శ్రీ వరాహ మహాపురాణము



గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః
గురుర్విశ్వం నచాన్యో2స్తి తస్మై శ్రీ గురవే నమః

శ్రీ జ్వాలా ప్రయోగ సెంట్రల్ ట్రస్ట్, హైదరాబాద్.
శ్రీ జ్వాలా సెంట్రల్ ట్రస్ట్, చెన్నై.

శ్రీవరాహ మహాపురాణము

(Sri Varaha Mahapuranam)

ముద్రణ : April 10, 2023

వరాహ జయంతి వేడుకల సందర్భంగా.

Cover page Art: Artist Prathap, 8977312839.
Editing & Book Designing: Padmini Satish.
References: Various Varaha Puranam versions.

Price: This publication is intended for free distribution by Sri Guruji. NOT FOR SALE. Those desirious of participating in publication of similar devotional books may send their contribution through crossed DD payable at Hyderabad to Sri Jwala Central Prayoga Trust, Hyderabad / Chennai.

Acknowledgements:

Our thanks to Smt. Neeraja Kuridi, Sri Venkatesh Narayanan, Smt. Shailaja reddy, Sri Vaddadi Srinivas, Sri Srikumar, Sri BVS Satish, Sri Shivakumar, Sri Krishna Kishore, Smt.Vijaya Bharati, Sri M. Vijay Kumar, Smt. Lakshmi Kanaka Durga, Sri Naveen Gopi, Kum. K. Sritha, Mrs.Udayapalli Krishna Varma, Sambhavi Martin, Sai Tirumala Printers.
For their valuable help in bringing out this book. Let Pujya Guruji's blessings be showered on them ever.

Published by:
Sri Jwala Prayoga central trust®,
Sri Jwala Central Trust®
1st floor, Room no.9,
Sunshine Commercial Complex,
Lakdikapul, Hyderabad -4.
Ph: 040-23231656.
www.jwala.org

Sri Jwala Trust®,
No.8, Anandha Velu Street,
Perambur, Chennai – 600011.
Tel: 94440 66669
www.jwala.in

శ్రీవరహ మహాపురాణము - అధ్యాయముల వరుస

ఓం గం గణపతయే నమః || ఓం శ్రీ గురుభ్యోన్నమః || ఓం లం శ్రీ ఆదివరాహాయ నమః

శ్రీ వరాహ మహాపురాణము

(వేదవ్యాస ప్రణీతము)

ప్రార్థన

నారాయణం నమస్కృత్య నరం చైవ నరోత్తమం|
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయముదీరయేత్ ||

అంతర్యామి, నారాయణ స్వరూపుడైన శ్రీ వరాహ భగవానునికీ, నరోత్తముడైన నరుడనే మునికీ, భగవల్లీలలను ప్రకటించే సరస్వతీదేవికి, వాటిని రచించిన శ్రీ వ్యాస మహర్షికీ నమస్కరించి, అసురసంపత్తిని నశింపజేసి, విజయాన్ని కలుగచేసే పురాణ ఇతిహాసాలను పఠించాలి.

నమస్తస్మై వరాహాయ లీలయోద్ధరతే మహీం |
ఖురమధ్యగతో యస్య మేరుః ఖణఖణాయతే ||

శ్రీ వరాహస్వామి లీలగా భూమిని ఉద్ధరించినవేళ, మేరు పర్వతం ఆయన డెక్కల మధ్యలో చిక్కుకుని ఖణఖణమన్నది. అట్టి శ్రీ వరాహస్వామికి నమస్కారం.

దంష్ట్రాగ్రేణోద్ధృతా గౌరుదధిపరివృతా పర్వతైర్నిమ్నగాభిః
సాకం మృత్పిండవత్ప్రాగ్ బృహదురువపుషానంతరూపేణ యేన |
సోయం కంసాసురారిర్ మురనరకదశాస్యాంతకృత్సర్వసంస్థః
కృష్ణో విష్ణుః సురేశో నుదతు మమ రిపూనాదిదేవో వరాహః ||

పూర్వం కంసాసురవైరి, మురాసురునీ, నరకునీ, పది తలల రావణాసురునీ, సంహరించిన కృష్ణుడు, ఎల్లప్పుడూ అందరిలో ఉండే విష్ణుమూర్తి, సురేశ్వరుడు, ఆదిదేవుడు, శ్రీవరాహస్వామి రూపందాల్చి, మహావిశాలమైన, అనంతాకారమైన దేహంతో, కోరకొనతో, చుట్టూ కడలి ఉన్న భూమిని పర్వతాలతో, నదులతో సహా మట్టిబెడ్డలా లేవనెత్తాడు. అట్టి వాడు నా అరిషడ్వర్గాలనే శత్రువులను నశింపజేయుగాక.

శ్రీవరాహ పురాణం – ప్రారంభం

సూతమహర్షి, శౌనకాది ఋషులను చిరునవ్వుతో చూసి, "శ్రీహరి అవతార గాథలు వివిధ పురాణాలలో ఉన్నప్పటికీ మత్స్య, కూర్మ, వామన, వరాహ పురాణములు మాత్రము ఆయా అవతారాల పేర్లతోనే విరాజిల్లుతున్నాయి," అన్నారు.

అంతట శౌనకాది మహర్షులు, " మహాత్మా ! తమ దయవల్ల మత్స్య, కూర్మ అవతార పురాణములు విని ఉన్నాము. వరాహపురాణం కూడా వినాలని ఉంది. ఇది మునుపు ఎవరు ఎవరికి చెప్పారు?" అని అడుగగా సూతుడు ఇలా సెలవిచ్చారు–"శ్రీహరి తనను పాతాళం నుంచి కాపాడి, వరాహావతారుడై పైకి తీసుకొచ్చాకా, ఆ సందర్భంలో భూదేవి ఆయనను స్తుతించి, కొన్ని సందేహాలను ఆయనముందు ఉంచింది. వాటికి సమాధానంగా వరాహస్వామి కొన్ని వృత్తాంతాలను చెప్పారు. సాక్షాత్తూ, శ్రీ వరాహ స్వరూపంలో ఉన్న శ్రీమహావిష్ణువుచే చెప్పబడినందున, ఇది వరాహపురాణమైనది," అంటూ ఆ పురాణం చెప్పడం ప్రారంభించారు.

1వ అధ్యాయము - భూదేవి వరహస్వామిని వేడుకొనుట

మనుపు శ్రీహరి వరాహ రూపంతో తనను ఉద్ధరించిన సమయంలో ధరణి ఆయనను ఇలా ప్రశ్నించింది, "ప్రభూ! ప్రతి కల్పంలోనూ నీవు నన్నిలా ఉద్ధరిస్తున్నావు. కానీ, ఆదిసృష్టి గురించి కానీ, నీ రూపం గురించి కానీ నేను తెలుసుకోలేకపోయాను. వేదాలు పోయినప్పుడు మత్స్యావతారం ధరించి, సముద్రంలో ప్రవేశించి, రసాతలం నుంచి వాటిని తీసుకువచ్చి, బ్రహ్మకు ఇచ్చావు. సురాసురులు కలిసి కడలిని మథించినప్పుడు, ఓ మధుసూదనా! నీవు కూర్మ రూపంతో మందర పర్వతాన్ని మోసావు. జగన్నాథా! శ్రీ వరాహ భగవానుడవై, మునిగిపోతున్న నన్ను మహాసముద్రంలో రసాతలం దగ్గరనుంచి ఒంటి కోరతో ఉద్ధరించావు. హిరణ్యకశిపుడు వరప్రభావంతో గర్వించి, నన్ను బాధిస్తుంటే వానిని నీవు పడగొట్టావు. భగవానుడా! వామన రూపంతో బలిని బంధించావు. దేవా! జమదగ్ని పుత్రుడు పరశురాముడవై 21 మార్లు దండెత్తి, నాపై క్షత్రియులే లేకుండా చేశావు. ప్రభూ! శ్రీరామ రూపంలో క్షాత్ర తేజంతో, రావణాసురుడిని సంహరించావు. నీ చేష్టలు నాకు కొంచెం కూడా తెలియలేదు. నన్ను ఉద్ధరించాక, నీవు సృష్టి ఎలా చేస్తావు? ఎలా దానిని పోషిస్తావు? విభూ! సులభంగా నిన్ను ప్రసన్నం చేసుకునే మార్గం ఏమిటి? సృష్టి

ఎలా ప్రారంభమవుతుంది, ఎలా అంతమవుతుంది? యుగాన్ని ఎలా లెక్కిస్తారు, నాలుగు యుగాల క్రమం ఏమిటి? యుగలక్షణాలు ఏమిటి? వాటి స్థితిగతులు ఏమిటి? ఏ యాజ్ఞికులు, ఏరాజులు ఉత్తమ సిద్ధినిపొందారు? నాపట్ల ప్రసన్నుడవై, ఇదంతా సమగ్రంగా చెప్పు" అని ప్రశ్నించేసరికి శ్రీవరాహ రూపంలో ఉన్న పరమేశ్వరుడు నవ్వాడు.

ఆయన అలా నవ్వుతూ ఉండగా జగద్ధాత్రి అయిన భూమాత, ఆయన బొజ్జలో రుద్రులనూ, దేవతలనూ, వసువులనూ, సిద్ధసంఘాలనూ, మహర్షులనూ చూసింది. ఇంకా ఆయన లోపలే నివశిస్తూ స్వధర్మం నెరవేరుస్తున్న చంద్రునీ, సూర్యునీ, గ్రహాలనూ, సప్త లోకాలనూ దర్శించింది. ఇదంతా చూసి, భూమాత శరీరమంతా వణకసాగింది.

వరాహస్వామి నోటిలో పావనియైన ధరణి, మహాసముద్రంలో శేషపాన్పుపై నిద్రిస్తున్న చతుర్భుజుడైన జనార్ధనుని, ఆయన నాభికమలంలో ఉన్న బ్రహ్మను చూచింది. అంతట ధాత్రి చతుర్భుజునికి నమస్కరిస్తూ ఇలా స్తుతించింది...

ధరణీకృత వరాహ స్తోత్రం

ధరణ్యువాచ:

నమః కమల పత్రాక్ష నమస్తే పీతవాససే | నమః సురారి విధ్వంసకారిణే పరమాత్మనే ||

శేషపర్యఙ్కశయనే ధృత వక్షఃస్థలశ్రియే | నమస్తే సర్వదేవేశ నమస్తే మోక్షకారిణే ||

నమః శాంగార్సిచక్రాయ జన్మమృత్యు వివర్జితే | నమో నాభ్యుత్థిత మహా కమలాసన జన్మనే ||

నమో విద్రుమ రక్తోష్ఠ పాణిపల్లవ శోభినే | శరణం త్వాం ప్రసన్నాస్మి త్రాహి నారీ మనాగసమ్ ||

పూర్ణనీలాఞ్జనాకారం వారాహం తే జనార్దన | దృష్ట్వా భీతాస్మి భూయోఽపి జగత్ త్వద్దేహ గోచరే ||

ఇదానీం కురుమేనాథ దయాం త్రాహి మహాప్రభో | కేశవః పాతుమే పాదౌజఙ్ఘే నారాయణో మమ ||

మాధవో మే కటింపాతు గోవిన్దో గుహ్యమేవ చ | నాభిం విష్ణుస్తు మే పాతు ఉదరం మధుసూదనః ||

ఊరూ త్రివిక్రమఃపాతు హృదయంపాతు వామనః| శ్రీధరఃపాతుమే కణ్ఠం హృషీకేశోముఖంమమ ||

పద్మనాభస్తు నయనే శిరో దామోదరో మమ | ఏవం న్యాస్య హరేన్యాసం నామాని జగతీ తదా ||

నమస్తే భగవన్ విష్ణో ఇత్యుక్త్వా విరామ హ || (1.20-28)

భావము: "కమలదళనయనా! పీతాంబరధారీ ! దేవవైరిధ్వంసకా! శేషశయనా ! హృదయలక్ష్మ్యాలంకృతా! సర్వదేవేశా! మోక్షకర్తా! శారఙ్గఖడ్గచక్రధరా! జననమరణాతీతా! పద్మనాభా ! విరించిజనకా! కెమ్మోవి కలవాడా! పల్లవపాణీ ! నీకు వందనాలు! శరణు

వేడుచున్నాను జనార్ధనా! కాపాడు! నీ నీలమేఘరూపమూ, నీలో కనిపించిన జగత్తూ చూసి భయపడిపోయాను. నాథా! నా మీద దయచూపించి కాపాడు మహాప్రభూ!" అంటూ ధరణి శ్రీహరి నామాలను తన అవయవాలపై న్యాసము చేసి, అంగన్యాస పూర్వకంగా స్తుతించి, భగవానుడా! విష్ణూ! నీకు అనేకానేక నమస్కారములు" అంటూ మ్రొక్కింది.(1)

2 వ అధ్యాయము – సృష్టిక్రమము

హరి ధరణి భక్తికి సంతోషించి, తన శరీరంలో ఉన్న మాయను వెల్లడించి, వరాహరూపంతోనే ఇలా అన్నారు:"ఓ సుందరజఘనా! దుర్లభమైన, పురాణ సంబంధమైన నీ ప్రశ్నలకు సర్వశాస్త్రాలనూబట్టి సమాధానం చెబుతాను. ధరణీ! సృష్టి, ప్రతిసృష్టి (ప్రళయం), వంశము, మన్వంతరాలు, వంశానుచరితం – అన్న ఐదు లక్షణాలు ఉన్నదే పురాణమని నిర్ణయించి చెప్పబడింది. వరాననా ! నీకు మొదట ఆదిసృష్టిని గురించి చెప్పి, అటుపై దేవతల, రాజుల చరిత్రలనూ, ఆపై నాలుగు భాగాలైన సనాతన పరమాత్మ గురించీ చెబుతాను."

"మొదట నేను శూన్య(మహాకాశ) స్వరూపంలో ఉన్నాను. ఆ తర్వాత అణురూపమైన బుద్ధి నానుంచి జనించి, సత్వము, రజస్సు, తమోగుణాలనే మూడు తత్వాల రూపాలను ధరించింది. ఇందులోని తమోగుణం వల్ల, తత్వజ్ఞులు 'ప్రధానుడు' అని పిలిచే మహత్తు రూపంలో నేను వ్యక్తమయ్యాను. దాని నుంచి బలిష్టుడైన క్షేత్రజ్ఞుడూ, ఆయన నుంచి బుద్ధీ, దాని నుంచి శ్రవణాది ఇంద్రియ పరంపరా, జగతికి స్థిరపడ్డాయి. కళ్యాణీ ! నేనే పంచభూతాలతో స్థూలశరీరనిర్మాణం చేసాను. మొదట ఉన్న శూన్యం నుంచి శబ్దమూ, శబ్దం నుంచి ఆకాశమూ, దానినుంచి వాయువూ, దానినుంచి తేజస్సూ(అగ్ని), దానినుంచి జలమూ, దానినుంచి ప్రాణులను ధరించే నిన్నూ(పృథ్విని) నేను సృష్టించాను.

పృధ్వీజల సంయోగంతో ఒక బుడగ లాంటి గర్భపిండం ఏర్పడింది. అది గ్రుడ్డుగా ఎదిగినపుడు, తొలుత జలరూపంలో నన్ను నేనే నిర్మించుకున్నాను. అలా నారములను (నీళ్ళను) సృష్టించి, వాటిలో నివసించాను కనుక, నాకు 'నారాయణుడు' అన్న పేరు వచ్చింది. ప్రతి కల్పంలోనూ నేను ఆ నీటిపై శయనిస్తాను, అప్పుడు నా నాభినుంచి ఆదికమలం పుడుతుంది. అందులోంచి చతుర్ముఖబ్రహ్మ జన్మించాడు. అతనితో నేను, "మహామతీ! ప్రజలను సృష్టించు," అని చెప్పి మాయమయ్యాను.

"జగద్ధాత్రీ ! అతడు సృష్టి గురించి ఆలోచించినా, అతనికి ఏమీ తోచలేదు. అతడికి మహారోషం వచ్చింది, అందులోంచి ఒక రోషస్వరూపుడు పుట్టి, అతని ఒడిలో ఏడవసాగాడు. అవ్యక్తమూర్తి అయిన బ్రహ్మ, ఆ బాలుడిని "ఏడవవద్దు" అనగా, అతడు "నాకు పేరు పెట్టు", అని బ్రహ్మతో అన్నాడు. బ్రహ్మ అతనికి "రుద్రుడు" అని పేరు పెట్టి, "లోకాలను సృష్టించమని" ఆనతినీయగా, ఆబాలుడు తాను అశక్తుడనని చెప్పి, తపస్సు కోసం నీటిలో మునిగిపోయాడు. అంతట బ్రహ్మ ప్రాణిసృష్టి కోసం తన కుడి బొటన వ్రేలి నుంచి దక్ష ప్రజాపతిని, ఎడమ బొటనవ్రేలి నుంచి అతని పత్నిని సృష్టించాడు. వారిరువురికీ స్వాయంభువమనువు జన్మించాడు. అతనిద్వారా పూర్వం బ్రహ్మ ప్రజావృద్ధి చేసాడు." అని చెప్పగా విని, పృధివి, "సురేశ్వరా ! ఆదిసృష్టిని గురించి మరింత వివరంగా చెప్పండి. ఈ నారాయణుడు కల్పాదిలో బ్రహ్మ ఎలా అయ్యాడు?" అని ప్రశ్నించింది.

శ్రీ భగవానులు ధరణితో, "క్షితీ ! నారాయణ స్వరూపుడు సర్వ ప్రాణులను సృష్టించిన విధానం చెబుతాను, విను. కళ్యాణీ! గడచిన కల్పం చివరరాత్రి, బ్రహ్మ నిద్ర నుండి మేల్కొని, సత్వగుణ సంపన్నుడై, శూన్యంగా ఉన్న లోకాన్ని చూశాడు. నారాయణుడు, గొప్పవాడు, అచింత్యుడు, ఆదిజన్ముడు, బ్రహ్మస్వరూపుడు, భగవానుడు, అనాది, సర్వసృష్టికర్త, జగత్కారణుడు, అవ్యయుడు, బ్రహ్మ స్వరూపుడు అయిన నారాయణ దేవునికి, ఆ పేరు ఎలా వచ్చిందన్న సందర్భంలో ఒక శ్లోకాన్ని ఉదహరిస్తూ ఉంటారు.

ఆపో నారా ఇతిప్రోక్తా ఆపోవై నరసూనవః | అయనం తస్య తాః పూర్వంతేన నారాయణః స్మృతః ||

పురుషోత్తముడైన నరుని నుంచి జన్మించినవి కనుక నీళ్లను నారములు అంటారు. నారములు పూర్వం ఆయనకు నివాసం. కనుక ఆయనను నారాయణుడు అంటారు. పూర్వకల్పాలలో లాగానే బ్రహ్మ సృష్టిని గురించి ఆలోచిస్తున్నాడు. అప్పుడు ఆయన నుండి అసంకల్పితంగా – తమస్సు, మోహం, మహామోహం, తామిస్రం, అంధతామిస్రం అనే ఐదుకణుపుల తమోమయ అవిద్య జనించింది. ఆయన ఇంకా ఆలోచిస్తుండగా, చేతనారహితమైన, బుద్ధిరహితమైన – వృక్ష, గుల్మ, లతా, తృణ, పర్వతములనే పంచవిధ సృష్టి ఆయన నుండి ఏర్పడింది. వీనినే సృష్టివేత్తలు ముఖ్యసర్గమని తెలుసుకొన్నారు. ఇంకా ఆలోచిస్తూ ఉండగా ఆయన నుండి ఉత్తమమైన మరొక సృష్టి సంభవించింది. అది అడ్డంగా నడిచేది కనుక దానికి తిర్యక్ స్రోతః సృష్టి అన్న పేరు

వచ్చింది. ఇందులోని ప్రాణులు, పశువులు మొదలైనవి తప్పుదారి పట్టేవి కనుక, చతుర్ముఖుడు ఇది కూడా సాధకం కాదని అనుకున్నాడు. అప్పుడు ఆయన మూడు విధాలైన ఊర్ధ్వస్రోతఃసృష్టి చేసాడు. ఇందులోని వారంతా గర్భసంజాతులు, ధర్మవర్తనులు, సుఖప్రీతి కలవారు, దేవతలు, ఊర్ధ్వచారులు. ఈ ముఖ్యాది సృష్టులలో జన్మించిన ప్రాణులు పురుషార్ధ సాధకాలు కావని, బ్రహ్మ మరొక సృష్టి గురించి ఆలోచించసాగాడు. అంతట ఆయన క్రిందికి పోయే ఆహారం వల్ల ఎదిగే, అర్వాక్ స్రోతఃసృష్టిని చేసాడు. ఇందులోని మానవులు పురుషార్ధాలను సాధించగలిగినవారు. వీరిలో సత్వగుణం కలవారు ప్రకాశాయుతులూ, రజస్తమోగుణాలు అధికంగా కలవారు దుఃఖభూయిష్టులూ, చేసినదే చేసేవారూ అవుతారు.

కళ్యాణీ! ఈ విధముగా మొదటిది మహత్ సృష్టి (తమోగుణం ద్వారా వ్యక్తమైనది), రెండవది తన్మాత్ర సృష్టి (శబ్దస్పర్శరూపరసగంధములు), మూడవది వైకారిక సృష్టి (ఇంద్రియ సృష్టి), నాలుగవది స్థావర(వృక్ష, గుల్మ, లతా, తృణ, పర్వతాలు) లేక ముఖ్య సృష్టి. ఐదవది తిర్యక్ సృష్టి (అడ్డంగా నడిచే ప్రాణులు, పశవులు), ఆరవది, శ్రేష్టమైనది, ఊర్ధ్వస్రోతఃసృష్టి(దేవతలు), ఏడవది అర్వాక్ స్రోతఃసృష్టి (మానవులు), ఎనిమిదవది అనుగ్రహసృష్టి (సాత్వికమూ, రాజసమూ) ఏర్పడ్డాయి. బుద్ధిపూర్వకంగా ఏర్పడిన మొదటి మూడు సృష్టులను ప్రాకృత సృష్టి అంటారు. తక్కిన ఐదింటినీ వైకృతసృష్టులు అంటారు. తొమ్మిదవ సృష్టి ప్రాకృతమూ, వైకృతమూ కూడా అయిన కౌమారసృష్టి. ఈ ప్రజాపతి నవవిధసృష్టులే జగతికి మూల హేతువులు." అని, ఇంకేమి వినగోరుతున్నావు?" అని ప్రశ్నించారు.

ధరణి "దేవా! ఈ నవవిధ సృష్టి ఎలా పెరిగింది? అది చెప్పండి అచ్యుతా!" అని అడిగింది. శ్రీ వరాహులు ఇలా చెప్పారు, "మొదట బ్రహ్మ, రుద్రాది దేవతలనూ, తరువాత సనకాది కుమారులనూ, ఆపై మరీచాది ఋషులనూ సృష్టించాడు. ఆ ఋషులలో మరీచి, అత్రి, అంగిరసుడు, పులహుడు, క్రతువు, పులస్త్యుడు, మహాతేజస్వి ప్రచేతసుడు, భృగుడు, నారదుడు, మహాతపస్వి వశిష్టుడు ఉన్నారు. వీరిలో సనకాదులను నివృత్తి ధర్మం(అలౌకిక మార్గం) లోనూ, ఒక్క నారదముని మినహా మిగిలిన మరీచాదులను ప్రవృత్తి ధర్మం(లౌకిక మార్గంలో) లోనూ ఆయన నియమించాడు.

వీరేకాక, తొలుత బ్రహ్మ కుడిచేతి బొటనవ్రేలి నుంచి పుట్టిన దక్షప్రజాపతి ఉన్నాడే, అతని వంశంలోనిదే ఈ చరాచరజగత్తు. దక్షుని కన్యలకు జన్మించిన వారే, దేవతలు, దానవులు, గంధర్వులు, ఉరగులు, పక్షులు – వీరంతా పరమ ధార్మికులు. క్రోధం వలన బ్రహ్మ యొక్క వక్రమైన బొమముడుల మధ్యనున్న లలాటంనుంచి జన్మించిన రుద్రుడు ఉన్నాడే, ఇతడు అర్ధనారీనరాకారుడు, ప్రచండుడు, అతిభయంకరుడు. అతనితో బ్రహ్మ "నిన్ను విభజించుకో" అని మళ్ళీ చెప్పి, అంతర్ధాన మయ్యాడు. అలా అనేసరికి, అతడుతనను స్త్రీగా, పురుషుడిగా, ఇద్దరుగా విభజించుకున్నాడు. అందులోని పురుషత్వాన్ని పదకొండు విభాగాలు చేసుకున్నాడు. వారంతా ఏకాదశరుద్రులను విఖ్యాతులయ్యారు."

"అనఘురాలా! ఇప్పుడు నీకు యుగమాహాత్మ్యం గురించి సంపూర్ణంగా చెబుతాను. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగింటినీ చతుర్యుగం అంటారు. ఇందులో జీవించిన మహాసత్త్వులూ, బహుదక్షిణలిచ్చే రాజులూ, దేవాసురులూ, ఆచరించిన ధర్మకర్మలను గురించి చెబుతాను, విను."

ప్రియవ్రతుని వృత్తాంతము

ప్రథమకల్పంలో ఉన్న స్వాయంభువమనువుకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనే ఇద్దరు కుమారులు ఉండేవారు. వారు ధర్మవ్రతులు, వారి చర్యలు మానవాతీతాలు. వారిలో ప్రియవ్రతుడు విరివిగా దక్షిణలు ఇస్తూ, మహాయజ్ఞాలు చేసిన మహాయజ్వ, తపోబలుడు. తనకుమారులైన భరతాదులను ఈ భూపతి సప్తద్వీపలలోనూ నిలిపాడు. ఆపై వరప్రదాయిని అయిన విశాల(ఉజ్జయిని) కు వెళ్ళి, మహాతపస్సు చేసాడు. ఆ తపస్సును చూడవచ్చాడు నారదుడు. ఆకాశంలో సూర్యతేజస్సుతో వెలుగుతున్న నారదుని ఆ రాజేంద్రుడు చూసి, సంతోషంతో, గౌరవపూర్వకంగా లేచి నిల్చున్నాడు. ఆపై ఆయనను ఆహ్వానించి, ఆసనం, పాద్యం సమర్పించాడు. మాటలమధ్యన, ప్రియవ్రతుడు బ్రహ్మావాది అయిన నారదునితో, "భగవానుడా! నారదా ! ఈ కృతయుగంలో మీరు చూసిన లేక విన్న ఏదైనా వింత గురించి నాకు చెప్పండి," అని అడిగాడు.

నారదుడు, "ప్రియవ్రతా ! ఒక ఆశ్చర్యం చూసాను, అది చెబుతాను, విను." అని ఇలా చెప్పసాగాడు. "రాజేంద్రా ! నిన్నటి రోజున నేను శ్వేతద్వీపానికి వెళ్ళి, అక్కడ ఒక సరస్సు చూసాను. అందులోని పద్మాలు సమృద్ధిగా వికసించి ఉన్నాయి. దాని ఒడ్డున ఒక విశాలనేత్రి అయిన స్త్రీ నాకు కనిపించింది. ఆ సోగకన్నుల చిన్నదానిని చూసి, నేను

ఆశ్చర్యపోయి, “కళ్యాణీ, నీవు ఎవరవు? ఇక్కడకు ఎలా వచ్చావు? ఇక్కడ నీకేమి పని? సర్వాంగసుందరీ ! చెప్పు”, అని అడిగాను.ఆవిడ నావైపు రెప్ప వేయకుండా చూసి, జ్ఞాపకానికి తెచ్చుకుని, మౌనంగా నిలబడింది. ఆమెను చూచిన వెంటనే, నేను నేర్చుకున్న ఉత్తమజ్ఞానమైన సర్వవేదాలూ, సర్వశాస్త్రాలూ, యోగశాస్త్రాలూ, శిక్షలూ, స్మృతులూ అన్నింటినీ క్షణంలో మరచిపోయాను. అప్పుడు నాకు ఆశ్చర్యమూ, ఆపై విచారమూ, శోకమూ ముంచుకువచ్చాయి. ఆమెనే శరణు పొంది చూసేసరికి, రాజా, ఒక దివ్య పురుషుడు ఆమె శరీరంలో కనిపించాడు. అతని హృదయంలో మరొకడు, అతని వక్షఃస్థలంలో వేరొకడు కనిపించారు. ఇతడు ఎర్రని కన్నులతో ద్వాదశాదిత్య సమాన తేజస్సుతో ఉన్నాడు. ఇలా శరీరంలో ముగ్గురు పురుషులు నాకు కనిపించారు. సువ్రతా! తిరిగి చూస్తే ఎవరూ కనిపించలేదు, అక్కడ కన్య ఒక్కతే ఉన్నది.

ఆ దేవిని,కుమారిని నేను ఇలాఅడిగాను, "కళ్యాణీ! నావేదాలు ఎలా పోయాయి? అలా పోవటానికి కారణం ఏమిటి? నాకు చెప్పు." కన్య, "నేను సర్వవేదమాతను. నా పేరు సావిత్రి. నీవు నన్ను ఎరుగవు కనుక, నీ వేదాలు పోయాయి" అని చెప్పింది. రాజతపోధనా! నేను ఆశ్చర్యపోయి, "కళ్యాణీ ఆ పురుషులెవరు? ఇది చెప్పు", అనడిగాను.

కన్య, "నా శరీరంలో సర్వావయవాలు అందంగా తళతళలాడే వాడున్నాడే, అతడు ఋగ్వేదం. స్వయంగా నారాయణ స్వరూపం. ఆ వేదం అగ్నిమయం. ఉచ్చరించిన వెంటనే పాపాలను దహిస్తుంది. అతని హృదయంలో నీవు మరొకరిని చూచావే, అతడు యజుర్వేద స్వరూపంతో ఉన్న పుత్రుడు, మహాబలుడు, బ్రహ్మ. అతని వక్షఃస్థలంలో ప్రవేశించి ఉన్న పవిత్రుడు, ధగధగ లాడుతున్న వాడు, రుద్రస్వరూపుడు సామవేదం. ఇతన్ని స్మరిస్తే ఆదిత్యునిలా పాపాలను వెంటనే నశింపజేస్తాడు."

"ద్విజోత్తమా, వీరు ముగ్గురూ మహా వేదస్వరూపాలు. వీరు అకారాది త్రివర్ణాలు (అకార ఉకార మకారాలు), త్రియజ్ఞాలుకూడా. నారదా, ఇక నీవు తిరిగి వేదాలనూ, శాస్త్రాలనూ, సర్వజ్ఞత్వాన్నీ స్వీకరించు. మహావ్రతా, ఈ వేదసరస్సులో స్నానమాచరించు. అలా స్నానం చేసేసరికి సజ్జనోత్తమా, నీకు ఇతరజన్మ జ్ఞానం జ్ఞాపకానికి వస్తుంది", అని చెప్పి ఆ కన్య అంతర్ధానం చెందింది. రాజా, నేను ఆ సరస్సులో స్నానం చేసి, నిన్ను చూడాలని ఇక్కడికి వచ్చాను. (2)

3 వ అధ్యాయము - నారదుని పూర్వజన్మ గాథ

అంతట ప్రియవ్రతుడు "భగవానుడా, దేవర్షీ, మరొక జన్మలో నీవేమి ఆచరించావో చెప్పు, తెలుసుకోవాలని నాకు కుతూహలంగా ఉంది", అని ప్రశ్నించాడు.

నారదుడు "రాజేంద్రా, సావిత్రి మాట విని ఆ వేద సరస్సులో స్నానం చేసేసరికి, నాకు వెంటనే వేయి జన్మల వృత్తాంతం జ్ఞప్తికి వచ్చింది. ఒక జన్మను గురించి చెబుతాను విను. రాజా, అది మరొక కృతయుగం. అప్పుడు అవంతి అన్న నగరంలో పూర్వం నేను ఒక ఉత్తమ ద్విజునిగా పుట్టాను. నా పేరు సారస్వతుడు. వేదవేదాంగాల అంతు చూశాను. నాకు భృత్యులు, పరివారము చాలా మంది ఉండేవారు. ధాన్యం కూడా బాగా ఉండేది. ఉత్తమ జ్ఞానం కూడా ఉండేది. నేను ఏకాంతంలో ఇలా ఆలోచించాను "ఈ సుఖదుఃఖాలనే ద్వంద్వాలతో కూడిన సంసారంతో నాకు ఏమి పని? ఇదంతా నా కొడుకులకు అప్పగించి, దీక్షబూని, వేగంగా సారస్వత సదస్సుకు తపస్సు చేసుకోవడానికి వెళ్తాను." ఇలా ఆలోచించి, ఉచిత కర్మకాండల ద్వారా కేశవునీ, శ్రాద్ధాదుల ద్వారా పితరులనూ, యజ్ఞాల ద్వారా దేవతలనూ, పవిత్రాన్నదానాదుల ద్వారా ఇతర జనులను తృప్తి పరిచాను. అనంతరం తపస్సు చేయటానికి బయలుదేరి, సారస్వత సరస్సు వద్దకు వెళ్లాను. ఆ సారస్వత సరస్సే ఇప్పుడు నీకు చెప్పిన పుష్కర సరస్సు. అక్కడకు వెళ్లి, భక్తితో నారాయణ మంత్ర జపం చేసీ, ఉత్తమమైన బ్రహ్మపార స్తోత్రం పఠించీ, పురాణ పురుషుడు, మంగళకరుడు అయిన విష్ణుమూర్తిని ఆరాధించాను. అందువల్ల భగవానుడు నా పట్ల సంతోషించి ప్రత్యక్షమైనాడు. అని చెప్పగా విని ప్రియవ్రతుడు, "సర్వశ్రేష్టా! దేవర్షీ! బ్రహ్మపార స్తోత్రం ఎలా ఉంటుందో వినాలనుకుంటున్నాను. సుప్రసన్న బుద్ధితో అనుగ్రహించి, వినిపించు" అని అడిగాడు. నారదుడు ఇలా చెప్పాడు:

బ్రహ్మపార స్తోత్రం

నారద ఉవాచ :

పరం పరాణామమృతం పురాణం పారం పరం విష్ణుమనంత వీర్యం |

నమామి నిత్యం పురుషం పురాణం పరాయణం పారగతం పరాణాం ||

పురాతనం త్వప్రతిమం పురాణం పరాపరం పారగముగ్రతేజసం |

గంభీరగంభీరధియాం ప్రధానం నతోస్మి దేవం హరిమీశితారం ||

పరాత్పరం చా పరమం ప్రధానం పరస్పదం శుద్ధపదం విశాలం |

పరాత్పరేశం పురుషం పురాణం నారాయణం స్తౌమి విశుద్ధభావః ||

పురాపురం శూన్యమిదం ససర్జ తదాస్థితత్వాత్ పురుషః ప్రధానం |

జనే ప్రసిద్ధః శరణం మమాస్తు నారాయణో వీతమలః పురాణః ||

పారం పరం విష్ణుమపారరూపం పురాతనం నీతిమతాం ప్రధానం |

ధృతక్షమం శాంతిధరం క్షితీశం శుభం సదా స్తౌమి మహానుభావం ||

సహస్రమూర్ధానమనంతపాదమనంతబాహుం శశిసూర్యనేత్రం |

తమక్షరం క్షీరసముద్రనిద్రం నారాయణం స్తౌమ్యమమృతం పరేశం ||

త్రివేదగమ్యం త్రినవైకమూర్తిం త్రిశుక్లసంస్థం త్రిహుతాంశభేదం |

త్రితత్వలక్ష్యం త్రియుగం త్రినేత్రం నమామి నారాయణ మప్రమేయం ||

కృతేసితం రక్తతనుం తథా చ త్రేతాయుగే పీతతనుం పురాణం |

తథా హరిం ద్వాపరతః కలౌ చ కృష్ణే కృతాత్మనమథో నమామి ||

ససర్జయో వక్త్రత యేవ విప్రాన్ భుజాంతరే క్షత్రమథోరుయుగ్మే |

విశః పదాగ్రేషు తథైవ శూద్రాన్ నమామి తం విశ్వతనుం పురాణమ్ ||

పరాత్పరం పారంగతం ప్రమేయం యుధాంపతిం కార్యతయేవ కృష్ణామ్ |

గదాసిచర్మణ్య భృతోర్ధపాణిం నమామి నారాయణమప్రమేయం || (3.11-20)

భావం: పరాత్పరుడు, అమృతస్వరూపుడు, సనాతనుడు, (పరత్వానికి) అవధి అయిన పరుడు, అనంతశక్తిశాలి, నిత్యుడు, పురాణపురుషుడు, (సర్వ) పరమాశ్రయుడు, సర్వోత్తముడు అయిన విష్ణునికి నమస్కారం. పురాతనుడు, సాటిలేనివాడు, పెద్దవాడు, శ్రేష్ఠులకంటేకూడా శ్రేష్ఠుడు, పారం ముట్టినవాడు, ఉగ్రతేజస్వి, బహుగంభీరబుద్ధి శాలులలో ప్రధానుడు, శాసకుడు, అయిన శ్రీహరి దేవునికి వందనం. గొప్పవారికంటె గొప్పవాడు, తనకంటే గొప్పవాడు లేనివాడు, ప్రధానుడు, ఇతరులకు ఆశ్రయమైనవాడు, పరిశుద్ధమైన విశాలమైన స్థానం కలవాడు, గొప్పవారికంటే గొప్పవారికీ శాసకుడు, పురాణపురుషుడు, అయిన నారాయణుని, విశుద్ధమైన మనస్సుతో స్తుతిస్తున్నాను. ఈ

శూన్యమైన విశ్వశరీరాన్ని –ప్రకృతిని– పూర్వం సృష్టించి, తాను అందులో ఉన్నాడు కనుక, జనులలో 'పురుషుడ'ని ప్రసిద్ధుడైనాడు. అట్టిపురాణపురుషుడు, నిర్మలుడు, నారాయణుడు. నాకు రక్షకుడు అగుగాక. ఆయన పరాత్పరుడు. సర్వవ్యాపకుడు. ఆయనరూపానికి అవధి లేదు. ఆయన పురాతనుడు. నీతిమంతులలో ముఖ్యుడు. క్షమాశాంతి ధారి. ధరణీ కాంతుడు. శుభస్వరూపుడు. అట్టి మహానుభావుని సదా స్తుతిస్తున్నాను. ఆయన అనంత శీర్షుడు. అనంతపాదుడు, అనంతబాహుడు. సూర్యచంద్రులు ఆయన నేత్రాలు. ఆయన క్షర స్వరూపుడు, నాశరహితుడు, క్షీరసాగరశయనుడు, అమృత స్వరూపుడు, పరమేశ్వరుడు. అట్టి నారాయణుని స్తుతిస్తున్నాను. ఆయన (ఋగ్యజుస్సామనామక త్రివేదవేద్యుడు, ద్వాదశ (ఆదిత్య) రూపాలతోనూ, ఒక పరబ్రహ్మరూపంతోనూ, విరాజిల్లుతూ ఉంటాడు. (హరిహరహిరణ్యగర్భ) మూర్తి త్రయంలో కొలువై ఉంటాడు.(దక్షిణాగ్ని, గార్హపత్యాగ్ని, ఆహవనీయాగ్ని) మూడగ్నులుగాను విభక్తమై ఉంటాడు. (స్థూలసూక్ష్మ కారణములనే) మూడు తత్త్వాలలోనూ కానవస్తాడు. (భూతభవిష్యద్వర్తమాన కాలత్రయస్వరూపుడు. (సూర్యచంద్రాగ్ని రూప) త్రినేత్రుడు. అట్టి అప్రమేయస్వరూపుడైన నారాయణునికి నమస్సు. కృతయుగంలో తెల్లనిమేనితోనూ, త్రేతాయుగంలో ఎర్రని దేహంతోనూ, ద్వాపరయుగంలో పచ్చని శరీరంతోనూ, కలి యుగంలో నల్లని ఒడలితోనూ ఉండే పురాతనుడైన శ్రీహరికి అంజలిస్తున్నాను. తనముఖం నుంచి విప్రులనూ, బాహువుల నుంచి క్షత్రియులనూ, ఊరువుల నుంచి వైశ్యులనూ, పాదాలనుంచి శూద్రులనూ సృష్టించిన విశ్వ దేవునికి, పురాణ పురుషునికి దోయిలిస్తున్నాను. ఆయన పరాత్పరుడు. (సర్వశాస్త్ర) పారంగతుడు, యోధ శ్రేష్ఠుడు, (శిష్టరక్షణరూప) కార్యంకోసమే శ్రీకృష్ణుడైనవాడు;గదా, ఖడ్గమూ, డాలూ, చేతుల దాల్చినవాడు; అప్రమేయుడు, అట్టి శ్రీమన్నారాయణునికి నమస్కరిస్తున్నాను.

అని నేను చేసిన స్తోత్రానికి విష్ణువు సంతోషించి, నాతో మేఘసమాన ధ్వనితో, "ఏదైనా వరం కోరుకో" అని అనేక పర్యాయాలు పలికాడు. అప్పుడు నేను ఆయన దేహంలో లయం కావాలని కోరుకొన్నాను. అది విన్న సనాతనుడు, "విప్రుడా, ప్రకృతి అక్షయమైనది. బ్రహ్మ యొక్క యుగసహస్ర పర్యంతం, ఈ శరీరంలోని నీవు ఉండి అతని వల్ల తిరిగి జన్మిస్తావు. అప్పుడతడు 'నారదుడు' అని నీకు సార్థకమైన నామకరణం చేస్తాడు. నారములు అంటే నీరు, అది నీవు సదా పితరులకు ఇస్తావు కనుక, నీకు నారదుడు అని

పేరు వస్తుంది, అని చెప్పి అంతర్ధానమయ్యాడు. నేను కొంతకాలం తరువాత శరీరం విడిచి, తపశ్శక్తి వల్ల బ్రహ్మ తనువులో లీనమై, తిరిగి జన్మించాను. బ్రహ్మదేవుడు అవ్యక్తజన్ముడు. తొలి రోజున పదిమంది బ్రహ్మ మానస పుత్రులతో పాటు నేనూ సృష్టించబడ్డాను. ప్రభు ధర్మాన్ని అనుసరించి, దేవాది సర్వప్రాణుల సృష్టికి అదే ప్రారంభమయ్యింది. పార్థివా! ఇదే నా ప్రాకృతజన్మ. నీవడిగావని చెప్పాను. నేను నారాయణుని ధ్యానించి దేవత్వం పొందాను గనుక, నీవూ విష్ణుభక్తి పరాయణుడవు కమ్ము రాజేంద్ర! (3)

4 వ అధ్యాయము - అశ్వశిరుని కథ

ఇలా నారదుడు ప్రియవ్రతుడితో చెప్పిన విషయాలను వరాహమూర్తి భూదేవికి చెప్పగా, ఆ ధరణి, "సనాతన పరమాత్మ అయిన ఈ నారాయణుడు సర్వత్వం కలవాడో కాడో చెప్ప"మని అడిగింది. అప్పుడు నారాయణుని దశావతారాల గురించి వరాహస్వామి ఇలా చెప్పారు. "మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన పరశురామ, రామ, కృష్ణ, బుద్ధ, కల్కి అనే పది అవతారాలు ఆయన అవతారాలుగా చెప్పబడ్డాయి భూతధారిణీ. ఇవి ఆయన దర్శనం పొందాలని అనుకునేవారికి మెట్ల లాంటివి కళ్యాణీ. అతని దివ్య రూపాన్ని చూడలేని దేవతలు, నావంటి వరాహాదిరూపాలను అర్చిస్తూ, కోరికలు నెరవేర్చుకుంటూ ఉంటారు. బ్రహ్మకు కూడా రజస్తమో గుణాలు ఆ భగవంతుడి స్వరూపంతోనే ఏర్పడ్డాయి, వీటివల్లే ఈ సృష్టి నిలిచి ఉంది. ఈ నారాయణుడే భూమి, జలము, అగ్ని, వాయువు ఆకాశము, క్షేత్రజ్ఞుడు, సూర్యుడు, చంద్రుడు అనే అష్టమూర్తులుగా, ఈ జగతి మొత్తం నిండి ఉన్నాడు. దేవీ, "ఇంకేమి విన గోరుతున్నావు?" అని అడుగగా ధరణి, " పరమ ప్రభూ! నారదుడు అలా చెప్పిన తర్వాత ప్రియవ్రత మహారాజు ఏం చేశాడో నాకు దయతో చెప్ప"మని అడిగింది. అప్పుడు వరాహ స్వామి, "నారదుడు చెప్పిన ఈ వింతను విన్న ఆ ప్రియవ్రతుడు భూమిని ఏడు భాగాలుగా చేసి, తన పుత్రులకు ఇచ్చి తపస్సు చేశాడు. నారాయణ స్వరూపుడైన పరబ్రహ్మను జపించి, అతని మీదే మనస్సునుంచి మోక్షాన్ని పొందాడు. ఓ సుందరీ! నీకు పూర్వకాలంలో బ్రహ్మను ఆరాధించిన ఒక రాజు కథను నీకు చెబుతాను విను."

అశ్వశిరుడనే పరమ ధార్మికుడయిన రాజు ఉండేవాడు. అతడు అశ్వమేధ యాగం చేసి, ఘనమైన దక్షిణలను ఇచ్చి, అవబృథ స్నానం(యజ్ఞం ముగిసినప్పుడు

బ్రాహ్మణులతో కలిసి చేసే పవిత్రమైన స్నానము) చేసాడు. ఆ సమయంలో యోగివరుడైన కపిలముని, యోగిరాజయిన శ్రీమత్ జైగీషవ్యుడూ, అక్కడకు వచ్చారు. ఆ రాజు తక్షణమే లేచి, పరమ సంతోషంతో వారికి స్వాగత సత్కారాలు చేసాడు. వారిద్దరూ పూజలందుకుని ఆసీనులయ్యాకా, మహాబలశాలి అయిన ఆ రాజు వారిద్దరిని చూసి, "విప్రులారా! మీరిద్దరూ ప్రకాశమానులు, ధీశాలులు, యోగవేత్తలు, పురుషోత్తములు. నన్ను అనుగ్రహించి, దయచేసిన మీరు, పరమదైవము, శ్రీహరి అయిన నారాయణుని ఎలా ఆరాధించాలో నాకు చెప్పండి," అని అడిగాడు. అంతట వారు, "రాజా! నీవు నారాయణ గురువు అంటున్నది ఎవరిని? మేమిద్దరమూ నారాయణులము. నీ ఎదుట నిలిచి ఉన్నాము." అన్నారు. అశ్వశిరుడు, "మీరిద్దరూ సిద్ధులైన బ్రాహ్మణులు. తపస్సు వల్ల మీ పాపాలు దహించుకు పోయాయి. నారాయణులమని మీరు ఎలా అంటున్నారు? ఆ జనార్దనుని చేతిలో శంఖము, చక్రము, గద ఉంటాయి. గరుడునిపై ఉంటాడు. గొప్ప దేవుడు. ఈ భూమి మీద అతనికి సమానమైనవారు ఎవరూ లేరు." అని అడిగాడు. ఆ రాజు మాట విని, గొప్ప వ్రతములను చేసిన ఆ బ్రాహ్మణులిద్దరూ నవ్వారు. "రాజా! విష్ణువును చూడు" అంటూ కపిలుడు స్వయానా విష్ణువుగా, జైగీషవ్యుడు గరుడుడిగా మారిపోయారు. ఆ క్షణమే గరుడునిపై ఉన్న సనాతనుడయిన నారాయణుని చూసి, అక్కడున్న రాజుల సమూహమంతా హాహాకారాలు చేసింది.

అంత గొప్ప కీర్తిగల రాజు, చేతులు జోడించి, “విప్రులారా! శాంతించండి. విష్ణువు అంటే ఇటువంటి వాడుకాదు. విష్ణువు యొక్క నాభికమలం నుంచి బ్రహ్మ పుట్టాడు. బ్రహ్మ నుంచి రుద్రుడు పుట్టాడు. అలాంటివాడు పరమేశ్వరుడైన విష్ణువు” అన్నాడు. రాజు మాటలు విన్న వాళ్ళిద్దరూ యోగమాయను కల్పించారు. కపిలుడు పద్మనాభుడిగా మారాడు. జైగీషవ్యుడు బ్రహ్మగా కమలంలో ఉండి ప్రకాశిస్తున్నాడు. ఆయన ఒడిలో ఒక పొట్టి బాలుడు ఉన్నాడు. ఆ బాలుడి కన్నులు కాలాగ్నితో సమానమైన తేజస్సును కలిగి ఉన్నాయి. అది చూసి ఆ రాజు ఇలా అన్నాడు "ఆ విశ్వేశుని చూసేందుకు సాధ్యం కాదు. ఇదంతా యోగుల మాయ అనిపిస్తోంది. శ్రీహరి లక్ష్మీ దేవితో కూడి ఉండేవాడు, సర్వవ్యాపకుడు," అంటూ ఉండగానే, ఓ భూతధారిణీ! అప్పటికప్పుడే ఆ రాజభవనంలో, రాజ్యసభలో అన్ని చోట్లా, దోమలు, నల్లులు, పేలు, తుమ్మెదలు, పక్షులు, పాములు,

గుఱ్ఱాలు, గోవులు, ఏనుగులు సింహాలు, పులులు, నక్కలు ఇతర విధాలైన గ్రామ, అరణ్య పశువులు, కీటకాలు కోట్లకొద్దీ కనిపించసాగాయి. ఆ ప్రాణికోటి సమూహాన్ని చూసిన రాజు మనసులో ఆశ్చర్యపడి, ఇదంతా కపిలుని యొక్క, జైగీషవ్యుడి యొక్క మహాత్త్యమని తెలుసుకున్నాడు.

అంతటా అశ్వసేనుడు చేతులు జోడించి భక్తితో ఆ ఇద్దరినీ, "ద్విజోత్తములారా! ఇది ఏమిటి?" అని ప్రశ్నించాడు. అందుకా మహర్షులు, "మహారాజా! విష్ణువును ఎలా పూజించాలి? ఆయన ఎలా లభిస్తాడు? అని నువ్వు మమ్మల్ని అడిగావు. అందుకే నీకు ఇది చూపించాము. ఇవే సర్వజ్ఞుడైన అతని గుణాలు. ఆయన సర్వజ్ఞుడు కామరూపి (ఇష్టమైన రూపమును ధరించగలవాడు), ఆయన అంతటా ఉంటాడు. కొన్ని చోట్ల సౌమ్యుడిగా, సుస్థిరుడిగా మనుషులకు లభిస్తాడు. ఆయన ఆరాధనవల్ల వాక్కు అర్థవంతం అవుతుంది. ఈ జగత్పతీ, పరమాత్మ, సర్వ శరీరాలలోనూ ఉన్నాడు. భక్తితో చూసిన వారికి తమ దేహంలోనే కనిపిస్తాడు. కానీ ఒక్క చోటనే ఉండదు. అందుకే పరమాత్మ అయిన దేవుని రూపం నీకు చూపించాము. రాజేంద్రా! మాలో నీకు ఎలా కనిపించాడో, అలాగే విష్ణువు నీలో, నీ మంత్రుల దేహాలలో, నీ సేవకసమూహాల దేహాలలో కూడా వ్యాపించి ఉన్నాడు. నీకు చూపించిన దేవతలు, పశువులు, పురుగులు మొదలైన వాటిలో కూడా ఆయనే ఉన్నాడు. శ్రీహరి అంతటా ఉన్నాడని భావిస్తూ, ఆయనకు సమానమైన ప్రాణి లేదన్న దృఢమైన భావనతో ఆయనను సేవించాలి. మేము నిండైన భావంతో శ్రీమన్నారాయణుడైన హరిని మనసులో నిలుపుకొని, నీకు ఆయన జ్ఞాన స్వరూపాన్ని తెలియజేశాము. అందువల్ల నీవు పరిపూర్ణ భావంతో నారాయణ గురువును స్మరించు. పూజలు, ఉపచారాలు, ధూపము, బ్రాహ్మణ సంతర్పణ, చెదరని ధ్యానం చేయడం, వీటివల్ల పరమేశ్వరుడు వెంటనే లభిస్తాడు", అని చెప్పారు. (4)

5 వ అధ్యాయము - రైభ్య అశ్వశిరః కథ

అంతట అశ్వశిరుడు "పూజ్యులైన మీరిద్దరూ నా సందేహమొకటి తీర్చాలి. అది తీరితే నాకు సంసార విముక్తి కలుగుతుంది" అన్నాడు. అప్పుడు యోగులలో గొప్పవాడు, ధర్మాత్ముడు అయిన కపిలుడు, యజ్ఞకర్తలలో శ్రేష్టుడైన రాజుతో ఇలా అన్నాడు. "రాజా!

పరమధార్మికా! నీ మనసులోని సందేహం ఏమిటో నీ కోరిక ఏమిటో నాకు చెప్పు, విని తీరుస్తాను."

రాజు "మునీ! మోక్షం కర్మ వలన సిద్ధిస్తుందా లేక జ్ఞానం వల్లనా? నన్ను అనుగ్రహించి ఈ సంశయాన్ని తీర్చండి" అని అడిగాడు. కపిలుడు "మహారాజా! మునుపు బ్రహ్మ పుత్రుడైన రైభ్యుడూ, వసురాజు బృహస్పతిని ఈ ప్రశ్నే అడిగాడు. పూర్వం రాక్షసుడు అనే పేరున్న మనువు కాలంలో, బ్రహ్మ వంశోద్ధారకుడు, రాజ శ్రేష్టుడు, విద్వాంసుడు, దాత అయిన వసువు అనే రాజు ఉండేవాడు. ఆ వసువు బ్రహ్మను చూడాలని ఆయన లోకానికి వెళ్ళాడు. దారిలో చైత్రరథుడు అనే విద్యాధరశ్రేష్ఠుని చూసి, వసువు సంతోషంతో, బ్రహ్మదేవుని కలుసుకోవడానికి అనువైన సమయం గురించి చెప్పమని అడిగాడు. ప్రస్తుతం బ్రహ్మ ఇంటిలో దేవ సభ జరుగుతోందని చైత్ర రథుడు చెప్పాడు. అది విన్న వసువు బ్రహ్మ ఇంటి ద్వారం వద్ద నిలిచాడు. అంతలో మహాతపస్వి అయిన రైభ్యుడు అక్కడికి వచ్చాడు. ఆ వసురాజు సంతోషించి, నిండు మనసుతో ముందుగా ఆయనను పూజించి, "ఎక్కడికి వెళ్తున్నారు మునీ?" అని అడిగాడు. రైభ్యుడు "మహారాజా! నేను ఒక విషయాన్ని గురించి దేవ పురోహితుడైన బృహస్పతిని అడగడానికి ఆయన వద్దకు వస్తున్నాను" అని చెబుతుండగా, బ్రహ్మ మహా సభ ముగిసింది. దేవతలందరూ తమ తమ నివాసాలకు వెళ్లారు. అంతలో అక్కడికి బృహస్పతి వచ్చి, రైభ్యునితో కలవడానికి అనుమతి తీసుకుని, వసుని పూజలు అందుకుని, వారితో కలిసి తన ఇంటికి వెళ్ళాడు. రైభ్యుడు, వసురాజు, బృహస్పతి కూర్చున్నాక దేవగురువు బృహస్పతి రైభ్యునితో, "మహాభాగా! వేదవేదాంగ పారంగతా! నేను మీకు ఏమిచెయ్యగలను?" అని అడిగాడు.

రైభ్యుడు "బృహస్పతీ! మోక్షము కర్మము చేత సిద్ధిస్తుందా లేక జ్ఞానము చేతనా? సమర్థుడైన నీవు ఇది నాకు తెలియజేయమని" అడిగాడు. బృహస్పతి ఇలా చెప్పారు, "పురుషుడు ఆచరించే కర్మ, మంచిదయినా, చెడ్డదైనా, ఏది చేసినా అంతా నారాయణ అర్పణం గావించి చేస్తే, ఏ కర్మా అంటదు. ద్విజోత్తమా! ఇందుకు సంబంధించి, మునుపు ఒక విప్రునకు, వేటగానికి జరిగిన సంవాదమొకటి చెప్తాను విను. ఆత్రేయ గోత్రము వాడైన ఒక ముని ఉండేవాడు. ఆయన బ్రాహ్మణుడు, నిత్యము వేదాభ్యాసం చేసేవాడు, తపస్వి, ప్రాతఃస్నానము చేసేవాడు, మూడుమార్లు సంధ్యావందనం చేసుకునేవాడు. అతని పేరు

సంయమనుడు. ఒకరోజు ఆయన ధర్మారణ్యంలో శుభకరమైన, ధన్యమైన గంగానదిలో స్నానానికి వెళ్ళాడు. అక్కడ ఒక పెద్ద లేళ్ళ గుంపు ఉంది. వాటిని చంపడం కోసం విల్లు ఎక్కుపెట్టి, యముడిలా వచ్చాడు నిష్ఠురకుడు అనే వేటగాడు. సంయమనుడు వేటాడ బోతున్న అతన్ని చూసి, 'భద్రా, ఈ లేళ్ళ ప్రాణాలు తీయకు,' అని వారించాడు. అది విన్న కిరాతకుడు నవ్వి "ద్విజోత్తమా! నేను విడిగా ప్రాణులను చంపడం లేదు. భగవానుడయిన పరమాత్మే స్వయంగా ఈ ప్రాణులతో ఆడుకొంటున్నాడు. మనుషులు మట్టితో ఎడ్లను చేసినట్లే ఇదీనూ. ఇందులో సందేహం లేదు. మోక్షం కోరేవారికి 'నేను' అన్న అహంకారం ఉండకూడదు. ఈ విశ్వమంతా ప్రాణాలను నిలుపుకోవడానికి చేస్తున్న ఒక యాత్ర వంటిది. ఇందులో 'నేను' అన్న శబ్దము మంచిది కాదు" అన్నాడు. అది విన్న విప్రోత్తముడైన సంయమనుడు, ఆశ్చర్యంతో, నిష్ఠురకునితో, "భద్రా! నీవు చెబుతున్న అంశాన్ని నిరూపించగలవా?" అన్నాడు.

అది విన్న ధర్మవేత్త అయిన కిరాతకుడు, ఒక ఇనుప వల తయారు చేసి, దాని కింద నిప్పుపెట్టి, కట్టెలు అంటించమని, బ్రాహ్మణుడితో అన్నాడు. విప్రుడు నోటితో నిప్పు ఊది ఊరుకున్నాడు. మంట ఎగసే సరికి, నిప్పు ఒక్కచోటే ఉన్నా కూడా, ఇనుపవల సందుల నుండి వేలకొద్దీ అగ్నిజ్వాలలు వెలికి వచ్చాయి. అప్పుడా కిరాతుడు "మహామునీ! నీవు ఒక జ్వాల తీసుకో. మిగిలిన జ్వాలలు ఆర్పేస్తాను" అని చెప్పి, మంటల్లోకి నిండుకుండ లోని నీటిని కుమ్మరించాడు. వెంటనే అగ్ని ఆరిపోయింది. అప్పుడా వేటగాడు ఆ బ్రాహ్మణ తపోధనుడితో, "భగవానుడా! నీవు తీసుకున్న జ్వాలను ఇయ్యి. లేడి మాంసం తెచ్చుకుని కాల్చుకొని తింటాను." అన్నాడు. విప్రుడు ఇనుప వల చూసేసరికి, అక్కడ అగ్ని లేదు. మొదలు ఆరిపోయే సరికి అదీ ఆరిపోయింది. బ్రాహ్మణుడు సిగ్గుతో మౌనం వహించాడు. అప్పుడు కిరాతకుడు " సజ్జనోత్తమా! ఇక్కడ అంటించిన నిప్పు వలలోంచి, వేయి అలలుగా వ్యాపించింది. కానీ మొదలు పోతే అదీ పోయింది. అలాగే మూలకారణమైన ఆత్మ ప్రాణులకు ఆశ్రయం అవుతుంది. దానివల్ల జగత్తు ఉద్భవిస్తుంది, ఆత్మలోనే జగత్తు కూడా ఉంటుంది. ఆత్మ స్వీకరించిన శరీర ధర్మాన్ని బట్టి, అది చేసే పనులన్నీ ఆత్మకే (పరమాత్మకే) ఆపాదించి ఆచరించేవాడు వినాశముపొందదు"అని చెప్పాడు. రాజశ్రేష్ఠుడా! కిరాతుడు ఇలా చెప్పేసరికి అతని మీద ఆకాశం నుంచి పూలవాన కురిసింది. కామగమనం

కలిగినవి, బహురత్నాలు కలవి, దివ్యమైనవి, చాలా పెద్దవి అయిన విమానాలను ఆ బ్రాహ్మణోత్తముడు తన ఎదుట చూసాడు. వాటన్నిటిలోనూ, ఉత్తముడైన కిరాతకుడు, తనకు నచ్చిన రూపాన్ని ధరించి వున్నట్లు చూసాడు. యోగశక్తితో, అద్వైత వాసనతో, సిద్ధిని పొంది, అనేక శరీరాలు ధరించిన అతన్ని చూసి సంతోషించిన సంయమనుడు, తన ఆశ్రమానికి వెళ్ళాడు.

"ద్విజోత్తమా! రైభ్యా, వసురాజా, ఇలా జ్ఞానం ఉన్న వాడు స్వజాతి కర్మలను ఆచరించినప్పటికీ ముక్తి కలుగుతుంది. ఇది నిశ్చయం." అని బృహస్పతి చెప్పగా, అశ్వశిర మహారాజా! రైభ్య వసువు లిద్దరూ తమ సందేహాలు తీర్చుకుని బృహస్పతి భవనము నుండి తమ ఆశ్రమాలకు వెళ్లారు. కనుక, రాజేంద్రా, నీవు కూడా నీ దేహంలో ఉన్న ప్రభువైన నారాయణదేవుడు, నీ దేహంలోనే ఉన్నాడన్న అభేదంతో చూస్తూ ఆరాధించు." అని చెప్పిన కపిలుని మాటలు విని,అశ్వశిర మహారాజు తన పెద్ద కుమారుడైన స్థూలశిరుడికి పట్టం కట్టి, నైమిశారణ్యానికి వెళ్ళిపోయాడు. వరారోహా! అక్కడ యజ్ఞమే దేహముగా కలవాడు, గురువయిన శ్రీమన్నారాయణుని తపస్సుతోనూ, యజ్ఞమూర్తి స్థవంతోనూ ఆరాధించాడు. అని చెప్పగా విన్న ధరణి "మహాభాగా! రాజు అశ్వశిరుడు యజ్ఞ శరీరుడైన నారాయణుని ఏ విధంగా స్తోత్రం చేశాడో, అది నాకు చెప్పు," అని అడిగింది.

యజ్ఞమూర్తి స్తవము- యజ్ఞమూర్తి స్తోత్రం

శ్రీవరాహ ఉవాచ:

నమామి యాజ్యం, త్రిదశాభిపస్య భవస్య సూర్యస్య హుతాశనస్య |

సోమస్య రాజ్ఞో మరుతామనేక - రూపం హరిం యజ్ఞ నరం నమస్యే ||

సుభీమదంష్ట్రం శశిసూర్యనేత్రం సంవత్సరేచాయనయుగ్మకుక్షమ్ |

దర్భాంగ రోమాణమ థేద్మశక్తిం సనాతనం యజ్ఞ నరం నమామి ||

ద్యావాపృథివ్యో విదమంతరం హి వ్యాప్తం శరీరేణ దిశశ్చ సర్వాః |

తమీడ్యమీశం జగతాం ప్రసూతిం జనార్దనం తం ప్రణతోస్మి నిత్యమ్ ||

సురాసురాణాం చ జయాజయాయ యుగే యుగే యః స్వశరీరమాద్యమ్ |

సృజత్యనాదిః పరమేశ్వరో య-స్తం యజ్ఞమూర్తిం ప్రణతోస్మి నాథమ్ ||

దధార మాయామయముగ్రతేజా జయాయ చక్రం త్వమలాం సుశుభ్రమ్ |

గదాసి శాంగాది చతుర్భుజోయం తం యజ్ఞమూర్తిం, ప్రణతోస్మి నిత్యమ్ ||

క్వచిత్ సహస్రం శిరసాం దధార క్వచిన్మహాపర్వతతుల్య కాయమ్ |

క్వచిత్ స ఏవ త్రసరేణుతుల్యో, యస్తం సదా యజ్ఞ నరం నమామి ||

చతుర్ముఖో యః సృజతే సమగ్రం రథాంగ పాణిః ప్రతిపాలనాయ |

క్షయాయ కాలానలసన్నిభోయ- స్తం యజ్ఞ మూర్తిం ప్రణతోస్మి నిత్యమ్ ||

సంసారచక్ర క్రమణ క్రియాయై య ఇజ్యతే సర్వగతః పురాణః |

యో యోగిభిర్ధ్యాయతే చాప్రమేయస్ తం యజ్ఞ మూర్తిం ప్రణతోస్మి నిత్యమ్ ||

సమ్యజ్ మనస్యర్పిత వానహం తే యదా సుదృశ్యం స్వతనౌ నుతత్త్వమ్ |

న చాన్యదస్తీతి మతిః స్థిరా మే యతస్తతో మావతు శుద్ధభావమ్ ||

ఇతీరితస్తస్య హుతాశ నార్చిః ప్రఖ్యం తు తేజః పురతో బభూన |

తస్మిన్ న రాజా ప్రవివేశ బుద్ధిం కృత్వాలయం ప్రాప్తవాన్ యజ్ఞ మూర్తౌ || (5.46-55)

భావం: ఇంద్రశివసూర్యాగ్ని చంద్ర రాజమరుదనేకరూపివి, యజ్ఞ శరీరుడవు, యజింపదగినవాడవు అయిన శ్రీహరీ! నీకు నిత్యమూ నమస్కారం. బహుభయంకరములయిన కోరలూ, చంద్రసూర్యనేత్రములూ కలిగి, సంవత్సరంలోని రెండయనములూ, కుక్షిగాకలిగి, దర్భలు అంగములుగాకలిగి, ఉగ్రశక్తిశాలీ, సనాతనుడూ అయిన యజ్ఞ పురుషునికి నమస్సు. దివికీ,భువికీ నడుమగల భాగమూ, సర్వదిక్కులూ, తనశరీరంతో వ్యాపించిన ప్రశంసనీయుడు, శాసకుడు, జగత్సృష్టికర్త అయిన ఆ జనార్దనునికి నమస్సు. ఆ యజ్ఞపురుషుడు సురాసురుల జయాజయాలకోసం ప్రతి యుగంలోనూ తన ఆదిశరీరాన్ని సృజిస్తుంటాడు. ఆయన అనాది. అట్టి పరమేశ్వరునికి నిత్యమూ వందనం. ఆ ఉగ్రతేజస్వి జయంకోసం మాయామయమై, నిర్మలమైతెల్లనైన చక్రం ధరించాడు. అతడు గదాఖడ్గశారంగాదులున్న చతుర్భుజుడు. అట్టి యజ్ఞమూర్తికి నిత్యమూ ప్రణతి. ఆయన ఒకచోట వెయ్యి శిరస్సులు ధరించి ఉంటాడు. ఒక చోట మహాపర్వతసమాన కాయంతో ఉంటాడు. ఒకచోట త్రసరేణు సమానుడుగా ఉంటాడు. అట్టి యజ్ఞ పురుషునికి సదా ప్రణామం. ఆయన చతుర్ముఖుడై సమస్తమూ సృజిస్తాడు. పాలించటానికి రథాంగపాణీ,

నశింపచేయటానికి కాలాగ్ని సన్నిభుడూ (శివుడూ) అవుతాడు. అట్టి యజ్ఞమూర్తికి నిత్యమూ అభివందనం. సంసారచక్రం తిరుగుతుండటంకోసం సర్వగతుడైన ఆ పురాణ పురుషుని యజిస్తుంటారు. ఆ అప్రమేయుని యోగులు ధ్యానిస్తుంటారు. ఆ యజ్ఞమూర్తికి నిత్యమూ నమోవాకం. చక్కగా చూడదగిన నీ తత్వం, నాశరీరంలోని మనస్సుకు నేను బాగా అర్పించుకొన్నప్పుడు వేరేదీ లేదు అనే బుద్ధి స్థిరమౌతున్నది. అందువల్ల విశుద్ధభావం ఏర్పడుతున్నది. కనుక నన్ను రక్షించు.

6 వ అధ్యాయము - వసురాజు తరువాత కథ

ధరణి, ''దేవా, ఆంగిరసుని (బృహస్పతి) మాట విని, సందేహాలు తీర్చుకుని, ఆ వసువు, సజ్జనోత్తముడు రైభ్యుడు, ఇద్దరూ ఏమి చేశారు?'' అని ప్రశ్నించింది. శ్రీ వరాహ స్వామి ఇలా చెప్పారు, "సర్వధర్మజ్ఞుడు, ఆ వసువు తనరాజ్యాన్ని చక్కగా పరిపాలించాడు. భూరి దక్షిణలిచ్చి బహుమహాయజ్ఞాలు చేశాడు. ఆ రాజేంద్రుడు కర్మకాండతో దేవేశుడు, హరి, అయిన శ్రీ నారాయణ ప్రభువును ఆయనను అభేదముగా ధ్యానిస్తూ సంతోషపెట్టాడు. అనంతరం చాలాకాలం గడిచేసరికి ఆ రాజుకు భోగేచ్ఛ తొలగిపోయింది. (రాగద్వేషాది) ద్వంద్వాలు అంతమయ్యాయి. ఆయనకు నూరుగురు కొడుకులు, వారిలో పెద్దవాడు వివస్వంతుడు, ఉత్తముడు. అతనిని తన రాజ్యానికి అభిషిక్తుని చేసి, తపోవనానికి వెళ్ళి పోయాడు. అన్ని తీర్థాలలో ఉత్తమమైనది పుష్కరతీర్థం. అక్కడున్న కేశవుని పుండరీకాక్షుడనే పేరుతో ఆయన భక్తులు పూజిస్తుంటారు. కాశ్మీరాధిపతి, పండితుడు, వసురాజర్షి అక్కడికి వెళ్ళి, అకల్మషుడైన నారాయణ దేవుని ఆరాధింపగోరి, భక్తితో పుండరీకాక్షపారస్తోత్రం జపిస్తూ అతి తీవ్రతపస్సుతో తన శరీరం శుష్కింపజేసుకొన్నాడు. స్తోత్రాంతంలో రాజ సత్తముడు వసురాజు పుండరీకాక్షునిలో లీనమయ్యాడు." అని చెప్పగా విని, ధరణి ''దేవా, పరమేశ్వరా, పుండరీకాక్షపారస్తోత్రం ఎలాచెప్పబడిరదో, ఎట్టిదో, అది నాకు యథాతథంగా చెప్పు'' అని అడిగింది.

పుండరీకాక్ష పారస్తోత్రం

నమస్తే పుండరీకాక్ష నమస్తే మధుసూదన । నమస్తే సర్వలోకేశ నమస్తే తిగ్మచక్రిణే ॥

విశ్వమూర్తిం మహాబాహుం వరదంసర్వతేజసం।నమామి పుండరీకాక్షంవిద్యావిద్యాత్మకం విభుం॥

ఆదిదేవం మహాదేవం వేద వేదంగ పారగమ్ । గమ్భీరం సర్వదేవానాం నమామి మధుసూదనమ్ ॥

విశ్వమూర్తిం మహామూర్తిం విద్యామూర్తిం త్రిమూర్తికమ్ / కవచం సర్వదేవానాం నమస్యే వారిజేక్షణమ్ //

సహస్రశీర్షిణం దేవం సహస్రాక్షం మహాభుజమ్ / జగత్సంవ్యాప్య తిష్ఠన్తం నమస్యే పరమేశ్వరమ్ //

శరణ్యం శరణం దేవం విష్ణుం, జిష్ణుం సనాతనమ్ / నీలమేఘప్రతీకాశం నమస్యే చక్రపాణినమ్ //

శుద్ధం సర్వగతం నిత్యం వ్యోమరూపం సనాతనమ్ / భావాభావవినిర్ముక్తం నమస్యే సర్వగం హరిమ్ //

నాన్యత్ కించిత్ ప్రపశ్యామి వ్యతిరిక్తం త్వయాచ్యుత / త్వన్మయం చ ప్రపశ్యామి సర్వమేతచ్చరాచరమ్ // *(6.10-17)*

భావం: పుండరీకాక్షా, నీకు నమస్కారం. మధుసూదనా, నీకు నమస్సు. సర్వలోకేశ్వరా, నీకు సాగిలపాటు. ఉజ్జ్వలచక్రహస్తా, నీకు ప్రణామం. విశ్వమూర్తికి, మహాబాహునికి, వరదునికి, సర్వ తేజసునికి, పుండరీకాక్షునికి, విద్యావిద్యా (జ్ఞానాజ్ఞాన) స్వరూపునికి, విభునికి, అభివందనం. ఆది దేవుడు, మహాదేవుడు, వేదవేదాంగ పారంగతుడు, సర్వ దేవతలలో గంభీరుడు, అయిన మధుసూదనునికి నమస్సు. విశ్వమూర్తి, మహామూర్తి, త్రిమూర్తి, సర్వదేవకవచుడు, అయిన వారిజేక్షణునికి వందనం. సహస్రశీర్షుడు, సహస్రాక్షుడు, మహాభుజుడు, ప్రకాశమానుడు అయి జగత్తునంతనూ వ్యాపించిఉన్న పరమేశ్వరునికి ప్రణతి. శరణు పొందదగినవాడు, శరణమైనవాడు, దేవుడు, విష్ణుడు, జిష్ణుడు, సనాతనుడు, నీలమేఘసమానుడు అయిన చక్రపాణికి దండం. శుద్ధుడు, సర్వగతుడు, నిత్యుడు, వ్యోమరూపుడు, సనాతనుడు, భావాభావవిముక్తుడు, సర్వగామి అయిన శ్రీహరికి జోహారు. అచ్యుతా, నీకంటె వ్యతిరిక్తమైనది, వేరే కొంచెమూ కనబడటం లేదు. ఈ చరాచరమైనదంతా నీ మయంగా చూస్తున్నాను.

ఇలా స్తుతిస్తున్న వసురాజు శరీరం నుండి రూపు దాల్చి, ఒక పురుషుడు వెలువడ్డాడు. వాడు నల్లగా, మహాతీక్షణంగా, భయంకరంగా ఉన్నాడు. అతనికళ్ళు ఎర్రగా ఉన్నాయి. పొట్టిగా ఉన్నాడు. మాడిన ఊకరంగులో ఉన్నాడు. అతడు నమస్కరించి ''ఏమి చేయను నరాధిపా?'' అన్నాడు. రాజు ''ఎవడవు నీవు? ఇక్కడ నీకు ఏమి పని? ఎక్కడినుంచి వచ్చావు? కిరాతకా, ఇది చెప్పు, ఇది తెలుసుకోవానుకుంటున్నాను'' అని అడిగాడు. అప్పుడా కిరాతుడు వసురాజు వెనుకటి జన్మకథను ఇలా చెప్పాడు: ''రాజా, నీవు

పూర్వం కలియుగంలో, దక్షిణాపథంలో, జనస్థానంలో ఒక రాజువు. పూర్తి ధర్మంకలిగిన శ్రీమంతుడవు, విచక్షణుడవూను. వీరుడా, అట్టినీవు ఒకప్పుడు, చుట్టూ గుఱ్ఱపుదండు రాగా, ప్రత్యేకించి క్రూరమృగాలను చంపాలని, అడవికి వచ్చావు. అక్కడ, లేడిరూపం ధరించి ఉన్న ఒకమునిని, నీవు అనుకోకుండానే, దూరంనుంచి రెండు అమ్ములు వేసి, నేలను పడగొట్టావు. వెంటనే ఆ ఉత్తమవిప్రుడు గతించాడు. పార్థివా, లేడి పడిందని సంతోషంతో నీవు చూచేసరికి (అంతవరకూ) లేడిరూపంలో ఉన్న విప్రుడు ప్రస్రవణ పర్వతంమీద, ప్రాణాలు వదలి ఉన్నాడు. మహారాజా, అతనిని చూచి, నీ మనస్సూ, ఇంద్రియాలూ చెదరిపోయి ఇంటికి వెళ్ళిపోయావు. ఇతరులు ఎవరికో ఈ సంగతి చెప్పావు. కొన్నిరోజులు ఇలా జరిగిపోయాయి. ఒకనాటి రాత్రి, నరేశ్వరా, నీవు బ్రహ్మహత్యాభయంతో "ఈ పాపం నుంచి విముక్తినిచ్చే శాంతికృత్యం చేస్తాను." అని ఆలోచించావు. తరువాత మహారాజా, నారాయణ ప్రభువును స్మరిస్తూ, పవిత్రద్వాదశినాడు ఉపవాసవ్రతం ఆచరించావు. రాజా, ఆ శుభదినాన 'నారాయణుడు నాపట్ల సుప్రీతుడగు గాక, నారాయణో మే సుప్రీతః' అని యథావిధిగా గోదానం చేశావు. వెంటనే కడుపులో శూలవచ్చి కన్నుమూశావు. ద్వాదశీ ధర్మంకోసం భోజనం చెయ్యలేదు. అప్పటి నీ భార్య పేరు నారాయణి. ఆమె శుభ లక్షణవతి. నీ ప్రాణాలు కంఠములో ఉన్న సమయంలో ఆమెపేరు ఉచ్చరించావు. కనుక నీకు ఉత్తమగతిగా ఒక కల్పకాలం పాటు విష్ణుపురం లభించింది. మహారాజా, నేనపుడు కల్పం చివరివరకూ నీ శరీరంలో ఉన్నాను. కనుక నాకంతా తెలుసు. మహాభయంకర బ్రహ్మరాక్షసుడను, నిన్ను పీడించాలనుకొన్నాను. విష్ణుకింకరులు నన్ను రోకళ్ళతో మోదేసరికి ఆ దెబ్బతో నీ రోమకూపాలనుంచి జారి క్షీణించాను. రాజేంద్రా, స్వర్గంలో ఉన్నప్పుడు కూడా నీ దేహంలో నా తేజస్సువల్ల ఉన్నాను. సజ్జనోత్తమా, అనంతరం రాత్రికల్పంతోపాటు పగటికల్పం కూడా గడచిపోయింది. రాజసత్తమా, తరువాత ఈ సృష్ట్యాదివేళ, కృతయుగంలో నీవు సుమనసుడనే కాశ్మీరదేశపు రాజుఇంట జన్మించావు. మహారాజా, నేనూ నీరోమాలతో పాటు జన్మించాను.

గొప్పదక్షిణలిచ్చి ఎందరితోనో చాలా యజ్ఞాలు చేశావు నీవు. కాని వాటిలో విష్ణుస్మరణం లేనందువల్ల వాటివల్ల నేను తొలగలేదు. ఇపుడు నీవు పుండరీకాక్షపారస్తోత్రం చదివావే, దాని ప్రభావంవల్ల నీకేశాలను వదలి ఏకంగా కిరాతరూపంతో తిరిగి

జన్మించాను. నృపోత్తమా, నేను భగవత్ స్తోత్రం వినినందున పూర్వపు పాపరూపం నన్ను విడిచిపెట్టింది. ఇపుడు నాలో ధర్మబుద్ధి ప్రవర్తిస్తున్నది విభూ." అనిన ఈ మాట విని రాజు చాలా ఆశ్చర్యపోయాడు. వరంతో ఆ కిరాతుని ఆదరిస్తూ రాజసత్తముడు ''కిరాతా, నీవు మాకు జన్మాంతరగతవృత్తాంతం జ్ఞాపకం చేశావు. కనుక, నా అనుగ్రహంవల్ల ధర్మవ్యాధుడవుతావు. ''ఈ పుండరీకాక్షపార పరమస్తోత్రం విన్నవారికి పుష్కరయాత్రలో యథావిధి స్నానం చేసిన ఫలం లభిస్తుంది'' అని చెప్పాడు. అశేషధారిణీ, తరువాత రాజు ఉత్తమనవిమానం అధిరోహించి, పరంజ్యోతిలో లీనమైనాడు.(6)

7 వ అధ్యాయం - రైభ్యుని తీవ్రతపస్సు- గయా శ్రాద్ధ మహిమ

ధరణి ''దేవా, ఈ మునిశార్దూలుడు, రైభ్యుడు వసువు సిద్ధుడైనాడని విని, అపుడు తానేమి చేశాడు? ఇది నాకు మహాసంశయంగా ఉన్నది'' అని అడిగింది. అప్పుడు వరాహ స్వామి ఇలా చెప్పారు: "ఆ మునిశార్దూలుడు, తపోధనుడు, రైభ్యుడు, వసువు సిద్ధుడైనాడని విని, అపుడు, పితృతీర్థంలో, పుణ్యప్రదమైన గయకు వచ్చాడు. అక్కడకు వెళ్ళి భక్తితో పిండ ప్రదానంతో పితృగణానికి తృప్తి కలిగించాడు. పరమదుష్కరమైన అతిమహాతీవ్రతపస్సు చేశాడు. ధీశాలి ఆ రైభ్యుడు తీవ్రతపస్సు చేస్తుండగా ఒక అతిదీప్తిమంతుడైన మహాయోగి విమానంపై వచ్చాడు. ఆ విమానం సూర్యునిలా వెలుగుతూ, నలుసంత పరిమాణంతో, శుద్ధంగా ఉన్నది. అందులో ఉన్న ఆ దీప్తిమంతుడైన పురుషుడు పరమాణువు అంత ఉన్నాడు.

అతడు ''సువ్రతా, రైభ్యా, ఏమిపనిపై తపస్సు చేస్తున్నావు?'' అని అడిగాడు. ఇలా అడిగి ఆ పురుషుడు భువికీ, దివికీ నడుమ వ్యాపించి, మహారూపం ధరించి ఉన్నాడు. అతడు (రైభ్యుడు) ఐదు రథాలంతై, సూర్యసమానమై రోదసిలో వ్యాపించి, ఒకేసారి బ్రహ్మాండమంతా వ్యాపిస్తున్న విమానాన్ని చూచాడు. అప్పుడు రైభ్యుడు ఆశ్చర్యంలో మునిగి తేలుతూ, ప్రణామం చేసి, ''మహాయోగీ, నీవెవరవో నాకు చెప్పు'' అని అతనిని ప్రశ్నించాడు. పురుషుడు ''నేను రుద్రుని తమ్ముడను. బ్రహ్మమానసపుత్రుడను. నా పేరు సనత్కుమారుడంటారు. నేను భూలోకానికి పైన ఉన్న ఐదవ లోకమైన జనలోకంలో నివసిస్తాను. తపోధనా, ప్రేమవల్ల నీవద్దకు వచ్చాను. నాయనా, బ్రహ్మ కులవర్ధనా, సర్వథా ధన్యుడవు'' అన్నాడు. రైభ్యుడు ''యోగివరా, నీకు నమస్కారం, ప్రసన్నుడవగుము.

విశ్వరూపా, నాపై దయచూపిస్తున్నావు. నా కర్తవ్యమేమిటో చెప్పు. యోగిసింహా, నీవిప్పుడు నేను ధన్యుడనన్నావుకదా, ఎందువల్ల?'' అని అడిగాడు. అందుకు సనత్కుమారుడు రైభ్యునితో ఇలా అన్నాడు:

"బ్రాహ్మణ ముఖ్యా! నీవు నిజంగా ధన్యుడవు. నీవు గయచేరి వేదాలపై ఆసక్తి కలిగి, సర్వపిండాలతోనూ, మంత్ర, వ్రత, జప, హోమాలతోనూ పితృగణాన్ని తృప్తిపరుస్తున్నావు. రాజా! విను, మరొక నరపతి ఉండేవాడు. అతనిపేరు విశాలుడు. విశాలపురంలో ఉండేవాడు. అతడు పుణ్యాత్ముడు, శత్రుఘాతకుడు, ధైర్యము కలవాడు. కాని అతనికి పుత్రులులేరు. ఆ విశాలాధిపతి ఒకానొక సమయంలో ఉత్తమద్విజులను పుత్రుడు కావాలని అడిగాడు. సత్వగుణ సంపన్నులైన ఆ బ్రాహ్మణులు ''రాజా, గయకు వెళ్ళి అనేకాన్నదానాలతో పితృగణాన్ని తృప్తి చెందించు. నృపేశా! నీకు, గొప్పదాతా, సకల భూమికీ రాజు కాగలసుతుడు తప్పక జన్మిస్తాడు.'' అన్నారు. ఆ బ్రాహ్మణుడు అలా చెప్పేసరికి, ఆ రాజు విశాలాధిపతి బాగా సంతోషించి, పనిగట్టుకొని వచ్చి, ఆ ఉత్తమతీర్థంలో మఘా నక్షత్రంలో భక్తితో యథావిధిగా ప్రయత్నపూర్వకంగా పితృగణానికి పిండప్రదానం చేశాడు. అంతలో ఆ రాజు ఆకాశంలో తెల్లగా,పచ్చగా, నల్లగా ఉన్న ముగ్గురుమూర్తులను చూచి ''మీరుఎవ్వరు? ఈ సమయంలో ఏ పనిమీద వచ్చారు? అలా ఊరికే ఉన్నారు ఎందుకని? నాకు కుతూహలం ఎక్కువవుతోంది." అన్నాడు. సితుడు (తెల్లనివాడు) ''నేను సితుడను, నీతండ్రిని. పేరువల్లా, నడవడివల్లా, కులంవల్లా, కర్మవల్లా, కూడా స్వచ్ఛమైన వాడినే నాయనా. ఇతడు నాతండ్రి. ఎఱ్ఱనివాడు. కఠినకార్యాలు చేశాడు. బ్రహ్మహత్య చేసాడు. పాపపు పనులు చేసాడు. పేరు అధీశ్వరుడు. మరొకరు కృష్ణుడు (నల్లనివాడు) వృత్తిచేతనూ, కర్మచేతనూకూడా కృష్ణుడే. ఈ కృష్ణుడు పూర్వజన్మలో పాపకారి అయి, ఎందరో పురాణ ఋషులను సంహరించాడు. నాయనా, వీరిద్దరూ మరణించి, ఘోరమైన అవీచి అనే నరకానికి పోయారు. అధీశ్వరుడు నాతండ్రి. కృష్ణుడు ఇతని తండ్రి. ఇద్దరూ చాలాకాలం అందులో ఉన్నారు. నేను నా స్వచ్ఛకర్మవల్ల ఇంద్ర సింహాసనం పొందాను. అది దుర్లభమైనది. నరకంలో ఉంటున్నా, అన్ని మంత్రములనూ తెలుసుకొన్న నీవు, గయలో పిండప్రదానం చేసినందువల్లా, ఆ తీర్థపిండ ప్రదానం ప్రభావంవల్లా, వీరిద్దరూ బలంగా నాలో కలిశారు."

''శత్రునాశకా, నీవు పితరులనూ, పితామహులనూ, ప్రపితామహులనూ, సంతృప్తి పరుస్తానని ఆ నీళ్ళు వదిలావు. అందువల్ల, ఆ మాటలవల్ల మేము అందరమూ ఒక్కసారిగా కలిశాము. సజ్జనోత్తమా, ఈ తీర్థప్రభావంవల్ల మేము పితృలోకం వెడతాము. సంశయం లేదు. ఈ నీ పితామహులు పాపం చేసి, వికారము పొందిన వారైనా, దుర్గతిపాలైనవారైనా కూడా, ఇక్కడి పిండప్రదానం వల్ల చక్కగా సద్గతి పొందారు. ఈ తీర్థప్రభావం ఇది. ఈ తీర్థంలో పితృపిండ ప్రదానంవల్ల, బ్రహ్మహత్య చేసిన వానిని కూడా అతని కొడుకు ఉద్ధరిస్తాడు." ''నాయనా, ఈ కారణం వల్లనే వీరిద్దరినీ కలుపుకొని నిన్ను చూడాలని వచ్చాను. ఇప్పుడు వెడుతున్నాను. రైభ్యుడా, ఈ కారణం వల్ల నీవు ధన్యుడవన్నాను. ఒక్కసారి గయ వెళ్ళటమూ, ఒక్కసారి పిండప్రదానం చేయటమూ దుర్లభమైనవి. నీవేమో నిత్యమూ ఇక్కడనే ఉంటున్నావు. రైభ్యుడా, ప్రభూ, నీ ఈ పుణ్యం గురించి ఏమి చెప్పేది? నీవు గదాపాణి అయిన నారాయణునే సాక్షాత్తూ చూచావు. బ్రాహ్మణశ్రేష్టా ! గదాధరుడు సాక్షాత్తూ ఈ క్షేత్రంలో ఉన్నాడు. అందువల్ల ఈ తీర్థం అతి విఖ్యాతమైనది." అని పలికి ఆ మహాయోగి అక్కడనే అంతర్ధానమయ్యాడు. "రైభ్యుడు కూడా అనంతరం గదాపాణి అయిన హరిని ఇలా స్తోత్రం చేశాడు'' అని శ్రీవరాహులు చెప్పారు.

<u>**శ్రీ గదాధరుని స్తోత్రం**</u>

<u>రైభ్య ఉవాచ:</u>

గదాధరం విబుధజనై రభిష్టుతం ధృతక్షామం క్షుధితజనార్తినాశనం |

శివం విశాలాసురసైన్య మర్దనం నమామ్యహం హతసకలాశుభం స్మృతౌ ||

పురాణపూర్వం పురుషం పురుష్టుతం పురాతనం విమలమలం నృణాం గతిం |

త్రివిక్రమం ధృతధరణిం బలేర్ధ్వం గదాధరం రహసి నమామి కేశవం ||

సుశుద్ధభావం విభవైరుపావృతం శ్రియావృతం విగతమలం విచక్షణం |

క్షితీశ్వరైరపగత కిల్బిషైః స్తుతం గదాధరం ప్రణమతి యః సుఖం వసేత్|

సురాసురైరర్చిత పాద పంకజం కేయూరహారాంగదమాలిధారిణమ్ |

అబ్ధౌ శయానం చ రథాంగ పాణినం గదాధరం ప్రణమతి యః సుఖం వసేత్ ||

సితం కృతేత్రేతాయుగే రుణం విభుమ్ తథా తృతీయే పీతవర్ణ మచ్యుతమ్ |

కలౌ ఘనాలి ప్రతిమం మహేశ్వరం గదాధరం ప్రణమతి యః సుఖం వసేత్ ||

బీజోద్భవోయః సృజతే చతుర్ముఖ – స్తథైవ నారాయణరూపతో జగత్ |

ప్రపాలయేద్ రుద్రవపు స్తథాన్తకృద్ గదాధరో జయతు షడర్ధమూర్తిమాన్ ||

సత్త్వం రజశ్చైవ తమోగుణాస్త్రయ- స్త్వేతేషు నాన్యస్య సముద్భవః కిల |

సచైక ఏవత్రివిధో గదాధరో దధాతు ధైర్యం మమ ధర్మ మోక్షయోః |

సంసారతోయార్ణవ దుఃఖతన్తుభి ర్వియోగనక్రక్రమణైః సుభీషణైః |

మజ్జనముచ్చైః సుతరాం మహాప్లవే గదాధరో మాముదధాతు పోతవత్ ||

స్వయం త్రిమూర్తిః స్వమివాత్మనాత్మని స్వశక్తితశ్చాణ్ణమిదం ససర్జ హ |

తస్మింజలోత్థాసనమార్య తేజసం ససర్జయస్తం ప్రణతోస్మి భూధరమ్ ||

మత్స్యాదినామాని జగత్సు కేవలం సురాది సంరక్షణతో వృషాకపిః |

ముఖ్యస్వరూపేణ సమస్తతో విభు- ర్గదాధరో మేవిదధాతు సద్ గతిమ్|| (7.29-38)

భావం: విబుధులచే స్తుతింపబడినవాడు, వహించినవాడు, ఆకొన్న వారిఆర్తులను నశింపజేసేవాడు, శుభప్రదుడు, విశాల రాక్షస సైన్యాలను మర్దించేవాడు, స్మరిస్తే సకలాశుభాలను హరించేవాడు అయిన గదాధరునికి నేను కైమోడుస్తున్నాను. పురాణపురుషుడు, ముందు స్తుతింపబడేవాడు, పురాతనుడు, కల్మషరహితుడైన నిర్మలుడు, నరులకు గతి, త్రివిక్రముడై పెరిగి, బలినుంచి ధరణిని హరించినవాడు, కేశవుడు అయిన గదాధరునికి రహస్యంగా ప్రణమిల్లుతున్నాను. విశుద్ధభావుడు, విభవపరివేష్టితుడు, సిరివరించినవాడు, విమలుడు, విచక్షణుడు, కల్మషరహితులైన తీశ్వరులచేత స్తుతింపబడిన వాడు అయిన గదాధరునికి జోహారు చేసినవాడు, సుఖంగా ఉంటాడు. ఆయన పాద పంకజాలను సురాసురులు అర్చిస్తారు. ఆయన బాజూబందులూ, హారాలూ, కిరీటమూ ధరిస్తాడు. కడలిలో పవ్వళిస్తాడు. చక్రపాణి. ఆ గదాధరునికి జోత వెట్టినవాడు సుఖంగా ఉంటాడు. గదాధరుడు కృతయుగంలో తెల్లగానూ, త్రేతాయుగంలో ఎర్రగానూ, మూడవ (ద్వాపర) యుగంలో నీలంగానూ, కలియుగంలో మేఘంలాగానూ, తుమ్మెదలాగానూ, (నల్లగానూ) ఉంటాడు. సర్వవ్యాపకుడు, నాశరహితుడు, గొప్ప శాసకుడు. ఆయనకు

అభివాదం చేసినవాడు సుఖంగా ఉంటాడు. గదాధరుడు సృష్టికి మూలమై చతుర్ముఖుడై (బ్రహ్మయి)జగత్తును సృష్టిస్తాడు. నారాయణరూపంతో పాలిస్తాడు. రుద్రశరీరంతో సంహరిస్తాడు. అట్టి మూడుమూర్తులుగల ఆయన సర్వోత్కృష్టుడై వర్ధిల్లాలి. సత్త్వ రజస్తమోగుణాలు మూడింటిలో ఏదీ (గదాధరునినుంచితప్ప) మరెవ్వరినుంచీ ఏర్పడలేదు. ఆ గదాధరుడొక్కడే ఆమూడింటి రూపం అయినవాడు. ఆయన ధర్మమోక్షాల విషయమై నాకు ధైర్యం కలిగించాలి. సంసారజలధిలోని దుఃఖం కలిగించే అతిభయంకరములైన ఎడబాటు, మృత్యువు, అనే మొసళ్ళ విజృంభణంగల పెను వెల్లువలో పూర్తిగా మునిగిపోతున్న నన్ను గదాధరుడు ఓడలా పైకి (తీసి) దాటించుగాక. స్వయంగా తానే తనలో త్రిమూర్తులై, స్వశక్తితో (మాయతో) ఈ బ్రహ్మాండం సృష్టించాడు. అందులో ఆర్య తేజస్వి కమలాసనుని సృజించాడు. భూధరునికి ప్రణమిల్లుతున్నాను. ఆ వృషాకపి దేవాదులను సంరక్షించటానికి మత్స్యాదినామాలు పొందుతాడు. ముఖ్య స్వరూపంతో సర్వత్ర వ్యాపించి ఉండే వ్యాపకుడు గదాధరుడు నాకు సద్గతిని అనుగ్రహించాలి.

రైభ్యునికి గదాధరుని సాక్షాత్కారం: ఈ విధముగా భక్తితో బుద్ధిశాలి అయిన రైభ్యుడు స్తుతించేసరికి పీతాంబరుడు, జనార్దనుడు, అయిన విష్ణుమూర్తి వెంటనే ప్రత్యక్ష మయ్యాడు. ఆ పురుషోత్తముడు చేతులలో శంఖచక్రగదలు ధరించి, గరుత్మంతుడి నధిరోహించి, ఆకాశంలోఉండి, మేఘగంభీర వాక్కుతో ''ద్విజోత్తమా, రైభ్యవిభూ, నీభక్తికీ, స్తుతికీ, తీర్థస్నానానికీ, సంతోషించాను. నీ కోరికఏమిటో చెప్పు'' అన్నాడు. రైభ్యుడు ''దేవేశా, జనార్దనా, నీ అనుగ్రహంవల్ల సనకాదులున్న చోట నేను నివసించేగతిని అనుగ్రహించు'' అన్నాడు. విష్ణుదేవభగవానుడు ''బ్రాహ్మణుడా, అట్లే అగుగాక'' అని పలికి అంతర్ధానమయ్యాడు. రైభ్యుడు సంతోషించి, విష్ణుదేవుని (అనుగ్రహం) వల్ల క్షణంలో దివ్యజ్ఞానసమన్వితుడైనాడు. సనకాది మహర్షులు, సిద్ధులు, ఉండేచోటికి వెళ్ళాడు. రైభ్యుడు చేసిన గదాధరస్వరూపుడైన విష్ణునిస్తోత్రం పఠించినవానికి గయకు వెళ్ళి పిండప్రదానం చేసినంతకంటే విశేషమైన ఫలం లభిస్తుంది.(7)

8 వ అధ్యాయం - ధర్మ వ్యాధుని కథ

శ్రీవరాహస్వామి ఇలా చెప్పారు, "ఆ వసురాజు దేహంలో ఉన్నాడే, అతడు కిరాతుడై తనవృత్తి చేసుకుంటూ, నాల్గువేల సంవత్సరాల కాలం మిథిలా నగరంలో ఉన్నాడు. తన

కుటుంబంకోసం (రోజుకి) ఒక్కొక్క అడవి జంతువును చంపి భృత్యులనూ, అతిథులనూ, అగ్నిహోత్రునీ, సదా తృప్తిపరచేవాడు. వరారోహా, అమావాస్యాది ప్రతిపర్వంలోనూ, తన ఆచారాన్ని అనుసరించి, ఆ వివేకి శ్రాద్ధకర్మ ఆచరించేవాడు. నిత్యమూ అగ్నిని ఆరాధిస్తూ సత్యమైన మంచిమాట పలుకుతూ, జీవయాత్రకు అవసరమైనదానికి మించి ఒక్క ప్రాణిని కూడా చంపేవాడు కాడు. ఇలా ఉంటుండగా అతనికి ఒక పుత్రుడు జన్మించాడు. అతడు ధర్మబుద్ధిగలవాడు. మహాతపస్వి. మునిలా ఇంద్రియ నిగ్రహం కలవాడు. అతని పేరు అర్జునకుడు.

మంచి నడవడికతో చాలాకాలం గడిచేసరికి, ఆ ధీశాలి ధర్మవ్యాధుడికి 'అర్జునకి' అన్న చక్కని రూపురేఖలు గల కన్య కలిగింది. ఆమెకు వయసు వచ్చేసరికి ఆ ధర్మవేత్త ''ఈ కన్యను ఎవరికిచ్చేది? ఈమెకు తగినవాడెవడు?'' అని చింతించాడు. ఇలా చింతిస్తున్న ధర్మవ్యాధునికి మతంగుని సుతుడు ప్రసన్నుడనే అతనిని గురించి ఆప్తులు బాగా చెప్పారు. ధర్మవ్యాధుడు మాతంగ ప్రసన్నుని గురించి ప్రయత్నించి, అతని తండ్రితో ''తపస్విశ్రేష్ఠా, ప్రసన్నుడు మహాత్ముడు. అతనికి నా బిడ్డ అర్జునకిని ఇచ్చి వివాహం చేస్తాను. నీవు దయతో స్వీకరించు" అన్నాడు. మతంగుడు ''వ్యాధసత్తమా, నా సుతుడు ఈ ప్రసన్నుడు సర్వశాస్త్రవిశారదుడు, నీ కుమార్తెను అర్జునకీకన్యను, ఇతనికోసం స్వీకరిస్తాను'' అన్నాడు. ఇలా అనేసరికి మహాతపస్వి ధర్మవ్యాధుడు, ధీశాలీ, మతంగుని పుత్రుడూ అయిన ప్రసన్నునికి తన కన్యను ఇచ్చాడు. ఆ తరువాత ధర్మవ్యాధుడు స్వగృహం చేరుకొన్నాడు. అర్జునకి కూడా అత్తమామకూ, భర్తకూ, ఆసక్తితో సేవచేస్తున్నది. ఇలా చాలాకాలం గడిచింది.

అర్జునకిని అత్తగారు ''నీవు, జీవుల ప్రాణాలను తీసేవాడి కూతురివే. నీవూ అలాంటి దానివే. కనుకనే, నీకు తపస్సు చేయటమూ తెలియదు. భర్తను ఆరాధించటమూ తెలియదు'' అంటూ ఆరళ్ళు పెట్టసాగింది. ఆ సన్ననడుము చిన్నదాని నేరం స్వల్పమైనా, ఇలా బెదిరించేసరికి, ఆ చిన్నది మాటిమాటికి శోకిస్తూ, కన్నవారింటికి వచ్చింది. తండ్రి ''ఏమిటమ్మా ఇది? ఎందుకు ఏడుస్తున్నావు?'' అనడుగగా, ఆ భామిని ''నాన్నా, అత్తగారు అగ్గిమీద గుగ్గిలమై నన్ను ''ప్రాణాలు తీసేవాడికూతురివే, కిరాతకుడికి పుట్టావే'' అని చీటికీ మాటికీ అంటున్నది.'' అని చెప్పింది. ఇది వినేసరికి ధర్మాత్ముడైన ధర్మవ్యాధునికి క్రోధం

వచ్చింది. వెంటనే పల్లెనడుమ ఉన్న మతంగుని కొంపకు వెళ్ళాడు. విజయాన్ని వరించిన ఆ మతంగుడు, వచ్చిన చుట్టానికి ఆసనాదులు ఇచ్చి, అర్ఘ్యపాద్యాలతో అర్చించి ''నీవు వచ్చినపని ఏమిటి? నీకు స్వాగతసత్కారంగా ఏమి చేయమంటావు?'' అని అడిగాడు. వ్యాధుడు ''ప్రాణి సంబంధం కాని భోజనము కొంత తినాలని ఉంది. ఆ కోరికతోనే నీయింటికి వచ్చాను'' అన్నాడు. మతంగుడు ''బాగు చేసిన గోధుమలూ, బియ్యమూ, యవలతో వండిన పదార్థాలు మా ఇంట్లో ఉన్నాయి. ధర్మవేత్తలతో శ్రేష్ఠుడా, తపోధనా, కావలసినట్టు ఆరగించు'' అన్నాడు.

వ్యాధుడు ''ఆ గోధుమలూ, బియ్యమూ, యవలూ, ఎట్టివో చూస్తాను. అవి ఏ స్వరూపంలో ఉన్నాయో తెలుసుకొంటాను సజ్జనోత్తమా'' అన్నాడు. ఇలా అనేసరికి మతంగుడు అక్కడ నిండా గోధుమలు ఉన్న చేట ఒకటీ, బియ్యమున్న చేట మరొకటీ ధర్మవ్యాధునికి చూపించాడు. ఆ ధర్మవ్యాధుడు గోధుమలూ, యవలూ చూచాడు. ఉత్తమాసనం మీదనుంచి లేచి, వెళ్లసాగాడు. మతంగుడు ఆపి ''నా ఇంటిలో ఉత్తమమైన సిద్ధాన్నం తినకుండానే వెళ్ళిపోబోతున్నావెందుకని, మహామేధావీ? స్వయంగా వండించి, ఇప్పుడెందుకు తినవో చెప్పు'' అని అడిగాడు. వ్యాధుడు ''ప్రతిరోజూ వేలాదిగా, కోట్లాదిగా జీవుల్ని చంపుతున్నావు. మరి ఇంటువంటి పాపాత్ముడి అన్నం ఏ సత్పురుషుడు తింటాడు? ప్రాణి సంబంధం కాని, బాగావండిన ఆహారం ఏదైనా నీ ఇంట్లో ఉంటే, నీవాడననుకొని, ఇపుడు తింటాను. ఇప్పుడిక్కడ చూచినవి నీటి జంతువులు. మునీ, వీటిని విత్తితే ఒక్కొక్కటీ వేలకొలది గింజలుగా అవుతాయి కదా!''

''నేను, కుటుంబంకోసం రోజుకొక పశువును అడవిలో చంపుతాను. దానినైనా, వండి, పితరులకు నివేదించి, నావారితో పాటు భుజిస్తాను. నీవో, అనేక జీవాలను వధించి, సకుటుంబపరివారంగా తింటావు కనుక, అది నాకు సదా అభోజ్యం. బ్రహ్మదేవుడు పూర్వం ఓషధులనూ, సకల లతలనూ, యజ్ఞంకోసం సృష్టించాడు. అది (యజ్ఞశిష్టం) అయితే తినదగినదే, అని శ్రుతి. దివ్యయజ్ఞం, భూత యజ్ఞం, పితృయజ్ఞం, మానుషయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, అని ఈ పంచమహాయజ్ఞాలనూ బ్రహ్మ పూర్వం సృష్టించాడు. బ్రాహ్మణులా, తదితరులా, హితంకోసం ఆ యజ్ఞాలు బ్రాహ్మణులకు విహితమైనవి. ఇతరులకు, శుభ (యజ్ఞ) ములు బ్రాహ్మణులే చేయిస్తారు. ఇలా విభాగం (యజ్ఞం) చేసి, అందులో మిగిలిన

శ్రేష్ఠమైన ఆహారం పరిశుద్ధమవుతుంది. అలా యజ్ఞశిష్టములు కానందువల్ల ఆ బియ్యం మెతుకు ఒక్కొక్కటీ, ఒక్కొక్క మృగంగా, పక్షిగా, భావించాలి. దాతకూ, భోక్తకూ అది నరమాంసంతో సమానమన్నారు."

"నేను దేవతాస్వరూపురాలైన కూతురును నీకొడుకు కోసం ఇచ్చాను. ఆమెను నీ భార్య జీవుల ప్రాణాలు తీసేవాడి కూతురువన్నది. అందుకనే నీఇంటికి వచ్చాను. మీ ఆచారమూ, దేవపూజా, అతిథిసంతర్పణమూ చూద్దామని. వీటిలో ఒక్కటైనా నీవు ఇక్కడ చేస్తున్నట్టుకూడా కనబడదు. కనుక పితరులకు శ్రాద్ధకర్మ చెయ్యాలని నేను ఇంటికి వెడదామనుకొంటున్నాను. అది చేయకుండా, స్వగృహంలోనే నేను భోజనం చేయను. నేను వ్యాధుడను, జీవుల ప్రాణాలు తీసేవాడిని. నీవో, ప్రాణిహింసకుడవు కావు. జీవ ఘాతకుడనైన నా కూతురు నీకొడుకును పెళ్ళాడింది. నాకడుపున పుట్టిన పాపానికి, ఆమెకు ప్రాయశ్చిత్తము సంప్రాప్తించింది తపోధనా." అని పలికి, లేచి, అపుడు స్త్రీలను ఇలా శపించాడు ధరణీ "కోడళ్ళకూ, అత్తలకూ ఎక్కడా నమ్మకం లేకుండుగాక. కోడలు ఎన్నడూ అత్త బ్రతకాలని కోరకుండుగాక" అని పలికి, వ్యాధుడు స్వగృహానికి వెళ్ళాడు భామినీ ధరణీ. అనంతరం ఆ విచక్షణుడు దేవతలనూ, పితృదేవతనూ పూజించాడు. పుత్రుని అర్జునకుని కుటుంబ పెద్దగా నిలిపి, మహాతపస్వి ధర్మవ్యాధుడు వెంటనే త్రిలోక ప్రసిద్ధమైన పురుషోత్తమం అనే తీర్థానికి వెళ్లాడు. అక్కడికి వెళ్ళాక ఏకాగ్రచిత్తంతో నియమంతో ఈస్తోత్రం పఠిస్తూ తపస్సు చేశాడు ధరాదేవీ.

<u>ధర్మవ్యాధకృత విష్ణుస్తుతి</u>

నమామి విష్ణుం త్రిదశారినాశనం విశాలవక్షఃస్థలసంశ్రిత శ్రియమ్।

సుశాసనం నీతిమతాం పరాం గతిం త్రివిక్రమం మందర ధారిణం సదా ॥

దామోదరం రంజితభూతలం ధియా యశోంశుశుభ్రం భమరాంగ సప్రభమ్ ।

ధరాధరం నరకరిపుం పురుష్టుతం నమామి విష్ణుం శరణం జనార్ధనమ్ ॥

నరం నృసింహం హరిమీశ్వరం ప్రభుం త్రిధామనామా నమనంతవర్చసమ్ ।

సుసంస్కృతాస్యం శరణం నరోత్తమం వ్రజామి దేవం సతతం తమచ్యుతమ్ ॥

త్రిధా స్థితం తిగ్మరథాంగ పాణినం నయస్థితం తృప్తమనుత్తమైర్గు ణైః ।

నిః శ్రేయసాఖ్యం క్షపితేతరం గురుం నమామి విష్ణుం పురుషోత్తమం త్వహమ్ ||

హ్రతౌ పురాణౌ మధుకైటభావుభౌ బిభర్తి చక్ష్మాం శిరసా సదా హి సః |

యథాస్తుతో మే ప్రసభం సనాతనో దధాతు విష్ణుః సుఖ మూర్జితం మమ ||

మహావరాహోహవిషాంబుభోజనో జనార్దనో మే హితకృచ్ఛితీముఖః |

క్షితీధరో మాముదధిక్షయో మహాన్ స పాతు విష్ణుః శరణార్థినంతు మామ్ ||

మాయాతతం యేన జగత్త్రయం కృతం యథాగ్ని నైకేన తతం చరాచరమ్ |

చరాచరస్య స్వయమేవ సర్వతః నమోస్తు విష్ణుః శరణం జగత్పతిః |

భవే భవే యశ్చ ససర్జ కంతతో జగత్ ప్రసూతం సచరాచరం త్విదమ్ |

తతశ్చరుద్రాత్మవతి ప్రలీయతే- న్వతో హరిర్విష్ణుహర స్తథోచ్యతే ||

ఖాత్మేన్దుపృథ్వీ పవనాగ్ని భాస్కరా జలం చ యస్య ప్రభవంతి మూర్తయః |

స సర్వదా మే భగవాన్ సనాతనో దదాతు శం విష్ణురచింత్యరూపధృక్ ||

ఇతీరితే తస్య సనాతనః స్వయం పురో బభూవాద్భుతరూపదర్శనః |

వరం వృణీష్వేతి సనాతనో-బ్రవీ దనంత పాదోదర బాహువక్త్రః ||

ఇతీరితే వ్యాధవరో జగాద ప్రదీయ తామేష వరః సుతేష్వపి |

క్రియాకలాపేన తథాత్మవిద్యయా కులప్రసూతావపి తేనుగామినః ||

జ్ఞానోదయ స్త్వన్య కులస్య సర్వగే లయస్తథా బ్రహ్మణి మే సనాతన |

ఇతీరితే తం భగవానువాచ హ ప్రసన్న బుద్ధిర్భవతే మయా త్వయమ్ ||

వరో విస్పష్టశ్చ కులస్య తేమయా లయస్తథా బ్రహ్మణి శాశ్వతే తవ |

ఇతీరితే దేవవరేణ సక్షణాత్ స్వదేహత స్తేజ ఉదీర్ఘమైక్షత |

విసర్జయామాసకవిం సనాతనం లయం చ తత్ర, ప్రతిపేది వానసౌ ||

ఇతీరితం స్తోత్రవరం ధరేనరః పఠిష్యతే యశ్చ శృణోతి మానవః |

హరిం సమభ్యర్చ్య సదా హ్యుషోషితో విశేషతో విష్ణుదినే చ మానవః |

సయాతి యత్ర స్వయమేవ కేశవో వనేత మన్వంతరసప్తతిం సుఖమ్ || *(8.42-54)*

భావం: నేను విష్ణుమూర్తికి సదా సమస్కరిస్తున్నాను. అతడు దేవ శత్రువులను (రాక్షసులను) నశింపజేస్తాడు. ఆయన విశాల వక్షఃస్థలాన్ని ఆశ్రయించుకొని లక్ష్మి ఉంటున్నది. ఆయన శాసనం మంచిది. నీతిమంతులకు పరమగతి, త్రివిక్రముడు, మందరధారి. విష్ణుమూర్తికి ప్రణమిల్లుతున్నాను. ఆయన దామోదరుడు. తెలివితో భూతలం రంజింపజేశాడు. ఆయన యశఃకరణాలతో స్వచ్ఛమైనవాడు. ఆయన తుమ్మెద మేనికి సరివన్నె వాడు. ధరాధరుడు. నరకారి. దేవలోకనంస్తుతుడు. ఆయన రక్షకుడు, జనార్ధనుడు. నేను అచ్యుతుని సదా శరణుపొందుతున్నాను అతడు నరుడు, నరసింహుడు, హరి, ఈశ్వరుడు, సమర్థుడు, త్రిధామనాముడు, అనంత వర్చస్వి, సుపవిత్రముఖుడు, నరోత్తముడు, దేవుడు. విష్ణుమూర్తికి వందనం చేస్తున్నాను. ఆయన మూడు విధాలుగా (త్రిమూర్తులుగా) ఉన్నాడు. ఆయన చేతిలో చక్రం మెరుస్తున్నది. ఆయన నీతిలో ఉంటాడు. సర్వోత్తమ గుణసంతృప్తుడు. మోక్షస్వరూపుడు.వినాశరహితుడు. గురుడు, పురుషోత్తముడు. విష్ణువు నాసుఖాన్ని బాగా పెంపొందించాలి. ఆయన పురాతనులైన మధు కైటభులనే ఇద్దరు (రాక్షసులను) సంహరించాడు. నిరంతరమూ ధరణిని శిరసా ధరిస్తుంటాడు. ఆ సనాతనుని నేను వెంటవెంటనే స్తుతిస్తుంటాను. శరణార్థిని నన్ను విష్ణుమూర్తి రక్షించుగాక. ఆయన మహా వరాహుడు. హవిర్భోక్త. జనులను సంతోష పెడతాడు. నాకు మేలు చేస్తాడు. చితీముఖుడు, క్షితిధరుడు. సముద్రంలో ఉంటాడు. నన్ను రక్షించుగాక. జగన్నాథుడు విష్ణుమూర్తి నాకు రక్షకుడు అగుగాక. ఒక్క అగ్ని చరాచరాలన్నిటా విస్తరించినట్టు ఆయన మాయను ముల్లోకాలలోనూ విస్తరింపజేశాడు. చరాచరాల అన్ని వైపులా ఉన్న వాడు తానే. సృష్టిసృష్టిలోనూ ఆయన నీటిని సృష్టించాడు. దానినుంచి ఈ చరాచరజగత్తు జన్మించింది. తరువాత రుద్రస్వరూపంలో లీనమౌతున్నది. కనుకనే హరి, విష్ణుడు (సర్వవ్యాపకుడు) హరుడు అనబడుతున్నాడు. సూర్యచంద్రులూ, భూమి, వాయ్వాదులూ, అగ్నీ, జలమూ, ఆ సనాతనునిమూర్తులు. అట్టి అచింత్య రూపధారి విష్ణుభగవానుడు సర్వదా నాకు శుభము అనుగ్రహించాలి." అని ధర్మవ్యాధుడు స్తుతింపగా, అతని ఎదుట అద్భుతరూపదర్శనుడు, సనాతనుడు, అయిన భగవంతుడు స్వయంగా ప్రత్యక్షమయ్యాడు. అనంతములైన పాదములూ, ఉదరములూ, బాహువులూ, ముఖములూ, గల ఆ సనాతనుడు ''వరం కోరుకో'' అన్నాడు.ఈ విధముగా అనగానే, ఆ వ్యాధోత్తముడు ''స్వామీ, నా బిడ్డలూ, నా

కులంలో పుట్టేవారందరూ కూడా సత్కార్యములతో, ఆత్మవిద్యతో అలరారుతూ, నీ అనుచరులు కావాలి. ఈ వరం ఇవ్వండి. ఇంకా, నా సంతతిలో ఎవరూ ధర్మయుగంలో జన్మించాలి తప్ప, కలియుగం లో పుట్టకూడదు. నా కులానికి జ్ఞానాభివృద్ధి, సర్వగతమైన బ్రహ్మములో లయమూ, సర్వదా కలుగుతుండాలి సనాతనా! దేవసత్తమా, ఈ విధముగా నీ అనుగ్రహం పొందిన తరువాత నేను నీలో లీనమవుతాను'' అనేసరికి భగవానుడూ మనస్సులో సంతోషించి ''నీకీ వరం ఇస్తున్నాను. నీకూ, నీకులానికి, నాలో, శాశ్వత బ్రహ్మంలో లయం లభిస్తుంది.'' అన్నాడు. దేవోత్తముడీ విధంగా చెప్పేసరికి, అతడు తక్షణమే తనదేహం నుంచి వెలువడుతున్న మహాతేజస్సును చూచాడు. దానిని విడిచి, అతడు ఆ సనాతనకవిలో లయమైనాడు. ధరాదేవీ, ఈ విధముగా ధర్మవ్యాధుడు పఠించిన ఉత్తమస్తోత్రం – సదా శ్రీహరిని అర్చిస్తూ, ఉపవసించి, విశేషించి విష్ణువాసరం (=ఏకాదశి) నాడు చదివిననరుడు, వినినమానవుడు, కేశవుడు స్వయంగా నివసించేచోటికి వెళ్ళి, డెబ్బైమన్వంతరాలు సుఖంగా అక్కడ నివసిస్తాడు.(8)

9 వ అధ్యాయం - మూర్తామూర్త సృష్టి

ధరణి ''నాథా, మొదట కృతయుగాదిలో విశ్వమంతా తానే అయిన నారాయణుడు ఏమి చేశాడో, ఆ సత్యం వినాలనుకొంటున్నాను'' అని అడిగింది. శ్రీవరాహ స్వామి ఇలా చెప్పారు: ధరా, పూర్వం నారాయణుడు ఒక్కడే ఉన్నాడు. వేరే ఏమీ, లేదు. తన ఇష్టప్రకారం పనులు చేసే ఆయనకు, ఒంటరితనం వల్ల సంతుష్టి కలుగనే లేదు. ఆయన రెండవవాడు కావాలనుకొంటుంటే ఆయన బుద్ధిరూపాన్ని ధరించి మెరిసింది. దాని పేరు "అకారం." అది ఒక క్షణం పాటు సూర్యసమానంగా వెలిగింది. ఆ ఆలోచన బ్రహ్మమును తెలుపుతూ, ఉ, మ అన్న రెండువిధాలై, ఎల్లప్పుడూ మర్త్యలోకంలో నిలిచింది. అవే ఉకారమకారాలు. అలా అకార, ఉకార, మకారస్వరూపమైన మూడు రకాలయిన ఆలోచన – ఓం అన్న ప్రణవాక్షరమై అపుడీ భూమిని సృజించింది.

భూర్లోకం భువర్లోకాన్ని సృజించింది. అది స్వర్లోకాన్ని సృజించింది. దానినుంచి మహర్లోకమూ, దాని నుంచి జనోలోకమూ, దానినుంచి తపోలోకమూ, తపోలోకంనుంచి సత్యలోకమూ సంభవించాయి. అటుపై ఆత్మ పరమాత్మలో విలీనమౌతుంది. ఇదంతా బుట్టలో దారంలా, మణులలో వెలుగులా అంతటా వ్యాపించింది. ప్రణవం (ఓంకారం)

నుంచి పుట్టిన ఈ జగత్తు అప్పుడు శూన్యంగా ఉన్నది. భగవానుని మూర్తి అయిన శంకరుడు స్వయంగా శ్రీహరే. ఈ శూన్యలోకాలను చూసి, ఆ శంకరుడు ఉత్తమ ఆకారాలను సృష్టింపగోరి, మనస్సును మథించాడు. అప్పుడు తన అంశతో ఒక ఆకారం ఏర్పడింది. దానిపై ఆయన కూర్చుండగా, అది అటూఇటూ కదలాడి, బ్రహ్మాండ మేర్పడిరది. అది ముక్కలయ్యేసరికి క్రింది భాగం భూలోకంగా ఏర్పడింది. మధ్యభాగం సూర్యునిలా వెలుగుతూ, నక్షత్రమండలం దాకా వ్యాపించి, మరోలోకం ఏర్పడింది. అందులో పురాణపురుషుడయిన నారాయణదేవుడు ప్రాజాపత్యతేజస్సుతో వ్యాపించి పద్మపు మొగ్గలో ఉన్నాడు. ఆయన అకారాది స్వరాలనూ (అచ్చులనూ), హల్లులనూ తన నాభి లోంచి సృష్టించాడు. సృష్టిలో ఇంకాఆకారాలు ఏర్పడకముందే ఆయన శాస్త్రాలను (వేదాలను) ఉచ్చరించాడు. అపుడు దిక్కులను సృష్టించి, ఆ అమేయాత్ముడు వాటిని నిలపడంగురించి ఆలోచించాడు. ఆలోచిస్తున్న అతని నేత్రాలనుంచి ఒక మహాతేజస్సు వెలువడింది. దక్షిణంవైపుది అగ్నిలా ఉన్నది, ఎడమవైపుది మంచులా ఉన్నది. అది చూచి పరమేష్ఠి వాటిని చంద్రసూర్యులుగా మలచాడు. తరువాత పరమేష్ఠి ప్రాణం వాయువై వెలువడింది.సర్వవ్యాపకుడైన ఆవాయుభగవానుడే నేటికీ మనహృదయంలో ఉంటున్నాడు. వాయువునుంచి అగ్ని, అగ్నినుంచి మహాజలం వెలువడింది. ఈ అగ్నియే బ్రాహ్మణ జాతికి మూలకారణమైన బ్రహ్మతేజస్సు. ఈ తేజస్సే రెండుబాహువులనుంచీ క్షాత్ర తేజస్సును సృష్టించింది. ఆ విభుడు రెండుఊరువుల నుంచీ వైశ్యులనూ, రెండు పాదాల నుంచీ శూద్రులనూ సృష్టించాడు.ఆప్రభువు తరువాత యక్షులనూ,రాక్షసులనూ, సృష్టించాడు.

చతుర్విధ వర్ణాలతో భూలోకాన్నీ, యక్షాదులతో భువర్లోకాన్ని, స్వర్గ మార్గాన్ని అనుసరించే ఇతర ప్రాణులతో స్వర్లోకాన్నీ నింపాడు. అలాగే ఆయా సనకాది ప్రాణులతో మహర్లోకాన్నీ, తరువాత వైరాజులనే ప్రాణులతో జనోలోకాన్నీ నింపాడు. అటుపై దేవుడు తపోలోకాన్ని తపోనిష్ఠులతో నింపాడు. మరణము లేని దేవతలతో సత్యలోకాన్ని నింపాడు. భూతభావనుడు, భగవానుడు, పరమేశ్వరుడు, దేవుడు, అలా సృష్టిని సృష్టించి, కల్పమనే పేరున్న తనపగటివేళ మేలుకొని ఉంటాడు. ఆ పగటిలో భూలోక భువర్లోకస్వర్లోకాలివి మూడు జన్మిస్తాయి. ఇందులో సందేహం లేదు. కల్పాంతంలో దేవుడు నిద్రిస్తే పగలు ఎంతకాలముందో, అంతకాలమూ రాత్రి ఉంటుంది. అప్పుడు ఈ మూడులోకాలూ నీటిలో

మునిగి నిద్రిస్తాయి. అనంతరం రాత్రి గడిచాక కమలాక్షుడు దేవేశుడు లేస్తాడు. ఆ నాలుగు వేదాలనూ, వాటి తల్లి సావిత్రినీ, ధ్యానిస్తాడు. అయినా ఆ వేదాలను పొందదు. నిద్రాజ్ఞాన మోహితుడై, లోకమార్గం ఏర్పరచటానికి ఆ దేవేశుడు ఇక్కడ వేదాలు లేవనునకొంటాడు. ఆపైని సర్వేశ్వరుడు జలమనే తనరూపంలో లీనమైన వేదాలను చూచి, తీసుకోవాలని ఆలోచించి, మత్స్యమై నీటిలో ప్రవేశిస్తాడు. ఇలా ఆలోచించి, క్షణంలో మహామత్స్యమై దేవుడు నీటిలో ప్రవేశించి అన్నివైపులా కలచివేస్తాడు. వేగంగా పెద్ద పర్వతమంత శరీరంతో, ప్రకటంగా, ఆ దేవవరుడు మత్స్యరూపంతో మహా సముద్ర జలంలో ప్రవేశించి, భూమినెత్తేసరికి ఆ హరిని సనకాదియోగులు స్తోత్రాలతో స్తుతిస్తారు.

<u>మత్స్యరూపనారాయణస్తుతి</u>

నమోస్తు వేదాంతరగా ప్రతర్క్య నమోస్తు నారాయణ మత్స్య రూప!

నమోస్తుతే సుస్వర విశ్వమూర్తే నమోస్తు విద్యాద్వయరూపధారిన్ ||

నమోస్తు చంద్రార్క మరుత్స్వరూప జలాన్తవిశ్వస్థిత చారు నేత్ర |

నమోస్తు విష్ణోః శరణం వ్రజామః ప్రపాహినో మత్స్యతనుం విహాయ ||

త్వయా తతం విశ్వమనంతమూర్తే పృథగ్గతే కించి దిహాస్తి దేవ |

భవాన్ న చాస్య వ్యతిరిక్త మూర్తి స్త్వత్తో వయం తే శరణం ప్రపన్నాః ||

ఖాత్మేన్దువహ్నిశ్చ మనశ్చ రూపం పురాణమూ రే స్తవ చాబ్జనేత్ర |

క్షమస్వ శంభో యది భక్తి హీనం త్వయా జగద్భాసతి దేవ దేవ ||

విరుద్ధమేతత్ తవ దేవ రూపం సుభీషణం సుస్వనమద్రితుల్యమ్ |

పురాణ దేవేశ జగన్నివాస శమం ప్రయాహ్యచ్యుత తీవ్రభానో ||

వయం హి సర్వే శరణం ప్రపన్నా భయాచ్చ తే రూపమిదం ప్రపశ్య |

లోకే సమస్తం భవతా వినా తు న విద్యతే దేహగతం పురాణమ్ ||

ఏవం స్తుతస్తదా దేవో జలస్థాన్ జగృహేచ సః | వేదాన్ సోపనిషచ్ఛాస్త్రానన్తస్థం తూపమాస్థితః ||

యావత్స్వమూర్తిర్భగవాంస్తావ దేవ జగత్ త్విదమ్ | కూటస్థే తల్లయం యాతి వికృతిస్థే వివర్ధతే|| (9.29-36)

భావం: వేదాంతరగామీ, నీకు వందనం. అచింత్యా అభివందనం. మత్స్యరూపా, నారాయణా, సుస్వరా, విశ్వమూర్తీ, నీకు అభివాదం. విద్యాద్వయరూపధారీ, అభివాదనం. చంద్రార్క మరుత్స్వరూపా, నీటిలోని విశ్వంలో ఉన్నవాడా, సుందరనేత్రా, అంజలి. ప్రణామం. విష్ణువును (నిన్ను) శరణు పొందుతున్నాము. మత్స్య శరీరం విడిచి పెట్టి మమ్మల్ని సంరక్షించు. అనంతమూర్తీ, విశ్వమంతా నీవు విస్తరించినదే. దేవా, నీకంటె వేరైనది ఇక్కడ కొంచెమూ లేదు. నీవు దీనికి వ్యతిరిక్త మైనమూర్తివి కావు. నీవల్లనే (సంభవించినది). మేము నీశరణు వేదు తున్నాము. అబ్జనేత్రా, ఆకాశం, ఆత్మ, చంద్రుడు, అగ్ని, మనస్సు, పురాణమూర్తివైన నీరూపాలే. శంభూ, దేవదేవా, నీవల్లనే జగత్తు భాసిస్తున్నది. భక్తిహీనుడనైతే నన్ను క్షమించు. దేవా, మంచిధ్వనితో బాగా అరుస్తూ అద్రిసమానంగా ఉన్న ఈ రూపం నీకు విరుద్ధమైనది. ప్రాచీనుడా, దేవేశా, జగన్నివాసా, అచ్యుతా, తీవ్రభానూ, శాంతించు. నీ ఈ రూపం చూచి మేము అందరమూ భయంతో నమస్కరిస్తున్నాము. శరణు వేడుతున్నాము. నీవువినా నేడు లోకంలో సమస్తమూ లేదు. ప్రాచీనమైనదంతా నీ శరీరంలో ఉన్నది.

ఇలా స్తుతించేసరికి అపుడు ఆ దేవుడు నీటిలో ఉన్న వేదాలనూ, ఉపనిషత్తులనూ, శాస్త్రాలనూ, పట్టుకొన్నాడు. తరువాత తన నిజరూపం స్వీకరించాడు. భగవానుడు ఎంతవరకూ తన రూపంతో ఉంటాడో, అంతవరకే ఈ జగత్తు. అతడు ప్రకృతిలో కలిసిపోతే, ఈ జగత్తు కూడా అతనిలో లీనమౌతుంది. ఆయన దేహము ధరిస్తే జగత్తు వర్ధిల్లుతుంది.(9)

10 వ అధ్యాయం - పూజ్యతకోసం దేవతల వేడుకోలు

శ్రీవరాహస్వామి ఇలా చెప్పారు: భగవానుడు, భూతభావనుడు ఇలా జగత్తు సర్వమూ సృష్టించి ఊరకున్నాడు. ధరా, అనంతరం సృష్టి పెరిగింది. ఆపైని సృష్టి పెరిగాక, సర్వదేవతలూ, పురాతనుడైన నారాయణుడనే పురుషుని వివిధముఖాలతో, యజ్ఞాలు చేస్తూ అనేక వేల ఏండ్లు పూజించారు. తాము పూజ్యులము కావాలన్న కోరికతో, సర్వద్వీపాలోనూ, ఆయా వర్షాలలోనూ, ఆ దేవతలు శ్రద్ధతో, మఖాలతో, మహాసత్రయాగాలతో యజిస్తూ ఆయనను మిక్కిలి సంతోషపెట్టారు. ఇలా వారు సంతోషపెడుతుంటే అనేక వేల సంవత్సరాల కాలం గడిచింది. అపుడు దేవుడు సంతుష్టుడై

ప్రత్యక్షమయ్యాడు. అపుడు అనేకములైన బాహువులతో, ఉదరాలతో, ముఖాలతో, నేత్రాలతో, మహాగిరిశిఖరంలా, ఆకాశం రాచుకొంటూ వచ్చిన దేవుడు ''సురేశ్వరులారా, దేవవరులారా, మీకు ఇష్టమైన ఉత్తమవరం కోరుకోండి'' అన్నాడు.

దేవతా కృత విష్ణు స్తుతి

జయస్వ గోవిన్ద మహానుభావ త్వయా వయం నాథ వరేణ దేవాః |

మనుష్యలోకే ఽపి భవన్త మాద్యం విహాయ నాస్మాన్ భవతే హ కశ్చిత్ ||

చంద్రాదిత్యా వసవో యే చ సాధ్యా విశ్వే ఽశ్వినౌ మరుత శ్చోష్మపాశ్చ |

సర్వే భవన్తం శరణం గతాః స్మకురుష్వ పూజ్యా నిహ విశ్వమూర్తే || (10.6-7)

భావం: గోవిందా! మహానుభావా! స్వామీ, సర్వోత్కృష్టుడవు కా. దేవతలమైన మేము నీవల్ల వరం కోరుతున్నాము. మనుష్యలోకంలో కూడా నిన్ను విడిచిపెట్టి, మమ్మల్ని ఎవరూ సేవించటం లేదు. చంద్రుడు, ఆదిత్యుడు, వసువులు, సాధ్యులు, విశ్వ దేవతలు, అశ్వినులు, మరుత్తులు, ఊష్మవులు, అందరమూ నిన్ను శరణు వేడుతున్నాము. విశ్వమూర్తీ, మమ్మల్ని ఈ విశ్వంలో పూజింపదగిన వారిని చెయ్యి.

వారు ఇలా పలికేసరికి మహాయోగీశ్వరుడు, హరి, ''మిమ్మల్నందరినీ పూజ్యులను చేస్తాను'' అని పలికి అంతర్ధాన మయ్యాడు. సనాతనులైన దేవతలుకూడా, ఆయనను స్తుతిస్తూ తమనివాసాలకు వెళ్ళారు. దేవీ ! పరమేశుడు కూడా మూడు విధాలుగా అయి ఉన్నాడు. ఇలా మహేశ్వరుడు జగద్ధాత, సాత్వికం, రాజసం, తామసం అనే మూడువిధాలై దేవతలను ఆరాధించాడు. సాత్వికరూపంలో వేదాలను పఠించాడు, యజ్ఞాలతో దేవతలను పూజించాడు. రజోగుణంతో అతడు తన అంశతో కాలరూపి, రౌద్రుడు, ప్రకృతితో సహా శూలహస్తుడు అయిన రుద్రుడిని సృష్టించి, పూజించాడు. తమోగుణంతో రాక్షసులలో కొలువైనాడు. ఇలా జగద్ధాత మహేశ్వరుడు మూడు భాగాలై దేవతలను ఆరాధించాడు. ఆ తరువాత లోకంకూడా మూడువిధాలైంది. ఆయన బ్రహ్మవిష్ణుమహేశులనే పేర్లు స్వీకరించి ఉన్నాడు. యుగాలలో శ్రేష్ఠమైన కృతయుగంలో ఆ ప్రభువు నారాయణుడు. త్రేతాయుగంలో రుద్రరూపుడైనాడు. ద్వాపరంలో యజ్ఞమూర్తి అయినాడు. కలిలో నారాయణదేవుడు బహురూపాలతో జన్మించాడు. ఆదికర్త, మహా

తేజస్సు కలిగినవాడయిన ఆ విష్ణువుచరితం సమస్తమూ నేను చెపుతాను. సుందరజఘనా, భామినీ, విను.

దుర్జయునికథ : కృతయుగంలో సుప్రతీకుడనే రాజు ఉన్నాడు. అతడు మహా బలశాలి. అతనికి ఇద్దరు భార్యలు ఉన్నారు. వారు భేదం లేనివారు. మనోహరమైనవారు. వారిపేర్లు విద్యుత్ప్రభ, కాంతిమంతి. రాజు ఎన్ని సత్కార్యాలు చేసినా, వారిద్దరివల్లా ఆయనకు తగిన పుత్రుడు లభించలేదు. అపుడు ఉత్తమమైన చిత్రకూటపర్వతంపై కల్మషహితుడైన ఆత్రేయముని శ్రేష్ఠుని ఆ రాజు యథావిధిగా సంతోషపెట్టాడు. అత్రిపుత్రుడైన ఆముని, ఆ ఋషి చాలా కాలం నుంచి వరం కోరుతున్న అతని పట్ల సంతుష్టుడై వరం ఇవ్వగోరి మాట్లాడబోతున్నాడు. అంతలో మహాబలుడు ఇంద్రుడు గజారూఢుడై దేవసైన్యపరివృతుడై మాటాడకుండానే ఆయన ప్రక్కగా వెళ్లాడు. అతనిని చూచి ఆ మునికి అతనిమీది ప్రీతి, అప్రీతిగా మారింది. కోపించి, దేవరాజుపై ఉగ్రశాపం విడిచిపెట్టాడు. ''మూఢుడా, దివస్పతీ, నీవు నన్ను అవమానించావు కనుక, నీవు రాజ్యభ్రష్టుడవై వేరే లోకంలో నివసిస్తావు.'' అని కోపముగా పలికాడు. తరువాత సుప్రతీకభూపతితో ''రాజా, నీకు దృఢపరాక్రమశాలి అయిన పుత్రుడు పుడతాడు. అతడు ఇంద్రుడులా ఉంటాడు. శ్రీమంతుడు, ఎత్తినకత్తి దింపని ప్రతాపశాలి అవుతాడు. అతడు విద్యాప్రభావమూ, కర్మకాండా తెలిసినవాడు, కార్యశూరుడు, జయింప శక్యము కానివాడు, అతిబలశాలి అయినరాజు అవుతాడు'' అన్నాడు.

ఇలా పలికి ముని వెళ్ళిపోయాడు. ఆ సుప్రతీక రాజు ధర్మజ్ఞుడు. అతని భార్య విద్యుత్ప్రభ గర్భం ధరించింది. ఆమెకు తగుసమయంలో కానుపయింది. ఆమె పుత్రుడు మహాబలశాలి దుర్జయుడు అనే పేరు గలవాడయ్యాడు. ఆత్రేయ ముని, తపస్సు వల్ల అకల్మషశరీరుడైనవాడు, స్వయంగా ఆ బిడ్డకు సంస్కారాలు చేశాడు. ఆ మునిఇష్టి (యజ్ఞ) బలం వల్ల అతడు సౌమ్యుడూ, వేదశాస్త్రార్థ విద్యాపారంగతుడూ, ధర్మాత్ముడూ, శుచీ అయ్యాడు. మహాత్ముడైన ఆ రాజుకు రెండవ భార్య ఉన్నదే, కాంతిమతి అను పేరు గల ధన్యురాలు, ఆమెకూ సుద్యుమ్నుడనే పేరుగల పుత్రుడు జన్మించి, వేదవేదాంగ పారగుడయ్యాడు. తరువాత చాలాకాలానికి ఆ రాజసత్తముడు సుప్రతీకుడు చేరువనున్న యోగ్యుడైన దుర్జయకుమారుని చూచాడు. తన ముసలితనం చూచాడు. బలశాలి అయిన

ఆ వారాణసీపాలకుడు దుర్జయునికి రాజ్యం ఇవ్వటం గురించి ఆలోచించాడు భామినీ. ఇలా బాగా ఆలోచించి ఆ ధర్మాత్ముడైన నరపాలుడు అతనికి రాజ్యం ఇచ్చాడు. తాను చిత్రకూటపర్వతానికి వెళ్ళిపోయాడు. దుర్జయుడు సమర్థుడు కనుక, తన మహారాజ్యంలో కరితురగరథాలు సమకూర్చుకొని రాజ్యవృద్ధి గురించి, ఆలోచించాడు. అలా ఆలోచించి ఆ మేధావి కరితురగ రథపదాతులతో సైన్యాన్ని తీసుకొని ఉత్తరదిక్కుకు వెళ్లాడు. ఆ మహాత్మునికి ఉత్తరదేశాలన్నీ లభించాయి. ఏమాత్రమూ జయింప శక్యంకాని ఆ రాజు, భారతవర్షాన్ని సాధించాడు. అనంతరం కింపురుషవర్షాన్ని కూడా సాధించాడు. దానిపై నుండే హరివర్షాన్ని జయించాడతడు. రమ్యంకం, హిరణ్మయం, కురువర్షం, భద్రాశ్వవర్షం, నడుమమేరువుకల ఇలావృత వర్షం, ఇవన్నీ జయించాడతడు.

ఆ నృపుడు ఈ జంబూద్వీపం జయించి, దేవేంద్రుని జయించటానికి వెళ్లాడు. సమస్త దేవతలతో కూడిన మేరుపర్వతం ఎక్కి, దేవగంధర్వదానవులనూ, గుహ్యకులనూ, కిన్నరులనూ, దైత్యులనూ జయించాడు. అనంతరం బ్రహ్మకుమారుడైన ముని నారదుడు దుర్జయుని జయం గురించి దేవేంద్రునికి చెప్పాడు. వెంటనే ఇంద్రుడు లోకపాలురతో కలిసి దుర్జయుని త్వరగా సంహరించటానికి వెళ్లాడు. కాని అతడు కొంచెం సేపటిలోనే దుర్జయుని అస్త్రాలకు ఓడి, మేరు పర్వతాన్ని విడిచిపెట్టి ఈ మర్త్యలోకానికి వచ్చాడు. తూర్పుదిక్కున దేవతల రాజైన దేవేంద్రుడు లోకపాలురతో పాటు ఉండిపోయాడు. దుర్జయుని గొప్ప చరిత్ర ఇంకా చాలా ఉంది. దుర్జయుడు సురలను జయించి తిరిగివస్తూ, గంధమాదనపర్వతంపై సర్వసంభారాలతో విడిది చేసి ఉన్నాడు. అతనివద్దకు ఇద్దరు తపస్వులు వచ్చి ''రాజా, దుర్జయా, నీవు లోకపాలకులనందరినీ, వారిపాలననుంచి నివారించావు. లోకపాలకులు లేనిదే జగత్తు నడవదు. కనుక వారి సర్వోత్కృష్టమైన స్థానం మాకిద్దరికీ ఇయ్యి'' అన్నారు. వారిలా అనేసరికి ధర్మవేత్త అయిన దుర్జయుడు ''మీరిద్దరూ ఎవరు?'' అన్నాడు. ఆపైని ఆ శత్రువిజేతలిద్దరూ ''గౌరవదాయకా, మాపేర్లు విద్యుత్తు, సువిద్యుత్తు, మేము అసురులము. నీవు మమ్మల్ని చక్కగా తీర్చి దిద్దితే, ఇప్పుడు సజ్జనులపట్ల ధర్మము తప్పకుండా పని చెయ్యాలని కోరుతున్నాము. సుదుర్జయా, లోకపాలుర పనంతా మేము చేస్తాము'' అన్నారు. ఇలా పలికేసరికి దుర్జయుడు వారిని ఇద్దర్నీ స్వర్గంలో నిలిపి, లోకపాలురను చేశాడు. ఆపైని

వారిద్దరూ తక్షణమే అంతర్ధానమయ్యారు. ధరాధరా, వారిద్దరి గొప్పచరిత్రా ముస్ముందు చెబుతాను.

మహారాజు దుర్జయుడు మందరపర్వతంపై కుబేరుని దివ్యవనం చూచాడు. అది నందనవనంలా ఉన్నది. ఆ రాజసత్తముడు ఆ రమణీయవనంలో సంతోషంతో తిరుగుతుండేసరికి ఒక సువర్ణ వృక్షం క్రింద ఇద్దరు కన్యలు కనిపించారు. వారు అతి సౌందర్యంతో చూడటానికి అద్భుతంగా ఉన్నారు. వారిని చూచి, అతడు ఆశ్చర్యంలో మునుగుతూ, ఈ శుభలోచనలు ఇద్దరూ ఎవరా అని ఆలోచిస్తూ ఒక క్షణం ఉన్నాడు. అంతలో అతనికి ఇద్దరు తపస్వులు ఆ వనంలో కనిపించారు. రాజు వారిని ఇద్దరినీ చూచి, వెంటనే పరమప్రీతీ, సంతోషమూ పొందాడు. గబగబా ఏనుగునుంచి దిగి, వారికి ఇద్దరికీ స్వయంగా నమస్కారం చేశాడు. వారు ఇచ్చిన ఉత్తమదర్భాసనంపై కూర్చున్నాడు. వారు ఇద్దరూ ''నీవు ఎవరవు?'' ఎక్కడ నుంచి వచ్చావు? ఎవరి వాడవు? ఇక్కడెందుకు ఉన్నావు?'' అని అడిగారు.రాజు పకపకా నవ్వి వారిద్దరితో ''సుప్రతీకుడని పేరుకెక్కిన రాజు ఉన్నాడు. అతని కుమారుడనై జన్మించాను. నా పేరు దుర్జయుడు. సజ్జనోత్తములారా, పృథ్వి మీది సర్వరాజులనూ జయిస్తూ ఇక్కడికి వచ్చాను. తపోధనులారా, తప్పక నన్ను జ్ఞాపకం ఉంచుకోవాలి. పూజ్యులు మీరిద్దరూ ఎవరు? దయచేసి, నన్ను అనుగ్రహించి, చెప్పండి'' అన్నాడు. తాపసులు ఇద్దరూ ''మేము స్వాయంభువమనువుకుమారులము. హేతృడు, ప్రహేతృడు అని మాపేర్లు. మేమిద్దరమూ దేవతలను నశింపజేయాలని మేరుపర్వతానికి వెళ్ళాము. అక్కడ రథగజతురగములతో కూడిన మాఇద్దరి మహాసైన్యమూ వందలూ, వేలుగా ఉన్న సర్వదేవతల సైన్యాలనూ జయించింది. ఆ దేవతలు మా మహాసైన్యాన్నీ, అసురులచేత పడగొట్టబడి ప్రాణాలు విడిచిన తమ సైన్యాన్నీ, చూచినతరువాత శ్రీహరిని శరణు వేడారు. పాలకడలిలో దేవేశుడు శ్రీహరి ప్రభువు స్వయంగా శయనిస్తాడుకదా, అక్కడ అందరూ ప్రణామపూర్వకంగా ''దేవదేవా, హరీ, అసురసత్తములు సర్వసైన్యాన్నీ ఓడించారు. భయపడిపోయి బెదరుచూపులతో ఉన్న మమ్మల్ని రక్షించు. నీవు పూర్వం దేవాసురయుద్ధంలో సహస్రబాహువూ, క్రూరుడూ ఐన కాలనేమితో సమరంలో మమ్మల్ని కాపాడావు కేశవా. దేవేశా, ఇప్పుడు కూడా దేవకంటకులైన హేతృప్రహేతృ నామధేయులైన, బహుసైన్యపరివృతులైన ఈ

అసురులిద్దరినీ సంహరించి మమ్మల్నందరినీ రక్షించు దేవదేవా, జగత్పతీ” అని విన్నవించారు.

ఇలా చెప్పినతరువాత నారాయణుడు, విష్ణుప్రభువు, జగత్పతి ‘నేను వారినిద్దరినీ సంహరించటానికి వెడుతున్నాను’ అన్నాడు. విష్ణువు ఇలా చెప్పిన తరువాత, దేవతలు మనసారా జనార్ధనుని ధ్యానిస్తూ, మేరుపర్వతం వద్దకు బయలు దేరారు. వారు ధ్యానించారో లేదో చక్రగదాధరదేవుడు, మహాబలశాలి ఒక్కడే మాఇద్దరి సైన్యంలోకి ప్రవేశించి, తన మహిమతో తాను ఒకడుగా, పదిమందిగా, వందమందిగా, వేలమందిగా, లక్షల మందిగా, కోట్లుగా అయ్యాడు. రాజా! ఆ జగత్పతి, దేవోత్తముడు, మహాబలుడు, మా సేనలో ఉన్న అసురధీరులంతా సంహరింపబడి ప్రాణాలు విడిచి, నేలబడి కనబడేటట్టు చేశాడు. ఇలా మా సైన్యమంతా ఆ విశ్వమూర్తి తన మాయతో సంహరించగా, గుఱ్ఱములు, కాల్బలము, ఏనుగులు మొదలైన చతురంగ బలాలతో కూడిన మా సేన రూపుమాసిపోయింది. చక్రధారి ఆ దేవుడు, చివరికి మేమిద్దరమూ మిగలటం చూచి, ఆ ప్రభువు అంతర్ధానమయ్యాడు. మేమిద్దరమూ, ఆ శార్ఙ్గి దేవుని ఈ ఘనకార్యం చూచి, తరువాత అతనినే ఆరాధించటం కోసం శరణుపొందాము.”

“నీవు మామిత్రుడైన సుప్రతీక నరపతి కుమారుడవు. వీరిద్దరూ మాఇద్దరి కుమార్తెలు. మనుజేశ్వరా, స్వీకరించు. హేతృకన్య సుకేశి. ప్రహేతృపుత్రి మిశ్రకేశి” అని చెప్పారు. హేతృడు ఈ విధముగా చెప్పేసరికి దుర్జయమనుజేశ్వరుడు ఆ ఉభయశుభ కన్యలనూ ధర్మపద్ధతిని భార్యలుగా పరిగ్రహించాడు. ఆ రాజు వారిని ఇద్దరినీ తీసికొని పరమసంతోషంతో నిజసైన్యపరివృతుడై తనరాజ్యానికి వచ్చాడు. తరువాత చాలాకాలానికి అతనికిద్దరు కూమారులు కలిగారు. సుకేశిపుత్రుడు ప్రభవుడు. మిత్రకేశిపుత్రుడు సుదర్శనుడు. ఆ రాజు శ్రీమద్దుర్జయుడు, శుభక్షణాలుగల ఇద్దరు కుమారులు కలిగిన తరువాత, కొన్నాళ్ళకి చేరువలో ఉన్న అరణ్యానికి వెళ్ళాడు. అందులో భయంకరాలైన అడవిజంతువులను బంధిస్తూ, ఆఅరణ్యంలో ఉన్న నిష్కల్మషుడైన ఒక మునిని దర్శించాడు. ఆ మహాభాగుడు తపస్సు చేస్తున్నాడు. శుభప్రదుడు. ఆయన పేరు గౌరముఖుడు. ఆయన ఋషిబృందానికి రక్షకుడు. పాపుల పాపాలను తొలగించి, స్వయంగా కాపాడేవాడు. ఆశ్రమంలో స్వచ్ఛమైన జలం కలిగి, గాలివీస్తున్న సువాసనగల ఉత్తమ వృక్షాలు కలిగి,

ఆకాశంనుంచి భూమికి వచ్చిన మేఘంలాగా, ఉత్తమవిమానంలా ఆ ద్విజునిగృహం ప్రకాశిస్తున్నది. ఆ ఉత్తమ ఆశ్రమంలో ఉన్న అతని నివాసంలో మండుతున్న అగ్నివల్ల ఆకాశం ధగధగలాడుతున్నది. పరిశుద్ధముగా, సువాసనగలిగి చక్కగా అలంకరింపబడి ఉన్నది. శిష్యులు సామనాదం ఉచ్చరిస్తున్నారు. మంచి అందమైన మగువలూ, మునికన్యలూ అక్కడ ఉన్నారు. అన్ని వృక్షాలూ బాగా విచ్చిన పువ్వులతో ఉన్నవి. (10)

11 వ అధ్యాయం - గౌరముఖముని ఆతిథ్యవైభవం

శ్రీవరాహస్వామి ఇలా చెప్పారు. అనంతరం అట్టి గౌరముఖుని ఆశ్రమం చూచి దుర్జయుడు ''అందాల ఆశ్రమ మండలంలో ప్రవేశిస్తాను. అందులో పరమధార్మికులైన ఋషులను దర్శిస్తాను'' అని ఆలోచించాడు. అలా ఆలోచించి రాజు ఆ ఆశ్రమంలో ప్రవేశించాడు. అలా ప్రవేశించిన రాజుకపుడు ధర్మాత్ముడైన గౌరముఖముని పరమహర్షంతో పూజచేశాడు. ఆ ద్విజమహాముని స్వాగతాదిక్రియలు చేసి, మాటలచివర అతనితో ''నృపశ్రేష్ఠా, అనుచరులతో సహా (నీకు) నాశక్తిని బట్టి భోజనం పెడతాను. గుర్రాలను చక్కగా విడిచిపెట్టు'' అన్నాడు. ఇలా పలికి ఉత్తమవ్రతి ఆ ముని మౌనంగా ఉన్నాడు. రాజుకూడా ఆయనమీది భక్తితో తన సహాయకులతో పాటు ఉన్నాడు. అప్పుడతని సైన్యం ఐదు అక్షౌహిణులు మాత్రం ఉన్నది. 'ఇతడు తాపసుడు. నాకిక్కడ ఏమి భోజనం పెట్టగలడు ?'' (అనుకొన్నాడు) విప్రుడు గౌరముఖుడు దుర్జయనరపతిని ఆహ్వానించి ''ఇతనికి నేనేమి భోజనం పెట్టను?'' అని ఆలోచించాడు. ఇలా ఆలోచిస్తున్న భావితాత్ముడైన ఆ మహర్షి మనస్సులో దేవేశుడు హరి, నారాయణ ప్రభువు నిలిచాడు. అనంతరం మునిసత్తముడు గంగలో దిగి నారాయణదేవుని మనసా స్మరించి స్తుతించాడు. (అని చెప్పగా విని) ధరణి ''భూధరుడా, గౌరముఖుడు విష్ణువును ఎలా స్తుతించాడు? ఇది నాకు కుతూహలముగా ఉన్నది. బాగా వినాలనిపిస్తున్నది'' అన్నది.

గౌరముఖ కృత జనార్ధన స్తోత్రం

నమోస్తు విష్ణవే నిత్యం నమస్తే పీతవాససే | నమస్తే చాద్యరూపాయ నమస్తే జలరూపిణే ||

నమస్తే సర్వసంస్థాయ నమస్తే జలశాయినే | నమస్తే క్షితిరూపాయ నమస్తే తేజసాత్మనే ||

నమస్తే వాయురూపాయ నమస్తే వ్యోమరూపిణే | త్వం దేవః సర్వభూతానాం ప్రభుస్త్వమసి హృచ్ఛయః ||

త్వమోంకారో వషట్ కారః సర్వత్రైవ చ సంస్థితః । త్వమాదిః సర్వదేవానాం తవ చాదిర్న విద్యతే ॥

త్వం భూ స్త్వం చ భువో దేవ త్వం జనస్త్వం మహాః స్మృతః । త్వం తపస్త్వం చ సత్యం చ త్వయి దేవ చరాచరమ్ ॥

త్వత్తో భూతమిదం విశ్వం త్వదుద్భూతా ఋగాదయః । త్వత్తోః శాస్త్రాణి జాతాని త్వత్తో యజ్ఞాః ప్రతిష్ఠితా ॥

త్వత్తో వృక్షా వీరుధశ్చ త్వత్తుః పర్వావనౌషధీః । పశవః పక్షిణః సర్పాస్త్వత్త ఏవ జనార్దనః ॥

మమాపి దేవదేవేశ రాజా దుర్జయ సంజ్ఞితః । ఆగతోభ్యాగతస్తస్య ఆతిథ్యం కర్తుముత్సహే ॥

తన్య మే నిర్ధనస్యాద్య దేవదేవ జగత్పతే । భక్తినమ్రస్య దేవేశ కురుష్వాన్నాద్య సంచయమ్ ॥

యం యం స్పృశామి హస్తేవ యం యం పశ్యామి చక్షుషా । వృక్షం వా తృణకన్దం వా తత్తదన్నం చతుర్విధమ్ ॥

తథా త్వన్యతమం వాపి యద్ ధ్యాతం మనసా మయా । తత్ సర్వం సిద్ధ్యతాం మహ్యం కమస్తే పరమేశ్వర ॥ (11.7 -21)

భావం: "విష్ణువుకు నిత్యమూ వినతి. పీతాంబరునికి, నీకు వెన్నెల. ఆద్యరూపునికి నీకు అభివందనం. జలరూపికి, నీకు జోత. సర్వత్ర ఉన్న వానికి, నీకు సాగిలపాటు. జలశాయికి నీకు జేజే. క్షితిరూపునికి నీకు కేల్ మోడ్పు. తైజసాత్మునికి నీకు దండం. వాయురూపునికి నీకు ప్రణతి. వ్యోమరూపికి నీకు కైమోడ్పు. నీవు సర్వప్రాణుల హృదయాలలోనూ శయనించి ఉండే ప్రభుడవు, దేవుడవు. నీవు ఓంకారానివి. వషట్కారానివి. సర్వత్ర ఉన్నవాడవు. నీవు సర్వ దేవతలకు ఆదివి. నీకు ఆది లేదు. నీవు భూలోకానివి. నీవు భువర్లోకానివి. నీవు స్వర్లో కానివి. నీవు జనోలోకానివి. నీవు మహర్లోకానివి. నీవు తపోలోకానివి. నీవు సత్యలోకానివి. దేవా, నీలో చరాచరం ఉన్నది. నీవల్ల ఈ విశ్వం సర్వమూ సంభవించింది. నీవల్ల ఋగాది (వేదాలు) వెలువడ్డాయి. నీవల్ల శాస్త్రాలు జన్మించాయి. నీవల్ల యజ్ఞాలు ప్రతిష్ఠింపబడ్డాయి. నీనుంచి వృక్షాలూ, లతలూ, సంభవించాయి. నీనుంచి సర్వవనౌషధులూ జన్మించాయి. జనార్దనా, పశువులూ, పక్షులూ,

సర్పాలూ, నీ నుంచే ప్రభవించాయి. దేవదేవేశా, దుర్జయుడనే రాజు నాకు అభ్యాగతుడుగా వచ్చాడు. అతనికి అతిథిసత్కారం చేయాలనుకొంటున్నాను. దేవ దేవా, జగత్పతీ, దేవేశా, అట్టి నిర్ధనుడను, భక్తి నమ్రుడను నేను. నాకు అన్నాదిసంభారాలు కలిగించు. నేను ఏది ఏది చేతితో స్పృశిస్తానో, ఏది కంటితో చూస్తానో అది, కట్టెయినా, గడ్డయినా, దుంప అయినా, చతుర్విధాహారం కావాలి.అలాగే, నేనుమనస్సులో మరేది స్మరించినా, అదినాకు సిద్ధించాలి. పరమేశ్వరా, నీకు నమస్కారం.”అన్నస్తుతితో జగత్పతి దేవేశుడు సంతోషించాడు.

గౌరముఖమునికి హరిసాక్షాత్కారం: కేశవుడు ఆమునికి తన రూపం చూపించాడు. ‘‘విప్రుడా, ఉత్తమవరం కోరుకో’’ అంటూ సుప్రసన్నస్వరూపుడై పలికాడు. ఇలా విని, ముని రెండుకన్నులూ విప్పేసరికి శంఖగదాపాణి, పీతాంబరుడు, జనార్దనుడు, గరుడునిపై ఉన్నవాడు, ద్వాదశాదిత్య తేజస్వి, దివ్యసుప్రభుడు (కనిపించాడు) ఆకాశంలో వెయ్యిమంది సూర్యులు ఒక్కసారి పైకి వస్తే ఆ కాంతి ఆ మహాత్ముని కాంతికి సమాన మౌతుంది. అనేక విధాలుగా విభక్తమైన సమస్త జగత్తూ ఆ ఒక్కనిలో ఉన్నది. ఆ ముని విస్మయోత్ఫుల్ల లోచనుడై వీక్షించాడు దేవీ. దేవునికి శిరసా నమస్కరించి, దోసిలిపట్టి అన్నాడు: ‘‘దేవరా, కేశవుడు, భక్తుడనైననాకు వరదాయకుడైతే, ఇపుడు ఈ నృపతి సైన్యాలతో, వాహనాలతో నా ఆశ్రమంలో ఆహారం స్వీకరించి రేపు తన ఇంటికి వెళ్ళాలి.

గౌరముఖునికి చిత్తసిద్ధిమణిలబ్ధులు: అని పలికేసరికి దేవేశుడు అతనివాడై, చిత్తసిద్ధిని, బహు మహాకాంతిమంతమైన మణినీ ఇచ్చాడు. అదిచ్చి, ఆదిదేవుడు అంతర్ధాన మయ్యాడు. ఆ ముని గౌరముఖుడు సకలఋషినిషేవితమైన పవిత్రమైన ఆశ్రమానికి వెళ్ళాడు.

చిత్తసిద్దితో కల్పించిన భవనాదులు : అక్కడికి వెళ్ళి, ఆ విప్రేంద్రముని హిమగిరిశిఖరంలా, మేఘంలా ఎత్తైన, వెన్నెలలా ఉన్న, నూరు అంతస్తుల మేడ తలచుకొన్నాడు. విష్ణువువల్ల వరాలు పొందిన ఆ విప్రుడు అటువంటి గృహాలు వేలకొలదీ, లక్షకొలదీ, కోట్లకొలదీ, నిర్మించాడు. వాటికి చేరువగా ప్రాకారాలు ఉన్నాయి. వాటికి ఆనుకొని ఉద్యానాలు ఉన్నాయి. వాటిలో కోకిలలూ, రకరకాల పక్షులూ, కూస్తున్నాయి. సంపెంగ, అశోకం, పున్నాగం, నాగకేసరం, మొదలైన నానాజాతుల వృక్షాలూ, గృహోద్యానాలంతటా, ఉన్నాయి. ఏనుగులకూ, గుర్రాలకూ, వాటివాటిశాలలు ఉన్నాయి.

విప్రుడు అన్నిచోట్లా, నానాభక్ష్యసంభారాలూ, ఏర్పరిచాడు. అన్నిచోట్లా, భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య, బహువిధాన్నాలూ, పైడిపాత్రలూ, నిర్మించాడు.ఇలా చేసి, ఆ విప్రుడు భూరితేజస్వి అయిన రాజుకు "సర్వ సైన్యాలూ ఇండ్లలో ప్రవేశించుగాక" అని చెప్పాడు. ఇలా చెప్పిన తరువాత రాజు ఆ పర్వతం వంటి మేడలో ప్రవేశించాడు. ఇతర భృత్యులూ, వేగంగా ఇతరమైనవాటిలో ప్రవేశించారు.

మణిమహిమతో చేసిన ఆతిథ్య వైభవం: వారు ప్రవేశించిన తరువాత గౌరముఖముని ఆ దివ్యమణి పట్టుకొని రాజుతో ''స్నానానికి, భోజనానికి మార్గాయాసం తొలగించటానికి విలాసినులనూ, దాసులనూ నీకు పంపిస్తాను నరపాలా'' అన్నాడు. ఆ విప్రేంద్రుడు ఇలా పలికి, ఆ విష్ణువిచ్చిన మణిని ఆ రాజు చూస్తుండగా ఏకాంతంలో ఉంచాడు. శుద్ధసమానమైన కాంతిగల ఆ మణినక్కడ ఉంచగానే దాని లోనుంచి దివ్యరూపిణులైన వేలకొది వెలదులు వెలువడ్డారు. వారి అంగరాగాదులు సుకుమారంగా ఉన్నాయి. ఆ ఉత్తమాంగలను సుకుమారులు, వారి కపోలాలు మెరుస్తూ ఉన్నాయి. వారి శరీరాలు చాలా అందంగా ఉన్నాయి. వారి జుట్టూ చక్కగా ఉంది. వారి కన్నులూ సొగసుగా ఉన్నాయి. కొందరు కాంతలు పసిడి పాత్రలు పట్టుకొని బయలుదేరారు. ఇలా ఇంతులు (వెలువడితే), అందులోనుంచి నరపాలునికి పనిచేసే సర్వపురుషులూ బయటికి వచ్చారు. అన్నిచోట్లా ముందు వస్త్రాలూ, కేవలం భోజనమూ,రాజుకులాగే సర్వభృత్యులకూ స్నానమూ,ఆ అతివలు(ఏర్పరిచారు.) అన్నిచోట్లా నానావిధతూర్యాలూ మ్రోగుతున్నాయి.

ఆ రాజు స్నానం చేస్తుంటే కొందరు కాంతలు నృత్యం చేశారు. మరికొందరు మగువలు స్నానంచేస్తున్న దేవేంద్రునికిలా అక్కడ గానంచేశారు. మహామనస్వి, రాజు ఇలా దివ్యోపచారంతో స్నానం చేశాడు. ఆ రాజేంద్రుడు మనస్సును ఆశ్చర్యం ఆవేశించగా ''ఏమిటిది? ముని సామర్థ్యంవల్లనా, తపస్సువల్లనా, మణివల్లనా?'' అని ఆలోచించాడు. ఆ నరపాలుడు ఇలా స్నానం చేసి ఉత్తమవస్త్రాలు ధరించాడు. ఆ ఉత్తమనరపతి యథావిధిగా రకరకాల ఆహారాలు భుజించాడు. ఆమహర్షి, మునిసత్తముడు, నృపతికి పూజచేసినట్లే, అతని భృత్యులకు కూడా చేశాడు. ఆ రాజూ, భృత్యులూ, సైన్యమూ, వాహనాలూ, ఆహారం స్వీకరించేసరికి అరుణకాంతితో భానుడు అస్తగిరికి వెళ్ళాడు. తరువాత రాత్రి వచ్చింది. అది శరత్కాలం. కళకళలాడే చంద్రబింబమూ, చుక్కలూ ఆ రాత్రికి అందాన్నిస్తున్నాయి. ఆ

రోహిణీవల్లభుడు అనురాగం కలిగిస్తున్నాడు. సౌమ్యగుణాలు కలవారిలో ఉన్న తాపం కలిగించే లక్షణం కూడా చక్కగా అమరినట్టుగానే ఉంటుంది. సురాధిపతి, దైత్యగురువు, భృగూద్వహుడు (శుక్రుడు) కర్రి రంగుకిరాణాలవాని (శని) తో సహా ఉదయించాడు. కాని నడుమ శత్రుపక్షంలో చేరినందున ప్రకాశించటం లేదు. ప్రాణులకు స్వభావయోగాన్ని బట్టి బుద్ధి ప్రవర్తిస్తుంది. చంద్రుని తెల్లనికిరణాల వల్ల భూమికుమారుడు (అంగారకుడు) కూడా సురక్తత్వం (మిక్కిలి అనురాగం కలిగిఉండటమూ, బాగా ఎర్రగాఉంటమూ) విడిచి పెడుతున్నాడు, (ఎర్రనివాడైన) రాహువూ తెల్లబడిపోయాడు. (వరప్రభావంవల్ల) సురలూ, అసురులూ కూడా లోకస్వభావాన్ని విడిచిపెట్టారు. స్వభావాన్ని అనుసరించేవాడూ, మంచిపనులు చేసేనరపాలుడూ బలవంతులు. స్వచ్ఛమైన ప్రభువు (నిష్కళంకుడైన పరిపాలకుడూ, చంద్రుడూ) వెలయించిన రశ్మిమండలం (పన్నులవ్యవస్థా, కిరణాల వలయమూ సూర్యకాంతిలా నిర్మలంగా ఉండగా, ఆ ఉన్నతమైన దానిపై (అధికునిపై) కేతువు (=కేతుగ్రహమూ, దుష్టుడూ) తమస్సును (=చీకటినీ, కళంకాన్నీ) వ్యాపింప జేయలేకపోయాడు. అలాంటపుడు కుచ్చితపు నడవడిగల వారినడవడికూడా నిర్మలమవుతుంది. చంద్రుని పుత్రుడు, ఉన్నతమేధావి, బుధుడు, స్వేచ్ఛతో, తన కక్ష్యలో కనకర్మలతో చాలాసేపు లోకాలను వెలయింపజేస్తూ ప్రకాశించాడు. చంకనెత్తుకొని మోసిసభృత్యుల అభిప్రాయాలను మన్నిస్తూ, పండితుల బోధనల వల్ల ఉన్నతబుద్ధి కలిగి, తనపనులతో లోకాన్ని వెలయింపజేస్తూ రాణిస్తున్న పరిపాలకుని కుమారునిలా ఉన్నాడు. సజ్జనుల పట్ల ఈ పోలిక నిశ్చయంగా శాశ్వతంగా ఉంటుంది. చంద్రునియొక్కా దేవతలయొక్కా మార్గంలో ఉన్న ఆకాశాన్ని కేతువు చాలాసేపు మిక్కిలి కపిలవర్ణం కలిగిఉండేటట్లు చేశాడు. దుర్జనుడు సజ్జనసభలో ఎక్కడా తనపనినేర్పు శుద్ధంగా ప్రకటించడు. చంద్రకాంతివల్ల ధగధగలాడుతున్న దిక్కులు అడుగడుగుకూ మిక్కిలి కాంతిపొందాయి. ఉన్నత కులసంజాతులు ధర్మవర్తనం కలిగి ఉంటారు. గొప్పవారి కలయికవల్ల గొప్పఉన్నతి గొప్పవారికి లభిస్తుంది. చంద్రుడు, వరుణపుత్రునీ త్రిదోషప్రవర్ధకునీ సూర్యకిరణాలనూ శనినీ అధఃకరించాడు. కౌశికసన్నివిష్టమైన వేదకర్మ విరాజిల్లుతుంది. ఎక్కడా అన్యథా కాదు. పూర్వం ధ్రువుడు పసివాడుగా ఉండి హరిని ఆరాధించాడు. విష్ణు స్మరణంవల్ల దుర్లభమైన రాజాసనమూ పొందాడు. అతడు లక్ష్మితో

బుద్ధితో చాలాకాలం ప్రకాశిస్తున్నాడు. కళ్యాణీ(ధరణీ), ఇలా ఆ రాత్రి ఋషి యొక్క ఉత్తమాశ్రమంలో దుర్జయ భూపతికి భృత్యులతో, సామంతులతో, మేలైన ఏనుగులతో గుర్రాలతో సహ చక్కని భోజనమూ, వస్త్రాలూ, ఆభరణాలూ, మొదలైన వాటి సమర్పణతో, పూజతో శోభిల్లింది. ఇట్టి రాత్రి ఆ ఇళ్ళలో ఉత్తమ రత్న చిత్రితాలై మంచి పట్టుదుప్పట్లు పరచిన మేలిశయ్యలు అందకత్తెల పనితనంతో ప్రకాశిస్తూ ఉన్నాయి. అక్కడ ఆ రాజు భూపతులనూ, భృత్యులనూ ఆ ఇళ్ళలోనికి పంపించాడు. వారు వెళ్ళిన తరువాత ఆ ప్రతాపశాలి స్వర్గంలో ఉన్న ఇంద్రునిలా ఉత్తమ కాంతాపరివృతుడై నిద్రించాడు. ఇలా ఆ మనస్వికీ, భృత్యులకూ మహాత్ముడైన ఆ ఋషి ప్రభావంవల్ల హర్షంతో నిద్ర లభించింది. అనంతరం రాత్రి గడిచేసరికి ఆకాంతలూ ఆ గృహాలూ అంతర్ధానమయ్యాయి. గొప్పవారు ఉపయోగించే ఉత్తమాసనాలూ, జలాలూ అదృశ్యమయ్యాయి. అది చూచి ఆ రాజు ఆశ్చర్యావిష్టుడై దుఃఖంతో ''ఈమణి నాకెలా వస్తుందా'' అని మాటిమాటికి ఆలోచించాడు. ఆ రాజు దుర్జయుడు ఆలోచిస్తూ చేరి, ''ఇతని ఈ చింతామణిని అపహరిస్తాను'' అని ఆలోచించాడు. ఆ రాజు ఆశ్రమం బైటికి ప్రయాణానికి ప్రేరేపించాడు.

మణికోసం మంత్రిరాయబారం: ఆశ్రమానికి వెలుపల వాహనాలతో కొంచెం దూరం వెళ్ళిన తరువాత, గౌరముఖుని మణి అడిగే పనికి విరోచనుడనే మంత్రిని పంపించాడు. (అతడు) ఆ ఋషి వద్దకు వెళ్ళి, మణి అడగడానికి సిద్ధపడ్డాడు: ''రాజు రత్నాలకు (శ్రేష్ఠవస్తువులకు) పాత్రుడు. మణిని అతనికి ఇయ్యి'' అన్నాడు. అమాత్యుడు ఇలా పలికేసరికి గౌరముఖుడు క్రుద్ధుడై ఇలా అన్నాడు ''విప్రుడు పుచ్చుకొంటాడు. రాజు ఇస్తాడు. నీవు రాజువి. మళ్ళీ దీనుడవులా ఎలా అడుగుతున్నావు?" అని దురాచారుడైన రాజు దుర్జయునితో స్వయంగా చెప్పు. వెళ్ళు వేగంగా. "దురాచారుడా, నిన్ను లోకం విడువకుండుగాక'' (అని చెప్పి, మనస్సులో మణిగురించీ, శత్రునాశనం గురించీ, ఆలోచిస్తూ ముని దర్భలూ సమిధలూ తెచ్చుకోవటం కోసం వెళ్లాడు.) అలా చెప్పగానే దూత రాజువద్దకు వెళ్లాడు. బ్రాహ్మణుడు చెప్పినదంతా చెప్పాడు.

మణిని తెమ్మని నీలునికి అజ్ఞ : బ్రాహ్మణుడు అన్నది విని దుర్జయుడు క్రోధావిష్టుడై నీలుడనే సామంతునితో ''వెళ్ళు, ఆలస్యం చేయకు. బ్రాహ్మణునిమణి తీసికొని వేగంగా యథేచ్ఛగా రా'' అన్నాడు. ఇలా అనేసరికి నీలుడు బహుసైన్యసహితుడై ఆ విప్రుని

అరణ్యాశ్రమమండంలోకి వెళ్ళాడు. అక్కడ అగ్నిహోత్రశాలలో ఉంచిన ఆ మణిని చూచి ఆ నీలుడు రథం నుంచి నేలమీదికి దిగాడు. పరమభయంకరుడైన ఆ నీలుడు క్రూరబుద్ధితో దిగేసరికి ఆ మణినుంచి ఆయుధపాణులు వెలువడ్డారు. ఆ యోధులు పరమదుర్జయులు. రథాలతో, ధ్వజాలతో, అశ్వాలతో, కవచాలతో, ఖడ్గాలతో, డాలులతో, ధనుస్సులతో, తూణీరాలతో సహా ఆ మణిని ఛేదించుకొని వెలువడ్డారు. ఆ మహాబలులు అసంఖ్యాకంగా ఉన్నారు. వారిలో సన్నద్ధులైన మహాశూరులు పదిహేనుగురు ఉన్నారు. మహాభాగులారా, వారిపేర్లు చెపుతాను విను: సుప్రభుడు, దీప్తతేజుడు, సురశ్మి, శుభదర్శనుడు, సుకాంతి, సుందరుడు, సుందుడు, ప్రద్యుమ్నుడు, సుమనసుడు, శుభుడు, సుశీలుడు, సుఖదుడు, శంభుడు, సుదాంతుడు, సోముడు, ఈపదిహేనుగురూ మణినుంచి వెలువడిన నాయకులు.

అనంతరం బహుసైన్యభూషితుడైన విరోచనుని చూచి నిర్విచారులై వివిధాయుధహస్తులై పోరాడారు. కనక కాంతిగల వారిధనుస్సులు కనకపుంఖాలుగల బాణాలను విడుస్తున్నాయి. అతిభయంకరములైన ఖడ్గాలూ, పరమప్రధానాలైన భుశుండి శూలాలూ పడుతున్నాయి. రథం రథాన్నీ, ఏనుగు ఏనుగునూ, గుర్రం గుర్రాన్నీ, అత్యుగ్ర పరాక్రముడైన పదాతి శ్రేష్ఠుడైన పదాతినీ ఢీకొన్నారు. ఎందరో ద్వంద్వయుద్ధం చేస్తున్నారు. అలాగే, యుద్ధంలో శూరులు బెదిరిస్తూ పరిగెడుతున్నారు. పోరు భయంకరంగా, సజ్జన మార్గం నుంచి వైదొలగి అతిభయంకరంగా రక్తం చిందిస్తున్నది. దొమ్మికయ్యం అలా జరిగేసరికి ఆ రాజుసచివుడు స్పృహలేకుండా యుద్దంలో హతుడయ్యాడు. అతడు అనుచరులతో సకల సైన్యంతో సహా వైవస్వతుని (యముని) ఇంటికి వెళ్లాడు. దుర్జయుని ఆ మంత్రి హతుడయ్యేసరికి ఆ రాజు తనసైన్యంతో వచ్చాడు. ఆ దుర్జయుడు గుర్రాలు పూన్చినరథంతో, అతితీవ్ర ప్రతాపంతో, ఆ మణిసంజాతులతో పోరాడాడు. అనంతరం అక్కడ రాజుకు మహాయుద్ధం జరిగింది. అపుడు హేతృప్రహేతృలిద్దరూ అల్లుడు యుద్ధంలో ఉన్నాడని విని, పోరాడుతున్న ఆ మహాబాహుని వద్దకు మహాసైన్యాన్ని తీసుకొని వచ్చారు. ధరా! ఆ సైన్యంలో ఏ దైతేయులున్నారో, వారిని గురించి విను, చెపుతాను. ప్రఘసుడు, విఘసుడు, సంఘసుడు, ఆశనిస ప్రభుడు, విద్యుత్ప్రభుడు, సుఘోషుడు, భయంకరుడైన ఉన్మత్తాక్షుడు, అగ్నిదంతుడు, అగ్నితేజుడు, బాహుశక్రుడు, ప్రతర్దనుడు, విరాధుడు, భీమకర్ముడు, విప్రచిత్తి – ఈ పదిహేనుగురూ పరమాయుధులైన, శ్రేష్ఠులైన

అసురులు. వీరికి ఒక్కొక్కరికీ విడివిడిగా ఒక్కొక్కొ అక్షౌహిణి పరివారం ఉన్నది. మహాత్ముడైన దుర్జయుని మహామాయావులు, మణిసంభవులతో మహాసైన్య రక్షితులై పోరాడారు. (సుప్రభుడు, ఐదుబాణాలతో ప్రఘసుని కొట్టాడు. అవి పాముల్లా ఉన్నాయి. ప్రజ్వలిస్తున్న భాస్కరులలా ఉన్నాయి. తప్తతేజుడు మూడు బాణాలతో విఘసుని నొప్పించాడు. శుభదర్శనుడు రణంలో ఐదింటితో అశనిప్రభుని కొట్టాడు. సుకాంతి విద్యుత్ప్రభునీ, సుందరుడు సుఘోషునీ, సుందుడు ఉన్మత్తాక్షునీ, ఐదేసి బాణాలతో కొట్టారు. సుందుడు ఉన్మత్తాక్షుని ధనుస్సును వంగినకణుపులు గల ఒక వాడితూపుతో నరికాడు. సుమనసుడు అగ్నిదంష్ట్రునీ, సుశుభుడు అగ్ని తేజసునీ, సుశీలుడు వాయుశక్రునీ, సుముఖుడు ప్రతర్దనునీ కొట్టారు. శంభుడు, విరాధునితోనూ, సుకీర్తి భీమకర్మునితోనూ, విప్రచిత్తి సోమునితోనూ తలపడ్డారు. అది మహాయుద్ధమైపోయింది. ఆ ఘోరయుద్ధంలో అస్త్రలాఘవంతో పరస్పరం పోరాటం కాగా, ఆదైత్యులు యథాసంఖ్యంగా (మొదటివాడు మొదటివానిని –ఇలా) మణిసంజాతులచేత చంపబడ్డారు. వారి ఆ మహాసంగ్రామం ఘోరమై పెరిగేటంతలో ముని గౌరముఖుడు సమిధలూ, దర్భలూ తీసుకొని వచ్చాడు.

భయంకరంగా కన్పించే మహాశ్చర్యకరమైన బహుసైన్యపరివారాన్నీ, నిలబడిన ఆ దుర్జయునీ చూచి, ఆముని విచారగ్రస్తుడై ద్వారంలో కూర్చుని మణికోసం జరిగినదని తెలుసుకొని, మణిచేసిన భయంకరమైన తీవ్రమైన యుద్ధమని నిర్ణయించు కొన్నాడు. గౌరముఖముని దేవేశుని హరిని ధ్యానించాడు. ఆ దేవుడు పీతాంబరం ధరించి, గరుత్మంతునధిరోహించి, అతని ఎదుట కనిపించి ''నేనిక్కడ నీకు చేయవలసినదేమిటి?'' అని అడిగాడు. ఆ ఋషి దోసిలి పట్టి, పురుషోత్తమునితో ''సైన్యపరివృతుడైన ఈ పాపిని, దుర్జయుని సంహరించు'' అన్నాడు. అలా అనేసరికి, అప్పుడతడు అగ్నితుల్యమైన చక్రం, కాలచక్రం వంటి సుదర్శనం దుర్జయుని బలంపై విడిచిపెట్టాడు. ఆ చక్రంతో అసురసహితమైన దుర్జయుని బలిష్ఠమైన ఆ సైన్యం క్షణంలో మరునిమిషంలో పూర్తిగా భస్మం అయిపోయింది. ఇలా చేసినతరువాత దేవుడు గౌరముఖమునితో ''ఈ అరణ్యంలో ఈ దానవబలం ఒకనిమిషంలో హతమైనది కనుక ఇది నైమిషారణ్యం అన్న పేరుగలది అవుతుంది, సార్థకమవుతుంది. బ్రాహ్మణులకు విశేషంగా నివాసమవుతుంది. నేను యజ్ఞపురుషుడనై ఈ వనంలో ఉంటాను. ఈ పదిహేనుగురు నాయకులూ వారి పేరుతో

యజింపదగిన వారౌతారు. మణి నుంచి జన్మించిన వీరు కృతయుగంలో రాజులవుతారు'' అని చెప్పాడు. ఇలా పలికిన తరువాత దేవుడు, నియామకుడు అంతర్ధానమైనాడు. ద్విజుడు కూడా పరమసంతోషంతో తన ఆశ్రమంలో ఉన్నాడు.(11)

12 వ అధ్యాయం - చిత్రకూట శ్రీరాముని స్తుతి

శ్రీవరాహులు ఇలా చెప్పారు. అనంతరం అక్కడ తనకుమారుడు చక్రాగ్ని దగ్ధుడయ్యాడని విని పార్థివుడు, ప్రతీతాత్ముడు, సృపోత్ముడు, సృపోత్తముడు, సుప్రతీకుడు చింతించాడు. ఆలోచిస్తున్న అతనికి ఆలోచన ఇలా కలిగింది: ''చిత్రకూటగిరిపై విష్ణువును రాముడంటారు. అందువల్ల నేను ఆ రాముడనే నామధేయంతో జగత్పతిని స్తుతిస్తాను'' అని. సుప్రతీకుడు పలికాడు:.

సుప్రతీకకృత చిత్రకూట శ్రీరామస్తుతి

సుప్రతీక ఉవాచ :

నమామి రామం నరనాథమచ్యుతం | కవిం పురాణం త్రిదశారినాశనమ్ |
శివస్వరూపం ప్రభవం మహేశ్వరం | సదా ప్రపన్నార్తి హరం ధృతశ్రియమ్ ||
భవాన్ సదా దేవ సమస్తతేజసాం | కరోషి తేజాంసి సమస్తరూపధృక్ ||
క్షితౌ భవాన్ పంచగుణ స్తథా జలే | చతుః ప్రకార స్త్రివిధోథ తేజసి ||
ద్విధాథ వాయౌ వియతి ప్రతిష్ఠితో | భవాన్ హరే శబ్దవపుః పుమానసి ||
భవాన్ శశీ సూర్యహుతాశనోసి | త్వయి ప్రలీనం జగదేతదుచ్యతే |
భవత్ప్రతిష్ఠం రమతే జగద్ యతః | స్తుతోసి రామేతి జగత్ ప్రతిష్ఠితమ్ ||
భవార్ణవే దుఃఖతరోర్మిసంకులే | తథాక్షమానగ్రహణే తిభీషణే ||
న మజ్జతి త్వత్స్మరణప్లవో నరః | స్మృతోసి రామేతి తథా తపోవనే ||
వేదేషు నష్టేషు భవాం స్తథా హరే | కరోషి మాత్స్యం వపురాత్మనః సదా ||
యుగక్షయే రంజితసర్వదిజ్ముఖో | భవాం స్తథాగ్నిర్బహురూపధృగ్ విభో ||
కౌర్మం తథా తే వపురాస్థితః సదా | యుగే యుగే మాధవ తో యమన్థనే ||
న చాన్యదఃస్తీతి భవత్సమం క్వచి | జ్జనార్దనాద్ యః స్వయం భూతముత్తమమ్ ||

త్వయా తతం విశ్వమదం మహాత్మన్ | స్వకాఖిలాన్ వేదదిశశ్చ సర్వాః ||

కథం త్వమాద్యం పరమం తు ధామ | నిహాయ చాన్యం శరణం వ్రజామి ||

భవానేకః పూర్వమాసీత్ తతశ్చ | త్వత్తో మహీ నలిం వహ్నిరుచ్చైః||

వాయు స్తథా ఖం చ మనోపి బుద్ధి -శ్చేతో గుణా స్తత్ప్రభనం చ సర్వమ్ ||

త్తయా తతం విశ్వమిదం సమస్తం | సనాతన స్త్వం పురుషో మతో మే ||

సమస్త విశ్వేశ్వర విశ్వమూర్తే | సహస్రభాహోజయ దేవదేవ ||

నమోస్తు రామాయ మహానుభావ | ఇతిస్తుతో దేవవరః ప్రసన్నః ||

తదా రాజ్ఞః సుప్రతీకస్య మూర్తిమ్ | సందర్శయామాన తతో భ్యువాచవరం వృణీష్వేతి చ సుప్రతీకమ్ ||

ఏవం శ్రుత్వా వచనం తస్య రాజా | సంసంభ్రమం దేవదేవం ప్రణమ్య ||

ఉవాచ దేవేశ్వర మే ప్రయచ్ఛ | యం యదాస్తే పరమం వపుస్తే ||

ఇతీరితే రాజవరః క్షణేన | యం తథా గాదసురఘ్నమూర్తౌ ||

స్థిత స్తస్మిన్నాత్మభూతో విముక్తః | స భూమిపః కర్మకాండైరనేకైః || (12.1 -14)

భావం: నరనాథుడు, అచ్యుతుడు, ప్రాచీనకవి,రాక్షసనాశకుడు, శివ స్వరూపుడు, కారణస్వరూపుడు, మహాశాసకుడు, సదా ప్రపన్నార్తి హరుడు, లక్ష్మీధరుడు అయిన శ్రీరామునికి నమస్కరిస్తున్నాను. దేవా, నీవు నిరంతరమూ సమస్తరూపాలను ధరించి, సమస్త తేజస్సులయొక్క తేజస్సులనూ కల్పిస్తున్నావు. నీవు భూమిలో (శబ్దస్పర్శ రూపరసగంధములనే) అయిదు గుణాలవు. నీటిలో (శబ్దస్పర్శరూపరసాలనే) నాలుగు ప్రకారాలుగా ఉంటావు. తేజస్సు(అగ్ని)లో (శబ్దస్పర్శరూపాలనే) మూడువిధాలుగా వాయువులో (శబ్ద, స్పర్శాలనే) రెండువిధాలుగా ఉంటావు. ఆకాశంలో హరివీ, పురుష స్వరూపుడవూ నీవు శబ్దానివై సంచరిస్తుంటావు. నీవు చంద్రుడవు, సూర్యుడవు, హుతాశనుడవు. నీలో ఈ, జగత్తు ప్రలీనమువుతుంది. జగత్తు నీలో ఉండి క్రీడిస్తున్నది కనుక నీవు రాముడవని జగత్తులో ప్రతిష్ఠితుడవై నావు. మిక్కిలి దుఃఖతరములనే కెరటాలతో నిండి, ఇంద్రియాలూ అభిమానమూ (అనే జంతువులు) పట్టుకొనే నీటితో

భయంకరమైన సంసారసాగరంలో నీస్మరణమనే నావకల నరుడు మునిగిపోవడు. అలాగే తపోవనంలో రాముడని స్మరింపబడుతున్నావు. హరీ, వేదాలు నష్టమైపోయినపుడు సదా నీవు మత్స్య రూపాన్ని ధరిస్తావు.యుగాలు నశించేటప్పుడు సకలదిగ్ భాగాలూ, ఎఱ్ఱబడినపుడు నీవు అగ్నివై అనేక రూపాలు ధరిస్తావు విభూ. మాధవా, ప్రతియుగంలోనూ, సముద్రమధనంలో నీవు కూర్మ రూపం ధరిస్తావు. నీతో సమానమైనది మరేదీ ఎక్కడా లేదు. నీవు స్వయంభువుడన ఉత్తముడవు. మహాత్మా, ఈ విశ్వం నీచేత విస్తరింపబడింది. సమస్తమైన లోకాలూ, వేదాలూ, దిశలూ, అన్నీ నీవెరుగుదువు. (నీవల్ల ఏర్పడినవే.) ఆద్యుడవు, పరంధామస్వరూపుడవు, నిన్ను విడిచి ఇతరుని ఎలా శరణు పొందగలను? పూర్వం నీవు ఒక్కడవే ఉన్నావు. తరువాత నీనుంచి భూమి, జలమూ, అగ్నీ, వాయువూ, ఆకాశమూ, మనస్సూ, బుద్ధీ, చేతస్సూ కలిగాయి. నీనుంచే గుణాలు కలిగాయి. సర్వమూ నీనుంచి పుట్టినదే. ఈ విశ్వం అంతా నీవల్ల విస్తరించినదే. నీవు సనాతనుడ వై న పురుషుడవని నా అభిప్రాయం. సమస్త విశ్వేశ్వరా, విశ్వమూర్తీ, సహస్రబాహూ, దేవ దేవా, సర్వోత్కృష్టుడవై వర్ధిల్లు. మహానుభావా, రాముడవైన నీకు నమస్కారం." అని స్తుతించేసరికి దేవశ్రేష్ఠుడు ప్రసన్నుడై సుప్రతీక నరపతికి తనరూపం చూపించి, ఆ తరువాత ''వరం కోరుకో'' అన్నాడు. ఇలా అతని మాట విని, రాజు తొట్రుపాటుతో ఆ దేవశ్రేష్ఠునికి ప్రణమిల్లి ''దేవేశ్వరా, నీ శరీరం సర్వోత్కృష్టమైనది. కనుక అందులో నన్ను లయం చేసుకో'' అన్నాడు. ఇలా పలికినక్షణంలో రాజోత్తముడు ఆ రాక్షసాంతకుని శరీరంలో లీనమయ్యాడు. ధ్యానసహితుడై ఆ పురుషుని ధ్యానిస్తూ, బహుకర్మకాండ విముక్తుడై, ఆ భూపాలకుడు ఆత్మస్వరూపుడై అతనితో ఉన్నాడు.

శ్రీవరాహులు ఇలా చెప్పారు: ఆ స్వాయంభువ మన్వంతరంలో చేసిన దానిలో ఒక ప్రాచీనమైన అంశం నీకు నేను చెప్పాను. ఎవడూ ఎన్నోవేలనోళ్ళతో అయినా ఇక్కడ చెప్పటం శక్యం కాదు. కళ్యాణీ, ఉద్దేశపూర్వకంగా, జ్ఞప్తికి వచ్చినది, ఎక్కడెక్కడో జరిగినది, ఈ ప్రాచీనవిషయం నీకు నేను చెప్పాను, సముద్రజలం నుంచి మేఘం కొంచెం కొంచెంగా జలం గ్రహించినట్లు, దీనిని స్వయంభువుడైన బ్రహ్మ, ఎందునుంచీ భయంలేని నారాయణుడూ, చెప్పినది, ఈ ప్రపంచంలో మరెవ్వడు చెప్పగలడు? ఇది చెప్పటానికి శక్యంకానిది. నేనా పరమాత్మరూపమే అయినందున జ్ఞప్తికి తెచ్చుకొని ఈ ఆదివృత్తాంతం

నీకు చెప్పగలిగాను. సముద్రంలోని ఇసుకరేణువులకూ, నేలమీది ధూళికణాలకూ సంఖ్య ఉంటుంది. కానీ క్రీడిస్తున్న పరమేష్ఠియొక్క సృష్టులకు లెక్క ఉండదు. శుచిస్మితా, ఈ నారాయణాంశం నేను చెప్పాను. ఇది కృతయుగ వృత్తాంతం. మరింకేమి వినగోరుతున్నావు? (12)

13 వ అధ్యాయం - గౌరముఖ మార్కండేయ సంవాదము

ధరణి ''గురూ, గౌరముఖమునీ, ఆ మణిసంభవులూ (పరమాత్మను) దర్శించి ఏ ఫలమూ, వరమూ పొందారో, ఇది నాకు మహాశ్చర్యంగా ఉన్నది.''ఈ పరమధార్మికుడైన శ్రీమద్గౌరముఖుడు ఎవరు? ఆ ముని పుంగవుడు హరిచేసిన పనిచూచి ఏపని చేశాడు?'' అని అడిగింది. శ్రీవరాహులు ఇలా చెప్పారు. ఆముని, భగవానుడు నిమిషంలో చేసినపని చూచి, ఆదేవునే ఆరాధింపగోరి, వనానికి వెళ్ళాడు. ప్రభాసమని పరమదుర్లభమైన సోమతీర్థానికి వెళ్ళాడు. అక్కడిదేవుడు దైత్యసూదనుడని తీర్థచింతకులు చెపుతారు. దైత్యసూదనుడనే ఆ హరిని ఆరాధించాడు. అతడు శ్రీహరిదేవుని, నారాయణప్రభువును ఆరాధిస్తుండగా మహాయోగి మార్కండేయమహాముని వచ్చాడు. ఆ ముని, వచ్చిన అతనిని దూరంనుంచే చూచి, అర్ఘ్యపాద్యాలతో పూజించాడు, భక్తితో, పరమసంతోషంతో. ఆ ముని దర్భాసనంమీద కూర్చున్న అతనిని ''మునిశార్దూలా, మహావ్రతా, ఏమిచేయను? ఆజ్ఞాపించు నన్ను'' అని ప్రశ్నించాడు. ఇలా అడిగేసరికి ఆ మహాతపస్వి, విప్రోత్తముడు మార్కండేయుడు, గౌరముఖమునితో మధురవాక్కుతో ''మహామునీ, సజ్జనుల కలయికయే మహాకార్యం. ఏదైనా సందేహం ఉంటే, అది అడుగు'' అన్నాడు.

గౌరముఖుడు ''వేదవాదులు, పితృదేవతలంటూ పేర్కొంటుంటారుకదా, వీరు సర్వవర్ణాలవారికీ ఒకరేనా? విడివిడిగా ఉంటారా?'' అని అడిగాడు. మార్కండేయుడు ''సర్వదేవతలకూ ఆద్యుడు, గురువు, నారాయణుడు. అతనినుంచి బ్రహ్మ సంభవించాడు. అతడు సప్తమునులను సృష్టించాడు. ఆ పైని పరమేష్ఠి ''నన్ను గురించి యజించండి.'' అని వారితో చెప్పాడు. మొదట తమ్ము తామే యజించుకొన్నారు అని శ్రుతి. మహావైకారి కర్మపరులైన ఆ బ్రహ్మపుత్రులను ఈ మహాతిక్రమణం చేశారు కనుక, 'మీరందరూ జ్ఞానభ్రష్టులై పోతారు. సందేహం లేదు' అని శపించాడు. బ్రహ్మ, తన కుమారులను ఇలా శపించేసరికి వారు తక్షణమే వంశకర్తలైన పుత్రులను సంభవింపజేసి స్వర్గానికి వెళ్ళారు. ఆ

బ్రహ్మవాదులు స్వర్గానికి వెళ్లిన తరువాత వారిపుత్రులు శ్రార్ధదానాలతో జ్ఞానంతో తర్పణం చేశారు. ఆ బ్రహ్మమానసపుత్రులు ఏడుగురూ తమ కుమారులు మంత్రోక్తంగా పిండప్రదానం చేయటం, విమానాలలో ఉండి చూచారు'' అని చెప్పాడు. ఇలా చెప్పగా విని గౌరముఖుడు ''బ్రాహ్మణుడా, ఆ పితరులెవరు? ఎంతకాలం ఉంటారు? పితృగణాలు ఎందరు ఆ లోకంలో ఉన్నారు?'' అని అడిగాడు.

మార్కండేయుడు ఇలా చెప్పాడు. దేవతలో కొందరు ఉత్తములు సోమవర్ధనులు ఉన్నారు. వారు మరీచి మొదలైనవారు ఏడుగురు స్వర్గంలో ఉంటారు. వారిని పితరులంటారు. వారు నలుగురు సశరీరులు, ముగ్గురు అశరీరులు. వారిలోక నైసర్గిక స్వరూపం చెపుతాను. అది విను. వారి ప్రభావమూ మహైశ్వర్యమూ నేను చెపుతాను విను. వారిలో ధర్మస్వరూపధారులైన వేరే మూడు ఉత్తమగణాలవారున్నారు. వారి పేర్లనూ, లోకాలనూ కీర్తిస్తాను, అది విను. సంతానకములు అనే లోకాలు ఉన్నాయి. వాటిలో అశరీరులయిన పితృగణాలు, ప్రజాపతిపుత్రులు ప్రకాశిస్తూ ఉంటారు. విరాజునియొక్క ఉత్తమసంతతి కనుక వారు వైరాజులు అనబడినారు. వారు దేవతల పితరులు. వారిని దేవతలు యజిస్తుంటారు. వీరు లోకభ్రష్టులై నూరుయుగాల తరువాత బ్రహ్మవాదులై (వేదావధానులై) మళ్ళీ సనాతనలోకాలను పొందుతారు. వారు తిరిగి ఆ స్మృతినీ, సర్వోత్తమమైన యోగాన్నీ సాధించి, పునరావృత్తదుర్లభమైన శుద్ధయోగగతినీ ధ్యానిస్తారు. వీరు శ్రాద్ధంలోని పితృగణం. యోగులయోగాన్ని వృద్ధిపొందిస్తుంటారు. వారందరూ యోగుల యోగశక్తివల్ల ఇదివరకు పుష్టిపొందారు.

కనుక, యోగిసత్తమా, యోగులకు శ్రాద్ధాలు ఇవ్వాలి. (అంటే, శ్రాద్ధభోక్తలుగా యోగులను నిమంత్రించాలి.) ఇది మొదటిసృష్టి. సోమపానం చేసేవారిది. సర్వోత్కృష్ట మైనది. వీరు ద్విజోత్తములు, ఏకశరీరులై స్వర్గలోకంలో నివసిస్తూ ఉంటారు. భూలోకవాసులు వీరిని యజించాలి. మరీచి మొదలైన బ్రహ్మపుత్రులు, వీరు మహర్లోక వాసులను యజించాలి.కల్పవాసికులనే పేరుగల వీరు (మహర్లోకవాసులు) జనోలోకంలో ఉండే సనకాదులను యజించాలి. వారు తపోలోకంలో ఉండే వైరాజులను యజించాలి. వారు సత్యలోకంలోని ముక్తులను యజించాలి. ఇది పితృసంతతి. అగ్నిష్వాత్తులు, మారీచ్యులు, వైరాజులు, బర్హులు సుకాలేయులు – అని వీరు వసిష్ఠప్రజాపతి పితరులు.

వారిని కూడా మూడు వర్ణాలవారూ వేరువేరుగా యజించాలి. శూద్రుడు వేరుగా కొందరిని యజించటం లేదు. శూద్రుడు వర్ణత్రయంవల్లనూ అనుజ్ఞపొంది, పితరులందరినీ యజించాలి. అతనికి శూద్రజాతిపితరులు వేరే లేరు. బ్రాహ్మణుడా, విశేష శాస్త్ర దృష్టి వల్లనూ, పురాణ దర్శనం వల్లనూ ముక్తచేతనుడు బ్రాహ్మణులలో కనిపిస్తాడు. ఇలా బ్రహ్మ పుత్రులకు ఋషుల స్తుతులవల్లనూ, శ్రౌతాదివిషయాలనూ శాస్త్రాలనూ తెలుసుకోవటం వల్లనూ, సృష్టిలో స్వయంగా స్మృతి లభించింది. జ్ఞానం వల్లనే వారు పరమనిర్వాణం పొందారు. వసువులు మొదలైనవారికి కశ్యపాదులూ, వర్ణాలకు వసువులూ మొదలైన వారూ, గంధర్వాదులూ భేదం లేకుండా (యజింపదగినవారని) తెలుసుకోవాలి. ఇది నిశ్చయం. మహామునీ, ఈ పైతృకసృష్టి గురించి నీకు ఉద్దేశపూర్వకంగా చెప్పాను. కోటి సంవత్సరాలు చెప్పినా దీనికి అంతం కనబడదు.

శ్రాద్ధకాలాలను గురించి చెపుతాను, ద్విజోత్తమా, అది విను. శ్రాద్ధానికి తగిన పదార్థం కాని, విశిష్టుడైన ద్విజుడు కాని లభిస్తే, శ్రాద్ధం చెయ్యాలి. తెలుసుకొని, వ్యతీపాతం కాని, అయనం కాని, విషువం కాని, సూర్య చంద్ర గ్రహణం కాని, ప్రతిరాశిలోకి సూర్యుడు సంక్రమించినపుడు కాని, నక్షత్రగ్రహపీడా సమయాలలో కాని, దుస్స్వప్నం కన్నప్పుడు గాని, క్రొత్తపంట వచ్చినప్పుడు కాని, ఇచ్ఛాశ్రాద్ధాలు చెయ్యాలి విప్రోత్తమా. ఆర్ద్ర, విశాఖ, స్వాతి, – వీటితో కలిసి అమావాస్య వచ్చినపుడు శ్రాద్ధాలతో పితృగణాలకు ఎనిమిది సంవత్సరాలు తృప్తి కలుగుతుంది. పుష్యమి, రుద్రనక్షత్రం (ఆర్ద్ర), పునర్వసువు – వీటితో కూడిన అమావాస్యనాడు పితరులనర్చిస్తే, వారికి పండ్రెండు సంవత్సరాల తృప్తి కలుగుతుంది. ఇంద్రనక్షత్రం (ధనిష్ఠ), అజైకపాద (పూర్వాభాద్రా) నక్షత్రం, వారుణ నక్షత్రం (శతభిష), – వీటితో కూడిన అమావాస్య పితృతప్తికోరే దేవతలకు కూడా దుర్లభం. ద్విజోత్తమా, అక్షయ్యఫలం కావాలనుకొనేవారు ఈ తొమ్మిది నక్షత్రాలలో దేనిలోగాని అమావాస్య వచ్చినపుడు శ్రాద్ధాలు పెట్టాలి. (అలా చేస్తే) కోటివేల సంవత్సరాలైనా, ఆ పుణ్యానికి అంతం ఉండదు.

పితరులు మరొక శ్రాద్ధకాలం గురించి కూడా మాకు చెపుతారు. అది రహస్యమైనది. పవిత్రమైనది. వైశాఖమాసంలోని తదియ, కార్తికశుద్ధనవమి, భాద్రపద బహుళ త్రయోదశి, మాఘపంచదశి, చంద్రసూర్యగ్రహణం, (నాలుగు) అష్టకాలు,

రెండయనాలు, వీటిలో మనుష్యుడు నియమవంతుడై నువ్వులు గలిపిన నీళ్ళయినా, పితృదేవతలకు ఇవ్వాలి. (అలా ఇస్తే) అతడు వెయ్యేళ్లు శ్రాద్ధం పెట్టినట్టని పితరులు రహస్యం చెపుతుంటారు. మాఘబహుళ అమావాస్య ఎప్పుడైనా వారుణ (శతభిషా) నక్షత్రంతో కలసి వచ్చినకాలం పితరులకు శ్రేష్ఠమైనది. ఇది స్వల్ప పుణ్యాత్ములకు లభించదు ద్విజా. విప్రోత్తమా, ఆ కాలం (మాఘబహుళ అమావాస్య) లో ధనిష్ఠ లభిస్తే, అపుడు పితరులకు ఆ కులంలో జన్మించిన నరులిచ్చిన నీళ్ళు కాని, అన్నం కాని పదివేల సంవత్సరాల తృప్తినిస్తాయి. ఆ సమయంలోనే (మాఘబహుళ అమావాస్యనాడే) పూర్వాభాద్ర గనుక వస్తే, అపుడు పితరులకు పెట్టిన శ్రాద్ధం పరమతృప్తి కలిగిస్తుంది. దానివల్ల ఒక పూర్తి యుగంపాటు పితరులు నిద్రిస్తారు.

శ్రాద్ధపక్షమనబడే మహాలయపక్షం పితృదేవతలకు తృప్తినిస్తుందని మునిగణాలు చెపుతారు. గంగ, సరయువు, విపాశ, సరస్వతి, నైమిషం, గోమతి – వీటిలో ఎందులోనైనా స్నానం చేసి ఆదరంతో పితరుల అర్చన చేస్తే, అందువల్ల అహితాలు పోతాయి. పితరులు ఎప్పుడు తనయాదులు మఘాబహుళ పక్షంలో చివరి రోజున మఘానక్షత్రంలో ఇచ్చిన శుభతీర్థజలాలతో తృప్తి పొందుతామా అని దీనిని గానం చేస్తూ ఉంటారు. నరులకు విశుద్ధమైనచిత్తమూ, విత్తమూ, ప్రశస్తమైన కాలమూ (శాస్త్రాదులో) చెప్పబడిన విధానమూ, యథోక్తమైన పాత్రమూ, పరమభక్తీ అభీష్టాలను ఇస్తాయి. సజ్జనోత్తమా, అలాగే ఈ సందర్భంలో పితరులు గానంచేసిన శ్లోకాలు విను. విని అట్టివాడవవుతావు. సదా మనస్సుతో అలా ఉండాలి.

పితృగీతలు

పితృగీతా స్తథైవాత్ర శ్లోకాస్తాన్ శృణు సత్తమ | శ్రుత్వా తథైవ భవితా భావ్యం తత్ర విధాత్మనా॥

అపి ధన్యః కులే జాయాదస్మాకం మతిమాన్ నరః| అకుర్వన్ విత్తశాఠ్యం యః పిండాన్ యో నిర్వపిష్యతి ||

రత్నవస్త్రమహాయానం సర్వం భోగాదికం వసు | విభవే సతి విప్రేభ్యో అస్మానుద్దిశ్య దాస్యతి ||

అన్నేనవా యథాశక్త్యా కాలే2స్మిన్ భక్తినమ్రధీః| భోజయిష్యతి విప్రాగ్ర్యాంస్తన్మాత్రవిభవోనరః ||

అసమర్థో2న్న దానస్య వన్యశాకం స్వశక్తితః | ప్రదాస్యతి ద్విజాగ్ర్యేభ్యః స్వల్పాం యో వాపి దక్షిణామ్ ||

తత్రాప్యసామర్థ్యయుతః కరాగ్రాగ్రస్థితాం స్తిలాన్ | ప్రణమ్య ద్విజముఖ్యాయ కస్మైచిద్ ద్విజ దాస్యతి ||

తిలైఃసప్తాష్టభిర్వాపి సమవేతాంజలాంజలిమ్ |భక్తినమ్రః సముద్దిశ్యాప్యస్మాకం సంప్రదాస్యతి ||

యతః కుతశ్చిత్సం ప్రాప్య గోభ్యో వాపి గవాహ్నికమ్ | అభావే ప్రీణయత్యస్మాన్ భక్త్యా యుక్తః ప్రదాస్యతి ||

సర్వాభావే వనం గత్వా కక్షామూల ప్రదర్శకః| సూర్యాదిలోకపాలానామిదముచ్చైః పఠిష్యతి ||

న మే2స్తి విత్తం న ధనం న చాన్య- చ్ఛ్రాద్ధస్య యోగ్యం స్వపితౄన్ నతో2స్మి |

తృప్యన్తు భక్త్యా పితరో మయైతౌ భుజౌ తతౌ వర్త్మని మారుతస్య ||

ఇత్యేతత్ పితృభిర్గీతం భావాభావ ప్రయోజనమ్ | కృతం తేన భవేచ్ఛ్రాద్ధం య ఏవం కురుతే ద్విజ || (13.51-61)

భావం: మాకులంలో సొమ్ముకు వెను తీయకుండా మాకు పిండ ప్రదానం చేసే ధన్యుడు, బుద్ధిమంతుడు అయిన నరుడు జన్మిస్తాడా? రత్నాలూ, వస్త్రాలూ, గొప్ప వాహనాలూ, భోగాలూ, మొదలైనవీ, ధనమూ, సర్వమూ, ఐశ్వర్యమున్నప్పుడు మమ్మల్నుద్దేశించి విప్రులకు దానంచేసేవాడు జన్మిస్తాడా? ఈ సమయంలో తన ఐశ్వర్యానికి తగిన విధముగా భక్తి నమ్రబుద్ధితో యథాశక్తి విప్రోత్తములకు అన్నం పెట్టే నరుడు జన్మిస్తాడా? అన్నదానానికి అసమర్థుడైనవాడు తన శక్తినిబట్టి ఉత్తమద్విజులకు అడవికూర అయినా స్వల్ప దక్షిణతో ఇచ్చేవాడు జన్మిస్తాడా? అందుకూ అసమర్థుడయినవాడు చేతులతో నల్లనినువ్వులు తీసికొని, ఎవరైనా ఉత్తమద్విజునికి నమస్కరించి ఇచ్చేవాడు జన్మిస్తాడా? (అందుకూ అసమర్థుడయిన పక్షంలో) ఏడు లేక ఎనిమిది తిలలతో కూడిన జలాంజలిని భక్తినమ్రుడై మమ్మల్నుద్దేశించి ఇచ్చేవాడు జన్మిస్తాడా? అదీ లేనప్పుడు ఎక్కడనుంచో ఒకచోటనుంచి తెచ్చి గోవులకు ఒక రోజుకు సరిపడే మేత వేసి భక్తితో సంతోష పెట్టేవాడు జన్మిస్తాడా? ఏమీ లేకపోతే వనానికి వెళ్ళి, బాహుమూలాలు చూపిస్తూ,(రెండుచేతులూ పై కెత్తి) సూర్యాదిలోక పాలకుల నుద్దేశించి "నాకు విత్తం లేదు, ధనం లేదు, శ్రాద్ధానికి యోగ్యమైనది మరేదీ లేదు. నాపితరులకు నమస్కరిస్తున్నాను. నాపితరులు భక్తికి సంతోషిస్తారుగాక. వాయుమార్గంలో నా రెండుచేతులూ చాచాను" అని

బిగ్గరగా పలికేవాడు జన్మిస్తాడా ? అని ఇలా కలిమిలోనూ, లేమిలోనూ ఉపయోగించే పితృగీతలను పితరులు గానం చేశారు. ఏ ద్విజుడు పైన చెప్పిన విధానములలో దేనినైనా మనఃపూర్వకంగా చేస్తాడో, అతడు శ్రాద్ధం చేసినట్లే. (13)

14 వ అధ్యాయం – శ్రాద్ధ విధి

విప్రర్షీ, పూర్వం మేధావి బ్రహ్మపుత్రుడు సనకునితమ్ముడు (సనత్కుమారుడు) బ్రాహ్మణులను (భోక్తలను) గురించి దీనిని నాకు చెప్పాడు. ఇప్పుడు విను : త్రిణాచికేతుడు, త్రిమధుడు, త్రిసుపర్ణుడు, షడంగవేత్త, వేదవిదుడు, శ్రోత్రియుడు, యోగి, జ్యేష్ఠసామగాత, ఋత్విక్కు, మేనల్లుడు, దౌహిత్రుడు, మామ, అల్లుడు, మేనమామ, తపోనిష్ఠుడైన బ్రాహ్మణుడు, పంచాగ్నినిరతుడు, శిష్యుడు, బంధువు, మాతాపితృ భక్తుడు – వీరిని శ్రాద్ధంలో (భోక్తగా) నియమించాలి.

త్రిణాచికేతుడు = రెండవకఠంలోని 'అయం వావ యఃపవతే' మొదలైన మూడు అనువాకాలకూ త్రిణాచికేతములని పేరు. వాటిని చదివేవాడు, అనుష్ఠించేవాడూ త్రిణాచికేతుడు. త్రిమధుడు = 'మధువాతాః' మొదలైన ఋక్కులను అధ్యయనం చేసేవాడూ మధువ్రతం ఆచరించేవాడూను. త్రిసువర్ణుడు = 'బ్రహ్మమేతు మాం' మొదలైన ఛాందోగ్యప్రోక్తమైన మూడు అనువాకాలనూ అధ్యయనం చేసేవాడూ, వాటికి సంబంధించిన వ్రతం ఆచరించేవాడూను– శ్రీ. షడంగవేత్త = ఆరు అంగాలతో కూడిన వేదం చదివినవాడు, లేదా, తెలిసిన వాడు 'షట్ అంగాని యస్య తం వేదమధీతే వేత్తి వా షడంగవిత్' – వై.విష్ణు.3–15–1. ఆరు అంగాలంటే, శిక్ష, వ్యాకరణం, ఛందస్సు, నిరుక్తం, జ్యోతిషం, కల్పం, ఈ ఆరు శాస్త్రాలు. వీటి సంగ్రహశ్లోకం :

శ్లో: శిక్షా వ్యాకరణం ఛందో నిరుక్తం జ్యోతిషం తథా| కల్పశ్చేతి షడంగాని శ్రీ.విష్ణు. 3-6-28.

వేదవిదుడు = వేదార్థవిచారకుడు, శ్రోత్రియుడు = వేదార్థానుష్ఠాత, జ్యేష్ఠసామగాత = 'మూర్ధానం దివ' ఇత్యాది ఋగ్విశేషంలో గానం చేయబడిన 'ఆజ్యదోహం' ఇత్యాదికమైన సామ జ్యేష్ఠసామ, దానిని యథావిధిగా గానం చేసేవాడు.శ్రీ., వై., విష్ణు. పంచాగ్ని = ఆహవనీయం, దక్షిణాగ్ని, గార్హపత్యం, సభ్యం, అవసభ్యం (అవసథ్యం అని వై., శ.ర.) ఇవి పంచాగ్నులు. లేదా, వేదాంతోక్తమైన ద్యుపర్జన్య – పృథివీ – పురుష – యోషిద్రూపపంచవిద్య – శ్రీ విష్ణు.3–15–3. మిత్రద్రోహి, చెడుగోళ్ళవాడు,

తోపురంగు(నల్ల) పళ్ళవాడు, కన్యను చెరచినవాడు, అగ్నిహోత్రమునూ, వేదాలనూ విడిచిపెట్టినవాడు, సోమరసం అమ్మేవాడు, నలుగురూ 'ఛీ' అనేవాడు దొంగ, కొండెగాడు, గ్రామయాజకుడు, భృతకాధ్యాపకుడు, (జీతం పుచ్చుకొని వేదం చెప్పేవాడు), జీతమిచ్చి వేదం చెప్పుకొనేవాడు, మారుమనువు దానిని పెళ్ళాడినవాడు, తల్లిదండ్రులను విడిచిన (పోషించని) వాడు, శూద్రాసంతతిని పోషించేవాడు, శూద్రాపతి, దేవార్చనపై ఆధారపడి బ్రతికేవాడు – వీరు శ్రాద్ధ (భోజన) నిమంత్రణకు తగరు.

సోమరసం అమ్మేవాడు – అగ్నిహోత్రమునూ, వేదాలనూ విడిచిపెట్టినవాడు – నిష్కారణముగా (అని చేర్చినది వి.విష్ణు. 3–15–6;) నలుగురూ 'ఛీ' అనేవాడు, మూలం 'అభిశస్తః' అనిపించుకొనేవాడు – శ్రీ. వై.విష్ణు.3–15–6; గ్రామయాజకుడు = గ్రామార్థం యజ్వా = గ్రామం కోసం యజ్ఞం చేసేవాడు –శ్రీ. సాధారణులయాజకుడు – వై.విష్ణు.3–15–6; దేవార్చనపై ఆధారపడి బ్రతికేవాడు = దీనికి మూలం 'దేవలకః' అని . దేవోపజీవి అని అర్థం వ్రాసి – శ్రీ. ఉదాహరించిన శ్లోకం :–

శ్లో॥ దేవార్చనపరో యస్తు విత్తార్థం వత్సరత్రయం। సవై దేవలకో నామ హవ్యకవ్యేషు గర్హితః ॥

మూడు సంవత్సరాలు సొమ్ముకోసం దేవార్చన చేసినవాడు దేవలకుడు. హవ్యకవ్యాల విషయమై గర్హితుడు అని దీని భావం విష్ణు. 3–15–7; పరమాత్మను ప్రతిఫలవాంఛారహితంగా ఆరాధించటం శ్రేష్ఠమనటానికీ, దేవుని సొమ్ము అతనికే చేసిన సేవకే ప్రతిఫలముగా అయినా, తినకూడదనీ, ఇక అక్రమరీతిలో అయితే చెప్పేదేమిటనీ చెప్పటానికి అయి ఉంటుంది.

★★★

జ్ఞాని ముందురోజున విప్రోత్తములను శ్రాద్ధభోజనానికి పిలవాలి. ముందు ద్విజులను నిమంత్రించి, తరువాత ఇంటికి వచ్చినయతులకు భోజనం పెట్టాలి. ఇంటికి వచ్చిన ద్విజులకు కాళ్ళు కడగటంతో ప్రారంభించి భోజనం పెట్టాలి. చేతికి పవిత్రం పెట్టుకొని, ఆచమనం చేసినవారిని (భోక్తలను) ఆసనాలపై కూర్చోపెట్టాలి. పితరులకుగాను ఇద్దరు కానివారినీ, దేవతలకుగాను ఇద్దరినీ నియోగించాలి, దేవతలకొకరినీ పితరులకొకరినీ అయినా నియోగించాలి. అలాగే, వైశ్వదేవసహితమైన మాతమహశ్రాద్ధం గానీ, వైశ్యదేవిక తంత్రంగానీ భక్తితో చెయ్యాలి. దేవస్థానంలో ఇద్దరిని

కానీ, ఒక విప్రునికానీ తూర్పుముఖంగా (కూర్చోబెట్టి), భోజనం పెట్టాలి. పితృపితామహ స్థానీయులను ఉత్తరముఖంగా (కూర్చోబెట్టి) భోజనం పెట్టాలి. ఇద్దరికీ కొందరు ద్విజులు వేరుగా శ్రాద్ధం పెట్టాలని చెపుతారు. ఒక చోట ఒకే వంటతోనే అని మరికొందరు మహర్షులు చెపుతారు. ఆసనం నిమిత్తం దర్భలిచ్చి అర్ఘవిధానం ప్రకారం చక్కగా పూజించి, ప్రాజ్ఞుడు వారి ఆనుజ్ఞతో దేవతలను ఆవాహనం చెయ్యాలి. వారికి సుగంధ ధూపదీపాలను యథావిధిగా సమర్పించి యవోదకంతో దేవతలకు విధానవేత్త అర్ఘ్యమివ్వాలి.

పితరులకు అపసవ్యంగానే సర్వమూ నిర్వర్తించాలి. తరువాత అనుజ్ఞపొంది రెండుగా చేసిన దర్భలిచ్చి, మంత్రపూర్వకంగా జ్ఞాని పితరులకు ఆవాహనం చెయ్యాలి. బుధుడు నువ్వుల నీళ్ళతో అపసవ్యంగా ఆర్ఘ్యాదికం ఇవ్వాలి. ఆ సమయంలో ద్విజుడు బాటసారి అయిన అతిథి అన్నం కోరివస్తే, బ్రాహ్మణుల అనుమతితో అతనిని కూడా బాగా పూజించాలి. నరులకు ఉపకారులైన యోగులు తమస్వరూపం తెలియ రాకుండా వివిధరూపాలతో పృథ్విపై తిరుగుతుంటారు. కనుక, శ్రాద్ధకాలంలో వచ్చిన అతిథిని జ్ఞాని చక్కగా పూజించాలి. ద్విజోత్తమా, అపూజితుడైన అతిథి శ్రాద్ధక్రియాఫలాన్ని పోగొడతాడు.

తరువాత పురుషశ్రేష్ఠా, వ్యంజనాలూ, కారమూ లేని అన్నం ఆ ద్విజుల అనుమతితో మూడుసార్లు అగ్నిలో హోమం చేయాలి. 'అగ్నయే కవ్యవాహనాయ స్వాహా' — కవ్యవాహనుడైన అగ్నికి హోమం చేస్తున్నాను, అని మొదటి ఆహుతి. 'సోమాయ పితృమతే స్వాహా' – పితరులుకల సోమునికి హోమం చేస్తున్నాను, అని తరువాత ఇవ్వాలి. 'వైవస్వతాయ స్వాహా' – వైవస్వతునికి (యమునికి) హోమం చేస్తున్నాను, అని ఆ వేరే మూడవదానిని ఇవ్వాలి. హోమం చేయగా మిగిలినది కొంచెం కొంచెం విప్రుల పాత్రలో ఉంచాలి. తరువాత రుచికరమైన మిక్కిలి ఇష్టమైన చక్కగా వండిన అన్నం పెట్టి, 'కావలసినంత భోజనం చేయండి' అని అకఠినంగా చెప్పాలి. అది వారుకూడా మౌనంగా సుముఖులై తదేక చిత్తంతో, సుఖంగా భోజనం చేయాలి. అతడు (శ్రాద్ధకర్త) కూడా త్వరపడకుండా, క్రోధంలేకుండా భక్తితో పెట్టాలి. రక్షోఘ్నమంత్రం పఠించటం, తిలలు భూమిపై చల్లడం, పితరులు, ఆ ద్విజోత్తములు నెయ్యి త్రాగేటట్లు చేయటం – ఇవిచేసి, ''విప్రదేహాలలో ఉన్న నా తండ్రీ, పితామహుడూ, ప్రపితామహుడడూ హోమముతో పుష్టి పొందిన మూర్తులతో నేడు తృప్తి చెందుదురుగాక. నేడు విప్రదేహాలో ఉన్న నా తండ్రీ,

పితామహుడూ, ప్రపితామహుడూ, తృప్తిని పొందుదురుగాక.; నేను భూమిమీద ఉంచిన పిండాలవల్ల నాతండ్రీ, పితామహుడూ, ప్రపితామహుడూ నేడు తృప్తిచెందుదురుగాక. నేను భక్తితో ఇది పలుకుతునాన్నను గనుక నాతండ్రీ, పితామహుడూ, ప్రపితామహుడూ తృప్తి చెందుదురు గాక. మాతామహుడు తృప్తిచెందాలి, అతని తండ్రి తృప్తిచెందాలి. అతని పితామహుడు తృప్తిచెందాలి. విశ్వదేవతలు పరమతృప్తిచెందాలి. యాతుధానులు (రాక్షసులు) నాశనం చెందాలి. యజ్ఞేశ్వరుడు, హవ్యసమస్తకవ్య భోక్త, అవ్యయాత్ముడు, హరి, ఈశ్వరుడు, ఇక్కడ తృప్తిచెందాలి. అతని సన్నిధానం వల్ల అశేషరాక్షసులూ, సర్వాసురులూ తక్షణం తొలగిపోవాలి' అని పఠించాలి.

రక్షోఘ్నమంత్రం = **''ఓం అపహతాః అసురా రక్షాగ్ంసి వేదిషదః''** మొదలైనది.

ఆ విప్రులు తృప్తిచెందిన తరువాత భూతలం మీద అన్నం చల్లాలి. వారికి ఒక్కొక్కసారి ఆచమనం కోసం నీళ్ళు పొయ్యాలి. సర్వాన్నంతో మిక్కిలి తృప్తులైన వారి అనుజ్ఞపొంది నేల మీదనుంచి ఏకాగ్రచిత్తంతో నీటితో పిండాలను తీసుకొని (పితరులకు సమర్పించాలి). మాతామహులకుకూడా పితృతీర్థంతో నీటినీ, దానితోనే (పితృతీర్థంతోనే) జలాంజలినీ ఇవ్వాలి. దక్షిణాగ్రాలుగా ఉంచినదర్భలపై తీర్థంతో పిండాలనుంచి పుష్పధూపాదులతో పూజించాలి. తనతండ్రికి మొదటిపిండం ఉచ్ఛిష్టం దగ్గరనే వెయ్యాలి. తాతకు మరొకటీ, అతనితండ్రికి ఇంకొకటీ (వెయ్యాలి) దర్భ మొదళ్ళ లేపభోక్తలైనవారికి లేపం రాచి, వేసి, సంతృప్తి కలిగించాలి.

అలాగే, మాతామహ పిండంమీద గంధమాల్యాది సహితముగా పూజించి, జ్ఞాని ద్విజోత్తములకు ఆచమనం ఇవ్వాలి. భక్తితో, తద్గతచిత్తంతో ద్విజోత్తమా, యథాశక్తితో 'సుస్వధా' మొదలైనవి ఆశీస్సులు పలికి, పొంది మొదట పితరులకు దక్షిణ ఇవ్వాలి.

పితృతీర్థం = చూపుడు వ్రేలికీ బొటనవ్రేలికీ మధ్యభాగం. లేపభోక్తలు = (ప్రపితామహునిపైవారు) నాలుగవవారు మొదలైనవారు. తండ్రి మొదలైనవారు పిండ భాక్కులు. లేపభాక్కులు నాలుగవ వారు మొదలైనవారు అని స్మృతి :

శ్లో: లేపభాజశ్చతుర్థాద్యాః పిత్రాద్యాః పిండభాగినః - శ్రీ.విష్ణు. 3-15-41

వారికి దక్షిణ ఇచ్చి, విశ్వదేవతలకు సంబంధించినవి పలకాలి. 'విశ్వదేవతలు(మొదట విశ్వదేవతలకూ, తరువాత పితృదేవతలకూ, తరువాత

మాతామహులకూ) సంతుష్టులగుదురుగాక' అని అతడు పలకాలి. వారు 'అలాగే' అన్నతరువాత ఆ విప్రులను ఆశీస్సులు ఇమ్మని ప్రార్థించాలి. మహామతీ, అలాగే ముందు పితృదేవతలనూ, తరువాత దేవతలనూ సాగనంపాలి. మాతామహులకు కూడా దేవతలతోపాటు క్రమంగా ఇలాగే చేయాలి, భోజన విషయంలోనూ తన శక్తిని బట్టి, దానం విషయంలోనూ చేయాలి. కాళ్ళు కడుక్కోవడానికి ముందునుంచీ ద్విజులకు ఇలా చేయాలి. జ్ఞాని అయిన పితృస్థానీయుడైన బ్రాహ్మణునిముందూ, తరువాత మాతమహ స్థానీయునీ, అనంతరం అర్థులనూ సమ్మానించి,ఇంపైన మాటలతో సాగనంపాలి. ద్వారం వరకూ వెనుకనేవెళ్లి వారి అనుమతితో మరలాలి. అనంతరం వైశ్వదేవమనే నిత్యక్రియ ఆచరించాలి. భృత్యులనూ, బంధువులనూ ఆదరించి తనతోపాటు భోజనం పెట్టాలి. ఇలా జ్ఞాని పైతృకమూ, మాతామహ సంబంధమూ అయిన శ్రాద్ధం పెట్టాలి. శ్రాద్ధాల వల్ల సంతుష్టులైన పితామహులు, సర్వవాంఛలూ తీరుస్తారు.

★★★

శ్రాద్ధంలో దౌహిత్రుడు, కుతపం, తిలలు, – ఈ మూడూ పవిత్రమైనవి. రజతం యొక్క దానమూ, సందర్శనాదికమూ అట్టివే. దౌహిత్రుడు = దుహిత అంటే కుమార్తె, ఆమె కొడుకు. దీనికి మూలం 'దౌహిత్రః' అని. దీనికి 'దౌహిత్రం' అనే పాఠాంతరం ఉన్నదనీ, దానికి ఒక రకమైన నెయ్యి అని అర్థమనీ చెప్పి, ఆ నేతిని ఇలా వివరించాయి – శ్రీ., వై.సోముడు (చంద్రుడు) అమావాస్యాగతుడై గడ్డి మేసినావుకు దుహిత అని పేరు. దానినేతిని దౌహిత్రం అంటారు అనే భావంగల క్రింది శ్లోకం పద్మపురాణంలో ఉన్నది.

శ్లో: అమావాస్యాగతే సోమే యా చ ఖాదతి గౌస్తృణం|

దుహితా నామ సా తస్యా ఘృతం దౌహిత్రముచ్చతే ||

మరొక పక్షంకూడా ఉన్నది: ఖడ్గలలాటం (అగ్రభాగం?) నుంచి కలిగినది దౌహిత్రం ఆ ఖడ్గమున్న పాత్ర దౌహిత్రమనబడుతున్నది.

శ్లో|| దౌహిత్రః ప్రోచ్చతే ఖడ్గలలాటాద్యశ్చ జాయతే|

తస్య ఖడ్గస్య యత్పాత్రం తద్దౌహిత్రముదాహృతమ్|| శ్రీ.

కుతపం = ఎనిమిదవ ముహూర్తం కుతపకాలం –శ్రీ. పగటిలో ఎనిమిదివ ముహూర్తం – వి. ముహూర్తం అంటే నలభైఎనిమిది ఇంగ్లీషునిమిషాలకాలం కనుక, సూర్యోదయం

నుంచి లెక్కగడితే, ఐదుగంటల ముప్పై నాలుగు నిమిషాల తరువాత నుంచి ప్రారంభమైన నలభైఎనిమిది నిమిషాలకాలం కుతపకాలం అన్నమాట. కుతపం అంటే ఇలా కాలవిశేషమే కాక, ఇతర కుతపాలూ ఉన్నాయి : 1) మధ్యాహ్నం, 2) ఖడ్గపాత్ర, 3,4) మేక –గొఱ్ఱె – ఉన్నికంబళ్ళ యొక్కా వెండి యొక్కా దానం, 5) దర్భలు, 6) తిలలు, 7) గోవులు, 8) దౌహిత్రుడు. శ్రాద్ధంపెట్టేవాడు క్రోధమూ, మార్గప్రయాణమూ, తొందరా – మూడూ నిస్సంశయంగా విడిచిపెట్టాలి. విప్రోత్తమా, శ్రాద్ధభోక్తకూ ఈ మూడూ విడువదగినవే. ఇందులో సందేహం లేదు. ద్విజా, శ్రాద్ధం పెట్టిన పురుషునిపట్ల విశ్వదేవతలూ, పితరులూ, మాతామహులూ సమస్తకులమూ సంతుష్టులౌతారు. పితృగణం సోమునిపై ఆధారపడి ఉన్నది. చంద్రుడూ, యోగంపై ఆధారపడి ఉన్నాడు. కనుకనే యోగి ని భోక్తగా నియోగించిన శ్రాద్ధం ప్రశస్తమైనది విప్రోత్తమా. పాపాన్ని కుత్సితమంటారు. దానిని ఈ ఎనిమిదీ సంతసింపజేస్తాయి.= కాలుస్తాయి. కనుక, ఇవి కుతపములైనాయి.

శ్లో॥ మధ్యాహ్నః ఖడ్గపాత్రంచ దానం చాజోవికంబళాః।

రూప్యం దర్భాస్తిలా గావో దౌహిత్రశ్చాష్టమః స్మృతః॥

పాపం కుత్సితమిత్యాహు స్తస్య సంతాపకారిణః।

అష్టావేతే యతస్తస్మాత్కుతపా ఇతి విశ్రుతాః॥

అధికారి పితృదేవతలు అగ్నిష్వాత్తాదులు వసురుద్రాదిత్యస్వరూపులున్నారు. వారు మనం భోక్తులుగా పిలిచిన విప్రులను ఆవేశించి, వానినోటి ద్వారా శ్రాద్ధం భుజించి, సంతృప్తులయి, నిత్యమూ, తమయోగశక్తి ద్వారా పుష్టినందిన సోమనిద్వారా మనవంటి వారి పితృదేవతలకు, ఆయా లోకాలో ఉన్నవారికి తృప్తి కలిగిస్తారు. శ్రాద్ధ కర్తలయిన మనవంటివారి కోరికలుతీర్చి, వృద్ధి పొందిస్తారు. ఆ అధికారి పితృగణమూ, వారిరూపైన నిమంత్రిత బ్రాహ్మణగణమూ, యోగబలంతో సోమునికి పుష్టిని కలిగిస్తారు. సోముడు మనవంటివారి పితరులకు ఆధారమైనవాడూ, పోషకుడూను. కనుక యోగబలం కలిగినవారు నిమంత్రితులైతే మంచిది. యోగులు తమదేహంలో ఉన్న సోమునికి యోగ బలం వల్ల పుష్టికలిగించటం ప్రసిద్ధం కనుక.

ఈ చెప్పిన విషయాలు హరివంశంలో భీష్మునితో శంతనుడు చెప్పిన క్రిందమాటలలో విశదంగా ఉన్నాయి: ''నాయనా, దివిలో ఉన్న పితృదేవతలు ఆదిదేవుడైన

బ్రహ్మసుతులు. మహాభాగా, అప్రమత్తుడవై పితృశ్రాద్ధంతో వారిని యజించు. నామగోత్రాదులు కీర్తించి నీవు వారినారాధిస్తే, వారు సర్వవాంఛితాలనూ తీర్చి, శ్రేయస్సు సమకూరుస్తారు. నామగోత్రాలు పేర్కొంటూ మూడు పిండములు దానంచేస్తే, భారతా, వారు మనవంటివారికి, స్వర్గంలో ఉన్న మన పితరులకూ పుష్టి కలిగిస్తారు. వారందరూ నిరంతరమూ శ్రాద్ధ దానం వల్ల పూజితులయినందున ఈ కర్మలాచరించే మనవంటి వారినందరినీ, మనపితృపితామహులనూ వర్థిల్లజేస్తారు.''అని.

శ్లో|| ఆది దేవసుతాస్తోత పితరో దివి దేవతాః |

తాన్ యజస్వ మహాభాగ పితృశ్రాద్ధైరతంద్రితః||

తేహి శ్రేయో విధాస్యంతి సర్వకామఫలప్రదాః |

త్వయూవారాధ్యమానాస్తే నామగోత్రాదికీర్తనైః||

ఆస్మానాప్యాయయిష్యన్తి స్వర్గస్థానపి భారత |

శ్రాద్ధేషు యే ప్రదాస్యన్తి త్రీన్ పిండాన్ నామగోత్రతః||

సర్వే ప్రవర్తమానాన్ స్వాన్ పితృనాథ పితామహాన్ |

భావయిష్యన్తి సతతం శ్రాద్ధే దానేన పూజితాః ||

విప్రులు వెయ్యిమందయినా, యోగి ముందుంటే సర్వభోక్తలనూ, యాజమానునీ కూడా తరింపజేస్తాడు ద్విజా. ద్విజత్తమా, పూర్వకల్పంలో దీనిని నాకు సనత్కుమారుడూ, దేవతలకు వాయువూ, శంభుడు ఋషులకూ చెప్పారు. శక్తిపుత్రుడు (పరాశరుడు) మైత్రేయనామధేయునికి చెపుతాడు. ఈ క్రమంలో నేను నీకు చెప్పాను ద్విజా. ఈ పైతృకక్రియ సర్వపురాణాలలోనూ సామాన్యమైనది. (అన్ని పురాణాలలోనూ సమానంగా ఉన్నది.) ఈ కర్మకాండ క్రమంగా తెలుసుకొంటే బంధ విముక్తుడౌతాడు. దీనినాశ్రయించి శంసితవ్రతులైన ఋషులు నిర్వాణం పొందారు. గౌరముఖా, నీవుకూడా వెంటనే దీనియందు ఆసక్తికలవాడవు కా. ద్విజసత్తమా, భక్తితో అడిగావు గనక నీకిలా చెప్పాను. ఎవడు పితృదేవతలను యజించి హరిని ధ్యానిస్తాడో, అతనికి అంతకంటే ఎక్కువ ఏమున్నది? పితృతంత్రాన్ని మించిన (ఆరాధనా) తంత్రం లేదని నిశ్చయం. (14)

15 వ అధ్యాయం - గౌరముఖుని పూర్వజన్మ, ముక్తి

ధరణి ''దేవా, విభూ, ఇలా మార్కండేయుని వల్ల ఆ మహాముని గౌరముఖుడు శ్రాద్ధవిధి వినినతరువాత ఏమి చేశాడు?'' అని అడిగింది. శ్రీవరాహస్వామి ఇలా చెప్పారు. ధాత్రీ, మహామునీ ధీశాలి అయిన మార్కండేయుని వల్ల ఈ పితృతంత్రం వినిన తరువాత అతని వల్లనే అతని అనేకజన్మలు జ్ఞాపకానికొచ్చాయి.(అని చెప్పగావిని) ధరణి ''భగవానుడా, ఇతరజన్మలో ఈ గౌరముఖుడెవరు? అతనికి ఏమి జ్ఞప్తికి వచ్చింది? అతడెలా జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు? ఆ సజ్జనోత్తముడు జ్ఞప్తికి తెచ్చుకొని ఏమి చేశాడు?'' అనడిగింది. శ్రీవరాహులు ఇలా చెప్పారు. ఇతర బ్రహ్మజన్మలో అతడు సాక్షాత్తూ భృగుడు. అతని వంశంలో జన్మించిన పుత్రుడు మార్కండేయమహాముని. ''మీరు పుత్రువల్ల బోధితులై సుగతిని పొందండి'' అని పూర్వం బ్రహ్మ చెప్పాడు. అందుచేత మార్కండేయుని చేత బోధితుడై, సర్వజన్మలనూ జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. జ్ఞప్తికి తెచ్చుకొని, ఏమి చేశాడో అది విను వరారోహా, సంగ్రహంగా చెపుతాను. ఇలా శ్రాద్ధవిధానంతో అనంతరం పండ్రెండు సంవత్సరాలు పితరులను యజించి, ఆ ముని తరువాత హరిని స్తుతించటానికి ప్రారంభించాడు. త్రిలోకవిశ్రుతమైన ప్రభాసతీర్థమున్నదే, అందులో దైత్యాంతక దేవునిస్తోత్రం చేయటానికి గౌరముఖుడు నిలిచాడు.

గౌరముఖకృతప్రధాన దైత్యహరస్తుతి

గౌరముఖ ఉవాచ :

స్తోష్యే మహేన్ద్రం రిపుదర్పహం శివం నారాయణ బ్రహ్మవిదాం ప్రతిష్ఠితమ్ |

ఆదిత్యచన్ద్రాశ్వియుగస్థమాద్యం పురాతనం దైత్యహరం సదా హరిమ్ ||

చకార మాత్స్యం వద్రేవాత్మనో యః పురాకృతం వేదవినాశకాలే |

మహామహీధృగ్వపురగ్రపుచ్ఛ – చ్ఛటాహవార్చిః సురశత్రుహాద్యః ||

తథాబ్ధిమన్థానకృతే గిరీన్ద్రం దధార యః కౌర్మవపుః పురాణమ్

హితేచ్ఛయా యః పురుషః పురాణః ప్రపాతు మాం దైత్యహరః సురేశః ||

మహావరాహః సతతం పృధివ్యాన్ తలాత్తలం ప్రావిశద్ యో మహాత్మా|

యజ్ఞాంగసంజ్ఞః సురసిద్ధసంధ్యః న పాతు మాం దైత్యహనః పురాణః ||

నృసింహరూపీ చ భవత్యజస్రం యుగే యుగే యోగివరోగ్రభీమః |

కరాలవక్త్రః కనకాగ్రవర్చా రత్నాశయోస్మానసురాన్తకోవ్యాత్ ||

బలేర్మఖధ్వంస కృతే మహాత్మా స్వాం గూఢతాం యోగవపుః స్వరూపః |

స దణ్డకాష్ఠాజినలక్షణః పునః క్షితం చ పదా క్రాన్తవాన్ యః స పాతు ||

త్రిఃసప్తకృత్వో జగతీం జిగాయ జిత్వా దదౌ కశ్యపాయ ప్రచణ్డః |

స జామదగ్న్యోభిజనస్యగోప్తా హిరణ్యగర్భోమరహా ప్రపాతు ||

చతుః ప్రకారం చ వపుర్య ఆద్యం హైరణ్యగర్భ ప్రతిమానలక్ష్యమ్ |

రామాదిరూపైర్బహురూపభేద శ్చకార సోస్మానసురాన్తకోవ్యాత్ ||

చాణూరకం సాసురదర్పభీతే -ర్భీతామరాణామభయాయ దేవః |

యుగేయుగే వాసుదేవో బభూవ కల్పే భవత్యద్భుతరూపకారీ |

యుగే యుగే కల్కినామ్నా మహాత్మా వర్ణస్థితిం కర్తుమనేకమూర్తిః ||

సనాతనో బ్రహ్మమయః పురాణో న యస్య రూపం సురసిద్ధదైత్యాః |

పశ్యన్తి విజ్ఞానగతిం విహాయ అథోప్యనేకాని సమర్చయన్తి |

మత్స్యాదిరూపాణి చరణి సోవ్యాత్ ||

నమో నమస్తే పురుషోత్తమాయ పునశ్చ భూయోపి నమో నమస్తే |

నమః పురస్తాదథ పృష్ఠతస్తే నయస్వ మాం ముక్తిపదం నమస్తే | (15.8 – 21)

భావం: మహేంద్రునీ, రిపుదర్పనాశకుడైన శివునీ, బ్రహ్మవేత్తలలో ఉన్న నారాయణునీ, ఆదిత్యుడు, చంద్రుడు, ఉభయాశ్వినీ దేవతలు, వీరిలో ఉన్న పురాతనుడైన దైత్యహరుడైన హరిని సదా స్తుతిస్తున్నాను. అతడు వేదాలు నశించిన (దొంగిలింపబడిన) కాలంలో తన పురాతనమైన మత్స్యశరీరాన్ని ధరించాడు. ఆ శరీరం మహామహీధరంలా ఉన్నది. అగ్ర భాగంతోనూ, తోకతోనూ, చేసినయద్ధం కాంతులు వెదజల్లింది. ఆ ఆద్యుడు రాక్షస సంహారకుడు. అలాగే, కడలి తరవటంకోసం అతడు (లోక) హితం కోరి పురాతన కూర్మరూపంతో గిరిరాజును మోశాడు. ఆ పురాణపురుషుడు, సురేశుడు, దైత్యహరుడు నన్ను రక్షించుగాక. అతడు మహావరాహమై పృథివియొక్క (అధోభాగమైన) తలాతలం

ప్రవేశించాడు. ఆమహాత్ముడు సురసిద్ధ వంద్యుడు, యజ్ఞ శరీరుడు. ఆ పురాణ దైత్యహరుడు నన్ను పాలించుగాక. అతడు ప్రతియుగంలోనూ యోగివరుడు, ఉగ్రుడు, భయంకరుడు, భీకరముఖుడు, సువర్ణాగ్ర తేజుడు, ఉత్తమాశయుడు అయిన నరసింహునిరూపం వహిస్తాడు. ఆ అసురాంతకుడు మమ్మల్ని కాపాడు గాక. అతను అప్రమేయుడు, యోగాత్మకుడు, యోగశరీరస్వరూపుడు, బలిమఖధ్వంసంకోసం గూఢంగా దండకాష్ఠమూ, అజినమూ (లేడిచర్మం) తాల్చినవాడు. భూమిని ఒక్కఅడుగుతో ఆక్రమించినవాడు. ఆ మహాస్వరూపుడు మమ్మల్ని పరిపాలించు గాక. ముయ్యేడుమార్లు జగత్తును జయించి కశ్యపునికిచ్చిన ప్రచండుడు, ఆ జమదగ్ని కుమారుడు, కులరక్షకుడు, హిరణ్యగర్భుడు, అసురహంత రక్షించుగాక. రాముడు మొదలైన హిరణ్యగర్భసంతతి సమానంగా కనిపించే నాలుగువిధాలైన రామాదిరూపాలతో బహురూపభేదం చేసిన ఆ అసురాంతకుడు మమ్మల్ని కాపాడుగాక. కల్పంలో ప్రతియుగంలోనూ చాణూరుడు, కంసుడు, మొదలైన అసురుల గర్వానికి జడిసిన అమరులకు అభయంకోసం, వాసుదేవుడయ్యే అద్భుత రూపకారి అయిన దేవుడు మమ్మల్ని రక్షించటానికై ఉన్నాడు. ప్రతియుగంలోనూ కల్కి అనేపేరుతో ఆ మహాత్ముడు వర్ణాలను నిలపటానికి అనేక రూపాలను ధరిస్తాడు. అతడు సనాతన బ్రహ్మస్వరూపుడు. పురాతనుడు. అతని రూపాన్ని సురసిద్ధదైత్యులు విజ్ఞానగతి విడిచి కానలేరు. కనుక నియమంతో మత్స్యాదిచరరూపాలను సమర్చిస్తుంటారు. అతడు రక్షించుగాక. పురుషోత్తముడవైన నీకు నమస్కారం, నమోవాకం, నీకు మళ్ళీ మళ్ళీ నమో వచనం. నమస్య. నీకు ముందూ వెనుకా నతి. నన్ను ముక్తి స్థానానికి చేర్చు నీకు వందనం.

అని నమస్కరిస్తున్న భావితాత్ముడైన ఆ మహర్షికి చక్రగదాధరదేవుడు స్వయంగా ప్రత్యక్షమైనాడు. అతనిని చూచి, స్థిరమైన ఆత్మజ్ఞానం పొంది, అతని ఆత్మ పరతత్త్వంలో లయమై, అపునర్భవం అనే శాశ్వతబ్రహ్మంలో లీనమైనాడు. (15)

16 వ అధ్యాయం – గోమేధ యజ్ఞము, సరమ కథ

ధరణి ''భూధరా, అపుడు దుర్వాసుని చేత 'మూఢుడా, సుప్రతీకుని కుమారుడు స్వర్గం నుంచి తొలగించగా నీవు మనుష్యలో నివసిస్తావు' అని శపింపబడిన శతక్రతుడు, దేవేంద్రుడు సర్వదేవతలతో కలిసి, మానవలోకానికి వచ్చి, ఏమి చేశాడు? ఆ దుర్జయుడు భగవానుడైన పరమేష్ఠి చేత పడగొట్టబడిన తరువాత యోగవేత్తలో ఉత్తములైన విద్యుత్తు,

సువిద్యుత్తు అనే వారిద్దురూ స్వర్గంలో అపుడేమి చేశారు? దేవా, అనుగ్రహంతో ఈ నా సంశయం చెప్పు'' అని అడిగింది.

శ్రీవరాహులు ఇలా చెప్పారు. ధాత్రీ, దుర్జయునిచేత ఓడిపోయిన తరువాత శతక్రతుడు దేవేంద్రుడు భారతవర్షంలో వారాణసిలో తూర్పువైపున దేవతలు, యక్షులు, మహోరగులు – వీరితో పాటు ఉన్నాడు. కళ్యాణీ, అప్పుడు విద్యుత్తూ, సువిద్యుత్తూ యోగ మవలంబించి వాయుకర్మయోగంతో దీర్ఘతాపజ్వరాన్ని అవలంబించి యోగ మాయతో లోకపాలకృత్యమంతా ఆచరించారు. ఆ దుర్జయుడు మరణించాడని విని, ఎల్లప్పుడూ సముద్రం లోపల ఉండే చతురంగబలాన్నీ తీసుకొనివచ్చి దేవతలమీదికి వెళ్ళారు. ఆ దైత్యులిద్దరూ మహాసైన్యంతో వచ్చి హిమపర్వతం మీద విడిసి ఉన్నారు. దేవతలు కూడా మహాసైన్యాన్ని సమీకరించి, ఆయుధాలు ధరించి, కలతపడకుండా ఇంద్రపదవికోసం ఆలోచనచేశారు. అక్కడ దేవగురువు ఆంగిరసముని, (బృహస్పతి) ''ముందు గోమేధంతో యజించండి. అనంతరం అన్ని క్రతువులతోనూ యజించండి ఇది స్థితి. అమరులారా, నేనుపదేశం చేశాను. మీరు దీనిని శీఘ్రంగా ఆచరించండి'' అని చెప్పాడు. ఇలా చెప్పిన తరువాత గోవులనూ, పశువులనూ ఏర్పరచుకొని వాటిని తిరగటానికి వదిలారు. వాటిరక్షణకు సరమనిచ్చారు. ఆ గోవు దేవశుని రక్షణలో ఉండి తిరుగుతూ, ఆ అసురులున్న చోటికి వెళ్ళాయి ధరాధరా. వారు ఆ గోవులను చూచి, పురోహితుడైన శుక్రునితో ''బ్రహ్మన్, దేవా, చూడు నీవు. దేవశుని సరమ కాపలాకాస్తూ దేవ గోవులను త్రిప్పుతున్నది. చెప్పు ఏమి చేయాలో ఇప్పుడు'' అన్నారు. అలా చెప్పేసరికి శుక్రుడు ఆ అసురులతో ''ఈగోవులను అపహరించండి వెంటనే, అసురులారా, ఆలస్యం చేయకండి'' అనిచెప్పాడు. ఇలాచెప్పేసరికి దైత్యులు దైవికంగా (చేరిన) ఆ గోవులను అపహరించారు. వాటిని అపహరించేసరికి, సరమ దారివెతుకుకోంటూ దితి కొడుకు తీసికొనిపోయిన గోవును చూచింది ధరాధరా. దైత్యులు కూడా విశేషించి దారికనుక్కొన్న ఆ శునిని చూచారు. వారు ఆ సరమను చూచి సామపూర్వకంగా ఒకమాట ''కళ్యాణీ, సరమా, ఈ గోవు పాలు పితికి (నీకిస్తాము) త్రాగు'' అని చెప్పి తెలివిగా దానికి ఇచ్చారు. ఆ దైత్యనాయకులు దానికి పాలు పోసి, ''కళ్యాణీ, దేవేంద్రునికి ఈ గోవు గురించి చెప్పకు'' అన్నారు. అలా పలికిన తరువాత దైత్యులు ఆ శునిని అడవిలో విడిచిపెట్టారు. వారు

విడువగానే అది వణుకుతూ వెంటనే సురలవద్దకు వెళ్ళింది. సరమ సురసత్తముడైన దేవేంద్రునికి నమస్కరించింది. దేవేంద్రుడు మరుత్తులనే దేవతలను ''మహాబలశాలులారా, మీరా దేవశునిరక్షణకోసం కనపడకుండా వెళ్ళండి'' అని పంపి ఉన్నాడు. అతడు అలా చెప్పగానే వారు తెలివిగా సూక్ష్మరూపంతో వెళ్ళారు. ధరాధరా, వారుకూడా వచ్చి, సురేంద్రునికి నమస్కరించారు.

ఆమెను (చూచి) దేవరాజు ''సరమా, ఆవులేమయ్యాయి?'' అని అడిగాడు. ఇలా అడిగేసరికి ఆ సరమ ''నేనెరుగను'' అన్నది. ఆపైని ఇంద్రుడు రోషంతో ''యజ్ఞంకోసం ఏర్పరచిన ఆ గోవులు ఎక్కడ ఉన్నాయి? దేవశుని ఇలా అంటున్నదేమిటి?'' అని మరుత్తులను అడిగాడు. ఇలా దేవేంద్రుడు అడిగేసరికి మరుత్తులు కలవరపడకుండా ఆ సరమ చేసినపని చెప్పారు ధరాధరా. అనంతరం ఇంద్రుడు లేచి, ఆ శునిని కాలితో తన్నాడు. దేవేంద్రుడు పాకశాసనుడు మహాక్రోధావిష్టుడై ''ఓసి మూఢులారా, నీవు పాలు త్రాగావు. గోవులనేమో అసురులు అపహరించారు'' అన్నాడు. ధరా, ఇలా దేవేంద్రుడు పలికి సరమను కాలితో తన్నేసరికి ఇంద్రుని కాలితాపువల్ల దానినోటినుంచి పాలుకారటం ప్రారంభించాయి. ఆ శుని పాలు కారుతుండగా ఆ గోవున్న చోటికి వెళ్ళింది. ధరా, అపుడు దేవేంద్రుడు సైన్యంతో సహా అక్కడికి వెళ్ళాడు. దైత్యులు అపహరించిన ఆగోవును చూచాడు అక్కడ. ఆ గోవును కాపలాకాస్తున్న దైత్యులు చాలా బలమయిన వాళ్ళు. (అయినా) ఆ సైన్యాలు కొట్టేటప్పటికి వెంటనే గోవును స్వరూపాలతో విడిచిపెట్టారు. తరువాత సురేంద్రుడు, మహేంద్రుడు పరమానందభరితులైన సామంతులతో ఆ గోవును పొంది, పరమ సంతోషంతో సమర్థుడు కనుక వేలకొదీ, వివిధ యజ్ఞాలు చేశాడు. యజ్ఞాలు చేస్తూ ఉంటే ఆ ఇంద్రుని బలం పెరిగింది. ఇంద్రుడు పెరిగిన బలంతో దేవ సైన్యంతో "సురలారా శీఘ్రమే దైత్యవధకు సన్నద్ధులు కావాలి" అన్నాడు. అలా అనేసరికి దేవతలు తక్షణమే సన్నద్ధులయ్యారు. దేవతలు వాసవునితో (ఇంద్రునితో) పాటు అసురులు లేకుండా చేయటానికి వెళ్ళారు. వెళ్ళి, వేగంగా పోరాడి అసురసైన్యాన్ని జయించారు. ధరాధరా, దేవతలచేతిలో అసురులు ఓడిపోయారు. హతశేషులు భయభీతులై మనసు బేలుపడి సాగర జలంలో మునిగిపోయారు. ధరా, దేవేంద్రుడు లోకపాలురతో పాటు స్వర్గం అధిరోహించి, మునుపటిలానే దేవతలకు ప్రభువై, సమర్థుడై, ప్రకాశిస్తూ (భోగాలు) అనుభవించాడు.

సరమాఖ్యాన ఫల్రశుతి : ఎవడు ఉత్తమైన ఈ సరమాఖ్యానం నిత్యమూ వింటాడో, ఆ మానవుడు గోమేధయజ్ఞ ఫలం పొందుతాడు. రాజ్యం కోల్పోయిన రాజు దీనిని ఏకాగ్రచిత్తంతో వింటే, దేవేంద్రుని స్వర్గరాజ్యంలా, తన రాజ్యం పొందుతాడు. (16)

17 వ అధ్యాయం - మణిసంభవుల తరువాత కథలు

ధరణి ''దేవా, అప్పుడు త్రేతాయుగంలో మణినుంచి జన్మించిన నరోత్తములకు భగవానుడు వారు రాజులౌతారని వరమిచ్చాడు గదా, వారెలా జన్మించారో, ఏ పనులు చేశారో, వారి పేర్లేమిటో, విడిగా చెప్పు నాకు'' అని అడిగింది. శ్రీవరాహులు సుప్రభుని కథను ఇలా చెప్పారు. మహామనస్వి సుప్రభుడనే మణిజుడు రాజయినాడు. వరారోహా, భూతధారిణీ, అతని ఉత్పత్తిని గురించి నీవు విను. పూర్వం తొలికృతయుగంలో మహా బాహువైన ఒక రాజుండేవాడు. అతడు మిక్కిలి బలమైనవాడు ముల్లోకాలలోనూ శ్రుతకీర్తి అని ప్రఖ్యాతుడైనాడు. ధరా, సుప్రభుడనే మణిజుడు అతనికి పుత్రుడైనాడు. ప్రజాపాలుడనే పేరుతో మహాబలశాలి అయికీర్తి గడించాడు. అతడొకనాడు క్రూరమృగాలున్న అరణ్యానికి వెళ్ళాడు. అక్కడ ఒక ఋషి యొక్క ధన్యమైన గొప్ప ఆశ్రమ మండలం చూశాడు. అందులో మహాతపుడనే పరమధార్మికుడైన ఋషి సనాతన బ్రహ్మజపం చేస్తూ, నిరాహారుడై, తపస్సుచేశాడు. ఈ శ్రీమాత్ పార్థివుడు ప్రజాపాలరాజు ఆ మహాతపుని ఆశ్రమంలోనికి వెళ్ళానుకొని ప్రవేశించాడు. ఆ ఉత్తమమైన ఆశ్రమస్థానంలో వనవృక్షాలు భూమినుంచి పెరిగి, దారికి అటూఇటూ ఉన్నాయి. పొదరిళ్ళు పూలతో చంద్రునిలా సూర్యునిలా ప్రకాశిస్తున్నాయి. అక్కడికి వెళ్ళిన తుమ్మెదకు మకరందం లభిస్తున్నందున శ్రమ తెలియటం లేదు. ఉత్తమదేవతాంగనలు ఉన్నతమైన స్వర్గస్థానం కూడా విడిచి, చక్కగా ఎర్రనైన పద్మం లోపలిభాగంలా కోమలాలైనగోళ్ళ కొనలుగల వ్రేళ్ళుచాచి, వాటిపువ్వులు కోస్తుంటారు.

ఒకచోట మిక్కిలిసంతోషంతో ఉన్న రకరకాల పక్షులూ, మదించిన తుమ్మెదలూ బిగ్గరగా కూస్తూ, ఎత్తైన రకరకాల చక్కని పూలుగల బాగా కలిసిఉన్న కొమ్మమీద వ్రాలి ఉన్నాయి. కడిమి, మంకెన, మద్ది, శీల, సాలాది మహావృక్షాలమీది గూళ్ళలో ఉన్న పక్షులు మధురస్వరంలో కలవరపాటు లేకుండా స్వకార్యతత్పరులైన సుజనుల ప్రయోగాలలా ఉంటున్నాయి. గృహస్థులైన ద్విజుల హోమాగ్నిధూమాలు ప్రజ్వరిల్లిన అగ్నిలోని హోమ జ్వాలతో వాడికోరలూ జూలూ కలిగి, మదించిన సింహాల వల్ల అధర్మమనే ఏనుగు

చీల్చబడినట్టు ఉన్నాయి. ఇలా ఆరాజు ఆ ఉత్తమాశ్రమంలో వివిధవిషయాలు చూస్తూ ప్రవేశించాడు. అతడు ప్రవేశించేసరికి తీవ్రతేజస్వి, పుణ్యకర్తలతో ముఖ్యుడు, బ్రహ్మవేత్తలతో శ్రేష్ఠుడు, మహాతపుడు దర్భాసనం మీద అనంత కిరణాలుకల భానునిలా కనిపించాడు. విజేత అయిన రాజు, ముని సాంగత్యం వల్ల అతడు మృగాల ఆలోచన మరచిపోయాడు. సర్వోత్తముడయిన ఆ ముని లభించేసరికి ఆ నృపతి మనస్సు ధర్మంపైకి పోయింది. ఆ ముని నిష్కల్మషుడైన ఆ ప్రజాపాలనరపతిని చూచి, ఆసనస్వాగతాదులతో అతిథి సత్కారం చేశాడు. వసుధా, అనంతరం రాజు కూర్చుని, ఋషిపుంగవునికి నమస్కరించి, ''భగవానుడా, ఉత్తమవ్రతా, దుఃఖసంసారంలో మునిగి, తరింపగోరే నరులకు కర్తవ్య మేమిటో నమస్కరించిననాకు చెప్పు'' అని పరమదుర్లభమైన ఈ ప్రశ్న అడిగాడు. మహాతపుడు ''సంసారసాగరంలో మునుగుతున్న మనుష్యులు స్థిరమైన, మిక్కిలి శాశ్వతమైన నావ ఏర్పరచుకోవాలి. పూజలూ, హోమాలూ, దానవిధానాలూ, యజ్ఞాలు, ధ్యానాలూ మేకులుగా, సురభటులు ప్రాణాదులనే పెద్దత్రాళ్ళు మోక్షానికి కట్టి దానిని పైకిలాగాలి. నరపతీ, ఇప్పుడు త్రిలోకేశ్వరుని ఓడగా చేసుకో. ''రాజరాజా, నరకహరుడు, సురేశ్వరుడు అయిన నారాయణునికి ఎవడు భక్తితో నమస్కరిస్తాడో, అతడు శోకరహితుడై, శోకరహితమైన, నాశరహితమైన విష్ణుపరమపదం పొందుతాడు.'' అని చెప్పాడు. రాజు ''భగవానుడా, సర్వధర్మజ్ఞా, ముముక్షువులైన పురుషులు సనాతనుడైన విష్ణువును పూజించటమెలాగో యథార్థం చెప్పు'' అని అడిగాడు.

మహాతపుడు చెప్పాడు : ''మహాప్రాజ్ఞా, రాజా, సర్వయోగీశ్వరుడు శ్రీహరి విష్ణువు స్త్రీపురుషుల పట్ల ఎలా ప్రసన్నుడౌతాడో విను. బ్రహ్మాది దేవతలూ, పితరులూ, బ్రహ్మాండమధ్యస్థులైన అందరూ విష్ణుసన్నిధానం నుంచే ఉత్పన్నులైనారని వేదశ్రుతి చెబుతున్నది. అగ్ని, అశ్వినీదేవతలు, గౌరి, గజాననుడు, నాగులు, కార్తికేయుడు, ఆదిత్యులు, దుర్గ, మాతృకలు, దిక్కులు, ధనపతి, విష్ణువు, యముడు, రుద్రుడు, శశి, పితరులు, జగత్పతి నుంచి ప్రాధాన్యాన్ని బట్టి సంభవించిన వారే. అందరూ హిరణ్యగర్భుని (=బ్రహ్మ =నారాయణుని) శరీరం నుంచి సంభవించినవారే. (అయినా), ఎవరికి వారే మహాగర్విష్ఠులైపోయారు. 'నేను యోగ్యుడ' ననీ, 'నేను యాజ్యుడ' ననీ వారు చేసిన మహాకోలాహలం దేవసమితిలో కల్లోలసాగరంలా వినవచ్చింది. పార్థివా, వారు

వాదులాడుతుండగా వహ్ని లేచి నన్ను యజించమనీ నన్ను ధ్యానించమనీ అంటూ''ఈ ప్రాజాపత్య (=బ్రహ్మదైన = నారాయణునిదైన) శరీరం నేను లేకపోతే నశిస్తుంది. ఉండదు. కనుక నేను గొప్పవాడను'' అన్నాడు. ఇలాపలికి వహ్ని శరీరం విడిచి బయటికి వచ్చాడు. అందులోనుంచి అతడు వెలువడినా, శరీరం శిథిలం కాలేదు. ఆ పైని శరీరంలో ఉండే ప్రాణాపాన స్వరూపులైన అశ్వినీ దేవతలిద్దరూ ఆకారంధరించి ''మేమిద్దరమూ ప్రధానులం కనుక ఉన్నతులమైన మేమే యజింపదగినవారము'' అన్నారు. ఇలా పలికి శరీరం విడిచిపెట్టి ఒక చోట నిలిచారు. వారు లేకపోయినా, క్షేత్రి (ఆత్మ) ఆ శరీరంలో ఉన్నది.

ఆమీద గౌరి వాణి ''ప్రాధాన్యం నాలో ఉన్నది'' అన్నది. ఆ కళ్యాణి ఇలా పలికి శరీరం నుంచి వెలికి వచ్చింది. ఆమె లేకపోయినా, వాక్కు లేని ఆ శరీరం ఉన్నది. అపుడు ఆకాశనామకుడైన గణపతి ఒక వాక్యం ''నేను లేనిదే శరీరం కొంతకాలం (దూరం) కూడా ఉండబోదు'' అన్నాడు. ఇలా పలికి అతడుకూడా దేహంనుంచి నిష్క్రమించి విడివడ్డాడు. అయినప్పటికీ శరీరం నశించలేదు. ఆకాశతత్త్వం లేకపోయినా అది శిథిలంకాలేదు. రంధ్రాలు లేకున్నా నిలిచిఉన్న శరీరాన్ని చూచి, శరీరధాతువు నాగులన్నీ ఒక వాక్యం ''మేములేని శరీరానికి నిలకడ ఉండదు'' అన్నాయి. ఇలా పలికి ఆ శరీరాలన్నీ విడిచిపెట్టాయి. అవి లేకపోయినా, దేహాన్ని పురుషుడు చక్కగా పోషిస్తున్నాడు. అహంకారాన్నే స్కందుడంటారు. అతడది చూచి ''నేను లేకపోతే, శరీరానికి పుట్టుకే లేదు'' అన్నాడు. ఇలా అని అతడు శరీరంనుంచి తొలగి, విడిగా నిలిచాడు. అతడు లేకపోయినా ఆశరీరం ముక్తునిలా ఉన్నది.

అది చూచి, భానుడు కోపించాడు. అతనిని ఆదిత్యుడంటారు.''నేను లేనిదే ఈ శరీరం ఒక క్షణమైనా, ఎలా ఉంటుంది?'' అని పలికి అతడు వెళ్ళిపోయాడు. ఆ శరీరం శిథిలం కాలేదు. ఆ తరువాత దుర్గ అనబడే మాయ కోపంతో ''నేను లేకపోతే, దీనికి ఉనికి లేదు'' అని పలికి అంతర్ధానమయింది. ఆపైని దిక్కులు లేచి, ఈ పెద్దమాట ''మేము లేనిదే, కార్యముండదు. సంశయం లేదు'' అన్నాయి. అలా పలికి నాలుగు దిక్కులూ వచ్చి, క్షణంలో తొలగిపోయాయి. అనంతరం ధనపతి వాయువు ''నేను తొలగిపోతే శరీరానికి ఉనికి ఎక్కడిది?'' అని పలికి శిరస్సుద్వారా వెళ్ళిపోయాడు. ఆ వెనుక విష్ణువు – మనస్సు ''నేను లేకపోతే, ఈ దేహం క్షణం కూడా ఉండాలనుకోదు'' అని అంతర్ధానమైనాడు. ఆ

తరువాత ధర్ముడు ''దీనినంతటినీ పాలించినవాడను నేను. ఇప్పుడు నేను తొలగితే, ఇది ఎలా ఉంటుంది?'' అని పలికి వెళ్ళిపోయాడు. ఆ శరీరం శిథిలం కాలేదు. అది చూచి పితరులు – తన్మాత్రలు – ''మేము తొలగితే ఈ శరీరం తప్పక నశిస్తుంది'' అన్నారు. ఇలా పలికి ఆ దేహాన్ని విడిచిపెట్టి అంతర్ధానమయ్యారు.

అగ్ని, ప్రాణాపానాలు, వాణి, ఆకాశం, సర్వధాతువులు, క్షేత్రం, అహంకారం, భానుడు, కామాదులు, మాయ, దిక్కులు, వాయువు, విష్ణువు, ధర్ముడు, శంభుడు, ఇంద్రియ విషయములైన (పితరులు) వీరు విడిచినప్పటికీ ఆ శరీరం అలాగే ఉన్నది. దానిని ఇందు (చంద్ర)రూపి అయిన పురుషుడు సోముడు పాలిస్తున్నాడు. ఇలా నాశరహితుడైన షోడశ (పదహారుకళల = పైని పేర్కొన్న పదహారు రూపాలుగల) స్వరూపుడైన సోముడు ఉన్నందున మునుపటిలానే గుణసహితమై ఆ క్షేత్రం (శరీరం) లేచి తిరిగింది.

క్షేత్రదేవతాకృత పరమేశ్వర స్తుతి

క్షేత్రదేవతాకృతసోమస్తుతి:

ప్రాగవస్థం శరీరం తు దృష్ట్వా సర్వజ్ఞపాలితమ్ । తాః క్షేత్రదేవతాః సర్వావైలక్షం భావమాశ్రితాః ॥

తమేవ తుష్టువుః సర్వాస్తందేవం పరమేశ్వరమ్ । స్వస్థానమీయిాషుః సర్వాస్తదానృపతిసత్తమ్ ॥

త్వమగ్నిస్త్వం తథాప్రాణస్త్వమపానః సరస్వతీ ।త్వమాకాశం ధనాధ్యక్షస్త్వం శరీరస్యధాతవః ॥

అహంకారో భవాన్ దేవ త్వమాదిత్యోష్టకో గుణః । త్వం మాయా పృథివీ దుర్గా త్వం దిశ స్త్వం మరుత్పతిః ॥

త్వం విష్ణుస్త్వం తథా ధర్మస్త్వం విష్ణుస్త్వం పరాజితః । అక్షరార్థస్వరూపేణ పరమేశ్వరసంజ్ఞితః ॥

అస్మాభిరపయాతైస్తు కథమేద్భవిష్యతి । ఏవమత్ర శరీరం తు త్యక్తమస్మాభిరేవ చ ॥

తత్ పరం భవతా దేవ తదవస్థం ప్రపాల్యతే । స్థానభంగో న సః కార్యః స్వయం సృష్ట్వా ప్రజాపతేః ॥

కృతకృత్యస్య యే కిం ను భవద్భిర్విప్రయోజనమ్ । తథాపి దద్మి వో రూపే ద్వే ద్వే ప్రత్యేకశోధునా ॥

భూతకార్యేష్వమూర్తేన దేవలోకే తు మూర్తినా। తిష్ఠధ్వమపి కాలాన్తేలయం త్వావిశతద్రుతమ్ ॥

శరీరాణి పునర్నైవం కర్తవ్యోహమితి క్వచిత్ / మూర్తీనాం చ తథా తుభ్యం దద్మి నామాని వోధునా || (17.55-65)

సర్వజ్ఞుడు పాలిస్తున్న ఆ శరీరం మునుపటిలాగానే ఉండటం చూచి, ఆ క్షేత్ర దేవతలందరూ సిగ్గుపడిపోయారు. నృపతిసత్తమా, వారందరూ తమతమస్థానాలు పొంద గోరి ఆ పరమేశ్వరదేవుని ఈ (చెప్పబోయే) విధముగా స్తుతించారు. అని వారు స్తుతించి నందుకు ఆ దేవుడు వారిపట్ల పరమసంతోషం పొందాడు. వారితో ''మిమ్మల్ని క్రీడకోసం నేను సృష్టించాను. కృతకృత్యుడనైన నాకు మీ వల్ల ఏమిటి విశేష ప్రయోజనం? అయినా, మీకు ఒక్కొక్కరికీ రెండేసి రూపాలిస్తానిప్పుడు. ప్రాణిశరీరాలలో రూప రహితంగానూ, దేవలోకంలో రూపసహితంగానూ, ఉండండి. కాలాంతంలో వేగంగా లయమౌతారు. శరీరాలు నేనని మళ్ళీ ఎన్నడూ అనుకోకండి. మీ మూర్తులకూ మీకూ ,ఇప్పుడు పేర్లు పెడుతున్నాను. అగ్ని వైశ్వానరుడు. ప్రాణాపానాలు రెండూ అశ్వినీ దేవతలు. గౌరి హిమగిరితనయ అవుతుంది. ఈ పృథివ్యాదిగణం గజముఖుడౌతుంది. ఈ శరీర ధాతువు నానాప్రాణులౌతుంది. అహంకారం, స్కందుడు, కార్తికేయుడు అవుతుంది. ఈ భానుడు ఆదిత్యుడు సరూప – అరూపనేత్రాలు. ఈ కామాదిగణం మళ్ళీ మాతృరూపం అవుతుంది. శరీరమాయ ఈ దుర్గ కారణాంతమౌతుంది. ఈ పదిదిక్కులూ వరుణ కన్యలౌతాయి. ఈ వాయువు కారణాంతంలో ధనేశుడవుతాడు. ఈ మనస్సు విష్ణువౌతుంది. సందేహం లేదు. ధర్ముడు యముడవుతాడు. సంశయం లేదు. మహాత్తత్త్వం భగవానుడైన మహాదేవుడు అవుతుంది. ఇంద్రియవిషయాలు పితరులు అవుతాయి. సంశయం లేదు. ఈ సోముడు ముందు ఎల్లప్పుడూ యామిత్రం (సప్తమి స్థానం) కాగలడు అమరులారా. ఇలా వేదాంత పురుషుడు నారాయణస్వరూపు చెప్పబడ్డాడు. దేవతలారా, మీ మీ స్థానాలలో ఉండండీ'' అని చెప్పి దేవుడు విరమించాడు. జనార్దనుడు ఇట్టి ప్రభావం కలవాడు, వేదవేద్యుడు. నృపతీ ఇతనిని గురించి నీకు చెప్పాను. మరి ఇంకేమి వినగోరుతున్నావు? (17)

18 వ అధ్యాయం - పంచభూత సృష్టి – అగ్నివాచక నిరుక్తి

ప్రజాపాలుడు ''మహామునీ, అగ్ని, అశ్వినీ దేవతలు, గౌరి, గణపతి, నాగులు, గుహుడు, ఆదిత్యుడు, చంద్రుడు, మాతృకలు, దుర్గ, దిక్కులు, ధనదుడు, విష్ణువు, ధర్ముడు, పరమేష్ఠి, శంభుడు, పితరులు, చంద్రుడు వీరెలా ఉద్భవించారు? మునీ, ఈ శరీర

దేవతలందరూ ఏవిధంగా రూపం ధరించారు? మునీ, వారి ఆహారమేమిటి? వారి పేర్లేమిటి? వీరు ఏతిథులలో పూజితులై పురుషులకు ఫలమూ, కుశలమూ కలిగిస్తారు? ఇది నాకు రహస్యవిషయాలతోనూ నీవు చెప్పదగుదువు మునీ'' అని అడిగాడు. మహాతపుడు చెప్పాడు: ఆత్మస్వరూపుడు, యోగసాధ్యస్వరూపుడు, నారాయణస్వరూపుడు, సర్వజ్ఞుడు తనలో తాను క్రీడిస్తుండగా అతనికి భోగేచ్ఛ కలిగింది. ఆ మహాభూతస్వరూపుడు క్షుబ్ధుడు కాగా ఈ శబ్దం ఏర్పడిరది. అది చాలా ఆశ్చర్యకరమైనది. అందువల్లా ప్రీతికలుగనందున జలవికారం (మార్పు) ఇష్టమైంది. వికృతి పొందుతున్న దానికి (నీటికి) అప్పుడు మహాగ్ని సంభవించింది. ఆ అగ్నికి కోటిజ్వాలలున్నాయి. ధ్వనిస్తున్నది. తగులబెడుతున్నది. ఆ అతి తేజస్వి (అగ్ని) కూడా వికృతికి ఇష్టపడ్డాడు. వికృతిచెందుతున్న వహ్నికి పరమదారుణమైన వాయువు పుట్టింది. వికృతి చెందుతున్న వాయువునుంచి ఆకాశం పుట్టింది.

శబ్ద లక్షణమైన ఆ ఆకాశమూ, ప్రతాపంగల ఆ వాయువూ, ఆ తేజస్సూ నీటితో కూడి పరస్పరం మిళితమైనాయి. తేజస్సు వల్ల ఎండిననీరు, ప్రచండవేగంగల వాయువు వల్ల కదలి, బాధితమైన ఆకాశం దారి ఈయగా, తక్షణమే ముద్ద అయి సర్వమూ ఘనీభించింది. మహాభాగా, అదే ఈ పృథ్వి, వాటిలో మిక్కిలి పెద్దదయింది. నాలుగింటి కలయిక వల్ల కలిగిన కాఠిన్యంవల్లా, ఒక్కొక్కగుణం పెరిగినందువల్లా పృథ్వి పంచగుణాలు కలదిగా తెలుసుకోవాలి. అవి కూడా పృథ్విలో ఉన్నాయి. అతడు కాఠిన్యంకలదానిని చేస్తూ బ్రహ్మాండాన్ని నిర్మించాడు. అందులో నారాయణ దేవుడు చతుర్మూర్తులు గల చతుర్భుజుడైనాడు. (చతుర్మూర్తులు గల = నాలుగు మూర్తులు గల అని అర్థం. 1. వాసుదేవుడు, 2. సంకర్షణుడు, 3. ప్రద్యుమ్నుడు, 4. అనిరుద్ధుడు అనినవి నాలుగు మూర్తులు. ఈ నాలుగూ క్రమంగా 1. పురుషుడు, 2.జీవుడు, 3.మనస్సు, 4. అహంకారం అని మహాభారతం పేర్కొంటున్నది. శాంతిపర్వం 342, 347, 356 అధ్యాయాలు చూడండి.)

ప్రజాపతిరూపంలో వివిధప్రాణులను సృష్టించగోరి ఆలోచిస్తూ, ఆ లోకపితామహుడు సృష్టి చేయలేకపోయాడు. అనంతరం అతనికి పరమదారుణమైన మహాకోపం వచ్చింది. ఆ కోపంవల్ల వేయినాల్కలుగల దహనస్వరూపడు (అగ్ని) బయలుదేరాడు. అతడు ఆ బ్రహ్మను దహించబోయాడు. నరపతీ, అపుడు బ్రహ్మ అతనితో ''హవ్యమూ, కవ్యమూ వహించు'' అన్నాడు. అందువల్ల అతడు హవ్యవాహనుడైనాడు.

అతడు ఆకలివేసి బ్రహ్మవద్దకు వెళ్ళి ''నేనేమి చేయను? నాన్నాజ్ఞాపించు'' అన్నాడు. ఆ బ్రహ్మ అతనితో ''నీకు మూడువిధాల తృప్తికలుగుతుంది. దక్షిణలిచ్చినపుడు మొదట తృప్తికలిగి, అమరులకు దక్షిణ భాగం చేరుస్తావు. కనుక, దక్షిణాగ్ని అనబడతావు. విభావసూ, ముల్లోకాలలోనూ సర్వత్ర హోమం చేయబడినదంతా దేవతలకోసం మోసుకొని పో, అందువల్ల నీవు హవ్యవాహనుడవవుతావు. ఒళ్ళే ఇల్లన్నారు. నీవు దానికిప్పుడు అధిపతివి. అందువల్ల విభూ, సర్వగతుడవైన నీవు గార్హ పత్యుడవవుతావు. ప్రభూ, హోమంచేసిన సమస్త (విశ్వ) నరులనూ సద్గతికి చేరుస్తావు. అందువల్ల నీకు నిత్యమైన వైశ్వానరుడనే పేరు వస్తుంది. ద్రవిణం బలమని చెప్పబడింది. ధనమే ద్రవిణం. దానినిచ్చే వాడవు నీవే. కనుక, నీవు ద్రవిణోదుడవు. నీవు తనువునూ (సశరీరులనూ) కాపాడతావు; అతనువునూ (అశరీర ప్రాణులనూ) కాపాడతావు. అందువల్ల విభూ, నాయనా, నీకు తనూనపాత్తు అనే పేరు కలుగుతుంది. నీవు పుట్టినవాటినీ, పుట్టనివాటినీ ఎరుగుదువు; కనుక, ప్రభూ, నీకు జాతవేదుడని పేరు. నారములు సామాన్యంగా నరులు, విశేషంగా ద్విజులు, అవి నిన్ను ప్రశంసిస్తాయి. కనుక నీవు నారాశంసుడవు కా. అగస్సు (పాపం) నిత్యమూ నిశ్శబ్దంగా, నిశ్చయంగా (నీవల్ల) మాయమౌతుంది. నీవు అగస్సువు కనుకనూ, సర్వగామివి కనుకనూ, నీ తేజస్సు అగ్ని అవుతుంది. ధ్మా అంటే ప్రపూరణం అని అర్థం. ఇధ్మాలకు (సమిధకు) కూడా వాచకం. పూరితమైనదానికి గతి నీవల్ల ఔతుంది. కనుక నీవు ఇధ్మడవు కాగలవు. నాయనా, నీ యీ పేర్లు మహాయజ్ఞాలలో యజింపబడతాయి. నరులు నిన్ను యజిస్తూ నిస్సంశయంగా తమకోరికలు తీర్చుకొంటారు. (18)

19 వ అధ్యాయం - అగ్ని కథ – ప్రతిపత్తిథి

మహాతపుడు ఇలా చెప్పాడు. నీకు ప్రసంగవశాన విష్ణువిభూతి మాహాత్మ్యం చెప్పాను. నరపతీ, తిథుల మహాత్మ్యం చెబుతున్నాను, విను. బ్రహ్మ క్రోధంనుంచి పుట్టిన మహాగ్ని ఇలా అయి, బ్రహ్మదేవునితో ''విభూ, నాకు ఒకతిథి ఇయ్యి, నాడు నేను సమస్త జగత్తులోనూ విఖ్యాతి పొందుతాను'' అని అడిగాడు. బ్రహ్మ ''సజ్జనోత్తమా, దేవతలకూ, యక్షులకూ, గంధర్వులకూ కంటె మొదట నీవు ప్రతిపత్తు (పాడ్యమి) నాడు జన్మించావు గనుక, పావకా, నీ పదం (స్థానం) నుంచి అన్య దేవతలు ప్రతిపదమూ సంభవిస్తారు. కనుక ప్రతిపత్తనే ఈ తిథి నీది అవుతుంది. ఆ తిథినాడు ప్రాజాపత్య (బ్రహ్మ) మూర్తితో

హవిష్యంతో హోమం చేసినవారిపట్ల పితరులూ, సర్వదేవతలూ ప్రీతులవుతారు. చతుర్విధప్రాణులూ, మనుష్యులూ, పశువులూ, అసురులూ, దేవతలూ, గంధర్వులూ అందరూ నీవు తృప్తుడవైతే సంతృప్తులై ప్రీతి చెందుతారు. ప్రతిపత్తునాడు నీభక్తుడెవడు ఉపవాసం గాని, పాలు మాత్రమే త్రాగి ఉండటం కాని చేస్తాడో, అతని మహాఫలం విను. ముప్పైయారు మహా యుగాలు స్వర్గలోకంలో గౌరవింపబడతాడు. తేజస్వి, రూపవంతుడు, ద్రవ్యవంతుడు అయిన నరుడయి పుడతాడు. ఈ జన్మలో రాజై, పోయి స్వర్గంలో గౌరవింపబడతాడు'' అని చెప్పి, మౌనం వహించాడు. ఆ అగ్ని బ్రహ్మ ఇచ్చినచోటికి వెళ్ళాడు. ప్రాతఃకాలంలో లేచి ఈ అగ్ని జన్మ గురించి ఏ మానవుడు వింటాడో అతడు పాపవిముక్తుడు అవుతాడు, సంశయం లేదు.(19)

20 వ అధ్యాయం - అశ్వినీదేవతల కథ – ద్వితీయా తిథి

ప్రజాపాలుడు ''బ్రహ్మన్, ఇలా మహాత్ముడైన అగ్నిఉత్పత్తి అయింది. ''ప్రాణపానాలు రెండూ అశ్వినీదేవతలుగా ఎలా అయ్యాయి?'' అని అడిగాడు.మహాతపుడు ఇలా చెప్పాడు. మరీచి బ్రహ్మపుత్రుడు. బ్రహ్మ స్వయంగా పద్నాలుగు రూపాలతో ఉన్నాడు. వాటిలో మరీచి శ్రేష్ఠుడైనాడు. అతని పుత్రుడు మహాతేజస్వి కశ్యపముని. ఆయనస్వయంగా ప్రజాపతి, శ్రీమంతుడు, దేవతకు తండ్రి అయ్యాడు. ప్రభూ, అతని పుత్రులు ద్వాదశాదిత్యులయ్యారు. అదితిపుత్రులు గనుక వారు ఆదిత్యులని కీర్తింపబడినారు. వారిలో వాడు మార్తండుడు మహాతేజస్వి లోకవిశ్రుతుడైనాడు. నారాయణ స్వరూపమైన తేజస్సే ఆ పన్నెండుగురని చెప్పబడింది. ఆ ఆదిత్యులు మాసాలు, హరి స్వయంగా సంవత్సరం. ఇలా ఆ ద్వాదశాదిత్యులో మార్తండుడు ప్రధానుడు. అతనికి త్వష్ట, మహాప్రభ గల సంజ్ఞ అనే కన్యను దానం చేశాడు. ఆమెకు యముడు, యమున అనే ఇద్దరు బిడ్డలు కలిగారు. అతని తేజస్సు భరించలేక ఆమె మనోజవంగల అశ్వం అయి, తన ఛాయను అక్కడ నిలిపి, తాను ఉత్తరకురుభూములకు వెళ్ళిపోయింది.

ఆమెరూపమూ, రంగూ, కల ఛాయను మార్తండభాస్కరుడు పొందాడు. అతని వల్ల ఆమెకు శని, తపతి అనే ఇద్దరు బిడ్డలు కలిగారు. బిడ్డను తేడాగా చూచినపుడు నరోత్తముడు, భగవానుడు క్రోధంతో కన్నులు ఎరుపెక్కగా సంజ్ఞలా ఉన్న ఛాయతో ''భామినీ, సొంతబిడ్డలో ఒలపక్షం చేయతగదు'' అన్నాడు. ఇలా చెప్పినా, ఆమె భేదబుద్ధి

విడువలేదు. అప్పుడు యముడు మిక్కిలి దుఃఖపడి తన తండ్రితో ''తండ్రీ, ఈమె తల్లి కాదు. ఎందుకంటే మాపట్ల ఎప్పుడూ శత్రువులా, మారుడు తల్లిగా నిష్ప్రయోజనంగా ఉంటున్నది. తనబిడ్డల పట్ల వాత్సల్యం చూపుతున్నది''అన్నాడు. ఇలా యమునిమాట విని ఆ ఛాయ క్రోధ మూర్ఛితురాలై ''నీవు త్వరలోనే ప్రేతరాజువు (మృతి చెందినవారికి అధిపతివి) అవుతావు'' అని శపించింది. ఇలా విని అపుడు మార్తండుడు పుత్రునిమేలు గోరి ''నీవు ధర్మపాపాలు రెండింటికీ మధ్యవర్తివి అవుతావు. నాయనా, నీవు లోకపాలుడవై దివిలో శోభిల్లుతావు'' అన్నాడు మార్తండుడు ఛాయకోపంవల్ల రెచ్చిపోయి శనిని ''పుత్రకా, నీవు మాతృదోషం వల్ల క్రూరదృష్టి కలవాడవు అవుతావు'' అని శపించాడు. భానుడు (సంజ్ఞను) చూడగోరి, లేచివెళ్ళాడు. అతడు ఉత్తరకురుభూములలో ఆడుగుర్రంగాఉన్న ఆమెను యోగ దృష్టితో చూచాడు. అనంతరం అతడు అశ్వరూపం ధరించి, ఆ ఉత్తరకురుభూములకు ప్రాజాపత్యమార్గంలో ఆత్మను ఆత్మతో అనుసంధానంచేశాడు. మార్తండుడు అశ్వరూపంలో ఉన్న ఆ త్వష్టకూతురులో తీవ్రతేజస్సుతో బీజం ఉంచాడు. అది జ్వలిస్తూ రెండుగా పడింది. ఆ యోనిలో ఆత్మనిగ్రహంగల ప్రాణాపానాలు రెండూ మునుపటివరదానంవల్ల రూపం ధరించాయి. అశ్వరూపంకల త్వష్ట కూతురుకు పుట్టిన ఉత్తమపురుషులు కనుక ఆ రవి నందనులు ఇద్దరూ అశ్వినీదేవతలని పిలువబడుతున్నారు. భానుడు స్వయంగాప్రజాపతి స్వరూపడు. త్వష్టకూతురు పరాపరశక్తి. మునుపటిలా ఆమెశరీరంలో రూపరహితంగా ఉన్న ఆ ఇద్దరూ రూపాన్ని అవలంబించారు. అనంతరం అశ్వినీ దేవతలిద్దరూ మార్తండుని సమీపించారు. ఆస్వరుచితో ''మా ఇద్దరకూ కర్తవ్యం ఏమిటి?'' అనిఅడిగారు. మార్తండుడు ''పుత్రులారా, శ్రేష్ఠుడైన ప్రజాపతిదేవుని నారాయణుని భక్తితో ఆరాధించండి. అతడు మీకు వరం ఇస్తాడు. నిశ్చయంగా మీరు వరం పొందగలరు" అని చెప్పాడు. ఇలా మహాత్ముడు మార్తండుడు చెప్పేసరికి, ఆ అశ్వినీదేవతలిద్దరూ ఏకాగ్రచిత్తులై, బ్రహ్మపారమయస్తోత్రం జపిస్తూ, తీవ్రతపస్సులై, పరమదుశ్చరమైన తపస్సు చేశారు. వారిద్దరూ చాలాకాలం తపస్సు చేశాక నారాయణస్వరూపుడైన బ్రహ్మ పరమ ప్రీతితో సంతోషించాడు. వారిద్దరికీ ఈ వరం ఇచ్చాడు. అని చెప్పగా విని ప్రజాపాలుడు ''బ్రహ్మన్, మహామునీ, అశ్వినీ దేవతలిద్దరూ పలికిన అవ్యక్తజన్ముడైన బ్రహ్మస్తోత్రం నీ ప్రసాదంవల్ల వినగోరుతున్నాను నేను'' అన్నాడు.

అశ్వినీదేవతలు చేసిన బ్రహ్మస్తోత్రం

మహాతపుడు చెప్పాడు : విను రాజా, అశ్వినీదేవతలిద్దరూ చేసిన బ్రహ్మస్తోత్రం. అనఘా, వారిస్తోత్రానికి ఇట్టి ఫలం లభించింది.

"ఓం నమస్తే నిష్క్రియ నిష్ప్రపఞ్చ నిరాశ్రయ నిరపేక్ష నిరాలంబ నిర్గుణ నిరాలోక నిరాధార నిర్ణయ నిరాకార బ్రహ్మన్ మహాబ్రహ్మన్ బ్రాహ్మణప్రియ పురుష మహాపురుషోత్తమ దేవ మహాదేవోత్తమ స్థాణో స్థితిస్థాపక భూత మహాభూత భూతాధిపతి యక్ష మహాయక్ష యక్షాధిపతే | గుహ్య మహాభూధిపతే సౌమ్య మహాసౌమ్య సౌమ్యాధిపతే పక్షి మహాపక్షిపతే దైత్య మహాదైత్యాధిపతే రుద్ర మహారుద్రాధిపతే విష్ణు మహావిష్ణుపతే పరమేశ్వర నారాయణ ప్రజాపతయే నమః ||"

భావం: ఓం నిష్క్రియా, నిష్ప్రపంచా, నిరాశ్రయా, నిరపేక్షా, నిరాలంబా, నిర్గుణా, నిరాలోకా, నిరాధారా, నిర్ణయా, నిరాకారా, బ్రహ్మ, మహా బ్రహ్మ, బ్రాహ్మణప్రియా, పురుషా, మహాపురుషోత్తమా, దేవా, మహాదేవోత్తమా, స్థాణూ, స్థితిస్థాపకా, భూతా, మహాభూతా, భూతాధిపతీ, యక్షా, మహాయక్షా, యక్షాధిపతీ, గుహ్యా, మహాగుహ్యాధిపతీ, సౌమ్యా, మహాసౌమ్యా, సౌమ్యాధిపతీ, పక్షీ, మహాపక్షిపతీ, దైత్యా, మహాదైత్యాధిపతీ, రుద్రా, మహారుద్రాధిపతీ, విష్ణూ, మహావిష్ణుపతీ, పరమేశ్వరా, నారాయణా, ప్రజాపతీ, నీకు నమస్కారం, నమోవాకం.

ఇలా ఆ అశ్వినీదేవతలిద్దరూ తనను స్తుతించేసరికి ఆ ప్రజాపతి సంతోషించాడు. పరమప్రీతితో ''దేవతలకు కూడా పరమదుర్లభమైనవరం శ్రీఘ్రంగా కోరుకొనండి. నా వరదానంవల్ల మీరు స్వర్గంలో సుఖంగా సంచరించగలుగుతారు'' అని అన్నాడు. అశ్వినీ దేవతలిద్దరూ ''దేవా, ప్రజాపతీ, మాకిద్దరికీ శాశ్వతమైన సోమపాయిత్వమూ, దేవతలలో సమానత్వమూ ఇయ్యి'' అని అడిగారు. బ్రహ్మ ''సాటిలేని రూపమూ, కాంతీ, సర్వ వస్తువులోనూ వైద్యత్వమూ, లోకాలలో సోమపాయిత్వమూ –ఈ సర్వమూ కలుగుతుంది.'' అని చెప్పాడు. ఈ సర్వమూ అశ్వినీ దేవతలకు పూర్వంబ్రహ్మ విదియనాడిచ్చాడు కనుక తిథులో వారికది శ్రేష్ఠమైనతిథి. రూపం కోరే నరుడు పుష్పాహారం మాత్రమే తీసుకోవాలి. సంవత్సరం పాటు శుచి అయి, నిత్యమూ (ఇలా చేస్తే), మంచి స్వరూపం కలవాడవుతాడు నరుడు. అశ్వినులకిద్దరికీ ఏ గుణాలున్నాయని చెప్పబడినాయో, అవి అతనికికూడా కలుగుతాయి. ఏ నరుడు ఉత్తమమైన ఈ అశ్వినులజన్మగురించి నిత్యమూ వింటాడో, అతడు సర్వపాపవినిర్ముక్తుడై పుత్రవంతుడౌతాడు. (20)

21 వ అధ్యాయము - గౌరీదేవీ రూపధారణ వృత్తాంతం

"గొప్ప ప్రజ్ఞగల ఓ మునీంద్రా! పరమాత్ముడైన పరమ పురుషుని వరదానము వలన గౌరీదేవి యెట్లు రూపము పొంది స్తుతులందినదో నాకు తెలియజెప్పుము" అని ప్రజాపాలుడు కోరగా, మహాతపుడు ఇలా చెప్పాడు. "మునుపు ధర్మాత్ముడైన ప్రజాపతి వివిధ ప్రజలను సృజింప గోరెను. ఎంత చింతించినను సృష్టి ఏర్పడని కారణముగా ఆతనికి పెనుకోపము వచ్చింది. ఆ కోపము వలన గొప్ప ప్రతాపముగల రుద్రుడు సంభావించాడు. రోదనము చేసిన కారణమున ఆతనికి పరమేష్టిరుద్రుడు అను పేరు కలిగింది. శుభప్రదుడు, తండ్రి, ప్రజాపతి అయిన బ్రహ్మ, ఒక చక్కని కన్యను రుద్రునకు భార్యగా తన దేహము నుండి సృజించెను. ఆమెకు గౌరి అను పేరు ఆయనయే పెట్టెను. తానే ఆమెకు తండ్రియై మిక్కుటమగు దేహముగల రుద్రున కొసగెను. ఆ రుద్రుడు ఆ సుందరిని పొంది పరమానంద మందెను. బ్రహ్మ సృష్టి సమయములలో ఆతనిని గాంచి 'రుద్రా! ప్రజలను సృష్టిచేయుము' అని పదేపదే యిట్లు ప్రేరేపించాడు. ఇట్లు బ్రహ్మ మాటిమాటికి నొక్కి చెప్పుచుండగా గొప్పబలము గల రుద్రుడు – ఇది నాకు చేతకాదని, ఇది తపస్వులకు మాత్రమే సాధ్యమని, తపస్సు లేనివాడు ప్రజలను సృజింప జాలడని తలచి మహాప్రతాపము గల రుద్రుడు నీట మునిగెను. అట్లు రుద్రుడు నీట మునుగగా బ్రహ్మ మహా సౌందర్యము గల ఆ గౌరి అను కన్యను మరల తన దేహములో లీనము గావించెను. భగవానుడగు బ్రహ్మ మరల ప్రజలను సృజింపగోరి దక్షునితో పాటు సప్త మానస పుత్రులను సృజించెను. వారి వలన ప్రజలు పెంపొందిరి. దేవతలు, దేవేంద్రుడు, ఎనిమిది మంది వసువులు, రుద్రులూ, పండ్రెండుగురు ఆదిత్యులు, ఏడుగురు మరుత్తులు — సర్వ దేవతలూ దక్షుని దౌహిత్రులే!

దాక్షాయణి గా గౌరీదేవి జననం: ఇంతకు ముందు రుద్రునకు తాను భార్యగా నొసగిన గౌరి అను సుందరాంగిని బ్రహ్మ దక్షునకు కూతురుగా నొసగెను. ఇట్లా గౌరియు మరల దాక్షాయణీ దేవి అయింది.

దక్షయజ్ఞం: అంత దక్షుడు మురిసిపోవుచు మనుమలను (కూతురు కొడుకులను) సమృద్ధిగా పొందగోరి ప్రజాపతి తృప్తికై ఒక యజ్ఞమును ఆరంభించెను. అప్పుడు, బ్రహ్మ కుమారులగు మరీచి మొదలగువారు తమతమ మార్గముల యందు చక్కగా కుదురుకొని

ఋత్విక్కుల కార్యమును నిర్వహించిరి. మరీచి స్వయముగా బ్రహ్మయ్యెను. ఇతరులు ఇతర కార్యములను నిర్వహించిరి. అత్రి యజ్ఞ కార్యాన్ని నిర్వహించుచుండెను. అంగిరసుడు ఆగ్నీధ్రుడయ్యెను. పులస్త్యుడు హోతయాయెను(హవిస్సు మొదలైన హోమం చేసేవాడు). పులహుడు ఉద్గాత (యజ్ఞంలో సామవేద తంత్రం నడిపేవాడు) అయ్యెను. క్రతువను మహా తపశ్శాలి ఆ యజ్ఞమున ప్రస్తోత(యజ్ఞాన్ని నడిపేవాడు) అయ్యెను. ప్రచేతసుడు ప్రతిహర్త (ఉద్గాతకు సహాయకుడు). వశిష్ఠుడు సుబ్రహ్మణ్యుడాయెను. సనకుడు మొదలగువారు సభాసదులైరి.

యజ్ఞమున అర్చనల నందువాడు, యజ్ఞఫలముల నందువాడు విశ్వమును అంతటిని సృజించిన బ్రహ్మ దేవుడే. సంమానము పొందువారు దక్షుని మనుమలు (దౌహిత్రులు) రుద్రులు, ఆదిత్యులు, అంగిరులు మొదలగువారు ప్రత్యక్షముగా నున్న పితృదేవతలు. వారు ప్రీతి నొందినచో జగము ప్రీతి నొందును. ఆ యజ్ఞమున దేవతలు, ఆదిత్యులు, వసువులు, విశ్వదేవతలు, పితరులూ, గంధర్వాదులూ, మరుద్గణాలూ తమ వంతు యజ్ఞ హవిర్భాగాలు అన్నింటినీ స్వీకరిస్తూ ఉన్నారు. విశ్వేదేవులు, పితృదేవతలు, గంధర్వులు, మరుద్గణములు తమకు సమర్పించిన యజ్ఞ భాగములను కైకొనుచుండిరి.

రుద్రుని తపః సమాప్తి: ఇంతలో మునుపు బ్రహ్మకోపము వలన పుట్టి, పెనుజలమున మునిగియున్న రుద్రుడు ఒక్క పెట్టున నీటినుండి పైకి లేచెను. వేయి సూర్యుల ప్రోవువలె వెలుగొందుచు, సర్వజ్ఞానము ముద్దకట్టి వచ్చిన స్వరూపముతో, దేవతలందరి తత్త్వములు తనలో నిండగా, నిర్మలమైన రూపముతో ఆతడు నీటి నుండి వెలువడి, తపస్సుతో ప్రకాశించుచు సమస్త జగమునకు సాక్షాత్కరించెను. రాజా! ఆ సమయముననే దేవలోక సంబంధముగా 5 విధములగు జాతులును, భూమి యందుండునవియు, మృత్యుధర్మము కలవియునగు 4 జాతులయు సృష్టి యేర్పడెను. ఆ విధముగా రుద్రుడు చేసిన సృష్టి ఒక పెట్టున ఏర్పడెను.

రుద్రసృష్టి: పార్థివసత్తమా! ఆ రుద్ర సృష్టిని గూర్చి యిప్పుడు నీకు తెలిపెదను. వినుము. అట్లు పదివేలేండ్లు పెన్నీట తపమొనరించి మేల్కొన్నవాడై రుద్రుడు చక్కని పైరులతో, అడవులతో, మనుష్యులతో, పశువులతో, చూడముచ్చటగా నున్న భూమిని గాంచెను. మరియు దక్షుని యజ్ఞవాటిక యందు యాజ్ఞికులు చెదరని బుద్ధితో, పెద్ద స్వరముతో

చేయుచున్న వేదనాదములను వినెను. మహాతేజస్వియు, సర్వము నెఱిగినవాడును అగు పరమేశ్వరుడా శబ్దమును విని, తీవ్రముగా కోపించి, "మొదట పరమాత్మ నన్ను పుట్టించెను. ఆ ప్రభువు నిండు హృదయముతో ప్రజలను సృజింపుమని పలికెను. ఇప్పుడు ఈ సృష్టి మొదలగు పని నంతటిని ఎవ్వడు చేసెను?"– అని యిట్లు పలికి పెనుకోపముతో పరమేశ్వరుడు పెద్దనాదము గావించెను. అట్లు రంకెలు వేయుచున్న ఆతని చెవుల నుండి నిప్పులు గ్రక్కుచున్న వేతాళములును, భూతములు ప్రేతములగు పూతనలు, కూశ్మాండులు అను రక్కసులు, మంటలెగయు నోళ్లతో, పెక్కు ఆయుధములు తాల్చి కోట్లకొలదిగా వెలువడిరి.

వేదవిద్యాంగరథం: పెక్కువిధములగు ఆయుధములు తాల్చిన ఆ భూతముల మొత్తములను గాంచి, ఆ మహాదేవుడు వేద విద్యలే అంగములుగా గల అందమైన రథము నొకదానిని సృజించెను. ఆ రథమునకు ఋగ్వేదం మొదలగునవియే గుఱ్ఱములు, మూడు తత్త్వములే త్రివేణువులు, మూడుసవనములే, మూడు పూజకములు, ధర్మమే ఇరుసు, వాయువే ధ్వనిగా అమరియుండెను. పగలు రాత్రియను రెండు పతాకలు, ధర్మము, అధర్మము అను రెండు కర్రలు ఆ బండికి అమరెను. ఇట్లు సర్వ విద్యారూపమైన ఆబండికి సాక్షాత్తు బ్రహ్మయే సారథిగానయ్యెను. ఆ దేవదేవునకు గాయత్రియే విల్లు. ఓంకారమే అల్లెత్రాడు, ఏడు స్వరములు బాణములు ఆయెను. ఇట్లు సాధన సంపత్తి నేర్పరచుకొని మహాప్రతాపముగల దేవదేవుడు రుద్రుడు కోపముతో దక్ష యజ్ఞము కడ కరిగెను. ఆ దేవుడట్లు పోవుచుండగా సూర్యుడు తొలిగాడు. ఋత్విజుల మంత్ర పఠనము ఆగిపోయెను. ఈ విపరీతమును గాంచి అందున్న ఋత్విక్కులందరు "దేవులారా! సిద్ధముగా నుండుడు. మీకొక పెనుభయము వచ్చిపడినది. బ్రహ్మవలన రూపొందిన ఒక పెనురక్కసుడు గొప్ప బలముతో, మిక్కిలి దుర్లభమైన ఈ యజ్ఞఫలమున వంతునకై వచ్చుచున్నాడు" అని పలికిరి.

మనుమలకు దక్షుని సంగ్రామాజ్ఞ: ఆ మాటలను విన్న అమరులు తాతయగు దక్షునితో "తాతా! ఇప్పుడు మేమేమి చేయుదుము? నీ నిర్ణయమేమో తెలుపుము" అని అడుగగా, వారికి దక్షుడు "వడివడిగా ఆయుధములు చేతబట్టుడు. ఇచట మనము పోరాడ వలయును" అనిపలికెను. దక్షుడిట్లు పలుకగా దేవతలు పెక్కుతీరుల ఆయుధము లను ధరించి రుద్రుని సేవకులతో పెద్ద యుద్ధము గావించిరి. పెక్కువిధములగు ఆయుధములు

తాల్చిన బేతాళ భూతములు కూష్మాండులు, గ్రహపూతనలు (వీరందరు రుద్రానుచరులు) లోకపాలురతో పోరు సలిపిరి. రుద్రుని భూతాలను బాణములు, ఘోరములగు ఖడ్గములు, ధనస్సులు, గండ్రగొడ్డళ్ళతో యమలోకమునకు విసరివైచిరి. రుద్రుని ముందు నిలిచి వెరపు గొలుపు భూతములు కూడ దొక్కుకొని రోషముతో కొఱవులను, ఎముకలను, బాణములను దేవతలపై క్రుమ్మరించు చుండిరి. ఇట్లు మహాతీవ్రముగా భయము గొలుపు యుద్ధము సాగుచుండగా రుద్రుడు ఒక్కవాడి బాణముతో ద్వాదశాదిత్యులలో ఒకడు అగు భగుని రెండు కనులను పొడిచివైచెను. రుద్రుని బాణము మంటకు కనులు పోయిన భగుని చూచి క్రోధముతో తేజస్వియగు పూషుడు రుద్రుని పైకి దూకెను. (పూషుడు ద్వాదశాదిత్యులలో ఒకడు) అట్లు బాణములు గుప్పించుచున్న పూషుని గాంచి రుద్రుడు మహా యుద్ధమున వాని దంతములను ఊడలాగెను. పూషుని దంతములు రుద్రునివలన నేలకూలగా చూచి వసువులు చెల్లాచెదరైరి. పదునొకండుగురు రుద్రులు వారిని వెంటనంటి తోలిరి. అట్లు దెబ్బతిని దిక్కులకు పారిపోవుచున్న వారిని గాంచి ఆదిత్యుల తమ్ముడు, ప్రతాపవంతుడు అగు విష్ణువు తన బలముతో "మగతనమును, గర్వమును, మహిమను వదలివైచి యెందు పోయెదరు? మీరు వచ్చిన పనియేమో, మీ కులగౌరవము ఎట్టిదో, మీ సంపద ఎట్టిదో ఏల స్మరింపరు? సృష్టికర్త గుణములన్నియు కలిగియు, సాధారణ జనునివలె ఈ బ్రహ్మయు మునుముందు భయమంది వ్యర్థముగా చేతులు ముడుచు కొనుచున్నాడు".

అని ఇట్లు పలికి ఆ విష్ణువు శంఖమును, చక్రమును, గదను చేతుల యందు తాల్చి, పట్టు వస్త్రము ధరించి జనార్దనుడై గరుత్మంతుని అధిరోహించెను. అంత హరిహరులకు మేను గగుర్పొడుచు పోరు సాగెను. రుద్రుడు శక్తినంతయు కూడ దీసికొని పాశుపతాస్త్రముతో హరిని కొట్టెను. హరి కోపము పెల్లు రేగగా నారాయణాస్త్రముతో రుద్రుని మోదెను. పెను రోషముగల ఆ నారాయణ పాశుపతములు అనెడు అస్త్రములు రెండును ఆకసమున ఒకటి నొకటి రూపుమాప వలయునన్న భావముతో దివ్యములగు వేయియేండ్లు పోరినవి. ఆ విధముగా హరి హరుల పోరు సాగెను. ఆ అస్త్రములలో ఒకటి కిరీటముతో ఒదిగియున్నది. మఱియొకటి విప్పారిన జడలతో అలరి యున్నది. ఒకటి శంఖమును పూరించుచున్నది. మఱియొకటి శుభమైన దమరుకమును మ్రోగించుచున్నది. ఒకటి కత్తిచేత తాల్చియున్నది. మఱియొకటి దండము ధరించి ఉన్నది. ఒకటి కౌస్తుభము

వెలుగులు ఒడలెల్ల ప్రాకియున్నది. వేరొకటి భస్మముతో చెలువొంది ఉన్నది. ఒకటి గదను త్రిప్పుచున్నది. ఇంకొకటి దండమును త్రిప్పుచున్నది. ఒకటి కంఠమున ఉన్న మణులతో అలరారుచున్నది. వేరొకటి అస్థిమాలతో ఒప్పారుచున్నది. ఒకటి పచ్చనివస్త్రము తాల్చి యున్నది. రెండవది పాముల మొలనూలితో విరాజిల్లుచున్నది. ఇట్లు పరస్పరము పగగొన్న పాశుపత నారాయణాస్త్రములు రెండును, ఒకటి కొకటి మించ వలయునన్న భావముతో నుండగా బ్రహ్మ అదిగాంచి, మేలైన నడవడిగల అస్త్రములారా! మీమీ స్వభావముతో శాంతింపుడు– అని పలుకగా అవి రెండును శాంతించినవి. అంత బ్రహ్మ హరిహరులను గాంచి “దేవులగు హరిహరులిరువురు లోకమున కీర్తి నందెదరు. పాడైన యీ దక్షుని యజ్ఞము పరిపూర్ణతను గాంచును. దక్షుని సంతానరూపమైన యీ యజ్ఞము లోకమున వాసిగాంచును.” అని ఇట్లు హరిహరులతో పలికి లోక పితామహుడగు బ్రహ్మలోకులను ఉద్దేశించి రుద్రభాగము నీ రుద్రున కొసగుడని పలికెను. అంత రుద్రుని భాగము జ్యేష్ఠ భాగమని వేదవాక్కు వినవచ్చెను. దేవతలారా! పరమేశ్వరుడగు రుద్రుని స్తుతింపుడు – అనియు వేదవాక్కు వెలువడెను. భగుని కన్నులను పోగొట్టినవానిని, పూషుని దంతములు విరుగగొట్టిన వానిని ఈ రుద్రుని ఇట్టి నామములతో వడిగా స్తుతింపుడు. దానితో ఆతడు మీయందు ప్రసన్నుడై మీకు వరముల నొసగును అని వేదమాత పలుకగా దేవతలు పరమభక్తితో నమస్కరించి మహాత్ముడును, స్వయంభువు అగు శంభుని ఇట్లు స్తోత్రము చేసిరి.

దేవతాకృతశంభుస్తుతి

నమో విషమనేత్రాయ నమస్తే త్ర్యంబకాయ చ| నమః సహస్రనేత్రాయ నమస్తే శూలపాణయే||

నమః ఖట్వాంగహస్తాయ నమో దండభృతే కరే| త్వం దేవ హుతభుగ్జ్వాలాకోటిభాను

సమప్రభ||

ఆదర్శనే2నయద్ దేవ మూఢవిజ్ఞానతో2ధునా| కృతమస్మాభిరేవేశ తత్ర క్షమ్యతాం ప్రభో||

నమస్త్రినేత్రార్తిహరాయ శంభో త్రిశూలపాణే వికృతాస్యరూప|

సమస్త దేవేశ్వరశుద్ధభావ ప్రసీద రుద్రాచ్యుత సర్వభావః ||

పూష్ణో2స్య దంతాంతక భీమరూప ప్రలంబభోగీంద్రలులంతకణ్ఠ|

విశాల దేహాచ్యుతనీలకణ్ఠ ప్రసీద విశ్వేశ్వర విశ్వమూర్తే ||

భగాక్షి సంస్ఫోటనదక్షకర్మా గృహాణ భాగం మఖతః ప్రధానమ్ |

ప్రసీద దేవేశ్వర నీలకంఠ ప్రపాహి నః సర్వగుణోపపన్న ||

సీతాఙ్గరాగా ప్రతిపన్న మూర్తే కపాలధారిం స్త్రిపురఘ్న దేవ

ప్రపాహి నః సర్వభయేషు చైవ ఉమాపతే పుష్కరనాళజన్మ ||

పశ్యామ తే దేహగతాన్ సురేశ సర్గాదయో వేదవరాసనన్త

సాంగాన్ సవిద్యాన్ సపదక్రమాంశ్చ సర్వాన్ నిలీనాం స్త్వయి దేవ దేవ||

భవ శర్వ మహాదేవ పినాకిన్ రుద్ర తే హర నతాః స్మ సర్వే విశ్వేశ త్రాహి నః పరమేశ్వర||

(21.65-73)

భావం: విషమ నేత్రుడు, ముక్కంటి, వేయి కన్నులు కలవాడు శూలము చేత దాల్చినవాడవగు పరమేశ్వరా! నీకు నమస్సు. మంచపు కోడువంటి ఆయుధము గల ఓ స్వామీ! నీకు నమస్కారము. చేత దండము ధరించిన దేవా! నీకు మ్రొక్కులు. నీవు అగ్నిజ్వాలలు గల కోట్ల కొలది సూర్యులకు దీటైన తేజస్సు కలవాడవు. మా విజ్ఞానమునకు పొరలు క్రమ్మి నేడు నిన్ను గుర్తింపక చేసిన తప్పును ప్రభూ! క్షమింపుము. ఓ ముక్కంటీ! నీవు పీడలను పరిమార్తువు. శంభూ! త్రిశూలధారీ! వింత అయిన మొగము గల దేవా? సమస్త దేవేశ్వరా! శుద్ధ స్వభావా! రుద్రా! అచ్యుతా! సర్వభావముల సమష్టి రూపమైన ఓ ప్రభూ మాయందు ప్రసన్నుడవగుము. ఈ పూషుని దంతములు ఊడగొట్టిన ఓ భీమరూపా! వ్రేలాడు నాగరాజు మెడకు చుట్టుకొన్న స్వామీ! విశాల దేహముగల దేవా! అచ్యుతా! నీలకంఠా! విశ్వేశ్వరా! విశ్వమూర్తీ! మాయెడ దయగొనుము. భగుని కనుగ్రుడ్లను పొడిచి వేయుటలో నేర్పుగల ఓ దేవా! ఈ యజ్ఞమున నీవు ప్రధాన భాగమును స్వీకరింపుము. దేవదేవా!నీలకంఠా! సర్వగుణములు నెలకొన్న మహానుభావా!మాయందు దయచూపుము. మమ్ము పరిపాలింపుము. తెల్లని భూతిపూతగల నీ స్వరూపము గుర్తింపరానిది. ఓ కపాలధారీ! త్రిపురాసురులను మట్టుపెట్టిన స్వామీ! ఉమాపతీ! తామర తూడు నుండి ఉద్భవించిన ఓ ప్రభూ! మమ్ము సర్వ భయముల నుండి కాపాడుము. దేవదేవా! నీ దేహమున సృష్టుల నన్నింటిని గాంచుచున్నాము. అట్లే! అనంతా! అంగములతో,

విద్యలతో, పదము, క్రమము అను విభాగములతో నీయందు కలసియున్న వేదములను అన్నింటిని గనుగొనుచున్నాము. భవా! శర్వా! మహాదేవా! పినాకీ! రుద్రా! హరా! విశ్వేశా! మేమందరము నీకు అణగియున్నాము. పరమేశ్వరా! మమ్ము రక్షింపుము.

అని అట్లు దేవతలందరు తన్ను స్తుతింపగా దేవదేవుడగు మహేశ్వరుడు సంతోషమందెను. ఆ దేవతలందరతో నిట్లు పలికెను. “అదితి సుతులారా! భగునకు నేత్రములు వచ్చుగాక! పూషుని దంతములు మరల ఏర్పడుగాక! దక్షునిదగు ఈ యజ్ఞము ఏ లోపము లేనిదగు గాక! దేవతలారా! మీ పశు భావమును గూడ పోగొట్టెదను. నన్ను చూచుట వలన స్వర్గవాసుల కేర్పడిన పశుభావమును నేను వెనువెంటనే తొలగించెదను. మీకు మరల ఆధిపతిత్వము కలుగుగాక! నేను విద్యలన్నింటికి మొదటి ప్రభువును, సనాతనుడను, నేనే పశువుల నడుమ పతిలక్షణముతో నెలకొనియున్నవాడను, కావున నాకు 'పశుపతి' అను పేరు లోకమున ఏర్పడును. నన్ను పూజించువారికి పాశుపత దీక్ష కలుగును” అనుచు రుద్రుడిట్లు పలుకగా లోకపితా పితామహుడగు బ్రహ్మ చనువుతో, చిఱునగవుతో రుద్రునితో నిట్లు పలికెను.

దేవా! నీవు 'పశుపతి' అని లోకమున ఖ్యాతి నందెదవు. ఇది ధ్రువము. నీ పేరుతో ఈతడును లోకమున కీర్తికెక్కును. దేవతలందరకు ఆరాధ్యుడగును. ఇట్లని బ్రహ్మ జ్ఞానసంపద కలవాడై దక్షునితో రుద్రునకు, ముందే నిశ్చయించిన విధముగా, గౌరీదేవి నొసగుమని పలికెను. బ్రహ్మ యిట్లు పలుకగా దక్షుడు బ్రహ్మ సమక్షమున మహాదేవుడగు రుద్రునకు సర్వమంగళ యగు గౌరిని సమర్పించెను. అంత రుద్రుడు దక్షునకు మన్ననతో ప్రియ మొనర్చుచు సమస్త కల్యాణ గుణములు గల గౌరిని యథావిధిగ స్వీకరించెను. దక్షుని పుత్రికను శివుడు కైకొనగా, బ్రహ్మదేవతల యెదుట కైలాసమును శివునకు నెలువుగా నొసగెను. రుద్రుడు భూతగణములతో పాటు కైలాస పర్వతమున కరిగెను. దేవతలందరు సంతోషముతో తమతమ తావుల కరిగిరి. బ్రహ్మయు దక్షునితో కూడి ప్రాజాపత్యపురమున కరిగెను. (21)

22 వ అధ్యాయము - ఉమామహేశ్వర కళ్యాణ వృత్తాంతము

అనంతరము మహాతపుడు ఇలా చెప్పాడు. అలా పరమేశ్వరుడైన రుద్రుడు ఆ కైలాసగిరి యందు నివసించుచుండగా ఒకప్పుడు గౌరీదేవి తండ్రి, పగ మదిలో మెదలగా

రుద్రునిపై కోపించెను. ఈతడు మునుపు దక్షునకపకార మొనర్చెను. ఆతని యజ్ఞమును పాడుచేసెను. కావున నేను మరియొక దేహమును ధరిస్తాను. తపస్సుతో ఆతని నారాధించి మరల అతని గృహమును జేరుకొందును. అలాకాక బంధువులందరు నశించిన నాతండ్రి దక్షుని వద్దకు ఎలా వెళ్తాను? భవుని యిల్లాలు, దక్షుని కూతురు అగు ఆ సుందరి గౌరి యిట్లు తలపోసి తపస్సునకై హిమవంతమను మహాపర్వతమును చేరుకుంది. చాలాకాలం దేహాన్ని కృశింపజేసి తన శరీరాగ్నితో దానిని కాల్చివైచి ఆమె హిమవంతుని కూతురు అయ్యింది.

ఆదొడ్డ వనిత ఉమ, కృష్ణ అన్న పేర్లు గలిగి మిక్కిలి చక్కనైన రూపము తాల్చి హిమవంతుని గృహమున ఉదయించెను. ఆ త్రిలోచనుడే నాకు భర్త కావాలని తలచుచు గొప్పతనమున నిలిచి తపము చేసెను. హిమవత్పర్వతమున అట్లు తన్ను గూర్చి ఘోరతపము చేయుచున్న ఆమె ఆశ్రమమునకు ఆ మహేశ్వరుడు ముదుసలి, అవయవముల పట్టు సడలినవాడు, అడుగడుగునకు పడుచున్నవాడు అగు బ్రాహ్మణుని రూపము తాల్చి వచ్చెను. ఆ విప్రవరుడు అతికష్టమున ఆమెదరికి వచ్చి "మంచిదానా! బాపడను, ఆకలివేయుచున్నది. నాకు తినుటకేదైన పెట్టుము" అని అడిగెను. అతడిట్లు పలుకగా శైలకన్య ఉమ ఆ బ్రాహ్మణునితో "విప్ర! నీకు తినుటకు పండ్లు మొదలగునవి ఇత్తును. వేగమే స్నానము చేయుము. నీయిచ్ఛ వచ్చినట్లు అన్నము తినుము" అని పలికెను. అట్లు ఆమె పలుకగా ఆ విప్రుడు ఆ ఆశ్రమమునకు ప్రక్కనున్న మహానదియగు గంగకు స్నానము చేయగోరి వెళ్ళెను. స్నానము చేయుటకై దిగెను. బ్రాహ్మణ వేషము తాల్చిన రుద్రుడు స్నానము చేయుచుండగా నొక భయంకరమగు మొసలి మాయవలన నేర్పడెను. అప్పుడా విప్రుని ఆ చెడ్డ మొసలి పట్టుకుంది. మిక్కిలి బలము గల ఆ మొసలికి పట్టువడిన ఆ ముదుసలి "బాలా! చచ్చితిని. పరుగున వచ్చి నన్ను ఈ క్రూరమృగము బారి నుండి లాగికొని పొమ్ము. ఏదో కీడు మూడక ముందే నన్ను రక్షింపవలయును." అని అతడు అట్లు పలుకగా, పార్వతి ఇట్లు తలపోసెను. తండ్రియని హిమవంతుని, మగడని శంకరుని తాకఁగల్గుదును. తపస్సుచేత పవిత్రత నొందిన నేను ఇప్పుడీ బ్రాహ్మణుని ఎట్లు తాకజాలుదును? ఇప్పుడు నీటిలో మొసలికి చిక్కిన యాతనిని ఈవలకు లాగకపోతే నాకు నిస్సందేహంగా బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంటుంది. ఇతర తప్పిదాలను, అధర్మాన్ని

పోగొట్టుకోవచ్చు. బ్రహ్మ హత్యాదోషము మాత్రము పోగొట్టుకోరానిది– అని తలచి ఆమె వడివడిగా వెళ్లి, ఆ ముసలి బ్రాహ్మణుని చేతితో పట్టుకొని నీటి నుండి లాగెను. అంతలో తన తపస్సునకు లక్ష్యమైన ఆ రుద్రుడే ఆమె చేతికి చిక్కెను. ఆతనిని చూచినంత ఆ దేవి మిక్కిలి సిగ్గుపడెను. పూర్వము తన్ను వదలిన విషయమును తలపోయుచు ఆ సుందరి సిగ్గుతో ఒక్క మాటైనా పలుకకుండెను. అట్లు పలుకకున్న ఆ గౌరిని గాంచి రుద్రుడు మెల్లగా నవ్వుచు "ఓ కాంతా! నన్ను చేపట్టితివి. ఇప్పుడు ఎట్లు వదలగలవు? నా పాణిగ్రహణమును నీవు వ్యర్థము చేసినచో నేను బ్రహ్మపుత్రికను ఆహారము కొరకు వేడుకొందును. 'ఇది పరిహాసము కాదు' అని పలుకగా ఆతని యందు అనన్యభావముగల ఆ దేవి సిగ్గుపడుచు చిఱునగవుతో ఇట్లు పలికెను.

"దేవదేవా! త్రిలోకేశా! ఈ ప్రయత్నమంతయు నిన్ను పొందడానికే. పూర్వజన్మలలో నేను ఆరాధించిన దేవుడవు, మహేశ్వరుడవు, నా భర్తవు నీవే. ఇప్పుడును ఆ మహేశ్వర దేవుడవగు నీవే నా పతివి. మరియొకడు కాజాలడు. కానీ నాకు ప్రభువు, నాతండ్రి ఉన్నారు. నేను ఆతని వద్దకు వెళ్తాను. ఆతని అనుమతి తీసుకుని నన్ను నీవు పాణిగ్రహణము చేయవచ్చు" ఈ విధముగా పలికి ఆదేవి తండ్రి వద్దకు వెళ్లి, చేతులు జోడించి హిమవంతునితో "పూర్వజన్మలో దక్షుని యజ్ఞమును నాశనమొనర్చిన శంకరుడు నా భర్త. నేను అతనినే సర్వగతులలో భావన చేస్తూ, తపస్సుతో మనసున ధ్యానిస్తున్నాను. విశ్వపతియైన ఆ శంకరుడు బ్రాహ్మణుడై, భోజనము కొరకు నా తపోవనముకొచ్చి అన్నమడిగారు. నేను స్నానము చేసి రమ్మనగా గంగ కరిగెను. అందీ శంకరుడు పెద్ద దేహము, బాపని ఆకారము గలవాడై మొసలికి చిక్కి అయ్యో! కాపాడు! అని అరచెను.

నాయనా! బ్రహ్మహత్యకు భయపడి నేను అతనిని చేతితో పట్టుకొంటిని. పట్టుకొనినంత మాత్రమున ఆ శంకరుడు తన నిజదేహమును చూపెను. అంత నా దేవుడు అట్లు చేయి పట్టిన నన్ను 'దేవీ! తపోధనా! నీవేమియు విచారింపకుము' అని పలికెను. మహాత్ముడగు ఆ శంకరుడు అట్లు పలుకగా నేను అతని అనుమతిగొని నిన్నడుగ వచ్చితిని. ఇప్పుడు తగిన కార్యమును నీవు వేగము చేయదగును" అని పలికెను. అంత పర్వతరాజు ఆ మాట విని పరమానందముతో ఆ సమయమున విప్పారిన మోము గల ధన్యయగు తన బిడ్డతో ఇట్లు పలికెను. "బిడ్డా! లోకమున నేను ధన్యుడను. ఏలయన రుద్రుడు తానై

నాకల్లుడు కానున్నాడు. సంతానము గల దేవులందరిలో నేను, నీవలన సర్వశ్రేష్ఠుడనైతిని. 'నేను వచ్చునంతవరకు ఒక్కక్షణము నిలువుము' అని పలికి కొండలరేడగు హిమవంతుడు బ్రహ్మ దేవుని కడ కరిగెను. అచట సర్వదేవతలకు పితామహుడు, మహాత్ముడు అగు బ్రహ్మదేవుని గాంచి పర్వతరాజు ప్రణమిల్లి దేవా! నా బిడ్డ ఉమను రుద్రునకొసగెదను. నీవు అనుమతించినచో ఆపని చేయుదును. నాకానతిమ్ము" అని పలికెను : అంత దేవతలకు, లోకములకు పితామహుడగు ఆ బ్రహ్మ ఆనందమంది 'వెళ్లు. రుద్రునకు నీకన్య నిమ్ము' అని పలికెను. అంత హిమవంతుడు వడివడిగా తన యింటికి వచ్చి, వేగమే దేవతలను, ఋషులను, సిద్ధ సంఘములను ఆహ్వానించెను. తుంబురుని, నారదుని, హాహాహూహూ వును, కిన్నరులను, అసురులను, రక్కసులను పిలిపించెను. పర్వతములు, నదులు, చిఱుకొండలు ఔషధులు, బాలకుప్పలు – ఈ అన్నియు ప్రాణుల ఆకారములు ధరించి హిమవంతుని బిడ్డకు శంకరునితో జరుగు వివాహమును జూడ వచ్చెను. అందు భూమియే పెండ్లి అరుగు, ఏడు సముద్రములే కలశములు, సూర్యచంద్రులే దీపములు, నదులే జలము లాయెను. ఇట్లు పెండ్లి వస్తువుల నన్నింటిని సమకూర్చుకొని పర్వతరాజు మందర పర్వతమును రుద్రుని కడ కంపెను. మందరుడు వచ్చి చెప్పగా శంకరుడు శీఘ్రముగా ఉమాదేవిని పాణిగ్రహణము గావించెను. ఆ వేడుకయందు పర్వత నారదు లిద్దరు పాటలు పాడిరి. సిద్ధులు నాట్యమాడిరి. మంచి వృక్షములు పెక్కు పూవులనుచల్లెను. దేవకాంతలు పెద్దగా నృత్యములు చేసిరి. మంగళజలములు ప్రవహించిన ఆ పెండ్లి యందు, లోకేశుడగు బ్రహ్మ చక్కని స్థితి కలవాడై 'బిడ్డా! లోకమున నీమగడు తక్కిన పురుషులందరిలో గొప్పవాడు. నీవు స్త్రీలందరి కంటే మిన్నయైనదానవు' అని రుద్రునితో కూడిన ఉమాదేవిని ప్రశంసించి తన పురమున కరిగెను. పర్వతరాజు హిమవంతుడు అల్లుని గొప్పగా మన్నించి సాగనంపెను. అట్లే దేవతలను, దైత్యులను, వేరు వేరు ఋషులను ఆయా పర్వతములను వివిధములగు వస్తు ఆభరణములతో, వస్త్రములతో, మేలురకపు భోజనములతో సత్కరించి పంపెను.

ఇట్లు చక్కని మోముగల తన బిడ్డను దేవశ్రేష్ఠుడగు శివునకర్పించి మహాత్ముడు పర్వతరాజగు హిమవంతుడు శోకము, పాపము లేనివాడై పరిశుద్ధుడై బ్రహ్మలోకమున జరిగిన యజ్ఞము నందువలె ప్రకాశించెను. అని చెప్పి మహాతపుడు, ప్రజాపాలునితో

“రాజశేఖరా! దేవదానవులు కూడ ఎఱుగని గౌరి పుట్టుకను గూర్చి నీకు చెప్పితిని. అట్లే మూడు జన్మములలో స్వయంభువు, దక్షుడు, పర్వతరాజు అనువారికి ఆమె పుట్టిన సంగతియు, వివాహమును నీకు వర్ణించితిని” అని ఇట్లామె గౌరియను పేరున కారణ జన్మముగా ఆకారము ధరించి పుట్టిన విషయమంతయు తపస్సుతో పండిన బుద్ధి విశేషముగల మహర్షి తన్నడిగిన ప్రజాపాలునకు చెప్పెను. ఆ మహర్షి చెప్పిన గౌరి పుట్టుక, వివాహముల కథ నీకు ఉన్నదున్నట్లు చెప్పితిని. పార్వతీదేవికి సంబంధించిన యీ వృత్తాంతమంతయు తదియనాడు జరిగినది. కావున ఆ తదియనాడు స్త్రీ పురుషులు ఉప్పు తినుట మానవలయును. స్త్రీ ఆ తిథినాడు ఉపవాస మున్నచో సౌభాగ్యము పొందును. దరిద్రురాలగు స్త్రీగాని, దరిద్రుడగు పురుషుడు గాని ఈ కథ విని తదియనాడు ఉప్పు తినుట మానినచో వారి అన్నికోరికలు తీరును. సౌభాగ్యమును కలుగును. ద్రవ్య సంపదలు, ఆరోగ్యము, కాంతి, పుష్టి ఎల్లవేళల పొందుదురు” అని పల్కెను. (22)

23 వ అధ్యాయము - గణపతి జన్మాది వృత్తాంతము-చతుర్థీతిథి

అనంతరము ప్రజాపాలుడు ఇట్లు ప్రశ్నించెను. “మహర్షీ! గణపతి పుట్టుక కథ యేమి? ఆతనికి ఆ ఆకారమెట్లు వచ్చెను. మనస్సుకు బరువుగా ఉన్న యీ సంశయమును దీర్చుము” అని ప్రార్థింపగా మహాతపుడు మునుపు దేవతలు, తపోధనులగు ఋషులు ఆయా పనులు చక్కగా సిద్ధి పొందునట్లు కార్యములను ప్రారంభించెడివారు. మంచి నడవడి కలవారి యందు పనులు ఆటంకముల తోడను, చెడు నడవడి కలవారి యందు ఏ విఘ్నములు లేకుండ ఫలించుటయు సంభవించెను. అది చూచి దేవతలు, పితరులు శక్తి కొలది విచారించిరి. చెడుపనుల యందు విఘ్నము కలుగుటకై అందరు ఆలోచించిరి. అట్లు ఆలోచన చేయుచున్న దేవతల బుద్ధికి దొడ్డబుద్ధి గల రుద్రుని కడకరుగ వలయునను భావన కలిగెను. అంత వారందరు కైలాసవాసియగు గురువు రుద్రుని కడకు పోయి దండ ప్రణామములు గావించి వినయముతో

“దేవదేవా! మహాదేవా! శూలపాణీ! త్రిలోచనా! దుష్టుల కార్యములకు విఘ్నములు కలిగించుటకై ఒకనిని నీవు పుట్టింపవలయును” అని కోరిరి. దేవతలిట్లు పలుకగా పరమేశ్వరుడు పరమానందము నొంది రెప్పపాటులేని కంటితో పార్వతిని చూచెను. ఇట్లు దేవతల యెదుట ఉమను చూచుచున్న ఆ మహాత్ముని మదిలో

ఆకాశమునకు రూపము లేని కారణమేమా? అని ఆలోచన బయలుదేరెను. భూమికి ఆకృతి కలదు. నీటికి అట్లే కలదు. అగ్నికి, వాయువునకు ఆకృతికలదు, ఈ ఆకాశమున కేల లేదు? అని భావించుచు, ఆ దేవదేవుడు నవ్వెను. జ్ఞానశక్తియగు ఉమను చూచి, రుద్రుడు ఆకాశమున చూచెను. మఱియు ముందే బ్రహ్మశరీరుల శరీరమును గూర్చి పలికి ఉండెను. పరమేశ్వరుడు నవ్వెను. ఈ నాలుగు కార్యములతోడను, భూమి మొదలగు నాలుగు భూతములందున్న గుణములతోడను, కూడి నవ్వుచున్న పరమేశ్వరుని నుండి గొప్ప ఆకారము, దొడ్డది యగు తేజస్సు, వెలిగిపోవుచున్న ముఖము, గొప్ప వెలుగుగల కుమారుడు దిక్కులను ప్రకాశింపజేయుచు, పరమేష్ఠిగుణములతో కూడినవాడై, అపర రుద్రుడా అన్నట్లు ఏర్పడెను. కాంతి, తేజస్సు, ఆకారము, రూపము అను వానితో ఆ మహాత్ముడు పుట్టుచునే దేవకాంతలను మురిపించెను. ఆ కుమారుని రూపము అందముగా ఉండి, దేవకాంతలను సమ్మోహింపచేసింది. మహాత్ముడగు ఆ కుమారుని చక్కని రూపమునుగాంచి ఉమ రెప్పలార్పక వానిని చూచుచుండెను. అది చూచి కోపించిన శివుడు, స్త్రీ స్వభావము చంచలము కదా అని భావించి, ఆతనిని "కుమార! ఏనుగుమోము, జారిన పొట్టయు, పాముల జందెము గలవాడ వగుదువు– అని పట్టరాని కోపముతో శపించెను. ముక్కంటిదేవర దేహమునందలి యేబదిలక్షల రోమకూపములలో చెమట నిండి పోయెను. అట్టి త్రిశూలధారి దేహమును విదలించుచు పెనుకోపముతో లేచెను. త్రిశూలము చేత బట్టిన ఆ దేవుడెట్లెట్లు తన మొదటిదగు దేహమును విదలించు చుండెనో అట్లట్లు ఆతని కేశములు విరాజిల్లుచుండెను. చెమట నీరు నేలపై కాలువలు కట్టెను, ఏనుగుమోము గలవారు చీకటి చెట్లవలె, కాటుకవలె నల్లని దేహములుగలవారు, పెక్కు ఆయుధము దాల్చినవారు అగు వినాయకులు పెక్కుతీరులవారు లేచివచ్చిరి. అంత దేవతలందరు మనసులలో కలతపడి "ఇదియేమి? అద్భుతకర్మ మాచరించుచు, ఈ శివుడు ఇంత దొడ్డపని చేయుచున్నాడు. దేవతల కార్యము ఇతడొక్కడే చేయగలవాడు. మఱి యీ పెక్కుస్వరూపములతో పనియేమి?" అని దేవతలిట్లు చింతించుచుండగా వినాయకులతో భూమి అంతయు గగ్గోలు పడిపోయెను. అంత సాటిలేని బ్రహ్మ, విమానమెక్కి ఆకసమున నిలిచి, "దేవతలారా! మీరు ధన్యులైతిరి. అద్భుతమగు రూపము గల ముక్కంటి దేవర పరమేశ్వరుడు మిమ్ములను అనుగ్రహించెను. ఈ రూపములన్నియు దేవతల శత్రువులకు

విఘ్నములు కలిగించునవి" అని పలికెను. పితామహుడగు చతుర్ముఖుడు దేవతలతో ఇట్లు పలికి పిదప పరమేశ్వరునితో "ప్రభూ! నీ మోము నుండి పుట్టిన ఈ స్వామి వినాయకులకు ప్రభువగుగాక! వీరందరు అతని బంటులగుదురు గాక! నీవు అందరి కంటే మిన్నగా నిర్మించిన ఒక్కడు శరీరముతో తిరుగువాడై ఆకాశమున నిలుచుగాక! ఆతడు మొదట నాలుగు లక్షణములతో ఏర్పడినవాడే అగుగాక! ఆ ఆకాశము చాల పెద్దదిగదా! నీవు శ్రేష్ఠునే చేసితివి కాని ఇతరుని కాదు. ఆ వినాయకునకు నీవు ప్రభువగుము. ప్రతిమలవంటి అస్త్రములను చేత దాల్చి యీ బాలునకు అస్త్రములను, వరములను ఇమ్ము" – అని పలికి బ్రహ్మదేవుడు వెడలిపోగా, ముక్కంటి తన కొడుకుతో నిట్లు పలికెను. "నీవు వినాయకుడు, విఘ్నకరుడు, గజముఖుడు, శివపుత్రుడు, గణేశుడు అను పేర్లతో ప్రసిద్ధి పొందుము. ఈ క్రూరమగు చూపులు, భయముగొల్పు చేష్టలుగల ఈ వినాయకులందరు నీకు బంటులగుదురు. తాపములులేని వారొసగు పదార్థములతో పెంపొందిన దేహముగల వీరు ఆయా జనుల కార్యములను సఫలము చేయుచుందురు. నీవును నీ మహానుభావము వలన దేవతల యజ్ఞములలో, ఆయా శుభకార్యములలో మొట్టమొదట పూజనందుకొనెదవు. అట్లు కానిచో ఆయా కార్యముల సిద్ధిని నాశమొందింతువు" అని పరమేశ్వరుడిట్లు పలికి దేవతలతో పాటు బంగారు కుండలలో నున్న జలములతో ఆతనిని అభిషేకించెను. అట్లు వినాయకులతో ఆతడు విరాజిల్లెను. అట్లు అభిషేకము పొందుచున్న ఆ గణనాయకుని గాంచి దేవతలందఱు త్రిశూలపాణి సన్నిధానమున శ్రద్ధాసక్తులతో స్తుతించిరి.

దేవకృత గణపతిస్తుతి

దేవ ఉవాచ:

నమస్తే గజవక్త్రయ నమస్తే గణనాయక | వినాయక నమస్తే2స్తు నమస్తే చండవిక్రమ ||

నమో2స్తు తే విఘ్నకర్తే నమస్తే సర్ప మేఖల | నమస్తే రుద్రవక్త్రోత్థ ప్రలమ్బ జఠరాశ్రిత ||

సర్వ దేవనమస్కారాదవిఘ్నం కురు సర్వదా | ఏవం స్తుతస్తదా దేవైర్మహాత్మా గణనాయకః |

అభిషిక్తశ్చ రుద్రస్య సోమస్యా పత్యతాం గతః ||

ఏతచ్చతుర్థ్యాం సంపన్నం గణాధ్యక్షస్య పార్థివ | యత స్తతో2యం మహతీ తిథీనాం పరమా తిథిః ||

ఏతస్యాం యస్తిలాన్ భుక్త్వా భక్త్యా గణపతిం నృప |ఆరాధయతి తస్యాశు తుష్యతే నాత్ర సంశయః ||

యశ్చైతత్ పఠతే స్తోత్రం యశ్చైతచ్ఛృణుయాత్ సదా |న తస్య విఘ్నా జాయన్తే పాపం సర్వథా నృప || (23.31-36)

భావము: ఏనుగుమోము దేవరయగు నీకు నమస్కారము. గణనాయక! వినాయక! భయము గొల్పు పరాక్రమముగల నీకు మ్రొక్కులు. విఘ్నకర్తా! నీకు నమస్కారము. సర్పములు మొలనూలుగాగల స్వామీ! నీకు వందనము. రుద్రుని ముఖము నుండి పుట్టిన దేవా! నీకునతులు, జారుబొట్టగల దేవరా! నీకు కైమోడ్పు. సర్వదేవతలు నీకు మ్రొక్కుచున్నారు. అందువలన వారికి ఎల్లవేళ విఘ్నములు లేకుండజేయుము.

ఇట్లు దేవతల స్తుతుల నందుకొనిన గణనాయకుడు అభిషిక్తుడాయెను. ఉమాసహితుడగు రుద్రునికి కుమారుడాయెను. ఇట్లు వినాయకుడు గణనాథుడగుట చవితినాడు జరిగినది. అందువలన చతుర్థితిథి తిథులలో శ్రేష్ఠమై అలరారినది. ఈ తిథియందు నువ్వులను భుజించి గణపతిని భక్తితో పూజించిన వానియెడ గణపతి ప్రసన్నుడగును. ఇందు సందియము లేదు. ఈ స్తోత్రము చదివినవానికి, విన్నవానికిని విఘ్నములు కలుగవు. పాపమేవిధమునను అంటదు. (23)

24 వ అధ్యాయం- నాగవృత్తాంతము-పంచమీతిథి

అని శ్రీవరాహులు తెలుపగా భూదేవి ఇట్లు ప్రశ్నించెను. "దేవదేవా! భూధారీ! గొప్పబలము, పెద్ద ఆకారముగల సర్పములు ఆ పరమేశ్వరుని శరీరమును అంటి యుండుటకు కారణమెయ్యది?" అని ప్రశ్నింపగా వరాహమూర్తి గణపతి పుట్టుకను గూర్చి విన్న ప్రజాపాల మహారాజు మధురమగు వాక్కుతో పవిత్రమగు వ్రతములుగల ఆ మునితో యిట్లు పలికెను. "భగవానుడా! వంకరతనము గల నాగులు ఎట్లు రూపొందిరి? ఇది నాకు చెప్పుము. మరియు వారికి ఆకారమెట్లు కలిగినది?" అందులకు మహాతపుడు ఆ రాజుతో "బ్రహ్మదేవుడు సృష్టి చేయుచు సంతానము కొరకై మొదట మనసున ధ్యానింపగా మరీచి పుట్టెను. అతని కొడుకు కశ్యపుడు. ఆ కశ్యపునకు దక్షునిపుత్రిక కద్రువ అను సుందరవదన భార్య అయ్యెను. కశ్యపునియందు ఆమెకు గొప్ప బలముగల పుత్రులు పుట్టిరి.

అనంతుడు, వాసుకి, మహాబలుడగు కంబలుడు, కర్కోటకుడు, పద్మడు, మహాపద్మడు, శంఖుడు ఎవ్వరికిని ఓడని కులికుడు – వీరు కశ్యపుని సంతానము నందు ప్రధానులు, వీరి సంతానముతో జగమంతయు నిండిపోయెను. వంకర దేహములు, క్రూరపు పనులు, వాడిమోములు, పొంగివచ్చు విషతీవ్రతయు గల వీరు మనుజులను చూచినంతనే కాటువేసి క్షణములో బూడిద గావించుచుండెడివారు. ధ్వనినిబట్టి ఆ నాగులు మనుష్యులకడచేరి వారిని తాకుదురు. ఈ విధముగా ప్రతిదినము పరమ ఘోరమగు వినాశము సంభవించు చుండెను. ఇట్లు తమకు వినాశము కల్గుచుండగా చూచి ప్రజలందరు అన్నివైపుల నుండి బయలుదేరి రక్షకుడు, పరదైవము అగు పరమేశ్వరుని శరణుజొచ్చిరి. ఈపని కొఱకే ప్రజలందరు పద్మమున బుట్టిన పురాణ దైవము బ్రహ్మను గాంచి యిట్లు పలికిరి, దేవదేవా! ప్రభూ! పరమేశ్వరా! నీ సంతానమగు మమ్ము వాడికోరలు, పెద్ద దేహములుగాల పాములబారి నుండి రక్షింపుము. దేవా ప్రతిదినము మనుష్య రూపముగాని, పశురూపము ఆ పాముల కంట బడినంత బూడిదయై పోవుచున్నది. నీవు పుట్టించుచున్నావు. ఆనాగులు నాశనము చేయుచున్నారు. ఈ పాడుపనిని గమనించి తగిన కార్యమాచరింపుము" అని విన్నవింపగా చతుర్ముఖుడు వారితో "నేను మీకు రక్షణ కల్పింతును. సంశయము వలదు. మీమీ యిండ్లకు పొందు. ప్రజలకు కంగారు కలుగరాదు" అనుచు ఇట్టిదని చెప్పరాని ఆకృతిగల బ్రహ్మఇట్లు పలుకగా ప్రజలందరూ పరమసంతోషముతో స్వయంభువునకు నమస్కరించి తిరిగివచ్చిరి. అట్లు తిరిగిపోగా బ్రహ్మ వాసుకి మొదలగు పాములను పిలిచి పట్టరాని కోపంగా ప్రజలందరిని మీరు ప్రతిదినము నాశమొందించుచున్నారు. కావున మీకు మరియొక పుట్టుక యందు తల్లి యిచ్చెడు భయంకర శాపమువలన ఘోరమైన వినాశము పొందుదురు. ఇది స్వాయంభువ మన్వంతరమున జరుగును" అని శపించెను. బ్రహ్మ ఇట్లు పలుకగా ఆ నాగముఖ్యులందరు వణకిపోవుచు బ్రహ్మ పాదములపై బడి "భగవంతుడా! మా జాతిని నీవే కుటిలముగా చేసితివి. పెల్లుబికెడు విషము, క్రూరత్వము, చూపునట్టి శస్త్రమగు లక్షణమును నీవే ఏర్పరచితివి. ఇప్పుడు పాపరహితుడా! నీవు శాంతింపవలయును" అని పలికిరి. సర్పములాడిన మాటలకు బ్రహ్మ,

"తప్పుడు భావములు గల నాగులారా! నేనే మిమ్ములను సృజించినచో మీరు చీకును చింతయు లేక మనుజుల నేల నిత్యము తినుచున్నారు?" అని ప్రశ్నింపగా సర్పములు "దేవదేవా! మాకును మనుష్యులకు హద్దు లేర్పరపుము. వేరువేరుగా ఉండుచోటులను ఏర్పరపుము. కట్టుబాటు చేయుము" అని విన్నవించిరి. అంత బ్రహ్మ నాగుల మాట విని యిట్లు పలికెను. "నాగులారా! మీకు మానవులతో ఒక కట్టడి చేసెదను. నా శాసనమును చెదరని మనస్సుతో వినుడు. పాతాళము, వితలము, హర్మ్యము, అను మూడు లోకములు ఎల్లవేళల చూడముచ్చట గొలుపునవి మీకు నివాసముగా నిచ్చితిని. అచ్చటకు పొండు. అచట నా ఆజ్ఞవలన పెక్కు తీరులగు సుఖముల ననుభవించుచు ఏడురాత్రుల వంతు ఉండుడు. అంత వైవస్వత మన్వంతరము ప్రారంభమున మరల మీరు కశ్యప ప్రజాపతికి పుత్రులగుదురు. దేవతలందరకును, బుద్ధిమంతుడగు గరుత్మంతునకును జ్ఞాతులుగా పుట్టుదురు. అప్పుడు మీ సంతానము అంతయు అగ్నిదేవునకు భోజనమగును. మీకీ శాపము తగులదు. సంశయము లేదు. క్రూరులు, చెడ్డబుద్ధి గలవారు మీలో నుందురేని వారికి వినాశము తప్పదు. తిండి వేళకు దొరికిన మనుజులను, అపకారము చేసినవారిని మాత్రము మీరు తినుచుండుడు. మంత్రములతో ఔషధులతో, గరుడసంబంధమైన మండలములతో తిరుగు మానవులకు మీలో దుష్టులు చిక్కిపోవుదురు. వారి వలన మాత్రము మీరు భయముతో తిరుగుడు. ఇతర విధముల మీరు చింతింప పనిలేదు. అట్లుకానిచో మీకు వినాశము తప్పదు".

అని బ్రహ్మ ఇట్లు పలుకగా ఆ నాగులందరు క్ష్మాతలమను చోటికి అరిగిరి. అందు విలాసముగా నివసించుచు నిండైన భోగములు అనుభవించుచు నిలిచిరి. ఇట్లు బ్రహ్మవలన వారు శాపమొంది, పిదప అనుగ్రహమును సంపాదించి మోదముగల భావములతో పాతాళలోకమున నివసించిరి. ఆ మహాత్ముల ఈ కథయంతయు పంచమినాడు జరిగెను. అందువలన ఈ తిథి పుణ్యవంతమైనది. సర్వపాపములను హరించునది. శుభప్రదమైనది. ఈ తిథియందు నియమముగలవాడు పులుపు పరిహరింపవలయును. నాగులను పాలతో అభిషేకింప వలయును. అట్లయినచో వారికి మిత్రములగుదురు" అని మహాతపుడు తెలిపెను.(24)

25 వ అధ్యాయము - కార్తికేయ వృత్తాంతము - షష్ఠీతిథి

ప్రజాపాలుడు ఆయనను ఇట్లు ప్రశ్నించెను. "బ్రాహ్మణ ప్రవరా! మహామునీ! అహంకారము నుండి, కార్తికేయుడు ఎట్లు జన్మించెను? నా సంశయము తీర్చుకొనుటకు అడుగుచున్నాను, అనగా ఆ మహర్షి తత్త్వములన్నింటికి చిట్టచివరి దానిని పురుషు డందురు. ఆ పురుషుని నుండి అవ్యక్తము ఏర్పడినది. అది మూడు విధములైనది. పురుషునకు అవ్యక్తమునకు నడుమ 'మహత్తు' అనునది యేర్పడినది. దానినే అహంకార మనియు నందురు. పురుషుడు విష్ణువు లేదా శివుడు. అవ్యక్తము పద్మముల వంటి కన్నులుగల లక్ష్మీదేవి లేక ఉమాదేవి. వారిరువురి సంయోగము వలన అహంకారము పుట్టెను. అతడే సేనానియగు కుమారస్వామి. రాజా! బుద్ధిశాలీ! ఆతని పుట్టుకను వివరించి చెప్పెదను వినుము. అందరకు మూలము నారాయణదేవుడు. ఆతని నుండి బ్రహ్మ పుట్టెను. ఆతని వలన స్వయంభువులగు మరీచి, మొదలగు బ్రహ్మలు పుట్టిరి. వారే సూర్యాదులకు కారణమైన వారు. వారితో మొదలుకొని దేవతలు, రాక్షసులు, గంధర్వులు, మనుష్యులు, పక్షులు, పశువులు, సర్వభూతములు ఏర్పడెను. దీనినే సృష్టి అందురు. ఇట్లు సృష్టి క్రమక్రమముగా పెరిగిపోగా గొప్పబలముగల దేవతలును, దానవులను ఒకరిపై ఒకరు విరోధము పెట్టుకొని గెలువ వలయునను కోరికతో పోరాడిరి. దైత్యుల నాయకులు యుద్ధమున మిక్కిలి పొగరు కలవారు, గొప్ప బలము కలవారు నైయుండిరి. అందు మొదటివాడు హిరణ్యకశిపుడు. మహాబలుడగు హిరణ్యాక్షుడు, విప్రచిత్తి, విచిత్తి, భీమాక్షుడు క్రౌంచుడు, మొదలగు గొప్ప శక్తికల శూరులు మహా యుద్ధమున ప్రతిదినము నిరంతరము పదునైన బాణములతో దేవసేనను పరిమార్చుచుండిరి. ఆ దేవతల ఓటమిని చూచి, బృహస్పతి యిట్లు పలికెను. "దేవతలారా! నాయకుడు లేని మీ సేన హీనమై యున్నది. ఒక్క ఇంద్రునితో ఈ దేవసేన అంతటిని రక్షింపనలవి కాదు. కావున ఒక సేనానిని వెదకుడు. ఆలసింపకుడు." అని బృహస్పతి అట్లు పలుకగా ఆ దేవతలందరు లోకములకు పితామహుడగు బ్రహ్మకడకు పోయి తొందరతనముతో "మాకు సేనాపతి నొసగుము" అని పలికిరి. అంత నలువ వీరికి నేనేమి చేయుదునా! అని చింతించెను. అంతట ఆయన మదిలో రుద్రుడు మెదలెను. పిమ్మట దేవతలు, గంధర్వులు, ఋషులు, సిద్ధులు, చారణులు, బ్రహ్మను ముందిడుకొని కైలాస పర్వతమున కరిగిరి.

అందు మహాదేవుడు, శివుడు, పశుపతియునగు ప్రభువును గాంచి వివిధములగు స్తోత్రములతో దేవేంద్రుడు మొదలగు దేవతలందరు ఈ విధముగా స్తుతించిరి. మేమందరము మహేశ్వరుడు, ముక్కంటి, భూతపతియగు శంకరుని శరణుగోరిన వారమై మ్రొక్కుచున్నాము. ఉమాపతీ! విశ్వపతీ! దేవపతీ! జగత్పతీ! శంకరా! మమ్ములను నీవే కాపాడుము. త్రిశూలపాణీ! పురుషోత్తమా! అచ్యుతా! జటలగుంపు చివర నున్న చంద్రుని కాంతితో వెలుగొందు సమస్త జగములు కల దేవరా! మూడు లోకములు గర్భమున గల స్వామీ! దైత్యుల నుంచి మమ్ము రక్షింపుము. నీవు ఆదిదేవుడవు, పురుషోత్తముడవు. హరివి, భవుడవు, మహేశుడవు, త్రిపురాసురులను రూపుమాపినవాడవు. విభుడవు, భగుని కన్నులు పెరికినవాడవు. దితి కొడుకులను చంపినవాడవు. పురాతనుడవు. వృషభధ్వజుడవు. ఉత్తములగు దేవతలకెల్ల ఉత్తముడవు. మమ్ము పాలింపుము. భూమి మొదలగు తత్త్వము లందు ఆయాగుణముల రూపముననీవే నెలకొని యున్నావు. విశేషించి ఆకసమున ధ్వనిస్వరూపునిగా, వాయువు నందు శబ్దస్పర్శములను రెండు లక్షణములతో, అగ్నియందు శబ్దస్పర్శ రూపములను మూడు లక్షణములతో, భూమియందు శబ్దస్పర్శరూపరస గంధములను అయిదు గుణములతో నీవే కలవు. అట్టి నీవు మమ్ము కాపాడుము, చెట్లలో నీవు అగ్ని స్వరూపము కలవాడవు. రాళ్ళలో నీవు సత్త్వ స్వరూపుడవు. (సత్యము–శక్తి) జలములలో విద్యుత్స్వరూపుడవు, భగవంతుడవు. మహేశ్వరుడవు. దైత్యుల గుణములు పట్టిపీడించు చున్న మమ్ము కాపాడుము. మొదట ఈ సృష్టి ఏమియు లేదు. సూర్యుడు ఇంద్రుడు, కుబేరుడు, మొదలగు వారి సంగతి చెప్పనేల? తర్కములు మొదలగు వానితో సంబంధము లేక ఉన్నవాడవు. కపాలములు మాలగా, చంద్రరేఖ శిరోభూషణముగా, తెల్లని బూది మైపూతగా, శ్మశానము గృహముగా, పాములు జందెముగా గల దేవదేవా! యమునికి యముడైన ఓ స్వామీ! సమర్ధమగు బుద్ధితో మమ్ము రక్షింపుము. నీవు పురుషుడవు. శక్తి స్వరూపిణియగు ఈ గిరిసుత సర్వాంగములలో అందము గలదియె నీయందే నిలిచి యున్నది. మూడులోకములు నీచేతనున్న త్రిశూలరూపముతో ఉన్నవి. మూడుకన్నులలో గార్హపత్యము, ఆహవనీయము, దక్షిణము అను యజ్ఞపు అగ్నులు మూడును కుదురుకొని ఉన్నవి. అన్ని సముద్రములు, ఏడు కుల పర్వతములు, నదులు నీ జడల స్వరూపముతో అలరారుచున్నవి. తలపై చంద్రుడు జ్ఞాన స్వరూపముతో నిలచి

యున్నాడు. పాడుచూపులు గల జనులు నిన్ను ఇట్లు చూడజాలరు. జగముల ఉత్పత్తికి కారణమగు నారాయణుడవు నీవు. అట్లే భవుడు, బ్రహ్మయు నీవే. అట్లే నీవు సత్త్వము మొదలగు గుణముల భేదముతో, గార్హపత్యము మున్నగు అగ్నుల రూపముతో, కృతము మున్నగు యుగముల భేదముతో మూడు విధములుగా నిలిచి ఉన్నావు. ఈ దేవనాయకులు అందరు నీ మఱియొక పుట్టుకను కోరుచు సంతోషముతో స్తుతించుచున్నారు. విశ్వేశ్వరా! రుద్రా! భూతి భూషణా! మాకై మరల జన్మింపుము. మమ్ములను రక్షింపుము. నీకు నమస్సులు.

అనుచు ఇట్లు దేవతలందరు తన్ను స్తుతింపగా పశుపతి, చెదరని మనస్సుతో దేవతలతో 'పనియేమి? చెప్పుడు ఆలసింపకుడు' అని పలికెను. అందులకు దేవతలు "దేవేశా! దైత్యుల నంతమొందించుటకై మాకు సేనాపతిని ప్రసాదింపుము. బ్రహ్మ మొదలగు దేవతలకు ఇదియే హితము" అని వినుతింపగా కరుణామయుడగు చంద్ర శేఖరుడు "దేవతలారా! మీకు సేనాపతి నొసగుదును. చింతమానుడు. సనాతనమగు యోగాదుల భావనకు కూడ అందని తత్వము పుట్టగలదు." అని పలికి శివుడు దేవతలను పంపి తన దేహమున నెలకొన్న శక్తిని పుత్రుని కొరకై మథించెను. అట్లు శక్తిని ఊపివైచిన శివుని నుండి అగ్ని సూర్యులతో సమానమగు కాంతిగల వాడగు కుమారుడు జ్ఞానముతో విరాజిల్లు సహజశక్తితో పుట్టెను. పెక్కు మన్వంతరములలో దేవ సేనాపతి పుట్టుక పెక్కురూపములతో ఉండెనట!

రాజా! దేహమున నున్న అహంకార మనునదియే ఒక ప్రయోజనము కొఱకు దేవుడైన సేనాపతి రూపమున అవతరించెను. ఆతడు అట్లు జనింపగా దేవతలందరితో పాటు బ్రహ్మ, దేవదేవుడు, శివుడు అగు పశుపతిని పూజించెను. దేవతలందరును, ఋషులును, సిద్ధులు వరముల నొసగి ఆతనిని లాలించిరి. అంత దేవతలతో కుమారుడు నాకు ఆటకై ఒక తోడు కల్పింపుడని పలికెను. ఆతని మాట విని మహానుభావుడగు మహాదేవుడు "నీకు కోడిని ఆట వస్తువుగా నిత్తును. అట్లే శాఖుడు, విశాఖుడు అను ఇద్దరు సేవకుల నొసగుదును. కుమారా! భూత గ్రహములకు నాయకుడవగుము. దేవతలకు సేనాపతివగుము" అని ఇట్లు ఆ మహాదేవుడును పలుకగా, దేవతలందరను, శివుని ఆనందపరచు వాక్కులతో స్కందుడగు ఆ సేనాపతిని స్తుతించిరి.

<u>దేవకృతస్కందస్తుతి</u>

భవస్వ దేవసేనానీ ర్మహేశ్వరసుత ప్రభో | షణ్ముఖ స్కన్ద విశ్వేశ కుక్కుటధ్వజ పావకే ||

కమ్పితారే కుమారేశ స్కన్ద బాలగ్రహానుగ | జితారే క్రౌఞ్చవిధ్వంస కృత్తికాసుత మాతృజ ||

భూతగ్రహపతి శ్రేష్ఠ పావకి ప్రియదర్శన | మహాభూతపతేః పుత్ర త్రిలోచన నమో2స్తుతే ||

ఏవం స్తుతస్తదా దేవైర్వవర్ధ భవనన్దనః | ద్వాదశాదిత్యసంకాశో బభూవాద్భుతదర్శనః |

త్రైలోక్యమపి తత్తేజస్తాపయాస పార్థివ ||

యశ్చైతత్ పఠతి స్తోత్రం కార్తి కేయస్య మానవః | తస్య గేహే కుమారాణాం క్షేమారోగ్యం భవిష్యతి || (25.40-43, 50)

భావం: "మహేశ్వరుని పుత్రుడా! ఆరుమొగముల దేవరా! స్కందా! విశ్వేశా! కుక్కుటధ్వజా! అగ్నిపుత్రా! నీవు దేవసేనాని వగుము. శత్రువులను వణకించినవాడా! కుమారా! ప్రభూ! స్కంధా! బాలగ్రహముల స్వామీ! శత్రువులను జయించినవాడా! క్రౌంచ పర్వతమును ఛేదించినవాడా! కృత్తికల కుమారా! ఆరు మాతృకలకు ముద్దు బిడ్డా! నీకు నమస్సులు. భూత గ్రహముల ప్రభూ! అగ్నితనయా! ప్రియదర్శనా! మహాభూతపతి కుమారా! ముక్కంటి స్వామీ! నీకు నమస్సు" ఇట్లు దేవతలు స్తుతింపగా శివునికుమారుడు పెరుగజొచ్చెను. పండ్రెండుగురు సూర్యులతో ధీటైనవాడై చూడ ఆశ్చర్యము గొలుపు చుండెను. ఆతని తేజస్సు మూడు లోకములకు తాపము కలిగించుచుండెను.

అని ముని తెలియజేయగా రాజు ఆ గొప్ప దైవమును దేవతలు కృత్తికల కొడుకనియు, అగ్నిసుతుడనియు, మాతృకల ముద్దు బిడ్డడనియు ఎట్లు పలికిరి? అని ప్రశ్నించెను. ప్రజాపాల మహారాజుకు మహాతపుడు "నేను మొదటి మన్వంతరము నాటి స్వామి పుట్టుకను చెప్పితిని. దేవతలు పరోక్షమును గూడ జూడగలవారు కనుక ఆ ప్రభువునిట్లు స్తుతించిరి. రెండవ జన్మమున కృత్తిక, అగ్ని, సప్తమాతృకలు, పార్వతి అనువారు ఈ గుహుని పుట్టుకకు కారణమైనవారు. రాజా! నీవు నన్నడిగినదానికి సంబంధించిన విషయమంతయు, ఆత్మవిద్యయనెడు అమృతమును, రహస్యమైనదానిని, అహంకారము యొక్క ఉత్పత్తిని నీకు వివరించి చెప్పితిని. ఆ స్కందుడు సర్వపాపములు రూపుమాపు సాక్షాత్తు మహాదేవుడే. బ్రహ్మ ఆతని అభిషేకమునకు షష్ఠి తిథిని నిర్ణయించెను.

పండ్లు మాత్రము భుజించుచు మనసును అదుపులో ఉంచుకొని ఈ తిథిని గడుపువాడు పుత్రులు లేనివాడైనను పుత్రులను పొందును. ధనములేనివాడు ధనవంతుడగును. మనసులో ఏది కోరిన అది వానికి లభించును. కార్తికేయుని ఈ స్తోత్రము పఠించువాని యింట బాలురకు క్షేమము ఆరోగ్యము కలుగును" అని చెప్పెను. (25)

26 వ అధ్యాయము - సూర్యాఖ్యానము – సప్తమీతిథి

అనంతరము రాజును ఇట్లు ప్రశ్నించెను."ఓ బ్రాహ్మణోత్తమా! వెలుగునకు ఆకారమెలా ఏర్పడింది? నీకు నమస్కరింతును. నాయీ సంశయమును తీర్పుము" అని కోరగా మహాతపుడు "జ్ఞానమను శక్తిగా సనాతనమగు ఆత్మ ఒక్కటియే మొదట ఉండెడిది. అది రెండవ దానిని కోరునప్పుడు తనలో నున్న వెలుగు వెలువడియెను. అదియే గొప్ప వెలుగుల సూర్యుడు. ఆతని వెలుగులు ఒకనితో నొకటి బాగుగా కలిసిపోయి ఈ మూడు లోకములను ప్రకాశింపజేయుచున్నవి. అతనియందు ఒక్కమారుగా సురలు, సిద్ధులు, అన్ని విధములైన దేవగణములు, హరులతో పాటు పుట్టిరి. అందువలననే అతడు 'సూర్య' డాయెను. సూర్యుడనగా పట్టుటకు కారణమైనవాడు. బాగుగా కదలాడిన ఆతని తేజస్సు నుండి వేరుగా ఒక శరీర మేర్పడెను. వేదవాదులు ఆ శరీరముగల వానిని రవి అని కీర్తించిరి. ఆతడు ఆకాశమున ఉదయించు లోకములన్నింటిని ప్రకాశింపజేసెను. కావున ఆతనికి భాస్కరుడను పేరు కలిగెను. ఆ ప్రకాశమే అధికమగుట వలన ప్రభాకరుడనియు నందురు. పగటిని దివస మందరు. దానిని కలుగ చేయువాడు కనుక దివాకరుడు. జగమున కంతటికిని మొదటివాడు కావున ఆదిత్యుడను పేరేర్పడెను. ఈతని తేజస్సు చేతనే పంద్రెండుగురు ఆదిత్యులు విడిగా పుట్టిరి. ఆ అందరకు ప్రధానునిగా ఎల్లవేళల ఈతనినే చెప్పుదురు. జగము అంతటిని వ్యాపించుచు ఉన్న ఆ పరమేశ్వరుని గాంచి ఆతనిలోనే ఉన్న దేవతలందరు వెలుపలికి వచ్చి "దేవా! ఈ సమస్త జగత్తునకు నీవే కారణమువు. విశ్వమంతట తిరుగుచు ప్రళయమున నాశనము చేయుచున్నావు. ప్రభూ!శాంతింపుము. కర్మసాక్షీ! దేవలోకములను మాడ్చి వేయకుము. లోకములన్నింటిని తపింపజేయు తేజమును, యజ్ఞముల ప్రవృత్తికొరకు నీవు వ్యాప్తి చేయుచున్నావు. తీక్షము దివ్యమునైన నీ చక్రమును కాలమను పేరుతో వ్యవహరింతురు. అది చీకట్లను పారద్రోలును. నీవు

ప్రభాకరుడవు. రవివి, ఆదిదేవుడవు. ఈ చరాచరమైన సమస్తమునకు ఆత్మవు. పితామహుడవు. వరుణుడు, యముడు నీవే. గడచినది, గడువ నున్నదియు నీవే అని సిద్ధులు పల్కుదురు. సురలోకము పూజలందుకొను దేవా! నీవు చీకట్లను చీల్చివేయుము. శాంతింపుము. పితృదేవతలు నిన్ను కొనియాడుదురు. నీవు వేదాంతముచేత తెలియదగిన వాడవు. యజ్ఞములలో నిన్నే అర్చింతురు. నీవు విష్ణుడవు. ఓ సురనాథా! శంభూ, మమ్ము చక్కగా పాలింపుము" అని వారు భక్తితో స్తుతించిరి.

ఇట్లు దేవతలు స్తుతింపగా ఆతడు సౌమ్యమైన రూపమును దాల్చెను. గొప్ప కాంతిగలవాడై వెనువెంటనే దేవతలకు కానవచ్చెను. దేవతలకు తాపము కలిగించుట, మరల చల్లబడుట అనునది అంతయు సప్తమినాడు జరిగెను. సూర్యుడాదినముననే భూమండలముపై ఆకృతిని పొందెను. ఈ తిథిని, సూర్యుని భక్తితో ఉపాసించు పురుషునకు భాస్కరుడు ఇష్టఫలమును అనుగ్రహించును" అని చెప్పి రాజా! ప్రాతకాలపునాటి సూర్యునికథను నీకు వివరించితిని. మొదటి మన్వంతరమున నిది జరిగెను. ఇప్పుడు మాతృదేవతలను గూర్చి చెప్పెదను. వినుము. (26)

27 వ అధ్యాయము - మాతృకా వృత్తాంతము – అష్టమీతిథి

"మునుపు గొప్పబలము గల పెనురక్కసి అంధకుడనువాడు, బ్రహ్మ యిచ్చిన వర గర్వమున దేవతల నందరిని వశపరచుకొనెను. అతడు దేవతలందరిని మేరుపర్వతమును వదలిపోవునట్లు చేసెను. దానితో వారు అంధకుని భయముతో బ్రహ్మదేవుని శరణుజొచ్చిరి. అట్లు తనకడకు వచ్చిన ప్రధానదేవతలను గాంచి బ్రహ్మ "దేవులారా! మీ రాకకు కారణమేమి? చెప్పుడు. ఊరకున్నారేమి?" అని పలికెను. అందులకు ఆ దేవతల సమూహము "జగన్నాథా! మమ్ముల నందరను అంధకుడు పీడించుచున్నాడు. పితామహా! చతుర్వదనా! నీకు మ్రొక్కెదము, మమ్ము కాపాడుము" అని ప్రార్థించగా బ్రహ్మ దేవతలారా! నేను మిమ్ములను అంధకుని నుండి కాపాడజాలను. భవుడు, శర్వుడు అగు మహాదేవుని శరణువేడుదము కదలుడు. సురోత్తములారా! నేను అతనికి మున్ను 'నీవు చంపరాని వాడవగుదువు. నీ శరీరము నేలను తాకరాదు' అని వరమిచ్చితిని. అట్టి బలవంతుని ఒక్క రుద్రుడే చంపగలడు. కావున కైలాసమున నివసించు ప్రభువు కడ కరుగుదము" అట్లు బ్రహ్మ పలికి దేవతలతోపాటు శివుని సన్నిధి కరిగెను. ఆతని గాంచినంతనే రుద్రుడు

ఎదురేగుట మొదలగు మర్యాదలు నెరపి జగదీశ్వరుడగు బ్రహ్మతో నిట్లు పలికెను. "పితామహా ! మీరు వచ్చిన పనియేమి? దేవతలందరును నాకడకు వచ్చిరి. నేను వారికేమి చేయవలయునో శీఘ్రముగా సెలవిండు" అనగా దేవతలు అందరును "దేవా!బలవంతుడు, దుష్టబుద్ధి అయిన అంధకుని నుండి మమ్ము రక్షింపుము" అనుచు సురలిట్లు పరమేశ్వరునకు చెప్పుకొనుచుండగనే, గొప్ప సేనతో అంధకుడు అటకు వచ్చెను. నాలుగు విభాగములుగల సేనతో యుద్ధమున శివుని చంపగోరియు, ఆతని భార్యయగు పార్వతిని హరింప గోరియు సాధనములతో వచ్చెను. అట్లు ఒక్క పెట్టునవచ్చి దేవతలను, దేవేంద్రుని పీడించుచున్న ఆతనిని గాంచి దేవతలందరు ఒక్కుమ్మడిని రుద్రుని వెనుక కొరిగిరి.

రుద్రుడును వాసుకిని, తక్షకుడు, ధనంజయుడు అను సర్పములను స్మరించెను. వారిని నడుమునకు మొలత్రాడుగా కట్టుకొనెను. నీలుడను రాక్షసరాజు ఐరావతము వంటి భయంకర రూపముతో శివునికడకు వడివడిగా వచ్చెను. నంది దానిని గుర్తించు వీరభద్రునకు చూపెను. వీరభద్రుడును సింహరూపము దాల్చి ఒక్క పెట్టున కాటుకవంటి కాంతిగల ఆ ఏనుగు చర్మమును చీల్చి రుద్రునకర్పించేను. ఆతడు దానిని వస్త్రముగా చేసికొనెను. అది మొదలు రుద్రుడు గజచర్మాంబరధారి అయ్యెను. అట్లు పాములనే భూషణాలతో వెలుగులు చిమ్ముతూ, వెరపు గొలుపు త్రిశూలమును చేతదాల్చి ప్రమథ గణములతో పాటు అంధకునిపై కురికెను. అంత దేవదానవులకు ఘోర యుద్ధము ఆరంభము కాగా ఇంద్రుడు మొదలగు లోకపాలకులు, కుమారస్వామియు, తక్కిన దేవతలును పోరజొచ్చిరి. నారదుడు అదిగాంచి నారాయణుని కడ కరిగి కైలాసమున దేవతలకు రాక్షసులతో మహాయుద్ధము జరుగుచున్నదని చెప్పెను. అది విని చక్రము పట్టుకొని గరుడు నెక్కి జనార్దనుడు ఆచోటికి వచ్చి దానవులతో తలపడెను. విష్ణువు ఆదుకొన్నను, దేవతలు మొగములను వ్రేలవైచి పారిపోజొచ్చిరి. అట్లు దేవతలు దెబ్బతినగా స్వయముగా రుద్రుడు అంధకునిపై కరిగెను. గగుర్పాటు పుట్టించు పెనుపోరు సంభవించెను. అచట ఆ దేవుడు రక్కసుని త్రిశూలముతో గ్రుచ్చెను. అట్లు పొడువగా నేలపై పడిన రక్తము నుండి లెక్కపెట్టరాని అంధకులు పుట్టిరి. ఆ మహాశ్చర్యమును గాంచి రుద్రుడు యుద్ధమున అంధకుని త్రిశూలమున గ్రుచ్చి పట్టుకొని నాట్యమాడెను. తక్కిన అంధకులును, పైకి లేచిన ఇతరులను నారాయణుని చక్రముచేత మడిసిరి. శూలముతో

గ్రుచ్చిన ఆ అంధకుని నెత్తురు తుంపురులతో పెక్కుమారులు అంతులేని అంధకులు పుట్టుకొని వచ్చిరి. అంత రుద్రుడు తీవ్రక్రోధము తాల్చిన వాడాయెను. అతని ఆ పెనుకోపముచేత ముఖము నుండి జ్వాలలు వెలువడెను. ఆ జ్వాలల రూపము తాల్చి ఒకదేవి యావిర్భవించెను. ఆమెనే యోగేశ్వరి అందురు. ఒక దేవి రూపము తనంత తాను ఉద్భవించెను. అట్లే మరియొక దేవిని విష్ణువు నిర్మించెను. మరియు బ్రహ్మ కుమారుడు, ఇంద్రుడు, యముడును శక్తిరూపములను సృజించిరి. పరమ ప్రభువగు వరాహదేవుడు ఆ దేవికి పాతాళమును పెకలించి రూపమును కల్పించెను. ఆ దేవి పేరు మహేశ్వరి, వారినే అష్టమాతలు అందురు. ప్రజాపాలరాజా ! ఈ దేవతలు ఇట్లు శరీరస్థితిని పొందిన విషయమును అంతటిని నీకు వివరించితిని. శరీరజ్ఞాన బుద్ధితో వీరి స్వరూపములను వివరింతును. కామము, క్రోధము, లోభము, మదము, మోహము, మాత్సర్యము, చెడుతనము, ఇతరుల గుణములకు ఓర్వనితనము అను ఈ ఎనిమిదియు దేహమున ఉన్న ఆ యెనిమిది శక్తులు, కామమును యోగీశ్వరి అనియు, క్రోధమును మహేశ్వరి యనియు, లోభమును వైష్ణవి అనియును, మదమును బ్రహ్మణియనియు, మోహమును కౌమారి అనియు, మాత్సర్యమును ఇంద్రజ అనియు, క్రూరత్వమును యమదండధర అనియు, అసూయను వారాహి అనియు చెప్పుదురు. ఈ శరీరమున ఉన్న రామారుల సముదాయము మూర్తిని గొన్న విధానమును నీకరిగించితిని. ఈ దేవతలు ఆ అంధకుని రక్తమును పూర్తిగా పిల్చివేయగా అసురుని మాయ నాశనమాయెను. ఆ అంధకుడు సిద్ధుడాయెను.

ఇదిగో నీకు ఆత్మవిద్యామృతమును మొత్తము చెప్పితిని. ఈ మాతృదేవతల మంగళకరమగు కథను నిత్యము వినువారికి వారు ఎల్లవేళల రక్షణను గూర్తురు. ఈ మాతృదేవతల జన్మ వృత్తాంతము విన్న మానవుడు ధన్యుడై శివలోకమున కరుగును. బ్రహ్మవారికి ఉత్తమయగు అష్టమీ తిథిని అనుగ్రహించెను. ఆ దినమున మారేడు ఫలములు మాత్రము భుజించి వారిని పూజించువారికి ఆ దేవతలు సంతసించి క్షేమమును, ఆరోగ్యమును ప్రసాదింతురు" అని వివరించెను. (27)

28 వ అధ్యాయం - దుర్గాదేవీ వృత్తాంతము – నవమీతిథి

"మునివర్యా! కాత్యాయని శుభప్రద దుర్గగా, మాయ ఎలా జన్మించింది? ఆమె మొదటి స్థితిలో సూక్ష్మరూపముతో ఉండెను గదా! వేరు స్వరూపపముతో ఆవిర్భవించెను?"

అని రాజు ప్రశ్న చేయగా, మహాతపముని, "రాజా! మునుపు సింధుద్వీపుడను గొప్ప ప్రతాపముగల రాజుండెను. ఆతడు వరుణుని అంశముతో పుట్టినవాడు. అరణ్యమున తపస్సు చేయుచు ఉండెను. ఆరాజు నాకుమారుడు ఇంద్రుని నశింపజేయవలయునని నిశ్చయించి గొప్ప తపస్సుతో తన దేహమును ఎండగట్టెను" అని చెప్పగా రాజు "బ్రాహ్మణవరేణ్యా! ఆతనికి ఇంద్రుని వలన అపకారమెట్లు సంభవించెను. దానితో గదా ఆతడు ఇంద్రుని చంపు పుత్రుని గోరుచు తపమున నిలిచెను" అని ప్రశ్నింపగా ముని ఆతడు పూర్వజన్మమున త్వష్టుడను వాని కొడుకు. గొప్ప బలము గలవాడు. ఏ ఆయుధములకు చావనివాడు. నీటి నురుగుతో ఇంద్రుని వలన మరణించెను. ఆతడు నీటినురుగుతో మడిసి అందే లయము పొందెను. తిరిగి బ్రాహ్మణ వంశమున పుట్టి సింధు ద్వీపుడను పేరుగలవాడాయెను. ఆ ఇంద్రుని తోడి పగను మరవక ఆతడు ఘోరమైన తపస్సు గావించెను. అంత పెద్దకాలమునకు వేత్రవతి అను నది చక్కని అలంకారములు, అందచందములు గల మనుష్య వేషము ధరించి, ఆ రాజు తపము చేయుచున్న తావునకు వచ్చెను. చక్కని రూపసంపద కాంతను చూచి రాజు కోపముతో మండిపడి 'ఓ భామినీ! నీవెవరవు? నిజము చెప్పుమ'ని అడిగెను.

"నేను మహాత్ముడు, జలాధి దేవతయుఅగు వరుణుని పత్నిని. పేరు వేత్రపతి. పుణ్యురాలను. నిన్ను కామించి ఇటకు వచ్చితిని. కోరివచ్చినదియు, తన్ను సేవించినది యునగు ఇంతి పరస్త్రీలయినను ఆమెను వదలి వైచు మనుజుడు పాపుడగును. బ్రహ్మహత్యా పాతక మందును. ఇది యెరిగి నిన్ను కోరిన నన్ను పొందుము" అని ఇట్లు ఆమె పలుకగా రాజు అభిలాషతో ఆమెను అనుభవించెను. వెనువెంటనే ఆతనికి పండ్రెండుగురు సూర్యులకు దీటైన కాంతిగల కొడుకు పుట్టెను, వేత్రవతి కడుపున పుట్టెను గనుక వాడు వైత్రాసురుడయ్యెను. గొప్పబలము, దొడ్డతేజము గల ఆతడు ప్రాగ్జ్యోతిషమునకు ఏలిక యయ్యెను. కొంతకాలమునకు ఆతడు యువకుడు, బల పరాక్రమములుగల వాడునై పెద్దయోగము కలసిరాగా ఈ భూమిని గెలిచెను. ఇట్లు ఏడు ద్వీపములుగా ఉన్న భూమిని అంతటిని గెలిచి పిదప మేరు పర్వతమును ఎక్కెను. అందు వరుసగా మొదట ఇంద్రుని తరువాత అగ్నిని, అటుపై యముని, నిర్మతిని, వరుణుని, వాయువుని, కుబేరుని, ఈశానుని గెలిచెను. ఇంద్రుడు దెబ్బతిని అగ్నికడ కరిగెను. అగ్ని ఓడి యముని జేరబోయెను.

యముడు నిర్ృతికడకు వచ్చెను. నిర్ృతి వరుణుని చేరెను. ఇంద్రాదులతో కూడిన వరుణుడు వాయువును ఆశ్రయించెను. వాయువు కుబేరుని కడ కరిగెను. కుబేరుడు దేవతలతో కూడి ఒక గద చేపట్టి తన మిత్రమగు ఈశానుని చేరుకొనెను. బలముతో కన్నుగానని ఆ దానవుడు గదను లాగుకొని వానిని శివలోకమునకు తరిమెను. శివుడును, ఆ రాక్షసుడు చంపరానివాడని తలపోసి దేవతలను గైకొని, సురలు, సిద్ధులు మొదలగు పుణ్యవంతులు కొనియాడు బ్రహ్మనగరి కరిగెను. జగత్తులను సృష్టిచేయు బ్రహ్మ అచట విష్ణు పాదములందు పుట్టిన పవిత్ర జలము లోపలి భాగమున ఆకాశమును ఏర్పాటు చేసికొని క్షేత్రజ్ఞుడగు పరమాత్మ మాయయగు గాయత్రిని జపించుచుండెను. దేవతలు పెద్దగా దుఃఖముతో "ప్రజాపతీ! కాపాడు. రక్కసుని వలన భయము పొందిన దేవతలను, ఋషివరులను కాపాడు, కాపాడు" అని తొందర చేయుచు అరచిరి. అంత బ్రహ్మ అట్లు వచ్చిన దేవతలందరను గాంచి ఇదియంతయు దేవుని మాయ. జగత్తంతయు దీనితో నిండినది. ఇచట రక్కసులు లేరు. దేవతలు లేరు. ఇది యెట్టి మాయయో కదా! అని తలపోసెను. అతడు ఇట్లు భావించుచుండగా ఆతని ముందు ఒక కన్య ప్రత్యక్షమాయెను. ఆమె స్త్రీ గర్భమున పుట్టినది కాదు. తెల్లని వస్త్రములను ధరించి యుండెను. పూమాలలతో కిరీటములతో ఆమె మోము వెలుగొందుచుండెను. ఆమె యెనిమిది చేతులతో, దివ్యములగు ఆయుధములు ధరించి ఉండెను.

చక్రము, శంఖము, గద, పాశము, ఖడ్గము, ఘంట, విల్లు అనువానిని మరియు ఇతర ఆయుధములను చేపట్టి అమ్ములపొది కట్టుకొని నీటినుండి వెలువడి, ఆ మహాదేవి సింహవాహనముపై వడివడిగా వచ్చెను. ఒక్కతెయే పెక్కురూపములు తాల్చి రక్కసులందరితో పోరుసల్పెను. దేవతల వేయి సంవత్సరముల కాలము, దివ్యములగు అస్త్రములతో ఆ మహాబలునితో ఆ దేవి యుద్ధము చేసెను. అట్లు పోరి కొంతకాలము గడచిన పిదప ఆ వైత్రాసురుని రణమున చంపివైచెను. అంత దేవతల సేనయందు కిలకిలా రావములు పెద్ద పెట్టున చెలరేగెను. అట్లు భయంకరుడగు వైత్రాసురుడు చావగా స్వర్గవాసులందరు గెలువుము, పోరుము అని ఆమెను ప్రశంసించుచు ప్రణమిల్లిరి. స్వయముగా ఈశ్వరుడు ఆ దేవిని ఇట్లు స్తుతించెను "దేవీ! గాయత్రీ! మహామాయా! మహాప్రభా! మహాదేవి! గొప్ప శక్తియు, గొప్ప ఆనందము గల ఓ పూజ్యురాలా! జయము

గొనుము. దివ్యములగు గంధముల పూతగల దేహముతో, దివ్యములగు పూలమాలలతో, అలరారు మహేశ్వరీ! అ-ఉ-మ అను మూడక్షరముల, ఓంకారమునందున్న వేదమాతా! నీకు నమస్సులు. మూడు లోకములందును మూడు తత్త్వములందును మూడగ్నుల యందును నెలకొనియున్న ఓ త్రిశూలధారిణి! మూడుకన్నులు, భయము గొలుపు మోము, భయము గొలుపు కన్నులు గలిగిన భయంకర స్వరూపిణీ! కమలము ఆసనముగాగల బ్రహ్మ వలన పుట్టిన ఓ సరస్వతీదేవి! నీకు నమస్కారము. పద్మపత్రముల వంటి కనులు గల ఓ మహామాయా! అమృతమును జాలువార్చు ఓ దేవీ! అంతట నిండిన ఈ సర్వభూతములకు ఏలికయైన మాతా! స్వాహాకార స్వరూపిణీ! స్వధారూపిణీ! అంబికా! నీకు నమస్సు. సంపూర్ణా! పూర్ణచంద్రుని కాంతి వంటి కాంతిగలదానా! తళతళలాడు దేహకాంతిగల దేవీ! భవుని పుట్టుకకు కారణమైన తల్లీ! మహావిద్యా స్వరూపిణీ! జ్ఞాన స్వరూపిణీ! మహా దూత్యులను రూపుమాపు కరుణామయీ! శోకములేని ఆనందరూపా! పర్వతరాజ పుత్రీ! నీకు నమస్కారము. ఓ దేవి! నీవు నీతివి. నీవే వాక్కు. నీవు భూమివి. నీవు అక్షరమవు. నీవు బుద్ధిస్వరూపిణివి. నీవు లక్ష్మీదేవివి. నీవు ఓంకారమువు. నీవు తత్వమున నిలిచి యున్నదానవు. సర్వప్రాణులకు హితము చేయుదానవు. ఓ పరమేశ్వరీ! అట్టి నీకు నమస్కారము"

పరమేశ్వరుడగు శివుడిట్లు ఆ దేవిని సంస్తుతించెను. దేవతలందరును పరమేశ్వరిని గూర్చి పెద్దగా జయజయ నాదములు చేసిరి. ఆ బ్రహ్మదేవుడు నీటి నుండి వెలుపలికి వచ్చి కార్యము నెరవేరిన ఆ దేవిని దర్శించుకొనెను. బ్రహ్మ ఆమెను గాంచి దేవకార్యము నెరవేరినదని తలచి రాబోవు కార్యమును గూర్చి ఇట్లు పలికెను. ఈ దేవి హిమవత్పర్వతమునకు పోవును గాక! దేవతలారా! మీరందఱు కూడ అచ్చట కరిగి ఆనందమందుడు, ఆలసింపకుడు. ఈ దేవిని ఏకాగ్రబుద్ధితో నవమినాడు పూజింప వలయును. అట్లు ఆమె సర్వ లోకములకు వరముల నొసగునది అగును. ఇందు సంశయము వలదు. నవమినాడు మగవాడు కాని, స్త్రీ కాని, పిండిభోజనము నియమముగా చేసికొని ఈమెను అర్చించిన మనసులోని కోరిక తీరును, ఓ మహాదేవా! నీవు పలికిన ఈ స్తోత్రమును ఉదయ సాయంకాలములలో పఠించువానికి నీవు దేవితోపాటు వరముల నొసగుము. ఆపదల అన్నింటి నుండియు వాని నుద్ధరింపుము.

అనుచు ఇట్లు శివునితో పలికి, బ్రహ్మ మరల దేవితో నిట్లనెను. "దేవీ! నీవు మాకు చేయవలసిన మరియొక ఘనకార్యము కలదు. నీవు భవిష్యత్తున మహిషుడను రక్కసుని వినాశనమును చేయవలయును" అని బ్రహ్మ యిట్లు పలుకగా సర్వదేవతలును దేవిని హిమగిరి యందు ప్రతిష్టించి తమతమ నెలవుల కరిగిరి, ఆమెనట్లు ప్రతిష్ఠించి వారందరు ఆనందము పొందుట వలన ఆమెకు 'నంద' యను పేరు కలిగెను. ఈ దేవి జన్మకథను వినువాడును, తనకు తాను పఠించువాడును సర్వపాపముల నుండి విముక్తుడగును. మోక్షము నొందును. (28)

29 వ అధ్యాయము-దిక్కుల వృత్తాంతము – దశమీతిథి

పిమ్మట మహాతపుడు ఇట్లు పల్కెను. రాజా! బ్రహ్మచెవుల నుండి దిక్కులెట్లు పుట్టినవో చెప్పుచున్నాను. ఈ కథను శ్రద్ధతో వినుము. మొదటి సృష్టి మొదలైనప్పుడు సృష్టి చేయుచున్న బ్రహ్మకు 'నేను సృజించు ఈ ప్రజలను ఎవరు ధరింతురా?' అని పెద్ద చింత పట్టుకొనెను. ప్రజల విషయమున ఇట్లు అవకాశమును గూర్చి చింతించుచున్న ఆతని చెవుల నుండి పదిమంది కన్యలు, గొప్ప కాంతిగలవారు పుట్టుకొని వచ్చిరి. తూర్పు, దక్షిణము, పడమర, ఉత్తరము, పైదిక్కు క్రింది దిక్కు అను ఈ ఆర్వురు, ఆ కన్యలలో ముఖ్యులు. వారిలో మిగిలిన నలుగురు కన్యలు చక్కని చుక్కలు. మంచి రూపములు కలవారు. గాంభీర్యముతో కూడినవారు. వారు ఏ దోషములేని ప్రజాపతిని చనువుతో "దేవదేవా! ప్రజాపతీ! మాకును చోటిమ్ము. అవ్యక్తము నుండి పుట్టినదేవా! మేమెందు భర్తలతోపాటు సుఖముగా నిలుతుమో ఆచోటును, మాకు పతులను ప్రసాదింపుము" అని అడుగగా బ్రహ్మ "ఓ సుశ్రోణులారా! ఈ బ్రహ్మాండము నూరుకోట్ల ప్రమాణములు వ్యాపించియున్నది. దీని అంతము – నందు మీ యిచ్చననుసరించి నివసింపుడు ఆలస్యము చేయకుడు. మీకు తగిన మగలను అందచందములు గలవారిని సృజించి యిత్తును. ఇప్పుడు మీకు నచ్చిన దేశముల కరుగుడు." అని బ్రహ్మ యిట్లు వారితో పలుకగా అంతట వారు తమ యిష్టము వచ్చిన తావుల కరిగిరి. బ్రహ్మయు వెనువెంటనే మహాబలము గల లోకపాలురను సృజించెను. అట్లు లోకపాలురను సృజించి బ్రహ్మ ఆ కన్యలను మరల పిలిచెను. లోకములకెల్ల జ్యేష్ఠుడు ఆ బ్రహ్మ వారికి పెండ్లిండ్లు చేసెను. ఇంద్రునకు, అగ్నికి, యమునికి, నిర్బతికి, మహాత్ముడగు వరుణునకు, వాయువునకు, కుబేరునకు, ఈశానునకు

ఒక్కొక్క దిక్కునిచ్చిపై దిక్కును తనకు ఉంచుకొని క్రిందనున్న దిక్కును ఆదిశేషున కొసగెను. బ్రహ్మ యిట్లు వారలకు దిక్కుల నొసగి ఆ దిక్కులను దశమి తిథిని ఏర్పరచెను. పెరుగన్నము భోజనముగా కల్పించెను. అది మొదలు ఆ దేవకాంతలు ఐంద్రి మొదలగు పేర్లతో వ్యవహారమునకు వచ్చిరి. దశమి తిథి వారికి మిక్కిలి ప్రియము గూర్చునదాయెను. ఆ తిథినాడు పెరుగన్నము తినుచు చక్కని వ్రతము ఆచరించు నరులకు వారు సకలపాపములను ప్రతిదినము పోగొట్టుదురు. దిక్కులకు సంబంధించిన ఈ కథను చెదరని మనస్సుతో వినువాడు బ్రహ్మలోకమున నిత్యనివాసమును పొందును. సంశయము లేదు. (29)

30 వ అధ్యాయము - కుబేర వృత్తాంతము - ఏకాదశీతిథి

ఇంకను "రాజా! పాపములను పోకార్చు మరియొక కథ వినుము. అది వసుపతికి సంబంధించినది (వసుపతి – ధనములకు అధిపతి – కుబేరుడు) బ్రహ్మ శరీరమున ఉన్న వాయువు, కుబేరుడుగా ఎట్లు పుట్టెనో చెప్పెదను. వాయువు మొదట ప్రాజాపత్య దేహమున నుండెను. ఆ క్షేత్రమున కధిష్ఠానదేవత ఒక పనికొరకు వాయువునకు ఆకారము కలుగునట్లు ఆదేశించెను. అట్లు ఆకారము పొందిన వాయువు ఉత్పత్తి ఎట్లు జరిగెనో నేను వివరించుచున్నాను.

పుణ్యాత్మా! నేను చెప్పుచున్న ఆ ఉత్పత్తిని ఆలకింపుము. సృష్టి చేయగోరు బ్రహ్మ ముఖము నుండి మిక్కిలి తీవ్రమగు గులకరాళ్ళను వర్షించుచు వాయువు వెలువడెను. బ్రహ్మ వానిని నిలువరించెను. "ఆకారము పొందుము. శాంతింపుము", అని బ్రహ్మ పలుకగా వాయువు ఆకారము ధరించెను. దేవతలు అందరకు గల ధనమును, వారార్జించిన ఫలమును అంతటిని నీవు రక్షింపుము అని బ్రహ్మ పలుకగా వాయువు ధనపతి అయ్యెను. బ్రహ్మ సంతృప్తిపడి ఆ కుబేరునకు ఏకాదశ తిథిని కల్పించెను. ఆ తిథియందు అగ్నితో వండని పదార్థములను భుజించుచు నిష్టతో కూడిన పరిశుద్ధునకు కుబేరుడు తృప్తుడై కోరినదెల్ల ఒసగును.

ఈ ధనపతి రూపము పాపములన్నింటిని పటాపంచలు చేయును. ఈ కథను భక్తితో వినువాడు, చదువువాడును కోరిన కోర్కెలనెల్ల పొందును. స్వర్గలోకమున కరుగును. "అని మహాతపుడు ప్రజాపాల నరపతికి ఉపదేశించెను. (30)

31 వ అధ్యాయము- వైష్ణవ సృష్టి - ద్వాదశీతిథి

అనంతరము మహాతపుడు ఇట్లు చెప్పెను. మనువు అను పేరును, మనుత్వమనీ చదువుతూంటాం కదా. ఒక ప్రయోజనము కొఱకు విష్ణువే యీ మనువు రూపమును దాల్చెను. రాజా! పరము కంటె ఇంకను పరమైన ఈ నారాయణ దేవునకు సృష్టిని గూర్చి ఆలోచన పుట్టెను. ఈ సృష్టిని నేనే చేసితిని. దీనిని నేనే పాలింపవలయును గదా! ఆకారము లేని సృష్టితో ఆయా పనులు చేయనలవి కాదు. కావున ఒక మూర్తిని సృజింతును. అదియే ఈ జగము నెల్లను పాలించును అని తలచి సత్యమునే ధ్యానించు ఆ విష్ణువు ఇట్లు తలపోయుచుండగా మునుపటి సృష్టి సముదాయమంతయు ఒక దేహం దాల్చి, ఆతని ముందు ప్రకాశించెను. ఆ సృష్టి అంతయు ఎదుట నిలిచి యుండగా, తన దేహము నుండి మూడు లోకములు ఆ దేహంలో ప్రవేశించుచుండుటను స్వామి గమనించెను. అంతట ఆ భగవంతుడు మునుపు వాక్కు(సరస్వతి) మొదలగు వానికి తానిచ్చిన వరమును స్మరించెను. దానితో తృప్తిపడి మరల వరమొసగెను. “నీవు సర్వ మెరిగినవాడవు. సర్వమునకు కర్తవు. సర్వలోకము నీకు మ్రొక్కును. మూడు లోకములలోను ప్రవేశించుట వలన సనాతనుడవు అగు నీవు 'విష్ణువు' అను పేరుగల వాడవగుదువు. బ్రహ్మదేవుడు ఎల్లవేళల దేవతలకు కార్యసిద్ధి చేయుచుండ వలయును. ఓ దేవా! నీకు సర్వజ్ఞత కలుగుగాక. సందియము లేదు.”

అని ఇట్లు పలికి ఆ దేవుడు మరల సహజస్థితికి వచ్చెను. విష్ణువు ఇప్పుడు ఆ పూర్వపు బుద్ధిని స్మరించెను. అప్పుడు గాఢభావనగల ఆ భగవానుడు యోగనిద్రను భావించెను. ఇంద్రియ విషయముల వలన పుట్టిన ప్రజలను అందరను అందు స్థాపించి శ్రేష్ఠమగు రూపముతో ధ్యానించి, ఆ ప్రభువు నిదురించెను. అట్లు గాఢనిద్ర నొందిన ఆ భగవంతుని కడుపు నుండి ఒక పెద్ద పద్మము వెలువడెను. అందు ఏడు ద్వీపములతో, సముద్రములతో, అడవులతో నిండిన భూమిఅంతయు ఏర్పడెను. ఆ పద్మము రూపము అట్లు విస్తరిల్లెను. ఆ పద్మపుకాడయందుపాతాళము నెలకొనెను. దుద్దు నందు మేరువు కన్పట్టెను. దాని నడుమ బ్రహ్మ పుట్టుక ఏర్పడెను. ఆతని శరీరము నుండి పుట్టిన దీనిని అంతటిని గాంచి, ఆ శరీరముననే ఉన్న వాయువు మరియొక వాయువును సృజించి వెలుపలికి వదలెను. స్వామీ! అజ్ఞానమును జయించుటకై దీనిని శంఖ రూపముతో

ధరింపుము. అజ్ఞానమును రూపుమాపుటకై నీచేత ఎల్లప్పుడు ఈ ఖడ్గము నిలుచుగాక! ఇదిగో ఈ ఘోరమైన చక్రము కాలచక్రము. అచ్యుతా! అధర్మమనెడు ఏనుగులను మోదుటకై కేశవా! ఈ గదను గ్రహింపుము. భూతములకు తల్లియగు ఈమాల ఎల్లవేళల నీ మెడలో నిలుచుగాక! ఈ శ్రీవత్సము కౌస్తుభమును చంద్రసూర్యులకు బదులుగా నీ వద్ద ఉండును. వాయువే నీ గమనము. దానిని గరుత్మంతుడు అందురు. మూడు లోకములలో లక్ష్మీదేవి ఎల్లవేళల నిన్ను ఆశ్రయించి ఉండును. నీకు ప్రియమైన తిథి ద్వాదశి. అది యిచ్చవచ్చిన రూపుతాల్చినది అగును.

ద్వాదశి తిథియందు నీయందు మనసు నిలిపి నేతి భోజనము చేయు వ్యక్తి స్త్రీ అయిననూ, పురుషుడైనను స్వర్గమునందు నివసించును. దేవదానవుల మూర్తులన్నియు ఈ విష్ణువే. అతడే శరీరములను సృజించును. రక్షించును. సంహరించును. ప్రతియుగమున ఈతడే సర్వత్ర వ్యాపించు పరమ దైవము. వేదాంతమున పురుషుడని ఈతనినే అందురు. హీనబుద్ధితో ఆతనిని కేవలము మనుష్యుడని యెన్నటికిని పలుకరాదు. పాపమును పటాపంచలు చేయు ఈ విష్ణు సంబంధమైన సృష్టిని వినువాడు ఇహలోకమున చక్కని కీర్తి పొంది స్వర్గలోకమున శాశ్వతముగా నిలుచును అని చెప్పెను. (31)

32 వ అధ్యాయము - ధర్మోత్పత్తి - త్రయోదశీతిథి

మహాతపముని రాజా! నీకిపుడు గొప్పదియగు ధర్మము ఎట్లు పుట్టెనో, దాని మహిమ యెట్టిదో, దానికి సంబంధించిన తిథి యేమో వివరించెదను శ్రద్ధగా వినుము. మునుపు అవ్యయుడు, శుద్ధుడు, పరమునకంటె అపరుడు అను పేరుగలవాడు అగు బ్రహ్మ ప్రజలను సృజింపగోరి మొదట వారి పాలన మార్గమేమా! అని ఆలోచించెను. అట్లు చింతించుచుండగా ఆతని కుడిభాగము నుండి తెల్లని కుండలములు, తెల్లని మాల్యములు, మైపూతలుగల పురుషుడొకడు పుట్టుకొని వచ్చెను. నాలుగు పాదములతో ఎద్దువంటి ఆకారముగల ఆ పురుషుని గాంచి భగవానుడు 'సాధూ! ఈ ప్రజల నందరిని పాలింపుము. నీవు జగత్తునకు మొదటివాడవు కమ్ము' అని పలికెను. బ్రహ్మ యిట్లు పలుకగా ఆతడు చక్కని స్థితిగాంచి కృతయుగమున నాలుగు పాదములతో, త్రేతయందు మూడు పాదములతో, ద్వాపరమున రెండు పాదములతో, కలియందు ఒక పాదముతో నిలిచి ప్రజలను పాలించెను. బ్రాహ్మణులయందు ఆరు భేదములతో, క్షత్రియులయందు మూడు

భావములతో, వైశ్యుని యందు రెండు భావములతో, శూద్రుని యందు ఒక్క భావముతో ఆతడు నెలకొని అందరియందున్నవాడై పాలన చేసెను. (బ్రాహ్మణున ఆరుభావములు. యజన, యాజన, అధ్యయన, అధ్యాపన, దాన, ప్రతిగ్రహణములు అనగా 1. యజ్ఞము చేయుట, 2. యజ్ఞములు చేయించుట, 3. వేదములు చదువుట,4. చదివించుట, 5. దానము చేయుట 6. దానము పుచ్చుకొనుట. క్షత్రియుని యందు మూడు విధములు 1. యజ్ఞము చేయుట , 2. వేదమును చదువుట, 3. దానము చేయుట వైశ్యుని రెండు తీరులు 1. వ్యవసాయము, 2. వాణిజ్యము. శూద్రుని యందు ఒక రూపమున పై మూడు వర్గముల వారికి తోడ్పడుట.) సమస్త లోకముల యందును, ద్వీపములయందును ఆ ధర్ముడు అనెడు ప్రభువు పాలన గావించెను. ద్రవ్యము, క్రియ, జాతి అను ఈ నాలుగును ఆతని పాదములు. సంహిత, పదము, క్రమము ఇవి ఈ వృషభరూప పురుషుని మూడు కొమ్ములు. ఓంకారము, మొదలు, తుది అను రెండును ఈతని రెండు శిరస్సులు. విభక్తులు ఏడును ఏడు హస్తములు. ఉదాత్త, అనుదాత్త, స్వరితములు అను మూడు విధములుగా రూపొందిన నాదమయ పురుషుడు అతడు. జ్ఞాన సంపన్నులలో ముఖ్యుడై జగము అంతటిని పాలించు చుండెను. వింతగొలుపు పనులుగల చంద్రుడు, మునుపు అంగిరసుని తమ్ముడగు బృహస్పతి భార్యయగు తారను చేజిక్కించుకొని ఆ ధర్మపురుషుని నొప్పించెను. అప్పుడు ఆ ధర్మప్రభువు క్రూరకర్ముడు, బలవంతుడు అగు ఆ చంద్రుడు భయపెట్టగా భయంకరము, చొరరానిది అగు అడవికి చొచ్చెను. అట్లు ధర్మపురుషుడు అడవులపాలుకాగా దేవత లందరు రాక్షసుల పత్నులను పట్టుటకై ధర్మహీనులై వారి యిండ్లలో తిరుగజొచ్చిరి. అట్లే రక్కసులు దేవతల యిండ్లలో తిరుగాడిరి.

ఇట్లు హద్దులుపోయి ధర్మము నశింపగా, సోముడు చేసిన తప్పు వలన కోపించిన దేవతలును, రాక్షసులును స్త్రీ కారణముగ పెక్కుతీరుల ఆయుధములను చేపట్టి పోరదొడగిరి. అట్లు రక్కసుల యెడ కోపించి పోరాడుచున్న దేవతలను గాంచి సంబరపడి నారదుడు ఈ వార్తను బ్రహ్మ వద్దకు పోయి వివరించెను. అంత సర్వలోకములకు పితామహుడగు బ్రహ్మ హంస వాహనమును ఎక్కి, అటకు వచ్చి ఈ యుద్ధమునకు ప్రయోజనమేమి? అని పలుకుచు వారిని నివారించెను. వారందరు దీనికి కారణము సోముడు అని చెప్పిరి. అతని పీడవలననే తన పుత్రుడగు ధర్ముడు అడవుల పాలాయెనని

బ్రహ్మ తెలిసికొనెను. అంత బ్రహ్మ దేవదానవులతో కలసి వడిగా ధర్ముడున్న చోటి కరిగెను. అందు నాలుగు పాదములతో, వృషభము రూపుతో చంద్రునివలె విహరించుచున్న ఆ ధర్ముని దేవతలతోపాటుగాంచి వారితో ఇట్లు "ఈతడు నా మొదటి కొడుకు ధర్ముడను పేరు గలవాడు. మహాముని. సోదరుని భార్యను పట్టనెంచిన చంద్రుడు ఈతని మిక్కిలి పీడించెను. దేవతలారా! అసురులారా! మీరందరు ఇతనిని సంతోషపెట్టుడు. దానివలన మీ ఉభయులకు సమముగా చక్కని స్థితి కలుగును' అని పలికెను.

అంత దేవతలందరు బ్రహ్మ మాట వలన ఆతని సంగతిని ఎరిగినవారై నిండు చంద్రుని పోలిన ఆతనిని ఇట్లు స్తుతించిరి. "చంద్రుని పోలిన దేవా! జగత్పతీ! దేవరూపా, స్వర్గమునకు దారిచూపువాడా! కర్మమార్గమే స్వరూపమైనవాడా! సర్వమున ఉండు స్వామీ! నమస్కారము. నీవే ఈ భూమిని అంతటిని రక్షించుచున్నావు. ముల్లోకములును నీ రక్షణయందే నిలిచి ఉన్నవి. జనలోకము, తపోలోకము, సత్యలోకము – అది ఇది అననేల సర్వమును నీవే పాలించుచున్నావు. చరాచర ప్రపంచమున నీవు లేనిది కొంచెమైనను లేదు. నీవు లేనియెడల జగమంతయు అప్పటికప్పుడు నాశనమగును. నీవు సర్వభూతములకు ఆత్మవు. నీవు సజ్జనులకు సత్త్వ స్వరూపముతో, రజోగుణము గలవారికి రజస్స్వ రూపముతో, తమోగుణము మిక్కుటమైన వారికి తమోగుణము రూపముతో కన్పడుదువు. దేవా! నీకు నాలుగు పాదములు, నాలుగు కొమ్ములు, మూడు కన్నులు, ఏడు చేతులు, మూడు బంధములు. ఇట్టివానితో వృషభ రూపమున ఉన్న దేవా! నీకు నమస్కారము. నీవులేని మేము పిచ్చి మార్గములను పట్టితిమి. ఆ మార్గమును మూఢుల కొసగుము. మాకు నీవే పరమగతివి" దేవతలందరు ఇట్లు కీర్తింపగా వృషభ రూపధర్ముడు సంతుష్టిచెంది ప్రసన్నమైన మనసుతో శాంతమైన చూపుతో వారిని చూచెను. ధర్మపురుషుడు తన కంటితో చూచినంత మాత్రమున దేవతలందరు క్షణములో మోహమును వదలివైచిరి. చక్కని ధర్మముతో కూడినవారైరి. రక్కసులును అట్లే అయిరి. అంత బ్రహ్మ అతనితో ఇట్లు పలికెను. "ధర్మా! ఈ దినము నుండి నీకు త్రయోదశి ప్రియమగు తిథి అగుగాక! ఆ తిథినాడు ఉపవాసముండి నిన్ను సాధించువాడు, పాపములన్నియు చేసిన వాడైనను వానినుండి విముక్తి పొందును. నీవు బహుకాలము తిరిగిన కారణమున ప్రభూ! ఈ అరణ్యమునకు నీ పేరుతో ధర్మారణ్యము అను ప్రసిద్ధి కలుగును.

నాలుగు, మూడు, రెండు, ఒకటి అయిన పాదములతో కృత త్రేతా ద్వాపర కలియుగములందు నీవు లోకులకు కానవత్తువు. అట్లు ఈ కర్మభూమి యందును, పైలోకములయందును నీవు సాధారణముగా స్వగృహమునందు వలే నిలుచుచు ఈ విశ్వమంతటిని పరిరక్షింపుము. ఇట్లు వారు పలికినంత బ్రహ్మదేవుడు దేవదానవులు చూచుచుండగా అదృశ్యుడు అయ్యెను. ఆ దేవతలును దుఃఖమును వీడి ధర్మసహితులై తమతమ గృహముల కరిగిరి, ఈ ధర్ముని పుట్టుక కథను వినిపింపజేసినవాడును, శ్రాద్ధ కర్మలలో దీనితో పితృ దేవతలకు తర్పణము చేయువాడును త్రయోదశి యందు శక్తి కొలది పాయసముతో భోజనము పెట్టువాడును స్వర్గమున కలిసియుండును అని చెప్పి (32)

33 వ అధ్యాయము - రుద్రసంభూతికథనము - చతుర్దశీతిథి

వరాహదేవుడు అనంతర వృత్తాంతమును ఇట్లు చెప్పెను. ధర్మము నిర్వహించుటలో సమర్థుడు, క్షమయే గొప్ప ఆయుధముగా ధరించినవాడు, గొప్ప తేజస్సు గలవాడు అగు మహాతపుడు అను ఋషి ప్రీతితో 'రాజా! వినుము, మొట్టమొదటిదగు రుద్రుని పుట్టుకను గూర్చి మరియొక కథను వినిపింతును' – అని పలికెను. భయము గొలుపు తేజస్సు గల ప్రజాపతి పుట్టి అన్నిటికన్న మిన్నయగు జ్ఞానభావమును తెలిసికొని సృష్టి చేయగోరినవాడై జగత్తు ఎక్కువగా వృద్ధి పొందని కారణమున పట్టరాని కోపముతో క్షోభపడెను. అంత బ్రహ్మ తపస్సు చేయుచుండగా స్థిరమైన కీర్తి కలవాడు. పురాణుడు, రజస్తమో గుణములు జారిన ప్రవృత్తి కలవాడు, శ్రేష్ఠుడు, వరముల నొసగువాడు, ప్రతాపము గలవాడు, నలుపు తిరిగిన ఎఱ్ఱని వన్నెకలవాడు, పసుపు వన్నె కన్నులు గలవాడుఅగు ఒక పురుషుడు ఉదయించెను. ఆతడు పెద్దగా అరచుచుండగా బ్రహ్మ అరువకుమని పలికెను. అందువలన ఆ పురాణ పురుషునకు రుద్రుడు అను పేరు కలిగెను. 'మహానుభావా! నీవు సమర్థుడవు. సృష్టిని చక్కగా వ్యాపింప చేయుము' అని బ్రహ్మ పలికెను. (రుద్రుడు – రోదనము – ఏడుపు గలవాడు)

ఇట్లన్నంత మాత్రమున ఆతడు నీట మునిగెను. అట్లు దేవతలలో శ్రేష్ఠుడగు అతడు నీటనుండగా, బ్రహ్మ సృష్టి కొరకు మానస పుత్రులను సృజించాడు. వారు సృష్టిని విస్తారపరచిరి. అట్లు సృష్టి వ్యాప్తి చెందగా దేవేంద్రుడు బ్రహ్మకు సంబంధించిన గొప్ప యజ్ఞమును సాగించెను. పూర్వము నీటమునిగిన రుద్రుడు దానినుండి వెలువడి దేవతలను

సృజింపకోరినవాడు అయ్యెను. ఆ యజ్ఞమును, దానికి వచ్చిన సురలు, సిద్ధులు, యక్షులు, మొదలగువారిని గాంచి ఆ రుద్రుడు కోపగించెను. నన్ను కాదని నాకంటె వేరుగా మోహము వలన ఈ జగత్తునంతటిని ఎవ్వడు సృజించెనని కోపముతో మండిపడెను. హా! హా! అని అతడు అరచుచుండుగా, ముదురు పసుపువన్నెగల ఆతని నోటి నుండి అగ్నిజ్వాలలు కదలాడజొచ్చెను. అందుండి క్షుద్రులగు పిశాచములు, బేతాళ భూతములు, యోగులు గుంపులు గుంపులుగా వెలువడిరి. భూమియు, ఆకాశము, అన్నిదిక్కులు, అన్నిలోకములు వారితో గొప్పగా నిండిపోగా, ఆతడు సర్వమును ఎరిగినవాడు కనుక ఇరువది నాలుగు మూరల కొలతగల వింటి నొకదానిని నిర్మించెను. మూడు పేటల అల్లెత్రాటిని ఆ ధనువునకు ఏర్పరచెను. రోషముతో దివ్యములగు ఆ ధనువును, త్రాటిని పట్టుకొని దానితో పూషుని పండ్లు విరుగగొట్టెను. భగుని నేత్రములు పీకివేసెను. క్రతువు వృషణములు రాలగొట్టెను. ఊడిన వృషణములుగల క్రతువు అటనుండి వాయుదేవుని దారిపట్టి యజ్ఞభూమి నుండి పారిపోయెను. దేవతలందరు పశుపతిని సమీపించి ఆతనికి మ్రొక్కులిడిరి. బ్రహ్మ అచటికి వచ్చి, శివుని శాంతపరచి దేవతలను కౌగిలించుకొని 'దేవా! వీరాబాహూ! భక్తి భావముగల వీరినందరనీ చూడుము. మరల నీ విజ్ఞానమును మనసుకు తెచ్చుకొమ్ము' అని ప్రార్థించెను. అందులకు రుద్రుడు 'దేవదేవా! నన్ను నీవు సృజించితివి. వీరిని కాదు. యజ్ఞమునందు నాకు వీరేల భాగమును కల్పింపరు? కావున కోపముతో నేను వీరి జ్ఞానమును కొల్లగొట్టితిని. అంగభంగము గావించితిని' అని పలుకగా, 'దేవతలారా! అసురులారా! మీరందరు జ్ఞానముకొరకు సూక్తులతో పెద్దగా శంభుని కొలువుడు. దానితో భగవంతుడగు రుద్రుడు తుష్టినందును. ఆతడు తుష్టి చెందినంతనే మీకు సర్వ విషయముల జ్ఞానము కలుగును.' అని బ్రహ్మ ఇట్లు పలుకగా దేవతలందఱు ఆ మహాత్ముని ఇట్లు స్తుతించిరి.

"దేవాదిదేవునకు, ముక్కంటికి, ఎఱుపెక్కిన గోరోజనము వంటి కన్నులుగల స్వామికి జటలు అనెడు కిరీటము ధరించు మహాత్మునకు నమస్సులు. భూతములతో బేతాళములతో కూడినవానికి, పెనుబాములు జన్నిదముగాగల దేవరకు, భయము గొలుపు అట్టహాసము చేయు మోముగల ప్రభువునకు, కపర్దమను జడలముడి గల స్వామికి స్థాణువునకు నమస్కారము. పూషుని దంతములను, భగుని నేత్రములను కూల్చిన

దేవునకు, మున్ముందు ఎద్దు గురుతుగా చేసికొను ప్రభువునకు, మహాభూతములకు ఏలికయైన వానికి నమస్కారము. భవిష్యత్తు నందు త్రిపురాసురులను, అంధకాసురుని పరిమార్చువానికి, కైలాసమనెడు శ్రేష్ఠమగుచోట నివసించు వానికి, ఏనుగు తోలు వస్త్రముగా ధరించు వానికి నమస్కారము. మిక్కిలిగా భయము గొలుపునట్టి పైకిలేచిన జుట్టు గలవానికి, భైరవునకు, అగ్ని జ్వాలలతో వెరపు గొలుపు వానికి చంద్రుని శిరోభూషణముగా తాల్చినవానికి నమస్కారము. భవిష్యత్తు నందు కాపాలి పుర్రెతాల్చువాని వ్రతము కలవానికి, ఉత్కృష్టమగు స్థానమున ఉండు వానికి, దారువనమును ధ్వంసము చేయువానికి, పదునైన శూలముగలవానికి నమస్కారము. పాములను కంకణములుగా తాల్చు స్వామీ! నీలకంఠా! త్రిశూలధారీ, భయము గొలుపు దండము చేతబట్టిన నీకు, ముఖము నుండి బడబాగ్ని వెలువరుచు నీకు నమస్కారము. వేదాంతముచేతనే తెలియదగినవానికి, యజ్ఞమూర్తికి, దక్షుని యజ్ఞమును పాడు చేసినవానికి, జగత్తునకు భయము కలిగించువానికి నీకు నమస్కారము. విశ్వమునకు ప్రభువు, దైవము, మంగళ స్వరూపుడు, శుభము కూర్చువాడు, భవుడు, జటాధారి, వెఱపుగొలుపు వాడు అగు మహాదేవునకు నమస్కారము".

ఇట్లు దేవతలు స్తుతింపగా భయంకరమగు ధనువు తాల్చిన సనాతనుడగు దేవుడు శంభుడు 'నేను దేవులకు దేవుడను. ఏమి చేయవలయునో చెప్పుడు' అని పలికెను. "ప్రభూ! భవా! మాయెడల నీవు ప్రసన్నుడవైతివేని వేదశాస్త్రములను, రహస్యములతో కూడిన యజ్ఞ విధానమును ఆలసింపక మాకు దయజేయుము"" అని విన్నవించిన తరువాత రుద్రుడు 'మీరందరు కూడి పశువులగుడు. నేను మీ పతినగుదును. ఆ విధముగా మీరు అందరు మోక్షమును పొందుడు' అనగా అట్లే అనిరి. శివుడు పశుపతి అయ్యెను. అంత బ్రహ్మ పశుపతితో ప్రసన్నమగు హృదయముతో ఇట్లు పలికెను. "దేవదేవా! నీకు చతుర్దశి ప్రీతికరమగు తిథియగు గాక! ఆ తిథి యందు శ్రద్ధతో పూజించి ఉపవాసముండి, గోధుమ అన్నముతో బ్రాహ్మణులకు సంతర్పణ చేయువారికి నీవు తృప్తి చెంది మిక్కిలి శ్రేష్ఠమగు స్థానమును ప్రసాదింపుము" అని అవ్యక్తము నుండి ఉదయించిన బ్రహ్మ ఇట్లు పలుకగా అంత రుద్రుడు భగునకు దంతములను, పూషునకు కనులను, క్రతువునకు బీజములను ఒసగెను. దేవతలందరకు చక్కని జ్ఞానమును ప్రసాదించెను. ఇట్లు బ్రహ్మవలన

రుద్రుని పుట్టుక సంభవించెను. ఈ ప్రయోగము వలననే అతడు దేవతలకు ప్రభువు అయ్యెను. వేకువ జామున లేచి యీ కథను విను మానవుడు సర్వపాపముల నుండి విడివడి రుద్రలోకమును పొందును" అని చెప్పి మహాతపుడు అనంతరము ఇట్లు పల్కెను.(33)

34 వ అధ్యాయము - పితృదేవతల ఉత్పత్తి - అమావాస్యాతిథి

"రాజా! నేను చెప్పుచున్న పితృదేవతల పుట్టుకను గూర్చి వినుము. మునుపు ప్రజాపతియగు బ్రహ్మ వేరువేరు ప్రజలను సృజింపగోరినవాడై, చెదరని మనసుతో, ఆ ప్రజల మూలద్రవ్యములను మనస్సున నిర్మించి, ఆ సృష్టిని వెలుపలికి తెచ్చి దానిని విస్తృతపరచుటకై పరబ్రహ్మమును ధ్యానించెను. అట్లు పరమాత్మతో యోగము పొందిన ఆ బ్రహ్మదేవుని దేహము నుండి ఆ తన్మాత్రలు పొగవంటి వన్నెగల కాంతులతో బయటకు వచ్చెను. మేము సోమమును త్రావుదుమని, దేవతలతో పలుకుచు ఊర్వలోకమునకు పోగోరిన వారై గగనమున నిలిచినవారై తన్మాత్రల రూపముగల ఆ తపస్వులు ఉండిరి, ఆకసమున అడ్డముగా పైకెత్తిన మోములతో నిలిచిన వారిని చూచి బ్రహ్మ వెంటనే ఇట్లు పలికెను. మీరు గృహస్థులందరకు పితృదేవతలు అగుడు" అనగా అందు పైకెత్తిన తలగలవారు 'నాందీముఖులు' అను పేరుగలవారైరి. వృద్ధి కొరకు చేయు శ్రాద్ధ కార్యముల యందు వారిని వేదమార్గమున పూజింపవలయును. అగ్నిని ముందుంచుకొని అర్చించు అగ్నిహోత్రులైన బ్రాహ్మణులు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు అగు కర్మములందును, పర్వములందును వారిని తృప్తిపరుపవలయును. బహిః ప్రావరణులను పితృదేవతలను (వెలుపలి దర్భలపై కూర్చుండువారిని), క్షత్రియులు తృప్తిపరచాలి. నేయి త్రావువారికి వైశ్యులు తర్పణములు చేయవలయును.

శూద్రులు, బ్రాహ్మణుల అనుమతిగొని తమతమ తల్లిదండ్రుల నామములు – మంత్రము, విధానము అను వానితో పనిలేకయే పై వారిని అర్చింపదగును. ఆహితాగ్నులు కాని, బ్రహ్మక్షత్రియ వైశ్యులు లౌకికాగ్ని ముందు ఆయా పితృదేవతల తిథుల యందు అర్పింపవలయును. ఓ పితృదేవతలారా! ఇట్లు పూజలందుకొని మీరు వారికి ఇష్టములగు కోర్కెలను తీర్పుడు. ఆయువు, కీర్తి, ధనము, పుత్రులు, విద్య, గొప్పతనము, జ్ఞానము అనువానిని ప్రసాదింపుడు" అని బ్రహ్మ ఇట్లు పలికి వారికి దక్షిణాయనమను పేరుగల

మార్గమును ఏర్పాటు చేసెను. అనంతరము బ్రహ్మ మెల్లగా భూతములను సృజింప నారంభించెను. అంత పితృదేవతలు బ్రహ్మతో "భగవంతుడా! మాకు వృత్తినొసగుము. దానితో మేము సుఖముగా ఉందుము" అని పలికిరి. అందులకు చతుర్ముఖుడు "మీకు అమావాస్య తిథి యగుగాక! ఆనాడు దర్భలతో, నువ్వులతో, జలములతో మనుష్యులు మీకు తర్పణములు చేయుదురు. దానితో మీరు మిక్కిలి తృప్తి పొంది, ఆలస్యం చెయ్యకుండా వారికి గొప్ప వరాలను ఇవ్వండి" అని చెప్పెను. (34)

35 వ అధ్యాయము - చంద్రోత్పత్తి - పౌర్ణమాసీతిథి

అటు పిమ్మట మహాతపుడు ఇలా చెప్పాడు. "బ్రహ్మమానస పుత్రుడు అత్రి. అతడు గొప్ప తపస్సంపద గలవాడు. ఆతని పుత్రుడు చంద్రుడు దక్షున కల్లుడాయెను. దాక్షాయణులని పేరొందిన ఇరువదియేడుగురు కన్యలు, చక్కని రూపము కలవారు సోమునకు పత్నులయిరి. వారందరికంటే మిన్న రోహిణి. సోముడామెతోనే విహరింప జొచ్చి, ఇతర భార్యలను ఆదరింపకుండెనని వింటుము. ఆ ఇతర భార్యలు చంద్రుని యీ పక్షపాతమును తండ్రితో చెప్పుకొనిరి. దక్షుడును పలుమారులు చంద్రుని కడకు వచ్చి చెప్పినా, అతడు అందరిని సమముగా చూడడాయెను. అంత దక్షుడు "నీవు కనబడకుండా పొమ్మని" చంద్రుని శపించెను. దక్షుడు ఇట్లు శపింపగా సోముడు దక్షునితో "నీవును అట్లే అగుదువు. సనాతనమగు బ్రహ్మ దేహమును విడిచి పెక్కుమందికి పుట్టువాడ వగుదువు" అని పలికెను.

ఇట్లు పలికి చంద్రుడు దక్షుని శాపమువలన క్షీణించిపోయెను. సోముడు అట్లు రూపము లేనివాడు కాగా దేవతలు, మనుష్యులు, చెట్ల పొదలు, సమస్తములగు ఔషధులు పోయినవి. క్షీణించి పోవుచున్న ఓషధులతోపాటు దేవతాశ్రేష్ఠులు కూడ తరిగిపోవుచు బాధనొందినవారై "లతల మొదళ్ళలో చంద్రుడున్నాడని" పలుకజొచ్చిరి. తీవ్రమైన వేదనతో వారందరు విష్ణువును శరణుజొచ్చిరి. భగవంతుడు వారి నందరను 'నన్నేమి చేయుమందురని' అడిగెను. "దేవా! ఆ దక్షుని శాపముచేత సోముడు నాశమాయెను" అని పలికిరి. దేవతలారా! ఓషధులన్నింటిని పడవైచి చెదరిపోకుండ చూచుకొని, కలశము వంటి సముద్రమును చిలుకుడు అని విష్ణువు వారితో పలికెను. దేవతలతో ఇట్లు పలికి హరి తానై రుద్రుని, బహ్మను భావన చేసెను. అట్లే కవ్వపుద్రాడుగా ఉండుటకై వాసుకిని

స్మరించెను. వారందరు కలసి సముద్రమును చిలికిరి. అట్లు చిలుకగా చంద్రుడు మరల పుట్టెను. మానవుల దేహమున క్షేత్రజ్ఞుడను పేరున ఉన్న పరపురుషుడే ఈ సోముడని భావింపదగును. దేహులలో ఈతనికి జీవుడని పేరు. పరతత్త్వము ఇచ్చకు లోబడి ఆతడు వేరుగా సోమసంబంధమైన ఆకారమును పొందెను. దేవతలు, మనుజులు, పదునారు విధములుగా ఉన్న దేవతయోనులు ఆతనిపై ఆధారపడి బ్రతుకుదురు. అట్లే వృక్షములకు, ఓషధులకు ప్రభువుగా ఆతనినే భావింతురు. రుద్రుడతనినే అప్పుడు ఒక కళరూపముతో శిరస్సున ధరించెను. జలములు ఆతని స్వరూపములే. ఆతడు 'విశ్వమూర్తి' అనగా విశ్వమంతయు తన ఆకారమే అయినవాడుగా భావనకు వచ్చుచున్నాడు. ఆతని యెడ ప్రీతినొందిన బ్రహ్మ ఆతనికి పూర్ణిమ తిథిని సమర్పించెను. ఆ తిథియందు ఉపవాసముండి ఆతనిని పూజింప వలయును. యవలతో వండిన అన్నము తినవలయును. అట్టివానికి చంద్రుడు జ్ఞానము నొసగును. కాంతిని, పుష్టిని, ధనధాన్యములను ఎక్కువగా ప్రసాదించును' అని చెప్పెను. (35)

36 వ అధ్యాయము- మణిపుత్రులు - మహాతపః ప్రజాపాలుర సుగతి

మరల ఆ మహాముని "రాజా! మొదటి త్రేతాయుగమున మణివలన పుట్టిన రాజులుగా ప్రసిద్ధి చెందిన వారిని గూర్చి తెలిపెదను. నీవు ఆ వంశముననే కదా పుట్టితివి! కృతయుగమున సుప్రభుడను పేరుగల రాజవు నీవే. అట్టి నీవు ప్రజాపాలుడను పేరున ఉత్తముడవై పుట్టితివి. తక్కిన వారందరు త్రేతాయుగమున గొప్పబలము గలవారై పుట్టుదురు. మణి వలన పుట్టిన దీప్త తేజుడు, శాంతుడను ఖ్యాతి నొంది జనించును.సురశ్మియను రాజు శశికర్ణుడను పేరున గొప్ప బలముతో పుట్టును. శుభదర్శనుడను రాజు పాంచాలుడు అగును. అంగవంశమున సుశాంతి సుందరుడై పుట్టును. సుందుడు ముచుకుందుడు అయ్యెను. సుద్యుమ్నుడు తురుడై పుట్టెను. సుమనుడు సోమదత్తుడుగను, శుభుడు సంవరణుడుగను, సుశీలుడు వసుదాసుడును, సుఖదుడు సుపతిగను, శంభుడు సేనాపతి అయ్యెను. సుకాంతుడు దశరథుడు అయ్యెను. సోముడు జనకమహారాజాయెను. త్రేతాయుగమున వీరిట్లు జన్మించిరి. రాజా! ఈ రాజలందరు భవభోగములను పొంది, పెక్కువిధములగు యజ్ఞములాచరించి స్వర్గమునకు చేరుకొందురు. ఇట్లు బ్రహ్మవిద్య అను అమృతము వంటి అత్యుత్తమమగు కథను విని ఆ

రాజర్షి ప్రజాపాలుడు ప్రీతుడై, తపస్సు చేయుటకై అడవి కరిగెను. అని చెప్పిన వరాహమూర్తి ఇంకను "భూదేవీ! మహాతపుడు ఆధ్యాత్మ యోగముచే ఈ దేహమును విడచి బ్రహ్మముగానై హరియందు లీనమయ్యెను. ఈ రాజు తపస్సు కొఱకు బృందావనమున కరిగెను. అచట గోవింద నామము గల హరిని కొనియాడ దలచుకొని, దేవదేవుని ఇట్లు స్తుతించెను."

"దేవునకు, జగత్తులకు స్వరూపమైనవానికి గోపదేవునకు, ఇంద్రుని తమ్మునకు, ఊహింపనలవి కాని వానికి, సంసార చక్రమును దాటించుటలో నేర్పుగలవానికి, భూమికి పట్టుగొమ్మ అయిన వానికి దేవవరునకు నీకు నమస్కరింతును. ఈ సంసారమొక సముద్రము. ఇది వందలకొలది దుఃఖములనెడు తరంగములతో భయపెట్టుచుండును. ముసలితనమే యిందలిసుడులు. చీకటితో నిండిన పాతాళమే దీనికి మూలము. అట్టి దీనిని నాశనము చేయగలవాడవు నీవొక్కడవే. సుఖమును గూర్చువాడవును నీవే. ఓ గోపతీ! అప్రమేయా! అట్టి నీకు మ్రొక్కులు. దేవా! వ్యాధులతో, గ్రహబాధలతో కూడిన మానవులు అందరు నిన్ను ఆశ్రయింతురు. ఓ మహాత్మా! జనార్ధనా! అట్టి వ్యాధులు మున్నగు వానితో పోరాడుట యందు మిక్కిలి ఆసక్తి కలవాడవు. గోపేంద్రా! సమస్తమునకు చుట్టమైనవాడా! నీకు నమస్కారము. సర్వము నెరిగిన వారిలో నీవు శ్రేష్ఠుడవు. దేవదేవా! ఈ విశ్వమంతయు నీతో నిండియున్నది. గోపేంద్రా! సంసారము వలన భయపడిన నన్ను, వాడియగు చక్రమును చేతదాల్చిన స్వామీ! కాపాడుము. దేవా! నీవు సర్వమునకు పరుడవు. దేవులలో మిక్కిలి శ్రేష్ఠుడవు. పురుష స్వరూపుడవు. చంద్రునివలె వెలుగొందువాడవు. అగ్నియే ముఖమైనవాడవు. అచ్యుతుడవు. పసగల భావములు గలవాడవు. గోపేంద్రా! సంసారమున పడిపోవుచున్న నన్ను పాలింపుము. దేహముదాల్చిన వారికి సంసారమను చక్రమునందే తిరగడం సంభవించుచున్నది. వారందరు నీ మాయచేత మోహితులైన వారే. ద్వంద్వములందు నిలుచు వాడెవ్వడైనను నీ మాయను దాటలేదు? గోత్రము, స్పర్శ, రూపము, వాసన, పేరు నీకు లేవు. నీవు అజుడవు. సర్వశ్రేష్ఠుడవు. ఇట్టి నిన్ను ఉపాసించు బుద్ధిశాలులు సంసారము అను బంధంనుండి విడవడి ముక్తి పొందుదురు. నీవు శబ్దమును మించి పోయినవాడవు. గగనమే నీ రూపము. నీకొక ఆకారము లేదు. ఒక కార్యము లేదు. శుభమైన భావము కలవాడవు. ఉత్తమోత్తముడవు. చక్రము, పద్మము చేత దాల్చిన వాడవని

సూచనగా పురాణమునందు నిన్ను పేర్కొందురు. అట్టి నీకు ఎల్లవేళల మ్రొక్కుదును. దేవ! చరాచరములగు సమస్త భూతములను నీవే సృజింతువు. మరల నీవే లోగొందువు. ఎందేగి యోగులు మరల తిరిగిరారో ఆ తావునకు ముక్తిని కాంక్షించు నన్ను వడిగా చేర్చుము. గోవిందా! నీకు జయము. మహానుభావా! నీకు జయము. విష్ణూ! పద్మనాభా! నీకు జయము. సర్వమెరిగిన దేవా! ఊహలకందని పరతత్త్వమా! విశ్వేశ్వరా! విశ్వమంతయు ఆకృతియైన స్వామీ! నీకు జయము! అని ఇట్లు స్తుతించి ఆ రాజు తన కళేబరమును వదలివైచి పరమాత్ముడు, శాశ్వతుడు అయిన గోవిందుని యందు లయము పొందెను. (36)

37 వ అధ్యాయము - అరుణి వ్యాధ వృత్తాంతము

ధరణి వరాహమూర్తితో ఇట్లు పలికెను. "దేవా! విభో! సర్వప్రాణులకు భావింపదగిన స్వామీ! భక్తిగల నరులు, నారులు, నిన్నే తీరున ఆరాధింపగలరు? నాకు అది అంతయు చెప్పుము" అనగా ధరణితో ఆదివరాహస్వామి ఇట్లు చెప్పెను. "దేవీ! నేను భక్తికి మాత్రమే సాధ్యుడను. ధనములు, జపములు నన్ను సాధింపజాలవు. అయినను నన్ను పొందగల దేహకష్టములను గూర్చి నీకు తెల్పెదను. చేష్టతో, మనసుతో, మాటతో నన్ను భావించు నరుడు చేయు వివిధములైన వ్రతములను నేను హృదయమున నిలుపుకొందును, అని నీవు తెలిసికొనుము. ఓ భూదేవీ! అహింస, సత్యము, దొంగబుద్ధి లేకుండుట బ్రహ్మచర్యము, పాపపు పనులు చేయకుండుట అనునవి మానసములైన వ్రతములు. ఒకపూట భోజనము, రాత్రి భోజనము, ఉపవాసము మొదలగునది అంతయు మానవుల కాయిక వ్రతమగును. మరియొక విధముకాదు. మౌనము, వేదములను చదువుట, దేవుని స్తుతులను కొనియాడు చుండుట, క్రూరకర్మముల నుండి మరలుట అనునవి వాచికమైన వ్రతము.

ఈ విషయమున ఒక కథ వినవచ్చుచున్నది. మునుపు ఒక కల్పమున బ్రహ్మ కుమారుడు అరుణి అను పేరుగల గొప్ప తపస్సంపన్నుడు ఉండెడివాడు. ఆ ఉత్తమబ్రాహ్మణుడు తపస్సు చేయగోరినవాడై ఒక అడవి కరిగెను. అందతడు ఉపవాసము నందు శ్రద్ధకలవాడై తపస్సు చేయుచుండెను. ఆ బ్రాహ్మణుడు రమ్యమైన దేవికానది యొడ్డున నివసించుచుండెను. ఒకనాడు ఆతడు అభిషేకము కొరకు మహానదికి పోయెను. అచట స్నానముచేసి జపము చేసికొనుచు, ఆ విప్రుడు తన కెదురుగా వచ్చుచున్నవాడు.

గొప్ప విల్లు చేత దాల్చినవాడు, మిడిగ్రుడ్లవాడు, భయము గొలుపువాడు అగు ఒక వేటగానిని గాంచెను. ఆతడు ఆ బ్రాహ్మణుని కొట్టి, నారచీరలను ఎత్తుకొని పోవుటకే వచ్చెను. ఆ బ్రాహ్మణహంత వలని భయముతో ఆ విప్రుడు కలతచెంది నారాయణుని ధ్యానించుచు, అందే నిలిచెను. గుండెలో హరికి గూడుకట్టిన ఆ విప్రుని చూచి వేటగాడు భయపడిన వాడై విల్లంబులను పారవైచి అతనితో ఇట్లు పలికెను. “ఓయి బాపనయ్యా! నేనిచటకు వచ్చుటకు ముందు నిన్ను చంపగోరితిని. ఇప్పుడు నిన్ను చూచినంతనే ఆ నా బుద్ధి ఎటకోపోయినది. వేలకొలది బ్రాహ్మణులను, పదివేల కొలది ఆడువాండ్రను, ఆలుమగలను పాపకారినగు నేను ఎల్లవేళల చంపితిని. నావంటి క్రూరమైన చిత్తము నరకమునందు కూడ కానరాదు. ఇప్పుడు నాకు నీవద్ద తపస్సు చేయు కోరిక కలిగినది. ఉపదేశమొసగి నాయందు అనుగ్రహము చూపదగును.” ఆ బోయ అట్లు పలికినను, వీడు బ్రహ్మఘ్నుడు, పాపకర్ముడు అని ఆ విప్రశ్రేష్ఠుడు సమాధాన మీయకుండెను. అతని నోటి నుండి మాటరాకపోయినను ధర్మమునందు కోరికగల వ్యాధుడు అటనే నిలిచిపోయెను. ఆ బ్రాహ్మణుడును నదియందు స్నానముచేసి చెట్టు మొదట కూర్చుండి ఉండెను. కొంత సమయము ఇట్లు గడువగా ఒకనాడు ఆకలిగొన్న పెద్ద పులి శాంతముగా నున్న ఆ విప్రుని తినివేయుటకై ఆ నదికడకు వచ్చెను. నీటియందున్న ఆ విప్రుని ఆ పులి తినబోవు లోపల వ్యాధుడు దానిని బాణముతో కొట్టగా అది ప్రాణములను వదలెను. ఆ పులి దేహము నుండి ఒక పురుషుడు పైకి లేచెను. ఆ కలకలనాదము విని విప్రుడు“ఓం నమో నారాయణాయ"అని పలుకుచు నీటిలో మునిగెను. కంఠమునందున్న ప్రాణములతో ఆ పులియు ఆ మంత్రమును వినెను. విన్నంతనే ప్రాణములను వదలెను. అందునుండి వెడలిన పురుషుడును మంగళ రూపుడయ్యెను. 'అయ్యా! నేను సనాతనుడగు విష్ణువున్న తావునకు బోవుదును. నీ దయవలన నేను పాపములను పోగొట్టుకొంటిని. ఏ రోగములు లేనివాడనైతిని' అని ఆతడు పలికెను.

అప్పుడు ఆతడు ఇట్లనెను. “నేను పూర్వజన్మమున గొప్ప ప్రతాపముగల రాజేంద్రుడను. నన్ను దీర్ఘబాహుడు అందురు. అన్ని ధర్మములలో ఆరితేరినవాడను. నేను వేదముల నెరుగుదును, శుభాశుభములు నెరుగుదును. నాకు బ్రాహ్మణునితో పనియేమి? బ్రాహ్మణులు ఎంతవారు?” అని నేను ఇట్లు బ్రాహ్మణులతో పలుకుచుండగా, వారందరు

క్రోధము గలవారై “నీవు అణచ శక్యము కాని క్రూరమగు పెద్ద పులివగుదు”వని శాపమునిచ్చిరి. విప్రుల నవమానించుట వలన నీ స్మృతి శక్తి తప్పక నశించును. ఓయీ మూఢుడా! మరణకాలమున నీకు కేశవుని వలన ఆ స్మృతి నీకు కలుగును” అని బాహ్మణులు అట్లు పలుకగా ఆ బ్రహ్మశాపమును మొత్తముగా నేను పొందితిని. మహామునీ! అంత నేను వారి కాళ్లపై బడి ప్రార్థింపగా, ఆ బ్రాహ్మణులు అందరు నాయందు అనుగ్రహముతో ఇట్లు పలికిరి. “ఓరీ నరాధమా! దినమున ఆరవకాలమున అన్నము తినువేళకు నీముందు ఎవ్వడు నిలుచునో వాడు నీకు అన్నమగును. ఇట్లు కొంతకాలము సాగును. (1. షష్ఠ + అన్నకాలికస్య – పగటిని ఆరుభాగములుగా భావింతురు.1. ప్రాతఃకాలము, 2. సంగవ కాలము, 3. పూర్వాహ్ణము, 4. మధ్యాహ్ణము, 5. అపరాహ్ణము, 6. సాయాహ్నము. సాయంకాలము అన్నము తినగోరెడువాడు అని భావము) ఎన్నడు నీవు బాణపు దెబ్బతిని ప్రాణములు కంఠమునకు చేరుకొనగా ఒక బ్రాహ్మణుని ముఖమున “నమో నారాయణాయ” అను మంత్రము విందువో అప్పుడు నీకు స్వర్గగతి కలుగును. ఇందు సందియము లేదు”. విప్రులయెడ ద్వేషము పొందిన నాకు ఇతరుని ముఖము నుండియైనను విష్ణు నామము వినవచ్చినది. ఇది నీ యెదుటనే జరిగినది. ఇంక బ్రాహ్మణులను పూజించి తననోటితో 'నమో హరిమ్' (హరికి నమస్కారము) అనుచు ప్రాణములు వదలువాడు పాపములు నశించినవాడై ముక్తుడగునని చెప్పనేల? సత్యము, సత్యము, ముమ్మాటికి సత్యము. చేయి పైకెత్తి ఇది చెప్పుచున్నాను. బ్రాహ్మణులు తిరుగాడు దేవతలు. పురుషోత్తముడు కూటస్థుడు” అని ఇట్లు పలికి ఆరాజు పాపములు వదలినవాడై స్వర్గమున కరిగెను. బ్రాహ్మణుడును భగవన్నామముతో ఎల్లప్పుడు కూడినవాడై ఆ బోయవాని కిట్లనెను. “తినవచ్చిన మృగరాజము నుండి నన్ను రక్షించితివి. కుమారా! అందువలన నాకు సంతోషము కలిగినది. నీకు వరమిత్తును కోరుకొనుము” “ఓయి విప్రుడా! నీవు నాతో మాటాడితివి. ఇదియే నాకు వరము. ఇంతకంటెను మించి వరముతో నేనేమి చేయుదును. నన్ను శాసింపుము” అని బోయవాడు ప్రార్థింపగా “పెక్కుపాపములు చుట్టుముట్టిన వాడవు. ఘోరరూపుడవు. అట్టి నీవు తపస్సును కోరి నన్ను మున్ను ప్రార్థించితివి. దేవికానదిలో స్నానముచేతను, నా దర్శనము చేతను, విష్ణు నామమును వినుటచేతను ఇప్పుడు నీ పాపములన్నియు నశించిపోయినవి. నీ దేహము

శుద్ధమైనది. ఇందు సంశయము లేదు. ఓయీ మంచివాడా! ఇప్పుడు నానుండి నీవొక వరమును కైకొనుము. కోరుదువేని చిరకాలము తపమొనర్పుము" అని పల్కెను.

"స్వామీ! నీవు చెప్పితివే! ఆ విష్ణువు నారాయణ ప్రభువును మానవులు ఎట్లు పొందగలరు? ఇది చెప్పుము. ఇదియే నాకు వరము" అని బోయ అనగా బ్రాహ్మణుడు మానవుడు ఆ అచ్యుతుని గూర్చి ఏదేని వ్రతమును చేయవలయును. భక్తి నిండుగాగల అట్టి పురుషుడు ఆ పరమాత్మను పొందును. బిడ్డా! ఇది యెరిగి వ్రతము నొకటి ఆచరింపుము. 'చచ్చినదాని మాంసమును తినను. ఎన్నటికి అబద్ధమాడను.' అనువ్రతము పాటింపుము. ఈ వ్రతము నీకు ఉపదేశించితిని. వ్యాధవరా! నీవిట్లు తపముతో కూడి కోరినంత కాలము నిలువుము" అని చెప్పెను అని వరాహదేవుడు ఇట్లు చెప్పెను. ఇట్లు చింతతో కూడిన ఆ బోయ మోక్షము కోరుచున్నాడని ఎరిగి బ్రాహ్మణుడు వరము నొసగినవాడై ఆతని కనుగప్పి అటునుండి వెడిలిపోయెను. (37)

38 వ అధ్యాయము - సత్యతపోవృత్తాంతము

ఆ కిరాతుడు మంగళమైన మార్గమును అవలంబించి ఆహారము వదలి, ఆ గురువును మనసులో స్మరించుచు తపస్సు చేసెను. భోజన సమయము రాగా రాలిన ఆకులను తినుచుండెను. ఆతడు ఒకనాడు ఆకలిపైగొనగా ఒక చెట్టు మొదటికి చేరుకొనెను. ఆకలిగొన్న వాడై దగ్గరగా నున్న ఆకును తినగోరెను. ఇట్లు చేయుచుండగా ఆకాశమున అశరీరవాణి వినవచ్చెను. 'అపవిత్రమైన దానిని తినకు', అని బిగ్గరగా అశరీరవాణి పలుకగా అంత నతడు దానిని వదలివైచి రాలిన మరియొక చెట్టు ఆకును కైకొనెను. దాని విషయమున కూడ ఇట్లే నిషేధము వినవచ్చెను. మరొక దానియెడలను అట్లే యాయెను. ఇట్లతడు అంతయు అపవిత్రమే అని తలచి ఏమియు తినకుండెను. ఏ ఆహారము లేనివాడై, గురువును స్మరించుచు, మెలకువతో ఆతడు తపమొనర్చెను. ఇట్లు చాలా కాలము గడువగా, ఒకనాడాతని కడకు ఒక ఋషివరుడు అరుదెంచెను. ఆతడు దొడ్డబుద్ధిగల దుర్వాసుడు. తపమువలన పైకిలేచి వచ్చెడు తేజస్సులతో జ్వలించుచున్న హవిస్సువలె ఉన్నవాడును, ప్రాణములు కడబట్టినవాడును అగు ఆ బోయవానిని దుర్వాసుడు చూచెను. ఆ వ్యాధుడును ఆ మహామునికి శిరసా నమస్కరించి 'భగవానుడా! నీ దర్శనము వలన కృతార్థుడయినయితిని. ఇప్పుడు నాకు శ్రాద్ధకాలము. నీవు అనుగ్రహింపుము. రాలిన

ఆకులను పుచ్చుకొనుము. నేను వానితోనే శ్రాద్ధమును నిర్వహింతును. వానితోడనే నీకు ప్రీతి కలిగింతునని' పలికెను. పరిశుద్ధుడు, ఇంద్రియములను గెలిచినవాడును, శుద్ధమైన భావములు కలవాడును అగు అతని తపస్సును పరీక్షింపగోరి దుర్వాసుడును పెద్దగా ఇట్లు పలికెను. "ఆకలితో నుండి, నీకడకు వచ్చిన నాకు యవలు, గోధుమలు, సన్నబియ్యముల అన్నమును వండిన దానిని పెట్టుము" అని ఆ ముని పలుకగా ఆ వ్యాధుడు పెద్ద ఆలోచనలో పడెను. నాకిట్టిది ఎక్కడ దొరకును? అని విచారించెను.

అట్లు చింతించుచుండగా ఆకాశము నుండి బంగారు పాత్ర శుభమైనది, సిద్ధలతో కూడినది ఒకటి పడెను. దాని నాతడు చేతితో గైకొని వెరగుపడుచు ఆ వ్యాధుడు దుర్వాసునితో ఇట్లు పలికెను. "మహర్షి! నేను బిచ్చమెత్తివచ్చు వరకు నీవు ఇచటనే నిలువుము. నాయందు అనుగ్రహము చూపుము" అని పలికి ఆ మంచిబోయ చేరువలో ఉన్నదియు ధనములు, మంచి యిల్లాండ్రు గలదియునగు నగరమునకు భిక్షమెత్తుటకై అరిగెను. అతడిట్లు బయలు దేరినంతనే వృక్షముల నుండి వెలువడి బంగారు పాత్రలు చేత ధరించిన సుందర వనితలు పెక్కువిధముల అన్నములను అతనికి అందించిరి. అతని పాత్ర పూర్తిగా నిండిపోయెను. అతడును తన్ను కృతార్థునిగా భావించుచు తిరిగి ఆశ్రమమునకు వచ్చి మహర్షి శ్రేష్ఠుడగు ఆ దుర్వాసుని కాంచెను. కాంచి ఆ భిక్షను శుచియైన తావున ఉంచి ప్రసన్న బుద్ధియై ప్రణమిల్లి ఆ ఋషితో ఇట్లు పలికెను.

"పూజ్యుడా! ఋషివరా! కాళ్ళు కడుగుకొనుము. నన్ను అనుగ్రహింతువేని ఇట్లు చేయదగును." అతడు అట్లు పలుకగా ఆ ముని శుభమైన ఆతని తపోబలము నెరుగ గోరి "ఓయీ! నేను నదికి పోజాలను. నాకడ జలపాత్రము లేదు – ఓ మహామతీ! నేను కాళ్ళెట్లు కడుగుకొందును?" అని పలుకగా వ్యాధుడు అది విని మరల ఏమి చేయుదును? ఈతనికి భోజనము ఎట్లు అగును? అని విచారించెను. మనసులో చక్కగా ఆలోచించి ఆ వివేకి గురువును స్మరించి, ఆ బుద్ధిమంతుడు ఆ దేవికా నదిని శరణుజొచ్చెను. "అమ్మా! నదీమతల్లీ! నేను కిరాతకుడను. పాపకర్ముడను, బ్రహ్మహత్యలు చేసిన వాడను. అయినను నిన్ను భావించితిని. శరణుజొచ్చిన నన్ను కాపాడుము. దేవత నెరుగను. మంత్రము నెరుగను. అట్లే పూజించు పద్ధతి నెరుగను. గురుపాదములను శ్రద్ధతో ధ్యానించి శుభమును

గాంచుచున్నాను. ఓ పుణ్యనదీ! ఇట్టి నాయెడల దయచూపుము. ఋషి పాదములు కడుగుకొనుటకు నీటిని దగ్గరకు తెమ్ము. ఆలసింపకుము.''

అని ఆ బోయ అట్లు పలుకగా పాపములను నశింపజేయు దేవిక సంశితవ్రతుడగు దుర్వాసుడున్న కడకు వచ్చెను. ఆ గొప్పనది దేవిక స్వయముగా ఆ ముని పాదములను కడుగుచు వ్యాధుని ఆశ్రమముకడ సంతోషంగా ప్రవహించెను. ఆ గొప్ప వింతను గాంచి దుర్వాసుడు అచ్చెరువందెను. కాలుసేతులు కడుగుకొని ఆచమించి, శ్రద్ధతో పెట్టిన ఆ అన్నమును మిక్కిలి ప్రీతుడై భుజించెను. ఎముకలు మాత్రము మిగిలినవాడు, ఆకలితో అల్లాడుచున్నవాడు అగు ఆ బోయతో ఆ మహర్షి "వేదాధ్యయనము, సంగ్రహ గ్రంథములతో కూడిన సమస్తవేదములు, బ్రహ్మవిద్యయు, పురాణములు నీకు ప్రత్యక్షములగు గాక" అని పలికెను. దుర్వాసుడిట్లాతనికి వరమొసగెను, పేరు కూడ పెట్టెను. "నీవు సత్యతపుడవు, అను పేరుగల ఆది ఋషివి అగుదువని" పలికెను. ఇట్లాతడు వరమీయగా అతడు ఆ ముని శ్రేష్ఠునితో ఇట్లు పలికెను. "స్వామీ! నేను బోయజాతివాడనై వేదమునెట్లు చదివెదను?" "ఉత్తముడా! నీ పాతదేహ మీపుడు పోయినది. నీవు ఆహారము కొనవైతివి గదా! ఇప్పుడు నీది తపోమయమైన శరీరము. ఇది వేరు సంశయము లేదు. నీ దగు పాత విజ్ఞానము నశించినది. ఇప్పటి నీ విజ్ఞానము శుద్ధము. అక్షరము (నశింపనిది) కావున ఓ మునీ! నీకు వేదములు శాస్త్రములతో పాటు స్పష్టముగా తెలియవచ్చును" అని తెల్పగా (38)

39 వ అధ్యాయము - దుర్వాసఃకథిత ద్వాదశీకల్పవ్రతము

సత్యతపుడు ఇట్లు పలికెను. "పూజ్యుడా! నీవు బ్రహ్మవేత్తలలో శ్రేష్టుడవు. నీ రెండు శరీరములను గూర్చి పలికితివి. వాని భేదమేమి. అవి ఏవి? నాకు చెప్పుము ఆ కోరగా దూర్వాసుడు ఇట్లు చెప్పెను. శరీరములు రెండుకావు, మూడు అని చెప్పవలయును. భోగములకు నెలవైనదగు శరీరము ప్రాణులకు మూడు విధములుగా నుండును. మొదటి అవస్థలోని దానికి అధర్మము అను పేరుగలదు. అందు జ్ఞానము, స్పర్శ ఉండవు. రెండవది సవ్రతము. అది అత్యంత ధార్మికముగా తెలియవచ్చును. ఇంద్రియములను దాటినది ధర్మము, అధర్మముల అనుభవము కొరకు అయినది మూడవది. వేదముల తత్వముల నెరిగిన వివేకవంతులు ఈ మూడు విధములైన భేదములను చక్కగా నిరూపించిరి.

యాతన, ధర్మభోగము, భుక్తి అని మూడు భేదములు ఇందుగలవు. (యాతనా కర్మఫలములను పొందునది, ధర్మభోగములు ధర్మఫలములను అనుభవించు నది. భుక్త పుణ్యఫలమును పొందునది.) ప్రాణులను చంపునపుడు మున్ను నీకు గల భావము పాపము అను పేరుగల శరీరముగా చెప్పబడును.

ఇప్పుడు శుభమైన ప్రవృత్తిగల కపటములేని తపస్సు చేయుచున్న నీ శరీరము ధర్మరూపమైనది. దానిచేత నీవు వేదములను, పురాణములను నిస్సంశయము ఎఱుగవచ్చును. ఎనిమిదేండ్ల ప్రాయము నిండుసరికి మానవుడు ఈ మూడు కలవాడగును. ఎనిమిదేండ్ల వయస్సు దాటిన పిదప ఆతడు మూడు దశలను పొందువాడై నిర్మలుడు, అచంచలుడు, ఆత్మ నిగ్రహము కలవాడు అగును. మానవుడు అయిదింటిని, మరల అయిదింటిని, ఇంకను అయిదయిదుగానయిన వానిని వదలునో అపుడు అతడు ఒకే దారికలవాడై శాశ్వతమగు బ్రహ్మమును పొందును. అనగా,

1. అయిదు - జ్ఞానేంద్రియములు 1) చర్మము, 2) కన్ను, 3) చెవి,4) నాలుక,5) ముక్కు.

2. అయిదు - కర్మేంద్రియములు 1)నాలుక, 2)చేయి, 3)కాలు, 4) మల విసర్జనేంద్రియములు, 5) జననేంద్రియము.

3. అయిదు- విషయములు 1)శబ్దము, 2)స్పర్శ, 3) రూపము, 4) రసము, 5) గంధము.

4. అయిదు- పంచభూతములు 1) పృథివి, 2) నీరు, 3) అగ్ని, 4) వాయువు, 4) ఆకాశము.

ఈ ఇరువదింటి తగులము లేనివాడు బ్రహ్మమును వీడగలడని తెల్పగా మరల సత్యతపుడు ఇట్లు ప్రశ్నించెను. "మహాత్మా! విజ్ఞానరూపమైన శరీరము కలుగాకపోతే, అప్పుడు ఏవిధముగా పరబ్రహ్మము పట్టువడును?" అని అడిగాడు. దుర్వాసుడు "కర్మముల సముదాయమునకు జ్ఞానము మూలము. జ్ఞానమునకు కర్మము మొదలైనది మూలము. రాతికిని మట్టికిని వలె ఈ రెంటికిని భేదములేదు. కర్మకాండము నాలుగురూపములుగా బ్రాహ్మణాదుల యందు చెప్పబడినది. అందు వేదము ఉపదేశించిన కర్మములను మొదటి మూడు వర్ణముల వారును ప్రతిదినము ఆచరించుచుందురు. ఒకడు (నాల్గవ వర్ణము వాడు) ఈ మువ్వురకు శుశ్రూష చేయును. ఇది వేదము చెప్పిన క్రియ (శుశ్రూష అనగా సేవ. సేవ అనగా వృత్తులను అర్థమును సంభావింపవలయును, కమ్మరము, వడ్రంగము, కుమ్మరిపని, రజకవృత్తి మొదలగునవి) బ్రాహ్మణుడు ఈ ధర్మములను అవలంబించి

వేదములందు ప్రీతికలవాడై ఉపాసన చేయుచుండెనేని ఆతనికి ముక్తి తప్పక కలుగును" అని తెలియజేయగా మరల సత్యతపుడు, "ఓ మహామునీ! నీవు బోధించు ఈ పరబ్రహ్మమున్నదే, ఆ మహాత్మమగు పరబ్రహ్మ రూపము యోగులు కూడ ఎరుగరు కదా! అయ్యా! ఆ పరబ్రహ్మమునకు పేరులేదు. సగోత్రమగు పదార్థము లేదు. దానికి ఆకారము లేదు. ఏ స్వరూపమును ఆశ్రయించి ఉండదు. ఇట్లు నామరూపములు లేని ఆ బ్రహ్మమును ఎట్లు ఎరుగవలయును? వేదమార్గము తీర్చిదిద్దిన దాని సంజ్ఞను నాకు చెప్పుము" అని అడుగగా, దూర్వాసుడు,

"వేదమంత్రములందు పేర్కొనబడిన ఆ పరబ్రహ్మము అనునది పుండరీకాక్షుడగు దేవుడే. స్వయముగా పరుడైన నారాయణుడే. ఉత్తముడా! ఆ హరి, నారాయణుడను పరమదైవము యజ్ఞములచేతను, వివిధములగు యాగములచేతను, దానముల చేతను, దానవస్తువులచేతను పొందబడును" అని చెప్పెను. మరల సత్యతపుడు "మహాత్మా! వేదము తుదిముట్ట అధ్యయనము చేసిన ఋత్విక్కులు, పెక్కుదనములు గల పుణ్యాత్ములే కదా యజ్ఞములు చేసి ఆ బ్రహ్మమును పొందుదురు. ఇతరులకు ఆ యజ్ఞ మెక్కడిది? ఆ విధముగా పడిన కష్టముతో భగవంతుడు దొరకునన్నమాట! విప్రవరేణ్యా! ధనము లేక దానమిచ్చుట సాధ్యము కాదు. ధనమున్నను కుటుంబమునందు తగులమును కలవానికి దానమిచ్చు బుద్ధిపుట్టదు. బ్రాహ్మణోత్తమా! అట్టివానికి మోక్షమెట్లు? వానికి హరి ఏవిధముగాను దుర్లభుడన్న మాట! తక్కువ శ్రమతో సనాతనుడైన ఆ దేవుని పొందు మార్గము సర్వవర్ణముల యందును ఎట్లుండునో సామాన్యమగు తీరున నాకు తెలుపుము" అని ప్రశ్నించెను. అందులకు దూర్వాసుడు "మునుపు భూమి రసాతలమున మునిగిపోవుచు చేసినదానిని, మిక్కిలి రహస్యమైన దానిని, దేవతలు నిర్మించిన దానిని నీకు తెల్పెదను. భూమి యొక్క మట్టితనము నీటియందు మించి పోకుండెను. అది నీటిలో మునుగగా భూమి రసాతలమునకు పోయెను. భూతలము లన్నింటిని పట్టి నిలిపెడు ఆ దేవి రసాతలమున కరిగినదై పరమదైవమగు నారాయణ ప్రభువును ఉపవాసవ్రతములతో, వేర్వేరు నియమములతో ఆరాధించెను. పెద్దకాలమునకు గరుడధ్వజుడు ఆమె యెడ ప్రసన్నుడాయెను. ఆమెను పైకి కొనివచ్చి అవ్యయుడగు ఆ దేవుడు మునుపటి స్థితిలో ఆమెను నిలిపెను" అని తెల్పగా సత్యతపుడు ఇంకొకమారు "ఓ మహామునీ! ఆ భూదేవి

చేసిన ఉపవాసము అదియేమి? ఆమె చేసిన వ్రతములేవి? ఇది నాకు తెలుప వలయును." అని వినుతింపగా దూర్వాసుడు "మార్గశిరమున దశమినాడు నియమవంతుడే దేవతార్చనమును, అగ్నికార్యమును యథావిధిగ ఆచరింపవలయును. శుభ్రమైన వస్త్రములు తాల్చి ప్రసన్నమగు బుద్ధికలవాడై చక్కగా సంస్కరించిన హవ్యమగు అన్నమును భుజించి, అయిదడుగులు వేసి తిరిగి పాదములు శుద్ధిచేసికొన వలయును. ఎనిమిదంగుళములు పాలచెట్టు పుల్లను పలుదాము పుల్లగా నమలి, మరల శ్రద్ధగా ఆచమనము చేయవలయును. దేహము ద్వారముల నన్నింటిని తాకి, జనార్దనుని ఎక్కువ సేపు ధ్యానింప వలయును, శంఖము, చక్రము, గద చేతులయందు తాల్చినవాడును, కిరీటము గలవాడు, పచ్చని వస్త్రము కట్టిన వాడును, ప్రసన్నమగు ముఖము కలవాడును, శుభలక్షణములన్నింటితో కూడినవాడును అగు దేవుని ధ్యానించి మరల చేతితో నీటిని గ్రహించి సూర్యుని కర్ఘ్యము నొసగవలయును. ఆ సమయమున ఇట్లు పలుకవలయును.

పుండరీకాక్షా! అచ్యుతా! నేను ఏకాదశినాడు ఆహారము కొననివాడనై మరుదినము భుజింతును. నాకు నీవు శరణము కమ్ము, అని పలికి ఆ రాత్రి దేవదేవుని సన్నిధిలో 'నమో నారాయణాయ' (నారాయణునకు నమస్సు) అని జపించుచు నిద్రింప వలయును. అంత తెల్లవారిన పిదప సముద్రమునందు కలియు నదికిగానీ, మరేదైనా నదికి గానీ, చెరువుకి గాని, ఇంటియందలి బావికిగాని అరిగి శ్రద్ధతో, 'దేవీ! సర్వప్రాణులకు నీవలననే ధారణము, పోషణము. ఆ సత్యముతో నా పాపమంతయు పోగొట్టుము' అను మంత్రముతో పవిత్రమైన మట్టిని తేవలయును. ప్రభూ! బ్రహ్మాండము కడుపున గల తీర్థములన్నింటిని చేతులతో తాకితివి. అందుచేత నీవు తాకిన ఈ మట్టిని తాకి నేను ఆ అన్నింటిని పొందెదను. ఓయి వరుణదేవా! నీయందు ఎల్లకాలము రసములన్నియు నిత్యములై నిలుచును. దానిచేత ఈ మట్టిని ముంచి యెత్తి పవిత్రము నొనర్పుము" అని ఇట్లు మట్టిని, నీటిని అనుగ్రహింప జేసికొని ఒంటికి రాచుకొనవలయును. ఇట్లు మిగిలిన మట్టితో మూడు మారులు చేయవలయును. నీటితో గుండ్రని ఆకారమును లిఖింపవలయును.

పిదప ఆ చక్రాకారమున శ్రద్ధతో స్నానమాచరించి నియమములను తీర్చుకొని మరల దేవగృహమున కరుగవలయును. అచట మహాయోగియు, దేవుడును, ప్రభువును

అగు నారాయణుని ఇట్లు పూజింపవలయును. 'కేశవాయ' అని పాదములను ‘దామోదరాయ’ అని నడుమును, 'నృసింహాయ' అని తొడల జంటను, 'శ్రీవత్సధారిణే' అని రొమ్మును, 'కౌస్తుభనాథాయ' అని కంఠమును 'శ్రీపతయే' అని వక్షమును, 'త్రైలోక్య విజయాయ' అని చేతులను 'సర్వాత్మనే' అని శిరస్సును, 'రథాంగధారిణే' అని చక్రమును, 'శంకరాయ' అని శంఖమును. 'గంభీరాయ' అని గదను, 'శాంతిమూర్తయే' అని పద్మమును 'నమః' అనుచు పూజింపవలయును. మరల వివేకవంతుడగు అతడు నీటితో నిండినవియు, మాలలతో అలంకరింపబడి నవియు, తెల్లని గంధము పూత గలవియునగు నాలుగు కుండలను ఆ దేవదేవుని ముందు నిలుపవలయును. ఆ కుంభములు కంఠమున మామిడి చిగుళ్ళు కలిగి, తెల్లని వస్త్రములతో చుట్టబడి నువ్వులు, బంగారు నాణెములు గల రాగిపాత్రలతో కప్పబడి యుండవలయును. ఆ నాలుగు కలశములు నాలుగు సముద్రములుగా భావింపవలయును. వాని మధ్య వస్త్రము పరచిన శుభమైన పీటను ఉంచవలయును. దానిపై బంగారము, వెండి, రాగి, కొయ్య అనువానితో చేసిన ఏదో ఒక పాత్రను ఉంచవలయును. ఆ పాత్రలలో ఏదియు దొరకనిచో మోదుగ ఆకునైన ఉంచవచ్చును. దానిని నీటితో నింపి ఆ పాత్రయందు ఉంచవలయును. బంగారపు చేపరూపమున వేద వేదాంగములతో కూడినవాడును, శ్రుతి స్మృతులతో అలంకృతుడును అగు విష్ణు దేవుని రూపమును చేయవలయును. చక్కగా ప్రకాశించుచున్న ఆ దేవునకు పెక్కు విధములగు పిండివంటలతో, పండ్లతో, పూవులతో, గంధములతో, ధూపములతో, వస్త్రములతో విధి ననుసరించి పూజ సలుపవలయును.

'కేశవా! పాతాళమున నున్న వేదములను చేపరూపమున నీవు ఎట్లు పైకి తెచ్చితివో నన్నట్లుద్ధరింపుము' అని పలికి ఆతని ముందు జాగరము చేయవలయును. తెల్లవారిన తరువాత తన విభవము మేరకు నలువురు బ్రాహ్మణులకు ఆ నాలుగు ఘటములను దానమీయవలయును. తూర్పుదిక్కు కుండను బహ్వృచమును అధ్యయనము చేసిన వానికి, దక్షిణ దిక్కు కుంభమును ఛందోగునకు, పడమటి ఘటమును యజుశ్శాఖను చదివినవానికి, ఉత్తరదిక్కు దానిని ఇష్టము వచ్చిన వానికి ఒసగవలయును. ఇదియే ఇచటి విధి. తూర్పు కడవయందు ఋగ్వేదము, దక్షిణ కుంభమునందు సామవేదము, పడమటి దానీయందు యజుర్వేదము, ఉత్తర ఘటముతో అధర్వవేదము ప్రీతిపొందుగాక! ఈ

వరుసతో "ప్రీయతామ్" అని పలుకవలయును. చేపరూపు బంగారు ప్రతిమను ఆచార్యునకు సమర్పింప వలయును. గంధము, ధూపము, వస్త్రములు, మున్నగు వానితో యథావిధిగ క్రమముతో రహస్యములతో ఈ మంత్రమును జపింపవలయును. దీనిని ఇతరులకు సరహస్యముగా ఉపదేశించు వాడు, కోటిరెట్లు ఫలమును పొందును. ఈ మంత్రమును గురువు నుండి పొంది మూర్ఖత్వము చేత ఎవడు ఆతనిని కాదనునో ఆ పురుషాధముడు కోటి జన్మములు నరకమున యాతనలు పొందును. ఈ విధానమును ప్రసాదించిన వానిని గురువని బుధులు చెప్పుదురు. ఇట్లు కానుక లొసగి పద్ధతిని బట్టి ద్వాదశినాడు విష్ణువును అర్చించి శక్తిమేరకు దక్షిణలతో పాటు విప్రులకు భోజనము పెట్టవలయును. నువ్వులతో కూడిన రాగిపాత్రలలో కుండలను మూయించి ఆ జలపాత్రలందు ఉన్నదానిని కుటుంబముగల బ్రాహ్మణునకు ఈయవలయును. పిదప దేవునకు నైవేద్యము పెట్టవలయును. శ్రేష్ఠమగు అన్నముతో బ్రాహ్మణ సంతర్పణము చేయవలయును. తరువాత తన బాలురతో కలిసి మౌనముతో, ఇంద్రియ వికారములు లేనివాడై భోజనము చేయవలయును. ఈ ప్రకారము ధరణీ వ్రతమును చేయు నరుడు పొందు పుణ్యఫలము మిక్కిలి శ్రేష్టమైనది. బుద్ధి మద్వరుడా! దానిని గూర్చి చెప్పెదను వినుము.

ఓ సువ్రతా! నాకు వేయినోళ్ళున్నచో, బ్రహ్మతో సమానమగు ఆయువున్నచో ఈ ధర్మఫలమును గూర్చి చెప్పుట సాధ్యము. అయినను క్లుప్తంగా చెప్పెదను వినుము. నాలుగు లక్షల నాలుగువేల ఎనిమిదివందల సంవత్సరములు కలిసి నాలుగు యుగముల మొత్తమగును. అట్టి డెబ్బది యొక్క మహాయుగములు మన్వంతరమగును. పదునాలుగా బ్రహ్మదేవునకు ఒక పగలు. అంత కాలమే మరల రాత్రియగును. ఇట్టివి ముప్పై దినములు ఒక నెల. అవి పంద్రెండు కలిసి సంవత్సరము. ఆ సంవత్సరములు నూరు బ్రహ్మదేవుని ఆయువు. ఇందు సంశయము లేదు. ఎవడుగాని ఒక్కమారు ఈ ద్వాదశీ లో వ్రతము నీ విధముగా ఆచరించునో ఆతడు బ్రహ్మలోకమును పొందును. అంతకాలమచట నిలుచును. పిదప బ్రహ్మలయము పొందునపుడు ఆతడును లయమందును. మరల సృష్టి యందు ఆ మహాతాపసుడు వైరాజులకు దేవుడగును. కోరకయో, కోరియో ఈ లోకమున చేసిన బ్రహ్మహత్య మున్నగు పాపములన్నియు ఆ క్షణమున నశించును. ఈ లోకమున దరిద్రుడు

గాని, రాజ్యము కోల్పోయినవాడుగాని ఏకాదశియందు ఈ విధముగా ఉపవాస మున్న యెడల ఆతడు తప్పక రాజగును. గొడ్రాలగు ఇంతి ఈ పద్ధతిగా ఉపవాసముండి పరమ ధర్మమూర్తియగు కుమారుని పొందును. నరుడు తాను పొందరాని స్త్రీని పొందినట్లుగా ఎరిగినచో ఈ విధానమును బట్టి ఆ పాపము నుండి విడివడును. పెక్కేండ్లు వేదవిద్యకు లోపము కలిగిన నరుడు ఈ ఏకాదశీ ఉపవాసము ఒక్కమారు భక్తితోచేసి వేద సంస్కారము పొందును. మహామునీ! పెక్కుమాట లేల. పొందరానిది పొందక పోవుటకానీ, నశింపని పాపము కాని లేదు. బ్రాహ్మణోత్తమా! నాయనా! పాతాళమున మునిగిన భూమియే స్వయముగా ఉపవాస వ్రతమాచరించినది. కనుక ఇందు విచారణతో పనిలేదు. పట్టుదల లేనివానికి, నాస్తికునకు ఈ విధానమును ఉపదేశింప రాదు. దేవతలను, బ్రహ్మ జ్ఞాన సంపన్నులను ద్వేషించువారికి దీనిని వినిపింపరాదు. అప్పటికప్పుడు పాపములను పటాపంచలు చేయు దీనిని గురుభక్తి కలవానికి ఒసగవలయును. విధి ప్రకారముగా దీనిని ఆచరించువానికి ఈ జన్మముననే సౌభాగ్యము, ధనము, ధాన్యము, మంచి యిల్లాలు మొదలగునవి కలుగును. భక్తితో ఈఉత్తమమగు ద్వాదశీ కల్పమును వినిపించు వాడును, వినువాడును, సకల పాపముల నుండియు విముక్తు డగును" అని చెప్పెను. (39)

40 వ అధ్యాయము - దుర్వాసఃకథిత పౌష్య ద్వాదశీవ్రతవిధానము

మరల దూర్వాసుడు ఇట్లు పలికెను. "అట్లే పౌషమాసమున దేవతలు సముద్రమును చిలికిరి. అప్పుడు స్వయముగా జనార్దనుడే తాబేలుగా అయెను. కర్మరూపముగల ఆ హరి నుద్దేశించి పుష్యమాస శుద్ధ ద్వాదశి ఏర్పడినది. ఏకాదశినాటి రాత్రియే ముందుగా సంకల్పించి స్నానము మొదలగు పనులు ముందువలెనే ఆచరించి మునిశ్రేష్ఠా! వేర్వేరు మంత్రములతో దేవదేవుడగు జనార్ధనుని ఆరాధింపవలయును. "ఓం కూర్మాయ నమః" అని పాదములను మొదట పూజించి "నారాయణాయ నమః" అని హరి నడుమును, "సంకర్షణాయ నమః" అని ఉదరమును, "విశోకాయ" "ఉరోభవాయ నమః" అని కంఠమును పూజింపవలయును. "ఓం నమః సుబాహవే" అని భుజములను, "నమో విశాలాయ" అని శిరస్సును, చక్రమును పూజింపవలయును. తన పేరు పేర్కొనుచు, మంచివాసనగల పూవులతో పెక్కు విధములగు పండ్లతో చక్కగా పూజించి ఆతని ముందు మాలలు కట్టిన మెడగల కలశమును స్థాపించవలయును.

తన శక్తిననుసరించి లోపల రత్నములుగల బంగారు కలశమును ముందువలెనే చేసి మందర పర్వతముతో కూడిన కూర్మరూపుడగు విష్ణువును నేతితో నిండిన రాగిపాత్ర యందుంచి, దానిని కలశముపై ఉంచి మరునాడు బ్రాహ్మణున కొసగవలయును. చక్కని దక్షిణలతో మరునాడు బ్రాహ్మణులకు శక్తినిబట్టి భోజనముపెట్టి కూర్మ రూపముతో దేవదేవుడగు నారాయణుని తృప్తి పరుపవలయును. పిదప తన అనుచరలతో భుజింపవలయును. విప్రా! ఇట్లు చేసినచో అన్ని తాపములును రూపుమాసిపోవును. విచారము చేయవలదు. అట్టి సత్యధర్ముడు సంసార చక్రమును వదలివైచి నిర్మలము, సనాతనము అగు హరి లోకమును పొందును. అక్కడికక్కడ పాపములన్నియు నశించిపోవును. వాడు శ్రీమంతుడగును. భక్తితో ఇట్లు చేసిన నరుని పెక్కు తొలిజన్మముల పాపములు అన్నియు పటాపంచలగును. మున్ను చెప్పిన ఫలము నతడు పొందును. వెనువెంటనే నారాయణుడు తుష్టి పొందును అని చెప్పెను. (40)

41 వ అధ్యాయము - దుర్వాసఃకథిత మాఘ ద్వాదశీవ్రతము

మరియొకమారు దూర్వాసమహాముని సత్యతపునితో ఇట్లు పల్కెను. "ఓ మునీ! పరమ ధార్మికుడా! భూమిని తాల్చిన వరాహదేవుని మొదటి ద్వాదశిని గూర్చి వినుము. అది మాఘ మాసమున శుక్ల పక్షమున వచ్చును. మునుపు చెప్పిన పద్ధతి ప్రకారమే వివేకము కలవాడు ఏకాదశియందు సంకల్పము, స్నానము ఆచరించి దేవుని అర్చింపవలయును. ధూపము, నైవేద్యము, గంధములతో అచ్యుతుని అర్చించి అతని ముందు నీరు నింపిన కుంభమును ఉంచవలయును.

"ఓం వరాహాయనమః" అని పాదములను, "మాధవాయ నమః" అని నడుమును, "క్షేత్రజ్ఞాయ నమః" అని కడుపును, "విశ్వరూపాయ నమః" అని హరి వక్షమును "సర్వజ్ఞాయ నమః" అని కంఠమును, "ప్రజాపతయే నమః" అని శిరస్సును, "ప్రద్యుమ్నాయ నమః" అని భుజములను, "దివ్యాస్త్రాయ నమః" అని సుదర్శనమును, "అమృతోద్భవాయ నమః" అని శంఖమును పూజింపవలయును. ఇది దేవార్చన యందు పద్ధతి. ఇట్లు అర్చించి ఆ కుంభమున తన శక్తి మేరకు బంగారము తోనో, వెండి తోనో రాగితోనో పాత్రమును ఉంచవలయును. ఆ కుంభమును అన్ని విత్తనములతో నిండిన దానినిగా జేసి శక్తి ననుసరించి అందు బంగారు వరాహ ప్రతిమను ఉంచవలయును.

కొండలతో, అడవులతో, చెట్లతో కూడిన భూమినంతటిని కోర చివరతో ఎత్తిన వాడును, మధువను రక్కసుని చంపినవాడును, మాధవుడును, వరాహరూపమును తాల్చినవాడు అగు హరిని బంగారు రూపముతో చేసి ఆ బీజములన్నియు నింపిన పాత్రలపై నిలుపవలయును. తెల్లని వస్త్రముల జంట కప్పిన రాగిపాత్ర యందు నిలిపి గంధములతో, పూవులతో పెక్కు విధములగు నైవేద్యములతో అర్చింపవలయును. పూవుల రంగవల్లిని తీర్చి ఆ రాత్రి అచట జాగరము చేయవలయును. హరి అవతారములను చదివింప వలయును, భావించుచుండవలయును.

ఈ విధముగా నియమమును పూర్తిచేసి తెల్లవారిన పిదప సూర్యుడు ఉదయించు సమయమున స్నానము చేసి శుచియై హరికి మరల పూజచేసి ఆ పాత్రను ఉత్తమ బ్రాహ్మణునకు సమర్పింపవలయును. వేదములను, వేదాంగములను ఎరిగినవాడు, మంచి నడవడికలవాడు, బుద్ధిమంతుడు, విష్ణుభక్తుడుఅగు విప్రర్షికి విశేషముగా అర్పింప వలయును. అందుచేత సర్వశుభములు కలుగును. వరాహ ప్రతిమరూపముననున్న హరిదేవుని కుంభముతో పాటు బ్రాహ్మణునకు దానమిచ్చిన కలుగు ఫలమేమో చెప్పెదను వినుము. ఈ జన్మము నందతనికి సౌభాగ్యము, సంపద, కాంతి, తుష్టి కలుగును. దరిద్రుడుగా ఉన్నవాడు ధనవంతుడగును. కొడుకులు లేనివాడు కుమారుని పొందును. దరిద్ర దేవత వెనువెంటనే నశించును. లక్ష్మి అప్పటికప్పుడు వచ్చి చేరును. ఈ జన్మము నందు పరలోకము నందును కలుగు సౌభాగ్యమును గూర్చి ప్రాతకాలపు కథ యొకటి కలదు. వినుము. ఈ లోకమున పూర్వము వీరధన్వుడను రాజుండెడివాడు. ఆ మహా వీరుడొకనాడు వేటకొరకు అడవికి పోయెను. రాజు ఆ అడవి యందు మృగముల గుంపులను చంపుచు, తెలియక అడవినడుమ తిరుగుచు, మృగరూపమున ఉన్న బ్రాహ్మణులను చంపెను. అట్లు మృగరూపమున ఉన్నవారు సంవర్తుడను వాని పుత్రులు, అన్నదమ్ములు, ఏబది మంది. వేదాధ్యయనము నందు నిష్ఠ కలవారు" అని తెలియజేయగా సత్యతపుడు దూర్వాసుని "మహర్షీ! వారే కారణమున మృగరూపమును ధరించిరి? ఇది వినుటకు వేడుక కలదు. మ్రొక్కెదను. నాకు దానిని వినిపింపుము" అని ప్రార్థించినంతట ఆ మహర్షి "వారొకప్పుడు అడవి కరిగిరి. పుట్టి నంతనే తల్లిని కోల్పోయిన లేడిపిల్లలను చూచి ఒక్కొక్క దానిని గ్రహించిరి. భుజముపై నిలుపుకొనగా అవి చనిపోయెను. అంత అందరు

దుఃఖితులై తండ్రి కడ కరిగి, మృగహింస చేయని వారు కనుక ఇట్లు పలికిరి. 'మహర్షి! అప్పుడే పుట్టిన అయిదు లేడి పిల్లలు మావలన మా నిమిత్తము లేకయే చనిపోయినవి. అందువలన మాకు ప్రాయశ్చితమును విధింపుము.' 'నా తండ్రి హింస చేసినవాడు. నేనంత కంటెను పాపాత్ముడను. కనుక పాపకర్ములైన మీరు నాకు పుత్రకులై పుట్టిరి. ఇప్పుడు మృగ చర్మములు ధరించి నియమ జీవితము గడుపుచు అయిదేండ్లు తిరుగుడు. మీరు శుద్ధులగుదురు' అని తండ్రి యిట్లు పలుకగా ఆ కొడుకులు మృగచర్మము ధరించి ఏకాగ్రచిత్తముతో శాశ్వతమగు బ్రహ్మమును జపించుచు అడవి లోనికి ప్రవేశించిరి. అట్లు ఒక యేడు గడువగా వీరధన్వ మహారాజువారు లేడీ రూపములతో తిరుగు వనమునకు వచ్చెను. ఒక చెట్టు మొదట మృగ చర్మములను ధరించి జపము చేసికొనుచున్న వారిని చూచి ఆతడు మృగములే యనుకొని కొట్టగా, ఆ వేదపారాయణ చేయువారు ఒక్కమారుగా మృతిచెందిరి. మరణించిన చక్కని వ్రతములు బ్రాహ్మణులను – చూచి ఆ రాజు భయముతో వణకి పోవుచు దేవరాతుని ఆశ్రమము కరిగెను. 'ఓ మహామునీ! నాకు బ్రహ్మహత్యా పాతకము కలిగినదని' పలికెను. ఆ వధ వృత్తాంతము మొదటి నుండియు చెప్పి ఆ రాజు పరమశోకము పైకొనగా పెద్ద పెట్టున ఏడ్చెను.

అటు విలపించుచున్న రాజవరుని గాంచి ఆ దేవరాత తమహర్షి "రాజా! భయపడుకుము. నీ పాతకమును నేను తొలగింతును. సుతలమను పాతాళమున భూదేవి మునిగిపోయినపుడు దేవదేవుడగు విష్ణువు వరాహరూపము తాల్చి పైకెత్తినట్లు నిన్ను ఉద్ధరించెదను. బ్రహ్మహత్య పాపము చుట్టుకొన్న నిన్ను ఆ జనార్దన దేవుడే స్వయముగా ఉద్ధరించును" అని ముని యిట్లు పలుకగా ఆరాజు సంతోషించి, 'ఏవిధముగా ఆ దేవుడు నాయెడ ప్రసన్నుడగును? ప్రసన్నుడై నా పాపము నెట్లు రూపుమాపును?' అని అడిగెను. అతడట్లు పలుకగా ఆ దేవరాతుడతనికి ఒక వ్రతమును ఉపదేశించెను. ఆతడును దానిని చక్కగా నొనరించి పుష్కలములైన భోగములననుభవించి అంత్యకాలమున బంగారు విమానముతో ఇంద్రలోకమగు స్వర్గమున కరిగెను. అర్ఘ్యమును గొని దేవరాజు అతని ఎదురుగా వెడలెను. అట్లు వచ్చుచున్న ఇంద్రుని చూచి విష్ణు కింకరులు — దేవరాజు నిన్ను చూడరాదు. నీకంటే అతడు తక్కువ తపస్సు కలవాడు – అనిరి. ఇట్లే లోకపాలురందరు ఆతనికి కెదురుగా అరిగిరి. వారినందరిని విష్ణుకింకరులు మీరందరు హీనకర్ములని అతను

చూచుటకు వీలు కాదనిరి. ఇట్లతడు సత్యలోకము తుది వరకు వెడలెను. మరల మరణము లేనిది, దాహము, ప్రళయము దాపురింపనిది అగు లోకమున ఆ మహారాజు కొనియాడుచుండగా ఈనాటికిని నిలిచియున్నాడు. యజ్ఞపురుషుడు ప్రసన్నుడు కాగా ఆతడు అట్టి స్థితి పొందుటలో వింతయేమి?

విధిని అనుసరించి చేసిన ఒక్కొక్క వ్రతము కూడ ఈ జన్మములు ఆయువు, ఆరోగ్యము, సంపద అనువానిని, పరమున ఉత్తమమగు అమృతస్థితిని ఒసగును. నిండు సంవత్సరము పూర్తియైనచో నాలుగు రూపములు కల నారాయణుడు తన పదము నొసగుటలో సందేహమేమి కలదు? ఆ కేశవుడు పాలసముద్రము చిలుకునపుడు చేప రూపుతాల్చి వేదములను పైకి తెచ్చెను. అట్లే ఈ తాబేటి రూపము రెండవ విష్ణు స్వరూపము. ఆ పురుషోత్తముడు వరాహరూపము తాల్చి భూమిని పైకెత్తెను. అది మూడవ వైష్ణవ రూపము అని వాక్రుచ్చెను. (41)

42 వ అధ్యాయము - దుర్వాసఃకథిత ఫాల్గున ద్వాదశీవ్రతము

అనంతరము దూర్వాసుడు ఇట్లు పల్కెను. అట్లే బుద్ధిమంతుడు ఫాల్గునమాసము శుక్ల పక్షము ద్వాదశినాడు చెప్పిన పద్ధతి ప్రకారము ఉపవాసము ఉండి హరిని ఆరాధింప వలయును. “ఓం నరసింహాయ నమః" అని పాదములను, "గోవిందాయ నమః” అని తొడలను, “విశ్వభుజే నమః” అని నడుమును, “అనిరుద్ధాయ నమః” అని రొమ్మును, “శితికంఠాయ నమః” అని కంఠమును, “పింగకేశాయ నమః” అని శిరస్సును, “అసురధ్వంసనాయ నమః” అని చక్రమును, "తోయాత్మనే నమః” అని శంఖమును పూజించి గంధమును, పుష్పములను, ఫలములను సమర్పింపవలయును. స్వామి ముందు తెల్లని వస్త్రములు రెండు చుట్టిన ఘటము నుంచి, దానిపై రాగి పాత్రలో బంగారు నృసింహ ప్రతిమను శక్తిని బట్టి ఉంచవలయును. లేనిచో కొయ్యబొమ్మనైనను ఉంచవచ్చును. రత్నములు లోపలగల ఘటము నందు స్వామి ప్రతిమ నుంచి చక్కగా పూజింపవలయును. ద్వాదశినాడు వేదపండితుడగు బ్రాహ్మణునకు సమర్పింపవలయును. మునుపు వత్సుడను రాజు ఈ వ్రతము చేసి పొందిన ఫలమును గూర్చి చక్కగా తెలిపెదను.

పూర్వము కింపురుష వర్షమున మిక్కిలి ధార్మికుడగు భారతడును రాజుండెడి వాడు. అతనికి వత్సుడను కుమారుడు కలడు. అతడు యుద్ధమున శత్రువులకు ఓడి

ధనమంతయు కోల్పోయి, పాదచారియై పత్నీ సహితముగా వనమున కరిగెను. ఆ వనమునందలి వసిష్టుని ఆశ్రమమున నివసించెను. కాలము గడచుచుండగా వసిష్ఠమహర్షి– "ఈ మహాశ్రమమున వసించుచున్నావు. పనియేమి?" అని అడిగెను. "పూజ్యుడా! నా కోశము అపహరించబడినది. నా రాజ్యము శత్రువుల పాలైనది. పగవారు నా సంకల్పమును దెబ్బ కొట్టిరి. నిన్ను శరణుజొచ్చితిని. నాకు ఉపదేశమును అనుగ్రహింపుము" అని వత్సుడు తన స్థితిని తెలిపెను. అతడిట్లు పలుకగా వసిష్ఠుడతనికి ఈ ద్వాదశీ వ్రతమును ఉపదేశించెను. అతడును దానిని సర్వమును విధిపూర్వకముగా ఆచరించెను. ఆవ్రతము ముగిసిన విదప నరసింహభగవానుడు సంతోషపడెను. శత్రువులను రూపుమాపెడి చక్రమును ఆతని కొసగెను. ఆ రాజవరుడు ఆఅస్త్రముతో తన రాజ్యమును గెలుచుకొనెను. రాజ్యమున నిలువదొక్కుకొని వేయిఅశ్వమేధ యాగములను గావించెను. తుదకు ఆ శ్రేష్ఠుడు విష్ణు లోకమను ఉత్తమ పదము గాంచెను. మునీ! ఇది చాలా ధన్య వ్రతము, పాపములను హరించునది. ఇట్టి ద్వాదశిని గురించి మీకు ప్రయత్నపడి చెప్పితిని. నీకోరికను బట్టి ఆచరింపుము అని చెప్పెను. (42)

43 వ అధ్యాయము - దుర్వాసఃకథిత చైత్ర ద్వాదశీవ్రతము

మరల దూర్వాసుడు సత్యతపునితో "మునీ! ఇట్లే చైత్ర మాసమునను సంకలనం చేసికొని దేవదేవుడగు జనార్ధనుని ఆరాధింప వలయును. ఓం నమోవామనాయ, అని పాదములను, విష్ణవేనమః అని నడుమును, వాసుదేవాయనమః అని గర్భమును సంకర్షణాయ నమః అని రొమ్మును, విశ్వభ్రుతే నమః అని కంఠమును, వ్యోమరూపిణే నమః అని శిరస్సును, విశ్వజితే నమః అని బాహువులను, విష్ణువు యొక్క ఆయుధాలను వాని పేరులతో అనగా పాంచజన్యాయ నమః అని శంఖమును, సుదర్శనాయ నమః అని చక్రమును పూజింపవలయును. ఈ పద్ధతితోడనే సనాతనుడగు దేవదేవుని అర్చించి, మునుపటి వలెనే ఉత్తర దిక్కున రెండు వస్త్రములతో కుంభమును దేవుని ముందు ఉంచవలయును. మునుపు చెప్పిన రాగిపాత్ర యందు బంగారముతో వామనుని ప్రతిమను శక్తి మేరకు చేయించి, తెల్లని జన్నిదము కల ఆ పొట్టి రూపును నిలుపవలయును. ప్రక్కభాగమున కమండలమును, గొడుగును, పాదుకలను, జపమాలను, దర్భాసనమును ఉంచవలయును. ఈ పరికరములతో కూడిన వామనమూర్తిని తెల్లవారిన పిదప

బ్రాహ్మణునకు 'వామనరూపుడైన విష్ణువు ప్రీతినందుగాక' అని పలుకుచు దానమీయవలయును. నెలపేరు కలియునట్లుగా వామనుని అవతారమును భావించుచు ప్రీతినొందుగాక అని చెప్పు చుండవలయును. అన్నింటా ఇదే విధానము చెప్పబడింది.

పూర్వము హర్యశ్వుడను రాజు పేరు వినవచ్చుచుండెను. అతడు సంతానము లేనివాడు. గొప్ప తపస్సంపద గల కుమారుని కోరుచు తపస్సు చేసెను. ఇట్లు పుత్రుని కొరకు తపస్సు చేయుచుండగా విష్ణువు బ్రాహ్మణ రూపమును దాల్చి, ఆతని కడకు వచ్చెను. "రాజా! తపస్సుచేత నీవు కోరునదేమి?" అని అడిగెను. "పుత్రుల కొరకు తపస్సు" అని అతడు బదులు చెప్పెను. అంత ఆ రాజుతో ఆ బ్రాహ్మణుడు ఇట్లు – పలికెను. "రాజా! ఈ ద్వాదశీవ్రత విధానమునే ఆచరింపుము" అని ఆ ప్రభువు అదృశ్యుడాయెను. రాజును ఆ వ్రతమును మంత్ర సహితముగా వెంటనే ఆచరించెను. దరిద్రుడు, బుద్ధిమంతుడు అగు జ్యోతిర్గార్గుడను బ్రాహ్మణునకు ఆ వామనమూర్తిని దాన మొసగెను. "సంతానము లేని అదితికి స్వయముగా కొడుకై జన్మించితివి. అట్లే నాకును ఆ సత్యము తోడనే శ్రేష్ఠుడగు పుత్రుడు కలుగుగాక!" అని మంత్ర పూర్వకముగా ప్రార్థించుచు ఈ విధితో ఆతడు దానమొసగెను. ఓ మునీ, ఆతనికి కువలాశ్వుడని పేరొందిన పుత్రుడు కలిగెను. అతడు ఎదిగి చక్రవర్తి, మహాబలుడు అయ్యాడు. దీనివలన సంతానము లేనివాడు పుత్రులను, ధనము లేనివాడు ధనమును, రాజ్యము కోల్పోయినవాడు రాజ్యమును, మరణించినవాడు విష్ణు పురమును పొందును. అచట బహుకాలము కీర్తినొంది మరల మానవ లోకమునకు వచ్చిన ఆ ధీశాలి నహుషుని కుమారుడు యయాతి వలె చక్రవర్తి యగును. (43)

44 వ అధ్యాయము - దుర్వాసఃకథిత వైశాఖ ద్వాదశీవ్రతము

ఇంకను దూర్వాసుడు ఇట్లు తెల్పెను. "వైశాఖమాసమున కూడ జనుడిట్లే సంకల్పించి, మునుపు చెప్పినట్లు స్నానము మొదలగునవి ఆచరించి దేవాలయమున కరుగవలయును. అచట భక్తితో హరిని 'ఓం నమో జామదగ్న్యాయ' అని పాదములను, 'సర్వధారిణే' అని ఉదరమును, 'మధుసూదనాయ' అని నడుమును, 'శ్రీవత్సధారిణే' అని రొమ్మును, 'క్షత్రాంతకాయ' అని భుజములను, 'శితికంఠాయ' అని కంఠమును, స్వనామంతో శంఖచక్రాలను – అనగా 'పాంచజన్యాయ' అని శంఖమును, 'సుదర్శనాయ' అని చక్రమును, 'బ్రహ్మాండ ధారిణే' అని శిరస్సును, పూజించి నమస్కరించి ఎదుట ఒక ఘటం

ఉంచి అర్చింపవలయును. ఇట్లు కొలిచి బుద్ధిశాలి మునుపటి వలెనే రెండు బట్టలు చుట్టినదియు, మూసినదియునగు ఘటమును ఆ దేవుని ముందు నిలుపవలయును. జమదగ్ని తనయుడని పేరొందిన పరశురాముని, కష్టములు పోకార్చువానిని, వెదురు పాత్రతో నిర్మించి అందు ఉంచవలయును. అతని కుడిచేతి యందు గొడ్డలిని ఏర్పరుప వలయును. సుగంధములు గల పెక్కు విధములగు పూవులతో పూజింప వలయును. పిదప దేవుని ముందు భక్తితో జాగరము చేయవలయును. తెల్లవారిన పిదప (సూర్యోదయమైన తరువాత) ఆ కుంభమును బ్రాహ్మణునకు సమర్పింపవలయును. ఇట్లు నియమముతో కూడి వ్రతము చేయువాడు పొందు ఫలము చెప్పెదను. వినుము.

పూర్వము వీరసేనుడను మహాబలము గల రాజుండెడివాడు. అతడు పుత్రులు లేనివాడు. గొప్ప శక్తితో తీవ్రమగు తపస్సు చేసెను. అట్లు ఘోరమైన తపస్సు చేయుచున్న అతనిని అల్లంత దూరము నుండి చూచి యాజ్ఞవల్క్య మహాముని ఆతని కడకు వచ్చెను. గొప్ప ముఖవర్చస్సుగల ఆ ఋషి వచ్చుచుండగా చూచి రాజు దోయిలొగ్గి ఆతని కెదురేగెను. ఆతని పూజలంది ముని "రాజా! ధర్మజా! దేనికొరకు తపస్సు చేయుచున్నావు? నీవు సంకల్పించిన ఫలమేమి?" అని అడిగెను. "పుణ్యాత్ముడా! నేను అపుత్రుడను. నాకు పుత్ర సంతానము లేదు. కావున తపస్సు చేత నా దేహమును కష్టపెట్టుచున్నాను" అని విన్నవించగా "రాజా! చాలా కష్టమైన ఈ తపస్సు వలదు. నీకు కొంచెము పాటి క్లేశముతో పుత్రుడు లభించును. సంశయింపకుము అని యజ్ఞవల్క్య మహాముని తెలుపగా ఆ రాజు "బ్రాహ్మణోత్తమా! తేలిక శ్రమతో నాకు పుత్రుడెట్లు కలుగును. నీకు మ్రొక్కెదను. నాయందు ప్రీతి కలవాడవై నాకు దానిని బోధింపుము" అని ఆ రాజట్లు పలుకగా ఆ ముని అతనికి వైశాఖమాసమున శుక్లపక్షమున ద్వాదశి నాడు చేయవలసిన ఆ పూజను గూర్చి వివరించెను. పుత్రులను కోరిన ఆ రాజు, విధానము ననుసరించి, ఉపవాసము ఉండి ఆ వ్రతమాచరించి పరమధార్మికుడగు నలమహారాజును పుత్రునిగా పడసెను. ఈనాటికిని ఆ నలుని పుణ్యశ్లోకుడని కీర్తించుచున్నారు. "ఓ మహామునీ! ఈ వ్రతమును ఆచరించువానికి ధనము, విద్య, చక్కని ముఖకాంతిగల మంచి కుమారుడు కలుగును. ఇది ఒక అప్రధానమగు ఫలము. ఈ లోకమున ఇట్టి ఫలమందుట ఏమి చిత్రము. పరలోకము మాట వినుము. ఒక కల్పకాలము బ్రహ్మలోకమున అప్సరసల గణములతో విలాసముగా

గడిపి మరుసృష్టియందు చక్రవర్తియై జనించును. ముప్పదివేల సంవత్సరములు జీవించును. సంశయమిందు లేదు అని చెప్పెను. (44)

45 వ అధ్యాయము - దుర్వాసఃకథిత జ్యేష్ఠ ద్వాదశీవ్రతము

దూర్వాసుడు ఇట్లు పలికెను. మానవుడు జ్యేష్ఠ మాసమునందును ఇట్లే సంకల్పించి పరమదేవుని పెక్కు తీరులగు పూవులతో అర్చింపవలయును. 'ఓం నమో రామాభిరామాయ' అని పాదములను ముందుగా పూజింపవలయును. 'త్రివిక్రమాయ నమః' అని కటిని, 'ధృతవిశ్వాయ నమః' అని ఉదరమును, 'సంవత్సరాయ నమః' అని రొమ్మును, 'సంవర్తకాయ నమః' అని కంఠమును, 'సర్వాస్త్రధారిణే నమః' అని బాహువులను, స్వనామాలతో శంఖచక్రాలను, 'సహస్రశిరసే నమః' అని ఆ మహాత్ముని శిరస్సును పూజింపవలయును. పిదప మునుపటి వలెనే కుంభమును నిలుపవలయును. ఏదేని కోరికగల పురుషులు జమిలి వస్త్రముతో చుట్టిన బంగారపు రామలక్ష్మణుల ప్రతిమలను విధానము ప్రకారము అర్చించి, మరునాటి ప్రభాతమున బ్రాహ్మణునకు మనఃపూర్వకముగా దాన మీయవలెను. మునుపు పుత్రులు లేని దశరథ మహారాజు వసిష్ఠ మహర్షిని చక్కగా పూజించి, సంతానము గూర్చి అడిగెను.

ఆ బ్రాహ్మణుడు పూర్వకాలపు రహస్యము నెరిగి, ఆ దశరథున కిదియే విధానమును ఉపదేశించెను. ఆతనికి ఆ విష్ణువు స్వయముగా రాముడను పేరుతో, మహాబలము గల పుత్రుడై జన్మించెను. అవ్యయుడగు విష్ణువు మిక్కిలి సంతోషము చెంది ఆ మహారాజునకు నాలుగు రూపములతో పుట్టెను. ఇది ఇహలోక విషయము నీకు చెప్పితిని. పరలోక విషయమును ఇటుపై చెప్పెదను వినుము. పదునలుగురు ఇంద్రుల జీవిత కాలము స్వర్గమున ఉండి భోగములను అనుభవించును. ముగిసిన తరువాత మరల మనుజుడై నూరు యజ్ఞములు చేయు మహారాజు అగును. అట్టి పురుషునికి సర్వపాపములు నశించును. సంపూర్ణము, శాశ్వతముఅగు నిర్వాణమును పొందును. (45)

46 వ అధ్యాయము - దుర్వాసఃకథిత ఆషాఢ ద్వాదశీవ్రతము

అనంతరము దూర్వాసుడు ఇట్లు పల్కెను. మనుజుడు ఆషాఢమాసమునందును ఇట్లే సంకల్పించి విధి పూర్వకముగా ఆ పరమ దైవమును గంధ పుష్పములతో పెక్కు విధములుగా పూజింపవలయును. 'ఓం నమో వాసుదేవాయ' అని పాదములను,

'సంకర్షణాయ నమః' అని నడుమును, 'ప్రద్యుమ్నాయ నమః' అని కడుపును, 'అనిరుద్ధాయ నమః' అని రొమ్మును, 'చక్రపాణయే నమః' అని భుజములను, 'భూపతయే నమః' అని కంఠమును, వాని పేరులతో శంఖ చక్రములను (నమః పాంచజన్యాయ, నమః సుదర్శనాయ అని) 'నమః పురుషాయ' అని శిరస్సును పూజింపవలయును. బుద్ధిశాలి యగు నరుడు ఇట్లు అర్చించి మునుపటి వలెనే వస్త్రములు చుట్టిన ఘటమును నిలుప వలయును. దానిపై నాలుగు వ్యూహములుగల సనాతనుడగు వాసుదేవుని బంగారు ప్రతిమను నిలుపవలయును. విధి ననుసరించి గంధ పుష్పాదులతో క్రమముగా దేవుని అర్చించి, వేదమును అధ్యయనము చేయువాడు, చక్కని నియమములు గలవాడును అగు బ్రాహ్మణునకు దానిని దానమీవలెను. ఇట్లు నియమములతో కూడినవాడు పొందు పుణ్య మెట్టిదో తెలిపెదను వినుము.

యదువంశమును పెంపొందించెడు వసుదేవుడను రాజుండెడివాడు. అతని భార్య దేవకి, ఆమెయు అతనితో సమానముగ వ్రతముల నాచరించునట్టిది. పతి ధర్మమున శ్రద్ధ కలదియు, పతివ్రతయుఅగు ఆ దేవకి సంతానము లేనిదాయెను. పెద్ద కాలము గడచిన గడచిన పిదప ఆ వసుదేవుని ఇంటికి నారదుడు వచ్చెను. వసుదేవుడు అతనిని భక్తితో పూజింపగా నారదుడు ఇట్లనెను. "వసుదేవా! నాకొక దేవ కార్యము కలదు. వినుము, ఈ కథను విని నేను త్వరగా నీ కడకు వచ్చితిని. యదువరా! దేవతల సభలో నేను భూదేవిని చూచితిని. దేవతలారా! నేనీ భారమును మోయజాలకున్నాను అని పల్కుచున్నది. దేవతోత్తములారా! సౌభుడు, కంసుడు, జరాసంధుడు, ఇంకను నరకుడు పాంచాలురు, భోజులు, ఇంకను బలవంతులయిన దానవులు అందరు కూడి నన్ను పీడించుచున్నారు, వారిని చంపుడు" అని పృథివి యిట్లు పలుకగా ఆ దేవతలు, మనసులో నారాయణుని భావించిరి. ఆ దేవదేవుడు తత్ క్షణమున అచట ప్రత్యక్షమై, దేవతల పెద్ద ఆ విష్ణువు ఇట్లు పలికెను : దేవతలారా! ఈ పనిని నేను మనుష్యుని వలె మర్త్య లోకమున కరిగి స్వయముగా సాధింతును. మరియు, ఆషాఢమాసమున శుక్లపక్షము నాడు భర్తతోపాటు ఉపవాసమున్న మానవ స్త్రీ కడుపున నేను జన్మింతును" ఇట్లని దేవుడు వెడలిపోయెను. నేను స్వయముగా ఇటు వచ్చితిని. పుత్రులు లేని నీకిది తెలియజెప్తిని. నీవు భార్యతో పాటు ఉపవాసముండి పుత్రుని పొందెదవు. సంశయము లేదు" అని చెప్పగా వసుదేవుడు ఇట్లు ఈ ద్వాదశీ

వ్రతమును చేసి కుమారుని, గొప్ప సంపదను. పుత్రులతో, పౌత్రులతో కూడినవాడై, పొందెను. రాజ్య సంపదను అనుభవించి, తుదకు అతడు పరమగతి నందెను. మునీ! ఆషాఢమాసము నందలి విధిని నీకు తెలిపితిని. (46)

47 వ అధ్యాయము - దుర్వాసఃకథిత శ్రావణ ద్వాదశీవ్రతము

మునివర్యా సత్యతపా! శ్రావణ శుద్ధ ద్వాదశినాడు జనార్దనుడను పరమ దైవమును కొలువవలయును. "ఓం నమోదామోదరాయ' అని పాదములను, 'నమో హృషీకేశాయ' అని నడుమును, 'నమస్సనాతనాయ' అని కడుపును, 'నమః శ్రీవత్సధారిణే' అని వక్షమును 'నమశ్చక్రపాణయే' అని భుజములను, 'నమోహరయే' అని కంఠమును, 'నమః ముంజకేశాయ' అని శిరస్సును, 'నమో భద్రాయ' అని శిఖనూ పూజింపవలయును. ఇట్లు బాగుగా అర్చించి మునుపటి వలెనే కుంభమును పెట్టవలయును. వస్త్రములు ఉంచి దానిపై దామోదర నామము గల దేవదేవుని బంగారు ప్రతిమను నిలుపవలయును. ఆ దేవుని చక్కగా గంధపుష్పాదులతో విధి ననుసరించి క్రమముగా పూజించి వెనుకటివలెనే, ఆ ప్రతిమను వేదవేదాంగములను తుదముట్ట అధ్యయనం చేసిన బ్రాహ్మణున కొసగవలయును. ఇట్లు నియమము పాటించినవాడు పొందు ప్రభావమును నా వలన వినుము. శ్రావణమాసము నందు చేయవలసిన విధానమును చెప్పితిని. ఆ ద్వాదశీ వ్రత ప్రభావమును, పాపమును రూపుమాపు దానిని తెలిపెదను వినుము.

పూర్వము కృతయుగమున నృగుడను మహాబలము గల రాజుండెను. ఆతడు ఒకప్పుడు వేటయందు తగుల్కొన్న మనసుతో ఘోరమగు అడవిలో తిరుగాడుచు ఒక సమయమున గుఱ్ఱము గుంజుకొని పోవగా పెద్ద పులులు, సింహములు, ఏనుగులు మొదలగు వానితో నిండిన ఘోరమగు అడవి మధ్యములోనికి పోయెను. ఒంటరియగు ఆ రాజు అచట గుఱ్ఱమును వదలి ఒక చెట్టు నీడను దర్భలు పరచుకొని దుఃఖముతో నిద్రించెను. ఆ రాత్రి పదునాలుగు వేలమంది బోయవాండ్రు మృగములను చంపుటకై అచటికి వచ్చి, రాజు చుట్టును చేరిరి. అచట వారు బంగారు నగల అలంకారములు గలవాడును, మిక్కిలి తీవ్రముగా ఉన్నవాడును, గొప్ప తేజస్సుతో వెలిగిపోవుచున్నవాడును, నిద్రించుచున్నవాడును అగు ఆ నృగమహారాజును గాంచిరి. వారును త్వరత్వరగా పోయి తమ ప్రభువునకు నివేదించిరి. వెనువెంటనే అచ్చటకు వచ్చి అతడును రత్నములు,

బంగారము కొల్లగొట్టుటకై ఆతనిని చంపబోయెను. గుఱ్ఱమును కూడ వశపరుచుకొనుటకై ఆ ఆటవికులు నిద్రించుచున్న రాజును చేరుకొని పట్టుకొనుటకు ప్రయత్నించిరి. ఇంతలో ఆ రాజు శరీరము నుండి తెల్లని ఆభరణములు, మాలలు, చందనములు తాల్చిన ఒక స్త్రీ వెలువడెను. ఆమె లేచి చక్రమును గొని ఆ మ్లేచ్ఛులనందరిని కూలవైచెను. ఆ దేవి ఆ దొంగలమూకలను చంపి మరల ఆ రాజు దేహములోనికి ప్రవేశించెను. రాజంత మేల్కొని చచ్చిపడిన మ్లేచ్ఛులను, తన దేహములో కలసిపోయిన ఆ నారిని కాంచెను. గుఱ్ఱమెక్కి ఆ రాజు వామదేవుని ఆశ్రమమున కరిగెను. అచట భక్తితో ఆ మహర్షిని "స్వామీ! ఆమె ఎవరు? ఆ చచ్చిన వారెవరు? దీనిని నాకు తెలుపుము. ప్రసన్నుడవగుము" అని అడిగెను. రాజా! నీవు పూర్వజన్మమున శూద్రజాతివాడవు. ఒక బ్రాహ్మణుడు శ్రావణమాస శుక్లపక్ష ద్వాదశి నాటి వ్రతమును ఉపదేశించుచుండగా వింటివి. విధిపూర్వకముగా నీవు భక్తితో ఆ తిథినాడు ఉపవాస ముంటివి. దాని వలన నీకు రాజ్యము లభించినది. ఆ దేవి అన్ని ఆపదల యందును నిన్ను రక్షించుచున్నది. ఆ పాపాత్ములు, క్రూరులు అగు మ్లేచ్ఛులను సంహరించినది ఆమెయే. నిన్ను రక్షించిన ఆమె శ్రావణ శుద్ధ ద్వాదశి. ఆమె ఒక్కతెయే ఆపదలయందు రక్షించును. ఒక్కతెయే సామ్రాజ్యము నిచ్చును. ఇంక ఈ పండ్రెండు ద్వాదశుల సంగతి చెప్పనేల? వారు ఇంద్ర పదవి కూడ తప్పక లభిస్తుంది" అని వామనుడు రాజుకు తెలిపెను. (47)

48 వ అధ్యాయము - దుర్వాసఃకథిత భాద్రపద ద్వాదశీవ్రతము

మహాతపునితో తన ప్రసంగమును కొనసాగించుచు ఇంకను దూర్వాసుడు ఇలా చెప్పెను. అదేవిధముగా భాద్రపదమాసము శుక్లపక్షమున ద్వాదశినాడును సంకల్పము చేసికొని విధి పూర్వముగా పరమేశ్వరుని అర్చింపవలయును. "ఓం నమః కల్కినే" అని పాదములను, 'నమో హృషీకేశాయ' అని నడుమును, 'నమో మ్లేచ్ఛ విధ్వంసనాయ', 'జగన్మూర్తయే' అని ఉదరమును, 'నమః శితికంఠాయ' అని కంఠమును, 'నమః ఖడపాణయే' అని భుజములను, 'నమశ్చతుర్భుజాయ' అని హస్తములను, 'నమో విశ్వమూర్తయే' అని శిరస్సును పూజింపవలయును. మేధావియగు నరుడు ఇట్లు కొలిచి మునుపటివలెనే ఆ దేవుని ముందు ఘటమును నిలుపవలయును. అందు బంగారు కల్కి ప్రతిమను ఉంచవలయును. తెల్లని రెండు వస్త్రములతో దానిని కప్పి గంధములతో,

పూవులతో అలంకారము చేయవలయును. మరుసటి దినము సూర్యోదయ కాలమున చక్కగా శాస్త్రములు అధ్యయనము చేసిన విప్రునకు దానమీయ వలయును. ఇట్లు చేసినచో నేమగునో చెప్పెదను వినుము.

పూర్వము కాశీ పురమున విశాలుడను రాజుండెను. జ్ఞాతులు అతని రాజ్యమును అపహరింపగా అతడు గంధమాదన పర్వతమును ప్రవేశించెను. ఆ పర్వతము లోయలో బదరి అను అందమైన ప్రదేశమున రాజ్యము, సంపద కోల్పోయిన ఆ రాజు నివసించెను. పురాణులు, సర్వదేవతల మ్రొక్కులు కొనువారు, ఋషి శ్రేష్ఠులు నగు నరనారాయణులు ఒకనాడు అక్కడకు విచ్చేసిరి. అంతకుముందే అచటకు వచ్చి, పరబ్రహ్మ స్వరూపము, పరంధామము అగు విష్ణునామక తత్త్వమును ధ్యానించుచున్న రాజును వారు చూచిరి. నశించిన పాపములు గల ఆ రాజును చూచి వారు ప్రీతులై "రాజేంద్రా! మేము వరముల నిచ్చుటకై వచ్చితిమి. వరము కోరుకొనుమని" పలికిరి. "మీరెవరో నేనెఱుగను. ఎవరి వరమును గ్రహింతును? నేను దేనిని ఆరాధించుచున్నానో దాని నుండి మంచి వరము కోరుదును" అని అతడట్లు పలుకగా వారు "రాజా! నీవెవనిని ఆరాధించుచున్నావు. ఎవనిని వరము వేడుచున్నావు? తెలియ వేడుకయైనది. చెప్పుము" అనిరి. వారట్లనగా రాజు 'నేను విష్ణువును ఆరాధించుచున్నాను' అని పలికి ఊరకుండెను. వారు మరల ఇట్లనిరి. "రాజా! మేమాదేవుని ప్రసాదమువలననే వరమును ఇచ్చుచున్నాము. నీ వరమును గూర్చి చెప్పుము. నీ మనసున నేమి కలదు?" అని పలుకగా "నాకు యజ్ఞేశ్వరుడగు దేవుని పెక్కు విధములగు దక్షిణలు గల యజ్ఞములతో పూజించు సమర్థత కలుగునట్లుగా వరము నొసగుడు" అని అడిగాడు. అప్పుడు నరుడు "లోకులకు దారి చూపు దేవుడు నారాయణుడు స్వయముగా నాతో పాటు లోకముల మేలును కాంక్షించి బదరీవనమునందు తపస్సు చేయుచుండును. తరువాత ఇతడు మొదట మత్స్యమాయెను. తరువాత తాబేటి రూపుతాల్చెను. పిదప వరాహమాయెను. అటుపై నరసింహుడాయెను. వామనుడు, పరశురాముడు, రాముడు, కృష్ణుడు అను అవతారముల నెత్తెను. ఈతడు బుద్ధుడై జనులను మోహ పెట్టెను. పగవారగు మ్లేచ్ఛులను, దొంగలను మరల రూపుమాపి ఈ భూమిని స్వస్థురాలిని గావించెను. ఆ భగవానుడితడే హరి. సమస్త జ్ఞానమును పొందగోరువారు మత్స్య రూపుడగు హరిని పూజింపవలయును. తన వంశమును ఉద్ధరించు కొనుటకు

కూర్మరూపుడగు దేవునర్చింపవలయును. సంసార సముద్రమున మునిగినవాడు వరాహరూపుడగు హరినర్చింపవలయును. పాపభయము కల నరులు నరసింహ రూపమును పూజింపవలయును. మోహము నశించుటకు వామనుని, ధనము కొరకు పరశురాముని, క్రూరులగు శత్రువుల వినాశనము కొరకు దశరథరాముని కొలువ వలయును." ఇట్లు పలికి ఆ నరమహర్షి ఆతనికి ఈ ద్వాదశీ వ్రతమున గూర్చియే తెలియజేసెను. ఆతడును ఆ వ్రతము కావించి చక్రవర్తి ఆయెను. ఆతని పేరు మీదుగనే బదరి 'విశాల' అను పేరు పొందెను. ఆతడు ఇహజన్మమున రాజై, తుదికి అడవి కేగెను. అచట పెక్కు విధములగు యజ్ఞములు ఆచరించి తుదికి నిర్వాణమును పొందెను. (48)

49 వ అధ్యాయము - దుర్వాసఃకథిత ఆశ్వయుజద్వాదశీవ్రతము

దూర్వాసుడు ఇట్లు పలికెను. ఈ విధముగనే ఆశ్వయుజ మాసమున శుక్లపక్ష ద్వాదశినాడు సంకల్పించి సనాతనుడగు పద్మనాభ దేవుని అభ్యర్చింపవలయును. 'ఓం నమః పద్మనాభాయ' అని పాదములను, 'నమః పద్మయోనయే' అని నడుమును, 'నమః సర్వదేవాయ' అని ఉదరమును, 'నమః పుష్కరాక్షాయ' అని రొమ్మును, 'అవ్యయాయ నమః' అని చేతులను, అట్లే మునుపటివలె అస్త్రములను పూజింపవలయును. 'నమః ప్రభవాయ' అని శిరస్సును పూజించి మునుపటి వలెనే కుంభమును నిలుపవలయును. దానియందు బంగారముతో చేసిన పద్మనాభదేవుని ప్రతిమను నిలుపవలయును. గంధ పుష్పాదులతో క్రమముగా ఆ దేవుని పూజించి మరునాడు ఉదయమున బ్రాహ్మణునకు నివేదింపవలయును. ఇట్లు చేయగా కలుగు పుణ్య మెట్టిదియో చెప్పెదను వినుము. కృతయుగమున భద్రాశ్వుడను గొప్ప శక్తి సంపద గల రాజుండెడివాడు. అతని పేరుతో భద్రాశ్వమను దేశము ఏర్పడెను. ఒకప్పుడతని యింటికి అగస్త్యుడు వచ్చి, 'నీ యింట ఏడు రాత్రులు ఉందును' అని పలికెను. ఆ రాజు తలవంచి అట్లే "ఉండుడు" అని పలికెను. అతనికి మిక్కిలి సౌందర్యవతియగు కాంతిమతి అను భార్య *కలదు.* ఆమె ముఖకాంతి పంద్రెండుగురు సూర్యులకు సమానమై యొప్పెడిది మరియు ఆమెకు అయిదు వందల మంది సవతులును కలరు. వారందరు కాంతిమతి భయము చేత మనసు మనసులో లేనివారై బానిసలవలె ప్రతిదినము ఆమెకు సేవలు చేయచుండిరి.

రూపము, తేజస్సుగల ఆ సుందరిని, భయముతో ఆమెకు సేవలు చేయుచున్న సవతులను అగస్త్యుడు చూచెను. రాజు మాత్రము ఆమె ముద్దుమొగమునే చూచుచుండెడివాడు. ఇట్టి మహాసుందరి యగు రాణిని చూచి,' రాజా! మేలుమేలని' అగస్త్యుడు ఆనందముతో పలికెను. అగస్త్యుడు గొప్ప ప్రభగల ఆ రాణిని చూచి రెండవ దినమునందును 'అహో చరాచర జగమంతయు కొల్లగొట్ట బడినది, కొల్లగొట్టబడినది' అని పలికెను. మూడవనాడు ఆతడు ఆమెను చూచి ఇట్లనెను. 'పరమేశ్వరుడగు గోవిందుని అయ్యో! ఈ మూఢులు తెలియకున్నారు. ఆ స్వామి ఒక్క దినమున ఈ రాజునెడ తుష్టినంది ఫలమునంతటిని ఒసగియున్నాడు.' నాల్గవ దినమున ఆ మహర్షి రెండు చేతులు పైకెత్తి యిట్లు పలికెను : "జగన్నాథ! మేలుమేలు, స్త్రీలు మేలు, శూద్రులు మేలు, బ్రాహ్మణులు, వైశ్యులు మేలు మేలు– భద్రాశ్వా! నీవు గొప్ప వాడవు. అగస్త్య! నీకు మేలు మేలు. ప్రహ్లాదా! నీకు శుభము శుభము. ధ్రువా! మహావ్రతా! మేలు" అని ఇట్లు పలుకుచు రాజుకడ అగస్త్యుడు పెద్దగా నర్తించెను. పత్నీసహితుడైన ఆ రాజు ఇట్లున్న ఆ అగస్త్యుని గాంచి, "బ్రాహ్మణోత్తమా! నీ ప్రమోదమునకు కారణమేమి? ఏల ఇట్లు నృత్యము చేయుచున్నావు?" అని అడిగెను. "అయ్యో! రాజా! నీవు పాడురాజవు. మూర్ఖుడవు. ఈ నీ సేవకులందరు మూర్ఖులు. నీ పురోహితులు, అయ్యో! ఎంత మూర్ఖులు! నా అభిప్రాయమును ఎరుగకున్నారు". ఇట్లు పలుకగా రాజు చేతులు జోడించి, "మహర్షి! నీవు పలికినది మేమెరుగకున్నాము. మాయందు అనుగ్రహము కలవాడవై తెలుపుము", అని పలికెను అందులకు అగస్తుడు "ఈ నీరాణి పూర్వము విదిశాదేశ నగరపు వైశ్యుడు హరిదత్తుని దాసి, అప్పుడు కూడా ఈమె నీ భార్యయే. నీవు ఆ హరిదత్తుని సేవకుడవగు శూద్రుడవు. ఓమహామతీ!ఆ కోమటి ఆశ్వయుజమాస ద్వాదశినాడు నియమము నందుండి స్వయముగా విష్ణుని ఆలయమున కరిగి పుష్పములతో, ధూపాదులతో హరిని అభ్యర్చించి రక్షపాలకులగు మీయిరువురను దీపములు ఆరకుండా చూచుటకై నియోగించి, తన యింటి కరిగెను. వైశ్యుడట్లరుగగా మీరిరువురు దీపములను ఎగదోస్తూ, తెల్లవారు వరకు మేల్కొని యట్లే ఉండిపోతిరి. తరువాత కాలము గడువగా దంపతులు మీరిరువురు మరణించితిరి. ఆ పుణ్యము చేత నీకు ప్రియవ్రతుని గృహమున పుట్టుక కలిగినది.

తనది కాకపోయినను హరి ఆలయమున దీపపు వత్తిని ఎగదోసిన పుణ్యము చేత ఆ వైశ్యుని దాసియగు ఈమె నీకు పత్ని అయినది. ఇక తన సొమ్ముతో విష్ణుని ముందు దీపము వెలిగించిన వాని పుణ్యమెట్టిదో లెక్కించుట సాధ్యము కాదు. అందుచేత హరీ సాధు సాధు అని నేనంటిని."

"వివేకవంతుడు కృతయుగమున ఒక్క ఏడును, త్రేతాయుగమున ఆరు మాసములును హరికి భక్తి చేయుటతో ఇది సమానము, సంశయము లేదు. మూడు నెలలు ద్వాపరమున భక్తితో పూజించిన ఫలము, కలియందు "నమో నారాయణాయ" అనుటతో లభించును. అందుచేత విష్ణుని యందలి భక్తి లేని జగత్తు సర్వమూ కోల్పోయినదని నేను పలికితిని. దేవుని ముందు ఇతరుల దీపపు వత్తిని ఎగదోయుట వలన, రాజా! ఇట్టి ఫలమును నీవు పొందితివి. కనుక హరికి దీపము పెట్టు ఫలమును మూర్ఖులెరుగకున్నారని నేనంటిని. ఈ విధముగా ఏ బ్రాహ్మణులు, రాజులు భక్తితో వివిధములగు యజ్ఞములచేత కొలుతురో వారిని సాధువులుగా లోకము సంభావించును. నేను ఆ హరిని విడచి ఇతరుని ఈ భూమండలమున చూడను. అందుచేత 'అగస్త్యా ధన్యుడవు' అని నన్ను నేను గొప్ప ఆనందపు పొంగుతో ఎగిరి గంతులు వైచుచు కొనియాడు కొంటిని. ఆ యింతి ధన్యురాలు. ఆ శూద్రుడు ఇంకను ధన్యుడు. ఏలయన ప్రభువు సేవ చేయుచు ఆతని పరోక్షమున హరి పూజ కావించెను.

ఆ స్త్రీ ధన్య. అట్లే ఆ శూద్రుడును, ద్విజుల సేవ యందు మిక్కిలి ప్రీతి కలవాడు కనుక, మరింత ధన్యుడు. వారి అనుమతితో హరియెడల భక్తిని చేసిరి. కావున ఆ స్త్రీని ఆ శూద్రుని గురించి మేలు మేలంటిని. రాక్షస భావమును పొందియు ప్రహ్లాదుడు పురుషోత్తముని కాక ఇతరుని ఎరుగకుండెను. అందుకై 'ప్రహ్లాదుడెంత సాధువు' అంటిని. ధ్రువుడు ప్రజాపతి కులమున పుట్టి పిన్నవయసునందే అడవి కరిగెను. విష్ణువు నారాధించి పరమ శోభమైన పదమును అందెను. అందువలన ఆ ధ్రువుని మహిమను నేను కొనియాడితిని. ఇట్లు మహాత్ముడగు అగస్త్యుని మాట విని రాజు మునిపుంగవుడగు అతనిని ఒక చిన్న ఉపదేశమును గూర్చి అడిగెను. మహానుభావుడగు అగస్త్యుడును కార్తీక మాసమున పుష్కరమున కరుగుచు భద్రాశ్వుని యింటి కరిగినప్పుడు ఆతడు తనకేదైన చిన్న ఉపదేశము చేయుమని అడిగెను. ఆ ముని వరుడును రాజునకు ఆ ద్వాదశీ వ్రతమును

గూర్చి చెప్పెను. నేను నీకు చెప్పిన దీనినే ఆ మునిపుంగవుడును ఆ రాజున కెరిగించెను. చెప్పి మరల ఆ అగస్త్యుడు ఆ రాజసత్తమునితో ఇట్లనెను. నేను పుష్కరమున కరుగుచున్నాను. మరల నీ ఇంటికి వత్తును అని పలికి ఆ మహర్షి అక్కడికక్కడే అదృశ్యుడాయెను. ఆ విధానముతో రాజును, పద్మనాభ ద్వాదశి నాడు ఉపవాసము ఉండి కోర్కెలన్నిటిని పొందెను. భార్యలతో కూడిన ఆ రాజును ఆ ఉపవాసముండి ఈ జన్మమున పుత్రులను, పౌత్రులను పొందెను. (49)

50 వ అధ్యాయము - దుర్వాసఃకథిత కార్తీక ద్వాదశీవ్రతము

దూర్వాసుడు ఇంకను ఇట్లు చెప్పెను. మునిశ్రేష్టుడగు అగస్త్యుడు పుష్కరమను తీర్థమున కరిగి కార్తీకమాసము భద్రాశ్వుని మందిరమున కరుదెంచెను. అట్లు వచ్చిన మునిని చూచి మిక్కిలి ధర్మబుద్ధి గలరాజు అర్ఘ్యము, పాద్యము మొదలగువానితో పూజించి ఆసనమును గ్రహించినవాడును, నిష్టతో కూడిన వ్రతములు కలవాడును అగు అతనితో సంతోషముతో ఇట్లు పలికెను. "పూజ్యుడా! ఋషిసత్తమా! నీవు మునుపు ఆశ్వయుజమాస ద్వాదశి వ్రత విధానం చెప్పి యుంటివి. ఇప్పుడు కార్తీక మాసమున ఆ వ్రతము పుణ్యమెట్టిదో నాకు తెలియజెప్పుము" అందులకు అగస్త్యుడు "రాజా! మహాబాహూ! విను. కార్తీకమాస ద్వాదశినాడు విధి పూర్వకముగా ఉపవాసముండినచో కలుగు ఫలమెట్టిదో చెప్పెదను.

మునుపటి పద్ధతి ప్రకారమే సంకల్ప మొనరించి స్నానము చేయవలయును. నిర్మలుడగు నారాయణ దేవుని అర్చింపవలయును. 'ఓం నమః సహస్ర శిరసే' అని హరిశిరస్సును, 'పురుషాయ నమః' అని భుజములను, 'నమో విశ్వరూపిణే' అని కంఠమును, 'నమో జ్ఞానాస్త్రాయ' అని అస్త్రములను, 'నమః శ్రీవత్సాయ' అని రొమ్మును, 'నమో జగద్గ్రసిష్ణవే' అని ఉదరమును, 'నమో దివ్యమూర్తయే' అని నడుమును, 'నమః సహస్ర పాదాయ' అని పాదములను పూజింపవలయును. ఇట్లు వివేకవంతుడు అనులోమ విధానముగా(పాదములనుండి శిరస్సువరకు) దేవేశుని పూజించి 'ఓం నమో దామోదరాయ' అని హరిసర్వాంగములను అర్చింపవలయును. ఇట్లు విధానము ననుసరించి పూజించి ఆ దేవుని ముందు, లోపల రత్నములు కలవియు, తెల్లని గంధపు పూత కలవియు, మాలలు కట్టిన మెడలు కలవియు తెల్లని వస్త్రములు చుట్టబడినవియును, నువ్వులు, బంగారు నాణెములు గల రాగిపాత్రలు పైని నిలిపినవియు అగు నాలుగు

కుంభములను ఉంచవలయును. ఇట్లు నాలుగు సముద్రములు కూర్చినట్లుగును. వాని మధ్య మునుపటి పద్ధతి ప్రకారము, యోగీశ్వరుడు, యోగనిద్రలో ఉన్నవాడు, పీతాంబరము తాల్చినవాడు అగు హరిని బంగారు ప్రతిమ రూపముతో నిలుపవలయును. ఆ దేవుని కూడ ఇట్లే పూజించి, ఆ రాత్రి అచ్చట జాగరము చేయవలయును, యోగీశ్వరుడు అగు హరిని గూర్చి విష్ణు మయమైన యజ్ఞమును ఆచరింపవలయును. బహు రాజులు తీర్చిన పదునారు అరలుగల చక్రమున హరి నుంచి తెల్లవారిన పిదప బ్రాహ్మణునకు దానమొసగ వలయును. నాలుగు సాగరములను (కుండలను) నలుగురు బ్రాహ్మణులకును, యోగీశ్వరుడగు హరిని అయిదవ బ్రాహ్మణునకు నిష్ఠతో శుచియై ఒసగవలయును. గొప్ప వేదవిద్వాంసున కిచ్చినచో సమమైన ఫలము, వేదమును సంపూర్ణముగా ఎరిగినవాని కిచ్చినచో రెండు రెట్ల ఫలము. పాంచరాత్రాగమమున ఆచార్యుడైన వానికిచ్చినచో వేయిరెట్లు ఫలమును కలుగును. మంత్రములతో, రహస్యములతో వేదము నెరిగిన వానికిచ్చినచో కోటి కోటి రెట్ల ఫలితము సిద్ధించును. గురువు ఉండగా ఇతరుని ఆశ్రయించి పూజించినవాడు పాడుబుద్ధి కలవాడగును. ఇట్టివాని కిచ్చిన దానము ఫలము లేనిదగును. వాడు చెడు గతి నందును. చదువులేని వాడైనా, కలవాడైనా గురువే జనార్దనుడు. సరియగు దారి యందున్నవాడైనా లేనివాడైనా గురువే పరమగతి. ఒక గురువును పొంది మోహమువలన అతని యొద్ద భేద బుద్ధి పొందు పురుషాధముడు కోటి జన్మములు నరకమున యాతనలు అనుభవించును. ఇట్లు విధిపూర్వకముగా ద్వాదశియందు విష్ణువు నర్చించి విప్రులకు శక్తి ననుసరించి దక్షిణ లొసగి భోజనము పెట్టవలయును. ఈ ధరణీ వ్రతమును మునుపు ప్రజాపతి ఆచరించి ప్రాజాపత్యమును, అట్లే శాశ్వత పరబ్రహ్మ స్వరూపమగు ముక్తిని పొందెను.

యువనాశ్వుడను రాజర్షియు ఈ వ్రత విధానముచేత మాంధాత అను కొడుకును, శాశ్వత బ్రహ్మమును పొందెను. అట్లే హైహయరాజు కృతవీర్యుడను వాడు కార్తవీర్యుడను కొడుకును పొందెను. శాశ్వత బ్రహ్మమును సాధించెను. ఇట్లే శకుంతలయు తపస్సు చేసి దుష్యంతుని వలన చక్రవర్తియగు శాకుంతలుని అనగా భరతుడను కుమారుని పొందెను. ఇట్లి పురాణ ప్రసిద్ధులు, వేద ప్రసిద్ధులు నగు చక్రవర్తులు ఈ విధానముతో ఉత్తమమగు చక్రవర్తిత్వమును పొందిరి. మునుపు పాతాళమున కూరుకొనిపోయిన భూదేవి

ఈ వ్రతమును ఆచరించినది. అందువలన దీనికి ధరణీ వ్రతమను ఉత్తమ నామము కలిగెను. వ్రతము పరిసమాప్తి అయిన తరువాత, సంతోషించిన శ్రీహరి ధరాదేవిని వరాహ రూపము తాల్చి పైకెత్తి, నీటిలో మునిగిన నావను వలె, నిలువబెట్టెను, నేను నీకు ప్రీతితో కొనియాడి చెప్పిన ఈ ధరణి వ్రతమును భక్తితో వినువాడును, శ్రద్ధతో ఆచరించువాడును పాపములన్నింటి నుండి విడుదల పొందిన, విష్ణు సాయుజ్యమును పొందును. (50)

51 వ అధ్యాయము - పశుపాలకథా ప్రారంభము

ఇంకను వరాహదేవుడు ఇట్లు చెప్పెను. ధరణీ వ్రతమును గూర్చిన ఉత్తమమగు వాక్యమును దుర్వాసుని వలన విని సత్యతపుడు హిమవత్పర్వతము ప్రక్కభాగమునకు వెంటనే పోయెను. పుష్పభద్ర అను నదియు, చిత్రశిల అను శిలయు, భద్రవటమను మట్టిచెట్టును గల ప్రదేశమునందు అతని ఆశ్రమము విరాజిల్లెను. అందాతని ఉదాత్త చరిత్రము చోటు చేసికొనెను. మరల పృథ్వి ఇట్లు పలికెను. "ప్రభూ! సనాతనా! నేనీ వ్రతమును ఆచరించి పెక్కువేల కల్పములైనది. ఈ తపస్సును గూర్చి, నేను మరచితిని. పరమేశ్వరా! ఇప్పుడు నీ అనుగ్రహమున ఆ పాత విషయము గుర్తునకు వచ్చినది. పూర్వజన్మ స్మరణము కలిగినది. నా దుఃఖము నశించినది. ప్రభూ! నీ హృదయమున నాయందు ప్రీతి ఉన్నచో అగస్త్యుడు మరల భద్రాశ్వుని మందిరమునకు వచ్చి ఏమి చేసెనో, ఆ రాజేమి చేసెనో నాకు తెలియజేయుము" అని అడుగగా వరాహదేవుడు ఇట్లు చెప్పెను. తిరిగివచ్చి శ్రేష్ఠమగు ఆసనమున కూర్చున్న ఆ అగస్త్య మహర్షిని చూచి విశేషముగా పూజ యొనర్చి భద్రాశ్వుడు "మహానుభావా! ఏ కర్మముతో సంసారబంధము తెగిపోవును? ఆకారము ఉన్నవి, లేనివి కూడా ఏమి ఆచరించి శోకరహితులౌతారు?" అని అడిగెను. అందులకు దూర్వాస మహర్షి "రాజా! దూరముగా నున్నది మరియు దగ్గరగా నుండునది, కన్పట్టునట్టిది, కనపడనిది అను విభాగములు కలదియు నగు ఒక దివ్యకథ కలదు. వినుము.

అది పగలు కాదు, రాత్రియు కాదు. దిక్కులు కావు. దిక్కులు కానివియు కావు. అది ఆకాశము కాదు. వారు దేవతలు కారు. అది దినము కాదు. సూర్యుడును కాదు. అట్టి కాలమున పశుపాలుడు అను రాజు పెక్కు పశువులను పాలించుచుండెను. వానిని పాలించుచు, అతడు ఒకనాడు తూర్పు సముద్రమును చూడగోరి, వడివడిగా అచ్చటి కరిగెను. అంతులేని ఒడ్డుగల ఆ మహాసముద్రము తీరమున ఒక వనము కలదు. అందు

పాములు నివసించుచున్నవి. ఎనిమిది వృక్షములు, కామవహ అను నదియు అడ్డముగా, పైకిని వ్యాపించుచు అచ్చట ఉన్నవి. గొప్ప తేజస్సుతో వెలిగిపోవుచున్న ఒక స్త్రీని అయిదుగురు ప్రధాన పురుషులు పట్టుకొని ఉండిరి. ఆ ఇంతియును వేయి సూర్యులకు సమానమైన పెద్దరత్నమును తన ఎడదపై ధరించి ఉన్నది. ఆమె క్రింది పెదవి మూడు వికారములు, మూడు వర్ణములతో ఉన్నది. అటునిటు తిరుగుచున్న ఆరాజును చూచి తక్కినవారందరు మిన్నక చచ్చినవారివలె ఉన్నారు. ఈ రాజు అట్టి వనమున ప్రవేశించెను. అతడు ప్రవేశింపగా ఒక్కక్షణమున అందరు భయమువలన ఒక్కరుగానై ఆ వనమును ప్రవేశించిరి. మిక్కిలి క్రూరములైన ఆపాములు, క్రూరులు చుట్టముట్టగా ఆ రాజు చింతించెను. ఇవి ఇచట లేకుండుట యెట్లు? ఇవి యిటనుండి చెదరిపోవుట యెట్లు? అని ఇట్లు ఆరాజు చింతించుచుండగా మరియొక పురుషుడు మూడు వన్నెలు కలవాడు తెల్లని, ఎఱ్ఱని, నల్లని రంగులను ధరించినవాడు కానవచ్చి నాకంటె ఇతరు డెవ్వడవు నీవు? ఎక్కడకు పోవుచున్నావు? అని సంజ్ఞ చేసెను. అట్లు పలుకుచున్న ఆతనికి 'మహత్తు' అను పేరు కలిగెను.

ఆ పురుషుడును ఈ రాజును చుట్టుకొనగా అతడు 'మేల్కొనుము' అని పలికెను. అంత ఆ స్త్రీ ఆ రాజును అడ్డగించెను. అంతట ఒక మహాపురుషుడు, వీరుడు, సర్వేశ్వరేశ్వరుడు అతనిని చుట్టుకొని నిలిచి, "ఇది అంతయు మాయచే వ్యాపించినది. భయపడకుము అని పలికెను. అంత ఇతరులు అయిదుగురు పురుషులు ఆ నృపసత్తముని చుట్టుముట్టి నిలిచిరి. రాజుతో వారు పగ పెట్టుకొని ఉండిరి. రాజును అట్లు క్రమ్ముకొని ఉండగా, ఆ క్రూరులు అందరు ఒక్కటిగా ఆతనిని మధించుటకై ఆయుధమును పట్టుకొని భయముతో ఒకరిలో ఒకరు కలిసిపోయిరి. ఇట్లు వారు ఒక్కటియై పారిపోగా, ఆ రాజు భవనము మిక్కిలి సుందరము అయ్యెను. ఇతర పాపుల సమూహములు కూడ రూపుమాసిపోయినవి. ఆ యింట భూమి, నీరు, నిప్పు, సుఖము, చల్లని గాలి. శుభ్రమైన అవకాశములు – అనునవి అయిదు ఒక్కొక్క గుణము సమృద్ధి కలవిగా ఏర్పడినవి. అవి అన్నియు ఒక్క రూపముగా కలసిపోయి ఆతనిని చుట్టుకొని నిలిచినవి. ఇట్లా పశుపాలుడు దీని నంతటిని అప్పటికప్పుడు ఏర్పరచెను. యుద్ధము నందలి ఆతని ఆ చురుకుతనమును, రూపమును చూచి, మూడు రంగుల పురుషుడు ఆ రాజశ్రేష్ఠునితో ఇట్లు పలికెను.

మహారాజా! నేను నీ కుమారుడను. నీకేమి చేయుదును? బంధుత్వము కోరెదు మేమొక నిశ్చయము చేసితిమి. దేవా! మేమందరమును, నీచేత పరాజితులము కావింపబడినచో, ఇట్లే మేము శరీరములందు కలిసి పోయి ఉందుము. "నేనొక్కడను నీ పుత్రత్వమును పొందగా అందు సర్వమును సృష్టి ఏర్పడును" అని అతడట్లు పలుకగా రాజు ఆ నరునితో ఇట్లు పలికెను. నా పుత్రుడు ఇతరుల కందరికి సృష్టి కర్త అగును. మీ సుఖములతో, నరులతో, భావములతో నేను మాత్రము ఎన్నటికిని తగులమందను. అని ఇట్లు పలికి ఆ రాజు ఆతనిని తన కుమారుని గావించెను. వారిని విడనాడి తాను స్వయముగా వారి నడుమ వసించి సంతోషించెను. (51)

52 వ అధ్యాయము - పశుపాల వృత్తాంతము

అనంతరము అగస్త్యుడు ఇట్లు పల్కెను. రాజా! ఆ మూడు వన్నెల పురుషుడు, అగు పశుపాలుని తనయుడు స్వతంత్రత వలన 'అహమ్' అను మూడు రంగుల కుమారుని సృజించెను. అతనికి జ్ఞానస్వరూపిణి అగు కన్య ఉదయించెను. ఆమె చక్కని మనోహరుడగు విజ్ఞానదుడను పుత్రునికని ఆతనికిని అన్నింటిని అనుభవించువారు అందమైన కొడుకులు అయిదుగురు కలిగిరి. సంఖ్యల వరుసగా వారి పేర్లు 'అక్ష' శబ్దముతో అంతమగునవి. అనగా ఏకాక్షుడు, ద్వ్యకుడు, త్ర్యక్షుడు, చతురక్షుడు, పంచాక్షుడు అనునవి వారి పేర్లు. వీరు మొదట దొంగలు, తరువాత రాజునకు వశమైరి. ఆకారము లేనివారందరు శుభమైన స్థానములను ఏర్పాటు చేసికొనిరి. ఆ పురము తొమ్మిది ద్వారములు కలది. ఒక స్తంభము కలది. నాలుగు బాటలు కలది. వేల నదులు, నీటిలోనికి మెట్లు కలది. ఆ తొమ్మిది మంది ఒక్కటిగానై ఆ పురమును ప్రవేశించిరి. 1.ఆత్రివర్ణుడు, 2. అహమ్, 3. అవబోధకన్య, 4. విజ్ఞానదుడు, 5. ఏకాకుడు 6.ద్వ్యక్షుడు, 7. త్ర్యక్షుడు, 8. చతురక్షుడు, 9. పంచాక్షుడు (ఈ తొమ్మిదిమంది). వారందరు కలసి ఒక్క క్షణములో ఆకారమును పొంది పశుపాలుడను రాజు అయ్యెను. అంతట ఆ పురములో ఉన్న పశుపాల మహారాజు తనకు వాచకములగు శబ్దములు సూచించి, నిత్యములు అగు వేదములను స్మరించి, అందు చెప్పబడిన వ్రతములను, నియమములను యజ్ఞములను చేసెను. ఆ రాజొకనాదు దుఃఖపడి కర్మకాండమును ఇష్టపడుచు, సర్వమెరిగినవాడు కనుక యోగనిద్ర యందు ఉండి ఒక పుత్రుని సృజించెను. ఆ కొడుకునకు నాలుగుముఖములు, నాలుగు బాహువులు, నాలుగు

వేదములు, పశువులు పోవుటకు నాలుగు బాటలు కలవు. అది మొదలుకొని పశువులు మొదలైనవన్నియు ఆ రాజునకు వశమైనవి. అతడు కర్మకాండము నుండి వెలువడి సముద్రమునందు, వనమునందు, తృణాదులయందు, ఏనుగు మొదలగు వానియందు సముడాయెను" అని చెప్పెను.(52)

53 వ అధ్యాయము - పశుపాలకథా ప్రతీకా వివరణము

భద్రాశ్వుడు అగస్త్యునితో ఇట్లు పల్కెను. "బ్రాహ్మణోత్తమా! నా ప్రశ్నకు నీవీ కథ చెప్పితివి. అది ఎలా పుట్టింది? ఎవనికి ఎవరు చెప్పారు?" అని ప్రశ్నించగా అగస్త్యుడు "ఈ కథ చాలా చిత్రమై వెలువడినది. ఇది అన్నింటి విషయమునను ఉండునది. నీ దేహమున, నా దేహమున, సర్వజంతువుల విషయమున అది సమానముగా ఉండునట్టిది. దీనియందు పుటుకకు ఎరుగకోరువానికి ఆ పరమాత్మయే స్వయముగా ఉపాయము. పశుపాలుని వలన పుట్టిన ఆ నాలుగు పాదములు నాలుగు మొగములు కలవాడు ఎవడో అతడే ఈ కథకు గురువు. దీనిని సవరింపజేసినవాడు. అతని పుత్రుడు స్వరుడు. అతనికి 'సప్తమూర్తి' అనగా సప్తమూర్తి ఏడురూపములు కలవాడు అనియు వ్యవహారము. ఆయన ప్రవచించినదే నాలుగు పురుషార్థములకు సాధనము, ఋక్కులను కోరు వారికి ఆ నాల్గింటిచేత ఆ వాక్యములు ఆరాధింపదగినవి అయ్యెను.

ఆ నాల్గింటిలో మొదటిది, నాలుగు కొమ్ములతో కూడియున్నది. రెండవది వృషభము. అది పలికిన మార్గముతోడనే మూడవదియు, నాల్గవదియు ఏర్పడినవి. ఆ మొదటి దానిని భక్తితో పూజించి సుతుని పొందినవి. ఈ ఏడు మూర్తులుగల దేవుని చరితమును వినగోరువాడు బ్రహ్మచర్యముతో ప్రవర్తింపవలయును. ఈతని రెండవదశ అనగా రెండవ గృహస్థాశ్రమము సనాతనమయినది. పిదప సేవకులు మొదలగువారిని భరించుట వృషభరూపుడగు దైవమును అధిరోహించుట జరిగెను. "అహోమస్మి – నేనొకడను ఉన్నాను" అని ఒకడు అనేసరికి నాలుగు విధములుగా, ఒక విధముగా, రెండు విధములుగా, అనేక రూపములు కలిసి పుట్టునట్లుగా అతనికి కొడుకులు జన్మించిరి. నిత్యములు, అనిత్యములగు స్వరూపములు గలవానిని చూచి చతుర్ముఖుడు నేను నా తండ్రి నెట్లు చూతునని విచారమందెను. మహాత్ముడగు నా తండ్రి గుణములు ఈశ్వరుని బిడ్డల యందు ఒక్కరియందును ఇప్పుడు కానరావు. తండ్రి కొడుకు, కొడుకు తండ్రి పేరు

కలవాడగును. శ్రుతి ఈ విధముగా ఉండగా స్వరుని బిడ్డల యందు మరియొక విధముగా కారాదు కదా! నా భావమెచట ఫలమునకు వచ్చును? నా తండ్రి నాకెక్కడ కనిపించును? ఇట్టి స్థితికి వచ్చితిని. దీని కార్యమేమి? అని చింతాపరుడు అయ్యెను. అట్లతడు చింతించు చుండగా, అతని ముందు తండ్రికి సంబంధించిన శస్త్రమొకటి ప్రకాశించెను. రోషమువలన ఆ శస్త్రముతో ఆ స్వరుని కుళ్లబొడిచెను. అట్లు పొడువగా చతుర్వక్తునకు పట్టశక్యము కాని ఆ స్వరుని కొబ్బరికాయ వంటి ఆకారముగల తల కానవచ్చెను. అదియు ప్రధానముగా పదివైపులను కప్పబడి ఉండెను. నువ్వు గింజలంతగా దానిని నాలుగు పాదములను బ్రహ్మ చతుష్పాద శస్త్రంతో పగులగొట్టెను.

నువ్వు గింజంతగా ముక్కలు కొట్టినను దాని మూలము, నాకు కానరాలేదని అతడు అనుకొనుచుండెను. నేను, నేను అని పలుకుచు ఒక భూతము ఏర్పడెను. దానిని కూడా ఖండింపగా దాని భుజముపై ఒక పొట్టిరూపము కానవచ్చెను. నేను నీ అయిదు భూతముల స్వరూపమును అని పలుకుచు ఒక భూతము దాని సమీపమున కానవచ్చెను. దానిని కూడ ముక్కలు కొట్టెను. కాని, శూన్యతను చూడకుండెను. అనగా ఆ అయిదు అక్కడనే యుండెనని అవకాశమును చేసికొని వాగుచు నిలబడెను. దానిని కూడ అసంగమనెడు శస్త్రముతో నువ్వు గింజలంతగా ముక్కలు చేసెను. అది అట్లు పదేసి భాగములుగా కాగా మరియొక పొట్టి ఆకారము కానవచ్చెను.

ఆ పొట్టి పురుషుని కూడ ముక్కలు కొట్టి తెల్లనివాడు, సౌమ్యుడు అయిన మరియొక పురుషుని చూచెను. వానిని కూడ అట్లే చేసెను. ఇట్లు చేయగా ఆ ప్రభువునకు ఆ ముక్కలోపల ఒక శరీరము కానవచ్చెను. అది తన తండ్రిదే. అది త్రసరేణువు (ముప్పది పరమాణువులంతటిది) అంత ఆకారమున సర్వజంతువుల యందు అవ్యక్తముగా ఉండెను. అట్లు అంతట సమముగా ఉన్న దానిని చూచి వారిరువురు ఆనందము పొందిరి. అతడే స్వరుడు అయ్యెను.

ఈ విధమైన పురుషుడు స్వరమను నామము కలవాడాయెను. అతని మూర్తికి 'ప్రవృత్తము' అని పేరు. శిరస్సునకు నివృత్తమని పేరు" అని చెప్పి రాజా! ఈ కథ వలననే ఆతనికి పుట్టుక కలిగినది. ఇదియే దాని విస్తృతి అని వివరించెను. ఇది సర్వజగత్తు యొక్క మొదటి ఇతిహాసము. దీనిని తత్త్వముతో ఎరిగినవాడు సాక్షాత్తుగా కర్మపరుడగును. (53)

54 వ అధ్యాయము - నారదుడు అప్సరసలకు చెప్పిన వ్రతము

మరల భద్రాశ్వుడు ఇట్లు ప్రశ్నించెను. "బ్రాహ్మణోత్తమా! విజ్ఞానము ఉత్పత్తిని కోరువానికి ఆరాధ్యుడెవరు? ఎవనిని ఆరాధింపవలయును? ఆతనిని ఆరాధించు విధమెట్టిది? దీనిని నాకు ఉపదేశింపము" అని పలుకగా అగస్త్యుడు సర్వదేవతలకును, సర్వకాలముల యందును ఆరాధింపదగినవాడు ప్రభువగు విష్ణువే. ఆతడు వరదుడగుటకు ఉపాయమును చెప్పెదను. సర్వదేవతలకు, మునులకు, నరులకు పరదైవము నారాయణుడే. ఇది రహస్యము. అతనికి ప్రణమిల్లిన వాడు ఎన్నటికిని చెడడు అని వినవచ్చుచున్నది. పూర్వము మహాత్ముడగు నారదుడు తుష్టినిచ్చెడు విష్ణువ్రతమును అప్సరసలకు చెప్పెనట.

పూర్వకల్పమున ఒకప్పుడు నారదుడు స్నానము కొరకు మానస సరస్సున కరిగిన అందు అప్సరసల గణమును చూచెను. ఆ వరాంగనలు విలాసినులు జడలే కంటము గలవాడు, ఎముకలు తోలు మాత్రమే మిగిలినవాడు, గొడుగు, దండము, పుట్ట అని తాల్చినవాడు, దేవతలను రక్కసులను, నరులను చూడగోరువాడు, కలహా వేదనాదము కలవాడు, తపస్సుతో కూడినవాడునగు ఆ నారదుని చూచి అప్సరసలు ఇట్లు అడిగిరి. "పూజ్యుడా! బ్రహ్మకుమారా! మేము భర్తను కోరుచున్నవారము. మాకు నారాయణుని భర్తగా ఏ విధముగా పొందగల్గుదుమో దానిని ఉపదేశింపుము" అని వినుతింపగా నారదుడు ఆ అప్సరసలతో నమస్కరించి ప్రశ్నించడం శుభకరం. మీరు వయసు పొగరున నన్ను ఆ విధముగా అడుగరైతిరి. అయినను మీరు దేవదేవుడగు విష్ణువు నామమును కొనియాడితిరి. మాకు హరి మగడెట్లగును అంటిరి. అతని నామము పలుకుట చేతనే సర్వము సిద్ధించును. ఇందు సంశయము లేదు. హరి స్వయముగా వరదుడగు వ్రతమును, భర్తయగుటను ప్రసాదించుదానిని చెప్పెదను వినుడు.

వసంతరువున చైత్రమాసమున శుక్లపక్షమున వచ్చు ద్వాదశినాడు ఉపవాసముండి విధి పూర్వకముగా రాత్రి యందు హరిని అర్చింపవలయును. పెక్కు చిత్రములు కల తెల్లని వస్త్రము కప్పిన పాన్పును, ఏర్పరచి అందు లక్ష్మితో కూడిన హరిని వెండితో చేసి నిలుపవలయును. ఆ పాన్పు మీదుగా పూవులతో చక్కని మండపమును ఏర్పరుపవలయును. నృత్యములు, వాద్యములు, పాటలు మున్నగు వానితో అందు జాగరము చేయవలయును. 'ఓం నమో మనోభవాయ' అని శిరస్సును, 'నమః అనంగాయ'

అని నడుమును, 'నమః కామాయ' అని భుజమును, 'నమః సుశాస్త్రాయ' అని ఉదరమును, 'నమో మన్మథాయ' అని పాదములను, 'నమో హరయే' అని సర్వాంగములను, మల్లెలు, జాజులు మొదలగు పూవులతో చక్కగా పూజింపవలయును. పిదప చక్కని నాలుగు చెరకు గడలను దేవునకు నాలుగు దిక్కులందును నిలుపవలయును. ఈ విధముగా చేసి మరునాడు తెల్లవారిన తరువాత, వేదములందును, వేదాంగములందును పండితుడును, బుద్ధిమంతుడును, ఏ అంగవైకల్యము లేనివాడును అగు బ్రాహ్మణునకు దానము ఈయవలయును. అట్లే బ్రాహ్మణులను పూజించి ఈ వ్రతమును సమాప్తం చేయవలయును. ఇట్లు చేసినచో మీకు తప్పక విష్ణువు భర్త అగును. సుందరులారా! మీరు నాకు మ్రొక్కనిడక గర్వముతో అడిగితిరి. ఈ అవమానమునకు ఫలము మీకు తప్పక కలుగును. ఈ సరస్సునందే అష్టావక్రుడని మహాముని కలడు. అతనిని వెక్కిరించి మీరాతని శాపము పొందెదరు. ఈ వ్రతము చేత దేవదేవుని పతిగా పొందుదురు. కాని ఈ అవమానమువలన గోపాలురచేత మీ అపహరణము కలుగును. పిదప కన్యలను హరించిన ఆ దేవుడే మీకు భర్త కాగలడు" అని ఇట్లు పలికి ఆ దేవర్షి, నారదుడు క్షణములో అటనుండి వెడలిపోయెను. వారును ఆ వ్రతమును విధి ప్రకారము ఆచరించిరి. హరి స్వయముగా వారి యెడల తుష్టుడాయెను. (54)

55 వ అధ్యాయం - అగస్త్యకథిత శుభవ్రతము

ఈ విధముగా చెప్పిన అగస్త్యుడు ఇట్లు పల్కెను. "రాజా! వ్రతములలో మేలైన వ్రతమును చెప్పెదను వినుము. ఆ శుభమైన వ్రతముతో విష్ణువు దక్కును. సంశయము లేదు. మార్గశిరమాసమున శుక్లపక్షమున పాడ్యమి మొదలుకొని దశమి తిథి వరకు ఒంటి భోజనము చేయుచు ఈ వ్రతమును ఆరంభింపవలయును. దశమి మధ్యాహ్నము స్నానము చేసి విష్ణువును పూజించి భక్తితో మునుపటివలె ద్వాదశి వ్రతమునకు సంకల్పము చేయవలయును. ఆ తిథియందును అట్లే ఉండి, యవలను విప్రునకు దానమీయవలయును. దానమునందును, హోమమునందును, అర్చనము నందును 'ఓం నమః కృష్ణాయ' అని హరిని కీర్తించుచుండవలయును. ఇట్లు నాలుగు మాసములు గడపి, ఓ రాజసత్తమా చైత్రము మొదలగు మాసముల యందు మరల అట్లే ఉపవాసముండి పేలపిండి, బంగారు నాణెములుగల పాత్రలను చక్కని వేదపండితులకు దానము ఈయవలయును. శ్రావణము,

మొదలగు నెలలయందు అట్లే బియ్యమును దానము చేయవలయును. అట్లు మూడు మాసములు గడువగా కార్తిక మాసము మొదటి దినము వచ్చువరకు ఇట్లు చేయవలెను. ఆ నెలకూడ అట్లే దశమివరకు నిష్ఠతో శుచియై కడపి, మునుపటివలె భక్తితో ఇంద్రియము లను అదుపులో ఉంచుకొని, ఏకాదశి యందు శక్తి ననుసరించి సంకల్పము గావించి, మాసము పేరు చెప్పి హరిని ఆరాధింపవలయును. ద్వాదశినాడు భూమిని చక్కగా తీర్చ వలయును. బంగారు అవయవములు కలదియు, పాతాళముతో, కులపర్వతములతో కూడినదియు అగు భూదేవతలను భూమిన్యాస విధానముచేత ఆ హరిదేవుని ముందు నిలుపవలయును. తెల్లని రెండు వస్త్రములు కప్పినదియు, అన్ని విధములగు విత్తనములతో కూడినది అగు ఆ భూదేవతలను అయిదు రత్నములతో 'ప్రియదత్తాయ నమః' అనుచు పూజింప వలెను. రాజా! అచ్చట జాగరము చేసి, మరునాటి ఉదయమున ఇరువది నలుగురు బ్రాహ్మణులను ఆహ్వానించి, ఒక్కొక్కనికి ఒక్కొక్క గోవును, ఎద్దును, వస్త్రముల జంటను, ఉంగరమును, మురుగులను, బంగారు కుండలములను, ఒక్కొక్క గ్రామమును దానము చేయవలయును. వారిలో ఒక దరిద్రునకు తన శక్తిని అనుసరించి ఆభరణములను, రెండు వస్త్రములను, సర్వశ్రేష్ఠముగా ఒసగవలయును. తనశక్తి మేరకు బంగారుభూమి ప్రతిమలను చేసి రెండు గోవులను, రెండు వస్త్రములను దానమొసగ వలయును. గోవుల జంటను, ఆభరణమును, బంగారు నాణెములతో మొత్తముగా, శుక్లకృష్ణ పక్ష ద్వాదశుల యందు దానము చేయవలయును. వెండిబొమ్మగానైనను భూదేవిని శక్తి కలిగిన మేరకు చేసి, బ్రాహ్మణులకు దానము చేయవలయును. భోజనము పెట్టవలయును. పాదరక్షలను, పాదుకలను, గొడుగును కూడ యథాశక్తిగా నొసగవలయును. ఇట్లు వీని నొసగి 'కృష్ణుడు, దామోదరుడు, విశ్వరూపుడు, హరిదేవుడు ఎల్లప్పుడు నాయెడల ప్రీతుడగును గాక' అని పలుకవలయును. ఈ విధముగా దానము, భోజనము చేయించినందున కలుగు ఫలమును చెప్పుటకు వేయియేండ్ల కాలమునందు కూడ సాధ్యము కాదు. అయినను సూచనగా ఆ ఫలమును గూర్చియు, మునుపు జరిగిన దానిని గూర్చియు, దాని శుభములను గూర్చియు చెప్పెదను వినుము.

మునుపు ఆదియుగమున ఒక రాజుకలడు. అతడు వేదము చక్కగా అధ్యయనము చేసినవాడు. చెదరని వ్రతములు కలవాడు. ఆతడు పుత్రులను కోరినవాడై

బ్రహ్మను ఉపాయము అడిగెను. బ్రహ్మ ఆతనికీ ఈ వ్రతమును ఉపదేశించెను. ఆతడు దానిని యథావిధిగ ఆచరించెను. వ్రతము ముగిసిన పిదప విశ్వాత్ముడగు హరి తుష్టుడై స్వయముగా ప్రత్యక్షమై, "ఓ రాజా! మేలైన వరము కోరుకొమ్మని" పలికెను. దేవాదిదేవా! నాకొక పుత్రుని ప్రసాదింపుము. ఆతడు వేద మంత్రములయందు విశారదుడు, యజ్ఞములు చేయించువాడు, యజ్ఞములందు ఆసక్తికలవాడు, కీర్తిమంతుడు, చిరాయువు, లెక్కికిరాని గుణములు కలవాడు, బ్రహ్మ వంటివాడు, ఏ దోషము లేనివాడును కావలయును". అని ఇట్లు పలికి ఆ రాజు మరియు "పరమేశ్వరా! నాకును మరణము పిదప శుభమైన స్థానమును, మునులు కోరునదియు, ఎచట దుఃఖము కలుగదో అట్టి పదమును అనుగ్రహింపుము" అని కోరుకొనెను. ఆ దేవుడు అట్లే అని పలికి అదృశ్యుడయ్యెను. ఆ రాజునకు 'వత్సశ్రీ' అను పేరుగల కుమారుడు జన్మించెను. అతడు వేదవేదాంగములను చక్కగా నేర్చినవాడు, యజ్ఞములు చేసినవాడు. గొప్ప విద్యలు నేర్చినవాడు. ఆతని కీర్తి భూతలమందు అంతటను మిక్కిలిగా వ్యాపించెను.

విష్ణువు ప్రసాదించిన ప్రతాపవంతుడగు ఆ కొడుకును పొంది ఆ రాజు సుఖదుఃఖాదులగు ద్వంద్వములన్నింటిని విడనాడి తపస్సునందు మనసు నిలిపి, రమ్యమైన హిమవత్పర్వతమునకు పోయి, ఆహారము మానివైచి ఇంద్రియములను అదుపు చేసికొని నిరంతరము స్తుతి చేయుచు హరిని ఆరాధించెను. "బ్రాహ్మణా! ఆ రాజు చేసిన స్తుతి యెట్టిది? పురుషోత్తమ దేవుని స్తుతించిన ఆ రాజునకు తరువాత ఏమి జరిగినది?" అని ప్రశ్నింపగా దూర్వాసుడు "ఆ రాజు హిమవంతమున కరిగి హరియందే మనస్సు నిలిపి విష్ణువు, ప్రభవిష్ణువు అయిన దేవుని గూర్చి స్తుతి కావించెను.

<u>బ్రహ్మావాదిన్న పక్కృత విష్ణుస్తుతి</u>

క్షరాక్షరం క్షీరసముద్రశాయినం క్షితీధరం మూర్తిమతాం పరం పదమ్ |

అతీంద్రియం విశ్వభుజాం పురఃకృతం నిరాకృతం స్తౌమి జనార్దనం ప్రభుమ్ ||

త్వమాది దేవః పరమార్థరూపీ విభుః పురాణః పురుషోత్తమశ్చ |

అతీంద్రియో వేదవిదాం ప్రధానః ప్రపాహి మాం శంఖగదాస్త్రపాణే ||

కృతం త్వయా దేవ సురాసురాణాం సంకీర్త్య తే2సౌ చ అనన్తమూర్తే |

సృష్ట్యర్థమేతత్ తవ దేవ విష్ణో న చేష్టితం కూటగతస్య తత్స్యాత్ ||

తథైవ కూర్మత్వమృగత్వముచ్చై- స్త్వయా కృతం రూపమనేకరూప |

సర్వజ్ఞ భావాదసకృచ్చ జన్మ సంకీర్త్యతే తే2చ్యుత నైతదస్తి ||

నృసింహ నమో వామన జమదగ్ని నామ దశాస్యగోత్రాన్తక వాసుదేవ |

నమోస్తు తే బుద్ధ కల్కిన్ ఖగేశ శంభో నమస్తే విబుధారినాశన ||

నమోస్తు నారాయణ పద్మనాభ నమో నమస్తే పురుషోత్తమాయ |

నమః సమస్తామరసంఘపూజ్య నమో2స్తు తే సర్వవిదాం ప్రధాన ||

నమః కరాలస్య నృసింహమూర్తే నమో విశాలాద్రిసమానకూర్మ |

నమః సముద్ర ప్రతిమాన మత్స్య నమామి త్వాం క్రోడరూపిన్ననన్త ||

సృష్ట్యర్థ మేతత్ తవ దేవ చేష్టితం న ముఖ్యపక్షే తవ మూర్తితా విభో |

అజానతా ధ్యానమిదం ప్రకాశితం నైభిర్వినా లక్ష్యసే త్వం పురాణ ||

ఆద్యో మఖ స్త్వం స్వయమేవ విష్ణో మఖాఙ్గభూతో2సి హవిస్త్వమేవ |

పశుర్భవాన్ ఋత్విగిజ్యం త్వమేవ త్వాం దేవసంఘా మునయో యజన్తి ||

యదేతస్మిన్ జగద్ధ్రువం చలాచలం సురాది కాలానలసంస్థముత్తమమ్ |

న త్వం విభక్తో2సి జనార్దనేశ ప్రయచ్ఛ సిద్ధిం హృదయేప్సితాం మే ||

నమః కమలపత్రాక్ష మూర్తామూర్త నమో హరే|శరణం త్వాం ప్రపన్నో2స్మి సంసారాన్మాం సముద్ధర ||

ఏవం స్తుత సదా దేవస్తేన రాజ్ఞా మహాత్మనా | విశాలాద్రమతలస్థేన తుతోష పరమేశ్వరః ||

(55.31-42)

"నేను జనార్ధన ప్రభువును స్తుతింతును. ఆతడు క్షరుడు, అక్షరుడు. పాల సముద్రమును పవ్వళించువాడు. భూమిని ధరించువాడు. దేహరూపము పొందినవారికి పరమపదము. అతడు ఇంద్రియముల కతీతుడు. విశ్వమును తాల్చు వారందరికీ ముందుండు వాడు. ఆకారరహితుడు. స్వామీ! నీవు ఆదిదేవుడవు. పరమార్థమే నీ రూపము. విభుడవు, పురాణుడవు. పురుషోత్తముడవు. ఇంద్రియముల కందనివాడవు. వేదమెరిగిన వారిలో ప్రధానుడవు. శంఖము, గద, ఖడ్గము, చక్రములు చేత దాల్చిన స్వామీ! నన్ను

గట్టిగా కాపాడుము. దేవా! నీవు దేవదానవుల సృష్టికొరకు అనంతములగు రూపములను తాల్చినవాడవు. నిన్నట్లు కొనియాడుదురు. నిజమునకు కూటగతుడవగు నీకు ఏ చేష్టితమును లేదు. అట్లే నీవు తాబేటి రూపము, వరాహాది మృగ రూపమును పెక్కు రూపములు కలవాడా! పెక్కుమారులు సర్వము నెరిగినతనముతో చేసితివి. అట్లని నిన్ను కీర్తించుచున్నారు. అయినను నీకా రూపములు నిజమునకు లేవు. నృసింహా! నీకు నమస్సు. వామనా! పరశురామా! రావణాంతకా! వాసుదేవా! బుద్ధా! కల్కీ! పక్షిరాజా! శంభో! రాక్షసాంతకా! నీకు ఎల్లప్పుడు నమస్కారము. నారాయణా! పద్మనాభా! పురుషోత్తమా! సమస్త దేవతల పూజలందుకొను దేవా! సర్వమెరిగినవారిలో మొదటివాడా! నీకు నమస్కారము. వెరపు గొలుపు ముఖముగల ఓ నృసింహమూర్తీ! విశాలమగు కొండవంటి కూర్మరూపా! సముద్రమునకు సాటియగు మత్స్యరూపా! అనంతా! వరాహరూపముగల స్వామీ! నీకు నమస్సులు. ప్రభూ! ఈ నీ చేష్టితమంతయు కేవలము సృష్టికొరకు మాత్రమే. ముఖ్యముగు దృష్టితో నీకు ఆకారమేలేదు. నిన్నెరుగని వాడిట్టి ధ్యానమును ప్రకాశింప జేసెను. ఓ సనాతనుడా! ఇట్టి వానితో కానీ నీవు ఎరుగబడవు. విష్ణూ! నీవు మొట్టమొదటి యజ్ఞ స్వరూపమువు. యజ్ఞములందలి అంగమైన వాడవు కూడ నీవే. నీవే, హవిస్సు. నీవే యజ్ఞపశువవు. ఋత్విజుడవు నీవే. యజ్ఞఫలమును నీవే. దేవతలు, మునులు నిన్నుద్దేశించియే యజ్ఞములు చేయుదురు. ఈ సృష్టియందు నిలకడగా ఉన్నదియు, కదలునదియు కదలనిదియు, దేవతలు, కాలము, అగ్ని మున్నగువాని ఉత్తమమగు తేజమును, సర్వము నీవే, జనార్ధనా! ఈశ్వరా! నిజమునకు నీవు విభాగములు లేవు (ఏకరూపుడవు). నా హృదయము కోరెడు సిద్ధిని ప్రసాదింపుము. పద్మము రేకులవంటి కన్నులు గల ఓ దేవా! ఆకారము కలదియు, లేనిదియు సర్వము నీవే. నిన్ను నేను శరణము పొందితిని. నన్ను సంసారము నుండి సముద్ధరింపుము" అని ప్రార్థించెను.

మహాత్ముడగు ఆరాజు పరమైన మామిడిచెట్టు క్రింద నుండి ఇట్లా దేవుని స్తుతింపగా పరమేశ్వరుడు సంతోషించెను. అంత ఆ హరి స్వయముగా కుబ్జ(పొట్టి గూని) రూపము తాల్చి అచటకు వచ్చెను. ఆతడు వచ్చినంతనే ఆ విశాలమగు మామిడిచెట్టు కూడ కుంచించుకొనిపోయెను. ఆ గొప్ప ఆశ్చర్యమును గాంచి చక్కగా పాటించిన వ్రతముగల ఆ రాజు ఇంత విశాలమగు చెట్టు కుంచించుకొనిపోయెనేమి? అని విచారము కలవాడాయెను.

అట్లు చింతించుచున్న ఆతనికి ఆ బ్రాహ్మణుని యందు బుద్ధి ప్రసరించెను. ఇ'తడు వచ్చుటతోడనే ఇది యిట్లాయెను. సంశయము లేదు. అతని వలననే ఇదిట్లైనది. ఈతడు భగవంతుడగు పురుషోత్తముడే' అనుచు అతడావిప్రునకు నమస్కారము చేసెను. "భగవానుడా! నీవు నిక్కముగా పురుషోత్తముడవు. నన్ననుగ్రహించుటకై వచ్చితివి. హరీ! నీ స్వరూపమును నాకు చూపుము. అనుచు ఇట్లు పలుకగా దేవుడు శంఖము, చక్రము, గద అను వానిని ధరించి, సౌమ్యుడై ఆతని ముందు ప్రకాశించి ఇట్లు పలికెను. "రాజేంద్రా! నీ మనసున నున్న కోరిక యేమో కోరుము. నేను ప్రసన్నుడనైనచో ఈ మూడు లోకముల సముదాయము ఒక నువ్వు గింజంత అగును" అని హరి యిట్లు పలుకగా రాజు పరమానందముతో వికసించిన కనులు కలవాడై "దేవదేవా! నాకు మోక్షమును అనుగ్రహింపుము" అని మిన్నకుండెను. అంతట ఆ దైవము ఇంకను ఇట్లనెను, నేను రాగా ఈ విశాలమగు మామిడి చెట్టు పొట్టిదై పోయినది. అందు వలన ఈ తీర్థమునకు 'కుబ్జకామ్రము'అను పేరు రాగలదు. పశువులు, పక్షులు మొదలుకొని బ్రాహ్మణులు తుదిగాగల వారందరు దీనికడ శరీరమును వదలుదురేని వారి కొరకై అయిదు వందల విమానములు వచ్చును. యోగులకు సాక్షాత్తు ముక్తియే కలుగును" అని ఇట్లు జనార్దనుడు ఆ రాజుతో పలికి, శంఖముకొనతో ఆతనిని తాకెను. అట్లు తాకినంత మాత్రమున ఆతడు పరమపదమగు నిర్వాణమును పొందెను. కావున రాజేంద్రా! నీవును ఆ దేవుని శరణు పొందుము. దానివలన నీవు మరల శోకింపదగిన స్థానమును ఎన్నటికిని పొందవు. నిత్యము ఉదయమున నిద్రలేచి మానవుడు వారిరువురు ప్రవర్తించిన తీరును పఠించునేని మోక్షధర్మమును, ఫలమును ఇచ్చువాడగును. పుణ్యమైన ఈ శుభవ్రతమును ఆచరించు నరుడు సర్వసంపదలను అనుభవించి, తుదికి ఈ పరమాత్మునిలో లీనమగును" అని తెల్పెను. (55)

56 వ అధ్యాయము - అగస్త్యకథిత ధన్యవ్రతము

మరల అగస్త్యుడు రాజుతో ఇట్లు చెప్పెను. ఇటుపై మిక్కిలి శ్రేష్ఠమగు ధన్య వ్రతమును గూర్చి చెప్పెదను. దీనివల్ల ధనహీనులు కూడా తక్షణమే ధన్యులవుతారు. మార్గశీర్షమాసము శుక్లపక్షమున పాడ్యమినాడు రాత్రిపూట ఈ వ్రతమును చేయవలయును. ఆనాడు విష్ణురూపుడైన అగ్నిదేవుని పూజింపవలయును. 'ఓం నమో వైశ్వానరాయ' అని

పాదములను 'నమోగ్నయే' అని ఉదరాన్ని, 'నమో హవిర్భుజాయ' అని వక్షస్సును, 'నమో ద్రవిణోదాయ' అని భుజములను 'సంవర్తాయ నమః' అని శిరస్సును, 'నమోజ్వలనాయ' అని సర్వాంగములను, ఇలా విధానం ప్రకారం దేవదేవుడైన జనార్దనుని అభ్యర్చింప వలయును.

ఆ దేవుని ముందు విధానమును అనుసరించి హోమకుండమును ఏర్పరచి, వివేకవంతుడు హోమమును చేయవలయును. పిదప నేయి కలిపిన సగ్గు బియ్యపు అన్నమును భుజింపవలెను. కృష్ణపక్షమునందును ఇట్లే చేయవలయును. ఈ విధముగా నాలుగు మాసములు చేయవలెను. చైత్రము మొదలగు నెలలలో నేయి కలిపిన పాయసమును, శ్రావణము మొదలగు నెలలయందు పేలపిండిని భుజించి, వ్రతము ముగింప వలయును. వ్రతము ముగిసిన పిదప బంగారు అగ్నిదేవుని ప్రతిమను చేయింప వలయును. ఎర్రనివస్త్రములు రెండు చుట్టవలయును. ఎర్రనిపూలతో కప్పవలయును. కుంకుమను పూయవలెను.

ఇట్లు బ్రాహ్మణునకును చేయవలెను. ఏ అంగవైకల్యము లేనివాడు, చక్కని రూపము కలవాడు అగు ఆ బ్రాహ్మణునకు రెండు ఎర్రని వస్త్రములను దానమొసగి పూజింపవలయును. పిదప 'నేను ధన్యుడను, ధన్యమగు కర్మములు కలవాడను, ధన్యమగు చేష్టలు కలవాడను. పుణ్యవంతుడను. ఉత్తమముగా సాగించిన ఈ వ్రతము చేత సర్వకాలములందును సుఖపడుదును' అను మంత్రముతో ఆ ప్రతిమను ఆ బ్రాహ్మణునకు దానమీయవలెను. ఇట్లు పలికి ఆ కోశమును విప్రునియందు సమర్పించిన మహాత్మునకు వెనువెంటనే ధన్యత కలుగును.

అతడు భాగ్యహీనుడైనను ఇది సిద్ధించును. ఈ వ్రతము చేసిన మాత్రమున సౌభాగ్యము, ధనము, ధాన్యము పుష్కలముగా కలుగును. మునుపటి జన్మములందేర్పడిన ఆతని పాపమును కూడ అగ్ని కాల్చివేయును. అట్లు పాపము దగ్ధము కాగా ఆతడు ఈ జన్మమునందే విముక్తాత్ముడు అగును. ప్రతిదినము దీనిని వినువాడును, భక్తితో పఠించువాడును ఇద్దరును ఈ లోకమున వెంటనే ధన్యులగుదురు. మరియు పూర్వకల్పమున మహాత్ముడగు కుబేరుడు శూద్ర జన్మమున ఉన్నవాడై ఈ వ్రతమును ఆచరించినట్లు వినవచ్చుచున్నది" అని చెప్పెను. (56)

57 వ అధ్యాయము - అగస్త్యకథిత కాంతివ్రతము

అటు పిమ్మట అగస్త్యుడు రాజుతో ఇట్లు పల్కెను. రాజా! ఇటుపై మిక్కిలి శ్రేష్ఠమగు కాంతివ్రతమును గూర్చి చెప్పెదను. దీనిని ఆచరించి పూర్వము చంద్రుడు తిరిగి కాంతిగలవాడు అయ్యెను. చంద్రుడు మునుపు దక్షుని శాపముచేత క్షయరోగము పొంది, ఈ వ్రతము చేసి వెంటనే మరల కాంతిగలవాడు అయ్యెనని విందుము. కార్తికమాస శుక్లపక్ష ద్వితియనాడు రాత్రి బలకేశవుని అర్చించుచు ఈ వ్రతమును చేయవలెను. 'ఓం నమో బలదేవాయ' అని విష్ణుదేవుని పాదములను, 'నమః కేశవాయ' అని శిరస్సును అర్చింపవలెను. బుద్ధిశాలి ఈ విధముగా ఉత్తమమగు విష్ణువు రూపమును పూజించి, రెండు కళలు కల సోమునికి ఈ క్రింది బ్రహ్మ మంత్రముతో అర్ఘ్యము నొసగవలయును. 'అమృత స్వరూపుడు, సమస్తమగు ఓషధులకు రాజు, యజ్ఞలోకమునకు అధిపతి అగు చంద్రరూప పరమాత్మకు నమస్కారము' అని చెప్పుచు అర్ఘ్యమొసగి ఇదేవిధముగ బ్రహ్మకును అర్ఘ్యమొసగి రాత్రి విప్రులతో కూడి నేయి కలిపిన యవల అన్నమును తినవలయును. ఫాల్గునము మొదలు నాలుగు నెలలయందు ఇట్లు పవిత్రుడై పాయసాన్నమును పెట్టుచుండవలయును. కార్తీకమున యవలతో శాలిహోమము చేయింపవలయును. ఆషాఢము మొదలగు నాలుగునెలల నువ్వులతో హోమము చేయింపవలయును. అట్లే నువ్వులు కలిపిన అన్నమును తినవలయును. ఇదియే పద్ధతి. అంత సంవత్సరము నిండిన తరువాత చంద్రుని వెండి ప్రతిమను చేసి తెల్లని వస్త్రములను రెండింటిని కప్పి, తెల్లని పూలతో గంధములతో అర్చింపవలయును. ఇట్లు విప్రునకు కూడ వస్త్రాదికముల నొసగి ఆ ప్రతిమను అతనికి దానమీయవలెను. "చంద్రరూపుడవగు శ్రీనారాయణా! నీకు నమస్కారము. నీ ప్రసదము వలన నేనును ఈ లోకమున కాంతి మంతుడనగుదును. సర్వమెరిగినవాడునగుదును, చూడముచ్చటయినవాడ నగుదును" అని ఈ మంత్రము చదువుచు వాక్కునందు నియమము కలవాడై విప్రునకు దానమీయవలెను. ఇచ్చినంతనే ఆ నరుడు కాంతిమంతుడగును.

రాజా! ఈ వ్రతమును అత్రిపుత్రుడగు సోముడు, మునుపాచరించెను. ఆ వ్రతము ముగిసినంతనే స్వయముగా జనార్దనుడు సంతుష్టినంది ఆతనికిగల క్షయ రోగము తీసివైచి 'అమృత' అనుకళను ప్రసాదించెను. ఇట్టి గొప్ప తపస్సువలన ఆ కళను చంద్రుడు

పొందెను. కనుక ఆతనికి సోమత్వము సిద్ధించెను. ఓషధులకు రాజై ప్రకాశించెను. విదియనాడు అశ్వినీ దేవతలు సోమమును భుజించినందుననే వారు రెండు పక్షములందును శేష,విష్ణులుగా ప్రసిద్ధికెక్కిరి. రాజా! విష్ణువు కంటె వేరైన దైవము లేదు. అన్నియెడల నామభేదము చేత పరమేశ్వరుడే నెలకొని ఉన్నాడు" అని పల్కెను. (57)

58 వ అధ్యాయము - అగస్త్యకథిత సౌభాగ్యకరణ వ్రతము

అటుపై అగస్త్యుడు రాజుతో ఇట్లు పల్కెను. "మహారాజా! సౌభాగ్య కరణమను వ్రతమును గూర్చి చెప్పెదను వినుము. అది స్త్రీలకు, పురుషులకు శీఘ్రముగా సౌభాగ్యమును ప్రసాదించును. సత్యమునే పలుకు పరిశుద్ధుడు ఫాల్గుణమాసము శుక్లపక్షము తదియనాటి రాత్రి ఈ వ్రతమును చేయవలయును. ఆనాడు లక్ష్మీదేవితో కూడిన విష్ణువునుగాని, ఉమాదేవితో కూడిన రుద్రునిగాని పూజింప వలయును. ఏలయన లక్ష్మియే గిరిజ, హరియే ముక్కంటి అని అన్ని శాస్త్రములు, పురాణములు చెప్పుచున్నవి.

దీనికంటె భిన్నముగా ఎవ్వడైన రుద్రుడు విష్ణువుకంటె వేరు అన్నట్లు మానవులకు చెప్పునేని అది శాస్త్రము కాజాలదు. విష్ణువు రుద్రుడు కాదు. లక్ష్మి గౌరి కాదు అని చెప్పునది నాస్తిక నరుల వాదమని వివేకులు తెలిసికొని లక్ష్మితో కూడిన హరిని భక్తితో పూజించి ఆ పరమేశ్వరుని క్రింది మంత్రముతో అర్చింపవలయును. 'ఓం నమో గంభీరాయ' అని పాదములను, 'నమః సుభగాయ' అని నడుమును, 'నమో దేవదేవాయ' అని ఉదరమును 'నమస్త్రినేత్రాయ' అని ముఖమును, 'నమోవాచస్పతయే' అని శిరస్సును, 'నమో రుద్రాయ' అని సర్వాంగములను పూజింపవలయును. ఈ విధముగా లక్ష్మీసహితుడగు హరిని, లేదా గౌరీ సహితుడగు హరుని గంధపుష్పాదులతో క్రమముగా బుద్ధిశాలి పూజింపవలయును. పిదప ఆ దేవునిముందు తేనెతో, క్రొత్తనేతితో, నువ్వులతో, 'ఓం నమః సౌభాగ్యపతయే' అనుచు హోమము చేయింపవలయును. అటుపై ఉప్పుకారము లేనిదియు, నూనె తగులనిదియు అగు గోధుమ అన్నమును తినవలయును. కృష్ణపక్షము నందును ఇదియే విధానము, ఆషాఢము మొదలగు నెలలో విదియనాడు యవల భోజనము. అటుపై కార్తీకము మొదలుకొని మూడు నెలలు నియమముతో పరిశుద్ధుడై చామలఅన్నమును తినవలయును. పిదప మాఘమాస శుక్ల పక్షమున తదియనాడు గౌరీ రుద్రుల బంగారు ప్రతిమను,లేదా లక్ష్మీనారాయణుల బంగారు ప్రతిమను శక్తిమేరకు చేయించి,

యోగ్యతయు, వివేకము కల బ్రాహ్మణునకు సమర్పింపవలయును. వేదములు తుదిముట్ట చదివినవాడు, అన్నము లేనివాడు, సదాచారుడు, దరిద్రుడు అగు బ్రాహ్మణున కొసగవలయును. ఆ ప్రతిమలను, ఆరు పాత్రలతో కలిపి బ్రాహ్మణున కొసగవలయును. ఒకటి తేనె పాత్ర. రెండవది నేతిది. మూడవది నువ్వుల నూనె కలది. నాలుగవది బెల్లము కలది. అయిదవది ఉప్పుతో నిండినది, ఆరవది ఆవుపాలు కలది.

ఇట్లు ఈ పాత్రల నిచ్చిన వ్యక్తి స్త్రీగాని, పురుషుడుగాని ఏడు జన్మముల వరకు సుందరుడు, దర్శనీయుడు అగును" అని తెల్పెను. (58)

59 వ అధ్యాయము - అగస్త్యకథిత అవిఘ్నకరవ్రతము

మరియు "రాజా! నీకు అవిఘ్నకరమను వ్రతమును గూర్చి చెప్పెదను. వినుము. అది చక్కగా చేసినచో విఘ్నము అనునది కలుగదు. ఫాల్గుణ మాసమున చవితినాడు ఈ వ్రతమును చేపట్టవలయును. రాత్రిపూట నువ్వులు కలిపిన భోజనము చేయవలయును. దానినే హోమముచేసి బ్రాహ్మణునకు పెట్టాలి. ఈ వ్రతము కూడ నాలుగుమాసముల కాలము చేయవలయును. అయిదవ నెలలో సువర్ణముతో విఘ్నేశ్వరుని ప్రతిమను చేయించి, అయిదు పాత్రల యందు నువ్వులతో కూడిన పాయసముతో పాటు దానము చేయవలయును. ఈ వ్రతమును చేసినవాడు అన్ని విఘ్నముల నుండియు విడివడును. మునుపు సగరుడు తన అశ్వమేధ యాగమునకు విఘ్నము కలుగగా, దీనినే ఆచరించి ఆ యజ్ఞము సమాప్తి చేసికొనెను.

త్రిపురాసురులను వధించునపుడు రుద్రదేవుడు దీనిని ఆచరించియే వారి సంహారము గావించెను. నేనును సముద్రమును త్రాగునప్పుడు ఈ వ్రతమును ఆచరించితిని. అనేకరాజులు, తాపసులు, జ్ఞానవంతులు విఘ్నములు లేకుండటకై ఈ వ్రతమును చేసియున్నారు. శూరుడు, ధీరుడు, గజముఖుడు, లంబోదరుడు, ఏకదంతుడు అగు దేవునకు నమస్కారము అని వినాయకుని పూజింప వలయును. విఘ్నములు నశించుటకై తిరిగి హోమమును ఆచరింపవలెను.

ఈ వ్రతమును ఆచరించిననరుడు, సర్వ ప్రయోజనములు నెరవేరినవాడై వినాయకుని కృపచేత సర్వవిఘ్నముల నుండియు ముక్తుడగును" అని అగస్త్య మహాముని వివరించెను. (59)

60 వ అధ్యాయము - అగస్త్యకథిత శాంతివ్రతము

ఇంకను అగస్త్యుడు ఇట్లు ఉపదేశించెను. "రాజా! ఇంక నీకు శాంతి వ్రతమును గూర్చి చెప్పెదను వినుము. గృహస్థులకు ఎల్లవేళల శాంతి కలుగును. కార్తీకమాసము శుక్లపక్షపు పంచమినాడు దీనిని మొదలిడవలయును. ఒక సంవత్సరము పులుపు లేని భోజనము చేయవలయును. ఆనాటి రాత్రి శేషునిపై ఉన్న హరిని పూజింపవలయును. 'ఓం నమో అనంతాయ' అని పాదములను, 'నమో వాసుకయే' అని నడుమును, 'నమస్తక్షకాయ' అని ఉదరమును, 'నమః కర్కోటకాయ' అని రొమ్మును, 'నమః పద్మాయ' అని కంఠమును, 'నమో మహా పద్మాయ' అని భుజముల జంటను, 'నమః శంఖపాలాయ' అని ముఖమును, 'నమః కుటిలాయ' అని శిరస్సునూ ఇట్లు విష్ణు గతముగాను, నాగుల పరంగాను పూజింపవలయును. ఆ సర్పములను, విష్ణువును పాలతో స్నానము చేయింపవలయును. వారి ముందు పాలతో, నువ్వులతో హోమము చేయవలయును. ఇట్లు ఒక సంవత్సరము ముగిసిన తరువాత బ్రాహ్మణ సంతర్పణము చేయవలయును. బంగారు నాగ ప్రతిములు బ్రాహ్మణునకు దాన మీయవలయును. ఈ విధముగా ఈ వ్రతమును భక్తితో చేయువారికి శాంతి లభించును. పాముల భయము కలుగదు". (60)

61 వ అధ్యాయము - అగస్త్యకథిత కామవ్రతము

పిమ్మట అగస్త్య మహాముని ఇట్లు పల్కెను. "మహారాజా! నీకిపుడు కామవ్రతమును చెప్పెదను. వినుము. దీనితో మనస్సులో తలచిన సర్వకోరికలు తీరును. పుష్యమాస శుక్లపక్షము చవితినాడు భోజనము చేసినవారై షష్ఠి మొదలుకొని ఒక్క సంవత్సర కాలము ఫలములే ఆహారముగా ఈ వ్రతమును చేయవలయును. ధీశాలి అగు వ్యక్తి షష్ఠినాడు మొదటగా వాక్కులను నియంత్రించుకొని, అనగా మౌనవ్రతము పాటించి ఫలాహారమును తీసికొనవలయును. అటుపై బ్రాహ్మణులతో పాటు శుద్ధమైన ఆహారమును తీసికొనుచుండవలయును. లేదా కేవలము పండ్లతోనే ఈ ఒక్కరోజు గడపి సప్తమినాడు భోజనము చేయవలయును. అగ్ని కార్యమాచరించి, ఒక ఏడు కుమారస్వామి రూపమున అతని పేరుతో శ్రీ మహావిష్ణువును పూజించి ఈ వ్రతమును చేయవలయును. ఆరు మోములవాడా! కార్తికా! గుహా! సేనానీ! కృత్తికల కుమారుడా! స్కందా! అనియిట్లు స్కందుని పేర్లతో విష్ణువును పూజింప వలయును. వ్రతము ముగిసిన పిదప బ్రాహ్మణులకు

భోజనము పెట్టవలయును. బంగారు కుమారస్వామి ప్రతిమను బ్రాహ్మణునకు దానమొసగవలయును. "దేవా! కుమారస్వామీ! విప్రరూపమున వచ్చినవాడా! నీ దయవలన నా కోరిక లన్నియు నెరవేరుగాక! భక్తితో ఒసగిన దీనిని గ్రహింపుము. ఆలసింపకుము". అను ఈ మంత్రముతో బ్రాహ్మణునకు ప్రతిమను రెండు వస్త్రములతోపాటు ఒసగవలయును, దానివలన ఆతనికి ఈ జన్మమున కోరికలన్నియు సిద్ధించును. పుత్రులు లేనివాడు పుత్రులను, ధనములేనివాడు ధనమును రాజ్యము పోయిన వాడు రాజ్యమును పొందును. మునుపు ఋతుపర్ణుని దేశమున వ్రతచర్యతో నివసించినపుడు నలుడీవ్రతమును ఆచరించెను. అట్లే రాజ్యము నుండి భ్రష్టులైన పెక్కంద్రు రాజసత్తములు, మరల రాజ్యమును పొందుటకై పురాణ ప్రసిద్ధమగు ఈ వ్రతమును ఆచరించిరి" అని చెప్పెను. (61)

62 వ అధ్యాయము - అగస్త్యకథిత ఆరోగ్యవ్రతము

పిమ్మట కుంభసంభవుడు ఇట్లు పల్కెను. మహారాజా! మిక్కిలి పుణ్యమైనది, పాపములన్నింటిని పటాపంచలు చేయునది అగు ఆరోగ్య వ్రతమును తెలియజేసెదను. మాఘమాసము శుక్లపక్ష సప్తమినాడు ఉపవాసముండి విష్ణురూపుడు, సనాతనుడు అగు భాస్కరదేవుని పూజింపవలయును. 'ఆదిత్యా! భాస్కరా! రవీ! భానూ! సూర్యా! దివాకరా! ప్రభాకరా!' అనుచు పూజింపవలయును. షష్ఠినాడు ఆహారము తీసికొని సప్తమినాడు భానుని పూజింపవలయును. అష్టమినాడు మరల భోజనము చేయవలయును. ఇది యిందలి విధిక్రమము. ఈ విధితో ఒక నిండు సంవత్సరము సూర్యుని అర్చించువానికి ఈ జన్మమున ఆరోగ్యము, ధనము, ధాన్యము లభించును. పరమున, మరల తిరిగిరాని శుభస్థానము (మోక్షము) కలుగును. మునుపు అనరణ్యుడను గొప్ప బలముగల రాజు ఈ వ్రతముతో భాస్కరుని అర్చించెను. అతనియెడ తుష్టుడై ఆ దేవుడు ఉత్తమమగు ఆరోగ్యమును ప్రసాదించెను." అని చెప్పగా భద్రాశ్వ మహారాజు "మునీంద్రా! ఆ రాజు ఏ జబ్బు నుండి విముక్తుడాయెను? సార్వభౌమునకు అంతటి రోగమెట్లు కలిగినది?" అని ప్రశ్నింపగా అగస్త్యుడు మరల "ఆతడు మహాబలుడు, సార్వభౌముడును, గొప్పకీర్తియు, మంచిరూపమును కలవాడు. ఒకనాడా రాజశ్రేష్ఠుడు దేవగణములతో కూడిన, దివ్యమగు మానస సరోవరమున కరిగెను. అందు సరస్సు నడుము నున్న తెల్లని పెద్ద తామరపూవును

చూచి సారథితో ఇట్లనెను : ఈ పద్మమును కొనిరమ్ము. దీనిని తలపై దాల్చి అందరి యెదుట ప్రశంసకు పాత్రుడనగుదును. కనుక ఆలసింపక కొనిరమ్ము" అని రాజు పలుకగా సారథి ఆ కొలనులోనికి ప్రవేశించి ఆ పద్మమును కైకొన ప్రయత్నించెను. ఆ పద్మములో ఒక బొటనవేలంత పురుషుడు ఎర్రని వస్త్రాలతో, రెండు చేతులతో ప్రకాశిస్తూ ఉన్నాడు. సారధిపద్మాన్ని తాకగానే ఒక హుంకారము పుట్టింది. ఆ శబ్దముతో అతడు భీతుడై నేలగూలి మరణించెను. నృపతియు ఆ శబ్దముతో ఒక్క పెట్టున రంగు మారిపోయి కుష్ఠియు, బలవీర్యములు లేనివాడును ఆయెను. ఆ విధముగా మారిన తన్ను చూచుకొని ఆ పురుషవరేణ్యుడు శోకముతో, "ఇది ఏమి?" అని చింతించుచు అక్కడే ఉండెను. అట్లు చింతించుచుండగా ఆతని కడకు మహా తపస్వి బ్రహ్మ పుత్రుడు, బుద్ధిశాలియులగు వసిష్ఠుడు అరుదెంచి, ఆ రాజును ఇట్లు ప్రశ్నించెను. "మహారాజా! నీ దేహమునకీ శిక్షయేమి? ఇప్పుడు నీవు చేయవలసిన దేమి? నాకు చెప్పుము."

ఇట్లు మహాత్ముడగు వసిష్టుడు పలుకగా ఆ రాజు ఆ పద్మ వృత్తాంతము నంతటిని అతనికి తెలిపెను. ఆ రాజు చెప్పినది విని ముని "రాజా! నీవు మంచివాడవు. చెడ్డవాడవు అయితివి కనుక నీకీ కుష్ఠరోగము కలిగినది" అని పలికెను. అతడట్లు పలుకగా రాజు చేతులు జోడించి వణకిపోవుచు "విప్రా! నేను సాధువును, అసాధువును యెట్లు అయితిని? నాకీ కుషరోగమెట్లు వచ్చినది? దీనిని నీవు చెప్పవలయునని" పలికెను. రాజా! ఇది మూడు లోకములలో ప్రసిద్ధికెక్కిన బ్రహ్మోద్భవమను పద్మము. దీనిని చూస్తే సర్వదేవతలును చూసినట్లే. ఇది ఆరునెలలుమాత్రమే కానవస్తుంది. దీనిని చూచినంతనే జలమున ప్రవేశించునరుడు పాపములన్నిపోయి, మోక్షమును పొందును. బ్రహ్మము యొక్క మొదటి దశయగు మూర్తి ఇలా నీటిలో నెలకొనియున్నది. దానిని చూచి జలమున మునిగినవాడు సంసారము నుండి ముక్తి పొందును. రాజా! దీనిని చూచి, దానిని కైకొనుటకై జలమున మునిగి నీ సారథి సుగతి కరిగెను. నీవు పాడుబుద్ధితో ఈ కుష్టురోగమును పొందితివి. నీవు దీనిని చూచినందువలన నిన్ను నేను 'సాధువు' అంటిని. మోహము పొందితివి కావున 'అసాధుడవు' అంటిని. నేను బ్రహ్మ పుత్రుడను. నేను ప్రతిదినము వచ్చి ఆ పరమేశ్వరుని చూచుచుందును. అట్లే నీవును చూచితివి.ఈ బంగారు పద్మమును గాంచి దేవతలును బ్రహ్మ పద్మరూపమున మానస సరోవరమునకు హరి వచ్చి

యున్నాడు, మేము మరల తిరిగి వచ్చుటన్నది లేని ఈ పరబ్రహ్మమును పొందెదమని పలుకుదురు. రాజా! నీ కుష్టురోగమునకు కారణము కూడ చెప్పెదను వినుము. ఈ పద్మము గర్భమున స్వయముగా సూర్యదేవుడు నెలకొని యున్నాడు. అతడు నిజమునకు శాశ్వతుడగు పరమాత్మయే. అట్టి ఈ పద్మమును గాంచి నీవు తలపై విభూషణముగా తాల్చి, లోకమున వెలిగిపోయెదనని భావించితివి. ఇట్లు వాగిన నీకు ఈ పాపమునా దేవుడు చూపెను. నీవిపుడా దేవునే ఆరాధింపుము. అని ఇట్లు పలికి ఆ వసిష్ఠ మహర్షి ఆతనికి ఆరోగ్య వ్రతమను పేరుగల ఈ వ్రతవిధానమును. సూర్యారాధన పద్ధతిని వివరించెను. ఆ రాజును భక్తితో కూడినవాడై ఈ వ్రతమును కావించెను. పరమ సిద్ధిని పొందెను. వెనువెంటనే రోగము లేనివాడు ఆయెను" అని తెల్పెను. (62)

63 వ అధ్యాయము - అగస్త్యకథిత పుత్రప్రాప్తి వ్రతము

ఇంకను అగస్త్యుడు ఇట్లు పల్కెను. "మహారాజా! పుత్రప్రాప్తి వ్రతమను మరియొక పుణ్యవ్రతమును సంగ్రహముగా చెప్పెదను వినుము. భాద్రపద మాసము కృష్ణ పక్షమున అష్టమినాడు ఈ పుత్రప్రాప్తి వ్రతమును చేయవలయును. షష్ఠినాడు సంకల్పించి, సప్తమినాడు దేవకీదేవి ఒడిలో ఉన్నవాడు, తల్లుల నడుమ ఉన్నవాడు అగు శ్రీకృష్ణదేవుని అర్చింపవలయును. అష్టమినాడు స్వచ్ఛమైన ప్రభాతకాలమున నిష్ఠ కలవాడై హరిని మునుపు చెప్పిన విధానముతో అర్చింపవలయును. పిమ్మట యవలు, నల్లని నువ్వులు నేయి కలిపిన పెరుగును హోమము చేయవలయును. భక్తితో శక్తి ననుసరించి దక్షిణల నొసగుచు బ్రాహ్మణులకు సంతర్పణము చేయవలయును. పిదప మొదట ఒక మారేడు ఫలమును తిని తరువాత ఇష్టము ననుసరించి తైలపాకములను, అన్ని రసములతో కూడిన వానిని భుజింపవలయును. ఇట్లు పుత్రులు లేని నరుడు ప్రతిమాసమునను విధి పూర్వకముగా కృష్ణపక్షము అష్టమినాడు ఉపవసించి వ్రతము ఆచరింపవలయుసు. అతనికి తప్పక పుత్రుడు కలుగును. సంశయము లేదు.

ఒక కథ వినవచ్చుచున్నది. మునుపు ప్రతాపవంతుడగు శూరసేనుడను రాజు సంతానము లేనివాడై హిమవత్పర్వతమున తపస్సు చేసెను. ఇట్లతడు తపస్సు చేయుచుండగా దేవుడు ఆతనికి ఈ వ్రతమును గూర్చి ఉపదేశించెను. అతడును దానిని చక్కగా చేసి పుత్రుని పొందెను. ఆ రాజర్షి అనేక యాగములు చేసిన పుణ్యాత్ముని తన

కుమారునిగా పొంది పరమానంద మందెను. ఇట్లు, రాజా! నీకు కృష్ణాష్టమిని గూర్చి తెలిపితిని. ఏడు గడచిన పిదప కృష్ణ ప్రతిమలను రెండింటిని బ్రాహ్మణునకు దానమొసగ వలయును. పుత్రవ్రతమను దీనిని గురించి నీకు వివరించితిని. దీనిని ఆచరించి నరుడు పాపములన్నింటి నుండి విడుదల పొందును" అని వివరించెను. (63)

64 వ అధ్యాయము - అగస్త్యకథిత శౌర్యవ్రతము

అగస్త్యుడు ఇట్లు తెల్పెను. ఇటుపై నీకు మిక్కిలి శ్రేష్ఠమైన శౌర్య వ్రతమును గూర్చి చక్కగా తెలిపెదను. దీనివలన పిరికివానికినీ అప్పటికప్పుడు గొప్ప శౌర్యము కలుగును. ఆశ్వయుజమాస శుక్లపక్షమున నవమినాడు ఉపవాసము చేయవలయును. సప్తమినాడు సంకల్పము చేసి అష్టమినాడును ఉపవాసము ఉండవలయును. నవమినాడు మొదట పిండిని భుజింపవలయును. భక్తితో బ్రాహ్మణులకు సంతర్పణము చేయవలయును. మహామాయ, మహాప్రభ, మహాభాగ అగు దుర్గాదేవిని పూజించవలయును. ఇట్లు ఒక సంవత్సర కాలము విధానమును అనుసరించి ఆ తిథియందు ఉపవాసముండి బుద్ధిమంతుడగు నరుడు వ్రతము ముగిసిన వెనుక శక్తిననుసరించి కన్యకలకు అన్న మొసగ వలయును. బంగారు వస్త్రములు మున్నగువానితో శక్తిమేరకు వారిని అలంకరించి పిదప 'దేవి నాయెడల ప్రీతియగుగాక'అని వారినుద్దేశించి విన్నపముచేయవలయును. ఇట్లుచేసినచో రాజ్యము కోల్పోయినవాడు రాజ్యమును తప్పకపొందును. విద్య లేనివాడు విద్యనుపొందును. భయమునందిన వాడు శౌర్యమును పొందును. (64)

65 వ అధ్యాయము - అగస్త్యకథిత సార్వభౌమవ్రతము

మరల అగస్త్యుడు ఇట్లనెను. సార్వభౌమ వ్రతమును గూర్చి సంగ్రహముగా చెప్పుచున్నాను. దీనిని ఆచరించిన రాజు వెంటనే సార్వభౌముడగును. కార్తికమాసమున శుక్లపక్షము దశమినాడు రాత్రి భోజనము చేయుచు ప్రతిదినము అన్ని దిక్కుల యందును శుద్ధమైన బలిని ఉంచవలయును. రంగురంగుల పూవులతో భక్తితో ఉత్తమవిప్రులను పూజించి ఆయా దిక్కును గూర్చి "దిక్కులారా! మీరందరు నాకు ప్రతిజన్మము నందును సిద్ధిని కూర్చువారగుదురు గాక" అను అర్థముగల మంత్రముతో దిక్ప్రార్థనము చేయవలయును. ఇట్లు పలికి ఆయన యందు నిర్మలమగు మనస్సుతో బలిని ఉంచవలయును. ఆరాత్రి చక్కగా మంత్రములతో సంస్కరించిన పెరుగన్నమును భుజింపవలయును. మొదట

దధ్యోదనమును, తరువాత ఇష్టము ననుసరించి భుజింపవచ్చును. ఇట్లే ఈ వ్రతమును ఏడాది కాలము చేయువానికి దిగ్విజయము తప్పక కలుగును.

వివేకవంతుడగు మనుష్యుడు మార్గశీర్షమాసము శుక్లపక్షము ఏకాదశినాటినుండి ప్రారంభించి ఈ వ్రతమును పట్టుదలతో చేయవలయును. కుబేరునకు ఇష్టమైన ఈ వ్రతమును చేసినచో ఇది పుష్కలముగా ధనమునిచ్చును. ఏకాదశినాడు, శుక్ల పక్షమున గాని, కృష్ణపక్షమునగాని ఆహారము కైకొనక ద్వాదశి దినమున పారణచేయుట అను ఈ వైష్ణవ వ్రతమును ఆచరించువాడు మిక్కిలి ఘోరములైన పాపములనుండి విముక్తి పొందును. త్రయోదశినాడు నక్తమును పాటించుట ధర్మవ్రతముగా చెప్పబడును. పాల్గుణ మాసము శుక్లపక్షము మొదలుకొని ఈ వ్రతము చేయవలయును. కృష్ణపక్షము నందు విశేషముగా రౌద్రవవ్రతము మాఘమాసము మొదలుకొని ఒక సంవత్సరము వరకు చేయ వలయును. శుక్లపక్షమున పూర్ణిమ తిథియందు నక్త భోజనము అనగా రాత్రి పూట మాత్రము భోజనము చేయుట ఇందు వ్రతము, అమావాస్యనాడు చేయుట పితృవ్రతము. పదునైదేండ్లు ఈ విధముగా తిథివ్రతములను చేయువానికి వ్రతము ప్రమాణమును అనుసరించి మహాఫలములు లభించును. వేలకొలది అశ్వమేధములు, వందలకొలది రాజ సూయములు కల్పము ప్రకారము ఆతడు చేసినట్లగును. రాజోత్తమా! దీనినంతటిని చక్కగా చేయు నరుడు శుద్ధుడు, రజస్సు లేనివాడుగానై సర్వలోకములను పొందును". (65)

66 వ అధ్యాయము - అగస్త్యకథిత పంచరాత్ర శాస్త్రము

అగస్త్యునితో భద్రాశ్వుడు ఇట్లు పల్కెను. "ఓ ధర్మజ్ఞా! నీ వెరిగినది గాని చూచినదిగాని ఆశ్చర్యమేమైన ఉన్నచో నాకు చెప్పుము. నాకు మిక్కిలి వేడుకగా నున్నది" అని పలుకగా అతడితో అగస్త్యుడు సనాతనుడగు ఈ భగవంతుడే ఆశ్చర్యరూపుడు, ఆతని ఆశ్చర్యములు పెక్కువిధములైనవి కానవచ్చుచున్నవి. పూర్వమున నారదుడు శ్వేతద్వీపమునకు వెళ్ళెనట. అచట శంఖచక్ర పద్మములు గలవారు, తీవ్రమగు తేజస్సు కలవారు అగు పురుషులను చూచెను. ఇదిగో విష్ణువు, ఇతడే విష్ణువు. ఇతడు సనాతనుడగు విష్ణువు, ఇట్లని ఇందులో ప్రభువైన విష్ణువెవ్వరు? అని వారిని కాంచిన ఆతనికి చింతకలిగెను. ఇట్లు చింతించు చుండగా అతనికి కృష్ణుని గూర్చిన ఆలోచన బయలుదేరెను. శంఖచక్ర గదాధరుడైన కృష్ణుని ఎట్లు ఆరాధింతును? పరమదైవము, ప్రభువునగు కృష్ణుని ఎట్లు తెలిసికొందును

అని చింతించి ఆ పరమేశ్వరుడగు దేవుని గూర్చి ధ్యానించెను. బ్రహ్మ కుమారుడగు నారదుడు వేయి దివ్యవత్సరములు ఏకాగ్రముగా ధ్యానము చేయగా ఆ దేవదేవుడు పరితోషము పొందెను. ప్రసన్నమగు చిత్తముగల ఆ ప్రభువు ప్రత్యక్షమై "మహామునీ! నారదా! నీకేమి వరము కావాలో అడుగుము" అని పలికెను. అంతట నారదుడు "భువనేశ్వరా! నిన్ను నేను వేయిన్నొక్క వత్సరములు ధ్యానించితిని. నిన్ను పొందుట యెట్లో, నాయెడ తుష్టి నందితివేని తెలుపుము" అని వినుతింపగా ఆ దేవదేవుడు "పురుష సూక్తమును ఆధారము చేసికొని నన్నెవరర్చింతురో వారును, నిరంతరము వేద సంహిత లను అధ్యయనము చేయువారును నన్ను పొందెదరు. వేదములు శాస్త్రములు పట్టుబడనిచో పాంచరాత్రము చెప్పిన మార్గము తోడను నన్ను అర్చించువారు నన్ను పొందెదరు. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు పాంచరాత్ర విధానము చెప్పబడినది. శూద్రులు మొదలగు వారికి పుణ్యక్షేత్రముల కరుగుట, నా నామమును జపించుట విధి. ఇతర పూజలు వారు చేయనక్కరలేదు. "ఓయి విప్రవరా! పూర్వకల్పమున పురాతనమగు ఈ పంచ రాత్రమును, వేలలో ఒక్కడైనను ఇది గ్రహించునేమో అని, నేను చెప్పియుంటిని. కర్మము నశింపగా ఎవ్వడైన నా భక్తుడుండునేమో అని అట్టివాని కొరకు ఈ పంచ రాత్రమును చెప్పితిని. ఇది అతని హృదయమున నిత్యము నిలుచును. ఇతరులు రాజస తామస భావములు చుట్టుకొనగా నావద్ద కూర్చుండుట యందు పెడమొగము కలవారగుదురు. నారదా! కృత, త్రేత, ద్వాపర అని మూడు యుగములయందు సత్వమున నిలదొక్కు కొన్నవారు నన్ను కలియుదురు. కలియందు రజస్తమోగుణములు గలవారు అధికులు. నారదా! విను, నీకు మరియొక వరము కూడ ఇత్తును. మిక్కిలి దుర్లభమైన ఈ పంచరాత్రశాస్త్రమును నా దయవలన సంపూర్ణముగా తెలియుదువు, సంశయము లేదు. వేదము, పంచరాత్రము, భక్తి, యజ్ఞము అనువానిచేతనే నరునకు నేను అందువాడను. నాయనా! ఇతర విధముగా కోట్ల కోట్ల ఏండ్లకును లభింపను" అని పరమేశ్వరుడగు భగవానుడు నారదునితో ఇట్లు పలికి అదృశ్యుడాయెను. నారదుడును స్వర్గమున కరిగెను" అని చెప్పెను. (66)

67 వ అధ్యాయము - పగలు, రాత్రి సంవత్సర పురుషుడు

అగస్త్యుడు చెప్పినది విని మరల భద్రాశ్వుడు ఇట్లు పల్కెను. "ఉత్తముడా! తెల్లని నల్లని స్త్రీలు ఇరువురున్నారని అందురు. వారెవరు. అందు పవిత్రమెవ్వరు? నలుపు తెలుపుల ఇంతి

ఎవరు? ఈ పావకుడు ఏడుగాఅయ్యేనట! అతడెవరు? పంద్రెండు విధములుగా, రెండు దేహములతో, ఆరుశిరస్సులతో ఉండెడు ఆ పురుషుడెవ్వడు? సూర్యోదయము మొదలుకొని వారు దంపతులుగా ఉందురట. ఎవని వలన ఈ జగత్తంతయు పెంపొందినది?" అని ప్రశ్నింపగా అతడితో అగస్త్యుడు "ఈ నల్లని తెల్లని స్త్రీలు అక్కచెల్లెండ్రు. సత్య, అసత్య అను వారు. రెండు రంగుల ఆ రాత్రి. ఒక్కడై ఏడురూపములు పొందిన ఆ పురుషుడు సముద్రుడు అని తెలియదగును. ఏడు రూపములు పొందియు ఒక్కడైయున్నాడు. పన్నెండ్రు గానయి రెండు దేహములు, ఆరు శిరస్సులుగల ఆ ప్రభువు సంవత్సర పురుషుడు. రెండు దేహములు రెండుఅయనములు. ఆరుతలలు ఆరుఋతువులు. ఇతడే సంవత్సర పురుషుడు. ఆ ఆలుమగలు రాత్రిపగలు అనునవి. అవి చంద్రుడు, సూర్యుడు అనువాని రూపమున ఉండును. ఆ పరమేశ్వరునివలన జగత్తు ఏర్పడినది. ఆ పరమ దైవము విష్ణువని తెలియనగును. వేదసంబంధమగు క్రియలు లేనివానికి ఆ పరమేశ్వరుడు కానరాడు" అని తెలిపెను. (67)

68 వ అధ్యాయము - యుగాచార వర్ణనము

అనంతరము భద్రాశ్వుడు ఇట్లనెను. "ఓ మునీ! పరుడు, అపరుడు, సర్వగతుడు అయిన ఆ విష్ణుదేవుడు నాలుగు యుగములందు ఎట్టివాడు? ఆ పరమేశ్వరునెట్లు తెలిసికొనదగును. మునీ! ప్రతి యుగమునందు ఆయావర్ణముల వారి ఆచారమెట్టిది? ఇతర జాతుల స్త్రీలతో సంకర మేర్పడినపుడు విప్రులకు శుద్ధి ఎట్లగును?" అని ప్రశ్నింపగా అగస్త్యుడు రాజుతో "శ్రేష్ఠుడా! కృతయుగమున ఈ భూమిని దేవతలు వేదకర్మముతో అనుభవింతురు. త్రేతయందు అసురులు, దేవతలు యజ్ఞములు చేయుచు అనుభవింతురు. ద్వాపరమున సత్త్వరజస్సులు అతిశయముగా ఉండును. రాజు ధర్మమూర్తియై ఒప్పారును. అటుపై కలిరూపమున తమస్సు ఏర్పడును. ఆ కలియుగము రాగా బ్రాహ్మణుడు తన మార్గము నుండి భ్రష్టుడగును. రాజులు, వైశ్యులు, శూద్రులు తరచుగా జాతి భ్రష్టులగుదురు. సత్యము, శుద్ధియు లేనివారగుదురు. పొందరాని స్త్రీలను బ్రాహ్మణులు పొందుచుందురు, వేదమార్గము నుండి భ్రష్టులై అబద్ధములాడుచుందురు. తమ గోత్రములవారితో, ఈడుకాని వారితో వివాహముకూడ చేసికొనుచుందురు. ధనములందు లోభముగల మూఢులగు రాజులు బ్రహ్మజ్ఞాన సంపన్నులను హింసింతురు. శూద్రులు కూడా వర్తకవృత్తి యందు

ఆసక్తికలవారై వైశ్యవృత్తిని చేయుచుందురు. శూద్రజాతుల యందు గర్వితులై అభిమానము కలవారై ఉందురు. బ్రాహ్మణులు శౌచమును పాటింపక, సత్యమును వదలివైచి అన్ని విధముల తిండిని తినువారగుదురు. మద్యము సేవింపదగినదని నొక్కిపలుకుదురు. అంత లోకస్థితి చెడిపోవును. వర్ణధర్మము నశించును" అనగా మరల భద్రాశ్వుడిట్లు ప్రశ్నించెను. "పొందరాని స్త్రీని పొంది బ్రాహ్మణుడు, క్షత్రియుడు వైశ్యులు ,శూద్రుడు ఎట్లు శుద్ధి పొందును? పొందరానితనమెట్లు కలుగును? నాకు చెప్పుము"

అగస్త్యుడు ఇట్లు చెప్పెను."బ్రాహ్మణుడు నాలుగు వర్ణములవారిని, క్షత్రియుడు మూడు వర్ణములవారిని వైశ్యుడు రెండు వర్గముల వారిని, శూద్రుడు తనవర్ణము వారిని గమ్యలుగా (భార్యలు) భావింపవచ్చును. బ్రాహ్మణ స్త్రీ క్షత్రియునకు, క్షత్రియకాంత వైశ్యునకు, వైశ్యకాంత శూద్రునకు అగమ్య అని చెప్పుదురు. క్రింది కులమువానికి పైకులపు కాంత 'అగమ్య' అని మనువు చెప్పెను. రాజా! తల్లియు, తల్లి సోదరియు, అత్తయు, వదినయు, మరదలు కోడలును, కూతురు, మిత్రుని భార్య, తన గోత్రము నందలి కాంతయు, రాజపత్నియు, రాజుబిడ్డయు అగు స్త్రీలు ముఖ్యముగా మనుజునకు పొందరాని వారు. అట్లే వృత్తి పని చేయునట్టి చాకలి మున్నగు స్త్రీలు కూడ అగమ్యలు. ఈ అగమ్యాగమనము వలన పాపము కలుగును. బ్రాహ్మణుడు ఇతరస్త్రీని పొందినంత మాత్రమున బ్రాహ్మణత్వము నుండి భ్రష్టుడగును. ఇతరునకు నూరు ప్రాణాయామముల వలన శుద్ధి ఏర్పడును. పెక్కు కాలము నందు చేసిన పాపము వర్ణ సంకర సంబంధము, బ్రహ్మహత్య మున్నగు మహాపాపములన్నియు ప్రణవ పూర్వకమైన గాయత్రిని పదిమారులు చేయుట చేతను, మూడు నూర్ల ప్రాణాయామముల చేతను బ్రాహ్మణునకు నశించును. ఇతర పాతకముల సంగతి చెప్పనేల?

మరియును బ్రాహ్మణ శ్రేష్ఠుడు వేదములను అధ్యయనము చేయువాడై పరమాత్మ స్వరూపమును ఎరిగినచో వందలకొలది పాపముల నుండియు ముక్తుడగును"అని చెప్పెను. విష్ణువును స్మరించుచు, వేదమును పఠించుచు, దానమొసగుచు, హరిని పూజించుచు బ్రాహ్మణుడు శుద్ధుడగును. ఇతరుని కూడ తరింపజేయును. రాజా! నన్ను నీవడిగిన విషయమంతటిని నీకు చెప్పితిని. దీనినంతటిని మనువు మున్నగువారు విస్తరించి చెప్పుదురు. నేను నీకు సంగ్రహముగా చెప్పితిని. (68)

69 వ అధ్యాయము - అగస్త్యదేహమున జరిగిన ఆశ్చర్యకర వృత్తాంతము

మరల ఆ రాజగు భద్రాశ్వుడు ఇట్లనెను. "పూజ్యుడా! ద్విజశ్రేష్ఠుడా! నీ శరీరమున జరిగిన వింతయేమి? నీవు చిరంజీవివి ఎట్లయితివి? దీనిని నాకు చెప్పవలయును" అని ప్రార్థింపగా అగస్త్యుడు "రాజా! ఈ నా శరీరము పెక్కువింతలకు నిలయమైనది. పెక్కుకల్పములు వేదవిద్యలచేత శుద్ధి పొందినది. ఈ భూమినంతటిని తిరుగుచు నేను మేరువు ప్రక్కనున్న ఇలా వృత్తమను మహా వర్షమును చేరుకొంటిని. అచట అందమైన సరస్సును చూచితిని. దాని ఒడ్డున పెద్ద కుటీరమొకటి కలదు. దానియందు ఎముకలు, చర్మము మాత్రము మిగిలినవాడు, నారచీరలు ధరించినవాడును, ఉపవాసములచేత బడలినవాడగు ఆ తాపసుని కాంచితిని. అతనిని చూచి ఇతడెవరో ఇతనిని గురించి తెలిసికొన వలయును అనుకొంటిని. నేనిట్లు అనుకొనుచుండగా, ఆ మహాముని నాతో ఇట్లు పలికెను. "బ్రాహ్మణా! నిలువుము. నిలువుము. నేను నీకు ఆతిథ్యమును ఇవ్వవలయును." ఇది విని నే నాకుటీరములోని కరిగి చూడగా ఆతడు తేజస్సుతో వెలిగిపోవుచున్నట్లుండెను. నేలపై నిలబడిన నన్ను చూచి ఆ ద్విజుడు హుంకారము గావించెను. ఆ హుంకారము వలన పాతాళమును చీల్చుకొని అయిదుగురు కన్యలు పైకి వచ్చిరి. అందొకతె ఒక పీటను కొనివచ్చి నాకొసగెను. మరియొకతె చేతిలో నున్న నీటిని అందించెను. మరియొకతె ఆ నీటిని కైకొని నా పాదములను కడుగ మొదలిడెను. తక్కిన ఇద్దరు వీవనలు కొని నా ప్రక్కల నిలువబడిరి. మరల ఆ మహాతపస్వి హుంకార మొనరించెను. ఆ శబ్దముతో వెనువంటనే యోజనము వెడల్పుగల ఒక బంగారు దొన్నెతో, ఒక మొసలి సరస్సు నుండి పైకి వచ్చెను. దానియందు బంగారు కుండలు తాల్చిన చక్కని కన్యలు వందలకొలదిగా వచ్చిరి. ఆ దొన్నెను చూచి ఆ ముని నాతో ఇట్లనెను.

"బ్రాహ్మణా! ఇది యంతయు నీ స్నానము కొరకు ఏర్పాటు. నీవు ఈ దొన్నెలో ప్రవేశించి స్నానము చేయవచ్చును. ఆయన మాటపై నేనా దొన్నెలో దిగినంతలో అది మునిగిపోయెను. దొన్నెలోని నీట మునిగితి నన్నుకొన్న నేను పైకి లేచినంతనే ఒక అపూర్వమగు లోకమును కనుగొంటిని. అది మంచి భవనములు, గదులు, శాలలు కలదియు, విశాలమైనదియు, విశాలములగు రాచబాటలు కలదియు, పవిత్రులగు జనులతో నిండినదియు, గొప్ప నీతిమంతులు, ఆత్మవేత్తలు, పురాణులు, ధర్మమార్గమున

నెలకొన్న వారునగు నరులతో కూడినదిగా ఉండెను. అంతేకాక కదలాడు చర్యలు గల పరిఘలతో భయంకరమైనదియు, మిక్కిలి లోతైన పాతాళతలమున ఉన్నదియు, శ్రేష్ఠమైనదియు మేలైన పాశములు చేతదాల్చిన తెల్లని నరులతో, ఏనుగుల గుఱ్ఱముల మందలతో కూడినదియునై ఉండెను. అందమైన పద్మములు, కలువలు కలవి, పెక్కు విధములైన పక్షులు కలవియు, పద్మ పత్రముల మీదనున్న తుమ్మెదల నాదములతో అనేక లయలతో పాడుచున్నవో అన్నట్లున్న సరస్సులు అందుండెను. అందు కైలాసము శిఖరములను పోలునట్టివియు, పెక్కురత్నముల కలువల గుంపులు కలవియు, వేద పండితులగు విప్రులు నివసించు నట్టివియు, పుణ్యాత్ములు నివసించు నట్టివియు అగు గృహములు ఆ సరస్సుల తీరమునందు కలవు. తుమ్మెదలతో వంగిన పద్మములు అందు కదలాడుచున్నవి. వాని బరువులతో అవి ఎల్లప్పుడు ఊగుచున్నవి. ఆ సరస్సుల జలములందు చక్కని స్వరములు గల పక్షిజాతులు వేదమునందలి విచిత్ర మంత్రములను పలుకుచున్నవి. తెల్లని పద్మముల మాలలతో గాత్రములు కలవియు పక్షుల పంక్తులే ఉత్తరీయములుగా కలవియు, బ్రాహ్మణులు పురాతనములగు యజ్ఞక్రియల మంత్రములను చదువుచున్నతీరుగలవియునగు పెక్కు కొలనులు అందున్నవి. నేనా సరస్సులలో తిరుగుచు దేవతల, విద్యాధరుల కాంతలను స్నానము కొరకు ఆ ప్రదేశమునకు వచ్చిన వారిని గాంచితిని. ఆ విధముగా తిరుగుచు ఒకప్పుడు మంచి నీరు గల చక్కని కొలనును చూచితిని. దాని ఒడ్డున మొదట చూచిన కుటీరమును మునుపటి వలెనే చూచితిని. ఆ కుటీరమును ప్రవేశించి ఒకవైపున కూర్చున్న ఆ తపస్విని చూచి దగ్గరకు చేరి పలుకునంతలో నవ్వుచు, సాటిలేని ప్రభావముగల ఆ మహానుభావుడు ఇట్లు పలికెను. "విప్రా! మునుపు చూచిన నన్ను ఎరుగవా? మూఢుని వలె ఈ లోకమును చూచుచున్నావు. దేవతలు కూడ చూడజాలని నా భువనమును నీవు కనుగొంటివి. ద్విజోత్తమా! నీ ప్రియము కొరకు నీకీ లోకమును చూపితిని. మహామునీ! నా లోకపు సంపదను కనుగొనుము. అందు పెరుగుతో పాలతో ప్రవహించు నదులు, నేతితో నిండిన పెద్ద చెరువులు కలవు. హేమరత్నమయములైన స్తంభములు గల గృహములు కలదియు రత్నములతో కూర్చినదియు, పద్మరాగములకెనయగు కాంతి కలదియు, పారిజాత పుష్పములతో ప్రసిద్ధి కెక్కినదియు, యక్షకిన్నరులు సేవించుచున్నదియు అగు ఈ భూమిని చూడుము",

అని ఆ తాపసుడట్లు పలుకగా, రాజా! అచ్చెరువు నిండిన హృదయముతో అతను ఇట్లడిగితిని. "స్వామీ! నేను బ్రహ్మ. ఇంద్రుడు మున్నగువారుండు లోకములన్నీ చూచితిని. నీ లోకము ఆ అన్నింటికంటె ఉత్తమముగా నున్నది. తపోధనా! ఈ లోకము అపూర్వముగా నాకు కన్పట్టుచున్నది. సంపద, ఐశ్వర్యము, తేజస్సు, భవనములు, సముదాయములు, మంచినీరుగల పుణ్యవంతములగు సరస్సులు అనువానిచేత మిక్కిలి అద్భుతముగా నున్న దీనిని కనుగొంటిని. ఇటువంటి లోకమెట్లేర్పడినది? ఇందులో నీవెవరవు? దీనికి కారణమేమి? మునిపుంగవా! నాకెరుగ జెప్పుము. మహామునీ! ఇలావృతవర్షమున సరస్సు తీరమున నేను నిన్ను దర్శించుకుంటిని. ఆ సరస్సేమి? ఆ కుటీరమేమి? బంగారు గృహములు నిండిన ఈ లోకమున ఈ కుటీరమేమి? ఈ స్థానమేమి?" నేనిట్లనగా ఆ భగవానుడు నాకు చెప్పిన దానిని ఉన్నదున్నట్లు చెప్పేదను రాజేంద్రా! వినుము.

"నేను సనాతనుడు, జలరూపమున ఉన్నవాడగు నారాయణుడను. చరాచర రూపమైన మూడు లోకముల విశ్వమంతటిని ఆవరించి ఉన్నాను. పరమేష్ఠియగు ఆ దేవుని నీవు కాచిన ఆకారమును కూడా నేనే. నన్ను వరుణుడు అందురు. స్వయముగా అతడును పరుడైన నారాయణుడే. నీవు నన్ను ఏడు జన్మములు ఆరాధించితివి. అందుచేత మూడు లోకములు నశించినను నీవొక్కడవు గుర్తింపబడితివి" అని ఆ నారాయణుడు అట్లు పలుకగా నేను నిద్రతో మూసికొన్న కన్నులు కలవాడనై నేలపై పడి వెనువెంటనే లేచితిని. ఆ ఋషిని ఆ పురమును కనుగొనునంతలో మేరుగిరి శిఖరమున నన్ను నేను చూచుకొంటిని. ఏడు సముద్రములను, ఏడు కులపర్వతములను, ఏడు ద్వీపములు గల పుడిమిని కాంచితిని. నేటివరకును ఆ లోకమునే ధ్యానించుచు నిలిచితిని. ఆ లోకమును ఎప్పుడు పొందుదునా? అన్న చింతయే నాకున్నది. రాజా! నీ వేడుకను బట్టి నా దేహమున సంభవించిన పరమేష్ఠి వృత్తమును చెప్పితిని. ఇంకను నీవేది వినగోరుచున్నావు" అని అగస్త్యుడు రాజుతో చెప్పాడు. (69)

70 వ అధ్యాయము - త్రిమూర్తుల ఏకత్వ భావన

రాజు మరల "మునీ! నీవు ఆ అద్భుత లోకమును గాంచుటకు ఏ వ్రతమును, ఎట్టి తపమును, ఏ ధర్మమును చేసితివి? అని ప్రశ్నింపగా అగస్త్యుడు ఇట్లు చెప్పెను. హరిని

ఆరాధింపక లోకములను కోరెడు బుధుడెవ్వడుండును? హరిని ఆరాధించినచో సర్వలోకములు అరచేతి యందుండును. ఇట్లని చక్కగా ఆలోచించి నేను నూరేండ్లు గొప్ప దక్షిణలుగల యజ్ఞములతో సనాతనుడు అగు విష్ణుని ఆరాధించితిని. అంత నొకప్పుడు పెక్కుకాలము నేను యజ్ఞమూర్తి, దేవదేవుడు అగు జనార్ధనుని ఆరాధించుచుండగా నా పిలుపు మేరకు దేవేంద్రునితో పాటు దేవతలు విచ్చేసిరి. దేవేంద్రునితోపాటు దేవతలందరు తమతమ స్థానములందుండగా అంతలో అచటికి భగవంతుడు వృషభధ్వజుడు (శివుడు) ఏతెంచెను. మహాదేవుడు, విరూపాక్షుడు, ముక్కంటి, నీలలోహితుడు అగు పరమేశ్వరుడు రౌద్ర స్థానమున నిలిచియుండెను.

దేవతలు, ఋషి ముఖ్యులు మొదలగువారందరు రాగా వారినిగాంచి మహాయోగియు, త్రికాలజ్ఞుడు, పద్మసంభవుడునగు సనత్కుమారుడు సూర్యునివంటి విమానమున చిన్నరేణువు వంటి ఆకారముతో నిలిచి కానవచ్చెను. వచ్చి ఆ మహాముని రుద్రునకు శిరస్సువంచి ప్రణమిల్లెను. నేను ప్రణామము చేయగా శూలపాణి సమీపమున నిలిచి ఉండెను. అట్లు అచ్చటయున్న దేవతలను, నారదుడు మున్నగు ఋషులను, సనత్కుమారుని, రుద్రుని చూచిన నా మనసున ఒక ప్రశ్న ఉదయించెను "వీరిలో ఎవరు పూజింపదగినవారు? ఎవడు అందరికంటె గొప్పవాడు? ఎవరు తుష్టినందినచో ఈ రుద్రునితో కూడిన సర్వులును తుష్టినందుదురు? నేను, "దేవతలారా! మీకు వీరిలో పూజనీయుడు ఎవరు?" అని రుద్రునివైపు తిరిగి అడిగితిని. నేనిట్లు పలుకగా అంత రుద్రుడు దేవతలతో ఇట్లనెను. "దేవతలారా! నిర్మలులైన దేవర్షులారా! ప్రసిద్ధికెక్కిన బ్రహ్మర్షులారా! మీరు నామాట నాలకింపుడు. ఓ మహామతీ! అగస్త్యా! నీవు కూడ నామాట వినుము. ఎవ్వడు సర్వయజ్ఞములచే యజింపబడునో, ఎవని వలన ఈ జగమంతయు దేవతలతోపాటుగా పుట్టుచున్నదో, ఎల్లప్పుడు ఎవని యందు నిలిచి యుండునో, ఎవని యందు లీనమగుచున్నదో ఆ పరదైవము సత్వరూపుడు, జనార్దనుడగు నారాయణుడే. ఆ పరమేశ్వరుడే తన్నుదాను మూడు రూపములుగా సృష్టిచేసెను. రజస్సు తమస్సులతో కూడినవాడై ఆ విభుడు రజఃసత్త్వము లధికముగా గల బ్రహ్మను, కమలము ఆసనముగా గలవానిని బొడ్డుతామర యందు సృజించెను. రజస్సుతో, తమస్సుతో కూడినవాడై ఆతడే నన్నును పుట్టించెను. సత్వగుణమే ఆ హరి. హరియే పరమ పదము. సత్వ రజస్సుల

స్వరూపమై కమలమునందు పుట్టిన బ్రహ్మయే ఆ దైవము. ఆ దేవుడే బ్రహ్మ. రజస్తమస్సులతో కూడిన స్వరూపమగు నేనును అతడే. ఇందు సందియము లేదు. సత్వము, రజస్సు, తమస్సు, ఇది యంతయు ఈ మూడింటి సముదాయమే. సత్వగుణము చేత జీవుడు ముక్తుడగును. సత్వము నారాయణాత్మకము. సత్వముతో కూడిన రజోగుణముచేత రజస్సు అధికముగా గల సృష్టి ఏర్పడును. అది పితామహుడగు బ్రహ్మకు సంబంధించినదై ఏర్పడినదని అన్ని శాస్త్రములును ఘోషించుచున్నవి. వేదములకు వెలి అయిన కర్మము, శాస్త్రములను బట్టి చేయునది రౌద్రమని ప్రసిద్ధికెక్కినది. అది నాకు సంబంధించినది, అని కనిష్ఠమని, హీనమైనదని చెప్పుదురు. రజస్సులేని కర్మము కేవలము తామసము. అది నరులకు ఇహము నందును, పరము నందును దుర్గతిని కలిగించును. సత్వగుణము చేత జీవికి ముక్తి కలుగును. సత్వము నారాయణాత్మకము. యజ్ఞరూపుడగు నారాయణుడే భగవానుడు.

కృతయుగమున శుద్ధుడు, సూక్ష్మరూపుడునగు నారాయణుని ఉపాసింతురు. త్రేతా యుగమునయజ్ఞ రూపముతో అర్చింతురు. ద్వాపరమున పంచరాత్రులు ఉపాసింతురు. కలియందు నేను చూపిన మార్గముతో బహురూపములతో తామసులు, ద్వేషబుద్ధితో జనార్దనుడగు పరమాత్మను కొలుతురు. ఆతని కంటె పరదైవము మరియొకటి లేదు. ఉండబోదు. ఆ విష్ణువే స్వయముగా బ్రహ్మ. ఆ బ్రహ్మయే స్వయముగా నేను, మూడు వేదములందును, యజ్ఞము నందును, పూజ్యత విషయమున ఇదియే నిశ్చయము. మా ముప్వురిలో భేదమును భావించువాడు పాపకారి, దుష్టాత్ముడు. వాడు దుర్గతిని పొందును. అగస్త్యా! నేను చెప్పెడి దీనిని కూడ వినుము. ముందుగా కలియందు మానవులు ఎట్లు హరిభక్తి చేయకుండిరో తెలిపెదను. పూర్వము భూలోక వాసులందరు జనార్ధనుని పూజించి, భువర్లోకమును పొందుచుండిరి. అందుండియు కేశవు నారాధించి స్వర్గమును, అచటినుండి క్రమముగ ముక్తిని పొందుచుండిరి. ఇట్లు సర్వలోకముల వారును ముక్తిపదమున వ్యాపింపగా అంతకుముందు ముక్తిని పొందిన దేవతలందరు చిత్తశుద్ధితో ఆ హరిని ధ్యానించిరి. సనాతనుడగు ఆతడును అంతట ఉండువాడు కనుక వారికి ప్రత్యక్షమై, "యోగివరులారా! సురులారా! పనియేమి?" చెప్పుడని పలికెను. వారా దేవదేవునకు ప్రణమిల్లి పరమేశ్వరునితో ఇట్లనిరి. "దేవదేవా! జనమంతయు ముక్తిమార్గమున

నిలిచిపోయినది. ఇక సృష్టిసాగుట యెట్లు? నరకములందు ఎవరుందురు?" వారట్లు పలుకగా వారిని ఉద్దేశించి జనార్దనుడిట్లు పలికెను : "మూడు యుగములలో పెక్కండ్రు మానవులు నన్ను పొందెదరు. చివరి యుగమున చాల తక్కువగా జనులు నన్ను ఆశ్రయింతురు. ఇదిగో మోహమును సృజించుచున్నాను. అది జనులను మోహ పెట్టును. మహాబాహూ! రుద్రా! నీవును మోహము గొలుపు శాస్త్రములను చేయింపుము. తక్కువ శ్రమ, ఎక్కువ ఫలమును ప్రదర్శింపుము. వంచనను, ఇంద్రజాలములను, విరుద్ధాచారములను చూపి జనులను వెంటనే మోహపెట్టుము".ఇట్లు పలికి ఆ పరమేష్ఠి ఆ దేవుడు తన స్వరూపమును గుట్టుపరచెను. నన్నందరు తెలసికొనునట్లు చేసెను. అది మొదలుకొని నేను రచించిన శాస్త్రములందులోకము ఎక్కువగా రుచి కలది ఆయెను. వేదము ననుసరించు మార్గమును, నారాయణదేవుని ఏకభావముతో చూచువారు ముక్తిని పొందు వారగుచున్నారు. నన్ను, బ్రహ్మను విష్ణువు కంటె వేరుగా తలచువారు పాపకర్ములై నరకమున కరుగుదురు. వేద మార్గమును వదలి వైచినవారిని మోహపెట్టుటకే నేను 'నయ సిద్ధాంతమను' పేరుగల శాస్త్రమును చూపితిని. ఈ పశుభావమే పాశము. అది ఎప్పుడు పతనమైనదో అప్పుడు పాశుపతమను శాస్త్రము వేదము పేరిట పుట్టును. విప్రా! నేను వేదమూర్తిని. ఇతర శాస్త్రముల అర్థములను తర్కించువారికి నా స్వరూపము తెలియరాదు. అనాదియగు వేదమును వదలి నన్నెరుగరాదు. ఓయి బ్రహ్మర్షీ! నేను విశేషముగా బ్రహ్మజ్ఞాన సంపన్నులకు, వేదములకు మాత్రమే ఎరుగదగువాడను.

యుగములు మూడు;విప్రా! నేను, బ్రహ్మ,విష్ణువు–ముప్వురము. సత్వాది గుణములు మూడు, వేదములయందు అగ్నులు మూడు, లోకములుమూడు. సంధ్యలు మూడు. వర్ణములుమూడు. సవనములును మూడు. ఈ జగత్తంతయు ఈ మూడిటితో బంధింపబడినది. 1. యుగములు – కృత, త్రేతా, ద్వాపరములు 2. గుణములు – సత్త్వము, రజస్సు, తమస్సు 3. వేదములు – ఋక్కు, యజస్సు, సామము 4. అగ్నులు – ఆహవనీయము, గార్హపత్యము, దక్షిణ 5. లోకములు – భూలోకము, భువర్లోకము, స్వరోకము 6. సంధ్యలు – ప్రాతస్సంధ్య, మధ్యాహ్న సంధ్య. సాయం సంధ్య 7. వర్ణములు – బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య వర్ణములు, 8. సవనములు – ప్రాతస్సవనము, మధ్యాహ్న సవనము, సాయం సవనము. బ్రహ్మర్షీ! పరుడైన నారాయణుడు, బ్రహ్మ, నేను గుణములను

బట్టి ముప్పురము కాని ప్రధానముగా ఒక్కటే. ఇట్లు కాక భిన్నముగా చూచుట మోహమే". (70)

71 వ అధ్యాయము – పాశుపతవ్రత ఆవిర్భావ కారణకథ

ఇంకను అగస్త్యుడు రాజుతో "ఆ పినాకి ఇట్లు చెప్పగా దేవతలు, ఋషులు, నేనును ఆ దేవునకు ప్రణమిల్లితిమి. శిరస్సుతో ప్రణమిల్లి ఆ దేవుని చూచునంతలో ఆతని దేహమున ఉన్న బ్రహ్మను హృదయమున సన్నని దుమ్ము కణమంత సూక్ష్మరూపుడగు నారాయణుని కనుగొంటిమి. ఆ నారాయణుడు జ్వలించుచున్న సూర్యుని వన్నెతో ప్రకాశించుచుండెను. అతనిని దర్శించుకొని అందరు విస్మితులై యాజకులగు ఋషులందరు సామము, ఋక్కు యజుస్సులతో జయ జయధ్వనులను గావించి, ఆ దేవునితో ఇట్లనిరి. "పరమేశ్వరా! ఇదియేమి? నీ ఒక్కమూర్తి యందే త్రిమూర్తులును గానవచ్చుచున్నారు" అని పల్కిరి.

"ఓ మేధావులారా! ఈ యజ్ఞము నందు మహర్షులు నన్ను ఉద్దేశించి దేనిని హుతము చేయుదురో, దానిని మేము ముప్పురమును గ్రహింతుము. మునివరులారా! మాకు వేర్వేరు భావములు లేవు. చక్కని చూపుగలవారు దీనిని దర్శింతురు, ఇతరులకు వేర్వేరుగా కనిపిస్తాము" అని రుద్రుడిట్లు పలుకగా ఆ మునులందరు శంకరుని మన ప్రయోజనమును గూర్చి ఇట్లడిగిరి. "దేవా! లోకములను మోహ పెట్టుటకై నీవు ఒక శాస్త్రమును చేసితివి. అది చేయుటకు కారణమేమి? మాకు చెప్పుము."

భారతవర్షమున దండకమను వనము కలదు. అందు గౌతముడు అను బ్రాహ్మణుడు ఘోరమగు తపమొనరించెను. బ్రహ్మ దానికి నిండు సంతోషము పొంది ఆ మునితో "తపోధనా! వరము కోరుకొను"మని పలికెను. లోకములకు కర్తయగు బ్రహ్మ అట్లు పలుకగా అతడు 'పద్మసంభవా! నాకు వెను వెంటనే కొన్ని ధాన్యపు గింజల నొసగుము' అని పలికెను. ఇట్లనగా బ్రహ్మ ఆతడు కోరిన వరమునిచ్చెను. అతడును ఆ వరమును కైకొని శతశృంగమున ఒక పెద్ద ఆశ్రమమును నిర్మించుకొనెను. అందు ఆ ధాన్యపుగింజలు ఉషః కాలమున మొలకెత్తి మధ్యాహ్నమునకు పండుచుండగా వానితో ఆ విప్రుడు బాహ్మణులకు తగినంత ఆతిథ్యము చేయుచుండెను. అంత కొంతకాలమునకు ఒడలికి గగుర్పాటు కలిగించు కరువు ఏర్పడినది. పంద్రెండేండ్ల పెనుకరవుతో (అనావృష్టి)

ఆ దండకమున ఉన్న మహర్షులందరు ఆ అనావృష్టిని చూచి దప్పికతో బాధపడుచున్నవారై గౌతముని కడకరిగిరి. అట్లు వచ్చిన వారిని గాంచి గౌతముడు శిరసు వంచి మ్రొక్కి, ఓ మునివర పుత్రులారా! మీరందరు మాయింట నిలువుడని పలికెను. అట్లు పలుకగా వారందరు ఆ కరవంతయు పూర్తిగా పోవువరకు అతని ఆశ్రమము నందే భుజించుచు నిలిచిపోయిరి. ఆకరవు క్షీణించిపోగా, ఆ బ్రాహ్మణులందరు తీర్థయాత్రపై మనసు పెట్టిరి. అచట మారీచుడను పరమ ముని శాండిల్యుడను మునిసత్తముని చూచి చక్కగా ఆలోచించి యిట్లు పలికెను.

"శాండిల్యా! నీకొక మంచిమాట చెప్పెదను. నీ తండ్రి గౌతమ మహర్షి. అతనికి చెప్పక మనము తపోవనమునకు తపమాచరించుటకు పోజాలము. అట్లు పలుకగా ఆ మునులందరు నవ్విరి ఏమయ్యా! ఈయన అన్నము తిన్నంత మాత్రమున మనము మన దేహములను అమ్మితిమా! ఏమి?" ఇట్లు పలికి మరల అట నుండి వెడలిపోవుటకొక నిమిత్తమును ఆలోచించిరి. ఒక మాయ గోవును సృజించి ఆ శాలయందు వదలిరి. అంత ఆ గోవును చూచి, గౌతమముని చేతియందు నీటిని గ్రహించి 'రుద్రా! పొమ్ము' అని పలికెను. అపుడు మాయామయి అగు ఆ ఆవు నీటి బిందువులతో అట క్రిందపడెను. చనిపోయిన ఆ ఆవును, వెడల గోరుచున్న ఆ మునులను గాంచి నమస్కరించి ఆ గౌతముడిట్లు పలికెను. "విప్రులారా! మీయందు భక్తుడను. విశేషించి మీకు మ్రొక్కిన వాడనగు నన్ను వదలి మీరేల పోవలయును. చెప్పుడు ఆలసింపకుడు". అందులకు వారు "బ్రాహ్మణా! నీ దేహమందు ఈ గోహత్యా పాపమున్నంత వరకు నీ అన్నమును మేము తినము" అని ఆరు అట్లనగా ధర్మమెరిగిన గౌతముడు ఆ మునులతో ఓ తపోధనులారా! ఈ గోవధకు ప్రాయశ్చిత్తమును సెలవిండు– అని పలికెను.

"ఆ గోవు అమృతస్వరూప. మూర్ఛల్లినదివలె ఉన్నది. గంగాజలమున మునిగినచో ఇది లేచును. సంశయము లేదు. మరణించినదానికి ప్రాయశ్చిత్తము. చావని దానికి ఈ మాత్రము వ్రతము చాలును. కోపము చేయకుము" అని పలికి వారు వెడలిపోయిరి. వారు వెడలిపోగా బుద్ధిశాలియగు గౌతముడు హిమవంతమను మహాగిరికి నాన్నారాధించుటకును, గొప్పతపము చేయుటకును అరిగెను. ఒక నూరేండ్లు నన్నారాధించెను. నేను తుష్టి చెంది సువ్రతుడా! వరమును కోరుకొమ్మంటిని. అతడు నాతో

ఇట్లనెను. నీజటలలో ఉన్న తపస్విని ఈ గంగను నాకిమ్ము. ఈ పుణ్య భాగీరథి నాతోపాటు వచ్చుగాక! అతడిట్లు పలుకగా శివుడు ఒక జడముక్క నొకదాన్ని ఒసగెను. దానిని కైకొని ఆతడును చచ్చిపడియున్న గోవున్న చోటి కరిగెను. ఆ నీటితో తడిసిన వెనువెంటనే ఆ గోవులేచి స్త్రీయై అరిగెను. అచట పుణ్య జలములు, పవిత్రములను పడియలుగల ఒక్క పెద్దనది యేర్పడెను. ఆ గొప్ప అద్భుతమును గాంచి పవిత్రులైన సప్తమహర్షులు ఆకాశమున విమానము నందున్న వారై మేలు మేలని పలుకుచు వచ్చిరి. "గౌతమ! మేలు. మంచివారిలో నీకు సాటియగు వాడెవ్వడు? ఈ జాహ్నవీ దేవిని దండకమను పేరు గల ఈ మహారణ్యమున అవతరింపజేసితివి".

అని వారట్లు పలుకగా గౌతముడు ఇదియేమి. నాకీ గోహత్యా పాపమెట్లు కలిగించెనని పరికించెను. అది అంతయు ఋషుల మాయచేత కలిగెనని తెలిసికొని మీరందరు జడులు. బూడిద, తప్పుడు వ్రతములు తాల్చినవారు, వేదములకు వెలియైనవారు, వేదకర్మముల నుండి భ్రష్టులైనవారు అగుదని శపించెను. మహామునియగు ఆ గౌతముని క్రూరవచనము విని సప్తర్షులు ఇట్లనిరి : ఉత్తమ బ్రాహ్మణులు సర్వకాలములందు ఇట్లు కాకుందురుగాక! నీ పలుకు పొల్లును కారాదు. సంశయము లేదు. ఈ బ్రాహ్మణ శ్రేష్ఠులందరు ఉపకారము చేసిన నీయందు అపకారము చేయు వారైనను, నీయందు భక్తి కలవారు. నీ మాటల నిప్పులో బూదియై కలియుగమున బ్రాహ్మణులు క్రియాహీనులు, వేదకర్మముల నుండి వెలిపడినవారు అగుదురు. 'గోవుదత్త' వరదానము వలన అను అర్థముతో ఈ నది గోదావరియగును. ఈనది కడకు వచ్చి గోవును దానమిచ్చినవారు, ఇతర దానముల నొసగినవారు దేవతలతోపాటు మోదమును పొందుదురు. గురువు సింహరాశి యందు ఉన్నప్పుడు శ్రద్ధ గలవాడై ఈ నది కరిగి విధి పూర్వకంగా స్నానముచేసి పితృదేవతలకు తర్పణము చేయువాని పితరులు నరకమున పడినవారైనను స్వర్గమున కరుగుదురు. స్వర్గమునందున్న పితృదేవతలు ముక్తి పొందుదురు ఇందు సందియము లేదు. నీవును గొప్పకీర్తిని పొంది, శాశ్వత ముక్తిని పొందెదవు." అని ఆ మునులు, నేను, ఉమాదేవితో పాటు శాశ్వతముగా నుండు కైలాసపర్వతమున కేగితిమి. ఆ బ్రాహ్మణ శ్రేష్ఠులైన మునులు నాతో నిట్లనిరి.

"కలియందు వీరందరు నీవంటి రూపమునే కిరీటముగా ధరించువారు, ఇచ్ఛ ననుసరించి ప్రేతవేషమును తాల్చువారు, మాయ లింగములు ధరించువారును అగుదురు. ఆ విధముగా కలిచేత పీడింపబడు మా వంశము వారందరిని అనుగ్రహించుట కొరకు ఏదేని శాస్త్రమును దయతో తామొసగవలయును".

ఇట్లు వారు ప్రశ్నింపగా, "ఓ బ్రాహ్మణోత్తములారా! వేదక్రియలతో కూడిన 'నిఃశ్వాస' అను ఒక సంహితను చేసితిని. దానియందు బాభ్రవ్యులు, శాండిలులు ఆరితేరిన వారైరి. అల్పారాధన వల్ల విని, చదివిన వారు డాంబికులు అయ్యారు. భవిష్యత్తు ఎరిగిన నేను బ్రాహ్మణులను మోహపెట్టితిని. కలియందు లోభము కలవారు శాస్త్రములను నిర్మింతురు. నిఃశ్వాస సంహిత లక్ష శ్లోకముల ప్రమాణము కలది. అదియే పాశుపత దీక్ష, దానినే పాశుపత యోగమందురు. ఈ వేద మార్గము కంటే వేరైనది క్షుద్ర కర్మముగా తెలియదగినది. అది రౌద్రము. శుద్ధి లేనిది. డాంబికులగు నరులు రుద్రునాశ్రయించి బ్రతుకువారు, చంచల స్వభావులు తమ శాస్త్రములను వేరుగా వ్రాసికొను చుందురు. అట్టివారిని ఉచ్ఛుష్మరుద్రులందురు. నేను వారియందు నిలువను.

పూర్వము దేవకార్యం కోసం భైరవ స్వరూపముతో నేను నర్తనము చేసితిని. ఇది క్రూరకర్ములకు నాతో సంబంధము. మునుపు దైత్యులను నాశమొందించు కోరికతో నేను అట్టహాసము చేసితిని. అప్పుడు లెక్కపెట్టరాని కన్నీటి బిందువులు పడినవి. అవియే భూతలమున రౌద్ర స్వరూపములగును. ఉచ్ఛుష్మ పద్ధతియందు ఆసక్తి కల రుద్ర సంబంధులు మద్యమాంసముల యందు ప్రీతి కలవారు, స్త్రీలోలురు, పాపకర్ములు అయి భూలోకమున జన్మించిరి. గౌతముని శాపము వలన వారి కులమున బ్రాహ్మణులు జన్మింతురు.

వారిలో సదాచారులు నా శాసనమున ప్రీతికల వారగుదురు. బైడాలికులు స్వర్గమా, మోక్షమా అను సంశయము వలన నా సంతానమును చెరచు వారగుదురు. ముందు నామాట మీద గౌతముని శాపాగ్నిచే దగ్ధులైన బ్రాహ్మణులు నరకమున కరుగుదురు. ఇందు విచారణ చేయనక్కర లేదు. నేనిట్లు చెప్పగా ఆ బ్రహ్మపుత్రులు తమతావున కరిగిరి. పరంతపుడగు గౌతముడును తన గృహమున కరిగెను, విప్రులారా!

మీకు ధర్మము లక్షణమును చెప్పితిని. దీనికంటే విపరీతముగా ప్రవర్తించువాడు పాషండుల యందు ఆసక్తి కలవాడగును. (71)

72 వ అధ్యాయము - త్రిమూర్తులకు అభేదమును ప్రతిపాదించుట

వరాహస్వామి ఇలా చెప్పారు. సర్వజ్ఞుడు, సర్వకర్త, భవుడు, పురాతనుడు, రుద్రుడగు పరమేశ్వరునికి ప్రణమిల్లి అగస్త్యుడు శ్రద్ధతో ఇట్లడిగెను. "మూడుకన్నుల దేవరా! నీవు బ్రహ్మయును, విష్ణువును, ఈ ముువ్వురును సర్వశాస్త్రముల యందును, అంతటా త్రిమూర్తులుగా ప్రఖ్యాతులు. ఒక దీపము నందలి అగ్ని పెక్కు దీపములను వెలిగించునట్లుండువారు. అందు తమ ప్రధానత ఎప్పుడు? విష్ణువెప్పుడు ప్రధానుడు? బ్రహ్మ ఎప్పుడు? దీనిని నాకు తెలియజెప్పుము" అనగా రుద్రుడు ఇట్లు అనెను.

విష్ణువే పరబ్రహ్మము. వేదసిద్ధాంత మార్గములు దీనినే చెప్పుచున్నవి. అదియే మూడు భేదములను పొందుచున్నది. అజ్ఞానులు దీనిని ఎరుగకున్నారు. 'విశ' అను ధాతువునకు ప్రవేశించుట అని అర్థము. దానికి 'ష్ణు' అను ప్రత్యయము చేరగా "విష్ణు" అను రూపమేర్పడినది. సర్వదేవులయందు ప్రవేశించు సనాతనుడగు పరమాత్మయే విష్ణువు. ఈ విష్ణువే పదునొకండు రూపములుగా చెప్పబడుచున్నప్పుడు యోగము ఐశ్వర్యము, అను లక్షణములతో కూడినవాడై ఆదిత్యుడగుచున్నాడు. ఆ పరమేశ్వరుడే ఎల్లవేళల దేవకార్యములను చేయుచుండును. ప్రతియుగము నందును లోకమార్గములను చక్కగా సాగించుటకు, దేవకార్యములను నెరవేర్చుటకు, మనుష్య భావమును పొంది నన్ను స్తుతించుచుండును. ప్రతి ద్వాపరయుగము నందును నేనాతనికి వరములిచ్చువాడను, కృతయుగమున శ్వేతద్వీపమున నేనాతనిని స్తుతించుచుందును.

సృష్టికాలమున నేను నలుమోముల దేవరను స్తుతింతును. నేను కాలుడ నగుదును. కృతయుగమున బ్రహ్మయు, దేవతలు, రాక్షసులు నన్నెప్పుడు స్తుతింతురు. భోగములను కోరెడు దేవతలు లింగమే మూర్తిగాగల నన్ను పూజింతురు. ముక్తి కోరువారు మనస్సుల వేయి శిరస్సులు కల దేవుని అర్చింతురు. అతడే విశ్వాత్ముడు. దేవుడు అగు నారాయణుడు. బ్రాహ్మణోత్తములు నిత్యము బ్రహ్మయజ్ఞముతో పూజించుచు బ్రహ్మను ప్రీతుని గావింతురు. బ్రహ్మ అనగా వేదమే. నారాయణుడు, శివుడు, విష్ణువు, శంకరుడు, పురుషోత్తముడు – అను ఈ పేరులన్నియు సనాతనుడగు పరబ్రహ్మమునే చెప్పును.

మేధావులు ఇట్టి దానిని ధ్యానమయ యోగమని వక్కాణింతురు. యజ్ఞమునందు పశువులను వ్రేల్చు హోమకర్మమున 'ఓమ్' అని ప్రసిద్ధమైన దానియందు నేను చక్కగా నెలకొని ఉందును. కర్మములకై వేదములను ఉపయోగించువారికి బ్రహ్మ, విష్ణువు, మహేశ్వరుడు అను మేము ముప్పురము మంత్రముల తొలి వర్ణములము. ఇందులో ఆలోచించవలసినది లేదు. నేనును విష్ణువును, బ్రహ్మయును మేమే వేదములము, కర్మములము. ఇవన్నియు ఒక్కటియే. బుద్ధిమంతుడు వేరుగా భావింపరాదు. పక్షపాతము చేత ఎవ్వడైననుగాని వీనిని వేర్వేరుగా భావించునేని ఆ పాప పురుషుడు ఘోరమైన రౌరవమను నరకమున కరుగును. ఉత్తమా! నేనును, బ్రహ్మయును, విష్ణువును, వరుసగా ఋక్కు, యజుస్సు, సామములము, ఎవ్వరికిని దీనియందు సందేహము ఉండరాదు. (72)

73 వ అధ్యాయము – రుద్రకృతవిష్ణుస్తుతి, అభేదప్రకటనము

రుద్రుడు ఇట్లు అనెను. "మునివరా! వేడుకగొలుపు ఒక వృత్తాంతమును వినుము. నేను నీట మునిగినపుడు ఒక అపూర్వ సంఘటన సంభవించినది. మొదట బ్రహ్మ నన్ను సృజించి ప్రజలను సృష్టి చేయుమని నాతో పలికెను. అదియెట్లో తెలియక, సమర్థత లేని నేను నీ మునిగి ఉంటిని. చెదరని మనస్సు కలవాడనై, బొటన వేలంత పురుషుడగు పరమేశ్వరుని ధ్యానించుచు నేనచట క్షణకాలము నిలిచితిని. ఇంతలో ప్రళయాగ్ని వంటి కాంతులుగల పురుషులు పదునొకండ్రు ఆ జలముల నుడికించుచు పైకి లేచిరి. "అయ్యా! నీటి నుండి లేచి తేజస్సుతో ఈ జలమును తపింపజేయుచున్న మీరెవ్వరు? ఎక్కడి కేగుచున్నారు? చెప్పుడు?" అని నేను వారి నడిగితిని. నేనిట్లనగా వారు ఏమియు పలుకకుండిరి. ఊరక ఆ పురుషులు వెడలిపోయిరి. అంత వారి వెనుక ఒక మహాపురుషుడు, పరమ సుందరుడు, మేఘము వంటి వన్నెకలవాడు, పద్మములకు ఈడైన కన్నులు కలవాడు కానవచ్చెను. "ఓ మహాపురుషా! నీవెవరు? ఆ వెడలిన పురుషులెవ్వరు? ఇచట మీ పనియేమి? నాకు చెప్పుము" అని అతని నడిగితిని. ఆ పురుషుడు ఇట్లు పలికెను.

"భవా! వెలిగిపోవుచున్న తేజస్సుతో అట్లరిగినవారు ఆదిత్యులు. బ్రహ్మ వారిని తలపోయగా తొందరతో అరుగుచున్నారు. బ్రహ్మ సృష్టిని చేయును, ఆ పురుషులు ఆ సృష్టిని పరిరక్షించుట కొరకు అరుగుచున్నారు. సంశయము లేదు" అని తెల్పగా శంభుడు ఇట్లు అడిగెను. "స్వామీ! నేను నీకు తెలియనివాడను కదా! నన్ను భవా! అని పేరు పెట్టి

పిలిచితివి. నీకది యెట్లు తెలిసినది? అది అంతయు నాకు చెప్పుము" అని రుద్రుడనగా ఆ పురుషుడు సమాధానమునిట్లు చెప్పెను. "నేను నారాయణ దేవుడను నీటియందు నిద్రింతును. సనాతనుడను. నీకు దివ్యమగు కన్ను ఏర్పడుగాక! ప్రయత్నించి నన్ను చూడుము." ఇట్లతడు పలుకగగా నేను అటు చూచునంతలో వెలుగొందుచున్న సూర్యుని తేజస్సు కలవాడు, బొటన వేలంత వాడగు స్వామి కానవచ్చెను. నేనాతనినే పరీక్షించి చూచితిని. ఆతని బొడ్డున పద్మమును, ఆ పద్మమునందు బ్రహ్మను, దేహమున నన్ను కాంచితిని. ఆ మహాత్ముని అట్లు కాంచి పరమానంద మందితిని. ఆతనిని స్తుతింపవలయునను అను బుద్ధి పుట్టినది. ఆతనికొక ఆకృతి ఏర్పడగా, తపస్సుచేత స్మృతికి వచ్చిన కర్తవ్యము గలనేను ఆ విశ్వాత్ముని ఈ స్తోత్రములతో కొనియాడితిని.

"అనంతుడు, విశుద్ధహృదయుడు, తనకు తానే సాటియగు రూపము కలవాడు. వేయి బాహువులు గలవాడు, వేలకొలది కిరణములుగల శ్రేష్ఠుడు సృష్టికర్త, విశాలమగు దేహము పవిత్రమగు కర్మములు కలవాడు అగు దేవా! నీకు నమస్కారము. విశ్వములన్నింటి ఆర్తిని హరించువాడు, శంభుడు, వేలకొలది సూర్యుల వాయువుల తీవ్రతేజము కలవాడు, ఎల్ల విద్యలను ధరించువాడు, చక్రము కలవాడు, దేవతలందరి స్తుతులందుకొనువాడు, ఎల్లప్పుడు పాపములు లేనివాడగు దేవా! నీకు నమస్కారము. దేవా! నీకు మొదలు,తుది లేదు. శేషుడే నీకు అలంకారము. ప్రభూ! సర్వపతీ! జగత్పతీ! భువఃపతీ! భువనపతీ! నీకు సర్వదా నమస్కారము. దేవా! జలములకు ప్రభుడవు. నారాయణుడవు విశ్వములన్నింటికి శుభము కూర్చువాడవు. భూమికి భర్తవు. విశ్వేశ్వరుడవు. విశ్వమునకు నేత్రమయిన వాడవు. నీవే చంద్రుడవు. సూర్యుడవు. అచ్యుతుడవు. వీరుడవు. విశ్వమంతయు వ్యాపించు వాడవు. ఊహలకందని మూర్తి కలవాడవు. అమృతమూర్తివి. అవ్యయుడవు. జ్వలించుచున్న అగ్నికీలలతో అన్యులకు చొరశక్యము కాని మండలము కల నారాయణా! విశ్వతోముఖా! నన్ను కాపాడుము. దేవతల ఆర్తిని అంతముచేయు అమృతుడవు. అవ్యయుడవు. అచ్యుతుడవు, ఎల్లప్పుడు శరణుజొచ్చిన నన్ను కాపాడుము. ప్రభూ! నీ మోములను అనేకము నేను చూచుచున్నాను. నీ బొడ్డునందున్న పురాణుడు, ఈశ్వరుడు, సర్వలోకములకు సృష్టికర్త అయిన బ్రహ్మను నేను కనుగొనుచున్నాను. అట్టి పితామహునకు నా నమస్సు, సంసారమను చక్రమున

తిరుగుచుండు అనేకులు, జ్ఞానముచేత విశుద్ధమైన సత్వగుణము గల సన్మార్గులు ఓ ఆదిదేవా! దేవదేవా! నిన్ను ఉపాసింతురు. అట్టి నిన్ను గూర్చి నేనేమి పలుకుదును? ప్రకృతి కావల ఒక్కడవై యున్న నిన్నెరిగినవాడు సర్వము తెలిసినవాడు మొదటి జ్ఞాని. నీ గుణములు వారియందు (జ్ఞానులు యందు) విభజించి చూపగలిగినవి కావు. నీవు విశాలమూర్తివి. పరమసూక్ష్మ రూపుడవు. నీకు పలుకు లేదు. మనసు లేదు. ఇంద్రియములు లేవు. కర్మములు లేకున్నను చైతన్యముకలవాడవు. సంసారము కలవాడవు. సంసారము లేనివాడవు, దేవవరా! నిన్ను తెలియుట ఎట్లు? ఆకారము కలదియు, లేనిదియు, సాటిలేనిదియునగు నీ పరమదేహము విశుద్ధ భావులకు సంసారమును తెగత్రెంపులు చేసికొనగోరి అర్చించువారికి మాత్రమే లభించును. అందువలననే నిన్ను చతుర్భుజుడని నిర్ణయింతురు. కాని అచ్చెరువు కొలుపు నీ దేహమును దేవాదులు కూడ ఎరుగజాలరు. కనుకనే బ్రహ్మ మొదలగువారు అవతారములుగా చెప్పబడు నీ పురాణమైన తనువును ఆరాధింతురు. విశ్వము నెల్ల సృజించువాడు, పద్మము పుట్టుకకు తావైనవాడు, మహానుభావుడగు బ్రహ్మయు మొత్తముగా నీ దేహమును ఎరుగడు. నేను మాత్రము తపస్సుచేత విశుద్ధుడనై ఆద్యుడవు, పురాణుడవు, కవివి అగు నిన్నెరుగుదును. బ్రహ్మదేవుడు నాకు జనకుడని, పెక్కుమారులు పురాణములచేత ప్రసిద్ధుడు. ఈ పుట్టుక విషయమున నావంటివాడు కూడ తెలియరాకున్నాడు. ఇంక తపశ్శక్తి లేనివారు నిన్నెట్లు ఎరుగుదురు? బ్రహ్మ మొదలగు శ్రేష్ఠులకును తెలియని నిన్ను వేదహీనులగు మూర్ఖులు అనంతములగు నమస్కారములతో తెలియగోరుచుందురు. గొప్ప కీర్తికల అట్టివారి యందును సరియగు బుద్ధిలేదు. నీ అనుగ్రహము వలన వేదములను చక్కగా ఎరిగినవానికి పెక్కు జన్మములలో వివేకబుద్ధి కలుగును. నీవు దొరికిన లాభమునకు మనుష్యత్వము, దేవత్వము, గంధర్వత్వము వంటివి సాటి రావు. నీవు అంతట వ్యాపించిన రూపము కలవాడవు. మిక్కిలి సూక్ష్మరూపుడవు. స్థూల రూపుడవును. ఈ స్థూలరూపము భక్తులను కృతకృత్యులను చేయుట కొరకు ఏర్పడినది. ఇట్లు స్థూల సూక్ష్మ రూపములతో నుండు నీవు మిక్కిలి సులభుడవు. నీకు వెలియైన నడవడితో జనులు నరకమున కూలుదురు.

వితతమైన స్వభావముగల నీవు ఆకాశము, చంద్రుడు, అగ్ని, సూర్యుడు, భూమి, వాయువు, జలము అను తత్వములతో ఆత్మస్వరూపముతో, సమానమగు రూపములను

ధరించు వానితో కూడియుండగా ఇంక చెప్పవలసినదేమి కలదు? అనంతా! భగవానుడా! భక్తుడనగు నాయీ స్తుతిని స్వీకరింపుము. సృష్టి చేయుమని నీవు పలికితివి. దానికై ఓ విష్ణూ! నాకు సర్వజ్ఞతను ప్రసాదింపుము. చతుర్ముఖుడో, కోటిముఖుడో, లేక విశుద్ధ చిత్తుడైన వాడే నీ అనేక గుణాలను పలకగలడు. నాయందు ప్రసన్నుడవు కమ్ము. ప్రభూ! సమాధియుతుడై, విశుద్ధబుద్ధికలవాడు, నీ భావము తప్ప అన్యమెరుగని మనస్సు కలవాడగువాని హృదయమున నీవు ఎల్లప్పుడు ఉందువు. నీకు నమస్కారము. అంతట నుండు వానికి విడిగానుండు స్థితి ఎక్కడిది? ప్రభూ! ఇట్లు నేను అంతటను ఉండెడు నిన్ను గూర్చి పరమశుద్ధమైన బుద్ధితో ఈ స్తోత్రమును చేసితిని. సంసారమను చక్రమును దాటు ఉపాయముచేత భీతుడనైన నన్ను పవిత్రుని చేయుము".

మహాతేజస్సుగల రుద్రుడు ఇట్లు స్తుతింపగా, ఆ దేవుడు సంతుష్టుడై మేఘము వంటి గంభీరమగు కంఠధ్వనితో ఇట్లు పలికెను. "దేవా! ఉమాపతీ! నీకు మేలగును వరము కోరుకొనుము. మన యిరువురకు భేదము లేదు. మన యిరువురము ఒక్కటియే" అనగా రుద్రుడు ఇట్లు పలికెను. "ప్రభూ! బ్రహ్మ నన్ను ప్రజలను సృజింపుమని నియోగించెను మూడు విధములైన భూతభావనా! త్రివిధమైన ఆ జ్ఞానమును నాకు ప్రసాదింపుము" అనగా విష్ణువు ఇట్లనెను. "నీవు సర్వజ్ఞుడవు. సనాతనుడవగు జ్ఞానరాశివి. దేవతలందరకు నీవు ఎల్లవేళల పరమ పూజ్యుడవగుదువు" అని హరి ఇట్లనగా ఉమాపతి పరమసంతోషముతో మరల ఇట్లనెను. "దేవా! నాకు మరియు నొక వరమిమ్ము. నీవు నన్ను ఆరాధింపుము. దేవదేవా! నన్ను వహింపుము. నా నుండి వరము కైకొనుము. దానితో నేను సర్వదేవతలలో పరమ పూజ్యుడనగుదును" అనగా విష్ణువు ఇట్లనెను.

"దేవకార్యముల కొరకు దాల్చిన అవతారముల యందు నేను మనుష్య భావములు పొందువాడనై నిన్నే ఆరాధింతును. నీవు నాకు వరముల నొసంగువాడవగుము. ఈ నన్ను వహింపు మంటివి. కావున దేవదేవా! ఉమాపతీ! నేను మేఘుడనై నిన్ను నూరేండ్లు మోయుదును" అని ఇట్లు పలికి హరి తనంతతాను మేఘరూపమును పొంది, మహేశ్వరుని ఆ నీటి నుండి పైకి తెచ్చెను. మరియు ఇట్లనెను. "శంకరా! ఈ పదునొకండుగురు పురుషులు, వైరాజులు. భూమికి దిగి ఆదిత్యులను పేరుతో వెలుగొందుదురు. నా అంశగల పండ్రెండవ వాడు విష్ణువను పేరు కలవాడై భూమికి దిగి,

నిన్ను ఆరాధించును" ఇటు పలికి తనదైన అంశము వలన ఆదిత్యుని, మేఘమును సృజించి నారాయణుడు శబ్దమువలె, ఎందు లయమయ్యెనో మేమెరుగము. ఇట్లా హరిదేవుడు అంతట నుండువాడు. అన్నిభావనలు కలవాడు పూర్వము నాకు వరమునొసగెను. అందువలన నేను దేవతలలో శ్రేష్ఠుడనైతిని. నారాయణుని కంటె మిన్నయగు దేవుడు మునుపులేడు. ముందు కలుగడు. ఇది వేదముల, పురాణముల రహస్యము. విష్ణువు ఎట్లు పూజ్యుడయ్యెనో నేను మీకంతయు తెలియజెప్పితిని. (73)

74 వ అధ్యాయము - భూప్రమాణాలు

మరల వరాహదేవుడు ఇట్లు పల్కెను. సనాతనుడు, పురాణపురుషుడు శాశ్వతుడు, స్థిరుడు, అవ్యయుడు, విశ్వరూపుడు, అజుడు,శంభువు, ముక్కంటి, శూలపాణి అయిన ఆ రుద్రుని ఋషులందరు మరల ఇట్లు ప్రశ్నించిరి. "దేవదేవా! నీవు మాకును, సర్వదేవతలకును అధికుడవు. కావున నిన్నొక ప్రశ్న నడుగుచున్నాము. దానిని గూర్చి చెప్పవలయును. మాయందు కృపతో ఈ భూమి కొలతయు, పర్వతముల వైశాల్యము అనువానిని నీవు చెప్పుము" అనగా మరల రుద్రుడు బ్రహ్మ, విష్ణు, శివ మొదలగు పేర్లు కలవియు, వాయుసంబంధమైనది అగు అన్ని పురాణములయందును భూలోకమును గురించి విస్తరముగా చెప్పి ఉన్నారు. ఉత్తములారా! ధర్మజ్ఞులారా! ఇప్పుడు సంగ్రహముగా భూమికొలతను గూర్చి మీకు చక్కగా చెప్పెదను. చక్కగా తెలిసికొనుడు. సమస్త విద్యలచేత చక్కగా తెలియబడు ఆ పరమాత్మ కల్మషములు లేనివాడు. అతి సూక్ష్మస్వరూపుడు. ఊహింపనలవి కాని ఆత్మకలవాడు. నారాయణుడు భౌతికము, పారమార్థికము అయిన రెండు లోకములందును వ్యాపించియున్నవాడు. పచ్చని వస్త్రము ధరించినవాడు. విశాలమైన వక్షస్సు కలవాడు. భూమిని ధరించినవాడు. గుణములను బట్టియు, ప్రధానముగను అంతయు తానే అయినవాడు. అణుస్వరూపుడు, మహాస్వరూపుడు పొడవైనవాడు, హ్రస్వరూపుడు, ఎర్రదనములేనివాడు, మొదలైన లక్షణములతో గుర్తింపతగినవాడైనా, కేవలము విజ్ఞానస్వరూపుడు. సత్వము, రజస్సు, తమస్సు అనువాని ఉద్రేకములు కలిగి మూడు విధము లైనవాడై ఆ భగవానుడు మొదట జలమును సృజించెను. దానిని సృజించి ఆ అనాది పురుషుడు, పరమేశ్వరుడు ఆ నారాయణుడు, సకల జగన్మయుడు, సర్వమయుడు, దేవమయుడు, యజ్ఞమయుడు, జలమయుడు,

జలస్వరూపుడగు ఆ దేవుడు యోగనిద్రతో నిద్రించుచున్నవాడై తన బొడ్డు నందు ఒక చక్కని పద్మమును వెలువరించెను. ఆ పద్మము నందు సమస్త వేదములకు నిధి, ఊహింపనలవి కానివాడు, పరమేశ్వరుడు అగు బ్రహ్మయను ప్రజాపతి ఉదయించెను. ఆతడును సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, మొదలగు జ్ఞానస్వరూపులగు వారిని తొలుత సృష్టించి, పిదప స్వాయంభువ మనువును, మరీచి మొదలుకొని దక్షుడు తుదిగా గల ప్రజాపతులను సృష్టి చేసెను. ఆ స్వాయంభువ మనువును భగవంతుడు సృజింపగా ఆతని వలన భువనమును మిక్కిలి విశాలమై రచితమాయెను.

ఆ మనువునకు ప్రియవ్రతుడు, ఉత్తానపాదుడు అనువారు ఇద్దరు కొడుకులు కలిగిరి. ప్రియవ్రతునకు, ఆగ్నీధ్రుడు, అగ్నిబాహువు, మేథుడు, మేధాతిథి, ధ్రువుడు, జ్యోతిష్మంతుడు, ద్యుతిమంతుడు, హవ్యుడు, వపుష్మంతుడు, సవనుడు అను పదుగురు కొడుకులు కలిగిరి. ఆ ప్రియవ్రతుడు ఏడు ద్వీపముల యందును ఏడుగురు కుమారులను నిలిపెను. అందు ఆగ్నీధ్రుని జంబూ ద్వీపమునకు అధిపతిగా చేసెను. శాకద్వీపమునకు, ఈశ్వరునిగా మేధాతిథిని, కుశద్వీపమున జ్యోతిష్మంతుని, క్రౌంచమున ద్యుతిమంతుని శాల్మలమున వపుష్మంతుని, గోమేధమునకు హవ్యుని, పుష్కర ద్వీపమునకు అధిపతిగా సవనుని చేసెను. పుష్కరద్వీప ప్రభువగు సవనునకు మహావీతుడు, ధాతకి అను ఇరువురు పుత్రులు కలరు. వారి వారి దేశములును వారి పేరులతో ఏర్పడినవి, ధాతకిది దాతకీ ఖండము, కుముదునిది కౌముదము అగు శాల్మలీ ద్విపము. అధిపతి వపుషంతునకు ముగ్గురు పుత్రులు సకుశుడు, వైద్యుతుడు, జీమూతుడు అనువారు. సకుశునకు సకుశమను పేరుగల దేశము, వైద్యుతునకు వైద్యుతము, జీమూతునకు జీమూతము అనునివి కల్గెను. ఇవి శాల్మలి యొక్క దేశములు.

అట్లే ద్యుతిమంతునకు ఏడుగురు కొడుకులు, కుశలుడు, మనువు,గోష్ఠుడు, ఉష్ణుడు, పీవరుడు, ఉద్యాంధకారకుడు, ముని దుందుభి అనువారు. వారి పేర్లతో క్రౌంచమున ఏడు మహాదేశముల పేర్లు కూడ ఇట్టివియే. కుశద్వీపాధిపతి జ్యోతిష్మంతునకును ఏడుగురు పుత్రులు. ఉద్భిదుడు, వేణుమంతుడు, రథుడు, ఉపలంబనుడు, ధృతి, ప్రభాకరుడు, కపిలుడు అనువారు. వారి పేరులతోడనే దేశములును చూడదగును. శాకద్వీపము అధిపుడగు మేధాతిథికిని ఏడుగురు కొడుకులు,

శాంతభయుడు, శిశిరుడు, సుఖోదయుడు, నందుడు, శివుడు, క్షేమకుడు, ధ్రువుడు అనువారు. ఇవియే వారేలెడు దేశములకును పేర్లు.

ఇంక జంబూద్వీపాధిపతి ఆగ్నీధ్రునకు తొమ్మండుగురు కొడుకులు. నాభి, కింపురుషుడు, హరివర్షుడు, ఇలా వృతుడు, రమ్యకుడు, హిరణ్మయుడు, కురువు, భద్రాశ్వుడు, కేతుమాలుడు అనువారు వీరి పేర్లే దేశములకు ఏర్పడినవి. నాభికి మంచుగల హేమకూటము కింపురుషునిది కింపురుషము. నైషధునిది హరివర్షము. మేరువు నడిమి భాగము ఇలా వృతునిది, నీలము రమ్యకునిది. శ్వేతము హిరణ్మయునిది, ఉత్తర పర్వతములు కురువునకు చెందినవి, మాల్యవంతము భద్రాశ్వునిది, గంధమాదనము కేతుమాలునిది. స్వాయంభువ మన్వంతరమున భువన ప్రతిష్ఠ ఇట్టిది. ప్రతికల్పము నందును ఇట్లే ఏడుగురేడుగురు భూమిని పాలింతురు. భూమి వ్యవస్థయు ఇట్టిదిగా నుండును.

ఎల్లప్పుడు కల్పము స్వభావము ఇదియే అగును. ఇందు నాభి సృష్టిని చెప్పెదను. నాభి మేరుదేవియందు ఋషభుడను పేరుగల కొడుకును కాంచెను. అతని పెద్దకుమారుడు భరతుడు ఆ భరతునకు తండ్రి ఋషభుడు. హిమవత్పర్వతమునకు దక్షిణమున గల భారతమను వర్షమును ఇచ్చెను. భరతునకు సుమతి అను కొడుకు పుట్టెను. అతనికి రాజ్య మొసగి భరతుడు వనమున కరిగెను. సుమతికి తేజుడు, అతనికి సత్సువు, అతనికి ఇంద్రద్యుమ్నుడు, అతనికి పరమేష్ఠి, అతనికి ప్రతిహర్త, అతనికి నిఖాతుడు, అతనికి ఉన్నేత, అతనికి అభావుడు, అతనికి ఉద్గాత, ఉద్గాతకు ప్రస్తోత, ప్రస్తోతకు విభువు, విభువునకు పృథువు, పృథువునకు అనంతుడు, అనంతునకు గయుడు, గయునకు నయుడు, అతనికి విరాటుడు, అతనికి మహావీర్యుడు, అతనికి సుధీమంతుడు, అతనికి మహత్తు, అతనికి భౌవనుడు, అతనికి శతజిత్తును పుత్రులు. ఆ శతజిత్తునకు నూరుగురు కొడుకులు పుట్టిరి. వారిచేత ప్రజలు వృద్ధిపొందిరి. వారిచేత ఏడు ద్వీపములు గల భారతవర్షము గుర్తింపబడినది. వారి వంశపు సంతానము ఈ భారత ప్రజలను కృత, త్రేత మొదలగు పేర్లు గల డెబ్బది యొక్క యుగముల కాలము పాలించినది. భువన ప్రసంగముచేత శుభమగు స్వాయంభువమును గూర్చి చెప్పితిని. మనువు యొక్క ఇతర ద్వీపములను గూర్చి ఇటుపై తెలిసికొనుము. (74)

75 వ అధ్యాయము - జంబూద్వీప విస్తార వర్ణనము

అని చెప్పిన అనంతరము రుద్రుడు ఇట్లు అనెను. ఇటుపై జంబూ ద్వీపమును,అందలి సముద్రములను,ద్వీపములనుగూర్చి విస్తరముగా ఉన్నదున్నట్లుగా చెప్పెదను. అందలి వర్షములు (దేశములు), నదులు, మహాభూతముల ప్రమాణము, సూర్యచంద్రుల గతి, ఏడు ద్వీపములలోను ఉన్న వేలకొలదిగా నున్న ద్వీపముల భేదములు మొదలగు విధముగా విస్తరిల్లిన వానిని గురించి క్రమముగా చెప్పుటకు సాధ్యము కాదు. చంద్రుడు, ఆదిత్యుడు మొదలగు గ్రహములతోపాటు ఏడు ద్వీపములను గూర్చి వివరించి చెప్పెదను. ఈ ప్రమాణములన్నింటిని మనుష్యులు తర్కముతో (ఊహతో) మాత్రమే చెప్పగలరు. ఊహకందని భావములను తర్కముతో సాధింపజాలము. ప్రకృతులకంటె అతీతమైన దానిని అచింత్యముగా భావింతురు. తొమ్మిది వర్షములు గల జంబూ ద్వీపమును గూర్చి విస్తరమును, మండల స్వరూపము, యోజనముల కొలత మొదలగు వానితో ఉన్నదున్నట్లు చక్కగా చెప్పెదను.

ఒక వంద వేల యోజనములు కొలత కలది. పెక్కు జనపదములతో నిండినది, శిలల సముదాయముల నుండి పుట్టిన అన్ని విధములగు ధాతువులతో కూడిన పర్వతములతో ఇంపైనది, పర్వతముల నుండి జాలువారిన నదులతో వ్యాప్తమైనది. అగునట్టి జంబూ ద్వీపము మిక్కిలి విశాలము, శోభ కలది, సంపద కలదియునై తొమ్మిది దేశములతో ఆవృతమై పెద్దగా ఉన్నది. జంబూ ద్వీపమంత వైశాల్యము కల ఉప్పు సముద్రము దానిని అన్నివైపుల చుట్టుకొని ఉన్నది. దానికి తూర్పున వెడల్పు, పొడవుగల ఆరు వర్షపర్వతములు గలవు. (హద్దులుగా ఉన్న పర్వతములు) రెండు వైపుల తూర్పు పడమర సముద్రములు చుట్టుకొని ఉన్నవి.

మంచు అధికముగా గల హిమవంతము, బంగారము మిక్కుటముగా గల హేమకూటము, అంతట మిక్కిలి సుఖమును కూర్చు పెద్దదియగు నిషధము, నాలుగు రంగులు గలది, బంగారుతో నిండినది, చాల బిగువు గలది, గుండ్రని ఆకారము, చతురస్రమగు పైభాగము కల మేరుపర్వతము అందు కలవు. మరియు ఈ పర్వతము ప్రక్క భాగములయందు పెక్కువర్ణములు కలదియై ప్రజాపతి గుణములతో కూడినదై, పరమేష్ఠియగు బ్రహ్మ బొడ్డు భాగము నుండి పుట్టినదై ఉండెను.

తూర్పు దిక్కున అది తెల్లనివర్ణము కలిగిఉండెను. దానిచేత దాని బ్రాహ్మణత్వము తెలియవచ్చును. దక్షిణమున పసుపురంగు వలన వైశ్యత్వము వ్యక్తమగును. పడమటి భాగమున తుమ్మెదరెక్కల వంటి రంగు కలదు. దానిచేత పేరు, ప్రయోజనము, పని అనువానిని సూచించు ఆ మేరువునకు శూద్రతయు చెప్పబడినది. ఉత్తర పార్శ్వమున ఎరుపు రంగు కానవచ్చును. దానిచేత క్షత్రియభావము ఎరుగనగును. ఇట్లు దాని రంగులను గూర్చి చెప్పుదురు. ఇంక అయిదవది అగు నీలము స్వభావమును బట్టి గుండ్రని ఆకారము కలది. రంగును బట్టి నీలము, గొప్ప కొలత కలది. దానినిండ వైడూర్యములుండును. ఆరవ హిరణ్మయ పర్వతము తెలుపు ఎరుపుల కలనేత రంగులో ఉండును. నెమలి పింఛము వంటి వన్నె కలిగిఉండును. బంగారు కొమ్ములతో ఉండును. ఈ గొప్ప కొండలు సిద్ధులు, చారణులు మొదలగు దేవజాతులకు నివాసములు, వాని మధ్య భాగపు వైశాల్యము తొమ్మిదివేల యోజనములు.

మహా మేరువునకు నడిమి భాగమున ఇలావృతమను దేశము కలదు. అది తొమ్మిదివేల యోజనములు వ్యాపించి ఉన్నది. ఈ మహామేరువు మధ్యభాగము పొగలేని నిప్పువలె కన్పట్టును. మేరువునకు దక్షిణముగా సగము, ఉత్తరముగా సగము పీఠభూమి కలదు. ఇందు ఆరు దేశములు కలవు. వానికారు వర్ష పర్వతములు కలవు అన్ని దేశములకు యోజనము మేర అవి వ్యాపించి యున్నవి. రెండు రెండు దేశముల విస్తారము వేలకొలది యోజనములతో ఉన్నది. ఆ దేశముల విస్తీర్ణము, పొడవు జంబూ ద్వీపపు కొలత అగును. నీలము, నిషధము అను రెండు కొండలు రెండు నూర్లవేల యోజనముల పొడవు కలవి. తక్కిన శ్వేతము, హేమకూటము, హిమవంతము, శృంగవంతము అనునవి వాని కంటే తక్కువ కొలత కలవి.

నిషధ పర్వతము జంబూ ద్వీపమంతటిదని ప్రసిద్ధికెక్కినది. హేమకూటము దానికంటె పండ్రెండవ భాగము తక్కువది. హిమవంతము హేమకూటము కంటె ఇరువదవ భాగము తక్కువైనది. తూర్పు, పడమరలుగా హేమకూట మహాపర్వతము ఎనుబది ఎనిమిది యోజనముల పొడవు కలది. హిమవంతము, ఎనుబది యోజనముల పొడవైనది. ద్వీపము మండలాకారముగా ఉన్న కారణమున ఈ దేశములకు, ఆ పర్వతములకును హెచ్చు తగ్గులు కలుగుచుండునని చెప్పుకొందురు. ఆ కొండల నడుమ పెక్కు

జనపదములు గల దేశములు కలవు. జలపాతములతో విషమ స్వరూపములు గల కొండలును ఆవరించి యున్నవి. పెక్కు తీరులు గల నదులు వ్యాపించి యుండగా ఆ దేశములు ఒకదానికొకటి ప్రవేశింప నలవికానివై యున్నవి. అందు అన్నియెడల పెక్కుజాతుల జంతువులును నివసించును. హైమవత వర్షమున భారతజాతి జనులును, హేమకూట వర్షమున కింపురుష జాతి జనులును కలరు.

హేమకూటమున కావల నిషధము కలదు. దానినే హరివర్షమనియు అందురు. మేరువు ప్రక్కగా హరివర్షమున కావల ఇలావృతము కలదు. దాని కావల నీలము. దానికి రమ్యకమనియు ప్రసిద్ధి. రమ్యకము దాటిన తరువాత శ్వేతము. దానిని హిరణ్యయమనియు నందురు. హిరణ్యయమున కవతల ఉన్నది శృంగవంతము. దానిని కురుదేశమనియు అందురు. దక్షిణముగా ఉత్తరముగా ఉన్న రెండు దేశములు వింటివలె ఉండును. అందు నాలుగు ద్వీపములు కలవు. ఇట్టి ఇలావృతము చతురస్రాకారముగా ఉండును. నిషధమునకు దక్షిణముగా ఉన్న పీఠభూమి సగము దక్షిణ భూమిగా, శృంగవంతమునకు పరముగా ఉన్న సగము భూమిని ఉత్తర భూమిగా గుర్తింతురు. దక్షిణమున నున్న వేదియందు సగమున మూడు దేశములు ఉత్తరమున మూడు దేశముఁ కలవు. వాని నడుమ ఉన్నదియే ఇలావృత్తము. నీలమునకు దక్షిణముగా, నిషధమునక ఉత్తరముగా ఉత్తరము వైపు పొడవుగా నున్న మహాశైలము మాల్యవంతము. దాని వెడల్పు ఎత్తులు రెండువేల యోజనములు పొడవు ముప్పది నాలుగువేల యోజనములు.

దానికి పడమరగా గంధమాదన పర్వతము కలదు. ఎత్తు, వెడల్పు, పొడవులతో అది మాల్య వంతమునకు సాటియైనది. ఆ రెండు కొండల నడుమ నాలుగు వర్ణములు కలదియు, స్వర్ణమయమైనదియు నాలుగు కోణములు కలదియు, మిక్కిలి ఎత్తైనదియు అగు బంగారు కొండ మేరువు ఆవరించుకొని ఉన్నది.

వ్యక్తము కాని నీరు మొదలగు ధాతువులన్నియు పుట్టినవి. అవ్యక్తము నుండి మేరువు దుద్దుగా గల భూమియనెడు పద్మము నాలుగు రేకులతో పుట్టినది. అది అయిదు గుణములు గల మహత్తుగా ఏర్పడినది. దానినుండి సకలవిధములగు ప్రవృత్తులు ఏర్పడినవి. (చతుష్పత్రమ్ – నాలుగు రేకులు – 1) వాసుదేవ 2) సంకర్షణ 3) ప్రద్యుమ్న 4) అనిరుద్ధ తత్వములు) (అయిదు గుణములు – శబ్ద స్పర్శరూప రసగంధములు) పెక్కు

కల్పములు జీవించి ఉండువారు, పుణ్యములు చేసినవారు, కృతాతులు మహాత్ములగు పురుషులు, మహాయోగి మహాదేవుడు, జగత్తునకు ధ్యేయుడు సర్వలోకములను వ్యాపించి యుండువాడు, అనంతుడు, వ్యాపకుడు, అవ్యయుడునగు పురుషోత్తముని పొందుదురు.

ఆ పురుషోత్తమునకు ప్రాకృతమైన మూర్తి, మాంసము, మేధస్సు, ఎముకలు అనువానితో ఏర్పడునది లేదు. యోగి యగుట వలనను, ఈశ్వరుడగుట వలనను ఆ విభుడు సత్యరూపమును తాల్చువాడు. ఆతడు నిమిత్తముగా లోకమున సనాతనమగు పద్మము మిగిలిన కల్పపు శేషము నందును, మొదటి భాగము నందును పుట్టుచుండును. కాలపు గతి ఇట్టిది. ఆ పద్మమునందు దేవదేవుడు, నలుమోముల దేవర, ప్రజాపతులకు పతి, ఈశానుడు, జగత్తునకు ప్రభువు అగు బ్రహ్మదేవుడు ఉదయించెను. ఆ పద్మము విత్తనము సృష్టియే సమస్త ప్రజల సృష్టిగా విస్తరముగా వర్ణింపబడుచున్నది. ఆ నీరు విష్ణు సంబంధమైన దేహము, రత్నములతో అలంకరింపబడినది. దాని నుండి పద్మపు ఆకారముతో, అడవులతో, చెట్లతో కూడిన భూమి పుట్టినది. ఆ లోకపద్మపు విస్తారమును గూర్చి సిద్ధులు పలికియున్నారు. విభాగములతో వారు చేసిన ఆ వర్ణనమును, బ్రాహ్మణులారా! క్రమముగా చెప్పెదను వినుడు. అందు మహావర్షములు నాలుగు నెలకొని యున్నవి. అందు పర్వతముల కూర్పు మేరువనునది గొప్ప బలము కలది. ఆ మేరువు ప్రక్కభాగముల యందు పెక్కు వర్ణములు కలిగియుండెను. తూర్పున తెలుపు, దక్షిణమున పసుపు, పడమర దిక్కున తుమ్మెదల రంగు, ఉత్తరమున ఎరుపు అనునవి వన్నెలు. కాని పర్వతముల రాజవంశమందు నెలకొన్న మేరువు తెల్లనిదై ప్రకాశించుచుండు బాలసూర్యునివలె ప్రకాశించుచు పొగలేని అగ్నివలె అలరారుచుండును. ఎనుబది నాలుగువేల యోజనముల ఎత్తు కలదు. భూమిలోపలికి పదునారు యోజనముల లోతుదాకా ఉంటుంది. వైశాల్యము పదునారు యోజనములు. మూకుడు వలె ఉండుట వలన దానిపై భాగము ముప్పది రెండు యోజనముల విస్తృతితో ఉండును. దాని చుట్టుకొలత వెడల్పునకు మూడు రెట్లు. దాని వ్యాసము వృత్తాకరాపు కొలతతలో చూడదగినది. అన్నివైపుల చుట్టుకొలత తొంబదివేల యోజనములు. దాని వ్యాసము తొంబది ఆరుయోజనములు. చతురస్రపు కొలతతో దాని అన్నివైపుల వైశాల్యము లెక్కకు వచ్చును.

ఆ పర్వతము మహాదివ్యమైనది. దివ్యమగు ఓషధులతో కూడినది. స్వర్గమయములగు చక్కని భవనములతో నిండినది. ఆ శైలరాజమున దేవతలయు, గంధర్వులయు, నాగులయు, రాక్షసులయు, అప్సరసలయు గణములు పరమానందము పొందు చుండును. భూతములన్నియు మెచ్చుకొనెడు భవనములతో ఆ మేరువు చుట్టబడి ఉన్నది. దాని పార్శ్వములన్నింట నాలుగు దేశములు నెలకొనియున్నని. పడమటి దిక్కున భద్రాశ్వము, భారతము, కేతుమాలము అనునవియు, ఉత్తరమున పవిత్ర కార్యములకు నెలవులగు కురుభూములును కలవు. ఆ పద్మపు దుద్దు, మండలాకారముగా ఉన్నది. దాని కొలత వేలకొలది యోజనములుగా ఉండును. దాని కేసరజాలములు మొత్తము పదునైదు (వేలు)గా ఉన్నవి. ఎనుబది నాలుగు యోజనముల పొడవైనవి. లోపలకు ముప్పది యోజనముల కొలత కలవి. అవి అన్ని వైపులకు చెదరియున్నవి. అవి చాలా పెద్దవి. నూరువేల యోజనముల పొడవు ఎనుబది వేల యోజనముల వెడల్పు కలిగియున్నవి. అందు పదునాలుగు వేల యోజనములు గల ఆకులు నాలుగు కలవు.

నేను మీకు కర్ణిక అని చెప్పితినే. దానిని గురించి సంగ్రహముగా వర్ణింతును. వినుడు. అది మణిమయములగు వందలకొలది వర్ణములతో పెక్కు రంగుల కాంతులతో చిత్రముగా ఒప్పారుచున్నది. అది పెక్కు పత్రముల గుత్తులు కలిగి చక్కని వన్నెతో ఎర్రని కాంతితో, వేలకొలది కణుపులతో, వేలకొలది కందరములతో మనోజ్ఞమై, నూరువేల పత్రములతో గుండ్రని ఆకృతితో ఒక పెద్ద పర్వతమువలె అలరారును. దానిలోయలు, వేదికలు, ఇతర ప్రదేశములు, తోరణములు రత్నమయములై ఒప్పుచుండును. అందు బ్రహ్మసభ మిక్కిలి అందమైనది. అందు బ్రహ్మర్షులు ఎక్కువగా తిరుగుచుందురు. దాని పేరు మనోవతి. అన్ని లోకములలో ప్రసిద్ధికెక్కినది. అందు బ్రహ్మదేవుడు వేయి సూర్యుల కాంతితో వెలిగిపోవుచుండును. గొప్ప విమానమున కూర్చుండును. ఆతని మహిమ ఎల్లవేళలా భాసిల్లుచుండును. అందు దేవతల గుంపులు నాలుగు మొగముల దేవరను, తనకు తానే ప్రభువైన వానిని, పూజింపదగు వానిని మన్ననగల నమస్కారములతో ఆరాధించుచు నిలిచియుందురు. ఆ మహాత్ములందరు దృఢమైన సంకల్పము కలవారై సుందరములగు హృదయములతో, సదాచార మార్గము తప్పనివారై బ్రహ్మచర్యమును సాధించుచుందురు. మరియు గృహస్థులు పూజలు, చక్కని భోజనములు కలవారై

పితృదేవతల అర్చనలయందు ప్రీతికలవారై ఉందురు. వినయము కలవారు, అతిథుల యందు ప్రియులునై ఉందురు. ఇంకను గృహస్థులు పవిత్ర కర్మములయందు నిష్టకలవారు. విరక్తులు, యమము నియమము, దానము మొదలగు వానిచేత గట్టిగా కాలిపోయిన పాపములు కలవారు.

హరినివాసము స్వచ్ఛమై, ఏ నిందయు లేని బ్రహ్మలోకము పైపైకిగా ఉందు సర్వగతులకును పరమగతి. అది పదునాలుగువేల యోజనముల వైశాల్యము కలది. పైభాగమున అందమైనది, నల్లనిది, అయినను బాలసూర్యుని వన్నెతో ప్రకాశించునది. రత్న ధాతువులతో విచిత్రమైనది, రమ్యమైనది అగు పెద్ద పర్వతము కలదు. అది పెక్కు రత్నములకు నిలయము. మణితోరణముల మందిరములందు కలవు. మేరువునకు అన్నివైపుల గుండ్రని ఆకారముతో చుట్టుకొని ఉన్నది. ముప్పదివేల యోజనముల విస్తారము గల ఆ పర్వతము చక్రపాటము. 'జారుది' అనునట్టిది కూడా ఒక పర్వతము. ఇవి ఉత్తర దిక్కున ఉన్న పర్వతములు. ఉత్తరమున ఉన్న ఈ పర్వతముల తావులలో క్రమముగా ఉన్న నదులు, సరసులు అనువానిని గూర్చి తెలిసికొనుడు.

చక్రపాటము నుండి వెలువడి, పది యోజనముల విస్తీర్ణముకల ఊర్ధ్వవాహినియగు నది భూమిపై చక్కగా నెలకొనియున్నది. అది అమరావతీ పురమున చంద్రుని కాంతి వంటి కాంతితో ప్రవహించుచుండును. సూర్యుని, చంద్రుని, నక్షత్రముల కాంతులను కూడ అది తిరస్కరించును. ఉదయ సాయంకాల సంధ్యలను సేవించు బ్రాహ్మణ ప్రవరులు ఆ ఎనిమిది పర్వతములను కూడ స్తుతింతురు. చుట్టు తిరుగుచుండు నక్షత్రముల కాంతులు గల ఆ నదిని రుద్రుడు, ఇంద్రుడు కూడ సేవించుచుందురు. (75)

76 వ అధ్యాయము - దేవలోక వర్ణనము

మరల రుద్రుడు ఇట్లు చెప్పెను. ఆ మేరువునకు తూర్పున మిక్కిలి దీప్తి కలదియు, చక్రపాటమున వ్యాపించి ఉన్నదియు, పెక్కు ధాతువులతో విరాజిల్లునదియు అగు దేశమున చక్రపాటము నుండి వెలువడిన దేవతల రాజధానీ పురము కలదు. అది మిక్కిలి బలగర్వితులైన దేవదానవ రాక్షసులకును లోగొనరానిది. అందు బంగారు ప్రాకారము, తోరణము కలవు. దానికి ఈశాన్య దిక్కున గొప్ప కళాకాంతులతో అలరారు దేశమున అమరావతీపురి కలదు. అది దివ్యజనులతో నిండియుండును. వందల కొలది

విమానములు, గొప్ప బావులు, నిండారు సంతోషముగల జనులు, చిత్రవిచిత్రములగు రంగులుగల పూవులు, పతాకముల, ధ్వజముల వరుసలు మొదలగునవి సమృద్ధిగా గలవు. దేవతలతో, యక్షులతో, అప్సరసలతో, ఋషులతో శోభిల్లి ఉండును. అట్టి పురందరుని పురి రమణీయము, అది సంపదలతో అలరారునదియునై ఉండును. ఆ అమరావతి మధ్య భాగమున వజ్ర వైడూర్యముల వేదికలు కలదియు, మూడు లోకములందలి సుగుణములచే కీర్తినందినదియుఅగు సుధర్మయను సభ కలదు. అందు లక్ష్మీపతి సంపదల వంటి సంపదలు కలవాడు, వేయి కన్నులవాడు, శచీపతి అగు దేవేంద్రుడు, అన్ని విధములవారగు దేవతలు, సిద్ధాదులతో పరివృత్తుడై ఉండును. ఇంకను అందు మహాత్ముడగు భాస్కరుని నగరము సువంశమనునది కలదు. అందు సురల కధ్యక్షుడు, సర్వదేవతల మ్రొక్కులందు కొనువాడునగు సూర్యభగవానుడు ఉండును. ఆ అమరావతికి దగ్గరనే అన్ని దిక్కులకు వ్యాపించి ఉన్నదియు, గొప్ప గుణములతో కూడినదియుఅగు తేజోవతి అను నగరి మహాత్ముడగు అగ్నిదేవునికి సంబంధించినది కలదు. అట్లే (దానికి ప్రక్క) అనేక మంచి గుణములతో విలసిల్లు యముని పురి కలదు. దాని పేరు సంయమని. అది మూడు లోకములలో ప్రసిద్ధికెక్కినది. అట్లే నాలుగవ దిక్కు అగు నైరృతి యందు బుద్ధిశాలియగు విరూపాక్షుడను నిరృతి దిగ్భాగాధిపతి నగరము మిక్కిలి శోభ కలది కలదు. దాని పేరు కృష్ణావతి. నైరృతికి ఉత్తరముగా అయిదవది యగు పడమటి దిక్కునందు మహాత్ముడు జలాధిపతియగు వరుణుని నగరము శుద్ధవతి అనునది కలదు. అయిదవ దిక్కునకు ఉత్తరముగా వాయుదేవుని పురి సర్వగుణములచేత మేలైనది, గంధవతి అని ప్రసిద్ధికెక్కినది కలదు. దానికి ఉత్తరముగా గుహ్యకుల అధిపతి అగు కుబేరుని పురి, వైడూర్యముల అరుగులు కలది, మహోదయ అను పేరు కలది కలదు. అట్లే ఎనిమిదవ దిక్కున మహాత్ముడగు ఈశానునిపురి మనోహర అనునది కలదు. అందు పెక్కు విధముల భూతములు, మనోహరములగు పూవులతో ఇంపైన తోటలు గల ఆశ్రమములు గలవు. ఈ దేవ లోకమును అందరు పొందగోరుచుందురు స్వర్గమనియు కీర్తింతురు. (76)

77 వ అధ్యాయము - జంబూద్వీప పర్వత వర్ణనము

రుద్రుడు ఇట్లు చెప్పెను. ఆ పద్మపు దుద్దు మొదలు మేరువు నడిమి భాగమనియు, దాని కొలత యోజనములనియు చెప్పితిని గదా! దాని చుట్టుకొలత నలుబది

ఎనిమిదివేల యోజనములు. అది పర్వత రాజమగు మేరువునకు మూలముగా భావింపబడినది. అచటనున్న వేలకొలది పర్వతముల ప్రమాణము మిక్కిలి గొప్పది. మరియు ఎనిమిది దిక్కులలో ఎనిమిది సరిహద్దు కొండలు కలవు. వీనిలో తూర్పున జఠరము, దేవకూటము అని రెండు పర్వతములు కలవు. ఇవి తూర్పు పడమరలుగా వ్యాపించి సముద్రములోనికి చొచ్చుకొనిపోయి యున్నవి. ఈ మర్యాదా(సరిహద్దు) పర్వతములెనిమిదిని మేధావులు అభివర్ణింతురు.

బ్రాహ్మణ వరేణ్యులారా! బంగారు కొండగా ప్రసిద్ధికెక్కిన ఆ మేరుపర్వతానికి దన్నుగా ఉన్నవాటి గూర్చి చెప్పుదును వినుడు. ఆ మేరు పర్వతమునకు నాలుగు దిక్కులందును నాలుగు మహాపాదములు కలవు. అవి తనని పట్టుకొని యుండగా ఏడు ద్వీపములు గల భూమి కదలకుండినది. వాటి నడిమి ప్రదేశము పొడవు అడ్డముగా, ఎత్తుగా పదివేల యోజనములని ఊహ. అవి హరితాళ వృక్షములు గల ఒడ్డులతో క్రమ్ముకొని యున్నవి. వాని చరియలు మణిశిలలతో రంగురంగుల మణులతో, పెక్కు సిద్ధ భవనములతో, క్రీడా స్థానములతో గొప్ప కాంతులు కలిగియున్నవి. దానికి తూర్పున మందరము, దక్షిణమున గంధమాదనము, పడమటి దిక్కున విపులము, ఉత్తరమున సుపార్శ్వము అనుకొండలు కలవు. వాని శిఖరములందు నాలుగు మహావృక్షములున్నవి. దేవతలు, దైత్యులు, అప్సరసలు ఆ చెట్ల శుభగుణములచేత అచట విహరించుచుందురు. మందరగిరి కొమ్మున బాగుగా వ్రేలాడు కొమ్మల చివరలుగల కదంబమను వృక్షము కలదు. విప్పారిన కేసరములు గల దాని పూవులు పెద్ద కుండలంత ప్రమాణములో ఉండును. సర్వకాలములలో పూచును. గొప్ప పరిమళముతో మనోహరములై యుండును. సర్వప్రాణులకు ఉల్లాసము కలిగించు

భూభాగములతో ఆ చెట్లు గంధములతో దిక్కులను నింపుచు విరాజిల్లును. అట్టి చెట్టుగల మండలములు వేయికంటే అధికము.

వర్షగిరి అను గంధమాదనమునందు భద్రాశ్వమను వృక్షముండును. అది ఆ కొండ శిఖరమును పుట్టినది. మిక్కిలి ప్రసిద్ధి కలది. అందమైనది. శోభతో నిండినది. మహావృక్షముల కంటె మిన్న. అక్కడ సాక్షాత్తు హృషీకేశుడు సిద్ధుల సంఘములతో కొలువు తీరి యుండును. గుఱ్ఱపు మోముగల విష్ణువు ఆ భద్రకదంబ వృక్షముగల పర్వతపు

చరియను మాటి మాటికి చేరుచుండును. ఆ విధముగా భద్రకదంబమును చూచెడు అశ్వవదనుడు కలది కావున ఆ వర్షమును భద్రాశ్వము అనుచుందురు. సంశయము లేదు. దేవతలు సేవించెడు దక్షిణగిరి శిఖరమందలి వృక్షము జంబువు. (నేరేడు) అప్పటికప్పుడు పూవులు, కాయలు ఒసగుచుండును. పెనుకొమ్మలతో ఒప్పారుచుండును. దాని పండ్లు మిక్కిలి పెద్దవి, రుచి కలవి, మెత్తనివి, అమృతముతో సమానమైనవి. కొండ కొమ్మున రాలుచుండును.

ఆ మేలైన పర్వతము నుండి ఆ పండ్ల రసముతో జాలువారెడు దివ్యనది జంబూనది, తేనెలను స్రవింపజేయుచు పారుచుండును. మరియు దానియందు జాంబూనదమను బంగారము మంచి వన్నె కలిగి అగ్నిజ్వాలవంటి కాంతితో ఉండును. దేవతలకు అలంకారమైనది, పాపములను నశింపజేయునది అగు అది అచట పుట్టెను. దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, గుహ్యకులు అమృతము వంటిది, నేరేడు పండ్ల నుండి జాలువారినది అగు ఆ తేనెను త్రావిరి. దక్షిణ దేశమునకు పతాకవంటి ఆ జంబువు లోకములందు ప్రసిద్ధికెక్కినది. దాని పేరుతోడనే ఆ దేశమును మానవులు జంబూ ద్వీపమని పిలుచుచున్నారు. గొప్పదియగు విపుల పర్వతమునకు దక్షిణమున మిక్కిలి పెద్దదైన అశ్వత్థము (రావి) అను చెట్టు పుట్టినది. అనేక ప్రాణాలు దాన్ని ఆశ్రయించి ఉంటాయి. పెద్ద కొమ్మలు, గొప్పమొదలు, పెక్కు మహాగుణములుగల ఆ చెట్లు పండ్లు కుండలంతటివి. అన్ని ఋతువులలో కాయునవి. మేలైనవి. ఆ వృక్షము కేతుమాల దేశములకు పతాకవంటిది. దేవతలు, గంధర్వులు దానిని సేవింతురు. దానిని బట్టియే దానికి కేతుమాల మనుపేరు ప్రసిద్ధమైనది. నామకర్మములను బట్టి దాని నిర్వచనమును బ్రాహ్మణ ప్రవరులారా! తెలిసికొనుడు. పాలసముద్రమును మధించునపుడు ఇంద్రుడు ఆ చైత్యకేతువు యొక్క స్కంధంలో మాల ఉంచాడు.. అందుచేత ఆ దేశము 'కేతుమాల' మని ప్రసిద్ధికెక్కెను.

సుపార్శ్వము ఉత్తరశృంగమున వటమను పెద్ద మఱ్ఱిచెట్టు కలదు. దాని మొదలు మిక్కిలి విశాలమైనది. దాని మండలము మూడు యోజనముల ప్రమాణము కలది. పెక్కు విధములైన మాలల సముదాయములతో, మిక్కిలిగా వ్రేలాడు కొమ్మలతో అది ఆలరారు చుండును. సిద్ధులు దానిని సేవించుచుందురు. వ్రేలాడు కుంభముల వంటి, బంగారు

వన్నెకాల పండ్లతో ఆ న్యగ్రోధము (మర్రిచెట్టు) ఉత్తర కురు భూములకు పతాక వృక్షముగా ప్రకాశించుచుండును. సనత్కుమారుని తమ్ములు, బ్రహ్మ మానసపుత్రులు ఏడుగురు మహానుభావులు కురువులను వారు అచట ప్రసిద్ధికెక్కిరి. అందు స్థిరమైనగతి గలవారు, జ్ఞానులు, ఏ పాపము నెరుగనివారు, మహాత్ములు ఉందురు. ప్రళయకాలంలో వరకు చెడనిది, సనాతనమగు లోకముగా వారి స్థావరము ప్రసిదికెక్కినది. అది స్వర్ణమునందును, భూమి యందు ఉత్తరు కురువులుగా ఎల్లవేళల కీర్తింపబడునది. (77)

78 వ అధ్యాయము - ఉత్తర దిక్కునందలి మహాపర్వతముల వర్ణనము

మరల రుద్రుడు ఇట్లు చెప్పెను. ఇప్పుడు నేను క్రమముగా ఆ నాలుగు పర్వత రాజముల సుందరములైన శిఖరములను గూర్చి చెప్పెదను వినుడు. అందు పక్షుల కూతలు వినసొంపుగా ఉండు పెక్కు పక్షులు జతకట్టి తిరుగుచుండును. దేవతలు దివ్యకాంతలతో పాటుగా క్రీడించు తావులు అందు కలవు. కిన్నరులు గొంతెత్తి గానములు చేయుచుందురు. చల్లని మెల్లని సువాసనగల గాలులు మిక్కిలి ఇంపునింపుచు వీచుచుండును. అచట నాలుగు దిక్కులకు ప్రవహించు వాగులను గూర్చి చెప్పెదను. పుణ్యాత్ములారా! వినుడు. తూర్పున చైత్ర రథము. దక్షిణమున గంధమాదనము అను వాగులు కలవు. అందు మిక్కిలి రుచిగల నీరు, ఒడ్డులందు మేలరములైన వనములు కలవు. ఆ తోటలను ఆక్రమించి దేవతలు స్త్రీలతో కూడినవారై ఆ తావులలో మిక్కిలి సంతోషముతో క్రీడించుచుందురు. ఆ నాలుగు కొండల యందును మిక్కిలి అందమైన సరస్సులు కలవు. పక్షుల కూతలు,రత్నములు తాపిన రేవులు, అతిపుణ్యమైన జలములు, వినుటకు ఇంపైన ధ్వనులు గల పెద్ద పెద్ద జలయంత్రములు, నీటిలోనికి వ్రాలుచున్న కొమ్మలపై మనోజ్ఞముగా కూయు పక్షుల గూళ్ళు, పద్మములు, కలువలు, ఎర్ర కలువలు మున్నగువానితో ఆ సరస్సులు కలకలలాడు చుండును. ఇంకను పెక్కు గుణములు వానియందు కలవు.

తూర్పున అరుణోదయము, దక్షిణమున మానసము, పడమటి దిక్కున ఆసితోదము, ఉత్తరమున మహాభద్రము అని ఆ సరస్సుల పేర్లు. అనేక వర్ణముల పద్మములు, కలువలు వాని నలంకరించుచుండును. అరుణోదము నావరించి యున్న కొండలు ప్రాచ్యము లందురు వానిని గురించి చెప్పెదను వినుడు. కంకము, మణిశృంగము, సుపాత్రము, మహోపలము, మహానీలము, కుంభము, సుబిందువు,

మదనము, వేణునద్ధము, సుమేదస్సు, నిషధము,దేవపర్వతము అనునవి అచ్చటి మేలైన పర్వతములు. ఇంకను పుణ్యములైన కొండలు కలవు. మందరమునకు తూర్పున సిద్ధములు, మదాయుతములు అను పర్వతములు గలవు. మానస సరోవరమునకు దక్షిణముగా పెద్ద కొండలు గలవు. అచటి కొండలను గూర్చి మీకు చెప్పితిని. వానిపేర్లను చెప్పుదును. వినుడు. త్రిశిఖరము, శిశిరము, కపి, శతమక్షము, తురగము, తామ్రహము, విషము,శ్వేతోదనము,సమూలము, సరళము, రత్నకేతువు, ఏకమూలము, మహాశృంగము, గజమూలము, శాబకము, పంచశైలము, కైలాసము, హిమవంతము అనునవి. ఉత్తరమున నున్న మహా పర్వతములను గూర్చి చెప్పితిని. ఇటుపై వినుడు కపిలము, పింగళము, భద్రము, సరసము, కుముదము, మధుమంతము, గర్జనము, మర్కటము, కృష్ణము, పాండవము, సహస్రశిరము, పారియాత్రము, శృంగవంతము – ఇవి పశ్చిమ దిక్కున ఉన్న పర్వత రాజములు.

ద్విజవరులారా! మహాభద్ర సరస్సునకు ఉత్తరముగా ఉన్న పర్వతములను గూర్చి పలికెదను వినుడు. హంసకూటము, వృషహంసము, కపింజలము, ఇంద్రశైలము, నీలము, కనకశృంగము, శతశృంగము, పుష్కరము, మేఘశైలము, విరజము, జారుచి – ఇవి ఉత్తర దిక్కు పర్వతములు. ఉత్తరమున ఉన్న ప్రధాన పర్వతములు, పీఠభూములు, హ్రదములు, సరస్సులు– ఇవి, వీనిని గురించి చక్కగా తెలిసికొనుడు. (78)

79 వ అధ్యాయము - మేరు పార్శ్వమునందలి మైదానములు

రుద్రుడు ఇట్లు తెల్పెను. సీతాంతము, కుముదము అను కొండల నడుమనున్న విశాలమైన భూమి అనేక పక్షులు, పెక్కు మృగములు ఆశ్రయించినట్టిది, మూడువందల యోజనముల పొడవు, నూరు యోజనముల వెడల్పు కలది, అందు చక్కని స్వచ్ఛమైన రుచికరమగు నీరుగల అందమైన సరస్సు ఒకటి కలదు. పెద్ద కుండలంతటివి సువాసనలను విరజిమ్మునవి, వేయి రేకులు కలవి అగు తెల్లని మహాపద్మములు దానిని అలంకరించి ఉన్నవి. దేవతలు, దానవులు, గంధర్వులు, మహాసర్పములు అందు నెలకొని ఉన్నవి. పుణ్యమైన ఆ సరస్సుపేరు శ్రీసరస్సు, మంచి కాంతితో అలరారును. ప్రసన్నములగు జలములతో నిండినది, ప్రాణులన్నింటికి ఆశ్రయమొసగునది అగు ఆ సరస్సు నడిమి భాగమున పద్మముల తోటలో ఒక పెద్ద పద్మము కలదు. దానికి కోటి రేకులు కలవు. అది

ఉదయించు సూర్యుని వంటి దీప్తి కలది. ప్రతిదినము వికసించుట చేత మధురమైనది. కదలుచుండుటచేత పెద్ద మండలము కలిగియుండెను. అందమైన కేసరముల గుత్తులతో, మదించిన తుమ్మెదల నాదములతో ఒప్పారుచుండును. దాని నడుమ భగవతి లక్ష్మి నిత్యనివాస మొనరించును. ఆ నివాసమున సాక్షాత్తు రూపము ధరించి లక్ష్మి కన్పట్టును,సంశయము లేదు. ఆ సరస్సు ఒడ్డున సిద్ధులు నివసించునది, ఎల్లప్పుడు పూవులతో పండ్లతో సమృద్ధిగా ఉండునది, అందమైనది అగు మారేడు వనము ఒకటి కలదు. నూరుయోజనముల వెడల్పు, రెండు యోజనముల పొడవు కలిగి, అర్ధక్రోశము వరకు వ్యాపించిన చివరలు గలవి, వేలకొలది కొమ్మలు కలవి, గొప్పకాండములు కలవి అగు మహావృక్షములతో నిండియున్నది. పెద్దభేరులంతటి వేలకొలది, పచ్చని, తెల్లని అమృతమువలె రుచికరమైన, మంచి వాసనలుగల పండ్లతో ఒప్పారును. పండిపగిలి, రాలిపడుచున్న పండ్లతో ఆ భూమి అంతయు వ్యాపించి ఉన్నది. దాని పేరు శ్రీవనము. అన్ని లోకములలో ప్రసిద్ధికెక్కినది. ఎనిమిది దిక్కులందును దేవతలతో, బిల్వ ఫలములను మాత్రమే భుజించు పుణ్యవంతులగు మునులతో నిండియున్నది. అచట సిద్ధ సంఘములు కొలుచుచున్న శ్రీదేవత సర్వకాలములలో నివాసము చేయును.

ఒక్కొక్క కొండకు నడిమి ప్రదేశము నూరు యోజనముల వెడల్పు, రెండు నూర్ల యోజనముల పొడవు కలిగియుండెను. అందు విమలమైన పద్మవనము కలదు. దానిని సిద్ధులు, చారణులు సేవించి యుందురు. లక్ష్మీదేవి తాల్చిన పుష్పమువలె ఎల్లప్పుడు వెలిగిపోవుచు ప్రకాశించును. అర్దకోశము ఎత్తుగల చివరి భాగములతో పెద్ద పెద్ద కాండములతో బాగుగా పుష్పించిన కొమ్మల చివరలతో ఆ వనము లేత ఎరుపు వన్నెతో అలరారును. రెండు బారల చుట్టుకొలతయు మూడు బారల విస్తృతియు, మణిశిల చూర్ణము వంటి రంగుతో, తెల్లని కేసరములతో, నిత్యము వికసించును, సువాసనలతో అలరారు పూవులతో ఆ వనము మదించిన తుమ్మెదల నాదముతో ప్రకాశించుచుండును. దానవులు, దైత్యులు, గంధర్వులు, యక్షులు, రాక్షసులు, కిన్నరులు, అప్సరసలు, సర్పములు దానిని ఆశ్రయించియుండును. అందు భగవంతుడగు కశ్యప ప్రజాపతి ఆశ్రమము కలదు. సిద్ధులు, సాధు గుణములు కలవారు అందు కొల్లలుగా నుందురు. అనేక ఆశ్రమాలతో అది నిండియుండును.

మహానీలము, కుంభము అను కొండల మధ్య 'సుఖ' అనునది కలదు. దాని వద్దున పెద్ద వనమున్నది. ఏబది యోజనముల పొడవు, ముప్పది యోజనముల మండలము కలిగిన ఆతాలవనము(తాటితోపు) అందమైనది. శోభ నిండినది. అర్ధక్రోశము ఎత్తు పెరిగిన చెట్లు గలది. గొప్పబలము, గొప్ప సారము, గట్టితనము గల పండ్లు అందు కాటుక కొండలవలె ఉండును. గుండ్రనితనముతో అలరారెడు మహాఫలములతో ఆ వనము ఒప్పారు చుండును. ఇంపైన పరిమళము ప్రకాశించును. సిద్ధులు సేవించు ఆ ప్రదేశము ఐరావత గజమునకు స్థానమైనదిగా చెప్పుచుందురు. ఐరావతము, రుద్రము అను దేవ పర్వతముల నడుమ వేయి యోజనముల పొడవు, నూరు యోజనముల వెడల్పు గల ఒకరాతి భూమి చెట్లు చేమలు లేనిది కలదు. కాలి లోతు నీరులో అన్నివైపుల మునిగియుండును.విప్రవర్యులారా! మేరుపార్శ్వమున అనేక ఆకారములుగల మైదానములను గూర్చి మీకు వివరించి చెప్పితిని. (79)

౮౦ వ అధ్యాయము - దక్షిణ దిక్కునందలి పర్వతాదుల వర్ణనము

రుద్రుడు ఇట్లనెను: ఇటుపై దక్షిణ దిక్కున నెలకొన్న పర్వతముల మైదానములను గూర్చి చెప్పెదను. శిశిర పతంగముల నడుమ తెల్లని భూమి కలదు. అందు తీగలు చెట్లు కానరావు. ఇక్షు క్షేపమను శిఖరమున చక్కని చెట్లతో ఒప్పారునదియు, పక్షుల మూకలు నివసించునదియు అగు అందమైన ఉదుంబర (మేడిచెట్ల) వనము కలదు. పెద్దతాబేళ్ల వంటి పండ్లతో ఆ వనమంతయు విరుగబూచినట్లుండును. అష్టవిధదేవతలు ఎల్లవేళల ఆ వనమును ఆశ్రయించియుందురు. అచట ప్రసన్నములు, రుచికలవి అగు జలములుగల నదులు ఎక్కువనీరు కలవియై ప్రవహించుచుండును. అచట పూజ్యుడగు కర్దమప్రజాపతి ఆశ్రమము కలదు. అనేక మునిజనులతో నిండిన ఆ ఆశ్రమము నూరు యోజనముల వైశాల్యము కలది. మరియు అచట మండలాకారముగల వనము ఒకటి కలదు. అట్లే తామ్రాభము, పతంగము అను పర్వతముల నడుమ నూరుయోజనముల వెడల్పు, దానికి రెట్టింపు పొడవు కలదియు, బాలసూర్యుని వంటివి, అన్నివైపుల దట్టముగా ఉన్నవి అగు నూరురేకుల పద్మములతో ఒప్పారెడు గొప్ప సరస్సు కలదు. దాని దగ్గర అనేక సిద్ధులు, గంధర్వులు నివసించుచుందురు. దాని నడుమ ఒక మహాశిఖరము నూరు యోజనముల పొడవు, ముప్పది యోజనముల విస్తీర్ణము కలది కలదు. దానిపై రత్నమయములగు

తోరణములుగల పెద్దబాటఉన్నది. దానిలో పెద్ద విద్యాధరపురము కలదు. అందు విద్యాధరరాజు పులోముడు నూరువేల పరివారముతో ఉండును. అట్లే విశాఖ, శ్వేతము అను కొండల నడుమ ఒక సరస్సు కలదు. దాని తూర్పు ఒడ్డున పెద్దమామిడి తోట కలదు. బంగారువన్నెయు, మంచి వాసనయు, పెద్దకుండలంతటి ప్రమాణమును గల పండ్లతో అది నిండి యుండును. దేవతలు, గంధర్వులు మొదలగువారు అందు నివసింతురు. సుమాలము, వసుధారము అను కొండల నడుమ ప్రదేశము ముప్పది యోజనముల వెడల్పు, ఏబది యోజనముల పొడవు కలది. అందు బిల్వస్థలి అనువనము కలదు. దాని ఫలము పగడముల వన్నెతో నుండును. అవి రాలి పడుచుండగా అచటి మట్టి అంతయు తడి తడిగా అగుచుండును. ఆ తావునందు ఆ మారేడు పండ్లను తిను సుగుహ్యకాదులు నివసింతురు.

వసుధార, రత్నధార గిరుల నడుమ ముప్పది యోజనముల వెడల్పు, నూరు యోజనముల పొడవు గల సువాసనతో నిండిన కింశుక (మోదుగు చెట్ల) వనము కలదు. అది ఎల్లవేళల పూచుచుండును. దాని సువాసన నూరు యోజనముల వరకు వ్యాపించును. అందు సిద్ధులు నివసింతురు. మంచినీరందుండును. నెలనెలకు సూర్యప్రజాపతి అక్కడ దిగుచుండును. కాలమునకు జనకుడగు ఆ సూర్యునికి దేవతలు మొదలగు నమస్కరించు చుందురు.

పంచకూటము, కైలాసము అను కొండల నడుమ వేయి యోజనముల పొడవు నూరు యోజనముల వెడల్పుగలదియు, హంసలతో తెల్లనైనదియు, నీచమృగములు చొరరానిదియు స్వర్గమునకు మెట్టువంటిదియునగు భూమండలము కలదు.

సుపార్శ్వము, శిఖి అను ఇక పడమటి దిక్కునందలి పర్వత ప్రాంతములను చెప్పెదను. కొండల నడుమ నూరు యోజనముల పాషాణమయము, ఎల్లప్పుడు కాలుచుండునట్టిది. తాకరానిది అగు భూభాగము కలదు. దాని నడుమ ముప్పది యోజనముల వైశాల్యముగల మండలము కలదు. అది అగ్నిస్థానము. అచట అన్నింటిని క్షయముచేయు సంవర్తకుడను అగ్నిదేవుడు మండుచుండును. కుముదము, అంజనము అను దొడ్డ పర్వతముల నడుమ నూరు యోజనముల విస్తీర్ణముగల మాతులుంగ (మాదీఫలము) వనము కలదు. ఎల్ల జంతువులకును అది చొరశక్యము కానిది. పసుపు

పచ్చని పండ్లతో నిండి ఆ తావు విరాజిల్లుచుండును. అందు సిద్ధులకు నెలవగు పుణ్యమగు సరస్సు కలదు. ఆ వనము బృహస్పతిది. మరియు పింజర, గౌరగిరుల మధ్య ఒక జలప్రదేశముకలదు. పెక్కువందల ఆమడల పొడవైనది. పెద్దపెద్ద తుమ్మెదలు,రొదచేసెడు కలువలతో ఒప్పారుచుండును. అది పరమేశ్వరుడగు విష్ణువు స్థానము.

అట్లే శుక్లము, పాండురము అను పెద్ద కొండల మధ్య ముప్పది యోజనముల వెడల్పు, తొంబది యోజనముల పొడవు కల చెట్లు లేని ఒక రాతిప్రదేశము కలదు. అందొకచోట బురదలేని దిగుడు బావి, కొన్ని చెట్లు కలది ఉన్నది. దాని సమీపమున పెక్కు జాతులకు సంబంధించిన మెట్టతామరల తీగలు పద్మములతో అలరారుచుండును. దాని నడుమ అయిదు యోజనముల వైశాల్యము గల పెద్దరావి చెట్టు కలదు. అందు ఉమాపతి, నీలవర్ణపు వస్త్రము తాల్చినవాడు అగు చంద్రశేఖరుడు, యక్షాదులు స్తుతించు చుండగా నివసించును. సహస్రశిఖరము, కుముదము అను కొండల నడుమ ఏబది ఆమడల పొడవు, ఇరువది ఆమడల వెడల్పుగల ఇక్షుక్షేపము అను ఎత్తైన శిఖరము కలదు. పెక్కు విధములైన పక్షులందుండును. పెక్కు తీరుల చెట్ల ఫలములు తీయని రసములను జాలువార్చు చుండును. అచట దివ్యభావములతో కూడిన ఇంద్రుని ఆశ్రమము కలదు. మరియు శంఖ కూటము, ఋషభమను గిరులమధ్య 'పురుషషలి' అను తావు కలదు. గొప్ప గుణములు అనేక యోజనములు విస్తారము కలది. మారేడు పండ్లంతటి కంకోల ఫలములు మంచి వాసన కలవి అందుండును. పున్నాగ పుష్పముల రసముతో ఉన్మత్తములగు మహాసర్పము లందుండును.

అట్లే కపింజలము నాగము అను కొండల నడుమ, రెండు వందల యోజనముల పొడవు వెడల్పు గల 'శతయోజనస్థలి' కలదు. అందు పెక్కుతోటలు, ద్రాక్ష, ఖర్జూరములతో అలరారి ఉన్నవి. పెక్కు చెట్లు, తీగలు, సరస్సులు ఆతావున ఉండును. అట్లే పుష్కరము, మహామేఘము అను పర్వతముల నడుమ ఆరువది ఆమడల వెడల్పు, నూరు ఆమడల పొడవుగల 'పాణితల'మను పెద్ద మైదానము కలదు. అందు చెట్లు చేమలు ఉండవు. దాని ప్రక్క నాలుగు పెద్ద వనములు, పెక్కు యోజనముల విస్తృతిగల సరస్సులు కలవు. పది, అయిదు, ఎనిమిది, ముప్పది, ఇరువది యోజనముల ప్రమాణము కల భూములు, మైదానములు కలవు. అందు కొన్ని మహాఘోరములగు గుహలును ఉన్నవి. (80)

81 వ అధ్యాయము - పర్వతములందున్న దేవతా స్థానముల వర్ణన

రుద్రుడు పలికెను. ఇటుపై పర్వతములందలి దేవతల స్థానములను వివరింతును. అందు 'శాంతము' అను పేరుగల దేవేంద్రుని క్రీడాస్థలము కలదు. అది మహేంద్రగిరి పైభాగమున నున్నది. అందు దేవతల రాజు ఇంద్రుని పారిజాత వృక్షములతోట కలదు. దాని తూర్పు భాగమున కుంజరమును కొండయు, దానిపై దానవుల ఎనిమిదిపురములును కలవు. నీలకములు, కామరూపులు, మహానీలమనియు – ఇవి పర్వతములపై ఉన్న పురములు. కిన్నరుల పురములు పదునైదువేలుగా ప్రసిద్ధికెక్కినవి. దేవదత్తుడు, చంద్రుడు మొదలగువారు కిన్నరుల రాజులు. వారు పదునైదుగురు గర్వితులు. కలుగులు ప్రవేశముగా గలవారి పురములు స్వర్ణమయములు.

చంద్రోదయమను గొప్పపర్వతము నాగులకు నివాస భూమి. రంధ్రములలో ప్రవేశించు నాగులు ఆ రంధ్రములలో గరుత్మంతునకు దొరకక తిరుగుచుందురు. అనురాగము అను పర్వతమున రాక్షసేంద్రులు నివసింతురు. వేణుమంతమను పర్వతమున విధ్యాధరుల మూడు పురములు కలవు. ఒక్కొక్కటి ముప్పది ఆమడల వైశాల్యము కలిగినది. ఉలూకుడు,రోమశుడు, మహావేత్రుడు మొదలగు వారు విద్యాధరుల రాజులు. ఒక్కొక్క పర్వత రాజమున స్వయముగా గరుడుడు నివసించి యుండును.

కుంజరమను ప్రసిద్ధిగల కొండపై పశుపతి, వృషభము గుర్తుగా గలవాడు మహాదేవుడు, యోగులలో శ్రేష్ఠుడు అగు శంకరుడు నిత్యము నివసించును. పెక్కు గుణములుగా గల భూతముల సముదాయములు వేలకొలదిగా సేవించెడు భగవానుడు అనాదిపురుషుడు శంకరుడు అందు కాపుర ముండును. వసుధారము పుష్పవంతులగు వసువుల నెలవు. వసుధార, రత్నధార అను పర్వతముల శిఖరముపై ఎనిమిది, ఏడు సంఖ్యలుగల పురములు అష్టవసువులకు, సప్తర్షులకు సంబంధించినవి కలవు.

ఏకశృంగమను పర్వతమున భగవంతుడగు చతుర్ముఖుని స్థానముకలదు. గజపర్వతమున మహాభూతములు కొలిచియుండగా భగవతియే స్వయముగా నెలకొనియున్నది. వసుధారమఅను పర్వతము మునులు,సిద్ధులు,విద్యాధరులు అనువారి నెలవు, గొప్ప ప్రాకారములు తోరణములుగల ఎనుబది నాలుగు పురములు అందుగలవు.

అచట అనేక పర్వతులను గంధర్వులు యుద్ధములు చేయుటలో ఆరితేరిన వారు నివసింతురు. వారి అధిపతి రాజరాజగు కేబురుడు ఏక అను పింగళుడు.

పంచకూటమున సురల, రాక్షసుల, శతశృంగమున దానవుల, యక్షుల నూరేసి పురములు కలవు. తామ్రాభమున తక్షకుని నూరుపురములు, విశాఖ పర్వతమున గుహుని నివాసము కలవు. శ్వేతోదయమను గిరివరమందు గరుడుని పుత్రుడగు సునాభుని నివాసము, పిశాచకమను గిరివరమున మహాగంధర్వుల భవనము కలవు. హరికూటమున హరిదైవము. కుముదమున కిన్నరుల నెలవు. అంజనమున మహా సర్పములు, కృష్ణమున గంధర్వ నగరము, విద్యాధరుల పురములు ఏడు అలరారుచున్నవి. సహస్ర శిఖరమున భయంకర చేష్టలుగల దైత్యుల నివాసములు కలవు. హేమమాలి పర్వతములయందు ఒకవేయి పురములు కలవు. అందు శిఖరమున పాముల రాజులుందురు. ప్రపక్షమను పర్వతవరమున విస్వంతుడు, సోముడు, వాయువు, నాగరాజు అనువారి భవనములు నాలుగు కలవు. ఈవిధముగా మేరుపర్వతములయందు దేవతల నివాసములు ఉన్నవి.

మర్యాదాపర్వతమున దేవకూటమున పురముల స్థితిని తెలుపుచున్నాను. దానిపై నూరుయోజనముల మేర గరుడుని స్థానమేర్పడి యున్నది. దాని ప్రక్కభాగముననే ముప్పది ఆమడల వెడల్పు, నలుబది ఆమడల పొడవుగల ఏడు గంధర్వ నగరములు కలవు. అచటి గంధర్వులు ఆగ్నేయులనువారు. గొప్పబలము కలవారు. అందు మరియొక పురము సైంహికేయులది ముప్పది యోజనముల మండలము కలదు. అందు దేవర్షులు దేవకూటమున తిరిగెడు తావులు కానవచ్చును. కాలకేయులపురము కూడ అందే కలదు. దానికి దక్షిణమున ముప్పది యోజనముల వెడల్పు అరువది రెండు యోజనముల పొడవుగల మహాగర్వముగల కామరూపుల పురము కలదు. హేమకూటము నడుమ మహాదేవుని రావిచెట్టు కలదు.

ఇటుపై కైలాస వర్ణనము. కైలాసము ఒడ్డున నూరామడల పొడవు వెడల్పులు గల భువనపంక్తి వ్యాపించి యున్నది. దానినడుమ సభ. అందే పుష్కరమను విమానము కలదు. అదే కుబేరునిది. అదియే అతని నివాస స్థలము. అందు పద్మము, మహాపద్మము, మకరము, కచ్ఛపము, కుముదము, శంఖము, నీలము, నందము అను మహానిధులు కలవు. అందు చంద్రుడు మొదలగు లోకపాలుర నివాసములును ఉన్నవి. అందే

మందాకిని, కనకమంద, మంద అనునదులు, మరియు ఇతర నదులు కలవు. తూర్పు పార్శ్వమున నూరామడల పొడవు, ముప్పది ఆమడల వెడల్పుగల పది గంధర్వ నగరులు కలవు. అందు సుబాహువు, హరికేశుడు, చిత్రసేనుడు మొదలగువారు రాజులు, దాని పడమటి శిఖరమున ఒక్కొక్కటి ఎనుబది యోజనముల పొడవు, నలువది యోజనముల వెడల్పు గల యక్షనగరములు కలవు. అందు మహామాలి, సునేత్రుడు, చక్రుడు మొదలగువారు నాయకులు. దాని దక్షిణ పార్శ్వమున పొదలు, చరియలుగల గుహలయందు సముద్రములనబడు కిన్నరుల నూరు ఇండ్లు కలవు. వానియందు ద్రుమ, సుగ్రీవ, భగదత్త అను ప్రముఖులగు రాజులు నూరుగురు కలరు. అందే రుద్రునకు ఉమాదేవితో వివాహము జరిగినది. గౌరియు అందే తపస్సుచేసినది. అందుండియె శంకరుడు ఉమాదేవితో పాటు జంబూద్వీపమును చూచెను. అందు పెక్కండ్రు కిన్నరులు, గంధర్వులు గానములు చేయు ఉమావనము కలదు. అందు పెద్ద సంఖ్యలో అప్సరసలు, పూలతీవెలు కలవు. అందే భగవంతుడగు రుద్రుడు అర్ధనారీనర రూపమును పొందెను. మరియు అందు కార్తికేయుని (కుమారస్వామి) శరద్వనము కలదు. పుష్పచిత్రము, క్రౌంచము అనువాని మధ్య కార్తికేయుని అభిషేకము జరిగెను. దాని తూర్పు ఒడ్డున సిద్ధుల, మునిగణముల నివాసమగు కలాపమను గ్రామము కలదు. అట్లే మార్కండేయుడు, వసిష్ఠుడు, పరాశరుడు, నలుడు, విశ్వామిత్రుడు, ఉద్దాలకుడు మొదలగు మహర్షుల వేల ఆశ్రమములు కలవు.

మరియు, పడమటి దిక్కుననున్న నిషధపర్వతభాగమును గూర్చి వినుడు. దాని మధ్యశిఖరమున మహాదేవుని విష్ణ్వాలయము కలదు. దాని ఉత్తరపు ఒడ్డున ముప్పది ఆమడాల వైశాల్యముకల 'లంబ' అను పేరుగల రాక్షసపురముకలదు. దాని దక్షిణ పార్శ్వమున బిలప్రవేశ నగరము ఉన్నది. ప్రభేదకమను కొండకు పడమరగా దేవదానవ సిద్ధాదుల పురములు కలవు... గిరికొమ్మున పెద్ద సోమశిల కలదు. దాని యందు పర్వమున (పూర్ణిమదినము) చంద్రుడు స్వయముగా అవతరించును. దాని ఉత్తర పార్శ్వమున త్రికూటమను పర్వతము కలదు. అందు అప్పుడప్పుడు బ్రహ్మ ఉండును. మరియు అచట గల అగ్నిదేవుని ఆలయమున, రూపుగొన్న, అగ్నిదేవుని దేవతలు ఉపాసింతురు.

శృంగము అను ఉత్తర దిక్కునందలి పర్వతమున దేవతల భవనములు కలవు. తూర్పున నారాయణుని ఆలయము. మధ్య బ్రహ్మదేవునిది. పడమటి దిక్కున శంకరునిది మరియు అందు యక్షాదుల పురములు కొన్ని కలవు. దాని ఉత్తరపు తీరముననున్న జాతుభమను పర్వతమున ముప్పది ఆమడల మండలముల నందజలమను సరస్సు కలదు. అందు నందుడను నూరుతలలవాడు, ప్రచండుడగు నాగరాజు ఉండును. ఈ విధముగా ఈ ఎనిమిది దేవపర్వతములు తెలియదగినవి. వరుసగా బంగారము వెండి, రత్నము, వైడూర్యము, మణిశిల, హింగుళము (ఇంగిలీకము) మొదలగు వర్ణములు వానికి కలవు. ఈ భూమి నూరు లక్షల కోట్ల జనముతో నిండినది. వానియందు సిద్ధ విద్యాధరులు మొదలగువారి నివాసములు కలవు. మేరువు ప్రక్కగా ఉన్న సర్వపాదువంటి ఆ నిలయములన్నింటిని కలిపి సిద్ధలోకమని చెప్పుదురు. ఈ భూమి పద్మము ఆకారముతో నెలకొని యున్నది. ఇది అన్ని పురాణముల యందును సాధారణముగా చెప్పబడు విషయము. (81)

82 వ అధ్యాయము - దక్షిణదిక్కునందలి నదుల వర్ణనము

పిమ్మట రుద్రుడు ఇంకను ఇట్లు చెప్పెను. ఇటుపై నదుల అవతారమును గూర్చి వినుడు. ఆకాశ సముద్రమని ప్రసిద్ధికెక్కిన సామమను పేరుగల దానినుండి ఆకాశమున ప్రవహించు నదిఒకటి బయలుదేరెను. ఇంద్రుని యేనుగు దానిని కుదిలించి వేయుచుండును. అది ఎనుబది నాలుగు యోజనముల వెడల్పు కలది. అది మేరువును చక్కని దర్శనీయ స్థలము కావించునది. అదియు మేరు శిఖరపు ఒడ్డుల నుండి జారినదై నాలుగు పాయలుగా అయినది. అరువది యోజనముల మేర ఆధారములేక పడుచు ప్రదక్షిణముగా తిరుగుచు నాలుగుపాయలై ప్రవహించినది. సీత,అలకనంద,చక్షువు, భద్ర అని ఆపాయల పేర్లు. ఆయా స్థలములలో ప్రవహించుచు, కొన్ని వందల పర్వతములను చీల్చుకొని భూమికి చేరుటచేత దానికి గంగ అనుపేరు కలిగినది. (గాం భూమిని, గతా – పొందినది – గంగా).

ఇక గంధమాదనము ప్రక్కగానున్న అమరగండికను గూర్చి తెలిపెదను. అది ముప్పది యొక్కవేల యోజనముల పొడవు, నాలుగు వందల యోజనముల వెడల్పు కలిగి యుండెను. అచటి జనపదములు కేతుమాల అను పేరు కలవి. నలుపు వన్నెయు

మహాబలము కల పురుషులును, కలువల వంటి వన్నెగల చూడముచ్చటగా ఉన్న స్త్రీలును అందుందురు. అచట పనసచెట్లు పెద్దగా పెరిగి ఉండును. అందలి నీరు త్రావుటవలన ముసలితనము, రోగము లేనివారై వేయి యేండ్ల ఆయువు కలవారై జనులుందురు.

మాల్యవంతము తూర్పుతటమున పూర్వగండిక అను నదికలదు. ఒక కొండ కొమ్మునుండి ప్రవహించు ఆ నది, వేల యోజనముల కొలత కలది. అందు భద్రాశ్వములను జన పదములు, భద్రసాలమను వనము ఉన్నవి. నల్లని మామిడి చెట్లు, తెల్లని పద్మమువంటి వన్నెగల పురుషులు, ఎర్రతామరల వన్నెకల స్త్రీలు ఉందురు. వారి ఆయువు పదివేల వత్సరములు. అందు అయిదు కులపర్వతములు – శైలవర్ణము, మూలము, కోరజము, త్రిపర్ణము, నీలము అను పేర్లు కలవి కలవు. వానినుండి నదులు వెలువడినవి. వాని నీరుగల దేశములకు అవియే పేర్లు. ఆ దేశవాసులు ఆ నదుల నీరు త్రావుచుందురు. ఆ నదులు – సీత, సువాహిని, హంసవతి, కాస, మహాచక్ర, చంద్రవతి, కావేరి, సురస, శాఖావతి, ఇంద్రవతి, అంగార వాహిని,హరితోయ, సోమావర్త, శతహ్రద, వనమాల, వసుమతి, హంస, సుపర్ణ, పంచగంగ, ధనుష్మతి, మణివప్ర, సుబ్రహ్మభాగ, విలాసిని, కృష్ణతోయ, పుణ్యాద, నాగవతి, శివ, శేవాలిని, మణికట, క్షీరోద, వరుణావతి, విష్ణుపది, మహానది, హిరణ్యస్కంధవాహ, సురావతి, కామోద, పతాక – అనునవి. ఇవి అన్నియు గంగతో సమానమైనవి. బ్రదుకున్నంత వరకు పాపములను పోకార్చునవి. ఇంకను చిన్న వాగులు కోట్ల కొలది కలవు. ఈ నదుల నీరు త్రావువారు పదివేల సంవత్సరముల ఆయువు కలవారు. రుద్రునియందు, ఉమాదేవి యందు భక్తికలవారు. (82)

83 వ అధ్యాయము - నైషధపర్వతమునందలి నదులు

అనంతరము రుద్రుడు ఇలా చెప్పెను. భద్రాశ్వములు, కేతుమాలములు అనువాని స్థితిని విస్తరముగా వర్ణించితిని. నైషధమను పర్వతమునకు పడమరగా ఉన్న కులపర్వతములను, మహానదులను తెలియజెప్పుదును, విశాఖము, కంబలము, జయంతము, కృష్ణము, హరితము, అశోకము, వర్ధమానము అనునవి ఆ ఏడు కులపర్వతముల పేర్లు. వాని నుండి కోట్లకొలది నదులు పుట్టినవి. వాని ఒడ్డున నివసించు జనపదములకు అవియే పేర్లుగా చూచుకొనవలయును.

సౌరగ్రామము, అత్తసాంతపము, కృతసుర, శ్రవణము, కంబలము, మాహేయము, అచలకూటము, వాసమూలము, తపక్రౌంచము, కృష్ణాంగము, మణి పంకజము, కృష్ణపాట విదము, కపిలము, కర్ణికము, మహిషము, కుబ్జము, కరనాటము, మహోత్కటము, శుకనాసము, గజభూమము, కకురంజనము, మనాహకము, కిసపౌర్ణము, భౌమకము, చోరకము, ధూమజన్మము, అంగారము, జతీవనము, జీవలౌకిలము, వాచాంసహము, అంగమధురేయము, శుకేచకేయము. శ్రవణమత్తము, కాసికము, గోదావామము, కులపంజ, వర్జహము, మోదము, అలకము–అను ఈ జనపదములు పర్వతముల నుండి పుట్టిన నదులజలములను త్రావును. ప్లక్ష, మహోకదంబ, మానసి, శ్యామ, సుమేధ, బహులు, వివర్ణ, పుంఖ మాల, దర్భవతి, భద్రానది, శుకనది, పల్లవ, భీమ, ప్రభంజన, కాంబ, కుశావతి, దక్ష, కాసవతి, తుంగ, పుణ్యోద, చంద్రావతి, సమూలావతి, కకుద్మిని, విశాల కరంటక, పీవరి, మహామాయ, మహిషి, మానుషి, చండ – ఇవి ప్రధాననదులు, తక్కిన చిన్న నదులు వేలకొలదిగా గలవు. (83)

84 వ అధ్యాయము - ఉత్తర దక్షిణ దేశములందలి పర్వతాదుల వర్ణనము

రుద్రుడు ఇట్లు చెప్పెను. విప్రులారా! ఉత్తరదేశములయు, దక్షిణ దేశములయు పర్వతములందు నివసించు వారి వివరములను చెప్పుచున్నాను. చెదరని మనస్సులతో వినుడు. శ్వేత పర్వతమునకు దక్షిణముగా, నీలమునకు ఉత్తరముగా, వాయవ్యదిశలో రమ్యకమును దేశము కలదు. అందు బుద్ధివిశేషము కలవారు. స్వచ్ఛజీవనము కలవారు. ముసలితనమును, దుర్వాసన లేనివారు అయిన జనులు ఉందురు. అందును ఒక పెద్ద రావిచెట్టు 'రోహితము' అనునది కలదు. దానిపండువలనను, దాని రసమును త్రావుటవలనను అందలి మనుజులందరు దేవరూపులై పదివేల సంవత్సరములు ఆయువు కలవారగుదురు. శ్వేత పర్వతమునకు ఉత్తరముగా, త్రిశృంగమునకు దక్షిణముగా హిరణ్మయము అను దేశము కలదు. అచట హైరణ్వతి అనునది కలదు. ఆ దేశమున బలవంతులు, కామరూపులు అగు యక్షులు నివసింతురు.

అందలి జనులు పదునొకండు వేలయేండ్లు జీవింతురు. మరియు వందల కొలదిగా ఇతరులు పదునైదువేల యేండ్లు బ్రదుకుదురు. ఆ దేశమున చిన్నవియగు గజనిమ్మ వృక్షము లుండును. ఆ పండ్లను తినుచు అచటి మానవులు జీవింతురు.

అట్లే త్రిశృంగపర్వతమున మణికాంచనము, రత్నశిఖరము అనువాని వరుసలో దాని ఉత్తరశృంగము మొదలుకొని దక్షిణ సముద్రము తుదివరకు ఉన్నవి ఉత్తరకురు భూములు. అందలి జనులకు వస్త్రములు, ఆభరణములును చెట్టులందే కలుగును. అవి పాలను, రసములను ఇచ్చు వృక్షములు. అది అంతయు మణులు నిండిన భూమి, ఇసుక సువర్ణమయము. అందు స్వర్గము నుండి జారిన మనుష్యులు పదుమూడువేలయేండ్ల ఆయువు కలవారు నివసింతురు. ఆ ద్వీపమునకు పడమరగా దేవలోకము నుండి నాలుగువేల యోజనములు దాటిన పిమ్మట చంద్రద్వీపము కలదు. వేయి అమడల వైశాల్యము కలది. దానిమధ్య చంద్రకాంత సూర్యకాంతములను గొప్ప పర్వతములు కలవు. వానిమధ్య చంద్రావతి అను మహానది పెక్కు పండ్ల చెట్లతో పెక్కునదులతో కూడినది కలదు. దీనినే కురుదేశము అందురు. దాని ఉత్తర పార్శ్వమున సముద్రపు అలల మాలలతో గొప్పదియు, దేవలోకము నుండి అయిదువేల యోజనముల దూరమున ఉన్నది, వేయి ఆమడల వైశాల్యమున్న సూర్యద్వీపము కలదు. దాని మధ్య నూరుయోజనముల విస్తీర్ణము, ఎత్తుగల గొప్ప పర్వతమున్నది. అది సూర్యదేవుని నివాసభూమి. అందు సూర్యుడు దైవముగా గలవారు,ఆ వన్నె కలవారు పదివేల సంవత్సరముల ఆయువు కలవారు అగు జనులుందురు. ఆ ద్వీపమునకు పడమరగా నాలుగువేల యోజనములు దాటి పదివేల ఆమడల వైశాల్యము గల రుద్రాకరమను ద్వీపము కలదు. అందు వాయుదేవుని భద్రాసనము, పెక్కు రత్నములతో విరాజిల్లునది కలదు. అందు వాయుదేవుడు రూపముతాల్చి నివసించును, బంగారు వన్నెకల అచటి ప్రజలు అయిదువేల ఏండ్ల ఆయువు కలవారు.(84)

85 వ అధ్యాయము - నవఖండాత్మక భారతవర్ష వర్ణనము

మరల రుద్రుడు ఇట్లు చెప్పెను. ఇట్లు భూపద్మము స్వరూపమును వివరించితిని. ఇప్పుడు తొమ్మిది భేదము గల భారతవర్షమును గూర్చి వినుడు. అవి ఇంద్రము, కేసరువు, తామ్రవర్ణము, గభాస్తి, నాగద్వీపము, సౌమ్యము, గంధర్వము, వారుణము, భారతము అనునవి. సముద్రము చుట్టిన ఇవన్నీ ఒక్కొక్కటి వేయి యోజనముల వైశాల్యము కలవి. అందు ఏడు కులపర్వతములు కలవు. అవి మహేంద్రము, మలయము, సహ్యము, శుక్తిమంతము,ఋక్షము, వింధ్యము,పారియాత్రము అనునవి.

ఇంకను మందరము, శారము, దర్ధురము, కోలాహలము, సురము, మైనాకము. వైద్యుతము, వారంధమము, పాండురము, తుంగప్రస్థము, కృష్ణగిరి,జయంతము, రైవతము, ఋష్యమూకము, గోమంతము, చిత్రకూటము, శ్రీచకోరము, కూటశైలము, కృతస్థలము మొదలగు చిన్న కొండలు కలవు. మిగిలినవి గుట్టలు. వానికడ ఆర్యులు, మ్లేచ్ఛులు అను జానపదులు నివసింతురు. వారికి ఈ నదుల జలములు పానీయములు. అవి – గంగ, సింధు, సరస్వతి, శతద్రు, వితస్త, విపాశ, చంద్రభాగ, సరయువు, యమున, ఇరావతి, దేవిక, కుహువు,గోమతి, ధృతపాప, బాహుద, దృషద్వతి, కౌశికి, నిస్వర, గండకి, చక్షుష్మతి, లోహిత అనునవి. ఇవి హిమవంతుని పాదములనుండి వెలువడినవి. వేదస్మృతి, వేదవతి, సింధుపర్ణ, సుచందన, సదాచార, రోహిపార, చర్మణ్వతి, విదిశ, వేదత్రయి, వపన్తి అనునదులు పారియాత్ర పర్వతమునుండి పుట్టినవి. శోణ, జ్యోతిరథ, నర్మద, సురస, మందాకిని, దశార్ణ, చిత్రకూట, తమస, పిప్పల కరతోయ, పిశాచిక, చిత్రోత్పల, విశాల, వంజుల, వాలుక, వాహిని, శుక్తిమతి, విరజ, పంకిని,రీరి, కుహువు అనునవి ఋక్షపర్వతము నుండి పుట్టిన నదులు. మణిజాల, శుభ,తాపి, పయోష్ఠి, శ్రీఘోద, వేష్ణ, పాశ, వైతరణి, వేది, పాలి, కుముద్వతి, తోయ, దుర్గ, అంత్య, గిర – అనునదులు వింధ్య పర్వతము నుండి వెలువడినవి. గోదావరి, భీమరథి, కృష్ణ, వేణ, వంజుల, తుంగభద్ర, సుప్రయోగ, వాహ్య, కావేరి అనునవి సహ్య పర్వతమునుండి పుట్టిన నదులు. శతమాల, తామ్రపర్ణి, పుష్పావతి, ఉత్పలావతి అనునవి మలయ పర్వతమున పుట్టినవి. త్రియామ, ఋషికుల్య, ఇక్షుల, త్రివిద, లాంగూలిని, వంశవర అనునవి మహేంద్ర పర్వతము బిడ్డలు.

ఋషిక, లూమతి, మందగామిని, పలాశిని అనునవి శుక్తిమంతము నుండి పుట్టిన నదులు. ఇవి ప్రధానముగా కులపర్వతముల నుండి పుట్టిన నదులు. తక్కినవి చిన్నవాగులు. ఈ జంబూ ద్వీపము లక్ష యోజనముల కొలత కలది. ఇటుపై శాకద్వీపమునుగూర్చి తెలిసికొనుడు. జంబూద్వీపము వైశాల్యముకంటె రెట్టింపు వైశాల్యముకలది. ఇందు ఉప్పునీరు జంబూ ద్వీపమునకు రెట్టింపు ప్రమాణమున కలదు. అందు పుణ్యముగల జానపదులు చాలకాలమునకు మరణింతురు. కరవు, ముదిమి, రోగములులేని దేశమిది. ఏడే కులపర్వతములున్నవి. దానికి రెండువైపుల ఉప్పు సముద్రము, పాలసముద్రము కలవు.

అందు తూర్పువైపుగా సాగిన పర్వతరాజము ఉదయము దాని కవతల జలధారము అను కొండ కలదు. దానినే చంద్రమనియు అందురు. దానిజలము నింద్రుడు గ్రహించి వానకురియును. దాని ఒడ్డున రైవతకమను కొండ కలదు. దానినే నారదమనియు అందురు. ఆ నారదపర్వతము నుండి పుట్టిన మరియొక కొండ శ్యామము. అందలి ప్రజలు శ్యామవర్ణమును పొందిరి. దానినే దుందుభి అనియు అందురు. అందు సిద్ధులనబడు వారు పెక్కండ్రు క్రీడించుచుందురు. దానికి ప్రక్కగా రజతము అను కొండ కలదు. శాకమనియు దానికి మరియొక పేరు. దానికి అవతల 'అంబికేయము' అను పర్వతము కలదు. దానిని విభ్రాజస మనియు పిలుతురు. దానికే కేసరి అనియు పేరు. దాని నుండి వాయువు బయలు దేరును. కొండలపేర్లే దేశముల పేర్లు. ఉదయము, సుకుమారము, జలధారము, క్షేమకము, మహాద్రుమము అనునవి ప్రధానములు. పర్వతముల రెండవపేర్లతో కూడ పిలువ దగినవి. దాని మధ్య శాకవృక్షము కలదు. అందు ఏడుమహానదులు రెండేసిపేర్లతో ప్రసిద్ధికెక్కినవి. అవి సుకుమారి, కుమారి, నంద, వేణిక, ధేనువు, ఇక్షుమతి, గభస్తి అనునవి. (85)

86 వ అధ్యాయము - కుశద్వీప వర్ణనము

ఇటుపై మూడవదగు కుశద్వీపమును గూర్చి వినుడు, కుశద్వీపమును చుట్టి పాలనీరు కలదు. ఇది శాకద్వీపమునకు రెండింతలుగా ఉన్నది. అందును ఏడు కులపర్వతములు కలవు. అన్నింటికి రెండేసి పేర్లు. ఎట్లనగా కుముదము దానినే విద్రుమ మనియు అందురు. ఉన్నతమే హేమపర్వతము. బలాహకమే ద్యుతిమంతము. ద్రోణమే పుష్పవంతము. కంకమే కుశేశయము. ఆరవదియగు మహిషమునే హరి అనియు అందురు. అందు అగ్ని నివసించును. ఏడవది కకుద్మంతము. మందర మనియు దానికి పేరు. ఇవి కుశద్వీపమున గల కుల పర్వతములు. వీనికి దేశముల భేదముకూడ రెండేసి పేర్లతో ఏర్పడుచున్నది. కుముద పర్వతమునకు సంబంధించినది శ్వేతము. దానికే ఉద్భిదము అనియు పేరు. ఉన్నతమునకు చెందిన లోహితము. అదే వేణుమండలము. వరాహమునకు దేశము జీమూతము. దానినే రథాకారమనియు అందురు. కంకపర్వత దేశము కకుద్మంతము. అదియే వృతిమంతము మహిషమునకు మానసము. అదియే ప్రభాకరము. కకుద్మంతమునకు కపిలము దేశము. దానిని సంఖ్యాతమనియు అందురు. ఇవి దేశములు.

అందు రెండు పేర్లుగల నదులున్నవి. ప్రతప మొదటిది అదియే ప్రవేశ. శివరెండవది అదియే యశోద. పిత్ర మూడవది, అదియే కృష్ణ, హోదిని నాల్గవది, అదియే చంద్ర. విద్యుత అయిదవది, అదియే శుక్ల. వర్ష ఆరవది, అదియే విభావరి. మహతి ఏడవది, అదియే ధృతి, ఇవి ప్రధాన నదులు. తక్కినవి చిన్న నదులు. ఇది కుశద్వీపము నిర్మాణము.

కుశద్వీపము వైశాల్యములో, నిర్మాణములో శాకద్వీపమునకు రెట్టింపని చెప్పితిమి. దాని నడుమ పెద్దవిశాలమగు దర్భలతోటకలదు. ఈ కుశద్వీపము చుట్టును క్షీరసముద్రమునకు రెండింతలుగా ఉన్న పెరుగు సముద్రము కలదు. (86)

87 వ అధ్యాయము - క్రౌంచద్వీప వర్ణనము

రుద్రుడు ఇట్లు చెప్పెను. ఇక క్రౌంచ ద్వీపము నాల్గవది. కుశద్వీపము కంటె కొలతలో రెట్టింపుగా ఉండును. అందును ఏడే ప్రధానములగు పర్వతములు. మొదటి క్రౌంచ పర్వతము అదియే విద్యుల్లతము, రైవతము. తరువాత మానసము, అదియే పావకము. అటుపై అంధకారము, దానినే అచ్ఛోదకమనియు అందురు. తరువాత దేవావృత్తము, దానికి సురాపమనియు పేరు. పిదప దేవిషము, అదియే క్రాంచ శృంగము. దేవానందమునకు ప్రక్క గోవిందము, దానిని ద్వివిందమనియు అందురు. అటుపై పుండరీకము, అదియే తోశాశయము. ఈ ఏడును రత్నమయములగు పర్వతములు క్రౌంచద్వీపమున నెలకొని ఉన్నవి. ఒకదానికంటే ఒకటి ఏత్తైనది.

అందు దేశములు. క్రౌంచమునకు దేశము కుశలము, దానినే మాధవము అందురు. వామనమునకు మనోనుగము, దానిని సంవర్తకమనియు అందురు. తరువాతిది ఉష్ణవంతము, అదియే సోమప్రకాశము. తరువాతనున్నది పావకము, అదియే సుదర్శనము. — అటుపై అంధకారము, దానినే సంమోహమనియు అందురు. ఆ తరువాత మునిదేశము, అదియే ప్రకాశము. తరువాత దుందుభి, దానిని అనర్థమనియు అందరు. అందును ఏడు నదులున్నవి. గౌరి, కుముద్వతి, సంధ్య, రాత్రి, మనోజవ, ఖ్యాతి, పుండరీక – అని ఆ ఏడు విధములైన గంగకు పేర్లు. గౌరియే పుష్పవహా. కుముద్వతియే తామ్రవతి. సంధ్యయే రోధ. సుఖావహమే మనోజవ. ఖ్యాతియే క్షిప్రోద. పుండరీకయే గోబహుళ. రాత్రియే చిత్రవేగ.

తక్కినవి చిన్న నదులు. క్రౌంచ ద్వీపమును నేతి సముద్రము చుట్టుకొని యున్నది. దానిని చుట్టుకొని శాల్మలద్వీపము కలదు. (87)

౮౮ వ అధ్యాయము - శాల్మలద్వీప వర్ణనము

మిగిలిన మూడు ద్వీపములలో అయిదవదియగు శాల్మల ద్వీపమును గూర్చి చెప్పెదను వినుడు. శాల్మలము క్రౌంచద్వీపమునకు రెట్టింపు గలది. ఇది నేతి సముద్రముతో చుట్టబడి యున్నది. దాని వైశాల్యము క్రౌంచద్వీపమునకు రెట్టింపు. అందును ఏడుపర్వతములు ప్రధానములు. అంతే సంఖ్యలో దేశములు, నదులు కలవు. మిక్కిలి పెద్దది, బంగారుతో ఏర్పడినది. కనుక పచ్చని వన్నె కలదియగు సార్వగుణము, సౌవర్ణము, రోహితము, సుమనసము, కుశలము, జాంబూనదము, వైద్యుతము అనునవి కులపర్వతములు. దేశములును ఈ పేర్లతోనే ఉన్నవి. ఆరవది గోమేద ద్వీపము. శాల్మలము వలె సురోదము మద్యపు సముద్రముతో ఆవృతమైనది. అది దానికి రెట్టింపుగా ఉన్న గోమేదముతో చుట్టబడి యున్నది. అందు ప్రధాన పర్వతములు రెండే. మొదటిది తావసరము. రెండవది కుముదము. సముద్రము చెరకురసము కలది. దానికి రెట్టింపు అయినది పుష్కరము.

ఆ పుష్కర ద్వీపమున మానసమను పర్వతమొక్కటి కలదు. దానితో ఆ దేశము రెండుగా చీలినది. తీయని నీరు చుట్టును కలదు. దానికి పైని కటాహము కుండ మొదలగు వాని లోపలి అంచు కలదు. ఇది భూమి ప్రమాణము. బ్రహ్మాండము కటాహముల మొత్తము విస్తారపు కొలత కలిగి ఉన్నది. ఇట్టి అండములు లెక్కలేనన్ని కలవు. ప్రతికల్పమునందును భగవంతుడగు నారాయణుడు వరాహరూపమును తాల్చి రసాతలమున చొచ్చుకొని పోయిన వీనినన్నింటిని ఒక కోరతో పైకెత్తి మరల చక్కగా నిలుపును. విప్రులారా! భూమి పొడవు, వెడల్పుల మార్గమును మీకు తెలియజెప్పితిని. మీకు స్వస్తి అగుగాక! నేను నా నివాసమగు కైలాసమునకు పోయెదను. ఇట్లుపలికి రుద్రుడు క్షణములో అదృశ్యమైన మూర్తి కలవాడై వెడలెను. ఆ దేవతలు, ఋషులును అందరును తమతమ తావుల కరిగిరి. (88)

౮౯ వ అధ్యాయము - శక్తిస్వరూప ఆవిర్భావము

వరాహదేవునితో ధరణి ఇట్లు పల్కెను. "విభూ! దేవా! పరమాత్ముడు పుణ్యమూర్తి శివుడని కొందరందురు. ఇతరులు హరిని చెప్పుదురు. మరికొందరు బ్రహ్మను

పలుకుదురు. వీరిలో పరదైవ మెవరు? దీనిని నాకు చెప్పుము. నాకు చాల కుతూహలముగా నున్నది” అని అడగగా వరాహమూర్తియగు విష్ణువు ఇట్లు చెప్పెను.

“నారాయణుడే పరమదైవము. అతనినుండి చతుర్ముఖుడు పుట్టెను. అతనివలన రుద్రుడు కలిగెను. అతడు సర్వజ్ఞత్వమును పొందెను. ఓ వరాననా! అనుఘా! చారుగాత్రీ! ఆతని ఆశ్చర్యములు అనేకములు. నేను ఆ అన్నింటిని చెప్పెదను. వినుము. అనేక వర్ణముల ధాతువులతో (కొండరాలతో) చిత్రమై అందమైన కైలాస శిఖరమున శూలపాణి, ముక్కంటియగు దేవుడు నిత్యము నివాసముండును. సర్వభూతములు ఋుక్కులిడు ఆ దేవుడు ఒకనాడు భూతగణములు చుట్టుకొని యుండగా గౌరీదేవితో కూడియుండెను. అందు కొందరు సింహముఖులు. సింహమువలె గర్జింతురు. మణికొందరు ఏనుగు మోములవారు. ఇంకను కొందరు గుఱ్ఱము ముఖములవారు. వేరుకొందరు మొసలి మొగములవారు. ఇంకను ఇతరులు పంది ముఖములవారు. అన్యులు ఆడుగుఱ్ఱముల మొగముతో భయంకరమైనవారు. అట్లే గాడిదమొగముల వారు, మేక మొగములవారు, పొటేలు మొగములవారు, చేప మొగములవారు క్రూరులు, శస్త్రపాణులు అనంత సంఖ్యలో ఉన్నారు.

కొందరు పాడుచున్నారు. కొందరాడుచున్నారు. కొందఱు పరుగెత్తుచున్నారు. కొందరు పగులబడుచున్నారు. కొందరు నవ్వుచున్నారు. కిలకిల ధ్వనులు చేయుచున్నారు. మహాబలము గలవారు గర్జించుచున్నారు. కొందరు గణనాయకులు రాళ్ళు పట్టుకొని పోరాడ జొచ్చిరి. మరికొందరు బలగర్వముతో మల్లయుద్ధములు చేయుచుందిరి. ఇట్టి ప్రమధగణములు వేలకొలదిగా కొలిచి యుండగా మహాదేవుడు కొలువుండెను. ఈ విధముగా దేవదేవుడు తనకు తానై దేవితో క్రీడించుచుండగా త్వరతో బ్రహ్మదేవతలతో కూడి అట కరుదెంచెను. అట్లు వచ్చిన బ్రహ్మను గాంచి విధానము ననుసరించి రుద్రుడు పూజించి అవ్యయుడగు నాతనితో, ఇట్లు పలికెను. “బ్రహ్మా! నీవిచటకు వచ్చిన పనియేమి. త్వరగా చెప్పుము. మరియు దేవతలందరు తొందరతో నుండి నాకడకు వచ్చిరి. పనియేమి?”

“అంధకుడను మహారాక్షసుడు కలడు. దేవలోకవాసులందరు అతనిచేత బాధలనొంది నన్ను శరణుకోరిన వారై నాకడకరుదెంచిరి. నేనా దేవతలందరికి భవుడవగు

నిన్ను గూర్చి తెలిపి అచటకు పోదమంటిని. అందువలన వీరందరు ఇచటకు వచ్చిరి." ఇట్లు పలికి బ్రహ్మ పినాకి(శివుని) వైపు చూచుచుండెను. మరియు మనస్సున నారాయణ పరమేశ్వరుని స్మరించెను. అంత ఒక్కచోటనున్న ఆ బ్రహ్మ విష్ణుమహేశ్వరులు పరమానందముతో ఒకరి నొకరు సూక్ష్మదృష్టితో చూచుకొనిరి. అపుడు ఆముువ్వురి మూడు విధములగు దృష్టి ఒక్కటిగా రూపొందెను. ఆ దృష్టియందు ఒక దివ్యరూపముగల కుమారి ఉదయించెను.నల్లనికలువల రేకులవంటి దేహకాంతీయు,నల్లని నొక్కులుగల కేశములును, అందమైన ముక్కు, చక్కని నెన్నుదురు, అందమైన మొగము కలిగి ఆ కుమారి చక్కగా నిలిచి యుండెను. త్వష్ట అగ్ని జిహ్వకు ఏ లక్షణములను నిర్దేశించెనో, అది యంతయు ఒక్కచోట నిలిచిన తీరున ఆ కన్యయందు కానవచ్చెను. అంత బ్రహ్మ విష్ణు మహేశ్వరులు ఆ కన్యను చూచి "కాంతా! నీవెవరు? నీవు భావించినపని యేమి?" అని అడిగిరి. నలుపు, తెలుపు, పసుపు అను మూడు వన్నెలుగల ఆ కుమారి, "ఉత్తములారా! మీ దృష్టి యోగమువలన నేను పుట్టితిని. నన్నెరుగరా? నేను మీ శక్తి స్వరూపిణిని. పరమేశ్వరిని" అని పలికెను. అంత బ్రహ్మాదులు ఆనందమంది ఆమెకు వరము నొసగిరి దేవీ! (89)

౯౦ వ అధ్యాయము - బ్రహ్మకృత శక్తి స్తుతి

వరాహదేవుడు పృథ్వితో ఇట్లు పల్కెను. వరారోహా! మరియొక విషయము వినుము. శివుడు, పరమేష్ఠియు నిర్దేశించిన ఆ త్రిశక్తికి సంబంధించిన మహా విధిని గూర్చి చెప్పెదను. అందు సృష్టిని గూర్చి యింతకు ముందు తెలిపితిని. ఆమె తెల్లని వన్నె కలది. – చక్కని తనదగు రూపముకలది. ఒక అక్షరమే ఆమె స్వరూపము. అయినను సర్వాక్షరములు ఆమె స్వరూపమే! ఆమెను వాగీశ అందురు. కొండొకచో సరస్వతీదేవి అందురు. విద్యలకు ఈశ్వరి. ఆమెయే ఒకప్పుడు అమితాక్షర, జ్ఞాననిధి ఆమెను ఒక్కొక్కప్పుడు విభావరి అనియు అందురు. ఓ విశాలాక్షీ! వరాననా! సౌమ్యములు, జ్ఞానము నిండినవి అగు నామములన్నియు ఆ తల్లి నామములుగా చూడదగును. విష్ణువు వలన ఏర్పడినది, రక్తవర్ణ, సురూపిణియగు వైష్ణవియు, రుద్రునివలన రూపుగొన్న రౌద్రియు, ఈముువ్వురును తత్త్వమునకు ఒక్కరే. రుద్రుని చక్కగా తెలిసికొన్న వారికి ఈ ముువ్వురు సిద్ధింతురు. అంతటను ఉండు ఈ ముువ్వురి స్వరూపము ఒక్కటియే. వరారోహా! నీకు మున్ను నేను చెప్పిన ఆ పురాతని సృష్టిమాత ఉన్నదే, ఆమెయే ఈ స్థావర

జగమాత్మకమైన జగత్తునంతటను వ్యాపించి ఉన్నది. మొదట అవ్యక్తము నుండి జన్మమును పొందిన బ్రహ్మవలన వృద్ధి పొందిన ఆ సృష్టిమాతను పితామహుడు తగిన విధముగా ఆ దేవిని ఇట్లు స్తుతించెను.

బ్రహ్మకృత సృష్టిదేవీస్తుతి

జయస్వ సత్యసంభూతే ధ్రువే దేవి వరాక్షరే| సర్వగే సర్వజనని సర్వభూత మహేశ్వరి||

సర్వజ్ఞే త్వం వరారోహే సర్వసిద్ధి ప్రదాయినీ| సిద్ధిబుద్ధికరీ దేవి ప్రసూతిః పరమేశ్వరి||

త్వంస్వాహా త్వం స్వధాదేవి త్వముత్పత్తిర్వరాననే| త్వమోంకారస్థితా దేవి వేదోత్పత్తి స్త్వవమేవ చ||

దేవానాం దానవానాం చ యక్ష గన్ధర్వరక్షసామ్ | పశూనాం వీరుధాం చాపి త్వముత్పత్తిర్వరాననే ||

విద్యా విద్యేశ్వరీ సిద్ధా ప్రసిద్ధా త్వం సురేశ్వరి| సర్వజ్ఞా త్వం వరారోహే సర్వసిద్ధిప్రదాయినీ ||

సర్వగా గతసందేహా సర్వశత్రునిబర్హిణీ| సర్వవిద్యేశ్వరీ దేవీ నమస్తే స్వస్తికారిణి ||

ఋతుస్నాతాం స్త్రియం గచ్ఛేద్ యస్త్వాం స్తుత్వా వరాననే | తస్యావశ్యం భవేత్ సృష్టి స్త్వత్ప్రసాదాత్ ప్రజేశ్వరి ||

స్వరూపా విజయా భద్రా సర్వశత్రు ప్రమోహిని || (90.9-15)

"దేవీ! సత్యమువలన పుట్టినదానా! స్థిరమైన దానా! శ్రేష్ఠమైన వర్ణములే స్వరూపమైన ఓ సర్వజననీ! సర్వగా! సర్వభూతములకు మహేశ్వరివైన నీవు జయము గొనుము. నీవు అన్నియు ఎరిగినదానవు. అన్ని సిద్ధులను అనుగ్రహించుదానవు. సిద్ధిని బుద్ధిని కలుగజేయుదానవు. జననివి. పరమేశ్వరివి. నీవే స్వాహా (దేవతలకు సంబంధించిన నమస్కారము) కారమువు. నీవే స్వధా (పితృదేవతలకు సంబంధించిన నమస్కారము) కారమువు. నీవు ఉత్పత్తి స్వరూపిణివి. నీవు ఓంకారము నిలయమైన దానవు. నీవే వేదముల ఉత్పత్తికి కారణమైన దానవు. స్వధా,దేవతలు, దానవులు, యక్షులు, గంధర్వులు, రాక్షసులు, పశువులు, పంటలు అనునవి నీనుండియే పుట్టుచున్నవి. నీవు విద్యవు, విద్యలకు ఈశ్వరివి. సిద్ధవు, ప్రసిద్ధవు. నీవ దేవతలకు ఈశ్వరివి. శుభములు కలుగజేయు ఓ దేవీ! నీవు అంతట ఉందుదానవు. ఏ సందేహము లేనిదానవు. శత్రువులందరిని

పరిమార్చుదానవు. సర్వవిద్యలకు పాలకురాలవు. నీకు నమస్సులు. నిన్ను స్తుతించి ఋతుస్నాత అయిన భార్యను పొందువానికి నీ అనుగ్రహము వలన తప్పక సంతానము కలుగును. నీవు ప్రజేశ్వరివి. పరమాత్మ స్వరూపిణివి. విజయ రూపము, భద్రరూపము కలదానవు. కామము, క్రోధము, లోభము, మోహము, మదము, మాత్సర్యమను లోపలి శత్రువులను అన్నింటిని రూపుమాపుదానవు అని చెప్పెను. (90)

91 వ అధ్యాయము - వైష్ణవిమహిమ-మహిషాసుర కథారంభము

వరాహమూర్తి మరల ఇట్లు పల్కెను. మందరమునకు తపస్సునకై అరిగిన ఆ రజోగుణము వలన ఏర్పడిన పరమశక్తి వైష్ణవి కౌమార వ్రతధారిణియై ఒంటరిగా విశాల అనుచోట తపస్సు చేయుచుండును. చాలా కాలము . తపము చేయుచుండగా ఆమె మనస్సు కలతపడెను. ఆ క్షోభవలన కుమారికలు పుట్టుకొచ్చారు. నిర్మలములగు కన్నులు, నల్లని నొక్కులజుత్తు, దొండపండు వంటి పెదవులు, నిడుపాటి కన్నులు, మొలనూలుగల నడుములు, మ్రోయుచున్న అందెలపాదాలు, వెలిగిపోవుచున్న దేహకాంతి యు గలవారీ కుమారీజనులు. అలా దేవి మనసు క్షోభపడగా కోట్లకొలదిగా పెక్కు తీరులైన మొగములు గల కన్యలు ఉద్భవించిరి. అట్టి ఆ కుమారీ జనమునుగాంచి ఆ దేవి, ఆ పర్వతమున వెడల్పయిన బాటలు, బంగారు ప్రాసాదములు, లోపలనీరుగల భవనములు, మణులతో చేసిన సోపానములు రత్నజాలముల గవాక్షములు, అందుబాటులో ఉన్న ఉద్యానములు గల వందలకొలది భవనములున్న పురమును తపశ్శక్తి చేత నిర్మించెను.

భూదేవీ! ఆ భవనములు, ఆ కన్యలు లెక్కపెట్టరాని సంఖ్యలో ఉన్నవి. ప్రాధాన్యమును బట్టి ఆ కన్యల నామములను చెప్పెదను. విద్యుత్ప్రభ, చంద్రకాంతి, సూర్యకాంతి, గంభీర, చారుకేశి, సుజాత, ముంజకేశిని, ఘృతాచి, ఉర్వశి, శశిని, శీలమండిత, చారుకన్య, విశాలాక్షి, స్తనపుష్టిగల ధన్య, చంద్రప్రభ, గిరిసుత, సూర్యప్రభ, అమృత, స్వయంప్రభ, చారుముఖి, శివదూతి, విభావరి, జయ, విజయ, జయంతి, అపరాజిత – వీరును ఇంకను వందలకొలది కన్యలును ఆ ఉత్తమ పురమున నివసించిరి. వీరందరు ఆ దేవిని వెంటనంటి ఉందురు. పాశమును, అంకుశమును ధరించు వారు, మంచివారగు వారందరు చుట్టూ ఉండగా, ఆ దేవి సింహాసన మున కూర్చుండి, తెల్లని వింజామరతో స్త్రీలు విసరుచుండగా కౌమారవ్రతమును తాల్చి తపస్సు చేయుటకు ఉద్యుక్త

అయ్యెను. యౌవనమున ఉన్నది, పూజ్యురాలు, చక్కని దేహపుష్టి కలది, సంపెంగలు, అశోకములు, పున్నాగములు, నాగకేసరములు మొదలగు పూమాలలతో అన్ని అంగములందును అర్చింపబడినది, ఋషులు, దేవతలు మొదలగువారి నమస్కారములు కొనుచున్నట్టిది, శ్రేష్ఠలగు కన్యలుపూజలు చేయుచున్నట్టిది అయి ఆ దేవి విరాజిల్లు చుండెను. ఇట్లా దేవి సర్వాంగభోగములు కలదియై తపస్సు చేయుచుండగా, బ్రహ్మ కుమారుడు నారదుడచటికి వచ్చెను. తపస్సే ధనముగా గలవాడు, బ్రహ్మతనయుడు అగు అతనిని చూచి త్వరత్వరగా ఆ దేవి విద్యుత్ప్రభ అను సఖితో "ఆతని కాసనమిమ్ము. కాలుగడుగుకొనుటకు నీరు, తావుటకు జలము త్వరగా ఇమ్ము" అని పలికెను. అట్లు ఆ దేవి పలుకగా విద్యుత్ప్రభ నారదునకు ఆసనమును, పాద్యమును, అర్ఘ్యమును నివేదించెను.

ఆసనమును స్వీకరించి వినయముతో ఉన్న నారదమునిని గాంచి ఆ దేవి గొప్ప సంతోషముతో ఇట్లు పలికెను. "ఓ మునిశ్రేషా! నీకు స్వాగతము. ఏ లోకమునుండి యిచటికి విచ్చేసితివి? నీ పనియేమి? నీకు నేను చేయవలసిన దేమి? నీకు ఆలస్యము జరుగరాదు. చెప్పుము" అనుచు ఆ దేవి యిట్లు పలుకగా లోకజ్ఞుడగు నారదుడు "ఓ దేవేశీ! తల్లీ! బ్రహ్మలోకము నుండి యింద్ర లోకమునకు వెళ్ళి అటునుండి రౌద్రాచలమున కరిగి, అటనుండి నిను దర్శించుకొనుటకై నీకడకు వచ్చితిని – అని పలికి కాంతిశాలియగు ఆ నారదుడా దేవిని పరికించి చూచెను. ఒక్క ముహూర్తము ఆ దేవేశిని పరికించి నారదు డచ్చెరువందెను. "ఆహా! ఏమి రూపము! ఏమి కాంతి! ఏమి ధైర్యము! ఏమి వయస్సు! ఏమి నిష్కామత! అని మనసున చింతించెను. దేవతలు, గంధర్వులు, సిద్ధులు, యక్షులు, కిన్నరులు, రాక్షసులు అను జాతులలో కాని ఇంక ఏ యితర స్త్రీలలో కాని ఇట్టి రూపము ఎందును లేదు అని మనసున భావించి నారదుడు విస్మయము పొందెను. వరదురాలగు ఆ దేవికి దండ ప్రణామము గావించి ఆకాశమునకెగిరెను. తొందరతో దైత్యరాజు పాలించు పురి కరిగెను. ఆ పురి మహిషపురము. సముద్రములోపల కలదు. అచటికా పూజ్యుడరిగి దున్నపోతు ఆకారముగల ఆ రాక్షసరాజును చేరుకొనెను.

వరములు పొందిన వీరుడు, దేవ సైన్యమును పెద్దమొత్తములో రూపుమాపినవాడు అగు ఆ రాక్షసుని చూచి, భక్తితో అతడు చేసిన పూజలందుకొని లోకములందు తిరుగుచుండు ఆ ముని ప్రీతినొంది తాను దేవతాపురమున చూచిన ఆ దేవి

సర్వోత్తమ రూపమును గూర్చి ఉన్నదున్నట్లు వక్కాణించెను. "రాక్షసరాజా! ఒక కన్యారత్నమును గూర్చి సావధానుడవై వినుము. వరదానము వలన ఆమె చరాచరమగు మూడులోకముల సముదాయమును సాధించినది. దైత్యా! నేను బ్రహ్మలోకమునుండి మందరగిరి కరిగితిని. అందు వందల కొలది కన్యలతో బిలబిలలాడు దేవీపురమును గాంచితిని. అందు ముఖ్యురాలగు కన్య తపస్సు చేయుచున్నది. వ్రతమును పూని ఉన్నది. దేవతలలో, దైత్యులలో, యక్షులలో అట్టి ఆమెను నేనెచటను చూడలేదు. ఈ బ్రహ్మాండము నడుమ నేను తిరుగులాడుచు అట్టి కన్య నొక్కదానిని కూడ నేను ఎన్నడును కాంచనైతిని. దేవజాతివారు, గంధర్వులు, ఋషులు, సిద్ధులు, చారణులు, ఇతరులగు రాక్షస నాయకులు అందరు ఆమె కడ పడిగాపులు పడియున్న వరముల నొసగు ఆదేవిని గాంచి వెంటనే నేనిటకు పరువెత్తి వచ్చితిని. గంధర్వులను గెలువక ఆమెను ఒక్కడును గెలువజాలడు" అని ఇట్లు పలికి ఒక్క క్షణ మచట నిలిచి ఆతనిని వీడ్కొని ధీశాలియగు నారదుడు ఆ క్షణమున అంతర్ధానము చెందెను. (91)

92 వ అధ్యాయము - మహిషుడు దేవతలపై దండెత్తుట

ఇంకను వరాహదేవుడు ఇట్లు చెప్పెను. నారదుడట్లు పోగా, దైత్యుడు అచ్చెరువందిన మనస్సుతో ఆ నారదుని ముఖము నుండి వినిన ఆ సుందరిని గూర్చియే చింతించుచుండెను. ఆ దైత్యవరుడు ఆమెనే చింతించుచు సుఖము పొందడాయెను. మహామంత్రి, మహాబలుడు అగు అలంశర్మ తక్కిన మంత్రులను పిలిపించెను. ఆతనికి గొప్పనీతి వేత్తలు, శూరులు, పెక్కు శాస్త్రములలో ఆరితేరినవారగు మంత్రులు ఎనిమిదిమంది కలరు. ప్రఘసుడు, విఘసుడు, శంఖకర్ణుడు, విభావసుడు, విద్యున్మాలి, సుమాలి, క్రూరుడగు పర్జన్యుడు అనువారు (అలంశర్మ–ఒకడు) వీరాతనికి ముఖ్యులైన మంత్రులుగా ప్రసిద్ధికెక్కినవారు. వారు కొలువున్న ఆ రాక్షసరాజు వద్దకు వచ్చి, తమ ఏలికను గాంచి పనియేమో సెలవిమ్మని పలికిరి. వారి ఆ పలుకువిని మహాబలుడగు దానవేంద్రుడు నారదుని వలన పొందిన నిశ్చయముకలవాడు కావున కన్యాలాభమును ఆశించి యిట్లు పలికెను.

"నారదమహర్షి నాకొక బాలను గూర్చి చెప్పెను. కానీ దేవతల ప్రభువును గెలువక ఆ వరాంగన లభింపదట. మీరందరు విమర్శించి హేతుపూర్వకముగా ఆలోచన

చేసి ఆ బాలనాకెట్లు వశమగునో దేవతలను ఎట్లు ఓడింతునో, అది అంతయు నాకు త్వరగా తెలుపుడు." రక్కసుడు ఇట్లు పలుకగా వారందరు "ప్రభూ! మేమందరము విచారించి చెప్పుదుము" అని వారట్లు పలుకగా ప్రఘసుడు దానవరాజుతో ఇట్లనెను. రాజా! నారదుడు నీకు చెప్పిన ఆ మహాసతి పరమశక్తి వైష్ణవి. లోకములను అన్నింటిని పట్టి నిలుపునది. గురుపత్ని, రాజపత్ని మరియు సామంతుని ఇల్లాండ్రు – ఇట్టివారిని పొందగోరు రాజు నశించును. అట్లే పొందరాని స్త్రీలను పొందుటచేతను నాశనమగును".

ప్రఘసుడిట్లనగా విఘసుడిట్లు పలికెను. "ప్రఘసుడు ఆ దేవిని గూర్చి లెస్సగా పలికెను. నాబుద్ధికి ఒకటి తోచుచున్నది. అందరకు అది నచ్చినచో చేయవచ్చును. జయింప గోరువారు ఎల్లవేళల కన్యను వరింపవలయును. కాని ఎన్నటికిని కన్యను స్వతంత్రించి బలాత్కరింపరాదు. మీకీ మాట రుచించినచో మంత్రివర్యులారా! మంత్రులందరు అచటి కరిగి ఆ దేవిని యాచింపనగును. ఆమెకు దొడ్డబుద్ధిగల చుట్టమొకడు ఉన్నచో సామ మార్గమున యాచింతము. తరువాత దానమును ప్రయోగింతము. అటుపై భేదము, అదియు మదరనిచో దండము ప్రయోగింతము. ఈ వరుస పద్ధతిలో ఆమె వశము కానియెడల అప్పుడు సాధనములు సమకూర్చుకొని ఆ సుందరిని బలముతో పట్టుకొందము".

విఘసుడిట్లనగా తక్కిన మంత్రులందరు ఆ మాటను కొనియాడుచు, సంతోష వాక్కుతో నిట్లనిరి. "విఘసుడు ఆ కాంతను గూర్చి లెస్సగా పలికెను. అదియే త్వరగా చేయదగినది అచటి కొక దూతను పంపవలయును. సర్వశాస్త్రములను, నీతిని, చక్కగా ఎరిగినవాడు, పవిత్రుడు పరాక్రమవంతుడు అగు దూతను పంపి ఆతని వలన ఆదేవి వర్ణము, రూపము, గుణము పరాక్రమము, పాటవము, ధైర్యము, బలము, చుట్టపక్కములు, సాధనసంపతి, స్థానము మొదలగువానిని అన్నింటిని చక్కగా తెలిసికొని అటుపై కార్యమునకు దిగవలయును అని పలికి వారందరు, మంత్రులలో ఉత్తముడగు ఆ విఘసుని పలుకులను, మేలుమేలని పొగడిరి. ఇట్లు ప్రశంసించి వారందరు గొప్పవాడు. గొప్ప మాయ లెరిగినవాడు, ఉత్తముడు అగు విద్యుత్ప్రభుని దూతగా ఎన్నుకొనిరి.

అట్లా దూతను పంపిన పిదప విఘసుడిట్లు పలికెను. "ప్రభూ! దానవ ప్రభువులందరు చతురంగ బలముతో సంసిద్ధులై దేవ సైన్యముపై విజయము

సాధింపవలయును. అసురేంద్రా! దేవతలందరు విరిగిపోగా దేవేంద్రుడు నిన్ను చేరగా ఆ నీ పరాక్రమమునకు భీతిల్లినదై ఆ కన్య నీకు వశమగును. లోకపాలురు అందరును, మరుత్తుల గణములను నాగులును, విద్యాధరులును, సిద్ధులును, గంధర్వులును, రుద్రులును, వసువులును. ఆదిత్యులును అన్ని విధములుగా అందరు నీకు ఓడిపోవగా నీవే యింద్రుడవు అగుదువు. ఇంద్రుడవగు నీకు దేవగంధర్వ భామినులగు ఆ కన్యలందరు అన్ని విధములుగా వశమగుదురు. ఆ కన్యయు నీకు లొంగిపోవును.” అతడట్లుపలుకగా మహిషదైత్యుడు కారుమొయిలు వంటివన్నెకలవాడు, కాటుకకొండ వంటి కాంతి కలవాడును అగు విరూపాక్షుని– తన సేనాపతిని– చూచి యిట్లు పలికెను.

“ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, పదాతులుగల సైన్యమును వెంటనే సమాయత్త పరుచుము. దానితో దేవతలను, గంధర్వులను యుద్ధమున గెలువరాని వారిని – గెలిచెదను”. అతడిట్లు పలుకగా విరూపాక్ష సేనాపతి వెనువెంటనే అంతులేనిది, ఓటమి ఎరుగనిది అగు మహాసైన్యమును రప్పించెను. ఒక్కొక్క రక్కసుడు యుద్ధమున వజ్రము చేపట్టిన ఇంద్రుని వంటివాడు. ఒక్కొక్క దేవరాజును తన బలముతో గెలుచుటకు తొడలు గొట్టుచుండును. ఆ ముఖ్యుల సేనలు అర్బుదమూ తొమ్మిది కోట్లు. అందే ఒక్కనిని ఎవడు ఎదిరించినను మొత్తముసేన అండగా నిలుచును. దొడ్డ దేహబలము రక్కసులు వేలవేలు పోటుగాండ్రై యుద్ధమునకు సిద్ధపడిరి. దేవ సైన్యమును నమిలి మ్రింగవలయును నన్న కొరికతో పయనమైరి. విచిత్రములగు వాహనములు, పెక్కు తీరులగు ధ్వజపతాకలు, విచిత్రములగు ఆయుధములుగలవారై దేవతలను గెలుచుటకై ఆ రాక్షసులు పెక్కు భయంకర రూపములతో, భయంకరములగు ఆయుధములను చేతులతో ఎత్తి పట్టి నృత్యమును చేసిరి. (92)

93 వ అధ్యాయము - దేవతల ఓటమి

పిమ్మట వరాహదేవుడు ఇట్లు చెప్పెను. ఇష్టమైన రూపము తాల్పగలవాడు, గొప్పబలము గలవాడును అగు మహిష రాక్షసుడు మదించిన ఏనుగునెక్కి మేరుపర్వతమునకు ప్రయాణము కట్టెను. అంతట అతడు ఇంద్రుని పురమును ముట్టి దేవతలతోపాటు దేవేంద్రుని తరిమి కొట్టెను. అంత దేవతలందరు కోపావేశము పొందిరి. తమ శస్త్రములను, వాహనములను పెద్దగా గొని దైత్యులను నిలువరించి ఆనందపు పొంగుతో వారి

వెంటబడిరి. ప్రచండులగు యోధులు, ఒకరిపై ఒకరు గర్జించుచున్న వారును అగు వారికి ఒడలు గగుర్పాటు కలిగించు మహా సంకులమైన సమరము జరిగెను. అందు అంజనుడు, నీలకుక్షి, మేఘవర్ణుడు, వలాహకుడు, ఉదారాక్షుడు, లలాటాక్షుడు, సుభీముడు, భీమవిక్రముడైన స్వర్భానువు అను ఎనమండుగురు రక్కసులు యుద్ధమున వసువులను తరిమికొట్టిరి. మరొక పండ్రెండుగురు దైత్యులు పండ్రెండుగురైన ఆదిత్యులను తరిమికొట్టిరి. వారి పేర్లు – భీముడు, ధ్వంక్షుడు, ధ్వసకర్ణుడు, శంకుకర్ణుడు, వజ్రకాయుడు, గొప్ప వీర్యము కల విద్యున్మాలి, రక్షాక్షుడు, భీమదంష్ట్రుడు, విద్యుజిహ్వుడు, అతికాయుడగు మహాకాయుడు, దీర్ఘబాహువు, కృతాంతుడు. అట్లే ఇతర రాక్షసులు పదునొకండుగురు మిక్కిలి కోపము కలవారై తమసైన్యములను కొనిపోయి రుద్రులను పదునొకండుగురను తరిమివైచిరి. కాలుడు, కృతాంతుడు, రక్తాక్షుడు, హరణుడు, మిత్రహుడు అనిలుడు, యజ్ఞహుడు, బ్రహ్మహుడు, గోఘ్నుడు, స్త్రీఘ్నుడు, సంవర్తకుడు – అను ఈ పదునొకండు గురు దైత్యేంద్రులు, యుద్ధమున ఒడలెరుగనివారు భయంకర శౌర్యము కలవారు అదే సంఖ్యగల రుద్రులను ఎదుర్కొనిరి. మిగిలిన దేవతలను మిగిలిన రక్కసులు దొరకినవారిని దొరకినట్లు ఎదుర్కొనిరి. మహిష రాక్షసుడు స్వయముగా దేవేంద్రునితో తలపడి పోరాడెను.

ఆ దైత్యుడు మిక్కిలి బలము కలవాడు. బ్రహ్మ వరము వలన పొగరెక్కినవాడు, స్వయముగా పినాకము తాల్చిన శివుడెత్తి వచ్చినను, యుద్ధమున వధింపరానివాడు. ఆదిత్యులు, వసువులు, సాధ్యులు, రుద్రులు అను దేవజాతులవారు లెక్కపెట్టరాని సంఖ్యలో రాక్షసులను పరిమార్చిరి. దేవతల సైన్యములు కూడ రక్కసుల చేత నాశనమైనవి. ఇట్లు దేవేంద్రుడు విరిగి పారిపోగా దేవతలందరూ చెల్లాచెదరైరి. శూలములు, పట్టిసములు, ముద్గరములు మొదలగు పెక్కు విధములగు ఆయుధములతో నలుగగొట్టబడిన దేవతలందరు బ్రహ్మలోకమునకు పోయిరి. (93)

94 వ అధ్యాయము - మహిషాసురవధ - దేవీ స్తుతి

వరాహదేవుడు ఇట్లు చెప్పెను. అంత మహిషుడు దూతగా పంపిన విద్యుత్ప్రభుడు దేవి సమీపమున కరిగి ప్రణమిల్లి భక్తియుక్తుడై వందలకొలది కన్యలతో ఉన్న ఆమె ఆస్థానమున వినయము కలవాడై ఆ సుమధ్యతో యిట్లు పలికెను. “దేవీ! మొదటి సృష్టిలో జలము నందు పుట్టిన సుపార్శ్వుడను ఋషి కలడు. అతడు సారస్వత మహర్షికి మిత్రుడు.

అతనికి గొప్ప తేజస్సు, ప్రతాపము గల సింధుద్వీపుడను కొడుకు పుట్టెను. అతడు మహిష్మతి అను గొప్ప పట్టణమున తీవ్రమగు తపస్సు చేసెను. అట్లు నిరాహారుడై మహాఘోర తపమాచరించుచున్న అతనికి మాహిష్మతి అను కూతురు జన్మించెను. ఆమె విప్రచిత్తికి అక్క రూపములో సాటిలేనిది. దేవకన్య వంటిది. ఆమె చెలులతో కూడి ఒకనాడు విహరించుచు, అనుకొనకుండ మందర పర్వతపు లోయలో పెక్కు విధముల చెట్ల వరుసలు కల అంబరుడను పేరుగల ముని తపోవనమును, చేరుకొనెను. ఆ మహాత్ముని తపోవనము పెక్కు పొదరిండ్లతో, పెక్కు విధములగు పొగడలు, గజనిమ్మలు, మంచి గంధపు చెట్లు, సాలములు, సరళములు, విచిత్రములగు తోటలు మొదలగు వానితో అలంకృతమై ఉండెను. అట్టి అందమైనది, శుభమైనది అగు ఆశ్రమ పదమును గాంచి, ఆ రాక్షసుని మాహిష్మతి “ఈ తాపసుని భయపెట్టి పారద్రోలి, నేనిక్కడ చెలులతో ఆడుకుంటూ, వారి గౌరవం అందుకుంటూ ఉండిపోతాను” అని తలపోసి ఆ దేవి చెలులతో పాటు మిక్కిలి వాడియయిన కొమ్ములు తాల్చి మహిషి(గేదె)గా అయ్యెను. సుందరమగు మొగముగల ఆ రాక్షసి చెలులలతో పాటు అతని భయపెట్టుటకై అరిగెను. అంత ఋషి జ్ఞాన నేత్రముతో ఆమెను గుర్తించి క్రోధము పెచ్చురేగగా ఆ అసుర కన్యను శపించెను. “నన్ను గేదరూపు తాల్చి భయపెట్టిన కారణముగా ఓ పాపకర్ములారా! నూరేండ్లు గేదెవు కమ్ము.”అనగా ఆమె చెలులతోపాటు వణకిపోవుచు, శాపము తీరుదారి చెప్పమని మరల మరల పలుకుచు అతని పాదములపై పడెను. ఆమె మాట విని ఆ ముని కరుణ కలవాడై శాపము తీరుటకు అంగీకరించి” మంచిదానా! నీవు ఈ స్వరూపముతోడనే ఒక కొడుకును గని శాపాంతమును పొందుదువు. నా వాక్యము అబద్ధము కాదు” అని పలికెను. అతడట్లు పలుకగా ఆమె సింధుద్వీప మహర్షి ఘోరమగు తపస్సు చేసిన ఉత్తమమగు నర్మద తీరమున కరిగెను. అచట ఇందుమతియను ఒక దైత్యకన్య మహారూపవతి వివస్త్రయై జలమున మునుగుచు ఆ ముని కంటబడెను. అంత నా మహాతాపసుడు రాతి దొన్నెయందు శుక్రమును వదలెను. దివ్యమైన పరిమళము, శ్రేష్ఠమగు వాసన గల ఆ శుక్రమును జూచి మాహిష్మతి సఖులతో నేనీ నీరమును త్రావెదననెను.

ఇట్లు పలికి ఆమె మునివలన ఏర్పడిన ఆ శుక్రమును త్రావెను. ముని బీజము వలన గర్భము తాల్చెను. కుమారుని కనెను. ఆమెకు కొడుకు పుట్టెను. అతడు గొప్ప

బుద్ధిశాలి. గొప్ప బలము, పరాక్రమము కలవాడు, బ్రహ్మవంశమును పెంపొందించువాడు. పేరు మహిషుడు. దేవీ! దేవ సైన్యమును పిండగొట్టిన ఆతడు నిన్ను వరించుచున్నాడు. అతడు దేవతలను యుద్ధమున గెలిచి మిక్కిలి ప్రతీతి కలవాడై పుణ్యరాలా! నీకు మూడు లోకముల నొసగును. నీవును నిన్ను ఇచ్చుకొనుట ద్వారా, గొప్ప కృత్యమును ఆచరింపుము. అని ఇట్లా దూత పలుకగా ఆ శోభన, ఆ పరమదేవి నవ్వి ఏమియు పలుకకుండెను. అట్లు నవ్వుచున్న ఆమె కడుపులో ఆ క్షణమున ఆ దూత చరాచరాత్మకమయిన మూడు లోకములను చూచెను. ఆతడి తల తిరిగిపోయెను. అంత దేవి ప్రతీహారి 'జయ' అను సన్నని నడుముగల గొప్ప తేజశ్శాలిని, దేవి హృదయమున ఉన్న భావమును గూర్చి యిట్లు పలికెను.

"కన్యను కోరువాడు పలుకవలసినది పలికితివి. కాని ఈమె సర్వకాలమునకు సంబంధించిన కౌమార వ్రతమును పట్టినది. అట్లే ఇక్కడి కన్యలందరు ఆమె అడుగుజాడలలో నడచువారు కలరు. వారిలో ఏ యొక్కతెయు మీకు లభింపదు. ఇక పరమ పవిత్రయగు దేవి సంగతి చెప్పనేల? ఓయిదూతా! త్వరగా నీకిక్కడ ఏదో మూడకముందే పొమ్ము" అని ఇట్లు పలుకగా ఆ దూత వెడిలిపోయెను. ఇంతలో మహాముని నారదుడు పెద్దగా నృత్యము చేయుచు,వడివడిగా అచటకు విచ్చేసెను. భాగ్యము భాగ్యమనుచు ఆ శుభలోచనయగు దేవిని గూర్చి పలుకుచు మంచి మన్నన గొన్నవాడై పరమాసనమున కూర్చుండెను. ఆ మహాతాపసుడు సర్వేశ్వరియగు ఆ దేవికి ప్రణమిల్లి యిట్లు పలికెను. "అమ్మా! దేవతలందరు ప్రీతి నంది నన్ను పంపగా నీకడకు వచ్చితిని. దేవీ! మహిషుడను రక్కసునికి దేవతలు అందరు ఓడిరి. ఆ దైత్యరాజు నిన్ను చేపట్టుటకు ప్రయత్నము చేసియున్నాడు. మంచి ముఖసౌందర్యము గల ఓ తల్లీ! మహాదేవీ! దేవతలు నీకిది తెలుపుమని నన్నుపలికిరి. నీవు గట్టిగా నిలబడి ఆ రక్కసుని పరిమార్పుము." ఇట్లు పలికి నారదుడు వెనువెంటనే అంతర్ధానము చెందెను. దేవియు ఆ కన్యల నందరను సిద్ధము కండని పలికెను. అంత ఆ పుణ్యాత్ములగు కన్యలు అందరు దేవి ఆజ్ఞ వలన కత్తులు, డాళ్లు, విండ్లు చేతదాల్చి ఘోర రూపము కలవారై యుద్ధమునకును, దైత్యుని రూపుమాపుటకును సిద్ధపడిరి. ఇంతలో ఆ రక్కసుని సైన్యమంతయు దేవ సేనను వదలి, గొప్పదియగు స్త్రీ బలమున్నచోటికి పరుగున వచ్చెను. గొప్ప ఆత్మ ధైర్యముగల ఆ

కన్యలు రక్కసులతో పోరి క్షణములో వారి నాలుగు అంగములు గల సేననంతటిని కూలవైచిరి. అందు కొందరి తలలు పగిలి నేలcగూలినవి, మరికొందరి రొమ్ములను చీల్చి క్రూరమృగములు నెత్తురు త్రావినవి. మరికొందరు మొండెములు మాత్రము మిగిలిన దైత్యనాయకులు నృత్యములు గావించిరి. ఇంకను మిగిలినవారందరు మహిషాసురుడున్నచోటికి పారిపోయిరి. అపుడు పెద్దదియగు ఆ రాక్షస సేన హాహాకారములు చేసెను. ఈ గందర గోళమును చూచి మహిషుడు "సేనాపతీ! ఇదేమి! నా ఎదుటనే నా సేన నాశనమాయెను?" అని పలికెను. అప్పుడు యజ్ఞహనుడు అను రక్కసుడు ఏనుగురూపము కల, ఆ కన్యలందరు ఈ సేనను సర్వవిధముల విరిచి ప్రోవులు పెట్టెదనని పలికెను. అంత మహిషుడు గద చేపట్టి చక్కని కనులుగల ఆ కన్నెల నందరిని మహావేగముతో తరుముచు వచ్చెను. దేవతలు, గంధర్వులు పూజించుచున్న ఆ దేవి ఉన్నచోటికే వాడు పరుగెత్తుచు వచ్చెను. ఆమెయు అట్లు వచ్చి పడుచున్న రక్కసుని కని ఇరువది చేతులు కలది అయ్యెను.

విల్లు, కత్తి, శక్తి, బాణములు, శూలము, గద, గొడ్డలి,డమరువు, పెద్దఘంట, శతఘ్ని, ఇనుపగుదియ, ఘోరమైన భుశుండి, ఈటె,రోకలి, చక్రము, భిందిపాలము, దండము, పాశము, ధ్వజము, పద్మము అను ఈ ఇరువదింటినిచేతలతో పట్టుకొని సింహము నెక్కి చక్కగా కవచము మొదలగు వానిని ధరించి ఆ దేవి సంహారకారణుడు భయంకరుడు అగు రుద్రుని స్మరించెను. అంత ఎద్దు ధ్వజముగా గల రుద్రుడు తనకు తానై అచటకు వచ్చి, ఆమె అతనికి ప్రణమిల్లి యిట్లు విన్నవించెను. "ఈ దైత్యులను అందరిని నేను గెలుతును. దేవదేవా! సనాతనా! నీవు చేరువలో ఉన్న చాలును" అని పలికి ఆ అసురుల ను పరమేశ్వరి గెలిచెను. ఆ మహిషు నొక్కని వదలి తక్కిన మూక నంత వానిపై కురికెను. ఇంతలో వాడును ఆమెను గాంచి ఆమెవైపు దుమికెను. ఒక్కయెడ ఆ దైత్యరాజు పోరాడును. కొండొకచో పారిపోవును. మరొకవేళ యుద్ధము చేయును. మరొకయెడ మానివేయును. ఇట్లు ఆమెతో పోరుచున్న అతనికి పదివేల దివ్యవత్సరములు గడచిపోయెను. బ్రహ్మాండమంతయు బెదురుగుండెతో కదలిపోయెను. అంత చాలా కాలమునకు, శతశృంగ మహాపర్వతమున ఆ తల్లి పాదములతో తొక్కి, ఆ ఘోర దైత్యుని శూలముతో పొడిచి చంపివైచెను. ఖడ్గముతో వాని తలను కోసివైచెను. అట్లు దేవి

ఆయుధము పడుట వలన ఆ మహిషునిలో ఉన్న ఒక పురుషుడు వాని దేహము నుండి వెలువడి స్వర్గమున కరిగెను. అంత బ్రహ్మతోపాటు దేవతలందరు ఓడి చచ్చిన మహిషుని గాంచి, సంతసించిన హృదయముతో దేవి నిట్లు స్తుతించిరి.

<u>దేవకృతదేవీస్తుతి</u>

నమో దేవి మహాభాగే గంభీరే భీమదర్శనే | జయస్థే స్థితిసిద్ధాన్తే త్రినేత్రే విశ్వతోముఖి ||

విద్యావిద్యే జయే యాజ్యే మహిషాసురమర్దిని | సర్వగే సర్వదేవేశి విశ్వరూపిణి వైష్ణవి ||

వీతశోకే ధ్రువే దేవి పద్మపత్రశుభేక్షణే | శుద్ధసత్త్వవ్రతస్థే చ చండరూపే విభావరి ||

ఋద్ధిసిద్ధి ప్రదే దేవి విద్యేఽవిద్యేఽమృతే శివే | శాంకరీ వైష్ణవీ బ్రాహ్మీ సర్వ దేవనమస్కృతే ||

ఘంటాహస్తే త్రిశూలాస్త్రేమహామహిషమర్దిని| ఉగ్రరూపే విరూపాక్షి మహామాయేఽమృతస్రవే ||

సర్వసత్త్వహితే దేవి సర్వసత్త్వమయే ధ్రువే | విద్యా పురాణ శిల్పానాం జననీ భూతధారిణీ ||

సర్వ దేవరహస్యానాం సర్వసత్త్వవతాం శుభే | త్వమేవ శరణందేవి విద్యేఽవిద్యే శ్రియేఽమ్బికే |

విరూపాక్షి తథా క్షాన్తిక్షోభితా న్తర్జలేఽవిలే ||

నమోస్తుఽతే మహాదేవి నమోస్తు పరమేశ్వరి | నమస్తే సర్వదేవానాం భావనిత్యేఽక్షయేఽవ్యయే ||

శరణం త్వాం ప్రపద్యన్తే యే దేవి పరమేశ్వరి | తేషాం జాయతే కించిదశుభం రణసంకటే ||

యశ్చ వ్యాఘ్రభయే ఘోరే చౌరరాజభయే తథా | స్తవమేనం సదాదేవి పఠిష్యతి యతాత్మవాన్ ||

నిగడస్థోఽపి యో దేవి త్వాం స్మరిష్యతి మానవః| సోఽపి బంధైర్విముక్తస్తు సుసుఖం వసతే సుఖీ || (94.53-63)

"పూజ్యురాలా! దేవీ! ఎరుగుటకు అలవికాని తత్త్వము కలదానా! భయంకరముగా కానవచ్చు ఓ దేవీ! జయము నందుచున్న తల్లీ! సిద్ధాంతమును నెలకొల్పు మాతా! మూడు కన్నులదానా! అన్ని వైపులు ముఖములు గల ఓ అమ్మా! నీకు నమస్కారము. అమ్మా! నీవు విద్యవు, అవిద్యవు, జయవు, పూజ్యవు, మహిషాసురుని మర్దించితివి. అంతట నుందువు. సర్వదేవతలకు ఈశ్వరివి. విశ్వమంతయు నీ రూపమే. ఓ విష్ణుశక్తి! నీకు ప్రణతి. నిన్ను శోకమంటదు. నీవు స్థిరమైన దానవు. తామరరేకుల వంటి చక్కని కన్నులు గల ఓ దేవీ! శుద్ధసత్త్వ స్వరూపముగల వ్రతమునందున్న దానవు. చండరూపము నీది. నీవు రాత్రి రూపిణివి. సంపదను, సిద్ధిని ఒసగుదువు. విద్యవు,

అవిద్యవు, అమృత స్వరూపిణివి. మంగళరూపవు. శంకర, విష్ణు, బ్రహ్మల శక్తులన్నియు కలదానవు. సర్వలోకములు నీకు నమస్కరించును. ఘంటహస్తమున గలదానవు. త్రిశూలము ఆయుధమైన దానవు. మహామహిషుని మర్దించిన దానవు. ఉగ్రమగు రూపముగల దానవు. విరూపములగు కన్నులు కలదానవు. మహామాయవు. అమృతమును జాలువారు తల్లివి. నీవు సర్వజంతువులకు మేలుకూర్చుదానవు. సర్వప్రాణులు నీ స్వరూపమే అయిన దానవు. స్థిరమైన దానవు. విద్యలు, పురాణములు, శిల్పములు అనువానిని పుట్టించిన దానవు. సర్వభూతములను పట్టి నిలుపుదానవు. సర్వదేవతల రహస్యములకు, సర్వశక్తులు కలవారికి నీవే శరణము, దేవీ! విద్యయు, అవిద్యయు, సంపదయు నీవే. నీవే తల్లివి. నీవు మూడు కన్నులతో విరూపాక్షివి. సహన స్వరూపిణివి. నీటిలోపలి శక్తి నీ స్వరూపమే. ఏ కలుషము లేనిదానవు. మహాదేవి! నీకు నమస్సు, పరమేశ్వరీ! నీకు ప్రణామము, సర్వదేవతల భావములందు నిత్యమై వెలయు తల్లీ! అక్షయా! అవ్యయా! నీకు మ్రొక్కులు, పరమేశ్వరీ! దేవీ! ఘోరమగు యుద్ధములు కష్టసమయములలో నిన్ను శరణుపొందిన వారికి ఏకీడును కలుగదు. పులిభయము, ఘోరమగు చోరభయము, రాజభయము కలిగి నపుడు నిశ్చలమగు చిత్తముతో ఈ స్తోత్రమును పఠించువాడును, బంధనమున నుండి నిన్ను తలచిన నరుడును ఆ అన్నింటి నుండి విముక్తుడై సుఖముతో జీవించును." అని ఇట్లు దేవతలందరు చేతులు మోడ్చి స్తుతింపగా, ఆ పరమ సుందరి దేవతలను గాంచి మేలైన వరము కోరుకొనుడని పలికెను.

"అమ్మా! పుణ్యాత్మా! ఈ స్తోత్రమును భక్తితో చదువువారు అన్ని కామితములను పొందువారగునట్లు చేయుము. ఇదియే మాకు వరము" అని నుతింపగా ఆ దేవి "అట్లేయగు గాక!" అని పలికి, ఆ పరాపరయగు దేవి తానచటనే నిలిచినదై దేవత లందరిని వారి వారి తావులకు పంపివైచెను. ఓ ధరిత్రీ! దేవి యీ రెండవ జన్మమును గూర్చి తెలిసికొన్న వాడు శోకము లేని రజోగుణ మంటనివాడును అయి ఏ రోగము లేని పదమునకు చేరుకొనును అనితెల్పెను.(94)

95 వ అధ్యాయము - రౌద్రీశక్తి మహిమ

ఇంకను వరాహుడు ఇట్లు పల్కెను. భూదేవి! నీలగిరికి తపస్సునకై చెదరని మనసుతో అరిగిన, తమోగుణము వలన ఏర్పడిన రౌద్రి అనుశక్తి పట్టినవ్రతమును గూర్చి

చెప్పెదను వినుము. నేను చిరకాలము తపమొనరించి సమస్తమైన జగత్తును పాలింతునని సంకల్పించి, ఆ కాంత పంచాగ్నులు (అనగా నాలుగువైపుల నాలుగుఅగ్నులు పైని సూర్యాగ్ని) ఏర్పరచుకొనెను. అట్లు మహాతీవ్రమగు తపస్సు చేయుచున్న కాలములో బ్రహ్మ ఒసగిన వరములు కలవాడు, గొప్ప ముఖ కాంతి కలవాడు, రురువనువాడు సముద్రము నడుమ రత్నములతో నిండిన గొప్ప తోటలుగల పట్టణమున రాజైయుండెను. అతడు దేవతలందరికి భయంకరుడు. కొన్ని వందల కోట్ల రక్కసులతనికి బంటులు. రెండవ నముచియో అన్నట్లు మహాసంపదతో విరాజిల్లుచుండెను. చాలాకాలము గడువగా అతడు లోకపాలురపురము లన్నింటిని గెలువగోరినవాడై, సేనలను సిద్ధము చసికొని దేవతలకు భయము పుట్టించెను. ఆ మహారాక్షసుడు పైకి లేచుచుండగా సముద్రపు నీరు పెద్ద ఎత్తున పొంగి పోయెను. పెక్కు మొసళ్ళు, గ్రహములు, పెనుచేపలు నిండిన ఆ జలము కొండ చరియ భూములు ముంచి యెత్తెను. సముద్రపునీటిలో ఉన్న పెక్కు రక్కసిమూకలు, విచిత్రమైన ఆయుధములు కలవై, భయము గొలుపుచు పెద్ద యెత్తున సముద్రపు నీటి నుండి వచ్చెను. గొప్ప రాక్షసులతో కూడి, తమ ఆకారమునకు తగిన గంటలుగల పెద్ద పెద్ద దేహములతో కూడిన ఏనుగులు పైకి వచ్చినవి. చక్కని బంగారు నగలు కలిగి ఆ నీటిలోని రోహితములనెడు పెను చేపలవంటి గుఱ్ఱములు లక్షల కొలది, పైకి లేచి వచ్చినవి.

సూర్య రథముతో సమానమగు వేగముకలవి, చక్కని చక్రములు, దండములు, ఇరుసు, మూడు నొగలు కలవి, గొప్ప ఆయుధ యంత్రములు కలవి, కదలాడు పతాకలుకలవి, ఎదురులేని వేగము కలవి, నలుగగొట్టిన ప్రాణుల అంగములు కలవియగు రథములును వెలికి వచ్చినవి. అట్లే ఒకరినొకరు ఒరసికొనుచున్నవారు, ఉత్సాహముతో ముందు వారిని దాటిపోవ గోరువారు, శ్రేష్ఠులు, ఊగులాడు చేతులు కలవారు, ప్రతి యుద్ధమందును జయము గొనువారు, పోటుగాండ్రు అగు యోధులు ఈ రాక్షసరాజు వెంట పెద్దగా ప్రకాశించుచు వచ్చిరి. దేవతలందరు చెల్లాచెదరు కాగా ఆ సేన చతురంగబలముతో కూడినదై నీటి నుండి వెలువడి ఇంద్రుని పురముపైకి దండెత్తెను. రాక్షస రాజ గురువు దేవతలతో తలపడి ముద్గరములతో, రోకండ్లతో, ఈటెలతో, అమ్ములతో, దుడ్డు కర్రలతో పోరొనర్చి వారిని చావగొట్టెను. దేవతలును అట్లే రాక్షసులను కొట్టిరి. ఇట్లు కొంతకాలము పోరొనర్చి దేవతలు ఇంద్రునితోపాటుగా రక్కసుల చేత

ఓడింపబడి ఒక్క పెట్టున పెడమొగము పెట్టి పారిరి. ఇట్లు దేవతలు విరిగి చెల్లాచెదరు కాగా గొప్ప బలశాలియగు ఆ రక్కసుడు దేవతలను తరిమి కొట్టెను. అంత దేవతల మూకలు భయముతో గుండె చెదరిన వారై ఆ దేవి నెలకొనియున్న నీల పర్వతమునకు పరువెత్తుకొనిపోయిరి. ఆమె రుద్రశక్తి. తపస్సున ఆసక్తి కలది. తమోగుణము వలన ఏర్పడినది. ఉత్తమ సంహారకారిణి దేవి. కాళరాత్రి అని ఆమెను వారెరుగుదురు. అట్లు భయముతో గుండె చెదరిన ఆ దేవతలందరను చూచి భయపడకుడని ఆ దేవి పెద్దగా “దేవులారా! ఇదియేమి? మీ స్థితి మిక్కిలి బెదిరినట్లున్నది. వెంటనే చెప్పుడు. మీ భయమునకు కారణమేమి?” అని పలికెను. “అమ్మా! అడుగో వచ్చి పడుచున్నాడు రాక్షసరాజు రురుడు. భయంకరమగు పరాక్రమము కలవాడు. వీనివలన భయమందిన దేవతలందరను, పరమేశ్వరీ! కాపాడుము” అనుచు దేవతలిట్లు పలుకగా భీమపరాక్రమముగల ఆ దేవి మిక్కిలి ప్రీతితో దేవతల యెదుట పెద్దగా నవ్వెను. అట్లు నవ్వుచున్న ఆమె మోము నుండి పెక్కుదేవీ భూతములు వెలువడినవి. వికృతాకారముగల వారిచేత విశ్వమంతయు నిండిపోయినది. అందరు పాశములను అంకుశములను తాల్చినవారు. బలసిన పాలిండ్లు కలవారు. శూలములు చేపట్టినవారు. విండ్లు ధరించినవారు. కోట్లకొలదిగా ఉన్న ఆ దేవీ రూపకాంతలు అందరు ఆ దేవిని క్రమ్ముకొని నిలిచి, అంబుల పొదులు తాల్చి మహాబల దానవులతో యుద్ధ మొనరించిరి.ఆ దేవీ బలములచేత క్షణకాలములో దానవసేన అంతయు నశించినది. దేవతలందరు సన్నద్ధులై దానవ బలముతో పోరిరి. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, విశ్వేదేవులు,అశ్వినులు – అందరు ఆయుధములను గొని రక్కసుల మూకలతో పోరాడిరి, కాళరాత్రి బలమునుదేవతల బలము అంతయు కలిసి యముని ఇంటి కంపెను. మహాదైత్యుడు రురువొక్కడే యుద్ధభూమిలో ఉండెను. వాడును మహారౌద్రియగు రురుశక్తిని ఆ దేవిసేనపై వదలెను. ఆ మాయ దేవతలందరిని మోహపెట్టుచు భయంకరముగా వృద్ధిపొందెను. దానితో మోహితులగు దేవతలందరు వెనువెంటనే నిద్రను పొందిరి. దేవి మూడు మొనల శూలముతో ఆ రాక్షసుని కొట్టెను. ఓ శుభలోచనా! అట్లు దెబ్బతిన్న ఆ దైత్యుని చర్మము, మొండెము వేరువేరుగా పడిపోయెను. దానవరాజగు రురుని చర్మముండ ములను దేవి క్షణములో అపహరించి వైచెను. అందుచేత ఆమె చాముండ ఆయెను. ఆ పరమేశ్వరి, సర్వ

భూతములకు మహారౌద్రి, సంహారిణి కాళరాత్రి అని కొనియాడబడినది. ఆమె వెంటనుండి ఆ లెక్కికిరాని కోట్ల దేవీ గణములు ఆమె చుట్టును నిలిచిరి. వారందరు ఆకలికొన్నవారై ఒక్కపెట్టున, "అమ్మా! ఆకలికొన్నవారము. మాకు భోజనము పెట్టుమని" అడిగిరి. వారట్లు పలుకగా ఆదేవి వారి భోజనమును గూర్చి భావించెను. కాని తనకడ వారికి భోజనము కలుగకుండగా అప్పుడామె మహాదేవుడు, పశుపతి, విభుడగు రుద్రుని ధ్యానించెను.పరమాత్మయగు ముక్కంటి ఆ ధ్యానము వలన అచట సాక్షాత్కరించెను.

"దేవీ, వరారోహా! నీ మనసున ఏమున్నదో, నేను చేయవలసిన దేమో చెప్పుము"అని దేవితో పలుకగా దేవి "దేవదేవా! వీరు తినుటకు కొంచెమేదేని నీ వొసగవలయును. ఆకలితో ఉన్న ఈ మహాబలులందరు నన్ను ఒత్తిడి చేయుచున్నారు. లేనిచో వీరు నన్నేతిని వేయగలరు" అని ప్రార్థించెను. అందులకు పరమశివుడు దేవేశి! మహాప్రభా! కాళరాత్రీ! వరారోహా! వీరి తిండిని ఒకదానిని నేను సిద్ధము చేసితిని. చెప్పుదును. వినుము. గర్భము తాల్చిన ఏస్త్రీ అయినను ఇతర వనితల వస్త్రమును కట్టుకొన్నను, ముఖ్యముగా పురుషుని వస్త్రమును తాకినను అది వీరిలో కొందరికి భాగమగును. తక్కిన వారు దోషములున్నచోట పిల్లలను బలిగా గొని నూర్లకొలది ఏండ్లు ప్రీతికలవారై ఉండవలయును. మరికొందరు పురిటి ఇంటిలో దోషమును మ్రొక్కులు గొనుచు కొనుచుందురు గాక! ఇంకను కొందరు పుట్టిన బిడ్డలను హరించుచు నివసింతురు, ఇంటిలో, పొలములో, చెరువులకడ, తోటలలో అన్యులపై మనసు కలవారై ఏడ్చెడు స్త్రీల శరీరముల నావేశించి వీరిలో కొందరు తృప్తి నందెదరు" అనుచు ఇట్లు పలికి ప్రతాపవంతుడగు రుద్రుడు, అసురేంద్రుడగు రురువు, వాని బలము కూలియుండగా చూచి తానై దేవిని ఇట్లు స్తుతించెను.

<u>రుద్రకృతచాముండా స్తుతి</u>

జయస్వ దేవి చాముండే జయ భూతాపహారిణి | జయ సర్వగతే దేవి కాలరాత్రి నమో2స్తుతే ||

విశ్వమూర్తే శుభే శుద్ధే విరూపాక్షి త్రిలోచనే | భీమరూపే శివే విద్యే మహామాయే మహోదయే ||

మనోజవే జయే జృమ్భే భీమాక్షి క్షుభితక్షయే | మహామారి విచిత్రాఙ్గే గేయనృత్యప్రియే శుభే ||

వికరాలే మహాకాలి కాలికే పాపహారిణి | పాశహస్తే దండహస్తే భీమరూపే భయానకే ||

చాముండే జ్వలమానాస్యే తీక్షదంష్ట్రే మహాబలే | శవయానస్థితే దేవి ప్రేతాసనగతే శివే ||

భీమాక్షి భీషణే దేవి సర్వభూతభయంకరి | కరాలే కరాలే చ మహాకాలే కరాలిని ||

కాలీ కరాలీ విక్రాన్తా కాలరాత్రి నమో2స్తుతే || (95.45 – 50)

"దేవీ! చాముండా! భూతముల రూపుమాపుదానా! అన్నియెడల నుండెడు ఓ కాళరాత్రీ! నీకు నమస్కారము. విశ్వమంతయు నీ రూపమే, నీవు శుభ స్వరూపిణివి. నిర్మలవు, విరూపాక్షివి. ముక్కంటివి. భీమరూపవు. శివా! విద్యాస్వరూపిణీ! మహామాయవు. మహోదయా! నీకు నమస్సు. నీవు మనస్సునకు ఉన్నంత వేగము కలదానవు. జయము నీ స్వరూపము. నీవు ఆవులింతవు. భయము గొలుపు కన్నులు కలదానవు. క్షోభను నశింప జేయుదానవు. మహామారీ! విచిత్రాంగీ గేయము,నృత్యము అనువాని యందు ప్రీతికలదానా! శుభా! నీకు నమస్కారము. మహాకాళీ! కాళికా! భీమరూపిణీ! పాపములను పరిమార్చుదానా! పాశము చేత దాల్చినదానా! దండహస్తా! భయము గొలుపు దేవీ! నీకు మ్రొక్కులు. చాముండా! మంటలు గ్రక్కుచున్న మొగము గలదానా! మిక్కిలి వాడియగు కోరలు గలదానా! మహాబలా! శవవాహనమున నిలుచుదానా! దేవీ! ప్రేతాసనమున నుండు మంగళ స్వరూపా! నీకు నమస్సు. భీమాక్షీ! భీషణా! దేవీ! సర్వభూత భయంకరీ! కరాళా! వికరాళా! మహాకాళీ! కరాళినీ! కాళీ! కరాళీ! పరాక్రమించు తల్లీ! నీకు నమస్కారము. (కరాళి–వెరవు పుట్టించు నది. పొడవైనది) మిక్కిలి వెరపు గొలుపు ముఖము కల దేవీ! అగ్నిజ్వాలలను వెలిగ్రక్కు మోముకల తల్లీ! ప్రాణులన్నింటికి మేలు చేయు సర్వేశ్వరీ! నీకు ప్రణతి" అని పరమేష్ఠియగు రుద్రుడిట్లు స్తుతింపగా దేవి మిక్కిలిగా ఆనందపడుచు ఇట్లు పలికెను. "దేవదేవా! నీ మనసున నున్న వరమును కోరుకొనుము."

"దేవీ! ఈ స్తోత్రముతో నిన్ను స్తుతించువారికి అంతటను ఉండు తల్లివి నీవు వరముల నొసగుము. దేవీ! భక్తితో కూడి దినమునకు మూడు మారులు దీనిని పఠించువాడు పుత్రులు, మనుమలు, పశువులు సమృద్ధిగా కలవాడై ఐశ్వర్యమును పొందును. మూడు శక్తులుగల అమ్మవారి ఈ స్తోత్రమును భక్తితో వినువాడు పాపము లన్నింటిని పోగొట్టుకొని ఏ రోగము లేని స్థానమున కరుగును." అని ఇట్లు శివుడు పరమేశ్వరియగు చాముండను స్తుతించి క్షణములో అంతర్ధానము చెందెను. దేవతలును స్వర్గమున కరిగిరి. ఈ మూడు విధములైన దేవి పుట్టుకను చక్కగా ఎరిగినవాడు ఓ

భూదేవీ! సర్వపాపముల నుండి విడివడి పరమ నిర్వాణమును (మోక్షమును) పొందును. రాజ్యము కోల్పోయిన రాజెవ్వడైనను శ్రద్ధతో శుచియై, నవమినాడును, అష్టమి నాడును, చతుర్దశి నాడును ఉపవాసముండి (ఈ దేవిని కొలుచునేని) ఒక్కయేడు కాలములో ఏ బాధలులేని రాజ్యమును పొందును. ఈ త్రిశక్తి నయ సిద్ధాంతమునకు చెందినది. ఇదిగో తెల్లని ఈ తల్లి బ్రహ్మయందు సత్వరూపమున నెలకొని పరాసృష్టి అగుచున్నది. ఈమెయే ఎర్రని వన్నెకలదియై రజోగుణమున వైష్ణవి అనియు, ఈమెయే నల్లదియై తమోగుణము నందు రుద్రశక్తి అనియు ప్రసిద్ధి కెక్కుచున్నది.

పరమాత్ముడగు దేవుడెట్లు ఒక్కడే మూడు విధములుగా అయ్యెనో అట్లే ప్రయోజమును బట్టి ఒకే శక్తి మూడు విధములుగా ఆయెను. పరమ మంగళమైన ఈ త్రిశక్తి సృష్టిని విన్నవాడు పాపములన్నింటిని పరిమార్చి పరమ నిర్వాణమును పొందును. నవమి యందు శ్రద్ధతో భక్తితో దీనిని విన్నవాడు సాటిలేని రాజ్యమును పొందును. మరియు భయము నుండి ముక్తి పొందును. భూదేవీ! ఎవని యింట ఈ కథ లిఖింపబడునో వానికి అగ్ని భయము, సర్ప భయము, దొంగ భయము కలుగదు. పుస్తకమునందును దీనిని భక్తితో పూజించు పండితుడు చరాచరాత్మకమగు మూడు లోకములను పూజించిన వాడగును. ఈ గ్రంథము ఎవని యింటిలో ఉండునో అతనికి పశువులు, పుత్రులు, ధనము, ధాన్యము, చక్కని కాంతలు, రత్నములు, గుఱ్ఱములు, ఏనుగులు, సేవకులు, వాహనములు శీఘ్రముగా కలుగును.

భూతధారిణీ! రుద్రుని రహస్యమగు మహిమను గూర్చి మొత్తముగా నీకు తెలిపితిని. చాముండాదేవి తొమ్మిది కోట్ల భేదస్వరూపములతో నిలిచి ఉన్నది. ఆమె రుద్రునికి చెందిన తామసి యగు శక్తి. అట్లే వైష్ణవి భేదములు పదునెనిమిది కోట్లు. ఆమె రజస్సంబంధమగు శక్తి. లోకముల నేలునది. ఇక ఆ సత్వగుణమునందున్న బ్రహ్మశక్తి భేదములు అనంతములు. ఈ ముప్వురిభేదములన్నింటి యందును, రుద్రుడు విడిగా ఒక్కొక్క రూపముతో అంతటను ప్రభువైయుండును. ఈ మహాశక్తి రూపము లెన్నికలవో అన్నింటియందు శంకరుడు పతిరూపమున నుండి వానిని పొందుచున్నాడు. ఆ రూపములను ఆరాధించినచో రుద్రుడు తుష్టుడగును. ఆ దేవి మంత్రులు సర్వకార్యములను సిద్ధింప జేయుచుందురు. సంశయములేదు" అని వరాహమూర్తి తెల్పెను. (95)

96 వ అధ్యాయము – రుద్రవ్రతోత్పత్తికథనము

వరాహస్వామి ఇట్లు పల్కెను. "వరాననా! ఇంక రుద్రపక్షము పుట్టుకను గూర్చి వినుము. ఆ జ్ఞానముతో మానవులు సర్వపాపముల నుండియు ముక్తుడగును. బ్రహ్మ మునుపు రుద్రుని సృజించెను. అది మూడవ జన్మము (1)విష్ణువు, 2) బ్రహ్మ,3) రుద్రుడు) ఆ రుద్రుడు పచ్చని కన్నులు కలవాడు నలుపు, ఎరుపుల వన్నె, కలవాడు. అప్పుడు బ్రహ్మ వేడుకతో ఆ బాలుని భుజముపై ఎత్తుకొనెను. అవ్యక్తము నుండి పుట్టిన బ్రహ్మ భుజముపైన ఎక్కించుకొనగా అతని అయిదవతల ఆధర్వణ మంత్రములను పలికెను. దానివలన మనుజుడు అప్పటికప్పుడు ముక్తి పొందును. "కపాలీ! రుద్ర! బభ్రు! భవ! కైరాత! సువ్రత! విశాలాక్ష! కుమారవర! సర్వజ్ఞా! ఈ విశ్వము నంతటిని రక్షింపుము" అని ఇట్లు బ్రహ్మ రానున్న నామములతో పిలువగా భవుడు కపాల శబ్దము వలన కోపించినవాడై బ్రహ్మ యొక్క ఆ అయిదవ తలను ఎడమచేతి వ్రేలిగోటితో తెగగోసెను. ఆ తెగినతల శివుని చేతియందు తగులుకొని యుండెను. ఆ ప్రజాపతి తలచేతి నుండగా ముక్కంటి వినయముతో బ్రహ్మతో ఇట్లు పలికెను. దేవా! ఈ పుర్రె నాచేతి నుండి ఎట్లు పడును? ఈ నా పాపము ఎట్లు నశించును? ఆలసింపక చెప్పుము. "దేవా! సమయాచారముతో కూడిన ఈ కాపాలిక వ్రతమునే నీదగు తేజస్సుతో ఆచరింపుము" అని వ్యక్తము కాని రూపము కల బ్రహ్మ ఇట్లు పలుకగా రుద్రుడు అప్పుడు మిక్కిలి ఎత్తైనది, పాపములను పోకార్చునది అగు మహేంద్ర పర్వతమునకు ఏతెంచెను. అందుండి మహాదేవుడు ఆ తలను మూడు ముక్కలు చేసెను. అది అట్లు పగులగా రుద్రుడు దాని కేశములను కైకొని జన్నిదముగా చేసికొనెను. ఎముకలను అక్షమణులను కావించుకొనెను. పుర్రె ముక్క నొకదానిని నెత్తురు నిండినదానిని చేతనుంచుకొని మరొక ముక్కచేసి జుట్టుముడిలో ఉంచెను.

ఇట్లు చేసి మహాదేవుడు ఏడు ద్వీపములు గల పుణ్యమైన భూమంతా, తీర్థములలో మునుగుచు, తిరిగెను. మొదట సముద్రమున స్నానముచేసి తరువాత గంగలో మునిగెను. పిదప సరస్వతికరిగి మరల యమునా సంగమ స్థానమున తానమాడెను. శతద్రువు, దేవిక, మహానది, వితస్త, చంద్రభాగ, గోమతి, సింధువు, తుంగభద్ర, గోదావరి, గండకి అనునదులలో స్నానమాడెను. పిదప పై సీమలకు వెళ్లెను. రుద్ర మహాలయము, దారు వనము, కేదారము మొదలగు తీర్థములను సేవించెను. భద్రేశ్వరమున కరిగి గయకు

పోయెను. గయకరిగి స్నానముచేసి యత్నముతో పితృదేవతలకు తర్పణముచేసెను. పిదప వేగముగా సకల బ్రహ్మాండమును చుట్టి వచ్చెను. ఇట్లాతడు తిరుగుచుండగా ఆరవ ఏట ఆతని నడుమున ఉన్న గోచిగుడ్డ జారిపడెను. దేవీ! అదిపడగా ఆతడు దిగంబరుడు ఆయెను. ఆవిధముగా కాపాలికుడు అయ్యెను.

ప్రతి తీర్థమునందును హరుడు స్నానము చేసి పుట్టెను వదలించుకొనగోరెను. కాని అది అతని నుండి జారిపోకున్నది. పిమ్మట మహాత్ముడగు ముక్కంటి ఒక్క ఏడుకాలము హిమవత్పర్వతమున తిరిగెను. అటు తిరుగుచుండగా ఆతనికి కపిలవర్ణము కలిగెను. మరలా రెండేండ్లు పరమేష్ఠి, వృషాకపియగు రుద్రుడు పురాణములగు తీర్థములన్నింటిని చుట్టివచ్చెను. అంత కొంతకాలమునకు పంద్రెండ్రవయేట ఆ దేవుడు వారాణసి కరిగి అచట స్నానమాచరించెను. దేవదేవుడు గంగయందు మునిగిన వెంటనే మునుపు తగులుకొనిన బ్రహ్మకపాలము జారిపడెను. భూదేవీ! అంతటి నుండి కాశీనగరమునందు, ఉత్తమమగు ఆ తీర్థము భూమిలో 'కపాల మోచనమ'ను ఖ్యాతి గడించెను. రుద్రుని చేతినుండి పడిన కపాలమునుచూచి బ్రహ్మ దేవతలతో పాటుగా వచ్చి ఇట్లు పలికెను. భవా! రుద్రా! లోకమార్గమున నున్నవాడవై వ్రతములను ఆచరింపుము. మహాప్రభూ! ఈ వ్రతములు లోకమునకు ఉపయోగపడును. నీవు పుర్రెనుగొని గోచితో తిరిగితివి. అది నరులకు 'మహావ్రతము' కాగలదు. బట్టలు లేక కపాలమును శ్రద్ధగా చేతనుంచుకొని తిరిగితివి. అది 'నగ్నకాపాలిక వ్రతము'గా మనుష్యులకగును. నీకు హిమపర్వతమున తిరుగుచుండగా ఒక విధమగు ఎరుపువన్నె కలిగినది. దేవా! అది 'బాభ్రవ్యమను' వ్రతమగును.

ఇప్పుడు ఈ తీర్థమున విశుద్ధుడవగు నీకు దేహశుద్ధత ఏర్పడినది. పాపనాశనమగు ఆ వ్రతము 'శుద్ధశైవము' అగును. నన్ను పురస్కరించుకొని దేవతలు నిన్ను పెక్కు విధములుగా పూజింతురు. ఆ అన్నింటి శాస్త్రములను నీవే చెప్పగలవు. మరొక పద్ధతి లేదు. కుమారా!నీవు చేసిన వ్రతములన్నింటిని చేయువాడు నీ ప్రసాదము వలన బ్రహ్మహత్య చేయువాడైనను పరిశుద్ధుడగును. నగ్నకాపాలము, బాభ్రవ్యము, శుద్ధశైవము అను వ్రతములను చేయువారు ఆయా నామములు కలవారగుదురు.దేవా! నన్ను ముందుంచుకొని విధానము ననుసరించి నిన్ను అర్చించువారికి ఆ శాస్త్రములన్నింటిని,

అట్లే పాశుపత శాస్త్రమును విధాన పూర్వకముగా మహాదేవా! ఉపదేశింపుము" అని తెలియరాని ఆకృతిగల బ్రహ్మ యిట్లు పలుకగా రుద్రుడు సంతుష్టుడై, దేవతలు జయజయ నాదములు చేయుచుండగా, కైలాసనిలయమున కరిగెను. బ్రహ్మయు దేవతలతో పాటు తన ఉత్తమ లోకమున కరిగెను. అట నుండి దేవతలందరును వచ్చిన మార్గమున తమ నెలవుల కరిగిరి. భూదేవీ! ఇది రుద్రుని మాహాత్మ్యము. నేను చక్కగా వివరించి చెప్పితిని. దేవుని చరితము, వ్రతము భూమియందు ఎట్లేర్పడెనో వివరించితిని. ఆ రుద్రుని కంటే మిన్నయగు వాడు, నారాయణ ప్రభువు ఒక్కడు తక్క ఎవ్వడు కలడు? (96)

97 వ అధ్యాయము - సత్యతపోపాఖ్యానము

అనితెల్పగా ధరణి ఇట్లు పలికెను. "ప్రభూ!సత్యతపుడను వాడు మొదట బోయఅయి, తరువాత బ్రాహ్మణుడై ప్రకాశించెను. అతడు తన శక్తి మేరకు ఆరుణి అను వానిని పెద్దపులి భయము వలన కాపాడెను. దుర్వాసుడు ఉపదేశింపంగ హిమవత్పర్వతపు ఉత్తరదిశ కరిగెను. అందొక గొప్ప వింత జరిగెనని నీవు చెప్పితివి. అది ఎట్టిది? చాల వేడుకగా నున్నది. నాకు దానిని చెప్పుము" అని ప్రార్థింపగా వరాహమూర్తి ధరణితో "ఆ సత్యతపుడు పూర్వము భృగువంశమున పుట్టిన బ్రాహ్మణుడు. క్రూరుల సంసర్గము వలన బోయవాడుగా పుట్టెను. అంత చాలాకాలమునకు ఋషుల చెలిమి వలన మరల బాహ్మణుడాయెను. దుర్వాసుని బోధ వలన మరింత ప్రకాశించెను. హిమగిరి ఉత్తర పాదమున పుష్పభద్ర అను మంచి నది కలదు. దాని ఒడ్డున ఒక దివ్య శిల కలదు. దాని పేరు చిత్రశిల. అక్కడ భద్రమహావటమను ఒక గొప్ప మర్రిచెట్టు కలదు. అందా సత్యతపుడు తపస్సు చేయుచు మహా తాపసుడాయెను. అతడు ఒకనాడు గొడ్డలితో సమిధలు కోయుచు ఎడమచేతి చూపుడు వ్రేలిని నరకు కొనెను. తెగిన వ్రేలి నుండి భస్మపు పొడి ఏర్పడినదట. రక్తము, మాంసము, క్రొవ్వు ఏదియు కానరాలేదు. అతడు లెక్క పెట్టక మరల సమిధలు కొట్టుచుండెను. మరల అట్లే భస్మము కారుచు కన్పట్టెను. వ్రేలు అతుకుకొని మునుపటివలె ఆయెను. ఆ భద్రవటమున గల ఒక కిన్నర మిథునము రాత్రి నిద్రించి యుండెను. ఆ ఋషికి సంబంధించిన అద్భుతమును చూచి తెల్లవారిన పిదప ఇంద్రలోకమున కరిగెను. అంత ఇంద్రునితోపాటు దేవతలందరు, యక్షులు, గంధర్వులు, కిన్నరులు, ఏదేని మునుపెన్నడు జరుగని మహాశ్చర్యము కలిగెనా చెప్పుడని అడిగిరి. అంత

రుద్రసరస్సు ఒడ్డున ఉండు ఈ కిన్నరుల జంట ఇట్లు పలికెను. హిమవత్పర్వతమున పుష్పభద్రానది యొడ్డున మేమొక మహాశ్చర్యమును చూచితిమని వారు పలికి సత్యతపసుని వృత్తాంతము,చేతి నుండి భస్మము వెలికి వచ్చుట అను దానిని వివరించి చెప్పిరి. అది విని ఇంద్రుడు అచ్చెరువొంది విష్ణువుతో ఇట్లనెను. "విష్ణూ! రమ్ము, హిమవత్పర్వతము వైపు వెళ్లుదము. అక్కడ ఒక మహాశ్చర్యము సంభవించినదట. కిన్నరుడు చెప్పెను" అని ఇట్లు పలుకగా విష్ణువు వరాహమాయెను. ఇంద్రుడు వేటకాడై వారిరువురు ఆ ఋషికడ కరిగిరి. విష్ణువు పందిరూపముతో ఋషి కంటబడి నిలిచెను. కనపడియు కనబడక మరల కనపడుచు ఉండెను. ఇంతలో ఇంద్రుడు విల్లు చేపట్టి వాడి బాణములు తాల్చి వచ్చి సత్యతపర్షితో ఇట్లనెను.

"మహామునీ! దొడ్డదొరా! ఇచట ఒక బలిసిన పెద్ద పందిని చూచితివా? దానిని నావారి పోషణకై చంపెదను." అని పలుకగా, ధారణీ! ఆ మునియిట్లు తలపోసెను. 'ఈతనికి ఆ పందిని చూపితినా దానిని వీడు చంపును. చూపకుందునా, ఆకలితో వీని కుటుంబము నిస్సంశయముగా నశించును. పెండ్లము బిడ్డలతో వీడు మిక్కిలి ఆకలితో సున్నాడు. బాణము తగిలిన పంది నా ఆశ్రమమును చేరుకొనినది. ఇట్టి స్థితిలో నేనేమి చేయుదును?' అని ఆ ముని చింతించుచు నిశ్చయము పొందకుండెను. క్షణములో,అతనికొక ఊహ తోచెను. "ప్రాణము కలవారికి చూచుటకు కంటిని, పలుకుటకు నాలుకను ఏర్పరచెను. వేటకాడా! ఇక్కడ చూచినా నా కంటికి పలుకగల నాలుక లేదు. నాలుకకు చూచు కన్ను లేదు అనెను." ఇది విని ఆ ఇంద్రుడు, విష్ణువును సంతోషించి నిజరూపమును చూపిరి. మేము సంతసించితిమి. నీవొక కోరిక కోరుకొనుము అనియు పలికిరి. అది విని సత్వతపుడు ఇట్లనెను. "దేవులారా! ఈ వరమే నాకు చాలును. ధన్యుడను. దేవదేవులిరువురు నాముందు కానవచ్చితిరి. భూమిపై ఇంతకుమించిన వరమేముండును? అయినను పండుగ దినములలో ఒకనెల ఈ కథను విప్రులకు భక్తితో వినిపించినచో విప్రుల ద్రోగువడిన పాపమంతయు నశించుగాక. ఇది నేను కోరు వరము. నేను ముక్తి పొందవలయును. ఇది రెండవ వరము." అని పలుకగా ఆ దేవులిరువురు అట్లే అని ఆతనికి శుభమైన వరము నొసగి అదృశ్యులైరి. అతడును వరములు పొంది ఆ ఆశ్రమమున నుండి హృదయమున బ్రహ్మభూతుడాయెను.

అట్లు నెరవేరిన ప్రయోజనము గల ఆ మహాముని ఆ దేశమున ఉండగా ఆతని గురువు ఆరుణి అతనికి కానవచ్చెను. ఆ ఆరుణి భూమి నంతయు తీర్థయాత్రలకై చుట్టి వచ్చెను. ఆ మునిపుంగవుని ఈతడు పాద్యము, ఆచమనము, గోదానము మున్నగు వానితో మహాభక్తితో పూజించెను. ఆ ఆతడును ఆసనమును స్వీకరించి యుండెను. ఆతడును ఆ శిష్యుడు తపస్సుచేత కాలిన పాపములుగల సిద్ధుడని ఎరిగి, ఎదరుగా చేతులు మోడ్చి వినయముతో నిలిచియున్న ఆతనితో నిట్లనెను. "బిడ్డా! తపస్సుచేత సిద్ధుడవయితివి. బ్రహ్మభూతుడవయితివి. ఇప్పుడు నీకు ముక్తికాలము చేకూరినది. లే, రా! నాతో కలసి పరమపదమునకు రమ్ము. అచటకు పోయినచో నీకు మరల జన్మము కలుగదనుటకు సంశయము లేదు" ఇట్లు పలికిన పిమ్మట ఆ సిద్ధులిరువురు సత్యతపుడును, ఆరుణియు నారాయణ దేవుని ధ్యానించి తమ దేహములతో స్వరమున కరిగిరి. ఈ విస్తరమైన పర్వాధ్యాయమున ఒక్క నాలుగవ భాగము నైనను చదువువాడు, వినిపించువాడు గయ కరిగి పితృదేవతలను పూజించిన ఫలమును పొందును" అని తెల్పెను. (97)

98 వ అధ్యాయము - విష్ణుపూజా విధానము, మహిమ

ఆ వృత్తాంతమును వినిన పిమ్మట ధరణి "అవ్యక్తము వలన జన్మించిన బ్రహ్మశరీరము నుండి వెలువడిన ఆమాయ గాయత్రి ఎనిమిది భుజములు గలదియై వైత్రాసురునితో పోరాడెను. ఆమెయే దేవకార్యమును చేయగోరి నందయైనది. బ్రహ్మమాట మేరకు మహిషుడను రాక్షసుని వధ చేయనున్నది. విష్ణుమాయచే అతడు చచ్చెను. ఇది ఎట్లు? ప్రభూ! నాకు చెప్పుము" అని ప్రశ్నింపగా వారాహదేవుడు ఇట్లు చెప్పెను. "జగములకు మేలుకోరిన ఈ దేవి శంకరుని ప్రియురాలు గంగయు అగును. ఏది ఎప్పుడు ఎట్లు జరుగ వలయునో తెలిసినవాడు అన్నియు తెలిసిన పరమాత్మయే. స్వాయంభువ మన్వంతరమున మందరగిరియందు వైష్ణవి మహిషుడను రక్కసుని చంపెను. తరువాత మరియొక మహిషుడు కలడు. అతడు వైత్రాసురుడు. మహాబల పరాక్రమములు గల ఆతడు వింధ్యమున నందచేత చచ్చెను. ఆ తల్లి జ్ఞానశక్తి. మహిషుడు అజ్ఞానము రూపుకట్టినవాడు. అజ్ఞానము జ్ఞానముచేతనే రూపుమాయు ననుటచేతను సంశయము లేకుండును. మూర్తి పక్షమున ఇతిహాసము, మూర్తి సంభావన లేనిచో ఆమెను ఒకే స్వరూపముతో హృదయమున సంభావింప వలయును. వేదపండితులు వేద వాక్యములతో

దీనిని చక్కగా తెలియజెప్పుదురు. దేవీ! ఇప్పుడు వినుము. దేవదేవుడగు విష్ణువు పూజ అయిదు మహాపాతకములను నశింప జేయునదియు, పుత్రులను, ధనమును ప్రసాదించునదియు కలదు. దానిని చెప్పెదను.

ఈ జన్మమున లేమి, రోగము, కుష్ఠు మొదలగు వానిచేత పీడ నొందినవాడు, సంపదలు, పుత్రులు లేనివాడుఅగు నరుడు మండలమునందు దేవితో పాటుగా ఉన్న దేవుని చూచిన వెనువెంటనే సంపదను, ఆయువును, ధనమును, కుమారుని సుఖమును పొందును. విధానముననుసరించి నవనాభిమండలం కలది, పదునారు గాని ఎనిమిది గాని దళములు కలదిఅగు మండలము నందు దేవితో పాటు పూజనొందినవాడు,మంత్రములే ఆకారమైన వాడును, తల్లి కడుపున పుట్టనివాడును, పరదైవము అగు నారాయణుని ఆచార్యుడు చూపగా చూచినవాడు, విశ్లేషించి కార్తిక మాసమున శుక్లపక్షమున ద్వాదశినాడు గాని లేదా అన్ని నెలలలో ద్వాదశుల యందుగాని, సంక్రాంతి దినమునగాని, సూర్యచంద్రుల గ్రహణ దినములందుగాని గురువు ద్వారమున అర్చనలుగొన్న పరమదైవము నారాయణుని దర్శించినవాడు పరమానందమందును. వాని పాపములన్నియు పటాపంచలగును. బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు అను భక్తులను గురువు శుద్ధిని బట్టియు, పనులను బట్టి పరీక్షించాలి.

అట్లు తనకడకు వచ్చిన వారిని చక్కగా పరీక్షించి ఎంచుకొని, గురువు మనసులో నిర్ణయించుకోవాలి. వారును భక్తి కలవారై సంవత్సరకాలము గురువును పరమేశ్వరునిగా భావించి విష్ణువునకు వలె చపలత లేని విధముగా భక్తి చేయవలయును. అట్లు ఒక ఏడు ముగిసిన పిదప గురువును ప్రసన్నుని చేసికొన వలయును. "పూజ్యుడా! తపోధనా! నీ దయచేత సంసార సముద్రమును దాటుదును. ఇక భాగ్యమును కోరుచున్నాము." తెలివిగలవాడు గురువును ఎదుటనున్న విష్ణువునుగా భావించి ఇట్లు చక్కగా పూజింపవలయును. గురువు కూడ వారట్లు కొలువగా కార్తిక మాసం దశమినాడు పరమేష్ఠి మంత్రమును జపించుచు మర్రిచెట్టు పాలను పుచ్చుకొని దేవదేవుని సన్నిధియందు నిదురింపవలయును. మరియు భక్తుడు వివేకముతో గురువు ముందు తాను గాంచిన కలలను గూర్చి విన్నవింప వలయును. గురువు అందలి శుభమును అశుభమును తెలియజెప్పవలయును. ఏకాదశినాడు ఉపవాసముండి స్నానము చేసి దేవాలయమున

కరుగవలయును. గురువు చక్కగా తీర్చిదిద్దిన భూమియందు మండలమును కూర్పవలయును. వేరు వేరు శుభలక్షణములతో భూమిని చక్కగా అలంకరించి పదునారు అరలు గల చక్రమును గాని, తొమ్మిది బొడిపెలుగల మండలముగాని గీయవలయును. లేదా ఎనిమిదిరేకుల పద్మము వంటి మండలమునైన వ్రాసి చూపవలయును, ప్రయత్నముతో తెల్లని వస్త్రముతో భక్తులకు నేత్రబంధము చేయవలెను. తరువాత వారివారి వర్ణముల క్రమమును అనుసరించి పూవులు చేత దాల్చిన శిష్యులను ప్రవేశపెట్టవలయును. రంగులతో తొమ్మిది బొడిపెల మండలము చేసినపుడు గురువు తూర్పుదిక్కున ఇంద్రుని నిలిపి పూజింపవలయును. లోకపాలుర నందరిని ఇట్లు వారి వారి దిక్కులయందు నిలుప వలయును. అగ్నిని ఆగ్నేయమునందు, యముని దక్షిణమునందు, నిరృతిని నైరృతియందు, వరుణుని దక్షిణము నందు, వాయువును వాయవ్యము నందు, కుబేరుని ఉత్తరమునందు, రుద్రుని ఈశాన్యము నందు నిలిపి పూజింపవలయును.

ఈ విధముగా శాస్త్రమును అనుసరించి ఆయా దిక్కుల క్షేత్రములలో దిక్పాలురను పూజించి పద్మమునడుమ పరమేశ్వరుడగు విష్ణువును పూజింపవలయును. తూర్పు రేకున బలరాముని, దక్షిణపు రేకున ప్రద్యుమ్నుని, పడమటిరేకున అనిరుద్ధుని, ఉత్తరమున సర్వపాతకములను అణచివేయు వాసుదేవుని నిలిపి పూజింపవలయును. ఈశాన్యమున శంఖమును, ఆగ్నేయమున చక్రమును, దక్షిణమున గదను, వాయవ్యమున పద్మమును, ఈశానదిక్కున రోకలిని, దక్షిణమున గరుడుని పూజింపవలయును. దేవదేవునికి వెనుకవైపుగా లక్ష్మిని నిలుపవలయును. ధనుస్సును, ఖడ్గమును దేవుని ముందు భాగమున నిలుపవలయును. శ్రీవత్సమును, కౌస్తుభమును కూడా దేవుని ముందుంచి పూజింపవలయును. ఇట్లు పద్ధతి ప్రకారము దేవదేవుడగు జనార్ధనుని పూజించి దిక్కులందలి మండలములలో ఎనిమిది కుంభములను పద్దతి ననుసరించి ఉంచవలెను. మరియు విష్ణు సంబంధమైన తొమ్మిదవ కలశము నొకదానిని కూడ ఉంచవలయును. ముక్తిని కోరుచు వైష్ణవఘటముతో దేవుని అభిషేకింపవలయును. సంపద కోరువాడు ఇంద్రఘటముతోను, వస్తువులు ప్రతాపము కోరువాడు ఆగ్నేయ ఘటముతోను అభిషేకము చేయవలయును. మృత్యువును గెలుచు పద్ధతి కొరకు దక్షిణ దిక్కు కలశము తోడను, దుష్టులను రూపుమాపు కోరికతో నైరృతమగు కలశము తోడను స్నానము చేయింప

వలయును. శాంతికై దక్షిణ కలశముతోడను, పాపములు నశించుటకై వాయువ్య కలశము తోడను, ద్రవ్య సంపత్తి వాంఛ కలవాడు ఉత్తర కలశము తోడను అభిషేకము చేయవలయును. ఈశాన దిక్కు కలశముతో జ్ఞాన సంపదకై స్నానము చేయింపవలయును. ఇవి లోకపాలుర ఘటములు. ఒక్క కలశముతో నరుడు స్నానము చేసినను సర్వపాపములను పోగొట్టుకొనును. అడ్డు లేని జ్ఞానమును, సంపదను విప్రుడు, వివేకము కలవాడు పొందును. ఇంక తొమ్మిది కలశములతో స్నానము చేసినచో చెప్పనేల? పాతకములన్నియు వానికి నశించును. మరియు విష్ణువంతటి వాడగును. లేదా వెనువెంటనే రాజగును.

అట్లుకాక సంఖ్యను అనుసరించి అన్ని దిక్కులయందును తన శాస్త్రవిధానమును బట్టి లోకపాలురను పూజింపవలయును. ఇట్లు ప్రసన్నమగు బుద్ధి కలవాడై లోకపాలురగు దేవులను చక్కగా పూజించి తరువాత కన్నులకు గుడ్డ కట్టుకొన్న శిష్యులను ప్రదక్షిణముగా ప్రవేశపెట్టవలయును. అగ్ని తేజస్సు తాల్చినవి, కాలినవి, వాయువుచేత విసరబడినవి, సోమరసము చేత తృప్తినందినవి అగు సమయములను (ప్రతిజ్ఞలను) పండితుడగు ఆచార్యుడు శిష్యులకు వినిపించవలయును. బ్రాహ్మణులు, వేదములు నిందింపరానివి. "బ్రాహ్మణుడు విష్ణువే, రుద్రుని, ఆదిత్యుని, అగ్నిని, లోకపాలురను, గ్రహములను, గురువులను, విష్ణుభక్తులను మునుపు దీక్షగొన్న పురుషుని నిందింపను" అని ప్రతిజ్ఞ చేయించి తరువాత హోమకార్యమును చేయింప వలయును. శిష్యుని దేహమునందున్న తత్త్వములను (పంచభూతములు మొదలగువానిని) శుద్ధి చేయవలయును. "ఓం నమో భగవతే సర్వరూపిణే హుంఫట్ స్వాహా" అను పదునారక్షరముల మంత్రముతో జ్వలించుచున్న అగ్నియందు హోమము చేయింప వలయును. గర్భాధానము మొదలగు సంస్కారములను మూడుమూడు ఆహుతులతో దేవదేవుని సన్నిధియందు కావించవలయును. హోమము ముగిసిన పిదప దీక్షగొన్న రాజు గురుదక్షిణగా ఏనుగులు, గుఱ్ఱములు, వలయములు, సువర్ణములు, అగ్రహారములు మొదలగువాని నొసగవలయును. బుద్ధిశాలియగు మధ్యముడు (ఎక్కువ ధనసంపద లేనివాడు) మధ్య విధమగు గురు దక్షిణను ఒసగవలయును. ఇతరుడు (సామాన్యుడు) కొంచెము పాటి సువర్ణముతో ఏదైన తనకు కలదానిని జంటగా నొసగవలయును.

ధరాదేవీ! ఇట్లు చేయగా కలుగు పుణ్యము మహిమను నూరుల ఏండ్లు వర్ణించినను తీరదు. ముందు దీక్షితాత్ముడై వరాహ పురాణమునువినునేని వానికి వేదములు పురాణములు, అన్ని మంత్రములును చేతికి చిక్కినట్లే. పుష్కర తీర్థము నందును, ప్రయాగయందును, సింధు సాగరమునందును, దేవ నిలయమగు కురుక్షేత్రమునందును, విశేషించి వారణాసి యందును, గ్రహణ కాలమునను, విషువమునందును (రాత్రింబవళ్లు సమానముగా దినము) జపించువారికి ఏ పుణ్యము కలుగునో దానికి రెట్టింపు ఫలము దీక్షితుడైన ఈ వరాహపురాణము విన్నవానికి కలుగును. దేవతలు కూడ తపము చేసి ధ్యానిస్తూ, భారత వర్షమున ఎప్పుడు పుట్టుదుమో, దీక్షితులమై ఎప్పుడు వరాహపురాణమును విందుమో అని పలుకుచుందురు. పదునారు విభాగములు గల వరాహపురాణమును వినుచు ఎపుడు దేహమును వదలి మరల పుట్టుకలేని పరమ స్థానమును పొందుదుమోకదా! అని ధ్యానించు చుందురు. ఓ భూదేవి! మేము కార్తిక మాసమున ఎప్పుడు వరాహ యాగము చూతుమో! అని విబుధులు పలుకుచుందురు. మనసున చింతించుచుందురు. ఓ భూతధారిణీ! నేను నీకు ఈ యాగవిధానమును చెప్పితిని. ఇది దేవతలకు, గంధర్వులకు, యక్షులకు, అన్ని వేళలందును దుర్లభమైనది. దేవీ! దీనిని తత్త్వముతో ఎరిగిన వాడు, మండలమును తత్త్వపూర్వకముగా దర్శించుకొనువాడు. ఈ విధానమును తత్త్వముతో వినువాడు– ఈ అందరును ముక్తులని వేదము చెప్పుచున్నది" అని చెప్పగా ధరణి "దేవా! ఈ ద్వాదశుల ఫలమును నీవు చెప్పితివే దానిని, అల్పమగు ఆయువుగల మనుష్యులు, పొందజాలరు. తక్కువ శ్రమతో ఒక సంవత్సర కాలము ఉపవాసముండి మహాఫలమును పొందు మార్గమును నాకు తెలియజెప్పుము" అని కోరగా వరాహమూర్తి ఇట్లు పలికెను.

"దేవీ! ఈ యర్థమునే ముందు గొప్ప కీర్తి గల శ్వేతుడను రాజు స్వర్గమున గొప్ప ఆకలికి పీడనొంది వసిష్ఠుని అడిగెను. ఇలావృత వర్షమున దొడ్డబుద్ధి కల శ్వేతుడను రాజుండెను. ఆతడు 'పట్టణములతో, తోటలతో, చెట్లతో కూడిన సమస్త భూమిని, భగవంతుడా! బ్రాహ్మణులకు ఒసగగోరుచున్నాను. నాకనుమతి నిమ్ము'– అని వసిష్ఠునితో పలికెను. అపుడు వసిష్టుడు ఆ రాజసత్తమునితో ఇట్లనెను." రాజా! అన్నదానము సర్వకాలములందును సుఖమును కలిగించునది. అన్న మొసగినచో భూతలమున

ఈయబడనిది ఏముండును. అన్ని దానములలో అన్నదానము మిన్న. అన్నము వలననే సర్వప్రాణులును పుట్టు చున్నవి. అన్నము చేతనే వృద్ధిని చున్నవి. అందువలన సర్వప్రయత్నముతో రాజా! అన్నము ఇమ్ము" అనెను. రాజా మాటలు లెక్కచేయక వసిష్ఠునితో ఇట్లనెను. "అన్నమేమైనా ఒక గొప్ప దానమిచ్చు వస్తువా?చెప్పు."అని రత్నములను, వస్త్రములను, అలంకారములను నగరములను, ఏనుగులను, మృగచర్మము లను ఆ శ్రీమంతుడు బ్రాహ్మణుల కిచ్చుచుండెను. అంత గొప్ప ధర్మవేత్తయగు ఆ రాజు, భూమినంతటిని జయించి పురోహితుడు తాపస శ్రేష్ఠుడగు వసిష్ఠునితో "భగవానుడా! వేయి అశ్వమేధములను చేయగోరుచున్నాను" అని పలికెను. బంగారు కాసులు, రత్నములు, వెండి వస్తువులు మొదలగువానిని యజ్ఞము చేసి ఆ రాజు బ్రాహ్మణులకు దాన మొసగెను. కాని తక్కువ వస్తువని తలచి అన్నమునుగాని, నీటిని గాని ఒసగలేదు. ఇట్లు గొప్ప విభవముగల మహాత్ముడగు ఆ రాజునకు కాలధర్మవశమున మృత్యువు సంప్రాప్తించెను. దప్పి, ఆకలి అనునవి బాధించుచుండగా ఆ రాజవరుడు అప్సరసల నివాసమగు శ్వేతమను పర్వతమును కరిగెను. పరలోకమున తిరుగుచు దొడ్డ బుద్ధిగల ఆ రాజు ఆకలిదప్పుల చేత పీడ నొందెను. అందాతని వెనుకటి జన్మపుమూర్తి కాలినదై ఉండెను. ఆ రాజు దాని ఎముకలను ప్రోగుచేసికొని నాకుచునుండెను. మరల విమాన మెక్కి స్వర్గమున కరిగెను. అంత పెద్ద కాలమునకు చక్కగా చేసిన వ్రతములుగల ఆ రాజు ఎముకలను నాకుచు మహాత్ముడగు వసిష్ఠునకు కానవచ్చెను. వసిష్ఠుడు– ఇదియేమి? రాజా! నీ ఎముకనే తినుచున్నావు? అని అడిగెను.

ఇట్లు మహర్షియగు వసిష్టుడు పలుకగా శ్వేతమహారాజు ఆమునితో ఇట్లు పలికెను. "స్వామీ! ఆకలితో ఉన్నాడను. మునుపు నేను అన్నపానముల నొసగలేదు. అందుకై నా ఆకలి దారుణమైనది." రాజిట్లనగా మునిపుంగవుడగు వసిష్ఠుడు ఆ మహారాజు శ్వేతునితో మరల ఇట్లు పలికెను. "రాజా! విశేషముగా ఆకలిగొన్న నీకేమి చేయుదును? దానమొసగనిది ఎవ్వనికి ఏదియు మేలైనది లభింపదు. రత్నములు, బంగారము దానమొసగుట చేత నరుడు భోగములు కలవాడగును. అన్నము నొసగుటచేత అన్ని కామములతో తృప్తి కలవాడగును. రాజా! అదియెంత దానమనుకొని నీవు అన్నదానము చేయవైతివి."

"మహామునీ! భక్తినిండిన మనసుతో నిన్నడుగుచున్నాను. దానమొసగనిది పొందుట యెట్లో నాకు తెలియజెప్పుము." వసిష్ఠుడు ఇట్లు చెప్పెను "రాజా! దానికొక దారి యున్నది. సంశయము లేదు. చెప్పుచున్నాను వినుము. పూర్వకల్పమున వినీతాశ్వుడను రాజొకడుండెను. ఆతడు 'సర్వమేధమను' ఉత్తమ యజ్ఞమును ఆరంభించెను. యజ్ఞము చేయుచు ఆతడును విప్రులకు గోవులను, ఏనుగులను, ధనములను ఒసగెను కాని అన్నము తక్కువది అని నీవలెనే భావించి ఒసగకుండెను. సార్వభౌముడు, మహారాజుగు ఆ వినీతాశ్వుడు పుణ్యము చేసి నీవలెనే స్వరమునకు కరిగెను. ఆతడు ఆకలి పై కొనగా నీవలెనే మానవలోకమున గంగానది ఒడ్డున నీలపర్వతమున కరిగెను. సూర్యునివలె ప్రకాశించుచున్న విమానముతో దేవునివలె ఉన్న ఆ రాజు ఆకలి కొన్నవాడై తన శవమును చూచెను. తన పురోహితుడు హోతయను వానిని ఆ గంగ ఒడ్డున ఆ రాజు చూచెను. ఆతడును ఆ ముని సత్తముని 'నా ఆకలికి కారణమేమి?' అని యడిగెను. ఆ హోత అతనితో నిట్లనెను. "రాజా! నీవు వెంటనే తిలధేనువు. జలధేనువు, ఘృతధేనువు, దధి ధేనువు, రసధేనువు అనువానిని దానమొసగుము. దానితో నీ ఆకలి నిన్ను వదలును. సూర్య చంద్రులు ప్రకాశించుచున్నంత వరకు ఆకలి నిన్ను దరిజేరదు." ఇట్లతడు పలుకగా రాజాతనిని తిలధేనువు విధానమును గూర్చి అడిగెను. బ్రాహ్మణోత్తమా! గెలుపు గోరువారు ఏ విధముగా తిలధేనువు నిత్తురు? స్వర్గము నెట్లు అనుభవింతురు. అది నాకు చెప్పుము.

రాజా! తిలధేనువు నిచ్చు పద్ధతిని నీవు వినుము. నాలుగు మానికలు ఒక కుంచము. పదునారు కుంచాల నువ్వులతో ఆ ధేనువు ఏర్పడును. నాలుగింటితో దూడ ఏర్పడును. చెరకు గడలతో పాదములు, పుష్పములతో దంతములు, గంధముతో ముక్కు బెల్లముతో నాలుకయు చేయవలయును. తోకయందు పూలమాలను కూర్చవలయును. గంటల ఆభరణములతో అలంకరించిన ఆ తిలధేనువును బంగారు కొమ్ములు కలదానినిగా చేయవలయును. కంచుపాత్రను, వెండిగిట్టలను ఆ ఆవునకు విధిననుసరించి చేసి, దానిని శీఘ్రముగా బ్రాహ్మణునకు దానము చేయవలయును. నల్లని లేడిచర్మము ఆ ఆవునకు వస్త్రము. ఇట్లు ఆ శుభమగు నందితను కల్పించి సర్వరత్నము లతో కూడిన హారమును కూర్చి సకల విధములగు ఓషధులను ఏర్పరచి ఈ క్రింది మంత్రముతో పవిత్రను చేసి దానము చేయవలయును. "ఓ తిలధేనూ! నిన్ను ద్విజున కర్పించుచున్నాను.నాకు దీనివలన

అన్నము, పానము, అన్ని రసములు కలుగుగాక. మాకు సర్వమును సంపాదించి పెట్టుము." దానము గ్రహించువాడు– "ఓ తిలధేనూ! నీకు నమస్కారము. విశేషమగు భక్తితో నాకుటుంబము కొరకు నిన్ను గ్రహించుచున్నాను. నా కోరికలను, నన్ను ఆదరింపుము." అనవలయును. ఇట్టిదగు తిలధేనువును దానము చేయవలయును. అది అన్ని కోరికలను తీర్చును. సంశయము లేదు. దీనిని భక్తితో వినువాడు, చేయువాడు, చేయించువాడును సర్వపాపములను వదలించుకొని విష్ణు లోకమున కరుగును. (98)

౯౯ వ అధ్యాయము - జలధేను పూజా విధానము

హోత ఇట్లు పలికెను. "రాజా! జలధేనువును గూర్చి చెప్పెదను. పుణ్యదినమున విధి పూర్వకముగా గోమయముతో మండలము చేసి దానిపై గోవు చర్మమును ఉంచి దాని నడుమ పూర్ణ కుంభమును ఉంచవలయును. గంధముతో, కర్పూరము, అగురు, చందనము అనువానితో కలసిన సువాసనగల నీరు నింపి ఆ ధేనువును ఏర్పరుప వలయును. అట్లే మరియొక కుంభమును నేతితో నింపి ఆకులతో పూవులతో అలంకరింప వలయును. గరిక మొలకలను క్రింద నుంచవలయును. పూలమాలతో అలంకరింప వలయును. అయిదు రత్నములను ఆ కుంభమున ఉంచవలయును. అట్లే మాంసి, ఉశీరము, కుష్ఠము, కొండమట్టి అనువానిని అందు నిలుపవలయును. (మాంసి– జటామాంసి అను మూలిక, ఉశీరము – వట్టివేరు; కుష్ఠము– చెంగల్వకోష్టు; శైలేయ వాలుకము– కొండ ఏటిలోని ఇసుక) దానిలో ఆమలములు(ఉసిరికాయ), తెల్లనువ్వులు, సర్వధాన్యములు ఉంచవలయును. నాలుగు దిక్కులందును నాలుగు పాత్రలను పెట్టవలయును. ఒకటి నేతి పాత్ర. రెండవది పెరుగు పాత్ర. మూడవది తేనె పాత్ర. నాలుగవది చక్కెరగిన్నె, బంగారు మొగము, నల్లని అగురుతో చేసిన కొమ్ములు, మేలైన ఆకుల చెవులు, ముత్యములతో చేసిన చూపులు, ఎఱ్ఱని పిరుదు, కంచుపాత్ర, దర్భలే వెంట్రుకలు. త్రాటితో తోక, నల్లని ఆభరణములు, గంటలు కలిగిన ఆవును చేయవలయును.గంగడోలు నందు పూలమాల నుంచవలయును. బెల్లపు మొగము, ముత్యపు చిప్పల దంతములు, చక్కెరతో నాలుక, వెన్నతో పొదుగు, చెరకుగడలతో కాళ్లుకల ఆవును చేసి సర్వాభరణములతో అలంకరింప వలయును. నల్లనిలేడి చర్మము పైనుంచి వస్త్రములతో కప్పి, గంధ పుష్పములతో చక్కగా పూజచేసి, దానిని విప్రునకు

సమర్పింప వలయును. వేదము తుదిదాక అధ్యయనము చేసినవాడు, సాధువు, శ్రోత్రియుడు, ఆహితాగ్ని, తపస్సుచేతను, వయస్సుచేతను పెద్దవాడు, కుటుంబము కలవాడు అగు బ్రాహ్మణునకు ఆ ధేనువును దానము చేయవలయును. రాజా! ఇట్లు దానము చేయువాడు, చూచువాడు, వినువాడు, పుచ్చుకొనువాడగు విప్రుడు– వీరందరు పాపము నుండి దాటుదురు. బ్రహ్మహత్య, క్రూరహత్య, గోహత్య అనునవి చేసినవాడు, మద్యము త్రావువాడు గురుపత్నిని చెరచినవాడును సర్వపాపముల నుండియు దీనివలన విముక్తుడగును. విష్ణులోకమున కరుగును. రాజా! అశ్వమేధ యాగమును, శ్రేష్ఠమగు దక్షిణలతో పూర్తిచేసినవాడును, జలధేనువును దానమొసాగిన వాడును సమానులే. ఈ జలధేనుదానము చేయువాడు ఒకదినము జలాహారము ఒకదినము పాల ఆహారమును మాత్రమే పుచ్చుకొని వ్రతమాచరింప వలయును. దానము పుచ్చుకొనువాడు గూడ మూడు రాత్రులు ఇట్లే ఉండవలయును. ఈ జలధేను దానము చేయువారు పాలతో ప్రవహించు నదులు, తేనె, పాయసముల సమృద్ధి, అప్సరసల పాటలు గల పుణ్యలోకముల కరుగుదురు. ఇచ్చువాడు, ఇప్పించువాడు, పుచ్చుకొను బ్రాహణుడు అన్ని పాపములను రూపుమాపుకొని విష్ణు లోకమున కరుగుదురు. సంశయము లేదు ఈ జలధేను విధానమును గూర్చి విన్నవాడును, పలికినవాడును, పాపములు అన్నింటిని పోగొట్టుకొని ఇంద్రియములను గెలిచిన వాడై స్వర్గమున కరుగును. (99)

100 వ అధ్యాయము - రసధేను పూజా విధానము

మరల హోత రాజుతో ఇట్లనెను. రాజా! రసధేను విధానమును సంక్షిప్తముగా చెప్పెదను. అలికిన నేలపై నల్లలేడి చర్మమును, ధర్మాసనమును ఉంచి దానిపై చెరకు రసము నింపిన ఘటమును ఉంచ వలయును. దానిలో నాలుగవ భాగముతో దూడను(చిన్న కలశాన్ని) ఏర్పరచి దానిప్రక్క నిలుప వలయును. రసధేనువు నిట్లు చేయవలయును. చెరకుగడల కాళ్లు, బంగారు నగల కొమ్ములు, వస్త్రముతోడి తోక, నేతితో పొదుగు, పూవులు కూర్చిన గంగడోలు, చక్కెరతో ముఖము, – నాలుక – ఇవి కూర్ప వలయును. ఫలములతో దంతములు, రాగితో వెనుకభాగము, పూవులతో వెంట్రుకలు, ముత్యములతో చూపులు కల్పించి ఏడు విధములగు ధాన్యములను కూర్పవలయును. మంచి పరిమళములను కూర్పవలయును.నాలుగువైపుల నాలుగు నూవుల పాత్రలను

ఉంచవలయును. వేదవిద్వాంసుడు, శ్రోత్రియుడు, ఆహితాగ్ని, పురాణముల నెరిగినవాడు, విశ్లేషించి మంచినడవడిగల బుద్ధిశాలి, కుటుంబము కలవాడు అగు బ్రాహ్మణునకు ఆ గోవును దానమీవలయును. దాత, పాపములు లేనివాడు స్వరమును పొందును. దాతయు, గ్రహించువాడును ఒక దినము రసము మాత్రమే ఆహారముగా గొనవలయును. సోమము పానము చేసిన ఫలము, సర్వక్రతు ఫలము అతనికి కలుగును. ఆ ఆవును దానమిచ్చు చుండగా చూచువారును పరమగతి కరుగుదురు. ముందు గంధము, ధూపము, మాలలు మొదలగువానితో ధేనువును పూజించి మునుపు చెప్పిన మంత్రములను శ్రద్ధతో స్మరింప వలయును. ఇట్లు పలికి ద్విజశ్రేష్ఠునకు ఇచ్చినవాడు, తన వెనుక పదితరములవారిని, తనముందు పదితరముల వారిని, తనతో కలుపుకొని మొత్తము ఇరువదియొక్క తరముల వారిని పరమగతిని పొందించును. స్వర్గము నుండి మరల తిరిగిరాడు. రాజా! ఇట్లు నీకు మిక్కిలి ఉత్తమమైన రసధేనువును గూర్చి చెప్పితిని. దానిని దానమిమ్ము. పరమస్థానమును ఆ విధముగా పొందుము. దీనిని భక్తితో చదువువాడును, వినువాడును సర్వపాపములను పోగొట్టుకొని విష్ణులోకము నందు ప్రతిష్ఠనొందును. (100)

101 వ అధ్యాయము - గుడధేను పూజా విధానము

హోత ఇట్లు చెప్పెను."గుడధేనువును గూర్చి చెప్పెదను. ఇది కోరికల నన్నింటిని తీర్చునది. అలికిన నేలపై లేడి చర్మము, దర్భాసనము పరచవలయును. దానిపై వస్త్రము నుంచి పుష్కలముగా బెల్లమును తెచ్చి, దూడతో కూడిన ఆవు స్వరూపమును దానితో చేయవలయును. కంచు పాత్రను ఉంచవలయును. బంగారముతో ముఖమును, కొమ్ములను, మణులతో ముత్యములతో దంతములను, రత్నములతో మెడను, గంధముతో ముక్కును, అగురుకట్టెతో కొమ్ములను, రాగితో వెనుక భాగమును, పాలుపిదుకు కంచు పాత్రను, నారబట్టతో తోకను, చెరకు గడలతో కాళ్లను, వెండితో గిట్టలను, మెడకు పట్టు దారమును కూర్పవలయును. పట్టుబట్టలతో దానిని కప్పవలయును, గంటలతో చామ రసములతో అలంకరింప వలయును. అన్ని విధములగు ఆభరణములతో పితుకు పాత్రను అలంకరింపవలయును. మేలైన ఆకులతో చెవులను, వెన్నతో పొదుగును చేయవలయును. పెక్కువిధములగు ఫలములతో చుట్టూ అందముగా అలంకరింప వలయును. మగధదేశపు నాలుగు బారువుల తూకపు బెల్లపు ఆవు ఉత్తమము. నాలుగవ వంతు బెల్లముతో దూడను

చేయవలయును. (బారువు – 8000 తులములు) అందులో సగముతో మధ్యమము. ఒక్క బారువుతోనైన అధమము. ధనములేనివాడు ఎనిమిది వందల తులములతో నైనను నను శక్తిమేరకు చేయదగును. ఇంటిలోని ధనమును అనుసరించి అటుపై చేయవలయును. గంధములతో, పూవులతో, ధూపముతో, నైవేద్యముతో, దీపములతో పూజించి, మంచి నడవడి కలవాడు, శాంతుడు, అసూయలేనివాడు అగు బ్రాహ్మణునకు నివేదింపవలయును. ఇట్లు విశ్లేషించి ఆహితాగ్ని అయిన ఉత్తమ బ్రాహ్మణునకు వేయి బంగారు నాణెములతో ఆ ఆవును దానమీయవలెను.

మహారాజా! అందులో సగమైనను, సగములో సగమైనను, నూరైనను, అందు సగమైనను శక్తిమేరకు దానమీవలయును. గంధవస్త్రాదులతో, కర్ణాభరణములతో గొడుగు పాదుకలతో ఇచ్చుచు, ఈ మంత్రమును పలుకవలయును.

తూర్పునకుగాని, ఉత్తరమునకు గాని ముఖము పెట్టి "యాశ్రియా" ఇత్యాది పూర్వోక్త మంత్రములను స్మరించుచు బ్రాహ్మణునకు దానమీయ వలయును. బ్రాహ్మణునకు సమర్పించిన ఈ గుడధేనువు మాటతో చేష్టతో, మనసుతో చేసిన పాపములు మానవిషయముగా, తూకము విషయముగా చేసిన వంచనలను, కన్య విషయములో గోవు విషయములో ఆడిన అబద్ధములను ఈ సర్వపాపములను నశింపజేయును. ఇట్లు గుడధేనువును దానమిచ్చుచుండగా చూచువారును పరమగతి కరుగుదురు.

పాలు పాయసములే బురదగానున్న పాల నదులు ప్రవహించు చోటికిని, మునులు, ఋషులు, సిద్ధులు ఉండు చోటికిని ఈ ధేను దానము చేసినవారగుదురు. గుడధేనువు నిచ్చువాడు ముందు పదితరముల వారిని, వెనుక పదితరముల వారిని తరింప జేయును. అయన పర్వములలో, విషువము నందును, వ్యతీపాతమునందును, శూన్యతిథి యందును యోగ్యుడైన వ్యక్తి నెన్నుకొని అన్ని విధముల ఈ దానమును భద్రముగా చేయవలయును. ఇదియే విధానము. ఇవియే వస్తుసామగ్రి, ఇదే మంత్ర, ఆవాహన సంయోగము, ప్రతి పర్వము నందును ఇట్లే చేయవలయును. ఈ గుడధేను దానము భుక్తిని ముక్తిని ఒసగునది. అన్ని కోరికలను తీర్చునది. సర్వపాపములను హరించునది.

గుడధేనువు అనుగ్రహము వలన మానవుడు సంపూర్ణమగు సౌభాగ్యమును పొందును. హరి ప్రతి స్మరణము నందును విష్ణు పదమును చేరును" (101)

102 వ అధ్యాయము - శర్కరాధేను పూజా విధానము

హోత పలికెను. అట్లే చక్కెర ధేనువును గూర్చి ఉన్నదున్నట్లు చెప్పెదను. రాజా! వినుము. అలికిన నేలపై లేడిచర్మము, దర్భాసనము నుంచి నాలుగు బారువుల చక్కెరతో ఆవును చేయవలయును. అది ఉత్తమ పద్దతి. అందు నాలుగవ వంతు చక్కెరతో దూడను నిర్మింపవలయును. అందు సగము మధ్యమము. ఒక బారువుతోనైనచో చివరి పద్ధతి. దాని ప్రకారమే నాల్గవవంతు భాగముతో దూడను చేయవలయును.

ఆవు ఎత్తు ఎనిమిదివందల అంగుళములు ఉండవలయును. లేదా శక్తిని బట్టి చేయింపవలయును. తన్ను తాను బాధపెట్టుకొనరాదు. నాలుగు దిక్కులందును అన్ని విధములైన విత్తనములను ఉంచవలయును. ఆ ఆవునకు బంగారు ముఖము కొమ్ములు, ముత్యాల కన్నులు ఏర్పరుపవలయును. బెల్లముతో ముఖమును, పిండితో నాలుకను, గంగడోలును, పట్టసూత్రము, కంఠాభరణమును కూర్పవలయును. చెరకుగడల పాదములు, వెండిగిట్టలు, వెన్నతో పొదుగు, చక్కని ఆకులతో చెవులు, తెల్లని చామరములు, అలంకారములు, అయిదు రత్నములు మొదలగువానితో ఆ ఆవును నిర్మించి పైని వస్త్రములను కప్పవలయును. దానిని గంధములతో పూవులతో అలంకరించి, కుటుంబము కలవాడు, వేదము చక్కగా చదివిన వాడు, దరిద్రుడు, మంచి నడవడి కలవాడు, బుద్ధిశాలి, వేదవేదాంగములను చక్కగా తెలిసినవాడు, నిత్యాగ్నిహోత్ర అర్చన కలవాడు, దుష్టత లేనివాడు అగు బ్రాహ్మణునకు ఒసగవలయును. ఇతరులను చూచి కుళ్లుకొనువానికి ఈయరాదు.

అయనములందు, విషువమునందు, పుణ్యతిథియందు, వ్యతీపాత యోగమున్న దినమునకు (పూర్ణిమ సోమవారముల కలయిక రోజు) అమావాస్యయందును ఈ పుణ్యదినములందు కాని, ఎప్పుడైనను కాని ఈ దానము చేయవలయును. మంచి యోగ్యత కల శ్రోత్రియ బ్రాహ్మణుడు ఇంటికి రాగా అట్టివానికి ఈయవలయును. దాత తూర్పునకు గాని, ఉత్తరమునకు గాని మొగము పెట్టి ఆవుతోక దగ్గర కూర్చుండవలయును. ఆవును తూర్పు ముఖముగా, దూడను ఉత్తర ముఖముగా నిలుపవలయును.

దానకాలము నందు చదువవలసిన మంత్రములను చదివి సమర్పింప వలయును. విధి ప్రకారము విప్రుని ఉంగరముతో, కర్ణభూషణములతో పూజింప

వలయును. తన శక్తిననుసరించి దక్షిణ నొసగవలయును. విత్త శౌర్యమును విడువ వలయును. (ధనము విషయములో వంచన పనికిరాదు. సమర్థుడై తక్కువ ఇచ్చుట, శక్తిలేని యెడల ఎక్కువ ఇచ్చుటకు ప్రయత్నించుట విత్త శౌర్యము) చేతియందు దక్షిణనుంచి గంధమును, పూవులను ధేనువును సమర్పింపవలయును. ఇచ్చునపుడు పుచ్చుకొనువాని ముఖమును చూడరాదు. ఒక దినము చక్కెర భోజనముతో ఉండ వలయును. పుచ్చుకొన్న బ్రాహ్మణుడు మూడు దినములు చక్కెర భోజనముతో గడుప వలయును. ఆ ధేనువు సర్వపాపములను హరించును. అన్ని కోరికలను ప్రసాదించును. ఆ దాత అన్ని కోరికలు తీరిన వాడగును. ఇందు సంశయము లేదు .నరుడు ప్రళయకాల పర్యంతము విష్ణులోకమున ఉండును.తన పితరులను, తల్లివైపు వారితోపాటు తరింపజేయును. తన్ను విష్ణువులో లీనము చేసికొనును. సంశయము లేదు. ఆవు నిచ్చుచుండగా చూచువారును పరమగతి కరుగుదురు. దీనిని భక్తితో విన్నవాడును, చదువువాడును సర్వపాపముల వలన ముక్తుడై విష్ణులోకమున కరుగును. (102)

103 వ అధ్యాయము - మధుధేను పూజా విధానము

హోత ఇట్లు చెప్పెను. "రాజా! మధుధేనువును గూర్చి చక్కగా చెప్పెదను. ఇది సర్వపాతకములన నశింప జేయునది. అలికిన నేలపై లేడిచర్మము, దర్భాసనము నుంచి పదునారు నిండుకడవల తేనెతో ఆవును చేయవలయును. అందు నాలుగవ భాగముతో దూడను చేయవలయును. బంగారముతో ముఖము, అగురుచందనములతో కొమ్ములు, రాగితో తోక, పట్టు వస్త్రముతో గంగడోలు, చెరకుగడలతో పాదములు చేసి, తెల్లని కంబళితో కప్పి, బెల్లముతో ముఖము, చక్కెరతో నాలుక, పూవులతో పెదవులు, పండ్లతో దంతములు, దర్భలతో రోమములు, వెండితో గిట్టలు, కొలతకు తగ్గినట్లుగా మంచి ఆకులతో చెవులు కల్పించి అన్ని లక్షణములు సరిపడునట్లు ఆవును తీర్చవలయును. ఏడు విధములగు ధాన్యములను ఉంచవలయును. నాలుగు దిక్కులందును నాలుగు తిల పాత్రలు ఉంచవలయును. రెండు వస్త్రములు పైని కప్పవలయును. గంటలు, ఆభరణములతో అలంకరింపవలయును. కంచుతో చేసిన పాలు పితుకు పాత్రను ఏర్పరచి, గంధ పుష్పములతో సువాసన కూర్చవలయును. అయనము, విషువము, పుణ్యతిథి, వ్యతీపాతము, దినక్షయము, (పగటి భాగము తక్కువగా నున్న దినము)సంక్రాంతి,

గ్రహణము అను దినములలో కానీ,బుద్ధి పుట్టినప్పుడు కాని ద్రవ్యము, బ్రాహ్మణుడు లభించుటను చూచుకొని ఈ దానము చేయవలయును. దరిద్రుడు, శ్రోత్రియుడు ,ఆహితాగ్ని,ఆర్యావర్తమున పుట్టినవాడు (వింధ్య హిమవత్పర్వతముల నడిమి దేశమును ఆర్యా వర్తమందురు) వేద వేదాంగములను తుదముట్ట చదివిన వాడు అగు బ్రాహ్మణునకు, లేదా అటువంటి వానికి ఈ మధుధేనువును దానమీవలయును. తోక దగ్గరగా కూర్చుండి గంధము, ధూపము మొదలగువానితో పూజించి జంట వస్త్రములతో కప్పి ఉంగరము, చెవిపోగులు అనువానితోపాటు శక్తిననుసరించి ధనవిషయమున వంచన చేయక దక్షిణనొసగి, ముందు నీరువదలి తరువాత దానము చేయవలయును. “తల్లీ! నీవు సర్వదేవతలకు నాలుకవు. సర్వభూతముల మేలునందు ప్రీతి కలదానవు. నీవలన పితృదేవతలందరు ప్రీతులగుదురుగాక! ఓ మధుధేనూ! నీకు నమస్కారము” అనిపలికి ఆ గోవును బ్రాహ్మణునకు సమర్పింప వలయును.

“తల్లీ! నేను ప్రత్యేకించి కుటుంబము కొరకు నిన్ను గ్రహించుచున్నాను. కాని నా కామముల నన్నింటిని తీర్చుము. మధుధేనూ! నీకు నమస్కారము (అని పుచ్చుకొనువాడు అనవలయును) దానముచేత పవిత్రుడై 'మధువాతా' ఇత్యాది మంత్రముతో, గొడుగులతో పాటుగా ధేనువును దానమీవలయును. ఇట్లు భక్తితో మధుధేనువును దానమిచ్చినవాడు పాయసముతో, తేనెతో ఆ దినము గడుపవలయును.దానము పుచ్చుకొన్న బ్రాహ్మణుడు కూడ మూడు రాత్రులు పాయసము, తేనె గల భోజనముతో గడుపవలయును. ఇట్లు చేసినచో కలుగు పుణ్యమెట్టిదియో ఓ రాజా! వినుము. తేనెలు, పాయసకర్దమములు గల నదులు ప్రవహించు చోటికిని, ఋషులు, మునులు, సిద్ధులు ఉన్నచోటికిని ధేనుదాత లరుగుదురు. అచట సుఖములన్నియు అనుభవించి బ్రహ్మలోకమున కరుగును. అందు బహుకాలము సుఖముగా నుండి మరల మనుష్య లోకమునకు వచ్చి విస్తారములగు భోగములను అనుభవించి, విష్ణులోకమున కరుగును. వెనుక పదితరముల వారిని, ముందు పదితరముల వారిని తనతరమును మొత్తము ఇరువది యొక్క తరముల వారిని మధుధేను ప్రసాదము వలన విష్ణు సాయుజ్యమును పొందించును. ఇది వినువాడును, భక్తితో వినిపించువాడును సర్వపాపముల నుండి ముక్తి పొంది విష్ణులోకమున కరుగును. (103)

104 వ అధ్యాయము - క్షీరధేను పూజా విధానము

హోత ఇట్లు పలికెను. రాజా! క్షీరధేనువును తెలిపెదను ఎరుగుము. ఆవుపేడతో అలికిన నేలపై గోచర్మము కొలతతో దర్భలను అన్నివైపుల పరచి దానిపై నల్లజింకతోలు నుంచవలయును. దానిపై ఆవుపేడతో ఒక గుండ్రని అరుగును కావించి దానిపై పాలకుండను నిలిపి నాలుగవ వంతు గల మరియొక కుండతో దూడను చేయవలయును. బంగారుతో ముఖము, కొమ్ములు చేసి వానిపై చందన అగురువులు అలది, మంచి ఆకులతో చెవులు చేసి నువ్వులపై ఉంచవలయును. నోటిని బెల్లముతో, నాలుకను చక్కెరతో, దంతములను మేలైన పూలతో, కన్నులను ముత్యములతో, కాళ్లను చెరకుగడలతో,రోమములను దర్భలతో, గంగడోలును తెల్లని పట్టు వస్త్రముతో, పిరుదుల భాగమును రాగితో, పాలపాత్రను, కంచుతో, తోకను పట్టు వస్త్రముతో, పొదుగును వెన్నతో, అమ్ములను సువర్ణముతో, గిట్టలను వెండితో చేసి అయిదు రత్నములు కల క్షీరధేనువును కల్పింపవలయును. ఆ ఆవునకు నాలుగు దిక్కులందును నాలుగు తిల పాత్రలను నుంచవలయును. అన్ని దిక్కుల యందును ఏడు విధముల ధాన్యములను ఉంచవలయును.

ఇట్లు అన్ని లక్షణములతో కూడిన క్షీరధేనువును చేసి, రెండు వస్త్రములతో కప్పి గంధముతో పూలతో పూజింపవలయును. ధూపము, దీపము మొదలగునవి కావించి ఉంగరముతో కర్ణాభరణములతో అలంకరించి బ్రాహ్మణునకు నివేదింపవలయును. పాదుకలను, గొడుగును ఇచ్చి ఈ మంత్రముతోడనే క్షీరధేనువును సమర్పింప వలయును. "ఆశ్రయః సర్వభూతానామ్" ఇత్యాది మంత్రములు పలుకుచు దానమొసగ వలయును. 'ఆప్యాయస్వ' మొదలగు మంత్రములతో క్షీరధేనువును ప్రసన్నపరుప వలయును. పుచ్చుకొనువాడు 'గృహ్ణామి' మొదలగు మంత్రములను చదువవలయును. ఇట్లా ధేనువును దానమిచ్చుచుండగా చూచువారును పరమగతి కరుగుదురు. ఇట్లా గోవును తన శక్తి మేరకు వేయిబంగారు నాణెముల దక్షిణతో లేదా వందతో, కాదా అందు సగముతో, లేదా దానిలో సగముతో ఒసగవలయును. ఈ దానమిచ్చినచో కలుగు ఫలమును వినుము.

అరువది వేలయేండ్ల కాలము ఇంద్ర లోకమున ప్రసిద్ధికెక్కును. తండ్రులతో తాతలతో పాటుగ బ్రహ్మలోకమున కరుగును. దివ్యమైన విమానమునెక్కి దివ్యములగు

మాలలు,మైపూతలు కలవాడై బహుకాలము విహరించి విష్ణులోకమున కేగును. పండ్రెండు గురుసూర్యుల కాంతివంటి కాంతి కలదియు, చక్కగా అలంకరింపబడి నదియు అగు విమానమున గీత వాద్యముల ధ్వనులతో అప్సరసల సముదాయములు సేవించుచున్న ఆ విష్ణులోకమున నివసించి తుదికి విష్ణు సాయుజ్యము (కలసిపోవుట) ను పొందును. దీనిని భక్తితో వినువాడును, చదువువాడును సర్వపాపములను రూపుమాపుకొని విష్ణులోకమున కరుగును. (104)

105 వ అధ్యాయము - దధిధేను పూజా విధానము

హోత ఇట్లనెను. "రాజా! ఇప్పుడు దధిధేనువు విధానమును వినుము. ఆవు పేడతో అలికిన నేలపై గోచర్మమంత కొలతతో పూవులతో పాటుగా దర్భలు పరచి, లేడి చర్మమును, దర్భాసనమును ఉంచవలయును. ఏడు విధములగు ధాన్యములపై పెరుగు కుండను చక్కగా నిలుపవలయును. నాలుగవ వంతుతో బంగారు మొగముగల దూడను చేయవలయును. వస్త్రముల జంటతో కప్పి పూవులతో గంధముతో పూజించి, మంచికులము, చక్కని నడవడి, బుద్ధి,ఓర్పు, అంతరింద్రియ, బహిరింద్రియముల నిగ్రహము కల బ్రాహ్మణునకు దానమీయవలయును. తోక దగ్గరగా కూర్చుండి ఉంగరమును, కుండలములను పాదుకలను, గొడుగును, సమర్పించి "దధిక్రామ్" మొదలగు మంత్రమును పఠించుచు దధిధేనువును సమర్పింప వలయును.

ఇట్లు దధిధేనువును దానమొసగి ఒకపూట పెరుగు భోజనముతో గడుపవలయును. యజమానుడు ఒక దినమును, పుచ్చుకొన్న బ్రాహ్మణుడు మూడు రాత్రుల వరకును ఇట్లు పెరుగు భోజనముతో గడుపవలయును. ఇచ్చుచుండగా చూచిన వారును పరమ పదమున కరుగుదురు. వెనుక పదితరములవారును, ముందు పదితరములవారును తనతో పాటు మొత్తము ఇరువది యొక్క తరముల వారు ప్రళయకాల పర్యంతము విష్ణులోకమును పొందుదురు. దాతయు, ఇప్పించువాడును పరమగతి కరుగుదురు. పెరుగు నదులు, పాయసపు పంకములు కలచోటికి, మునులు, ఋషులు, సిద్ధులు ఉండు తావునకు ఈ ధేనుదానము చేసిన వారరుగుదురు. దీనిని వినిపించువాడు, వినువాడును అశ్వమేధయాగ ఫలమును పొంది విష్ణు లోకమున కరుగును. (105)

106 వ అధ్యాయము - నవనీతధేను పూజా విధానము

హోత ఇట్లు చెప్పెను. "రాజా! వెన్న ఆవును గూర్చి శ్రద్ధతో వినుము. దానిని విని మానవుడు సర్వ పాపముల నుండియు ముక్తుడగును. సంశయము లేదు. గోమయముతో అలికిన భూమిపై గోచర్మపు కొలతలో నల్లజింక చర్మమును పరచి వెన్నకుండను శ్రద్ధతో నుంచవలయును. అందు నాల్గవ భాగముతో దూడను చేయవలయును. శాస్త్రము ననుసరించి బంగారు కొమ్ములు, ముఖమును కూర్పవలయును. మణులతో ముత్యములతో కనులను, బెల్లముతో నోటిని, చక్కెరతో నాలుకను, పండ్లతో దంతములను, పట్టువస్త్రముతో గంగడోలును చేయవలయును. వెన్నతో పొదుగును, చెరకులతో కాళ్లను, రాగితో పిరుదు భాగమును, త్రాటితో తోకను, దర్భలతో రోమములను బంగారుతో కొమ్ములను, వెండి గిట్టలను అమర్చియ దానిని అయిదు రత్నములతో కూర్ప వలయును. అన్ని దిక్కులలో నాలుగు తిలపాత్రలను ఉంచవలయును. జమిలి వస్త్రములతో కప్పి గంధ పుష్పములతో అలంకరించి అన్నివైపుల దీపములను వెలిగించి బ్రాహ్మణునకు సమర్పింపవలయును. అతడు వేదవేదాంగములను అధ్యయనము చేసిన వాడు, ఆహితాగ్ని, జితేంద్రియుడు కావలయును, తక్కిన ధేనువుల విషయములో చెప్పిన మంత్రములనే యిచటను చదువవలయును. 'మునుపు దేవదానవులు సాగరమును చిలికినపుడు దివ్యమగు అమృతముగా ఈ నవనీతము వెలువడినది. శుభమైనది. సర్వభూతములకు ప్రీతి కలిగించునది. అట్టి ఓ నవనీతమా! నీకు నమస్కారము.' ఇట్లు పలికి కుటుంబముగల బ్రాహ్మణునకు మంచి లక్షణములు గల వస్తువులతో పాటుగ వచ్చి వాని యింటికి చేర్పవలయును. విప్రవర్యునకు హవిష్యమగు సరసమైన అన్నమును పెట్టవలయును. ధేనువు నిచ్చువాడు ఒక దినము, పుచ్చుకొన్నవాడు మూడు దినములు ఆ భోజనమే చేసి యుండవలయును. అట్లు ఈయబడుచున్న గోవును చూచిన వాడు సర్వపాపములను పాపుకొని శివసాయుజ్యమును పొందును. వెనుక ముందు తరముల పితృదేవతలతోపాటు ప్రళయ కాలము వరకు విష్ణులోకమున నివసించుచు. దీనిని వినువాడు వినిపించువాడునగు మానవుడు సర్వపాపముల నుండియు విశుద్ధుడై విష్ణులోకమున ప్రతిష్ఠగాంచును. (106)

107 వ అధ్యాయము - లవణధేను పూజా విధానము

హోత ఇట్లు చెప్పెను. "రాజా! లవణధేనువును గూర్చిచెప్పెదను. వినుము. అలికిన నేలపై జింకచర్మము, దర్భాసనములపై పదునారు కుంచాల ఉప్పుతో ఆవు రూపమును చేయవలయును. నాలుగు తూములతో దూడను చేయవలయును. చెరకుగడలతో కాళ్ళు చేయవలెను. బంగారము ముఖము, కొమ్ములు, వెండిగిట్టలు, బెల్లపునోరు, పండ్ల దంతములు, చక్కెర నాలుక, గంధపు ముక్కు, రత్నము కన్నులు, ఆకుల చెవులు,మంచి గంధపు కొమ్ములు, కడుపు, వెన్నపొదుగు, త్రాటితోక, రాగి పిరుదులు, దర్భపు రోమములుగల ఆవును కల్పింపవలయును. పాలుపితుకుటకు రాగిపాత్రను ఉంచవలయును. ఘంటలతో ఆభరణములతో అలంకరింపవలయును. మంచి వాసనగల పూవులతో ధూపములతో విధి ప్రకారము పూజించి జమిలి వస్త్రములు కప్పి బ్రాహ్మణున కొసగవలయును. గ్రహణము, సంక్రాంతి, వ్యతీపాతము, అయనము, నక్షత్ర గ్రహపీడా సమయములు అనువానిలో ఈ దానము చేయవలయును. లేదా ఎప్పుడైనను చేయవచ్చును.

మంచి నడవడి, కులము, బుద్ధి,వేదవేదాంగముల పాండిత్యము, వేదవిద్య, అగ్నిహోత్ర నిత్యార్చన కల బ్రాహ్మణునకు, ముఖ్యముగా ఇతరులయెడ మత్సరబుద్ధి లేనివానికి, ఈ గోవు నొసగవలయును. గొడుగు, చెప్పులు, ఉంగరము, కుండలములు, దక్షిణ, శాలువ అనువానిని వస్త్రముల జంటతో కప్పి యొసగవలయును. "ఓయి విప్రా! ఈ కామములను పిదుకు గోవును శుభమైన దానిని గ్రహింపుము. తల్లీ! రుద్రరూపా! నీకు నమస్కారము. నా వాంఛలన్నింటితో నన్ను భరింపుము. నీవు సర్వభూతములలో మిక్కిలిగా విరాజిల్లుచున్నావు. సర్వదేవతలు నీకు నమస్కరింతురు. నీవు కామములను తీర్చు ధేనువు. లవణధేనూ! నీకు నమస్కారము." లవణధేను దాత ధేనువు నొసగి లవణమును మాత్రము తిని, తక్కినయన్నింటిని వదలి ఒక దిన ముండవలయును. పుచ్చుకొన్న విప్రుడు మూడు రోజులు లవణభోజియై యుండవలయును. వేయియో నూరో బంగారుకాసులు తన శక్తి ననుసరించి దక్షిణ నొసగవలయును.

శంకరుడున్న భూమికి దీనివలన అరుగును. దీనిని భక్తితో వినువాడును, వినిపించు వాడును, సర్వ పాపముల నుండి విడివడి రుద్రలోకమున కరుగును. (107)

108 వ అధ్యాయము - కార్పాస(ప్రత్తి) ధేను పూజా విధానము

హోత ఇట్లు చెప్పెను. "రాజా! ప్రత్తి ఆవును గూర్చి వివరించెదను. దాని నిచ్చుట వలన నరుడు మిక్కిలి శ్రేష్ఠమగు ఇంద్రలోకమున కరుగును. విషువము, అయనము, సంక్రాంతి పుణ్యకాలము, సంవత్సరాది, గ్రహణము అను సమయములలో, గ్రహపీడలు సంభవించినపుడు, పీడకలలు, దయ్యములు కనబడినపుడును పుణ్యస్థలము నందును, ఆవుల మందలున్నచోటను, పవిత్ర స్థలము నందును దీనిని చేయనగును. ఆవు పేడతో అలికిన భూమియందు దర్భలను పరచి దానిపై తిలలను ఉంచి ఆ నడుమ ప్రత్తితో చేసిన ధేనువును నిలుపవలయును. వస్త్రములు, మాల్యములు, గంధపు పూతలు, నైవేద్యము, ధూపము,దీపము మొదలగువానితో పొగరులేనివాడై పూజింప వలయును. నాలుగు బారువుల పత్తితో చేయుట ఉత్తమ పద్ధతి. అందులో సగముతో మధ్యమ పద్ధతి. ఒక బారువుతో చేయుట అధమ పద్ధతి. ధనవిషయములో లోభము పనికిరాదు. నాలుగవ భాగముతో దూడను చేయవలయును. బంగారు కొమ్ములతో, వెండి గొరిజలతో, పెక్కుపండ్ల దంతములతో రత్నములు కడుపున ఉండునట్లుగా ధేనువును తీర్పవలయును. ఇట్లు అన్నియు నిండుగా నుండునట్లు ఆవును రూపొందించి శ్రద్ధతో కూడినవాడై ఆ (కార్పాస) ప్రత్తిధేనువును మంత్రములతో ఆవాహనము చేయవలయును. దర్భలు చేతదాల్చి పవిత్రుడై శ్రద్ధగలవాడై దానమంత్రములతోపాటు మునుపటి విధానమును చేయవలయును. 'దేవీ! నీవు లేక దేవగణములు' లేవు. నన్నీ సంసారమనెడు సముద్రము నుండి ఉద్ధరింపుము – అని పలుకవలయును. (108)

109 వ అధ్యాయము – ధాన్యధేను దానమాహాత్మ్యము

హోత పలికెను. రాజా! ఉత్తమమగు దానమాహాత్మ్యమును వినుము. దీనిని సంకీర్తించిన మాత్రమున పార్వతీదేవి సంతోషమందును. విశేషించి విషువము నందును. ఆయన నందును కార్తీకమాసము నందును ఇది వినవలయును.

అందువలన ఇప్పుడు ధాన్యధేనువు (వడ్లతో చేసిన ఆవు.) దాన పద్ధతిని చెప్పెదను. దీనిని ఇచ్చినచో పాపములు అన్నింటి నుండి విముక్తుడై రాహువు వదలిన చంద్రునివలె కాంతిమంతుడై శోభిల్లును. పది ఆవులను దానము చేయుటవలన కలగు ఫలమంతటిని ధాన్యధేనువు నొసగు నరుడు పొందును. ఆవుపేడతో అలికిన నేలపై

తూర్పుదిక్కునకు కంఠభాగము ఉండునట్లుగా నల్లలేడి చర్మమును ఉంచవలయును. దానిపై వస్త్రములతో కూడిన ధాన్యధేనువును నడుమ ఉంచి వేదనాదములతో మంగళ వాద్యములతో పాటుగ పూజింపవలయును. నాలుగు కుంచములతో చేయు ధేనువు ఉత్తమం. అందు సగమైనచో మధ్యమము, ధనము విషయమున వంచన చేయరాదు. ఆవులో నాలుగవ భాగముతో దూడను కూర్పవలయును. బంగారముతో కొమ్ములు, వెండితో గిట్టలు,గోమేధికముతో కడుపు, అగరు చందనముతో నాసిక, ముత్యములతో దంతములు, నేయి వెన్నలతోముఖము, మంచి ఆకులతో చెవులు, కంచుపాత్ర, చెరకు గడలతో పాదములు, పట్టుబట్టతో తోకను కూర్చి సర్వవిధములగు పండ్లను, రత్నములను సమీపమున ఉంచవలయును. పాదుకలు,చెప్పులు, గొడుగు,పాత్ర, మంచి భోజనములను ఏర్పరుపవలయును.

ఇట్లు అన్నియు చక్కగా ఏర్పరచి దీపార్చన మొదలగునవి కూర్చుకొనవలయును. పుణ్యకాలము రాగా స్నానము చేసి, తెల్లని వస్త్రములు తాల్చి గృహస్థు మంత్రములను చదువుచు మూడు మారులు ప్రదక్షిణము తిరుగవలయును. “మహానుభావా! వేదవేదాంగ. విశారదా! ద్విజోత్తమా! విప్రా! నీవు నా ఉపకారమునకై ఈ ఆవును గ్రహింపుము. దీనివలన భగవంతుడు, దేవదేవుడు, మధుసూదనుడు నా విషయమున ప్రీతినందుగాక తల్లీ ధాన్యలక్ష్మి! నీవు గోవిందుని యందు లక్ష్మివి. అగ్నియందు స్వాహవు. ఇంద్రుని యందు శచివి. శివుని విషయమున గౌరివి. బ్రాహ్మణుని యందు గాయత్రివి, చంద్రుని యందు వెన్నెలవు. రవియందు ప్రభవు. బృహస్పతి యందు బుద్ధివి. మునుల యందు ఉత్తమమగు మేధవు. ఇట్లని ప్రశస్తికెక్కితివి. అందువలన నీవు సర్వమయివి. ధాన్యరూపమునా నెలకొని ఉన్నావు.” ఇట్లు పలికి ఆ ధేనువుకు ప్రదక్షిణించి బ్రాహ్మణునికి క్షమాపణము చెప్పుకొని దానమొసగవలయును. సమస్తమైన పృథివి ఎంతయో, సమస్తమగు వస్తురత్నము లెంతటివియో వాని నన్నింటి నిచ్చిన పుణ్యముతో వ్రీహిధేనువు నిచ్చిన ఫలము సమానమగును. లేదా అధికమగును. అందువలన రాజా! భుక్తి ముక్తులనెడు ఫలముల నొసగు ఈ ధాన్యధేనువును దానమీవలయును. దీనివలన ఈ లోకమున సౌభాగ్యము, ఆయువు, ఆరోగ్యము పెంపొందును. సూర్యునికాంతి వంటి కాంతి కలదియు, చిరుగంటల రత్నముల మాలలు కలదియు అగు విమానముతో, అప్సరసలు కొనియాడుచుండగా

అతడు శివమందిరమున కరుగును. జన్మ స్మరణమున్నంత కాలము స్వర్గమున ప్రసిద్ధి పడయును. పిమ్మట స్వర్గము నుండి దిగివచ్చి జంబూద్వీపపతి అగును. ఇట్లు శివుని ముఖము నుండి వెలువడిన వాక్యమును విని సర్వపాపములు పోగా విశుద్ధమైన ఆత్మకలవాడై రుద్రలోకమున ప్రతిష్ఠనొందును. (109)

110 వ అధ్యాయము - కపిలాధేను దాన మహిమ

పిమ్మట మరల హోత ఇట్లు పలికెను. ఇక ఇటుపై ఉత్తమయగు కపిలాధేనువును గూర్చి చెప్పెదను. దాని దానమువలన నరుడు అత్యంత శ్రేష్ఠమగు విష్ణులోకమును పొందును. మునుపు చెప్పిన విధానముతో దూడతో కూడిన కపిల ధేనువును, అన్ని అలంకారములు, అన్ని రత్నముల కల దానిని దానము చేయవలయును. కపిలధేనువు తలయందు, కంఠమునందును బ్రహ్మ ఆదేశము వలన సర్వతీర్థములు నెలకొని ఉండును. ఉదయమునలేచి మానవుడు కపిలావు మెడ నుండియు, తల నుండియు జారిన నీటిని భక్తితో తలకద్దుకొనుచు శుచియైన, ఆ పవిత్రజలము వలన అప్పటికప్పుడు మాడిన సర్వపాపములు కలవాడగును. ముప్పదేండ్లు చేసిన పాపమును కూడ, అగ్ని కట్టెనువలె, కాల్చివేయును. ఉషఃకాలమున లేచి కపిల గోవులకు ప్రదక్షిణము చేయు నరుడు. ఓ భూదేవి! భూమికి ప్రదక్షిణము చేసినవాడగును. శ్రద్ధతో కూడిన ఒక ప్రదక్షిణము చేత పది జన్మములలో చేసిన ఆతని పాపము నశించును. సంశయము లేదు. కపిలగోవు మూత్రముతో స్నానముచేసిన మానవుడు మిక్కిలి పవిత్రుడగును. గంగ మొదలగు తీర్థములందు స్నానము చేసిన వాడగును. ఆ ఒక్క స్నానము మంచి భావముతో చేసిన నరుడు పుట్టినది మొదలుకొని చేసిన సర్వపాపముల నుండి విముక్తుడగును. సంశయము లేదు. వేయిగోవులను ఇచ్చువాడును, ఒక్క కపిలధేనువు నిచ్చువాడును సమానమేయని లోక పితామహుడగు బ్రహ్మ మునుపు నొక్కిచెప్పెను.

గోవుల ఎముకలను కాల్పరాదు. చచ్చిన ఆవు వాసనను నిందింపరాదు. ఆ వాసనను గ్రహించినంతవరకు ఆతడు పుణ్యములతో నిండిపోవును. గోవులను గోకుట ఉత్తము కార్యము. అట్లే గోవులను పెంచుట మంచిది. వానికి భయము, రోగము కలిగినపుడు రక్షించుట నూరావులను దానము చేయుటతో సమానము. ప్రతిదినము ఆకలిగల ఆవులకు గడ్డి నీరు ఇచ్చు ఉత్తమ మానవుడు గోమేధము చేసిన ఫలమును

పొందును. అట్టివాడు పెక్కు విధములగు దివ్యవిమానములతో చుట్టు నున్న కన్యలతో మంచి గంధములతో సేవలు కొనుచున్నవాడై అగ్నులవలె వెలిగిపోవుచుండును. బంగారు వన్నెతో గోరోచన వర్ణము కలిసినది మొదటిది. పసుపు ఎరుపులు కలిసినది రెండవది. ఎఱ్ఱని కన్నులు కలది మూడవది. బెల్లము రంగు కలది నాలుగవది. పెక్కు రంగులుకలది అయిదవది. తెలుపుగోరోజనమువన్నెలుకలది ఆరవది. తెలుపు గోరోచనముల వన్నెల కల కన్నులు కలది ఏడవది. నలుపు గోరోచనముల వన్నెలు కలసినది ఎనిమిదవది. తెలుపు ఎరుపుల కలయికకలది తొమ్మిదవది. తోకయందు గోరోజన వర్ణముకలది పదియవది. గిట్టల యందు తెలుపుకలది పదునొకండవది. వీనిలో అన్ని లక్షణములు కలది గొప్పది. అన్ని లక్షణములు కలదియు సర్వాలంకారములతో చూడ ముచ్చట అయినదియు అగు గోవును బ్రాహ్మణునకు సమర్పింపవలయును. గోవులు భుక్తిని ముక్తిని ఇచ్చునవి. వాని దానము చేసినవాడు విష్ణులోకమున కరుగును. (110)

111 వ అధ్యాయము - కపిలామహిమాను వర్ణనము

హోత ఇట్లు పలికెను. మహారాజా! ఇటుపై వరాహదేవుడు భూదేవికి మునుపు చెప్పిన ఉభయ ముఖ్యములు అనగా పరము, ఇహములగు ధర్మములను చెప్పెదను అది నీ పుణ్యఫలమును అగును.

ధరణి ఇట్లు అనెను. "ప్రభూ! నీవు మునుపు కపిలను సృజించితివి. ఆ హోమధేనువు ఎల్లవేళల పుణ్య అయినదిగా తెలియదగినది. దానికెన్ని లక్షణములు? ఓ జగద్గురూ! మాధవా! స్వయంభువు స్వయముగా ఎన్నివిధములగు కపిల గోవులను వక్కాణించెను? ఈనుచున్న కపిలను దానము చేయుట వలన కలుగు పుణ్యమెట్టిది ? దీనిని సవిస్తరముగా వినగోరుచున్నాను".

వరాహదేవుడు ఇట్లు పలికెను. "భద్రురాలా! తత్త్వపూర్వకముగా చెప్పెదను వినుము. ఇది పవిత్రమైనది. పాపములను నశింపజేయునది. దీనిని విని సర్వపాపముల నుండియు మానవుడు ముక్తుడగును సంశయము లేదు. వరాననా! అగ్నిహోత్రము కొరకును, యజ్ఞము కొరకును సర్వతేజస్సులను పైకి తెచ్చి బ్రహ్మ మునుపు కపిలను సృజించెను. వసుంధరా! కపిల పవిత్రములలో పవిత్రము, మంగళములలో మంగళము పుణ్యములలో పుణ్యము. తపస్సులలో మిన్నయగు తపస్సు, వ్రతములలో ఉత్తమమగు

వ్రతము. దానములలో ఉత్తమమగు దానము. నిధులలో ఇది తరగిపోనిది. భూమియందుగల సర్వతీర్థములతో, అందరకు తెలియరాకుండు పవిత్ర స్థలములతో, సర్వ పవిత్రములతో, సర్వలోకముల పుణ్యములతో ఇది సాటియగును. బ్రాహ్మణులు సాయంకాలములలో ప్రాతఃకాలములలో చేయు అగ్నిహోత్రములను కపిలగోవు నేతితోగాని, పెరుగుతోగాని, పాలతోగాని అర్చింపవలయును. పెక్కు విధములగు మంత్రములతో ఎల్లవేళల అగ్నిహోత్రములను పూజించు వారును, మిక్కిలి భక్తితో అతిథులను అర్చించువారును అగు ఉత్తమ బ్రాహ్మణులు సూర్యుని వంటి వన్నెకల విమానములలో విహరింతురు. మునుపు బ్రహ్మ సూర్యమండలము నడుమ, గోరోచనము రంగు కన్నులు గలదియు, సర్వసౌఖ్యములను ప్రసాదించునదియు, సిద్ధిబుద్ధుల ననుగ్రహించునదియు, అనంతరూపములు గలదియునగు కపిలధేనువును నిర్మించెను.

వరాననా! ఈ కపిలలు పదునొకండు విధములు, ఇవి యన్నియు గొప్ప మహిమ కలవి. తరింపజేయునవి. సంశయము లేదు. నదీసంగములలో దానములకు ప్రశస్తములయినవి. పాపము నన్నింటిని పోకార్చునవి. అగ్నిపుచ్ఛ (అగ్నివంటి తోక కలది) అగ్నిముఖ (అగ్నివంటి ముఖము కలది) అగ్నిలోమ (అగ్ని వంటి వెంట్రుకలు కలది), అనలప్రభ (అగ్నివంటి కాంతి గలది) ఆగ్నేయి (అగ్ని లక్షణములు కలది) సువర్ణాఖ్య (బంగారువంటి వన్నె కలది) అని కపిలలో పెక్కు విధములైనవి కలవు.

కపిలను కైకొని ఇష్టము వచ్చినట్లు పాలు పిండుకొని త్రావు శూద్రుడు ద్విజులందరకు పనికిరాని వాడు. అతడు చండాల సదృశుడు. కావున శూద్రునినుండి విప్రుడు కపిల గోవులను దానము పుచ్చుకొనరాదు. వానిని కుక్కలనువలె దూరముగా తొలగించ వలయును. ఆ విధముగా కపిలలను పీకుకొని బ్రదుకు పాపకర్ములగు శూద్రులను పర్వ సమయములలో విడిచి పెట్టవలయును. వారితో మాటాడరాదు. వారి నుండి దానములు కొనరాదు. కపిలాక్షీరమును ఎంతకాలము త్రావుదురో అంతకాలము వారి తాతలు పురుగు మట్టిమలమును తినుచుందురు. కపిలగోవుల పాలు, నెయ్యి, వెన్న అనువానితో జీవనము పుచ్చువారి గతి యెట్టిదో వినుము. కపిలగోవులపై ఆధారపడి బ్రదుకువారు క్రూరులై రౌరవ నరకమున కరుగుదురు. అందు నూరుకోట్ల ఏండ్లు పాతకమనుభవింతురు. కొంత కాలమునకు దాని నుండి విముక్తులై కుక్క కడుపున

కరుగుదురు. అటుపై బురదలో పురుగై పుట్టుదురు. మలస్థానములలో పరమ దుర్వాసనగలచోట పాపిష్ఠులు పుట్టుచుందురు. నాశము పొందుచుందురు. విద్వాంసుడగు బ్రాహ్మణుడు అట్టివారి నుండి దానము పుచ్చుకొన్నచో అది మొదలు మలము తుదిగా గల నరకములలో వాని పితరులు పడియుందురు. అట్టి విప్రునితో ఎవ్వడు పలుకరాదు. ఒక ఆసనముపై కూర్చుండరాదు. వాడు యజ్ఞమున దూరముగా విడువదగినవాడు. ఒకవేళ మాటాడినచో, ఒక ఆసనమున కూర్చున్నచో ప్రయత్నముతో ప్రాజాపత్యమును ప్రాయశ్చిత్తమును చేసికొనవలయును. అప్పుడా ద్విజుడు శుద్ధుడగును. ఒక కపిలను దానము చేయుట వేయిరెట్ల ఫలితమును నింపును. కోట్లకొలదిగా విస్తరించిన అనేక దానముల సంగతి చెప్పనేల?

వేదము చక్కగా చదువుకొన్నవాడు, దరిద్రుడు, మంచి నడవడికలవాడు, అగ్ని హోత్రములను నిత్యము అర్చించువాడు అగు బ్రాహ్మణునకు ఈనమోసిన కపిలధేనువును రక్షించి, ఈనుచుండగా దానమీవలయును. బిడ్డడు పుట్టుచుండగా ముఖము యోనియందు కన్పడుచుండగా ఇంకను గర్భమును పూర్తిగా వదలకముందు, అట్టి ఆవును పృథివిగా తెలియదగును. కపిలగోవును దానమొసగువారు,దూడతోపాటు ఆ ఆవునకు ఎన్నిరోమములు కలవో, ఆ గర్భపు నీటి కంటుకొని ఎన్ని ధూళికణములు కలవో అన్ని కోట్ల వర్షములు బ్రహ్మవేత్తలు కొలుచుచుండగా బ్రహ్మ లోకమున నివసింతురు. బంగారు కొమ్ములు, వెండిగిట్టలు గల కపిలధేనువును సువర్ణముగాని వెండిని గాని దక్షిణగా ఇచ్చి తోక దగ్గర నీటిని వదలి దానము చేయుచున్నానని పలుకవలయును. అట్టివాడు సముద్రముతో వనములతో కొండలతో అడవులతో కూడినదియు, రత్నములతో నిండి నదియు అగు భూమిని దానము చేసినవాడగును. ఇందు సంశయము లేదు. భూదానముతో సమానమగు ఈ దానముతో నరుడు ఆనందమొంది తన పితృదేవతలతో పాటు విష్ణువు అను పేరుగల పరమపదమున కరుగును.

బ్రాహ్మణుని సొమ్ము దొంగిలించినవాడు, గోవును చంపినవాడు, భ్రూణహత్య చేసినవాడు (భ్రూణము = గర్భములోని శిశువు) కొంపలు తగులబెట్టినవాడు, మహా పాతకములు చేసినవాడు, వంచకుడు, బ్రహ్మ జ్ఞానులను నిందించువాడు,ధర్మమును దూషించువాడు- ఇట్టి వారందరు కపిలగోవు దానముచేత శుద్ధి పొందుదురు.

'ఉభయముఖి' అని ప్రసిద్ధిగల కపిలను గొప్ప ధనముతో కూడినదానిని దానమొసగువాడు ఆ దినమున పాయసముగాని పాలుగాని ఆహారముగా కొని ఉండవలయును. (ఉభయముఖి - ఈనుచున్న ఆవు) వేయి కాసులుగాని, అందుసగముగాని, దానిలో సగముగాని, నూరుగాని, ఏబదిగాని, దానిలో సగము కాని దక్షిణగా ఒసగవలయును. విత్తము విషయమున వంచన పనికిరాదు. "ఈ కపిల ధేనువును గ్రహింపుము. నన్ను భయము నుండి కాపాడుము. వంశము వృద్ధి పొందుటకై ఈ దానము చేయుచున్నాను నాకు శుభమును కల్పింపుము" - అని దాత పలుకవలయును. "ధేనూ! కుటుంబము కొరకు ప్రత్యేకించి నిన్ను గ్రహించుచున్నాను. రుద్రాంగా! నీకు స్వస్తియగు గాక! నమస్కారము!" (రుద్రాంగ- రుద్రుని అంగము అయినది.) "ఓంద్యోస్త్వా దదతు" మొదలగు మంత్రములను 'కో2దాత్' మొదలగు మంత్రములను పఠించి గ్రహించువాడు దానమును కైకొనవలయును. తరువాత దాత ఆ బ్రాహ్మణుని ఇంటికి పంపి ఆవును ఆతని యింటికి చేర్పవలయును. ఇట్లు ఈనుచున్న ఆవును ఇచ్చువాడు, ఏడు ద్వీపములతో కూడిన భూమినంతటిని ఇచ్చినవాడగును. సంశయము లేదు. చంద్రునితో సమానమగు ముఖము కలవారు, బాగుగా కరిగిన బంగారు వంటి వన్నె కలవారును, గొప్ప ఖడ్గముల వంటి వాడియగు తత్వము కలవారును, సన్నని గుండ్రని నడుములు గల వారును, నిత్యజాగరూకత కలవారును అగు దేవులు అతనిని ఎల్లవేళల సేవించుచు తిరుగుచుందురు.

ఉదయమున లేచి భక్తుడు ఈ ధేనుకల్పమును ఇంద్రియ నిగ్రహము కలవాడై పవిత్రుడై చదివినచో, మూడు మారులు గోవునకు ప్రదక్షిణము చేసినచో సంవత్సరము కాలము అతడు చేసిన పాపము ఆ క్షణములో, గాలికి దుమ్ము కొట్టుకొనిపోయినట్లు, నశించును. పవిత్రము, ఉత్తమములగు ధేనుకల్పమును శ్రాద్ధకాలమున పఠించినచో చక్కగా సంస్కారము పొందిన ఆ అన్నమును పితృదేవతలు ప్రీతితో భుజింతురు. అమావాస్య నాడు బ్రాహ్మణుల ముందు దీనిని పఠించినచో ఆతని పితృదేవతలు నూరేండ్లు తృప్తి పడుదురు. దీనిని శ్రద్ధతో నిత్యము వినువానికి ఏడాది చేసిన పాపము ఆ క్షణమున నశించును. రాజా! శ్రీ వరాహ దేవుడు భూదేవికి చెప్పిన రహస్యము, పురాతనము అయిన ఈ ధేను మాహాత్మ్యమును నేను నీకు సర్వమును సర్వ పాపములను పోగొట్టుదానిని

చెప్పితిని. మాఘ మాసము శుక్లపక్ష ద్వాదశి యందు తిలధేనువు నిచ్చుచున్నవాడు నిండిన కొరిక లన్నింటితో సమృద్ధమైన విష్ణు పదమును పొందును. శ్రావణమాసమున శుక్లపక్ష ద్వాదశితిథి యందు సువర్ణముతో పాటు నిజం గోవును దానమీయవలయును. ఎప్పుడైనను అన్ని విధములైన గోవులను దానము చేయుట, సర్వపాపములు అణచునట్టిది. భుక్తిని ముక్తిని ప్రసాదించునట్టిది. ఈ సర్వము బహువిస్తరముగా ఒక రూపమున నీకు చెప్పితిని.లోక కర్తయగు బ్రహ్మ దీనికి అపారమైన ఫలమును నిర్ణయించెను. “రాజా! నీవు ఆకలితో మిక్కిలిగా పీడనొందుచున్నావు. ఇప్పుడు కార్తికము నడచుచున్నది. కావున ఇప్పుడు నీవు దానము చేయుము. ఈ బ్రహ్మాండము భూతములతో రత్నములతో ఓషధులతో, దేవదానవ యక్షులతో కూడి ఎల్లవేళల సర్వ సంపదలు కలిగియున్నది. దీనిని సువర్ణమయముగా, అన్ని బీజములతో కూడినదిగా చేసి రత్నములతోపాటు కార్తీక ద్వాదశినాడు, లేదా పూర్ణిమనాడు భక్తితో గురువైన పురోహితునకు సమర్పింపవలయును. అట్లు చేసినవాడు బ్రహ్మాండము కడుపులో నున్న భూతములన్నింటిని దానము చేసినవాడగును. సంగ్రహముగా చెప్పితిని. వేలకొలది మేలైన దక్షిణలతో యజ్ఞములు చేయువాడును బ్రహ్మాండములో ఒక భాగమును మాత్రమే ఇచ్చినవాడగును. ఇక ఈ సమస్తమైన బ్రహ్మాండమును అర్చించు నరుడు యజించుట, హోమము, దానము, అధ్యయనము, కీర్తనము చేసినవాడే యగును.

ఇది విని రాజు హేమకుంభమును బ్రహ్మాండముగా కల్పించి విధిపూర్వకముగా దానిని ఋషికర్పించెను. నిండిన సర్వమైన కోరికలు కలవాడై ఆ రాజు స్వర్గమున కరిగెను. కావున ఓ రాజేంద్రా! నీవును అది యిచ్చి సుఖము కలవాడగుము. వసిష్ఠుడిట్లు పలుకగా ఆ రాజు అట్లే కావించెను. దుఃఖము లేని పరమసిద్ధ పదమునకు ఏగెను.

ఓ వరారోహా! అన్ని కోరికలను తీర్చు ఈ వరాహ సంహిత అను పేరు గల దానిని నీకు చెప్పితిని. ఇది సర్వ పాతకములను నాశనము చేయునది. ఇది మొదట సర్వజ్ఞుడగు పరమేశ్వరుని నుండి బయలుదేరింది. అతని వలన బ్రహ్మ తెలిసికొనెను. అతడు తన కుమారుడు మహాత్ముడునగు పులస్త్యున కొసగెను. పులస్త్యుడు మహాత్ముడగు భార్గవునకు ఇచ్చెను. అతడును తన శిష్యుడగు ఉగ్రున కొసగెను. అతడు మునికి ఇచ్చెను. ఈ పరంపర ఇట్లుగా చెప్పబడినది.

ఇది పూర్వ కల్పమున చెప్పబడిన సంబంధము. ఇప్పుడు రెండవ సంబంధమును వినుము. నేను సర్వజుని వలన పొందితిని, నానుండి నీవు గ్రహించితివి. నీ నుండియు తపస్సుతో కూడిన కపిలుడు మున్నగువారు తెలిసికొందురు. క్రమముగా వ్యాసుని వలన ఇది లోకమునకు తెలియగలదు. రోమహర్షణుడను వాడు అతనికి శిష్యుడగును. అతడు దీనిని యథాతథముగా శౌనకునకు చెప్పెను. ద్వైపాయనుడను గురువు పదునెనిమిది పురాణము లెరిగినవాడు. బ్రహ్మము, పాద్మము, వైష్ణవము, శైవము, భాగవతము, నారదీయము, మార్కండేయము, ఆగ్నేయము, భవిష్యము, బ్రహ్మవైవర్తము, లైంగము, వారాహము, స్కాందము, వామనము, కౌర్మము, మాత్స్యము, గారుడము, బ్రహ్మాండము అనునవి అష్టాదశ పురాణములు.

భూదేవీ! కార్తీక ద్వాదశినాడు భక్తితో దీనిని నిర్వహించువాడు అపుత్రుడైనను తప్పక పుత్రుని పొందును. భూదేవీ! ఎవనియింట ఈ సంహిత వ్రాయబడునో, పూజింపబడునో ఆ యింట నారాయణ దేవుడు స్వయముగా నిలిచియుండును. ఈ శాస్త్రమును వదలక భక్తితో చదువువాడు, విని పూజించువాడును సనాతనుడగు విష్ణువును పూజించువాడగును. ధరాదేవీ! గంధములతో, పూవులతో, వస్త్రములతో, బ్రాహ్మణ సంతర్పణలతో శక్తిననుసరించి గ్రామములతో రాజవాచకుని పూజింపవలయును. ఈ వరాహమను పేరుగల శాస్త్రమును చదివి, పూజించి మానవుడు పాపము లన్నింటి నుండి పూర్తిగా విముక్తి పొంది విష్ణు సాయుజ్యమును పొందును. (111)

112 వ అధ్యాయము - భూదేవీకృత విష్ణు వర్ణనము

ఓం శ్రీ వరాహదేవునకు నమస్కారము. ఓం బ్రహ్మకుమారుడగు సనత్కుమారునకు నమస్కారము. లీలగా భూమిని ఉద్ధరించిన వరాహస్వామికి నమస్కారము. అట్లెత్తునప్పుడు ఆతని గిట్టల నడుమ చిక్కిన మేరు పర్వతము ఖణఖణ లాడినది. ఆ దేవుడు భూమిని మంచిమాటలతో సాంత్వన పరచిన పిమ్మట సనత్కుమారుడు ఆక్షేత్రమున భూదేవిని చూచి స్వస్తి పుణ్యాహవాచనము గావించి వసుంధరతో "భూదేవీ! ఎవనిని చూచి నీవు పొంగిపోవుదువో, నీవు ఎవనిని చేరుకొందువో, ఆ విష్ణువు నిన్ను కొనిపోవునపుడు నీవు చూచిన అద్భుతమెయ్యది?" అని

పలికెను. నీవు విష్ణు ముఖము నుండి వినిన దానిని తత్త్వముతో చెప్పుము.” అనగా ఆ బ్రహ్మ కుమారుని మాట విని భూదేవి ఇట్లు పలికెను.

విప్రవరా! నేను ఆ మహానుభావుని అడిగిన రహస్యమేదియో, అతడు నాతో చక్కగా పలికిన పలుకేదియో ఆ ధర్మపు గొప్ప మహిమను, గ్రహింపదగిన దానిని చెప్పెదను. వినుము. భగవంతుడు వక్కాణించిన ధర్మములలో మిక్కిలి రహస్యమైన దానిని చెప్పుచున్నాను. అది సంసారము నుండి విముక్తి కలిగించునట్టిది. ఆ ప్రభువు, విష్ణుభక్తున కేది కార్యమో, ఏది మిక్కిలి శ్రద్ధతో చేయదగినదియో, ధర్మము లన్నింటిలో వ్యాపించి నిశ్చయమైనదేదో, మిక్కిలి రహస్యమైనదేదో, సనాతనమగునదేదో అట్టి పరమ ధర్మమును వక్కాణింపగా నేను వింటిని.

అంత భూదేవి మాటలు విని మహాతాపసుడు, బ్రహ్మపుత్రుడు అగు సనత్కుమారుడు కోకాదిశముఖ తీర్థమువైపు చూచి అచటనున్న తాపసులు, బ్రహ్మ ఇంకను ఆ సమయమున అచటనున్నవారు మొదలగు వారినందరిని అచటకు రావించి యోగులలో పరమప్రభువు పూతాత్ముడుఅగు అతడు భూదేవితో ఇట్లు పలికెను.

"వరాననా! భావించుటకు అలవికాని ధర్మమును నేను ముందు అడిగితిని. దానిని చెప్పుము”. అంతట అతడి మాటవిని ఋషి పుంగవులకు ప్రణమిల్లి మిక్కిలి ప్రీతినొందిన భూదేవి తీయని పలుకులతో ఇట్లు పలికెను. “ఋషులారా! మీరందరు విష్ణుముఖము వలన నేను విన్నదానిని వినుడు” అని పలుకగా వారు “అట్లే! నీకు స్వస్తి, చెప్పుము” అని పలికిరి. ఆమె ఇట్లు చెప్పెను. చంద్రుడు, వాయువు లోకమున కానరావు. సూర్యుడు నక్షత్రములు రూపుమాసి పోయినవి. దిక్కులన్నియు మొద్దుబారి పోయినవి. ఏమియు తెలియరాకున్నది. అచట గాలి వీవదు. అగ్ని వెలుగదు. నక్షత్రములు ప్రకాశింపవు. అచట ఏమియు తెలియరాదు. తారలు లేవు. రాశులు లేవు. అంశువులు, నక్షత్రములు, గ్రహములు, కుజుడు, శుక్రుడు బృహస్పతి – ఎవ్వరు లేరు.

శని, బుధుడు, ఇంద్రుడు, యముడు, వరుణుడు, ఇంకను తక్కిన దేవతలు ఎవ్వరును లేరు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనెడు ముగ్గురు దేవులు తప్ప మరియెవ్వరు లేరు. అప్పుడు భారముతో మిక్కిలి వగచిన భూదేవి బ్రహ్మను శరణుజొచ్చెను. మాధవుని ఇల్లాలగు ఆమె ఆ దేవునికడ కరిగి దీనముగా ఇట్లు పలికెను.

పృథివీకృత వరాహస్తుతి

ప్రసీద మమ దేవేశ లోకనాథ జగత్పతే | భక్తాయాః శరణాయాశ్చ ప్రసీద మమ మాధవ ||

త్వమాదిత్యశ్చ చన్ద్రశ్చ త్వం యమో ధనదస్తు వై | వాసవో వరుణశ్చాసి అగ్నిర్మారుత ఏవ చ ||

అక్షరశ్చ క్షరశ్చాసి త్వం దిశో విదిశో భవాన్ |

మత్స్యః కూర్మో వరాహోఽథ నారసింహోఽసి వామనః |

రామో రామశ్చ కృష్ణోఽసి బుద్ధః కల్కిర్మహాత్మవాన్ ||

ఏవం యాస్యసి యోగేన శ్రూయతే త్వం మహాయశాః |

యుగే యుగే సహస్రాణి వ్యతీతా యే చ సంస్థితాః ||

పృథివీవాయు రాకాశమాపో జ్యోతిశ్చ పంచమమ్ |

శబ్దస్పర్శస్వరూపోఽసి రసో గన్ధోఽసి నో భవాన్ ||

సగ్రహా యే చ నక్షతాః కలాకాలముహూర్తకాః |

జ్యోతిశ్చక్రం ధ్రువశ్చాసి సర్వముద్యోతతే భవాన్ ||

మాసః పక్షమహో రాత్రమృతుః సంవత్సరాణ్యపి |

ఋతవశ్చాసి షణ్మాసాః షడ్రసాశ్చాసి సంయుతః ||

సరితః సాగరాశ్చాసి పర్వతాశ్చ మహోరగాః |

త్వం మేరుర్మందరో విన్ధ్యో మలయో దర్దురో భవాన్ ||

హిమవాన్ని షధశ్చాసి చక్రోఽసి చ వరాయుధః |

ధనూంషి చ పినాకోఽసి యోగః సాంఖ్యోఽసి చోత్తమః ||

పరమ్పరోఽసి లోకానాం నారాయణపరాయణః |

సంక్షిప్తం చైవ విస్తారో గోప్తా క్షేప్తా చ వై భవాన్ ||

యజ్ఞానాం చ మహాయజ్ఞో యూపానామసి సంస్థితః |

వేదానాం సామవేదోఽసి యజుర్వేదో వరానన ||

ఋగ్వేదోఽథర్వ వేదోఽసి సాంగోపాంగో మహాద్యుతే |

గర్జనం వర్షణం చాసి త్వం వేధా అనృతానృతే ||

అమృతం సృజసే విష్ణో యేన లోకానధారయత్ |

త్వం ప్రీతి స్త్వం పరా ప్రీతిః పురాణః పురుషో భవాన్ ||

ధ్యేయాధ్యేయం జగత్సర్వం యచ్చ కించిత్ ప్రవర్తతే |

సప్తానామపి లోకానాం త్వం నాథస్త్వం చ సంగ్రహః ||

త్వం చ కాలశ్చ మృత్యుశ్చ త్వం భూతో భూతభావనః |

ఆదిమధ్యాన్తరూపోఽసి మేధా బుద్ధిః స్మృతిర్భవాన్ ||

ఆదిత్య స్త్వం యుగావర్తః స చ పంచమహాతపాః |

అప్రమాణప్రప్రమేయోఽసి ఋషీణాం చ మహానృషిః ||

ఉగ్రదణ్డశ్చ తేజస్వీ హ్రీర్లక్ష్మీర్విజయో భవాన్ |

అనన్తశ్చాసి నాగానాం సర్పాణామసి తక్షకః|

ఉద్వహః ప్రవహశ్చాసి వరుణో వారుణో భవాన్ ||

క్రీడావిక్షేపణశ్చాసి గృహేషు గృహదేవతాః |

సర్వాత్మకః సర్వగతో వర్ధనో మాన ఏవ చ ||

సాఙ్గస్త్వం విద్యుతీనాం చ విద్యుతానాం మహాద్యుతిః |

యుగో మన్వన్తరశ్చాసి వృక్షాణాం చ వనస్పతిః ||

అణ్డజోద్భిజ్జస్వేదానాం జరాయూణాం చ మాధవ |

శ్రద్ధాసి త్వం చ దేవేశ దోషాన్ హన్తాఽసి మాధవ ||

గరుడోఽసి మహాత్మానం వహసే త్వం పరాయణః |

దున్దుభిర్నేమిఘోషైశ్చ ఆకాశగమనో భవాన్ ||

జయశ్చ విజయశ్చాసి గృహేషు గృహదేవతాః | సర్వాత్మకః సర్వగత శ్చేతనో మన ఏవ చ ||

భగస్త్వం వృషలింగశ్చ పరస్త్వం పరమాత్మకః | సర్వభూతనమస్కార్యో నమో దేవ నమోనమః |

మాం త్వం మగ్నామసి త్రాతుం లోకనాథ ఇహార్హసి || (112.25-47)

"దేవేంద్రా! పితామహా! భారము పీడింపగా నేను పర్వతములతో అడవులతో పాటుగా మునిగి పోయితిని. నన్ను తరింపజేయుము. భూదేవి మాట విని లోకపితామహుడగు బ్రహ్మ ముహూర్తకాలము ధ్యానములో నుండి భూమితో ఇట్లనెను. "వసుంధరా! ఇట్టి విషమ దశలో ఉన్న నిన్ను నేను ఉద్ధరింపజాలను. లోకముల కెల్ల ప్రభువు, సర్వ దేవతలకు మిన్న, మొదటి కర్త, లోకేశుడు, విలుకాడు, మాయల పేటిక అగు నల్లని దేవరను శరణు పొందుము. మా యెల్లరకు ఏపని పడినను, మమ్ముద్ధరించుట కాతడే సమర్థుడు. నిన్నుద్ధరించునని మరల చెప్పనేల? అంత కమలముల రేకులవంటి కనులు గలదియు, అనేకములగు ఆభరణములను తాల్చినదియునగు ఆ భూదేవి అనంతశయనమున యోగనిద్రలో ఉన్న మాధవునికి చేతులు జోడించినదై ప్రార్థించెను. ప్రభూ! నేను బరువుతో నున్నాను. బ్రహ్మను శరణుజొచ్చితిని. తాను అశక్తుడనని, ఆయన నీవద్దకు పంపెను.

"దేవదేవా! లోకనాథా! జగత్పతీ! నాపై దయజూపుము. భక్తురాలను, శరణు కోరితిని. మాధవా! నన్ననుగ్రహింపుము. నీవు సూర్యుడవు. చంద్రుడవు, యముడవు, కుబేరుడవు, ఇంద్రుడవు, వరుణుడవు, అగ్నివి, వాయువవు. నీవు అక్షరుడవు, క్షరుడవు. దిక్కులు, విదిక్కులును నీవే.మత్స్యము, కూర్మము, వరాహము, నారసింహము, వామనుడు, రాముడు, కృష్ణుడు, బుద్ధుడు, మహాత్ముడగు కల్కి అను అవతారములు అన్నియు నీవే. మహాకీర్తి శాలివగు నీవు ఇట్లనేక విధములుగా ప్రతి యుగమును వేలువేలు రూపములను, ఉన్నవానిని, రానున్న వానిని యోగముతో ధరింతువని మేము వినుచున్నాము. భూమి, వాయువు, ఆకాశము, జలము, అగ్ని అనునవియు, శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనునవియు అన్నియు మాకు నీవే. గ్రహములు, నక్షత్రములు, కలలు, కాలము, ముహూర్తములు, జ్యోతిశ్చక్రము, ధ్రువుడు ఈ అన్నింటిని నీవే ప్రకాశింపజేయుదువు. నెల,పక్షము, దినము, సంవత్సరము, ఋతువులు, అయనములు, ఆరురసములు అన్నియు సమాహార రూపమున నీవే. నదులు, సముద్రములు, పర్వతములు, మహాసర్పములు,మేరువు, మందరము, వింధ్యము, మలయము, దుగ్గరము – ఇవి యన్నియు నీవే. హిమవంతము, నిషధము, శ్రేష్ఠమగు ఆయుధమగు చక్రము, ధనుస్సులు, పినాకము నీవే. యోగమును, ఉత్తమమగు

సాంఖ్యమును నీవే. నారాయణా! లోకముల పరంపరయు, పరాయణమును నీవే. సంక్షేప స్వరూపము, విస్తార స్వరూపము నీవే. రక్షకుడవు, భక్షకుడవును నీవే. యజ్ఞములలో నీవు మహా యజ్ఞపస్వరూపుడవు. నీవు యూపస్తంభములలో నెలకొని యున్నావు. వేదములలో సామవేద స్వరూపుడవు. యజుర్వేద స్వరూపుడవు. (యూపము – యజ్ఞపశువునుకట్టు స్తంభము.) అంగములతో, ఉపాంగములతో కూడిన ఋగ్వేదము, అధర్వవేదము నీ స్వరూపములే. గర్జనము, వర్షణము నీవే. వేధ, ఋతము, అనృతము అనునవి నీవే. విష్ణూ! ఈ లోకములన్నింటిని పట్టి నిలుపు అమృతమును నీవు సృజించితివి. ప్రీతివి, పరమ ప్రీతివి నీవే. నీవే పురాణపురుషుడవు. ధ్యానింపదగినది, తగనిదియగు జగత్తు సర్వము నీవే. ఏడు లోకములకు నాథుడవు నీవే. ఆ లోకముల సముదాయమును నీవే. నీవు కాల స్వరూపుడవు. మృత్యువువు. భూతస్వరూపుడవు. భూతములను పాలించువాడవు. ఆది మధ్యాంతరూపుడవు. మేధవు, బుద్ధివి, స్మృతివి. నీవు ఆదిత్యుడవు, యుగముల పరంపరవు. అయిదు విధములైన గొప్ప తపస్సుల స్వరూపమగు ప్రమాణముల కందని స్వరూపము కలవాడవు. ఋషులలో మహర్షివి. నీవు భయంకరమగు దండరూపుడవు. గొప్ప తేజస్సుకలవాడవు. హ్రీ, లక్ష్మి, విజయము నీవే, నాగులలో అనంతుడు, సర్పములలో తక్షకుడు నీవే, ఉద్వాహము, ప్రవాహము అను తీవ్రవాయు స్వరూపములు, వరుణుడు, వారుణము నీవే. నీవు క్రీడలలోని చైతన్య స్వరూపుడవు, ఇండ్లలో గృహదేవతామూర్తివి. సర్వాత్మకుడవు. సర్వగతుడవు, వృద్ధి, మన్నన నీ స్వరూపములే. మెరుపులలో అంగములు, మెరుపులలోని మహాకాంతియు నీవే. యుగము మన్వంతరము నీవే. వృక్షములలో నీవు వనస్పతివి. (వనస్పతి = పూవులు లేకుండ కాచెడు చెట్టు.) మాధవా! గ్రుడ్డు నుండి పుట్టునవి, పగులగొట్టుకొని వచ్చునవి, చెమటవలన పుట్టునవి, గర్భము నుండి పుట్టునవి అనువానిలో నీవే యున్నావు. నీవు శ్రద్ధారూపుడవు. దోషములను పరిమార్చువాడవు. నీవు గరుడుడవై మహాత్ముడగు మాధవుని మోయుచున్నావు. దుందుభి, రథము, చక్రముల పట్టాల ఘోషతో ఆకాశమున ప్రవర్తించుచుందువు, జయ విజయులు, గృహదేవతలు నీవే. సర్వాత్మకుడవు. సర్వగతుడవు. చేతన, మనస్సు నీవే. నీవు భగము, వృషము, లింగము, పరుడవు, పరమాత్మకుడవు సర్వభూతములకు నమస్కరింపదగిన వాడవు. దేవా! నమస్సు, నమస్సు, మునిగిన నన్ను కాపాడుటకు లోకనాథా! నీవే సమర్థుడవు.

ఈ స్తోత్రము ఆదికాలమునకు సంబంధించినది. అన్ని పాపములను హరించునది. మంగళమైనది. దృఢమైన వ్రతము గలిగి ఈ కేశవ స్తోత్రమును పఠించు నరుడు సర్వరోగముల నుండియు సర్వబంధముల నుండియు ముక్తుడగును. పుత్రులు లేనివాడు పుత్రుని దరిద్రుడు ధనమును, భార్యలేనివాడు భార్యను,పతిలేని పడతి పతిని పొందుదురు. రెండు సంధ్యలలో ఈ మాధవ మహాస్తవమును పఠించువాడు విష్ణులోకమున కరుగును. విచారణ చేయపని లేదు. ఈ మహాస్తుతిని కేవలము అక్షరముల రూపములలో నైనను చదువువాడు వేల సంవత్సరములు స్వర్గలోకమున ప్రతిష్ఠి పొందును. (112)

113 వ అధ్యాయము – భూమాత అడిగిన ప్రశ్నలు

శ్రీవరాహదేవుడు ఇట్లు పలికెను. "మునులు, వేదపండితులు మున్నగువారు ఇట్లు చక్కగా స్తుతించుచుండగా నారాయణుడు, దేవుడు, కేశవుడు, పరముడు, విభువు తుష్టుడు అయ్యెను. అంత కొంతవడి ధ్యానమును పొంది, దివ్యమగు యోగమును పొంది మాధవుడు తీయని స్వరముతో వసుంధరతో నిట్లనెను. "దేవీ! నీ ప్రియము కొరకును, నీ భక్తిచేతను, నీ హృదయమున ఏది కలదో అది అంతయు చేసెదను. కొండలతో, అడవులతో, సముద్రములతో, నదులతో ఏడు ద్వీపములతో కూడిన నిన్ను నేను పట్టుకొని నిలిపెదను" అని పలికి ఇట్లు వసుధకు ఊరట కలిగించి, మాధవుడు పిక్కటిల్లిన దేహబలము గల వరాహరూపమును భావించెను. ఆరువేల యోజనముల ఎత్తు, మూడువేల యోజనముల వెడల్పుగా మొత్తము తొమ్మిది వేల యోజనముల రూపమును కల్పించెను. ఎడమకోరతో పట్టుకొని కొండలు, అడవులు, ఏడు ద్వీపములు, పట్టణములు గల భూమి నంతటిని పైకి లాగెను. పట్టు దొరకని కొన్ని పర్వతములు పడిపోయినవి. ఏదో తెలియవచ్చునట్లు వ్రేలాడుచుండినవి. విచిత్రములగు అంగములు కల అట్టివి వర్షాకాలములో మేఘముల వలె శోభిల్లినవి. చక్రము చేత దాల్చిన వరాహస్వామి ముఖమున వ్రేలుచు ఆ కొండలు చంద్రునివలె నిర్మల స్వరూపము కలవియై బురదలో తామర తూడులవలె ప్రకాశించినవి. ఈ విధముగా వజ్రముల వంటి కోరలు గల ఉత్తమ స్వభావముగల ఆ విష్ణువు సాగరములతో కూడిన భూమిని వేయిఏండ్లు పట్టుకొని నిలిపెను. అట్లు ఎన్నో యుగముల కాలము ఆ భూమి ఆ విధముగా ఉండగా డెబ్బది యొకటవ కల్పమున కర్దముడు ప్రజాపతి

అయి ఉండెను. అపుడు భగవానుడు, అవ్యయుడు, దేవుడునగు విష్ణువును, భూమియు ఆ ఉత్తమమగు వరాహకల్పమున ఒకరియందొకరు ప్రీతి కలవారైయుండిరి. ఆ భూమి పురాణుడు, అవ్యయుడు, పరముడునగు ఆ దేవుని స్తుతించెను. పరమమగు యోగముతో ఆతనిని శరణుజొచ్చెను. "దేవా! నన్ను పట్టుకొనుటలో నీకు ఆధారమెట్టిది? ఉపయోగమెట్టిది? ఆయా కాలమునందు, ఆయా దేశము నందు, ఆయా కర్మము నందు నీ వ్యవసాయమెట్టిది? పడమటి సంధ్య ఎట్టిది. ఆ పై విషయము లెట్టివి? నీ యెడల ఆయా పనులు చేయుచున్న దేవతలతో తక్కినవారు సమానులా? నిన్ను నెలకొల్పుట ఎట్లు? ఆవాహన యెట్లు. విసర్జన ఎట్లు? అగురు గంధ ధూపనము నీవెట్లు గ్రహింతువు? నీకు పాద్యమొసగుట ఎట్లు? నిన్ను నిలుపుట ఎట్లు? నీకు గంధము పూయుట ఎట్లు? నీకు దీపమొసగుట ఎట్లు? నీకు దుంపలు పండ్లు నివేదించుట ఎట్లు? నీకు ఆసనము, శయనము కూర్చుట ఎట్లు? నీ పూజ చేయుట ఎట్లు? ఎన్ని సందర్భములలో పూజ చేయవలయును. తూర్పు, పడమరల సంధ్యలలో పూజించుట వలన కలుగు పుణ్యమెట్టిది? శరత్తు, శిశిరము, వసంతము, గ్రీష్మము, వర్షము, వర్షము ముగిసిన కాలము – అను నీ ఋతువులలో చేయదగు కర్మమెట్టిది? అందు ఉపయోగింపదగు పూలెట్టివి? పండ్లెట్టివి? కర్మము, అకర్మము అనువానిలో శాస్త్రము వెలిపెట్టిన పదార్థము లెట్టివి? భగవంతులు ఏ పనిచేసి లక్ష్యమున కరుగుదురు? ఎట్టివారు ఆయాపనుల తుది భాగములందు అతిక్రమింప కుందురు? పూజకు ప్రమాణమేమి? స్థాపనము ఎట్టిది? పరిమాణ మెంతటిది? ఉపవాస మనగా నెట్టిది?

పసుపు, తెలుపు, ఎరుపు రంగుల ఆభరణములలో ఎట్టివానిని నీవు శాశ్వతముగా గ్రహింతువు? ఏ రంగు వస్త్రములు నీకు ఇచ్చినవారు మేలు పొందెదరు. ఏ ద్రవ్యములు కలిపి మధుపర్కమును నీకీయవలయును? అందు కర్మమెట్టిది? గుణములెట్టివి? మధుపర్కము పుచ్చుకొనుట వలన నరుడు ఏ లోకముల కరుగును? నీ స్తోత్రము చేయు పరమ పుణ్యకాలమున నీ భక్తుడు మధుపర్కమును ఏ ప్రమాణములో ఈవలయును? ఏయే మాంసములు, ఏ కూరలు, ఏ పండ్లు నీ సంబంధములగు పనులలో నివేదనకు శాస్త్రములను అనుసరించి యోగ్యములు? ఏ మంత్రముతో నిన్నాహ్వానింపగా భక్తవత్సలుడవు నీవరుదెంతువు. అప్పుడు ఏ మంత్ర విధానముతో నీకు నైవేద్యము

ఒసగవలయును? నిన్నాయా ఉపచారములతో యథావిధిగ అర్చించి భక్తుడు చేయవలసిన పనులెట్టివి? భోజనమైన తరువాత చేయదగిన కర్మము లెట్టివి? నీస్తుతి, నీ అర్పణములు ఏ దోషము లేకుండ ముగిసిన తరువాత సర్వశుద్ధికరము, శుభము అగు నీ ప్రసాదమును భుజించు వారెవ్వరు? ఒంటిపూట భోజనముచేసి నీకడకు వచ్చు భక్తిపరాయణులు ఏగతికి పోవుదురు? షష్ఠాష్టమ కాలమున భక్తి పరాయణ భావముతో మాధవుని కడకేతెంచు వారి గతియేమి? కృచ్ఛ్ర చాంద్రాయణములను కర్మములందు ఆసక్తి కలిగి నిర్వహించువారు మాధవునికడ కేతెంచినచో వారు పొందెడు స్థితియెట్టిది? శాస్త్రము చెప్పిన విధముగా వ్రతమొనరించి నీ శాసనము నందు చక్కగా మెలగువారు మాధవుని గూర్చి ప్రయాణింతు రేని వారు పొందెడు గతి యెట్టిది? నీ కర్మములందు పరమ శ్రద్ధ కలవారై అతికష్టమైన సాంతపనమను వ్రతమును చేయువారు మాధవుని కడకరుగుచు ఏ గతి పొందుదురు? కృష్ణా! వాయువే ఆహారముగా గ్రహించి నీయందలి భక్తితో అచంచలముగా ఉండు వారు పొందుగతి యేమి స్వామీ! నీ కర్మము ననుసరించువారై ఉప్పుకారములు లేని భోజనముతినుచు అచ్యుతునివైపు ప్రయాణించువారు ఏ గతిని పొందుదురు? వ్రతముల నాచరించుచు తులా పురుషక వ్రతమును చేసి కేశవుని వైపు పోవు నరులు ఏగతిని పొందెదరు? అచ్యుతుని కడకరుగు వారై పాలను మాత్రమే పుచ్చుకొని వ్రతము చేయువారు ఏగతి కరుగుదురు? నీయందు చెదరని భక్తి కలవారై ప్రతిదినము ఆవునకు మేత ఇడుచు మాధవార్చన చేయువారు ఏగతి కరుగుదురు? బిచ్చమెత్తుకొని బ్రదుకుచు రాలిన గింజ లేరుకుని తిను వ్రతము నవలంబించి మాధవునర్చించు వారే గతి పొందుదురు? నీ కర్మములందు మిక్కిలి శ్రద్ద కలిగి గృహస్థ ధర్మమును పాటించుచు కేశవు నర్చించువారు ఏగతి పొందుదురు. వైకుంఠా! నీ క్షేత్రములందు ప్రాణములు విడుచువారు, మరణము పొందినవారు ఏ లోకముల కరుగుదురు?

పంచాగ్ని మధ్య తపస్సును ఆచరించి మాధవుని శరణుజొచ్చిన వారు మరణించిన పిదప ఎట్టి పరమగతి కరుగుదురు? ముళ్లపానుపు నెక్కి అచ్యుతు నారాధించుచు తపముచేయువారు ఏ గతి కరుగుదురు? కృష్ణా! నీ భక్తి పై మిక్కిలి అనురక్తి కలవారై ఆకాశ శయనము కావించి తపస్సు చేయు వారి గతి యెట్టిది? నీపై అచంచలమగు భక్తి గలవారై ఆవుల మందలో నిద్రించు వ్రతమాచరించువారి గతి

యెట్టిది? నీయందలి పరమభక్తితో కూరలు మాత్రమే తినుచు అచ్యుతుని వైపు ప్రయాణించు వారు పొందెడు గతి యెట్టిది? పంచ గవ్యముల(ఆవుపాలు, పెరుగు, వెన్న, నెయ్యి, మూత్రము)ను త్రావి విష్ణుని ఆరాధించు భక్తుల గతి యెట్టిది? గోమయమునే ఆహారముగాగొని కేశవు నర్చించువారి గతి, నారాయణా! ఎట్టిది? నీ సేవలో శ్రద్ధకలవారై పేలపిండిని మాత్రము తినుచు మాధవునారాధించువారు పొందుగతి యేమి? తలపై దీపముంచుకొని కేశవు నర్పించువారికి దేవా! గతి యెట్టిది? నిత్యము పాలు మాత్రము త్రావుచు నిన్నే విడువక ధ్యానించుచుండువారు ఏగతి నందుదురు? నీ భక్తియందు పరమానురాగము కలవారై ఆమ (వండని పదార్థము) భోజనము అనువ్రతముతో నిన్నర్చించువారి గతి ఏమి? గరికను మాత్రమే తినుచు తమ కర్మములను గుణములను అనుసరించుచు నిన్ను చేరుకొనువారు పొందుగతి యెట్టిది? నీయందలి ప్రీతితో మోకాళ్లపై కూర్చుండి ధ్యానించు వారిగతి యెట్టిదో అడుగుచున్న నాకు తెలియ జెప్పుము. వెల్లకిల్లగా పండుకొని పైన దీపములుంచు కొని నిన్నర్చించువారు పొందెడు గతి యెట్టిదో చెప్పుము. నీ ధర్మమున శ్రద్ధ కలిగి మోకాళ్లమీద దీపముంచుకొని కేశవు నర్చించువారి గతి ఎట్టిది? రెండు చేతులలో దీపముంచుకొని కేశవు నర్చించు వారి శాశ్వతగతి యెట్టిదో చెప్పుము. తల క్రిందుగా ఉంచుకొని పండుకొనువారు జనార్ధనుని ఆశ్రయించి పొందెడు గతి ఏమి? కొడుకులను, భార్యను, ఇంటిని వదలి నిన్నే గతిగా కైకొను, సిద్ధులెట్టిగతి నందుదురో తెలియ బలుకుము. మాధవా! అన్ని లోకములకు సుఖకారణమైన రాకపోకలను గూర్చి నీవు ప్రసన్నుడవైన కారణముగా నేను పలుక గలిగితిని. నీవే తల్లివి, నీవే తండ్రివి. నీవే సర్వ ధర్మములకు నిశ్చయ రూపుడవు. కావున యోగము, సాంఖ్యము అనువాని నిర్ణయమును గూర్చి నీవే చెప్పవలయును. నిన్ను భజించుచు జీవుడు మృతిచెందినచో మధుపర్కముతో పాటు భస్మమునందు కలిసిన వాని దేహమును అగ్నిలో దహనము చేయు విధానమెట్టిది? నీ భక్తుడు నీటమునిగినప్పుడు, నీ క్షేత్రమున నిలిచియున్నప్పుడు నిన్ను పొందినచో ఆతని గతి యెట్టిది? నీ నామములను కీర్తించుచు "ఓం నమో నారాయణాయ" అని పలుకుచు దానినే స్మరించుచుండు వారి గతియెట్టిది? ఆయుధము నెత్తిపట్టుకొని శత్రువులు చంపుచున్నప్పుడు నీ నామమును కీర్తించువారు పొందుగతి యెట్టిది? నేను నీకు శిష్యను. నీదాసిని. నీ భక్తియందు స్థిరముగా ఉండు దానను, ధర్మముతో కూడిన ఈ రహస్యమును మాధవా!

నాకు చెప్పుము. జగద్గురూ! ఇది పరమ రహస్యము. నాయందలి ప్రీతితో లోకధర్మమును విచారించి నీవు నాకు చెప్పవలయును. (113)

114 వ అధ్యాయము – చాతుర్వర్ణ ధర్మాలు

అంత ఆ భూదేవి పలుకు విని నారాయణ దేవుడు ఇట్లు పలికెను. "దేవీ! స్వర్గ సుఖమును కలిగించు కర్మ మార్గమును నీకే చెప్పెదను. వసుంధరా! భక్తితో స్థిరబుద్ధితో నుండు మానవుల స్థితిని గూర్చి నీవడిగినదానికి సమాధానము వినుము. అల్పబుద్ధిగల నరులు ఇచ్చెడు వేలకొలది దానములచేతను, నూర్లకొలది యజ్ఞముల చేతగాని, ధనముచేతగాని నేను తుష్టినందను. చిత్తమును ఏకాగ్రము చేసి నన్ను భజించు వాని విషయమున, పెక్కు దోషములున్నను నేను తుష్టినందుదును. సుందరీ! పవిత్రమగు మందహాసము కలదానా! స్వర్గమునకు కారణమైన కర్మమును గూర్చి నన్నడిగితివి. చెప్పుచున్నాను. వినుము. మాధవీ! పురుషులు పెక్కుభావనలు కలవారైనను, నడి రేయియందు, చీకటిలోను, మధ్యాహ్నమునందు అపరాహ్ణము నందు నిత్యము నాకు నమస్కారము చేయుచు, నా భక్తియందు చక్కగా కుదురుకొన్న చిత్తము కలవారై శ్రద్ధతో ద్వాదశియందు ఉపవాసము చేయుదురేని అట్టివారికి నేనెన్నడును దూరముకాను. చక్కని బుద్ధి పొంది గుణములెరిగి భక్తియందు ఏక చిత్తము కలిగి నన్నే అర్చించు నరుడు, సుందరీ! స్వర్గమున నివసించును.

వరాననా! నా వంటివారు చిన్న విషయముతో లభ్యముకారు. నేను మిక్కిలి సులభుడనుకాను. పరమభక్తితో స్థిరులైనవారు ఏమి కర్మములు చేసి నన్ను పొందుదురో వానిని చెప్పెదను. నాయందు చెదరని భక్తి కలవారై ద్వాదశినాడు ఉపవాసము చేయు నరులు నన్నే చూతురు. ఉపవాసము చేసి జలము దోసిలితో గ్రహించి నారాయణ, నీకు నమస్కారమని పలికి సూర్యుని చూడవలయును. దోసిలిలోని నీటినుండి ఎన్ని బిందువులు పడునో అన్నివేల సంవత్సరములు అతడు స్వర్గలోకమున ప్రసిద్ధికెక్కును. మరియు ద్వాదశినాడు ధర్మమును గూర్చి ప్రసగించువారై, విధిపూర్వకముగా ప్రయత్నముతో తెల్లని పూలతో, నిండిన ధూపములతో నన్ను పూజించుచు హృదయమున భావించుచు నుండు నరులు పొందు గతి యెట్టిదో చెప్పెదను వినుము. నా శిరస్సున పుష్పములు నుంచి తెల్లని వస్త్రములను ధరించి, చేతిలో పుష్పముంచుకొని 'మంచి మనస్సు కల భగవానుడు ఈ

పుష్పాలను స్వీకరించి, నా పట్ల ప్రీతి చెందుగాక!' అను అర్థముగల మంత్రమును చదువుచు అర్చింపవలయును. విష్ణువునకు నమస్కారము. "ఓం నమో భగవతే విష్ణవే" వ్యక్తము, అవ్యక్తము అగు మంచిగంధమును స్వామీ నీవు గ్రహించు, గ్రహించు – అను మంత్రముతో గంధమును ఈయవలయును. భగవంతుడగు అచ్యుతుడు నా ఘన విని విచ్చేసెను. ఈ పూజకు ఆధారమాయెను. ఇందు ప్రవేశము పొంది నా ధూపమును ఆతడు గ్రహించుగాక! అను పవిత్ర వాక్యముతో ధూపము నొసగవలయును. నేను విన్నవించుకొన్న శాస్త్ర వాక్యములను విని నాచేత ఈ పూజ చేయించుకొనెను. అతడు నాలోకమున కరిగి నాలుగు భుజములు కలవాడగును. దేవీ! నాకు ప్రియమైన మంత్రపూజా విధానమును, సుఖము కలిగించుదానిని, శ్రేష్ఠమగు దానిని నీ ప్రియము కొరకు చెప్పితిని.

చామలు, షష్టకము (అరువది దినములలో పండెడు ధాన్యము), గోధుమలు, పెసలు, శాలిధాన్యము, యవలు, నివ్వరి ధాన్యము, కొర్రలు అను ఈ ధాన్యములను నా పూజయందు శ్రద్ధ కలవారు భుజింపవలయును. నాకు ప్రియుడై ఎల్లవేళల నన్ను పూజించు వాడు శంఖమును, చక్రమును, నాగలి(బలరాముని ఆయుధములు) ని, రోకలిని, గదను నిత్యము చూచుచుండును.

నా భక్తి యందు మిక్కిలి ఆసక్తి కలవారై ఆయా పూజలు చేయువారిలో బ్రాహ్మణుని కర్తవ్యము చెప్పెదను వినుము. అతడు ఆరు కర్మముల యందు శ్రద్ధ కలవాడు అనగా యజన, యాజన, అధ్యయన, అధ్యాపన దానప్రతిగ్రహణములు, అహంకారమును వదలినవాడు, లాభనష్టములను పట్టించుకొననివాడు. బిచ్చమెత్తిన అన్నము తినువాడు, ఇంద్రియ నిగ్రహము కలవాడు, నా పూజయందే శ్రద్ధకలవాడు, లోభగుణము లేనివాడు, ఋతుకాలమున మాత్రమే భార్యను పొందువాడు, శాంతాత్ముడు, దురభిమానము లేనివాడు, శాస్త్రములు ననుసరించువాడు, పక్షపాతము లేనివాడు, వృద్ధులయు, బాలురయు బుద్ధులు లేనివాడు కావలయును. (షట్కర్మములు – 1.యజ్ఞము చేయుట, 2. చేయించుట, 3 వేదములు చదువుట 4. చదివించుట, 5. దానమిచ్చుట, 6.పుచ్చుకొనుట) ఇది బ్రాహ్మణుని విధి. ఆతడు పరిపాకము చెందిన భావమున శ్రద్ధ కలవాడై ఇష్టాపూర్తములతో ఆయా కర్మములను చేయవలయును. అతడు నన్నే దర్శించును.

(ఇష్టము – యజ్ఞము, పూర్తము – నూతిని త్రవ్వించుట, గుడి కట్టించుట, వనము ఏర్పరచుట, అన్నదానము చేయుట) నా కర్మము నందు శ్రద్ధ కలవాడు వర్ణములలో నడుమనున్నవాడు అగు క్షత్రియుని కర్మము లెట్టివో చెప్పెదను. ఆతడు దానశూరుడు, కర్మములను చక్కగా ఎరిగినవాడు, యజ్ఞములందు నేర్పరి, శుచి, నా పనుల యందు మేధావి. అహంకారము వదలినవాడును కావలయును. మితముగా భాషించువాడు, గుణము నెరిగినవాడు, నిత్యము భగవద్భక్తుల యందు ప్రియము కలవాడు, గొప్ప విద్యలు కలవాడు, అసూయ లేనివాడు, చాటుమాటు పనులయందు తగులము లేనివాడును కావలయును. పెద్దలు కనబడినపుడు ఎదురేగుట మొదలగు పనులలో నేర్పు కలవాడు, లోభగుణము లేనివాడు – ఇట్టి గుణములతో కూడినవాడై నన్నర్చించు క్షత్రియుడు నాలోకమున కరుగును. నా భక్తి మార్గమున స్థిరముగా నిలిచి నా పనుల యందు శ్రద్ధకలవాడగు వైశ్యుని కర్మములను గూర్చిచెప్పెదను. చెప్పబోవు గుణములతో తన ధర్మమును పాటించు లాభనష్టములను లెక్కపెట్టక, ఋతుకాలమున భార్యను కలియుచు శాంతాత్ముడు మోహము లేనివాడును కావలయును. పరిశుద్ధుడు, సమర్థుడు, నా పనుల యందు ప్రీతికలవాడై యున్నప్పుడు ఆహారము కొననివాడు, గురువులను చక్కగా పూజించువాడు భక్తితో కూడినవాడు కావలయును. ఈ విధముగా చక్కగా నా భావముతో కూడియుండి తన కర్మమును అనుసరించు వానికి నేను దూరము కాను. అతడు నాకు దూరము కాడు.

మాధవీ! ఇక శూద్రుని కర్మములను గూర్చి చెప్పెదను వినుము. నాయందు నిలుకడ గల శూద్రుని కర్మములెట్టివో వక్కాణింతును. నా పనులయందు పరమ శ్రద్ధయు, నిష్ఠయు కలిగి ఆలుమగలిద్దరు నన్నే నమ్ముకొని నాయందు భక్తులై యుండువారు, దేశకాలములను పట్టించుకొనక, రజస్తమో గుణములను వదలి, అహంకారము మాని శుద్ధమగు అంతరంగము కలవారై, అతిథులను చక్కని భావములతో మన్నించుచు, శ్రద్ధ కలవారు, పవిత్రమైన హృదయము కలవారు, లోభమోహములను పరిత్యజించిన నాకు నమస్కరించుటయందు ప్రీతి కలవారు, నన్నే భావించుటలో స్థిరచిత్తము కలవారు అగు శూద్ర దంపతులు వారి కర్మములను చక్కగా ఆచరించు కొనవలయును. దేవీ! వేలకొలది ఋషులను వదలి నేనట్టి శూద్రులను ఆదరింతును. దేవీ! నాలుగు వర్ణముల వారి

కర్మములను, గుణములను నన్నడిగితివి. ఆ కర్మ గుణములతో పాటు చెదరని భక్తితో కూడిన వారిని గూర్చి వివరించి చెప్పితిని.వసుంధరా! అన్ని వర్ణములకు సాధారణములైన వానిని చెప్పితిని. బ్రాహ్మణుని యందు మరియొక విశిష్టత కలదు. దేనితో అతడు ఏ యోగమును పొందునో దానిని చెప్పెదను వినుము. బ్రాహ్మణుడు లాభనష్టములను గూర్చి భావింపరాదు. మోహమును, కామమును విడువవలయును. చలికి, ఎండకు చలింపరాదు. దొరికిన దానిని, దొరకని దానిని గూర్చి చింతింపరాదు. చేదు, కారము, తీపి, పులుపు, ఉప్పు మొదలగు రుచులయందు ఆసక్తి ఉన్న యెడల ఆతడు ఉత్తమమగు సిద్ధిని పొందడు. భార్య, కొడుకు, తండ్రి, తల్లి – అని యిట్లు సుఖభోగములకైన సంబంధముల వదలి నా పనులయందే పరమాదరమును పొందవలయును. ధైర్యము, నేర్పు, శ్రద్ధ, పట్టువీడని వ్రతము కలవాడై నన్నే పరమగతిగా భావించి ఇతర కార్యములందు ఏవగింపు పొందుచు, నిత్యము ప్రయత్నశీలుడు కావలయును. చిన్నవయసు నుండియు సమర్థుడు, మితముగా భోగములు పొందువాడు, కులధర్మమును తప్పనివాడు, అన్ని ప్రాణులయందు దయగలవాడు, పెద్దల కెదురేగు స్వభావముకలవాడు, గొప్ప ఓరిమి కలవాడును కావలయును. ఒకపని చేయునపుడు మౌనముతో ఆ పని చేయవలయును. మూడు కాలములలో సంధ్యా వందనము చేయవలయును. వైదిక కర్మముల యందు నిలుకడ కలిగియుండ వలయును. దొరికిన దానిని తృప్తితో భుజించుచు, తన పనికి అనుగుణమైన భోజనములు చేయుచు, అనుష్ఠానము నందు శ్రద్ధ కలవాడై నా వైపు మనసు పెట్టిన వాడై ఉండవలయును. తగు కాలములలో మలమూత్రములను విడచుచు, స్నానమునందు మిక్కిలి ప్రేమ కలవాడై పూలవాసనల యెడ, ధూపాదులయెడ, సత్కర్మములయెడను ఎల్లప్పుడు ప్రీతి కలవాడై ఉండవలయును. ఒకప్పుడు దుంపలు, ఒకప్పుడు పండ్లు, ఒకప్పుడు పాలు, గంజి, ఏమియు దొరకనిచో గాలిని భుజించుచుండవలయును, ఒకప్పుడు ఆరవకాలమున, ఒకప్పుడు లభించిన మహాఫలము, ఒకప్పుడు నాల్గవ భాగముతో, ఒకప్పుడు కేవలము ఒక్క ఫలముతో గడుపవలయును. పది దినములకు, పదునైదు దినములకు, నెలకు భుజింపవలసి వచ్చినను బాధనొందరాదు. ఇట్లు ప్రవర్తించు విప్రుడు నా పూజా కర్మలు చేయుచుండువాని యోగియని వక్కాణింతును. శాశ్వతముగా వానితోడనే కలిసియుందును.(114)

115 వ అధ్యాయము - కర్మమార్గ సాఫల్య కథనము

శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. పుణ్యురాలా! నేను చెప్పిన తీరున కర్మములు ఆచరించువాడు ఎట్లు సఫలత్వము పొందునో చెప్పెదను వినుము. అప్పుడప్పుడు ద్వాదశియందు దుంపలు, కూరలు తినుచు పాలుత్రాగుచూ, మౌనవ్రతము నవలంబించి సాత్వికాహారమును భుజింపవలయును. చెదరని చిత్తమును కూర్చుకొని అహంకారమును వదలివైచి, మనస్సును, ఇంద్రియములను అణచివైచుకొని నన్నే హృదయమున నిలుపుకొనవలయును.

షష్ఠి, అష్టమి, అమావాస్య రెండు పక్షములందును చతుర్దశి, ద్వాదశి అను తిథులందు మిథున కర్మము జోలికి పోరాదు. ఇట్లు యోగ విధానముతో చెడని వ్రతము కలవాడై కర్మమాచరించువాడు పవిత్రమైన హృదయము కలవాడై, ధర్మముతో కూడినవాడై, విష్ణులోకమునకు పోవును. అతనికి అలసట, ముసలితనము, మతిచంచలత, రోగము అనునవి కలుగవు. విండ్లు, ఖడ్గములు, శరములు, గదలు గల పదునెనిమిది భుజములు కలవాడగును. నా సంబంధమగు ఈ కర్మము వలన కలుగు ప్రయోజనము చెప్పెదను. ఈ విధముగా నా అర్చన విధి చేసినవాడు, అరువది వేల ఆరువందల సంవత్సరములు నాలోకమున ప్రతిష్ఠ పొందును. వసుంధరా! ఇప్పుడు దుఃఖమును గూర్చి చెప్పెదను. తగు విధములగు ఉపచారములతో పోగొట్టుకొనదగు దుఃఖములెట్టివో వివరింతును. ఎల్లప్పుడు అహంకారము పైకొనగా మోహము చుట్టుకొనగా నన్ను శరణు పొందకుండుట కంటె మిక్కిలి దుఃఖమేముండును? అన్నియు తినువాడు, అన్నింటిని అమ్మువాడు, నమస్కారము మానినవాడునై నన్ను శరణు పొందనివాడు పొందు దుఃఖము కంటే మించినదేమి కలదు? పెక్కు విధములతో పాకములతో అన్ని తీరులగు అన్నములను సిద్ధపరచుకొని వైశ్వదేవము చేయక, తాము తినకుండుట కంటె మించిన దుఃఖమేది? వైశ్వదేవ సమయమున కానవచ్చిన అతిథికి పెట్టక తినువాడు పొందు దుఃఖము కంటే మించినదేది?

తృప్తి పొందడు. లోభమునందే నిలుచును. పరుల భార్యలను తాకుచుండును. ఇతరులను బాధించుచుండును. బుద్ధిలేని వాడగును. దీనికి మించిన దుఃఖమేది? ఇంటిలో నివసించుచు పుష్కలముగా మంచి పనులు చేయక చావు దాపురించినపుడు పొందు దుఃఖముకంటె మించినదేది? ఒక యేనుగుగాని, గుఱ్ఱముగాని, వాహనముగాని తనకు

ముందు వెనుకలుగా పోవుచుండుటను చూడకుండుట కంటె మించిన దుఃఖమేది? కొందరు నెయ్యి, మంచి ధాన్యముతో అలరారు భోజనము మాంసముతో పాటు తినుచుండగా కొందరు సారములేని కూడు తినుచుందురు. అంత కంటె మిగిలిన దుఃఖమేది? కొందరు మేలిమి వస్త్రములు, భూషణములుగల హంస తూలికా తల్పములపై నిద్రించుచుండగా కొందరు గడ్డిపరకలపై వ్రాలియుందురు. అంతకంటే దుఃఖమేమి ఉండును?

ఒక నరుడు తన పుణ్యకర్మములచేత పరమ సుందర రూపముకలవాడై యొప్పారును. కొందరు వికృతాకారములతో కానవత్తురు. అంతకుమించిన దుఃఖమేది? విద్వాంసుడు, ప్రయోజనమును సాధించువాడు, గుణము లెరిగినవాడు, సర్వ శాస్త్రములలో ఆరితేరిన వాడునై ఒకడుండగా కొందరు మూగివారై కానవత్తురు. దానికి మించిన దుఃఖమేది? ధనమున్నను కొందరు పిసిని గొట్టులై, భోగములకు దూరమగుదురు. దాత దరిద్రుడగు చుండును. ఇంతకంటె దుఃఖమేది? ఇద్దరు భార్యలు, ఒక్క పురుషుడు. వారిలో ఒకతె నికృష్టురాలు అంతకంటే దుఃఖమేమి? పంచ భూతములతో ఏర్పడిన మనుష్యత్వమను స్థితిని పొందియునన్ను శరణు కోరరు. ఇంతకుమించి దుఃఖమేది? అన్ని వర్ణములలో ఉత్తమమైన బ్రాహ్మణ భావమును పొంది పాపకర్మములందు ఆసక్తి కలిగియుండుట కంటే మించిన దుఃఖమేది? ఉత్తమురాలా! ఇట్లు నన్ను నీవడిగిన దుఃఖకర్మముల నిశ్చయమును గూర్చి సర్వ భూతముల హితమును కోరి చెప్పితిని. ఓ నిర్మలాంగీ! శుభకర్మ మెట్టిదని నన్నడిగితివి. చెప్పుచున్నాను. నేను చేయు కర్మ నిర్ణయమును వినుము.

విస్తృతమైన కర్మము నొనరించి నా భక్తులయందు నివేదింప వలయునను బుద్ధి ఎవనికి కలుగునో వాడు సుఖమును పొందును. నన్నే అర్చించి అందు నివేదించిన ఉత్తమమగు మిగిలిన అన్నమును భుజించుట కంటే మించిన సుఖమేది? మూడు కాలములలో నన్నే శరణు పొంది సాయంకాలము చేయు సంధ్యావందనము చేయుట కంటె సుఖమేది? దేవతలకు, అతిథులకు, మనుజులకు అన్నమొసగి మిగిలిన అన్నమును తరువాత తినువానికంటె సుఖవంతుడెవ్వడు? తన యింటికి అతిథిరాగా ఏదో కొంత ఆతనికి ఇచ్చి, ఆతనిని నిరాశునిగా పంపకుండుట కంటే సౌఖ్యతరమేముండును? నెలనెల

అమావాస్యనాడు ఎవని పితరులు తర్పణములు పొందుదురో అంతకు మించిన సుఖమేమి కలదు? భోజనములకు వచ్చినవారికి ముఖములో ఏ భేదము లేని అనురాగ భావముతో యవాన్న మిడుట కంటె సౌఖ్యము ఏముండును?

ఇద్దరు, లేక ఇంకను మించిన సంఖ్యలో భార్యలున్నప్పుడు బుద్ధి నశింపక సమముగా ఎవడు చూడగలడో అంతకుమించిన సుఖమేముండును? విశుద్ధమగు అంతరాత్మతో అహింసయను పాటింపవలయును, అట్లు అహింసచే ఆనందపడు శుద్ధుడు సుఖము పొందును. సుందరరూపముగల ఇతరుల భార్యలను చూచి ఎవని మనసు చలింపదో, ఎవని మనస్సు వారియందు ప్రవర్తింపదో వానికంటె సుఖము కలవాడెవ్వడు? ముత్యములు రత్నములు, సువర్ణాభరణములు మొదలగు వానిని మట్టి ముద్దలవలె చూడగలిగిన దానికంటె మించిన సుఖమేది? గుఱ్ఱములు, ఏనుగులు గల రెండు సైన్యములు తన దారియందు ఆనందముతో ఉండగా ప్రాణములు కోల్పోయిన వారు పొందు సుఖము కంటె మించినది ఏమి కలదు? కుత్సితమైన పనిని చేపట్టక లాభనష్టములకు వగవక సంతృప్తితో జీవించుట కంటె మించిన సుఖమేముండును? వసుంధరా! స్త్రీల విషయములలో భర్త కిదియే వ్రతము. తనవలన ఆమె సంతోషము పొందవలయును. ఇంతకంటె సుఖమేమి?

ఐశ్వర్యము సమగ్రముగా నుండినను పండితుడై పురుషుడు అయిదు ఇంద్రియములను నిలువరించి ఉండువాడైనచో అంతకంటె సుఖమేముండును? అవమానమును సహించుచు కష్టమునందు మనసు వికలము కాక ఉండుట అను, ఇట్టి స్పష్టములు తెలిసిన ప్రవర్తన కలవానికంటె సుఖవంతుడెవ్వడు? కోరియోకోరికయో నా పుణ్యస్థలమున ప్రాణము విడుచుట కంటె మించిన సుఖము ఏముండును? తల్లిని తండ్రుని దేవతవలె సర్వకాలములలో పూజించుట కంటె మించిన సుఖమే ముండును. ప్రతి మాసమునందును ఋతుకాలమునందే మిథున కర్మమును, ఇతర వ్యక్తులందు మనసు పెట్టక ఆచరించుటకంటె మించిన సుఖమేమి కలదు. నన్ను ఎట్లు చక్కగా పూజించునో, అట్లే సర్వదేవతలయందును శ్రద్ధకలవాడై పూజించువానికి నేను దూరము కాను. అతడు నా విషయమున చెడడు. శుభశీలా! ఈ విధముగా అన్ని లోకముల మేలును గోరి నీవు నన్నడిగిన శుభాశుభముల వినిశ్చయమును నీకెరిగించితిని. (115)

116 వ అధ్యాయము – ఆహారనియమములు, దోషములు

శ్రీ వరాహదేవుడు ఇట్లు పల్కెను. వసుంధరా! మరియొక గొప్పవింతను వినుము. ఇది ఆహార విధికి సంబంధించిన నిశ్చయము. ఏది ఆహారము, ఏదికాదు అను విషయమును గూర్చి వినుము. మాధవీ! నా యోగము కొరకు మితముగా భుజించుచు, సాటిలేని కర్మము చేసియు నరుడు ధర్మము నాశ్రయించినవాడే అగును. కర్మవిధానము తెలిసినవారు, కర్మములకు కట్టుబడి ఉండువారును అగు నరులు ధాన్యములకు సంబంధించిన ఆహారమును నిత్యము తీసికొనుచుందురు. ప్రియా! నా విషయములో కర్మములకు విరుద్ధములైన భోజనములను గూర్చి చెప్పెదను. దారి తప్పిన అట్టి ఆహారముచేత గొప్ప శక్తి కలవానికిని అపరాధము కలుగును. వసుంధరా! మొదటగా, అపరాధములు నాకు రుచింపవు. నరుడు అదియేపనిగా ఇతరుల అన్నమును వృత్తిగా పెట్టుకొని తినుట మొదటి అపరాధము. అది ధర్మమునకు విఘ్నమును కలిగించును. పలుదాము పుల్లలను ఉపయోగింపక (పండ్లు తోముకొనక) నాకడకు చేరుట రెండవ అపరాధము. అది కర్మ విఘ్నము కొరకు ప్రవర్తించుట అగును. స్త్రీ సంగమముచేసి వెనువెంటనే నన్నుతాకు నరుడు మూడవ అపరాధము చేసినవాడని నేను భావింతును. ముట్టుతను చూచి మాకడకు వచ్చుట నాల్గవ అపరాధము. దానిని నేను క్షమింపను. చచ్చినవానిని చూచి ఆచమనము చేయక నన్ను తాకుట అయిదవతప్పు. వసుంధరా! నేను దానిని సహింపను. సంస్కారము పొందని శవమును తాకి నన్ను అర్చించుట అను ఈ ఆరవ తప్పును నేను క్షమింపను. నన్ను పూజించు కాలమున మలవిసర్జమున కరుగుట అనుదానిని ఏడవ దోషముగా నేను సంభావింతును. నల్లని వస్త్రమును చుట్టకొని నన్ను పూజించుట ఎనిమిదవతప్పుగా నేను పరిగణింతును. నా పూజాకాలమునందు అబద్దము పలుకుట తొమ్మిదవ అపరాధము. అది నాకు రుచింపదు. విధానమునకు విరుద్ధముగా నన్ను తాకి అర్చనచేయుట నాకు అప్రియమునకు కారణమగు పదియవ దోషము. కోపముతో చిరచిరలాడుచు నా పూజాకార్యములను చేయుట పదకొండవ తప్పుగా నేను లెక్కింతును. దైవకార్యములకు పనికిరాని పూవులను నా కర్పించుట పండ్రెండవ దోషముగా నేను పరిగణింతును. కుసుమపూవు వంటి ఎఱ్ఱని వన్నెగల వస్త్రము తాల్చి నాకడ కరుదెంచుట పదుమూడవ తప్పు. ఎన్నడైనను చీకటిలో నన్ను తాకుట పదునాల్గవ

దోషముగా నేను లెక్కింతును. నల్లని బట్టకట్టి నా పూజాకార్యములను చేయుట పదునైదవ దోషముగా నేను పరిగణింతును. బట్టలు దులుపుచు నాకడ కరుదెంచుట దోషములలో పదునారవదిగా నేను సంభావింతును, జ్ఞానము లేనివానిని పిలిచి అన్నము పెట్టుటను, పదునేడవ తప్పుగా నేను లెక్కింతును. చేపలు, మాంసములు మెక్కి నా పూజ కరుదెంచుట పదునెనిమిదవ దోషముగా నేను భావింతును. బాతు మాంసము తిని నన్ను దరిజేరుటను పందొమ్మిదవ తప్పుగా నేను భావింతును. దీపమును తాకి ఆచమనము చేయక నన్ను తాకుట, ఇరువదియవ దోషము. వల్లకాటి కరిగి నాకడ కరుదెంచుట ఇరువది యొకటవ తప్పు. తిండితిని నన్నర్చింప వచ్చుట యిరువది రెండవ తప్పుగా నేను సంభావింతును. పంది మాంసమును నాకు నైవేద్యముగా తెచ్చుటను ఇరువది మూడవ అపరాధముగా పరిగణింతును.

నరుడెన్నడైనను మద్యము త్రావి నన్నర్చింప వచ్చినచో, దానిని ఇరువదినాల్గవ దోషముగా నేను పరిగణింతును. కుసుమల కూరను తిని నన్ను పూజించుటకు పూనుకొనుట ఇరువది యైదవ దోషము. ఇతరుల వస్త్రములను తాల్చి నన్ను పూజింప నరుదెంచుట ఇరువది ఆరవ దోషము. పితృదేవతలకు పెట్టక క్రొత్త అన్నమును తినుట ఇరువదియేడవ దోషము. చెప్పులతోపాటు కూర్చుండి నా పూజకు ఉపక్రమించుట ఇరువది యెనిమిదవ తప్పు. శరీరమును మర్దనచేసికొని నాకడకు వచ్చుట ఇరువది తొమిదవ తప్పు. అది చేసినవాడు స్వర్గమును పొందడు. అజీర్ణము పైకొనగా నన్ను సమీపించుట ముప్పదియవ దోషముగా నేను భావింతును. గంధము, పూవులు సమర్పింపక ధూపము నిచ్చుట ముప్పది యొకటవ దోషముగా నేను లెక్కింతును. భేరి మొదలగువాని నాదము లేకుండ నా వాకిలి తలుపు తెరచుట పెద్దతప్పు. అది ముప్పది రెండవ దోషము.

మిక్కిలి శ్రేష్ఠమైనది, చాల గట్టిదిఅగు మరియొక దానిని గూర్చి చెప్పెదను వినుము. పుష్కలమైన ఆ కర్మమును ఆచరించినవాడు నాలోకమున కరుగును. నిత్యము నాయందు లగ్నమైన భావము కలవాడు, నా అర్చనలయందు మిక్కిలి శ్రద్ధ కలవాడు, అహింస పరమ ధర్మమని నమ్మినవాడు, అన్ని భూతముల యందును దయకలవాడు, సమాన దృష్టికలవాడు, పరిశుద్ధుడు, నా మార్గమును ఎన్నడును తప్పనివాడు, ఇంద్రియములపై అదుపు కలిగి సర్వాపరాధములను వదలినవాడును నాలోకమున

కరుగును. ఉదారుడు, ధర్మప్రవర్తన కలవాడు, ధర్మపత్నియందు చెదరని బుద్ధికలవాడు, శాస్త్రముల రహస్యముల ఎరిగినవాడు, పనుల యందు నేర్పరి, నా అర్చనల యందు నిష్ఠ కలవాడు, నా లోకమునకు చేరుకొను. ఈ చక్కని మార్గమున నిలుకడతో నుండి నాలుగు వర్ణములవారును నా లోకమున కరుగుదురు. నామాట నిజము.

పవిత్రయు, సమర్థయు, నా అర్చనల యందు నిలుకడకలదియు, ఆచార్యుల యందు దైవములయందు భక్తి కలదియు, భర్తయందు పుత్రప్రేమ కలదియు అగు ఇల్లాలు సంసారము నందు వర్తించుచున్నదై ముందుగా మరణించినచో నా లోకమున ఉత్తమ స్థానమున నిలిచి భర్త కొరకు ఎదురుచూచుచుండును.

నా భక్తుడగు పురుషుడు, ముందు మరణించినచో భర్తయందు పరమాను రాగముగల ఆమె కొరకు ఎదురు చూచుచు నా లోకమున నిలిచి ఉండును. మరియొక విషయమును కూడ నీకు వక్కాణింతును. ఇది కర్మముల కెల్ల ఉత్తమమైనది. నా మార్గమున చెదరని బుద్ధితో నిలిచిన ఋషులు కూడ, శుచియగు భాగవతుడు నన్నుచూచినట్లు చూడజాలరు.

నా పనుల యందు అధికశ్రద్ధ కలవారై నా పనులు ఈ విధానముతో చేయువారు శ్వేత ద్వీపమును దర్శింతురు నా లోకము నందున్న ఋషులు కూడ ఇతరులకు భక్తితో కనుగొనదగినవారు. నా పూజలందాసక్తి కల మనుష్యుల సంగతి చెప్పనేల?

మాధవీ! మూఢులు, పాపబుద్ధి కలవారునై ఇతర దేవతలయందు భక్తిచూపువారు, మాయ కమ్మినబుద్ధి కలవారై ఎన్నటికిని నన్ను పొందజాలరు. మోక్షమును కాంక్షించి ననే శరణు పొందు నిశ్చలభావము కలవారిని నా పురమునకు నేను చేర్చుదును. నీకు నా యందు పరమభక్తి కలదు. నిన్ను నేను ప్రీతితో ధరించితిని. కావున పరమ రహస్యమైన ఈ ధర్మమును నీకు చెప్పితిని.

ఓ మాధవీ! లోభికి, మూర్ఖునకు, దీక్షలేనివానికి, పనిగట్టుకొని దరిజేరనివానికి దీని నొసగరాదు. నా పూజాకార్యముల యందు పరమశ్రద్ధకల భాగవతుని తప్పించి, గురూపదేశము పొందనివాడు, మొండివాడు అగు పురుషునకు దీని నొసగరాదు.

దేవీ! గొప్ప శక్తిగల నా ధర్మమును నీకు చెప్పితిని. సర్వలోకముల మేలుకొరకు మరల ఏమి అడుగుదువో అడుగుము అని వరాహమూర్తి తెల్పెను. (116)

117 వ అధ్యాయము - దేవార్చనా విధాన వర్ణనము

మరల భగవానుడు అగు వరాహదేవుడు "భద్రా! ప్రాయశ్చిత్తమును ఉన్నదున్నట్లు విధిననుసరించి చెప్పెదను వినుము. అంతేకాక ఏ తెలివితో నా భక్తునకు దాన మొసగవలయునో చెప్పెదను. తలంటు స్నానము, నలుగుబెట్టుట, సామాన్యముగా చేసెడు శివస్నానము అను నాకు ప్రియమైనవి యెట్లు ఒసగవలయునో తెలిపెదను వినుము. ఉషఃకాలమున నిద్రలేచి తగువిధమైన భేరిని మ్రోగింపవలయును. భేరి మోగించుటకు వీలుకానిచో తలుపులనైన శబ్దము చేయవలయును. కుడిమోకాలితో ఇరువది రెండు పదములు 'నమో నారాయణాయ' అని పలుకుచు తిరుగుచు ఈ క్రింది మంత్రములు పలుకవలయును. **"దేవతా తపవస్వయ ఆదిమధ్యావసాన అవ్యక్త అవ్యయ బుధ్యస్వ, తవ కర్మణాం సంహారకర్తా చ ఆగతం విజ్ఞాహి తవ కర్మణ్యవస్థితం"** ఈ మంత్రముతో తలుపులను తెరవ వలయును. పలుదోము పుల్లను సమర్పింప వలయును. భూమిని తాకకుండ దీపము వెలిగింపరాదు. దీపము వెలిగించిన పిదప చేతిని శుద్ధి చేసికొనవలయును – కడిగికొని మరల లోనికి వచ్చి విగ్రహపు చరణములకు మ్రొక్కి దంత ధావనం కావింపవలయును. పిదప మంచినీరు తెచ్చి దంతములను శుభ్రముచేసి, ఏదొసగులేని వాడు, ఏపక్ష పాతములేనివాడు అగు భక్తుడు ఈ మంత్రమును ఉచ్చరింపవలయు భూదేవీ! ఇది నీవు నన్నడిగినదానికి సమాధానము.

"ఓం మంత్రా ఊచుః భువనభవన, రవిసంహరణ, అనంతో మధ్యస్థశ్చేతి. గృహ్ణేమం భువనం దంతధావనం." దంతములను తోముట ముగిసిన పిదప మిగిలిన జలములను భక్తుడు తన శిరసును భక్తితో చల్లుకొనవలయును. పిదప నీటితో పవిత్రమగు చేతితో కొంచెముపాటి నీటితో స్వామికి ముఖ్య కార్యములను చేయవలయును. ముఖము కడుగునపుడు చెప్పవలసిన మంత్రమును, సుందరీ నా వలన వినుము. ఈ మంత్రముతో ఆ పని చేయువాడు సంసారము నుండి ముక్తి పొందును. "**మంత్రా ఊచుః జలం గృహ్యే దేవ హర్తా కర్తా వికర్తా ఊచతాహవాం త్వాం గుణశ్చ ఆత్మనశ్చాపి గృహ వారిణశ్చాపి."** ఇట్లు అంతట దేవతల ముఖ ప్రక్షాళనము చేసి, ఇట్లు మంత్రములతో పూజించి ధూపములతో నైవేద్యములతో సుగంధములు మరల స్వామికి సమర్చింపవలయును. పిదప భగవంతుడు, భక్తవత్సలుడు అయిన స్వామికి పూలదోసిలి నారాయణాయ అని పలికి ఈ మనమును

పఠింపవలయును. " **ఓం మంత్రా ఊచుః: యజ్ఞానాం యజ్ఞయష్టాయం భూతస్రష్టారమేవ చ."** జ్ఞానము కలవాడు, పవిత్రుడునగు భక్తుడు ఈ విధముగా భగవంతుని కొరకు పూవులను పూజాకర్మములు అన్నింటితో కూడినవాడై సాష్టాంగపడి నమస్కరింప వలయును. ఇట్లు సాష్టాంగ నమస్కారము చేసి జనార్దనుని ప్రసన్నుడవు కమ్మని ప్రార్థించి శిరస్సున దోయిలి చేర్చి ఈ మంత్రమును పలుకవలయును. "**ఓం మంత్రా ఊచుః: లబ్ధ్వా సంజ్ఞామపి నాథ ప్రసన్నేచ్ఛాతః సంసారాన్ముక్తయే – అహం కర్మ కరోమి. యత్త్వయా పూర్వముక్తం మే ప్రసీద తు."** అని ఇట్లు మంత్రవిధిచే అనుష్ఠించి నాభక్తియందు నిలుకడకలవాడై పూజ ముగియు నంతవరకు వెనుకవైపుగా నడచుచు (భగవంతుని వైపు ముఖము నిలిపి) వస్తువులను అన్నింటిని కూర్చుకొని మిక్కిలి శ్రద్ధకలవాడై తైలముతోగాని, నేతితో కానీ నాకు తలంటు స్నానమును సమర్పింపవలయును. మంత్రములను ఎఱిగినవాడు, క్రియలయందు నేర్పుగలవాడు అగు భక్తుడు తైలమును గూర్చి మనసు నేకాగ్రము చేసికొని ఈ మంత్రమును పలుకవలయును. "**ఓం మంత్రా ఊచుః: స్నేహం స్నేహేన సంగృహ్య లోకనాథమయా హృతం. సర్వలోకేషు సిద్ధాత్మా దదామి ఆత్మహస్తే2హమన్యప్రోక్తం మన్నమస్తవేతి నమో నమః"** అనుచు ఇట్లు మంత్రములతో భగవంతుని ప్రార్థించి మొదట నూనెను శిరమున ఉంచవలయును. తరువాత కుడివైపు అంగముల యందును, పిదప ఎడమవైపునను ఉంచవలయును. తరువాత వెనుకవైపు నీటితో కడుగవలయును. పిదప నడుమునకు నూనె వలయును. అటుపై భూమిని ఆవుపేడతో అలుకవలయును. ఓ వసుంధరా! ఇట్లు నా మార్గము ననుసరించి అనులేపనము చేయువాడు పొందు పుణ్యములను వింటివా? అట్లు స్వామికి పూయుచున్న జలబిందువు లెన్నిగలవో అన్నివేల ఏండ్లు ఆతడు స్వర్గ లోకమున ప్రతిష్ఠ పొందును. తాను పుణ్యములతో సాధించిన లోకములను మలముతో అలుకుకొన్నవాడు (ఘోర పాపములు చేసినవాడు) ఈ ఆవుపేడతో ఒక్కమారు అలికిన పుణ్యముతో ఆ పాపముల నుండి విముక్తుడగును. ఇట్లు విశిష్టమైన విధానముతో నాకు అభ్యంజనము చేయువాడు. ఆ నూనెలో, లేదా నేతిలో ఎన్ని బిందువు లుండునో అన్ని వేల ఏండ్లు నా లోకమున స్థిరముగా నివసించును. భద్రా! ఇక నలుగుబెట్టుటను గూర్చి చెప్పెదను. అది నాకు ప్రియమైనది. భకులు దానితో సంతోషింతురు. నాకు వశమగుదురు. దానివలన నాకు విశుద్ధి కలుగును.

చేతితో చేసిన పిండితోగాని, పిండిగా అయిన చూర్ణముతోగాని నా దేహమునకు సుఖము కలుగునట్లు నలుగు బెట్టవలయును. నా కర్మమును అనుసరించు అట్టి వానికి పరమసిద్ధి కలుగును. ఇట్లు నలుగుబెట్టి తక్కిన పనులన్నియు ముగించి నా మనసునకు ప్రియము కలిగించు స్నానమును చేయింప వలయును.

అటుపై ఉసిరిక, వస, ఇప్ప, గోరింట, రావి, రోహిణం, అశ్వపర్ణం మొదలగు ఉత్తమ ద్రవ్యములతో నా అన్ని అవయవములను మర్దింపవలయును. అటుపై నీటికుండను పట్టుకొని ఈ మంత్రమును పఠింప వలయును. "**ఓం మంత్రా ఊచుః: దేవానాం దేవదేవో2సి దేవ అనాది అనంత వ్యక్తరూప స్నానం గృహ్య మాం.**" నా పనియందు శ్రద్ధగలభక్తుడు బంగారు కుండతో గానీ, వెండికుండతో కానీ, లభింపనిచో రాగికుండతో గానీ నాకు ఉత్తమముగ స్నానమును, విధానమెరిగినవాడై, చేయింపవలయును. ఇట్లభిషేకము గావించి శాస్త్రము చెప్పిన విధానము ననుసరించి శ్రేష్ఠమగు గంధమును మంత్ర పూర్వకముగా సమర్పింపవలయును. "**ఓం మంత్రా ఊచుః : సర్వగంధాః సర్వసౌగంధిభిశ్చ సర్వే వర్ణా యే కేచిద్ విధివర్ణ త్వయాదత్తం సప్తలోకేషు దేవ తవదేహే నమతి సుగంధం మదా జ్ఞాశ్చసమావహ మయం శుచి.**" యిట్లు గంధముల నొసగి శ్రేష్టమగు కర్మమును ఆచరింప వలయును. అనంతరము చక్కని యోగ్యములగు పూలమాలలను సమర్పింవలయును. ఇవి విధానము నెరిగిన కర్మకుశలుడు మాలార్చనము గావించి పుష్పములను దోయిలినిండుగా సమర్పించి ఈ మంత్రమును పలుకవలయును. "**ఓం మంత్రా ఊచుః : జలజం స్థలజం చైవ పుష్పం కాలోద్భవం శుచిః | మమ సంసారమోక్షాయ గృహ్య గృహ్య మమాచ్యుత.**" ఇట్లు విశ్వమున లభించు పుష్పములతో నన్ను ప్రియమార అర్చించి తరువాత మంచి సువాసనలుగల ధూపములను నాకు సమర్పింపవలయును. విధిని బట్టి కూర్చిన ధూపమును చేత దాల్చి రెండు వైపుల త్రిప్పుచు ధూప మంత్రమును పలుకవలయును. "**మంత్రా ఊచుః : శాంతిదేవతా మే కోష్ఠే వసంతి శాంతి మే సాంఖ్యానాం శాంతి యోగినాం గృహ్యాం ధూపం మమ సంసార మోక్షణం త్రాతారం నాస్తి మే కశ్చిత్ త్వాం విహాయ జగద్గురో.**" ఇట్లు పూలమాలలతో, గంధపు పూతలతో చక్కగా అర్చనము గావించి తరువాత తెల్లనిది, పచ్చని అంచులు గలదియగు పట్టువస్త్రమును సమర్పింపవలయును. ఇట్లు వస్త్రమును పట్టుకొని శిరసున దోయిలించి

చక్కని ధ్యానముతో ఈ మంత్రమును పలుక వలయును. **"ప్రీయతాం భగవాన్ పురుషోత్తమః శ్రీనివాసః శ్రీమానానందరూపః గోప్తా కర్తా ఆదికాలాత్మక భూతనాథ ఆదిరవ్యక్తరూపః క్షౌమం వస్త్రం వాసితాశ్చ మనోజ్ఞ దేవ గృహ త్వం గాత్ర ప్రచ్ఛాదనాయ చ."** అని పలికి పుష్పమును పట్టుకొని ఓంకారము తొలుత నుండునట్లు ధర్మము పుణ్యము అగు మంత్రముతో ఆసనమును కూర్పవలయును. **"ఇదం పరనాథ పరస్పర శాస్త్ర పరప్రమాణ ప్రమాణినాం చైవ తిష్ఠన్ కల్పయోపయుక్త మాత్మానం సత్యం సదేవ గృహ్ణ."**ఇట్లు నేను చెప్పిన మార్గమును అనుసరించి సమర్పణము గావించి వెనువెంటనే ముఖ ప్రక్షాళనమును మంత్రపూర్వకముగా చేయవలయును. **"శుచిస్తవేతి దేవానామేవం చైవ పరాయణం || శౌచార్థం తు జలం గృహ్ణ కృత్వా ప్రాపణముత్తమమ్."** ఇలా భోజనం పెట్టి, ముఖప్రక్ష్యాళన చేసి, నైవేద్యం అక్కడనుంచి తీసి, అప్పుడు తాంబూలం పట్టుకుని, ఈ మంత్రం చదవాలి. **"మంత్రా ఊచుః: అలంకారం సర్వతో దేవానాం ద్రవ్యోపయుక్తః సర్వ సౌగంధికాదిభిర్గృహ్య తాంబూలం లోకనాథ విశిష్టమస్మాకం చ భవనం తవ ప్రీతిర్మేభవం."** ముఖమునకు ఇంపుకలిగించునది, మనోహరమైనదియగు తాంబూలమును ప్రీతితో కొసగితిని. దేవా! శ్రేష్టమగు దీనిని గ్రహింపుము.

నా భక్తుడు ఈ ఉపచారముతో పూజను గావించి సంసారబంధమును విడివడి నామహా లోకములను నిత్యము చూచుచుండును" అని తెల్పెను. (117)

118 వ అధ్యాయము - నివేదన విధాన వర్ణనము

ఇట్లు సంసారము నుండి విముక్తి కలిగించు పూజా విధానమును విని, భూదేవి ప్రసన్నమగు ముఖముగల దేవునితో మరల ఇట్లు పలికెను. "నీ మార్గము ననుసరించువాని గొప్ప శక్తిగల కర్మమును గూర్చియు, నీకు నైవేద్యము నొసగుటను గూర్చియు, దేవా! నేను ప్రీతితో వింటిని. నివేదనము ఏ వస్తువుతో కూడినదియో, మాధవా! నాకు తెలియజెప్పుము."

భూదేవి పలుకువిని గొప్ప ఆత్మ కలవాడు, ధర్మజ్ఞుడు, వాక్య కోవిదుడు అగు వరాహ దేవుడు ధర్మముతో కూడుకొన్న విధముగా ఇట్లు పలికెను. నాకు నైవేద్యమును మంత్ర పూర్వకముగా ఒసగ వలయును. ఏడు విధములగు ధాన్యములను పాలతో పాటుగా గ్రహించి, కూరలను, ఇప్పపూవులను, మేడిపూవులను నాకు సమర్పింపవలయును.

ఇంకను ఇట్టిపనికి ఉపయోగపడునవి వందలకొలదిగా వేలకొలదిగా కలవు. వానిని నేను చక్కగా చెప్పియుంటిని. మాధవీ! నా నివేదనమునకు ఉపయోగింపదగిన ధాన్యములను చెప్పెదను. స్థిరమగు చిత్తముతో ఆలకింపుము. ధర్మచిల్లిక శాకము, సుగంధము, రక్తశాలికములు, దీర్ఘశాలి, మహాశాలి, వరకుంకుమము, మక్షికము, ఆమోదములు, సివసుందరి, శిరిక, కుల, కాలికములు మొదలగునవి ఉపయోగపడునవిగా కర్మజ్ఞుడు తెలియదగును. పప్పుధాన్యములలో పెసలు, మినుములు, నూవులు, కొఱ్ఱలు, ఉలవలు, అడవి వడ్లు, మహామోహము, మకుష్టము, వాహిజము అనునవి ఈ కర్మమునకు పనికి వచ్చునవి. ఓ వసుంధరా! ఇంకను చామలుకూడ నైవేద్యమునకు యోగ్యములు. ఇంకను భాగవతులకు ప్రియమైన వానిని నేను గ్రహింతును. వ్యంజనములను గూర్చి చెప్పెదను వినుము.

పశువుల పాలు మొదలగువానిలో ఏవి ఉపయోగింపదగినవో చెప్పెదను. గోవు పెరుగు, పాలు, నెయ్యి నాకు ఒసగదగినవి. గేదె, గొఱ్ఱె, మేక అనువాని పాలు మొదలగునవి యజ్ఞమునకు పనికి రానివిగా చెప్పుదురు. లేడి, పొటేలు, కుందేలు అనువాని మాంసము నాకు ప్రియమైనది. కనుక నైవేద్యమున నాకొసగదగును. వేదము కడదాక చదివిన బ్రాహ్మణుడు యజ్ఞమునందును వీనిని వాడుచుండును. ఆ యజ్ఞము నందు నాకును ఆ పశువు మాంసము నందు భాగము కలదు. గేదెపాలు, పెరుగు, నెయ్యి అనువానిని విషయమున వదలి పెట్టవలయును. విష్ణు సంబంధమైన పూజలో యజర్వేద మంత్రములతో చేయుదానిలో మాంసములను ముఖ్యముగా ఒంటిగిట్టలుగల జంతువుల పాలు, మాంసము మొదలగు వానిని పరిహరింపవలయును.

నా పూజలయందు ఉపయోగింపదగిన పక్షులను గూర్చి తెలిపెదను వినుము. కాకురమాంసము, నెమలి, కోడి, లావుకపిట్ట, వార్తికము, కముజుపిట్ట, వేణుకము, కణికము, గొప్ప శక్తిగల సమాతము, కుకురము అనువాని మాంసములు నాకు ప్రియమైనవి. అట్లే పంచ కోటకము, ఖారిక, అనునవియు పక్షులలో ఇష్టములైనవి. పక్షులలో నల్లని రెక్కలు కలదానిని నాకు ఒసగరాదు. కాని గిరివర్తికము, పదవిలాసకము, చితము, అంగకపోతము అను నాలుగు పక్షిజాతులు పూజకు ఉపయోగింపదగినవి. ఇవియు, మరియు వందలకొలది వేలకొలదిగా నా పూజలయందు ఉపయోగింపదగినవి

కలవు. వీనిని చక్కగా తెలిసికొని పూజాకార్యము నొనరించు వాడెన్నటికిని అపరాధము చేయువాడు కాదని నేనే పలుకుచున్నాను. నాకును, నా భక్తులకును సుఖము కూర్చెడు భోజ్యములు, మంగళవస్తువులు అను వానితో ఉత్తమసిద్ధి కోరువాడు పూజలను ఆచరింపవలయును.

ఈ విధానముతో పూజనొనరించువారు నా పూజను ముగించినవారై పరమసిద్ధిని పొందెదరు. (118)

119 వ అధ్యాయము - శ్రీమన్నారాయణ పూజా విధానము

మరల వరాహదేవుడు ఇట్లనెను. దేవీ! నీవు నన్నింతకు ముందడిగిన సంసారతరణమును గూర్చి మిక్కిలి రహస్యమగు దానిని చెప్పెదను వినుము. “నా పనులయందు పరమశ్రద్ధ కలవారు, విధి ననుసరించి స్నానమాచరించి చెడ్డకూడు తినువారైనను ఇంద్రియ నిగ్రహము కలవారై నాకడ కరుదెంతురు. సుందరీ! నాసనాతనమగు రూపము అని చెప్పబడుచుండునదియే సర్వము, సనాతనము అయిన నేను. క్రిందివైపు, పైవైపు, అన్ని దిక్కులలో క్రింది మీదులందును నెలకొని ఉన్నవాడను నేనే. కావున నా భక్తుడు పరమగతిని కోరువాడైనచో అన్నివిధముల అందరిని అన్నింటిని పూజాదికార్య సముదాయముచేత నమస్కరింపవలయును.

నా మార్గము ననుసరించు వారికి ఎట్లు వందనము చేయవలయునో గొప్పకీర్తికలది అగు ఆ రహస్యమును కూడ నీకు తెలిపెదను. పరమమైన అర్చనను గావించి, బుద్ధిని నిలుపుకొని, తూర్పునకు మొగముంచి, పరిశుద్ధుడై దోసిలితో నీటిని గ్రహించి, మనస్సును పరమాత్మపై నిలిపి, ఈ మంత్రమును పలుకవలయును. **“యజామహే ధర్మపరాయణోద్భవం నారాయణం ప్రసీదేశాన | సర్వలోకప్రధానం పురాణం కృపాసంసారమోక్షణం.”** మరల పడమటివైపు మొగము పెట్టి దోసిలిలోనికి నీటిని గ్రహించి 'ఓం నమో నారాయణాయ' అని పలికి ఈ మంత్రమును పఠింపవలయును. **“ఓం మంత్రా ఊచుః: యథామదేవః ప్రథమాదికర్తా పురాణకల్పం చ యథా విభూతిః |దివి స్థితాచాదిమనంతరూప మమోఘమోఘం సంసారమోక్షణం."** అటుపిదప మరల నీటి దోసిలిని గ్రహించి అదే యోగముతో ఉత్తరమువైపు ముఖము ఉంచి 'ఓం నమో నారాయణాయ' అని పలికి ఈ మంత్రమును పఠింపవలయును. **“మన్త్రోచ్యతే: యజామహే దివ్యపరం**

పురాణమనాదిమధ్యాన్తమనంత రూపం భవోద్భవం సంసారమోక్షణం". వెనువెంటనే దక్షిణమునకు మొగము పెట్టి 'ఓం నమః పురుషోత్తమాయ' అని పలికి మంత్రమును చదువవలయును. **"మంత్రా ఊచుః : యజామహే యజ్ఞమహోరూపజ్ఞం కాలం చ కాలాదికమప్రమేయం అనన్యరూపం సంసారమోక్షణం."** పిదప సమిధల పని ముగించి ఇంద్రియ నిగ్రహము కలవాడై అచ్యుతుని యందు మనస్సును నిలిపి ఈ క్రింది మంత్రమును చదువవలయును. **"మంత్రా ఊచుః : యజామహే సోమపథేన భావే త్రిసప్తలోకనాథం | జగత్ప్రధానం మృత్యురూపం సంసారమోక్షణం."**

ఈ తీరుగా బుద్ధియ ప్రజ్ఞయుగల భక్తుడు, పరమగతిని కోరువాడైనచో ఈ పూజా విధానములు మూడు సంధ్యల యందును భక్తితో చేయవలయును. ఇది యోగములలో పరమయోగము, రహస్యములలో ఉత్తమ రహస్యము. జ్ఞాన మార్గములలో పరమసాంఖ్యము. కర్మములతో ఉత్తమకర్మము. ఈ యోగమును మూర్ఖునకు, పిసినిగొట్టునకు, మొండివానికి ఒసగరాదు. ఉత్తమ శిష్యుడు, గట్టిగుండె నిబ్బరము కలవాడు అగు దీక్షితునకు మాత్రమే ఒసగవలయును. శ్రీ మహావిష్ణువు ఉపదేశించిన ఈ రహస్యమును బుద్ధి ప్రజ్ఞగల వాడై భక్తుడు చావు దాపురించినపుడును మరువరాదు. ప్రతి దినము ప్రాతః కాలమున నిద్రలేచి ఏమాత్రము చెదరని వ్రతము కలవాడై దీనిని పఠించువాడు సత్త్వ గుణముతో కూడినవాడై నా హృదయమున శాశ్వతముగా నిలుచును. ఈ విధానముతో మూడు సంధ్యలయందును కర్మము నాచరించువాడు పశుపక్ష్యాదుల కడుపున పుట్టినను నాలోకమున కరుగును. (119)

120 వ అధ్యాయము - గర్భవాసదుఃఖము పొందింపని ఉత్తమ ధర్మములు

శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "ఓ మాధవీ! దేనిచేత మనుజుడు గర్భవాసము పొందకుండునో ఆ సర్వధర్మ వినిశ్చియమును చెప్పెదను వినుము. గొప్పపని చేసియు తన్నుతాను పొగడుకొనక నిర్మలమగు మనస్సుతో పెక్కు సత్కర్మములు ఆచరించువాడు. నాకు ప్రియమైన నా పూజాది కార్యములు చేసియు అహంకారము పొందనివాడు, క్రోధమును తాల్పనివాడు. మనస్సుతో సమమును దర్శించుచు, లాభనష్టములను పట్టించుకొనక అయిదు ఇంద్రియములపై అదుపుకలిగి, ఆ నిగ్రహమున ప్రీతికలవాడు... కార్యము, అకార్యములను చక్కగా ఎరుగువాడు, ధర్మములన్నింట

నిష్ఠకలవాడు, చలి,వేడి, గాలి, ఆకలి దప్పి అనువానిని సహించువాడు... దరిద్రుడయ్యును, పనులయందు సోమరితనము లేనివాడు, సత్యమే పలుకువాడు, అసూయ లేనివాడు, ఎల్లప్పుడు తన భార్యయందే మనసు కలవాడు, ఇతరుల భార్యలను మోహింపనివాడు... సత్య స్వరూపమగు పరమాత్మను గూర్చియే పలుకువాడు, విశుద్ధమగు అంతరంగము కలవాడు, నిత్యము భగవద్భక్తులయందు ప్రియము కలవాడు, వివేకవంతుడు, విశేషముల నెరుగువాడు, బ్రహ్మజ్ఞానుల యందు పుత్రప్రేమ కలవాడు... ప్రియములగు మాటలు పలుకువాడు, ద్విజులయు, నాయొక్కయు కార్యములయందు ఇద్ధికల వాడుగు భక్తుడు పాడుకడుపులలో పడడు. నాలోకమునకు చేరుకొనును. వసుంధరా! నా పూజయందు మిక్కిలి ఆసక్తికల నరుడు వేరుజాతుల కడుపులో పడకుండుటను గూర్చి వివరించి చెప్పెదను వినుము.

ప్రాణులను హింసింపడు. సర్వప్రాణుల మేలును కోరుచుండును. పరిశుద్ధుడై అన్నింటిని సమానముగా చూచును. బంగారమును మట్టి పెళ్లవలె భావించును. చిన్నవయసు నందున్నను క్షమ, దయను కలవాడై పుణ్య కార్యముల యందాసక్తి కలిగి యుండును. మంచి పనులనే తెలిసికొనును. పగవాడు కీడుచేసినను పట్టించుకొనడు. చేయవలసినదానిని మరవడు. అబద్ధములు వాగడు. మోసముల నుండి మరలును. ఒక నిశ్చయమునకు వచ్చి దానిని తుదిముట్ట సాధించును. ఎల్లప్పుడు ధృతి కలిగి యుండును. చాటుమాటున ఆక్షేపింపడు. తన ఇల్లాలిని మాత్రమే కేవలము సంతానము కొరకు ఋతుకాలమున మాత్రమే పొందును. భూదేవీ! ఇట్టి నరులు నా కర్మమున మిక్కిలి శ్రద్ధ కలవారై వేరు జాతుల గర్భములందు పడరు. నా లోకమునకే చేరుకొందురు.

వసుంధరా! మరల ఇంకొక విషయమును చెప్పెదను వినుము. ప్రపన్నులగు పురుషులకు సనాతనమగు ధర్మమేదియో తెలిసికొనుము. మనువు, అంగిరసుడు, శుక్రుడు, గౌతముడు, సోముడు, రుద్రుడు, శంఖుడు, లిఖితుడు, కశ్యపుడు, ధర్ముడు, అగ్ని వాయువు, యముడు, ఇంద్రుడు, వరుణుడు, కుబేరుడు, శాండిల్యుడు, పులస్త్యుడు, ఆదిత్యుడు, పితృదేవతలు, స్వయంభువగు బ్రహ్మ – వీరందరు ధర్మమును వేరువేరు విధములుగా దర్శించిరి.ఆయా నరులు తమతమ ఆత్మలయందు ధర్మము విషయమున నిశ్చయమైన వ్రతము గలవారు. ఎవరి ధర్మమును వారు పాలింతురు. తమ అభిప్రాయమునే ధర్మముగా

వక్కాణించిరి. ధర్మములన్నింటి యందును నిశ్చయబుద్ధి కలవాడై యితరులను నిందింపరాదు. తన ధర్మమునందు తాను గట్టిగా నిలిచి ధర్మకార్యములను తూలనాడకుండవలయును. ఈ గుణములతో చక్కని పొందిక కలిగి నా పనులు చేయుచుండువాడు పశుపక్ష్యాది యోనులలో ప్రవేశింపడు. నాలోకమున కరుగును. మాధవీ! గర్భమను సంసార సాగరమునుండి తరించు మార్గమును మరియొక దానిని వక్కాణించెదను. వినుము. ఇంద్రియములను గెలిచినవారు, క్రోధముపై అదుపు కలవారు, లోభమోహములను వదలివైచినవారు, తన పరిణతస్థితియందు ప్రీతి కలవారు, ప్రతిదినము దేవతలను,అతిథులను, పితృదేవతలను ప్రీతిగాచూచువారు. హింసమొదలగు నీచకార్యములను చేయనివారు, మద్యమాంసములను ముట్టనివారు, నిత్యము గోవులకు వందనమాచరించువారు, సురాపానము చేయనివారు... బ్రాహ్మణవనితను మనస్సునందు – దుష్టభావముతో పొందనివాడు, విప్రునకు కపిలగోవును దానమొసగువాడు, ముదుసలిని మంచి మన్ననతో పరిరక్షించువాడు.... కుమారు లందరిలో భేదబుద్ధిని చేయనివాడు, మిక్కిలి కోపగించిన బ్రహ్మవేత్తను చూచి ప్రసన్నుని చేయువాడు... కపిలగోవును భక్తితోతాకువాడు, కన్యను చెఱుపనివాడు, అగ్నిని కాళ్లతో తాకనివాడు, కొడుకుతో వివాదము చేయనివాడు, నీటిలో మలమూత్రము వదలనివాడు, గురువు పలుకును వెక్కిరింపని వాడు. ఇట్లెట్లు ధర్మముతో కూడినవాడై నన్ను పొందెడువాడు గర్భవాస దుఃఖమును పొందదు. నాలోకమున కరుగును. (120)

121 వ అధ్యాయము - తరుణోపాయం, కోకాముఖ తీర్థ మహిమ

శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! పశుపక్ష్యాది జన్మములందినవారు కూడ పాపము నుండి విడివడు మిక్కిలి రహస్యమును వినుము. అష్టమి, చతుర్దశి, అమావాస్య తిథుల యందును, సంక్రాంతి, గ్రహణ కాలములందును మిథున కర్మమును చేయని వాడును ఇతరుని అన్నములు తిని పెట్టినవారిని రోతపడనివాడు, పిన్న వయసునందును నా యందు చెదరని వ్రతము కలవాడు... ఏ కొంచెము లభించినను తృప్తినందువాడు, తల్లిదండ్రులను పూజించువాడు, లభించిన దానిని తాను మాత్రమే తినక ఇతరులకును పంచి అనుభవించువాడు... అన్ని పనులయందును లోభితనము లేనివాడు, స్వతంత్రుడు, తన్నుదాను అదుపున

నుంచుకొనువాడు, పాడుపనులు చేయనివాడు, కుమార వ్రతమునందు (బ్రహ్మచర్య మందు) స్థిరముగా నిలిచి యుండువాడు... ఎల్లప్పుడు సర్వభూతములయందును దయగలవాడు, వివేకము కలవాడు, సత్యము తప్పనివాడు, బుద్ధిమంతుడు, ఇతరుల సొమ్ములకొఱకు ఎన్నడును ఆశపడి తాపము పొందనివాడు. ఇట్టి బుద్ధి నలవరచుకొని నా పూజా క్రియలను ఆచరించువాడు పశువుల పుట్టుక పొందడు, నాలోకమున కరుగును.

దేవతలకును సాధింపరాని ఈ రహస్యమును నేను చెప్పుచున్నాను. సుందరీ! శ్రద్ధగా వినుము.స్వేదజములు (చెమటవలన పుట్టునవి) ఉద్భిజములు, (విత్తనమును చీల్చుకొని పుట్టునవి) అండజములు (గ్రుడ్డు నుండి పుట్టునవి) జరాయుజములు (రక్తశుక్లముల కలయిక వలన పుట్టునవి) అను నాలుగు విధములైన ప్రాణులలో వేనిని హింసింపనివారు, శుద్ధమైన బుద్ధిగలవారు, అన్ని ప్రాణులయందును జాలి నిండుగా గలవారు, కోకావు, క్షేత్రమున తుదిశ్వాస విడుచువారును... ఇతరులకు మనస్సుతోకూడ సాధ్యముకాని నాలో లీనమగుటను పొందుదురు అని తెలుపగా, అంత విష్ణుని పలుకు విని అతి విశుద్ధమైన వ్రతములుగల భూదేవి వరాహ రూపుడగు ఆ విష్ణు దేవునితో మరల ఇట్లు పలికెను.

“మాధవా! నేను నీకు శిష్యను, దాసిని, నీయందు భక్తురాలను. ఇట్టి పరమ రహస్యములను నీవు నాకు చెప్పవలయును. నీవు చక్రతీర్థమును, వారణాసిని, అట్టహాసమును, నైమిశమును, భద్రకర్ణమను మడుగును, కోకాముఖ తీర్థమును ఏల ప్రశంసింతువు? సుగంధము, ద్విరండము, ముకుటము, మండలేశ్వరము, కేదారము అను పుణ్య భూములను వదలి కోకాముఖము(బరహచ్ఛేత్ర – అన్న పేరుతో, కోకా కోశి నదుల సంగమ స్థానంగా ప్రస్తుతం నేపాల్ లో ఉన్నదీ ఆలయం) నేల కొనియాడుదువు? దేవదారు వనము, జాగేశ్వరము, మహాలయ దుర్గమను పుణ్యస్థలములను కాక కోకాముఖమును ఏల పెద్దగా చెప్పెదవు? గోకర్ణము, శుద్ధమగు జాలేశ్వరము, ఏకలింగము అనువానిని వదలి కోకాముఖము నేల గొప్పగా చెప్పెదవు?” అని భక్తితో ఆ మాధవి యిట్లడుగగా, మాధవుడు వరాహ రూపియగు భగవంతుడు వసుంధరకు ఇట్లు బదులు చెప్పెను.

“పుణ్యాత్మురాలా! నీవు నన్ను అడిగినది మనోజ్ఞమైన విషయము. కోక ఏల అన్నింటి కంటె మిన్న అయినదో ఆ రహస్యమును వివరించెదను. నీవు ప్రశంసించిన

క్షేత్రములన్నియు రుద్రునకు నిలయములగు పాశుపత క్షేత్రములు. శ్రేష్ఠములైనవి. కాని కోక భగవద్భక్తునకు సంబంధించినది. ఓ వరాననా! సుందరీ! నీకు నా క్షేత్రములలో కోకాముఖమున జరిగిన ఒక గొప్ప వృత్తాంతమును వివరించెదను. ఒకప్పుడు ఒక బోయవాడు కోక మండలమున మాంసరూపమగు ఆహారమునకై తిరుగుచు కొంచెముపాటి నీరుగల మడువునందు నడుమనున్న చేపను మెలకువతో కొట్టెను. బలముగల ఆ చేప బోయచేతినుండి తప్పించుకొని దూరమునకు దూకి పడెను. ఒకడేగ ఊర్పులు పుచ్చుచు ఆకసమున తిరుగుచు ఆ చేపను చంప నుంకించెను. అప్పుడది నా క్షేత్రమగు కోకాముఖమున వ్రాలెను. అంత అది రూపము, బలము, పరిశుద్ధత కలదియై శకుడను వాని పుత్రుడై పుట్టెను. అంత కొంత కాలమునకు మృగముల వేటకాడొకడు కోకమున తిరుగుచు ఆ మాంస భాగములను తీసికొని అచటకు వచ్చెను. అంత మాంస మును హరించు కోరికగల ఆడుపిట్ట ఆకసమున నెగురుచు ఆతావునకు వచ్చి మాంసము తీసుకొని పోవుటకై చూచుచుండెను. ఆ బోయవాడు మాంసము నెగురుగొట్టి కొనిపోవు ఆ పిట్టను ఒక్క బాణముతో నేలగూల్చెను. ఆకాశము నుండి నేలగూలిన ఆ పిట్ట నాక్షేత్రమగు కోకయందు పడి చంద్ర పురమున చక్కని పేరు ప్రతిష్ఠలుగల రాజపుత్రియై పుట్టెను. ఆమె చక్కగా పెరిగెను. అరువది నాలుగు కళలలో ఆరితేరెను. రూపము, యౌవనము నిండుగా పొందెను. కాని మగవానిని చీదరించుకొనుచుండెను. రూపవంతుడు, గుణవంతుడు, శూరుడు, యుద్ధతంత్రములలో నిలుకడ కలవాడు, సౌమ్యుడు అయినను పురుషుని ఆమె కాదని ఏవగించుచుండెను.

అంత కొంతకాలమునకు నా కోరికమేరకు, ఆనందపురమున శకునితో వారికి సంబంధము సాగెను. అట్లు సంబంధము కలుగగా విధి విధానమునుసరించి వివాహము జరిగెను. ఆతడామెతో, ఆమె అతనితో ఒక్క మహూర్తమైనను వేరుపడక పరస్పరాను రాగముతో విహరించిరి. ఇట్లు వారికి ఏ దోషములేకుండ చాలా కాలముగడచెను. నాయిక అతని యందు ప్రేమతో, స్నేహముతో కూడి యుండెను. ఇట్లు వారిరువురు మిక్కిలి స్నేహముతో ఉండగా సమభోగములతో కూడిన పెద్దకాలము గడచెను. శకులకానందము పెంపొందించు ఆ రాజపుత్రునకు ఒకనాటి మధ్యాహ్నమున మిక్కిలి భయంకరమగు తలనొప్పి పుట్టెను. ఔషధములయందు మిక్కిలి నేర్పుగల వైద్యులందరు అతనికి అన్ని

చికిత్సలు కావించిరి కాని వేదన తగ్గదాయెను. ఇట్లు పెక్కు కాలములు గడచినవి. కాని అతడు విష్ణుమాయచేత మోహితుడై, తన్ను దానెరుగకుండెను. చివరకు వారిరువురకు సమయము నిండెను. పూర్వజన్మ జ్ఞానము కలుగు సమయమాసన్నమయ్యెను. అట్లు కాలముగడువగా ఒకరియెడనొకరికి మిక్కిలి ప్రేమగలవారిరువురు ఎడబాయక, జరిగినదేమో తెలియగోరిరి. అప్పుడా పరమ సుందరి నీకు తలయందు ఈ వేదన ఏలకలిగినది? నీకు నేను ప్రియమైనచో దీనినున్నదున్నట్లు నాకు చెప్పుమని భర్తనడిగెను. పెక్కు శాస్త్రములలో ఆరితేరిన వైద్యులు పెక్కండ్రు నీకు చికిత్సలు చేయుచున్నారు. కాని తలయందు వేదన అట్లే ఉన్నది గదా! అనియు నడిగెను. ఇట్లు ప్రియురాలు పలుకగా ఆతడామెతో ఇట్లనెను. భద్రా! నీవు మరచితివేల? పుట్టుక మాత్రమున జీవి సర్వరోగములతో కూడి దుఃఖమునో సుఖమునో పొందుచుండును. ఇట్లు జన్మ మేర్పడినది. మనుష్యత్వము కూడ కలిగినది. సంసారమను సముద్రమున దిగబడితిమి. ఇంక ఎక్కువగా అడుగవలసిన పనిలేదు అని ఆతడామెతో ఇట్లు పలుకగా ఆమెకు మరియు వినవలయునను కుతూహలము కలిగినది. పక్షములు, నెలలుగా కాలము గడువగా వారిరువురు ఒకనాడు ఒకశయ్యపై ఉండుగా ఆమెకు మరల వేడుక పుట్టి మెల్లగా అడిగెను. "నేను మునుపు అడిగిన విషయమునే చెప్పుము. నేను నీకు ప్రియమైన దానను, కలతపడి ఉంటిని. నీవు నాకు చెప్పకున్నావు. ఇందు దాచదగినది ఏమైన కలదా? నాముందు దాచెదవేల? నేను నీకు ప్రియురాల నైనచో తప్పక చెప్పవలయును." అని ఒత్తిడి చేసి అడుగగా ఆ శకదేశపు రాజు ప్రణయముతో మన్ననతో ప్రియురాలికిట్లు పలికెను. నీవు మానుష భావమును వదలుము. నీ పూర్వపు జాతిని గుర్తు తెచ్చుకొనుము. కాంతా! నీకు కోరికయున్నచో నా తల్లిదండ్రుల అనుమతికొనుము. ముఖ్యముగా నన్ను పెంచి పెద్ద చేసిన తల్లికి చెప్పుము. దేవతలకు లభింపని కోకాముఖమున కరిగి అచట నీకు సర్వ వృత్తాంతమును చెప్పుదును. అనగా ఓ భూదేవీ! ఆమె భర్త మాటకు అట్లే అని బదులు చెప్పెను. ఆమె అత్తమామల చరణములు పట్టుకొని "పుణ్యమైనది, గొప్పదియగు కోకాముఖమున కరుగ గోరుచున్నాము. పని దొడ్డది అగుటచేత మమ్ము మీరు వలదనరాదు. ఇంతవరకు ఎన్నడును మిమ్ము నేనేమియు అడుగలేదు. మీముందు నిలిచి నేనడిగిన ఈ యొక్క కోరికను మీరు తీర్పవలయును. ఈ మీకుమారుడు ఎల్లకాలము

తలనొప్పితో బాధపడుచున్నాడు. చికిత్స లేని బాధతో మధ్యాహ్న కాలమునందు మరణించినట్లే అగుచున్నాడు. సుఖములను, సర్వవిషయములను వదలి పరమవేదన పడుచున్నాడు. కోకాముఖమున కరుగక కష్టము మరలదు. మీకింతకు పూర్వమీ పరమ రహస్యమును నేను చెప్పలేదు. ఆ విష్ణుని పరమపదమునకు, పరమోత్తమ స్థానమునకు మా దంపతులము త్వరగా పోగోరుచున్నాము." అని ప్రార్థింపగా.

అంత కోడలి మాట విని శకాధిపతి చేతితో కోడలిని, కొడుకును స్పృశించి ఇట్లు పలికెను. "నాన్నా! ఇది ఏమి? కోకాముఖాశ్రమమును గూర్చి తలపోసితివేమి? ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, ఇతర వాహనములు, అప్సరసలవంటి స్త్రీలు, ఏడు అంగములు గలిగి, కోశము మున్నగు దానితో కూడినది, రత్నముల ప్రోవులు కలదియు అగు రాజ్యమంతయు నీయందు నెలకొని ఉన్నది. నా శ్రేష్ఠమగు సింహాసనమును, మిత్రులను నా సర్వమును గ్రహింపుము. నా ప్రాణములు నీయందు నెలకొనియున్నవి. నీవు నా ఉత్తమ సంతానమవు" అని తెలుపగా. అంత తండ్రి మాట విని ఆ కుమారుడు, తండ్రి పాదములు పట్టుకొని యిట్లు బదులు పలికెను. తండ్రీ! నాకు రాజ్యము, కోశము, వాహనము, బలము వలదు. వెనువెంటనే నేను కోకాముఖమున కరుగగోరుచున్నాడను. తలనొప్పితో నున్న నేను బ్రదుకుదునేని, తండ్రీ! అప్పుడు రాజ్యము, సేన, ధనాగారము అన్నియు నావే. సంశయము లేదు. అచటకు పోయిననే నా తలనొప్పి నాశనమగును" అనుచు అట్లు పలికి సర్వకార్యము లెరిగిన ఆ కుమారుడు తండ్రి పాదములు పట్టి నిలిచి యుండెను. అంత తండ్రి అతనితో పుత్రా! అరుగుము. నీకు మేలగుగాక అని అనుమతించెను. వర్తకులు, పురజనులు, వైశ్యులు, ఉత్తమ స్త్రీలును కోకాముఖ మార్గమున నిలిచిన రాజకుమారుని కడ కరుదెంచిరి. అంత చాలా కాలమునకు వారందరు కోకాముఖము కడకు వచ్చిరి. అంత ఆ యింతి భర్తను నేనడిగిన రహస్యమును చెప్పుమని కోరెను.

ఇట్లు ప్రియురాలు పలుకగా ఆ రాజపుత్రుడు నవ్వి ప్రియురాలిని కౌగిలించుకొని ఆమెతో ఇట్లనెను. "వరారోహా! ఒక రాత్రి యిచట సుఖముగా నిద్రింపుము. నీవు కోరిన దానిని రేపు నీకు చెప్పెదను. అంత తెల్లవారినంతనే వారిరువురు స్నానము చేసి పట్టువస్త్రములు తాల్చి శిరస్సుతో విష్ణువునకు మ్రొక్కిరి. అంత ఆ రాజకుమారుడు ప్రియురాలిని చేతితో పట్టుకొని ఈశాన్య దిక్కుగా కొనిపోయి అట నుండి తూర్పునకు

నడిపించి తన హృదయమున చక్కగా గుర్తున్న ఒకతావు కడ భూమిని త్రవ్వెను. అందొకచోట మిగిలియున్న ఎముకలు కానవచ్చెను. వరాననా! ఇవి నా పూర్వజన్మ అస్థికలు – అని చెప్పెను. నేనొక చేపను. కోకము నీళ్లయందు తిరుగుచుండెడివాడను. నన్నొక బోయవాడు గాలమువైచి పట్టుకొనెను. నేను వానిచేతి నుండి తప్పించుకొని యీ నేలపై పడితిని. మాంసమున ఆసగొన్న ఒకడేగ నన్ను గోళ్లతో చీల్చినది. నా ఎముకలు లేకుండ చేయగోరినది... అప్పుడు నేనాకాశము నుండి వ్రాలితిని. ఇదిగోచూడు. దాని దెబ్బకు నాకు తలపోటు కలిగినది. ఇది నేను మాత్రమే ఎరుగుదును. మరియెవ్వడును ఎరుగడు. నీవు నన్ను మున్నడిగిన దానిని చెప్పితిని. సుందరీ! నీకు మేలగుగాక! నీకు బుద్ధి పుట్టినచోటి కరుగుము." అంత ఎఱ్ఱని పద్మము వంటి మంచి మొగము గల ఆ నిర్మలాంగి జాలిగొలుపు కంఠ స్వరముతో భర్త కిట్లనెను.

"భద్రా! నీవు మిక్కిలి రహస్యమగు ఉత్తమ విషయమును నాకు చెప్పితివి. కాని ఈ కర్మ మోహనమునకు కారణమైన దానిని నేను నీకు చెప్పలేదు. నేనెట్టిదాననో, మునుపు ఏ విధముగా ఉంటినో చెప్పెదను. వినుము. ఆకలి దప్పులతో అలసత నొంది నేనెన్నడు మాధవుని కడకు రాలేదు. చెట్టుపై కూర్చుండి తిండిని వెదకుచు ఉంటిని. అంతనొక బోయవాడు అడవి మృగములను పెక్కింటిని చంపి మాంసపు మోపులను కూడబెట్టుకొని ఈ ప్రక్కల తిరుగుచుండెను. అతడు మాంసపు మోపులను ఒకచోట నుంచి కట్టెలను తెచ్చుచుండెను. నేనంత ఒక మృగమాంసమును చిక్కించుకొని ఆకాశమున తిరుగుచుంటిని. ఆకలిదప్పులకు అలసినదాననై మరియు మాంసములను చీల్చుచుంటిని. అంత ఆ బోయ కట్టెలు పేర్చి అగ్నిని దరికొల్పెను ఆకలిదప్పులను తీర్చుకొనుటకై ఆ మాంసములను వండుచుండెను. అంత నేనొక చెట్టెక్కి మాంసమునందు ఆశతో చూచుచు ఆతడు మాంసమును వండుచున్నచోట పడితిని. మోయలేని బరువుగల మాంసమును నేను వజ్రమయములగు గోళ్ళతో చీల్చుచుంటిని. ఆ బరువుతో పీడనొంది నేను బయటపడుటకు చాలకుంటిని. ఎక్కువ దూరము పోజాలక కొంచెము దగ్గరగా నిలుచుంటిని. పొంగి పోయెడు మనస్సుతో ఆ మాంసమును తినుచు నిలిచితిని. మాంసపు తిండితో ఒడలెరుగని నన్నాతడు చూచెను. క్రుద్ధుడై మాంసమును మరల పొందగోరి నన్నా వ్యాధుడు పరికించెను. అంత ఆతడు విల్లెత్తి బాణమును నాపై వేసెను. మాంసము ముక్క తినుచున్న

నేను వానిచేత నేలగూలితిని. అంత నేను గిలగిల గొట్టుకొనుచు చేష్టలుడిగి, బుద్ధి తప్పి దాట శక్యముకాని కాలతంత్రమున పడితిని. ఈ క్షేత్రము మహిమ వలన నేను కోరుకొనక పోయినను, రాజపుత్రినై పుట్టి నీకు ప్రియనైతిని. పూర్వ జన్మమును కూడ స్మరించుచుంటిని. ఇవిగో మిగిలిన. నా ఎముకలను చూడుము. చాలా కాలమునకు జీర్ణించియు కొన్ని మిగిలి ఉన్నవి" అని వానిని ఇట్లు భర్తకు చూపి ఆతనితో మరల నిట్లనెను. "పుణ్యాత్ముడా! నన్ను కోకాముఖమునకు తోడి తెచ్చితివి. ఈ క్షేత్రము ప్రభావము వలన పశుపక్షి జన్మముల మనము మనుష్య జాతియందు, ఉత్తమ కులముల యందు పుట్టితిమి. ఓయి యశోధనా! విష్ణువు చెప్పిన శుభమైనదానిని నీవు దేనిని నాకుపదేశింతువో అదియెల్లను సుఖమునకు తావలమగు ఈ విష్ణు స్థానమున ఆచరింతును" అని చెప్పగా.

అంత ఆమె మాటను విని పూర్వకథను స్మరించి ఆతడు మిక్కిలి ఆశ్చర్యము పొంది 'బాగు బాగు' అని పలికెను. క్షేత్రము నందలి విధులను విని, ఆమె పలికిన గొప్పమాట ఆలకించి వారితో వచ్చినవారును వారివారికి రుచించిన విధానములను ఆచరించిరి. కొందరు చాంద్రాయణ వ్రతమును ఆచరించిరి. కొందరు పద్మాసనము వేసికొని ధ్యానము చేసిరి. అట్లు విష్ణుమయములగు కర్మములను వారు నిరంతరము చక్కగా పాటించిరి. గొప్ప ధాన్య సంపదయు, ధన సంపదయు కల వారయ్యు ఆ దంపతులు చెదరని మహాభక్తి కలవారై పెక్కు వ్రతములను ఆచరించిరి. అట్లు వారందరు చాలాకాలము తమ పాపములను తొలగించు కొనువారై ధర్మ కార్యములను చేయుచు చనిపోయిరి. అంత క్షేత్ర మహిమచేతను, ఆ పూజల ప్రభావము వలనను వారు శ్వేతద్వీపమున కరిగిరి. ఇట్లా రాజపుత్రుడు సర్వభూతముల గణములతో కూడినవాడై మనుష్యభావమును వదలి పై మెట్టు నందు స్థిరముగా నిలిచెను.

నా వ్రతముల యందు నిష్ఠగల ఆతని పరిజనము కూడ మనుష్య భావమును వదలి చక్కని తేజస్సు కలదియై ఆత్మతో ఆత్మదర్శనము చేసికొన్న కారణముగా నాలోకమునకు చేరెను. అచటనున్న స్త్రీలందరు కలువల సువాసనలు కలవారై మాయను వదలి కాంతులు క్రమ్ముకొన్నవారైరి. ఇట్లు చేపయు, చిల్లియు సాధారణమగు కోరికలు కలిగినవైనను ఆ క్షేత్రముకు వచ్చి నా అనుగ్రహము వలన శ్వేతద్వీపమునకు చేరుకొనెను. ఇది ధర్మము, ఇది కీర్తి, ఇది శకుల గొప్ప యశస్సు. కర్మములలో శ్రేష్ఠమగు కర్మము

తపస్సులలో గొప్పదియగు తపస్సు. కథలలో ఉత్తమ కథ, వెలుగులలో గొప్ప వెలుగు. ధర్మములలో పరమధర్మము. వసుంధరా! దీనిని నీకై వర్ణించితిని. కోపిష్ఠి, మూర్ఖుడు, పిసినిగొట్టు, భక్తిలేనివాడు, శ్రద్ధలేనివాడు, మొండివాడు– అను వారికి దీనిని ఒసగరాదు. దీక్షితునకు, నాయందు ప్రసన్న భావము కలవానికి, జ్ఞానము కలవానికి, శాస్త్రములలో నిండైన ప్రజ్ఞ కలవానికి దీనినొసగలవయును. మరణ కాలమందు చెదరని హృదయముతో దీనిని పట్టుకొనువాడు పవిత్రమగు ఆత్మ కలవాడై గర్భవాసపు భయము నుండి విడుదల పొందును. సుందరీ! గొప్పశక్తి గల ఈ మహాఖ్యానమును నీకు వివరించితిని. ఈ విధముగా ప్రతిష్ఠగల కోకాముఖమున కరిగినవారు చిల్లియు, చేపయు మున్ను – సిద్ధి పొందిన విధముగా పరమసిద్ధిని పొందుదురు అని చెప్పెను. (121)

122 వ అధ్యాయము – విశిష్ట మాసాలలో హరిపూజ

ఇట్లు భూదేవి ధర్మము నిండుగాగల కోకామాహాత్మ్యమును, పిక్కటిల్లిన సత్తువగల ధర్మమును విని పరమాశ్చర్యమును పొందెను. "అహో! కోకాతీర ప్రభావము. వరాహరూప దేవుని మహిమ! పశుపక్ష్యాదుల కడుపున పుట్టినవియు పరమగతిని పొందినవి. మాధవా! దేవా! నీదయతో మరియొక విషయము తెలియగోరుచున్నాను. దీనిని కూడ మున్ను నిన్నడిగితిని. ఏ ధర్మముతో,ఏ తపస్సుతో, ఏ కర్మముతో మానవులు నిన్ను దర్శింతురో దానిని ప్రసాదసుముఖుడవై సర్వమును చెప్పుము." ఆ మాధవీ దేవీ ఇట్లడుగగా మాధవుడు నవ్వి ఇట్లు చెప్ప మొదలిడెను.

"పుణ్యాత్మురాలా! నీవు పలికినట్లే సంసారము నుండి ముక్తిని ప్రసాదించు ధర్మమును అంతటిని చెప్పెదను. వర్షర్తువు గడచిన తరువాత ప్రసన్నమగు శరత్కాలము రాగా ఆకాశము నిర్మలమై చంద్రబింబము స్వచ్ఛమై ఉండగా, ఎక్కువ చలి ఎక్కువ వేడి లేని కాలమున హంసల మధుర నాదములు వినవచ్చు వేళ, కార్తీకమాసము శుక్లపక్షమున ద్వాదశినాడు నన్నర్చింపవలయును, దాని ప్రభావమును వినుము. వసుంధరా! లోకములన్నియు నిలుచు కాలముదాక నా భక్తుడు ధన్యుడై యుండును. అన్య భక్తుడట్లెన్నటికిని కాడు. ఆ ద్వాదశియందు పూజాకార్యము లన్నియు చేసికొని, నా ఆరాధన కొఱకు ఈ మంత్రమును పఠింప వలయును. 'బ్రహ్మరుద్రులు స్తుతించు ఆ భగవంతుడు, ఋషి వందితుడు, వందనీయుడనగు స్వామీ! ఈ ద్వాదశి తిథి ప్రాప్తించినది. దేవా!

లోకనాథా! మేల్కొనుము. మేఘములు వెడలిపోయినవి. చంద్రుడు నిండుగా నిర్మలుడై ఉన్నాడు. నీవు ధర్మమునకు హేతువవు. అట్టినీకై శరత్కాలపు పూవులను సమర్పించు కొందును. లోకనాథా! మేల్కొని మెలకువతో ప్రకాశించుచున్న నిన్ను యజ్ఞముతో యజించుచున్నారు. భాగవతులు వేదములతో నిన్ను కొనియాడుచున్నారు. పరిశుద్ధులు, మేల్కొన్న వారు, నీ యెడల జాగరూకత కలవారునై నిన్ను అర్చించు చున్నారు.' అనుచు ఇట్లు ద్వాదశినాడు నా భక్తులు మిక్కిలి శ్రేష్ఠమైన వ్రతమును, పూజా కార్యములను చేయవలెను. దానివలన పరమగతి పొందుదురు.

దేవీ! శరత్కాల పూజా విధానమును సర్వమును ఇట్లు నీకు తెలిపితిని. ఇది భక్తునికి సంసార మోక్షమును కలిగించును. సుఖమునకు తావలమగును. దేవీ! నీకు మరియొక విషయము చెప్పెదను. అది శుభమైన శిశిరర్తు పూజనము. ఆ పనులు భక్తితో చేయు మానవులు పరమగతి నందుదురు. చలి, ఈదురుగాలి అనువానికి పీడనొందిన వారయ్యు నా భక్తులు చెదరని హృదయముతో యోగము కొఱకు నిశ్చయము చేసికొని శిశిరమున చేయవలసిన పనులను వివరించెదను. మోకాళ్లపై నిలిచి చేతులను జోడించి ఈ మంత్రమును పఠింపవలయును. 'లోకనాథ! ఈ శిశిరర్తువు మంచుతో గడపశక్యము కానిది. చొరరాని కాలము. ఇట్టి సంసారము నుండి నన్ను తరింపజేయుము. నన్ను చేపట్టుము.' నా భక్తియందు స్థిరముగా నిలిచి శిశిరమున ఈ మంత్రముతో పూజ చేయువాడు పరమసిద్ధి పొందును. వసుంధరా! నీకు మరియొక విషయమును కూడ చెప్పెదను. మార్గశిరవైశాఖ మాసములు నాకు మిక్కిలి ప్రియములైనవి. నేనిపుడు ఆ ఋతువు నందలి పుష్పాదుల ఫలమును వివరింతును. గంధపత్రమను పూవును నాకు ఈ కాలమున సమర్పించువాడు తొమ్మిదివేల తొమ్మిది వందల ఏండ్లు బుద్ధి ప్రజ్ఞలు కలవాడై విష్ణు లోకమున నిశ్చలముగా నిలుచును. మరియొక విషయము ఈ కార్తీకము, మార్గశిరము, వైశాఖము అను మూడు నెలలు ఏకాగ్ర చిత్తముతో వారు నాకు గంధపత్ర పుష్పములను సమర్పించినచో పండ్రెండు సంవత్సరములు ఆ పూలతో పూజ చేసినట్లగును. కార్తీకమున గంధపత్రముతో శాల పుష్పములను కలిపి అర్పింపవలయును. మార్గశిరమున కలువపూవులతో కలిపి అర్చింపవలయును. అది మహాఫలము నొసగును. మాధవుని యిల్లాలు భూదేవి ఈ మాటలను, విని చనవుతో మెల్లగా నవ్వి మధుసూదనునితో ఇట్లు

పలికెను. "నిండు సంవత్సరమున మూడువందల అరువది దినములతో పండ్రెండు నెలలు కాగా నీవు రెండే మాసములను ఏల పొగడుచున్నావు. అట్లే ద్వాదశిని కూడ ఎల్లప్పుడు నాముందు ఏల పెద్ద చేయుచున్నావు?" ఇట్లు భూదేవి తన్నడుగగా మాధవుడు నవ్వి ధర్మముతో కూడిన వాక్యము ఇట్లు పలికెను."దేవీ! ఈ రెండు నెలలును నాకెందుకు మిక్కిలి ప్రియములైనవో తత్త్వముతో చెప్పెదను. వినుము. తిథులలో ద్వాదశి సర్వయజ్ఞముల ఫలముల కంటె మిన్న అయినది. వేలకొలది బ్రాహ్మణులకు దానమొసగిన ఫలము అంతటిని ద్వాదశి నాడిచ్చిన మనుజుడు పొందును. నేను కార్తీకమున మేల్కొంటిని. వైశాఖమున నిన్నుద్ధరించితిని. కనుక ఈ యోగము మహాదానముల కంటె గొప్పది. అందువలన వీనికి ఈ ప్రభావము కలిగినది. అందువలన కార్తీకమునందును, వైశాఖము నందును మనస్సును నిగ్రహించుకొని గంధపుష్పములను చేతదాల్చి ఈ మంత్రమును ఉచ్చరించవలయును. 'భగవంతుడా! ఆనతిమ్ము. ఇది మిక్కిలి గొప్ప కాలము. వైశాఖము, కార్తీకము ఈ గంధ పుష్పములను స్వీకరింపుము. ధర్మమును వృద్ధి పరపుము' అని పలికి 'ఓంనమో నారాయణాయ' అని గంధపత్రమును సమర్పింప వలయును. గంధపత్ర పుష్పములను సమర్పించుట వలన నా భక్తులకు కలుగు గుణమును ఫలమును తెలిపెదను. ఆ పుష్పమును గ్రహించి ఈ మంత్రమును పఠింపవలయును. మంత్రము – 'భగవంతుడు ఆజ్ఞాపించుచున్నాడు. విశుద్ధములగు ఆత్మకల చక్కని నిశ్చయనము కల ఓ భగవంతుడా! మంచి పరిమళముగల ఈ పుష్పమును స్వీకరింపుము.' నా పూజయందు పరమ శ్రద్ధ గలిగి నాకిట్లు పుష్పములను అర్పించువాడు వేయి దివ్య వర్షములు, పుట్టుక, చావు,అలసట,ఆకలి అనునవి లేక నా లోకముల యందు నివసించును. దేవీ! ఒక్కొక్క పుష్పము యొక్క పుణ్యము, మహాఫలము అనువానిని నీ ప్రశ్నకు సమాధానముగా చెప్పితిని. (122)

123 వ అధ్యాయము - ఆయా ఋతువులలో ఉత్తమ కర్మలు

శ్రీవరాహ దేవుడు ఇట్లు పలికెను. ఫాల్గుణ మాసపు శుక్లపక్ష ద్వాదశినాడు మంచి పరిమళముగల అడవి మొల్లలను, తెలుపు మించిన పసిమి వన్నెగల వానిని గ్రహించి, మిక్కిలి ప్రీతినొందిన అంతరాత్మతో మంత్రపూర్వకమైన విధానముతో భాగవతుడు శుచియై, కర్మములన్నింటిని చక్కగా ఎరిగి పూజింపవలయును. శాస్త్ర విధానమును అనుసరించిన కర్మముతో పూజా కార్యములు చేయవలయును. కార్యము

మంత్రములతో పవిత్రము కావలయును. భక్తుడు శాంతము, నిర్మలము అగు మనస్సు కలవాడు కావలయును. "ఓం నమో నారాయణాయ" అని పలుకుచు ఈ మంత్రమును ఉచ్చరింపవలయును.

"వాసుదేవా! శంఖచక్రధరా! అచ్యుతా! లోకనాథ! మహావీరుడవగు నీకు నమస్సు, నీకు నమస్సు, వసంత కాలమున వనస్పతులు చక్కగా పూచినవి. చక్కని గంధరసముతో కూడి ఉన్నవి. వసంత కాలము వచ్చినది. ఈ పూచిన గొప్ప చెట్లను చూడుము." అనుచు ప్రార్థించి ఈ విధముగా ఫాల్గుణ మాసమున అర్చన చేయువాడు సంసారమును పొందదు. నాలోకమున కరుగును.

సుశ్రోణి! వైశాఖము శుక్లపక్ష ద్వాదశినాటి అర్చన ఫలమును గూర్చి నన్ను అడిగితివి. దానిని వినుము. చక్కగా పూచిన మద్ది మొదలగు చెట్ల పూవులను గ్రహించి నాపూజకు సిద్ధము కావలయును. కాలమునకు తగిన శుభకర్మలన్నింటి ఆచరించి భగవద్భక్తులను అందరిని ముందు ఉంచుకొని వేదము చెప్పిన విధానముగా మంత్రములను చదువుచు గంధర్వుల, అప్సరసల నాట్యములతో ఆటలతో, పాటలతో, వాద్యములతో పూజలు సలుపవలయును. అప్పుడు దేవలోకమువారు పురాణ పురుషోత్తముని స్తుతింతురు. సిద్ధులు, విద్యాధరులు, యక్షులు, పిశాచులు, నాగులు, రాక్షసులు సర్వలోకాధిపతియగు పురుషోత్తముని స్తోత్రములు చేయుచుందురు. ఆదిత్యులు, వసువులు, రుద్రులు, అశ్విదేవతలు, మరుత్తులు వీరందరు, దేవ దేవేశుడు, యుగముల నాశనము నందును చెడనివాడు అగు దేవుని స్తుతింతురు. అంత వాయువు, విశ్వేదేవతలు, అశ్వులు అందరుగుమికూడి ఆదికాలయముడు, ప్రభువునగు కేశవుని కీర్తింతురు. బ్రహ్మ, చంద్రుడు, ఇంద్రుడు, అగ్నియు సర్వభూతములకు నాథుడును, సర్వలోకములకు ప్రభువునగు విష్ణువును స్తుతింతురు. నారదుడు, పర్వతుడు, అసితుడైన దేవలుడు, పులహుడు, పులస్త్యుడు, భృగువు, అంగిరసుడు, ఇంకను పెక్కంద్రు మహర్షులు, మిత్రావసు, పరావసువులును, భూతనాథుడు, యోగినాథుడు, ఉత్తమయోగ స్వరూపుడునగు నారాయణుని స్తుతింతురు. మిక్కిలి శక్తిగల ఆ దేవతల నాదములను విని నారాయణ దేవుడు వసుంధరతో "ఇదియేమి శబ్దము వినవచ్చుచున్నది. వేదఘోషముతో మొదలైనది. దేవతల మహాశబ్దము ఇందు వినవచ్చుచున్నది" పలికెను.

అంత తామర రేకులవంటి కన్నులు కలదియు, అన్ని రూపములతో, గుణములతో కూడినదియునగు భూదేవి ఆ వరాహరూపదేవునితో ఇట్లు పలికెను. "దేవా! నీవు వరాహ రూపమునే తాల్చి ఉండవలయుననియు, వారందరు నీ ఆజ్ఞకు లోబడి లోకభావనను చేయవలయుననియు దేవతలు కోరుచున్నారు." అంత నారాయణ దేవుడు భూమితో ఇట్లనెను. "దేవీ! వారు నన్నువెదకుచు మార్గమున ఉన్నారని నేనెరుగుదును. వసుంధరా! నేను నిన్ను దివ్యమైన వేయివత్సరములు లీలగా నా ఒక కోరతో పట్టి నిలిపితిని. నన్ను చూచుటకై దేవలోక వాసులందరు – ఆదిత్యుడు, వసువులు, రుద్రులు, కుమారస్వామి, ఇంద్రుడు, బ్రహ్మ మొదలగువారు ఇచటికి వచ్చుచున్నారు." ఇట్లా మాధవుని మాట విని భూదేవి దోసిలిని నుదుటపై జోడించి ఆతని పాదములపై పడెను.

భూదేవి వరాహరూపుడగు దేవునకిట్లు విన్నవించుకొనెను "దేవా! రసాతలమునకు క్రుంగిన నన్ను నీవు పైకెత్తి నిలిపితివి. దిక్కులేని దానను నాకు రక్షకుడవైతివి. నీ భక్తునకు నీవే గతివి. ప్రభువవు. నాకేది కర్తవ్యము? ఏ పనితో నిన్నర్చింతును. నా జన్మమునకు పరమగతియేమి? ఏ విధముగా పూజించినచో నీవు తుష్టినందెదవు? స్వర్గసుఖమునకు తావలమైన ఆ పనిని నేను ఆచరింతును. నీ పూజా విధానము చేసెడు నాకు బాధ లేదు. అలసటలేదు. ముసలితనము లేదు. పుట్టుటయు గిట్టుటయును లేవు. దేవతలు, రాక్షసులు, సర్వజనులు, రుద్రుడు, ఇంద్రుడు, బ్రహ్మ అను కీర్తిధారులందరు నీ కడుపున ఒకమూల నివసింతురు. మాధవా! నిన్ను చూచుటకై వారే కృత్యములు చేయుదురు? ఏ ఆహారములు తిందురు? ఏ ఆచారములు పాటింతురు? బ్రాహ్మణుని కర్మమెద్ది? క్షత్రియుని కేదియగును? వైశ్యుడేమి చేయును? శూద్రుని కర్మమెట్టిది? ఎవడు యోగమును పొందును? ఎవడు తపమును ఎన్నుకొని చేయును? నీ కర్మమున మిక్కిలి శ్రద్ధకలవాడే ఫలమును పొందును? ఏ భావము దుఃఖమునకు నెలవగును? భోజనమెట్టిది? త్రాగున దేమి? నీ భక్తులు చేయవలసిన క్రియ ఎట్టిది? దిక్కులందు మూలలందు ఎట్టి నివేదనలు సలుపవలయును? గర్భవాసమును, జంతు జన్మాదులను పొందకుండుటెట్లు? ఏ కర్మ మొనరించి నరుడు పశుజన్మము పొందకుండును. కేశవా! నాకు మిక్కిలి సుఖము కలుగునట్లు ఈ సకలము తెలియజెప్పుము. ఏ పనిచేత ముసలితనమును పొందును? దేనిచేత జన్మమును పొందును?

గర్భవాసమును పొందకుండుట కేమి చేయవలయును? దేని ప్రభావము చేత నరుడు సంసారమున పడకుండును?" అని వసుంధర ఇట్లు అడుగగా భగవానుడు ఇట్లు బదులు పలికెను.

"మోక్షమార్గమున స్థిరముగా నిలిచియున్న భాగవతులారా! నేను దేనివలన మిక్కిలిసంతోషమును ఎల్లవేళల పొందుదునో ఆ మంత్రములను కీర్తింతును. వినుడు. "మాధవా! నీవు మాసములన్నింటను ముఖ్యమైన వైశాఖ మాసమవు. మంచి పరిమళముతో, చక్కని రసములతో వసంతకాలమున నీవు దేవుని దర్శించుచు వచ్చితివి. ఎల్లప్పుడు యజ్ఞములందు అర్చింపబడెడు ఈ నారాయణుడు ఏడు లోకములందును వీరుడు." ఇట్లే గ్రీష్మమునందు సర్వమును విధి పూర్వకముగా చేయవలయును. భాగవతులందరికి ప్రియమగు ఈ మంత్రమును పఠింపవలయును. "మాసములన్నింటిలో ప్రధానమగు గ్రీష్మమా! నీవు ప్రసన్నముగా వచ్చితివి. గంధ రసములతో కూడి నీవు ఏతెంచితివి. నిత్యము యజ్ఞములందు పూజలు కొనెడు శ్రీ నారాయణుడు సర్వలోకములందును వీరుడు." ఇదే విధముగా గ్రీష్మమునందును అర్చనము చేయవలయును. అట్టివానికి జనన మరణములు ఉండవు. నా లోకమునకు గతి కలుగును. ఈ విధముగా నన్నర్చించు వాడు భూమిలో చక్కని పరిమళముగల శాల(మద్ది) వృక్షముల పూవులన్నింటితో పూజించిన వాడగును. ఇట్లు వైశాఖ మాసమున నాపూజ నాచరించువానికి బుద్ధి నిర్మలమగును. ఆతడు మరల సంసారమున పుట్టడు.

నీకు మరియొక విషయము కూడ చెప్పెదను. అది సంసారము నుండి విడుదల కలిగించును. కడిమి, కొండగోగు, శల్లకము, అర్జునకము అను పూవులతో విధిని అనుసరించి అర్చనము గావింప వలయును. పిదప నా మంత్రములందు శ్రద్ధకలవాడై నన్ను ప్రతిష్ఠాపనము చేయవలయు 'ఓం నమో నారాయణాయ' అనుచు ఈ మంత్రమును పలుకవలయును. "పవిత్ర హృదయములు గలవారు మేఘము వన్నె కల పూజ్యుడవగు నిన్ను మహిమతో చూచుచున్నారు. లోకనాథా! వర్షాకాలము వచ్చినది. మేఘముల బృందములను చూడుము. నిద్రను పొందుము." ఆషాఢమాస ద్వాదశియందు సర్వశాంతికరమగు ఈ శుభకర్మమును శాస్త్రమును అనుసరించి చేయవలయును. అట్లాచరించువాడు ఎన్నటికిని ఏ యుగము నందును నశింపడు.

దేవీ! కర్మశ్రద్ధకల నరులు దేనిచేత సంసారమును తరింతురో అట్టి ఋతువులందు చేయదగిన ఉత్తమ కర్మమును నీకు చెప్పితిని. పుణ్యాత్ములారా! ఈ పరమ రహస్యమును నీకు చెప్పితిని. వరాహరూపమును తాల్చిన నారాయణదేవుడు కాక దేవతలును దీనిని ఎరుగరు. యజ్ఞదీక్ష లేనివానికి, మూర్ఖునకు, తంపులమారివానికి, నీచశిష్యునకు, శాస్త్ర విషయములను నిందించువారికి దీనినొసగరాదు. కసాయివారి నడుమను, మూర్ఖుల దగ్గరను దీనిని చదువరాదు. అట్లు చదువుట వలన వారికి ధర్మము, ధనము వెంటనే నశించును. దేవీ! నీవడిగిన దానిని మొత్తముగా చెప్పితిని. ఇంక నీవు దేని నడుగుదువు? (123)

124 వ అధ్యాయము - మాయా రహస్య కథనము

సూతుడు ఇట్లు చెప్పెను. కొనియాడబడు వ్రతములు గల భూదేవి ఆరు ఋతువుల కర్మములను విని నారాయణ దేవునితో మరల ఇట్లనెను. “మంగళకరములు, పవిత్రములునగు విషయములను చెప్పితివి. ఇవి నా లోకములందు తేటతెల్లములగును. నా మనస్సునకు మిక్కిలి ఆనందమును కూర్చుచున్నవి. నీ ముఖము నుండి పలుకబడిన ఈ అర్చన కర్మములను విని, దేవా! మాధవా! శరత్కాలపు చంద్రునివలె నిర్మలనైయితిని. మిక్కిలి రహస్యము, వేడుక పుట్టించునదియునగు ఈ విషయమును, నా మేలు కొరకు విష్ణూ! నీవు చెప్పదగును. దేవా! పలుమారులు నీవు 'నామాయ' అనుచుందువు. ఆ మాయ అనగానేమి? ఎటువంటిది? దేనిని మాయ అందురు, ఈ మాయా రహస్యమును మిక్కిలి ఉత్తమమైన దానిని తెలియగోరుచున్నాను.”

అంత ఆమె మాటను విని మాయకు పేటిక వంటివాడు విష్ణువు చిరునవ్వు నవ్వి, భూదేవితో మధురమగు ఈ వాక్యమును పలికెను. “భూదేవీ! ఈ మాయను గూర్చి అడుగకుము. నీవు కష్టపడనేల? మాయను తెలిసికొనజాలవు. ఈనాటికిని రుద్రుడు, ఇంద్రుడు, బ్రహ్మయు నామాయను తెలియజాలరు. విశాలాక్షీ! ఇంక నీసంగతి చెప్పనేల? ఒకచోట వానదేవుడు పెద్దగా కురియును. ఆ ప్రాంతము నీటితో నిండిపోవును. మరియొక దేశము నీటి బొట్టు లేక ఎండిపోవును. ప్రియా! ఇది నామాయ. చంద్రుడు ఒక పక్షమున తరుగుదలనందును. మఱియొక పక్షమున పెరుగుదల పొందును. అమావాస్యనాడు మొత్తముగా కనబడడు. ఇదియే నా మాయ. హేమంతమున (చలికాలమున) నూతిలో

నీరు వేడిగా నుండును. గ్రీష్మమున (వేసవియందు) చల్లగా నుండును. ఇది తత్వమును బట్టి నామాయ. సూర్యుడు పడమటి దిక్కున చేరి అస్తమించి, మరల ఉదయమున తూర్పు దిక్కున ఉదయించును. ఇది నామాయ. రక్తము, శుక్లము రెండును ప్రాణుల యందు ఉండునవియే. అవి గర్భమున చేరి క్రొత్త జీవి యగుచున్నది. ఇది నా ఉత్తమ మాయ. జీవుడు గర్భమున ప్రవేశించి సుఖమును, దుఃఖమునను పొందును. పుట్టినంతనే దాని నంతటిని మరచిపోవును. ఇది నా గొప్ప మాయ. తాను చేసిన కర్మములను పట్టి వ్రేలాడి జీవుడు తెలివిని, చేష్టను కోల్పోవును. కర్మము వానిని మరియొక చోటికి గుంజుకొనిపోవును. ఇది నా దొడ్డ మాయ. రక్తము, వీర్యము కలిసి కదా జంతువులు పుట్టుట! వేళ్లు, పెదవులు, ముక్కు చెవులు, కనులు, బుగ్గలు, నుదురు, నాలుక ఇవన్నియు ఏర్పడుట నా మాయ. దానితోడనే ప్రాణులు పుట్టుట. ప్రాణి తిన్నతిండిని జఠరాగ్ని పీల్చి వేయగా అది అరిగిపోవుచున్నది. పిదప క్రిందనుండి మలరూపమున జారిపోవుచున్నది. ఇది నా మహామాయ. శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనువానితో జంతువు ప్రవర్తించుచున్నది. ప్రియా! ఇది నామాలు (అనగా పుట్టిన ప్రాణి అని అర్థము) స్థావరము, జంగమము అనువారి యందు ఆ ఋతువులలో ఒకే ఆకారము. కాని దానితత్త్వము తెలియరాదు. ఇది నా మాయ. ఆకసమున నీరు కలదు. భూమియందు నీరున్నది. అవి వృద్ధి పొందకున్నవి. పరమ మాయ. వర్షఋతువున గుంటలు, చెరువులు నీటితో నిండిపోవును. గ్రీష్మమున అన్నియు ఎండిపోవును. ఇది నా మాయాబలము.

హిమవంతుని శిఖరము నుండి జాలువారిన నదికి మందాకిని అని పేరు. అదియే నేలకు దిగునప్పటికి గంగ అయినది. ఇది నా మాయ. ఉప్పునీటి సముద్రము నుండి మేఘములు నీరు గ్రహించుచున్నవి. లోకమున తీయని నీటిని కురియుచున్నవి. ఇది నామాయ బలము. కొన్ని ప్రాణులు రోగములను పొంది గొప్ప ఔషధములను తినుచుందురు. వాని శక్తియందు నేను నామాయను జారవిడుతును. మందు నొసగినను ప్రాణి మరణించుచున్నది. అనగా ఔషధమును శక్తిహీనము చేసి నేను కాలరూపుడనై హరించి వేయుదునన్న మాట. మొదట గర్భము ఏర్పడుచున్నది. తరువాత పురుషుడు పుట్టుచున్నాడు. కొంత కాలమునకు నడివయస్సు వాడగుచున్నాడు. అటుపై ముసలితనము, ఆపై ఇంద్రియములు నశించుచున్నవి. ఇది యంతయు నామాయా

బలము. నేల యందు విత్తనము నాటుదురు. అది మొలకెత్తుచున్నది. వెదజల్లిన ఒక్క విత్తనము నుండి గింజలు పెక్కులు కలుగుచున్నవి. దానియందు నేను మాయ కూర్పుతో అమృతమును జాలువార్తును.

గరుడుడు విష్ణువును మోయుచున్నాడని లోకము సంభావించును. నిజమునకు "నేనే వేగముతో గరుడుడనై నన్ను నేను మోసికొనుచున్నాను. ఈ దేవతలందరు యజ్ఞ భాగముతో సంతసించుచున్నారు. నేనే ఈ మాయను కల్పించి స్వర్గవాసులను తృప్తిపరచుచున్నాను. దేవతలు ఎల్లవేళల యజ్ఞము నందలి హోమ ద్రవ్యములను భుజింతురని లోకులందరు తలచుచున్నారు. నేనే మాయను కల్పించి సర్వదా ఆ దేవతలను రక్షించుచుందును. బృహస్పతి యజ్ఞకర్త అని లోకమంతయు కొనియాడుచుండును. ఆంగీరస మాయను కల్పించి దేవతల యాగములను చేయించునది నేనే. వరుణుడు సముద్రమును పాలించుచున్నాడని లోకులందరు తలతురు. వరుణమాయ కల్పించి మహాసముద్రమును కాపాడు చున్నవాడను నేనే. కుబేరుడు ధనమునకు ప్రభువని లోకములన్నియు సంభావించును. కుబేర మాయను స్వీకరించి ఆ ధనమును నేనే రక్షింతును. వృత్రుని ఇంద్రుడు పరిమార్చెనని లోకులు అనుకొనుచున్నారు. ఇంద్ర సంబంధమగు మాయను తాల్చి వృత్రుని రూపుమాపినది నేనే! లోకులు ఆదిత్యుడు కదలని మహాగ్రహమని తలపోయుదురు. మాయామయమగు దేహమును తాల్చి ఆదిత్యుని మోయుచున్నది నేనే. నీరంతయు వట్టి పోవుచున్నదని లోకము వాకొనును. బడబాగ్ని రూపము తాల్చి దానంతటిని నేనే త్రాగివేయుచున్నాను. వాయు మాయను తాల్చి దానిని మేఘములందు వదలుచున్నాను. లోకము ఈ నీరంతయు గూడుకట్టి యెక్కడ నిలుచుచున్నది అని పలుకును. అమృత మెక్కడ నిలుచునో దేవతలును ఎరుగరు. అది నా మాయచేసిన ఆజ్ఞ మేరకు ఓషధుల యందు నిలిచియున్నది. రాజు ప్రజలను పాలించునని లోకము భావన. కాని రాజమాయను కలిగి వసుంధరను నేను పాలించుచున్నాను. యుగము ముగియునప్పుడు పన్నిద్దరు భాస్కరులు ఉదయింతురు. నేను వారిలో చొరబడి లోకమున మాయను సృజింతును. భూమి! వర్షము, ధూళితోపాటు లోకములయందు పడుచున్నది. పాంసుమయ(ధూళి) మాయను కల్పించి నేనే జగత్తును నింపుదును. సంవర్తమను మేఘము రోకలివంటి ధారలతో కురియును. సంవర్తకమాయను గ్రహించి

లోకమంతటిని నింపువాడను నేనే. ధాత్రీ! నేను శేషునిపై పవ్వళించి నిద్రింతునని లోకము భావించును. అనంత మాయతో ఆ శేషుని మోయుచు నిద్రించుచుందును. (అనంతుడు–ఆదిశేషుడు) భూమి! వరాహమాయను తాల్చిన సంగతి నీ వెరుగవా!దేవతలందరు అందులీనమై పోవుదురు. అది నా మాయ. అయిననునీవు విష్ణుమాయను ఏవిధముగను ఎరుగజాలవు. నిన్నునేను పదునేడు మారులు పట్టినిలిపితిని. నేను ఈ భూమినంతటిని ఒకే సముద్రంగా చేసి ఆ జలమున నిలుతును. ఇది నా మాయా బలము. నేను బ్రహ్మను, రుద్రుని సృజింతును. హరింతును. అయిననువారు నామాయకు మోహితులై దాని నెరుగకుందురు. సూర్యుని తేజస్సువంటి తేజస్సుగల ఈ పితృగణముల వారిని పితృమయమగు మాయతో నేను పట్టుకొనియుందును. మరియు శోభనాంగీ! మరియొక మాయను గూర్చి చెప్పెదను. వినుము. ఒక ఋషిని పురుష స్వరూపుని స్త్రీ యోనియందు ప్రవేశపెట్టితిని. అనగా స్త్రీని చేసితిని.” అంత విష్ణుని పలుకు విని మరింత వినగోరినదై వసుంధర చేతులతో దోసిలి పట్టి యీ వాక్యమును పలికెను. “ఆ ఋషి ముఖ్యుడు అంత చేయరాని పని యేమి చేసెను? అతడు స్త్రీ రూపమును ఏల పొందెను? ఆ బ్రాహ్మణ ముఖ్యుడు స్త్రీ యగుటకు చేసిన పాపమెట్టిది? నాకు మిక్కిలి కుతూహలము కలుగుచున్నది. అదియంతయు వివరించి చెప్పుము.” అని వినుతింపగా, అంత భూదేవి మాటవిని మిక్కిలి ఆనందమందిన హృదయముగల హరి తీయని మాటను గొని భూదేవి కిట్లనెను.

“దేవీ! విశాలాక్షీ! మహామతీ! ఆ ధర్మాఖ్యానమును వినుము. ఒడలు గగుర్పొడుచు నా మాయను గూర్చి చెప్పెదను. నా మాయ కూర్పు వలన సోమశర్మ పడరాని పాట్లు పడు పెక్కుగతులు పొందెను. అందు కొన్ని ఉత్తమములు, కొన్ని నీచములు, కొన్ని మధ్యమము మరియు తిరిగి నామాయ త్రోయగా బ్రాహ్మణత్వమును పొందెను. ఆ బ్రాహ్మణ ముఖ్య స్త్రీ రూపము నెట్లు పొందెనో తెలిపెదను. అతడు చేసిన వికృత కర్మము లేదు. అపరాధము లేదు. ఆతడు నిత్యము నా అర్చన యందు, నా పనులయందు మిక్కిలి శ్రద్ధ కలవాడు. సర్వదా నన్ను గూర్చిన భావనయే అతని హృదయము నలరించును. అంతట చాలా కాలమునకు ఆతడు అనన్య హృదయముతో చేసిన తపస్సు, కర్మము, భక్తి అనువానికి నేను మిక్కిలి తృప్తినందితిని. అంత నేనతనికి నా ఉత్తమమగు దర్శన మొసగితిని. “నీ విషయమున తృప్తుడనైతిని. నాయనా! నీ హృదయమున ఉన్న వరమునెల్ల

కోరుకొనుము. అన్ని కోరికలతో కూడిన ఆ వరముల నెల్ల నీకు ఇత్తును. సువర్ణమా! గోవులా! ఏ పీడయు లేని రాజ్యమా? లేక అప్సరగణముల స్వర్గమా? దేనిని కోరుదువు? లేదా ఓ విప్రవరా! ఋషుల మహాతపస్సును కోరెదవా? కాక నా కర్మములయందు మహాశ్రద్ధ కలవాడవగుదువా? అట్లుకాక వేయిమంది దివ్య కన్యలను, ధనములు రత్నములు సమృద్ధిగా కలవారిని, స్వర్ణాభరణములు అలంకరించుకొన్నవారిని కోరెదవా? అప్సరసల కీడైన దివ్యరూపములుగల ఇంతులను కోరెదవా? నీకు వరమిత్తును. నీవేది తలతువో చెప్పుము."

అంత ఆ బ్రాహ్మణ వరేణ్యుడు నా మాట విని శిరస్సు నేలకు తాకునట్లుగా నేలపై వ్రాలి తీయని పలుకుతో ఇట్లనెను. "దేవా! నీవు కోపగింపవేని ఒక్క వరమడుగుదును. నీవు పలికిన విధముగా నేను కోరిన దొసగవలయును. నాకు బంగారము వలదు. ఇంతి వలదు. రాజ్యము వలదు. అప్సరస వలదు. స్వర్గము వలదు. మనసున కింపైన ఐశ్వర్యము వలదు. వేయి స్వర్గములలో ఒక్కటి యునాకు రుచింపదు. నీవు ఎల్లప్పుడు క్రీడించు నీమాయను తెలియగోరుచున్నాను." అంతనతని మాటవిని నేనిట్లంటిని : "ఓ విప్రవరేణ్యా! నీకు ఆ మాయతో పనియేమి? కాని పనిని అడుగుచున్నావు. విష్ణుమాయ చేత మిక్కిలి మోహితులై దేవతలు కూడ దాని నెరుగరు." అప్పుడా బ్రాహ్మణోత్తముడు నా మాట విని మాయాకర్మము పురికొల్పగా తీయగా ఇట్లు పలికెను. "దేవా! నా కర్మము, నా తపస్సు నీకు తృప్తి కలిగించినచో నీ అనుగ్రహము వలన నాకీవరమునే ఒసగవలయును." అప్పుడా తపస్వియగు బ్రాహ్మణునితో – "కుబ్జామ్రకమనుచోట కరుగుము. అందు గంగలో స్నానము చేసి నామాయను చూతువు" – అంటిని. ఈ నా మాట విని ఆ విప్రుడు నా మాయను చూడగోరినవాడై నాకు ప్రదక్షిణ మొనరించి కుబ్జామ్రకమున కరిగెను. అచ్చట అతడు కమండలువును, దండమును, ఇతర వస్తువుల భాండములను ఒకచోట నుంచి తీర్థమును సేవించెను. అంత నాతడు శాస్త్రము చెప్పిన తీరున గంగలోనికి దిగి నీటమునిగి, అన్ని అవయవములను తడుపుకొనెను. అంత ఆ బ్రాహ్మణుడు హఠాత్తుగా ఒక నిషాద వనిత గర్భమున నిలిచెను గర్భక్లేశము పీడింపగా హృదయమున ఇట్లు తలపోసెను.

"అయ్యో! ఎంతకష్టము! నేనేమి పాడుపని చేసితినో ఆటవిక స్త్రీ కడుపున : ఈ నరకములందుంటిని. ఛీ! నా తపమేల? నా కర్మ మెట్టిది? దాని ఫలమేమి బ్రదుకెంత

నికృష్టమయినది! నేను నిషాద గర్భమున ఏ భాగ్యము లేనిచోట నలిగిపోవు చున్నాను. మూడు నూర్ల ఎముకలు, తొమ్మిది ద్వారములు, మలమూత్రముల సంకీరత రక్తమాంసముల బురద, భరింపనలవికాని దుర్వాసన, వాతము, పిత్తము, శ్లేషముల వికారములు, పెక్కురోగముల రొంపి, పెక్కుదుఃఖముల గందర గోళముగల ఈ గర్భమున, నోటితో చెప్పనేల? పడరాని పాట్లు పడుచున్నాను. విష్ణువెక్కడ? నేనెక్కడ? గంగా జలములెక్కడ? ఈ గర్భ సంసారము నుండి వెలువడి అటుపై నేనేమి చేయవలసి ఉన్నదో?" అని ఇట్లు తలపోయుచు ఆతడు వెనువెంటనే గర్భము నుండి వెలువడెను. వెంటనే ఆతని ఆ భావమంతయు నశించెను. అంతనతడు ఒక నిషాదుని (ఆటవికుని) యింట కన్యగా పుట్టెను. కమండలువు, దండము నది ఒడ్డున ఉండెను. నామాయవలన ఆతడు దాని నెరుగకుండెను. అంత చాలాకాలము ధనధాన్యములు నిండుగా గల ఆ నిషాదుని యింట ఆ బ్రాహ్మణుడు తిరుగు చుండెను. విష్ణుమాయ క్రమ్మగా ఆతడేమియు తెలియకుండెను. పిదప చాలా కాలమునకు ఆమె వివాహము చేసికొని నా మాయ వలన కొడుకును, కూతురును కనెను. తినదగిన దానిని, తగనిదానిని తినెను. త్రాగదగినదానిని తగనిదానిని త్రాగెను. చంపిన జంతువులను అందందు అమ్ముకొని బ్రతుకుచుండెను. ఏది చేయతగినచో, ఏది చేయరాదో, ఏది పలుకదగినదో ఏది పలుకరాదో, ఏది పొందదగినదో, ఏది కాదో ఏదియు నామాయా జాలము మోహమున తెలియకుండెను. ఏబదియేండ్లు గడచిన పిమ్మట నా తలపు వలనను, తపస్సు ప్రభావము వలనను ఆ బ్రాహ్మణుడు కుండను తాకెను. మనసులో స్నానమును చేయవలెనని భావించి, వస్త్రములను తీసివైచి వానిని నేలపై ఉంచి గంగలో మునిగెను. మిక్కిలి చెమటతాపమునకుడికి తలను నీటముంపగా అంత ఆ వనిత దండ కమండలువులు తాల్చిన తపోధనుడుగా ఆయెను. అంత నావిప్రుడు వస్తువుల పెట్టెను, కమండలువును, త్రిదండమును, మున్ను తానుంచిన వస్త్రములను చూచెను. తాను విష్ణుమాయను తెలిసికొనగోరిన విప్రుడను అను జ్ఞానము కలిగెను. అంత గంగకు ఉత్తరముగా ఆ తపోధనుడు సిగ్గుతో వాసమును కల్పించుకొని దగ్గరలో ఉన్న ఆ యిసుకతిన్నె పై కూర్చుండి, యోగమును గూర్చి భావించుచుండెను.

అంతనాతనికి తాను నిషాదవనితగా నుండగా అందందు చేసిన పాపకర్మము లన్నియు స్మృతికి వచ్చెను. 'పాపకర్ముడను. చేయరాని పనులు ఎంతగా చేసితిని!

అగాధములో కూలిపోయితిని. ఈ స్త్రీ జన్మ మెత్తితిని. బోయకులమున పుట్టితిని. విచక్షణ లేని తిండి తింటిని. నేలపై నీటిలో నుండు ప్రాణులనన్నింటిని చంపితిని. అన్ని విధములగు త్రాగుడులను త్రావితిని. అమ్మరాని వానిని అమ్మితిని. పొందరాని వారిని పొందితిని. అనరాని మాటలు అంటిని. అన్ని కొంపల నుండి తినరాని తిండ్లు సంకోచింపక తింటిని. నిషాదునివలన కొడుకులను, కూతుండ్రను కంటిని. నేనేమి తప్పు చేసితిని? ఏ పాపకర్మము చేత ఈ నిషాద వనితయగు దశను పొందితినో చెప్పగల ఎవనిని నేనిప్పుడు భావింతును?' అని యిట్లనుకొనుచున్నంతలో అమాయా తీర్థమునకు ఆనిషాదుడు (ఆసోమశర్మ నిషాదిగా ఉన్నప్పటి మగడు) బిడ్డలు చుట్టుకొనిరాగా ఒడలెరుగని కోపముతో వచ్చెను.

చక్కని లక్షణములుగల భార్యను, మిక్కిలి అనురాగము కలవాడై వెదకుచుండెను. అచట తపస్సు చేయుచున్న ప్రతి తపోధనుని 'అయ్యలారా! నాఇంటిది నీటికొరకు కుండపట్టుకొని గంగ ఒడ్డునకు వచ్చినది. మీరు చూచితిరా?' అని అడుగుచుండెను. ఆ మాయ తీర్థమునకు వచ్చిన జనులు, తాము ఒక సన్యాసిని, అదిగో అచట ఉన్న కుండను చూచితిమని చెప్పిరి. అంత నతడు తన ప్రియురాలిని కానక పెనుదుఃఖముతో కుమిలిపోవుచు ఆమె తాల్చిన వస్త్రమును, నీటి కుండను చూచి జాలికలుగునట్లుగా ఏడ్చుచుండెను. ఇదిగో వస్త్రము, ఇదిగో కుండ, నది ఒడ్డున నున్నవి. గంగకు వచ్చిన నా యింటిది మాత్రము కానరాదు. ఆ దీనురాలు స్నానము చేయుచుండగా నీట ఆమెను మొసలి ఏదైన జిహ్వా చాపల్యము చేత తినివేసెనేమో! ఒక్కనాడును, కలలో కూడ నేనామెను మనసునకు కష్టము కలుగునట్లు తిట్టి యుండలేదు. ఒకవేళ ఏ పిశాచమో, భూతమో, రక్కసియో మ్రింగలేదు కదా! గంగ ఒడ్డునకు చేరిన ఆమెను ఏ రోగమో పట్టలేదు కదా! నేను మునుపు ఎంత ఘోరమైన పాపము చేసితినో నాముందు నా భార్య మీరు చూచుచుండగా దుర్గతి పాలైనది. ఓ సుందరీ! నా యిష్టమును బట్టి నడచుకొను దానవు. రా! ఇదిగో పరమ దుఃఖముతో నలిగిపోవుచు అటు ఇటు తిరుగుచున్న ఈ బిడ్డలనైనను చూడుము. ఓసి నా ప్రియురాలా! ఈనీ పాలబుగ్గల పసిబాలురు ముగ్గురు కొడుకులను, నలుగురు బిడ్డలను చూడుము. నీవే నాకు అన్నియు అయితివి. నీకొరకు అంగలార్చుచున్న ఈ పిల్లలు ఏడ్చుచున్నారు. పాపాత్ముడనగు నా బిడ్డలను కాపాడుము. నాపై మిక్కిలి ప్రేమ కలదానవు, ఆకలిదప్పులతో అలమటించుచున్న

నన్ను వదలి పోయితివి." అని ఇట్లు పరమ కరుణగా ఆ నిషాదుడు ఏడ్చుచుండగా ఆ విప్రుడు సిగ్గుతో నిషాదునితో ఇట్లు పలికెను. “ఆమె లేదు. పొమ్ము ఆలుబిడ్డలు నశించుట సుఖమైన యోగమని పెద్దలు చెప్పుదురు.” ఇంకను అట్లే కరుణతో నిలువెల్ల మునిగిన ఆ నిషాదునితో ఆ విప్రుడు అట్లు పలికెను. “వెళ్లు. ఊరక యేల అట్లు కుమిలిపోయెదవు? పెక్కు విధములగు ఆహారములతో ఈ పిల్లలను రక్షింపుము. ఈ నీ బిడ్డలను ఎల్లవేళల రక్షింపవలయునుగదా!” అని చెప్పెను.

ఆ నిషాదుడు ఆ సన్యాసి పలుకు విని, దుఃఖము నిలువెల్ల క్రమ్ముకొనగా మెల్లగా ఇట్లు పలికెను.“అయ్యవారా! గొప్ప ధర్మము తెలిసినవాడవు. తీయని మాటలతో నన్ను ఓదార్చితివి.” నిష్ఠతో చేసిన వ్రతములు గల ఆ ముని నిషాదుని మాట విని దుఃఖము తన్ను ముంచియెత్తగా మెల్లగా ఇట్లు పలికెను. “ఏడవకు! నీకు చెప్పెదను. నీకు శుభమగును. నేనే నీ దొడ్డభార్యను. ఈ గంగ ఒడ్డుకు వచ్చి నీకు ప్రియురాలనైతిని.” సన్యాసిమాట విని నిషాదుడు కొంత తేరుకొని ఆ బ్రాహ్మణోత్తమునితో ప్రియమైన పలుకులతో నిట్లనెను. “బాపనయ్యా! ఏమి ఇట్లు అయోమయముగా పలుకుచున్నావు? మగవాడు ఆడుది అగుట ఎన్నడు విన్నది కూడ కాదు.” నిషాదుని మాట విని బ్రాహ్మణుడు ఒడలెరుగని శోకముతో గంగ ఒడ్డున ఆ బోయతో తీయగా ఇట్లు పలికెను. “త్వరగా నీతావునకు ఈ పసివారిని కొనిపొమ్ము. అందరియందును సమానమగు ప్రేమ చూపవలయును.” ఆతడట్లు చెప్పుచున్నను నిషాదునకేమియు తెలియవచ్చుట లేదు. తీయని స్వరముతో ఆ బ్రాహ్మణునితో ఇట్లు పలికెను. "అయ్యా! నేను నీ దొడ్డయిల్లాలి ననుచున్నావు. ఇట్లగుటకు నీవు మున్ను చేసిన మహా పాపమేమి? ఋషి పుంగవా! ఏ తప్పుచేత నీకు ఆడుదనము కలిగినది? మరల ముని వెట్లయితివి? ఇది నాకు చెప్పుము.”

అని యిట్లు పలుకగా ఋషి మాయా తీర్థము జలమున సంభవించిన దానిని గూర్చి తీయగా ఇట్లు పలికెను. "నిషాదుడా! నా కథ ఉన్నదున్నట్లు చెప్పెదను. వినుము. నేనెన్నడు తప్పుడు పనిని చేయలేదు. నాచేత ఎవ్వరు చేయింపలేదు. నేను భక్తినిండిన ఆచారములు కలిగి, తినరానిదానిని వదలివైచి అనేక పుణ్యకార్యములతో లోకనాధుడగు జనార్ధనుని దర్శనము కోరి ఆరాధించితిని. అంత పెద్ద కాలమునకు జనార్దనుడు నాకు దర్శన మిచ్చెను. నేనును మహా భయంకరమగు విష్ణుమాయను చూడగోరితిని. అంత

విష్ణువు నాతో 'విప్రా! నీకు ఆ మాయతో పనియేమి. సరే! కుబ్జామ్రక క్షేత్రమున కరుగుము. గంగలో స్నానము చేయుము.' అని పలికి విష్ణువంతర్ధానము చెందెను. నేనును మాయ నెరుగు పిచ్చికోరికతో గంగ ఒడ్డునకు వచ్చితిని. దండమును కుండిని, పాత్రను, వస్త్రములను ఒకచోట ఉంచితిని. తగువిధమైన ఉపచారముతో గంగనీట మునిగితిని. అటుపై ఏమి జరిగినదో ఏమియు తెలియనైతిని, లోభము, మోహము, కామము, క్రోధము అనునవి ముంచి యెత్తుచుండగా నిషాదుని యింట ఉండుట మాత్రము తెలియవచ్చినది. అంత ఏదో కర్మవశమున నీటికొరకు ఇక్కడకు వచ్చితిని. ఇచట నీటమునిగి మరల బ్రాహ్మణుడ నైతిని. నిషాదా! ఇదిగో కుండ, ఇవిగో కావి గుడ్డలు, ఏబది యేండ్లయినను చెడక ఇక్కడ ఇట్లే ఉన్నవి. చివికిపోయిన నాకావి గుడ్డలన్నియు గంగలో కొట్టుకొనిపోకున్నవి." అని ఇట్లతడు పలుకుచుండగా నిషాదుడు అదృశ్యుడాయెను. అచటనున్న బిడ్డలలో ఒక్కడును కానరాడాయెను.

అంత నా బ్రాహ్మణుడు ప్రాణాయామము చేయుచు, చేతులు పైకెత్తి, వాయువు మాత్రమే ఆహారముగా గొనుచు తపస్సు చేయుచుండెను. అట్లు నిలిచియుండగా అపరాహ్న సమయమాయెను. అంత నాతడు నీటిని వదలి తగు కృత్యములు చేసికొనెను. నా పూజలయందు, పుణ్యకార్యములయందు ఎల్లవేళల మిక్కిలి ఆసక్తికలవాడై వీరాసనము వేసికొని నన్ను అర్చించుచుండెను. గంగాస్నానమునకు వచ్చిన ఉత్తమ బ్రాహ్మణులందరు ఆతని చుట్టును చేరిరి. అంత నా బ్రాహ్మణులందరు అట్లు తపస్సునకూర్చున్న ఆతాపసితో "బ్రాహ్మణోత్తమా! ఎప్పుడో పూర్వమున ఈ దండము, కమండలువు, నారచీరలు ఇక్కడ ఉంచి ఎటకో పోయితివి. ఈ స్థలమును మరచితివి? త్వరగా రాకుంటివి." అనిరి. ఆ విప్రుల పలుకులు విని ఆ ముని మిన్నకుండెను. వారు ఉన్న తావును గూర్చి మనసులో భావించుచుండెను. ఇంతలో ఆ బ్రాహ్మణ ప్రవరుడు మదిలో ఇట్లు తలపోసెను. ఇదియేమి ఆశ్చర్యము? ఏబది సంవత్సరములు గడచినవి. ఈనాడు అమావాస్య. ఇప్పుడు ఏ కాలము జరుగుచున్నది? ఈ బ్రాహ్మణులు పలుకుచున్నదేమి? నాసంచిని పూర్వాపమున ఇచట ఉంచి ఎటకేగి అపరాహ్నమునకు వచ్చితి వనుచున్నారు. ఇంతలో అచట బ్రాహ్మణ స్వరూపములో ఉన్న నేను, ఆ బ్రాహ్మణునకు దివ్యమైన రూపము తేజస్సుగల నా నిజరూపమును చూపితిని. చూపి అతనితో ఇట్లంటిని. "విప్రా! స్నానము చేయగోరి

జపము కొరకు పూర్వాపమున వెళ్ళితివి. ఇదిగో చూడు అపరాహ్నము ఇప్పుడు తిరిగి వచ్చితివేమి?" అనిన నా ఆ మాట విని ఆ శ్రోత్రియుడు చేతులు జోడించి తలను నేల కాన్చి దుఃఖము పైకొనగా ఇట్లు పలికెను. "నాకేడుగురు పిల్లలు పుట్టిరి. మద్యమును, పిల్లలను, తెల్లని తాబేటిని అమ్మితిని. తినరాని తిండి, త్రాగరాని త్రాగుడు, పొందరాని పొందు పలుకరాని పలుకులు ఈయన్నింటిని చేసితిని. మాధవా! నిన్ను సేవించుచు నేను చేసిన పాడుపనియేమి? తపస్సు చేయుచు నేను చేసిన వికృతమగు తపస్సెట్టిది? అచ్యుతా! నీ ఆరాధన చేయుచు, నేనే పూజకు పనికిరాని కూడుతింటిని? నీ పూజలో నేను చేసిన అకార్యమేమి? నేనా నరకమునకు పోవుటకు చేసిన పాపమెట్టిదో ఉన్నదున్నట్లు నాకు తెలియజెప్పుము." ఇట్లు పెనుదుఃఖముతో మాయకు వశుడైన ఆ విప్రుని జాలిగొలుపు ఏడుపు పలుకులు విని గంగపులినమునందు దుఃఖముతో కుమిలిపోయిన కన్నులుగల ఆతనితో ఇట్లు పలికితిని.

"విప్రా! మనసును చెదరగొట్టుకొనకుము. ఇది నీ స్వీయదోషము. దానివలన ఈ దుఃఖము పొందితివి. నీచయోని యందు పడితివి. నేను ముందే చెప్పితిని. విప్రా! నా మాయతో నీకు పనియేమి? దివ్యలోకముల నిత్తును. అంటిని. అవి నీవు కోరకుంటివి. బ్రాహ్మణా! నీవు కోరిన వైష్ణవ మాయను చూచితివి. రోజు గడవలేదు. అపరాహ్నము కాలేదు. ఏబదియేండ్లు నీవు నిషాదుని యింట నిలువలేదు. విప్రవరుడా! మరియొక విషయము కూడ నీకు చెప్పెదను. దానిని ఆలకింపుము. ఇది అంతయు నీవు కోరిన వైష్ణవ మాయ. నీవు శుభమునుగాని, అశుభమునుగాని ఏమియు చేయలేదు. ఇది అంతయు మాయతోనైనది. నీవు విస్మయము వలన కుములుచున్నావు. నీవు చేసిన పాడుపని, వ్యభిచారముల వలన నీతపమేమియు చెడలేదు. తపస్సు పాడు కాలేదు. మరియొక విషయము చెప్పెదను. పూర్వజన్మమునందలి ఏ అపరాధముతో నీవిట్లయితివో దానిని చెప్పెదను. నా భక్తులు, పరిశుద్ధులు అగు భాగవతులను నీవు అభినందింపకుంటివి. ఆ తప్పు ఫలమును నీవిపుడు ఈ రూపమున పొందితివి. నా భక్తులు శుచులు అగు భాగవతులు ఎల్లవిధముల వందనీయులు. భక్తులగు భాగవతులకు వందనము చేయువారు నాకు వందనము చేయువారగుదురు. ఇందు సందియము లేదు. నన్ను పొందుటకు కోరువాడును, ఎట్టి నిందలు పొందనివాడును – అనన్యమగు మనస్సుతో నా

భక్తులయందు తగులము పొందవలయును. పొమ్ము! బ్రాహ్మణా! సిద్ధుడవైతివి. ప్రాణముల నిచటనే వదలుము. పద! నాతోపాటు పరమస్థానమగు శ్వేతద్వీపమున కరుగుము" అని నేనిట్లు ఆ బ్రాహ్మణునితో పలికి వరమిచ్చి అంతర్ధానము చెందితిని.

బ్రాహ్మణుడిట్లు ఇతరులకు చేయనలవికాని మహాకార్యము చేసి మాయాతీర్థమున దేహమును వదలి శ్వేతద్వీపమును చేరుకొనెను. ధనుస్సు, అంబులపొంది, బాణములు, ఖడ్గముతాల్చి గొప్ప బలపరాక్రమములు కలవాడై నిత్యము చక్కని స్థితితోనున్న నా మాయాబలమును ఆతడు చూచుచున్నాడు. కనుక, భూమి! నీకు నామాయతో నేమిపని? నా మాయను నీవెరుగజాలవు. దేవతలు, దానవులు, రక్కసులును ఎవ్వరు ఎరుగరు. భూమీ! నీకిట్లు మాయకథ చెప్పితిని. ఇది మహాశక్తి కలిగినట్టిది. దీనిని మాయా చక్రమని కీర్తింతురు. సర్వదుఃఖములను పోకార్చి సుఖముల కూర్చునట్టిది. ఇది కథలలో మహాకథ. తపస్సులలో గొప్ప తపస్సు పుణ్యములలో పరమపుణ్యము, గతులలో పరమగతి. దీనిని భక్తుల నడుమ చదువవలయును. భక్తిలేనివారి కడ కీర్తింపరాదు. నీచుల నడుమను, శాస్త్రముల నిందించువారి కడను పఠింపరాదు. నాముందు, నావెనుక నా భక్తుల ముందును దీనిని చదువువాడు శోభిల్లును. కాని శాస్త్ర దూషకులకడ అట్లు ప్రకాశింపడు. చెదరని దీక్షతో ఉదయమున లేచి నిత్యము దీనిని పఠించువాడు పండ్రెండేండ్లు నాముందు పఠించిన వాడగును. కాలము నిండిన తరువాత ఆ నరుడు దేహమును చాలించి నా భక్తుడగును. నీచ జన్మములు పొందడు. వసుంధరా! ఈ మహాఖ్యానమును నిత్యము వినువాడు బుద్ధిహీనుడు కాకుండును. నీచజన్మము పొందకుండును. భద్రా! నీవు నన్ను మున్నడిగిన విషయమును వివరించితిని. ఇటుపై ఇంక ఏమి అడుగుదువు? (124)

125 వ అధ్యాయము – కుబ్జామ్రక(ఋషీకేశ్) క్షేత్ర మహిమ

సూతుడు ఇట్లు పలికెను. కొనియాడదగిన వ్రతములు గల ధరణి మాయాబలమును గూర్చి విని వరాహ దేవునితో "దేవా! నీవు కుబ్జామ్రకము అనంత మహిమలు కలదని చెప్పుచున్నావు. మరియు నేను మున్నడిగిన విషయములును కలవు. వీనిని గూర్చి నేను తెలియకున్నాను. కుబ్జామ్రకము నందలి పుణ్యమును గూర్చియు, మిక్కిలి సనాతనమైన మహిమను గూర్చియు ఆ పరమ రహస్యమును నాకు నీవు దయతో చెప్పవలయును" అని ప్రశ్నించెను.

వరాహదేవుడు ఇట్లు చెప్పెను. "దేవీ! కుబ్జామ్రకము నందలి మహిమ యెట్టిదో, ఏ దోషమును లేని తీర్థమెట్టిదియో దానిని, సర్వలోకమునకు సుఖము కూర్చుదానిని తేటపడునట్లు తెలియజేసెదను వినుము. కుబ్జామ్రకము ఎట్లు పుట్టినదో, అచట తీర్థము ఎట్లేర్పడినదో, అందు స్నానము చేసియు, మరణించియు నరుడు పొందు గతి ఎట్టిదియో అవి అన్నియు వరుస తప్పక చెప్పెదను. భూమీ! పదునేడవ యుగమున భూమినంతటిని ఒక్కటిచేసి, బ్రహ్మమాట మీద మధుకైటభులను సంహరించి నేను గంగా ద్వారమును చేరుకొంటిని. అచ్చట గొప్ప ప్రతిష్ఠ కలవాడును, ధర్మకర్మములందు గొప్ప నిష్ఠకలవాడును, నా ఆరాధన యందు తగులము కలవాడును అగు రైభ్యుడు అను మునిని చూచితిని. చక్కని నేర్పుగలవాడు. గుణము లెరిగినవాడు, శుచి, సమర్థుడు, జితేంద్రియుడు అగు అతడు పదివేల ఏండ్లు చేతులు పైకెత్తికొని అచట నిలిచి ఉండెను. వేయి ఏండ్లు నీరు,ఆహారముగా, అయిదు వందల యేండ్లు నాచు భోజనముగా ఆ మహర్షి అచట నిలిచి యుండెను. మహాత్ముడగు రైభ్యుని పరమభక్తికిని, అతని ఆరాధనకును నేను పరమ ప్రీతినందితిని. అట్లు గంగా ద్వారమునకు పోయి తపించుచున్న ఆ మునివరుని నేనొక మామిడిచెట్టును ఆశ్రయించి చూచితిని. ఒకానొక కారణముచేత నేనా మామిడి చెట్టు రూపమున ఆతనికి దర్శన మొసగితిని. నేనా చెట్టును ఆశ్రయించినంతనే ఆ చెట్టు కుంచించుకొనిపోయినది.

అట్లా స్థలము కుబ్జామ్రకమని (కుంచించుకొనిపోయిన మామిడిచెట్టు కలది) ప్రసిద్ధికెక్కినది. అచట మరణించినవారును నేరుగా నాలోకమునకు పోవుదురు. వసుంధరా! మరియొక విషయమును కూడ చెప్పెదను వినుము. ఆ ఋషి నన్ను చూచి ఏమనెనో తెలిపెదను. గుజ్జు రూపమున నున్న నన్ను అతడచట చూచి, మోకాళ్లను నేలపై ఆన్చి కొంచెమేదో భాషించెను. కొనియాడదగిన వ్రతములు గల ఆ ముని, మోకాళ్లపై నిలిచి ఉండగా నేను ఆతనిని వరము కోరుకొమ్మంటిని. అది అతనికి రుచింపలేదు. తపస్సుతో కూడియున్న ఆ ఋషి ఆ మహాయశస్వి నా అనుగ్రహమును కాంక్షించుచు నా మాట విని మధురముగా ఇట్లనెను. "భగవన్!నీవు లోకనాథుడవు, జనార్దనుడవు. నీకు నాయందు దయకలిగినచో నీవుఎల్లప్పుడు ఇచట నివసింపవలయునని కోరుచున్నాను. లోకములుండునంతవరకు ఇది నీకు నెలవు కావలయును. నీదయ. ఇదియే నా కోరిక. జనార్ధనా! నిన్ను విడచి నాకు మరియొకని యందు భక్తి కలుగుకుండుగాక! ఇతరుల

యందు భక్తి నాకెన్నటికిని రుచింపదు. నా హృదయమున ఉన్న పరమవాంఛ ఇదియే. నీవు తుష్టి నందితివేని ఈ వరము నాకీయదగును."

అంత ఆ రైభ్యుని మాట విని, "మునిపుంగవా! బ్రాహ్మణోత్తమా! సరియే, అదియట్లే అగునని పలికితిని. నా మాట విని ఆ బ్రాహ్మణోత్తముడు ముహూర్తకాలము ధ్యానమున నిలిచి యుండెను. నేనాతని ఆ వర మొసగితిని. దేవీ! నీవు నన్నడిగినదానికి సంబంధించి కుబ్జామ్రకమను పుణ్యతీర్థమునందలి లోకసుఖము కలిగించు విశేషములను తెలిపెదను. వినుము.

ఆ కుబ్జామ్రనుక క్షేత్రమునందలి తీర్థము (కొలను) కలువ వంటి ఆకారమున ఉన్నది. అందు స్నానము చేసిన మాత్రమున మానవుడు స్వర్గమున కరుగును. కార్తీకము, మార్గశిరము, వైశాఖము అను నెలలలో ఇచట దుష్కరమగు పూజాకర్మమాచరించి ప్రాణములు పరిత్యజించువారు స్త్రీలుగాని, పురుషులుగాని, నపుంసకులుగానీ, ఏ లోపములేని సిద్ధిని పొందుదురు. నా స్థానమున కరుగుదురు. మరియొక విషయమును వసుంధరా! తెలిపెదను. దీనిని మానస తీర్థమనియు అందురు. దీనిని చేరుకొని పుణ్యకార్యము లొనరించి అందు స్నానము చేసినవాడు నందనవనమున కరుగును. అందు వేయి దివ్యవత్సరములు అప్సరసలతో కూడి విహరించును. వేయి ఏండ్లు నిండిన తరువాత ఆతడు గొప్పకులమున మహాధనవంతుడు, గుణవంతుడునై పుట్టును. కార్తీక ద్వాదశినాడు అందు ప్రాణములు వదలినవాడు పూర్ణసిద్ధిని పొంది నాలోకమున కరుగును. వసుంధరా! మరియొక విషయమును కూడ చెప్పెదను. వినుము, దీనికి మాయా తీర్థమనియు, ప్రసిద్ధి. దీనిచేత నరుడు మాయను తెలిసికొనగలుగును.

ఈ మాయా తీర్థమునందు స్నానము చేసిన దొడ్డమానిసి పదివేల యేండ్లు నా భక్తుడై ఉండును. గొప్ప సంపదను పొందును. వేయి యేండ్లు అతనికి కుబేరుని భవనము ఇష్టము వచ్చినట్లు తిరుగు నివాసమగును. ఒకవేళ ఆతడా మాయాతీర్థమున మరణించినచో అతడు మాయా యోగియై నాలోకమున కరుగును. (మాయతో యోగము కలవాడు– మాధవుడు) భూదేవీ! మరియొక విషయము చెప్పెదను. వినుము. అందు సర్వాత్మకమగు తీర్థము కలదు. అది అన్ని ధర్మగుణములతో కూడినట్టిది. అందు వైశాఖ శుద్ధ ద్వాదశినాడు స్నానమాచరించువాడు, ఏ లోపము లేని స్వర్గమును పదునైదువేల

ఏండ్లు పొందును. అట్లే అచటి శీర్షకపమనెడు తీర్థమున ప్రాణములు వదలినవాడు తగులము లన్నింటిని వదలి నాలోకమున కరుగును. శుభలోచనా! మరియొక విషయమును వక్కాణింతును. వినుము. అచట పూర్ణ ముఖమును తీర్థము కలదు. దాని నెవ్వడు నెరుగజాలడు, గంగ నీరంతయు తక్కిన అన్ని తావులందును చల్లగా నుండును. కాని వేడిగానుండు తావు పూర్ణముఖ తీర్థమని తెలియనగును. అందు స్నానమొనరించి నరుడు సోమలోకమున కరిగి ప్రతిష్ఠ పొందును. పదునైదు వేలయేండ్లు సోముని ఎల్లప్పుడు దర్శించుచుండును. పిదప స్వర్గము నుండి తిరిగివచ్చి బ్రాహ్మణుడై పుట్టును. నా భక్తుడు, శుచిమంతుడు సమర్థుడు, అన్ని సత్కర్మములు, గుణములు కలవాడును అగును. ఒకవేళ మార్గశిర శుద్ధ ద్వాదశినాడు అచట మరణించినచో అతడు నాలోకమునకు పోగలడు. గొప్ప దీప్తి నాలుగు భుజములు గల నన్ను ఎల్లవేళల చూచుచుండును. వానికి ఇంక చావుపుటుకలు ఎన్నటికిని ఉండవు.

వసుంధరా! మరియొక విషయమును చెప్పెదను. వినుము. అశోకమను తీర్థము కలదు. అందు నరుడు శోకము లేనివాడై యుండును. దాని వ్యాప్తిని గూర్చి చెప్పెదను వినుము. నా భక్తుడగు భాగవతుడు అనన్యమగు మనస్సుతో అందు ఒక్కమారైన స్నానము చేసి పదివేలయేండ్లు స్వర్గమును ఆనందమందును. పిదప స్వర్గము నుండి కదలివచ్చి ఆ తీర్థము ఫలముగా ధనవంతుడు, గుణవంతుడునగు నా భక్తుడై పుట్టును. వైశాఖమాస శుక్లపక్ష ద్వాదశినాడు అందు ఎవరికిని సాధ్యముకాని మరణించుట అను పని చేసి అతడు చావు పుట్టుకలు పొందడు. అలసట, భయము అతనికి కలుగవు. అన్ని తగులములను విడనాడి నా లోకమున కరుగును. వసుంధరా! కరవీరకమను తీర్థము మిక్కిలి సుఖము కలిగించునది కలదు. దానిని గూర్చి తెలిపెదను వినుము. దాని గుర్తు చెప్పెదను. దానితో అది తెలియవచ్చును. దానివలన పురుషుడు నా భక్తితో కూడినవాడై జ్ఞానవంతుడగును. మాఘమాస శుక్లపక్ష ద్వాదశినాడు మధ్యాహ్నమున కరవీరము పూచును. సంశయము లేదు. ఆ తీర్థమున స్నానమాడిన వాడు వేయియేండ్లు ఇచ్ఛవచ్చిన గృహముల కరుగుచు విమానమెక్కి తిరుగాడుచుండును. మరియు మాఘమాస శుక్లపక్ష ద్వాదశినాడు అందు మరణించినవాడు బ్రహ్మను, నన్ను పరమేశ్వరుని దర్శించును.

వసుంధరా! మరియొక విషయమును చెప్పెదను. దానిని వినుము. దీనిని మునుపు నేనా బ్రాహ్మణ శ్రేష్ఠునకు (రైభ్యునకు) చెప్పితిని. ఆ కుబ్జామ్రకమున నాకు మిక్కిలి ఇష్టమైన పుండరీకమను స్థానము కలదు. అదియు గొప్ప ప్రసిద్ధి గల తీర్థము. దాని గుర్తును, ఆ తీర్థము సేవించిన కలుగు గొప్ప గుణముగల ఫలమును చెప్పెదను వినుము. పుండరీక యజ్ఞము చేయు యజమానుడే ఫలము పొందునో దానిని మానవుడు అందు స్వయముగా అందుకొనును. సందియము లేదు. మహాతపస్సు కలవాడై జ్ఞానము పొందిన మానవుడందు మరణించునేని పది పుండరీక యాగముల ఫలమును పొందును. ఆ మహాతాపసుడు జాలిచేత శుద్ధుడై యజ్ఞ ఫలమును అనుభవించి నిత్యమగు సిద్ధిని పొంది నాలోకమున కరుగును. ప్రియా! అగ్నితీర్థమని కుబ్జామ్రకమున గుట్టుగా నుండు మరియొక తీర్థమును గూర్చి చెప్పెదను వినుము. కార్తీకము, మార్గశిరము, ఆషాఢము, వైశాఖము అను నెలలలో శుక్లపక్ష ద్వాదశి నాడు, లేదా మనసునకు నచ్చిన సమయమందు, పంచ మహాపాతకములను రూపుమాపు కొనిన మానవుడు ఈ తీర్థమును సేవించునేని యిది తన నిజస్వరూపమును వానికి కనుపడునట్టు జేయును. దేవీ! దాని గుర్తు చెప్పెదను. నాదయిన ఆ తీర్థమును గూర్చి ఆ గుర్తుతో చక్కగా తెలియవలయును. చెదరని చిత్తమును కుదురుపరచుకొని వినుము. నా సంహితను పఠించువారు, శుద్ధులు, అగు భాగవతులను వదలినవాడు, శాస్త్రము నెరుగనివాడును దానిని తెలిసికొనజాలడు. అందు మృతి చెందినవాడు, స్నానము చేసినవాడు పొందు ఫలమును చెప్పెదను. మనసును చెదరనీయక కుదురుపరచుకొని వినుము.

కుబ్జామ్రకమునందలి అగ్ని తీర్థమునందు స్నానము చేయుట వలన కలుగు ఫలమెట్టిదియో చెప్పెదను వినుము. అచట స్నానమాడినంత మాత్రమున నరుడు, ఏడు అగ్నిమేధములు చేసిన ఫలమును పొందును. సంశయము లేదు. అట్లుకాక ఇరువది రాత్రులందు నివసించి ఏ ఒక్క ద్వాదశినాడు గాని అందు మరణించునేని అతడు నాలోకమున కరుగును. సుందరీ! ఆ తీర్థపు గుర్తులను చెప్పెదను. వినుము. దానివలన నరుడు నా భక్తితో పరమ సుఖమునకు మార్గమగు జ్ఞానసంపద చేత ప్రసిద్ధుడగును. అచట నేల హేమంతమున (చలికాలమున) వేడిగా నుండును. అచటి గంగవేడిగా నుండును. గ్రీష్మకాలమున చల్లగా నుండును. మహాభాగా! ఉత్తరముగా నున్న అగ్నితీర్థపు గుర్తు ఇది.

దీనివలన మానవులు ఘోరమగు సంసార సాగరమును దాటుదురు. మరియు కుబ్రామకము నందు వాయవ్యమని ప్రసిద్ధి కెక్కినదియు, ధర్మము అను కొండ నుండి వెలువడినదియునగు తీర్థమొకటి కలదు. దానిని గూర్చి చెప్పెదను.

ఆ తీర్థమున స్నానమాడి ఉదక కార్యములు, అగ్నికార్యములు చేయువాడు వాజపేయ యాగ ఫలమును సమగ్రముగా పొందును. వాయుతీర్థము అను ఆ గొప్ప సరస్సునందు పదునైదు దినములు నా పూజా కర్మముల నాచరించుచు మరణించువానికి మరల చావు పుట్టుకలు కలుగవు. ఆతడు నాలుగు చేతులు కలవాడై నా లోకమున స్థిరముగా నిలచియుండును. సుందరీ! ఉత్తములగు భాగవతులు ఏ గుర్తుతో ఆ వాయుతీర్థమును తెలిసి కొందురో దానిని చెప్పెదను. అవనీ! అచట ఇరువది నాలుగు ద్వాదశుల యందును రావియాకులు నిరంతరము కదలాడు చుండును. దానితో ఆ తీర్థమును తెలిసికొనదగును. కుబ్జామ్రకమను క్షేత్రమున శక్రతీర్థమను మరియొక తీర్థము కలదు. దానిని గూర్చి చెప్పెదను. అది సర్వసంసారము నుండియు ముక్తి పొందించును. ఆ శక్రతీర్థమున స్నానము చేయు గొప్ప కీర్తిగల మానవుడు ఇంద్రుని లోకమున వజ్రము చేతియందు కలవాడై నివసించును. సంశయము లేదు. (వజ్రహస్తుడు ఇంద్రుడు) మరియు పదిరాత్రులు అందు ఉపవాస మొనరించి మరణించువాడు నాలోకమున కరుగును. సుందరీ! మనసు కుదుటపరచుకొని వినుము. ఆ తీర్థమును గురించెడు చిహ్నమును తెలిపెదను. భూమీ! అచట దక్షిణమున అయిదు చెట్లు కలవు. దానితో ఆ శక్ర తీర్థమును తెలియనగును.

వసుంధరా! మరియొక తీర్థమును గూర్చి చెప్పెదను. అందు వరుణ దేవుడు పండ్రెండు వేల యేండ్లు తపస్సు చేసెను. నన్నడిగితివేని అందు స్నానముచేసిన ఫలమును చెప్పెదను. మరియు విశుద్ధమగు వ్రతములుగల పురుషుడు అందు మరణించినచో పొందు ఫలమును తెలియజేయుదును. అతడు ఎనిమిదివేల యేండ్లు వరుణ లోకమున ఇష్టము వచ్చినట్లు తిరుగాడును. సంశయము లేదు. అచట ఇరువది రాత్రులు ఉపవాసముండి మరణించిన నరుడు అన్ని తగులములను విడనాడి నాలోకమున కేతెంచును. వసుంధరా! దాని గుర్తును చెప్పెదను. వినుము. అచట ఒక ధార పడుచుండెను. అది ఎల్లప్పుడు ఒకే రూపమున నుండును. వర్షాకాలమున పెరుగదు. వేసవియందు తరుగదు. భూమీ! ఆ

కుబ్జామ్రక క్షేత్రమున సప్తసాముద్రమను తీర్థమొకటి కలదు. అందు స్నానము చేసిన ధర్మపరాయణుడగు నరుడు మూడు అశ్వమేధ యాగముల ఫలమును పొందును. అతడు వడివడిగా స్వర్గమున కరుగును. ఎనిమిదివేల యేండ్లు అందు నివసించును. పిదప స్వర్గము నుండి తిరిగివచ్చి ఉత్తమ కులమున, వేదములందు, వేదాంగములందు నేర్పు కలవాడును, సోమపానము చేయువాడునునగు బ్రాహ్మణుడై పుట్టును. మరియు, అచట ఏడురాత్రులు ఉపవాసముండి అన్ని తగులములను వదలుకొని ప్రాణములు విడుచువాడు, నాలోకమున కరుదెంచును. దాని గుర్తు చెప్పెదను. వైశాఖ శుద్ధ ద్వాదశినాడు అందు విభూతి పుట్టును. స్వర్గజలములతో అలంకృతమైన గంగ అచట ప్రవహించును. ఆ తీర్థమున గంగ గొప్ప కాంతి కలదియై పాలవంటి వన్నె కలదియగును. మరల పచ్చని రంగుతో ప్రకాశించును. అటుపై ఎర్రని వన్నె కలదియగును. కొంతవడి మరకతముల రంగుతో తేజరిల్లును. మరల ముత్యముల కాంతి వంటి కాంతితో అలరారును. దొడ్డ హృదయము గలవారు ఈ గుర్తులతో దానిని తెలిసి కొందురు.

కుబ్జామ్రకమున మరియొక తీర్థమును గూర్చి చెప్పెదను. దానిని మానసరమందురు. విష్ణు భక్తులందరు దానిని సేవింతురు. శుభమైనది.అందు స్నానమాడినవాడు మానస సరోవరమున కరుగును. అందు రుద్రులు, ఇంద్రుడు, మరుద్గణములు – అనువారితో కూడిన దేవతల నందరిని దర్శించుకొనును. అందు ముప్పది రాత్రులు ఉపవాసముండి మరణించిన నరుడు, అన్ని తగులము లను తెగఁతెంపులు చేసికొని నాలోకమున కరుగుము. నరులు దానిని చక్కగా తెలిసికొనుటకు వీలగు గుర్తును చెప్పెదను. అది ఎదురు బదురుగా వ్యాపించియుండి మనుష్యులకు ప్రవేశింప నలవికానిది. అది మానససరోవరము వంటిది. ఉత్తములు, నా కర్మములందు నిష్ఠకలవారునగు పరమ భాగవతులకు మాత్రమే తెలియదగినది. మహాభాగా! కుబ్జామ్రకమున ఉన్న ఈ తీర్థమును గూర్చి సిద్ధికాముడగు రైభ్యుడను విప్రునకు వివరించి చెప్పితిని. భూదేవీ! ఆ కుబ్జామ్రక క్షేత్రమున మునుపు జరిగిన ఒక ఆశ్చర్యమును, గొప్ప శక్తి కలదానిని చెప్పెదను. వినుము.

నా నిర్మాల్యమునకు ప్రక్క ఒక త్రాచుపాము భయములేనిదై గంధ మాల్యములను, నివేదన వస్తువులను తినుచు ఉండెడిది. కొంతకాలమున కచటి కొక

ముంగిస వచ్చెను. భయములేక ఆడుకొనుచున్న ఆ త్రాచును చూచెను. అంత ఆ రెంటికి పోరు ఆరంభమాయెను. మాఘమాసపు ద్వాదశినాడు మధ్యాహ్నము ముగియునపుడు ఆ ముంగిస ఆ పాము కాటునకు నా మందిరమున మరణించెను. ఆ ముంగిస విషము పైకొన్న పాము కూడ చనిపోయెను. ఇట్లా రెండును పోరొనర్చి మరణించెను. పాము ప్రాగ్జ్యోతిషమున రాజపుత్రియై పుట్టి ప్రసిద్ధికెక్కెను. ముంగిస కోసల దేశమున రూపవంతుడు, గుణవంతుడు, అన్ని శాస్త్రములలో కళలలో నేర్పు కలవాడును అగు రాజై పుట్టెను. వారు సుఖముతో శుక్లపక్షమున చంద్రునివలె పెరుగజొచ్చిరి. ఆ రాజకన్య ముంగిసను చూచినంతనే చంపగోరును. రాజకుమారుడు పామును చూచినంతనే చంపగోరును. అంత కొంతకాలమునకు కోసల రాజునకును, ప్రాగ్జ్యోతిష రాజకన్యకకును నా ప్రసాదము వలన సంబంధము ఏర్పడెను. వారిరువురు పెండ్లి చేసికొనిరి. వారిద్దరికి అనురాగము పెరిగెను. వారిరువురు లక్కవలె కలిసిపోయిరి. ఆడుచు పాడుచువారు, నందనమున శచీపురందరులవలె, ఇచ్చవచ్చిన తావులందు విహరింప జొచ్చిరి. పెద్దకాలము గడచినను వారి అనురాగము తరుగుపోలేదు. మహాసముద్రము ఒడ్డుపైకి ఉప్పొంగినట్లు వృద్ధి పొందుచుండెను. ఉద్యానములలో, దేవాలయములలో వారు విహరించుచుండిరి. అట్లువారికి డెబ్బది యేడేండ్లు గడచెను. కాని నామాయ పైకొనగా వారు తమ నిజస్థితిని తెలియరైరి. ఇట్లు వారొకనాడు ఉద్యానవనమున విహరించుచుండగా రాజపుత్రుడొక పామును చూచి చంప నుంకించెను. ఆమె వలదని వారించుచున్నను రాజపుత్రుడు పాములను చంపుటకు పరువెత్తు గరుత్మంతుని వలె, దానిని చంపుటకు సిద్ధపడెను. ఆమె వలదని అడ్డుపడుచున్నను ఆ రాజపుత్రుడు ఆ పామును వడివడిగా చావగొట్టెను. అంత నా రాజపుత్రి కోపించి ఆతనితో మాటాడకుండెను.

అదే సమయమున రాజపుత్రి ఎదుట ఒక ముంగిస తిండి కొరకు కలుగునుండి వెలువడి కానవచ్చెను. చూడముచ్చటగా ఆడుకొనుచున్న ఆ ముంగిసను చూచిన రాజపుత్రికి క్రోధము కలిగెను. దానిని చంపబోయెను. రాజపుత్రుడు ప్రాగ్జ్యోతిష రాజకుమారిని వారించెను. చక్కగా తిరుగాడుచు, అందరకు చూడముచ్చట అయిన నకులమును ఆమె చంపివేయగా చూచి రాజపుత్రుడు కుపితుడై ఆమెతో నిట్లనెను. “ఆడువారికి మగడు ఎల్లవేళల మన్నింపదగినవాడని శాస్త్రములు ఘోషించుచున్నవి.

నీవేమో నేను వలదనుచున్నను ముంగిసను చంపితివి." అనగా అభిమానవతియగు ఆ రాజపుత్రి, ఆతని మాట విని క్రోధముతో వణకిపోవుచున్న సర్వావయవములు కలదియై రాజపుత్రునితో ఇట్లు పలికెను. "ఏ పాప మెరుగక నేలపై ప్రాకుచున్న పామును, నేను వలదనుచున్నను చంపివైచితివి. ఇందు నీ తప్పేమియు లేదేమి?" రాజపుత్రి మాట విని రాజపుత్రుడు ఇట్లు పలికెను. నన్ను పోటుమాటలంటివి. మున్నెన్నడు నీవిట్లు పలుకవు. అది పాము, ఒక్కపెట్టున విషమును క్రుమ్మరించునట్టిది. వాడికోరలతో మహాభయము పుట్టించునది. కనబడినంతనే మానవులను కరచునట్టిది. అందువలన నేను దానిని చంపితిని. రాజు ప్రజలను పాలింప వలయును చెడ్డదారులను తొక్కువారిని నాశనము చేయవలయును. ఇది వేదము ననుసరించి శాస్త్రము చెప్పిన విషయము. కావలయునని నరులను, పంటలను పాడుబెట్టునవియగు క్రూరమృగములు వధింపదగినవి. సంశయము లేదు. రాజకర్మమునందున్న నేను రాజధర్మమును తప్పక ఆచరింప వలయును. ముంగిస చేసిన తప్పేమో చెప్పుము. చక్కని రూపముతో చూడముచ్చట అయినది. రాజుల యిండ్లలో ఉంచదగినది, శుభమైనది, పవిత్రమైనది అగు ముంగిసను చంపితివి. ఇండ్లలో ముద్దుగా తిరుగాడు ముంగిసను వలదన్నను చంపిన రాజపుత్రివి, భార్యవు అయిన నిన్ను నేను మెచ్చుకొనజాలను. నేను అడ్డుకొనుచున్నను నీవు ముంగిసను చంపి వైచితివి. ఇంక నీవు నాకు భార్యవు కావు. నేను నీకు మగడను కాను. నిన్నీనాడు చంపకున్నాను. ఆడువారు వధకు అర్హులు కారు కదా!" అని యిట్లు పలికి ఆతడు నగరమున కరిగెను.

వారిరువురు ఇట్లు కోపము పొంది చెడిన ప్రీతి కలవారైరి. దంపతుల నడుమ కాలమెట్లో గడచుచుండెను. ఒకరినొకరు ఆనందపరచుకొనకుండిరి తదనుగుణముగా తిట్టుకొనుటయు, జరుగుచుండెను. రాజపుత్రుడును ముంగిసను చంపిన కోపముచేత శరీర సుఖమును ఏమాత్రము పొందకుండెను. అంత పెద్ద కాలమునకు కోసల దేశాధిపతి ఆ కథ నంతటిని, పాము ముంగిసల వధమును వినెను. ఇది అంతయు ఉన్నదున్నట్లు విని వారు కోపముతో ఉన్న విషయము తెలిసికొని మంత్రులను, కంచుకులను కోడలిని, కొడుకును రావించి రాజిట్లు పలికెను. "నాయనా! కోడలియందలి నీ ప్రేమ ఎక్కడికి పోయినది? లక్కవలె అంటుకొని పోయెడు ప్రీతి ఏల నశించినది? అద్దములలో ప్రతిబింబమువలె మీ ప్రేమను నేను చూచితిని. బిడ్డా! ఎన్నడును విరుద్ధముగా కానరాదు. ఈమె సమర్థురాలు,

చక్కని శీలము కలది. ధర్మప్రవర్తనలో అందరికంటే మిన్న. నీ పరిజనము నందు కాని. ఇతర జనుల విషయమున కాని ఆమె అప్రియము అగు మాట పలికి ఉండలేదు. నీకు మధుర భోజనములు కూర్చు ఈ కోడలిని పరిత్యజించుట పాడిగాదు. నీకు ధర్మమే సర్వమైన ధనము. కులస్త్రీయే ధర్మము. సంశయము లేదు. స్త్రీలలో సత్యశీలము గలవారి వలననే కులము చక్కగా సాగును" అని పల్కగా, అంత తండ్రిమాట విని రాజపుత్రుడు తండ్రి రెండు పాదములను పట్టుకొని ఇట్లు బదులు చెప్పెను. "తండ్రీ! నీకోడలి యందలి తప్పు ఆవంతయు లేదు! కాని నేను వలదనుచుండగా నా యెదుట ముంగిసను చంపినది. చంపబడిన నకులమును గాంచిన నాకు పెనుకోపము కలిగెను. ఆ కోపముతో ఉడికిపోయిన నేను ఆమెను నిందించితిని" అని తెలుపగా, మగని మాటవినిన ప్రాగ్జ్యోతిష రాజపుత్రి రాజునకు శిరస్సు వంచి ప్రణమిల్లి ఇట్లు పలికెను. "ఏ తప్పు నెరుగనిది, బెదరిపోవుచున్నట్టిది, తలవంచుకొని తన దారిని తాను పోవుచున్నట్టిది అట్టి పామును, నేను వంద విధములుగా వారించుచున్నను వడివడిగా చంపివైచెను. అట్టి సర్పమును వధించుట చూచి క్రోధము కాల్చివేయగా, ఈయనతో కొంచెముగా వాదులాడితిని."

కోడలిమాటను, కొడుకు పలుకును విని కోసలరాజు ఇద్దరికి మేలైనదియు, శుభమైనదియు అగునట్లుగా ఇట్లు పలికెను. "సర్పమును చంపగా నకులమును చంపితిని అనుచున్నది. ఇంక ఇచట కోపమేల చేయవలయునో నాకు చెప్పుము. కొడుకా! ముంగిస చచ్చినది. ఇంక నీకు కోపమేల? రాజపుత్రీ! పాము చచ్చినది. నీకిచట కోపమేల?" అంత తండ్రి మాట విని కోసలేశ్వరుని నందనుడు, గొప్ప కీర్తిశాలి, రాజపుత్రుడు తీయని పలుకిట్లు పలికెను. "అట్లయినచో నీవు నన్నడగనేల? మహాత్మా! ఆమెనే అడుగుము. దానితో ప్రాణులందరు ఆ విషయ మెరుగుదురు." కొడుకుమాట విని కోసలరాజు వారిరువురి ధర్మపు కలయికను సాధించు తీయని పలుకిట్లు పలికెను." నాయనా! న్యాయముగా నీ హృదయమున ఏమున్నదో చెప్పుము. మీ ఇద్దరకు ప్రీతిని తెంచివేసిన కారణమెయ్యది? కొడుకా! నిన్ను కంటిని, పెంచి పెద్ద చేసితిని. సర్వకర్మముల యందును నేర్పును అలవరచితిని. తండ్రి అడుగగా రహస్యములు దాచియుంచువారు నరాధములు. సత్యమో అసత్యమో ఉన్నదున్నట్లు తండ్రికి చెప్పనివారు మండుచున్న యిసుకగల ఘోరమైన రౌరవ నరకమున పడుదురు. అది మేలైనను కీడైనను తండ్రి అడిగినపుడు

సత్యమునే చెప్పువారు సత్యమును పలుకువారేగు సుగతికి పోవుదురు. కుమారా! నీవు నా యెదుట, మంచి గుణములకు గనియైన కోడలియందు ప్రీతి యేల తప్పితివో దానిని తప్పక చెప్పవలయును."

తండ్రి మాట విని కోసల రాజనందనుడు, ఆ సభయందే మెత్తని పలుకునిట్లు పలికెను. "నాయనా! ఈ జనమంతయు వారివారి యిండ్లకు అరుగుదురు గాక! మీకిష్టమైనచో రేపు ఉదయమున మీకు ఉన్న విషయమును చెప్పుదును." తెల్లవారుచుండగా కోసలరాజు శంఖములు, దుందుభులు మ్రోగచుండగా సూతులు, మాగధులు, వందులు స్తోత్ర పాఠములు చేయుచుండగా మేల్కొనెను. అంత కమలముల రేకుల వంటి కన్నులు కలవాడు, గొప్ప యశస్సు కలవాడునగు రాజకుమారుడు స్నానము చేసి మంగళ కార్యములు ముగించుకొని రాజున్న తావునకు వచ్చెను. అంత కంచుకి వడివడిగా రాజుకడ కరిగి" రాజా! నీ కుమారుడు నిన్ను చూచు కోరికతో ద్వారమున నిలిచి యున్నాడని" నివేదించెను. కంచుకి మాట విని కోసలరాజు "నా కుమారుడు, నా కులమున పుట్టినవాడునగు అతనిని వెంటనే ప్రవేశపెట్టు"మని పలికెను. రాజపుత్రుడు ప్రవేశింపగా అందున్న జనులందరు ఆనందమొందిరి. తండ్రి కొడుకులు నాలుగు వర్ణముల వారి స్థితిగతులను గూర్చి కొంత వడి ముచ్చటించిరి.

"నాయనా! జనులు నిండుగా ఉన్న తావున నా రహస్యమును అడిగితివి. అందువలన ఆ రహస్యమును చెప్పజాలక పోవుచున్నాను. మహారాజా! మా ప్రీతిని త్రుంచివేసిన కారణమగు రహస్యమును మొత్తముగా నేను నీకు తప్పక చెప్పవలయును. మహారాజా! ఈ గొప్ప రహస్యమును నీవు వినగోరుదువేని నాతోపాటు కుబ్జామ్రకమను క్షేత్రమునకు శీఘ్రముగా రమ్ము, కోసలరాజా! నీవడిగిన ఆ పరమ రహస్యమును, ఏదోషము లేనిదానిని, నీకచట చెప్పెదను." అంత ఆ రాజకుమారుని పలుకు విని రాజు నాలుగు వర్ణములవారున్న ఆ తావున 'సరే'యని పలికెను. రాజపుత్రుడు అచట మంత్రులకడ నిలిచి యుండగా రాజు అచట నున్న జనులతో తీయగా "మేము ఆ కుబ్జామ్రక క్షేత్రమునకు పోయెదము. వెళ్లుటకు నిశ్చయము చేసికొంటిమి. ఎవ్వరును మమ్ము వారింపరాదు" అని పల్కెను.అంత ఏడు దినములు గడచిన తరువాత మంత్రులు రాజుతో "సర్వద్రవ్యములను సిద్ధము చేసితిమి. తమ ఆజ్ఞయేమి?" అని పలికిరి. మంత్రుల

మాట విని కోసలరాజు మంత్రుల సముదాయమునందు 'బాగు బాగు' అని పలికెను. ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, వాహనములు, చక్కగా సిద్ధపరుపబడిన ధనాగారము, శిల్పులు, వంటవారు, వేశ్యలు మొదలగు వారందరు బయలుదేరిరి. అంత ఆ రాజోత్తముడు పెద్దకొడుకుతో, "కుమారా! నేను చేయవలసినదేమి? ఈ రాజ్యమిప్పుడు శూన్యమైనది. (రాజు లేనిదైనది)" అని పలికెను. అంత తండ్రి మాట విని కీర్తిశాలి యగు రాజపుత్రుడు తండ్రి పాదములపై పడి తీయగా ఇట్లు పలికెను. "ఈతడు నా తమ్ముడు. మేమిరువురము ఒక్క గర్భము నుండి వెలువడిన వారము. న్యాయము ననుసరించి ఈ రాజ్యము నీతనికొసగుము." కొడుకు మాట విని ధర్మమున నిష్ఠగల ఆ రాజు, "నీవు జీవించియుండగా చిన్నవాడు రాజ్యమునకు ఎట్లు అర్హుడగును?" అని పలికెను. అంత తండ్రి మాట విని కోసలరాజు కులమును ఉద్ధరించు ఆ కుమారుడు ధర్మమును అనుసరించి తండ్రితో ఇట్లు పలికెను. తండ్రీ! నీవు తమ్మునికిచ్చెడు భూమిని నేను అంగీకరింతును. ఆతడు ఈ మేదినిని అనుభవించుట ధర్మముచేత ఉచితమైనది అగుగాక! నేను కుబ్జామ్రకమున కరిగి ఎన్నటికిని తిరిగిరాను. ఇది సత్యము, ధర్మము, నేను నొక్కి చెప్పుచున్నాను."

రాజోత్తముడగు ఆ కోసల జనాధిపుడు కొడుకు అనుమతిమేరకు అందరిముందు తన రెండవ కుమారుని మహారాజ్యమున అభిషిక్తుని గావించెను. అంత చాలా కాలమునకు రాజు అంతఃపురముతో, సకల వస్తువులతో కూడినవాడై కుబ్జామ్రకమునకు చేరుకొనెను. వారందరు అచటి కరిగి ఆ కుబ్జామ్రకమున క్షేత్రమున ఉండిరి. పెక్కుధనములను, రత్నములను దాన మొసగిరి. చాలా కాలము గడచెను. ఇట్లు వారచట నివసించుచుండగా ఒకనాడు రాజునకు కొడుకు కోడళ్ల ప్రీతి చెడుటకు గల కారణము అడుగవలయునను బుద్ధి పుట్టెను. అంత సూర్యుడు అస్తమింపగా, రాత్రిరాగా కోసల రాజు తన పుత్రుని ఇట్లడిగెను.

"బిడ్డా! విష్ణుపాదములకు నెలవైన కుబ్జామ్రకమును చేరుకొంటిమి. పెక్కుదానములు చేసితిమి. దానిని గూర్చి విచారింపను. నిజము చెప్పుము. కోడలు అందమైనది. తప్పు పనులెన్నటికిని చేయనిది. యోగ్యురాలు. కులము, శీలము, గుణము నిండుగా కలిగినది. ఆమె యెడ నీవు విముఖుడవైన కారణమును దాపక చెప్పుము." అంత నతడు తండ్రితో మధురముగా ఇట్లు పలికెను "నాయనా! ఈ రాత్రి నీవొక్కడవు ఇచట

నిద్రింపుము. తెల్లవారి నంతనే మునుపు జరిగిన ఆ ఘోరమైన వృత్తాంతమును తెలిపెదను.” ఆ రాత్రి గడచిన పిమ్మట సూర్యుడు ఉదయించిన తరువాత రాజపుత్రుడు గంగలో స్నానమాడి, పట్టువస్త్రములు కట్టుకొని, యోగ్యమగు విధానముతో పూజలు గావించి, తండ్రికి ప్రదక్షిణము చేసి ఇట్లు పలికెను.” రాజా! పోదము రమ్ము. రమ్ము నీవు నన్నడిగిన రహస్యమును గూర్చి ఉన్నదున్నట్లు చెప్పెదను. వినుము.” ఆ రాజపుత్రుడు, ఆ రాజు, ఆ పద్మలోచనయు వారందరు మునుపు పాతకథ జరిగి, నిర్మాల్యపు గతదినము నాటి తొలగించిన పూజా ద్రవ్యములుపోవు దగ్గర కరిగిరి. గొప్ప తపస్సంపదగల ఆ రాజపుత్రుడు నిర్మాల్యము దరిజేరి, తండ్రి రెండు పాదములను పట్టుకొని ఇట్లు పలికెను. మహారాజా! నేను మునుపొక ముంగిసను. ఈ అరటితోటలో ఉంటిని. కాలము త్రోసికొని రాగా ఈ నిర్మాల్యపు ప్రోవుకడకు వచ్చితిని. అప్పుడచటికి ఒక విషసర్పము వచ్చి మంచి సువాసనలు గల మేలైన పూవులను తినుచుండెను. ఆ పెనుబామును చూచి కోపముతో ఎరుపెక్కిన కన్నులతో ఒక్కపెట్టున దాని పైకి దుమికితిని. దానికిని నాకును, మాఘ మాసము ద్వాదశి నాడు ఘోరమైన పోరు సాగెను. దాని నెవరు చూడరైరి. అట్లు పోరుచుండగా ఆ పాము నా ఒడలెల్ల పెన వైచుకొని ముక్కుపై కాటు వేసెను. విషము పై కొన్న నేనును ఆ నాగుబామును చంపివైచితిని. ఇట్లు ఇరువరము ప్రాణములను వదలితిమి. ఇట్లిరువురము క్రోధము చేసిన తప్పు పైకొనగా ఆ సమయమున మరణించితిమి. నేను కోసలాధిపతివైన నీకు పుత్రుడనై పుట్టితిని. అప్పటి కోపము మనసున ఉండుటవలన నేనా ఆడుపామును చంపితిని. రాజా! నీవు మునుపు అడిగిన దాని రహస్యమిది.”

రాజపుత్రుని మాట విని కోడలు ఆ నిర్మాల్యపు ప్రోవు కడకరిగి మామతో ఇట్లు పలికెను. “మహారాజా! ఆ ముంగిస చంపిన త్రాచుపాము నేనే. నేను ప్రాగ్జ్యోతిష పురమున పుట్టి నీకు కోడలనైతిని. అట్లు నేను మరణించితిని. ఆ కోపముతో ఒడలెరుగని దాననై యింటిలోని ముంగిసను చంపి వైచితిని. ఈ రహస్యమును ఇపుడు నీకు చెప్పుచున్నాను.” కోడలు, కొడుకు చెప్పిన మాటలు విని నిష్ఠగా చేసిన వ్రతములు గల ఆరాజు మాయాతీర్థమును చేరుకొని అందు ప్రాణములు విడచెను. ఆ రాజపుత్రుడును, కీర్తిశాలిని యగు రాజపుత్రియు పౌండరీక క్షేత్రమున ప్రాణములు వదలిరి. ఆ రాజును, రాజకుమారుడును, యశస్విని యగు ఆ రాజపుత్రికయు జనార్ధన దేవుని పరమ

స్థానమును చేరుకొనిరి. నా అనుగ్రహము వలనను, వారి తపస్సు బలముచేతను చేయనలవి కాని కర్మమాచరించి వారు శ్వేతద్వీపమునకు చేరుకొనిరి. వారి పరిజనము కూడ చక్కని తపస్సు చేసి పరమసిద్ధిని పొంది శ్వేతద్వీపమున కరిగిరి.

దేవీ! నేనా బ్రాహ్మణముఖ్యుడగు రైభ్యునకు చెప్పిన కుబ్జామ్రక మహత్యమును నీకు తెలియజేసితిని. ఈ కథ జపింపదగినది పుణ్యమైనది. నాలుగు వర్ణముల వారియందును నిలుపదగినది. కార్యములలో మహాకార్యము. శ్రద్ధతో చేసెడు క్రియలలో ఉత్తమమైనది. వెలుగులలో గొప్ప వెలుగు. తపములలో గొప్ప తపస్సు. మూర్ఖుల మధ్య దీనిని ఎన్నటికిని చదువరాదు. కసాయివారి నడుమను, వేదములను, వేదాంగములను నిందించువారున్న తావునను దీనిని పఠింపరాదు. గురువులను, శాస్త్రములను నిందించువారికడ దీనిని చదువరాదు. సత్కార్య దీక్షల యందు నిష్ఠ కల భాగవతులకడ చదువవలయును. ఉదయముననే లేచి మానవుడు దీనిని పఠించినయెడల వెనుక పదితరముల వారిని, ముందు పదితరముల వారిని తరింపజేయును. ఇది చదువుచుండగా ప్రాణములు విడిచిన వాడు నాలుగు భుజములు కలవాడై నా లోకముల యందు స్థిరనివాసము చేయును. భూదేవీ! కుబ్జామ్రక స్థానమును గూర్చి నా భక్తుల సుఖమునకై దీనిని నీకు చెప్పితిని. మరియేమి వినగోరుదువు? (125)

126 వ అధ్యాయము - సనాతన ధర్మము, దీక్షావిధానము

సూతుడు శౌనకాది మహామునులతో ఇట్లు చెప్పెను. పెక్కు మోక్ష ధర్మ సాధకములగు ధర్మములను విని భూదేవి లోకనాథుడగు జనార్దనునితో ఇట్లు పలికెను. "అహో! నీవు చెప్పుచున్న ధర్మప్రభావ మెంత గొప్పది. నేనెంతో బరువు పైబడిన దాననయ్యును అది విని తేలికగా అయిపోయితిని. లోకమున ప్రశస్తి కెక్కిన ఈ ధర్మములన్నింటిని నీ ముఖమునుండి వెలువడు చుండగా వినుచున్న నేను మోహము లేనిదానను, పరిశుద్ధురాలను అయితిని. ఎఱుకగలవారిలో శ్రేష్ఠుడవగు నిన్ను మరియొక సంశయమును గూర్చి అడుగుదును. ఎట్టి ధర్మ విధానము చేత నరులు పొందెడు నిండైన దీక్షలను పొందుదురు? ఇట్లే, నాకు మిక్కిలి వేడుకగా నున్నది. ధర్మమును పరిరక్షించు నిమిత్తము రహస్యమును గూర్చి నిన్నడుగుదును. నీవు దానిని చెప్పవలయును."

మేఘము వంటి దుందుభినాదము వంటి గంభీరమగు భూదేవి పలుకువిని వరాహ రూపుడగు భగవానుడు భూదేవి కిట్లు బదులు పలికెను. "దేవీ! సనాతనమగు నా ధర్మమునుగూర్చి సమూలముగా వినుము. యోగ వ్రతమున నిష్ఠగా నుండు దేవతలు సైతము దీని నెరుగజాలరు. సుందరీ! నా దేహము నుండి వెలువడిన నా ధర్మమును నేనొక్కడనే చక్కగా ఎరుగుదును. నా భక్తులగు జనులు కూడ ఎరుగుదురు. సంసారము నుండి విముక్తిని కలిగించు కర్మమునకు సంబంధించిన దీక్షను, కథను నీకు చెప్పెదను. దానిని ఆలకింపుము. సంసారము నుండి విముక్తి కలిగించు దీక్షను ఒక్కడును పొందజాలడు. సుఖమును చేకూర్చు దీక్షను, నేను చెప్పుదానిని ఎవ్వడును సులభముగా పొందజాలడు. ఓ కీర్తిశాలినీ! నాలుగు వర్ణముల వారికి సంబంధించిన దీక్షను తెలిపెదను. దీనివలన వారు జన్మమనెడు సంసార సముద్రమును దాటుదురు. సుందరీ! నరుడు మొదట 'మహా సాంతసనము' 'తపకృచ్ఛము' అను వ్రతములను ఆచరించి 'నేను తమ శిష్యుడను, నన్ను శాసింపు'డని పలుకుచు గురువు కడ కరుగ వలయును. పిదప ఆతడు గ్రహింపగా యోగ్యమైన పదార్థములను భుజించుచు గురువు చెప్పిన ద్రవ్యములను తీసికొని రావలయును. పేలాలు, తేనె, దర్భలు, అమృతము వంటి నెయ్యి, ధూపము, గంధము, మాల్యములు, మోదుగుకర్ర, నల్లలేడి చర్మము, కుండ, కమండలువు, వస్త్రములు, పాదుకలు తెల్లని జన్నిదము, చిన్నకత్తి, పూజాపాత్రము, అన్నము వండుటకు పాత్ర, గరిటె, నూవులు, బియ్యము, పెక్కు విధములగు పండ్లు, నీరు – వీనిని తెచ్చుకొన వలయును. నా కర్మము నందు మిక్కిలి శ్రద్ధగల దీక్షితులు తినుటకు యోగ్యములైన భక్ష్యములు, పానీయములు తెచ్చుకొనవలయును. లభించిన విత్తనములు, పెక్కువిధములగు రత్నములు, బంగారము మున్నగు వానిని కూడా తీసికొని రావలయును. పాయసము, బెల్లము మొదలగు అమృతము వంటి వస్తువులను కర్మమునందు మిక్కిలి శ్రద్ధ కలవాడై కొనిరావలయును. ఇంకను ఈ కర్మమునందు చక్కగా వినియోగించుటకు వీలైన పదార్థములను కూర్చుకొనవలయును. బంగారు, వెండి, రాగి, మట్టి పాత్రలను కూర్చుకొని వానినన్నింటిని గురువు పాదముల కడ నిలుపవలయును. స్నానము చేసి, మంగళ వస్తువులతో కూడిన, దీక్షను కోరెడి బ్రాహ్మణుడు గురువు పాదములను చక్కగా పట్టుకొని 'నేను చేయవలసినదేమి?' అని అడుగవలయును.

పిదప గురువు అనుమతి పొంది ఒక్కొక్క వైపు పదునారు మూరలుగల చదరపు అరుగును దీక్షాకాముడైన బ్రాహ్మణుడు నిర్మించుకొనవలయును. ఆ వేదికయందు నా ప్రతిమను నిలుపవలయును. శాస్త్రము చెప్పిన కర్మాచరణముతో నన్ను అర్చింపవలయును. గురువు చెప్పిన ధర్మ నిర్ణయమును బట్టి నా అర్చన కావించి, తెచ్చుకొన్న వస్తువుల నన్నింటిని వేదిక నడుమ ఉంచవలయును. ఆవేదిక నాలుగు ప్రక్కలను నీటితో నింపిన వానిని మామిడి మండలతో ఒప్పారుచున్న వానిని నాలుగు కలశములను, శుద్ధములైన వానిని నిలుపవలయును. పుణ్యాత్ములారా! ఆ కలశములకు అన్నివైపుల తెల్లని దారములను చుట్టవలయును. అట్టి పూర్ణపాత్రములను నాలుగు వైపుల నిలుపవలయును. అటుపై మంత్రమును పఠించి దీక్షను సఫలము చేయు దక్షిణను సముచితముగా గురువు తుష్టి నందునంతగా ఒసగవలయును. అట్లు గురువు నుండి మంత్రమును చక్కగా గ్రహించి దీక్షను కైకొను కోరిక కలవాడు విష్ణువుపై ప్రమాణమును చేయవలయును. అంత గురువు తూర్పునకు మొగము పెట్టి నీటితో తగు విధముగా నోటిని శుభ్రపరచుకొని దీక్షా నియమములను శిష్యులందరకు వినిపింపవలయును.

భగవద్భక్తుని గాంచి, తాను భాగవతుడై, శుచియై, తన్నాతడు హింసించినను అతని పైకి విరుచుకొని పడరాదు. తండ్రి తన బిడ్డను ఒకనికి భార్యగానిచ్చి, మరల ఆమెనతని కడకు పంపనిచో, ఆతని యెనిమిది తరముల పితృగణములు హింస నొందెదరు. ఇందు సంశయము లేదు. తనకు మిక్కిలి ప్రియమైన సఖి, మంచి నడవడి కలదియునగు భార్యను దయలేని వాడై హింసించు వానికి పుట్టగతులుండవు. అది భూదేవిని హింసించునట్టి నీచమగు కార్యము. బ్రాహ్మణుని, మేలుచేసిన వానిని, ఆవును చంపినవారును, ఇంకను అట్టి పాపములను చేయువారును అగు శిష్యులను వదలివేయ వలయును. మద్దిచెట్ల ఆకునందు భుజింపరాదు. దానిని నరికి వేయరాదు. రావిచెట్టును, మద్దిచెట్టును ఎన్నటికిని నరికి వేయరాదు. మారేడు, మేడిచెట్టులను ఎన్నటికిని కొట్టివేయరాదు. అట్లే యజ్ఞకర్మములకు పనికి వచ్చు వృక్షములను బుద్ధిమంతులు నరుకరాదు. నాయనా! శిష్యా! నీవు పరమసిద్ధిని, సనాతనమగు మోక్ష ధర్మమును కోరుదువేని తినదగినదేదో, తినరాని దేదియో చక్కగా తెలిసికొనవలయును. ముండ్ల చెట్లను కూల్చివేయుట మంచిది. మేడిపండ్లను కూడ రాల్చి వేయవలయును. వానిని అప్పటికప్పుడు

తినకున్నచో అవి చెడుకంపు కలవియై తినరాని పదార్ధములగును. పంది మాంసమును, చేపలను దీక్షితుడగు బ్రాహ్మణుడు ఎన్నటికీ తినరాదు. ఇతరులను నిందింపరాదు. హింసింపరాదు. ఎంతటి కష్టము నందున ఎన్నటికిని చాడీలు చెప్పరాదు. నాయనా! ఎంతో దూరమునుండి వచ్చిన అతిధినిచూచి ఎంతోకొంత అతనికి అన్నము మొదలగు దానిని సమర్పింప వలయును. గురుపత్నిని, రాజపత్నిని, బ్రహ్మజ్ఞాన సంపన్నుని పత్నిని ఎన్నటికిని, మనస్సుతో కూడ పొందరాదు, ఇట్లని విష్ణువు వక్కాణించెను. బంగారు వస్తువులు, రత్నములు, వయసునన్నున్న స్త్రీ అనువాని యందు మనసు ఉంచరాదు. ఇట్లని విష్ణువు గట్టిగా చెప్పుచున్నాడు. ఇతరుల సంపదలను, తన ఆపదలను తలచి శోకింపరాదు. ఇది సనాతనమగు ధర్మము.

వసుంధరా! గురువు దీక్షను కోరువారికిట్లు ధర్మములను వినిపించి దైవమునకు గొడుగు,పాదుకలను మనఃపూర్వకముగా సమర్పింపవలయును. రెండు మేడిఆకులను వేది నడుమ నిలుపవలయును. చురకత్తిని, నీటితో నిండిన పాత్రను ఉంచవలయును. విధి పూర్వకముగా నన్ను అచ్చటికి ఆహ్వానింప వలయును. శాస్త్రయుక్తముగా అర్పింపవలయును. "స్వామీ! ఏడు ద్వీపములు, ఏడు పర్వతములు, ఏడు సముద్రములు, పదివేల స్వర్గములు సమస్తమును నీ హృదయమున నున్నవి. నీకు నమస్కారము. నీవే వీని నన్నింటిని వెలువరింతువు. మరల లోనికి గ్రహింతువు. ఓమ్, ఓ వాసుదేవ భగవానుడా! నేను పలికిన దానిని స్మరింపుము. నీవు వరాహరూపుడవై భూమి నుద్ధరించినపుడు పలికిన మంత్రములను కూడ స్మరింపుము. నీవు మా అజ్ఞానమును తలపోసి, మాకడకు దయచేయుము. దీక్షను కోరుచున్న విప్రుడు నీ ప్రసాదమును ప్రతీక్షించుచున్నాడు" అను ఈ మంత్రమును పఠించి తలతో మోకాళ్ళతో నేలను స్పృశించి ఉండవలయును. "స్వాగతము. నీవు విచ్చేసితివి" అని పలుకవలయును. పిదప, ఓ వసుంధరా! ఈ మంత్రముతో విధిపూర్వకముగా అర్ఘ్యమును, పాద్యమును సమర్పింప వలయును. "చేసిన మేలు మరువని దేవతల విషయమున రక్కసులు కృతఘ్నులైరి. బ్రాహ్మణుడు రుద్రుని వలన పొందిన ఈ ధనము భగవంతుని కొరకు అగుగాక! లోకనాథ! నేనొసగిన దానిని దయతో గైకొనుము." ఇట్లు అర్ఘ్యమును, పాద్యమును ఒసగి క్రమము ననుసరించి చురకత్తిని కైకొని ఈ మంత్రమును పలుకవలయును. "శిష్యా! విష్ణువు అనుగ్రహించిన నీటితో తడుపుచున్న

నీ శిరస్సును వరుణుడు రక్షించునుగాక! ఈ దీక్ష సంసారమును పోకార్చునది." ఇట్లు పలుకుచు కలశమున దీక్ష పొందువానికి (స్నానము కొరకు) ఈయవలయును. పిదప శిరస్సును వెంట్రుకలు లేకుండ చేసి, రక్తము లేనిదిగా నొనర్చి మరల వెంటనే స్నానము చేయింపవలయును. ఇట్లు దీక్షను పొందగోరు వానికి ఆయా పనులు అన్నియు కావించి సంపూర్ణమగు నిశ్చయముతో సంసారమును విడుదల గావించు దీక్షను ఒసగవలయును. మోకాళ్ళను భూమి కాన్చి, ఈ మంత్రమును పలుకవలయును. "ఇంతకుముందే మంచిదీక్ష పొందినవారై గురువులై ఉన్న భాగవతులందరకు మ్రొక్కెదును. విష్ణువు దయతో దీక్షను పొందిన వారందరు నాయందు ప్రసన్నులగుదురుగాక! వారందరికి నమస్కరింతును." ఇట్లు గురువు శిష్యునిచేత నమస్కారము చేయించి అగ్నిహోత్రుని ప్రజ్వలింపజేసి తేనె, కలిపిన నేయితో, పేలాలతో నల్లని నువ్వులతో ఏడు మార్లుగానీ యిరువది పర్యాయములు గాని హోమము చేయవలయును. మరల మోకాళ్ళు నేల కానించి ఈ మంత్రమును పలుకవలయును.

"అశ్వినీ దేవతలు, దిక్కులు, చంద్రుడు, సూర్యుడు ఈ మాకార్యమునకు సాక్షులగుదురు గాక! ప్రసన్నులై నేను పలికెడు సత్యమగు వాక్యమును వినుడు. సత్యమే ఈ భూమిని పట్టి నిలుపుచున్నది. భూమి నిలిచియున్నది. సత్యము చేతనే సూర్యుడు కదలుచున్నాడు. సత్యము చేతనే భూమి వృద్ధి పొందుచున్నది." అని ఇట్లు సత్యము మీద ఒట్టు వైచి దీక్ష గొనెడు బ్రాహ్మణుడు గురువును చూచి ప్రసన్నుని చేయవలయును. భగవద్భక్తుడగు గురువునకు మూడు మారులు ప్రదక్షిణము గావించి ఆతని చరణము లను పట్టుకొని ఈ మంత్రమును పలుకవలయును. "గురుదేవుని దయవలన నేను దీక్షను పొందితిని. ఓ గురుదేవా! నీకు నేను ఏదేని అపకారమును చేసిఉన్నచో దానిని తమరు క్షమింపవలయును." ఇట్లు గురువును ప్రసన్నునిచేసికొని శిష్యుడు మంత్రములను పలుకుచు తూర్పుముఖముగా వేదిక మీద గురువును కూర్చుండ పెట్టవలయును. అంత గురువు శిష్యునే చూచుచు కమండలువును, తెల్లని జన్నిదమును పట్టుకొని ఈ మంత్రమును పలుకవలయును.

"విష్ణువు దయవలననీవు సిద్ధినిపొందితివి. నీకు దీక్షయు,కమండలువును లభించినవి. దీనిని రెండు చేతులతో పట్టుకొని నీవు ఇటుపై దీక్షా కార్యమునకు

యోగ్యుడవైతివి.” ఇట్లు గురువుచేత దీక్షపొంది ముఖమునకు గుడ్డకట్టుకొని సర్వప్రదక్షిణము చేయుచు ఈ మంత్రమును పలుకవలయును. “నేను గ్రుడ్డినై ఇచట తిరుగుచున్నాను. నాకు గురువును, దీక్షను లభించెను. గురుదేవా! ఇది యంతయు నీ దయ వలననే కలిగినది” అని యీ మంత్రమును చెప్పుచు ముఖమునకు గుడ్డ కట్టుకొనవలయును. అప్పుడు గురువిట్లు పలుకును “ఒక కడవ నీటితో స్నానము చేయుము. దేవతలకు వస్త్రము నొసగుము. ఇట్లు దీక్షితుడు విష్ణువుని గ్రహించును. నాయనా! కమండలువును కైకొనుము. ఈ కమండలువు లోకములయందు ప్రసిద్ధమైనది. వనులయందు కలిగించునది. సుఖమును కలిగించు సువాసనగల ఆకులను కూడా గ్రహింపుము. ఇది శుద్ధమైనది. నిలువెల్ల విష్ణువే అయినది. సమస్తమగు సంసార లంపటము నుండి విముక్తి కలిగించునది. శుద్ధి అయిన పిదప మధుపర్కమును పుచ్చుకొనుము.” అని యిట్లు గురువు చెప్పగా శిష్యుడు గురువు రెండు పాదములను పట్టుకొని తలతో ప్రణమిల్లి, మనసును కుదుట పరచుకొని అర్ఘ్యమును చేత బట్టుకొని యీ మంత్రమును పలుకవలయును. “భాగవతులందరు దయచేసి వినుడు. గురువు నాకు కర్మదీక్ష నాచరించెను. స్వామీ! నేను తమకే శిష్యుడను, దాసుడను. నాకు దేవునకు సాటియగు గురువు లభించెను.”

వర్ణములన్నింటిలో మొదటి వారగు బ్రాహ్మణులకు సంబంధించిన దీక్ష యిట్టిది. భూదేవీ! తక్కిన మూడు వర్ణముల వారికి మరియొక విధమగు దీక్ష విధింపబడినది. వసుంధరా! ఈ విధానముతో దీక్ష ఒసగినచో ఆచార్యుడును, శిష్యుడును ఇరువురును సిద్ధిని పొందుదురు. (126)

127 వ అధ్యాయము - క్షత్రియాది దీక్షా విధానము

శ్రీ వరాహదేవుడు ఇట్లు పలికెను. ఓ వసుంధరా! ఇప్పుడు క్షత్రియునకు సంబంధించిన దీక్షను గూర్చి చెప్పెదను. వినుము. ఆతడు ముందు నేర్చుకొన్న ఆయుధముల నన్నింటిని వదలివేయవలయును. పిమ్మట అతనికి ముందు చెప్పిన మంత్రముతో దీక్షనొసగవలయును. నల్లజింక చర్మమును, మోదుగ కర్రను ఈ దీక్షయందు ఎన్నటికిని ఉపయోగింపరాదు. నల్లని గొర్రె చర్మమును, మద్దిచెట్టు దండమును ఈ దీక్ష కొరకు సమకూర్చుకొన వలయును. పండ్రెండు మూరల చదరపు స్థలమును ఏర్పరచుకొని

చక్కగా అలుకవలయును. పిదప నేను మునుపు చెప్పిన విధానముల అన్నింటిని చేయవలయును. ఇట్లు దీక్షను పొందెడు క్షత్రియుడు విధానమంతయు కావించి నన్నే శరణు పొందుచు ఈ మంత్రమును పఠింపవలయును."విష్ణూ! నేను ఆయుధముల నన్నింటిని వదలివైచితిని. క్షత్రియ కర్మమును వదలితిని. అన్నియు వదలి విష్ణుదేవుడవైన నిన్ను చేరుకొంటిని. ఇటుపై సంసారము కొరకు, మరియొక జన్మము కొరకును పుట్టింపకుము." ఇట్లు పలికి క్షత్రియుడు నా ప్రక్కను ఉండి నా రెండు పాదములను పట్టుకొని యీ మంత్రమును "దేవదేవా! నేను ఆయుధమును ముట్టను. పరులను గూర్చి చెడుమాటలను పలుకను. సంసారము నుండి ముక్తి కలిగించు కర్మమును, నీవు వరాహరూపుడవై ఉపదేశించిన ప్రకారము ఆచరింతును" అని పలుక వలయును. ఇట్లు అచట పలికి పెక్కు విధములగు గంధములను, ధూపములను మున్ను చెప్పిన విధముగా సమర్పింప వలయును. భూమి! అటుపై ఆతడు అదేవిధముగా పరిశుద్ధులగు భాగవతులకు అన్నమిడ వలయును. దేవీ! క్షత్రియుడు ఉత్తమ సిద్ధిని కోరునేని నా అనుగ్రహముతో ఇట్టి దీక్షను సంసార ముక్తికై పొంద వలయును. వైశ్యునకు దీక్ష ఎట్టిదో చెప్పెదను. వినుము.

మూడవ వర్ణమునను్న వ్యక్తి, నా పూజయందు శ్రద్ధ కలవాడు అగు వైశ్యుడు సిద్ధిని పొందుటకై వైశ్య కర్మములను విడనాడవలయును. నేను మునుపు తెలిపిన వస్తువులను అన్నింటిని కూర్చుకొనవలయును. ఇరువది మూరలమేర అలికి మునుపటి వలెనే చేయవలయును. పసుపు వన్నె గొర్రె చర్మము నందు మేడిచెట్టు కర్రను కుడిచేత పట్టుకొని పవిత్రులగు భాగవతులకు మూడు మారులు ప్రదక్షిణ నమస్కారము గావింపవలయును. మోకాళ్ళపై నిలబడి ఈ మంత్రమును పలుకవలయును. "నేను వైశ్యుడను తమకడ కరుదెంచితిని. వైశ్యజాతి కర్మములను అన్నింటిని వదలి వైచితిని. భగవంతుని ప్రసాదము వలన దీక్ష నాకు లభించినది. ప్రసన్నులై నాకు సంసార మోక్షమును దయసేయుడు." ఈ విధముగా నన్ను గూర్చి పలికి నా అనుగ్రహమును పొంది గురువు పాదములను పట్టుకొని ఈ మంత్రమును పలుకవలయును. "నేను వ్యవసాయము, గోపాలనము, వాణిజ్యము కొనుగోలు, అమ్మకము అను వానిని వదలివైచి నీ దయవలన కోరిన విష్ణు దీక్షను పొందితిని." ముందు భాగవతులకు, పిదప దేవునకు మ్రొక్కులు చెల్లించి ఏ దోషమును లేని విధముగా భోజనము పెట్టవలయును. నా మార్గము

అనుసరించు వైశ్యులకు ఇది దీక్షా విధానము. దీనితో ఆతడు ఘోరమగు సంసారము నుండి ముక్తి పొందును.

నా భక్తుడగు శూద్రునకు దీక్ష యెట్టిదియో చెప్పెదను. ఇది పొందిన అతడు అన్ని పాపముల నుండియు విముక్తి పొందును. నేను ముందు చెప్పిన విధముగా అన్ని వస్తువులను, అన్ని సంస్కారములను దీక్షను కోరెడు శూద్రుని కొరకు కూర్చవలయును. ఏడు మూరల నేలను ఆవుపేడతో అలికి స్థండిలమును చేయవలయును. నల్లని గొఱ్ఱె చర్మముతో ఆతని అంగములను అన్నింటిని కప్పవలయును. ఖదిర దండమును గురువు ఆతనికి కూర్చవలయును. ఇట్లు దీక్షకు సంబంధించిన వస్తువులు అన్నింటిని తగువిధముగా తెచ్చుకొని నన్నే శరణుపొందుచు ఈ క్రింది మంత్రములను పలుక వలయును. "నేను శూద్రుడను శూద్రకర్మములనన్నింటిని వదలుచున్నాను. మునుపు శూద్ర కర్మములను చేయుచు తినరాని వస్తువులను తినెడివాడను. ఆ తిండిని కూడ వదలివేయుచున్నాను. ఆ తిండిమొదలగు వానినంతటిని వదలివేయగోరుచున్నాను. ఇటుపై విష్ణుని ఆరాధనమునే చేయుదును. దేవా! చూడు. నేను శూద్రుడను. గురువు దయవలన నిన్ను సర్వభావముతో చేరుకొంటిని" అనుచు దీక్షను పొందెడు శూద్రుడిట్లు పలుకవలయును. ఆతడు పాపములన్నింటి నుండి విముక్తుడగును. జ్ఞానము పొందును. ఆశలుడిగినవాడగును. తరువాత గురువు పాదములను రెండింటిని పట్టుకొని అతని దయ పొందగోరుచు ఈ మంత్రమును పలుకవలయును. "గురుదేవా! విష్ణువు ప్రసాదము వలన రహస్యమైన దీక్షను సంసారముక్తి కొరకు నేను పొందితిని. దాని కనుగుణమగు కర్మమునే ఆచరింతును. నాయందు ప్రసన్నుడవు కమ్ము." ఇట్లు మంత్రమును పలికి నాలుగుమారులు ప్రదక్షిణము చేసి మరల తగు విధముగా అభివాదన మాచరింపవలయును. పిదప గంధములతో, మాలలతో అర్చనము గావింపవలయును. మనసులో ఏ చెడు భావములు లేకుండ భోజనము సమర్పింప వలయును. శూద్రుని దీక్ష ఇట్టిది. ఉపచారము (సేవ) ఈ విధమైనది. నాలుగు వర్ణముల వారికి దుఃఖ రూపమైన సంసారము నుండి ముక్తి కలిగించు దీక్షను గూర్చి తెలిపితిని.

వసుంధరా! నీకు మరియొక విషయమును తెలిపెదను వినుము. నాలుగు వర్ణముల వారికి గొడుగుల నొసగు విధానమును గూర్చి చెప్పెదను. బ్రాహ్మణునకు తెల్లనిది,

క్షత్రియునకు ఎర్రనిది, వైశ్యునకు పచ్చనిది, శూద్రునకు నల్లనిదియగు గొడుగు నొసగవలయును. నిర్మములగు వ్రతములను గురించి ఆ భూదేవి నాలుగు వర్ణముల వారి దీక్షలను విని వరాహరూపుడగు దేవునితో "కేశవా! నాలుగు వర్ణముల వారికి సంబంధించిన దీక్షలను గూర్చి వింటిని. నీ పూజలయందు శ్రద్ధ కల ఆ దీక్షితులకు కర్తవ్యమెట్టిది?" అని పలుకగా, అంత భూమి పలుకులు విని మేఘదుందుభి నాదము వంటి కంఠధ్వని గల వరాహరూప దేవుడు భూమితో ఇట్లు పలికెను. "కల్యాణీ! నీవు నన్నడిగిన దానికి నిజమైన సమాధానము చెప్పెదను, వినుము. దీక్ష పొందిన వ్యక్తి నన్ను, గుహ్యమైన గణాంతిక(జపమాలా) దీక్ష వహించి భావించుచుండవలయును." నారాయణుని పలుకు విని దోషములేని వ్రతములు గల ధరణి మిక్కిలిగా సంతోషముతో ఉప్పొంగిన హృదయము కలది ఆయెను. గొప్ప శక్తిగల ధర్మమును విన్న భాగవత శ్రేష్టయగు ఆమె భక్తుల యందును, భక్తులు కానివారి యందును వాత్సల్యము కలదియై చేతులుమోడ్చి నారాయణునితో మరల ఇట్లు పలికెను. "దేవా గణాంతికమనగా ఎట్లు? నాకు వివరముగా తెల్పుడు. దానిని దీక్ష పొందిన వ్యక్తి ఎట్లు ఆచరింప వలయును దేవా?"

"దేవీ! నీవు నన్నడిగిన దానికి సరియైన సమాధానము చెప్పెదను. నా భక్తి కర్మమున శ్రద్ధ కలవాడు నన్నెట్లు భావింపవలయునో తెలియజెప్పెదను. ఇది భగవంతుని కుడి పద్మము నుండి వెలువడినది. దీని పేరు 'గణాంతిక'(జపమాల) మిక్కిలి గుట్టుగా ఉంచదగిన దీనిని మానవుడు భావించుచుండవలయును. శాస్త్రము చూపిన విధానమును బట్టి పరిశుద్ధుడై దీక్షగొన్న వ్యక్తి దీనిని మంత్ర విధితో గ్రహింప వలయును. భగవంతుని యందు భక్తి గలిగి ఈ గణాంతిక దీక్షను కైకొన్న వ్యక్తి జనుల దర్శనమును స్పర్శను, ముఖ్యముగా ఎడమచేతి స్పర్శను పొందినచో అతనికి ధర్మము కలుగదు. అట్టివాడు దీక్షితుడుగా చెప్పబడడు. మంత్రము చేత పవిత్రమైన ఈ గణాంతిక దీక్షను సాధారణ బుద్ధితో గ్రహించిన వానికి అది ఆసుర (రాక్షస సంబంధమైన) దీక్ష అగును. అట్టివాడు నా ధర్మమున ప్రవర్తించు వాడు కాదు. ఈ గణాంతిక దీక్షను గ్రహించి ఎవరికి తెలియరాకుండ భావించుచుండు మేధావి వేయి జన్మములలో నన్ను భావించువాడగును. ఈ మంత్రమును గ్రహించు విధానమును, శిష్యునకొసగు విధానమును లోక సుఖము కొరకు వివరించి చెప్పెదను. భూదేవీ! దానిని వినుము.

కార్తీకము, మార్గశిరము, వైశాఖము నెలలో శుక్లపక్ష ద్వాదశినాడు మూడు రోజులు మాంసము లేని భోజనము తీసికొని, ధర్మము నిర్ణయించిన ఈ గణాంతిక దీక్షను మంత్ర పూర్వకముగా గ్రహింపవలయును. నా ముందు అగ్నిహోత్రమును ప్రజ్వలింపజేసి దర్భలతో సంస్తరణమును ఏర్పరచి గణాంతికను దానిపై నిలుప వలయును. (సంస్తరణము – వెడల్పుగా పరచుట) అంత శిష్యుడును గురువును శుచిగా దీక్షితులై "ఓం నమో నారాయణాయ" అనుచు మంత్రమును పలుకవలయును.

మొదట లోక పితామహుడు, బ్రహ్మణ్య దేవుడు, భవోద్భవుడు అగు బ్రహ్మ నారాయణుని కుడి భాగము నుండి పుట్టిన దీనిని ధరించెను. అట్టి వశ్యము, అమృతము అయిన దీనిని మేము గ్రహించు చున్నాము. పిదప ఈ మంత్రముతో గురువు మరల 'గణాంతిక'ను గ్రహించి శిష్యున కొసగుచు మరల ఈ మంత్రమును పలుకవలయును.

"శిష్యా! నారాయణుని కుడివైపున జనించిన ఈ దేవిని ప్రతిజ్ఞ చేసి కైకొనుము. ఎల్లప్పుడు దీని భావన యందు శ్రద్ధ కలవాడవగుము. దీనిని భావించినవాడు మరల సంసారమున పుట్టడు."

మరల వసుంధర శ్రీ వరాహ భగవానుని "మాధవా! స్నానము మొదలగు కార్యములందు చేయదగిన విధి ఏమి? అలంకరణమును ఏ మంత్రముతో చేయవలయును? నీ పనుల యందు శ్రద్ధాసక్తులు కలవాడు ఇతర కార్యములు చేయకున్నను ముక్తి పొందును కదా!" అని ప్రశ్నించెను.

లోకనాథుడగు జనార్దనుడు భూదేవి పలుకు విని ధర్మముతో కూడిన పలుకులతో వసుంధర కిట్లు బదులు చెప్పెను. "దేవీ! నీవు నన్నడిగిన దానికి యథార్థమైన సమాధానము చెప్పెదను. ఈ కర్మము నందు స్నానము, ఉపచారములు ఎట్లు చేయుదురో వివరించెదను. ఉపచారములు, స్నానక్రియలు అనువానిని ముగించిన వ్యక్తి దువ్వెన, కాటుక, అద్దము మున్నగు వానిని ఆయా మంత్రములతో కూర్చుకొనవలయును. నా అంగముల నన్నింటిని పట్టు వస్త్రముతో కప్పి కాటుకను, దువ్వెనను ఉపయోగింపవలయును. పిదప మోకాళ్ళపై కూర్చుండి, శ్రద్ధ కలవాడై దువ్వెనను మోడ్చిన చేతులతో పట్టుకొని ఈ మంత్రమును పలుకవలయును. "నారాయణ! దేవా! దయచూడు. ఇదిగో దోసిలి. ఇదిగో దువ్వెన. దీనితో నీ శిరస్సును చక్కదిద్దుకొనుము. మహాను

భావములైన మీ కన్నులను సర్వలోకములును చూచును. ఓ లోకప్రభూ! లోకప్రధానా! ఈ కాటుకను కన్నులకు పెట్టుకొనుము. దయజూడుము. గ్రహింపుము. గ్రహింపుము. నన్ను మంచి భావముతో చూడుము." పిదప 'నమో నారాయణాయ' అని పలికి ఈ మంత్రమును పఠింపవలయును. "మాధవా! నీ దయవలనను, గురువు దయవలనను, నేనీ మంత్ర పూజగల గణాంతిక దీక్షను పొందితిని. నాకు ఎన్నటికిని అధర్మము కలుగకుండు గాక."

ఈ విధముగా దీక్షితుడై నా పూజా విధానములను గురువుతో కూడి గ్రహించువాడు నాలోకమున కరుగును. మంచి నడవడి లేని శిష్యునకు, క్రూరునకు, మొండివానికి ఈ దీక్ష నొసగరాదు. ఉత్తమ శిష్యుని చేతులయందే ఈ గణాంతిక కర్మమును సమర్పింప వలయును. ఇది శుభములతో కూడినది. శుభమైనది. సిద్ధి కలిగించునది. భక్తుని సంసారము నుండి విముక్తి చేయునది. దీని పరిమాణమును చెప్పెదను. ఓ మాధవీ! వినుము. నూరుగింజల జపమాల ఉత్తమమైనది. ఏబదింటితో అయినది మధ్యమము. ఇరువది అయిదింటితో అయినది తక్కువది. ఈ విధముగా కొలత నిర్ణయింపబడినది. రుద్రాక్షలతో చేసిన మాల ఉత్తమమైనది. పుత్ర జీవకములతో చేసినది మధ్యమము. అష్టకములతో గ్రుచ్చినది అధమము. దేవీ! దీనిని నీకు చెప్పితిని.

సర్వలోకములకు మేలు చేయునదియు, శుద్ధ అయినదినయు, మోక్షమందు కోరిక పుట్టించునదియు నగు ఈ గణాంతిక దీక్షను నూరు జన్మములకైనను ఎవ్వడును తెలియ జాలడు. దీనిని ఎంగిలితో తాకరాదు. స్త్రీ చేతియందు ఉంచరాదు. పరమగతిని కోరువాడు దీనిని మిక్కిలి ఎత్తున నిలుపవలయును. ఇది రహస్యములలో మిక్కిలి రహస్యమైనది. సంధ్యా కాలముల యందు ఉపాసింపదగినది. ఈ మంత్రము మిక్కిలిగా పూజింపదగినది. జపింపదగినది. ఈ జపమాలను విధిపూర్వకముగా పాలింప వలయును. అట్లు చేసిన నా భక్తుడు మిక్కిలి శుద్ధుడై నా లోకమున కరుగును. రత్నముల అలంకారములు గల భూదేవి, విష్ణువు వాక్కును విని, లోకనాథుడు, మహాశక్తిశాలి అయిన పరమ పురుషునితో మరల ఇట్లు పలికెను. "ప్రభూ! మాధవా! నీకు అద్దము నెట్లు పట్టవలయును. ఎట్లు పట్టినచో నీ నిజరూపమును చూచుకొని తృప్తి నంది భక్తుని భావనల కందుదువు?" భూదేవి పలుకు విని శ్రీవరాహదేవుడు ఇట్లు పలికెను. దేవీ! నాకు అద్దము చూపుట యెట్లో ఉన్నదున్నట్లు తెలిపెదను. వినుము. "నమో నారాయణాయ" –

నారాయణ దేవునకు నమస్సు అనుచు ఈ మంత్రమును పఠింపవలయును. "దేవా! నీ పూజల యందు శ్రద్ధగల భాగవతులందరు శ్రేష్ఠులు. "స్వామీ! ఇవిగో నీ అంగములు. అన్ని లోకములలో ముఖ్యమైన నీ ముఖము చంద్రుని సూర్యుని వెలుగులు గల కన్నులు. ఇదిగో లోకనాథుడవగు నీకు అద్దము. అన్నివైపుల నుండియు నీ స్వరూపమే అయిన జగత్తును దర్శింపుము." నా పూజా కర్మమునందు శ్రద్ధ కలవాడు ఈ విధానముతో నా కర్మములను ఆచరించినచో అతని ఏడు తరముల బంధువులు తరింతురు.ఆశ్రయించిన దీక్షితునికే ఇవ్వాలి. భూమీ! ఈ మంత్రముతో, ఈ విధమగు ఉపచారముతో ఆనందము, తృప్తికల వాడు, పరమగతిని కోరినచో చేయవలయును. (127)

128 వ అధ్యాయము - సంధ్యార్చనాది విధాన వర్ణనము

వరాహదేవుడు ఇట్లు అనెను. "నా పనుల యందు శ్రద్ధ కలవాడు, నాకలంకారములను సమర్పించి తొమ్మిది వరుసలు గల తెల్లని జన్నిదమును నాకు అర్పింపవలయును." తలపై అంజలి ఘటించి భూదేవి మరల ఇట్లు పలికెను. "ప్రభూ! ఈ పరమరహస్యమును నీవు నాకు చెప్పవలయును. నిన్నర్చించు పనులలో శ్రద్ధయు, చక్కని వివేకమును కలవాడు పవిత్రము, భగవంతునకు సంబంధించి నదియునగు సంధ్యను ఏ మంత్రముతో మొక్కవలయును?"

అంత భూదేవి పలుకు విని భూతముల పుట్టుకకు, కారణమైనవాడు, అవ్యయుడు అగు వరాహరూప భగవానుడు బదులు పలికెను. "మాధవీ! నీవు నన్ను అడిగిన ఆ పరమ రహస్యమును పుణ్యులు, మంచివారుఅగు భాగవతులు ఎట్లు చెప్పుదురో అట్లు చెప్పెదను. తన పనులన్నింటిని చక్కగా చేసికొని పరిశుద్ధుడై సంసారమోక్షమునకై ప్రాతఃసంధ్యను, సాయం సంధ్యను ఎట్లు నమస్కరింపవలయునో చెప్పెదను. నా భక్తితో ఉన్నవాడు జలాంజలి పట్టుకొని ఒక ముహూర్త కాలం ధ్యానించి (ఈచెప్పబోయే అర్థంకల) మంత్రం ఉచ్చరించాలి. "భవోద్భవుడు, ఆదిన్యక్తరూపుడు, ఆదిత్యుడు అయిన వాసు దేవుని నిన్ను నీవంటి బ్రహ్మ, రుద్రుడు మొదలైన సర్వదేవతలూ నీధ్యానయోగస్థితులై, సింధ్యాస్థితులై నమస్కరిస్తారు. మేము దేవుడవు, ఆదివి, అవ్యక్తరూపుడవు అగు నిన్ను ఆత్మగా చేసుకొని, దేవభావనలో ఉన్నప్పటికీ, సంసారవిముక్తికోసం సంధ్యాస్థితులమై ఉపాసిస్తున్నాము. వాసుదేవా, నీకు నమస్కారం" అని. మంత్రాలలో పరమమంత్రం, తపస్సులలో

పరమతపస్సు అయిన ఈ ఆచారం ఇలా చేసినవాడు నా లోకం వెళతాడు. ఇది గుహ్యాలలో పరమగుహ్యమైనది. అత్యుత్తమమైన రహస్యం. దీనిని నిత్యమూ పఠించిన అతనిని పాపం అంటదు. దీక్షితుడు కానివానికి, ఉపనయనం కానివానికి ఏ విధముగానూ ఇవ్వగూడదు.

మాధవీ! భగవంతుని భక్తిగల సజ్జనులు ఒసగెడు దీపమును నేనెట్లు గ్రహింతునో ఆ విషయమును విడమరచి చెప్పెదను, వినుము. నా పూజా కర్మము లన్నింటిని చక్కగా ఆచరించి మేలైన దీపమును గ్రహించి దానిని మోకాళ్ళపై నిడుకొని ఈ మంత్రమును పఠింపవలయును. "అనుగ్రహ రూపమైన తేజస్సుగల భగవంతునకు నమస్కారము. ఓ విష్ణూ! దేవతలందరు ఈ అగ్నియందు ప్రవేశించి ఉన్నారు. అట్లే అగ్నియందుండు శక్తులన్నియు ఇందు ప్రవేశించినవి. ఈ అగ్ని నీ తేజస్సునందు ప్రవేశించినది. ఈ తేజస్సు ఆత్మరూపమై నన్ను చేరినది. నీవు మంత్రములతో కూడినవాడవై ఈ ప్రపంచము కొరకు దీనిని గ్రహింపుము. ఈ దీపకాంతి, మంత్రమూర్తి మంత్రమై గర్భవాసమున పడి కుములుచు, నేను ఏదేది చేసితినో అది యెల్ల పాపములేనిదగునట్లు చేయుగాక!" అనుచు ఈ విధముగా చిరుదివ్వెల సమర్పించు నరుడు తన పితృదేవతలను తరింపజేయును. వంశమున పూర్వమువారి నందరిని పాపరహితులను చేయును. లోకమునకు సుఖమును కలిగించు మరియొక పనిని, భూదేవీ! నీకు చెప్పెదను. నా నొసటిపై తిలకమెట్లు ఏ మంత్రముతో దిద్దవలయునో తెలిపెదను. వా"సుదేవా! నీవే సమకూర్చిన ఈ ముఖాలం కారమును నేను తెచ్చితిని. దీనితో నీ ముఖము నలంకరింతును. దీనిని దేవా! దయతో స్వీకరింపుము. నాకు సంసారమును కూర్చు పాపము నుండి మోక్షము ననుగ్రహింపుము".

నారాయణుని పలుకువిని భూదేవి అచ్చెరువంది "భగవంతుడా!" అనుచు వరాహరూప దేవునితో ఇట్లు పలికెను. "నీ అర్చనల యందు శ్రద్ధగల భాగవతులు నీ పూజలను గూర్చి విని చక్కగా ఆచరింతురు. అట్టి నీ సేవాకర్మములయందు నీ భక్తులు నీవు తుష్టి పొందు విధముగా ఉపయోగింపదగు పాత్రలెట్టివి? దీనికి నాకు చక్కగా చెప్పుము." భూదేవి పలుకులు విని ఆలోకనాథుడు ఇట్లు పలికెను. దేవీ! నీవు నన్నడిగినదానికి సమాధానముగా నాకెట్టి పాత్రలు ప్రియములగునో వానిని తెలిపెదను వినుము. బంగారు, వెండి, కంచు పాత్రలలో నాకర్పింపవలసిన వానిని అర్పింతురు. కాని నేను వానిని అన్నింటిని వదలి రాగిపాత్రను ఇష్టపడుదును." నారాయణుని ఈ మాటవిని

ధర్మకామ అగు వసుంధర లోకనాథుడగు జనార్ధనునితో తీయని ఈ పలుకులతో "జనార్ధనా! బంగారు, వెండి, కంచు పాత్రలను వదలి నీవు రాగిపాత్రలను ఎట్లిష్టపడుదువు. ఆ రహస్యమును నాకు చెప్పుము" అని పలికెను.

అంతట భూదేవి మాటలను విని మొదటివాడు,అవ్యక్తుడు, అవ్యయుడు, లోకములలో అందరికి కోరదగినవాడు, శ్రేష్ఠుడు అగు నారాయణుడు భూదేవి కిట్లు బదులు పలికెను. "పుణ్యురాలా! నాకు రాగిపాత్ర ఏల ప్రియమైనదో చెప్పెదను, మనస్సును చెదరకుండ చేసికొని వినుము. ఓ ప్రియదర్శనా! ఈ రాగి పుట్టి ఏడువేల యుగములైనది. కమలపత్రాక్షి! ఆ సమయమున గుడాకేశుడనెడు మహారాక్షసుడు రాగి రూపు ధరించి నన్ను కొలుచుటకు సిద్ధపడెను. పదునారువేల ఏండ్లు అతడట్లు ధర్మకామముతో నన్నారాధింపగ నేనాతనిని తపస్సునకు ప్రీతినొందితిని. అంత ఆ రాగిపుట్టిన రమ్యమగు తామ్రాశ్రమమున నేనాతనిని గాంచి కొంచెముగా మాటలాడితిని. అంత అతడు మోకాళ్ళ పై నిలిచి నన్నే చింతించుచుండగా నేనాతని గాంచి "గొప్ప ప్రజ్ఞగల ఓ గుడకేశా! నీవు నా పూజయందు నెలకొని ఉన్నావంటిని." ప్రసన్నమగు హృదయముగల నేను ఇంకను అతనితో నిట్లంటిని. "మహాభాగా! గుడాకేశా! నేను నీకేమి చేయవలయునో చెప్పుము. భక్తుడవగు నీయెడ నేను మిక్కిలి సంతసించితిని. కర్మముతో, భావముతో నీవేది తలతువో, నీ హృదయమున ఇష్టమగు కోరిక యేదో ఆ వరమును అడుగుము." ఇట్టి నా మాటను విని గుడాకేశుడు చేతులతో దోసిలిపట్టి మిక్కిలి శుద్ధమగు అంతరాత్మతో ఇట్లు పలికెను. "దేవా! నీవు నిండు హృదయముతో నా యెడల తుష్టుడవైనచో నాకు నీయందలి భక్తి వేలకొలది జన్మముల వరకు గట్టిదై నిలుచుగాక! నీవు వదలిన చక్రముతో నా చావును కోరుచున్నాను. నీ చక్రముతో కూలిన నా యీ మజ్జయు, మాంసమును 'తామ్రము' అను పేరు గలదియై, పవిత్రము చేయు శుభద్రవ్యమగు గాక! దానితో చేసిన పాత్ర యందుంచి నీ కర్పించిన వస్తువు పవిత్రమైనదగు గాక. లోకనాథా! దేవా! ఇది నా చెదరని హృదయము. ఈ నా తపస్సు గొప్పదిగా తీవ్రమైనదిగా నీవు భావింతువేని నాయందు ప్రసన్నుడవైతివేని నాకీ వరము ప్రసాదింపుము."

"సరియే, అది యట్లే యగును. ఓయి మహారాక్షసా! లోకములుండు నంతవరకు నీవు రాగియందు నిలుచువాడవై నాలో నెలకొన్నవాడవగుదువు అని పల్కితిని. గుడాకేశుని

తపమిట్టిది. అతడే రాగి ఆయ్యెను. ఆతనిదెల్ల పాపములేనిది, శుభమైనది, పవిత్రమైనది, సంసారమోక్షణము కలిగించునట్టిది అగును– అని అచట నేను పలికితిని. అతడును తపస్సున నిష్ఠకల వాడాయెను. "వైశాఖమాసమున శుక్ల పక్షమున ద్వాదశినాడు మధ్యాహ్నమున సూర్యుడు వెలుగొందుచుండగా నా చక్రము నతడు చూచుచుండగా అగ్నిదీప్తి గల ఆ నా చక్రము అతనిని వధించును. సందేహము లేదు. అతడు నా లోకమున కరుగును. ఇందు సంశయము లేదు." అని యీ మాట పలికి అచ్చటనే అంతర్ధానము చెందితిని, చక్రముతో చచ్చు కోరికతో అతడును, శుద్ధములు, శ్రేష్ఠములు నాకు సంబంధించినవి అగు పనులు చేయుచుండును, లోకమునుండి మరలిన అంతరంగముతో ఆతడు ఆ నెల ఎప్పుడు వచ్చునో, చక్రము రాక ఎన్నడో, అది నా మాంసములను చీల్చి నన్నెప్పుడు విష్ణువునందు లీనము చేయునో అని తలపోయుచు ఉండగా ఆ వైశాఖ మాసము ఏతెంచెను. శుక్లపక్ష ద్వాదశినాడు సూర్యుడు నడిమింట నుండగా ధర్మమున చక్కని నిశ్చయముగల అతడు మనస్సును విష్ణువునందు చక్కగా నిలిపి "ప్రభూ! అగ్నివలె మంటలు క్రక్కుచున్న నీ చక్రమును నా పై వదలు, వదలు. వెంటనే నీ చక్రము నన్ను చీల్చివైచి నా ఆత్మను ఒక్కపెట్టున నీ కడకు తీసికొనిపోవుగాక!" అనిభావించెను. ఆతని మాంసమంతయు రాగి, రక్తము తగరము, ఎముకలు బంగారము, మలము కంచు అయ్యెనని చెప్పుదురు.

దేవీ! ఎవ్వడైనను గాని రాగి పాత్రతో నాకు నైవేద్య మిడినచో దాని ఒక్కొక్క మెతుకు వలన కలుగు గొప్ప ఫలమును గూర్చి వినుము. ఆ రాగి పాత్రలో ఉన్న మెతుకులెన్నో అన్ని వేల ఏండ్లు ఆతడు నా లోకమున ఆనందమందును. భాగవతుడు నాకు ప్రియమొనరింప గోరునేని ప్రతిదినము నాకొఱకు రాగి పాత్రను ఉపయోగింప వలయును. దీనివలన ధర్మము కలుగును. రాగి ఇట్లు పుట్టినది. కావున నాకు మిక్కిలి ఇష్టమైనది. దాని స్వరూపమును గూర్చి విశదముగా నీకు చెప్పితిని. రాగి పవిత్రములలో పవిత్రము. మంగళముల కెల్ల మంగళము. శుద్ధములలో శుద్ధము. సంసారము నుండి ముక్తి కలిగించునది. దీక్షితులు, విశుద్ధులు అగువారు నా సంబంధమగు కార్యములలో నాకు ప్రియమగు రాగినే ఉపయోగింపవలయును. ఇది దీక్షా విధానము. రాగి పుట్టుక ఇట్టిది. దీనిని నిండుగా నీకు చెప్పితిని. మరియేమి అడుగుదువు? (128)

129 వ అధ్యాయము - రాజన్నదోష ప్రాయశ్చిత్త కథనము

సూతుడు ఇట్లు పలికెను. ఇట్లు భూదేవి దీక్షను నారాయణుని ముఖము నుండి విని పవిత్రమైన మనస్సు కలదియై మరల విష్ణువుతో "దీక్ష మహిమ ఎంత గొప్పది! దాని సమృద్ధి ఎంత మేలైనది! దీనిని విన్న మేము పవిత్రులమైతిమి. ఆహా! లోకముల ప్రభువగు ఈ దేవుని మాహాత్మ్యము ఎంత గొప్పది! ఆ మహిమ నాలుగు వర్ణముల వారికి సుఖము కలిగించెడి దీక్షను నిర్మించినది. ఇట్లే, పరమేశా! నీ హృదయమున ఏదేని పరమ రహస్యమున్న యెడల నీ భక్తుల సుఖము కొరకు దానిని నాకు చెప్పవలయును. దేవా! నీవు మునుపు ముప్పది రెండు దోషములను గూర్చి చెప్పి ఉంటివి. బుద్ధి తక్కువ మనుజులు ఈ అపరాధములు చేసి, ఏ పనితో పరిశుద్ధులగుదురు? నాయందలి ప్రీతితో దానిని నాకు దయతో చెప్పుము" అని పలుకగా,

అంత గొప్ప కీర్తిగల శ్రీమన్నారాయణుడు మిక్కిలి శ్రేష్ఠమగు ధ్యానమును తాల్చి భూమికిట్లు బదులు పలికెను. ఏ దోషములు నెరుగని నాభక్తులు, నా పూజలయందు ఆసక్తి కలవారు, లోభము చేతనో, భయము వలననో లేక ఆపదలు వచ్చినపుడో రాజుల అన్నము తిన్నచో పదివేల యేండ్లు నరకమున మ్రగ్గిపోవుదురు. భగవంతుని ఆ మాట విని వసుంధర వణకిపోయెను. పదునేడు దినములు ఆమెకు తీవ్రమైన భయము కలిగెను.

ఆమె దిగులొందిన మనస్సుతో అన్ని లోకములకు సుఖము కలిగించు తీయని పలుకిట్లు పలికెను. "దేవా! నా హృదయమున నున్న దానిని వినుము. రాజుల తప్పేమి? దీనిని నాకు నీవు తెలుప తగుదువు." అంత భూదేవి పలుకువిని సర్వధర్మములను ఎరిగినవారిలో మిన్నయగు నారాయణుడు ధర్మమును వినగోరుచున్న భూదేవితో ఇట్లు పలికెను.

"సుందరీ! శ్రద్ధతో వినుము. ఇది రహస్యము, దోషములు లేని భాగవతులు ఎన్నటికిని రాజుల కూడు తినరాదు. రాజు లోకమున నా అంశముతో మెలగువాడే అయినను రజస్సు, తమస్సు అను గుణములతో మిక్కిలి దారుణమగు కర్మములు చేయువాడగును. అందువలన ఓ వరారోహా! రాజాన్నములు నింద్యములగుచున్నవి. సంశయము లేదు. ధర్మము నిలుపు విషయమున అది నాకు రుచింపదు. వసుంధరా! రాజుల అన్నము పవిత్రులగు భాగవతులు తినదగినదియు కలదు. దానిని గురించి

వివరించి చెప్పెదను వినుము. విధి చూపిన కర్మముతో నన్ను నెలకొల్పి భగవద్భక్తులైన రాజులు ధనధాన్యములతో సమృద్ధములైన పదార్థముల నొసగినచో సిద్ధులైన భాగవతులు నాకు నివేదింపగా మిగిలిన ఆ అన్నమును తిన్నను వారికి పాపము అంటదు.” మేలైన వ్రతములు గల భూదేవి విష్ణువు వచనము విని ఆ వరాహరూప దేవునితో మరల ఇట్లు పలికెను. “శుద్ధుడగు భాగవతుడు రాజాన్నమును తిని ఏ కర్మముతో పరిశుద్ధడగునో, జనార్ధనా! అది నాకు చెప్పుము.” దేవీ! రాజాన్నమును తిన్నవారు ఎట్లు తరింతురో అని నీవడుగుచున్న దానికి సమాధానము చెప్పెదను వినుము.

ఒక చాంద్రాయణము, ఒక నిండైన తప్తకృచ్ఛ్రము, ఒక సాంతపనము అనువానిని చేసినచో ఆ పాపము నుండి వెనువెంటనే ముక్తులగుదురు. (చాంద్రాయణము – చంద్రుని క్షీణతను బట్టి కృష్ణ పక్షమున ఒక్కొక్క ముద్దను తగ్గించుచు, శుక్లపక్షమున ఒక్కొక్క ముద్దను పెంచుచు ఆహారము తినుచు చేసెడి వ్రతము, తప్తకృచ్ఛ్రము, వేడినీరు, పాలు, నెయ్యి మూడు రోజులు నియమముతో పుచ్చుకొనుట, వేడి గాలి పీల్చుట అనువ్రతము. సాంతపనము, మూడు దినములు పండ్లు మాత్రమే తినుట, మూడుదినములు రాత్రులందే భుజించుట, తరువాత మూడుదినములు అడుగుకొనకుండా లభించిన దానిని మాత్రమే ఆహారముగా కొనుట, అటుపై మూడు దినములు ఉపవాసముండుటగా చేయు వ్రతము.) ఒకవేళ రాజుల అన్నమును తిన్నను ఈ కర్మమును ఆచరింపవలయును. అట్టి వాని అపరాధమును నేను పరిగణింపను. ఇదిగో ఇది నా మాట. నాకు ప్రియమాచరింపగోరువాడును, పరమగతిని కోరువాడును, ఎన్నటికిని రాజు అన్నమును తినరాదు. (129)

130 వ అధ్యాయము - దంతధావన ప్రాయశ్చిత్తము

శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. ఉదయమున పలుదాము పుల్లను ఉపయోగింపక (పండ్లు తోముకొనక) నా కడకు వచ్చువాని పూర్వపుణ్య మంతయు ఆ ఒక్కపాపముతో నశించును. నారాయణుని మాట విని ధర్మమునందు నిలుకడగల భూదేవి విష్ణుభక్తుల సుఖముకొరకై విష్ణువుతో ఇట్లు పలికెను. “ఎంతో కష్టపడి సంపాదించిన సర్వకాల సంబంధమగు పుణ్యమంతయు ఒక్క తప్పుతో ఎట్లు నశించును?”

"సుందరీ! ఒక్క తప్పు చేత పూర్వ పుణ్యమంతయు ఎట్లు నశించునో నేను చెప్పెదను వినుము. మనుష్యుడు సహజముగా దోషములు కలవాడు. కఫము, పిత్తములతో కూడిన వాడు. కుళ్లిన రక్తముతో నిండిన అతని ముఖము చెడువాసన కలదియై యుండును. పలుదోము పుల్లను వాడుటవలన, ఆ దోషము నిలువదు. ఆచారము వదలిన భక్తునికి శుద్ధి కలుగును.

"పలుదోముపుల్లను నమలక, నీ పూజాకర్మములను ఆచరించువానికి ప్రాయశ్చిత మేమి? దేనివలన నాతని ధర్మము నశింపకుండును?" నాకు చెప్పుము. "పుణ్యాత్మురాలా! నీవు నన్ను అడిగిన దానికి సమాధానముగా మానవులెట్లు శుద్ధి పొందుదురో చెప్పెదను. ఏడుదినములు ఆరుబయట పడుకున్నచో పలుదోమని పాపము నుండి మానవుడు శుద్ధి పొందును." ఈ విధానముతో ప్రాయశ్చిత్త మొనరించినవానికి దోషము కలుగదు. సంశయము లేదు. (130)

131 వ అధ్యాయము – పూజాపరాధములు, ప్రాయశ్చిత్తములు

మరల శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "మిథునకర్మమును కావించి స్నానము చేయక నా వస్తువులను తాకు దుష్టబుద్ధి పదునాలుగువేల యేండ్లు రేతస్సును త్రావును." అంత నారాయణుని పలుకు విని శ్రేష్ఠమగు వ్రతములు గల భూదేవి దిగులొందిన మనస్సు కలదియై మధుసూదనునితో "దేవా! భయము గొలుపు ఘోరమగు ధర్మమును ఏల పలుకుదువు? ఆ పురుషుడు రేతస్సు త్రావు వాడెట్లు అగును? ఇది నా పెనుదుఃఖము, దీనిని గూర్చి నీవు వివరముగా చెప్పవలయును" అని పలికెను.

"దేవీ! ఇది మిక్కిలి రహస్యము. మిక్కిలి గొప్పది. వ్యభిచారమును నిర్ణయించు గుర్తును చెప్పెదను. వినుము. జాలి ఏ కొంచెము లేనివారై, పురుషులు స్త్రీల యందు చేసెడు పాపపు పనుల ఫలమును తప్పక పొందుదురు. వరారోహా! నీవడిగిన ఈ దోషమునకు పరిశుద్ధియు లేదు. నా పూజల యందు శ్రద్ధగల గృహస్థులగు పురుషులు స్త్రీల విషయమున పొందిను రాగమనెడు దోషమునకు ప్రాయశ్చిత్తమెట్టిదో చెప్పెదను. మూడు దినములు అలసందల పిండిని, మరి మూడు దినములు బియ్యపు పిండిని, ఒక దినము గాలిని తిను నియమము వలన ఈ పాపము నుండి విముక్తుడగును. శాస్త్రము చూపిన విధానముతో, చేసిన దోషమును తెలిసికొని ఈ విధముగా ప్రాయశ్చిత్తము చేసికొనువానికి

ఆ పాపము అంటదు. ధర్మ విరుద్ధమగు స్త్రీ సంపర్కమును పొందినవానికి ప్రాయశ్చిత్త మెట్టిదియో నీకు చెప్పితిని. అది నా లోకసుఖమును కూర్చునది అగును. మరణించినవాని దేహమును తాకి, నాశాస్త్ర విధానములను పాటింపక వల్లకాటికి చనువాని తండ్రులు, తాతలు, తనతోపాటు వల్లకాటిలో నక్కలై శవములను పీకుకొని తినుచుందురు. అంత హరి మాట విని ధర్మమున వాంఛగల వసుంధర లోకులందరకు సుఖమును కలిగించు తీయని పలుకునిట్లు పలికెను. "నాథా! నీవే గతియని నమ్మి కొలిచెడివారికి ఈ విషయమున దారియేది? ఆ పాపమును వదిలించు కొనుటకు ప్రాయశ్చిత్తమెట్టిది? నాకు చెప్పుము."

"సుందరీ! నన్నడిగినదానికి ఇదిగో పాపమును పోకార్చు శుభ్రమును గూర్చి చెప్పెదను. ఏడు దినములు ఒంటిపూట భోజనము, మూడు దినములు ఉపవాసము, అటుపై పంచగవ్యము పుచ్చుకొనుట అనువానితో ఈ పాపము నుండి ముక్తి పొందును. (పంచగవ్యములు : ఆవుపాలు, పెరుగు, నెయ్యి, పేడ, మూత్రము) శవమును తాకగా కలుగు దోషమునకు సంబంధించి చేయదగు దానిని నీకు చెప్పితిని. భాగవతులందరు అన్ని విధములుగా ఈ దోషమును వదలి వేయవలయును.ఈ విధముగా ప్రాయశ్చిత్తమును చేసికొనువాడు పాపము లన్నింటి నుండి విడివడును. వానికి దోషము ఉండదు.

ముట్టతను తాకుట అను దోషమునకు ప్రాయశ్చిత్తము:

"దేవీ! ముట్టయిన స్త్రీని ముట్టుకొని భయములేనివాడై నన్ను తాకువాడు, రాగ మోహములతో కూడినవాడై కామమునకు వశమై పోయినవాడు, ఒక వేయి యేండ్లకాలము రజస్సును త్రావుచుండును. గ్రుడ్డివాడు, దరిద్రుడు, జ్ఞానహీనుడు, మూర్ఖుడు అగును. ఈ అపరాధము చేసి నరకమున పడుచున్నవాడు తన్ను తాను గుర్తింపజాలడు. ఇందు సంశయము లేదు" అనిన శ్రీ వరాహ భగవానునితో భూదేవి ఇట్లు పలికెను. "జనార్ధనా! నిన్నే శరణు పొంది నీ పనులయందు శ్రద్ధ కలిగినవాడు పొరపాటున ఈ దోషముతో కూడిన వాడైనచో ఏ పనిచేసి శుద్ధుడగును? దానిని నాకు చెప్పుము" అనగా శ్రీ వరాహమూర్తి "దేవీ! ముట్టు అయిన స్త్రీని ముట్టిన నా భక్తుడు మూడు త్రులు ఆకాశశయనము(ఆరుబయట నిద్రించుట) చేయవలయును. అంత నాతడు పరిశుద్ధుడగును. ఆచారమునకు వెలియైనవాడు ఈ విధముగా ప్రాయశ్చిత్తము చేసికొని ఆ

పాపము నుండి విడుదల పొందును. ఓ కాంతా! ఇట్లు ముట్టు అయిన స్త్రీని తాకుట అను దోషమును, దాని ప్రాయశ్చిత్తమును నీకు చెప్పితిని. ఇది సంసార దోషములను పోగొట్టునట్టిది."

శవము తాకు దోషమునకు ప్రాయశ్చిత్తము:

"చచ్చినవానిని తాకి నా క్షేత్రములలో నిలుచువాడు నూరువేల యేండ్లు గర్భములలో పడి దొరలు చుండును. పదివేల యేండ్లు చండాలుడై పుట్టును. ఏడువేల సంవత్సరముల గ్రుడ్డివాడగును. నూరేండ్లు కప్పయై ఉండును. మూడేండ్లు ఈగ యగును. పదునొకండు వత్సరములు లకుముకిపిట్ట అగును. పదునేడేండ్లు తొండయై పుట్టును. వందయేండ్లు ఏనుగు, ముప్పది రెండేండ్లు గాడిద, ఇరువది నాలుగేండ్లు ఎద్దు, పండ్రెండేండ్లు కుక్క, తొమ్మిది ఏండ్లు పిల్లి,పదునై దేండ్లు కోతియగును. నా పనుల యందు శ్రద్ధ కల భక్తుడు ఇట్టి తన దోషము చేత పెను దుఃఖము పొందును. సంశయము లేదు."

అంత హరి మాట విని కుమిలిపోయిన భూదేవి అందరి సంసారదుఃఖమును పోగొట్టుటకై యిట్లు పలికెను. "ప్రభూ! మనుష్యులకు పొందనలవికానిది, వెరపు గొలుపునది, నా ఆయువుపట్లను పగులగొట్టునది అగుపలుకు పలికెదవేల? నీకర్మము లందు నిష్టకలవారు ఆచారముల నుండి పరిభ్రష్టులై ఈ మహాఘోర స్థితుల నెట్లు దాటుదురో ఆ ప్రాయశ్చిత్త విధానమును నాకు తెలుపుము." అనుచు భూదేవి పలికిన ఆ మాటవిని లోకనాధుడగు జనార్దనుడు ధర్మమును పరిరక్షించుట కొరకు ఇట్లు పలికెను. "నా భక్తుడు శవమును ముట్టి పదునైదు దినములు ఒంటిపూట భోజనము చేయుచు నుండవలయును. ఈ విధానము నాచరించి పిదప పంచగవ్య ప్రాశనము చేయవలయును. మనసులో మలినము లేనివాడిట్లు పరిశుద్ధుడై పాపమంటని వాడగును. చచ్చిన వానిని ముట్టిన దోషమునుండి మనుజుడెట్లు పరిశుద్ధు డగునని నీవడిగిన దానికి సమాధానము చెప్పితిని." ఈ విధముగా ప్రాయశ్చిత్తము చేసికొనువాడు దోషము నుండి విముక్తుడై నాలోకమునకు చేరుకొనును. (131)

132 వ అధ్యాయము - అపానవాయు దోష ప్రాయశ్చిత్తము

శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను."భూదేవీ! నన్ను తాకుచు మలము వంటి అపాన వాయువునువదలువాడు, వాయువుచే పీడింపబడిన మనస్సు కలవాడై అయిదేండ్లు

ఈగయై, మూడేండ్లు ఎలుకయై, మూడేండ్లు కుక్కయై, తొమ్మిదేండ్లు తాబేలై పుట్టును. ఈ పాపమునకు ఇది నేను విధించెడు శిక్ష. ఈ తప్పు చేసినవాడు శాస్త్ర మెరిగిన వాడు, నా భక్తుడైనను ఇదియే అతనికి శిక్ష." ఈ మాట విని భూదేవి హృషీకేశునితో ఇట్లు పలికెను. "నీ భక్తులు సరికాని పనిచేసి పరిశుద్ధి నెట్లు పొందుదురు? అట్టివారి సుఖము కొఱకు దీనిని నిన్నడుగుచున్నాను."

"దేవీ! పుణ్యురాలా! ఏ పనిచేసి ఈ దోషము నుండి దాటుదురో దానిని మొత్తముగా చెప్పుచున్నాను వినుము. అలసందల పిండితో మూడు దినములు, రాత్రి భోజనముతో మూడు దినములు కడపి ప్రాయశ్చిత్తము చేసికొనువాడు నాకు దోషము చేయనివాడగును. అన్ని అంటులను వదలివైచి నాలోకమున కరుగును. మంచిదానా! మలవాయువునకు సంబంధించి అపరాధము చేసిన వాని దోషమును, ప్రాయశ్చిత్తము వలన కలుగు గుణమును నీకు చెప్పితిని." (132)

133 వ అధ్యాయము - మల విసర్జన దోష ప్రాయశ్చిత్తము

శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "భూమీ! నా అర్చనము చేయుచు, మలమును విసర్జించు దోషమును గూర్చి నేను చెప్పుచున్న దానిని వినుము. అట్టివాడు రౌరవ నరకమున దేవతల వేయియేండ్లు మలము తినుచు మహాదుఃఖము ననుభవించును. చెడిన బుద్ధితో నా ధర్మము నుండి పరిభ్రష్టుడైన వాడు పాపము నుండి విడివడు ప్రాయశ్చిత్తమును చెప్పెదను వినుము. నీటిలో ఒక దినము, బయలున ఒక దినము నిద్రించి ఈ అపరాధము వలన విడుదల పొందును. పూజా విధాన సమయమున మలము విసర్జించు నా భక్తుల అపరాధమును, ప్రాయశ్చిత్తమును నీకు తెలియజెప్పితిని." (133)

134 వ అధ్యాయము - మఱికొన్ని దోషములు, ప్రాయశ్చిత్తములు

శ్రీవరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "నా భక్తుడు నా మంత్రములను వదలి చెడు పలుకులు పలికినచో అట్టివాడు పండ్రెండు జన్మములు మూర్ఖుడగును. నా భక్తుడు అట్టి పాపము నుండి ముక్తి పొందు ప్రాయశ్చిత్త విధిని చెప్పెదను. పదునైదు దినములు బయలున పవ్వళించవలయును. అప్పుడే దోషము నుండి ముక్తుడగును. సంశయము లేదు. ఇది మౌనమును విడచిన దోషమునకు ప్రాయశ్చిత్తము."

నల్లని వస్త్రము తాల్చిన దానికి ప్రాయశ్చిత్తము – శుద్ధి అపరాధమునకు ప్రాయశ్చిత్తము:

నల్లని వస్త్రముతో నన్ను సమీపించువాడు అయిదువందల యేండ్లు పురుగై యుండును. ఓ విశాలాక్షీ! సుశ్రోణీ! ఈ దోషము నుండి శుద్ధి చేయునట్టి ప్రాయశ్చిత్తమును తెలిపెదను. దాని చేత నరుడు పాపమునుండి విడివడును. శాస్త్రమున కానవచ్చు. పద్ధతి ప్రకారము చాంద్రాయణ వ్రతమును ఆచరించి మానవుడు ఈ పాపము నుండి ముక్తుడగును. సంశయము లేదు. ఇది నల్లని వస్త్రము ధరించి సమీపించిన దానికి అను ప్రాయశ్చిత్తము. అంతేకాక కాని పద్ధతిలో నన్ను తాకి నాకడకు చేరువాడు మూర్ఖుడు, పాపకర్ముడు, నాకు అప్రియము కలిగించు వాడును అగును. అతడొసగిన గంధములు, మాలలు మొదలగు వానిని నేను గ్రహింపను. వాడు తాకిన దానిని కూడ నేను అందుకొనను. అంత నారాయణుని పలుకు విని శ్రేష్ఠమగు వ్రతములు గలదియు, ధర్మమున వాంఛ కలదియు అగు వసుంధర తీయగా నిట్లు పలికెను. "నాథా! ఆచారమున వైపరీత్యము కలిగినపుడు జరుగుదానిని చెప్పితివి. ఇప్పుడు నీవు ముఖశుద్ధిని గూర్చిన రహస్యమును చెప్పదగును. ఈ భూమిపై భాగవతులు నీ పనుల యందు శ్రద్ధకలవారు ఏ కర్మ విధానముతో శుద్ధి చేసికొని నీ కడ కరుదెంతురు? దేవా! ఇది సంశయము. నాకు మిక్కిలి వేడుకగా నున్నది. నీ భక్తుల సుఖము కొరకు నీవు లోపము లేకుండ చెప్పవలయును."

శ్రీ వరాహ దేవుడు ఇట్లు చెప్పెను. "దేవీ! భీరూ! నీవు నన్ను బ్రతిమాలుచు అడుగుచున్న ఆ రహస్యమును నీకు చక్కగా తెలిపెదను. సర్వకర్మములను పరిత్యజించి నన్ను చేరుకొనువాడు శుద్ధి ఎట్లు చేసికొని వలయునో చెప్పెదను వినుము. తూర్పునకు మొగము పెట్టి కాళ్ళు నీళ్ళతో కడుగుకొని, నీటిని తగువిధముగా గ్రహించి మూడు మట్టి ముద్దలను గ్రహించి చేతిని వానితో నీళ్ళతో కడుగుకొనవలయును. పిదప ఏడు పుడిసెళ్ళ నీటితో ముఖమును శుద్ధి చేసికొనవలయును. అయిదయిదు పాత్రల నీటితో రెండు కాళ్ళను కడగుకొనవలయును. పిదప ఆ పాత్రలను శుద్ధి చేయవలయును. ఇది నా ప్రియమును కోరినచో చేయదగుపని. మూడు పాత్రల నీటిని శరీర శుద్ధి కొరకు పుచ్చుకొనవలయును. చేతులతో ముఖమును తుడుచుకొన వలయును. ఇంద్రియములపై అదుపు ఉంచుకొనవలయును. సంసారమోచనము ఫలముగా, విధివిధానమునననుసరించి భావించుచు ప్రాణాయామము నాచరింప వలయును. పరబ్రహ్మమును మనసుననిలిపి

తలనుముమ్మారు తాకవలయును. పిదప చెవులను,ముక్కును మూడేసి పర్యాయములు స్పృశింపవలయును. తాను కూర్చున్నచోటును మూడు మారులు నీళ్లు చల్లి తాకవలయును. నన్ను సమీపించునపుడు భక్తుని కర్తవ్య మిట్టిది. కడపట తన దేహముపై నీళ్లు చల్లుకొనవలయును. నా ప్రియమును కోరు భక్తుని కర్తవ్య మిట్టిది. నా అర్చన యందు నిలుకడ కలిగి యిట్లు చేయువానికి ఏ దోషమును అంటదు. దేవీ! ఇందు సందియము లేదు." అంత నారాయణుని పలుకు విని వసుంధరాదేవి భాగవతులందరకు ప్రియమైన మాటను తీయగా ఇట్లు పలికెను. "ఈ శుద్ధి విధానముతో శుభకర్మముల నాచరించువాడు ప్రమాదపడుట, ప్రాయశ్చిత్తము పొందుట ఎట్లో తాము చెప్పవలయును."

శ్రీ వరాహ దేవుడు ఇట్లు చెప్పెను. "నా శాసనమునకు వెలిగా ప్రవర్తించు వారేగతిని పొందుదురో ఆ గుట్టును నీ కెరిగింతును వినుము. ఈ విధానమును అతిక్రమించి నన్ను సమీపించువాడు పురుగై పదివేల పదివందల ఏండ్లు ఉండును. ఇందు సంశయము లేదు. ఆ మూర్ఖునికి ప్రాయశ్చిత్త మెట్టిదో చెప్పెదను. దానితో ఆతడు మరల కృతకృత్యుడగును. అతడు బ్రాహ్మణుడు కానీ, క్షత్రియుడు కానీ, వైశ్యుడు కానీ, నా బుద్ధియందు నిలుచువాడెవ్వడు గానీ, మహాసాంతపనము, తప్తకృఛ్ఛము అనువానిని నిర్దుష్టముగా చేసి ఈ పాపము నుండి విముక్తి పొందును. పరమగతిని పొందును ఇది. శుద్ధి అపరాధమునకు ప్రాయశ్చిత్తము. ఎవ్వడు గాని నా పనులయందు శ్రద్ధ కలవాడు, మనస్సును చపలము చేసికొని క్రోధముపై కొన్నవాడై నా దేహమును తాకునేని అది మహాదోషము. నేను రాగము గలవానిని, తీవ్రమగు కోపము కలవానిని ఇష్టపడను. ఇంద్రియములపై అదుపుగల వానిని, మంచివానిని, పరిశుభ్రత కలవానిని, భక్తుని ఎల్లప్పుడు ఇష్టపడుదును. అయిదు ఇంద్రియములను తన ఆధీనమున నిలుపగలవానిని, ద్వంద్వములను వదలిన వానిని, అహంకారమును పూర్తిగా దూరము చేసికొనినవానిని, నా పనులయందు మిక్కిలి ప్రీతి కలవానిని నేను ఇష్టపడుదును. (ద్వంద్వములు – జంటలు – లాభము – నష్టము, గెలుపు – ఓటమి; సుఖము – దుఃఖము మొదలగునవి). పరిశుద్ధుడైన భాగవతుడు క్రోధము కలవాడై నన్ను తాకినచో ఆతడేమి పొందునో ఆ విషయమును నీకు చెప్పెదను. వరాననా! వినుము. అతడు నూరేండ్లు మిడుత అగును. నూరేండ్లు డేగ అగును. మూడువందల యేండ్లు కప్ప అగును. పదియేండ్లు రాక్షసుడగును. అరువదియేండ్లు

నపుంసకుడగును. రేతస్సు తినువాడగును. ఇరువదియొక్క ఏండ్లు గ్రుడ్డివాడగును. ముప్పది రెండేండ్లు గ్రద్ద అగును. పిదప పదియేండ్లు నాచును తినుచు ఆకాశమున సంచరించు చక్రవాకమగును. చిట్టచివరకు కొన్నాళ్ళు కప్ప బ్రతుకు గడపి బ్రాహ్మణుడగును. తాను చేసిన దోషము వలన సంసార సాగరమున పడును."

"అయ్యో! నీవు పలికిన దెంత ఘోరముగా నున్నది! నా చిత్తము వికలమై పోయినది. నిలువకున్నది. నీ పలుకు నీ భక్తులకు ఎంతో భయంకరమైన పొందరాని ఆపద. దాటనలవికాని సంసార సముద్రమున గూర్చి విని వణకిపోవుచున్నాను. కుమిలిపోవు చున్నాను. కానీ దేవదేవా! జగత్పతీ! నీకేమియు చెప్పజాలకున్నాను. దేవా! నా ప్రీతి కొరకును, సర్వలోకముల సుఖము కొరకు, పూజలయందు తగులముగల నీ భక్తులు క్రోధము, లోభము కలవారైనచో వారు ఆ పాపము నెట్లు వదలించుకొందురో సెలవిమ్ము. పాపము వీరు ఒకపాటి సత్తువ కలవారు. భయము పొందినవారు. రాగలోభములతో కూడు కొన్నవారు, ఇట్టి వీరు ఈ మహాకష్టము నెట్లు దాటుదురో ఆ ప్రాయశ్చిత్తమును నాకు చెప్పుము."

సనత్కుమారా! అప్పుడు తామరరేకుల వంటి కన్నులు కలవాడు, వరాహముఖముతో కూడినవాడు అగు నారాయణుడు నా భక్తికి సంతృప్తి చెంది ఇట్లు పలికెను. అంత భూదేవి మాట విని బ్రహ్మకుమారుడు, మునియు, యోగతత్వమెరిగినవాడు నగు సనత్కుమారుడు వసుంధరతో నిట్లనెను. "భూదేవీ! నీవు ధన్యవు, భాగ్యవతివి. ఏలయనగా వరాహరూప భగవానుడు, సర్వమాయలకు పేటిక అయిన శ్రీహరిని ఇట్లు అడిగితివి. దేవి! యోగములు, యోగ అంగములు అన్నియు నిండుగా ఎరిగినవాడు, సర్వధర్మములు ఎరిగినవారిలో శ్రేష్ఠుడు అగు నారాయణ దేవుని ఇంకేమేమి అడిగితివి?"

సనత్కుమారుని మాట విని ఆ భూదేవి యిట్లు బదులు పలికెను. "బ్రాహ్మణోత్తమా! ఆ దేవుని నేనేమేమి అడిగితినో చెప్పెదను వినుము. నేను శ్రీ మన్నారాయణ దేవుని పూజా కార్యములు, విధానములు, యోగము, అధ్యాత్మ విద్య, భౌతిక స్థితిగతులు అనువానిని గూర్చి అడిగితిని. అంత మాయల పెట్టె ఆ విష్ణువు క్రుద్ధులగు భాగవతులు దేనితో పాపము నుండి పరిశుద్ధులగుదురో దానిని నాకు తెలిపెను. "నా అర్చనల యందు శ్రద్ధ కలవాడు ఇట్టి వ్రతమును చేయవలయును. ఇంటింట

బిచ్చమెత్తవలెను. (ఆరవ కాలము అనగా సాయంకాలము. పగటిభాగమును ఆరుగా భావింతురు. 1.ప్రాతః కాలము, 2.సంగవకాలము, 3, పూర్వాహము, 4. మధ్యాహ్నము, 6. అపరాహ్నము, 6, సాయాహ్నము.)బ్రాహ్మణా! ఈ విధానముతో కర్మములను చేయువాడు పాపము నుండి విడివడునని జనార్ధనుడు చెప్పెను. బ్రాహ్మణోత్తమా! పరమమైన సిద్ధిని, విష్ణులోకమును నరుడు కోరునేని వెనువెంటనే విష్ణువును ఈ విధముగనే ఆరాధింపవలయును. అట్లు చేసినవారు తరింతురు."

అంత భూమి మాటవిని బ్రహ్మమానస పుత్రుడైన సనత్కుమారుడు ధర్మకామయగు వసుంధరతో నిట్లనెను. "ఆహా! దేవీ! నీ పలుకు ఎంత గుహ్యము ఎంత రహస్యము. ఏకాంతమున జరిగినది ఆ విష్ణువు ముఖము నుండి వెలువడిన ధర్మములను నాకు చెప్పదగును." భూదేవి ఇట్లు పలికెను. "ఎఱ్ఱని కమలముల వంటి కనులు కలవాడు, శంఖము చక్రము గదలను చేపట్టిన వాడు, లోకనాధుడు, జనార్దనుడు అగు వరాహరూప భగవానుడు మేఘము, దుందుభి నాదము వంటి కంఠధ్వని కలవాడై భక్తుల కర్మములకు సుఖమునకుగాను గుణసంపదతో నిండిన మధురమగు వాక్యమునిట్లు పలికెను. ఆచారముతో కూడినవాడై ఈ విధానముతో నాఅర్చన చేయువాడు నాలోకమున కరుగును. పరమగతిని కోరువాడైనచో కోపముతో, లోభముతో తొందరతనముతో నా పూజనము చేయరాదు. క్రోధమును విడనాడి యింద్రియములను గెలిచి నన్నర్చించువారు దోషములు లేనివారై సంసారమున పడకుందురు ఇది క్రోధదోష ప్రాయశ్చిత్తము."

పనికిరాని పూలతో నర్చించు తప్పునకు ప్రాయశ్చిత్తము:

"భూదేవీ! పూజకు పనికిరాని పూవుతో నన్నర్చించువాని పాటు ఎట్టిదో చెప్పెదను, వినుము. మూర్ఖులు, నాకు అప్రియమును కలిగించువారునగు భాగవతులు ఒసగిన అట్టి దానిని నేను గ్రహింపను. అట్టివారు నాకు ప్రియులు కారు. వారి అజ్ఞాన దోషముచేత ఘోరమైన రౌరవ నరకమందు పడుదురు. దుఃఖములు అనుభవింతురు. పదియేండ్లు కోతిగా, పదుమూడేండ్లు పిల్లిగా, అయిదేండ్లు ఎలుకగా, పంద్రెండేండ్లు ఎద్దుగాను అగును. ఎనిమిదేండ్లు మేక, ఒకనెల ఊరకోడి, మూడేండ్లు దున్న అగును. సంశయము లేదు, మంచిదానా! విశాలాక్షీ! నాకిష్టము కాని పనికిరాని పూవు నా కొసగిన దాని ఫలమెట్టిదియో నీకు చెప్పితిని."

"నిర్మలమగు మనస్సుతో నీవు నాయెడ ప్రసన్నుడవగుదువేని నీ పూజాసక్తి గల ఆ భక్తులు ఎట్లు శుద్ధి పొందుదురో నాకు తెలుపుము." అన్నది ధరణి. "దేవీ! నన్నడిగినదానికి బదులు చెప్పెదను. మానవులు ఈ తప్పునకు ఏ ప్రాయశ్చిత్తము చేసికొని శుద్ధులగుదురో దానిని వివరించెదను. వసుంధరా! ఒకనెల కాలము ఒంటిపూట భోజనము చేయవలయును. పదునాలుగు దినములు వీరాసనమువేయుచు నుండవలయును. ఒకనెలరోజులు నాలుగవవంతు భోజనము మాత్రము చేయుచు నేతి పాయసమును తినవలయును. అటుపై మూడు రోజులు యవల అన్నమును, మూడు రోజులు గాలి భోజనము చేయవలయును. (గాలి భోజనము – ఉపవాసము) ఈ విధానముతో నా పూజలు చేయువాడు అన్ని పాపముల నుండి విడివడి లోకమున కరుగును. (134)

135 వ అధ్యాయము – మఱికొన్నిదోషములు, ప్రాయశ్చిత్తములు

ఎరుపు బట్టలను కట్టు దోషమునకు ప్రాయశ్చిత్తము:

శ్రీవరాహ భగవానుడు ఇట్లు పలికెను. ఎఱ్ఱని వస్త్రముతాల్చి నా కడకు అరుదెంచువాని సంసారముక్తి విధాన మెట్లుండునో, ఓ భూదేవీ! వినుము.తెలిసి చేసిన కర్మదోషము చేత మానవుడు ముట్టుతలైన స్త్రీల రజస్సును తాకిన వాడగును. ఎఱ్ఱని వలువలు తాల్చిన వ్యక్తి పదునైదు వత్సరములు అట్టి రజస్సై యుండి పోవును. అట్లు శాస్త్రవిధిని వదలి ప్రవర్తించు పురుషులు శుద్ధి పొందెడు ప్రాయశ్చిత్త విధానమును వక్కాణించెను. పదునేడు దినములు ఒంటిపూట భోజనము చేయవలయును. మూడు దినములు గాలిని, ఒక రోజు నీటిని పుచ్చుకొనవలయును. ఈ విధముగా నాకు అప్రియము చేసినవాడు అట్టి ప్రాయశ్చిత్తమును చేసికొని దోషము నుండి విడివడును. నాకు ప్రియుడును అగును. భూమీ! ఎఱ్ఱని వస్త్రములు (నా పూజా సమయమున) తాల్చుట, దాని ప్రాయశ్చిత్తము అనువానిని నీకు తెలిపితిని. ఇది సంసార మోక్షణమును కలిగించునట్టిది.

చీకటిలో దైవస్పర్శకు ప్రాయశ్చిత్తము:

సుందరీ శాస్త్రమును పాటింపక చీకటిలో దీపము లేకుండ త్వరపడుచు, విజ్ఞత లేక నన్ను తాకువాని పతన మెట్లుండునో చెప్పెదను వినుము. ఆ పాపము చేత ఆ నరాధముడు కష్టములలో నలిగిపోవును. వాడు ఒక్క జన్మకాలము గ్రుడ్డివాడై చీకటి

గుయ్యారమున అడ్డమైన గడ్డిని తినువాడై ప్రవర్తించును. ఎప్పుడు తన తప్పు తెలిసికొని నన్ను చెదరని మనస్సుతో స్మరించునో అప్పుడు నా భక్తుడై పుట్టును. ఇది ఆతనిని చక్కదిద్దు విధానము. చీకటిలో నన్ను తాకువానికి ప్రాయశ్చిత్త మెట్టిదో, దేనితో అతడు తరించునో, నాలోకమునకరుగునో దానిని చెప్పెదను.పదునైదుదినములు కన్నులకు గంతలు కట్టుకొనవలయును. ఇరువది దినములు శ్రద్ధతో ఒంటిపూటభోజనము చేయవలయును. ఏదో ఒకనెలలో ద్వాదశినాడు నీరు మాత్రము త్రావుచు ఉండవలయును. పిమ్మట గోవు మూత్రముతో వండిన యవల అన్నమును భుజింపవలయును. ఇట్టి ప్రాయశ్చిత్తము చేత ఆ పాతకము నుండి అతడు విడుదల పొందును.

నల్లని వలువలు ధరించు దోషమునకు ప్రాయశ్చిత్తము:

నల్లని బట్టలు కట్టుకొని నా పూజల యందు ఆసక్తి కలవాడై ఆయాపనులు చేయువాని పాట్లెట్టిదో వినుము. చెట్లపై పురుగై అయిదేండ్లు, దోమయై మూడేండ్లు, ఈగయై మూడేండ్లు, చేపయై పదియేండ్లు, లకుముకి పిట్టయై పదునైదేండ్లు, ముంగిసయై యైదేండ్లు, తాబేలై పదియేండ్లు ఈ ప్రపంచమున త్రిమ్మరు చుండును. నన్ను ప్రతిష్ఠించిన తావులలో పదునాల్గేండ్లు పావురమై నా పరిసరములలో నిలిచి యుండును. నల్లని బట్టలు తాల్చిన దోషమునకు ప్రాయశ్చిత్తమును చెప్పెదను. దీనితో అతడు సిద్ధిని పొందును. సంసారము నుండి మోక్షము పొందును. ఏడుదినములు యవల పిండిని, మూడు రాత్రులు పేలాలపిండిని రాత్రికి మూడు చొప్పున తినుచు పాపము నుండి విడుదల పొందును. ఈ పద్దతితో కర్మములు చేయువాడు శుచియగు భాగవతుడై నా దారిననుసరించువాడై సంసారమునకు పోకుండును నాలోకమునకు పయనించును.

ఉతుకని వస్త్రముల దోషమునకు ప్రాయశ్చిత్తము:

ఉతుకని వస్త్రము తాల్చి నా భక్తుడు నాపూజలు చేసినదో ఆ దోషమునకు శిక్షయేమో తెలిపెదను. అట్లు మాసిన బట్టలు తాల్చి పూజ చేయువాడు సంసారమున పడిపోవును. ఒక జన్మమున పక్షియు, ఒక జన్మమున లొట్టిపిట్టయు, ఒక జనమున గాడిదయు, ఒక జన్మమున నక్కయు, ఒక జన్మమున గుఱ్ఱమును, ఒక జన్నమును లేడియు అగును. ఇట్లు ఏడు జన్మముల తరువాత మానవుడై పుట్టును. నాకు భక్తుడు, గుణము లెరిగిన వాడు, నా పూజలయందు శ్రద్ధకలవాడు, దోషములు లేనివాడు, సమర్థుడు

అహంకారము లేనివాడు అగును. అంత భూదేవి, “మాసిన వలువలు కట్టి పూజచేయు మానవులు పొందెడు దుఃఖమును నీవు చక్కగా వివరించి చెప్పితివి. సర్వకర్మములకు మేలు కూర్చెడు ప్రాయశ్చిత్తమును కూడ నాకు చెప్పుము. నీ పూజ యందు చెదరని ఆసక్తి కల భక్తులు ఏమిచేసి యీ పాపము నుండి ముక్తి పొందుదురో దానిని నాకు సెలవిమ్ము.” అనెను. “దేవీ! నీ అర్చనలకు సుఖమును కూర్చునట్టి ప్రాయశ్చిత్తమును చెప్పెదను. వినుము. యవల పిండితో మూడు దినములు, పిండితో మూడు దినములు, నూకలతో మూడు దినములు, పాయసముతో మూడు దినములు, పాలతో మూడు దినములు, ఏమియు తినకుండ మూడు దినములు– ఇట్లు మాసినగుడ్డలు కట్టుకొని పూజచేయువాడు ప్రాయశ్చిత్తము చేసికొనినచో అతనికి దోషముండదు. సంసారమునకు ప్రవేశింపడు.”

కుక్క ఎంగిలి దోషమునకు ప్రాయశ్చిత్తము:

కుక్కముట్టిన పదార్థమును నాకు నివేదన మొసగువాడు. ఆ పాపము వలన సంసారమను మహాభయమున చిక్కుకొనును. ఏడు పుట్టుకలు కుక్కయు, ఏడు పుట్టుకలు నక్కయు, ఏడేండ్లు గ్రుడ్ల గూబయునై పిదప మానవుడుగా పుట్టును. అంత భాగవతులలో శ్రేష్ఠుడైన వాని యింటియందు విశుద్ధమగు బుద్ధి కలవాడు, వేదముల నెరిగిన వాడు నా భక్తుడునై పుట్టును. పిక్కటిల్లిన శక్తిగల ప్రాయశ్చిత్తమును చెప్పెదను. మానవులు దానితో పాపమును వదలి సంసారమను సముద్రమును దాటుదురు. దుంపలు, పండ్లు, కూరలు, పాలు, పెరుగు, పాయసము, గాలి – వీనిని మూడేసి దినముల చొప్పున తినుచు ఇరువది యొక్క రోజులు చెదరని దీక్షతో, మంచి లక్షణములతో గడుపవలయును. అప్పుడా దోషము ఉండదు. నా లోకమునకు ప్రవేశింపడు.

పందిమాంసము తినిన దానికి ప్రాయశ్చిత్తము:

పంది మాంసము తిని నా కడకు వచ్చు వాని పాపమెట్టిదో, సుందరీ! చెప్పెదను. పందియై పదియేండ్లు అడవిలో తిరుగును. పదునాలుగేండ్లు బోయవాడగును. పిదప ఏడేండ్లు మట్టియై నీట మునుగుచుండును. పిదప పదునాలుగేండ్లు ఎలుకై, అటుపై పందొమ్మిదేండ్లు రక్కసుడు అగును. ముళ్ళపందియై ఎనిమిదేండ్లు అడవిలో తిరుగు చుండును. ముప్పదియేండ్లు మాంసము తిండిగా గల పులియై పుట్టును. ఇట్లు యాతనల నన్నింటి ననుభవించి పంది మాంసము తిన్నవాడు పుణ్యముకల కులమున భాగవతుడై

పుట్టును. నిండైన లక్షణములు గల హృషీకేశుని మాట అంతయు విని భూదేవి తలపై దోసిలి యొగ్గి ఇట్లు పలికెను. "పందిమాంసము తిన్నవానికి ప్రాయశ్చిత్త మెట్టిదియో భక్తులకు సుఖమును కూర్చెడు ఆ పరమ రహస్యమును నాకు తెలుపుము." శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. పశువుల పుట్టుక అనెడు సముద్రము నుండి మానవులెట్లు దాటుదురో చెప్పెదను. అయిదు దినములు ఆవు పేడతో, ఏడు దినములు నూకలతో, ఏడుదినములు నీటితో, ఏడు దినములు ఉప్పుకారములు లేని చప్పిడి కూటితో, మూడు దినములు పేలాలపిండితో, ఏడు దినములు నూవులతో, ఏడు దినములు ఉప్పుతో, ఏడు దినములు పాలతో గడపి తనకు శుద్ధిని కలిగించుకొనవలయును. క్షమ, ఇంద్రియ నిగ్రహము కలవాడగును. అహంకారమును విడనాడును. ఇట్లు చెదరని దీక్ష కలవాడై నలుబది తొమ్మిది రోజులు ప్రవర్తించువాడు పాపములన్నింటి నుండియు ముక్తి పొంది జ్ఞానము కలవాడై, ప్రమాదము లేనివాడై నా కర్మము లాచరించి నా లోకమున కరుగును.

బాతు మాంసపు దోషమునకు ప్రాయశ్చిత్తము:

బాతు మాంసము తిని నాకడ కరుదెంచువాడు పదునైదేండ్లు బాతు అగును. పదియేండ్లు మొసలి యగును. అయిదేండ్లు పంది యగును. నా యెడల చేసిన ఈ తప్పునకు సంసారమున పడి పొరలుచుండును. కడకు చేయరాని పుణ్యకర్మము చేసి శ్రేష్ఠమగు కులమున పుట్టును. పరిశుద్ధుడు, శ్రేష్ఠుడు, దోషములేనివాడు అగు భాగవతుడై సర్వధర్మములను వదలిచి నా లోకమున కరుగును. మనుజుల ఘోరమైన దుఃఖమనెడు సముద్రము నుండి దేనివలన దాటుదురో అట్టి ప్రాయశ్చిత్తమును, బాతుమాంసము తిన్న పాపమునకు చేయవలసిన దానిని చెప్పెదను. మూడు దినములు యవల అన్నము, మూడు దినములు గాలిని, మూడు దినములు పులుపు, ఉప్పు లేని అన్నమును– ఇట్లు పదునైదు దినములు భోజన నియమ మును పెట్టుకొని ప్రాయశ్చిత్తము చేసికొన వలయును. మనోజ్ఞమైన గతిని కోరువాడగునేని చక్కదిద్దుకొన్న బుద్ధి కలవాడై బాతుమాంసము తిన్న తప్పునకు ప్రాయశ్చితము చేసికొనవలయును.

దీపపు దోషమునకు ప్రాయశ్చిత్తము:

దేవీ! దీపము ముట్టుకొని నా పూజలు చేయుట అను దోషము వలన మానవుడు పాటునొందును. పుణ్యాత్ములారా! దానిని గూర్చి చెప్పుచున్నాను. వినుము. అట్టివాడు

అరువది యేండ్లు కుష్టరోగియై చండాలుని యింట ఉండును. ఇందు సంశయము లేదు. ఇట్లు ఆ కర్మ ఫలము ననుభవించి నా క్షేత్రమున మరణించెనేని నా భక్తుడై పవిత్రమగు భాగవతుని యింట జన్మించును. దీపమును తాకిన దానికి ప్రాయశ్చిత్తమును చెప్పెదను. దీనితో మానవులు నీచములగు చండాల యోనుల నుండి బయటపడుదురు. ఏదో ఒక మాసమున శుక్లపక్ష ద్వాదశినాడు నాలుగవ కాలమున ఆహారమును కొనుటయు, ఆరుబయలున నిద్రించుటయు చేయవలయును. విధి ననుసరించి నాకు దోష పరిహారముగా దీపము నొసగి పవిత్రులైనా పూజా మార్గమున నిలుతురు. దీపము తాకుట అను దోషము నుండి శుద్ధి కలిగించు విధానమును నీకు చెప్పితిని. దీనివలన నరుడు శుభమును పొందును. (135)

136 వ అధ్యాయము – మఱికొన్నిదోషములు, ప్రాయశ్చిత్తములు

వల్లకాటికి పోయి స్నానము చేయనందుకు ప్రాయశ్చిత్తము:

నరుడు వల్లకాటికి వెళ్ళి స్నానము చేయకయే నన్ను తాకినచో అట్టి దోషము ఫలమును స్పష్టముగా చెప్పెదను వినుము. పదునాలుగేండ్లు భూమిపై నక్కయగును. ఏడేండ్లు పక్షిరాజగు గ్రద్దయగును. అవి రెండును మనుష్య మాంసమును తినుచుండును. పిదప పదునాలుగేండ్లు పిశాచమగును. అటుపై ముప్పది యేండ్లు శవముల ఎంగిలిని తినుచుండును. నారాయణుని వలన అట్టి మాట విని ధరణి యిట్లు పలికెను. "లోకనాథా! జనార్ధనా! నాకు మిక్కిలి ఉత్కంఠ కలుగుచున్నది. ఈ రహస్యమును మొత్తముగా చెప్పదగును. పుండరీకాక్షా! వల్లకాడు ఈశ్వరుని మెప్పు పొందినట్టిది. అట్టి పవిత్రము, శివుడు మెచ్చినది యగు వల్లకాటి యందలి దోషమేమి? గొప్ప తేజస్సు గల భగవానుడు శివదేవుడు కాంతులు చిమ్మునది, గొప్ప శక్తి కలదియు అగు పుర్రెను చేతబట్టి అందు ప్రతిదినము క్రీడించుచుండును. రుద్రుడు మెచ్చినది, రాత్రులయందు ఆతనికి ప్రియమైనది అగు శ్మశానమును నీవు నిందింపనేల?"

శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "దేవీ! ఈ కథను శ్రేష్ఠమైన దానిని బాగుగా వినుము. ఉత్తమములగు వ్రతములు కలవారు కూడ సర్వభూతములకు నాథుడైన శంకరుని, అతడొనర్చిన మిక్కిలి దుష్కరమైన కార్యమును ఎరుగకున్నారు. త్రిపురాసుర సంహార సమయమున పసివారిని, ముదుసలులను, ఆడువారిని చంపి ఆ పాపము చేత

కట్టువడి శివుడు కాలుచేతులాడని దశలో నుండెను. మనస్సు మహిమ చెడిపోగా, తనదగు యోగమాయ పనికిమాలినది కాగా ఆ మహేశ్వరుడు తన ప్రమథ గణములు చుట్టి యుండగా మొగము వెలవెలపోయి అచట స్థాణేశ్వరుడు అయి నిలిచి పోయెను. వసుంధరా! అట్లు మాయ నశించిన ఈశ్వరుని నేను ధ్యానించితిని. ఈశ్వరుడు మరల తన శక్తిని పొందవలయునని నా భావన. నేను దివ్యమగు చూపుతో ఆ దేవుని చూచునంతలో ఆ సర్వభూత మహేశ్వరుడు నశించిన మాయాబలము కలవాడై యుండెను. నేనందుపోయి యజించు కోరిక గల ముక్కంటిని చూడగా అతడు చైతన్యము లేనివాడు జ్ఞానము కోల్పోయినవాడు, యోగబలము నశించినవాడు, బలము లేనివాడునై కన్పట్టెను. అప్పుడు నేను సుఖమును గూర్చు పలుక నిట్లు పలికితిని. రుద్రా! ఇదియేమి? ఇట్లు పాపభావము చుట్టుకొని యున్నావు. నీవు కర్తవు. వికర్తవు. వికారమైన ఆకారము కలవాడవు.సాంఖ్యము, యోగము నీవే. లోకముల పుట్టుకకు పరగతికి కారణమవు నీవే. (సాంఖ్యము – జ్ఞానమార్గము – యోని – పుట్టుక స్థానము . పరాయణమ్ – పరమగతి) ఓయి ఉగ్రా! నీవు దేవదేవుడవు. మొదటివాడవు. సోముడవు. దిక్కులన్నియు నీవే. ఈ ప్రమథగణములు చుట్టుకొని యుండగా నిన్ను నీవేల తెలియకున్నావు. దేవదేవా! ఈశా! ఇదియేమి? పాలిపోయితివి. మిడిగ్రుడ్లవాడవైతివి. నిజమునకిది యేమో అడుగుచున్నాను. చెప్పుము. నీ యోగమును, మాయను గుర్తు తెచ్చుకొనుము. మహాత్ముడగు విష్ణువును నన్ను చూడుము. నీ ప్రియము కొరకే ఇదిగో నేను ఇచటికి వచ్చితిని.

అంత నా మాట విని మహేశ్వరుడు కొంత తెలివిని పొందెను. పాపముతో వేడెక్కిన కనులు కలవాడై, తీయగా ఇట్లు పలికెను. "దేవా! ఉన్నదున్నట్లు చెప్పెదను. వినుము. సర్వలోకములలో శ్రేష్ఠుడు, మంగళుడు అయిన నారాయణుడు కాక మరి యింకొకడు ఇట్లు చేయగలడా? ఓ విష్ణూ! నీ అనుగ్రహము వలన నేను పవిత్రుడనైతిని. నా యోగము, నా జ్ఞానము నాకు లభించినవి. మాధవా! నా జబ్బు పోయినది. నీదయ వలన నిండు చందురునివలె నిర్మలుడనైతిని. నీవు నన్నెరుగుదువు. నేను నిన్నెరుగుదును. మన యిరువురను మరియొక్కడెవ్వడును ఎరుగడు. ఎల్లప్పుడు అంటి పెట్టుకొని యుండువాడే అయినను బ్రహ్మయు ఆ విధముగా మనల నెరుగడు. మేలు! విష్ణూ! మహాత్మా! నీవు మాయలన్నింటికి పెట్టెవు." ఆ హరుడు నాతో ఇట్లు పలికి ఒక్కక్షణ కాలము ధ్యానమున

నిలిచి మరల నాతో ఇట్లనెను. "విష్ణుదేవా! నీ దయవలన నేను త్రిపురములను కూల్చి వైచితిని, ఆ రక్కసులను చంపివైచితిని. గర్భవతులగు స్త్రీలును నాచేత మడిసిరి. బాలురు, వృద్ధులును పది దిక్కులకు పరువులు తీయుచు నా వలన చచ్చిరి. ఆ పాపము వలన నేను కాలుచేతులాడింప జాలకున్నాను. నా యోగము, నా మాయ, నా ఐశ్వర్యము, అన్నియు చెడిపోయినవి. కృష్ణా! మాధవా! ఇట్టి పాపదశలో ఉన్న నాకు ఇప్పుడు కర్తవ్యమేమి? విష్ణూ! నిక్కముగా నా పాపమును పరిమార్చు ప్రాయశ్చిత్తమెట్టిది? ఏది చేసినంత నేను దోషము నుండి ముక్తి పొందుదునో దానిని నాకు చెప్పుము." ఇట్లు చింతపై కొన్న మనసు గల శివునితో నేనిట్లంటిని. "శంకరా! పుట్టెలమాలను చేతబట్టి నీవు (సమల) అనుచోటికి అరుగుము."

శ్మశాన ప్రవేశ దోషపు ప్రాయశ్చిత్తము:

నా మాట విని భగవానుడగు పరమేశ్వరుడు నాతో ఇట్లు పలికెను. "జగత్పతీ! మరల నాకు చక్కగా తెలియజెప్పుము. నేను పోవలసిన ఆ 'సమల' ఎట్టిది?" అంత ఆ శంకరుని పలుకు విని, ఆతని పాపము శుద్ధియగుటకై నేనిట్లు పలికితిని. "రుద్రా! శ్మశానమే సమల. కుళ్ళుతో నిండినది. గాయముల చెడు వాసనతో కూడి యుండును. అందు మనుజులు చైతన్యము లేనివారై పడియుందురు. శంకరా! అచట పుట్టెలను గైకొని వేలకొలది దివ్యములగు ఏండ్లు చెడని వ్రతము కలవాడవై విహరింపుము. పిమ్మట మాంసములను తినుచుండుము. పాపక్షయము కలుగు పనులను జేయగోరుము. హింసించు స్వభావము గలవాని నంజుడులు నీకు ప్రియమైన భోజనములు అగును. నీ ప్రమథ గణములన్నింటితో పాటు అచట చెదరని నిశ్చయము కలవాడవై నిండుగా వేయి యేండ్లు నిండిన పిదప గౌతమ మహాముని ఆశ్రమమున కరుగుము. చక్కని విధులతో నెలకొన్న ఆ ఆశ్రమమున నిన్ను నీవు తెలిసికొనగలవు. గౌతమముని దయవలన నీవు పాపములు పోయిన వాడవగుదువు. పాపముల పుట్టఅయిన నీ నెత్తినున్న పుట్టను ఋషి పడగొట్టుటకు సమర్థుడగును. సంశయము లేదు." ఇట్లతనికి వరమిచ్చి నేను అంతర్ధానము చెందితిని. రుద్రుడును పాపములు చుట్టుముట్టిన ఆ శ్మశానమున తిరుగుచుండెను."భూమీ! అందువలననే వల్లకాడన్న నాకిష్టముండదు. రుద్రుడు చేసిన పాపమున్న తావు కదా! దానికి సంబంధించిన రోత పనిని గూర్చి నీకు చెప్పితిని.

సంస్కారము పొందకున్నను నా పూజా కార్యముల యందు శ్రద్ధ కలవాడు పాపము నుండి విడివడు ప్రాయశ్చిత్తమును చెప్పెదను. పదునైదు దినములు దినము నాలుగవ భాగమున భోజనము చేయుచుండవలయును. ఒక వస్త్రమును తాలి దర్భల చాపపై బయలున నిద్రించుచుండ వలయును. తెల్లవారుజామున పంచగవ్యమును త్రావవలయును. ఇట్లు చేసి అన్ని పాపముల నుండియు విడివడి నా లోకమున కరుగును.

తెలకపిండి తిన్నదానికి ప్రాయశ్చిత్తము:

సుశ్రోణీ! తెలకపిండి తిని నన్ను సమీపించు వాని ఆ గొప్ప పాతకమును గూర్చి చెప్పెదను వినుము. పదియేండ్లు గుడ్లగూబయు, మూడేండ్లు తాబేలును అయి నా పూజాపరాయణుడు మరలమానవుడుగా పుట్టును. గొప్ప శక్తిగల ప్రాయశ్చిత్తమును అట్టి వానికి చెప్పెదను. దానిచేత అతడు ఆ పాపము నుండి ముక్తుడై మోక్షమునకు అరుగును. యవలపిండిని మజ్జిగతో కలిపి ఒక్క ముద్దను ఒక దినమునకు చొప్పున నీటితో కలిసి తీసికొనవలయును. నా పూజలయందు ఆసక్తి కల నరుడు ఇట్లా విధినాచరింప వలయును. రాత్రియందు బయలున వీరాసనము వేసికొని యుండవలయును. ఆరుబయలున నిద్రించి వేకువజామున ఆ సాధకుడు పంచగవ్యమును సేవింప వలయును. ఇట్లాతడు ఆ పాపము నుండి విముక్తుడగును. భూదేవీ! ఇట్టి పద్ధతితో ప్రాయశ్చిత్త కర్మము లాచరించువాడు మరల సంసారమున పొందడు. నా లోకమున కరుగును.

పందిమాంసపు నివేదన తప్పునకు ప్రాయశ్చితము:

అనుచు మరల వరాహ భగవానుడు ఇట్లు పలికెను. "పంది మాంసముతో నాకు నివేదన మిడువారు మూర్ఖులు, పాప కర్ములు. వారు నా అర్చకులైనను వారి గతి అట్టిదియే. ఓ భూదేవీ! ఎట్టి దోషములను చేసి సంసారమున చిక్కుకొందురో వానిని తెలిపెదను. వినుము. వరాహరూపుడనగు నా అంగములయందు ఎన్నిరోమములు కలవో అన్నివేల యేండ్లు నరకమున పడుదురు. వసుంధరా! నీకు మరియొక విషయమును కూడ చెప్పెదను. వినుము. పందిమాంసముతో నాకు నివేదనము చేయువాడు, ఆ పాత్రలయందు ఎన్ని మెతుకులుండునో అన్ని వేల యేండ్లు పంది కడుపున పడియుండును. నా ఆరాధనయందు శ్రద్ధ కలవారు ఇట్టి దోషము చేత ఎట్టి గతిని పొందుదురో తెలియజెప్పెదను. చక్కగా వినుము. అట్టివారు ఒక జన్మము కాలము గ్రుడ్డివారై ఉందురు.

పందిమాంసమును నివేదన మిడిన పాపము వలన ఇట్టివారై మరల సంసారమును పొందుదురు. అపుడతడు పెద్దది, శుద్ధము, భగవద్భక్తి కలది అగు కులమున పవిత్రుడై జన్మించును.వినయము కలవాడగును. సంస్కారము పొందినవాడగును. ధనవంతుడు, గుణవంతుడు, రూపవంతుడు, శీలవంతుడు, శుచియు నగును. అతని శరీరమును శుద్ధి యొనరించు ప్రాయశ్చిత్తమును చెప్పెదను. దానివలన ఆ నా అర్చకుడు పాపము నుండి విడివడును. ఏడు రోజులుపండ్లు, ఏడు రోజులు దుంపలు తినవలయును. ఏడు రోజులు ఏమియు తినకుండ ఉండ వలయును. మరల ఏడురోజులు పాయసముతో గడుప వలయును. ఏడుదినములు మజ్జిగతో, ఏడుదినములు జావతో ఏడు దినములు పెరుగుతో గడుపవలయును. ప్రతిదినము అహంకారము లేక మెలగవలయును. ఇట్టి నేను చెప్పిన కర్మపద్ధతిలో ప్రాయశ్చిత్తమును ఆచరించువాడు ఓ పుణ్యశీలా! నా లోకమున కరుగును.

మద్యపాన దోషమునకు ప్రాయశ్చిత్తము:

ఓ వరారోహా! మద్యము త్రావి నా కడకు అరుదెంచు వాని దుర్గతిని తెలిపెదను. సుందరీ! దానిని తత్త్వముతో వినుము. అట్టివాడు పదివేల యేండ్లు దరిద్రుడై పుట్టును. మరల అతడు సాధారణ మానవుడై నా భక్తుడగును. సంశయము లేదు. ఓ వసుంధరా! నీకొక్క విషయమును చెప్పెదను. నిప్పురంగు గల మద్యమును త్రావినచో అట్టి వాడీ పాపము నుండి ముక్తుడగును. (అగ్నివర్ణ మద్యము – ప్రాయశ్చితమునకై ఏర్పరచిన పవిత్ర వస్తువులతో కూడిన ద్రవ పదార్థము.) ఈ విధానముతో ప్రాయశ్చిత్తము నాచరించు వానికి పాపమంటదు. మరల సంసారమున పడదు.

కుసుమల ఆకు తిన్నదానికి, నివేదన మిడుదానికి ప్రాయశ్చిత్తము:

నా పూజకుడు కుసుమ ఆకుల కూరను తిని పదునైదేండ్లు ఘోరమగు నరకమున పందియై మ్రగ్గిపోవును. పిదప మూడేండ్లు కుక్కకడుపునను, ఒక యేడు నక్కకడుపునను పుట్టును. పిదప పరిశుద్ధుడై నా కర్మముల యందు ప్రీతిగల వాడగును. నా లోకము నందుకొనును. కుసుమలను తిన్నచో చాంద్రాయణ వ్రతమును శ్రద్ధతో చేయవలయును. నివేదనము చేసినచో పండ్రెండు దినములు పాలు మాత్రమును పుచ్చుకొను వ్రతము నాచరింపవలయును. ఈ పద్ధతితో ప్రాయశ్చిత్తము నాచరించువాడు పాపము అంటనివాడై నా లోకమున కరుగును.

ఉతుకని, ఇతరుని వస్త్రము ధరించి పూజ చేసినందులకు ప్రాయశ్చిత్తము:

మాధవీ! చక్కగా ఉతుకని, ఇతరుని వస్త్రము ధరించి నా పూజ చేయు మూర్ఖుడు ప్రాయశ్చిత్తమును పొందవలయును. అంధకారమున మునిగి ఆ విధముగా నా పూజలు ఆచరించువాడు పదియేండ్లు మృగమై పోవును. ఒక జన్మము కాళ్ళులేనివాడై, మూర్ఖుడై, కోపము గలవాడై యుండును. నా భక్తియందు నిలుకడ కలవాడగు అట్టివానికి మిక్కిలి శక్తిగల ప్రాయశ్చిత్తమును తెలిపెదను. మాఘమాస శుక్లపక్ష ద్వాదశినాడు నా పూజల యందు ఆసక్తి కలవాడై ఎనిమిది కాలముల తరువాత భుజించి (రెండు రోజులు ఉపవాసముండి అనితాత్పర్యము) లోని యింద్రియములను, వెలుపలి యింద్రియములను అదుపున నుంచుకొని కొలనులో నిలిచియుండి చెదరని మనస్సుతో నా భావనయే చేయుచు ఉండవలయును. ప్రాతఃకాలమున సూర్యుడుదయించిన తరువాత పంచగవ్యమును (ఆవుపాలు, నెయ్యి, వెన్న, మూత్రము, పేడల కలిపిన పదార్థమును) త్రావి నా పూజలు కావింపవలయును. ఈ విధముగా ప్రాయశ్చిత్తము చేసికొనినవాడు, పాపములన్నింటి నుండి విడివడి నాలోకమున కరుగును.

కొత్త ధాన్యముల అన్నమును తిను దోషమునకు ప్రాయశ్చిత్తము:

నా అర్చనలు చేయువాడు క్రొత్త భోజనములను తనవికాని, ఇతరులిచ్చినవి కాని, నాకు సమర్పింపక తినునేని అట్టివానిని నేను ఇష్టపడను. అట్లుముందుగా నాకు సమర్పించుట అతని కర్తవ్యము. దీనిని నేను లోభముతోడనో, రాగముతోడనో చెప్పుటలేదు. భగవంతుని భక్తుడై క్రొత్తధాన్యముల అన్నములను నాకు సమర్పణము చేయని వాని పితృదేవతలు పదునైదేండ్లు వాని అన్నమును తినరు. క్రొత్త అన్నములను నా కర్పింపక ఎన్నడు గాని తిను నరునకు ధర్మము కలుగదు. ఇందు సంశయము లేదు. ఆ పాపము నుండి ముక్తి పొంది నా భక్తుడు సుఖముగా నుండెడు ప్రాయశ్చిత్తమును ఓ మహాభాగా! తెలిపెదను. మూడు రాత్రులు ఉపవాసము చేయవలయును. ఆరుబయలున నిద్రింపవలయును. నాలుగవరోజున ఆతడు శుద్ధుడగును. ఇట్లు విధిని ఆచరించి సూర్యోదయ కాలమున పంచగవ్యమును పుచ్చుకొని ఆ దోషము నుండి విడివడును. ఈ విధానముతో కొత్త ధాన్యముల అన్నమును తిను దోషమునకు ప్రాయశ్చిత్తము చేసికొని అన్ని తగులములను వదలివైచి నాలోకమున కరుగును.

గంధ మాల్యముల నొసంగక ధూపదానమిచ్చుట అను దోషమునకు ప్రాయశ్చిత్తము :

గంధములను, మాల్యములను ఒసగక ధూపమును నాకు అర్పించువాడు క్రుళ్ళిన శవములను తిను రాక్షసుడై పుట్టును. సంశయము లేదు. ఇరువదియొక్క యేండ్లు నింద్యమైన తావులలో నివసించుచుండును. ఇందు సంశయము లేదు. వసుంధరా! ఇట్టి పాపమునకు ప్రాయశ్చిత్తమును నీకు వక్కాణించెదను. దేనివలన ఈ పాపము నుండి ముక్తుడగునో తెలిపెదను. ఏదో ఒక నెలలో శుక్లపక్షము ద్వాదశినాడు రెండు రోజులు ఉపవాసముండి, పది పదునైదు దినము లుండవలయును. పిదప తెల్లవారిన పిదప సూర్యుడు ఉదయించిన అనంతరము పంచ గవ్యమును పుచ్చుకొని ఆ పాపమును పోగొట్టుకొనును. ఈ విధముగా ప్రాయశ్చిత్తము చేసికొనువాడే కాదు. ఆతని తండ్రి తాతలును పాపముల నుండి దాటుదురు.

చెప్పులు తాల్చి దేవుని ఆరాధించిన దోషమునకు ప్రాయశ్చిత్తము:

చెప్పులు తొడిగికొని, నా దగ్గరకు వచ్చువాడు పదుమూడేండ్లు చర్మకారుడగును. అందు ఆ జన్మము నుండి జారి పందియై పుట్టును. పంది జన్మము నుండియు పరిభ్రష్టుడై కుక్కయై పుట్టును. కుక్క జన్మమును వదలి మరల మానవుడై పుట్టును. నాకు భక్తుడు, వినయము కలవాడు, దోషములు లేనివాడునై సంసార దోషములన్నింటిని వదలి నాలోకమున కరుగును. వసుధా! ఈ విధానముతో కర్మము నాచరించువాడు పాపపు అంటు లేనివాడగును. సంశయము లేదు.

భేరీతాడనాపరాధ ప్రాయశ్చిత్తము:

భూమీ! భేరీనాదము చేయక నన్ను మేల్కొలుపువాడు ఒక జన్మ కాలము చెవిటి వాడగును. సంశయము లేదు. ప్రియా! ఆ భేరిని మ్రోగించు పనిలో ప్రమాదపడిన పాపము నుండి ముక్తి పొందెడు దానికి ప్రాయశ్చిత్తమును చెప్పెదను. ఏదో ఒక నెలలో శుక్లపక్ష ద్వాదశినాడు ఆరుబయలున నిద్రించి వెనువెంటనే ఆ పాపము నుండి విడివడును. ఈ పద్ధతిలో, ఓ వసుధా! అర్చనలను చేయువాడు అపరాధమును పొందడు. నా లోకమున కరుగును.

భేరీతాడనాపరాధ ప్రాయశ్చిత్తము:

పొట్ట పగులునట్లన్నము తిని అజీర్ణముతో అవస్థపడుచు క్రక్కుకొనుచు, స్నానము చేయక నాకడ కరుగుదెంచువాడు ఒక జన్మమున కోతియగును. వేరొక జన్మమున నక్కయగును ఇంకొక జన్మమున మేకయగును. తరువాత ఒక జన్మమున గ్రుడ్డివాడగును. మరల ఎలుక యగును. అట్టివాడు ఆపాపము నుండి తరింపజేయబడినవాడై గొప్ప కులమున శుద్ధుడు, శ్రేష్ఠుడు, అపరాధము లేనివాడునగు భాగవతుడై పుట్టును. నా భక్తుని సుఖమును కూర్చునది, నా కర్మమున శ్రద్ధ కలవానిని ఆ పాపము నుండి విడుదల చేయునదియునగు ప్రాయశ్చిత్తమును చెప్పెదను. యవలపిండితో మూడు రోజులు, దుంపలతో మూడు దినములు, పండ్లను తినుచు మూడు రోజులు, పులుపు ఉప్పులేని చప్పిడిని తినుచు మూడు దినములు, పాయసముతో మూడు దినములు, పేలపిండితో మూడు దినములు, గాలి తినుచు మూడు రోజులు గడుపవలయును. ఆరుబయట పడుకొని మూడు దినములు గడుపవలయును. తరువాత తెల్లవారిన వెనుక పండ్లు తోముకొని పంచగవ్యమును పుచ్చుకొన వలయును. శరీరమును శుద్ధి చేసికొనవలయును. ఈ విధానముతో ప్రాయశ్చిత్తము చేసికొనువానికి పాపముండదు. అతడు నాలోకమున కరుగును.

మహేశ్వరీ! ఇది ఆఖ్యానములలో మిక్కిలి గొప్ప ఆఖ్యానము. తపస్సులలో శ్రేష్ఠమైన తపస్సు. దీనిని నేను బ్రాహ్మణులకు చెప్పుచున్నాను. ఇది ధర్మము, ఇది కీర్తి, ఆచారములలో గొప్ప శక్తి కలది. గుణములలో మిక్కిలి శ్రేష్ఠమైనది. కాంతులలో గొప్ప కాంతి కలది. ప్రాతః కాలమున నిద్రలేచి ప్రతిదినము దీనిని పఠించువాడు ముందు పదితరముల వారిని, వెనుక పదితరముల వారిని పితృదేవతలను తరింపజేయును. ఆరోగ్యములలో, మహారోగ్యము మంగళములలో గొప్ప మంగళము, రత్నములలో పరమమైన రత్నము. అన్ని పాపములను అణగార్చునది. ఏ భాగవతుడు చెదరని నిష్ఠకలవాడై ప్రతిదినము దీనిని చదువునో అతడు సర్వ పాపములు చేసినవాడైనను ఆ పాపములు అంటులేని వాడగును. ఇది జపింపదగినది. ప్రమాణమైనది. సంధ్యను ఉపాసించుటయేయైనది. ప్రాతఃకాలమున నిద్రలేచి దీనిని పఠించువాడు నాలోకమున కరుగును.

మూర్ఖుల నడుమ దీనిని పఠింపరాదు. చెడు శిష్యులకు దీనిని బోధించరాదు. నా అర్చన యందు శ్రద్ధగల భాగవత శ్రేష్ఠునికి దీనిని ఒసంగవలయును. దేవీ! ఆచార నిశ్చయమును గూర్చి మున్ను నీవు నన్నడిగిన దానిని వివరించి చెప్పితిని. మరియు నీవు దేనిని వినగోరుచున్నావు? అనగా (136)

137 వ అధ్యాయము – సౌకరకక్షేత్ర(సోరోన్, ఉత్తరప్రదేశ్) మహిమ

వసుంధర ఇట్లు పలికెను. “స్వామీ! ఈ అపరాధ విశోధనమును విస్తారముగా వింటిని. ఇవి భగవంతునికి సంబంధించినవి. శ్రేష్ఠమైనది. ఆశ్చర్యకరమైనది. భాగవతులందరకు మిక్కిలి ప్రియమైనది. నా ప్రియము కొరకు, నీ భక్తుల సుఖము కొరకు నీవు తెలిపితివి. సర్వ ధర్మములను సాధించునట్టి దీనిని నేను వింటిని. సర్వ పాపముల నుండియు పూర్తిగా విడివడితిని. చంద్రునివలె నిర్మలనైతిని. అన్ని ధర్మముల సుఖములకును తావలమైన ఒక పరమ రహస్యమును గూర్చి నిన్నడుగుదును. నీ భక్తుల సుఖము కొరకు నీవు దానిని చెప్పవలయును. శ్రేష్ఠమైన వ్రతమని దేనిని చెప్పుదురు? శుభమైన కుబ్జామ్రక మెట్టిది? భక్తజనులకు సుఖమును కూర్చెదు క్షేత్రములలో మేలైనదేది?

శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. “భూమీ! నీవు నన్నడిగినదానికి బదులుగా పరమ రహస్యమును చెప్పెదను. నాకు ప్రియమైనదియు, భాగవతులకు ఇష్టమైనదియునగు క్షేత్రమును గూర్చి తెలియజెప్పెదను వినుము. కోకా ముఖము గొప్ప క్షేత్రము. అట్లే కుబ్జామ్రకము కూడ గొప్పదియే. సౌకరకము కూడ మిన్నయే. సమస్తమగు సంసారమును విడిపించునట్టిది. దేవీ! నిన్నా తావునందే రసాతలము నుండి నేను ఉద్ధరించితిని. ఆ సౌకరకమున భాగీరథీ యగు గంగయును ఉన్నది. పృధ్వి ఇట్లు ప్రశ్నించెను. “లోకనాధా! సౌకరకమున మరణించినవారు ఏ లోకముల కరుగుదురు? అందు స్నానము చేసిన వానికి, పానము చేసిన వానికి ఎట్టి పుణ్యము లభించును? విష్ణూ! పద్మాక్షా! నీదగు ఆ సౌకరక క్షేత్రమున ఎన్ని తీర్థములు కలవు. ధర్మ సంస్థాపన కొరకు దానిని నాకు నీవు చెప్పదగును.”

శ్రీ వరాహ దేవుడు ఇట్లు పలికెను. “దేవీ! నీవు నన్నడిగిన దానికి బదులు చెప్పెదను. సౌకరకమున మరణించువారు ఎట్టిగతి పొందుదురో, స్నానము చేసిన వానికిని, మరణించిన వానికిని ఎట్టి పుణ్యము లభించునో, ఆ సంస్థానము నందున్న తీర్థము లేవియో

చెప్పెదను వినుము. సుందరీ! పుణ్యాత్మురాలా! నా క్షేత్రములలో సౌకరకమునకు పోయి పొందెడు పుణ్య మెట్టిదియో వినుము. వెనుకటి పదితరముల వారిని, ముందు పదునైదు తరముల వారిని అచటి కరుగు వారు ముక్తి చెందింతురు. ఆ క్షేత్రమునకు పోయినంత మాత్రమున, నా ముఖమును చూచినంత మాత్రమున మానవుడు ఏడు తరములు గొప్ప కులమున జన్మించును. ధనము, ధాన్యము నిండుగా గల కులములందు, నా భక్తుడు, చక్కని రూపము, గుణములు, పవిత్రత కలవాడై జన్మించును. మనుజుడై పుట్టి ఎట్టి దోషములు లేనివాడు కావలయును. అందువలననే అతడా క్షేత్రమున కరుగటయు, అందు మరణించుటయు సంభవించును. సుశ్రోణీ! నా దగు సౌకరక క్షేత్రమున మృతి చెందినవాడు సంసారమంతటిని వదలి వైచి, ధనుస్సు, అంపపొదులు, ఖడ్గము, గద, గొప్ప తేజస్సు, నాల్గు భుజములు కలవాడై శ్వేత ద్వీపమున కరుగును. వసుంధరా! నీకు మరియొక విషయమును కూడ చెప్పెదను. అందలి తీర్థములందు స్నానము చేసినవాడు పరమగతిని పొందును. చక్రము ప్రతిష్ఠితమైన చక్రతీర్థమును సేవించిన నరులు ఎట్టి పుణ్యమును పొందుదురో చెప్పెదను వినము. అదియే పనిగ చక్ర తీర్థమున కరిగినవాడు మేలుగా, పవిత్రతతో విధి ననుసరించి వైశాఖ ద్వాదశినాడు స్నానము చేసినేని పదివేల పదివందల యేండ్లు ధనధాన్యములు పుష్కలముగా గల గొప్ప కులమున పుట్టును. అట్టి కులమున నా భక్తుడు, నా అర్చనల యందు శ్రద్ధ కలవాడు పుట్టును. పాపములను విడనాడును. దీక్షకలవాడగును.

అట్లు మంచికులమున పుట్టి సంసారమను సముద్రమును దాటి ఆ క్షేత్రమున కరిగి అందు మరణించును. అట్టి నరుడు పాపములన్నింటి నుండి విముక్తి పొంది ధనుస్సు, చక్రము, గద, ఖడ్గము గల నాలుగు భుజములు గలవాడై అలరారును. చక్రతీర్థము పుణ్యము వలన అతడు శ్వేతద్వీపమున కరుగును. సౌకరక క్షేత్రపు పుణ్యమిట్టిది. చక్రతీర్థమున చచ్చుట అనగా అదియే కృతకృత్యత. వసుంధరా! మఱియొక విషయమును చెప్పెదను. దానిని వినుము. నాదైన సౌకరక క్షేత్రమున రూపతీర్థమని ప్రఖ్యాతి చెందిన దొకటి కలదు. నా అర్చనల యందు శ్రద్ధగల నా భక్తుడు, అక్కడ స్నాన మాడినచో, మరణించినచో పొందెడు పుణ్యమెట్టిదియో వక్కాణింతును. తినరాని తిండి తిన్నవాడైనను, గట్టి నియమముతో ఇచట కార్తీకమాస శుక్లపక్ష ద్వాదశినాడు స్నానము చేసినచో అతని

తండ్రులు, తాతలు వెనుకటి పది తరముల వారు, ముందటి పండ్రెండు తరముల వారు తరింతురు. అతని ఒడలిపై ఎన్ని నీటి చుక్కలు నిలుచునో అన్నివేల యేండ్లు ఆతడు నా భక్తుడగును. రూపవంతుడు, గుణవంతుడు,ధనవంతుడు నగునట్టి నా భక్తుడు చక్కని రూపముగల పతివ్రత యగు భార్యను పొందును. అతడు దాతయగు ఆ క్రోధరాగములు లేనివాడగును. వివేకవంతుడు, చక్కని శీలము కలవాడు, నా భక్తుల యందు వాత్సల్యము కలవాడును అగును. సంసారమును మొదలంటా దాటి ఆ నా అర్చకుడు నా దయవలన అచటనే మరణమును పొందును. సందియము లేదు. గొప్ప శక్తిగల ఆ రూపతీర్థమున మరణించి ఆతడు గొప్ప తేజస్సు, కాంతి, నాలుగు చేతులు కలవాడై శ్వేతద్వీపమును పొంది వాయుభక్షుడై నిలిచిపోవును.

సుందరీ! ఆ రూపతీర్థపు గుర్తును చెప్పెదను వినుము. దానితో నా భక్తుడు దానిని చక్కగా తెలిసికొనును. అచట దక్షిణపు ప్రక్కభాగమున మిక్కిలి లావుకానిది, పెద్దగా ఎత్తుగా లేనిది అగు ఒకపాటి ఎఱ్ఱగోరంట వృక్షము కలదు. వైశాఖ మాసమున మానవతుల హృదయములను ఆకర్షించుచు అది పూచును. అట్లే కార్తీకమాసము ద్వాదశినాడును అది పుష్పించును. ఓ మహాభాగా! ఆ నా సౌకరక క్షేత్రమున తిరుగాడు నరుడు ఈ గుర్తుతో దాని నెరుగును. సంశయము లేదు. ఆ నా సౌకరక క్షేత్రమున మరియొక దానిని గూర్చి చెప్పెదను. అచట యోగతీర్థమని చెప్పబడునది ఒకటి కలదు. దానిని దేవతలును ఎరుగజాలరు. నా భక్తులు, నా అర్చనయందు మిక్కిలి నేర్పు కలవారు ఆ యోగ తీర్థమున స్నానమాడి యెట్టి గతిని పొందుదురో చెప్పుదును. వినుము. వారు పదునొకండు వేలయేండ్లు ఎట్టి దోషములు లేనివారు. క్రోధరాగములు వదలిన వారు, అహింసయందు గట్టి పట్టుదల కలవారునగు నా భక్తులుగానే అయి పుట్టుదురు. ఓ మహానుభావా! దొడ్డదైన ఆ యోగతీర్థమున ఒక దినము నివసించినవాడు సంసారబంధముల నన్నింటిని త్రుంచుకొని నా అర్చనల యందు శ్రద్ధ కలవాడగును. యోగమునందు నిష్ఠ కలవాడు ఆ తీర్థమును వెదకుచుండును. నా దయవలన దానిని పొందును. ఆ సౌకరకమున పుణ్యమైన స్నానము నాచరించును. అట్టి నా ఆరాధకుడు అందు ప్రాణములను వదలి యోగియై కడకు శ్వేతద్వీపమున కరుగును. మంచిదానా! యోగతీర్థపు గొప్ప ఫలమును యోగులైన నా భక్తులు అరుగు తావును గూర్చి నీకు

చెప్పితిని. నన్ను శ్రద్ధతో అర్చించువారు ఆ యోగతీర్థము నెట్లు తెలిసికొందురో ఆ గుర్తును చక్కగా వివరింతును. మార్గశీర్ష శుక్లపక్ష చతుర్దశినాడు ఆ తీర్థపు తావులందు ఒక్కపెట్టున చీకటి ఏర్పడును. మూడువేల మూడువందల మూడుమూరల కొలత ఆ తీర్థమునకు చేయబడినది. ఈ గుర్తును పట్టుకొని అందు మరణించుటయో, స్నానమాడుటయో చేయువాడు మునుపు చెప్పిన గతికరుగును. ఓ మహాభాగా! నేనున్న యోగతీర్థపు గుర్తిట్టిది. అందు సిద్ధిని కోరువాడు, పరమగతిని అపేక్షించువాడును నన్ను పూజింపవలయును.

వసుధా! సౌకరకతీర్థము నందలి మరియొక విశేషమును చెప్పెదను. అందు చంద్రుడు తపస్సు చేసెను. అయిదువేల యేండ్లు ఒంటికాలిపై నిలిచియుండెను. అయిదు వేలయేండ్లు చేతులు పైకెత్తికొని నిలిచెను. తలవంచుకొని అయిదువేల యేండ్లు, తల పైకెత్తి అయిదువేల యేండ్లు, గాలిని తినుచు అయిదువేల యేండ్లు, ఆహారములేనివాడై అయిదువేలయేండ్లు ఆతడు వ్రతమున నిలిచియుండెను. ఇట్లు వేలకొలది యేండ్లు తపస్సు చేసెను. నా ఆరాధన యందే తగులుకొని యుండెను. బ్రహ్మజ్ఞాన సంపన్నుల హితము నందు ప్రీతికలవాడై యుండెను. ఆతని ఈ పలుకు విని వసుంధర ఏదో అడుగగోరినదై తలపై దోసిలియొగ్గి పిదప మెల్లగా ఇట్లు పలికెను.

"జనార్ధనుని ఆ చంద్రుడే కారణమున మెప్పించెను? ప్రభూ! దీనిని నాకు చక్కగా తెలుపవలయును. నాకు దానిని వినవలయునను ఉత్కంఠమిక్కుటముగా నున్నది." భూదేవి పలుకు విని మాయల పెట్టె యగు విష్ణువు ఉరుమువంటి కంఠధ్వనితో తీయగా నిట్లు పలికెను. "భూమీ! నేను ప్రయత్నపడి చెప్పుచున్న దానిని వినుము. ఆతడు నన్నేల ఆరాధించెనో ఆ కారణమును చెప్పెదను. ఆతని విశుద్ధమగు అంతరాత్మతో నేను ప్రీతుడనైతిని. దేవతలకు దుర్లభమైన నా ఆత్మ నాతనికి చూపితిని. చంద్రుడు నా రూపమును చూచెను. వెంటనే మూర్ఛనందెను. నా తేజస్సుచే మిక్కిలి మోహము నందినవాడైనా రూపమును మొత్తముగా చూడజాలకపోయెను. అట్లే మోడ్పు కన్నులు కలవాడై తలతో దోసిలిఒగ్గి, మాటలు పెకలిరానివాడై బెదరు కన్నులతో దిగులు దిగులుగా ఉండెను. ఇట్లు తిరుగుళ్లు పడుచును బ్రాహ్మణాధిపతి యగు సోమునితో నేను మెల్లని చల్లని వాక్కుతో ఇట్లంటిని. "సోమా! నీవు ఏమి చేయదలచితివి? నీ తపమునకు కారణమేమి? ఉన్నదున్నట్లు చెప్పుము. నీవు కోరినదేదో దానినంతటిని అనుగ్రహముతో చేసెదను.

సంశయింపకుము. సోమ తీర్థమున నున్న ఆ గ్రహపతి నా మాటవిని తీయగా నిట్లు పలికెను. ప్రభూ! జనార్ధనా! లోకనాధా! లోకస్రష్టా! సర్వయోగేశ్వరేశ్వరా! నా విషయమున నీవు తుష్టుడవైనచో ఈ లోకములుండునందాక, నీవు ఉండునంతవరకు నీయందు నా భక్తి సాటిలేనిదై నిలువ వలయును. నీవు నాయందు నెలకొల్పిన ఆ నా రూపము. ఏడు ద్వీపముల యందును ఎక్కడి కక్కడ నిలుచుచు నందరకు కానవచ్చు గాక! యజ్ఞములందు బ్రాహ్మణులు సోమమను పేరున నా అమృతమును త్రావుదురు. అది దేవతల కమృతమువలె పరమగతికి కారణమగు గాక! అమావాస్యనాడు నేను క్షీణించినప్పుడు బ్రాహ్మణులు చేయు పిండపితృ యజ్ఞము విధి తప్పనిదై జరుగుగాక! నేనప్పుడు చక్కని దర్శనము కలవాడ నగుదును గాక! విష్ణూ! నా బుద్ధి ఎన్నటికిని అధర్మమున నిలువ కుండుగాక! నేను ఓషధులకు పతినగుదును గాక! ఈ విధముగా నీవనుగ్రహింపుము. నా యెడల నీవు తుష్టుడవైనచో అవ్యక్తమగు మాయతో నా ప్రియము కొరకు దేవా! నీవు నాకీ వరము ననుగ్రహింపుము.''

స్వచ్ఛమగు వ్రతములు కల ఆ చంద్రుని మాట విని నేనాతనితో "సోమా! అట్లే అగును. నీవు కోరినది నెరవేరును. సందేహము లేదు అని పలికితిని. అంత ఆ బ్రాహ్మణుడు (సోముడు)నిర్మలమగు అంతరాత్మతో 'సరి సరి' అని పలుకుచు నా మాటను అనుగ్రహముగా భావించెను. అంత నా సోముని మాట విని అతనికి వరమనుగ్రహించి, సోమా! పోయి రమ్మని పలికి అదృశ్యుడనయితిని.'' మహాభాగా! ఇట్లు చంద్రుడు చెదరని బుద్ధితో సోమతీర్థమున తపమాచరించెను. పరమసిద్ధి నందెను. ఆ తీర్థమున స్నానము చేయువాడు, నాలుగు దినములు ఉపవాసముండు వాడునగు నా ఆరాధకుడు పొందు ప్రయోజనము చెప్పెదను వినుము. మూడువేల మూడు వందల సంవత్సరములు ఆతడు, వేదములయు, వేదాంగములయు పారమును ముట్టిన బహుజ్ఞాని యగును. ఆతడు ద్రవ్యవంతుడు, గుణవంతుడు, వివేకము కలవాడు, దోషములు లేనివాడు నగు నా భక్తుడగును, సంసార సాగరమున నున్నను బ్రహ్మ జ్ఞానము కలవాడగును. నా మార్గము ననుసరించు భక్తుడు తెలిసికొనెడు సోమతీర్థపు గుర్తును తెలిపెదను. వైశాఖమాస కృష్ణపక్ష ద్వాదశినాడు చీకట్లు క్రమ్ముకొని యుండగా అందేమియు కానరాకుండును. అప్పుడు ఆ నేల చంద్రుడు లేకయే చంద్రుని కాంతితో మెరసిపోవు చుండెను. వెన్నెల కానవచ్చును.

చంద్రుడు కానరాడు. దారియందు నిలిచియుండగా తననీడ కానవచ్చును. ఇది మిక్కిలి ఆశ్చర్యము. పుణ్యమగునా సౌకరక క్షేత్రమున సోమతీర్థపు గుర్తిట్టిది. మానవులిందు ముక్తి పొందుదురు. భద్రురాలా! సంసారమను సముద్రమున చిక్కిన నరులు ఎచట తరింతురో ఆ సోమ తీర్థమును గూర్చి నీకు వివరించితిని. వసుంధరా! ఈ క్షేత్రము ప్రభావమును గూర్చి మరియొక విషయమును చెప్పెదను వినుము. అది పరమాశ్చర్యమును కలిగించును. తన పూర్వకర్మ నిర్ణయమువలన తన కోరిక లేకయే ఈ క్షేత్రమున చచ్చిన ఆడునక్క మనుష్య స్త్రీ అయినది. ఆమె విశాలమైన కన్నులు కలది. దోషములు లేనిది, నిలువెల్ల సౌందర్యము కలది. రూపవతి, గుణవతి, అరువది నాలుగు కళలలో ఆరితేరినది అగు రాజపుత్రి అయినది. ఆ సోమ తీర్థమునకు తూర్పు ప్రక్కగా గృధ్రవటమను తీర్థము కలదు. అచట అనుకొనకయే మరణించిన గ్రద్ద మనుష్యత్వమును పొందెను. నారాయణుని వలన పై మాట విని శుభలక్షణ యగు భూదేవి విష్ణుభక్తుల సుఖమునకు అస్పదమైన వాక్యమును తీయగా ఇట్లు పలికెను. “ఆ తీర్థ ప్రభావము ఎంత గొప్పది? నీవెంత శుభలక్షణుడవు! అట్టి నీ ప్రభావము చేత పశుపక్ష్యాది జన్మములను పొందిన గ్రద్దయు నక్కయు మానవ దేహమును పొందినవి. జనార్ధనా! అచటి తీర్థములందలి స్నానము, మరణము పొందినవారు ఎట్టి గతిని పొందుదురో నాకు చక్కగా తెలియజెప్పుము. వారిని గుర్తింపదగు చిహ్నమెట్టిది? విష్ణుభక్తులకు సుఖమును కూర్చెడు నీ క్షేత్రము నందలి తీర్థములెట్టివి? ఎట్టి కర్మ పరిపాకముతో, కోరుకొనకుండియు గ్రద్దయు, నక్కయు నీ క్షేత్రములందు మరణించి గొప్ప ప్రియమును పొందినవి?” అని ప్రశ్నింపగా అంతట ధర్మవేత్తలలో శ్రేష్ఠుడగు విష్ణువు శ్రీ వరాహ దేవుడు భూదేవి మాట విని ధర్మమెరుగగోరు వసుంధరతో తీయగా ఇట్లు పలికెను.

“భూమీ! ఆ రెండును ఏ కారణమున మనుష్య దేహము పొందెనని నన్ను నీవడిగితివి. దానిని చక్కగా తెలియజెప్పెదను వినము. ఆ కృతయుగమునా ఏర్పాటు వలన గడచిపోగా యుగముల వరుసలో త్రేత రాగా, కాంపిల్య నగరము నందు సర్వకర్మముల చక్కని జ్ఞానము కలవాడు, పుణ్యమూర్తి బ్రహ్మదత్తుడని ప్రసిద్ధి కన్నవాడునగు ఒకరాజు ఉండెడివాడు. అతని కుమారుడు సోమదత్తుడు, సర్వ ధర్మములలో నిష్ఠ కలవాడు. పుణ్యాత్ముడు శుభమైన లక్షణములు కలవాడు. అతడు పితృక్రియ కొరకు (శ్రాద్ధము

కొరకు) ఒక అమావాస్యనాడు మృగమును పొందగోరి పులులు, సింహములు తిరుగాడెడు అడవికి వేటకై అరిగెను. కాని ఆ రాజు అందొక్క మృగమును కూడ శ్రాద్ధమునకై పొందజాలకుండెను. ఇట్లు తిరుగుచుండగా అతని కుడివైపున నిలిచిన ఒక నక్క కానవచ్చెను. సర్వశుభములు కల ఆ నక్క వేగముగా పోవుచుండగా ఆతడు దానిని దేహము నడుమ బాణముతో కొట్టెను. అట్లు ఆ బాణము తన దేహమును కాల్చివేయు చుండగా నిలువెల్ల వేదనతో కూడిన ఆ ఆడునక్క సోమ తీర్థము కడ యాదృచ్ఛికముగా ప్రాణములను వదలెను. ఇంతలో ఆ రాజ పుత్రుడు ఆకలిగొన్నవాడై గృధవట తీర్థమునకు చేరి అచట విశ్రాంతి గొనుచుండెను. అంతలో రావిచెట్టు కొమ్మపైనున్న ఒక గ్రద్దను చూచి ఒక బాణముతో దానిని కూలనే సెను. బాణముతో ముక్కలైన గుండెగల ఆ గ్రద్ద ప్రాణములు పోయినదై, చైతన్యము లేనిదై ఆ రావిచెట్టు మొదట కూలెను. రాజపుత్రుడు అట్లు కూలిన గ్రద్దను కాంచి,తెగి పడిన రెక్కలు గల ఆ గ్రద్ద నెత్తుటితో ఎరుపెక్కిన బాణములతో దాని రెక్కలను తొలగించి దానిని ఆ వటమున నుంచి తన పురమునకు తిరిగి వచ్చెను. అదియు పెక్కుకాలమునకు, కోరకయే అచట కూలి, కళింగరాజు కుమారుడై పుట్టెను. సర్వశాస్త్రములను చక్కగా తెలిసిన దాయెను. అతడు పండితుడు, గుణవంతుడు. తన దేశమునకు ప్రియము చేయువాడు. ఆయాస మెరుగడు.దుఃఖమాతనికి ఎన్నడు కలుగదు.

భూమీ! ఆ నక్క ఉన్నదే, అది కాంతీరాజ్య పాలకుని కులమున రాజపుత్రియై మనోరమ అను పేరుతో పుట్టెను. చక్కని రూపము కలది. గుణములు కలది. సమర్థ సర్వాంగ సుందరి. అరువది నాలుగు కళలలో ఆరితేరినది. కోకిలవలె చక్కని కంఠస్వరము కలది. ఇట్లు కాగా, మంచి భావనల వలనను, ఒకరి కొకరికి ఏర్పడిన ఆత్మీయత వలనను, పరస్పరము కులములు కలసినందువలనను, నా అనుగ్రహము వలనను కాంతీరాజ్య కలింగరాజ్య పాలకులకు సంబంధము ఏర్పడెను. అంత కొంతకాలమునకు కాంతీరాజ కళింగరాజులు శాస్త్రము చూపిన పద్ధతితో వారిరువురకు వివాహము చేసిరి. కళింగరాజు కుమార దంపతులకు సమృద్ధములైన ధనములను, రత్నములను, రమణీయములను, యోగ్యములునగు ఆభరణములను, వస్తువులను కానుకగా ఇచ్చిరి. కళింగ రాజు వివాహము కావించి తన తనయునితో కూడియున్న కోడలిని కైకొని మిక్కిలి సంతోషము

నొందిన మనస్సుతో వేగముగా తన పురమునకు వచ్చెను. ఇట్లు ఆ దంపతులకు అనుకూలముగా కాలము గడచుచుండగా ఒకరి యెడ నొకరికి ప్రీతియు, రోహిణీ చంద్రులకువలె వృద్ధి పొందుచుండెను. వారిరువురు చక్కని రమణీయ ప్రదేశములందును, దేవాలయములందును, నందనముతో సరితూగెడు ఉద్యానవనముల యందును ప్రీతితో విహరించిరి. చక్కని ప్రతిష్ఠగల రాజపుత్రి ఏ క్షణము నందైనను, భర్త తన పార్శ్వమున కనబడనిచో తాను మరణించినట్లే భావించెడిది.

అతడును, సర్వమైన రూపముచేత మిక్కిలి సౌందర్యము కల తన భార్యను ఒక్క క్షణమైన చూడకుండెనేని తానును మరణించినట్లే భావించెడివాడు. ఇట్లు వారిరువురకు ప్రేమ పెరుగుచునే యుండెను. సముద్రపు అలలవలె వారి ప్రీతి పెరుగుచునే యుండెను. ఆమె తన హృదయమున మరియొక పురుషుని తలచి యెరుగదు. ఆమెయు తన చక్కని శీలముచేతను, నడవడిచేతను, కళింగరాజును, పౌరులను, జానపదులను సంతోషపరచుచుండెను. కళింగరాజు అంతఃపురము నందలి కాంతలు, రాజును వారి నడవడితో, పనులతో,మన్ననలతో పరమానందమందిరి. ఇట్లు వారిరువురకు, శచీపురందరులకువలె, ఒకరియెడనొకరికి ప్రీతి పెరుగుచుండెను. ఆనందమందు చుండిరి. అంతనొకనాడు ఆ బాల ఏకాంతమున ప్రేమతో, సిగ్గుతో ఆ రాజపుత్రునితో ఇట్లు పలికెను.

"రాజపుత్రా! యశోధనా! నిన్నొక్క చిన్న విషయమడుగ గోరుచున్నాను. నా యందలి స్నేహముతో, ప్రియముతో నీవు దానిని గూర్చి చెప్పవలయును." అంత కళింగరాజు కుమారుడు, పద్మపత్రముల వంటి కన్నులు కలవాడు ప్రియురాలి మాట విని తీయగా నిట్లు పలికెను. "మంచిదానా! నీవేదేది కోరుదువో దానినంతటిని చేసెదను. సత్యము మీద ఒట్టువేసి చెప్పు చున్నాను. రాణీ! సత్యము బ్రాహ్మణులకు కుదురు. విష్ణువు సత్యమునందే నెలకొనియుండును. దాని కుదురు తపస్సు. రాజ్యము సత్యమునందే ప్రవర్తించును. నేను ఎన్నటికిని అసత్యము పలుకను. సుందరీ! ఇంతవరకు అసత్యమాడలేదు. చెప్పు. నీ కొరకు నేనేమి చేయవలయును? ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, వాహనములు, మిక్కిలి శక్తికల రత్నములు– నీకు వలయునా? లేక అన్నిటికంటే మిన్నయయినది నా పట్టబంధమును (రాజలాంఛనమగు కిరీటము) నీ కొసగుదునా?" కాంతీరాజ పుత్రియగు ఆమె భర్త పలుకు విని ఆతని పాదములను చక్కగా

పట్టుకొని భర్తకిట్లు బదులు చెప్పెను. "నేను రత్నమును కోరను, ఏనుగులు, గుఱ్ఱములు, రథములు నాకక్కరలేదు. నా భర్త జీవించియున్నంతవరకు నాకు కిరీటముతో పనిలేదు. నేను మధ్యాహ్నమున ఒంటరిగా నిద్రింపగోరుచున్నాను. ఎక్కువ సేపు కాదు. చాలా తక్కువ కాలము. అట్లు నేను నిద్రించునపుడు నన్నెవ్వడు చూడరాదు. మామకాని, అత్తగాని, మరియెవరు కాని నేను నిద్రించుచుండగా చూడరాదు. ఇది ఒక ముహూర్త కాలము నాకు వ్రతము. ఇంటి పరిచారకులు గాని, బంధుజనులు గాని ఎవ్వరుగాని నేను నిద్రించుచుండగా నన్ను చూడరాదు." కళింగ సంపదల పెంపొందించు ఆ రాజకుమారుడు భార్య మాట విని అట్లే అని పలికెను. "సుశ్రోణి! నమ్మకముతో నుండుము. శుభముగా నీ వ్రతమును చేసికొనుము. నీశయనీయ మహా వ్రతమును ఎవ్వడును చూడడు."

ఇట్లు వారిరువురకు కాలము గడుచుచుండగా కళింగుడు ముసలితనము పొంది పుత్రుని రాజ్యమున అభిషేకించెను. వంశపు మొలక అయిన కొడుకునకు న్యాయము ననుసరించి తాను నిష్కంటకముగా అనుభవించిన రాజ్యమును ఒసగి కళింగుడు మరణించెను. ఇట్లు తండ్రి ఒసగినదియు, తన కీర్తిచే చేతికంది నదియునగు రాజ్యమును ఆతడు అనుభవించు చుండెను. ఆమెయు తన్నెవ్వరు చూడని తావున ఒంటరిగా నిద్రించుచుండెను. అంత చాలాకాలమునకు ఆ కళింగ వంశవర్ధనుడు సూర్యునితో సమానమగు తేజస్సుగల పవిత్రులగు అయిదుగురు పుత్రులనుపొందెను.ఈ విధముగా నామాయతో మోహితమైన మనుష్యలోకము తమతమ కర్మములతో చక్కగా కూడుకొని చక్రమువలె తిరుగుచున్నది. జనుడు పుట్టుచున్నాడు. పుట్టి బాలుడగుచున్నాడు. తరువాత తరుణుడగుచున్నాడు. వెనుక నడిమి వయస్సు కలవాడగు చున్నాడు. అటుపై ముదుసలి యగుచున్నాడు. బాలుడై తెలియక చేయు కర్మములనుబట్టి పాపముతో అంటు పొందడు. ఇందు సంశయము లేదు. అన్ని విధములగు అడ్డంకులతో కూడిన రాజ్యము నతడేలుచుండగా డెబ్బది యేడేండ్లు కడచినవి. డెబ్బది యెనిమిదవ ఏట ఆ రాజు ఏకాంతమున సూర్యుడు మధ్యాహ్నమున నుండగా ఆమెను గూర్చి ఆలోచించెను.

వైశాఖమాస శుక్లపక్ష ద్వాదశినాడు ఆతనికి ప్రియురాలిని చూడవలయునను బుద్ధిపుట్టెను. ఇందు ప్రయోజనమేమి? ఈ వ్రతమెట్టిది? ఈమె జనులు లేనిచోట నిద్రించెడు

వ్రతమేమి? ఏ ధర్మశాస్త్ర గ్రంథముననను ఇట్టి నిద్రించు వ్రతమేదియు కానరాదే! ఇది విష్ణువు చేసిన కర్మము కాదు. ఈశ్వరుడు ఉపదేశించినది కాదు. మనువు ఏర్పాటు చేసిన ధర్మముగా కానరాదు. కాశ్యపుడు చేసిన ధర్మము కాదు. మహాయోగులెవ్వరి వ్రతము కాదు. ఈ వ్రతము నాచరించిన వాడెవ్వడు ఇంతవరకు కానరాడు. బృహస్పతి చెప్పిన ధర్మములందు గాని, యముడుబోధించిన ధర్మములందు గాని, యిదికానరాదు. ఈమె నిద్రించుచు ఈ వ్రతము నాచరించుచున్నది. ఇష్టమైన భోగముల ననుభవించుచు, చక్కని మాంస భోజనములు చేయుచు, తాంబూలము వేసికొని, ఎర్రని వస్త్రములను, సన్నిని వలిపెములను ధరించి, రత్నమయములగు ఆభరణములతో నిండిన శరీరమున సుగంధములందుకొని ఆ వెడదకన్నుల నాకాంత ఏవ్రతము చేయుచున్నది? కమలముల వంటి కన్నులు గల నా ప్రియురాలు కోపగించినను తప్పక ఆమె ఎట్టి వ్రతమును చేయుచున్నదో చూడనే వలయును. ఇతరులను వశపరచుకొనెడు కిన్నరుల వ్రతము చేయుచున్నదా? కాక యోగీశ్వరియై యిచ్చ వచ్చిన తావున కరుగుచున్నదా? అట్లు కాక ఇతరుని మరిగి కామరోగముతో పైకొనియున్నదా? లేక ముహూర్త కాలము చెడిపెయై మరియొక పురుషుని అంటి పెట్టుకొని యుండెనా? ఇట్లతడు తలచుచుండగా సూర్యుడు అస్తమించెను. జనులందరకు సుఖము కలిగించు రాత్రి అరుదెంచెను. అంత రాత్రి గడువగా వేకువజామురాగా వందులు మాగధులు, వైతాళికలు స్తోత్ర పాఠములు చేయ మొదలిడిరి.

సర్వలోకముల మేలుకొరకు సూర్యుడు ఉదయింపగా రాజు శంఖములయు, దుందుభులయు నాదములతో మేల్కాంచెను. తన ప్రియురాలిని (నిద్రించుచుండగా) చూడవలయునని తాను వెనుకటి దినమున తలచిన ఆ తలపే తక్కిన అన్ని చింతలను పారద్రోలి తిరుగసాగెను. స్నానముచేసి సంధ్యవార్చి తగు విధముగా పట్టుపుట్టములు గట్టి అందరను తొలగించి తగువిధముగా ఇట్లు ఆజ్ఞను ప్రకటించెను. వ్రతమున నున్న నన్ను స్త్రీగాని, పురుషుడుగాని చూచినచో ధర్మ యుక్తమైన దండముతో ఆ వ్యక్తి నాకు చంపదగినది అగును అని. ఇట్లాపించి ఆ కళింగనృపతి తొందరతో ధీరుడై యాచోటి కరిగి అందు ప్రవేశించెను. ఆమెను చూడవలయునను ఆశ కల ఆ రాజు పాన్పుపై నున్న ఆ సుందరిని చూచి చింతాసక్తుడాయెను. ఆ కమలపత్రాక్షి వేదనతో, ఆయాసముతో,

తలనొప్పితో రోగపీడితయై ఏడ్చుచుండెను. "నేను పూర్వజన్మమున ఎట్టి చేయరాని పని చేసితినో, నా పుణ్యము తరిగిపోగా ఇట్టి దశను పొందితిని. దిక్కులేని దానివలె పాటుపడుచున్న నన్ను నా భర్త యెఱుగడు. నా భర్త నన్ను గూర్చి యేమి అనుకొనుచున్నాడో? అతని జనుల భావము లెట్టివో? ఇచట పడియున్న నేను చెలులకేమి చెప్పుదును? నేను తలచెడు తీరు సరికాదనుకొందును. కోరి తెచ్చుకొన్న దానికి ఈ దుఃఖము తగదు. భర్త నన్నుగూర్చి యేమి తలచునో? తక్కిన జనులు ఏమనుకొనుచున్నారో? సరికాని విధముగా నేనీ వ్రతమును చేపట్టితిని. ఇది అన్నియెడల వికటించినది. ఏనాటికైన సౌకరక క్షేత్రమునకు పోవలయును. అప్పుడు నా మదిలో ఉన్న మాటను చెప్పవలయును." అంత ప్రియురాలి మాట విని రాజులేచి చేతులతో భార్యను కౌగిలించుకొని యిట్లుపలికెను. "ప్రియా! నిన్నునీవు ఏల నిందించుకొందువు. మెచ్చుకొనవేల? శోకింపరానిదానవు. శోకింపదగిన దానవేల అయితివి? ఎనిమిది అంగములు గల వైద్యమున నేర్పుగల వైద్యులు లేరా? పెరిగిన నీ తలపోటును మెల్లగా తొలగింపగలరు కదా! ఏదోసగుచేత నీవు దీనిని ఇంత గుట్టుగా నుంచితివి? తలపోటు నిన్ను పీడింపగా ఏల నలిగిపోవుచున్నావు? వాతరోగమా? కఫముతో కూడిన పైత్యదోషమా? రక్త దోషమా? శ్లేష్మ దోషమా? సన్ని పాతమా? దేనితో నీతల నొచ్చుచున్నది? కాలము, అకాలము అనువాని తత్త్వమెరిగినవారు, ఉపాయములు తెలిసినవారు ఎందరో కలరు. మాంసపు కూడు తినుచున్నావు. దానివలన నీతల నొచ్చుచున్నదేమో? తలనరములను గట్టిగా పొడిచినచో చెడురక్తము వెలువడును, తలకు తైలము మర్దించినచో తలనొప్పి పోవకుందునా? దీనినింత గుట్టు చేసితివి. నాకును మునుపు చెప్పవైతివి. వ్రతమను నెపముతో నిన్ను నీవు హింసించుకొంటివి. నీలో నీవు సౌకరమునకు పోవుటను గూర్చి మాటాడు కొనుచున్నావు. అందు నీవే గుట్టుగా చేయవలసినది కలదేమో! దానిచేతనే వేదన నిన్ను పీడించుచున్నది." అంత ఆ కమలపత్రాక్షి సిగ్గుతో దుఃఖముతో కుమిలిపోవుచు ఆతని రెండు పాదములను పట్టుకొని యిట్లు పలికెను.

"రాజేంద్ర! నీవు అనుగ్రహముతో నన్నడుగదగదా? ఇది నా పూర్వకర్మ ననుసరించి వచ్చిన విషయము. దీనిని విడువదగును." అంత భార్య మాటను విని

కళింగజనేశ్వరుడు మనసు కుదుటపరచుకొని తీయగా నిట్లు పలికెను. "ఓ కీర్తిశాలినీ! ఈ రహస్యమును నాకును దాచెదవేల? అడుగుచున్నను నాకును చెప్పవేల?" భర్త మాట విని విస్మయముతో విప్పారిన కనులు గల ఆమె కళింగ జనాధిపునితో మెల్లగా ఇట్లనెను. "భర్తయే ధర్మము, భర్తయే యశస్సు, భర్తయే అన్నింటికంటే ప్రియముతో చూడదగిన వ్యక్తి. నన్ను నీవడిగిన దానిని తప్పక చెప్పవలసినదే. కానీ రాజా! నా హృదయమున ఏమి తిరుగుచున్నదో, ఈ దుఃఖమేమో నేను నీకు ఇందు ఎన్నటికిని చెప్పజాలను. నీవు మహారాజవు. నిత్యము సుఖముతో ఉన్నవాడవు. అందగాడవు. నావంటి భార్యలు నీకు అంతఃపురమున పెక్కండ్రు కలరు. మాంస భోజనములు చేయుచుందువు. ప్రజలు నీ మాటపై నడతురు. నీవు నాకు దేవుడవు గురువవు. సాక్షాత్తు భర్తవు. సనాతనమైన యజ్ఞమవు, ధర్మము, అర్థము, కామము కీర్తి, స్వర్గము, పాలకుడు– అన్నియు నీవే. రాజా! నీవు అడిగినపుడు ఇది యంతయు నేను చింతింపదగినది. రాజేంద్రా! సమస్తమగు రాజ్యమున కోరిక గల సుముఖుడవగు నీకు ఆ కారణమును తప్పక చెప్పవలయును. నీకు పెక్కండ్రు భార్యలు కలరు. నీవు వారిని నా వేదనను గూర్చి అడుగదగును. ఇక నేనో మాంసపు కూడులను తినుచున్నాను. నా మాట చెల్లుచున్నది. గంధములు, భోగములు కలవు. అట్టి నన్ను తను అడుగరాదు." అంత భార్య పలికినది విని కళింగ దేశ మహారాజు కమలములవంటి కన్నులుగల ఆమెతో తీయగా ఇట్లు పలికెను.

"మంచిదానా! శ్రద్ధగా వినుము. అది శుభమో, అశుభమో, నీవు తప్పక చెప్పవలయును. ఇది ధర్మము, సంశయము లేదు. ధర్మ మార్గమున నున్న స్త్రీలకు గ్రహింపదగిన వెన్నియున్నను, భర్తను పొందిన పిమ్మట వారు రహస్యములను దాచరు. ఎంత దుష్కరమగు పనిచేసినను రాగ లోభములకు కక్కుర్తిపడి రహస్యమును దాచునేని ఆమెను పండితులు 'సతి' అనరు. దీనిని బాగుగా విచారించి ఓ యశస్వినీ! పుణ్యాత్మురాలా! సత్యమును చెప్పుము. ఆ రహస్యమగు విషయమును నాకు చెప్పుట వలన నీకు అధర్మము కలుగదు." అంత భర్త మాట నాలకించి కాంతీరాజ కులమున పుట్టిన ఆమె కళింగాధిపతికి ప్రియమగు మాట నిట్లు చెప్పెను. "రాజే దైవము రాజు గురువు. రాజు చంద్రుడని గ్రంథములందు చదువుదురు. తప్పక చెప్పవలయును. ఇది సనాతనమగు ధర్మము. నీతో రహస్యము చేయరాని దగునేని, రాజసత్తమా! విను. నీ పెద్ద కుమారుని

రాజ్యమున నభిషేకింపుము. న్యాయము ననుసరించి కులమునకు తగినట్లుగా రాజ్యమును పుత్రున కొసగి నాతోపాటు రమ్ము. సౌకరక్షేత్రమునకు పోదము.” అంత తన యిల్లాలి పలుకు విని కళింగరాజు అట్లే అని పలికి ఆమె మాటకు అంగీకరించెను. “నేను నా తండ్రి నుండి క్రమమైన మార్గమున మునుపు పొందిన రాజ్యమును, నీ మాట మీద కుమారున కొసగెదను.” అంత రాజును, రాజుపుత్రియు వెలుపలికి వచ్చిరి. అచట జనులను గాంచిరి. అంత రాజు పెద్ద కంఠధ్వనితో, “ఎవరక్కడ ద్వారము కడ నిలిచినది?” అని కంచుకిని త్వరగా రమ్మని పిలిచెను. “ఈ జనులందరను, నా పరిచారకులను ఇక్కడ నుండి పంపివేయుము. ఒక వింత జరిగినది. ఈ కీర్తిశాలిని త్వరగా వెడలుగాక! అంత హలాహలా అను శబ్దము, నవ్వులు అంతఃపురజనము నుండి వెలువడినవి “మమ్ములను తోలి వేయుటకు కారణమేమని వారు పలికిరి. రాజులకు పెక్కుచింతలు. పెక్కుపనుల తొందరలు కనుక మమ్ముల నెందులకు తొలగ ద్రోయు చున్నారో మేము వినరాదా?” అని అడిగిరి.

పిమ్మట రాజు పెక్కు విధములగు అన్నపానములను తీసికొనెను. అభిషేకమునకై మంత్రులను ఆయా కార్యములకు నియోగించెను. రాజధానికి వచ్చిన మంత్రుల నందరిని చూచి వెడదకన్నులు గలవాడు. రాజనీతిలో ఆరితేరినవాడునగు కళింగుడు ధర్మముతో కూడినది, శబ్దశాస్త్ర మర్యాదలు తప్పనిదగు మధురమగు మాట నిట్లాడెను. “రేపు ఉయమున పుత్రుని రాజ్యము నందభిషేకింప గోరుచున్నాము. కుమారుని అభిషేకము నకు చేయవలసిన దానిని వెంటనే సిద్ధపరపుడు.” అంత మంత్రులు రాజుతో అంతయు సిద్ధమే అనిరి. రాజా! నీవు పలికినది మాకును ప్రియమే అనియు పలికిరి.

ఇట్లు పలికి మంత్రులు వెడలిపోయిరి. సూర్యుడు అస్తమించెను. ఆ రాత్రి ఆటపాటలతో సుఖముగా గడచిపోయెను. సూతులు, మాగధులు, వందులు, వైతాళికులు స్తోత్రపాఠములతో మంగళ గీతములతో రాజును మేల్కొల్పిరి. రాత్రి గడచిన పిదప సూర్యుడు ఉదయించినంత శుభముహూర్తమున రాజు కుమారుని అభిషేకించెను. కుమారునకు రాజ్యమొసగి అతని శిరస్సు మూర్కొని పుత్రులు కలవారిలో శ్రేష్ఠుడు, ధర్మవేత్తయునగు ఆ రాజు కొడుకుతో నిట్లనెను. కుమారా! రాజ్య పదవి యందున్న నీకు

కర్తవ్యమెట్టిదో నా వలన వినుము. పరమ ధర్మమును, పితృదేవతల ముక్తిని కోరినచో నీవిది వినవలయును.

"ఈయదగిన వారి యందు ఆర్తిని కలిగించరాదు. పరుల భార్యలను చెరచువారిని, బాలురను, స్త్రీలను హింసించువారిని కఠినముగా శిక్షింపవలయును. పరుల భార్యలయందు, ముఖ్యముగా బ్రాహ్మణ స్త్రీల యందు లోభము ఎన్నటికి చేయవలదు. చక్కని రూపముగల పరస్త్రీని చూచి కన్నులు మూసికొనవలయును. ఇతరుల ధనము, అన్యాయముగా సంపాదించు ధనములందును లోభము కూడదు. మంత్రులందరు సర్వకాలముల యందును ఒక్కతీరున నిలువరు. కులధర్మమును బట్టియు, కీర్తిని బట్టియు నీవు సాధించిన దేశమును రక్షించుకొనవలయును. ఏమరుపాటు లేక నిలువవలయును, మంత్రుల మాటలు పాటింపవలయును. మంత్రులు చెప్పిన దానిని బాగుగా విమర్శించి చేయవలయును. శరీర రక్షణమును తప్పనిసరిగా చేయవలయును. నాకు ప్రియమును, హితమును కోరెడు నీవు ప్రజలను సంతోషపెట్టవలయును. వేదవేత్తలను ఆనందింపజేయ వలయును. కుమారా! ఇది నీకు కర్తవ్యము. ఏడు వ్యసనములను రాజు విడువవలయును. రాజసుతులలో దోషములు మెండుగా నుండును. వానితో ఎంత సంపదగల వాడైనను, ఎంతటి తేజశ్శాలి అయినను రాజు నశించును. (1. స్త్రీ, 2. జూదము, 3. పానము, 4. వేట, 5. పలుకులలో పరుసదనము, 6. కఠినమైన దండనము. 7. సొమ్మును వ్యర్థముగా వెచ్చించుట ఇవి సప్త వ్యసనములు) మద్యము త్రావుటను వదలి వేయవలయును. వేటను ఎల్లప్పుడు వదలవలయును. పరుషమైన పలుకు పలుకరాదు. చొల్లు వాగుడు ఎన్నటికిని చేయరాదు. రాజ్య సంబంధమగు రహస్యమును రట్టు సేయరాదు. దూత మనసు విరుగ గొట్టరాదు. దండమున పరుసదనమును, చెడువారి సహవాసనమును వదల వలయును. ధనమును వ్యర్థపరుపరాదు. రాజకార్యము నెరవేరవలయునన్న కోరిక యున్నచో మంత్రితో అప్రియము పలుకరాదు. వెడలిపోవుటకు దారియందున్న నన్ను వారింపవలదు. అది నా కిష్టము కాదు. నా యందు నీ కిష్టమున్నచో వెంటనే దీనిని ఆచరింపుము. నా యాత్రకు అంగీకరింపుము." అంత తండ్రి మాట విని రాజపుత్రుడు "ఓ యశస్వీ! రెండు పాదములను పట్టుకొని దీనముగా ఇట్లు బదులు పలికెను. నాయనా! నీవు లేనపుడు నాకు రాజ్యమేల? కోశమేల? బలమేల? నేను కాలుచేత లాడించుటకును చాలను. అభిషేకము,

రాజశబ్దము వీనిని నాకు నీవంటగట్టుచున్నావు. నీవు లేని నేను వీనిని గొప్పవిగా భావింపను. ఏదో ఆటలాడుట మాత్ర మెరుగుదును. బాలకులు క్రీడింతురు గదా! రాజులు చేసెదు రాజ్య చింత అననేమో నాకు తెలియదు". కళింగమహీపతి ఆ మాటను విని మెత్తని మాటలతో ఇట్లు పలికెను. "కుమారా! ఇట్లాడుదువేమి? నేను నీ పలుకును తెలియకున్నాను. పౌరులు, జానపదులు నీకు అన్నియు నేర్పుదురు." ఇట్లు ధర్మశాస్త్రానుసారము ఆ రాజు కుమారుని బోధించి గట్టి నిశ్చయము చేసికొని బయలుదేరుటకు సిద్ధమాయెను. అట్లు బయలుదేరిన రాజునుగాంచి పౌరులు, జానపదులు ఆలుబిడ్డలతో పాటు ఆ రాజును వెంటనంటిరి. ఏనుగులు, గుఱ్ఱములు, రథములు, వాహనములు, స్త్రీలు, అంతఃపురము – పొంగులెత్తు ఆనందముతో అందరు రాజు వెంటపోసాగిరి.

ఇంకను శ్రీ వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "మాధవీ! పెద్దకాలమునకు అతడు సౌకరక క్షేత్రమును చేరుకొనెను. ధనములను, ధాన్యములను, పెద్ద యెత్తున దానమొసగెను. వసుంధరా! ఈ విధముగా ధర్మసంబంధములగు కార్యకలాపముతో న్యాయము తప్పని రీతితో అతనికి కాలము గడచుచున్నది. అంతనొకనాడు పద్మముల రేకుల వంటి కన్నులుగల ఆ కళింగరాజు కాంతీరాజసుతతో తీయగా ఇట్లు పలికెను. సుందరీ! నా జీవితమున వేయి యేండ్లు నిండినవి. నిన్ను నేనడిగిన ఆ పరమ రహస్య మేమియో చెప్పుము. అంత పతిమాట విని నవ్వి ఆ శుభేక్షణ ఆతని రెండు పాదములను పట్టుకొని రాజుతో ఇట్లు పలికెను. "పుణ్యాత్మా! నీవడిగినది అది అట్లే అగును. మూడు రాత్రుల ఉపవాసము తరువాత దానిని విందువు." "ఓ యశశ్వినీ! పద్మపత్ర విశాలాక్షీ! నిండు చంద్రుని బోలు మోము కలదానా! సరే" అని ఆమెకు ఆ రాజు బదులు పలికెను. పంద్రెండంగుళముల పలుధము పుల్లను గ్రహించి చక్కగా కూర్చుండి విధిననుసరించి ఆమె ఉపవాసమును ప్రారంభించెను. మూడు రాత్రులు కడచిన పిమ్మట ఆ దంపతులిద్దరు స్నానమాచరించి తెల్లని వస్త్రములు ధరించి విష్ణుదేవునకు ప్రణమిల్లిరి. అంత చక్కని మోముగల ఆ సుందరి తన రత్నాభరణములు అన్నింటిని తీ,సి నా ఆయా అవయవముల యందు సమర్పించెను. ఆభరములన్నింటిని తీసి వైచిన ఆ కాంత రాజుతో "నాథా! రమ్ము, రమ్ము నీవు కోరినచోటి కరుగుదము" అని పలికెను. అంత ఆ కీర్తిశాలిని భర్త చేతిని చేతితో

పట్టుకొని లేవ తీయగా ఆ కళింగరాజుతో ఇట్లు పలికెను. "రాజా! నేను పూర్వజన్మమున ఆడునక్కను. పశుజాతిదానను. మృగమును పొందగోరిన సోమదత్తుడు బాణముతో నన్ను కొట్టెను. రాజా! ఇదిగో నా తలయందు నాటుకొని యున్న ఈ బాణమును చూడుము. దీని దోషము వలన నేను రజస్సు, తమస్సులకు వశమై పోయితిని. కాంతీ రాజకులమున నా పుట్టుక అయినది. నా తండ్రి నన్ను నీ కొసగెను. నేను నీకు అప్రియనైతిని. రాజా! పద్ధతి ప్రకారము నీవు పరమసిద్ధి కరుగుము. నీకు నమస్కారము."

అంత తామరరేకులవంటి కన్నులుగల కళింగరాజు ఆ మాట విని విశుద్ధమైన అంతరంగముతో మనోహరమగు నవ్వుగల తన ప్రియురాలితో తీయగా ఇట్లు పలికెను. "మహాభాగా! నేను గ్రద్దను, అడవియందు తిరుగుచున్న ఆ సోమదత్తుడే ఒక్క బాణముతో నన్ను కూలనేసెను. ఓ సుశ్రోణీ! అందువలన నేనును కళింగదేశపు నృపతినైతిని. గొప్ప భాగ్యము, రాజ్యము నాకు లభించినది. సర్వాంగ సుందరీ! సిద్ధియు నాకు దొరికినది. గొప్ప సత్తువతో తిరుగుచు నేనొకనాడు కోరుకొనకయే ఇచ్చట మరణము పొంది పరమ సిద్దిని, రాజ్యలక్ష్మిని పొందగలిగితిని. కాంతా! రమ్ము నాతోపాటు పూజలను చేయుము" అని పలికెను. శ్రేష్ఠులైన భగవద్భక్తులు, నారాయణ ప్రియులు, పౌరులు, పల్లెలవారు అందరు లాభనష్టములను లెక్కగొనక పూజలు చేసిరి. వారందరు పెద్దకాలమునకు తమ గతిని కూర్చుకొనుచు నిర్మలమగు కర్మము లాచరించి దేహములను వదలిరి. వారందరు నాలుగు భుజములవారు, శంఖచక్రములను దాల్చినవారు, ఆయుధములతో కూడినవారునై శ్వేతద్వీపమున కరిగి (విష్ణు సారూప్యమును సామీప్యమును పొందిరి. అందలి స్త్రీలందరు శ్వేత ద్వీపమున అన్ని భోగములతో కూడినవారై స్తుతులచే మన్నింపదగినవారు. గొప్ప దేహశక్తి కలవారునై పరమానంద మందిరి.

భూదేవీ! సౌకరక క్షేత్రమునందలి మహాభాగ్యమును గూర్చి నీకు చెప్పితిని. కోరకయే అందు మరణించినవారు కూడా శ్వేత ద్వీపమున కరుగుచున్నారు. ఈ విధానముతో ఆ తీర్థమున నివాసము కల్పించుకొని మరణము పొందెడువాడు. విశాలాక్షీ! తప్పక శ్వేతద్వీపమున కరుగును. వసుంధరా! మరియొక విషయమును చెప్పెదను. వినుము. శాఖోటక తీర్థమున స్నానము చేసిన పుణ్య ఫలమెట్టిదో చెప్పెదను. వినుము. అట్టివాడు పదునొకండు వేల యేండ్లు నందనవనమును పొంది ఎల్లప్పుడు ఆనందమందు

చుండును. అటుపై స్వర్గము నుండి తిరిగి వచ్చి గొప్ప కులమున నా భక్తుడై పుట్టును. సంశయము లేదు. మరియొక విషయమును చెప్పెదను. గృధ్రవటమున స్నానము చేసి నీరు పుచ్చుకున్న మాత్రమున నరుడు పొందు ఫలమెట్టిదో చెప్పెదను. తొమ్మిదివేల తొమ్మిది వందల యేండ్లు ఇంద్రలోకమున నుండి దేవతలతోపాటు ఆనందము పొందు చుండును. ఇంద్రలోకము నుండి తిరిగివచ్చి నాతీర్థ ప్రభావము వలన తగులములన్నింటిని వదలి వైచి నా భక్తుడై పుట్టును దేవి. వసుంధరా! నీవు మున్ను నన్నడిగిన స్నానమాత్ర ఫలమును, సంసార లంపటము లన్నింటిని వదలించు దానిని నీకు వివరించితిని."

శుద్ధమగు వ్రతములుగల భూదేవి నారాయణునివలన ఈ విషయములన్నింటిని విని లోకనాధుడగు జనార్ధనునితో మధురముగా ఇట్లు పలికెను. "అతడు చేసిన విశిష్ట కర్మమెట్టిది. దానివలన అతడు తీర్థత్వమును పొందెను గదా! ఈ ఉత్తమమైన పరమ రహస్యమును నా కెరిగింపుము."

సర్వలోకములకు ప్రభువైన హరి భూదేవి వాక్యమును విని ధర్మమునందు కోరికగల వసుంధరతో ఇట్లు పలికెను. "దేవీ! నీవు నన్నడిగిన దానికి బదులు చెప్పెదను వినుము. ఆ గ్రద్దయు, నక్కయు పశు జన్మమును పొందినవి కదా! పెక్కు జన్మములలో సంపాదించిన పుణ్యములచేతను, తీర్థస్నాన జపాదులచేతను, మహాదానముల చేతను, నా భక్తులు తీర్థమున మరణము పొందుదురు. వెనుకటి జన్మములలో చేసిన కర్మము తక్కువదియో ఎక్కువదియో అది ఎప్పటికైనను ఫలించియే తీరును. దానికి పూర్తిగా నశించుట అనునది యుండదు. ఒకప్పుడు పుణ్యతీర్థములు మొదలగు వానిని దర్శించుట వలన కలిగిన పుణ్యము మరింత తోడు తెచ్చుకొని ప్రబలమైనది దుర్బలమగును. కర్మపు గతి అర్థము కానట్టిది. చాల తక్కువదిగా కన్పట్టునది, గొప్పది అగుటకును సమర్థమగును. అందువలననే తీర్థము ప్రభావము వలన ఆ నక్కకును, గ్రద్దకును మనుష్యత్వమే కాదు, రాజత్వము కూడ ప్రాప్తించినది. తీర్థమున కేవలము చనిపోయిన మాత్రమున వారు నశించిన పాపము కలవారై, పూర్వజన్మ స్మరణము పొంది శ్వేతద్వీపమునకు చేరుకొనిరి. వసుంధరా! నీవు దీనిని తెలిసి కొనుము.

వసుంధరా! మరియొక విషయమును చెప్పెదను. ఆదిత్యుడు తపస్సు చేసిన తావు వైవస్వత తీర్థమను పేరు పొందినది. యశస్వినీ! అతడు పుత్రునికొరకు తపము

నాచరించెను. పదివేల యేండ్లాతడు చాంద్రాయణ వ్రతమున శ్రద్ధ కలవాడాయెను. పిదప ఏడువేల యేండ్లు వాయుభక్షుడై తపము చేసెను. అంత గొప్ప శక్తి కల ఆ సూర్యుని విషయమున నేను తుష్టుడనైతిని. అటుపై ఆదిత్యుని వరము కోరుకొమ్మంటిని. "ఓయి మహాతేజశ్శాలి నీ మనసున నున్న కోరికయేమో తెలుపుమని" మహానుభావుడు. నా ఆరాధనయందు శ్రద్ధకలవాడునగు వివస్వంతునితో పలికితిని. అంత నా మాటవిని మహాబలము గల కశ్యప పుత్రుడు చక్కని కంఠస్వరముతో గొప్ప మాటనిట్లు పలికెను. "దేవా! నాయెడ ప్రసన్నుడ వైతివేని ఈవరమొసగుము. నీ దయవలన నాకొక పుత్రుడు కలుగ వలయును." వరము కోరెడు సూర్యుని పలుకు విని, సుందరీ! నిర్మలమగు మనస్సుతో నేనిట్లంటిని. "మహానుభావా! అది అట్టిదే అగును. నీకు యముడు, యమున అనుసంతానము కలుగుదురు. సంశయము లేదు." వసుంధరా! ఇట్లు ఆ సూర్యునకు వరమొసగి నాదైన యోగము ప్రభావముతో అక్కడనే అంతర్ధానము చెందితిని. ఎవ్వరికిని చేయనలవి కాని కర్మమును సౌకరక క్షేత్రమున చేసి ఆదిత్యుడును గొప్ప విలువ కల తన గృహమున కరిగెను. రెండు రోజులు ఉపవాసముండి ఆ తీర్థమున స్నానము చేయువాడు పదివేల యేండ్లు ఆదిత్య లోకములలో ఆనందమందును. లేదా, ఆ వైవస్వత తీర్థమున మరణించినవాడు యమునింటికి ఎన్నటికిని పోడు. "భూదేవీ! చల్లని చూపులదానా! వైవస్వత తీర్థమున స్నానము, మరణము లభించువాడు పొందెడు ఫలమును గూర్చి నీకు చెప్పితిని. పదునైదు దినములచట ఉపవాముండినవాడు అన్ని తగులములను వదలివైచి నా లోకమున కరుగును. మంచిదానా! వైవస్వత తీర్థఫలమును నీకు చెప్పితిని. సౌకరక క్షేత్రమున జరిగిన వృత్తమును నీకు వివరించితిని.

ఇది ఆఖ్యానములలో గొప్ప ఆఖ్యానము. క్రియలలో మహాక్రియ. ఇది జపింపదగినది. ప్రమాణమైనది. సంధ్యను ఉపాసించుట వంటిది. ఇది వేదములు, మంత్రములు. ఇది యంతయు భాగవతులకు ప్రియమైనది. దీనిని పిసినిగొట్టునకు ఒసగరాదు. భాగవతుడైనను మూర్ఖుడైనవానికి, అట్టి వైశ్యునకు, శూద్రునకు, నన్నెరుగనివారికి ఒసగరాదు. పండితుల సభనడుమను, భాగవతుల కడను, వేదమెరిగిన వారిలో శ్రేష్ఠులగు బ్రాహ్మణుల కడను దీనిని చదువవలయును. చక్కగా శాస్త్రముల నెరిగిన నిష్ఠ కలవారికి మాత్రమే దీని నొసగవలయును. మంచిదానా! సౌకరక క్షేత్రపు గొప్ప

పుణ్యమును నీకెరిగించితిని. ఉదయమున లేచి ప్రతి దినము దీనిని పారాయణము చేయువాడు పండ్రెండు సంవత్సరములు నన్ను భావించిన వాడగును. అతడు మరల గర్భములయందు పుట్టడు. సంసారమున చిక్కడు. ఒక అధ్యాయమును పఠించుట వలన పదితరముల వారిని తరింపజేయును. సమస్తమగు సంసారము నుండి విముక్తి పొందును. వసుంధరా! ఇంకనేమి అడుగుదువు. (137)

138 వ అధ్యాయము - సౌకరకక్షేత్ర మహిమ, మఱియొక కథ

సూతుడు ఇట్లు చెప్పెను "సౌకరక తీర్థమునందలి ఈ పుణ్యమును, గుణస్తుతిని, మాహాత్మ్యమును, జాతుల మార్పును విని కమలపత్రాక్షి, సర్వధర్మముల నెరిగినవారిలో మిన్నఅయిన భూదేవి పరమాశ్చర్యమును పొంది, ఆనందమందిన అంతరంగముతో మరల ఆ దేవుని ఇట్లడిగెను. "ఆహా! ఏమి నీ సౌకరక క్షేత్రమునందలి ఈ తీర్థ మహిమ! కోరక మరణించినదానికి మనుష్యత్వము సిద్ధించినది. దేవా! సౌకరకమునందు జరిగిన మరియొక వింత ఏదైననున్న నాకు తెలుపుము. నాకు విను వేడుక మిక్కుటముగా నున్నది. అచట నేల అలికిన దాని పుణ్యవిశేష మెట్టిది? ఆవు పేడ ఫలమేమి? నీటి నొసగినచో కలుగు పుణ్యమెటువంటిది? దేవ! నీ భక్తుడు నిండారు సంతోషము గల మనస్సుతో అచటి నేలను ఊడ్చినచో దాని పుణ్యమెట్టిదగును? అచట పాడినచో, వాద్యములు మ్రోయించినచో, నృత్యము చేసినచో, జాగరణము చేసినచో కలుగు ఫలమెట్టిది? పుష్పమును భక్తితో ఒసగినచో అనేక పుష్పముల మాలలను కానుకగా ఇచ్చినచో, అట్టివారేగతి పొందుదురు? ఈ పరమ రహస్యము నెరుగు కోరిక నా హృదయమున నున్నది. భక్తుల సుఖము కొరకై దీనిని నీవు చెప్పవలయును."

అంత భూదేవి పలుకువిని సర్వదేవమయుడగు హరి ధర్మకామ అయిన వసుంధరతో తీయగానిట్లు పలికెను. "సుందరీ! నన్ను నీవు అడిగిన దానికి ఉన్నదున్నట్లు, బదులు చెప్పెదను. ఆ పుణ్యమెట్టిదో, అది రహస్యమైనను, సుఖమును కలిగించునది, కనుక అంతయు నీకు తెలిపెదను. ఆ సౌకరక క్షేత్రమున శరత్కాలమున కాటుకపిట్ట యొకటి పురుగులను పక్షులను తినుటకు పట్టు కొనుచుండెను. ఆహార దోషముచేత అజీర్ణముతో బాధపడినదై గిలగిలలాడి స్పృహ తప్పి అది చనిపోవుటకు నిశ్చయించెను. అజీర్ణదోషముచేత చనిపోయెను. ఆ పిట్టను చూచి అచట ఆడుకొనుటకు వెళ్ళిన బాలకులు,

ఆటలు ముగిసిన పిదప దానిని పట్టుకొని యిష్టము వచ్చినట్లు కదలింపసాగిరి. అంత నా బాలురు దాని రెక్కలను తీసికొన దలచినవారై, నాది నాది అని పలుకుచు వారిలో వారు కలహమాడజొచ్చిరి. అంత బాలుడు ఆ పక్షిని పట్టుకొని ఇది మీది కాదనుచు గంగనీటిలో దానిని విసరిన, నేను నీకు మునుపు వివరించి చెప్పిన ఆదిత్య తీర్థము నందు గంగ నీటిలో పడి, అది నీటితో తడిసిన రెక్కలు కలదాయెను. వసుంధరా! అంత ఆ పక్షి పెక్కు యజ్ఞములాచరించు వైశ్యుని యింట, ధనరత్నములు నిండుగా గలచోట, రూపవంతుడు, గుణవంతుడు, పవిత్రుడు విశుద్ధుడునగు నా భక్తుడై జన్మించెను. అతడు పుట్టిన పండ్రెండేండ్లు గడచిన పిమ్మట ఒకనాడు అతడు తల్లిదండ్రులతో ఇట్లు పలికెను. అతడు మనసు కుదుట పరుచుకొని, నా ప్రియము నెరిగిన వారైనచో నా హృదయమున నున్న దానిని చెప్పెదను. నాకొక వరము నొసగవలయును. నన్ను అమ్మగాని, నాన్నగాని ఎన్నటికి వారింపరాదు. గురువుపై ఒట్టువేసి చెప్పుచున్నాను. అది మీ రంగీకరించినట్లే భావింతును. కొడుకు పలుకు విని ఆ దంపతులిద్దరు కమలముల వంటి కన్నులుగల ఆ బాలునితో మేలైన పలుకు నిట్లు పలికిరి.

"తండ్రీ! నీ మనసున నున్నదేదో, నీవేమి చెప్పుదువో దానినంతటిని చేయుదుము. ఇందు సంశయము లేదు. చక్కని పాలిచ్చెడు ఇరువది వేలగోవులు మనకు కలవు. ఎచట ఏది నీకిష్టమగునో అచట దానిని దానమిమ్ము. నీ కడ్డు చెప్పము. నాయనా! మరియొక మాట చెప్పెదము. మామాటలు వినుము. మనము వైశ్యులము. వర్తకము మన వృత్తి. అది ఏమగును? నీ వెనుకబడి ఆడుకొనెడి మిత్రులు పెరిగిపోవుచున్నారు. కనుక తగువిధముగా మిత్రులకు ధనమొసగుము. ధనములను, ధాన్యములను, రత్నములను ఇమ్ము. నీకు అడ్డులేదు. చక్కని అందచందములు గల మనకులవు కన్నెలు కలరు. వారిని తీసికొని వచ్చెదము. క్రమముగా పెండ్లియాడుము. లేక నీవు కోరుదువేని వైశ్యులు చేసెడు యజ్ఞములను శాస్త్రపూర్వకముగా చేసి దేవతలను పూజింపుము. ఎనిమిది వందల నిండు బలముగల ఎద్దులు గల నాగళ్ళు మనకు గలవు. వ్యవసాయము వైశ్య కర్మము కనుక వానిని గొని సేద్యము చేయగోరుదువా? ఎందరు నీతో మాటాడుదురో అందరు అతిధులకు అన్నమిడుదువా? భోజనముతో తృప్తిపడిన బ్రాహ్మణులకు ధనములిచ్చి తృప్తిపరుతువా? నీ యిష్టము ననుసరించి అది అంతయు నీవు చేయవచ్చును." ధర్మమును చక్కగా వినియున్న

ఆ బాలకుడు తల్లిదండ్రులు మాటలు విని వారిరువురి చరణములు పట్టుకొని మరల ఇట్లు పలికెను.

"గోదానమున నాకు పనిలేదు. మిత్రములను గూర్చి నేను భావించుట లేదు. కన్యల పొందులో నాకు కోరికలేదు. యజ్ఞఫలము నందు ఆశలేదు. వాణిజ్యము, వ్యవసాయము, గోరక్ష నాకు పట్టవు. అతిధులందరిని మెప్పించుట నా హృదయమున ఉన్న విషయము కాదు. నాదైన పరమ రహస్య మొక్కటియే. దానియందే నా కోరిక తిరుగాడుచున్నది శ్రీ నారాయణ క్షేత్రమైన సౌకరమునకు పోవుటయే నా భావన. నా అర్చన యందు పరమానురాగము గల ఆ కుమారుని మాట విని అతిదీనముగా ఆ దంపతులు విలపింపదొడగిరి. "కొడుకా! నీవు పుట్టిన పండ్రెండేండ్లే అయినది. ఇప్పుడే నీవు నారాయణుని ఆశ్రయమునకు పోవుచింత చేసితివి. ఇదియేమి? నీకు మేలగుగాక! ఆ వయస్సు వచ్చినప్పుడు తప్పక దానిని గూర్చి ఆలోచింపవచ్చును. ఇప్పటి నుండియే నీ వెనుక భిక్షాపాత్రను గొని మమ్ములను పరుగెత్తుమందువా? సౌకరమున కరుగు భావన ఇది ఏమి నాయనా! నీకొసగిన గొప్ప శక్తిగల ఔషధము మొదలగు వాని ఫలమైన మేము గాంచము కదా! చక్కగా అన్నము తినువేళ అతిక్రమించుచుండగా హఠాత్తుగా నారాయణ క్షేత్రమునకు పోవు బుద్ధి నీకు పుట్టినది. ఇది ఏమి? ఈనాటికిని రాత్రింబవళ్లు నా చన్నులు చేపుచున్నవి. బిడ్డా! అట్టి నీ స్పర్శను రూపు మాపెదు ఆలోచనను నీవేల చేయు చున్నావు. రాత్రివేళ నిద్రించి పాన్పున పొరలాడుచు 'అమ్మా' అని పలుకుచుందువు. అట్టి నీవిట్లేల చింతించితివి? చిన్ని నాయనా! నీ వాటలాడుకొనుచుండగా నీ రూపమున కచ్చెరువడు స్త్రీలును, పురుషులను నిన్ను తాకుచుందురు. బాలకా! ఎప్పుడైన నీయెడల చిరాకు కలిగినను, నిన్ను నొప్పించెడు మాట ఇంతవరకు పలుకము. ఎవరి దోషము వలన నీవు వెళ్లిపోవుటకు చింతించితివి? ఇల్లు వాకిండ్లలో ఏ దోషము లేదు గదా! ఇంటిలోని వారెవ్వరు నీయెడల పరుషముగా పలుకరు కదా! ఎప్పుడైనా నీపై కోపము వచ్చి చేతనొక కర్ర పట్టుకొనియు నిన్ను కొట్టుటకు నాకు మనసు వచ్చెడిది కాదు. నీ యందలి అనురాగము నన్ను ఉక్కిరిబిక్కిరి చేసెడిది." అంత తల్లి మాటవిని ఆ వైశ్యకుల నందనుడు తల్లితో మెల్లగా ఇట్లు పలికెను. "అమ్మా! నీ కడుపున పడుకొని నీ అంగములలో నిలిచియుంటిని. నీ ఒడిలో ఆడుకొంటిని. చక్కగా పొంగారెడు నీ స్తనములయందు నేను

పాలుత్రావితిని. దుమ్ము కొట్టుకున్న ఒడలితో నీ ఒడిలో నేను పొరలాడితిని. అమ్మా! ఏడువకుము. పుత్ర దుఃఖమును విడిచి పెట్టుము. కొడుకు కోరికను తీర్పుము. నన్ను గూర్చి దుఃఖపడవలదు. మనుజులు వచ్చుచున్నారు. పోవుచున్నారు. కొందరు వచ్చిరి. కొందరు వత్తురు. ఇప్పుడు కన్పట్టుచున్నారు. మరల నశింతురు. తిరిగి ఎన్నటికిని కానరారు. ఎక్కడనుండి పుట్టితిని? ఏమి సంబంధము? నీవు తల్లివి. ఆయన తండ్రి. ఈ యోనిలో ఈ ఘోర సంసార సాగరములో పడితిని. వేలకొలది తల్లిదండ్రులు, వందలకొలది భార్యలు కొడుకులు, ప్రతిజన్మము నందును ఇట్టి బంధములు గలుగుచునే యున్నవి. వారెక్కడివారో, మేమెవరి వారమో! అమ్మా! ఈ విచారమును పొంది నీవు దుఃఖింపరాదు."

ఇది విని తండ్రియు తల్లియు ఆశ్చర్యముతో మరల ఇట్లు పలికిరి. "అయ్యో! ఇదియేమి? ఏదో పెద్ద రహస్యము. నాయనా!" చెప్పుము. ఈ మాట విని ఆ వైశ్యకుల బాలకుడు తల్లిదండ్రులతో మరల నిట్లనెను. మీరు గట్టి నిర్ణయముతో ఈ రహస్యమును వినగోరుదురేని సౌకర క్షేత్రమున కరిగి అచట నన్నడుగుడు. ఈ అమ్మ నన్ను కడుపున పెట్టుకొని కనినట్టిది. తండ్రితోపాటు మనము సౌకర క్షేత్రమున కరుగుదము. అచటకు పోయి నాగొప్ప శక్తిగల గుట్టును తెలియజేసెదను. సూర్యతీర్థమును చేరుకొని, నాయనా! నీవడిగిన దానిని చెప్పెదను." ఆ దంపతులు అట్లే అని కొడుకుతో పలికి సౌకరక క్షేత్రమునకు పోవుటకై సంకల్పించిరి. "నాయనా! నీవు ఈనెల మొదటి పక్షమున కృతకృత్యుడవు కాగలవు" అని వలసినవస్తు సామగ్రితో వారు సౌకరక క్షేత్రమునకు పయనమైరి. అంత ఆ పద్మ పత్రముల వంటి కన్నులు గల ఆ భీరప్రభువు (వైశ్యుడు) ముందుగా వడివడిగా ఇరువదివేల గోవులను తరలించెను. ఆ గోవులు ముందుగా తగు ద్రవ్యములతో కూడినవై బయలుదేరినవి. ఇంటనున్న వస్తువు సమస్తము నారాయణునికి సమర్పితమైనది.

అంత మాఘమాస శుక్ల పక్షమున త్రయోదశినాడు తమ వారికి, చుట్టములకు పోయి వత్తుమని చెప్పిరి. స్నానము చేసి, శౌచకార్యములు ముగించుకొని నారాయణునికి ప్రీతియగునట్లుగా దోషములు లేని ముహూర్తమున బయలుదేరిరి. అంత పెద్ద కాలమునకు నాయందు చెదరని భక్తి కలవారు వైశాఖ ద్వాదశినాడు నా క్షేత్రమును చేరుకొనిరి. గంగయందు స్నానముచేసిరి. శుభ్రమైన వస్త్రములను తాల్చిరి. ఇరువదివేల గోవులను

నాకు సమర్పించిరి. అచట భాంగురసుడను నా భక్తుడు విధిపూర్వకముగా ఆ గోవులను నాకొరకై గ్రహించెను. గొప్ప వెలగల యిరువది గోవులను శుభమైనవి. పవిత్రములైనవి. ఎక్కువ పాలిచ్చునవి యగు వానిని నా నుండి గ్రహించి ఆతడు దానమొసగెను. ప్రతి దినము ధనములను, రత్నములను దానమిచ్చుచుండెను. ఇట్లు కుమారునితో, భార్యతో, తనవారితో ఆ వైశ్యుడు ఆనందముగా కాలము గడుపుచుండెను. ఇట్లచట అతడు నివసించుచుండగా వర్షాకాలము వచ్చెను. అన్ని పంటలను పెంపొందించు వరములు చనుదెంచెను. కడిమిచెట్లు కుటజములు, అర్జునకములు విరియబూచినవి. ప్రియుల దగ్గరలేని స్త్రీలు కుమిలి పోసాగిరి. మేఘములు మెరుపులతో బెగ్గురుపక్షులనెడి అలంకారములతో ఉరిమిరిమి కుండపోతగా కురిసినవి. నెమళ్ల క్రేంకారములతో, బెగురుపక్షుల కలకలారావములతో కడిమి మొదలగు పూలచెట్ల సువాసనలతో ఆతావు నిండిపోయెను. నెమిళ్లకు సుఖము కలిగించునవియును, భర్తల ఎడబాటుకల వనితలకు దుఃఖము కలిగించునవియును అగు చక్కని గాలులు వీచుచున్నవి. మేఘములు దుందుభి నాదములతో కాలము గడచుచున్నది. పిదప శరత్కాలము వచ్చినది. అగస్త్య మహర్షి ఉదయించెను. చెరువులన్నియు ప్రసన్నములైనవి. తామరలతో కలువలతో కలకలలాడుచున్నవి. పద్మముల వనములు కన్నులకింపుగా చక్కగా పూచియున్నవి. తెల్లని పద్మముల చల్లదనమును, కర్పూర పుటనటుల సువాసనను కలుపుకొని కామిజనులకు ప్రియములైన సుఖకరములగు మెల్లని వాయువులు వీచుచున్నవి. ఇట్లు శరత్కాలము నడచుచుండగా కార్తీకమాస శుక్లపక్ష ఏకాదశినాడు ఆ దంపతులు స్నానములు చేసి తెల్లని పట్టుపుట్టములు ధరించి కుమారునితో ఇట్లు పలికిరి. "పుత్రా! ఇచట ఆరు నెలలుంటిమి. రేపు ద్వాదశి, మమ్ములను ఇంతవరకు నిలువరించిన ఆ రహస్యమును మాకేల చెప్పకున్నావు?"

తల్లిదండ్రుల మాటనాలకించి ధర్మమున నిష్టగల ఆ కుమారుడు, మరణమునకు నిశ్చయము చేసికొని మెల్లగా వారి కిట్లనెను. "నాయనా! నీవు పలికినది అట్టిదే. రేపు ఉదయమున నీకు నా పరమరహస్యమును చెప్పుదును. తండ్రీ! ఇదిగో ఈ కార్తీక ద్వాదశి ప్రభువగు నారాయణునకు ప్రియమైనది. మంగళకరము. విచిత్రమయినది. విష్ణుభక్తులకు సుఖము కూర్చునది. సంతోషముతో కూడిన హృదయముతో ఈ కార్తీక ద్వాదశినాడు

దానము లొసగువారు యోగుల కులమున దీక్షకలవారు, విష్ణుభక్తులలో వృద్ధి పొందినవారు అగుదురు. ఆ దానము మహిమచేత విష్ణుభక్తులు ఘోరము, విస్తారము అయిన సంసారమును దాటుదురు. ఇట్లు మాటాడుకొనుచుండగా వారికి ఆ రాత్రి కడచి తెల్లవారెను.సంధ్యాకాలము కడచి సూర్యమండలము ఉదయింపగా ఆ బాలుడు శుచియై పట్టు వస్త్రమును తాల్చెను. దేవునకు తలతో ప్రణమిల్లి ప్రదక్షిణమాచరించి తల్లిదండ్రుల పాదములకు నమస్కరించి వారితో ఇట్లు పలికెను. "తండ్రీ! మనమీ సౌకరక క్షేత్రమునకు ఏలవచ్చితిమి? అనినీవడుగు దానికి సమాధానము వినుము. నేను కాటుక పిట్టను. తిర్యగ్జాతికి చెందిన పక్షిని. పురుగులను తింటిని. అజీర్ణముతో మిక్కిలి బాధనొందితిని. అదే దోషముచేత నేను మెదలుటకు చాలని వాడనైతిని. అట్లు విలవిలలాడుచున్న నన్ను బాలకులు పట్టుకొని ఆడుకొనజొచ్చిరి. ఒకని చేతినుండి మరియొకని చేతికి విసరివైచుచు, కేరింతలు కొట్టుచు. దీనిని నీవు చూచితివి. కాదు నేను చూచితిని అని వారిలో వారు కలహించిరి. అంత ఒక బాలుడు తరుగువోని నీటిలో గిరికీలు కొట్టుచు, నీది కాదు, అనుచు ఆదిత్య తీర్థమును చేరుకొని తీవ్రమగు క్రోధమును పూని గంగనీటిలో నన్ను విసరివైచెను. గొప్ప శక్తిగల ఆ సూర్య తీర్థమున నేను కోరుకొనకయే ప్రాణములను విడిచితిని. అమ్మా! నీ కొడుకునై పుట్టితిని. ఇప్పుడు ఆ కాలము నడుచుచున్నది. ఇదిగో ద్వాదశి కోరుకనకయే మరణించిన నాకు పదుమూడేండ్లు నిండినవి. నాయనా! ఇచ్చటికి వచ్చుటలో రహస్యమగు దీనిని నీకు చెప్పితిని. నేను నాపని చేసికొందును. నీవు ఇంటి కేగుము. నీకు నమస్కారము. అంత అతని తల్లిదండ్రులు కొడుకుతో మరల నిట్లనిరి. నాయనా! విష్ణువు చెప్పిన కర్మములు నీవు చేసెడివేవి కలవో మేమును శాస్త్ర మార్గము ననుసరించి వారిని చేసెదము. దానివలన మాకు సంసార బంధము వదలిపోవును. వారును పెద్దకాలము నా ఆరాధనయందు శ్రద్ధ కలవారై విపులముగా పూజల నాచరించి పిదప మరణించిరి. నా క్షేత్రము ప్రభావమువలనను, వారి కర్మపరిపాకము వలనను సంసార బంధములన్నింటిని తెంచుకొని వారు శ్వేతద్వీపమున కరిగిరి. వారి యింటినుండి వచ్చిన పరిచారకులను, చక్కని పూజాకర్మములను ఎవరికి తోచిన విధముగా వారాచరించిరి. అట్లు నా పూజల యందు శ్రద్ధగల వారందరు సంసారబంధము నుండి ముక్తిపొంది, క్షేత్ర ప్రభావము చేత సకలైశ్వరములతో కూడినవారై వ్యాధులు, రోగములు

లేనివారై శ్వేతద్వీపమును చేరుకొనిరి. అందందరు యోగులే. అందరు కలువలకమ్మని వాసనలు కలవారే. నా అనుగ్రహము వలన అందరు క్షేమమును, ఆనందమును పొందువారే. దేవీ! ఇది గొప్ప శక్తిగల మహాఖ్యానము. నీకు చెప్పితిని. సౌకరక క్షేత్రమున జరిగిన మరియొక విషయమును కూడ నీకు చెప్పెదను. (138)

139 వ అధ్యాయము - మందిర ప్రోక్షణ, సంకీర్తనల మాహాత్మ్యము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! నా మందిరమును గోమయము చేత అలుకువానికి లభించు ఫలమును చెప్పుచున్నాను. బహుశ్రద్ధగా నేను చెప్పబోవు విషయమును వినుము. భగవంతుని మందిరమును గోమయముచే అలుకు మనుష్యుడు ఎన్ని అడుగులు వేయునో అన్ని వేలసంవత్సరముల వరకు అతడు దివ్యలోకమున ఆనందించును. నా భక్తుడు ఎవరైననూ, పన్నెండు సంవత్సరముల కాలముపాటు మందిరమును అలుకుటను చేయునో, అతడికి ధనధాన్యములు, సంపదచేత సుఖించు శ్రేష్ఠమైన పెద్ద కుటుంబమునందు జన్మించి, దేవతల ద్వారా అభినందింపబడి కుశద్వీపమునందు జన్మించు అవకాశమును లభించును. నా సేవ మహత్మ్యము వలన, ఆ కుశ ద్వీపమునందు జన్మించిన తర్వాత పది వేల సంవత్సరముల వరకు అచటనే వసించు భాగ్యము లభ్యమగును. పిమ్మట కుశదీపమునందు రాజుగా జన్మించి ధర్మపరుడై దీర్ఘకాలము జీవింపగలడు. శుభురాలా! దేవీ! ఎవరు నా గర్భగృహమును స్వయముగా గోమయము చేత లేపనము చేయునో లేక పద్ధతి ప్రకారము ఇతరుల చేత చేయించునో అతడు నా లోకమును పొందగలడు. వసుంధరా! ఇప్పుడు నేను గోమయము యొక్క మహిమను తెల్పుచున్నాను. ఆలకింపుము. మందిరమునుంచి, ఏజీవి దేని సమీపస్థానము నుంచి, లేక దూరముపోయి గోమయము తెచ్చుటకు ఎన్ని అడుగులు వేయునో, అతడు అన్ని వేల సంవత్సరముల వరకు స్వర్గలోకమున గౌరవముతో వాసము చేయును. స్వర్గలోకమున నివసించు అవధి పూర్తియైన తర్వాత అతడు శాల్మలీ ద్వీపమున జన్మించి ఆనందమును అనుభవించుచూ అచటనే 12,100 సంవత్సరముల వరకు వాసము చేయగలడు. మరల పుణ్యభూమియైన ఈ భారత వర్షమునందు రాజుగా జన్మించి, ధర్మజ్ఞులందరిలోనూ శ్రేష్ఠునిగా ఖ్యాతిగాంచి నా భక్తుడు కాగలడు. తర్వాత జన్మమునందు కూడా తన పూర్వజన్మ సంస్కారము, అభ్యాసముల కారణముల చేత మరల గోమయమును

తెప్పించి నా మందిరమును పరిశుభ్రముగా అలికించును. ఆ సత్కర్మాచరణ ఫల స్వరూపముగా నాలోకముకు శాశ్వతముగా చేరుకొనగలడు. ఎవరైననూ గోవును స్నానము చేయించి, ఆ గోవు యొక్క గోమయము చేత అలికించిన యెడల ఆ సమయమున నీటిని తీసుకొని వచ్చు మనుష్యుడు అతడు తీసుకొని వచ్చిన నీటి బిందువుల సమాన సంఖ్యగల అన్ని వేల సంవత్సరముల వరకు స్వర్గలోకమున గౌరవముతో నివసించును. అంతేకాక స్వర్గలోకమున వాసము చేయు అవధి పూర్తియైన తర్వాత ఆతడు క్రౌంచ ద్వీపమునకు పోయి అచట తగినంత కాలము వసించిన కాలము అయిపోయిన తర్వాత భూమండలముపై ధర్మపరుడైన రాజుగా జన్మించును. అంతేగాక సిద్ధుడు ఆ పుణ్య ప్రభావము చేత అతడు నా శ్వేత ద్వీపమును చేరుకొనును.

వసుంధరా! స్త్రీ యైననూ లేక పురుషుడైననూ నా మందిరమునందు మార్జనము (చిమ్ముట) అను పనిని చేయువారు, తాము చేసిన సర్వఅపరాధముల నుంచి ముక్తులై సన్మాన పూర్వకముగా స్వర్గలోకమున నివసింపగల్గుదురు. పిమ్మట మార్జనము చేయు సమయమునందు ఎగిరిపడు ధూళి కణములు ఎన్ని కలవో అన్నివందల సంవత్సరముల వరకు స్వర్గలోకమునందు వసించుటయే, కాక ఆ స్వర్గలోకచ్యుతి జరిగిన తర్వాత వారు శాకద్వీప దానమును ప్రాప్తించుకొనగలుదురు. అట్టి వ్యక్తి అచట బహు దీర్ఘకాలము నివాసముండి, పిమ్మట పవిత్రమైన భారత భూమియందు ధార్మికుడైన రాజుగా జన్మించును. అంతేగాక సమస్త విధములైన భోగములను అనుభవించి, నన్ను ఉపాసించి శ్వేత ద్వీప వాసమును పొందగల్గును.

దేవీ! ఇప్పుడు నీకు మరికొన్ని విషయములను చెప్పుచున్నాను. శ్రద్ధగా ఆలకింపుము. నా ఆరాధనా సమయమునందు పద్య గానము చేయు ప్రాణికి లభ్యమగు ఫలమును చెప్పుచున్నాను వినుము. పాడిన పద్య పంక్తులయందు ఎన్ని అక్షరములు కలవో అన్ని వేల సంవత్సరముల వరకు ఆ గాయకుడు ఇంద్రలోకమున ప్రతిష్ఠితుడగును. ఎల్లప్పుడు నా స్తుతి గానమునందు నిమగ్నుడగు నా భక్తుడు ఇంద్రలోకమునందలి రమణీయమైన నందన వనము నందు దేవతలతో కూడి ఆనందమును పొందిన తర్వాత అచట నుండి చ్యుతిచెందు కాలము రాగా భూమండలమున వైష్ణవ కులమునందు జన్మించి వైష్ణవులతోనే కలిసి నివాసముండును. అచట నాపై భక్తితో నా యశోగానమున లగ్నమైన

మనస్సుకలవాడై ఉండును. పిమ్మట ఆయువు పూర్తియైనతర్వాత, శుద్ధమగు అంతఃకరణము గల ఆ పురుషుడు నా దయచేత నా లోకమునకే చేరుకొనును. అని ఈ విధముగా భగవంతుడు వరాహమూర్తి చెప్పగా, వసుంధర "ఆహా! భక్తికి సంబంధించిన విషయములు ఎంత విస్మయకరమగు ప్రభావము కలవియో కదా! అందుచేత ఈ కీర్తనము యొక్క ప్రభావము చేత ఎందరు జీవులు సిద్ధి ప్రాప్తింప చేసికొనిరో వినవలయునని నాకు కోరిక కలదు" అని ప్రార్థించినది.

వరాహమూర్తి విష్ణుభగవానుడు ఇట్లు చెప్పెను. "దేవీ! వరాహ క్షేత్రమునందు నా మందిర సమీపమున ఒకానొక చండాలుడు నివసించుచుండెను. అతడు నాయందలి భక్తి చేత పరవశుడై రాత్రి అంతయు మేలుకొని ఉండి, భక్తిచే నా యశోగానమును చేయుచుండెను. ఒక్కొక్కప్పుడు అతడు సుదూరములోఉన్న ఇతర ప్రాంతములకు తిరుగుచూ నా భక్తి గీతములను గానము చేయుచుండెను. అనేక సంవత్సరములపాటు ఈవిధముగా అతడు చేయుచుండెను. ఒకానొకప్పుడు జరిగిన విషయము. కార్తీక మాస శుక్లపక్ష ద్వాదశి నాటి రాత్రియందు జనులందరును నిద్రపోవుచుండగా, అతడు తన వీణను చేతిలోనికి తీసికొని, ఆర్ద్రతతో భక్తి గీతములను పాడుచు తిరుగుట ప్రారంభించెను. ఆ విధముగా తిరుగుచుండగా ఒకచోట అతడిని ఒక బ్రహ్మ రాక్షసుడు పట్టుకొనెను. పాపము ఆ చండాలుడు పాపము బహు నిర్బలుడు. బ్రహ్మరాక్షసుడు చూచినంతనే భయమును కల్గించు ఆకారము, రూపము కలవాడు. ఆ కారణముచేత ఆ రాక్షసుని పట్టునుంచి అతడు తనను తాను విడిపించుకొనలేకపోయెను. బలహీనుడై,శోకము చేత దుఃఖము కలిగి వ్యాకులుడై తప్పించుకొను ఉపాయము గానక నిశ్చేష్టుడుగా నిలబడి పోయిన చండాలుడు బ్రహ్మరాక్షసునితో "ఓయి! నా వలన నీకు ఏమి కోరిక సిద్ధింపగలదు? ఎందుకు నీవు ఈ విధముగా నన్ను లోబర్చుకొంటివి" అని ప్రశ్నించెను. అతని మాటలు విని మనుష్య మాంసమనిన మిక్కిలి ఆపేక్షగల ఆ బ్రహ్మరాక్షసుడు చండాలునితో "గత పది దినముల నుంచి నేటివరకును నాకు ఆహారము ఏమియు దొరకలేదు. అట్టి సమయమున బ్రహ్మదేవుడు నాకు ఆహారమగుట కొరకే నిన్ను పంపి ఉన్నాడు. ఇప్పుడు నేను మజ్జమాంసము రక్తములతో పూర్తిగా నిండి ఉన్న నీ శరీరమును భక్షించెదను. అంతటితో నా ఆకలి నశించి తృప్తి కలుగగలదు" అని చెప్పెను.

వసుంధరా! చండాలుడు నా గుణగానము చేయుట యందు చాలా ఆసక్తుడై యుండెను. అందుచే అతడు బ్రహ్మ రాక్షసునితో "మాహాభాగా! నేను నీ పలుకులను గౌరవించెదను. బ్రహ్మ నీ భోజనము కొరకే నన్ను పంపించెను. కాని పరమాత్ముడు విష్ణుదేవునిపై గల భక్తి సంపన్నుడనైన నేను ఈ జాగరణ సమయము నందు దేవాధిదేవుడు అగు జగదీశ్వరుని గుణగానము కొరకు సంపూర్ణముగా ఉద్యుక్తుడనైయున్నాను. అందుచేత సమీపమున గల తోట యందున్న ఆ పరమేశ్వరుని ఆవాసస్థలము దగ్గరకు పోయి, ఆయన గుణగానమును జగదీశ్వరునకు వినిపించి తిరిగి రాగలను. అప్పుడు నీవు నన్ను తినవచ్చును. కాని ఇప్పుడు ఆ భగవంతుని సన్నిధికి పోవుటకు నాకు అనుమతి ఇమ్ము. ఎందుకనగా నేను రాత్రియందే శ్రీహరి భగవానుని ప్రసన్నుని చేసుకొనుట కొరకు భక్తి సంగీతము వినిపింతునని వ్రతమును పూనియున్నాను. నా వ్రతము పూర్తియైన తర్వాత నీవు నన్ను భక్షించవచ్చును" అని ప్రార్థించెను. క్షుధార్తుడగు బ్రహ్మరాక్షసుడు ఈ మాటలను విని కోపముతో కఠోరమైన వాక్కులతో ఇట్లు "ఓరీ మూర్ఖుడా! ఇట్టి అసంబద్ధములైన మాటలు మాట్లాడుటకు నీకు తెలివి ఎట్లు వచ్చినది. ఇట్టి అబద్ధములను ఎందుకు పల్కుదువు. నీవు నా దగ్గరకు మరల వచ్చెదనని చెప్పుచున్నావు. ఆహా! ఏమి నయగారపు పలుకులు. మృత్యుముఖమున ప్రవేశించి తిరిగి బ్రతుకగలనని అనుకొను మనుష్యుడు ఎవడైననూ, ఎచటనైననూ ఉండునా" పలికెను బ్రహ్మరాక్షసుని నోటియందు చిక్కుకొని కూడా తప్పించుకొని పోవలయునని కోరుకొనుచున్నావు. ఇది ఎట్లు జరుగును?" అని బ్రహ్మ రాక్షసుడు పలికెను. ఆ మాటలను విని చండాలుడు "బ్రహ్మరాక్షసుడా! నేను పూర్వ జన్మమున చేసిన నిందిత కర్మల ప్రభావముచేత ఈ జన్మలో చండాలుడనైతిని. కాని నా అంతఃకరణమందు ధర్మము నిలిచియే ఉన్నది. నేను ధర్మానుసారము మరల తప్పక నీ వద్దకు రాగలను. అందులకు నా ప్రతిజ్ఞను వినుము. నా జాగరణ వ్రతమును పూర్తిచేసి అవశ్యము నేను నీ వద్దకు రాగలను. ఈ ప్రపంచము అంతయూ సత్యముపై ఆధారపడియే నిలిచియున్నది. మిగిలిన లోకములన్నియూ సత్యముపై ఆధారపడినవే. బ్రహ్మాదులైన ఋషులు సత్యము వలననే కార్యసిద్ధి పొందినట్టివారు. కన్య సత్యప్రతిజ్ఞ పూర్వకముగానే దానము చేయబడును. బ్రాహ్మణులు కూడా ఎల్లప్పుడూ సత్యమునే పలుకుదురు. దేశమును

పరిపాలించు రాజులు సత్యభాషణము యొక్క ప్రభావము చేత మూడు లోకములందును విజయమును ప్రాప్తించుకొనగలుగుచున్నారు. అందుకే

సత్యమూలమ్ జగత్సర్వం లోకాః సత్యే ప్రతిష్టితాః

సత్యేన దీయతే కన్యా సత్యమ్ జల్పంతి బ్రాహ్మణాః

సత్యమ్ జయని రాజానవీణ్యేతా బృవన్నృతామ్

అని చెప్పబడినది. సత్యప్రభావము చేతనే స్వర్గ మోక్షములను ప్రాప్తించుకొనుట సులభమగుచున్నది. సూర్యుడు కూడా సత్యము యొక్క ప్రతాపము చేతనే ఉష్ణముచే తపింపజేయుచున్నాడు. ఇంకనూ చంద్రుడు సత్య ప్రభావము వలన ప్రపంచమును రంజింపజేసి ఆనందమును కల్గించుచున్నాడు. **(సత్యేనగమ్యతే స్వర్గో మోక్షః సత్యేన చాప్యతే సత్యేన తపతే సూర్యా సోమః సత్యేన రంజ్యతే)** నేను సత్యపూర్వకముగా ప్రతిజ్ఞ చేయునదేమనగా ఒకవేళ నేను తిరిగి నీ దగ్గరకు రాకపోయిన యెడల రెండు పక్షములలోని షష్ఠి, అష్టమి, అమావాస్య చతుర్దశి ఈ తిధులయందు స్నానము కూడా చేయని వానికి ఏ దుర్గతి కలుగునో నాకును అదే గతి కలుగు గాక! మిధ్యా యజ్ఞమును చేయువాడు అట్లే, మిధ్యాభాషణములు చేయువారికి ఏ గతి ప్రాప్తించునో నాకును అదే గతి కలుగుగాక! బ్రాహ్మణ వధ చేయుట చేత, మదిరాపానము చేత దొంగతనము చేయుట, వ్రత భంగముల చేత పురుషునికి ఏ దుర్గతి కలుగునో తిరిగి నేను నీ వద్దకు రాని యెడల నాకును అదే గతి కలుగు గాక!" అని పల్కెను.

దేవీ! వసుంధరా! ఆ సమయమునందు చండాలుని మాటలను వినిన బ్రహ్మ రాక్షసుడు మిక్కిలి ప్రసన్నుడయ్యెను. అందుచే అతడు మధురములగు మాటలచే "ఓయీ! నీవు చెప్పినది వింటిని. నీవు పొమ్ము. నీకు నమస్కారము" అని ఈ విధముగా పల్కి నిశ్చయముతో చలింపని చండాలుని పంపుటకు బ్రహ్మరాక్షసుడు అనుమతించెను. దేవి వసుంధరా ఆ చండాలుడు నా యశోగానము చేయుటయందు లీనమయ్యెను. అతడు నన్నుగురించి గానము చేయుచూ నాట్యము చేయుచూ ఉండగా రాత్రి సంపూర్ణముగా గడచిపోయినది. ప్రాతఃకాలమున సూర్య భగవానుడు ఉదయించు సమయమునకు చండాలుడు బ్రహ్మరాక్షసుని వద్దకు తిరిగి వచ్చుచుండగా దారిలో ఒక పురుషుడు అతని వద్దకు వచ్చి ఎదుట నిలబడి, "సాధూ! నీవు ఇంత వేగముగా ఎచటికి పోవుచున్నావు. నీవు

ఆ బ్రహ్మరాక్షసుని వద్దకు ఎట్టి పరిస్థితులలోను పోవద్దు. ఆ బ్రహ్మ రాక్షసుడు శవములను కూడా తినునట్టివాడు. అందుచేత అతని వద్దకు నీవు పోవుట మృత్యువు ముఖమునందు ప్రవేశించుటయే అగును" అని పల్కెను.

ఆ మాటలను వినిన చండాలుడు "మొదటనే నన్ను చూసిన బ్రహ్మరాక్షసుడు తినుటకే సిద్ధపడెను. నేను అతనికి తిరిగి వత్తునని ప్రతిజ్ఞ చేసితిని. సత్యమును పాటించుట పరమ ఆవశ్యకమగు విషయము" అని చెప్పగా ఆ పురుషుడు ఆతనికి హితము చేయవలెనను కోరికచే, "చండాలా! అచ్చటకు పోవద్దు. ప్రాణమును రక్షించు కొనుటయందు సత్యమును వదలివేసిననూ అందు దోషము లేదు" అని పల్కెను. కాని చండాలుడు తన వ్రతమును వీడదలచుకొనక స్థిరమగు భావము గలవాడై నిలిచెను. అందుచే అతడు మధురవాక్కులతో "మిత్రుడా! నీవు చెప్పు మాటలు నాకు అభీష్టములు కావు. నేను సత్యమును వదలుకొన లేను. ఎందుకనగా నావ్రతము స్థిరమైనది. ప్రపంచము యొక్క స్థిరత్వము సత్యమైనది. సత్యము పైననే ఈ లోకము మొత్తము నిలిచియున్నది. సత్యమే పరమ ధర్మము. పరమాత్మ కూడా సత్యము పైననే ప్రతిష్ఠితుడై ఉన్నాడు. ఆ కారణము చేత నేను ఎట్టి విధముగానైననూ అసత్యమును ఆచరింపను" అనిచెప్పి ఆ చండాలుడు బ్రహ్మరాక్షసుని వద్దకు పోయి ఆతనితో గౌరవముగా "మహాభాగా! నేను వచ్చితిని. ఇప్పుడు నీవు నన్ను తినుటయందు ఎట్టి ఆలస్యమును చేయవద్దు. నీ కృప చేత ఇప్పుడు నేను విష్ణుభగవానుడు వసించు ఉత్తమ స్థానమునకు పోగలను. అందుచే నీ ఇష్టమును అనుసరించి నా శరీరము నందలి అంగ ప్రత్యంగములను భక్షింపవచ్చును" అని పల్కెను.

అంతట ఆ బ్రహ్మ రాక్షసుడు ఇంపు కల్గించు పల్కులచే "సాధు, వత్సా నేను నీ సత్యసంధత చేత సంతుష్టుడనైతిని. నీవు సత్యధర్మమును చక్కగా పాలించితివి. సాధారణముగా చండాలురకు ధర్మమును గూర్చిన జ్ఞానము ఉండదు. కాని నీవు అత్యంత పవిత్ర బుద్ధి గలవాడవు. భద్రా! నీకు జీవించవలెనను కోరిక ఉన్న యెడల విష్ణు మందిరమునకు పోయి గత రాత్రియందు నీవు చేసిన గానము యొక్క ఫలమును నాకు ధారపోయుము. నేను నిన్ను వదలివేయుదును. అట్టియెడ నిన్ను భక్షింపను, భయపెట్టను" అని పలుకగా చండాలుడు "బ్రహ్మరాక్షసా! నీ పలుకులలోని అభిప్రాయము ఎట్టిదో. నేను

కొంచెమైననూ తెలుసుకొనలేకున్నాను. ముందు నీవు నన్ను తినుటయే నేను కోరుకొనుచున్నాను అని ఇంతకు ముందుపల్కి ఇప్పుడు భగవద్ గుణగానము వలన పుణ్యమును ఏల కోరుచున్నావు?" అని చండాలుడు ప్రశ్నింపగా, ఆతని పలుకులను విని బ్రహ్మరాక్షసుడు నీవు గానము చేసిన ఒక గీతము చరణము యొక్క పుణ్యమును నాకు ప్రసాదింపుము. నిన్ను నేను వదలివేయుదును. అందుచే నీవు భార్యాపుత్రులతో సుఖముగా జీవింప గల్గుదువు. అనగా ఆ చండాలుడు గీతగానము యొక్క పుణ్యముయెడ లోభము గలవాడై నందున మరల అతడు బ్రహ్మరాక్షసునితో "నేను సంగీతఫలమును నీకు ఇవ్వలేను. నీవు నీ నియమమును అనుసరించి నన్ను తినివేయుము. ఇంకనూ నీ మనోభిలాషను అనుసరించి నా రుధిరమును త్రాగుము"అనగా ఆ బ్రహ్మరాక్షసుడు చండాలునితో "తండ్రీ! నీవు విష్ణుమందిరమున గానము చేసిన గానఫలమునందు ఒక గీతము యొక్క ఫలమును నాకు ఇచ్చుటకు దయ చూపుము. నీవు ఇచ్చు ఒక గీత ఫలము చేతనే నేను తరింప గల్గుదును. అంతేగాక నా కుటుంబమును కూడా తరింపజేయును" అని పల్కెను. అంతట చండాలుడు బ్రహ్మరాక్షసుని సాంత్వనపరచుచూ ఆశ్చర్యచకితుడై "బ్రహ్మరాక్షసా! నీవు ఏమి వికృత కర్మమును చేసి ఉంటివి. బ్రహ్మరాక్షసునిగా అగుటకు కారణమైన ఆ వికృత కార్యమును నాకు తెల్పుము" అని పల్కెను.

చండాలుని మాటలకు సమాధానముగా బ్రహ్మ రాక్షసుడు "నేను పూర్వజన్మమునందు చరక గోత్రియుడనైన సోమశర్మ అను పేరు గల ఒక యాయవార బ్రాహ్మణుడను. నాకు వేద సూత్రములు గాని, మంత్రములుగాని సక్రమమైన పద్ధతిలో తెలియవు. అయిననూ యజ్ఞాదికర్మములలో నేను నిమగ్నుడై ఉండెడివాడను. లోభ మోహముల చేత ఆకృష్టుడైన నేను మూర్ఖులకు పౌరోహిత్యమును కూడా నిర్వర్తించుచుండెడివాడను. వారికి యజ్ఞము, హవనము మొదలగు కార్యములను చేయించుచుంటిని. ఒకప్పుడు జరిగిన విషయము వినుము. నేను సంయోగ వశమున పాంచరాత్రము అను పేరు గల యజ్ఞమును చేయించుచుంటిని. ఆ కార్యమును నిర్వర్తించుచుండగానే నాకు ఉదరశూల కల్గినది. ఆ శూలయొక్క బాధ చేత నేను ప్రాణరహితుడనైతిని. ఆ సమయమునకు ఆ పాంచరాత్ర యజ్ఞము యొక్క పూర్ణాహుతి జరుగలేదు. అందుచేతనే నాకు ఈ స్థితి కల్గినది. ఆ దూషిత కర్మయొక్క ప్రభావము చేత

నేను బ్రహ్మారాక్షసుడనైతిని. నేను ఆ యజ్ఞమునందు మంత్ర హీనము, స్వరహీనము, నియమ విరుద్ధమైన ప్రాగ్వంశ నిర్మాణమును స్థాపింప జేసితిని. (ప్రాగ్వంశము అనగా యజ్ఞవేదిక యొక్క తూర్పు దిశయందు పర్ణముల చేత నిర్మింపజేయబడిన పాక వంటి గృహము. దీనియందు యజ్ఞము చేయించువారికి చెందిన స్త్రీలు పిల్లలు కూర్చుండెదరు) అది నియమ విరుద్ధము. హవనమును కూడా విధి ప్రకారము చేయించుటలో విఫలుడనైతిని. ఆ కర్మ దోషము యొక్క ఫలితముగా నాకు రాక్షస జన్మము సంప్రాప్తించినది. యిప్పుడు నీవు నీ గీత ఫలమును ఇచ్చి నన్ను ఉద్ధరింపుము" విష్ణు గీతము యొక్క పుణ్యము చేత నా వంటి అధముని శీఘ్రముగా ఈ పాపము నుంచి విముక్తి కలిగిన వానిగా చేయుము" అని వినుతించెను.

దేవీ! ఆ చండాలుడు ఉత్తమ వ్రతమును పాటించు వ్యక్తి. బ్రహ్మ రాక్షసుడు చెప్పిన వృత్తాంతమును విని ఆ వచనములను సహర్షముగా ఆమోదించి ఇట్లు పల్కెను. "రాక్షసుడా! నీవు నా గీత ఫలముచేత శుద్ధ మనస్కుడవై క్లేశముక్తుడవు కాగలిగిన యెడల ఆ ఫలమును తీసుకొనుము. అత్యంత సుందర స్వరముల చేత నేను చేసిన సర్వోత్కృష్ట ఫలమును నీకు దానము చేయుదును. శ్రీహరి ఎదుట భక్తి సంగీతమును గానము చేసిన నరుడు ఇతరులను అత్యంత కఠిన పరిస్థితులయందు కూడా ఉద్ధరింపగలడు" అని చెప్పి ఆ చండాలుడు తన గీతము యొక్క ఫలమును బ్రహ్మ రాక్షసునికి ప్రదానము చేసెను. భద్రే! వసుమతీ! ఆ గీత ఫలమును స్వీకరించిన బ్రహ్మారాక్షసుడు తక్షణమే ఒక దివ్య పురుషుని రూపమును దాల్చి నిల్చెను. అతడు శరదృతువు చంద్రుని వలె ప్రకాశించెను. నా గుణయుక్తమైన గీతముల ఫలము అనంతమైనది. భూదేవీ! నేను నా భక్తి సంగీతము యొక్క గానము చేత కలుగు ఫలమును నీకు వర్ణించి తెలిపితిని. ఆ గీతము నందలి ఒక శబ్ద ప్రభావము చేతనే మనుష్యుడు సంసార సాగరమును తరింపగలడు.

ఇప్పుడు నేను వాద్యము వలన కలుగు ఫలమును తెలుపుచున్నాను. ఆ వాద్య ఫలము చేతనే వసిష్ఠుడు దేవతల నుంచి కామధేనువును ప్రాప్తించుకొనగల్గెను. రాగ, తాళముల చేత లేక వాని సంయోగ ప్రయోగము చేత మనుష్యుడు తొమ్మిదివేల తొమ్మిది వందల సంవత్సరముల వరకు కుబేర భవనమునందు నివసించి, ఇచ్ఛానుసారముగా ఆనందమును అనుభవింపగలడు. అక్కడ నుంచి విముక్తి పొందిన తర్వాత తాళ రాగముల

సంపన్నుడై స్వతంత్రాపూర్వకముగా నా లోకమును చేరగలడు. నా ఆరాధన సమయము నందు నృత్యము చేయు మనుష్యునికి లభ్యమగు పుణ్యమును తెలియ జేయున్నాను. వినుము. ఆ నృత్య ఫల స్వరూపముగా అతడు సంసారబంధములను తెంపుకొని నా లోకమును చేరుకొనగలడు. ఏ మానవుడు జాగరణము చేసి వాద్యములతో, గీతములతో నా యెదుట నృత్యము చేయునో, అతడు జంబూద్వీపమునందు జన్మించి రాజులకు కూడా రాజగు సామ్రాట్టు కాగలడు. అంతేగాక సమస్త ధర్మముల చేత సంపన్నుడై సమస్త పృథ్వికి ప్రేక్షకుడు కాగలడు. నా భక్తుడు నాకు పుష్పములు, ఉపహారములను అర్పించిన నా లోకమును చేరుకొనగలడు. వసుంధరా! సత్కర్మలు చేయుచూ నన్ను ఉపాసించువాడు, అట్లే పుష్పములను తీసుకొని వచ్చి నాపై చల్లెడివాడు ఘనమైన ఉత్తమ స్థితిని పొందగలడు. అందుచేత నా లోకమును చేరుకొను అధికారము గలవాడగును.

భూదేవీ! ఏ నరుడు ప్రాతఃకాలమునందే లేచి ఈ వృత్తాంతమును పఠించునో అతడు పది పూర్వ జన్మలు, పది రాబోవు జన్మలలో కలుగు కష్టములనుంచి తరింపగలడు. మూర్ఖుడు, నిందకుల ఎదుట ఈ వృత్తాంత ప్రవచనము చేయరాదు. ఇది ధర్మములలోనే పరమ ధర్మము. క్రియలలో పరమక్రియ. శాస్త్ర నింద చేయు వ్యక్తి ఎదుట ఈ కథనమును ఎన్నడూ వినిపింపరాదు. ఎవరు నాయందు శ్రద్ధ కల్గియుందురో, ఎవరియందు ముక్తి యెడ అభిలాష కలదో వారే దీని పఠన పాఠనములను చేయవలయును. (139)

140 వ అధ్యాయము – కోకాముఖ క్షేత్ర మాహాత్మ్యము

ధరణి ఇట్లు ప్రశ్నించెను."భగవాన్! మీరు ఇంతకు ముందు తెల్పిన తీర్థముల మాహాత్మ్యమును అన్నింటినీ నేను విని ఉంటిని. అయిననూ ఇప్పుడు మీరు సగుణస్థాకార విగ్రహ రూపమును ధరించి నిత్యము ఏ క్షేత్రమునందు సుశోభితులై ఉందురో నేను మీనుంచి తెలుసుకొనవలయునని కోరుకొనుచున్నాను. అట్టి క్షేత్రములలోనే మీ ఉత్తమ కర్మను సంపాదించి శ్రేష్ఠగతిని పొందుటకు అవకాశము కల్గునుగదా!

ధరణితో వరాహమూర్తి ఇట్లు చెప్పెను. "దేవీ! కోకాముఖము అను పేరుగల తీర్థము యొక్క పేరును ఇంతకు ముందే నీకు తెల్పి ఉంటిని. అది గిరులలో శ్రేష్ఠమైన హిమాలయా పర్వత లోయయందు కలదు. అంతేగాక లోహార్గళము అను పేరు గల మరియొక స్థలము కూడా కలదు. ఆ రెండు క్షేత్రములను ఒక్కక్షణము కూడా నేను వదలి

ఉండను. అట్లే జ్ఞాన దృష్టితో పరిశీలించిన చరాచరముల చేత నిండిన ఈ ప్రపంచమంతయు నాచే ఆవరించి ఉన్నది. అంతేగాక ఏ స్థలమైననూ నేను ఉండనిది ఉండదు. కాని నా గూఢగతిని తెలుసుకొనవలయునని కోరిక లేనివారు నన్ను ఆరాధించుటకు వీలైనంత త్వరగా కోకాముఖమునకు పోవుటకు ప్రయత్నము చేయవలెను" అని చెప్పగా "ధరణి జగత్ప్రభూ! నీవు సర్వత్రా వ్యాపించి ఉండెడివాడవు అయినను ఆ కోకాముఖ క్షేత్రము మిక్కిలి శ్రేష్ఠమైనదని ఎట్లు చెప్పగలవు?" అని ప్రశ్నించెను. ధరణి యొక్క సందేహమును తీర్చుటకు భగవానుడు ఆది వరాహమూర్తి వసుంధరా! కోకాముఖమును మించి ఏ స్థానమును దానికంటె శ్రేష్ఠము, పవిత్రము, ఉత్తమము లేక నాకు ప్రియమైనది లేదు. ఏ మనుష్యుడు కోకాముఖ క్షేత్రమునకు చేరి నా దర్శనము చేసికొనునో అతడు మరల ఈ ప్రపంచము నందు జన్మించడు. కోకాముఖ క్షేత్రముతో సమానమైన మరియొక స్థానము లేదు. భవిష్యత్కాలములో రాదు. అచట నా మూర్తి గుప్తరూపముతో నివసించి ఉండును" అని తెలుపగా.

పృథ్వి ఇట్లు ప్రశ్నించెను."దేవేశ్వరా! నీవు సర్వోపరిదేవుడవు. భక్తులకు అభయప్రదానము చేయుట నీ స్వభావము. ఇప్పుడు ఈ కోకాముఖ క్షేత్రమున ఎన్ని గోపనీయ స్థానములు గలవు వారిని గురించి దయతో నాకు తెలియజేయ ప్రార్థన" అనగా వరాహమూర్తి ఇట్లు చెప్పెను. "దేవీ! ఎచ్చట ఈ శ్రేష్ఠమైన హిమవత్ పర్వతము నుంచి నిరంతరము జలబిందువులు భూమిపై పడుచుండునో, ఆ స్థానమును జలబిందు తీర్థము అందురు. అచట పృథ్విపై రోకలితో సమానమైన నీటిధార పర్వతము నుంచి పడుచుండును. ఆ ధారను విష్ణుధార అని పిలుతురు. అచట ఒక రాత్రి పగలు ఉపవాసము చేసి, యథాపూర్వకముగా స్నానము చేయవలెను. అట్టివానికి అగ్నిష్టోయ యజ్ఞమును అనుష్టించిన ఫలము లభించును. ఇంకనూ అతడి మనస్సునందు కర్తవ్య నిర్ధారణ చేయట యందు ఎన్నడునూ వ్యామోహము కలుగదు. అంతేగాక అంతమునందు ఆతడు విష్ణుధార యొక్క ఒడ్డున మరణించగల్గు అదృష్టము కలిగి నిత్యము నా ఈ రూపమును దర్శనము చేసుకొనుచుండును. ఇందు సందేహము ఆవంతయు వలదు. ఆ కోకాముఖ క్షేత్రమునందు విష్ణుఫలము అను పేరు గల ప్రదేశము కలదు. అచట కూడా నా విగ్రహము కలదు. కాని ఈ రహస్యము ఎవరికిని తెలియదు. భూదేవీ! ఏ నరుడు అచట స్నానము చేసి ఒక రాత్రి

అచట నివాసముండి నాయందు శ్రద్ధ కలిగినవాడైన యెడల ఆతడికి క్రౌంచ ద్విపమున జన్మించు భాగ్యము కల్గును. ఇంకనూ చివరిలో ప్రాణత్యాగము జరిగినప్పుడు సమస్త కోరికల నుండి ముక్తుడై నా లోకమునకు చేరుకొనగలడు.

ఈ కోకా మండలమునందే చతుర్ధార అను స్థానము కలదు. అచట ఎత్తైన పర్వతము నుంచి ధారగా నీరు పడుచుండును. ఏ మానవుడు ఐదు దినముల వరకు అచట నివాసముండి, స్నానము చేసిన యెడల అతడికి కుశ ద్వీపమునందు జన్మించి, నివాసముండి పిమ్మట నా లోకమును చేరుకొను భాగ్యము కలుగును. అచ్చటనే అనిత్యము అను పేరు గల ఒక ప్రసిద్ధ క్షేత్రము కలదు. కర్మఫలమును సుఖవంత మగునట్లు పరివర్తింప దాని ఉనికిని దేవతలు కూడా తెలియజాలరు. ఇక మానవుల సంగతి చెప్పవలసినదేమి? శ్రేష్ఠ సువాసితురాలవైన ధరణీ అచ్చట ఒక రాత్రి ఒక పగలు నివాసముండి స్నానము చేసిన పురుషుడు పుష్కర ద్వీపమునందు జన్మించును. ఇంకనూ సమస్త పాపములనుండి ముక్తులై నా లోకమునకు చేరుకొనును. అచట అత్యంత గోపనీయమైన బ్రహ్మసరము అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఒక స్థానము కలదు. అచట కలతలముపై పవిత్ర ధారగా జలము క్రిందకు పడుచుండును.నా భక్తుడెవరైననూ అచట ఐదు రాత్రుల కాలముపాటు నివసించి, స్నానము చేసిన అతడి సూర్యలోకమును చేరుకొనగల్గును. సూర్యధారను ఆశ్రయించి ఉండు వ్యక్తి ప్రాణము పోయినప్పుడు నా లోకమును ప్రాప్తింపజేసుకొనును. దేవీ! అచట పరమ రహస్యమైన నా స్థానము ఒకటి కలదు. దానిని "ధేనువటము" అని పిల్చెదరు. అచట ఎత్తుగా గల శిలనుంచి నిరంతరము బాగుగా లావుగా ఉండు నీటిధార పడుచుండును. నా కర్మమునందు అనగా నన్ను ఆరాధించుటయందు సంలగ్నుడైన ఏ నరుడైనను ప్రతి దినము స్నానము చేసి, ఏడు రాత్రుల కాలము అచట ఉండునో అతడు సప్త సముద్రముల యందు స్నానము చేసినవానిగా పరిగణింపబడును. ఆ ఫలముచే అతడు నా ఉపాసనయందు ఉండి సప్తద్వీపములయందు విహారము చేసిన వానిగా పరిగణింపబడి అంతమున నా ధ్యానము, భజన చేయుచూ, చనిపోయిన పిమ్మట సప్తద్వీపములను అతిక్రమించిన వాడై నా లోకమును ప్రాప్తింపజేసికొనివాడు అగును. దేవీ! అచట "కోటివటము" అను పేరు గల మరియొక గుప్త క్షేత్రము కలదు. అచ్చట గల వటవృక్షము యొక్క వేరు నుంచి వెలువడిన

ధార నిరంతరము పడుచుండును. ఆ ప్రదేశమున ఒక రోజు రాత్రి ఉండి స్నానము చేసిన మనుష్యుడు ఆ పర్వత శృంగముపై గల వటవృక్షము యొక్క ఆకుల సంఖ్యకు వేయిరెట్లు సంఖ్యగల సంవత్సరముల వరకు రూపము, సంపదల చేత సంపన్నుడుగా ఉండగలడు. తరువాత మరణించి అగ్నికి సమానముగా తేజోవంతుడై నా లోకమును చేరుకొనును.

దేవీ! నా ఈ క్షేత్రమునందు "పాప ప్రమోచనము" అను పేరు గల మరియొక గుప్తస్థానము కలదు. అచట ఒక రోజు రాత్రి స్నానము చేసి వసించిన నరుడు నాలుగు వేదముయందు పారంగతుడై జన్మించును. అచటనే కౌశికి అను పేరుగల నది ఒకటి కలదు. ఈ ఆప్రదేశమున ఐదు రాత్రులు నివాసముండి స్నానము చేసినవాడు ఇంద్రలోకమునకు చేరుకొనును. కౌశికీనది నుంచి ఒక ధార ప్రవహించుచుండును. ఏ నరుడు ఒక రాత్రి పర్యంతము అచట వసించి స్నానము చేయునో అతడికి యమలోకమున ఘోరకష్టములను అనుభవింపవలసిన అవసరము రాదు. ఆ నా భక్తుడు ప్రాణములను త్యజించిన తర్వాత నా లోకమునకు చేరుకొనును.

భద్రే! నా బదరీ క్షేత్రమునందు మరియొక విశిష్ట గుణము కలదు. దాని ప్రభావము చేత సంసార సాగరమును తరింపగలరు. దానిపేరు "దంష్ట్రాంకురము". అదియే కోకానదికి జన్మస్థానము. ఆ గుహ్య స్థానమును తెలుసుకొనుటయందు సమర్థుడైనవాడు ఎవడునూ లేడు. ఆ కారణము చేత జనులు అచటికి చేరుకొనలేరు. భద్రే! అచట స్నానము చేసి ఒక పగలు, రాత్రి పవిత్రమైన భావముల చేత నివాసము ఉండగలిగిన మానవుడు శాల్మలీ ద్వీపమునందు జన్మను పొందును. అంతేగాక నన్ను ఉపాసించి ఆ ఉపాసన సంలగ్నము గలవాడై ఆ నరుడు ప్రాణత్యాగమొనరించిన తర్వాత, శాల్మలీ ద్వీపమును పరిత్యజించి నా సమీపవర్తియై వసించును. మాహాభాగే! అచట పరమఫలదాయకమైన మరియొక గుప్తస్థానము కలదు. దానిని "విష్ణు తీర్థము" అందురు. అచట పర్వతముల మధ్యనుంచి వెలువడిన జలధార కోకానది యందు కలియును. ఆ జలమును "త్రిస్రోతసము" అందురు. ఇది సమస్త సంసార బాధలను తొలగించునట్టిది. పృథ్వీదేవీ! అచట స్నానముచేయు మనుష్యుడు సంసార బంధనములను ఛేదించుకొని వాయుదేవ లోకమునకు ప్రాప్తించుకొనును. అంతేకాక వాయు రూపమును ధరించి ఆ లోకముననే నివాసము ఉండును. నా ఉపాసన యందు సంలగ్నుడై ఆ నరుడు

ప్రాణోత్క్రమణము చెందిన తర్వాత, ఆ వాయు లోకమునుండి వెలువడి నా లోకమును చేరుకొనును. ఇచ్చట కౌషికీ, కోక రెండు జలధారల సంగమము జరుగు విశిష్టమైన స్థానము కలదు. దాని ఉత్తర భాగమునందు సర్వకామిక అను పేరు గల ఒక శిల శోభించుచుండును. అచట ఎవడు ఒక రోజు రాత్రియందు నిద్రించి స్నాన పూర్వకముగా నివసించునో, వానికి ప్రశస్తము విశాలమగు కులమునందు జన్మించు యోగ్యత సిద్ధించును. అంతేగాక అతనికి జాతిస్మరత అనగా పూర్వజన్మము యొక్క సమస్త విషయములను గుర్తులో ఉంచుకొనుట లభ్యమగును. ఈ కౌశికీ, కోకా సంగమము నందు సర్వ కామిక అను శిల సమీపమున స్నానము చేయుట చేత మనుష్యుడు స్వర్గము, లేక భూమండలమునకు ఏనాడునూ పోవలయునని కోరుకొనునో లేక, వానిని అన్నింటిని ప్రాప్తింపజేసుకొనునో అతనికి సమస్త మనోవాంఛితములు సమకూరును. నా ఆరాధనయందు తత్పరుడైయుండు మానవుడు ఆ స్థానమునందు ప్రాణపరిత్యాగము చేసిన తర్వాత అన్ని విధములైన ఆసక్తుల నుంచి ముక్తుడై నా లోకమునకు చేరుకొనును. కోకాముఖ క్షేత్రమునందు "మత్స్యశిల" అను పేరు గల ఒక గుహ్యాస్థానము కలదు. శ్రేష్ఠమైన ఆస్థానమునందు కౌశికీ నది నుండి వెలువడిన మూడుధారలు పడుచుండును. దేవీ! ఆ జలమునందు స్నానము చేయు సమయమున నీటియందు చేపలు కనిపించిన యెడల అతడు శ్రీమన్నారాయణుడే తనకు కన్పించినట్టే భావించుకొనవలయును. సుందరీ! చేపలను చూచిన తర్వాత యజన (పూజ) చేయు పురుషుడు తేనె, లాజలు కలిపి అర్ఘ్యప్రదానము చేయవలయును. ఎవడు నా ఈ ఉత్తమమైన, అట్లే పరమ గుహ్యామైన క్షేత్రమునందు స్నానము చేయునో అతడు మేరుపర్వత ఉత్తర భాగమున గల పద్మపత్రము అను పేరు గల స్థానమున వసింపకల్గును. కొంతకాలము అచట వసించిన పిదప నా ఆ గోపనీయ స్థానమున వదలిన పిమ్మట నా లోకమునకు చేరు కొనగల్గును.

వసుమతీ! ఐదు యోజనములు విస్తరించిన ప్రదేశమునందు కోకాముఖము అనుపేరు గల నా క్షేత్రము కలదు. దానిని తెలుసుకొన్నవాడు పాపకర్మమునందు మునగడు! ఇప్పుడు ఒకటి రెండు స్థానములను గురించి తెలియజేయుచున్నాను వినుము. పరమ రమణీయమైన నేను దక్షిణ దిశవైపు ముఖము నుంచి కూర్చొను ఈ కోకా క్షేత్రమునందు "విశాల చందనము" అను పేరు గల స్థానము కలదు. అది దేవతలకు

కూడా పరమ దుర్లభమైన క్షేత్రము. పురుషాకృతిని పొందిన తర్వాత కూడా నేను అచట వరాహరూపమునే ధరించి ఉందును. అచ్చట సుందరమైన ఎత్తైన ముఖము, పైవరకు లేచి ఉన్న గడ్డముతో కూడి సమస్త విశ్వమును వీక్షించుచుందును.

పృథ్వీ! నాపై ప్రేమ గల భక్తులు నన్ను నిత్యము స్మరించువారు, నా స్మరణ చేయుచూ ఉపాస్య కర్మములందు నిరతులై ఉండువారికి పాపములు సర్వధా నశించుపోవును. అందుచేత వారు పవిత్రాత్ములైన పురుషులైనందున సంసారబంధనముల నుంచి ముక్తులగుదురు. ఆ మహత్వపూర్ణమగు కోకాముఖస్థానము గుహ్యములలో కూడా పరమగుహ్యము. అంతేగాక సిద్ధులకు అది పరమసిద్ధిప్రదాత. సాధకులైన పురుషులు సాంఖ్యయోగ ప్రభావము చేత సిద్ధిని పొందలేనప్పుడు కూడా అదే సిద్ధి కోకా ముఖక్షేత్రమునకు పోయినప్పుడు కూడా సహజ సులభముగా సాధించుట జరుగును. వసుంధరా! ఈ రహస్యమును నీకు తెలిపితిని.

మహాభాగురాలా! నీ ప్రశ్నకు జవాబుగా నేను శ్రేష్ఠమగు స్థానములను వర్ణించి చెప్పితిని. ఇప్పుడు ఇంకనూ నీవు నా నుంచి ఏమి తెలుసుకొనదలచుచు ఉన్నావు.

పృథ్వీదేవీ! నాచే నీకు తెలియజేయబడిన ఈ కోకాముఖము, తీర్థములు అన్నింటిలో సర్వోత్తమమైనది. అచటికి పోయి దర్శన స్నానాది కృత్యములను చేసుకొనినవాడు తనకు ముందు పది తరముల వారిని తన తర్వాత పది తరముల వారిని కుటుంబసహితముగా ఉద్ధరింపగలరు. అంతేగాక అచట దైవ యోగము చేత ఎప్పుడైననూ శరీర పరిత్యాగము చేసిన అతని పరమ పవిత్రమైన భగవద్భక్తుని కులములో జన్మించును. అతని చిత్తము నా యందె లగ్నమగును. అతడు నా ధర్మ ప్రచారకుడు కూడా అగును. ఏ నరుడు ప్రాతఃకాలముననే లేచి ఈ వృత్తాంతము సర్వమును వినగల్గునో, అతడు ఈ శరీరమును వదలిన తర్వాత నా లోకమునకు చేరుకొనగలడు. అతనికి ఐదువందల పూర్వజన్మముల యందలి పాపము పరిహారమగును. నాకు ప్రియమైన భక్తుడు కూడా కాగలడు.

ప్రాతఃకాలమునందే ఈ ఉపాఖ్యానమును నిత్యమును పఠించినవాడు నా లోకమున ఉత్తమోత్తమమైన స్థానమును పొందును. ఇందు సంశయము లేదు. (140)

141 వ అధ్యాయము - బదరికాశ్రమ మహాత్మ్యము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఆ హిమాలయా పర్వతముల పైన అత్యంత గుహ్యమైన స్థానము ఒకటి కలదు. అది దేవతలకు కూడా దుర్లభమైనది. దానినే బదరికాశ్రమము అందురు. దానికి సంసార బాధల నుంచి ఉద్ధరించు దివ్యశక్తి కలదు. నాపై శ్రద్ధ కలవారు మాత్రమే ఆ బదరికాశ్రమమును చేరుటయందు సఫలులగుదురు. ఆ ఆశ్రమమును చేరుకొనుట చేత మానవులకు గల సర్వ మనోరథములు పూర్ణములగును. ఆ ఎత్తైన పర్వత శిఖరములపై బ్రహ్మకుండము అను పేరు గల అత్యంత ప్రసిద్ధమైన స్థానము కలదు. అచట నేను హిమమునందే స్థిరుడనై నివసించుచున్నాను. అచ్చట ఏ మనుష్యుడు మూడు రాత్రుల పర్యంతము ఉపవాసము ఉండి స్నానము చేయునో అతడికి అగ్నిష్టోమ యజ్ఞఫలము ప్రాప్తించును. నా వ్రతమునందు ఆసక్తి కలిగిన జితేంద్రియుడైన మనుష్యుడు అచట ప్రాణత్యాగము చేసిన అతడు సత్యలోకమును కూడా ఉల్లంఘించి నా లోకమును పొంద గలడు. ఆ నా ఉత్తమ క్షేత్రమునందు అగ్నిసత్యపథము అను పేరు గల స్థానము కలదు. అచట హిమాలయముల యొక్క మూడు శిఖరముల నుంచి విశాలమగు జలధారలు క్రిందకి పడుచుండును. నాకు ఇష్టమగు కార్యములందు పరాయణుడైన మానవుడు అచట మూడు రోజుల పాటు నివాసముండి స్నానము చేయునెడల అతడు సత్యవాది, అత్యంత కార్యకుశలుడు కాగలడు. అచటి జలమును స్పృశించిన ఏ నరుడైనను ప్రాణమును త్యజించిన యెడల అతడు నా లోకమున ఆనందపూర్వకముగా నివాసముండగలడు.

దేవీ! ఈ బదరికాశ్రమమునందే "ఇంద్రలోకము" అను పేరు గల నాకు సంబంధించిన ప్రసిద్ధ ఆశ్రమము కలదు. అచట దేవతలకు అధిపతియైన ఇంద్రుడు నన్ను చక్కగా సంతుష్టుని చేసెను. అచట ఎత్తైన హిమాలయ శిఖరముల నుంచి నిరంతరము పెద్ద ధారలుగా జాలువాఱు నీరు పడుచుండును. ఆ విశాల శిలాతలముపై అనగా ఆ పర్వతముపై నా ధర్మము సదా వ్యవస్థాపితమై ఉండును. ఏ నరుడు ఒక రాత్రియైననూ అచ్చట వసించి స్నానము చేయునో అతడు పరమ పవిత్రుడు, సత్యవాదియై సత్య లోకమునందు నివసించు గౌరవమును పొందును. అచ్చట నిత్యవ్రతము చేసిన తర్వాత తన ప్రాణములను త్యజించిన మానవుడు, నా లోకమునకు నేరుగా పోగల్గును. బదరికాశ్రమముతో సంబంధము కలిగిన "పంచశిఖ" అను పేరు గల ఒక తీర్థము కలదు.

హిమాలయముల యొక్క ఐదు శిఖరముల నుంచి ఆ ప్రదేశమున జలధారలు పడుచుండును. ఆ ధారలు ఐదు నదుల రూపమున పరివర్తనము చెంది ప్రవహించును. అచ్చట స్నానము చేసిన మానవుడు అశ్వమేధయాగం చేసిన ఫలమును పొంది దేవతలతో పాటు ఆనందమును అనుభవించును. దుష్కరమైన తపస్సు చేసిన తర్వాత అచ్చట ప్రాణత్యాగము చేసిన నరుడు స్వర్గలోకమును దాటి నా లోకమున ప్రతిష్ఠింపబడును. ఆ నా క్షేత్రమున చతుఃశ్రోత అను పేరుతో ప్రసిద్ధమైన ఒక స్థలము కలదు. అచట హిమాలయముల యొక్క నాలుగు దిశల నుంచి నాలుగు జలధారలు పడుచుండును. అచట రాత్రియందు కూడా నివాసముండి స్నానము చేసిన నరుడు స్వర్గమునకు ఊర్ధ్వ భాగమందు ఆనందపూర్వకముగా వాసము చేయును. కాలము అయిపోయిన తర్వాత భ్రష్టుడై మనుష్య లోకమునందు జన్మించి, అతడు నా భక్తుడగును. మరల ఈ ప్రపంచమున దుష్కరకర్మ చేసి ప్రాణములను త్యాగము చేసి, స్వర్గమును అతిక్రమించి నా లోకమును చేరుకొనగలడు.

ధరణీ! ఆ నా క్షేత్రమునందు "వేదధార" అను పేరు గల తీర్థము కలదు. అచ్చటనే బ్రహ్మ యొక్క నాలుగు ముఖముల నుంచి నాలుగు వేదములు వెలువడినవి. ఆ క్షేత్రమున నాలుగు విశాలమైన జలధారలు ఎత్తయిన శిలాతలముపై పడుచుండును. ఇచ్చట నాలుగు రాత్రులు వసించి స్నానము చేసిన మానవుడు నాలుగు వేదములను అధ్యయనము చేసిన అధికారము పొందినవాడు అగును. నా ఉపాసకుడైన ఏ నరుడు అచట ప్రాణ త్యాగము చేయునో అతడు నా లోకమునందు ప్రతిష్ఠితుడగును. అచ్చటనే ద్వాదశ దివ్యకుండములుఅను పేరుగల నీ స్థలము కలదు. నేను అచ్చటనే 12 ద్వాదశ సూర్యులను స్థాపింపచేసితిని. అచ్చటి గల ఆ స్థలమును ప్రతిష్ఠితుడై యున్న పర్వతశృంగములపై ఉండు తీర్థములు చాలా విశాలమైనవి. ఏ నరుడు ద్వాదశి తిథినాడు స్నానము చేయునో అచట గల ద్వాదశ సూర్యుల అభిమానమును పొందును. అతడు ద్వాదశ సూర్యుల లోకములకు చేరుకొనగలడు. ఇందు ఆవంతయు సందేహం లేదు. ఇంకనూ నా ఆరాధనయందు స్థిరముగా నిలిచి ఉండు మనుష్యుడు ప్రాణపరిత్యాగము చేసిన తర్వాత, ఆదిత్యుల వద్దనుండి విడిపోయి నా లోకమునకు చేరుకొనును.

ఇచ్చటనే "సోమాభిషేకము" అను పేరుచే ప్రసిద్ధిచెందిన మరియుక తీర్థము కలదు. అచట నేను రాజ యొక్క, బ్రాహ్మణుల రూపమును ధరించి చంద్రునికి అభిషేక మొనర్చి ఉంటిని. ఆ అత్రినందనుడైన చంద్రుడు, నన్ను ఇచటనే సంతుష్టుని చేసెను. 14 కోట్ల సంవత్సరముల వరకు తపో అనుష్ఠానము చేసినందుకు నా దయతో చంద్రునికి పరమసిద్ధి లభించినది. ఈ మొత్తము ప్రపంచమున అందలి ఉత్తమమైన ఔషధములు అన్నియూ చంద్రుని అధికారమునందే ఉండును. ఈ స్థానమునందే ఇంద్రుడు, స్కంధుడు, మరుద్గణములు, ప్రత్యక్షములై విలీనములైనవి. దేవీ! నాతో సంబంధము ఉన్న అచ్చట గల వస్తువులన్నియు సోమమయములై అంతమున నాయందు లీనస్థితిని పొందును. సోమగిరి అను పేరుతో ప్రసిద్ధమైన ఇంకో స్థానము కలదు. అచ్చటగల భూమి మీద ఉన్న కుండమునందును అట్లే విశాలమైన అరణ్యమునందు కూడా జలము ధారలుగా పడుచుండును. ఇది మీకు చెప్పియుంటిని. ఏ మానవుడు మూడు రాత్రుల పాటు అచట ఉండి స్నానము చేయునో, అతడు సోమలోకమునకు పోవు అర్హతను పొంది, ఆనందమును అనుభవించును. దీనియందు ఏ మాత్రము సందేహము లేదు. దేవీ! అటు పిమ్మట అత్యంత కఠోరమైన తపము చేసిన తర్వాత అతడు మరణించిన యెడల అతడు చంద్రలోకమును ఉల్లంఘించి నా లోకమును పొందగలడు.

ధరణీ! నా ఈ బదరికాశ్రమ క్షేత్రమునందు "ఊర్వశీ కుండము" అను పేరుతో ఒక గుప్తక్షేత్రము కలదు. అచట ఊర్వశి అను పేరుగల అప్సర నా కుడిజంఘను భిన్నముచేసి ప్రకటించుకొనినది. దేవతలకు చెందిన కార్యసాధనము చేయుట కొరకు అచ్చట నేను నిరంతరము తపముచేయుచున్నాను. కాని ఎవడును నన్ను తెలుసుకొనలేడు. నేను స్వయముగా నన్ను నేను ఎరుగుదును. అచట నా తపస్సు చేసి చాలా సంవత్సరములు గడచిపోయిననూ ఇంద్రుడు, బ్రహ్మ, మహేశ్వరుడు మొదలగు దేవతలు కూడా ఆ రహస్యమును తెలుసుకొనలేకపోయిరి. దేవీ! బదరికాశ్రమమునందు తపస్సు యొక్క ఫలము సునిశితమైనది. అందువలన స్వయముగా నేను కూడా చాలా సంవత్సరముల పాటు తపము చేసితిని. భూదేవీ! అచట నేను నూటపది కోట్ల పద్మవర్షముల వరకు తపముచేయుటలో తత్పరుడనైయుంటిని. ఆ సమయములందు నేను దేవతలు కూడా నన్ను తెలుసుకొనలేనట్టి గుప్తస్థానమున వసించితిని. ఆ కారణము చేత దేవతలకు విస్తారముగా

దుఃఖము కలిగి, అత్యంత విస్మయులైరి. పృథ్వీదేవీ! నేను తపమునందు పూర్తిగా నిమగ్నుడనై చూచుచూ ఉంటిని. యోగమాయా వృతుడనగుట వలన ఆ ప్రభావము చేత వారినందరికీ నన్ను చూచు శక్తి లేకపోయెను. అప్పుడు ఆ దేవతలందరునూ బ్రహ్మతో "పితామహా! విష్ణు భగవానుడు లేకుండా ఈ జగములన్నింటియందు శాంతి లభ్యమగుట లేదు." అని పలుకగా దేవతలందరి విన్నపమును విని లోకపితామహుడగు బ్రహ్మ నాతో మాట్లాడుట కొరకు ఉద్యుక్తుడయెను ఆ సమయమునందు యోగమాయా పొర చేత కప్పబడి ఉంటిని. అందుచే వారికి నేను కన్పించలేదు. ఆ కారణము చేత దేవతలు గంధర్వులు, సిద్ధులు అట్లే ఋషిగణములు మహాప్రసన్నులై నన్ను స్తుతించుటకు ప్రారంభించిరి. ఇంద్రాది దేవతలందరునూ నన్ను ప్రార్థించిరి. వారు "నాథా! నీవు కన్పించక పోవుటచే మేమందరమును మహాదుఃఖము కల్గిన వారమై ఉత్సాహహీనలమైతిమి. ఎట్టి ప్రయత్నము చేయుటకు మాకు చేతకాదు. ఋషికేశా! నీవు మాపై అనుగ్రహము కలవాడవై మమ్ములను రక్షింపుము"అని ప్రార్థించిరి. శోభాస్పదమైన విశాలాక్షీ! పృథ్వీ! దేవతలు ఈ విధముగా ప్రార్థించిన తర్వాత వారిపై నా కృపాదృష్టి పడినది. నేను చూచుట తోడనే వారు పరమ శాంతులైరి. ఇది ఈ ఊర్వశీ తీర్థము యొక్క విశేషత. ఈ ఊర్వశీ కుండమునందు ఏ నరుడు ఒక రాత్రి వసించి స్నానము చేయునో, అతడు సర్వపాపముల నుండి ముక్తుడగును. ఇందు ఎట్టి సంశయము లేదు. అతడు ఊర్వశీ లోకమునకు పోయి అనంతకాలము వరకు క్రీడించి తర్వాత విరామమును పొందును. దేవీ! నా ఉపాసన పరాయణులైన వారిలో ఎవరైననూ అచట ప్రాణత్యాగము చేసినఎడల అతడు సమస్త పాపముల నుండి ముక్తుడై నేరుగా నాయందు లీనము కాగలడు.

పృథ్వీదేవీ! ఈ బదరికాశ్రమము యొక్క మాహాత్మ్యము ఎక్కడెక్కడ ఉండి స్మరించబడునో అచట విష్ణు స్థాన భావన ఉత్పన్నము కాగలదు. అట్లు చేయు నరుడు తిరిగి ఈ ప్రపంచమునకు రాడు. ఏ నరుడు దీని పఠనము, శ్రవణము మున్నగునవి చేయునో అతడు బ్రహ్మచారి, క్రోధమును జయించినవాడు, సత్యవాది, జితేంద్రియుడు, నాయందుశ్రద్ధ గలవాడు అయి, ధ్యానము యోగములందు సదా నిరతుడై ముక్తి ఫలమును పొందగల్గును. ఎవడు ఈ విషయములను తెలుసుకొనునో అతడు సమస్త ధ్యాన

యోగమును తెలిసినవాడే అగును. అతడు తన ఆత్మతత్త్వమును ఎరిగి పరమగతిని ప్రాప్తింపజేసుకొనును. (141)

142 వ అధ్యాయము - ఉపాసనకర్మ, నారీధర్మముల వర్ణనము

పృథ్వీదేవి ఇట్లు ప్రశ్నించెను. "మాధవా! స్త్రీలయందు ప్రాణము బలము చాలా తక్కువగా ఉండును. వారు ఉపవాసము చేయుట లేక ఆకలి త్వరగా కల్గుటలయందు ఓర్పును ప్రదర్శించుటలో అసమర్థులుగా ఉందురు. అందుకు గల కారణములు నాకు ఎరింగింప నీ భృత్యురాలనైన నేను ప్రార్థనపూర్వకముగా వినతి చేయుచున్నాను."

భూదేవి యొక్క ఈ వినతికి వరాహమూర్తి ఇట్లు చెప్పెను. "మాహాభాగే! మొదటగా, నతడు ఇంద్రియములను వశపరచుకొని నా యందు మనస్సు లగ్నము చేసి, సన్యాస యోగమును స్వీకరించి అన్ని కర్మలను నావిగానే భావించవలెను. ఇంకనూ చిత్తమును ఏకాగ్రమొనర్చి తాను పాటించుచున్న వ్రతమునందు మనసుకు దృఢముగా నిల్పి అన్ని కర్మలను నాకు అర్పింపవలెను. అట్లు చేయుటచే స్త్రీ, పురుష, నపుంసకులు, వేరెవరికైనను కూడా జన్మ మరణరూపమైన సంసార బంధనముల నుంచి పూర్తిగా విముక్తి లభించును. అంతేగాక పరమగతి పొందవలయునను కోరిక ఉన్న యెడల జ్ఞానరూపముగల సన్యాసయోగమును ఆశ్రయింపవలెను. ఒకవేళ ప్రాణి యొక్క చిత్తము సమాన రూపముచే నాయందే నిలిచిపోయినయెడల, అతడు అన్ని రకములైన భక్ష్యాభక్ష్య పదార్థములను తినుచూ, త్రాగుటకు యోగ్యములు కాని పదార్థములను త్రాగుచూ, ఉన్నను ఆ కర్మ దోషము చేత కట్టివేయబడిన వాడు కాదు. దానియందు అనురక్తుడు కాడు. మనస్సు, బుద్ధి, చిత్తము సమానరూపముతో నాయందే స్థిరపరచబడి ఉండినట్లైన ఎట్టి కర్మను చేయుచున్నను, అతడు అదే రకమైన ఆసక్తి కలవాడు కాదు. ఇది ఎట్టిదనగా కమల పత్రము నీటియందే ఉండికూడా ఆ నీటినుంచి విభిన్నముగా ఉండును. సమత్వము యొక్క ప్రభావము చేత కర్మ సంయోగము కలవాడైననూ, ప్రాణి దానియందు అనురక్తుడు కాకుండకనే ఉండును. ఇందు ఎటువంటి విపరీతభావమును చేయరాదు. దేవీ! రాత్రులు, పగళ్ళు ఒక ముహూర్తకాలముచేత ఒక (క్షణ కాలము) ఒక కళ. ఒక నిమేషము. కనీసము ఒక ఫలము ఖాళీ లభించిననూ చిత్తమును సమరూపముగా నాయందు నిలబడునట్లు చేయవలెను. ఒకవేళ చిత్తము వ్యవస్థిత (స్థిర) రూపముగా సమానముగా ఉండగలదో అట్టి

యెడ రాత్రింబగళ్ళు ఎల్లప్పుడూ మిశ్రిత కర్మలను చేయుచుండినను, వారికి కూడా పరమసిద్ధి ప్రాప్తి కలుగగలదు. మెలకువతో ఉన్నప్పుడు, నిద్రపోవనప్పుడు, వినునప్పుడు, చూచునప్పుడు కూడా ఏ వ్యక్తి నాయందు చిత్తమును లగ్నము చేయునో అట్టి చిత్తము గల పురుషునికి భయమెందుకు? దేవీ! దురాచారుడు అయిన నరుడు చండాలుడైననూ లేక సదాచారము గల బ్రాహ్మణుడైననూ వారియందు నాకు ఎట్టి భేదమును ఉండదు. నేను ఎల్లప్పుడు అనన్య చిత్తము నాయందు లగ్నము చేసి పూర్తిగా నా భక్తులైన వారిని ప్రశంసింతును. సంపూర్ణ ధర్మ జ్ఞానము గల జ్ఞానరూపుడైన పురుషుడు సంస్కారముచే పవిత్రుడై నన్ను ఉపాసించునో నా సేవాకర్మములందు తత్పరుడై యుండునో అట్టి వ్యక్తుల యొక్క చిత్తము నిరతము నాయందే లగ్నమై ఉండును. ఎవరు తన హృదయమునందు సంపూర్ణముగా నన్ను స్థాపించుకొని కర్మలను నిర్వహింతురో అట్టివారు సంసార కర్మముల యందు లగ్నమై ఉండి కూడా సుఖముగా నిద్రింపగలరు. దేవీ!

ఎవని చిత్తము పరమశాంతముగా ఉండునో వారే నాకు ప్రియపాత్రులు. ఎందుకనగా వారు తమ శుభాశుభములచే కర్మలను చేసి వాటి అన్నింటిని నాయందు అర్పించి నిశ్చింతులు అగుదురు. ధారుణీదేవీ! ఎవరి చిత్తము నిరతము చంచలముగా ఉండునో, అట్టి ఆ అధమ మానవులు దుఃఖభాగులు అగుదురు. చంచలచిత్తమే నరులకు నిజమైన శత్రువు. అట్లే శాంత చిత్తము ఆతడికి మోక్షసాధన కారకము. అందుచేత నీవు నీ చిత్తమును నాయందు లగ్నము చేయుము. జ్ఞాన యోగములను ఆశ్రయించి మనస్సును ఏకాగ్రము చేసి నీవు నన్ను ఉపాసింపుము. ఎవరు నిరంతరము నాయందు చిత్తమును కేంద్రీకరించి తాను చేయు వ్రతమునందు నిశ్చయముగా నిలిపి, నాకు అర్పింతురో వారు నా సన్నిధిని పొందగల్గి అంతమున నాలోనే లీనమగుదురు.

దేవీ! మరల ఇంకొక విషయము తెల్పుచున్నాను వినుము. జ్ఞానము చిత్త సంబంధమైనది. క్రియ యోగము చేత జ్ఞానియగు పురుషుడు కర్మ ప్రభావము చేత నా స్థానమును పొందగల్గుచున్నాడు. యోగసిద్ధుడు, తరించిన పురుషుడు కూడా అచ్చటకు చేరుకొనగలడు. నా మార్గమును అనుసరించు మానవుడు జ్ఞాన, యోగ, సాంఖ్యములను చిత్తము నందు చింతింపలేకపోయిననూ, పరమసిద్ధిని పొందగల్గు అధికారము కలవాడగును.

ఋతుకాలము వచ్చిన సమయమునందు నా యందు శ్రద్ధ యుంచెడి స్త్రీ ఆ మూడు దినముల వరకు నిరాహారాలై ఉండుట కర్తవ్యము. ఆమె వాయువును మాత్రమే ఆహారముగా తీసికొని, కాలమును గడుపవలెను. నాల్గవరోజు గృహసంబంధమైన కార్యములను నిర్వర్తింపవలెను. ఆ సమయమున ఇతర స్థలములకు పోవుట నిషిద్ధము. అన్నింటికంటే ముందుగా తలస్నానము చేసి పిమ్మట నిర్మలమైన శ్వేత వస్త్రధారణ చేయవలెను. తన చిత్తముపై తన అధికారమును నిల్పి, అనగా తన చిత్తమును సరియైన విషయములపై కేంద్రీకరించి, మనస్సు, బుద్ధులను, సమములుగా ఉంచి కర్మచేసినయెడల ఆమె ఎల్లప్పుడూ నా హృదయమునందే వసించును. భోజన సామాగ్రిని నా నైవేద్యముగా భావించి స్వీకరింపవలెను. ఇంద్రియములను వశమునందు ఉంచుకొని చిత్తమును ఎలా పరచవలెను. అంతట సన్యాస యోగ సాధనమును చేయవలెను. స్త్రీ, పురుషులు నపుంసకులు ఎవరైననూ కానిమ్ము వారు కూడా నిత్యము ఇట్లే చేయవలెను. జ్ఞానసంపనలు కూడా నాకర్మ సంబంధముగా ఎవరు యోగమును సహాయముగా తీసుకొనరో అట్లే సంసారసంబంధ కార్యములందు జీవనమును గడిపి వేయుదురో, అట్టి మానవులు నేడు కూడా నా విషయములందు అజ్ఞానులే. వారు సాంసారిక మోహమునందు మునిగి నన్ను తెలియరు. వారియందు తల్లి, తండ్రి, భార్యాపుత్రుల వంటి వందలకొలది లేక వేలకొలది మోహము కల్గించు శృంఖలలు నిరంతరము పరిభ్రమించుచూ, నన్ను తెలుసుకొన లేకపోవుదురు. మోహము చేత, అజ్ఞానము చేత నిండి ఉన్నఈ ప్రపంచము అనేకవిధములైన ఆశక్తుల చేత బంధింపబడి ఉన్నది. దీని చేత మనుష్యులు నాయందు విత్తమును నిలుపుకొనలేక పోవుచున్నారు. మృత్యుసమయము సమీపించినప్పుడు, అందరు వదిలివేసే ఈ ప్రపంచమున పృథక్ పృథక్ స్థానములకు పోవుచున్నారు. ఇంకనూ అందరునూ కర్మలను అనుసరించి జన్మలను పొందుచున్నారు. పృథ్వీదేవీ! ప్రపంచము యొక్క మోహము నందు పడిన మానవులు అందరూ అజ్ఞానులుగానే ఉండుచున్నారు. దీనియందే వారి పూర్తి సమయము గడచిపోవుచున్నది. మరల పునర్జన్మ, మరల మృత్యువు కలుగుచున్నవి అయిననూ నా సాన్నిధ్యము కొరకు ఎవరునూ ప్రయత్నము చేయుట లేదు.

క్షితీదేవి! ఇది అంతయు సన్యాసయోగమునకు సంబంధించిన విషయము. ఈ జ్ఞానము నిరంతరము రహస్యముగా ఉంచదగినది. మనుజుడు ఎల్లప్పుడునూ యోగము

నందు లీనమై సంసార బంధనముల నుంచి ముక్తుడు కావలెను. ఇందు సంశయము లేదు. ఏ నరుడు ప్రాతఃకాలమునందే లేచి నిరంతరము ఈ విషయములను వినుచుండునో, అతడికి పుష్కలముగా సిద్ధి ప్రాప్తించును. చివరలో నా లోకప్రాప్తి కలుగును. (142)

143 వ అధ్యాయము - మందార మహిమా నిరూపణము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను "సుందరీ! గంగానది దక్షిణ తటమునందు అనగా వింధ్య పర్వత వెనుక భాగము నందు నా పరమ గుహ్యమైన ఒక ఏకాంత స్థానము కలదు. నా ప్రియభక్తులు 'మందారము' అను పేరుతో పిలుచుచుందురు. అచట త్రేతాయుగము నందు రాముడు అను పేరుతో అతి ప్రసిద్ధుడైన మహాప్రతాపము గల ఒక పురుషుని పరాక్రమము ప్రకటింపబడును. ఆయన అచట నా విగ్రహమును ప్రతిష్టింపగలడు. ఇందు సందేహము లేదు."

పృథ్వీదేవి ఇట్లు చెప్పెను. "దేవేశా! నారాయణా! నీవు ధర్మము అర్థములతో సంయుక్తమైన మందారము అను పేరు గల స్థానమును గురించి వర్ణించితివి. అచట మనుష్యుడు చేయవలసిన కర్తవ్య కర్మలు ఎట్టివి? అందుచేత ఆ మానవులకు ఏయే లోకముల ప్రాప్తి జరుగును? ఈ వివరములను తెలుసుకొనవలెనని నాకు మనమున గొప్ప ఉత్సుకత కలుగుచున్నది. ఆ కారణము చేత నీవు నాపై దయతో విస్తారముగా ఆ ప్రదేశము యొక్క మహిమను నాపై దయతో వర్ణింపుము."

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను." దేవీ! మందారము అను ఆ స్థలము యొక్క రహస్యము అతి గోపనీయము. ఒకసారి, ఆ మందారములోగల పుష్పములన్నియూ వికసించి ఉన్న సమయమున నేను మనస్సునందు ఎక్కువగా సంతసించుచుంటిని. ఆ సమయమున ఒక సుందర పుష్పమును కోసి నేను నా హృదయమునకు హత్తుకొంటిని. అప్పటినుండి వింధ్య పర్వతము పై గల ఆ మందారక్షేత్రమునందు నా చిత్తము లగ్నము అయిపోయినది. వసుంధరా! అచట గల పదకొండు కుండములు ఆ పర్వతము యొక్క శోభను ఇనుమడింప చేయుచున్నవి. శుభగురాలా! భక్తులపై నా కరుణ కురిపించవలెనను కోరిక చేత నేను ఆ మందారము అను పేరు గల వృక్షము క్రింద నివసించుచుంటిని, వింధ్యపర్వతము సమీపమున ఉన్న ఆ లోయ పరమ సుందరమైన ప్రదేశము. అత్యంత దర్శనీయమైనది. ఆ మహా వృక్షము మందారమునందు చాలా ఎక్కువ ఆశ్చర్యచకితులను

చేయు ఒక విషయము కలదు. దానిని కూడా వినుము. ఆ విశాల వృక్షము పువ్వుల యొక్క ద్వాదశి, చతుర్దశి తిధులనాడు మాత్రమే వికసించును. అచట మధ్యాహ్న సమయమునందు జనులు ఆ విషయమును చక్కగా దర్శింపగలరు. ఇతర దినములలో ఆ వృక్షము ఎవరికిని కనిపించదు. అచ్చట ఒక్కసారి మాత్రము భోజనము చేసి నివాసము ఉండువారికి అందు స్నానము చేసిన తోడనే ఆత్మ పరిశుద్ధము అగును. ఇంకను వారు పరమగతిని ప్రాప్తింపజేసుకొందురు.

దేవీ! దాని ఉత్తర భాగమునందు "ప్రాపణ" అను పేరు గల పర్వతము కలదు. అచట దక్షిణ దిశ నుంచి వచ్చు నీటి యొక్క మూడు ధారలు పడుచుండును. మేరు పర్వతము యొక్క దక్షిణ శిఖరము పై "మోదనము" అను పేరు గల ఒక స్థానము కలదు. దానికి తూర్పు దిక్కున, ఉత్తర దిశల మధ్యలో "వైకుంఠ కారణము" అను పేరు గల ఒక గుహ్య స్థానము కలదు. అచట పసుపు రంగులో ఉండి, భ్రాంతితో ప్రకాశించు నీటి యొక్క ధార ఒకటి పడుచుండును.ఏ నరుడు ఒక రాత్రి అచట ఉండి స్నానము చేయునో అతనికి స్వర్గము ప్రాప్తించగలదు. అచ్చటకు పోయి, దేవతలతో కలసి ఆనంద అనుభవమును పొందగల్గును. అట్లే అతడి మనోరధములన్నియు సంపూర్ణముగా నెరవేరును. అంతేగాక అతడు తన సమస్త కులమును ఉద్ధరింపగలడు. వింధ్య గిరుల యొక్క శిఖరములపై మేరు శిఖరము నుండి "సమస్రోత" అను పేరు గల ధార క్రిందకు ప్రవహించి ఒక గొప్ప సరస్సు రూపములో ఏర్పడుచున్నది. అచట మనుష్యులు స్నానము చేసి ఒక రాత్రి మాత్రము నివసించినచో సర్వ అభీష్టములు సిద్ధించును. ఉన్నతములైన శిలలు గల మేరు పర్వతము యొక్క పూర్వదిశలో ఉన్న ఆ ప్రదేశమున చిత్తమును స్థిరముగా చేసి ఎవరు తన ప్రాణమును పరిత్యజింతురో ఆతని భవబంధములు సంపూర్ణముగా తెగిపోవును, అతడు నా లోకమునకు చేరుకొనును. మందారమునకు పూర్వ (తూర్పు) భాగమున కోటర సంస్థితము అను పేరు గల ప్రదేశము నందు ముసలపు ఆకారములో అనగా రోకలి యొక్క ఆకారములో ఒక పవిత్ర జలాధార పడుచుండును. అచట స్నానము చేసి ఐదు దినములు మాత్రము నివాసము ఉండుటచేత మేరు గిరికి పూర్వ భాగమున స్వర్గ సుఖములను పొందగలడు. మరల అచట కూడా అతడు అత్యంతకఠినమైన కర్మము నుంచి తగిన లాభమును పొంది నా లోకమును పొందగలడు. యశస్వినీ! మందారమునకు దక్షిణము,

పశ్చిమ భాగములో సూర్యునికి సమానమైన కాంతి గల ఒక జలధార పడుచుండెను. అచట స్నానము చేసి ఒక రోజు రాత్రింబగళ్ళు నివసించుట నరునకు ఆవశ్యకము. ఈ సుకర్మ చేత మేరు పర్వతము యొక్క పశ్చిమ భాగమున ధ్రువుని స్థానమున నిలిచి భక్తి పరాయణుడైన మనుష్యుడు భౌతిక శరీరము నుండి వేరుపడినప్పుడు అనగా మరణించినప్పుడు నా లోకమును పొందగలడు. ఆ మహాయశస్వియైన మానవుడు చక్రవర్తియగు రాజుతో సమానముగా ప్రాణములను పరిత్యజించి మేరు పర్వత శిఖరములను వదలివేసి, నా సన్నిధానమునకు చేరుకొనును. దానికి మూడు క్రోసుల దూరమున దక్షిణ దిశలో గల "గభీరకము" అను పేరు గల ఒక గుహ్యస్థానము కలదు. అచట కూడా లోతైన జలములు గల మహాసరోవరము కలదు. అచ్చట స్నానము చేసి ఎనిమిది రోజులపాటు నివాసము ఉండుట చేత స్వచ్ఛంద గమనము చేయగల శక్తి లభ్యమగును. చివరకు అతడు నా లోకప్రాప్తి పొందగలడు. దేవీ! ఇప్పుడునేను నీకు ఆ క్షేత్రము యొక్క పరిసరములను గురించి తెల్పుచున్నాను వినుము. మేరు పర్వతముపై గల మంధరము అను పేరుతో ఉన్న ఆ స్థానము "శ్యమంత పంచకము" అను పేరుచేత నేను ఎల్లప్పుడును అచటనే నివాసముందును. వింధ్య పర్వతము యొక్క ఎత్తైన శిలలపై దక్షిణము, వామభాగములలో గద, ముందు భాగమున నాగలి, (ముసలాయుధము), శంఖువులను చేత పూని విరాజమానుడనై ఉందును. దేవీ ఈ గుహ్యము, రహస్యమైనట్టి ఈ పరమ పవిత్ర రహస్యములను ఏ నరుడు నన్ను శరణుకోరునో అతడు మాత్రమే తెలుసుకొనగలడు, అది తెలిసికొనుట ఇతర మనుష్యులకు సాధ్యము కాదు. అందుకు నా మాయయే వారిబుద్ధిని మోహితులను చేయును. ఈపవిత్రమైన విషయమును, సుందరక్షేత్ర రహస్యమును నీకు తెల్పితిని. మరి ఇంకేమి తెలుప వలయునని కోరుదువు? (143)

144 వ అధ్యాయము - త్రివేణి ఆది క్షేత్రముల మాహాత్మ్యము

వసుధ ఇట్లు పల్కెను. "ప్రభూ! నీ దయతో మందారము యొక్క వర్ణనను వింటిని. అందు దీనికంటెను ఎక్కువ శ్రేష్ఠమైన స్థానము ఉన్నయెడల దానిని గురించి నాకు తెలుపవలెను అని వేడుకొనుచున్నాను. నాపై దయయుంచి ఆ తీర్థమాహత్మ్యమును వివరింపుడు." వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! శాలగ్రామము (ముక్తినాథ క్షేత్రము) అను పేరుతో నాకు పరమ ప్రియమైన ప్రసిద్ధమైన స్థానము కలదు. పూర్వము

ద్వాపరయుగమున యదువంశమునందు శూరసేనుడు అను పేరుగల ఒక చతురుడు, నిపుణుడు అయిన వ్యక్తి కలడు. ఆయనకు వసుదేవుడు అను పుత్రుడు కలిగెను. వసుదేవుని సహధర్మచారిణి దేవకి. మహాభాగే! ఆ దేవకి యొక్క గర్భమున ఉద్భవించిన నేను అవతార మెత్తుదును. దేవతలకు శత్రువులైన వారిని మర్దించుటయే నా అవతారముల ముఖ్య ఉద్దేశము. ఆ సమయమున వాసుదేవుడు అను పేరుతో నాకు కీర్తి కలుగును. యాదవుల యొక్క వంశాభివృద్ధికి కారణమగు శూరసేనుడు అచట ఉండు సమయమున శాలంకాయనుడు అను పేరు గల శ్రేష్ఠుడైన మహర్షి వచ్చెను. మహర్షి నన్ను ఆరాధించుట కొరకు దశదిశల యందును తిరుగుచుండెను. ముందుగా ఆయన మేరుగిరి శిఖరము పైకి పోయి పుత్రుని కొరకు తపస్సును ఆరంభించెను. వసుంధరా! దాని తర్వాత పిండారకము (ఇది మహా భారతములోనూ, భాగవతంలోనూ పలుమార్లు ప్రశంసింపబడిన క్షేత్రము. ఇప్పుడు దీని పేరు పిండార్. ఇది ద్వారక నుంచి 20 మైళ్ళ దూరములో జాయ్ నగర్ జిల్లా యందు కళ్యాణపురము తాలూకాయందు కలదు) మరియు లోహర్గళము (ఇది రాజస్థానములో నావర్టైడ్ నుంచి 20 మైళ్ళ దూరమున కలదు. అయిననూ నందాలాల్ తెల్పిన దానిని అనుసరించి, ఇది హిమాలయాపర్వతములలో కూర్మాచలము (కుమయున్) యొక్క అంతర్గతముగా ఉండు చంపావతి నుండి 3 మైళ్ళ ఉత్తరముగాగల లోహాఘాట్ అనునది. ఈ లోహరళము వరాహపురాణమున వర్ణింపబడినది.) అను క్షేత్రమునకు పోయి అచ్చట ఒక వేయి సంవత్సరముల వరకు తపస్సు చేయుచునే ఉండును. దేవీ! బ్రహ్మర్షియగా శాలంకాయనుడు అచ్చట అటునిటు తిరుగుచూ ఆ ప్రదేశమునందుననే నన్ను అన్వేషించుచూ ఉండును. కాని నేనుండు ఆ స్థలమునందు ఉండినను, ఆతడికి నా దర్శనం లభింపలేదు.

శంకర భగవానుడు కూడా శిలారూపములో విరాజితుడై ఉండును. ఆయన అచట సాలగ్రామ శిలారూపము నందు విరాజితుడై ఉన్నాడు. చక్రాంకితములు గల అచటి శిలలు అన్నియూ నా స్వరూపములే. అంతేగాక, అచ్చటి కొన్ని శిలలు శివనాథ అనియు, కొన్ని చక్రనాభము అను నామములో ప్రసిద్ధములుగా ఉండును. ఈ శివరూప పర్వతము సోమేశ్వరుడు అను పేరుతో ప్రసిద్ధమైనది. చంద్రదేవుడు నా శాపమును పోగొట్టు కొనుట కొరకు అచట వేయి సంవత్సరముల కాలము తపస్సు చేసెను. ఆ తపస్సు చేత ఆయన

శాపవిముక్తుడై, మహాతేజస్వి అయ్యెను. అప్పుడే ఆయన శంకరభగవానుని స్తుతించెను. ఆయన దివ్యస్తుతి చేత ప్రసన్నుడైన వరమునిచ్చు భగవంతుడు శంకరుడు మూడుకనులతో సంపన్నుడై సోమేశ్వరలింగము నుంచి ఉద్భవించి పరమశివుని దర్శించిన సమీపమున స్థితుడై ఉండగా చంద్రుడు ఇట్లు స్తుతించెను.

"సౌమ్య స్వరూపము కలవాడును, ఉమాదేవిని పత్నిగా కలవాడను, భక్తులపై నిత్యము ఆతృత వహించి యుండువాడును అగు పంచముఖములు గల భగవంతుడు త్రిలోచనునికి, నీలకంఠునికి, శంకరునికి నేను నమస్కరించుచున్నాను. నిశ్చల భక్తితో చంద్రుడు సుశోభితుడై యుండు లలాటము కలవాడును, చేతి యందు పినాకము అను పేరు గల ధనస్సు ధరించి ఉండువాడను, భక్తులకు అభయదాన మిచ్చు దివ్య రూపధారి అగు దేవేశ్వరుడైన శంకరునికి నేను నమస్కరించుచున్నాను. తన చేతి యందు త్రిశూలము డమరుకము కలవాడు, అనేక విధములైన ముఖములు గల గణములు నిరతము సేవించుచుండువాడును గాక వృషభ ధ్వజుడగు భగవంతునికి నేను నమస్కరించు చున్నాను. త్రిపురములను, అంధకుడు మహాకాలుడు మొదలగు పేర్లు గల భయంకరులైన అసుర సంహారకుడు గజచర్మమును ధరించు వాడును ప్రళయము నందు కూడా అచల స్వభావము గలవాడును అగు శంకర భగవానునికి నేను నమస్కరించు చున్నాను సర్పరూపమగు యజ్ఞోపవీతమును ధరించువాడును, రాక్షసుల యొక్క రుద్రక్షమాల ఎట్లు సౌందర్యమును నలుదిశలా వెదజల్లునో, భక్తుల యొక్క ఇచ్ఛాపూర్తి చేయుటయే ఎట్లు స్వాభావిక గుణమో ఎవరు అన్నింటికి శాసకుడుగా ఉండునో ఆ అద్భుత రూపం శంకరునికి నేను ప్రణామము చేయుచున్నాను. "

దేవీ! చంద్రుడు శంకర భగవానుని ఈ ప్రకారము స్తుతించిన తర్వాత శివుడు చంద్రునితో" నీవు అభిలషించు వరమును కోరుకొనుము. ప్రసాదింతును" అన చంద్రుడు ఇట్లు పల్కెను. "భగవంతుడా! నీవు నాకు వరమును ఇవ్వవలెనని కోరుకొన్నచో నాకు అభిలాషకల వరము ప్రసాదింపుము. నీవు ఈ సోమేశ్వర లింగమునందు శాశ్వతముగా నివాసముండుచూ దీనియందు శ్రద్ధనుంచి ఉపాసన చేయు పురుషుల మనోరథములను తీర్చునట్లుగా దయ చూపుమ" అని అడుగగా దేవేశ్వరుడగు శంకరుడు ఇట్లు చెప్పెను. శీతకిరణములు గల స్వామి "విష్ణుభగవానునితో నేను కూడా ఇచట ఎల్లప్పుడు

నివాసముండుటకే వచ్చి ఉంటిని. నీవు కూడా నా స్వరూపము కలవాడవు. కాని నేను ఇచట ఈ రోజు నుండి విశేష రూపము కలవాడనగుదును. అందుచే ఈ లింగపూజ చేయు శ్రద్ధ గలవారైన పురుషులకు ఎల్లప్పుడు నా పూజయొక్క ఫలము ప్రాప్తించుచుండును గాక! నీకు శుభమగును గాక! నేను నీకు దేవతలకు కూడా దుర్లభమైన వరమును ఇచ్చుచున్నాను వినుము. ఇచట పూర్వము శాలంకాయన ముని మహాగొప్ప తపస్సు చేసి ఉండెను. ఆయన తపస్సు చేత ప్రసన్నుడై విష్ణుభగవానుడు ఆయనకు తన వెంట ఉండుటకు వరము నిచ్చెను. అందుచేత ఓ కళానిధి! మనమిద్దరము ఇచట ఉండుట ముందే నిశ్చితమైన విషయము. శ్రీహరి ద్వారా అధిష్ఠితముగా ఉన్న పర్వతము యొక్క పేరు 'శాలగ్రామగిరి'. అట్లే నేను ఇచ్చట నీ పేరు కూడ కలిసి ఉండునట్లు సోమేశ్వరుడు అను పేరుతో నిలిచి యుందును. ఈ రెండు పర్వతములకు సంబంధ బంధం కల్గించు ఈ శిలలును విష్ణుశీల, శివశీల అను పేర్లతో ప్రసిద్ధములు అగును. పూర్వకాలమున ఒకానొకప్పుడు రేవా (నది) కూడా ఇచ్చటనే నన్ను ప్రసన్నుని చేసుకొనుటకు తపస్సు చేసుకొని ఉండినది. వాని మనస్సునందు నేను శివభగవానునికి సమానుడుగా పుత్రులను కావలయుని కోరిక గలదు. అందుకై నేను ఎవనికి పుత్రుడను కాను. ఇప్పుడు ఏమి చేయవలెనో? సోముడా!" ఆ సమయమున మిక్కిలిగా ఆలోచించి, చర్చించి నేను ఆమెతో ఇట్లు చెప్పితిని, దే"వీ! నీకు నాపై అపార భక్తి కలదు. అందుచేత నేను నీకు పుత్రుడునై గణేశసహితముగా లింగరూపమున నీ మందిర గర్భతలము శయ్యగా నివసించెదను! అని చెప్పి ఈ విధముగా రేవా నా సాన్నిధ్యమును పొంది ఇచటకు వచ్చి ఉన్నది. అప్పటి నుంచి ఈ కారణము చేత రేవాఖండము అను పేరుతో ప్రసిద్ధమైనది. దానికి సమీపముననే గండకీ నది కూడా ఎండిన ఆకులను తినుచూ వాయువును పీల్చుచూ వంద దేవ వర్షములు వరకు తపస్సుయందు తత్పరులై యున్నది. ఆ సమయమున ఆమె నిరంతరము విష్ణు భగవానుని స్తోత్రము చేయుచున్నది. చివరిలో జగదీశుడు శ్రీహరి అచ్చటకు స్వయముగా పోయి, "పుణ్యమయీ గండకీ! నేను నీ భక్తికి ప్రసన్నుడనైతిని. నీవు నన్ను వరమును కోరుకొనుము" అని పల్కెను. ఈ వృత్తాంతము జరుగుటకు ముందు కూడా గండకికి ఒకసారి శంఖ చక్రగదాధారియగు భగవంతుని దర్శనము ప్రాప్తించినది. మరల ఒకమారు ఆ దేవదేవుని మాటలను విని గండకీ, ఆయనకు సాష్టాంగ ప్రణామము చేసి "ఈశ్వరా! నేను నిన్ను ఏ దర్శనము

చేసుకొంటినో అది దేవతలకు కూడా దుర్లభమైనది. ఈ స్థావర జంగమమైన సంపూర్ణ లోకముల సృష్టి నీవు కృపచేత ప్రసాదించినట్టిదే. నీవు కన్నులు మూసుకొనిన సమయముననే విశ్వమంతయూ నశించిపోవును. శృతియందు చెప్పబడిన ప్రకారము అనాది అనంత అసీమస్వరూపమగు బ్రహ్మవు నీవే. మహావిష్ణూ! నిన్ను తెలుసుకొనినవారు వేదతత్వజ్ఞ పురుషులు. మీ ఆదిశక్తి యోగమాయ, ప్రధాన ప్రకృతి అను పేరుతో ప్రసిద్ధమైనట్టిది. నీవు అవ్యక్త చిత్త రూప, నిర్గుణ, నిరంజన, నిర్వికార, ఆనందస్వరూప పరమశుద్ధ పరమాత్ముడవు. నీవు స్వయముగా సృష్టిని నిర్మాణము గావించినను ఆ సృష్టికంటే వేరుగా ఉందువు. అంతేగాక నీ యోగమాయ సమస్త కార్యములను లభించునట్లు చేయును. నీ నిరంజన రూపము అతి గొప్పది. ఒక మూర్ఖ అబలను అగు నేను దానిని యధార్థతః ఎట్లు తెలుసుకొనగలను?" అని ప్రస్తుతించెను.

గండకి చేసిన స్తుతి చేత ప్రభావితుడై విష్ణు భగవానుడు "దేవీ! నీకు గల కోరిక ఏదైననూ ఇతరులకు అన్ని విధములా దుర్లభమైనది, ప్రాప్తించుకొనలేనిది అయినను అట్టి వరమును నా నుంచి కోరుకొనుము. నన్ను దర్శించుకొనిన తర్వాత ఏ ప్రాణికైననూ ఎట్టి మనోరథము అసంపూర్ణముగా మిగులదు." అన్నాడు. ఈ మాటలను విని జనులను పాపముల నుంచి తరింపజేయ గండకీదేవి శ్రీహరి ఎదుట చేతులు జోడించి నమ్రతాపూర్వకముగా మధుర వచనములతో ఇట్లనెను. "భగవంతుడా! నీవు నాయెడ ప్రసన్నుడవైన నేను కోరుకొనిన వరము ప్రసాదించు దయ చూపుము. నీవు నా గర్భము నందు నిలిచి నివాసము చేయవలెను అని నా కోరిక" అని పలుకగా. ఆమె మాటలకు విష్ణుభగవానుడు సంతోషించి "నాతో ఎల్లప్పుడును కలసి ఉండుట కొరికను తీర్చుకొనెడి ఈ గండకీనది ఎంతో అద్భుతమైన వరమును కోరుచున్నది. సమస్త ప్రాణులయొక్క బంధనము తెగిపోవును కదా!" ఈ కారణము చేత నేను ఈ వరమును ఈమెకు తప్పక ఇచ్చెదను అని ఆలోచించి ప్రసన్నతాపూర్వకముగా ఆయన నేను సాలగ్రామశిలారూపమును ధరించి నీ గర్భమునందు (నదీతటము) నివసించెదను. నీ దర్శనము, స్పర్శ, జలపానము మొదలగు అవగాహన చేసుకొనుటచే మనుష్యుల యొక్క మనస్సు, పల్కు (వాణి), కర్మల చేత ఏర్పడినసమస్త పాపములు నష్టములై పోగలవు. ఏ నరుడు నీ జలము నందు స్నానము చేసి దేవతలకు, ఋషులకు, పితరులకు

తర్పణములిచ్చునో అతడు తన పితరులను ఉద్ధరించి, వారిని స్వర్గమును చేరునట్లు చేయును. అంతేగాక నాకు ప్రియమైనవాడై స్వయముగా బ్రహ్మ లోకమునకు చేరుకొనగలడు. నీ తటముపై మృతిచెందిన ప్రాణి నా లోకమును ప్రవేశించు ప్రాప్తి కలుగును. అక్కడకు పోయి చింతింపవలసిన అవసరము కలుగదు.''

అని ఈ విధముగా గండకీదేవికి వరమునిచ్చి విష్ణుభగవానుడు అంతర్ధాను డయ్యెను. శశాంక! అప్పటి నుంచి నేనును విష్ణు భగవానుడు ఈ క్షేత్రమునందు (ఈ శాలగ్రామ క్షేత్రము నేపాల్ దేశము యొక్క ముక్తినాథ క్షేత్రము) వసించుచున్నాను. పిమ్మట వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా! ఈ విధముగా చెప్పి శంకర భగవానుడు చంద్రునికి తేజస్సును ప్రదానము చేసి ఆయన అంగములపై తన చేతితో నిమిరెను. దానిచే శశాంకుడు మహా స్వచ్ఛమైన దేహము కలవాడయ్యెను. అప్పుడు శంకర భగవానుడు అచటనుంచి వెడలిపోయెను. ఈ సోమేశ్వర లింగము యొక్క ఎడమ భాగమున రావణుడు బాణము చేత పర్వతమును ఛేదించెను. అప్పటి నుండి దానినుంచి పవిత్రమైన జలధార వచ్చుచుండెను. ఇది స్నానము చేయువారి పాపములను హరించి వేయును. అంతేగాక వారికి మహాపుణ్య ప్రదానము కల్గించును. దాని పేరు వాణగంగ. సోమేశ్వరునికి తూర్పుభాగము నందు రావణుని తపోవనము కలదు. అచట మూడు రాత్రులు వసించి రావణుడు తపస్సును, నృత్యమును చేసెను. ఆయన నృత్యము చేత సంతుష్టుడైన ఈశ్వరభగవానుడు ఆయనకు వరప్రదానము చేసెను. ఆ కారణము చేత ఆ స్థానమును నర్తనాచలము అందురు. వాణగంగయందు స్నానము చేయుట, వాణేశ్వరుని దర్శించుటచే నరులకు గంగలో స్నానము చేసిన ఫలితము లభించును. అంతేగాక దేవతలవలె వారికి స్వర్గమునందు భోగములను అనుభవించ గల సౌభాగ్యము, ఆనందము లభ్యము అగును.

పృథ్వీ! ఆ సమయమున శాలంకాయన ముని కూడా నా శాలగ్రామ క్షేత్రమునకు వచ్చి ఘోరమైన తపస్సు చేయుట మొదలు పెట్టెను. ఆ సమయమున ఆయన మనస్సు నందు నాకు శివునితో సమానమైన పుత్రుడు కలుగవలెను, అనుకోరిక గలదు. మునియొక్క వాంఛితమైన ఈ శ్రేష్ఠభావమును తెలిసికొని శంకరుడు ఒక సుందరము సుఖప్రదమైన రూపమును నిర్మించెను. అంతేగాక తన యోగమాయచేత వారు శాలంకాయనుని పుత్రులై వారియొక్క దక్షిణ భాగమునందు విరాజమానులైరి. అయిననూ, ఈ విషయమును

శాలంకాయ ముని. తెలిసికొనలేకపోయెను ఆయన నన్ను ఆరాధించుట యందు ఏకాగ్రచితులై ఉండెను. అప్పుడు శంకరుని యొక్క ఈ రెండవ ఆకారమైన నంది నవ్వుచూ శాలంకాయమునితో "మునిశ్రేష్ఠుడా! ఇప్పుడు మీరు ఆరాధన నుండి విరమింపుడు. ఎపుడో మీ మనోరథము సఫలమైనది" అని చెప్పెను.

దేవీ! నంది పల్కిన ఈ మాటలను విని మునిశ్రేష్ఠుడైన శాలంకాయనుని ముఖము సంతోషముతో వికసించెను. ఆయన ఆశ్చర్యంతో "ఆహా! నా ఈ తపము యొక్క ఫలము లభించిన యెడల విష్ణుభగవానుడు కూడా తప్పక దర్శనము ఇవ్వవలెను. ఆయనను చూచువరకును నేను తపస్సును మానుకొనను" అని యోగమును ఆశ్రయముగా తీసుకొనినవాడై నందితో ఆలోచించి "నీవు మధురకు పోమ్ము. అచట నాయొక్క పవిత్ర ఆశ్రమము కలదు. అందు నా మహిమచేత భూసంపత్తి కలదు. ఆ ప్రదేశమున ముష్యాయణుడు అను పేరుగల శిష్యుడు కూడా కలడు. అతడిని తీసుకొని నీవు యథా శీఘ్రముగా ఇచ్చటకు రమ్ము" అని చెప్పగా శాలంకాయన మహర్షి యొక్క ఆజ్ఞచేత నంది వెంటనే మధురకు పోయెను. అచ్చటకు చేరుకొని, నంది ఋషుల యొక్క ఆశ్రమమును అన్వేషించెను. అంతేగాక ఆముష్యాయణుడు ఆయనకు కనిపించెను. మరల కుశల ప్రశ్నలు అడిగిన తర్వాత ఇంటియందు గల గోవులు మొదలగు సంపత్తి యొక్క విషయములను కూడా సంభాషించి తెలుసుకొనెను, ఆయన "సాధు తపో మహాధనుడైన నా గురుదేవుని దయ చేత యిచట అంతయునూ కుశలమే. యిప్పుడు మీరు మా గురువర్యుల యొక్క కుశలము తెలుపగలందులకు దయచూపుడు. ఈ సమయమున ఆయన ఎచట విరాజమానుడై యున్నాడు. మీరు ఎచటనుండి వచ్చుచున్నారు. అట్లే మీరు ఇచటకు ఏ కారణము చేత వచ్చిరి? ఈ విషయమును విస్తారపూర్వకముగా నాకు ఎరింగించి నేను ఒనర్చు అర్ఘ్యాది కృత్యములను స్వీకరించుడు. ఆముష్యాయణుడు ఈ విధముగా చెప్పిన తర్వాత నంది ఆయన చేత ఇవ్వబడిన అర్ఘ్యము, పాద్యములను స్వీకరించిన తర్వాత శాలంకాయన మునియొక్క వృత్తాంతమును వివరించెను. అట్లే తాను వచ్చిన విషయమును గురించి స్పష్టముగా తెలిపెను. అనంతరము నంది ఆముష్యాయణునితో గోధనమును తీసుకొని అచట నుంచి తిరిగి వచ్చిరి. చాలా రోజుల గడచిపోయిన తర్వాత అవి గండకీ నదీ తీరమున త్రివేణీ సంగమము వద్దకు చేరుకొనినవి.

దేవిక అను పేరు గల (ఇచ్చట చెప్పబడుచున్న దేవిక ముక్తినాథ పర్వతముపై గల ఒక చిన్ని నది) ఒక నది కూడా అచ్చటికి వచ్చి తపస్సు చేయుచున్నది. పురస్త్యముని ఇంకనూ పురఃముని యొక్క ఆశ్రమము (పురః ఆశ్రమము వర్ణనము శ్రీ మద్భాగవతములో 5వ స్కంధమున, 11వ స్కంధమున ఇవ్వబడునది. అది ప్రస్తుత నేపాల్ దేశమునకు అంతర్గతమైన ముక్తినాథ పర్వతమే) నకు సమీపమున ఇక్కడ గంగానది కూడా వచ్చి కలియుచున్నది. ఈ మూడు నదులును ఒకచోట, కలసిపోవుచున్న కారణము చేత దీనిని త్రివేణీ సంగమము అందురు. ముందుకు పోయి ఈ మహాతీర్థము యొక్క పేరు "కామిక" అయినది. ఈ తీర్థము వలన పితృగణములు, మహా సంతోషిత స్వాంతులగుదురు. ఇచటనే శివదేవుని అతి పెద్ద లింగము కలదు. అచట ఆయనను త్రిజలేశ్వర మహాదేవుడు అందురు. ఆ దేవుని దర్శించుట చేత భుక్తిముక్తులు రెండునూ సులభములగును. సమస్త పాపములు నశించిపోవును.

వరాహభగవానుని పలుకులు విని పృథ్వి మరల ఇట్లు ప్రశ్నించినది. "ప్రభూ! త్రివేణి అనునది ఒక ప్రయాగలోనే వింటిని. అచట మహేశ్వరుడు శూలాఠంకము అను పేరుతోనూ, సోమేశ్వరుడు అనుపేరుతోను ప్రసిద్ధుడు. అంతేగాక అచట శ్రీహరి స్వయముగా వేణీమాధవుడు అను పేరుతో విరాజిల్లుచుండును. అచట గంగ, యమున, సరస్వతి అను మూడు నదులు కలవు. అచట సంపూర్ణముగా దేవతలు, ఋషులు, నదులు అట్లే తీర్థములు అనేకములు విరాజిల్లుచుండును కదా! ఆ తీర్థరాజమునందు స్నానము చేయువాడు, ప్రాణత్యాగము చేయువాడు అగు వ్యక్తి మోక్షభాగుడు అగును. అయిననూ మీరు గండకీనది యొక్క త్రివేణీ విషయమును గురించి చెప్పుచున్నారు. ఇది ఆ త్రివేణియేనా? లేక వేరొకటియా? మహాభాగా! నీవు అఖిల జగత్తుకు హితము చేయు కోరిక చేత ఈ విషయమును నాకు తెలుపుటకు దయ చూపుడు. దయానిధీ! నా కలుషితమైన బుద్ధిపై ఎక్కువ దృష్టి పారనీయక స్పష్టము చేసి దయదాల్చవలెను."

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను! "దేవీ! ఈ విషయమును వివరించు ఒక ప్రాచీన ఇతిహాసము ప్రసిద్ధముగా కలదు. హిమాలయా పర్వతముల యొక్క రమణీయ స్థలమునందు దేవతలు నివాసముండువారు. చాలా కాలము క్రిందట ఈ జగత్తుకు హితము కూర్చవలెనను ఆలోచనచే విష్ణుభగవానుడు అచటనే తపస్సు చేయుచుండెను.

కొంతకాలము తర్వాత విష్ణువు యొక్క పవిత్ర విగ్రహము నుంచి అత్యంత దివ్యతేజము వెలువడినది. దానిచేత చరాచరములు, సంపూర్ణ లోకములు దహించిపోవుట మొదల య్యెను. అందుచే విష్ణువు యొక్క గండ స్థలము (చెక్కిళ్ళు) చెమటతో తడసి పోయినది. ఆ స్వేదము చేతనే పవిత్ర గంగానది ప్రవహించినది. ఈ అద్భుత ఘటన చేత జనలోకము, మహర్లోకము మొదలగు అన్ని లోకములును ఆశ్చర్యమున మునిగిపోయి, గంగ ప్రాదుర్భావ స్థలమును వెతుకుటకు మొదలు పెట్టిరి. కాని ఎచ్చటను కనుగొనలేకపోయిరి, చివరకు బ్రహ్మతో కూడిన దేవతలందరునూ శంకర భగవానుని వద్దకు చేరి, ఆయనకు నమస్కరించి ఒక ప్రక్కగా నిలబడిరి. ఇందుకు శంకరభగవానుడు ధ్యానము చేసినవాడై, "మీకు సంగమము యొక్క ఉత్పత్తి స్థలమును చూపించెదను అని చెప్పి ఉమాదేవీ, శివగణములు, దేవతల సహితంగా విష్ణుభగవానుడు తపస్సు చేయుచున్న ప్రదేశము వైపు నడుచుట మొదలు పెట్టెను. అచటకు పోయి ఆయన "భగవాన్! నీవు సర్వసమర్థుడవు. ఈ జగత్తు అంతా నీ చేతనే నిర్మింపబడినది. నీ మనమునందు ఏ అభిలాష కలదు? మీరు ఎందుకు తపస్సు చేయుచున్నారు? సంపూర్ణ లోకములు నీ ఆశ్రయము చేతనే పొందినవి. నీవు సర్వేశ్వరుడవు. నీకు దుర్లభమైన విషయము ఏమి కలదు? అంతటి నీవు ఎలా ఈ కఠోరమైన తపస్సు చేయుచున్నావు?" అని ప్రశ్నించిరి. దీనిపై జగత్ప్రభుడగు విష్ణువు వారికి నమస్కరించి ఇట్లు చెప్పెను. "నేను ప్రపంచము యొక్క హిత కామనచేత తపము చేయుటకు ఉద్యుక్తడనై ఉంటిని. మిమ్ములనందరిని చూడవలయునని నా మనస్సులో హెచ్చు ఉత్సుకత కలిగినది. జగత్ప్రభో! ఈ సమయమున మీ దర్శనము పొందుట చేత నా మనోరథము సఫలమైనది." అని చెప్పెను.

అంతట శంకర భగవానుడు భగవాన్! ఇది ముక్తి క్షేత్రము. ఈ క్షేత్రదర్శనము చేత మనుష్యుడు ముక్తిని పొందు అధికారము గలవాడగును. ఎందుకనగా ఇచ్చట మీ కపోలముల నుంచి వెలువడిన గండకీనది నదులలో శ్రేష్ఠమైనది కాగలదు. ఆ నదీ గర్భమునందు నీవు సుశోభితుడవై ఉండగలవు. ఇందు ఎట్టి సందేహము లేదు. నీవు జగత్తునకు అధికారము గలవాడవు. కేశవా! నీవు ఇక్కడ నివాసము ఉన్నప్పుడే కేశవా! నీ సంపర్కము చేత నేను, శివుడు, బ్రహ్మ సమస్త దేవతలు, ఋషులు, యజ్ఞములు, తీర్థములు దాదాపు అన్నియు, ఈ గండకీ నదియందు వసించును. ప్రభో! ఏ నరుడు కార్తీక

మాసమున పూర్తిగా ఇచ్చట స్నానము చేయునో ఆతని పాపములు సంపూర్ణముగా నశించిపోవును. అతడు ముక్తి పొందుట నిశ్చయము. తీర్థములందు అత్యుత్తమమైన తీర్థమిది, సమస్త మంగళములందు మహాశుభకరమైనది. ఇచట స్నానము చేయుటచేత మానవుడు గంగాస్నాన ఫలమును పొందినవాడు అగును. దీనిని స్మరించుట, చూచుట, స్పృశించుట చేత మనుష్యుడు పాపవిముక్తుడగును. దీనితో సమానమగు ఫలమును ఇచ్చునది ఏ నదియునూ లేదు. దీనితో సమానమైన పవిత్ర నది కేవలము గంగానది ఒక్కటి మాత్రమే.

భుక్తి ముక్తి ప్రసాదించునది, పరమపుణ్యకరము అయిన గండకీ అచ్చట 'దేవికా' అను పేరుతో మరియొక నది కూడా గండకితో కలసిపోవుచున్నది. ఇక్కడ నుంచి కొంత దూరంలో పులస్త్యుడు, పులహుడు అను మునులు ఆశ్రమమును నిర్మించుకొని సృష్టి విధానమును సంపన్నపరచుటకై గొప్ప తపస్సు చేసిరి. తపస్సు యొక్క ఫలస్వరూపముగా ఆయనకు సృష్టి చేయు శక్తి సులభము అయినది. అదే సమయమున బ్రహ్మ శరీరము నుండి వెలువడిన పుణ్యశాలియైన నది గంగ ఏ నదులయందు ప్రధానమైనదిగా పరిగణింపబడుచున్నదో అట్లే మరియొక్క నది దేవిక వచ్చి గండకియందు కలసిపోవు చున్నది. అందుచేత ఆ పవిత్రమైన గొప్పనది యొక్క పేరు త్రివేణి అని పెట్టబడినది. ఇది దేవతలకు కూడా దుర్లభమైనది. పవిత్రము, ముక్తిప్రదమైన ఈ క్షేత్రము ఒక యోజన విస్తార ప్రదేశము నందు కలదు.

దేవీ! పూర్వకాలమున జరిగిన విషయము. వేద విద్యా విశారదుడైన కర్ధమమునికి ఇద్దరు పుత్రులు కలరు. వారి పేర్లు క్రమముగా జయవిజయులు అనునవి. వీరిద్దరూ యజ్ఞ విద్యయందు నిపుణులు. అంతేగాక వేదాంగముల యందు కడముట్ట అధ్యయనము చేసినవారు పండితులలో శ్రేష్ఠులు. విద్వాంసులు. వారు భగవంతుడు శ్రీహరియందు కూడా బహునిష్ఠ గలవారు. ఒకనొకప్పుడు ఆ యిద్దరు మహాకుశులులైన బ్రాహ్మణులను మరుత్ మహారాజు యజ్ఞము చేయించుట కొరకు పిలిపించెను. యజ్ఞము సమాప్తము అయిన తర్వాత రాజు వారిద్దరు సోదరులను పూజించి, విస్తారముగా దక్షిణలను ఇచ్చెను. దక్షిణగా లభ్యమైన సంపదను పంచుకొనుట మొదలయ్యెను. ఆ సమయమున వారిద్దరి యందు పరస్పరము సంఘర్షణ జరిగెను. పెద్ద కుమారుడు

జయుడు ధనమును ఇద్దరకు సమాన వాటాలలో పంచవలెనని చెప్పెను. రెండవవాడైన విజయుడు ఎవరికి వారు సంపాదించిన ధనమును అతడిదే అగునట్లు పంచవలెనని చెప్పెను. అప్పుడు జయుడు విజయునితో ఏమి నీవు నన్ను శక్తిహీనుడుగా తలంచి ఈ విధముగా చెప్పుచున్నావు. సర్వసంపత్తిని తీసుకొని నీవు నాకు ఇచ్చుటకు ఇష్టపడని యెడల మొసలివి కమ్ము" అని శపించెను. ఇందుకు విజయుడు కూడా జయునితో ధనలోభము చేత నీవు పూర్తిగా గుడ్డివానివి అయితివా? నీవు మదాంధుడవై నాతో చెప్పుచున్నావు. నీవు మదాంధమగు ఏనుగువు అగుదువు గాక! అని శాపమిచ్చెను.

ఈ విధముగా ఒకరికి ఒకరు శాపములు పెట్టుకొనిన కారణములచేత, వేరు వేరుగా ఆ బ్రాహ్మణులు మొసలి, గజములుగా మారిపోయిరి. వారిలో విజయుడు జాతి స్మరణ కలిగిన మొసలిగా మారి గండకీ నదిలోనూ, అట్లే జయుడు త్రివేణీ నది యొక్క పరిసర అరణ్యములందు జాతిస్మరణ కలిగిన ఏనుగుగా అయ్యెను. ఆ ఏనుగు, తన పిల్లలు, ఆడ ఏనుగులతో క్రీడలాడుచూ, అచటనే అడవిలో నివసించుచుండెను. ఈ విధముగా మొసలి, ఏనుగులు అచట ఉండగా కొన్ని వేల సంవత్సరములు గడచిపోయెను. ఆ ఏనుగు ఒకానొకప్పుడు ఆడ ఏనుగుల గుంపుల వెంట పోయి స్నానము చేయుచుండెను. ఆ ఆడ ఏనుగుపై నీరు చిమ్ముచుండగా ఆ ఆడ ఏనుగు మగ ఏనుగుపై అట్లే చేయుచుండెను. అది తొండము చేత స్వయముగా నీటిని పీల్చి, ఆ ఆడ ఏనుగును చేత కూడా నీటిని పీల్పించుచుండెను ఈ విధముగా ప్రసన్నమైన మనస్సు కలవాడై దానితో క్రీడించుచు, తన వెంట గల ఆడఏనుగును సంతోషపరచుచుండెను. దాని క్రీడయొక్క యోగమున ప్రేరితమై, మొసలి తన పూర్వ వైరమును స్మరణకు తెచ్చుకొని ఆడ ఏనుగులతో క్రీడించుచున్న ఏనుగు వద్దకు వచ్చెను. అంతేగాక దాని పాదములను ధృఢముగా పట్టుకొనినది. అందుచేత ఆ ఏనుగు మొసలిని తన దంతములతో కొట్టెను. ఇటువైపు మొసలి ఆ ఏనుగును జలములోనికి లాగుచుండెను. ఏనుగు మొసలిని బయటకి లాగవలెనని కోరుకొనుచుండెను. అట్లు ఆ రెండింటి యందు భయంకరమైన పెనుగులాట జరుగుచు వేల సంవత్సరముల వరకు యుద్ధము జరుగుచుండెను. ఈ విధముగా మత్సరము (ద్వేషము, కోపము) చే పరిపూర్ణమైన మనస్సు గల గజము, మొసలి ఈ రెండిటి పరస్పర విరోధము అచటగల ఎన్నియో ప్రాణులకు చాలా గొప్పబాధ కలిగించినది. అనేక

జీవములు తమ ప్రాణములపై ఆశ వదులుకొనిన అప్పుడు ఆ క్షేత్రము యొక్క యజమాని జలేశ్వరుడు శ్రీహరికి ఆ వృత్తాంతమును తెలియజేసెను. అందుచే భగవంతుడు తన సుదర్శన చక్రము చేత మొసలి ముఖమును చీల్చివేసెను. వసుంధరా! మహావిష్ణువు,తన చక్రమును అనేకమార్లు ఉపయోగించుచుండెను. అందువలన శిలలపై కూడా ఆ చక్రము రాచుకొనిన గుర్తులు పడినవి. దీనిచేతనే శిలలపై గాట్లు ఏర్పడినవి. అందుచే చక్రము యొక్క దెబ్బల చేత శిలలపై కూడా గుర్తులుగా పడుట జరిగినది. ఆ గుర్తులు శిలలను వజ్రకీటము ద్వారా తినినట్లుగా కన్పడుచున్నవి. సుందరీ! ఈ త్రివేణి క్షేత్రము యొక్క విషయమునకు సంబంధించి నీవు సందేహపడుట సరియైనది కాదు. ఈ క్షేత్రమునకు గల ఇట్టి మహిమను నేను నీకు పూర్తిగా తెల్పితిని. (ఈ కథ శ్రీ మద్భాగవతము అష్టమ స్కంధములో ఉన్నదానికిని, వామన పురాణములోని గజేంద్ర మోక్ష కథకును, ఈ పురాణమున ఉన్న దానికిని కొంత భేదము కలదు.) దేవీ! భరతమహారాజు కూడా పులస్త్యముని యొక్క ఆశ్రమ సమీపమునకు పోయి త్రిజలేశ్వర దేవుని పూజయందు సంపూర్ణముగా మగ్నులగుటచే వారు ప్రపంచము నుంచి ఎల్లప్పుడు ఇష్టము లేనివారై, లేడి యొక్క శరీరము వదలివేసిన తర్వాత జడభరతుడయ్యెను. (ఈ కథావృత్తాంతము శ్రీమద్భాగవతము పంచమ స్కంధమున కలదు) ఈ జన్మము నందు మరల ఆయన వానిని పూజించెను. అందుచేతనే వారు జలేశ్వరుడు లేక జడేశ్వరుడని కూడా పిలువబడుచున్నారు. భక్తిపూర్వకముగా ఆయన పూజ చేయుట చేత యోగసిద్ధి ప్రాప్తించును. శుభగురాలా! జలేశ్వరుడు (జడ భరతుడు) నన్ను స్తుతించినను విషయము నేను శ్రేష్ఠమైన శాలగ్రామ క్షేత్రమునందు ఉండుట చేత, అచ్చట నాకు ఈ విషయము తెలిసినది. వసుధా! భక్తులపై దయ చూపించుటకు నేను వివశుడనై పోవుచుందును. అందుచేతనే నేను నా సుదర్శన చక్రమును కదలునట్లు చేసెదను, మొదట నా చక్రము పడిన ప్రదేశము చక్రతీర్థమైనది. అక్కడ స్నానము చేయుట చేత నరుడు తేజోసంపన్నుడే సూర్యలోకమునందు ప్రతిష్టను పొందగలడు. అంతేగాక మరణించిన తర్వాత నా లోకమును పొందగలడు. నావలెనే శంకరుడు కూడా అచట వసించిన కారణమున ఈ తీర్థము హరిహర క్షేత్రము అని పిలువబడుచున్నది. ఇచటనే 'త్రిధారకము' అను పేరు గల తీర్థము కలదు. దానికి పూర్వభాగమున హంస తీర్థము అను పేరు గల ప్రసిద్ధమైన ఒక

స్థానము కలదు. అచట జరిగిన ఒక కౌతుకపూర్ణము (మహాసక్తిని కలిగించునది, సర్వోత్కృష్టమైనది అగు) వృత్తాంతమును ఒకదాని చెప్పుచున్నాను వినుము. ఒకానొక కాలమున శివరాత్రి నాడు ఈ మందిరము నందు ఒక ఉత్సవము జరుగుచుండెను. అనేక ప్రకారములైన నైవేద్యములు అర్పించి ఇంకను శంకరుని యొక్క ఉపాసన జరుగుచు ఉండెను. ఇంతలోనే కొందరు ఆకలిగొన్న ఎవరో ఒకడు ఆ అన్నముపై అతి వేగముగా పడెను. అంతేగాక ఒక కాకి అన్నమును ముక్కుతో పట్టుకొని పైకి ఎగిరిపోయెను. అంతేగాక ఇంకొకడు దానిని లాగుకొని పోవుటకు దానిపై ఉరికెను. ఈ విధముగా వారిరువురు పరస్పరము దెబ్బలాడుకొనుచూ, ఒక కుండముపై పడిరి. అచట పడిన వెనువెంటనే ఆ హంసల ఆకృతి సమానముగా అగుటచే అవి బయటికి వచ్చినప్పుడు వానికి చంద్రునితో సమానమైన ప్రకాశము వ్యాపింపదొడగెను. అచటి జనులు ఈ సంఘటనచూచి మహాశ్చర్య భరితులైరి. అప్పటి నుంచి జనలు ఆ స్థానమును హంస తీర్థము అని పిలిచిరి. చాలాకాలము క్రిందట ఇచ్చటనే యక్షుడు శంకరుని ఆరాధించెను. అచ్చట స్నానము చేసిన మనుష్యులు పవిత్రులై యక్షలోకమున ప్రతిష్ఠను పొందెదరు. (144)

145 వ అధ్యాయము - శాలగ్రామ క్షేత్ర మాహాత్మ్యము

వరాహుని వివిధ విషయములను గురించి ప్రశ్నించుచున్న ధరణి తిరిగి ఇట్లడిగెను. "భగవాన్! మీరు సర్వదేవతలకును అధిపతి. మునులలో శ్రేష్ఠుడైన శాలంకాయనుడు మీ ముక్తిప్రద క్షేత్రములో తపస్సు చేయుచూ, ఇంకనూ ఇతర కార్యములందు చేసిన మహాకార్యములను, ఏయే సిద్ధులను పొందెను అనునవి తెలిసికొనవలెనని నాకు కోరిక గలదు. దయతో తెలియజేయుడు." అనగా వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా! శాలంకాయన ముని అచ్చటనే సుదీర్ఘకాలము తపము చేయుచూ ఉండెను. ఆయన సమీపముననే శాలవృక్షము కలదు. దాని సుగంధము పరిసరములకు వ్యాపించుచుండెను. శాలంకాయనుడు నిరంతరము తపము చేసి అలసిపోవుచుండెను, ఆయన దృష్టి ఆ శాలవృక్షము పై పడినది. ఆయన ఆ విశాల వృక్షము క్రిందకి పోయి విశ్రమించుచుండెను. ఆయన మనస్సులో నన్ను దర్శించుకొనవలెనను అభిలాష ఎక్కువగు చుండెను. ఆ సమయమున శాలవృక్షము

యొక్క పూర్వభాగము నందు పశ్చిమదిశకు ఎదురుగా కూర్చొని ఉండెను. నా(విష్ణు)మాయ ఆయనను జ్ఞానశూన్యునిగా చేసివేసెను. ఆ కారణము చేత ఆయన నన్ను దర్శింపలేకపోయెను. సుందరీ! కొన్ని దినముల తర్వాత వైశాఖ మాసమున ద్వాదశి తిథి వచ్చుటచే ఆయనకు తూర్పుదిశయందు మాత్రమే నా దర్శనము లభ్యమయ్యెను. ఆ సమయమున ఉత్తమమైన వ్రతమును పాటించు వాడగు తపస్వియగు ఆ ముని అచట నన్ను చూచి అనేకమార్లు ప్రణామము చేసెను. అట్లే వేద మంత్రములచే నన్ను స్తుతించుచుండెను. ఆ సమయమున నా తీక్షణ తేజముచేత ఆ ముని నేత్రములు మెరయుచుండెను. అందుచేత అతడు నెమ్మదిగా తన నేత్రములను మూసుకొని నను స్తుతించుచుండెను. తర్వాత అతడు కన్నులు తెరిచిన వెంటనే, ఆ వృక్షము యొక్క దక్షిణ భాగమునకు నిలబడి నేనుండుటను చూచెను. అప్పుడు ఆ ఋషి నా ముందుకు వచ్చి కూర్చొని ఋగ్వేదము చేత నన్ను స్తుతించుచుండెను. ఆ సమయమునకు నేను శాలవృక్షము పశ్చిమ భాగమునకు వెళ్ళితిని. ముని కూడా అచట పశ్చిమ భాగము వైపు పోయి కూర్చొని యజుర్వేద మంత్రముల చేత నన్ను స్తుతించెను. అటు తర్వాత నేను ఆయనకు ఉత్తర దిశకు పోయితిని. అక్కడ కూడా ఆయన సామవేద మంత్రములను గానము చేయుచూ నన్ను స్తుతించుచుండెను. పిమ్మట ఋషి ప్రవరుడు అగు శాలంకాయనునియొక్క స్తుతుల చేత సంతుష్టుడనై, నేను ఆయనయెడ అత్యంత ప్రసన్నుడనైతిని. అందుచే ఆయనతో "మునివరా! శాలంకాయనా! నీవు చేసిన ఈ తపో ప్రభావము చేత నేను మహా సంతుష్టుడనైతిని. నీవు చేసిన తపస్సు యొక్క ఫలితము చేత నీకు పరమసిద్ధి ప్రాప్తించినది" అని పల్కితిని.

ఆ మాటలకు శాలంకాయ ముని వినియపూర్వకముగా నాతో హరి! నేను భూమండలముపై నిరంతరము భ్రమణము చేయుచూ తపస్సు చేయుచూ ఉంటిని. కాని నిశ్చితముగా నేడు మాత్రమే నాకు నీ శుభ దర్శనము ప్రాప్తించినది. నీవు నా యెడ ప్రసన్నుడవై నాకు వరమును ఇవ్వవలెనని కోరుచున్న యెడల కృపతో నాకు శివభగవానునితో సమానముగా పుత్రులను ఇచ్చునట్లు చేయుము అని అడిగెను. అప్పుడు "మునీశ్వరా! నా యొక్క రెండవ రూపము నందికేశ్వరుడు అను నామము చేత ప్రసిద్ధుడై యున్నాడు. నీ కుడివైపు శరీరాంగము నుంచి పుత్ర రూపమున ఇప్పటికే ప్రత్యక్షమై

ఉన్నాడు. ఓ బ్రాహ్మణుడా! ఇప్పుడు నీవు తపము చేత విరక్తి చెందియున్నావు. యోగమాయ యొక్క శక్తి సంపన్నుడవై ఈ సమయమున నాతో వ్రజభూమినందు వర్ధిల్లుచున్న నీ శిష్యుడు ఆముష్యాయణుని మధుర నుంచి పిలిపించి ఆయనతో శూలపాణి (శివుడు) రూపమున అచట నిలిచి ఉన్నాడు. ఇప్పుడు నేను నీకు ఒకటి రెండు గుప్త విషయములను కూడా తెలుపుచున్నాను. శ్రద్ధగా ఆకర్ణింపుము. నేటినుంచి ఈ ఉత్తమ క్షేత్రము సాలగ్రామ క్షేత్రము అని పిలువబడును. అంతేగాక నీవు చూచిన ఈ వృక్షము కూడా నిస్సందేహముగా నేనే. ఈ విషయము శంకరభగవానుడు తప్ప వేరు ఇతర వ్యక్తి ఎవరికినీ తెలియదు. నేను నా యోగమాయ చేత దీనిని ఎల్లప్పుడు దాచి ఉంచుచున్నాను. అయిననూ నీ తపోశక్తికి సంతసించి నేను రూపమును ధరించి ప్రత్యక్షము అయితిని." వసుధా! ఆ సమయమున శాలంకాయన మునికి ఈ విధముగా వరమును ఇచ్చి, ఆయన చూచుచుండగనే అంతర్ధానమైతిని. ఆ వృక్షమునకు ప్రదక్షిణము చేసి శాలంకాయన ముని కూడా తన ఆశ్రమమునకు వెళ్ళిపోయెను.

భూదేవీ! ఇప్పుడు ఇంకను మహాశ్చర్యపూర్ణమైన మరియొక స్థానమును గురించి తెలుపుచున్నాను. ఇచట శంఖప్రభ అను పేరుతో ప్రసిద్ధి చెందిన నా పరమగుహ్య క్షేత్రము ఒకటి కలదు. అచట ద్వాదశీ పర్వము నాడు, అర్థరాత్రి సమయమున శంఖ ధ్వానము వినిపించును. ఆ క్షేత్రము యొక్క దక్షిణ దిశయందు 'గదాకుండము' అను పేరుతో విఖ్యాతమైన నాస్థానము మరియొకటి కలదు. అచటనుంచి నిరంతరము ఒక జలధార ప్రవహించుచుండును. అచట మూడు దినముల పాటు ఉండి స్నానము చేయవలెనను నియమము కలదు. దానియందు స్నానము చేసిన వ్యక్తి వేదాంతవాది, బ్రాహ్మణులతో సమాన ఫలభాగి అగును. ఒకవేళ శ్రద్ధాళువు, గుణవంతుడైన మనుష్యుడు ఆ క్షేత్రమున ప్రాణత్యాగము చేసిన యెడల తన చేతియందు గదను ధరించి విశాలకాయము గలవాడై నా లోకమును పొందును.

వసుంధరా! ఇచట 'దేవప్రదము' అను పేరుగల నా మరియొక క్షేత్రము కూడా కలదు. ఇది అగాధ జలములు కలిగిన శ్రేష్టమైన దేవసరోవరము అది సుందరము, శీతలము అగు జలముచే సంపన్నమగుచూ అందరికినీ సుఖము కల్గించును. దేవతలు కూడా దీని కొరకు తహతహలాడుదురు. ఆ ప్రదము నిరంతరము స్వచ్ఛమగు జలము చేత

పరిపూర్ణముగా ఉండును. దానియందు చక్రచిహ్నాంతములైన అనేక రకములైన మత్స్యములు కూడా వ్యాపించి ఉండును. సునయనా! ఇప్పుడు అచట గల మరియొక విషయమును చెప్పుచున్నాను వినుము. ఆశ్చర్యయుక్తమైన ఘటన నిరంతరమును అచట జరుగుచు ఉండును. నాయందు శ్రద్ధగా ఉండు మానవుడు మాత్రమే ఈ అలౌకిక ఆశ్చర్యమయ దృశ్యమును చూడగల్గును. పాపులైన నరులు దానిని చూడలేరు. ఆ పరమ పవిత్రమైన దేవప్రదమునందు సూర్యోదయ సమయమున బంగారు వర్ణములు గల ముప్పదియారు స్వర్ణ కమలములు కనిపించును. దానిని అందరునూ మధ్యాహ్నకాలము వరకూ చూడగల్గుదురు. దానియందు స్నానము చేసిన తర్వాత, మానసిక, వాచిక ఇంకనూ శారీరక మలములు వదలిపోవును. అంతేగాక శుద్ధములై స్వర్గమునకు వెడలిపోవును. పది రోజుల పాటు అచ్చట నివసించి, స్నానముచేసి విధి పూర్వకముగా అనుష్ఠానము చేసినవాడు పది అశ్వమేధయజ్ఞముల ఫలమును పొందగలడు. నా చింతనమునందే పూర్ణము లగ్నమైన మనస్సు గల ప్రాణి, అచ్చట ప్రాణత్యాగము చేసిన అతడు అశ్వమేధ యజ్ఞఫలమును అనుభవించి నా సారూప్య మోక్షప్రాప్తి పొందును.

దేవీ! ఇచటనే శ్రీ కృష్ణుని విగ్రహము నుంచి కృష్ణగండకీ అను నీటిధార ప్రాదుర్భవించినది. అదేవిధముగా త్రిశూలగంగ అను పేరు చేత ప్రసిద్ధమైన శివ శరీరముచే వెలువడిన నది కూడా ఇచటనే కలదు. ఈ విధముగా రెండు నదుల మధ్యగల ప్రదేశము తీరముగా ఏర్పడినది. ఈ స్థానమును సర్వతీర్థ కదంబకము అందురు. ఇచట గల కదళీవనము (అరటితోట) శివవనముయొక్క సౌందర్యమును అధఃకరించుచున్నది. నిచుల(ఒకరకమైన వెదురు),జాయఫల(జాజికాయ),నాగకేశర (పొగడ), ఖర్జూర (ఖర్జూరం), అశోక(అశోకం), వకుల, ఆమ్ర(మామిడి), ప్రియాలక, నారికేళ (కొబ్బరి), సోపారి, చంప (సంపెంగ),జామున (నేరేడు), దవ, నారంగి (నారింజ), బేర (గంగరేగిపండ్లు), జంబీర(నిమ్మ), మాతురంగ(మాదీఫల), కేతకి (మొగలి), మల్లిక (మల్లె), యుథిక (అడవి మొల్ల), కూయి (తెల్ల కలువ), కూరయా, కుఠన, దాడిమ (దానిమ్మ) మొదలగు అనేక ఫలములు, పూలుగల వృక్షముల చేత దాని అనుపమ శోభ నిరంతరము మనస్సును లోగొనుచుండును.

దేవతలు తమపత్నులతో కూడి అచటకు వచ్చి ఆనందమును పొందుదురు. ఈ పరమ పుణ్యమయమైన సరోవరమునందు ఆ రెండు మహానదుల యొక్క సంగమము జరుగును. అచ్చట స్నానము చేయుట చేత నరునకు నూరు అశ్వమేధ యాగములు చేసిన ఫలము లభించును. వైశాఖమాసము నందు స్నానము చేయుటచే నరునకు ఒకవేయి దానములు చేసినట్టి ఫలమును, మాఘమాసమునందు స్నానము చేయుట చేత సంక్రాంతినాడు ప్రయాగయందు స్నానము చేసిన ఫలమును లభింపగలదు. కార్తీక మాసమునందు సూర్యుడు తులారాశిలో ప్రవేశించినప్పుడు విధిపూర్వకముగా స్నానము చేసినవాడు నిశ్చయముగా ముక్తి ఫలము పొందుటకు అధికారము కలవాడగును. దేవీ! ఈ విధముగా ఇది హరిహరాత్మక క్షేత్రము. ఇచ్చట శరీరత్యాగము చేసినవాడు, నా కర్మలను అనుసరించు వ్యక్తులు ఉత్తమ గతిని పొందుదురు. మొదట ముక్తి క్షేత్రము, తదుపరి రురుఖండము, పిమ్మట ఆ రెండు దివ్యస్థలముల చేత నిర్మితమైన ప్రవాహములు. త్రివేణీ సంగమము. ఈ తీర్థములయందు ఉత్తరోత్తర క్రమముగా ఒకటిని మించి ఒకటి శ్రేష్ఠములుగా పరిగణింపబడుచున్నవి. గండకి నుంచి సంగమక్షేత్రము వరకు గల ప్రదేశము పరమ ప్రమాణము అని ఎరుగవలెను. ఈ విధముగా నదులయందు ఆ గండకీనది సర్వశ్రేష్ఠమైనది. భగవత్స్వరూపమైన గంగతో ఆ గండకీనది ఎచ్చట కలియునో, అచ్చట స్నానము చేయుట చేత అపరిమిత ఫలము లభ్యమగును. ఇది హరిహర క్షేత్రము అని పిలువబడు మహాక్షేత్రము. ఇచట పవిత్ర గండకీనది భగవంతురాలైన భాగీరథితో కలియుచున్నది. ఈ తీర్థమాహాత్మ్యమును దేవతలు కూడా సరిగా ఎరుగరు.భద్రే! నేను నీకు శాలగ్రామ క్షేత్రమును గురించి (ముక్తినాధ క్షేత్రము) అట్లే సర్వపాప పరిహారకమగు గండకీ మాహాత్మ్యమును వర్ణించి తెలిపితిని. ఏ నరుడు ప్రాతఃకాలమున లేచి దీనిని ఎల్లప్పుడు పాఠము చేయునో అతడు తన ఇరువది యొక్క పీడల నుంచి తరింపగలడు. అట్టి మానవుడు మృత్యు సమయమునందు ఎన్నడునూ మోహమునందు పడడు. అతడు పరమసిద్ధి పొందవలెనని కోరుకొన్న యెడల నా లోకమునకు పోగలడు. మహాదేవీ! నేను శాలగ్రామ క్షేత్రము యొక్క శ్రేష్టమైన మాహాత్మ్యమును వర్ణన చేసి తెలియజేసితిని. ఇప్పుడు మరియొకటి వినవలయునను కోరిక ఏ విషయముపై గలదో తెలుపుము. (145)

146 వ అధ్యాయము - రురుక్షేత్రము, హృషీకేశ మాహాత్మ్యము

ధరణి ఇట్లు పల్కెను. "ఈశ్వరా! నీవు చెప్పిన శాలగ్రామ క్షేత్ర మాహాత్మ్యము వినుట చేత నాకు చిత్తశాంతి లభించినది. ఇప్పుడు నేను రురుఖండము నీనుంచి ఈ కురుక్షేత్రము కూడా విష్ణుపురాణాను సారము ముక్తినాథ పర్వత సమీప ప్రాంతము నందలి పర్వతమునకు ప్రసిద్ధి ఎట్లు కలిగినది? ఆ ఉత్తమ క్షేత్రము మీ పవిత్రమైన ఆశ్రయము అగుట ఎట్లు జరిగినది అని విషయములను తెలిసికొనకోరుచున్నాను. వీనిని దయతో నాకు తెలుప వేడెదను." వరాహ భగవానుడు అట్లు చెప్పెను.

"దేవీ! పూర్వము భృగు వంశమునందు దేవదత్తుడు అను పేరు గల వేదవేదాంగ పారాంగతుడు, విద్వాంసుడు అయిన బ్రాహ్మణుడు ఒకడు కలడు. ఆయన తన పవిత్ర ఆశ్రమమునందు ఉండి, పదివేల సంవత్సరముల పాటు కఠోరమైన తపస్సు చేయుచూ ఉండెను. దీనితో ఇంద్రుని మనస్సునందు గొప్ప చింత ఉత్పన్నమైనది. అందుకే ఆయన ప్రమ్లోచ అను పేరుగల అప్సరసను పిలిపించి, కామదేవుడు(మన్మథుడు),వసంతుడు ఇంకనూ కొందరు గంధర్వులను వెంట తీసికొని పోయి ఆ దేవదత్తుని తపస్సును విఘ్నము కల్పింపవలసినదని వారిని పంపించెను. ఆ అప్సర వీరందరితో కలిసి వెంట మునిశ్రేష్ఠుడైన దేవదత్తుని ఆశ్రమమునకు పోయెను. అక్కడ అనేక ప్రకారములైన లతలు, వృక్షములు పూర్వము నుండి ఆశ్రమమునకు గల సౌందర్యమును పెంపొందించుచుండినట్లు కోకిలల సమూహము మధురమైన కూజితములు చేయుచుండెను. మామిడి చిగుళ్లు, తుమ్మెదల ఝుమ్మను శబ్దము, గంధర్వుల సంగీతము, సుగంధితములగు శీతల మంద వాయువులు ఇవన్నియు ఒకదానిని ఒకటి మించిన రాగోద్దీపకములుగా ఉండెను. అత్యంత స్వచ్ఛమైన సుగంధిత పూరితమైన మధుర జలముచే ఆ సరోవరము నిండియుండెను. ఆ సరోవరమునందు కమలముల సముదాయము. విప్పారి ఉండెను. అదే సమయమున ఆ పరమ సుందరియగు ప్రమ్లోచ అను అప్సర అత్యంత మధుర సంగీరతమును పాడుట మొదలుపెట్టెను. అప్పుడే కామదేవుడు కూడా బాణములను ఎక్కుపెట్టి శాంతచిత్తుడైన మునీశ్వరుడు దేవదత్తుని తన లక్ష్యము చేసుకొనెను. రమ్యముగు ఆలాపనముల చేత సుసంపన్నము సుమధురము అగు ఆ సంగీతమును విని, ఉత్తమవ్రతుడైన ఆ మునివరుడగు దేవదత్తుని చిత్తము కలత చెందెను. అప్పుడు ఆయన ఆశ్రమమునందు

తిరుగుచుండెను. ఇటు అటు చూచుచూ అంతలో సుందరమగు అంగముల శోభ చేత ప్రకాశించుచున్న ఆ అప్సర ప్రమ్లోచ శరీరము పైనుంచి వీచుచున్న మలయానిలముగల గంధిత పూరితమైన సువాసన, మనసును చలింప చేయునట్లుండెను. అంత ఆ అప్సర కూడా మునీశ్వరుడు ఉన్న దిక్కుకు పోయెను, ఆమె పై దృష్టి పడగనే మునివరుడు దేవదత్తుడు మన్మధ బాణముల చేత బంధింపబడెను. అంతట ముని తనను తాను సంభాళించు కొనలేక, ఆమెతో "సుభగే! నీవెవరవు? ఈ ఉపవనము నందు ఎట్లు ప్రవేశించితివి?" అని అడిగెను. చివరలో ఆమె సమ్మతి చేత ఆమెతో కలిసి ఉంటూ, ఆ ముని తన తపఃప్రభావము చేత మనోహరమైన అనేకానేక భోగములను అనుభవించెను. భోగములయందు ఆసక్తి గలవారై వారు పగలు రాత్రుళ్ళు నిద్ర కూడా పోక, భోగములయందు మునిగి తేలిరి. ఈ విధముగా అనేక దినములు గడచిపోయినవి. ఒకనాడు ఆయన జాగృతుడై వివేకము కలిగి, అజ్ఞాన రూపియైన నిద్రను వదలి వెనువెంటనే మెళకువ కలిగిన వాడయ్యెను. ఆయన "ఆహా! శ్రీహరి భగవానుని మాయ ఎంత ప్రబలమైనది. దాని ప్రభావము చేత నేను కూడా మోహసాగరమునందు మునిగిపోతిని. ఇది తెలిసి కూడా ఇందు నా తపస్సునకు నష్టము కలిగినది. దీనిచేత నా తపస్సుకు ఆటంకము వచ్చినది. ప్రబలుడైన దైవము యొక్క అధీనమునందున్న కారణము చేతనే నేను ఈ కుత్సితమైన పనిని చేసితిని. ప్రసిద్ధమైన సుభాషితము ఈ ప్రమాదము. స్త్రీ అగ్నిగుండము వంటిది. పురుషులు ఘృతపాత్రలతో సమానమైనవారు. ఇది తెలిసికొనిన వాడనైననూ నేను ఈ మూర్ఖుల నిందయందు పడితిని. అని ఆలోచించి, చూచినట్లైన వస్తుతః దీని యందు పెద్ద అంతరము కలదు. ఎందుకనగా పచ్చికుండను నిప్పుపై ఉంచిన అది విడిపోవును. అంతేగాని కేవలము చూచుట చేత విడిపోదు. కాని పురుషుడు స్త్రీని చూచిన మాత్రముననే కరగిపోవును. అంతేగాక ఇచ్చట ఈ స్త్రీ చేసినట్టి అపరాధము ఏమియునూ లేదు. ఎందుకనగా నేను స్వయముగా నా ఇంద్రియములపై విజయము ప్రాప్తింపు చేసికొనుటలో అసమర్థుడనైతిని."

అని ఈ విధముగా పశ్చాత్తాపపడుచూ, ప్రమ్లేచను అతడు అచటి నుండి పంపించి వేసి, 'అయిననూ ఈ స్థానము ఉన్నందుచేతనే నాకీ బాధ కలిగినది. అందువలన నేనిప్పుడు ఈ ఆశ్రమమును పరిత్యజించి, వేరే ఎచ్చటికైననూ పోవుటయే గాక అచట

తీవ్రతపస్సును ఆశ్రయించి ఈ శరీరమును శుష్కింపచేయుదును' అని ఈ విధముగా నిశ్చయించుకొని, ఆ దేవదత్తుడు భృగుముని యొక్క ఆశ్రమమునకు పోయెను. అచ్చట గండకీనదీ సంగమమునందు స్నానము చేసి దేవతలకు పితరులకు తర్పణములు వదలెను. అంతేగాక విష్ణువు శివులను ఉత్తమమగు విధానములో పూజించెను. అంతేగాక ముని శంకర భగవానుని దర్శనమును చేసుకొనవలెనను అభిలాష చేత గండకీ నదీ తటమున నిలిచి భృగుతుంగముపై (ఈప్రదేశము గండకీగనది యొక్క ఈశాన్య దిక్కుయందు గల నేపాల్ లోని ముక్తినాధ పర్వతమే). కఠోరతపస్సు చేయుట మొదలిడెను. ఈ విధముగా చాలా కాలము గడచి పోయినది. ఆయన తపస్సునకు మెచ్చిన శంకరభగవానుడు ఆయన తపము చేత సంతుష్టుడయ్యెను. శంకరుని లింగరూపము నుండి తీవ్రముగా పైన, క్రింద జలధారలు వెలువడుట మొదలయ్యెను. అంతట ఆ శంకరుడు, "మునీ! ఇట నన్ను చూడుము. నేను శివుడను. విష్ణువు కూడా నేనే అని నీవు తెలుసుకొనుము. మా ఇద్దరిలో తత్త్వమును అనుసరించి ఎట్టి భేదమును లేదు. ఇంతకు పూర్వము నీవు చేసిన తపస్సునందు, నా యందు విష్ణువుయందు నీకు భేదదృష్టి కలదు. అందుచేత నీవు విఘ్నములను ఎదుర్కొన వలసి వచ్చినది. అందుచే నీ గొప్ప తపస్సు క్షీణించినది. ఇప్పుడు నీవు మా ఇద్దరిని సమంగా చూడుము. అట్లైనయెడల ఇందు నీకు శీఘ్రముగా సిద్ధి లభించును. నీవెచట తపస్సు చేసితివో అచట అనేక శివలింగములు వెలసినవి. ఈ స్థలము సంగమము అను- పేరుచే ప్రసిద్ధికెక్కును. ఈ గండకీ తీర్థమునందు స్నానము చేసి, ఇచ్చట లింగ రూపమున గల నన్ను పూజించిన వానికి యోగము యొక్క ఉత్తమ ఫలము లభ్యమగును. ఇందు సందేహము ఏమాత్రము లేదు" అని పల్కి మునికి వరము ప్రసాదించి, శంకర భగవానుడు అచటనే అంతర్జానుడయ్యెను. పిమ్మట ఆ ముని భగవంతుడు, శివుడు తెల్పిన మాటలను అనుసరించెను. అందుచే ఆయనకు పరమ సాయుజ్యప్రదము ప్రాప్తించినది.

ముని సంపర్కము చేత ప్రమ్లేన గర్భవతి అయినది. ఆశ్రమ సమీపమునందే ఆమెకు ఒక ఆడబిడ్డను జనించినది. ప్రమ్లేన ఆ బిడ్డను అక్కడనే వదలివేసి స్వర్గమునకు వెడలిపోయెను. ఆ బిడ్డ 'రురు' అను పేరు గల మృగముల చేత పెంచబడి నెమ్మది నెమ్మదిగా పెరిగి పెద్దదయ్యెను. అందుచేత ఆ కన్య పేరు కూడా "రురు"గా అయ్యెను. ఆమె

తన తండ్రి దేవదత్తుని ఆశ్రమమునందే ఉండుచుండగా అనేకమంది యువకులు ఆమెను తమ భార్యగా చేసుకొనవలెనని కోరుకొనుచుండిరి. అయిననూ ఆమె ఎవరి మాటలను వినక విష్ణుభగవానుని ప్రసన్నత చేసుకొనుటకు తపస్సు చేయుట ప్రారంభించినది. ఆమె కఠోర తపము చేయచూ కేవలము ఎండిన ఆకులను మాత్రమే తినుచూ, కొంతకాలము గడువగా పిమ్మట ఆకులు తినుట కూడా వదలివేసి కేవలము వాయువును మాత్రమే ఆహారముగా జీవించుచూ, శ్రీహరి యొక్క ఆరాధన యందు తత్పరురాలై యుండెను. ఈ విధముగా నూరు సంవత్సరముల వరకు ద్వంద్వములను సహించుచూ నిశ్చలభావము చేత భగవధ్యానమునందు సమాధి స్థితిని పొంది, స్థాణువు వలె నిశ్చలముగా ఉండుచుండెను. అంతట ఆమె శరీరము నుండి వెలువడిన దివ్యప్రకాశము ప్రపంచ మంతయూ వ్యాపించెను.

అప్పుడు నేను ఆమె ఎదుట ప్రత్యక్షమైతిని. నియంత్రిత ఇంద్రియములు గల ఆ కన్య ఎదుట, నియంత్రిత రూపము చేత నేను ప్రత్యక్షమైతిని. అందుచేత అప్పటి నుంచి హృషికేశుడు అను పేరుచే ఇచ్చట నిల్చి ఉంటిని. మరల నేను ఆమెతో "బాలా! ఉత్తమోతమమైన నీ తపస్సు చేత నేను పరిపూర్ణ సంతుష్టుడనైతిని. నీ మనస్సునందు ఏమి కలదో అది నానుండి కోరుకొనుము. వేరు ఇతర వ్యక్తులకు అత్యంత దుర్లభమైనది. ఏదియైననూ పట్టి ఇవ్వదగని వరమైననూ నేను ఇప్పుడే నీకు ఇచ్చుటకు సిద్ధముగా ఉంటిని' అన్నాను.

అంతట "రురు" అను పేరు గల ఆ దివ్యకన్య శ్రీహరికి అనేకమార్లు ప్రణామము చేసి ఇట్లు చెప్పెను. "జగత్పతి నీవు నాకు వరమును ప్రసాదింపవలెనని కోరుకొనుచున్న యెడల దేవాధిదేవా! నీవు ఈ రూపముతోనే ఇచట వెలసి ఉండునట్లు దయ చూపుము" అనగా అంతట నేను ఆమెతో "బాలా! నీకు శుభము కలుగును గాక! నేను ఇచటనే ఉంటిని గదా! అందుచే ఇప్పుడు నీవు వేరు ఇతర వరమును కోరుకొనుము. తప్పక ప్రసాదింతును". అని చెప్పగా ఆమె నాకు నమస్కరించి "దేవేశా! నీవు నాయెడ ప్రసన్నుడవైన యెడల ఈ క్షేత్రము నా పేరుతోను ప్రసిద్ధము అగుగాక! ఇంతకు మించి నాకు వేరు ఇతర అభిలాష ఎట్టిదియునూ లేదు". అని పల్కెను. అందుకు విష్ణువు "శుభగురాలా! అట్లే అగు గాక! నీ ఈ శరీరమే సర్వోత్తమము అయిన తీర్థము అగుగాక!

అంతేగాక ఈ సమస్త క్షేత్రము కూడా నీ పేరుతోనే ప్రసిద్ధికెక్కు గాక! దానితోపాటు ఈ తీర్థమున మూడు రాత్రుల వరకు నివాసము చేసి స్నానము చేసిన నరుడు నా దర్శనము చేత పవిత్రుడు కాగలడు. ఇందులో ఎట్టి సందేహము లేదు. ఇది తెలిసియో తెలియకనో చేసినను అన్ని పాపములు నశించిపోగలవు. ఇందు సందేహము వలదు" అని తెల్పి వరమిచ్చెను. దేవీ! ఈ విధముగా "రురు"కు వరమునిచ్చి, నేను అచ్చటనుంచి అంతర్ధానమైపోతిని. ఆ స్థలము కూడా సమయానుసారముగా పవిత్రమైన తీర్థముగా అయినది. (146)

147వ అధ్యాయము - గోనిష్క్రమణ తీర్థమాహాత్మ్యము

ధరణి ఇట్లు ప్రశ్నించినది."భగవానుడా! నీ దయచేత నేను "రురు" క్షేత్రము, హృషీకేశము యొక్క మహిమను వర్ణనమును వింటిని. దేవేశా! ఇప్పుడు అచ్చట ఇతర పవిత్ర క్షేత్రములు ఉన్నయెడల వానిని తెలిపి నాపై కృప చూపుము."

వరాహభగవానుడు ఇట్లు పల్కెను. "దేవీ! హిమాలయాపర్వత శిఖరముపై నా ప్రసిద్ధము, పుణ్యవంతమైన క్షేత్రము ఒకటి కలదు. దానిపేరు "గోనిష్క్రమణ క్షేత్రము." ఆ క్షేత్రమునందే గడచిన కాలమునందు కామధేనువు మొదలగుగోవులు ఈదుకొనుచూ సముద్రము నుండి బయటికి వచ్చినవి. చాలాకాలము క్రిందట 'ఔర్వ'నాముడు అను పేరుగల ప్రసిద్ధుడైన ఒక ప్రజాపతి కలడు. ఆయన ఇచ్చట సుదీర్ఘకాలము పాటు నిష్కామభావము చేత తపస్సు ఆచరించెను. కొంతకాలము తర్వాత, ఆయన తపస్సు చేయుచుండిన ఎత్తైన ఆ పర్వతముపై పూలు పండ్ల రూపముచేత పరిపూర్ణురాలైన లక్ష్మి కూడా అచట రూపము దాల్చెను. అందువలన మరికొందరు తపస్వులు అయిన బ్రాహ్మణులు అచ్చటకు వచ్చి చేరిరి. సరిగా అదే సమయమున తిరుగుచూ మహాతేజస్వియగు శంకరభగవానుడు కూడా అచటికి వచ్చెను. ఒక పర్యాయము "ఔర్వముని" కమలపుష్పములు కొరకు హరిద్వారము వెళ్ళిన సమయమున, మహాదేవుడు శంకరుడు తన ఉగ్రతేజము చేత ఔర్వముని దగు ఆ ప్రియ ఆశ్రమమును భస్మము చేసి వైచెను. అనంతరము శీఘ్రముగా తన వాసస్థానమైన హిమాలయా పర్వతములపైకి చేరుకొనెను. దేవీ! సరిగా అదే సమయమున ఔర్వముని పత్రములు, పుష్పములు గల పాత్ర కొరకు హరిద్వారము నుంచి ఆ ఆశ్రమమునకు వచ్చెను. ముని శాంతుడు, మృదు

స్వభావుడు, క్షమాశీలుడు, సత్యవ్రత తత్పరుడు అయినప్పటికిని పూలు, పండ్లు నీటితో సుసంపన్నముగా వెలుగుచుండవలసిన ఆ ఆశ్రమము దగ్ధమగుటను చూచి ఆ ముని క్రోధభరితుడయ్యెను. దుఃఖముచేత ఆతడి కన్నులు ఎఱ్ఱబారి అశ్రువులు ధారగా కురిసినవి. క్రోధము నిండిన మనస్సుతో వెనువెంటనే ఆ ముని "శ్రేష్ఠమైన పూలు ఫలములు జలముల చేత సంపన్నమైన నా ఈ ఆశ్రమమును తగులబెట్టిన వాడెవడు? అతడు కూడా దుఃఖము చేత సంతప్తుడై ప్రపంచమంతటియందు తిరుగుచు ఉండునుగాక!" అని శాపము ఇచ్చెను. అందుచేత శంకర భగవానుడు సమస్త ప్రపంచమునకు అధిపతియై నను, ఆ క్షణములోననే వ్యాకులుడై, జగన్మాత ఉమాదేవితో ఇట్లు పల్కెను. "ప్రియురాలా! ఔర్వముని యొక్క కఠినమైన తపస్సును చూచి దేవసమూహముల హృదయమునందు భయము కలిగినది. అందుచే వారు అందరూ నన్ను 'భగవంతుడా! సమస్త ప్రపంచము కాలిపోవుచున్నది. అయిననూ ఆ ఔర్వుడు ఈ అగ్నినుంచి రక్షించుటకు ఏమియూ చేయుట లేదు. మీరు దాని నివారణ కొరకు అందరునూ సురక్షితులు అగునట్లు ఏదో ఒక ఉపాయమును చేయుడు' అని నన్ను ప్రార్థించిరి. దేవతలందరూ ఈ విధముగా చెప్పగా నేను ఔర్వుని ఆశ్రమమునందు నా మూడవ కంటిని తెరచితిని. ఆ దృష్టి చేత ఆయన ఆశ్రమము భస్మమైపోయినది. మేము ఆప్రదేశమునుండి బయటికి వచ్చితిమి కాని ఆశ్రమము కాలిపోవుటచే, ఔర్వునికి మహాదుఃఖము, సంతాపము కలిగినది. శివానీ! అతడు క్రోధము చేత నిండిన హృదయము గలవాడై ఉన్నాడు. ఇప్పుడు ఆతడి రోషయుక్తమైన శాపము చేత మా మనస్సుల యందు తీవ్రమైన వ్యధ కలుగుచున్నది."

ఇట్లు చెప్పిన మహాభాగుడు శంభుడు అశాంతుడై ఇటు అటు తిరుగుట మొదలు పెట్టెను. కాని క్షణములో కొద్ది అంశము మాత్రమైననూ ఆయన శాంతుడుగా ఉండలేక పోయెను. నేను కూడా ఆయన ఆత్మను అగుటచే ఆ సమయమున కలిగిన దుఃఖముచే దుఃఖితుడను, సంతప్తుడనై నిశ్చేష్టుడనైతిని. అంతట పార్వతి శంకర భగవానునితో "ఇప్పుడు మనందరము భగవంతుడు విష్ణుని వద్దకు పోవుదుము. ఆయన పలుకు, పరామర్శల చేత మనకు శాంతి లభించుట సంభవము కావచ్చును. లేని యెడల భగవంతుడు నారాయణుని వెంట పెట్టుకొని మనమందరము ఔర్వుని వద్దకు పోయి అతడిచ్చిన శాపమును వెనుకకు తీసుకొనవలసినదిగా ప్రార్థించెదము. అట్లుకానిచో

మనము అందరము కాలిపోవుచున్నాము” అని పార్వతి శివునితో పల్కినది. అంతట ఆ సమయమున అన్ని రకములైన ప్రయత్నములును జరుపబడుచూనే ఉన్నవి. కాని ఔర్వుడు నా పలుకు ఎన్నడునూ వంధ్య అగునట్టిది కాదు. నేను ఉపాయము చెప్పుచున్నాను. కామధేనువులను తీసుకొని మీరందరునూ అచటికి పోయి ఆ గోవుల దుగ్ధముచే రుద్రునికి స్నానము చేయించిన మీరందరూ ఈ శాపము చేత విముక్తులు కాగలరు. ఇందులో సందేహము లేదు. అని ఉపాయము చెప్పెను.

కళ్యాణీ! ఆ సమయమున నేను మహాశక్తి శాలినిలగు డెబ్బది ఏడు కామధేనువులను స్వర్గము నుంచి క్రిందకు దింపి, వాని పాలచే అభిషేకించిన తర్వాత రుద్రుడు ఇతరులు అందరూ దగ్ధమగుట శాశ్వతముగా శాంతమయ్యెను. అప్పటి నుంచి ఆ స్థలము పేరు “గోనిష్క్రమణ తీర్థము” అని అయ్యెను. ఏ నరులు అచట ఒక్క రాత్రియైననూ నివాసము ఉండి స్నానము చేయుదురో వారు గోలోకమునకు చేరుకొని ఆనందభోగమును అనుభవింతురు. ఉత్తమ ధర్మాచరణము జరిపిన తర్వాత ఆ తీర్థమున వారి మృత్యువు జరిగిన యెడల వారు శంఖుచక్రగధా సంపన్నులై నారాయణ లోకమునందు ప్రతిష్ఠను పొందుదురు. అచట ఆవుల నోటినుండి వెలువడిన అత్యంత శృతిసుఖదశబ్దము ఒకటి వినబడు చుండును. ఒకసారి జ్యేష్ఠమాస శుక్లపక్ష ద్వాదశీ తిథికి నేను స్వయముగా అట్టి సుసంస్కృత శబ్దమును విని ఉంటిని. అందుచే ఇందు సందేహపడవలసిన అవసరము లేదు. గోస్థలము అను పరమ పవిత్ర క్షేత్రము యొక్క ప్రసిద్ధి ఇది. అచట నాయందు శ్రద్ధ ఉంచునట్టి పవిత్రాత్ములైన పురుషులు శుభకర్మలను ఆచరింపవలెను. ఆ ప్రభావము చేత అతడు పాపములనుంచి వెనువెంటనే విముక్తి పొందగలడు. శంకర భగవానునికి ఔర్వముని యొక్క శాప ప్రభావము కలిగిన సమయమునందే దాని వలన మండుచుండిరి. ఆ సమయమున మరుద్గణములతో అచటికి వెళ్ళిన వెంటనే అతనికి శాపము నుండి విముక్తి కలిగినది. దీని చేత ఆ క్షేత్రమునకు అట్టి మహిమ కలిగినది. ఈ గోస్థలకము అను పేరు గల క్షేత్రము మహాశ్రేష్ఠమైనది. అంతేగాక అన్ని విధములుగను శాంతిని కల్గించునట్టిది."

మహాభాగే! ఈ ప్రసంగము సంపూర్ణముగా శుభములను ప్రదానము చేయునది. ఇంకనూ నా మార్గమును అనుసరించు భక్తులకు శ్రద్ధను వృద్ధి పొందించునవి. ఇది

ఉత్తమమైన వాటిలో పరమోత్తమమైనది. శుభములలో పరమ శుభమైనది. లాభములలో మహాలాభకరము. ధర్మములలో ఉత్తమ ధర్మము. యశస్విని నా నిర్దిష్ట పథమును అనుసరించు పధిక పురుషులు దీనిని చదివిన ప్రభావము చేత తేజస్సు, శోభ, లక్ష్మియే గాక సమస్త మనోరథములను ప్రాప్తించునట్లు చేయును. మనస్విని! దీనిని చదువు పాఠకుడు ఈ అధ్యాయమున ఎన్ని అక్షరములు కలవో అన్ని సంవత్సరముల వరకు నా లోకమునందు సుశోభితుడై వర్ధిల్లును. ప్రతిదినము దీనిని చదువు మానవునికి ఎన్నడునూ పతనము ఉండదు. అట్లే దీనిని ఇరువది యొక్కసార్లు చదివిన ఇరువది యొక్క పీడల నుండి విముక్తుడగును. నిందకులు, మూర్తులు, దుష్టుల యెదుట దీనిని ప్రవచనము చేయరాదు. దీనిని స్వాధ్యాయము చేయు యోగ్యత కలవాని పుత్రుడు లేక శిష్యునికి దీనిని వినిపించ వలెను. వసుంధరా! ఐదు యోజనముల దూరము విస్తారముగా ఈ క్షేత్రముపై నాకు అతిశయమైన ప్రేమ కలదు. అందుచేత నేను ఇచ్చట ఎల్లప్పుడు నివాసము ఉందును. ఇచట గంగా ప్రవాహము తూర్పుదిశ నుంచి పశ్చిమ దిశ వరకు విపరీత వేగముగా ప్రవహించుచుండును. (ఈ స్థలము హృషీకేశమునకు పైగా వ్యాసఘట్టమునకు కొద్ది దూరములో కలదు) ఇట్టి గుహ్యమైన రహస్యమును తెలిసిన వారు అందరును అన్ని సత్కర్మలయందు సుఖమును పొందగల్గుదురు. మహాభాగా! ఇదియే నీవు అడిగిన ఆ గుప్త క్షేత్ర మాహాత్మ్యము. (147)

148 వ అధ్యాయము - స్తుతస్వామి మాహాత్మ్యము

పృథ్వి ఇట్లనెను. "జగత్ప్రభూ! గోవుల మహిమ చాలా విచిత్రమైనది. ఈ మాటను విని నాకు గల శంకలన్నియూ తీరినవి. నారాయణా! ఇటువంటివే మరికొన్ని గుప్తతీర్థముల గురించి నాకు తెలియజేయవలసినదిగా మిమ్ము ప్రార్థించుచున్నాను. ప్రభూ! ఈ క్షేత్రము కంటే విశిష్టము, శ్రేష్ఠము అయిన క్షేత్రము ఉన్న యెడల దాని మహిమను కూడా నాకు వివరింపుడు."

ధరణి ఈ ప్రార్థన చేయగా వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "మహానుభావురాలా! ఇప్పుడు నేను నీకు స్తుతస్వామి అను పేరు గల క్షేత్రమును గురించి తెలియజేయుచున్నాను. శ్రద్ధతో వినుము. సుందరీ! రాబోవు ద్వాపర యుగమున అచట నేను నివాసము ఉందును. అప్పుడు వసుదేవుడు నా తండ్రి కాగలడు. పవిత్రురాలగు దేవకి

దేవి తల్లి అగును. నా పేరు కృష్ణుడు కాగా ఆ కాలమున నేను అసురులను అందరినీ సంహరింప గలను. ఆ సమయమున శాండిల్య జాబాలి కపిల ఉపసాయక భృగువు అను ధర్మనిష్టాపరులు అయిన ఐదుగురు శిష్యులు అగుదురు. అంతేగాక నేను వాసుదేవ సంకర్షణ ప్రద్యుమ్న అనిరుద్ధ అను ఈ నాలుగు రూపములలో ఎల్లప్పుడు ప్రత్యక్షునిగా ఉందును. ఆ సమయమున కొందరు ఈ చతుర్వ్యూహములను ఉపాసించుటచేత, కొందరు జ్ఞానప్రభావము చేత మరికొందరు వ్యక్తులు సత్కర్మ పరాయణులై ముక్తులగుదురు. సుశ్రోణి, ఎవరి వారిచే ఇచ్ఛానుసారము నిర్వర్తింపబడిన యజ్ఞమును అనేక కర్మయోగక్రియలు ఈ సంసారము నుంచి వారిని ఉద్ధరింపగలవు. కొందరు సజ్జనులు యోగఫలమును అనుభవించి నాలో గల లోకములను చూడగలరు. నాయందు విధిపూర్వక నిష్ఠను ఆచరించు వారు ఎందరో మనుష్యులు అన్ని జీవములందును నా రూపమునే చూడగల్గుదురు.

భూదేవీ! అనేక రకములైన పురుషులు సమస్త ధర్మములను ఆచరించుచు, సర్వులతో కూడి భోజనము చేయుదురు. అంతేగాక అన్ని పదార్ధముల విక్రయము కూడా జరుపు చుందురు. అప్పుడైననూ అట్టి వారి చిత్తము నాయందు ఏకాగ్రమై ఉండిన యెడలవారు ఉత్తమమగు విధానములను అనుసరించుచు ఉండిన యెడల వారికి నన్ను దర్శించుట సులభము కాగలదు. "దేవీ! ఈ వరాహపురాణము ఈ ప్రపంచం నుంచి జనులను ఉద్ధరించుటకు పరమ సాధనము, మహాశాస్త్రము నా భక్తులు సరియైన జీవనము గడుపగల్గిన యెడల వారికి నేను అండగా ఉందును. అందుచేతనే నేను ఈ పరమ ప్రియమైన విధానమునువారికి తెల్పుచున్నాను. శాండిల్యుడు మొదలైన నా శిష్యులు నా ఇచ్ఛానుసారము ఈ సాధనములను ప్రచారము (ప్రవచనము) చేయుదురు. నా ఈ స్తుతస్వామి అను క్షేత్రము నుంచి దాదాపు ఐదు క్రోశముల దూరములో పశ్చిమదిశ యందు ఒక కుండము కలదు. అందలి నీరు నాకు మహా ఇష్టమైనది. ఆ అగాధమైన జలములు గల సరోవరము నందలి నీరు స్వర్ణము, స్వర్ణకాంతితో లేక మరకతమణికి సమానమైన కాంతితో ప్రజ్వలించుచుండును. ఈ నా సరోవరమందు ఐదు రోజుల పాటు స్నానము చేసిన మనుష్యులకు సర్వపాపములు మటుమాయమగును. దీని సమీపముననే 'ధూతపాపము' అను పేరు గల మరియొక తీర్థము కలదు. అది మణిపూరక గిరికి పైన

కలదు. అచట నివసించు ప్రాణులపై ఆ తీర్థపు జలధార పడనంత వరకు వాని సర్వపాపములు నశించవు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయము. సుందరీ! సర్వపాపములు నష్టములైన తర్వాత అచట గల ప్రాణులపై ఆ నీరు కురిసినప్పుడు వారి సంపూర్ణ పాపములు నష్టములగును. ఇట్టి ఆ స్థలమునందు అచట ఒక రావిచెట్టు కలదు.

పృథ్వీ ఇట్లు ప్రశ్నించెను. “దేవదేవా! నీవే స్థితస్వామివి అని నేను వింటిని. ఇప్పుడు ఈ స్తుతస్వామి పేరుతో మీ అభిప్రాయము ఏమి? ఆ విషయము దయతో నాకు ఎరిగింపుడు.” వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! నేను మణిపూరము అను స్థానమునందు ఉన్నప్పుడు, మంత్రప్రవచనము చేయు బ్రహ్మాది అనేక దేవతలు నన్ను స్తుతించుచుండిరి. సౌభాగ్యవతియగు దేవి! ఈ కారణము చేతనే నారదుడు, అశితుడు, దేవలుడు ఇంకనూ పర్వతుడు అను నామములు గల మునిగణములు భక్తి సంపన్నులై, ఆ సమయమున ఆ మణిపూర పర్వతముపై ఉన్న సమయమున నా పేరు స్తుతస్వామి అని పెట్టిరి.

అప్పటినుంచి నాకుసంబంధించిన సత్కర్మల వలన నాకు స్తుతస్వామి అను పేరు ప్రసిద్ధి చెందినది. నేను నీకు సర్వ ధర్మములకు ఆశ్రయమిచ్చువాడైన ఈ శ్రీ స్తుతస్వామియొక్క మాహాత్మ్యమును తెలిపితిని. ఇప్పుడు నీవు మరియొక వృత్తాంతమును దేనిని వినుటకు కోరుకొనుచున్నావో తెలుపుము. (148)

149 వ అధ్యాయము - ద్వారకా మాహాత్మ్యము

పృథ్వీ వరాహ భగవానుని ఇట్లు ప్రార్థించెను. “దేవేశ్వరా! నీ దయతో స్తుతస్వామి యొక్క మాహాత్మ్యమును విను అదృష్టము నాకు కలిగినది. కృపానిధీ! ఇప్పుడు ఆ స్తుతస్వామి యొక్క గుణములు మాహాత్మ్యములను వినిపించుటకు దయ చూపుడు.” వరాహభగవానుడు ఇట్లు పల్కెను “దేవీ! ద్వాపర యుగమునందు యాదవ కులమునందు కులోద్ధారకుడైన శౌరి వాసుదేవుడు అను పేరుచే నా తండ్రి కాగలడు. ఆ కాలమున విశ్వకర్మ చేత నిర్మింపబడిన దివ్యపట్టణమగు ద్వారకయందు నేను ఐదు వందల సంవత్సరముల వరకు నివసించి ఉందును. ఆ కాలముననే దూర్వాసుడు అను పేరు గల విఖ్యాతుడైన ఒక ఋషి ఉండును. ఆయన నా కులము మొత్తమునకు శాపము పెట్టును. ఆ ఋషి యొక్క శాపము వల్ల వృష్ణి అంధకుడు భోజుడు మొదలైన కులపెద్దలు అందరి

సంహారము జరుగగలదు. ఆ కాలముననే జాంబవతి అను పేరు గల ఒక స్త్రీ నాకు ధర్మపత్ని కాగలదు. ఆమె నా సుఖమునకు మూలము కాగలదు. ఆమె భాగ్యశాలియైన గొప్ప పుత్రునికి జన్మను ఇచ్చును. రూపయవ్వన గర్వీకృతుడైన ఆ నా పరమ సుందర పుత్రుడు సాంబుడు అను పేరుతో విఖ్యాతుడై, నాకు అతి ప్రియమైన పుత్రుడు కాగలడు.

ఇప్పుడు నేను వైష్ణవ జనులకు శ్రవణ సుఖము కలిగించు ద్వారక యొక్క వివిధ స్థానములను వర్ణించుచున్నాను. వినుము. 'పంచసర' అను పేరుతో విఖ్యాతమగు ఒక గుహ్య క్షేత్రము కలదు. సముద్రపు తీరము నుంచి కొద్దిదూరము పోయి నా భక్తియందు సంలగ్నులైన మానవులకు సుఖమును ప్రసాదించు ఆ క్షేత్రమునందు ఆరు రోజుల పాటు నివాసముండి స్నానము చేయవలెయును. అందుకు ఫలస్వరూపముగా స్నానము చేసిన మనుష్యులు అప్సరసలచే నిండి ఉండు స్వర్గలోకమునందు ఆనందమును అనుభవించగలరు. ఆ పంచసర క్షేత్రమునందు ప్రాణత్యాగము చేసిన మనుష్యుడు నా లోకమగు వైకుంఠమునందు ప్రతిష్ఠ గలవాడు అగును. అచట సముద్రము నందు మకరాకృతిలోగల ఒక ప్రదేశము గలదు. అచట అనేక మత్స్యములు, మొసళ్ళు ఇంకనూ ఇతర జలజంతువులు ఇటు అటు తిరుగుచూ కనబడుచుండును. కానీ ఆ నీటియందు స్నానము చేయుచున్న వ్యక్తులకు విరుద్ధముగా అవిఎట్టి అపరాధపు పనులను చేయవు. నరుడు ఆ విమల జలములందు పిండములును కలిపినప్పుడు, వారు దూరమునందు ఉన్ననూ ఆ జలచరములు పిండములను లాగుకొని తీసుకొని పోవును. కాని తమకు ఇవ్వని వాటిని ఆ జంతువులు ముట్టుకొనవు. ఈ విధముగా పాపియైన నరుడు ఎవరైననూ జలమునందు పిండములను ఇచ్చిన యెడల వానిని అవి తీసుకొనవు. ధర్మాత్ముడైన పురుషులు పిండములును వదలిన వానిని ఆ జలజంతువులు స్వీకరించును.

దేవీ! నా ఈ ద్వారకా క్షేత్రమునందు "పంచపిండకము" అను పేరుతో ప్రసిద్ధమైన ఒక గుహ్య స్థానము కలదు. దానియందు అగాధమగు జలము ఉండును. దానిని దాటిపోవుట ఎట్టి మనుష్యులకైననూ అతి కఠినమైన కార్యము. అది ఒక క్రోసెడు దూరము విస్తరించి వ్యాపించినది. మనుష్యుడు ఐదు రాత్రుల పాటు అచట నివసించి, నాకు అభిషేకము చేసినయెడల అతడు నిస్సందేహముగా ఇంద్రలోకమునందు ఆనందమును అనుభవించును. యశస్వినీ! ఒకవేళ అక్కడే అతడు ప్రాణత్యాగము చేసిన

యెడల తిరిగి అతడు అచ్చట నుంచి నా లోకమునకు చేరుకొనగలడు. ఆ ద్వారకా క్షేత్రమునందే హంసకుండము అను పేరుతో ప్రసిద్ధికెక్కిన ఒక తీర్థము కలదు. అచట 'మణిపూరకము' అను పర్వతము నుండి జలధార పడుచుండును. ఆ తీర్థమునందే ఆరు రోజుల పాటు వసించి స్నానము చేసిన గొప్ప మహిమ లభ్యమగును. అందు స్నానము చేసిన వ్యక్తి ఎట్టి దానియందును ఆసక్తి రహితుడైన, యెడల అతడు వరుణ లోకమునందు ఆనందమును పొందగల్గును. శ్రేష్ఠురాలా! ఆ హంస తీర్థమునందు పాంచ భౌతికమైన శరీరమును వదలిన యెడల అతడు వరుణలోకమును పరిత్యజించి నా లోకమునకు చేరుకొని, అచట ప్రతిష్ఠితుడగును. ఆ ప్రసిద్ధ ద్వారకా క్షేత్రమునందు కదంబము అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఒక స్థానము కలదు. ఆ స్థానమున వృష్టి కులమును పరిశుద్ధులైన వ్యక్తులు, నా ధామమునందు అలంకరించి ఉందురు. నరులు అచట నాలుగు రాత్రుల వరకు నివాసము ఉండి, నా అభిషేకము చేయవలెను. అట్లు చేయుటచే ఆ పుణ్యాత్ముడగు పురుషుడు నిస్సందేహముగా ఋషి లోకమును ప్రాప్తింప జేసికొనగలడు.

భాగ్యవతీ! ఆ నా ద్వారకా క్షేత్రమునందు 'చక్రతీర్థము'అను పేరుతో ప్రసిద్ధి చెందిన శ్రేష్టమైన స్థానము ఒకటి కలదు. అచట మణిపూర పర్వతము నుండి వెలువడు ఐదు నీటిధారలు పడుచుండెను. ఐదు రోజులపాటు అచట ఉండి అభిషేకము చేయువాడు పదివేల సంవత్సరముల వరకు స్వర్గములో సుఖమును అనుభవించును. లోభమోహముల నుండి విముక్తుడై, అచట ప్రాణము వదలిన మానవుడు సంపూర్ణముగా సర్వ ఆసక్తులను పరిత్యజించినవాడై నా ధామమందు ప్రవేశించగలడు. ఆ ద్వారాకా క్షేత్రమునందే 'రైవతకము' అను పేరు గల మరియొక తీర్థము కలదు. అచట నా లీలను ప్రదర్శింతును. ఆ స్థానము సమస్త లోకములయందును ప్రసిద్ధమైనదే. నానారకములైన లతలు, తీగలు, పూలు, దాని శోభను వెదజల్లుచూ ఉండును. దాని అనేక దిశలయందును అనేక వర్ణములు కలిగిన రాళ్ళవంటి గుహలు కలవు. ఆ ప్రదేశము అనేక బావులతో గుహలతో కూడి యుండును. అదే విధముగా అది దేవసమూహములకు కూడా దుర్లభమైనది. మనుష్యులు ఆరు దినముల వరకు అచట ఉండి అభిషేకము చేయవలెను. దాని ఫలితముగా ఆ నరుడు కృతకృత్యుడై, నిశ్చయముగా చంద్రలోకమును చేరుకొనును. నా పూజయందే నిరతము నిలిచిన నరుడు అచటనే ప్రాణత్యాగము చేసిన యెడల ఆ లోకము నుంచి నా ధామములో

నివాసము కొరకు చేరుకొనును. ఆ ప్రదేశమునకు సంబంధించిన ఒక అలౌకిక విషయమును తెల్పుచున్నాను వినుము. ధర్మాభిలాష గల ప్రతివాడును ఆ దృశ్యమును చూడగలడు. ఈ విషయమునందు ఎట్టి సందేహమును లేదు. అచట గల ప్రతి వృక్షమును అనేక రకములైన ఆకులను పడవేయును. కాని ఒక్క ఆకు కూడా ఎవరికిని కనిపించదు. అన్ని ఆకులు స్వచ్ఛమైన నీటిలోనికి చేరుకొనును. ఒక విశాలమైన వృక్షము నాకు పూర్వభాగము నందు కలదు. అట్లే అదికాక కొన్ని వృక్షములు నా పార్శ్వభాగమునందు ఉన్నవి. దేవతలు కూడా ఈ వృక్షములను చూచుట యందు అసమర్థులుగానే ఉందురు. ఐదు క్రోశముల విస్తారము గల ఆ స్థలము, మహావృక్షములు అత్యంత శోభనీయములుగా ఉండును. సుగంధీ! పద్మములు, ఉత్పలములు ఆ స్థలముయొక్క నాలుగు వైపులలోను వ్యాపించి ఉండును. హెచ్చుగా జలములు, జలముతో నిండిన సరస్సులు, దానికి అన్ని భాగముల యందును ఉండును. నరులు ఎనిమిది రోజుల వరకు అచట ఉండి అభిషేకము చేయవలెను. ఆ సరస్సు నందు స్నానమాచరించు వాడు అప్సరసలకు తగిన దివ్యమైన నందనవనమున విహారము చేయగల్గును.

వసుంధరా! నా ఈ ద్వారకా క్షేత్రమునందు 'విష్ణుసంకామము' అను పేరు గల ఒక స్థానము కలదు.అచట జర అను పేరు గల వ్యాధుడు(వేటగాడు) నన్ను తన బాణముతో కొట్టెను. నేను అతడిని తన ఆకారమును స్థాపించుకొనుటకు అవకాశమిచ్చితిని. అచట దానియందు మణిపూర పర్వతముపై జలము యొక్క ధార పడుచుండును. లోభము, హాని చేత నిశ్చితుడై అచట నివసించు నరుడు సూర్యలోకమును దాటి నా లోకమునందు ప్రతిష్ఠితుడగును" అని జనులు చెప్పుకొనుచుందురు.

భూదేవీ! దశల కొలది దిక్కులయందు నాలుగు వైపులా వ్యాపించి ఉన్న ఈ నా ద్వారకా క్షేత్రము ముప్పది యోజనముల ప్రమాణము గలది. వరారోహ! అచట ఏ పుణ్యాత్ముడైన మనుష్యుడు అయినను భక్తి పూర్వకముగా నన్ను దర్శించినచో అతడికి చాలా త్వరగా పరమగతి ప్రాప్తించగలదు. ఇది ప్రసంగ ఆఖ్యానములందు అతి గొప్ప ఆఖ్యానము. శాంతులయందు పరమ శాంతము. ధర్మముల యందు పరమ ధర్మము. ద్యుతులయందు మహాద్యుతి. లాభమునందు ఉత్కృష్ట లాభము. క్రియల యందు పరమక్రియ. శృతులయందు పరమ శృతి. అట్లే తపస్సులయందు మహాతపస్సు. ఏ నరుడు

ప్రాతఃకాలమున లేచి దీనిని అధ్యయనము చేయునో అతడు తన కులము యొక్క ఇరువది ఒకటవ పీడను కూడా దాటగలడు.

దేవీ! ద్వారకా క్షేత్రము యొక్క పునీతమైన ఈ ప్రసంగమును నేను నీకు తెలియజేసితిని. ఇప్పుడు నీవు ఉచితము, లోకోపకారి అయిన ఇతర విషయము ఏదైనను నన్ను అడుగదలచుకొనిన యెడల అడుగవచ్చును. (149)

150 వ అధ్యాయము - సానందూర మాహాత్మ్యము

భూదేవి, సూతుడు ద్వారకామాహాత్మ్యమును విని "ప్రభూ! నీ కృప చేత ద్వారకా మాహాత్మ్యమును వర్ణింపగా విని ఉంటిని. ఈ పరమ పవిత్రమైన ద్వారకామాహత్మ్య విషయమును వినుట చేత నేను కృతకృత్యురాలనైతిని. జగత్ప్రభూ ఆ ద్వారక కంటెను మాహాత్మ్యము గల ఏదైననూ రహస్య ప్రదేశము ఉండిన యెడల, దాని మాహాత్మ్యమును కూడా వినవలయునని నాకు కోరిక గలదు. అపారదయసముద్రుడవగు నీవు నాపై కృప చూపి, దానిని కూడా విను భాగ్యము కల్పింపుము" అని ప్రార్థించినదని సౌనకాది మహామునులకు తెల్పెను.

అనగా కమలలోచనుడగు వరాహ రూపవిష్ణు భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! సానందూరు అను పేరుతో ప్రసిద్ధమైన పరమ రహస్యమైన నా నివాస స్థలము ఒకటి కలదు. ఆ క్షేత్రము సముద్రమునకు ఉత్తరముగను, మలయగిరికి దక్షిణముగాను కలదు. ఆ గిరికి ఉత్తరభాగమున ఎక్కువ ఎత్తు, అంత చిన్నది కాక మధ్యమ ప్రమాణములు గల అత్యంత ఆశ్చర్యమైన రూపము గల నా ప్రతిమ ఒకటి కలదు. కొందరు ఆ ప్రతిమ యినుము చేత తయారు జేయబడినదని కొందరు రాగి చేత తయారు చేయబడినదని, మరికొందరు వ్యక్తులు కంచు లోహముతో తయారుచేయబడినదని తలంతురు. అట్లే మరికొందరు అది యశదము, కొందరు సీసముతో తయారు చేయబడినదని కూడా అనుచుందురు. నా ఆ ప్రతిమను కొందరు రాతిచేత తయారు చేయబడినదని కూడా చెప్పుచుందురు. భూదేవీ! ఆ క్షేత్రమునందలి వివిధ స్థానములను గురించినేను నీకు తెలియునట్లు వివరించు చున్నాను. ఆకర్ణింపుము. యశస్వినీ! ఈ సానందూరు కు పోయిన మనుజుని, సంసార సాగరము నుంచి దూరముగా పోవునట్లు చేయు మహిమ కలదని అందురు. ఆ సానందూర క్షేత్ర మాహాత్మ్యమును తెల్పుచున్నాను వినుము.

వరాననా! అచ్చట రామగృహమను పేరుగల గుహ్యప్రదేశము కలదు. ఆ స్థలమున అద్భుతమైన విషయము ఒకటి జరుగుచుండును. దానిని చెప్పుచున్నాను వినుము. అచ్చట ఒక పెద్ద మహావృక్షము కలదు. ఆ వృక్షము లతలు, తీగలతో చుట్టు కాచబడి ఉండును. దానివేళ్ళు సముద్రలోనికి వ్యాపించి ఉండును. కానీ అవి ఎవరికిని దృష్టి గోచరము కావు. కానీ నిరంతరము నిశ్చల భక్తితో తమ మనస్సును నా పైనే లగ్నము చేసి ఉన్నవారికి అవి కన్పింపగలవు. వేలకొలది, కోట్లకొలది మత్స్యములు ఆ సముద్రమున జీవించుచుండును. దుర్మార్గ కార్యము లొనరించు పురుషుడు, అచ్చటగల చక్రాకార మత్స్యములను, ఇతర జలచరములకు ఆహారమును వేసినను అవి ముట్టుకొనవు. అంతేకాక సానందూర క్షేత్రమునందు సంగమనము అను పేరుతో ఒక పరమోత్తమమైన గుహ్య క్షేత్రము ఉన్నది. ప్రియా! అది ఉప్పునకు సముద్రమునకు సమాగమము కల్పించిన స్థానము. అచట స్వచ్ఛమైన నీరు గల ఒక కుండము కలదు. అనేక విధములైన తీగలు, లతలు, పక్షుల చేత ఆ ప్రదేశము విచిత్ర శోభ కలిగినదిగా ఉండును. సముద్రము యొక్క సమీపమునగల కొద్ది యోజనముల దూరములోనే ఆ ప్రదేశము గలదు. అనేకములైన సుగంధములు గల ఉత్తమ పుష్పములు, కమలములు ఎల్లప్పుడూ దాని శోభను పెంచుచూ ఉండును. నరుడు ఎవరైననూ ఆరు రోజుల వరకు నివాసముండి అచట స్నానము చేయవలెను. ఆ ప్రభావము చేత అతడు కొంతకాలము సముద్రలోక భవనమునందు నివసించి పిమ్మట నా లోకమును చేరుకొనును.

దేవీ! సానందూర క్షేత్రమునందు రామసరము (సరస్సు) అను పేరుతో విఖ్యాతమైన నా పరమగుహ్య క్షేత్రమొకటి కలదు. అచటకు పూర్వభాగమునందు కొన్ని యోజనముల దూరము పైఆస్థానము కలదు. ఆ సరస్సును నాపై భక్తి గలవారు మాత్రమే వీక్షింపగలరు. అన్యులకు అది దృగ్గోచరము కాదు. ఆ సరస్సు ఒక క్రోశము విస్తీర్ణము కలదై అనేక విధములగు నీటి తీగలతో నిండి ఉండును. దానిచుట్టును దట్టమైన పొదలు, లతలు అల్లుకొని ఉండును. ఆ సరస్సు దశదిశల యుండును. పద్మములు వికసించి శోభను కల్పించుచుండినను, అచ్చట ఒక తెల్లని సువర్ణనిర్మిత పద్మమును కూడా చూడవచ్చును. ఆ కుండము యొక్క మధ్యభాగము నందు విషమ రూపముతో నీటి యొక్క నాలుగు ధారలు పడుచుండును. కళ్యాణీ! ఆ ధారల యొక్క జలము అత్యంత నిర్మలముగా

ఉండును. నాలుగు రోజుల పాటు అచట ఉండి స్నానము చేయవలయును. ఈ పుణ్యము చేత అతడు నాలుగు లోకముల లోకపాలుర యొక్క ఉత్తమమైన నగరములకు పోవు అధికారి అగును.

అచట గల సరస్సులయందు బ్రహ్మసరము అను పేరు గల సరస్సు కలదు. అచట ఏ నరుడు ప్రాణత్యాగము చేయునో అతడు లోకపాలుర యొక్క స్థానములను వదలి నా ధామమునందు ఆనందముతో నివాసము చేయును. అచట మహాశ్చర్యము కలిగించు విషయము ఒకటి కన్పించుచున్నది. దానిని చెప్పుచున్నాను వినుము. ఎవని అంతః కరణము పవిత్రమైనదో అట్లే ఎవడు నాయందు శ్రద్ధ కలిగి ఉందురో వారు మాత్రమే ఆ దృశ్యమును చూడగలరు. ఆ దృశ్య ప్రభావము చేత సంసార సాగరము నుండి ఆ పురుషులు ఉద్ధరింపబడుదురు. అచట నాలుగు దిక్కులయందు నాలుగు ధారలుగా జలము పడుచుండును. అచట పడుచుండు జలము ఎక్కువ తక్కువలుగా ప్రవహించదు. దాని స్థితి ఎల్లప్పుడునూ సమానముగా ఉండును. భాద్రపద మాస శుక్ల పక్ష ద్వాదశీ తిథినాడు హెచ్చు పుణ్యము చేసినవారికి మనోహరముగా ఉత్తమమైన గీతము వినబడుచూ ఉండును.

వసుంధరా! సూర్వారక అను పేరుతో ప్రసిద్ధమైన ఒక గుహ్యమైన నా క్షేత్రము కలదు. అది నాకు పరమ పవిత్రమైనది అట్లే దివ్యమైనది. ఆ దేవుడు పరశురాముడు, శ్రీరాముని ఆశ్రమముల చేత సుశోభితమైనది. దేవీ! ఆ పరమ పవిత్రమైన స్థానము సముద్ర తటముపై కలదు. నేను అచట శాల్మలీ వృక్షము క్రింద నివాసము చేయుచున్నాను. అచట ఐదు దినములవరకు మనుష్యులు స్నానమాచరింపవలెను. దాని ఫల స్వరూపముగా మనుష్యులు ఋషిలోకమునకు పోయి, అరుంధతిని దర్శనము చేసుకొన గల్గుదురు. నా భక్తియందు సంలగ్నమైన పురుషులు తమ ప్రాణములను త్యాగము చేసినచో ఋషి లోకమును వదలి నా స్థానమునకు చేరుకొందురు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయము. ఇచ్చట ఏమనుష్యుడు నాకు ఒకసారి నమస్కారము చేయునో అతడు పన్నెండు సంవత్సరముల వరకు తాను చేసిన నమస్కారము ఫలితమునకు భాగస్తుడు కాగలడు. ఈ సూర్పరక కేత్రము (సూర్పరక క్షేత్రము ప్రస్తుతము బొంబయి నగరము యొక్క ధాణా అను స్థానమే). ఈ ప్రదేశ వర్ణనము మహాభారతము మొదలగువాని యందు కలదు) నందు

నిష్ఠగల పురుషుడు మాత్రమే నా దర్శనము చేసికొనగలడు. మాయా మోహితుడగు వ్యక్తి ఎవరునూ నా దర్శనమును చేసికొనలేరు.

దేవీ! ఈ సానందూర క్షేత్రమునందు మరియొక పరమగుహ్యమైన క్షేత్రము కలదు. ఆ క్షేత్రమునకు వాయవ్య (పశ్చిమోత్తరము) మూలయందు విరాజిల్లుతున్న ఆ క్షేత్రము పేరు జటాకుండము. ప్రియా! నాల్గువైపులను పదియోజనములవరకూ వ్యాపించి ఉండును. ఆ ప్రదేశము మలయాచలమునకు దక్షిణముగను, సముద్రమునకు ఉత్తర భాగమునందును కలదు.ఇచట నిలిచి నరుడు ఐదు దినములు స్నానమాచరించవలెను. ఆ ఫల స్వరూపముగా ఆ వ్యక్తి ఆగస్త్యముని యొక్క ఆశ్రమమునకు చేరుకొని నిశ్చయముగా ఆనందపూర్వక నివాసమును పొందగల్గును. లేక ఒక వ్యక్తి నా స్మరణ చేయుచూ అచటనే పాపవిసర్జన చేయగల్గును. అందుచేత అతడు ఆ స్థానమును వదలి, నా లోకమునకు పోగల్గు సంపూర్ణ అధికారమును పొందగల్గును. ఈ కుండమునకు తొమ్మిది జలధారలు ఉండును. ప్రియురాలా! ఈ సానందూర క్షేత్రమహిమను నీకు వర్ణించి తెలిపితిని. దీనిని వినుటచే శ్రీహరిభగవానునిపై భక్తిశ్రద్ధలు వృద్ధి పొందును. ఈ క్షేత్రము గుహ్యములలో పరమ గుహ్యము. స్థానములలో సర్వోత్తమ స్థానము గలది. నవ విధములైన భక్తియందు సంలగ్నుడైన వ్యక్తి ఈ సానందూర క్షేత్రమునకు పోయిన నరునికి, నేను చెప్పినట్లుగా పరమసిద్ధి పాత్రుడగును.ఏ మనుష్యుడు ప్రతిదినము ప్రసన్నతతో దీనిని చదువునో, లేక వినునో అతడు పద్దెనిమిది విధముల పీడలను తొలగించుకొని పూర్ణపురుషుడై తరించును. (150)

151వ అధ్యాయము - లోహార్గళ క్షేత్ర మాహాత్మ్యము

సూతుడు ఇట్లు పలికెను. సానందూర మాహాత్మ్యమును వినిన ధరణి చేతులు జోడించి ఇట్లు చెప్పినది. "ప్రభూ! విష్ణూ! నీవు సకల లోకాధిపతివి. నేను సాటిలేని సానందూర క్షేత్ర పరమోత్తమమైన రహస్య పూర్ణమహిమను ఇప్పుడే నీ నుంచి వినగల్గితిని. దానిని వినుటచే నాకు పరమ ప్రాప్తి లభించినది. ఇది కాకుండా వేరొక సుఖమును కల్గించు గుప్తక్షేత్రము ఉన్న యెడల నేను దానిని కూడ తెలుసుకొన వలెననుకొనుచున్నాను. దయతో దానిని కూడా తెలియజేయుడు." అని ధరణి విన్నపముచేయగా వరాహ భగవానుడు ఇట్లు పల్కెను. "దేవీ! ఇప్పుడు నేను తత్వపూర్వకమైన మరియొక గుప్త క్షేత్రమును గురించి నీకు

తెలుపుచున్నాను. – శ్రద్ధగా ఆకర్ణింపుము. "సిద్దవటము" అను పేరుగల ప్రదేశము సానందూరము నుండి ముప్పై యోజనముల దూరములో హిమాలయముల వద్ద కలదు. అది మ్లేచ్ఛులచే నిండిన దేశము. ఆ దేశ మధ్యముగా దక్షిణ భాగమునందు హిమాలయా పర్వతము మధ్య లోహార్గళము అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఒక గుప్త క్షేత్రము కలదు. (లోహార్ధళ క్షేత్రము లోహానదిపై ఉన్న లోహాఘాట్ అనునదే. ఈ లోహాఘాట్ లోహానది పై గల చంపావట్ కు ఉత్తరమున 3 మైళ్ళ దూరమున కునావూ ప్రాంతమున కలదు.) అది పదునైదు రహస్య స్థానములు గల క్షేత్రము. అది నాలుగు దిక్కులలోను ఐదు యోజనముల వరకూ వ్యాపించి ఉన్నది. చతుర్దిశల యందును పరివేష్టించి ఉన్న ఆ స్థానము పాపులకు దుర్గమమైనది, దుస్సహమైనది కూడా. కానీ ఎవరు నిరతము నా చింతనయందు తత్పరులై యుందురో ఎవరి కాలమంతయూ పుణ్యకార్యములలో వినియోగపడబడుచుండునో వారికి ఆ క్షేత్రము పరమసులభమైనది. ఆ ప్రదేశము యొక్క ఉత్తర దిశయందు నేను నివాసముందును. అచట బంగారముతో చేయబడిన నా ప్రశస్తమైన విగ్రహరూపముతో నేను నెలకొని ఉందును.

వసుంధరా! ఒకానొక సమయమునందు ఆ నా ఉత్తమోత్తమమైన స్థానమును దానవులందరునూ సంపూర్ణముగా ఆక్రమించుకొనిరి. మాయాబలము చేత వారు నన్ను అవహేళనము కూడా చేసిరి. అప్పుడు బ్రహ్మ రుద్ర స్కంద మరుద్గణ ఆదిత్య వసుగణ వాయు అశ్వినీకుమార చంద్ర బృహస్పతి మొదలగు సమస్త దేవ సమూహములను అచ్చట నేను సురక్షితులను చేసి, తేజోవంతమైన నా సుదర్శన చక్రమును పైకిలేపి ఆ నిశాచరులను సంహరించితిని. ఆ కార్యము చేత దేవగుణములు మహానంద భరితులై విహరించుట మొదలిడిరి. అప్పటినుండి నేను ఆ ప్రదేశమునకు లోహార్గళము అని పేరు పెట్టితిని. అంతే గాక ప్రబల శక్తి శాలురగు దేవసముదాయములను అచట ప్రతిష్టించి నా ప్రతిమను కూడా ప్రతిష్టిపంజేసితిని. ఆ స్థానమున ప్రతిష్టింపబడిన నా విగ్రహమును యత్నపూర్వకముగా దర్శనము చేసుకొనిన వ్యక్తి నాభక్తుడగును. మూడు రాత్రుల వరకు అచ్చట నివాసముండి శాస్త్ర విహితకర్మలు చేయువాడు, నియమ పూర్వకముగా అచ్చటికుండమున స్నానము చేయువాడుగు మానవుడు వేలకొలది సంవత్సరముల పాటు స్వర్గమున వసించి, ఆనందించును. ఇందు ఆవంతయు సందేహము లేదు. ఒకవేళ తన కర్మలయదు ఉత్తమ

విధముగా తత్పరుడైయుండు వ్యక్తి ప్రాణత్యాగము చేసినయెడల అతడు స్వర్గలోకమునకు పైభాగమునగల నాలోకమునకు చేరుకొనును. ఒకమారు నేను ఒక అశ్వమును సృష్టించి దానిని సకల ఆభరణములతో అలంకృతము చేసితిని. ఆ అశ్వము తెల్లని కమలమును, శంఖము లేక కుంద పుష్పములకు సమానమగు తెల్లని కాంతులతో ప్రకాశించుచుండును. ధనుస్సు, అక్షసూత్రము (జపమాల) కమండలమును తీసుకొని దానిపై నేను ఆసీనడనై యాత్రను ఆరంభించపోవుచుండగా మార్గమధ్యమున శ్వేత పర్వతమునకు చేరుకొంటిని. అచట కురువంశీకులు నివసించుచుండిరి. నేను అచటనుంచి వారిని పడద్రోయుట ఆరంభము చేసితిని. అంతేగాక ఆకాశము నుండి అనేకులు ఇతరులను కూడా చంపి పడవేసితిని. ఈ విధముగా ఎందరినో నష్టపరిచిననూ ఆ అశ్వము ఆకాశమునందు శాంతముగా ఉండి యధావిధిగా మొదట ఎట్లుండెనో అట్లే సురక్షితముగా సుస్థిరముగా ఉండెను. మరల వరాహభగవానుడు ఇట్లు తెల్పెను: సుమధ్యమా! అప్పటి నుంచి పురుషులు ఉత్తమ జాతికి చెందిన అశ్వములను అధిరోహించి స్వర్గము వరకునూ నేరుగా యాత్రను చేయుట మొదలిడిరి. దేవీ! పంచసారము అను పేరుతో ప్రసిద్ధికెక్కిన మరియొక నా పరమ గుప్త క్షేత్రము కలదు. అచట శంఖమునకు సమానముగా తెల్లని కాంతితో అతి వేగముగా పారునట్టి నాలుగు నీటిధారలు పడుచుండును. ఆ క్షేత్రమునందు నాలుగు దినముల వరకు ఉండినట్టి వాడు చైత్రాంగద లోకమునకు పోయి గంధర్వులతో పాటు విహరించును. అట్లే అచట ప్రాణత్యాగము చేసిన జీవుడు నా లోకమును పొందగల్గుచున్నాడు. ఇచటనే నారదకుండము అను పేరుతో ప్రసద్ధికెక్కిన నాకు సంబంధించిన మరియొక ఉత్తమ క్షేత్రము కలదు. అచట తాళవృక్షమునకు సమానమైన లావైన ఐదు నీటిధారలు పడుచుండును. ఆ తీర్థమునందు ఒక్క రోజుపాటు నివాసముండి, స్నానము చేసి, పురుషులు దేవర్షి నారదుని దర్శించు సౌభాగ్యము కలుగుటచే అచ్చట మరణించిననూ తిరిగి నా ధామమును చేరును. అచటనే వశిష్ఠ కుండము కలదు. నా కర్మలయందు అనగా నన్ను ఆరాధించు విధానములందు నిమగ్నుడై ఉండు ఆ పురుషుడు అచట ప్రాణము విడిచిన, ఆనందమును పొందగల్గును. నా కర్మలయందు ఉండిన ఆ పురుషుడు ఒకవేళ ప్రాణములను వదలివేసిన ఆ లోకమును వదలివేసి నా ధామమునకు చేరుకొనును.

దేవీ! ఈ లోహార్గళ క్షేత్రమునందు నాకు సంబంధించిన 'పంచకుండము' అను పేరు గల ముఖ్య తీర్థము కలదు. అచట హిమాలయముల నుంచి వెలువడు ఐదు జలధారలు పడుచుండును. ఆ ప్రదేశమునందు ఐదురోజులపాటు నివసించి స్నానము చేసిన మనుష్యుడు పంచశిఖాస్థానముపై నివాసము ఉండును. అతడు ఇంద్రియములపై ఆధిపత్యము పొంది, నా భక్తుడై అచట ప్రాణత్యాగము చేసిన యెడల ఆతడికి నా లోకము ప్రాప్తింపగలదు. ఈ లోహార్గళ క్షేత్రమునందు 'సప్తర్షి కుండము' అను పేరు గల మరియొక తీర్థము కలదు. ఆ కుండము నందుగల జలమునందు స్నానము చేసిన పుణ్యము చేత నరులు ఋషుల లోకమునకు పోయి సంతోషపూర్వకముగా నివాసము ఉందురు. దేవీ! అచట అగ్నిసరము అను పేరుతో విఖ్యాతి చెందిన మరియొక కుండము కలదు. ఆ స్థానమందు ఎనిమిది రాత్రులు వసించి ఆ కుండమునందు స్నానము చేసిన నరుడు సర్వసుఖములను అనుభవించి అంగిరాముని లోకమును పొందగల్గును. ఇందు ఎట్టి సంశయమును అక్కరలేదు. ఒకవేళ నాతో సంబంధము గల కర్మలయందు అనగా నా ఆరాధనయందు తత్పరుడైన పురుషుడు అచ్చట ప్రాణములు వదలిన అతడు అగ్ని లోకమును వదలివేసి నా ధామమును పొందగల్గును.

ధరణీ! ఆ లోహార్గళ క్షేత్రమునందు ఉమాకుండము అను పేరుతో ఒక ప్రసిద్ధ స్థానము కలదు. ఆ స్థానము నందే ఒకప్పుడు శంకర భగవానుడు తన పత్ని పరమసుందరియైన గౌరీదేవిని దర్శించెను. అచట పదిరాత్రులపాటు వసించి నరులు స్నానము చేయుట అవసరము. దీనితో అతడికి గౌరి యొక్క దర్శనము సంభవమగును. అట్లే ఆ లోకమున అతడు మిక్కిలి ఆనందముతో నివసించును. ఒకవేళ ఆయుక్షీణము అయిన ఎడల ఆ నరుడు ఆ స్థానమునందే ప్రాణత్యాగము చేసిన ఆ లోకము నుంచి తొలగి నా ధామమును చేరి శోభించును. శంకర భగవానునితో ఇచటనే ఉమాదేవి యొక్క వివాహము జరిగినది. దీనియందు హంస కారండవ, చక్రవాక, సారసము మొదలగు పక్షులు ఎల్లప్పుడు నివసించుచుండును. హిమాలయా పర్వతముల నుంచి నిర్మలమైన మూడు నీటి ధారలు ఇచట పడుచుండును. నరులు పన్నెండు దినముల వరకు ఇచట నివసించి స్నానము చేసిన యెడల అతడు రుద్రలోకమున ఆనందింపగలడు. ఒకవేళ అతడు అచట అత్యంత కఠినమైన కర్మలను చేసి ప్రాణములను వదలిన,

రుద్రలోకమునుండి కూడా వేరుపడినవాడై నా స్థానమునకు బయలుదేరును. అచటనే బ్రహ్మకుండము అను పేరు గల స్థానమునందు నాలుగు వేదముల ఉత్పత్తి జరిగినది. దీని ఉత్తర దిశయందు సువర్ణముతో సమానమైన రంగు గల స్వచ్ఛమైన జలధార పడుచుండును. అచట ఋగ్వేద ధ్వని వినిపించును. ఇచట పశ్చిమ భాగమున యజుర్వేద యుక్తధార, అట్లే దక్షిణ దిశలో అధర్వవేద సమన్విత ధార పడుచుండును. ఏడు రాత్రుల వరకు మనుష్యుడు ఇచట స్నానమాచరించిన యెడల అతడు బ్రహ్మ లోకమును పొందగలడు. అహంకార శూన్యుడై, ఆ నరుడు ప్రాణములను త్యాగము చేసిన అతడు ఆ లోకమును పరిత్యజించి నా లోకమునకు చేరుకొనును. మహాభాగురాలా! నా ఈ లోహార్గళ క్షేత్ర వృత్తాంతము చాలా రహస్యాత్మకమైనది. సిద్ధి కోరుకొను మనుష్యులు అచటకు పోవుట ఆవశ్యకము. వరాననా! ఆ క్షేత్రము ఇరుది అయిదు యోజనముల దూరమునందు నాలుగు దిక్కులయందు వ్యాపించి ఉన్నది. అంతేగాక అది స్వయముగా వెలసినట్టిది. ఈ విషయము ఆఖ్యానములలో పరమాఖ్యానము. ధర్మములయందు సర్వోత్కృష్ట ధర్మము, అట్లే పవిత్రములయందు పరమ పవిత్రమైనది. శ్రద్ధాళులైన పురుషులు దీనిని పఠించిన వారు లేక కనీసము వినినవారు వారి తల్లిదండ్రులు ఈ రెండు వంశముల పదిపది తరముల పూర్వపురుషులు యొక్క సంసార సాగరము నుండి ఉద్ధరింపబడుదురు. (151)

152వ అధ్యాయము - మధురాతీర్థ ప్రశంస

సూతుడు ఇట్లు చెప్పెను: "ఋషులారా! భగవంతుడగు శ్రీహరి ద్వారా లోహార్గళ క్షేత్రము యొక్క మహిమను వినిన పృథ్వి ఆశ్చర్యచకితురాలై మరల ఇట్లు పల్కినది."

"ప్రభూ! నీ కృపచేత లోహార్గళ క్షేత్ర మాహాత్మ్యమును వింటిని. ఈ క్షేత్రముకన్ననూ శ్రేష్ఠమైనది, తీర్థములలో సర్వోత్తమమైనది. అందరికీ శుభములను సమకూర్చునది వేరేదైనను తీర్థము ఉన్న యెడల నాపై కృప ఉంచి దానిని గురించి తెలియజేయవలసినది" అనగా వరాహ భగవానుడు ఇట్లనెను. "వసుంధరా! మధురతో సమానమై నాకు ప్రియమైన ఆకాశ పాతాళ, మర్త్యములను ఈ మూడు లోకములలోను ప్రియమైన తీర్థము లేదు. ఈ నగరము నందే నా శ్రీకృష్ణావతారము జరిగినది. అందుచేత అది పుష్కరము, ప్రయాగ, ఉజ్జయిని, కాశీ, నైమిశారణ్యముల కంటే అధికమైన మాహాత్మ్యము గలది. ఇచట విధి పూర్వకముగా నివసించు మానవులు నిస్సందేహముగా

ముక్తులగుదురు. మాఘమాసము నందలి ఉత్తమ పర్వ సమయమున ప్రయాగయందు నివసించుట చేత నరులకు, పుణ్యఫలము ప్రాప్తించునో, అది మధురలో ఒక దినము ఉండుట చేతనే లభ్యమగున ఈ విధముగా వారణాశియందు వేయి వత్సరములు నివసించుట చేత ఎట్టి ఫలప్రాప్తి లభ్యమగునో అంతే ఫలము మధురయందు ఒక్క క్షణము నివాసము ఉండుట చేత సులభముగా లభించును. దేవీ! కార్తీక మాసమునందు పుష్కర క్షేత్రమునందు నివసించు వానికి లభ్యమగు సువిఖ్యాత పుణ్యఫలము మధురయందు నివాసముండు వానికి జితేంద్రియులైన నరులకు, సహజముగా సంప్రాప్తించును. ఎవరైననూ 'మధురా మండలము' అను పేరును ఉచ్చరించిననూ లేక ఆ శబ్దమును మరియొకడు విన్ననూ, వినినవాడు కూడా అన్ని పాపములనుండి విముక్తుడగును. భూమండలముపై సముద్ర పర్యంతము ఎన్ని తీర్థములు లేక సరోవరములు కలవో అవి అన్నియూ మధురానగరమునకు అంతర్గతముగా ఉన్నవి. అందుకు కారణమేమనగా సాక్షాత్ భగవంతుడు శ్రీహరియే గుప్త రూపముతో అచట నిరంతర నివాసము ఏర్పాటు చేసికొని ఉన్నాడు. కుబ్జామ్రకము, సౌకరకము, మధుర ఈ మూడును పరమ విశిష్ట తీర్థములు. అచ్చట ఆ ప్రదేశము యోగులకు తపోసాధకముగా ఉండకపోయిననూ కూడా, ఈ స్థానములందుండు నివాసి, సిద్ధిని పొందగల్గును. దీనియందు సందేహము ఏమియు లేదు.

దేవీ! ద్వాపరయుగము వచ్చిన తర్వాత అచట నేను యయాతి మహారాజు వంశమునందు అవతరించెదను. నాది ఆ కారణము చేత క్షత్రియకులము కాగలదు. ఆ సమయమున నేను నాలుగు అవతారములు కృష్ణ, బలరామ, ప్రద్యుమ్న, అనిరుద్ధులుగా మారి చతుర్వ్యూహ రూపములందు వంద సంవత్సరముల వరకు అచట నివాసముందును. నా ఈ నాలుగు విగ్రహములు క్రమముగా చందన, సువర్ణ, అశోక, కమలములను పోలిన రూపము కలవారుగా ఉందురు. ఆ సమయమున ధర్మమును ద్వేషించువారగు కంసుడు మొదలగు మహా భయంకరులు ముప్పది రెండుమంది దైత్యులు ఉద్భవించెదరు. వారిని అందరను నేను సంహరించగలను. అచట సూర్యపుత్రియగు యమున యొక్క సుందర ప్రవాహము ఎల్లప్పుడు సమీపములో శోభాకరముగా ఉండును. మధురయందు నాకు సంబంధించిన అనేక గుప్త తీర్థములు కలవు. ఆ తీర్థములయందు స్నానము చేయుట చేత,

మనుష్యులు నా లోకమునందు ప్రతిష్ఠితులు అగుదురు. ఇంకను అచట చనిపోయిన తర్వాతనాలుగు భుజముల కలవాడై నా స్వరూపమును పొందును. దేవీ! మధురా మండలము నందు 'విశ్రాంతి' అను పేరు గల ఒక తీర్థము కలదు. అది మూడు లోకములందును ప్రసిద్ధి చెందినట్టిది. అచ్చట స్నానము చేయు మానవుడు నా లోకమున నివసించుటకు అవకాశమును, స్థానమును పొందును. అచ్చట నా ప్రతిమను దర్శించి సమస్త తీర్థములోను స్నానము చేసిన ఫలమును పొందును. ఎవరు రెండు మార్లు దాని ప్రదక్షిణము చేయుదురో వారు విష్ణులోక భాగస్తులు అగుదురు. ఇంతేగాక ఇదే విధముగా 'కణకల' అను పేరుగల అత్యంత గుహ్యాస్థానము కలదు. అచట మనిషి కేవలము స్నానము చేయుట చేతనే స్వర్గ సుఖము పొందుటకు అధికారమును ప్రాప్తించు కొనును. అట్టిదే 'విందుక' అనే పేరు గల విఖ్యాతమైన ఒక పరమగోప్యమగు మరియొక క్షేత్రము కలదు. ఆ క్షేత్రమున స్నానము చేసిన వ్యక్తి నా లోకమున ప్రతిష్టితుడగును.

వసుంధరా! ఆ తీర్థమునకు సంబంధించిన ఒక ప్రాచీన ఇతిహాసమును ఇప్పుడు చెప్పుచున్నాను వినుము. పాంచాల దేశము నందు ప్రసిద్ధి చెందిన కాంపిల్య (ఇది ఫరూకాబాద్ జిల్లాలోని కంపిల నగరము) నగరమునందు బ్రహ్మదత్తుడను రాజు వసించు చుండును. అచట అతని వద్ద తిందుకుడు అను పేరు గల ఒక మంగలి నివసించు చుండును. చాలా దినములు పాటు అచ్చట నివసించిన తర్వాత అతడి బంధుమిత్రులందరూ క్షీణించిపోయిరి. అంతట తిందుకుడు దుఃఖము చేత పీడింపబడినవాడై అచటి నుండి మధురకు పోయి ఒక బ్రాహ్మణుని ఇంటియందు నివసించుచుండెను. అచ్చట అతడు ఆ బ్రాహ్మణుని యొక్క వందలకొలది పనులు చేయుచూ, ప్రతిరోజూ యమునాస్నానము కూడా చేయుచుండెను. ఈ విధముగా చాలాకాలము గడచిపోయిన, తర్వాత అతడు ఆ తీర్థమునందే మృత్యువు పాలయ్యెను. తర్వాత జన్మలో అతడు జాతి తెలిసిన బ్రాహ్మణుడుగా జన్మించెను. ఈ మధురయందు 'సూర్యతీర్థము' కలదు. అది సర్వపాపముల నుండి విముక్తిని కలిగించునట్టిది. అచట విరోచన పుత్రుడగు బలి మొదట సూర్యదేవుని ఉపాసించెను. ఆయన ఉపాసన చేత సూర్యభగవానుడు ప్రసన్నుడై అతని తపమునకు కారణమేమని ప్రశ్నించెను. అందుకు బలి "దేవేశ్వరా! పాతాళమునందు నా నివాసము కలదు. ఈ సమయమున నేను

రాజ్యభ్రష్టుడను, ధనహీనుడను అయితిని.” అని చెప్పెను. ఆ తరువాత సూర్య భగవానుడు బలికి తన కిరీటము నుండి చింతామణి అను వజ్రమును తీసి ఇచ్చెను. ఆ మణిని తీసుకొని బలి పాతాళలోకమునకు వెడలిపోయెను. అచట స్నానము చేయుట చేత మనుష్యుల సమస్త పాపములు సమాప్తమై పోవును. అచ్చట మరణము కలిగిన యెడల ఆ ప్రాణికి నా లోకప్రాప్తి కలిగెను. దేవి! ప్రత్యేక ఆదివారము నాడు, సంక్రాంతి సమయమున, అట్లే సూర్యచంద్ర గ్రహణములందు ఆ తీర్థము నందు స్నానము చేయుట చేత రాజసూయ యజ్ఞ నిర్వహణ ఫలము లభ్యమగును. ధృవుడు కూడా ఇచ్చట స్నానాది పూర్వక కఠోర తపము చేసెను. అందుచే నేటికి ధృవలోకమునందు ప్రతిష్ఠితుడుగా ఉన్నాడు. వసుధా! ఏ నరుడు ఈధృవతీర్థమునందు శ్రద్ధ కలిగినవాడు అగునో అతడి సర్వపితరులు ఉద్ధరింపబడుదురు. ధృవతీర్థము యొక్క దక్షిణ భాగమునందు తీర్థరాజము అను స్థానము కలదు. అచట స్నానము చేసిన మానవులు నా ధామమును పొందగల్గుదురు. మధురయందు కోటితీర్థము అను పేరు గల ఒక స్థానము కలదు. దాని దర్శనము దేవతలకు కూడా బహుదుర్లభమైనది. ఆ కోటి తీర్థమందు స్నానము చేసి పితరులు, దేవతలకు తర్పణము అర్పించవలెను. ఇందుచే పితామహాది పితరులందరూ తరింపబడుదురు. ఆ తీర్థమున స్నానముచేయు మనుష్యుడు బ్రహ్మలోకము నందు ప్రతిష్ఠను పొందును.

ఇచటనే పితరులకు కూడా దుర్లభమైన వాయుతీర్థము కలదు. ఇచట పిండదానము చేయుటచే నరుడు పితృ లోకమునకు పోగల్గును. దేవీ! గయయందు పిండదానము చేయటచే మనుష్యునకు లభించెడిన ఫలము, ఇచ్చట జ్యేష్ఠయందు పిండదానము చేయుటచే లభ్యమగుచున్నది. ఇందు ఎట్టి సంశయము లేదు. ఈ పన్నెండు తీర్థములను కేవలము స్మరణ చేయుట చేత పాపము దూరముగా పోవుచున్నది. అంతేగాక మనుష్యుని సమస్త కోరికలు పరిపూర్ణము కాగలవు. (152)

153, 154, 155 వ అధ్యాయములు - మధుర, యమున, అక్రూర తీర్థముల మాహాత్మ్యము

వరాహ విష్ణుభగవానుడు ఇట్లు చెప్పెను. “వసుంధరా! శివకుండమునకు ఉత్తర భాగమున నవకము అను పేరు గల పవిత్ర క్షేత్రము కలదు. అచట స్నాన మాత్రము చేతనే ప్రాణికి సౌభాగ్యము సులభముగా లభ్యమగును. అట్లే పాపులైన వారు కూడా నా

ధామమున ప్రతిష్ఠను ప్రాప్తించుకొందురు. ఇప్పుడు ఈ తీర్థము యొక్క ఒక ప్రాచీన ఘటనను వినుము. ప్రాచీన కాలమున నైమిశారణ్యము నందు దుష్టుడైన నిషాదుడు వసించుచుండెను. ఒకసారి అతడు ఒకానొక మాసము నందలి చతుర్దశినాడు మధురకు వచ్చెను. అతడి మనస్సునందు యమునా నది యందు ఈదులాడవలెనను కోరిక ఉత్పన్నమైనది. అందుచే అతడు యమున యందు ఈదుచూ సంయమన తీర్థము వరకును చేరుకొనెను. అంతట దైవయోగము చేత అతడు ఆ తీర్థము నుండి బయటకు రాలేకపోయెను. అందుచే అచటనే అతడి ప్రాణములు పోయినవి. రెండవ జన్మలో కూడా అతడే (నిషాదుడు) క్షత్రియ వంశమునందు ఉత్పన్నుడై సంపూర్ణ భూమండలమునకు అధిపతి అయ్యెను. అతడి రాజ్యరాజధాని సౌరాష్ట్రములో కలదు. అట్లే కాలాంతరమునందు అతడే యక్ష్మధ్వనుడు అను పేరుతో ప్రఖ్యాతుడయ్యెను. అతడు తన ధర్మములు అగు (క్షత్రధర్మము, రాజధర్మము) లను చక్కగా పాలించుచుండెను. అట్లే రాజ్య రక్షణమునందును ప్రజారంజకముగా పాలించుటయందు సమర్థుడు, సఫలుడు అయ్యెను. అతడి వివాహము సుందరియైన కాశీ రాజకుమార్తె పివరితో జరిగెను. యక్ష్మ ధ్వనునికి మరికొందరు రాణులు కలరు. అయిననూ అతనికి అందరు రాణులయందును పివరియే మెచ్చిన భార్య అగుటచే ఆమెనే అతనికి అందరికంటెనూ అధికముగా ప్రేమించుచుండెను. అతడు ఆమెతో భవనములు ఉద్యానవనములు, ఉపవనములు నదీనదతటములపై విహరించుచూ, రాజ్యసుఖములను అనుభవించుచుండెను. కాలాంతరమున అతడికి ఏడుగురుపుత్రులు,ఐదుగురు పుత్రికలు జన్మించిరి. ఈవిధముగా యక్ష్మ ధ్వనునికి డెబ్బదియేడు సంవత్సరముల వయస్సు గడిచెను. ఒకానొక సమయము నందు అతడు నిద్రించునప్పుడు అకస్మాత్తుగా అతడికి మధురయందలి సంయమన తీర్థము యొక్క సృతి కలిగినది. అప్పటి నుంచి అతని ముఖము నుండి హాహా అను శబ్దము వెలువడుట మొదలయ్యెను. ఆ రాజునకు సమీపములోనే నిదురించుచున్న అతని పట్టపురాణి పివరి “రాజా! నీవు ఏమి చెప్పుచున్నావు?” అని ప్రశ్నింపగా “ప్రియా! ఏదో ఒక మాదక వస్తువున సేవించుట చేత స్పృహ లేనివాడనై ఉంటిని. నదియందు ఉండు ఆతని చిత్తము చలించుచూ ఉండును. ఆతడి ముఖమునుండి అసంబద్ధ శబ్దములు వెలువడుట స్వాభావికములే. నేను నదియందు ఉంటిని. అందుచేత ఈ శబ్దములు నా నోటినుండి వెలువడినవి. ఈ

విషయము నందు నీవు నన్ను అడుగవలసిన అవసరం లేదు" అని జవాబివ్వగా రాణి అనేకమార్లు ఆగ్రహావేశురాలు అయినందున యక్ష్మధ్వనుడు "దేవా! నా మాట నీవు వినుట ఆవశ్యకము అని అనిపించన యెడల మనమిరువురము మధురాపురికి పోవుదుము గాక! అచటనే నేను నీకు ఈ విషయమును తెల్పుదును. గ్రామములు, రత్నములు, కోశము (ఖజానా) జనులను సంభాళించుట కొరకు పుత్రుని సింహాసనముపై అభిషిక్తుని చేయుట అవసరము. దేవీ! విద్యకు సమానమైన కన్ను ఏదియు లేదు. ధర్మమునకు సమానమైన బలమును ఉండదు. అనురాగమునకు సమానమైన దుఃఖము వేరేదియూ లేదు. త్యాగమును మించిన సుఖము మరేదియును లేదు. ప్రపంచమంతటిని సంగ్రహించిన వాని కోరిక కంటే త్యాగవంతుడైన పురుషుడు ఎల్లప్పుడు ఉత్తముడుగా పరిగణింపబడును."

అని రాజు యక్ష్మధనుడు ఈ విధముగా తన పత్ని పివరిని సముదాయించి తన జ్యేష్ఠపుత్రునికి రాజ్యాభిషేకము చేసెను. అంతేగాక అతడితో శ్రేష్ఠులైన మంత్రి మొదలగు సత్పురుషులు ఉండునట్లు వ్యవస్థను కల్పించెను. పిమ్మట ఆ పురవాసులైన ప్రజల నుండి వీడ్కోలు తీసికొని ఏనుగులు, గుఱ్ఱములు,కోశము (ధనము) తీసుకొని, కాలినడకన పోవు కొందరు పురుషులను తన వెంట చేర్చుకొని భార్యతో కూడుకొని వారిరువురు మధురకు బయలుదేరి చాలా రోజులు గడచిన తర్వాత మధురను చేరుకొనిరి. ఆ కాలమున మధురాపురి దేవతల ముఖ్యపట్టణమగు అమరావతి వలె ప్రసిద్ధికెక్కి ఉండెను. ద్వాదశ తీర్థముల చేత సంపన్నమైన ఆ పుణ్యనిలయమగు పట్టణము పాపులను నష్టపరచుటకొరకు తనను మనోహరముగా చేసుకొనినదా అనునట్లు ఉండెను. వసుంధరా! రాజు యక్ష్మధనుడు, పివరి మధురాపురిని దర్శించుట చేతనే వారి హృదయములు ప్రసన్నములైనవి. మరల ఆ రాణి వారు ఎందుకొరకు మధురకు వచ్చిరో ఆ విషయమును తన భర్తయగు రాజుకు గుర్తుచేసి, ఆ రహస్యమును తెలుపవలెనని అడిగెను. దీనిపై యక్ష్మధనుడు ముందు నీవు నీ రహస్యమైన విషయమును తెలుపుము. తర్వాత నేను తెల్పెదను అని పల్కెను.

పివరి ఇట్లు చెప్పెను. "పూర్వము నా నివాసము గంగాతీరమునందు కలదు. అచట కూడా నా పేరు పివరియే. ఒక పర్యాయము నేను కార్తీక ద్వాదశినాడు ఈ మధురాపురిని దర్శించుట కొరకు ఇచ్చటకు వచ్చితిని. అదే సమయమున నావ ద్వారా

యమునను దాటించు సమయమున అకస్మాత్తుగా నేను ధారాపతనము అను తీర్థము యొక్క లోతైన జలమునందు పడితిని. అందుచే నా ప్రాణములు పోయినవి. ఈ తీర్థము యొక్క ప్రభావము చేత నేను కాశీరాజు వద్ద జన్మించుటయు, అట్లే నీతో వివాహమగుటయు జరిగినది. సుందరియగు రాణి పివరి ఈ విధముగా చెప్పిన తర్వాత యక్ష్వధనుడు సంయమన తీర్థమునందు ఏ విధముగా తాను మృతుడైయ్యెనో మొదలైన కథనంతయు పివరికి వినిపించెను. అంతట వారిద్దరును మధురయందే ఉండుట ప్రారంభించి యమునయందు స్నానము చేయు నియమము ఏర్పరుచుకొనిరి. ప్రతిరోజు వారు నియమముతో నా దర్శనము చేసుకొనుచుండిరి. కొంతకాలము గడచిన తర్వాత అచటనే వారు శరీర త్యాగము చేసి అన్ని బంధనముల నుండి ముక్తులై నా లోకమునకు చేరు ప్రాప్తము కలుగువారు అయిరి, ఆ మధురా నగరమునందే మధువనము అను పేరు గల అత్యంత సుందరమైన స్థానము ఒకటి కలదు. అందు కుందవనము అను పేరుతో నా ప్రసిద్ధస్థానము కలదు. అచటికి వెళ్ళిన వెంటనే నరుడు సఫల మనోరథుడు అగును. అచటనే గల వనమునందు ముఖ్యముగా కామ్యకవనము కలదు. అందు స్నానము చేయుటచే మనుష్యుడు నా లోకమును చేరుకొనగలడు. ఇచట గల విమలకుండ తీర్థమునందు స్నానము చేయుటచే నరుల సంపూర్ణ పాపములు విడిచిపోవును. అంతేగాక ఎవరు అచట ప్రాణపరిత్యాగము చేయుదురో వారు నా లోకమునందు ప్రతిష్ఠితులగుదురు. ఒక వనము వకుళ వనము అని పిలువబడును. అచట స్నానము చేసిన మనుష్యుడు అగ్నిలోకమును పొందగలుగుచున్నాడు. యమునానదికి రెండవ ఒడ్డున భద్రవనము అను పేరు గల ఆరవ వనము కలదు. నా భక్తి పరాయణుడైన నరుడే అచ్చటికి పోగల్గును. అందుచే అతడికి నాగలోకప్రాప్తి కలుగుచున్నది. ఖదిరవనము అను పేరు గలది ఏడవదియగు వనము, ఎనిమిదవ వనము పేరు మహావనము. తొమ్మిదవ వనము పేరు లోహజంఘ వనము. ఎందుకన లోహజంఘుడే దీనిని రక్షింపగలడు. పదవ వనము పేరు బిల్వవనము. అచటికి పోయినప్రాణి బ్రహ్మలోకమున ప్రతిష్ఠను పొందును. పదకొండవ వనము పేరు భాండీరవనము. దాని దర్శన మాత్రము చేతనే మనుష్యుడు మాతాగర్భమున చొరలేడు. పన్నెండవది బృందావనము. ఆ వనమునకు అధిష్ఠాతి బృందాదేవి. దేవీ! సమస్త పాపములను సంహరించునది అగు ఈ స్థానమునకు నాకు చాలా ఇష్టమైనది.

బృందావనమునకు పోయి గోవిందుని దర్శనము చేసుకొనిన నరుడు యమపురియందు ఎన్నడునూ ప్రవేశింపడు. అతడికి పుణ్యాత్ములగు పురుషుల గతి సహజ సులభము అగుచున్నది.

యమునేశ్వర తీర్థము యొక్క ధారాపతనమునందు స్నానము చేసిన తర్వాత మనుష్యునికి స్వర్గములో కలుగు ఆనందము కలుగ గలదు. అచ్చట ప్రాణము త్యాగము చేయువాడు నా ధామమునకు పోగలడు. దీనికి ముందు నాగ తీర్థము, ఘంటాభరణ తీర్థము కలవు. దీనియందు స్నానము చేయు మనుష్యుడు సూర్యలోకమునకు పోవుచున్నాడు. వసుధా! ఇచ్చట సోమతీర్థమునకు చెందినది అగు పవిత్ర స్థానము కలదు. ద్వాపర యుగమునందు ఇచ్చటనే చంద్రుడు నా దర్శనము చేసుకొనుచుండెను. దీనికి అభిషేకము చేసిన మనుష్యుడు చంద్రలోకము నందు నివసించును. ఇచ్చట సరస్వతీ నదిపై నుంచి క్రిందకు దిగు పవిత్రస్థానము కలదు. అది సంపూర్ణ పాపములు హరించునట్టిది. మధురకు పశ్చిమముగా ఋషిగణములు నిరంతరము నా పూజ చేయుచుందురు. ప్రాచీన కాలమునందు సృష్టి సమయమున బ్రహ్మద్వారా మనస్సు చేతనే నిర్మింపబడిన కారణము చేత దీనికి మానసతీర్థము అని పేరు పెట్టబడినది. ఇచ్చట స్నానము చేయువారికి స్వర్గము లభించును.ఇచట శ్రీ గణేశ భగవానుని పుణ్యమయ తీర్థము కలదు. దాని ప్రభావము చేత పాపములన్నియూ దూరమై పోవును. ఇచ్చట చతుర్థి, అష్టమి, చతుర్దశి దినములందు స్నానము చేయుటచే శ్రీ గణేశుని ప్రభావము వలన మనుష్యుల ఎదలో దుఃఖము దగ్గరకు చేరుకొనదు. విద్యారంభము చేయబడుచున్నానూ లేక యజ్ఞము దానము మొదలగు క్రియలు సంపన్నము చేయబడుచున్ననూ అన్ని సమయములందు గౌరీనందనుడగు గణేశుడు, ధర్మకర్తయగు పురుషునికి సమస్త కార్యములు ఎల్లప్పుడు నిర్విఘ్నములుగా పూర్తి చేయించి ఇచ్చెదరు. ఇచటనుండి అర్ధకోశము దూరమున పరిమాణము నందు మహాదుష్కరమైన శివక్షేత్రము కలదు. అచట ఉండి శంకరభగవానుడు మధురాపురిని నిరంతరము రక్షించుచుండును. దాని జలమునందు స్నానము, ఆ జలము యొక్క పానము చేసి మనుష్యులు మధురావాస ఫలప్రాప్తి పొందుచున్నారు.

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. “దేవీ! ఇప్పుడు నేను మరియొక దుర్లభమైన అక్రూర తీర్థమును వర్ణించుచున్నాను. అయన (సూర్యుడు కర్కాటక రాశిలోనికి

వచ్చినప్పుడు దక్షిణాయనము అట్లే మకర రాశిలోనికి ప్రవేశించినప్పుడు ఉత్తరాయణము జరుగును. సూర్యుని ఈ షాణ్మాసిక కదలిక లేక స్థితిని అయనము అందురు), విషువత్ (రాత్రింబగళ్ళు సమానము ఎప్పుడు అగునో దానిని విష్ణుపది అందురు. ఇట్టి స్థితి మార్చి 15వ తేదీన, సెప్టెంబర్ 23వ తేదీన వచ్చును.) అట్లే విష్ణుపది (వృష, సింహ, వృశ్చిక కుంభరాశిలలో వచ్చు సూర్యసంక్రాంతిని విష్ణుపది అందురు) ల శుభసమయములందు నేను శ్రీకృష్ణస్వరూపముతో అచట ఉందును. ఇచ్చట సూర్యగ్రహణ సమయమునందు స్నానము చేయుటచే మనుష్యుడు రాజసూయము, అశ్వమేధయజ్ఞముల ఫలమును పొందగల్గును. ఇప్పుడు ఈ తీర్థము యొక్క అతి పురాతన ఇతిహాసమును చెప్పుదును వినుము. పూర్వము ఇచట సుధనుడు అను పేరుగల ధనవంతుడు భక్తుడైన వైశ్యుడు ఉండుచుండెను. అతడు భార్యాపుత్రులు తన బంధువులతో కలసి నిరతము నా ఉపాసన యందు గడుపుచుండెను. గంధ పుష్ప ధూప దీప నైవేద్యముల కొరకు నియమాను సారముగా నిత్యము నా(శ్రీహరి యొక్క) పూజ చేయుచుండెను. అతడు దాదాపు ఏకాదశికి ఈ అక్రూర తీర్థమునకు వచ్చి నా యెదుట నృత్యము చేయుచుండెను.

ఒకమారు అతడు రాత్రి జాగరణము, నృత్యము, అట్లే కీర్తనము మొదలగు చేయవలెనను ఉద్దేశ్యముచే నా వద్దకు వచ్చుచుండెను. ఆ సమయమున భయంకరుడైన ఒకానొక బ్రహ్మ రాక్షసుడు ఆతడి కాళ్ళు పట్టుకొనెను. ఆ బ్రహ్మరాక్షసుని ఆకృతి హెచ్చుగా భయపెట్టినది. వెంట్రుకలు పైకి నిక్కపొడుచుకొని ఉండెను. అతడు సుధనునితో ఇట్లు చెప్పెను. వైశ్యా! నేను నిన్ను భక్షించి తృప్తిపొందగలను. అని అనగా సుధనుడు ఇట్లు చెప్పెను. రాక్షసా! చాలును. నీవు కొద్దిసేపటి వరకు ప్రతీక్షించుచుండుము. నేను నీకు సంపూర్ణ భోజనమును పెట్టగలను. తర్వాత నీవు ఈ నా శరీరమును కూడా భక్షించెదవు. కానీ ఈ సమయమందు నేను దేవేశ్వరుడైన శ్రీహరి ఎదుట నృత్యము, రాత్రి జాగరణము చేయుటకు పోవుచున్నాను. నా ఈ వ్రతము పూర్తి చేసుకొని నేను ప్రాతఃకాలమున సూర్యుడు ఉదయింపగనే నీ వద్దకు తిరిగి రాగలను. అప్పుడు నీవు నా ఈ శరీరమును తప్పక భక్షింపుము. భగవంతుడగు నారాయణుని ప్రసన్నుడిని చేసుకొనుటకై పోవుచున్న నా ఈ వ్రతము భంగము చేయుట నీకు ఉచితము కాదు అనెను. ఆ మాటను వినిన బ్రహ్మరాక్షసుడు ఆదరపూర్వకముగా మధురమైన పలుకులుతో ఇట్లు పలికెను. "సాధూ!

నీవు అసత్యపు మాటలను ఏల మాట్లాడుచున్నావు. భళా! ప్రపంచములో రాక్షసుని నోటియందు పడవలసిన వానిని వదలి మరల స్వేచ్ఛగా అతడి వద్దకు తిరిగి రానిచ్చు మూర్ఖుడు ఎవరైననూ ఈ ప్రపంచంలో ఉండునా?" అని పల్కెను.

ఆ మాటలకు వైశ్యవరుడు "సంపూర్ణ ప్రపంచమునకు పునాదియేసత్యము. సత్యముపైననే అఖిల జగత్తు ప్రతిష్ఠింపబడినది. వేదములను కడముట్టు వరకు ఋషులు సత్యముయొక్క బలము వలననే సిద్ధి ప్రాప్తింపజేసి కొనుచున్నారు. ఒకవేళ పూర్వజన్మ కర్మవశమున నా జన్మము ధనికులైన వైశ్యకులమున జరిగినది. అయిననూ నేను నిర్దోషుడనే. బ్రహ్మరాక్షసుడా! ప్రతిజ్ఞా పూర్వకముగా చెప్పుచున్నాను వినుము. అచట భగవంతుని సన్నిధిలో జాగరణము, నృత్యము చేసి సుఖపూర్వకముగా నేను తప్పక తిరిగి వచ్చెదను. సత్యము వలననే కన్యాదానము జరుగుచున్నది. బ్రాహ్మణులు ఎల్లప్పుడు సత్యమునే పలుకుచున్నారు. సత్యము చేతనే రాజులు రాజ్యపరిపాలనను నడుపగల్గుచున్నారు. సత్యము వలననే ఈ పృథ్వి సురక్షితముగా ఉన్నది సత్యము చేతనే ప్రాణిస్వర్గమునకు సులభముగా చేరగల్గుచున్నది. అంతేగాక సత్యము చేతనే మోక్షము లభ్యమగుచున్నది. ఈ కారణముల చేత నేను నీ యెదుటకు తిరిగి రాని యెడల భూమి దానమిచ్చి తిరిగి దానిని అనుభవించుట చేత ఏ పాపము తగులునో ఆ పాపమునందు నేను భాగస్తుడను అగుదును. తరువాత క్రోధము లేక ద్వేషవశమున ఎవడు భార్యను వదలివేయునో వాని పాపము నాకు కలుగు గాక! ఒకవేళ నేను మరల నీ యెదుటకు రాని యెడల ఒకచోట కూర్చొని భోజనము చేయు వ్యక్తులయందు పంక్తి భేదము చేత ఏ పాపము తగులునో ఆ పాపము నాకు తగులు గాక! లేనియెడల నేను నీ వద్దకు మరల రాని యెడల ఒకమారు కన్యాదానము చేసి మరి రెండవది దానము చేయుట లేక బ్రాహ్మణ హత్య చేయుట లేక మధిరాపాన మొనర్చుట, దొంగతనము చేయుట, వ్రతభంగము చేసిన తర్వాత ఏ నీచగతి కలుగునో ఆ దుర్గతి నాకు కల్గును గాక!" అని చెప్పెను.

వరాహభగవానుడు ఇట్లు పల్కెను. దేవీ! సుధనుని మాటలును విని ఆ బ్రహ్మరాక్షసుడు సంతుష్టుడయ్యెను. అతడు "సోదరా! నీవు వందనీయుడవు. ఇప్పుడు నీవు కోరినట్లు యథేచ్ఛగా పొమ్ము అని అనుజ్ఞనిచ్చెను." అటుపిమ్మట ఆ కళామర్మజ్ఞులైన వైశ్యుడు నా యెదురుగా వచ్చి నృత్యగానములు చేయుచూ ప్రాతఃకాలమున "ఓం నమో

నారాయణ” అని ఉచ్చరించుచూ యమున యందు మునకలు వేసి స్నానము చేసెను. పిమ్మట మధురకు పోయి నా దివ్యరూపమును దర్శించెను. దేవీ! నేను ఆ సమయమున వేరొక రూపమును ధరించి అతడి ఎదుటనే ప్రత్యక్షమై ఇట్లు ప్రశ్నించితిని. “అయ్యా! నీవు ఇంత శీఘ్రముగా ఎచటికి పోవుచుంటివి?” అని అడుగగా సుధనుడు నేను నా ప్రతిజ్ఞను అనుసరించి బ్రహ్మరాక్షసునితో నీకు ఆహారముగా మరల వత్తునని ఇట్లు చెప్పితిని. నేను నా ప్రతిజ్ఞానుసారము బ్రహ్మరాక్షసుని వద్దకు పోవుచున్నాను అనెను. అప్పుడు నేను (విష్ణువు) అతడిని (సుధనుడు) అడ్డగించి ఇట్లు పల్కితిని. “పాపరహితుడా! నీవు అచటకు పోవుట మంచిది కాదు. బ్రతికి ఉన్న యెడలనే ధర్మానుష్ఠానము చేయుట సంభవము అగును”. అని చెప్పిన నా మాటలను విని వైశ్యుడు “మహాభాగా! నేను బ్రహ్మరాక్షసుని వద్దకు అవశ్యము పోవుదును. దాని వలన నా (సత్య) ప్రతిజ్ఞ సురక్షితముగా కాపాడినవాడను అగుదును. జగత్ప్రభుడైన విష్ణుభగవానుని నిమిత్తము రాత్రి జాగరణము, నృత్యము చేయుట నా వ్రతము. ఆ నియమము సుఖపూర్వకముగా పూర్తియైనది.” అని ఈ విధముగా పల్కి అతడు అచట నుంచి బయలుదేరిపోయి బ్రహ్మరాక్షసునితో ఇట్లు పల్కెను. “రాక్షసుడా! ఇప్పుడు నీవు నీ ఇచ్ఛానుసారము ఈ నా శరీరమును తిని ఆకలి తీర్చుకొనుము.”

ఇట్లు చెప్పగా బ్రహ్మరాక్షసుడు “వైశ్యవరా! నీవు వస్తుతః సత్యము, ధర్మములను పాటించు సాధుపురుషుడవు. నీకు శుభమగు గాక! నేను నీ నడవడిక చేత సంతుష్టుడనైతిని. ఇప్పుడు నీవు నాకు నృత్యము, జాగరణముల పూర్తి పుణ్యమునునాకు ఇచ్చి దయచూపుము. నీ ప్రభావము చేత నేను ఉద్ధరింపబడుదును గాక!” అనగా వైశ్యుడు “రాక్షసా! నేను నీకు రాత్రి జాగరణము నృత్యముల పుణ్యమునందు భాగమును ఈయ్యజాలను. అర్ధరాత్రి ఒక జాము లేక అరజాము పుణ్యమును కూడా నీకు ఇచ్చుటకు నేను సమర్ధుడను కాను” అనగా ఆ వైశ్యుని మాటలకు రాక్షసుడు ఒక నృత్యము యొక్క పుణ్యమును నాకు దయతో ఇమ్ము. అని అడిగెను. ఆ మాటలకు వైశ్యుడు “నేను నీకు పుణ్యమును గాని మరి ఏదియును గాని ఈయలేను. అయిననూ ఒక మాట చెప్పుచున్నాను. అందుకే నేను ఇచ్చటికి వచ్చితిని. నీవు ఏ కర్మ యొక్క దోషము చేత బ్రహ్మరాక్షసుడవు అయితివి? ఈ విషయము రహస్యము కాని యెడల నాకు తెల్పుమని” వైశ్యుడు అడిగెను. అప్పుడు బ్రహ్మరాక్షసుని ముఖముపై సంతోషము ఏర్పడినది. అతడు “వైశ్యవరా! నీవు ఇట్టి

మాటలు ఎందుకు చెప్పుచున్నావు. నేను నీకు దగ్గరగా ఉండువాడనే. నా పేరు అగ్నిదత్తుడు. నేను పూర్వజన్మము నందు వేదాభ్యాసుడనైన బ్రాహ్మణుడను. అయిననూ చౌర్యదోషము చేత నేను బ్రహ్మరాక్షసుడను కావలసి వచ్చినది. దైవయోగము చేత నీతో కలయిక కలిగినది. ఇప్పుడు నీవు నాకు ఉపకారము చేయు దయ చూపుము. వైశ్యవరా! నీవు ఒకే నృత్యము లేక గానముల యొక్క పుణ్యమును నాకు ఇమ్ము. అట్లైన నేను ఉద్ధరింపబడుదును." అని ప్రార్థించగా వైశ్యుడు "రాక్షసుడా! నేను ఒక నృత్య పుణ్యము యొక్క ఫలమును నీకు ఇచ్చితిని" అని పల్కెను అందుచేత ఆ నృత్యము చేసిన పుణ్యము యొక్క ఫలముచేత ఆతడికి వెంటనే ఉద్ధరణ జరిగినది. బ్రహ్మరాక్షసునికి ముక్తి లభ్యమైనది" వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! ఆ సమయముననే బ్రహ్మ రాక్షసుని స్థలములో శంఖచక్రగదా పద్మములు ధరించిన శ్రీహరి భగవానుడు ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున నా విష్ణురూపము (శ్రీవిష్ణు రూపము) శ్రీ విగ్రహము యొక్క కాంతి మహా దివ్యముగా ఉండును. భక్తుల కోర్కెలను తీర్చువాడనగు నేను (శ్రీ విష్ణు స్వరూపుడు) ఆ వైశ్యునితో మధురమగు మాటలచేత "ఇప్పుడు నీవు సపరివారముగా ఉత్తమ విమానము అధిరోహించి దివ్యమైన విష్ణులోకమునకు పొమ్ము." అంటిని.

"వసుంధరా! ఈ విధముగా తెల్పి నేను అచటనే అంతర్ధానుడనైతిని. సుధనుడు కూడా తన పరివార సహితముగా దివ్యమగు విమానము ద్వారా సశరీరముగా విష్ణులోకమునకు పోయెను. దేవీ! అక్రూర తీర్థము యొక్క ఈ మహిమ నేను నీకు తెలిపితిని. కార్తీక మాసము నందు శుక్ల పక్ష ద్వాదశి తిథినాడు ఈ తీర్థమున ఎవడు స్నానమాచరించునో అతనికి రాజసూయ యజ్ఞఫలము లభించును. ఇంకనూ అచట శ్రాద్ధము మొదలగు వృషోరము చేయు పురుషుడు తన కులము అంతనూ అట్లే ఉద్ధరించును." (153,154,155)

156, 157 వ అధ్యాయములు – బృందావనాది తీర్థముల మాహాత్మ్యము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. ధరణీ ఇప్పుడు నీకు మధురా మండలము యొక్క మరియొక పరమపుణ్యప్రదము, మహాపవిత్రము అయిన 'వత్సక్రీడనకము' అను పేరుగల మరియొక అతి పవిత్ర తీర్థ మాహాత్మ్యమును వర్ణించుచున్నాను. అచట ఎర్రరంగు గల అనేక విశాల శిలలు గలవు. ఒకమారు అచ్చట స్నానము చేసినంత మాత్రముననే

నరులకు వాయుదేవుని లోకము ప్రాప్తింపగలదు. ఆ ప్రదేశమున మరణించినంత ఆ వ్యక్తి నా లోకమునకు చేరుకొని గౌరవము పొందగలడు. వసుంధరే నేను అచ్చట గల మరియొక స్థలమును గురించి తెల్పుదును. అది ఇచటనే గల భాండీరక వనము అనునది. అది పవిత్ర తీర్థస్థలము. మద్ది, శాల, తాళ, తమాల, అర్జున, ఇంగుదీ, పీలుక, కీరీల అట్లే ఎఱ్ఱని పూలు గలిగిన అనేక వృక్షములు ఆ స్థలము యొక్క శోభను పెంచుచుండును. ఆ భాండీరక తీర్థమునందు తనమనసును, ఆహారమును నిగ్రహింపజేసికొని ఇచట స్నానము చేయుటచే మనుష్యునికి సంపూర్తిగా పాపములు నశించి ఇంద్రలోకప్రాప్తి పొందగలడు. ఈ ప్రదేశములో ప్రాణమును త్యజించిన నరుడు నాలోకమును చేరుకొనగలడు. లతలు, తీగలు మొదలగువానితో ఆచ్ఛాదితమై ఇచట గల రమణీయ బృందావనము దేవతలు దానవులకు సిద్ధులకు కూడా దుర్లభమైనట్టిది. ఆవులు, గోపాలుర వెంట ఇచ్చట నేను కృష్ణావతారము నందు ఆటలాడితిని. ఇచట ఒక రాత్రి నిద్రవాసము, ఉపవాసము చేసి కాళిందీనది యందు స్నానము చేసిన మనుష్యనకు గంధర్వ లోకప్రాప్తము కలిగి, అప్సరసలతో సుఖించు యోగము కలుగును. అంతేకాక ఆ తీర్థమున ప్రాణత్యాగము చేసిన మనుష్యుడు నా ధామమునకు చేరుకొనగలడు.

సుమధ్యమా! ఇచటనే పవిత్రమైన, సర్వపాపకనాశమగు మరియొక తీర్థము కేశి అనునది కలదు. బృందావనము యొక్క ఈ స్థానమునందు నేను కేశి అను రాక్షసిని సంహరించితిని. అది గంగానదికంటె నూరురెట్లు అధిక పవిత్రమైనది. అట్లే శ్రీహరి విశ్రమించిన అచ్చట గల ప్రదేశము కాశి నగరము తీర్థము కంటే వేయిరెట్లు అధిక మాహాత్మ్యము గలది. ఆ కేశి తీర్థమునందు పిండ ప్రదానము చేయుట చేత గయలో పితృవులకు పిండప్రదానము చేసినదానితో సమాన ఫలము లభ్యమగును. అంతేగాక ఇచట స్నానదానము, హవనములను చేయుటచే అగ్నిష్టోమ యజ్ఞఫలము లభించును. ఇచట ద్వాదశాదిత్య తీర్థము వద్ద యమున (నది) ప్రవహించుచుండును. ఇచ్చట కాళీయ సర్పము ఆనందముగా నివసించుచున్నది. ఇచటనే (కాళీయహ్రదము నందు) నేను దాని దమన కృత్యములను అణచి, భూమిపైకి రాగా చలిచేత బాధింపబడితిని. అంతట, ద్వాదశాదిత్యులు తమ ప్రకాశమును నా చుట్టును ప్రసరింపజేసిరి. నేను కాళీయుని గర్వమణచిన తర్వాత ద్వాదశ ఆదిత్యులును అచ్చట నెలకొనిరి. పిమ్మట నేను ద్వాదశ

ఆదిత్యులను వరము కోరుకొనుడనగా వారు "దేవాధి దేవా! నీవు మేము వరము కోరుకొను అర్హత గలవారమని భావించిన యెడల మాకు ఈ తీర్థమున స్నానము చేయగల్గు వరమును ప్రసాదింపుమని" కోరితిమి. వారి ఆ అభ్యర్థనను విని నేను "ఈ తీర్థము ద్వాదశ ఆదిత్య తీర్థము అని పేరుపొందగలదని" వరమునిచ్చితిని. ఈ తీర్థమునందు స్నానముచేయుట చేత మనుష్యుడు సంపూర్ణముగా సిద్ధించిన కోర్కెలు గలవాడై పాపములనుండి విముక్తుడు కాగలడు. అట్లే ఏ నరుడు మనోనిగ్రహము కలవాడై, ఆదివారమునాడు కానీ లేక సంక్రమణ కాలమునందైనను,స్నానమొనర్చిన యెడల ఆతడికి ఎట్టి కోరికయైనను సఫలము కాగలదు. అట్లు చేయలేకపోయిన యెడల మనస్సునందు ఆ విధముగా భావించినను కోర్కెలు సిద్ధించినవాడగును. అట్లే ఏ వ్యక్తి ఇచ్చట ప్రాణ పరిత్యాగము చేయునో అతడు నా ధామమున ప్రవేశించగలడు. సూర్య తీర్థము లేక ఆదిత్య తీర్థమున స్నానము చేసి అచ్చట గల ద్వాదశ ఆదిత్య మందిరమును దర్శించిన నరుడు ఆదిత్య లోకమునకు చేరుకొనును. అచ్చట ప్రాణము పోయినవాడు నా లోకమునకు చేరుకొనును. ఈ స్థానము యొక్క పేరు హరిదేవ క్షేత్రము, కాళీయ హ్రదము అని పిలువబడుచున్నది. ఈ హరిదేవ క్షేత్రమునకు ఉత్తరమున, కాళీయ ప్రదము యొక్క దక్షిణ భాగమునందు ఎవడు తన పాంచభౌతికమైన శరీరమును వదలివేయునో అతనికి ఈ ప్రపంచమున పునరావృత్తి జన్మము కలుగదు. బృందావనము యొక్క పేరు గ్రీకు గ్రంథములలో కలికావర్తము, అనగా కాళీయ నాగస్థానము అని చెప్పబడినది. ఈ బృందావనము యొక్క అధిక వర్ణనకు భాగవతము, పద్మపురాణము రఘువంశము మొదలగు గ్రంథములలో చూడవచ్చును.

శ్రీ వరాహభగవానుడు ఇట్లు చెప్పెను: దేవీ! యమున యొక్క ఆవలి తటముపై యమలార్జకము అను పేరు గల తీర్థము కలదు.అచ్చట నా చేత శ్రీకృష్ణావతార సమయమున శకటము (పెద్ద పెద్ద భాండములచే నింపబడిన బండి) భిన్నము చేయబడినది. అంతేగాక భాండములు అన్నియూ ఛిన్నాభిన్నములై పోయినవి. అచట స్నానఉపవాసములు చేయుటచే కలుగు ఫలము అనంతము.

వసుంధరా! జ్యేష్ఠమాసము యొక్క శుక్లపక్ష ద్వాదశీ తిథినాడు ఆ తీర్థమందు స్నానము, దానములు చేయుటచేత మహాపాతకుడైన నరునకు కూడా పరమగతి ప్రాప్తించును. ఇంద్రియ నిగ్రహము గల మనుష్యుడు యమునా జలమున స్నానము చేసి

మధురయందలి శ్రీహరిని దర్శించిన పవిత్రుడగును. అంతేగాక సమ్యక్ ప్రకారముగా అచ్యుతుడగు శ్రీహరిని అర్చించిన వాడు పరమగతి ప్రాప్తము కలుగజేసుకొనును. దేవీ! స్వర్గమునకు పోయిన పితృగణములు "మా వంశమునందు జన్మించిన ఏ పురుషుడు మధురయందు నివాసముండి,కాళింది యందు స్నానము చేయునో, భగవంతుడు గోవిందుని పూజించునో అట్లే జ్యేష్ఠమాస శుక్లపక్షము ద్వాదశీ తిథి సమయమునందు యమునానది ఒడ్డున పిండదానము చేయునో అతడు పరమ కళ్యాణ సుఖజకుడు అగును." అని పితృదేవతలు ఎదురుచూచుచుందురు. బృందావనము సమీపమునందు ప్రదక్షిణము చేయుచు, అచ్చటనే ఉండి, ఒకరాత్రి జాగరణము చేసి గోవిందుని స్మరించు చుండిన నరుడు తనకు గల కోర్కెలన్నింటిని తీర్చుకొనును.

పృథ్వీ! మధురా తీర్థము మహా పవిత్రమైనది. అనేక పేర్లు గల తీర్థములు ఆ వనము యొక్క శోభను పెంపొందునట్లు చేయుదురు. అచ్చట గల అరణ్యములో బహుళ అను పేరుగల తీర్థము కలదు. ఆ తీర్థమునందు స్నానమాచరించినవాడు రుద్ర భగవానుని లోకమునందు ప్రతిష్ఠ కలిగిన వాడగును. చైత్రమాసము యొక్క శుక్ల పక్ష ద్వాదశీ తిథి పుణ్యసమయము నందు అచ్చట స్నానము చేయు మానవుడు నిశ్చయముగా నా లోకమునకు పోవును. యమున రెండవ తీరమునందు 'భాండహ్రదము' అను పేరు గల ప్రసిద్ధికెక్కిన పలువురకు దుర్లభమైన ఒక తీర్థముకలదు. అచ్చట దివ్యులకు ఆదిత్యులు ప్రత్యక్షమగుచుందురు. ఈ ప్రపంచమందలి అలౌకిక కార్యములను సుసంపన్నము చేయు ఆ దివ్య గణములు అచట ప్రతిదినము కనిపించుచుందురు. అచట స్నానము చేసిన నరుడు పాపముల నుండి సంపూర్ణముగా ముక్తుడై సూర్యలోకమునకు చేరగలును. ఒకవేళ అచ్చట మరణించినా నా లోకమునకు చేరుకొనగల్గును. ఆదిత్యులు వసించు ప్రదేశ సమీపముననే స్వచ్ఛమైన నీటిచే నిండియుండు సప్తసాముద్రకము అను పేరు గల ఒక కూపము కలదు. అచట స్నానము చేయుటచే మానవులు అన్ని లోకములు యందును స్వచ్ఛందముగా విహరింపగల్గుదురు. అచటనే 'వీరస్థలము' అను పేరుతో నా ఇంకొక పరమ గుహ్యక్షేత్రము కలదు. అచ్చట నిరంతరము వికసించి యుండు కమలములు, ఉత్పలములు జలముల యొక్క శోభను నిరంతరము అధికము చేయుచుండును. సుమధ్యమా! ఒక రోజు రాత్రి ఇచట నివాసము ఉండి, స్నానమాచరించిన మనుష్యుడు నా కృపచేత వీరలోకమందు

చేరుకొని అచ్చట కూడా ఆదరము పొందును. ఆ స్థల సమీపముననే కుశస్థలము అను పేరు గల సర్వపాపహరమగు మరియొక తీర్థము కలదు. అచ్చట యధావిధిగ స్నానమాచరించిన నరుడు బ్రహ్మ లోకమునకు చేరుకొనును. అచ్చట మరణించినట్లైన నా లోకమును చేరుకొనగల్గును. దానికి సమీపమున పుష్పస్థలమను మరియొక తీర్థము ఉన్నది. దానియందు స్నానమాచరించిన నరుడు శివలోకమునకు చేరుకొనును.

ఈ మధురా మండలమునందు గోపీశ్వరము అను పేరుతో విఖ్యాతమైన తీర్థము కలదు. అచ్చట పదునారువేల గోపికలు అందమైన రూపములను ధరించి శ్రీకృష్ణ భగవానుని ఆనంద పరవశులను చేయుటకై జన్మించి, నృత్యము చేయుచు ఉండగా నేను శ్రీకృష్ణ రూపముతో వారితో రాసలీలను చేసితిని. అట్లే నేను శ్రీకృష్ణుడనై బాల్యమునంద యమలార్జునులు అను పేరుగల రెండు వృక్షములను శకటమును, కుటీరమును, కుంభములను కూడా విరగతన్నితిని. ఇచ్చటనే గోవిందుడు గోపికలతో ఆటలాడి, వారికి కనిపించి, అదృశ్యమై తన లీలలను చూపెను. ఇచ్చట ఇంద్రుని సారథి మాతలి దేవతల ప్రార్ధన మన్నించి, గోపబాలకుని వేషములో గల శ్రీకృష్ణునికి ఒక కూపము వద్ద రత్నములు, నిండి జలపూర్ణములైన కలశముల చేత అభిషేకము చేసిరి, మాతలి దేవదేవుని అభిషేకించుచుండగా, శ్రీకృష్ణునితో గల గోపభామినులు కృష్ణా! కృష్ణా! అనుచు ఆయన చుట్టును నాట్యమాడిరి. అప్పుడే మాతలి ఆ స్థలములో గోపీశ్వరుడను పేరుతో శ్రీకృష్ణుని ప్రతిష్ఠించెను. అంతేగాక అచ్చటనొక బావిని త్రవ్వించి, అందు సప్తసముద్రముల జలమును పవిత్రములగు భాండములలో తెప్పించి నింపించెను. అప్పటినుండి ఈ కూపము యొక్క పేరు 'సప్త సాముద్రిక కూపము' అయ్యెను. ఈ సప్తసాముద్రిక కూపము వద్దకు పోయి పితరులకు ఎవడు శ్రాద్ధము పెట్టునో ఆ నరుడు తన కులములోని డెబ్బదియైదు తరముల వారిని సర్వ పీడలనుంచి ఉద్ధరింపగల్గును. సోమవతీ అమావాస్య అనగా అమావాస్య తిథిగల సోమవారము రోజు అచట పిండప్రదానము చేయువాని పితరులు కోటి సంవత్సరముల వరకు తృప్తి చెందిన వారగుదురు. వారికి గండోపిండ సదృశఫలము లభించును. ఇచ్చట గోవింద తీర్థము, గోపీశ్వర తీర్థముల మధ్య గల రపదేశమున మరణించిన వ్యక్తి ఇంద్ర లోకము చేరుకొనును. రుద్ర తీర్థము, గోవింద తీర్థమును, బ్రహ్మ గోపీశ్వర తీర్థములకు మధ్య మరణించినవాడును అదే ఫలము అనుభవించగలడు.

అంతేగాక అచ్చట, స్నానదానములు ఆచరించినవాడు తనకు పదితరముల ముందువారిని, పదితరముల తరువాత వారిని ఉద్ధరింపగలడు. వసుంధరా! ఇచట 'వత్స్యపుత్రక' అను పేరుతో ప్రసిద్ధికెక్కిన ఒక తీర్థము కలదు. అది నా పరమ పవిత్రమైన, అట్లే ఉత్తమమైన స్థానము. మధుర యొక్క దక్షిణ భాగమునందు 'పాల్గుణక' అను పేరుగల తీర్థము కలదు. దాని జలమును త్రాగిన, ఆ జలమునందు స్నానమొనరించిన నరుడు వీరులు చేరుకొను స్థానమునకు పోగలడు. ఫాల్గుణకము గల ప్రదేశమునందే వృషభాంజనకమను ప్రదేశము కలదు. అచ్చట జలకమాడిన జనుడు దేవతలతో కూడి సుఖించెను. ఆ స్థలమునకు దాదాపు సగము యోజనముల దూరమున, పశ్చిమ దిశలో ధేనుకాసురుని 'తాళవనము' అను పేరు గల ప్రసిద్ధ స్థానము కలదు. అది ధేనుకాసురునిచే రక్షితమైన స్థలము. ఇచ్చటను పవిత్రమగు తీర్థము కలదు. విశాలాక్షీ! ఇచ్చట 'సంపీఠక కుండము' అను పేరుతో శ్రేష్ఠమైన నా తీర్థము మరి ఒకటి కలదు. ఆ కుండము నిరంతరము పవిత్రము, స్వచ్ఛమైన జలముచేత నిండి ఉండును. ఒకరోజు రాత్రి ఇచ్చట నివాసము ఉండి స్నానము చేసిన నరులకు అగ్నిష్టోమ యజ్ఞఫలము లభ్యమగును. ఇందు ఆవంతయు సందేహము లేదు.

పద్మముఖీ! కృష్ణావతారమునందు దేవకీవసుదేవుల గర్భమునందు జనించిన నేను గొప్ప పవిత్ర భావముతో సూర్యదేవుని కుమారుని కొరకై ఆరాధించి ఉంటిని. దానిచేత నాకు రూపవంతుడు, గుణవంతుడు, జ్ఞాని అయిన పుత్రుడు (సాంబుడు) జన్మించెను. ఇచట ఆరాధనా సమయమునందు నాకు హస్తమునందు కమలమును ఉంచుకొని సూర్యభగవానుడు దర్శనము కల్గించెను. దేవీ! అప్పటినుంచి భాద్రపద మాస కృష్ణపక్ష సప్తమీ తిథిని తీవ్రతేజముగల వాడగు సూర్యుడు అచట నిరంతరము విరాజిల్లుచుండును. ఆ కుండము నందుసావధానచిత్తులై స్నానము చేయు నరునికి ప్రపంచమునందు దుర్లభమైన వస్తువు ఉండదు. ఎందుకనగా సూర్యుడు సంపూర్ణ సంపత్తులకు దాత అయిన వాడు. దేవీ! ఆదివారము నాడు సప్తమీ తిథి రాగానే ఆ శుభ సమయమునందు స్నానము చేయు పురుషుడైననూ,స్త్రీ అయిననూ,లభ్యమగు ఫలమును సమగ్రముగా ప్రాప్తింపజేసు కొందురు. ప్రాచీన కాలమునందు శంతన మహారాజు తపస్సు చేసి భీష్ముడు అను పేరు గల పరమ పరాక్రమవంతుడైన పుత్రుని పొందెను. అట్లే ఆయనను తీసుకొని వారు

హస్తినాపురమునకు ప్రయాణమైపోయిరి. అందుచేతనే అచ్చట స్నానదానములు చేయుటచే నిశ్చయముగా మనోభిలాషిత ఫలమును పొందుచున్నారు. (156,157)

158,159,160 వ అధ్యాయములు - మధురా తీర్థ ప్రాదుర్భావము, ప్రదక్షిణ విధి, మాహాత్మ్యము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా!నా మధురా క్షేత్రము యొక్క హద్దు ఇరువదియోజనముల మేరలో కలదు. (మధురా మాహాత్మ్యము ప్రస్తుత వరాహ పురాణమునందే కాక నారద, పద్మ, స్కాంద పురాణములలో కూడా కలదు.) ఇది సప్త మోక్షపురులలో ఒకటి. దీని ప్రాచీన నామము మధుర, మధుపురి, మహోలి. ఇచ్చట దాని క్షేత్ర సరిహద్దు ఇరవై యోజనములుగా చెప్పబడినది. ఇచట మందిరములు, వనములు విస్తృతముగా ఉన్నవి. అచ్చట ఎక్కడైనను స్నానము చేసిన లేక మరణించిన మానవుడు సంపూర్ణ పాపములనుంచి విడివడును. వర్షఋతువునందు మధురయొక్క చుట్టుప్రక్కల గల ఏ స్థలమునందైనను నా భక్తులకు అత్యానందప్రదముగా ఉండును. హరి–సుషుప్తి (హరిశయనము) తర్వాత నాలుగు నెలలకు సప్తద్వీపములందు పుణ్యమయమైన తీర్థములన్నియు, పుణ్యస్థలములుగా మధురకే వచ్చి చేరును. నా దేవోత్థాన సమయమునకు, నేను మేల్కొనిన తర్వాత, మధురయందు నన్ను దర్శించిన నేను నిరతము ఉందును. ఇందు ఎట్టి సందేహము లేదు. పృథ్వీ! ఆ సమయమున నా ముఖపద్మమును చూచిన మనుష్యులు ఏడుజన్మలలో చేసిన పాపము నుండి తక్షణమే ముక్తులు కాగలరు. అందుచే మధురయందు నివసించు జనులందరును ముక్తి పొందిన వారే అగుదురు. మధురయందు ప్రవేశించి కాళింది (యమున)నదియందు స్నానమాచరించి నిరతము నన్ను తలచుకొనిన వాడు రాజసూయ, అశ్వమేధ యాగములు చేసిన ఫలమును పొందును. అంతేగాక నా విగ్రహమునకు ప్రదక్షిణము చేసినవాడు ఏడు దీపములలో గల పృథ్వి యొక్క ప్రదక్షిణము చేసినట్లు అగును. ఇంకను ఒక వస్త్రముతో పత్తిని చేసి, నేతితో నింపిన పాత్రయందు దానిని ఉంచి, ఆ వత్తిని వెలిగించి భగవంతుని సన్నిధిలో ఆ దీపమును ఉంచిన వ్యక్తికి అంత్య సమయమున ఐదు యోజనముల పొడవు, ఐదు యోజనముల వెడల్పు గల్గి పూర్తిగా దీపములతో అలంకరింపబడిన విమానము అందులో గల అప్సరసలు స్వాగతము పల్కుచుండగా, దేవ, గంధర్వ, యక్ష, సిద్ధ, నాగ

వైతాళికులతో స్వాగతింతురు. కాలాంతరమున అతడి పుణ్యము క్షీణించిన పిదప సంపద గల ద్విజ కుటుంబమున జన్మించెదరు."

అంతట ధరణి ఇట్లు ప్రశ్నించినది. "భగవాన్! ఒకవేళ అన్ని తీర్థ క్షేత్రములు పశువులు, భూత పిశాచములు నాయకుడు లేకుండా ఈ ఉపద్రవములు కల్గించు ప్రాణుల నుంచి బాధితులు అయి ఉండవచ్చును. అయిననూ ఇచట మధురాపురి ఏ దేవుని చేత సురక్షితముగా ఉండి అనంత ఫల ప్రదానము చేయుటయందు సమర్ధముగా ఉండును?" వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "దేవీ! పృథ్వీ! నా ప్రభావము చేత విఘ్నకారులగు శక్తులు నా ఈ క్షేత్రమునందు, భక్తులపై ఎన్నడునూ దృష్టి సారించలేరు. వానియందు గల నా భక్తులైన వారికి ఎట్టి కీడును కలిగించజాలరు. వాని రక్షణ కొరకై నేను పదిమంది దిక్పాలకులు, నలుగురు లోకపాలకులను నియమించి ఉంచితిని. వారు నిరంతరము ఈ పురము యొక్క రక్షణయందు తత్పరులై ఉందురు. దీనిని పూర్వదిశయందు ఇంద్రుడు దక్షిణ దిశయందు యముడు పశ్చిమమున వరుణుడు ఉత్తరమున కుబేరుడు అట్లే మధ్యభాగములో ఉమాపతియగు మహాదేవుడు రక్షించుచుందురు. ఏ నరుడు మధుర యందు ఇంటిని నిర్మింపచేసికొనునో, అట్టి జీవన్ముకుడగు పురుషుడు, నిరంతరము అచ్చట వసించు చతుర్బాహుడగు విష్ణువు యొక్క రూపము అని తెలిసికొనవలెను.

ఇచట గల నిర్మలమైన జలము కల్గిన 'మధురాకుండము' అను ఒక జలాశయమును గూర్చి ఆశ్చర్యపరచెడి విషయమును చెప్పుచున్నాను వినుము. దీని జలములు హేమంతఋతువునందు నా మహాత్యము చేత వేడిగా ఉండును. గ్రీష్మ ఋతువునందు మంచువలె చల్లగా ఉండును. అంతేగాక వర్శఋతువునందు ఇచట నీరు ఎక్కువ కాదు. గ్రీష్మ ఋతువు నందు ఎండిపోదు. మధురయందు అడుగడుగునకు తీర్థములు ఉండును. వీనియందు స్నానము చేసిన మనుష్యుడు సమస్త పాపములు నశించినవాడు అగును. అచ్చట మరణించిన యెడల, విష్ణులోకమున ప్రవేశించి, సకల ఆనందములను పొందగల్గును.

'ముచుకుంద తీర్థము' అను పేరు గల నా మహిమా ప్రభావము గల దివ్యక్షేత్రము కలదు. అచట దేవాసుర సంగ్రామమైన పిదప ముచుకుంద మహారాజు నిద్రించెను. అచట స్నానము చేయువారికి అభీష్టఫలప్రాప్తి కలుగును. అట్లే వారి

అదృష్టవశముచే అచ్చట మరణించువారికి నా లోకప్రాప్తి కలుగును. ఆ ప్రదేశమున సర్వం సహా భగవంతుడగు కేశవుని నామమును సంకీర్తనము చేయుట చేత, ఈ జన్మలో చేసిన పాపములే కాక పూర్వజన్మమున చేసిన పాపములు కూడా ఆ క్షణమునందే నష్టపరచు శక్తి కలిగినది. అనేక నామములను పలుమార్లు ఉచ్చరించినంత మాత్రమున కారణముచే కార్తీక శుక్ల అక్షయ నవమినాడు భగవన్నామ కీర్తన చేయుచూ మధుర నగర ప్రదక్షిణము చేయుట చేత మనుష్యుడు సర్వపాపముక్తుడు అగును. దీనికి పద్ధతి కలదు. కార్తీక శుక్ల అష్టమి నాటికి మధురా నగరమునకు పోయి బ్రహ్మచర్యమును పాటించుచూ నివాసము ఉండి, "ఈ రాత్రియందు ప్రదక్షిణము చేయుదును", అని సంకల్పము చేసికొనవలయును. ప్రాతఃకాలమునందు దంతధావనాదులు చేసుకొని స్నానము ముగించి, ధౌత వస్త్రములను ధరించి పిమ్మట మౌనియై దీని ప్రదక్షిణము ప్రారంభం చేయవలెను. ఇందుచే మనుష్యుడు చేసిన పాపములన్నియూ నశించి పోవును. ప్రదక్షిణముచేయు సమయమునందు మనుష్యునికి ఎవరైననూ మరొకవ్యక్తి తగిలిన యెడల అతడి మనోరథములు కూడా పూర్తి అగును. ఇందు కించిత్తును ఆలోచించవలసిన ఆవశ్యకత లేదు. ప్రదక్షిణము చేసిన తర్వాత లభ్యమగు పుణ్యము మధుర యందు పోయి స్వయముగా ప్రతిష్టించుకొనగలిగిన శ్రీహరి యొక్క దర్శనము చేత సులభము అగును.

భూమి యొక్క ప్రదక్షిణ గణనము కూడా యోజనములతో ప్రమాణముగా ఇవ్వబడినది. పృథ్వియందు నెలకొనిన అరవై వేల కోట్లు, అరవై వందలకోట్ల తీర్థములు కలవు. దేవతలు, ఆకాశము నందుండు తారాగణముల సంఖ్య కూడా ఇంతే ఉండును. ఈ గణనము ప్రపంచమునకు ఆయు స్వరూపులైన వాయు, బ్రహ్మ, లోమశుడు నారదుడు, ధృవుడు జాంబవంతుడు, బలి, హనుమంతుడును చేసినట్టిది. వీరందరూ వన, పర్వత సముద్రసహిత ఈ భూమి యొక్క బయటిరేఖనుంచి అనేక మార్లు ప్రదక్షిణము చేసి ఉండిన వారే సుగ్రీవుడు, పంచపాండవులును మార్కండేయ ప్రభృతి. కొందరు యోగసిద్ధులైన వారును భూమికి లోపల భ్రమణము చేయుచూ తీర్థములను లెక్కించిరి. కానీ ఇతరులు కొద్దిపాటి ఓజోబలమును, కొద్ది బుద్ధి బలమును కలవారు. వారు మనస్సునందు కూడా నీటి అన్నింటి పరిభ్రమణము చేయుటయందు అసమర్థులు. ఇక ప్రత్యక్షముగా గమనమును చేయుటను గూర్చి చెప్పవలసినది ఏమి? అయిననూ ఈ సప్త ద్వీపములు,

తీర్థములయందు భ్రమించుట చేత కలుగు పుణ్యమున కంటే అధిక ఫలము మధుర యొక్క ప్రదక్షిణము వలన లభ్యమగును. మధుర యొక్క ప్రదక్షిణము చేయువారు సప్తద్వీపములు గల పృధ్వియొక్క ప్రదక్షిణము చేసినవారే అగుచున్నారు. కోరికలన్నింటిని కోరుకొను మనుష్యులు అన్ని విధముల ప్రయత్నము చేసి, మథురకు పోయి అచట విధి పూర్వకముగా ప్రదక్షిణము చేయవలెను. ఒకమారు సప్తఋషులకు బ్రహ్మ ఇట్లు చెప్పెను. "సమస్త వేదముల అధ్యయనము, అన్ని తీర్థముల స్నానము, అనేక విధములైన దానము, యజ్ఞయాగాదులను చేయుట ఇంకనూ బావులు, సరస్సులు,ధర్మశాలలు నిర్మింప జేయుటచేత లభ్యమగు పుణ్యము, వాని వలన లభ్యమగు ఫలమునకు మధురా ప్రదక్షిణము చేత వందరెట్లు అధిక ఫలము కలుగును. బ్రహ్మ ఈ విషయమును విని సప్తర్షులు ఆయనకు ప్రణామము చేసి, అచ్చట నుండి మధురను చేరుకొని అక్కడ ఆశ్రమ నిర్మాణము చేసికొనిరి. ఆయనతో పాటు ధృవుడు కూడా కలదు. పిమ్మట వారందరును తమ కామనలను ఫలవంతములగుటకు, కార్తీక మాస శుక్ల పక్ష నవమి తిథినాటికి మధురానగరమునకు విధి ప్రకారము ప్రదక్షిణము చేసిరి. ఇందుచేత వారందరునూ ముక్తులు అయిరి.

వరాహ విష్ణు భగవానుడు ఇట్లు చెప్పెను. విశ్వంభరా! కార్తీక మాసము యొక్క శుక్ల పక్ష అష్టమి తిథి వ్రతము చేయవలయుననుకొను సాధకుడు మధురకు చేరుకొని విశ్రాంతి తీర్థమునందు స్నానము చేసి, దేవతలకును అట్లే పితరులకు అర్చించుటయందు లగ్నము వారు కావలెను. పిమ్మట విశ్రాంతికి దర్శనము చేసికొనిన తర్వాత, దీర్ఘ విష్ణుని భగవంతుడు అగు కేశవదేవుని యొక్క దర్శనము చేసుకొనవలయును. ఆ రాత్రికి బ్రహ్మచర్య పూర్వక ఉపవాసము లేక అల్పాహారమును తీసుకొనవలెను. అట్లే అంతఃకరణమును శుద్ధిపరచుకొనుట కొరకు సాయంకాలము కూడా దంతధావనము చేసుకొనవలెను. పిమ్మట స్నానము చేసి ధౌత వస్త్రములను ధరించి మౌనవ్రతమును పాటించి చేతియందు తిలలు, బియ్యము, కుశ (దర్భ)లను తీసికొని పితరులను, దేవతలను పూజింపవలెను.

పిమ్మట నవమినాడు ప్రాతఃకాలము బ్రాహ్మీముహూర్తమునందు సంయమ పూర్వకముగా పవిత్రుడై సూర్యోదయము కాకముందే ప్రదక్షిణముకొరకు యాత్రకార్యమును

ఆరంభము చేయవలెను. ప్రాతఃకాల స్నానము 'దక్షిణ కోటి' అను పేరు గల తీరము నందు చేయుట విధి అగును. ముందుగా రెండు పాదములను కడుగుకొని, ఆచమనము చేసి మంగళ స్వరూపములు కలవాడు, బాలబ్రహ్మచారి అగు, హనుమంతుని ప్రసన్నుని చేసుకొనుటకు ఉద్యుక్తులు కావలెను. ఆ హనుమంతుని స్మరణ చేతనే సమస్త ఉపద్రవములు శాంతములు అగును. మరల భగవంతుని "భగవానుడా! నీవు ఏ విధముగా శ్రీరామచంద్రునికి యాత్రయందు సిద్ధిప్రదానము చేసి ఉంటివో, అదే విధముగా నా ఈ ప్రదక్షిణ యాత్ర సఫలమగునట్లు దయ చూపుము" అని ప్రార్థింపవలెను. ఇంతేగాక పిమ్మట గణేశ్వరుడు, విష్ణుభగవానుడు, హనుమానుడు మొదలగు కార్తికేయుని విధిపూర్వకముగా ఫల, మాల, దీపములు మొదలైనవాని చేత పూజ చేసి, యాత్రారంభము చేయవలెను. యాత్రయందు వసుమతి దేవి యొక్క దర్శనము చాలా ముఖ్యమైనది. అచటనే రాజులు ఆయుధములు నిక్షిప్తము చేయు స్థానమునందు సంపూర్తిగా భయమును పారద్రోలు భగవతీ అపరాజిత యొక్క దర్శనము చేయవలెను. దేవి కంసవాసనికా, ఔగ్రసేనాచర్చికా వంటి వధూటిదేవుల దర్శనము చేయవలెను. ఈ దేవులు దానవులకు పరాజయమును, దేవతలకు విజయము ప్రదానము చేయునట్టివారు. మరల దేవతలచేత సుపూజితురాలైన అష్టమాతలు, గృహదేవులు, వాస్తుదేవుల దర్శనము చేసుకొని పిమ్మట వారి నుండి అనుజ్ఞపొంది యాత్రను ఆరంభింపవలెను. ప్రదక్షిణమునందు దక్షిణ కోటి తీర్థము లభ్యమగునంత వరకును మౌనముగా ఉండి యాత్రను చేయవలెను.

పిమ్మట దక్షిణకోటి తీర్థమునందు స్నానము, పితృ తర్పణము దేవ దర్శనము చేసికొని ప్రణామము చేసి భగవంతుడగు శ్రీకృష్ణుని చేత పూజింపబడిన భగవతి 'ఇక్షువాస' కు నమస్కరింపవలెను. అటు తర్వాత వాసపుత్ర, అర్కస్థల, వీరస్థల, కుశస్థల, పుణ్యస్థలములు అను గొప్ప పాపములను నశింపజేయు మహాస్థలములకు పోవలెను. ఈ తీర్థములన్నియూ సంపూర్ణ పాపములను దూరముగా పారద్రోలును. తర్వాత హయముక్తి, సింధూర, సహాయకము అను పేరుగల ప్రసిద్ధ స్థానములకు పోవలెను. ఈ విషయములను గురించి ఋషుల చేత చెప్పబడిన ఒక ప్రాచీన గాథ వినవచ్చుచున్నది. ఒకానొక కాలములో ఒకానొక రాజకుమారుడు గుఱ్ఱముపై నెక్కి సుఖముగా మధురానగర ప్రదక్షిణము చేయుచూ, ఉండెను. కాని మార్గమధ్యముననే సేవకులతో కూడిన గుఱ్ఱము

మృత్యువు పాలైనది. అది మధురా ప్రదక్షిణము చేయుచు మరణించుటచే శీఘ్రముగా ఉత్తమ లోకప్రాప్తి చెందినది. అయిననూ ఆ రాజకుమారుడు మాత్రమే ఈ లోకమునందే ఉండెను. ఆ కారణము చేతనే, ఎవరికి శ్రేష్ఠమైన ఫలము పొందవలెనను కోరిక ఉందునో వారు గుఱ్ఱమునెక్కి మధురకు ఎన్నడునూ ప్రదక్షిణము చేయరాదు. ఎందుకనగా అట్లు చేసిన యెడల ముక్తి కలుగదు.

ఇప్పుడు చెప్పిన ఆ హయముక్తి తీర్థము యొక్క దర్శనము, స్పర్శనము చేయుటచే పాపములనుండి ముక్తి లభ్యమగును. ఆ ప్రదక్షిణ మార్గ మధ్యన 'శివకుండము' అను పేరుతో ప్రసిద్ధమైన ఒక గొప్ప తీర్థము కలదు. విజయము కావలెననుకొనువారలకు నీ కృష్ణ భగవానుని, మల్లికాదేవిని కూడా దర్శనము చేసుకొనవలెను. అంతేగాక 'కదంబఖండము' యొక్క యాత్ర చేసి, సపరివారముగా 'చర్చిక' అను యోగినిని దర్శించవలెను. పిమ్మట పాపములను హరించు 'వర్షఖాతము' అను పేరు గల శ్రేష్ఠమైన కుండమునకు పోయి, స్నానము తర్పణము చేసికొనవలెను. దేవీ! వసుమతి! ఇచ్చట భూతములకు ప్రభువైన మహాదేవుని దివ్యవిగ్రహము కలదు. దానిముందు 'కృష్ణ క్రీడా సేతుబంధము' అట్లే 'బలిహరణము' అను కుండములు గలవు. అవి శ్రీకృష్ణుడు జలవిహారము చేసిన కుండములు. వాని దర్శన మాత్రము చేతనే మనుష్యుడు సర్వ పాపముల నుండి ముక్తిని పొందును. వీని తర్వాత కొద్ది దూరమున సుగంధము చేత సువాసితమగు 'స్తంభోచ్చ్యము' అను పేరు గల శిఖరము ఉన్నది. దీనిని శ్రీకృష్ణ భగవానుడు అలంకరించి, పూజించెను. ఈ ప్రయత్నములోనే ఆ శిఖరమునకు ప్రదక్షిణము, పూజలను కూడా చేయవలెను. దీని చేత అన్ని ప్రాణులు పాపములు నుండి విముక్తములై విష్ణులోకమునకు చేరుకొందురు. దీని తర్వాత 'నారాయణస్థానము' అను తీర్థమునకు పోయి, తర్వాత కుబ్జిక అను మరియొక వామన స్థానమునకు పోవలెను. ఇదియే విజయేశ్వరీదేవి యొక్క స్థానము. ఆమె శ్రీకృష్ణుని రక్షణ కొరకు ఇచట ఎల్లప్పుడునూ తత్పరురాలై ఉండును. కంసుని సంహరించుటను కోరుకొనిన శ్రీ కృష్ణుడు, బలభద్రుడు, గోపాలురు దేవి యొక్క సంకేతమును ఇచ్చటనే అందుకొనెను. అప్పటి నుంచి ఈమెను 'సిద్ధిధా', 'గోవధా', లేదా 'సిద్దేశ్వరి' అని కూడా పిలువబడుచున్నది. మరికొందరు ఆమెను 'సంకేతేశ్వరి' అని పిలుచుచున్నారు. ఆమె దర్శనము చేత తప్పక సిద్ధి ప్రాప్తించును.

ఇచ్చటనేగల కుండమునందు గల స్వచ్ఛమైన జలము నరుని పాపములన్నింటిని నశింపజేయును. దీని తర్వాత గోకర్ణేశ్వరి యొక్క దర్శనము చేసికొని సరస్వతిదేవి విఘ్నరాజగు, గణేశుని దర్శనము చేత నరుదు శ్రేయప్రాప్తులను పొందును.

మరల పుణ్యములను కలిగించు గార్వతీర్థము, భద్రేశ్వరతీర్థము, సోమేశ్వరతీర్థములకు పోవలెను. సోమేశ్వర తీర్థమునందు స్నానము చేసి, సోమేశ్వర భగవానుని దర్శనము చేసికొని అటుపిమ్మట 'ఘంటాభరణక', 'గరుడకేశ', 'ధారాలోపనక', 'వైకుంఠ' , 'ఖండ వేలక', 'మందాకినీ', సంయమన', 'అసకొండ', 'గోపతీర్థ', 'ముక్తికేశ్వర', 'వైలక్ష గరుడ', మహాపాతక నాశనము' అను తీర్థములకు కూడా పోవలెను. ఆ పిమ్మట శివభగవానునికి ఈ విధముగా ప్రార్ధన చేయవలెను. "దేవేశా! ముక్తిని ప్రసాదించు ప్రదాన దేవుడవు నీవే. సప్తర్షులు కూడా పృధ్వికి ప్రదక్షిణముచేయు సమయమునందు నిన్ను స్తుతించెదరు. ఇదే విధముగా నేను కూడా నిన్ను ప్రార్థించుచున్నాను. నీ ఆజ్ఞచేత మధురకు ప్రదక్షిణము చేయుటయందు నాకు సఫలత ప్రాప్తింపజేయుము" అని ఈ విధముగా ఆ క్షేత్రస్వామి దేవాధిదేవుడగు శివుని ప్రార్థించి 'విశ్రాంతి సంజ్ఞక' అను తీర్థమునకు పోవలయును. అచటకు పోయి, స్నానము తర్పణము భగవదర్చనము చేయవలెను. తదనంతరము శ్రీకృష్ణుని సోదరి భక్తుల ఆర్తులను హరించునది అగు భగవద్ సమంగళాదేవి యొక్క మందిరమునకు పోయి ఆమెను మధురయాత్రా సిద్ధి కొరకు ఈ విధముగా ప్రార్థించవలెను. "శివే! నీవు సంపూర్ణముగా, మంగళపూర్ణముగా కార్యములను సంపన్నము చేయుటయందు కుశలు రాలవు. నీ దయ చేతనే ప్రాణుల సర్వమనోరథములు పూర్ణములగుచున్నవి. నీవు ప్రసన్నురాలవై నాకు కూడా ఈ యాత్రయందు సఫలత సిద్ధించునట్లు వరమిమ్ము"ఈ సుమంగళార్చన అయిన తర్వాత పిప్పలేశ్వరమహాదేవుడు ఉండు స్థానమునకు పోవలెను. పిప్పలాదుడు అను ముని ఇచ్చటనే ఆ మహాదేవుని అర్చించెను. ఆ మహాతపస్వియగుముని ప్రదక్షిణము చేయుటచే అలసిపోయెను. అందుచేత ఈ స్థానమునకు శివభగవానుడు వచ్చి ఆయన అలసటను తీర్చెను. ఆ సమయమున పిప్పలాదముని అచ్చట గల భూమిని చదును చేసి, దానిపై తనయొక్క గుర్తు గల శంకరభగవానుని ప్రతిమను స్థాపించెను. అందుచేత ఆయనకు యాత్రయందు సాఫల్యము సిద్ధించెను. అందుచేత ఆయన దర్శనము శుభమునకు

సూచకము. మందిరమునందు ప్రవేశించు సమయమున దక్షిణ భాగము యొక్క శబ్దము కార్య అనుకూలతను సూచించును. శ్రీకృష్ణుడు కంసవధా సమయము నందు సాఫల్యము కలుగుటకై స్వయముగా ప్రార్ధన చేసి, ఈ దేవి యొక్క శుభసూచకమగు ఉత్తమమైన దర్శనము ముందుగాను, అంతమునందు మరియొక మారు ప్రాప్తింపజేసికొనెను. అందుచేత ఆయన దర్శనము చేసుకొనుటచే మనుష్యునికి సర్వాభీష్ట కార్యములు పూర్ణములు అగును. ఆ సమయమున కంసుని యొక్క పెద్ద పెద్ద మల్లులను చంపవలెనను ఆలోచనచే శ్రీకృష్ణుడు వజ్రముతో సమానమగు రూపము గల్గిన సూర్యభగవానుని కూడా ధ్యానించెను. ఆ సమయమున మల్లుందరునూ నశించిపోయిరి. అప్పుడు శ్రీకృష్ణుడు స్వయముగా ఆ స్థలమున వజ్రాసన సూర్యుని ప్రతిష్టాపించెను. అప్పటి నుంచి మధుర యందు నివాసముండు వ్యక్తులు ముందు అభీష్టవరము లిచ్చు సూర్యుని తమ ప్రధాన దేవతగా పరిగణించుచున్నారు. అంతేకాక సూర్య తీర్థముపై ఆయనను దర్శించుకొనుటతో ప్రదక్షిణ యాత్ర సమాప్తము చేసుకొనవలెను. మధురా ప్రదక్షిణ సమయమునందు మనుష్యుని అడుగులు పృథ్విపై పడుతున్నపుడు ఎన్ని అడుగులు పడినవో, అన్ని వేల సంవత్సరములు అతని వంశమునందలి సనాతన సూర్యలోకమునందు స్థానము సంపాదించుకొందురు. మధురా ప్రదక్షిణము చేసికొని వచ్చు మనుష్యుని ఎవరుచూచిన వారు పాపములనుంచి ముక్తి పొందుదురు. ఎవరు ప్రదక్షిణమునకు సంబంధించిన విషయములను విందురో వారుకూడా, అపరాధముల నుంచి ముక్తులై పరమపద ప్రాప్తి పొందగలరు. (158,159,160)

161, 162 వ అధ్యాయములు - దేవ వనము, చక్రతీర్థముల మాహాత్మ్యము

పిమ్మట భగవానుడు వరాహమూర్తి ఇట్లు చెప్పెను. నరుడు మధురానగరమునకు, కార్తిక మాస శుక్ల పక్ష అష్టమినాడు చేరుకొనవలెను. అచటికి చేరిన తర్వాత విశ్రాంతి తీర్ధమునందు స్నానము చేసి పితృదేవతలను దేవతలను ఆరాధించవలెను. అచట విశ్రాంతి తీర్ధ స్థానములో గల కేశవుని 'దీర్ఘ విష్ణు' అను పేరు గల ఆ విగ్రహమును దర్శించుకొనవలెను. పిమ్మట ఆ నరుడు అన్ని చర్యలయందును ఓర్పును పాటించవలెను. ఆ దినము చివరి వరకు విశ్రాంతి అను ఆ పవిత్ర స్థానమున అచట గల వనములను దర్శించవలెను. లేని యెడల ఆ నగరమునకు ప్రదక్షిణము చేసిన నరక క్లేశమునకు నుంచి

ముక్తి పొందుదురు. ఆ విధముగా స్వర్ణభోగమును అనుభవించుటకు యోగ్యత సిద్ధించును. దేవీ! ఈ మథురా మండలమునందు 12 వనములు కలవు. క్రమములో అవి 'మధువనము', 'తాళవనము', 'కుందవనము', 'కామ్యకవనము', 'బహువనము', 'భద్రవనము', 'ఖదిర వనము', 'మహావనము', 'లౌహవనము', 'బిల్వవనము', 'బాండీరవనము', 'వృందావనము' అనునవి. ఇవి అన్నియూ పరమశ్రేష్ఠములే గాక నాకు అత్యంత ప్రియపాత్రమైనవి. లౌహవన ప్రభావము చేత ప్రాణి యొక్క సమస్త పాపములు దూరములగును. అట్లే బిల్వవనము దేవతలచేత కూడా ప్రశంసింపబడిన వనము. ఏ మానవుడు ఈ వనములను దర్శించునో అతడికి నరకబాధలను అనుభవింపవలసిన గతి తప్పును.

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఇప్పుడు మధురకు ఉత్తర భాగమునందు గల చక్రతీర్థము యొక్క మహిమను తెల్పుచున్నాను. దానిని ఆకర్ణింపుము. పూర్వము జంబూద్వీపముయొక్క ఆభరణము వలె శోభను పెంచునట్టి 'మహా గృహోదయము' అను పేరు గల అతి ప్రసిద్ధమైన ఉత్తమమైన నగరము ఒకటి ఉండెను. శుభురాలా! ఆదివ్య నగరమునందు వేదములను తుదముట్ట అధ్యయనమొనర్చినవాడు యశోధరుడగు బ్రాహ్మణుడు వసించుచుండెను. ఒకప్పుడు జరిగిన విషయము. అతడు తన పుత్రుని, పుత్రికను వెంట తీసుకొని శాలగ్రామ (ముక్తినాథుడు) తీర్థమునకు పోయి, అచటనే తన నివాసము ఏర్పరచుకొనెను. ఎల్లప్పుడు నియమితానుసారము అచ్చట గల పవిత్రనదియందు స్నానముచేసి, దేవతలను దర్శనము చేసికొని తీర్థస్థలములను సందర్శించుటయే అతడి నిత్య కార్యక్రమముగా ఉండెను.

అచ్చట అతడికి కాన్యకుబ్జమునకు చెందిన సిద్ధపురుషుని దర్శనమయ్యెను. సిద్ధపురుషుడు అనేక పర్యాయములు కల్పగ్రామమునకు కూడా ప్రయాణము చేయ చుండెను. మాటల ప్రసక్తి సంబంధముగా ఆ సిద్ధుడు ప్రతిదినము కల్పగ్రామమును ప్రశంసించుచుండెను. ఆ గ్రామము యొక్క సంపదను గూర్చి విని, ఆ శ్రేష్ఠ బ్రాహ్మణుడు మనస్సునందు ఆలోచించి, తాను కూడా ఆ కల్పగ్రామమునకు పోయిన బాగుండునని తలచి సిద్ధపురుషుని ఇట్లని ప్రార్థించెను. "మిత్ర శ్రేష్ఠుడా! నీవు సిద్ధపురుషుడవు. అందుచేత ఒకమారు నన్ను కూడా ఆ కల్పగ్రామమునకు తీసుకొనిపోయి, నాపై దయచూపుడు."

ధారుణీదేవీ! ఆ శ్రేష్ట బ్రాహ్మణుడు అడిగిన విషయమును విని సిద్ధపురుషుడు "ద్విజవరా! అచ్చటకు కేవలము సిద్ధపురుషులు మాత్రమే పోగలరు. సామాన్య పురుషులకు అచ్చటకు పోవుటకు వీలుకాదు" అని చెప్పెను. ఆ మాటలపై బ్రాహ్మణుడు పలుమార్లు ప్రార్థింపగా సిద్ధుడు "అయ్యా! నాకు ఆత్మయోగ శక్తి సులభమైనదే. అందుచేత నిన్నే కాక నేను నీ పుత్రుని వెంట తీసుకొనిపోగలను. అని చెప్పగా, ఆ సిద్ధపురుషుడు తన కుడిచేతి యందు ఆ వేదజ్ఞ బ్రాహ్మణుని అట్లే ఎడమ చేతియందు మహామతి అను పేరుగల గొప్ప బుద్ధిమంతుడైన ఆయన కొడుకును తీసుకొని పైకి ఎగిరి కల్పగ్రామమును చేరుకొనెను. అచట చేరుకొన్న తర్వాత ఆ పితాపుత్రుల చేతులను తన చేతినుండి వదలి వేసెను. ఆ పితాపుత్రులిరువురు ఆ ప్రదేశమున చాలా కాలము ఉండిరి. సమయము గడచిపోవుట చేత, ఆ బ్రాహ్మణుని శరీరమునందు వ్యాధి ఉత్పన్నమైనది. అందుకు తోడుగా వృద్ధాప్యవస్థ కూడా ఉన్నది. అందుచే అతడు మరణించవలెనని నిశ్చయించుకొని ఆ ధర్మవిశారదుడైన బ్రాహ్మణుడు మహాయోగ్యుడైన తన పుత్రుని కూడా పిలిచి ఇట్లు చెప్పెను. "వత్సా! నాకు మరణకాలము ఆసన్నమైనది. నన్ను గంగాతీరమునకు తీసుకొని పోమ్ము" అని ఆదేశించెను. అంతట పుత్రుడు తండ్రి స్థితిని చూచి భాష్పములు కారుచుండగా, తన తల్లిని గంగానది యొక్క ఒడ్డునకు చేర్చి, అతడు కూడా తన తండ్రియెడల గల అపార శ్రద్ధాభక్తులు గల కారణముచేత అచటనే అతనితో కలసి నివసించుటను, వేదాధ్యయనము చేయుటను కూడా ప్రారంభించెను. ఈ విధముగా కొంతకాలము గడిచెను.

భద్రే! ఒకమారు జరిగిన వృత్తాంతము. దైవవశమును కాన్యకుబ్జ దేశనివాసియగు ఆ బ్రాహ్మణ కుమారుడు ఆ సిద్ధపురుషుని గృహమునకు భోజనము చేయుటకై వచ్చెను. కల్పగ్రామ నివాసియగు సిద్ధునికి గొప్ప అందగత్తెయగు కూతురు కలదు. సిద్ధునిచే అడుగబడిన ఆ బ్రాహ్మణకుమారుడు తన వృత్తాంతమునంతటిని సిద్ధునికి తెలియజేసెను. తన దివ్యదృష్టిచే ఆ బ్రాహ్మణ కుమారుని గురించి తెలిసికొని అంతట ఆ సిద్ధుడు బ్రాహ్మణ కుమారునికి స్వాగత సత్కారములు విధిపూర్వకముగా అతనిని అర్చన చేసి, ఆతడికి తన కన్యను ఇచ్చి వివాహము చేసెను. అప్పటినుంచి ప్రతిదినము బ్రాహ్మణకుమారుడు తన అత్తగారి ఇంటికే పోయి భోజనము చేయుచుండెను. తన తండ్రి యొక్క దయనీయమైన స్థితిని చూచి, ఆ బ్రాహ్మణకుమారుడు తన తండ్రి యొక్క క్లేశము

కలిగించు శరీరమును గురించి, సిద్ధపురుషులైన తన మామను ఇట్లు ప్రశ్నించెను. స్వామి! మీరు నాకు ఎప్పుడు నా తండ్రి శాంతముగ ఉండునట్లు చేసి, ఆ విషయమును తెల్పి దయచూపుదు" అని అడిగెను. అందుకు ఆ సిద్ధపురుషుడు చిరునవ్వు నవ్వి "ద్విజవరుడా! నీ తండ్రి అపవిత్రమైన అన్నము తినెను. ఈ ఆహార దోషము చేతనే ఇట్టి దుర్గతి అనుభవింప వలసి వచ్చెను. ఆ అన్నము ఇప్పుడు ఆయన పాదముల మీద పడి ఉన్నది" అని తెల్పెను. ఆ కుమారుడు ఒకనాడు తన తండ్రికి ఈ విషయమును తెలియజేసెను. అందుచేత శరీరము యొక్క జర్జరత చేత అత్యంత దుఃఖము కలిగినవాడై ఆ శ్రేష్ఠబ్రాహ్మణుడు ఒకనాడు గంగాతటముపై పడిఉన్న అన్నదోషయుక్తమైన ఒక రాతితో తన రెండు కాళ్ళను విరుగగొట్టుకొనెను. ఆ చర్యచేత ఆతని ప్రాణములు పోయి మరణించెను. ఆ సమయమున అతని పుత్రుడు తన అత్తగారింట స్నానము, భోజనము మొదలగు వాని కొరకుపోయి ఉండెను. తిరిగి వచ్చిన తర్వాత అతడు తన తండ్రి యొక్క శవమును చూడగానే విలపించుట ప్రారంభించెను. ఆపస్తంబముని సరిగానే ఇట్లు చెప్పెను. "సర్పము కాటు వేయుట చేత, కొమ్ములు దంతములు గల జంతువులను చంపుట చేత, చాలా త్వరగా తన ప్రాణములను త్యాగము చేయుటచేత– అనగా ఆత్మహత్య చేసుకొనుటచేత ఎవని ప్రాణములుపోవునో ఆమనుష్యుడు పాపమునందు భాగస్తుడగును. అనగా అతనికి కొంత పాపము తగులును".

అప్పుడు ఆ బ్రాహ్మణ కుమారుడు మరల తన మామగారి యింటికి పోగా అతనిని చూచిన వెంటనే మామ "ఓయీ! నీకు బ్రహ్మహత్య తగులకొనినది. నీవు ఇచట నుంచివెడలిపొమ్ము." అని చెప్పెను. మామ పలికిన మాటలు వినగానే జామాత "మహానుభావా! నేను ఎన్నడునూ ఏ బ్రాహ్మణుని హత్య చేయలేదు. అయిననూ నీవు నాపై బ్రహ్మహత్యా దోషమును ఆరోపించుచున్నావు. ఇది ఎట్లు జరుగును" అనెను. శ్వశరుడు పుత్రకా! నీవు నీ తండ్రి యొక్క మృత్యువునకు కారణభూతుడవైతివి. అందుచేత బ్రహ్మహత్యయందు భాగము కలవాడవు అయితివి. 'ఒకవేళ ఒక పతితుడితో, అతడి సమీపములో ఒక సంవత్సరము వరకు శయనము, భోజనము లేక కనీస సంభాషించినను శుద్ధ పురుషుడు పతితుడు అగును.' అని ఒక నియమము కలదు. ఆ కారణము చేత ఇప్పుడు నీవు నాయింటి యందు ఉండుట కొరకు స్థానము లేదు" అని చెప్పెను. మామ

యొక్క ఈ మాటలను విని ఆ అల్లుడు "విశారదుడా! నీవు నన్ను వదలి వేసినందున నా దోషము పోవుట ఎట్లు?ఇప్పుడు నా కొరకు ఏ రకమైన ప్రాయశ్చిత్తము కలదు? దయతో ఈ విషయమును తెల్పుడు" అని అర్ధించెను. ఇందుకు శ్వశురుడు "ఇప్పుడు నీవు కల్పగ్రామమును త్యజించి మథురకు పొమ్ము. మథుర తప్ప నీవు శుద్దుడవు అగుటకు వేరెచ్చటను సంభవము కాదు" అని పల్కెను. అంతట ఆ బ్రాహ్మణుడు మరుక్షణము కల్పగ్రామము నుండి వెడలి మథురకు చేరుకొని, నగరమునకు బయటనే తాను వసించుటకు నివాసము కొరకు ఏర్పాటు చేసికొనెను. ఆ సమయమున మథురయందు కాన్యకుబ్జ మహారాజగు కుశికుని యొక్క నిత్య సత్రము (నిత్యము చేయు అన్నదానము) జరుగుచు ఉండెను. ఆ సత్రమునందు ప్రతిరోజూ రెండువేల మంది బ్రాహ్మణులు భోజనము చేయుచుందురు. అచట బ్రాహ్మణులు భుజించుసమయమున వారి నోటినుండి జారిపడు చిన్న చిన్న మెతుకుల (ఉచ్ఛిష్టము) అన్నమును తినుట చేత ఆ బ్రాహ్మణ కుమారుడు పాపమునుండి ఉద్ధరింపబడిన వాడయ్యెను. అతడు నిత్యము చక్రతీర్థమునకు పోయి స్నానము చేయుచుండెను. ఎవరి ఇంటను అతడు భిక్షను అర్ధింపడు. అట్లే అన్యప్రదేశమునకు ఎచ్చటకును అతడు పోడు.

పృథ్వీ! చాలా కాలము గడచిన తర్వాత ఆ బ్రాహ్మణుని మామకు ఆతడిని గురించిన చింత కల్గెను. అతడు తన దివ్య దృష్టిచే జామాత యొక్క స్థితిని తెలుసుకొని తన కుమార్తెకు "నీవు ఇప్పుడు భోజనము తీసుకొని మధురాపురికి పొమ్ము. నీ భర్త అచటనే గలడు" అని చెప్పెను. ఆ స్త్రీ యోగసిద్ధదివ్యజ్ఞానము చేత సంపన్నురాలు అయినట్టిది. ఆ హేతువు చేత తన భర్తకు భోజనము చేయించు ఆలోచనచేత, ఆమె ప్రతిదినము భర్త వద్దకు రాకపోకలు సాగించుచుండెను. అదియే ఆమెకు నిత్యకార్యక్రమ మయ్యెను. సాయంకాల భోజనమును తీసుకొని రాబడిన భోజనము చేసి రాత్రియందు ఆ సత్రశాలయందే పడి ఉండుచుండెను. ఈ విధముగా ఉండుచున్న బ్రాహ్మణునికి మరియొక ఆరు నెలలు గడచి పోయెను. కొంతకాలము గడచిన తర్వాత అచట వసించు బ్రాహ్మణులు అతనితో "నీవు ఇచ్చట ఎక్కడ నిద్రించుచున్నావు? అంతగాక ప్రతిరోజు నీకు భోజనము ఎచ్చటి నుండి లభ్యమగుచున్నది" అని ప్రశ్నించిరి.

అంతట ఆ బ్రాహ్మణుడు వారితో తమ సంపూర్ణ వృత్తాంతమును తెలియునట్లుగా పల్కెను. ఆ విప్రుని మాటలను విని, ఆ బ్రాహ్మణులందరూ ఒకచోట చేరి అతనితో "బ్రాహ్మణ శ్రేష్ఠుడా! ఇప్పుడు నీవు అన్ని విధములుగా శుద్ధుడవు అయిపోతివి. ఈ చక్రతీర్థ ప్రభావము చేత నీ పాపములన్నియూ దూరమైనవి, ఇంకనూ మా అందరి శరీర సంపర్కము కలుగుట చేత నీ పిల్లపాపలు లేని పాపము కూడా పోయినది" అని పలికిరి, ఆ బ్రాహ్మలు చెప్పిన మాటలు వినిన ఆ బ్రాహ్మణుని మనస్సు ప్రశాంతమైసంతోషము కలిగినదయ్యేను. అంతట అతడు స్నానార్ధము మరల చక్రతీర్థమును వచ్చెను. అప్పటికి అతడి భార్య ముందుగానే భోజనము తీసుకొని వచ్చి అచట ఉన్నది. ఆమె హరిత మనసుగాలై తన పతితో "స్వామీ! నాకు మీరు బ్రహ్మహత్య నుంచి అన్ని విధముల ముక్తులైనట్లు అనిపించుచున్నది" అని పల్కెను, భార్య మాటలను విని అతడు "ప్రియా! నీవు చెప్పిన విషయమును మరల ఒకసారి స్పష్టముగా వివరించుము" అని అతడు పలికిన మాటలను విని భార్య "అంతకు ముందు నీవు మాట్లాడుటకు కూడా అయోగ్యుడవై ఉంటివి. అందుకు కారణము నీవప్పుడు బ్రహ్మహత్యాగ్రస్థుడవు, ద్విజశ్రేష్టుడా! ఇప్పుడు నీవు చక్రతీర్థ ప్రభావముచే పాపముక్తుడవు అయితివి. ఇప్పుడు నీవు పరమ పవిత్రమైన కల్పగ్రామమునకు పొమ్ము" అని పత్ని పల్కెను. తదనంతరము ఆ బ్రాహ్మణోత్తముడు తన భార్యతో సహాకల్పగ్రామమునకు పోయెను, వసుంధరా! ఆ పరమ పవిత్ర చక్రతీర్థము నేనునూ, భగవంతుడు భద్రేశ్వరుడునూ విరాజితులుముగా ఉందుము, మమ్ములను దర్శించుట చేత తీర్థఫలము లభ్యమగును. చక్రతీర్థమును సేవించుటచే సమగ్రమైన కల్పగ్రామ సేవనము కంటే వంద రెట్లు ఎక్కువగా ఫలము లభించును, ఒక పగలు రాత్రి అచట ఉపవాసము చేసిన తర్వాత మనుష్యుడు బ్రహ్మహత్యా పాతకము నుంచి ఉద్ధరింపబడును.(161,162)

163 వ అధ్యాయము - కపిలవరాహ మాహాత్మ్యము

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా! మిథిలా ప్రాంతమునందు జనక మహారాజు యొక్క జనకపురి అను పేరుగల ఒక ప్రాచీనము, పరమ రమణీయమైన నగరము కలదు. అచట బ్రాహ్మణ జయత్యతులు అను నాలుగు కులములవారు నివాసముండుచూ ఇంకనూ తీర్థయాత్రలు మొదలగు వాని కొరకు ఇతర ప్రాంతముల

నుండి కూడా వచ్చుపోవుచూ ఉండిరి. ఇంకనూ అచటికి సమీపమున గల సౌకరక తీర్థమునందు స్నానము చేసి, వారు మధురాపురి యాత్ర చేయుచుండిరి. అంతేగాక అచ్చట కొంతకాలము - నిలిచి ఉండుచుండిరి. ఆ జనబాహుళ్యంలో, శరీరమునందు బ్రహ్మహత్యా చిహ్నములు గల ఒక బ్రాహ్మణుడు ఉండెను. అతడి చేతి నుండి నిరంతరము రుధిరధార పడుతూ ఉండినది. అందరూ ఆ ధారాపాతమును చూచుచు ఉండిరి. ఆ బ్రాహ్మణుడు ఆ హత్యాపాపము నుండి ముక్తుడగుటకై అంతకు ముందు అన్ని తీర్థములకును పోయి, స్నానముచేసి ఉండెను. అయిననూ అతనికి బ్రహ్మ హత్యాపాతకము దూరము కాలేదు. కానీ దాని తర్వాత అతడు వైకుంఠ తీర్థమున స్నానము చేసినంతనే చేతినుండి వచ్చు ఆ రుధిరధార దానంతట అదే ఆగిపోయినది. అంతట ఆయన సహవాసులందరూ ఆశ్చర్యముతో "ఇట్లు జరిగినదేమి? ఇది ఎట్లు జరిగెను" అని ఒకనితో ఒకరు చెప్పుకొను చుండిరి. ఆ సమయమున బ్రాహ్మణ రూపము ధరించి ఒక దివ్య పురుషుడు అచ్చటికి వచ్చి అచ్చట గలవారినందరిని "ఇక్కడి నుంచి బ్రహ్మహత్య ఈ బ్రాహ్మణుని వదలివేసి ఏ విధముగా పోయినది?" అని అడిగెను. దీనిపై ఆ ప్రజలందరూ వానిని ఆ బ్రాహ్మణుని బ్రహ్మహత్య పాతకమునుంచి విముక్తి కలుగుటకు చేసిన ప్రయత్నము, అట్లే చివరిలో వైకుంఠ తీర్థమునందు చేసిన స్నానము ద్వారా హత్యాముక్తి జరిగిన విషయమంతయు చెప్పివేసిరి. ఆ కారణము చేత ఈ తీర్థము యొక్క మాహాత్మ్యము నందు కించిత్ సందేహమును పెట్టుకొనవలసిన అవసరము లేదు అని చెప్పిరి.

సూతుడు ఇట్లు చెప్పెను. ఋషులారా! దాని తర్వాత వరాహభగవానుడు మరల పృథ్వితో దేవీ! ఇచట అమితపుణ్యమును ప్రసాదించునదియగు అశికుండము అను పేరు గల మరియొక క్షేత్రము కలదు. దానిని గురించి ఇప్పుడు నేను చెప్పుచున్నాను.ఆ క్షేత్రమునందు మరియొక కుండము కూడా కలదు. దానిని 'గంధర్వకుండము' అందురు. అది తీర్థములన్నింటిలోను ప్రముఖ మైనది. అచట స్నానము చేయువాడు గంధర్వులతో పాటు ఆనందభోగమును అనుభవించును. అంతేగాక ఆ స్థలమునందు ప్రాణత్యాగము చేసినవాడు నా లోకమునకు చేరుకొనును. వసుధా! మధురామండలము యొక్క సరిహద్దుకు ఇరువది యోజనముల దూరము కలదు. ఆ పురి ఆకృతి కమలముతో సమానముగా ఉండి, ఎల్లరకు ముక్తిని ప్రసాదించుటకు సామర్థ్యము కలదిగా ఉండును.

దాని కర్ణిక యొక్క మధ్యభాగము నందు సమస్త క్లేశ నాశకుడైన కేశవ భగవానుడు విరాజిల్లుచుండును. ఈ స్థానమునందు ఎవని ప్రాణ త్యాగము జరుగునో, అతడు ముక్తిభాగుడు అగును. ఇక్కడనే కాదు అతడి మృత్యువు మధుర యందు ఎచ్చట జరిగిననూ వారందరూ ముక్తులు అగుచున్నారు. ఈ తీర్థము యొక్క పశ్చిమ భాగమునందు గోవర్ధన పర్వతము కలదు. శ్రీ కృష్ణభగవానుడు అచ్చటనే నివసించును. అచ్చట ఆ దేవేశ్వరుని దర్శనము ప్రాప్తించుకొనుటచేత మనస్సునందు ఎట్టి సంతాపమును మిగిలి ఉండదు.

పృథ్వీ! పూర్వకాలమునందు మాంధాత అను పేరు గల ఒక రాజు కలదు. ఆయన చేసిన భక్తిపూర్వక స్తుతి చేత ప్రసన్నుడనైన నేను, ఈ విగ్రహమును అప్పగించితిని. మాంధాత మహారాజు యొక్క మనస్సునందు ముక్తి పొందవలయునని అభిలాష కలదు. అందుచేత ఆయన ప్రతినిత్యము ఈ ప్రతిమను అర్చించుట చేయుచుండెను. మధురయందు లవణాసురుని వధ జరిగిన సమయమునందే ఈ విగ్రహము ఈ తీర్థమునందు స్థాపింప బడినది. ఈ విగ్రహము మహా దివ్యము, పుణ్య స్వరూపము, అద్భుత తేజో సంపన్నముగా ఉండును. ఇది (విగ్రహము) మధుర వచ్చుటకు గల కారణము తెలుపు వృత్తాంతము విచిత్ర మైనది. కపిలుడు అను పేరు గల ముని అపార శ్రద్ధ మనోయోగపూర్వకమైన నా ఈ వారాహి ప్రతిమను నిర్మింపజేసెను. ఆ విప్రవరుడు కపిలుడు, ప్రతిరోజు ఈ ప్రతిమకు ధ్యానము, పూజయు చేయుచుండెను. పిమ్మట ఇంద్రుడు ఆ మునివరుడు అగు కపిలుని దీనిని తనకు ఈయవలసినదని ప్రార్థించెను. అంతట కపిలుడు ప్రసన్నుడై, ఈ దివ్యరూపము గల ప్రతిమను అతనికి అర్పించెను. ఈ ప్రతిమ లభ్యమైన వెనువెంటనే హృదయమునందు సంతోషము నిండినవాడై ఇంద్రుడు నిత్యము భక్తితో నన్ను పూజించుచుండెను. దీనికి ఫలస్వరూపముగా శక్రునికి (ఇంద్రుడు) సర్వోత్కృష్టమైన దివ్యజ్ఞానము ప్రాప్తించినది. ఇంద్రుడు నా ఈ కపిల వరాహుడు అని పేరుగల ప్రతిమను చాలా సంవత్సరములపాటు పూజించెను. దీని తర్వాత రావణుడు అను పేరు గల దుర్దాంతుడగు రాక్షసుడు కలడు. ఆ మహాపరాక్రమశాలియైన నిశాచరుడు ఇంద్రలోకమునకు పోయి స్వర్గమును జయించుటకు ప్రయత్నము చేయుచుండెను. అతడు దేవతలనందరినీ ఓడించెను. మహాపరాక్రముడగు ఇంద్రుడు కూడా అతని చేతిలో

ఓడిపోవుటచే రావణుడు అతడిని బంధితునిగా చేసి, ఆ ఇంద్రుని భవనములోనికి చొచ్చుకొని పోయెను. ఆ రాక్షసుడు రత్నముల చేత సుశోభితమైన ఇంద్రభవనమునందు ప్రవేశించగనే వానికి భగవంతుడగు ఆ వరాహుని దర్శనము కలిగెను. చూచిన వెంటనే అతడు తన మస్తకమును నేలపై కొట్టుకొని దీర్ఘకాలముపాటు ఈ శ్రీహరిని స్తుతించెను. అందుచే విష్ణుభగవానుడు సౌమ్యరూపధారణ చేసి, పుష్పక విమానారోహుడై ఆ రాక్షసుని వద్దకు వచ్చెను. వెనువెంటనే ఆ విగ్రహమునందు అతడు ప్రవేశించుట జరిగిపోయెను. రావణుడు ఆ విగ్రహమును పైకెత్తవలెనని అనుకొనెను. కాని దానిని పైకి లేపలేకపోయెను. అందుకు అతడు హద్దులేని ఆశ్చర్యమునందు మునిగిపోయి అతడు “భగవంతుడా! చాలా కాలము నాటి మాట నేను శంకరసహితుడనై కైలాసపర్వతము వరకును నా చేతులతో పైకి లేపితిని. నీ రూపము చాలా చిన్నది. అయిననూ దానిని పైకి లేపుటయందు నాశక్తి చాలలేదు. నీకు నమస్కారము. నాపై ప్రసన్నుడవై దయచూపుము. ప్రజల పురియగు లంకా నగరమునకు నిన్ను తీసుకొని పోవలెను. దేవేశ్వరా! నాపై ప్రసన్నుడవై దయ చూపుము. ప్రభూ! నా హార్దిక కోరిక ఒకటి కలదు.” అనగా వరాహోభాగవాడు ఇట్లు చెప్పెను.

“విశ్వంభరా! ఆ సమయమున నేను కపిలవరాహుని రూపములో రావణునితో “రాక్షసా! నీవు అవైష్ణవ వ్యక్తివి. నీకు ఇట్టి మహత్తర భక్తి ఎచట నుంచి ప్రాప్తించినది.” అని ప్రశ్నించితిని. అంతట నన్ను కపిల వరాహునిగా తెలిసికొని రావణుడు “మహాత్మా! నీ పవిత్ర దర్శనముచే నాకు ఇట్టి అనన్య భక్తి కలిగి, ఈ పని సులభము అయినది. దేవేశ్వరా! నీకు అనేక మార్లు ప్రణామము చేయుదును. నీవు దయతో నా పురియందు తిరుగుము” అని ప్రార్థించెను. పృథ్వీ! అప్పుడు నా ఈ ప్రతిమ తేలిక అయిపోయినది. అంతేగాక రావణుడు మూడులోకములందు విఖ్యాతుడైన, నా కపిలవరాహ విగ్రహమును పుష్పకవిమానమునందు ఉంచి లంకకు తీసుకొని పోయెను. లంకలో ఆ విగ్రహమును ప్రతిష్ఠింపజేసెను. తదనంతరము శ్రీరాముడు రాక్షసరాజు రావణుని చంపి, లంకారాజ్య సింహాసనముపై విభీషణుని ప్రతిష్ఠింపజేసి, పట్టాభిషేకము చేసెను అయిననూ విభీషణుడు శ్రీరామునితో "ప్రభూ! ఈ రాజ్యము అంతయూ మీదే! మీరే దీనిని తీసుకొనుడు” అని ప్రార్థించెను. అంతట శ్రీరాముడు ఇట్లు చెప్పెను. “రాక్షసరాజా! విభీషణా! ఇందతయూ నీకు చెందినదే! దీని వలన నాకెట్టి ప్రయోజనము లేదు. కానీ రాక్షసేశ్వరా!

ఇంద్రలోకమునుండి రావణుడు తీసికొని వచ్చిన కపిలవరాహ విగ్రహము ఇచ్చట కలదు. దానిని మాత్రమే నాకు ఇమ్ము. ఆ వరాహభగవానునికి నేను ప్రతిదినము పూజ చేయవలెనని కోరుకొనుచున్నాను దానవేశ్వరా! నేను దానిని అయోధ్యకు తీసుకొని పోవుదును'' అని అడిగెను. అప్పుడు విభీషణుడు ఆ దివ్య విగ్రహమును శ్రీరామునికి సాధక సభక్తికముగా సమర్పణము గావించెను. శ్రీరాముడు దానిని పుష్పకవిమానము నందుంచి తన నగరమైన అయోధ్యకు తీసుకొనిపోయెను. అయోధ్యకు చేరిన తర్వాత దానిని ప్రతిష్టాపించెను. ప్రతిరోజు పూజాచేయవలెనను నియమమును వహించెను. ఈ ప్రకారము పది సంవత్సరములు గడచి పోయిన తర్వాత శ్రీరాముడు లవణాసురుని వధించుటకై శత్రుఘ్నుని ఆజ్ఞాపించెను. సమయమున ఆ రాక్షసుడు మధురయందు నివసించుచుండెను. శత్రుఘ్నుడు మహాత్ముడగు శ్రీరామునికి నమస్కరించి తన చతురంగ బలములను తీసుకొని మధురకు ప్రయాణమై పోయెను. లవణాసురుని రూపము చాలా భయంకరమైనది. రాక్షసులందరూ అతడిని మహాభయంకరుడుగా భావించుచుండిరి. అన్ని జాతుల రాక్షసులు అతనిని తమనాయకునిగా పరిగణించుచుండిరి. అయినను, శత్రుఘ్నుడు లవణాసురుడిని వధించివైచెను. ఆ తర్వాత శతృఘ్నుడు మధురానగరము యొక్క లోపలికి పోయి అచట అత్యంత తేజస్వులు, ఇరువది ఆరువేల వేదపారాయణులగు బ్రాహ్మణులను ఉండునట్లు చేసెను. అచ్చట నాలుగు వేదములను ఎరిగిన పురుషులు కలరు. ఇప్పుడు ఆ స్థానము పవిత్రము అయినది. అచ్చట ఒక్క బ్రాహ్మణునికైననూ భోజనము పెట్టిన కోట్ల కొలది బ్రాహ్మణులకు పెట్టిన దానితో సమాన ఫలము లభ్యమగుచుండెను.

మేదినీ! తిరిగి వచ్చిన శత్రుఘ్నుడు లవణాసుర వధావృత్తాంతమును ఉన్నది ఉన్నట్లుగా శ్రీరామునితో విన్నవించెను. అంతట ఆ అసురుని మృత్యువు యొక్క వృత్తాంతమును విని భగవంతుడగు రాఘవేంద్రుడు ప్రసన్నచిత్తుడై, "శతృఘ్న! నీ మనసునందు ఏ వస్తువు మీదనైననూ అభిలాష ఉన్న యెడల దానిని నీవు నా నుండి వరముగా కోరుకొని తీసుకొనుము'' అని చెప్పగా, ఆ సమయమున శ్రీరాముని మాటలను వినిన శతృఘ్నుడు "భగవాన్! నీవు నాకు పూజ్యుడవు. నీవు నాయెడ ప్రసన్నుడవైన కపిల వరాహప్రతిమను నాకు దయతో ప్రసాదింపుము'' అని ప్రార్థించెను. అప్పుడు శతృఘ్నుని మాటను విని శ్రీరాముడు "శతృఘ్నా! నీవు ఈ వరాహ భగవానుని ప్రతిమను తీసుకొని

పోదగుదువు. నిన్ను అనుసరించిన వారందరకు ధన్యవాదములు తెల్పుచున్నాను. ప్రపంచమునందు పవిత్రమైన ఆ మధురాపురికి ధన్యవాదము. ఎల్లప్పుడూ ఆ కపిల వరాహుని దర్శనము, స్పర్శనము, ధ్యానమును చేయువారు, ప్రతిదినము ఈ విగ్రహమునకు స్నానము చేయించుచు వానిని అనులేపనములను చేయువారు చేసిన పాపములన్నియూ హరించిపోవును. దీనికి పూజచేసి దర్శనము చేసికొనువారి సమస్త పాపములు నాశనముచెంది మోక్షమును గూడా పొందగల్గును.

ఉర్వరా! ఈ విధముగా చెప్పి, శ్రీరాముడు కపిలవరాహ ప్రతిమను శతృఘ్నునికి ఇచ్చి వేసెను. దానిని తీసికొని శతృఘ్నుడు మధురాపురికి పోయెను. అచ్చట అతడు నాకు దగ్గరలోనే ఆ విగ్రహమును ప్రతిష్ఠించెను. మధురా నగర మధ్యభాగమునందు ప్రతిష్టించిన ఆ విగ్రహమునకు విధి ప్రకారము పూజ చేసెను. గయలో జ్యేష్ఠమాసము నందు, పుష్కర క్షేత్రము నందు పిండదానము చేయుటచేత అట్లే సేతుబంధమున రామేశ్వరుని యొక్క దర్శనము చేసుకొనుటచే మనుష్యులు ఏ ఫలమును పొందుదురో, వారు ఈ విగ్రహమును దర్శనము చేసికొనుటచే పొందుచున్నారు. అదేవిధమగు ఫలము విశ్రాంతిసంజ్ఞక, గోవింద కేశవ, దీర్ఘవిష్ణుల యెడ శ్రద్ధ కలిగినయెడల లభ్యమగుచున్నది. నా తేజము ప్రాతఃకాల విశ్రాంతిసంజ్ఞకమునందు మధ్యాహ్న సమయమున దీర్ఘ విష్ణువుయందును అట్లే పగటి సమయ చతుర్ధ భాగమునందు అనగా సాయంకాలమందు కేశవునియందు ప్రతిష్ఠింప బడియున్నది. దేవీ! ఈ బ్రహ్మవిద్య (వరాహ పురాణము) పరమ ప్రాచీనమైనది. (163)

164,165 అధ్యాయములు

అన్నకూట (గోవర్ధన) పర్వతము యొక్క ప్రదక్షిణ మాహాత్మ్యము

వరాహభగవానుడు భూదేవితో ఇట్లు చెప్పెను. "దేవీ! మధురకు సమీపముననే పశ్చిమదిశయందు రెండు యోజనములు విస్తరించి గోవర్ధనము అను పేరు గల ప్రసిద్ధ క్షేత్రము కలదు. అచ్చట చుట్టును వృక్షములు, లతలచేత శోభాయమానముగా ఉండు సుందర సరోవరము కూడా కలదు. మధుర యొక్క తూర్పుదిశయందు ఇంద్రతీర్థము, దక్షిణమునందు యమతీర్థము పశ్చిమమున వరుణతీర్థము, ఉత్తర దిశయందు కుబేర తీర్థము అను నాలుగు తీర్థములు గలవు. ఇచటనే అన్నకుండము అను పేరు గల ఒక క్షేత్రము కలదు. దీనికి ప్రదక్షిణము చేయువాడు మానవలోక సంసార గుంజాటనమందు

తిరిగి జన్మింపడు. అంతేగాక మానసీగంగయందు స్నానము చేసి గోవర్ధన గిరిపై శ్రీకృష్ణ భగవానుని దర్శనము చేసుకొనవలెను. ఈ గోవర్ధన పర్వత ప్రదక్షిణము చేసిన వారికి ఏ రకమైన బాధ్యతలు, కర్తవ్యములు మిగిలి ఉండవు. సోమవతి అమావాస్యనాడు అనగా సోమవారముతో కూడిన అమావాస్య తిథినాడు ఇచ్చటకు పోయి పితరులకు పిండప్రదానము చేసిన యెడల, అతడికి రాజసూయ యజ్ఞఫలము ప్రాప్తించును. గయా తీర్థమునకు పోయి పిండప్రదానము చేయు మనుష్యునికి లభ్యమగు ఫలము అదే గోవర్ధనపర్వతముపైన చేయు పిండదానము చేత సులభము కాగలదు. ఇందు ఆలోచింపవలసిన ఎట్టి ఆవశ్యకతయును లేదు. గోవర్ధన భగవానునికి ప్రదక్షిణము చేయుటచే రాజసూయ, అశ్వమేధ యజ్ఞములకు లభ్యమగు ఫలము లభించును.

గోవర్ధన ప్రదక్షిణము చేయు విధానము ఇది : ఈ విధి ప్రకారము భాద్రపద మాస శుక్ల పక్ష బహు పుణ్యమైన ఏకాదశీ తిథినాడు ఈ పర్వతము వద్ద ఉపవాసము ఉండి, పాతఃకాలముననే సూర్యోదయ సమయమున స్నానము చేసి, పర్వతము పైననే ఉన్న శ్రీహరి యొక్క పూజ చేయవలెను. దీని తర్వాత పుండరీక తీర్థమునకు వెళ్ళి, అచ్చట గల కుండమునందు స్నానము చేసి దేవతలు పితరుల యొక్క సమ్యక్ పద్ధతిచే అర్చన చేసి, పుండరీక భగవానుని పూజింపవలెను. అచట నిర్మలమైన జలముతో నిండి ఉండు అప్సర కుండము ఒకటి కలదు. అచ్చట స్నానము చేయుటచే పాపములన్నియు నశించును. ఆ కుండము నందు తర్పణము విడుచుటచే రాజసూయము, అశ్వమేధ యజ్ఞముల ఫలము నిశ్చయముగా లభ్యము కాగలదు. మధురయందు సంకర్షణము అను పేరుతో విఖ్యాతి చెందిన ఒక తీర్థము కలదు. దానికి బలభద్రకుడే రక్షకుడు. అక్కడికి పోవుట, స్నానము చేయుట అనువానిచే పూర్వముననందే చుట్టుకొని ఉన్న గోహత్యా పాతకమునుండి విముక్తి లభ్యమగును.

ధారుణీ! గోవర్ధనమునకు సమీపమునందు శక్ర తీర్థము అనునది ఒకటి గలదు. అచ్చటనే శ్రీకృష్ణుడు ఇంద్రుని పూజించుట కొరకు చేయబడిన యజ్ఞమునకు నష్టము కలిగించినది. ఆ యజ్ఞ సమయమునందు భోజ్యములైన (తినదగిన) అనేక రకములైన పదార్థములు పెద్ద ఎత్తున గుట్టలుగా పోయబడి ఉంచబడినవి. ఆ సమయమున ఇంద్రునితో శ్రీ కృష్ణునికి వివాదము కలిగెను. అంతట ఇంద్రుడు మహాభయంకరమైన

వృష్టిని (వర్షము) కురిపించెను. ఆ జలము ప్రజమునందు నివసించు వారికి అట్లే గోవులకు ఎన్నో కష్టములను గలిగించుట జరిగెను. శ్రీ కృష్ణుడు వారిని అందరినీ రక్షించు నిమిత్తము ఈ శ్రేష్ఠమగు పర్వతము (గోవర్ధనగిరిని) చేతిపై లేపి నిలబెట్టెను. అప్పటినుంచి ఈ పర్వతము అన్నకూట పర్వతము అను పేరుతో విఖ్యాతి చెదెను. ఇచ్చటనే ముందు కొద్దిపాటి దూరమున స్వచ్ఛమైన జలము గల కదంబఖండము అను పేరు గల కుండము కలదు. అచ్చట స్నానము చేసి, పితరులకు తర్పణము చేయుట చేత బ్రహ్మలోకప్రాప్తి కలుగును. దీనికి తర్వాత వంద శిఖరములు కలిగిన దేవగిరి పైకి వెళ్ళవలెను. అచట స్నానము దర్శనము చేయుట చేత వాజపేయ యజ్ఞము చేసిన ఫలము లభ్యమగును.

దేవీ! మానసీ గంగ యొక్క ఉత్తర తటముపై చక్రధారణము చేయువాడు దేవేశ్వరుడైన శ్రీహరికి అరిష్టాసురునితో మహాభయంకర యుద్ధము జరిగెను. అప్పుడు ఆ అసురుడు తన రూపమును మార్చి వృషభము (ఎద్దు) రూపమును పొందెను. అతడి జీవనలీల శ్రీకృష్ణుని చేతిలో సమాప్తమైనది. అతడు క్రోధముతో మడమతో తన్నుట చేత భూమిపై ఒక తీర్ధము ఏర్పడెను. ఈ వృషభాసురవధ చేత నిర్మితమైన తీర్థము అత్యంత అద్భుతమైనది అని తెలుసుకొనదగిన విషయము. ఆ వృషభరూపుడైన మహాసురుని చంపిన తర్వాత, శ్రీకృష్ణుడు ఆ తీర్థమునందే స్నానమొనరించెను. శ్రీకృష్ణుడు మనమునందు "ఈ పాపి అరిష్టాసురుడు వృషభ రూపములో కలడు. నా చేతితో ఈ హత్య జరిగినది" అను చింత ఉత్పన్నమై ఆలోచించుచుండగా, ఇంతలోనే భగవతి శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని సమీపమునకు వచ్చినది. ఆమె తన పేరుతో సంబద్ధమైన ఆ స్థానములో ఒక తీరరూప కుండమును ఏర్పడునట్లు చేసెను. అప్పటి నుంచి సమస్త పాపములను హరించు వేయునట్టి ఆ శుభస్థానము" రాధాకుండము" అను పేరుతో ప్రసిద్ధికెక్కినది. తమ ప్రసంగమునందు జనులు దానిని అరిష్ఠకుండము, రాధాకుండము అనియు కూడా పిలుచుచున్నారు. అచట స్నానము చేయుటచే రాజసూయయాగము, అశ్వమేధ యజ్ఞములు చేసిన ఫలము లభ్యమగును. మధుర యొక్క పూర్వదిశయందు ఇంద్రధ్వజము అను పేరుతో విఖ్యాతమైన ఒక తీర్థము గలదు. అచట స్నానము చేయువారు స్వర్గలోకమునకు పోవుదురు. ఇచ్చట ప్రదక్షిణము లేక యాత్ర చేయుటచే వచ్చు పుణ్యము భగవంతునికే సమర్పితము చేయవలెను. ఏమనగా ప్రారంభము చేయు సమయమున

చక్రతీర్థములో స్నానము చేయుట మనుష్యుల కర్తవ్యము. యాత్ర సమాప్తి చేయు సమయమున పంచకుండ తీర్థములో స్నానము చేయవలెను. ఇచట రాత్రి జాగరణము చేయవలసిన నియమము కూడా కలదు. ఇందుచే మనుష్యుల యొక్క పాపములన్నియూ పటాపంచలు కాగలవు.

భద్రే! అన్నకోట పర్వతము యొక్క ప్రదక్షిణ విధానము నీకు నేను తెలియజేసితిని. ఇదేవిధముగా ఇదే వరుసలో ఆషాఢమునందు కూడా ప్రదక్షిణము చేయుట జరుగును. భక్తిపూర్వకముగా శ్రీహరి భగవానుని ఈ తీర్థమునందు ప్రదక్షిణము చేయు సందర్భమున, అట్లే గోవర్ధనము యొక్క మాహాత్మ్యమును వినుట చేతను గంగయందు స్నానము చేసిన ఫలము లభించుచున్నది. పిమ్మట వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. పృథ్వీ! ఇప్పుడు నీవు ఇతిహాసయుక్తమైన మరియొక విషయమును వినుము. మధురకు దక్షిణముగా గల ఒకానొక నగరమునందు సుశీలుడు అను పేరు గల ధనవంతుడగు ఒక వైశ్యుడు నివసించుచుండెను. ఆ వైశ్యుడు బహుశా తన జీవితమంతయూ క్రయ విక్రయములలోనే గడిపి వేసెను. అందుచే ఏనాడును అతనికి ఏ రకమైన సత్సంగము ప్రాప్తింపలేదు. అట్లే అతడు ఏరకమైన దానధర్మాది సత్కార్యములు చేయలేదు. ఈ విధముగా ఆయన గృహమునందు కుటుంబమునందు ఆసక్తి కలిగిఉండియు, ఆ వైశ్యుడు పలు సత్కార్యములను చేయలేదు. కాలవశమున ఆయువు కరిగిపోవుటచే, ఈ లోకమును విడిచి పోయెను. అంతట అతడికి మరుజన్మమున ప్రేతయోనియే లభ్యమైనది. ధనము లేనివాడు, అట్లే చాయారహితమైన అడవియందు ఆకలిదప్పుల చేత వ్యాకులపాటు కలిగినవాడై, అటునిటు తిరుగుచూ ఉండెను. ఆ విధముగా తిరుగుచూ ఉండగా, అతడు భయంకరమైన ప్రేతములు కలిగిన మరుస్థలము (ఎడారి) నకు చేరిపోయెను. అచ్చట అతడు చాలా దినముల వరకు ఒక వృక్షముపై నివాసము చేయుచుండెను.

ఉర్వరా! ఈ విధముగా చాలా కాలము గడచిపోయిన తర్వాత దైవయోగము చేత అతడు వసించుచున్న ప్రదేశమునకు అమ్మకము చేయు వైశ్యుడు ఒకడు వచ్చెను. వానిని చూడగానే ఆ ప్రేతమునకు చాలా సంతోషము కలిగి నాట్యము చేయుచూ, అతడితో ఇట్లు పల్కెను. "ఓహో! నీవు ఇప్పుడు నాకు ఆహారముగా అయి ఇచటికి వచ్చితివి. అహా! ఏమి జరిగినది" అని పల్కెను. ప్రేతము యొక్క మాటలు విని ఆ వ్యాపారి వైశ్యుడు అత్యంత

భయభీతుడై, పరిగెత్తి పోవుచుండెను. అయిననూ ప్రేతము వానిని వెంబడించుచూ అతనిని పట్టుకొని "ఓరీ! ఇప్పుడు నేను నిన్ను తినివేయుదును" అని చెప్పెను. ఆ ప్రేతము అనిన మాటలను విని, ఆ వైశ్యవ్యాపారి "రాక్షసుడా! నేను నా పరివారము యొక్క భరణము, పోషణముల చేత కలిగిన దుఃఖముచే, ఈ ఘోరారణ్యమునకు వచ్చితిని. నా యింటియందే ముసలివారైన తల్లిదండ్రులు కలరు. పతివ్రతయైన భార్య కూడా ఉన్నది. నీవు నన్ను తినిన యెడల వారందరికినీ మృత్యువు తప్పదు" అని పలుకగా వైశ్యుని మాటలను విని "ప్రేతము మహామతీ! నీవు ఎచ్చటనుంచి ఇచటకు వచ్చితివి సర్వమూ ఉన్నది ఉన్నట్లే సత్యమును తెలుపుము" అనెను.

వైశ్యుడు ఇట్లు చెప్పెను. "ప్రేతా! నేను వివిధ పర్వతములలో శ్రేష్ఠమైన గోవర్ధనము, మహానది యమున ఈ రెండింటికిని మధ్యనగల మధురాపురి యందు నివసించుచున్నాను. నేను మొదటి నుంచి సంచితము చేసిన సంపత్తి ఉండెడిది. అయిననూ దాని నంతటిని దొంగలు దోచుకొని పోయిరి. అందుచే నేను అన్ని విధములా నిర్ధనుడను అయిపోతిని. ఆ కారణము చేత కొద్దిపాటి ధనమును తీసుకొని వ్యాపారము చేయుట కొరకు ఈ మరు స్థలమునకు వచ్చితిని. ఇట్టి నా స్థితియందు నీవు ఏమి చేయ తలచుకొంటివో దానిని చేయుము"

అని చెప్పగా ప్రేతము ఇట్లు చెప్పెను. "వైశ్యుడా! నీపై నాకు దయ కల్గినది. అందుచేత నేను నిన్ను ఇప్పుడు తినదలచు లేదు. నేను చెప్పబోవు వచనములను పాటించగల్గినట్లైన యెడల ఒక షరతు పై నేను వదలివేయుదును. నీవునా కార్యము ఒకదానిని సిద్ధింప చేయుట కొరకు ఇక్కడ నుంచి తిరిగి మధురానగరమునకు పొమ్ము. అచ్చటకు పోయి చతుఃసాముద్రికము అను పేరు గల కూపము వద్దకు పోయి, విధిపూర్వకముగా స్నానముచేసి నాపేరును ఉచ్చరించి, నీఇంటి యందుండు ధనముతో, విధిపూర్వకముగా పిండదానము చేయును. పిమ్మట ఇక స్నాన, దానాది అన్ని కర్మల యొక్క ఫలము నాకు ఇచ్చివేయవలయును. చాలును అదియే నీవు చేయలసిన పని. అప్పుడు నీవు ఎట్టి భయమును లేక సుఖపూర్వకముగా పోగలవు" అని పల్కిన ప్రేతము యొక్క మాటలను విని వైశ్యుడు "ప్రేతా నా వద్ద ఒక ఇల్లు తప్పించి, ఎట్టి ధనమును లేదు" అని పలుకగా అందుకై ప్రేతము చిరునవ్వుతో అతడితో 'వైశ్యా! నేను నీకు చెప్పినది, నీ

ఇంటియందలి ధనమును గురించి, దాని భావము ఏమనగా నీ ఇంటియందు ఒక గోయి కలదు. దానియందు పెద్ద పెద్ద సంచితమైన బంగారపురాశి కలదు. నేను నీకు మధురకు పోపు మార్గమును కూడా తెలుపుచున్నాను.. అని పల్కెను.

సూతుడు శౌనకాది మహర్షులతో ఇట్లు చెప్పెను. మహర్షులారా! ప్రేతము ఆ విధముగా చెప్పిన తర్వాత దానిపై ఆ వైశ్యుడు మరల "ప్రేతా! ఈ యోనియందు జన్మించి కూడా నీకు ఇట్టి దివ్య జ్ఞానము ఎట్లు లభ్యమైనది." అని ప్రశ్నించెను. ప్రేతము ఇట్లు చెప్పెను. "వైశ్యుడా! నేను కూడా దీని ముందు జన్మలో మధురా నివాసిని. అచట సాక్షాత్తు శ్రీ కృష్ణ భగవానుడే విరాజిల్లుచుండెను. ఒకనాడు ప్రాతఃకాలమున ఆ భగవంతుని మందిరమునకు బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, శూద్రజనులు అనేకులు వచ్చి గుమికూడి ఉండిరి. అచట శ్రేష్ఠుడైన కథావాచకుడు(పురాణము చెప్పువాడు) కూర్చొని ఉండెను. ఆయన పవిత్రమగు పురాణముల యందలి కథను వినిపించుచుండెను. నా మిత్రుడొకడు ప్రతిదినము అచ్చటికి పోవుచు ఉండెను. ఆ రోజు మిత్రుని ప్రేరణచే నేను కూడా అచటికి పోతిని. అత్యంత ఆదరముగా ఆ భక్తులందరునూ అనేకమార్లు నన్ను సంతుష్టిపరచుటకై ప్రయత్నించిరి. ఆ ప్రయత్నములయందు అచట ఒక పవిత్రమైన కూపము గలదని వింటిని. ఆ కూపము పాపములను కడగివేయును. అని వారి ద్వారా తెలుసుకొంటిని. ఈ కూపమునందు నాలుగు సముద్రములు వచ్చి నిలచి ఉండును. ఈ కూపము యొక్క మాహాత్మ్యమును వినుట చేత గొప్పఫలము లభించును. ఆ సమయము నందు శ్రేష్ఠులందరునూ కథావాచకునికి ధనమును సమర్పించిరి. కాని నేను మాత్రము మౌనముగా ఉంటిని. అప్పుడు నాతో ఆ మిత్రుడు మరల "ప్రియవరా! నీ శక్తిని అనుసరించి కొంత అవశ్యము ఇవ్వవలెయును" అని చెప్పెను. అందుకై నేను ఆ కథావాచకునికి ఒక సువర్ణమాల (8 రతుల బంగారముతో కూడిన నాణెము) ప్రదానము చేసితిని. అటుపిమ్మట మృత్యువు కలిగినప్పుడు నా పూర్వకర్మను అనుసరించి యమరాజు యొక్క ఆజ్ఞ దుఃఖయోజకమైన ఈ ప్రేతయోని లభ్యమైనది. పూర్వజన్మము నందు నేను ఎన్నడునూ తీర్థ స్నాన దాన హవనకవనములను గానీ, కనీసము పితరుల కొరకు తర్పణమును కూడా చేయలేదు. ఈ కారణము చేతనే నేను ప్రేతము కావలసి వచ్చినది" అని తెలుపగా దీనిపై వెశ్యుడు "నీవు ఈ వృక్షము యొక్క మొదటి భాగమున ఉండి ఎట్లు

ప్రాణధారణము చేసికొనుచున్నావు" అని ప్రశ్నించెను. అందుపై ప్రేతము మొదట జరిగిన విషయములు నేను నీకు తెల్పియే ఉంటిని. నేను ఆ కథా వాచకునికి ఇచ్చిన సువర్ణముద్రల యొక్క ప్రభావము చేత ఈ వృక్షముపై ఉండుచున్నను, తృప్తి కలిగినవానిగా ఉండుచున్నాను. వాస్తవమునకు దానిని కూడా నేను ఇతరుల యొక్క ప్రేరణ చేతనే ఇచ్చితిని. దాని పరిణామమే ఈ ప్రేత యోనియందు కూడా నేను దివ్యజ్ఞానమును కలిగి ఉంటిని" అని తెల్పెను.

వసుంధరా! ప్రేతము చెప్పిన మాటలను విని ఆ వైశ్యుడు మధరాపురమునకు పోయి, ప్రేతము నిర్దేశించనట్లుగా సమస్తమును అచ్చటనే చేసెను. అందుచేత అతడు ప్రేతముక్తుడై స్వర్గమునకు పోయెను. దేవీ! ఇది ఈ మధురాపురి యొక్క మాహాత్మ్యము, ఇచ్చట చతుఃసాముద్రిక కూపముపై పిండదానము చేయుటచే పరమగతి ప్రాప్తించును. మధుర యొక్క ఏ స్థానమునందైననూ ఆఖరుకు దేవాలయము, నాలుగు బజారులు కలియుబాట యందును, మరెచ్చటనైననూ ఎవనికి మృత్యువు కలిగినను అతడు ముక్తుడు అగును. ఇందు సందేహము లేదు. ఇతర ప్రదేశములందు చేయబడిన పాపములు ఈ తీర్థమునకు పోయినప్పుడు నష్టములై పోవును. కానీ ఆ తీర్థస్థానములలో చేయబడిన పాపములు వజ్రలేపమునందు నశించిపోవును. అయిననూ ఈ మధురాపురి యొక్క విశేషం ఇచ్చట ఒకవేళ పాపము చేసిననూ, అతనికి అచ్చటనే నష్టము కలుగును. ఎందుకనగా ఈ పట్టణము పరమ పుణ్యమయమైనది. ఇచ్చట పాపమునకు ఎచటనూ స్థానము లేదు అందుచేతనే

అన్యత్రహీ కృతం పాపమ్ తీర్థమసాథుగచ్ఛతి|

తీర్దేతు యత్కృతం పాపమ్ వజ్రలేపో భవిష్యతి ||

మధురాయాం కృతం పాపమ్ తత్రైవం వినశ్యతి|

విషాపురి మహాపుణ్య యస్యాంపాపం నవిద్యతే||

అని చెప్పబడింది. ఒకవేళ ఒకానొక పురుషుడు వేయి యుగముల వరకునూ ఒంటికాలిపై నిలబడి తపస్సు చేసినను అట్లే ఒక వ్యక్తి నివాసము చేసిన మధురా నగరవాసికి వచ్చు పుణ్యమే అధికమైనది. క్రోధరహితుడైన మానవుడు మధురయందు దేవతలను పూజించిన యెడల తీర్థములందు స్నానము చేసిన వారు దేవయోనియందు

జన్మింతురు. వేరొక స్థానమున వేయిమంది మహాభాగులైన బ్రాహ్మణులకు పూజ చేయుట చేత ఏ ఫలము లభ్యమగునో, అదియే ఫలము ఒక బ్రాహ్మణునికి చేసిన పూజతో సమానము. ఎందుకనగా దేవతల యొక్క సిద్ధ సమాజము మధురకు వచ్చి సామాన్య ప్రాణులవలె నివసించుచున్నారు. దేవతలు, సిద్ధులు భూతముల సముదాయము అంతయూ ఇచట చతుర్బాహుడైన విష్ణుస్వరూపమును, మధుర వాసులైన ప్రాణులను దర్శించు కొనుటకు వచ్చుదురు. ఆ కారణము చేత మధురయందు నివసించు మనుష్యులే విష్ణు స్వరూపులు. (164,165)

166,167 వ అధ్యాయములు -అసికుండ తీర్థము, విశ్రాంతి మాహాత్మ్యము

ధారుణి ఇట్లు పల్కెను."ప్రభూ! మహాదేవా! సంపత్కరమైన నీ ముఖమునుండి వెలువడిన అనేక విధములైన తీర్థముల వర్ణన విని ఉంటిని. ఇప్పుడు మీరు నాకు అసికుండ తీర్థ ప్రసంగమును వినిపించి నాపై దయ చూపుడు." వరాహభగవానుడు ఇట్లు పల్కెను. "వసుంధరా! సుమతి అను పేరుగల ధార్మికుడు, ప్రఖ్యాతి పొందిన రాజు కలడు. ఒక తీర్థయాత్రా ప్రసంగమందు ఆయనకు మృత్యువు కలిగెను. అంతట ఆయన పుత్రుడగు విమతి రాజ్యభారము వహించెను. ఇంతలో ఒక రోజు అచ్చటికి నారద మహాముని వచ్చిరి. విమతి ఆయనకు అర్ఘ్య పాదములిచ్చి స్వాగతము కల్పించెను. వారి ప్రసంగ మధ్యమున ముని రాజుతో "రాజా! తండ్రి ఋణమును తీర్చిన తర్వాతనే పుత్రుడు ధర్మమునందు భాగస్తుడు కాగలడు" అని చెప్పి నారదముని అచటనే అంతర్ధానుడైపోయెను. ముని వెడలిపోయిన తర్వాత రాజు మంత్రులను నారదుడు చెప్పిపోయిన విషయము యొక్క అర్థము ఏమి అని అడిగెను. మంత్రులు తమ తీర్థయాత్రల యొక్క ఫలమును మీరు మహారాజుకు సమర్పించిన మీ తండ్రి యొక్క ఋణము నుంచి విముక్తులు అగుదురు. ఎందుకనగా తీర్థయాత్ర ఎల్లప్పుడునూ సగమే పూర్తియగుచుండును. ఇదియే నారదున కథనము యొక్క ముఖ్య ఆశయము" అని చెప్పెను. ధారణీ! మంత్రులు చెప్పిన దానిని వినిన విమతి మధురాపురియందు నివసించువారి యొక్క విషయములను వివరించుచూ ఆలోచించెను. ఎందుకనగా అచ్చట అన్ని తీర్థములు అసమర్థంగా ఉన్నాయి. అందుచేత ఎచట వరాహభగవంతుడు విరాజిల్లుచుండునో, మనమందరమూ ఆ కల్ప గ్రామమునకు పోవుదము. అట్లు చేయుటయే ఉచితము అని భావించినవి. వసుంధరా ఈ విధముగా

పరామర్శించి తీర్థములన్నియూ కల్పగ్రామమునకు పోయెను. వరాహరూపమును ధరించి అచట నేను కూడా ఆనందముగనే నివసించి ఉంటిని. వారందరూ నా యెదుటకు కల్పగ్రామమునకు వచ్చి ఇట్లు చెప్పిరి. "భగవాన్! స్వయముగా మీరు శ్రీహరి. మీరు అచింత్యులు, అచ్యుతులు. అట్లే ప్రపంచమును శాసించు వారు, సృష్టి చేయువారు. ప్రభూ మీకు జయము, మీకు జయము కలుగుగాక!"

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుధా! ఆర్థికులందరునూ ఈ విధముగా నన్ను స్తుతించిరి. అప్పుడు నేను వారితో "తీర్థవరులారా! మీకు శుభమగును గాక! మీరు కావలసిన వరమును కోరుకొనుడు. తీర్థములు ఇట్లు చెప్పెను. వరాహరూపమును ధరించినవాడా! దేవేశ్వరా! మీరు సంతోషితస్వాంతులైన యెడ మమ్ములను ఈ మాహాపద నుంచి రక్షింపగల్గు అభయ ప్రదానము చేసి కృప జూపుదు."

ఆ మాటలు విని నేను మధురకు ప్రయాణమై ఇచ్చటకు చేరుకొని, నా దివ్యఅసి (ఖడ్గము) చే విమతికి శిరచ్ఛేదము చేసెను. కత్తియొక్క దెబ్బ చేత అచ్చట భూమిపై ఒక పెద్ద గర్తము పడినది. అది ఒక దివ్య కుండము యొక్క రూపములో పరివర్తన చెంది, అసికుండము అను పేరుతో ప్రసిద్ధి చెందినది. దాని ప్రభావము చేత సుమతి విమతులు ఇద్దరును ముక్తులు అయిరి. దేవీ! దక్షిణము నుంచి ఉత్తరము వరకు గల తీర్థములు ఇంతకు ముందు నేను చెప్పిన వాని గణన చేత లెక్కింపవలెను. ఈ అసికుండముతో గణన ఆరంభించుట శ్రేష్ఠము. ఏ మనుష్యులు ద్వాదశి రోజున ప్రాతఃకాలమున పడక నుంచి లేచిన వెంటనే అసికుండమున స్నానము చేయుదురో వారిని ఇచట వరాహ, నారాయణ, వామన, రాఘవల సువర్ణ విగ్రహముల దివ్యదర్శనములు కలుగును. వానిని దర్శించిన వారు ఎవరును మరల ఈ ప్రపంచమును చేరుకొనరు.

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "దేవీ! ఇప్పుడు విశ్రాంతి తీర్థము యొక్క మహిమ వినుము. పూర్వము ఉజ్జయినిలో ఒక దురాచారుడైన బ్రాహ్మణుడు వసించుచుండెను. అతడు దేవతలు యొక్క పూజ చేయడు, సాధుసంతులకు నమస్కరించడు. ఇంకనూ తీర్థములకు పోయి ఎన్నడునూ స్నానమాడడు. ఆ మూర్ఖుడు సాయంకాలము ఇరుసంధ్యలందు నిద్రపోవుచు ఉండును. బ్రహ్మ ఆశ్రమములన్నింటిలోనూ గృహస్థజీవనమే ఉత్తమమైనదని చెప్పెను. పృథ్వీయందలి జంతువులన్నియూ

గృహస్థాశ్రమమును ఆశ్రయించి ఉండును.అట్లే శిశువులయొక్క ప్రాణము తల్లిపై ఆధారపడిఉండును.అదేవిధముగా సంపూర్ణములైన ప్రాణి సమూహములు గృహస్థునిపైననే ఆధారపడి ఉన్నవి. ఈ విధముగా ఆ అధమ బ్రాహ్మణుడు ఈ ఆశ్రమమునందే నివసించుచూ ఎల్లప్పుడూ దొంగతనము మొదలగు వానిలో నిమగ్నుడై ఉండెను. దేవీ! అతడు ఒకనాడు రాత్రియందు చౌర్యము చేయుటకు ఇటు అటు తిరుగు చుండెను. ఆ సమయమున రాజు యొక్క సైనికులు అతనిని పట్టుకొనుటకై గస్తీ తిరుగు చుండిరి. అందువలన ఆ సైనికులు వేగముగా పరుగెత్తుచు అచ్చట గల ఒక బావిలో పడి మరణించిరి. ఈ విధముగా అతడు తర్వాత జన్మలో ఒక అడవియందు బ్రహ్మరాక్షసుడుగా జన్మించెను. అతని రూపము మహాభయంకరముగా ఉన్నది. ఒకనాటి విషయము. కార్యవశము చేత అచ్చటకు జనులసమూహము వచ్చినది. దానియందుగల ఒక బ్రాహ్మణుడు రక్షోఘ్నమంత్రము చదివి అందరినీ రక్షించుచుండెను. అప్పుడు ఆ సమయమున ఆ రాక్షసుడు ఆ బ్రాహ్మణుని వద్దకు వచ్చి "విప్రుడా! నీ మనస్సునందే ఏ వస్తువుపై ఇచ్ఛ కలదో దానిని నీకు సమకూర్చుటలో నేర్పుగలవాడను. చాలాకాలము తర్వాత నాకు కడుపునిండా, మనస్సు కోరిన భోజనము లభ్యమైనది. విప్రా! నీవు లేచి ఇచ్చట నుంచి పోయివేరెచ్చటనైననూ నిద్రింపుము. అందుచే నేను వీరినందరును తిని తృప్తుడను అగుదును." అని పలుకగా బ్రాహ్మణుడు "రాక్షసా! నేను వీరి వెంటనే ఇచ్చటకు వచ్చి చేరితిని, వీరందరూ నా బంధువులే. ఆ కారణము చేత నేను వీరిని వదలిపోలేను. నీవు ఇచట నుండి వెళ్ళిపొమ్ము. నా మంత్ర ప్రభావము చేత నీవు వీరిపై కన్ను కూడా మెదల్పలేవు. అట్టిశక్తి నాకు కలదు. అందుచే వెంటనే ఇచ్చట నుండి వెళ్ళిపొమ్ము, అస్తు (అగుగాక!) ఇప్పుడే మనమే మాట్లాడుకొందము. నీవు ఈ జన్మను ఎట్లు పొందితివి? ఆ విషయము నాకు తెలుపుము." అని ప్రశ్నించెను.

అందువలన ఆ రాక్షసుడు ఇట్లుచెప్పెను. "విప్రా! కేవలము అనాచారపు కారణము చేతనే నాకు ఈ దుర్గతి ప్రాప్తించినది." ఈ విధముగా ఆ రాక్షసుడు తనకు సంబంధించిన అన్ని విషయములను ఉన్నది ఉన్నట్లుగా బ్రాహ్మణునికి స్పష్టము చేసెను. దానికై బ్రాహ్మణుడు "రాక్షసా! ఇప్పుడు నీవు నా మిత్రుల శ్రేణికి వచ్చితివి. ఏమి కావలెనో కోరుకొనుము" అని అనెను.

రాక్షసుడు "విప్రా! నా మనస్సునందు ఉన్నమాటను చెప్పెదను. నీవు మధురాపురియందు విశ్రాంతి తీర్థమున స్నానము చేసినప్పుడు లభ్యమైన ఫలమును నాకు దానము ఇమ్ము. దానిచే నేను ముక్తుడను అగుదును" అని తెల్పెను. అంతట ఆ రాక్షసుడు దుస్సహమగు దుఃఖము గలవాడై ఉండగా, ఆ కృపాళుడైన బ్రాహ్మణుడు "రాక్షసా! విశ్రాంతి అను పేరు గల తీర్థమును గురించి నీకు ఎట్లు తెలిసినది? దానికి ఆ పేరు ఎట్లు వచ్చినది? ఆ విషయమును దయతో నాకు తెల్పుము" అని అడిగెను.

అందుకు "రాక్షసుడు బ్రాహ్మణా! నేను మొదట ఉజ్జయినీ నగరమందు నివాసముండు వాడను. ఒకప్పుడు నేను సంయోగవశమున మహావిష్ణుని మందిరమునందు ప్రవేశించితిని. ఆ మందిరము యొక్క సింహద్వారమున ఒక కథాకారుడు, వేదమునందు విద్వాంసుడైన బ్రాహ్మణుడు కూర్చొని ఉండిరి. ఆయనకు ఆ విశ్రాంతి తీర్థము యొక్క మహిమను తెలుపుట ప్రతిదినము చేయవలసిన వ్రతము. దాని మాహాత్మ్యమును వినుటచేతను నా హృదయమునందు భక్తి జనించినది." అనగా విప్రుడు "పాపరహితుడా! నీకు ఇప్పుడు అచ్చటనే దానిని వినవలసిన అవసరము ఎట్లు కలిగినది? ఈ తీర్థమునకు విశ్రాంతి అని పేరు ఎట్లు వచ్చినదో స్పష్టముగా చెప్పుము.' అని అడిగెను. "ఈ స్థానము వద్ద ఈశ్వరుడైన శ్రీహరి విశ్రాంతి తీసుకొనెను. ఆ విశాల భుజములు గల్గిన ప్రభువునే వాసుదేవుడు అని కూడా అందురు. అందుచేత ఈ తీర్థము "విశ్రాంతి"అను పేరుతో విఖ్యాతమయ్యెను" అని రాక్షసుడు చెప్పిన ఈ మాటలను విని ఆ బ్రాహ్మణుడు "రాక్షసా! ఆ తీర్థమునందు ఒకమారు స్నానము చేయగా లభించు పుణ్యఫలము నేను నీకు ఇచ్చివేసితిని" అని తెల్పెను. ప్రియే! బ్రాహ్మణుని ముఖము నుండి ఆ మాట వచ్చిన వెంటనే రాక్షసునికి విముక్తి కలిగినది. (166,167)

168, 169 వ అధ్యాయములు - మధుర అవాంతర తీర్థముల మాహాత్మ్యము

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను."ధారుణీ! పరమాత్ముడగు శివుడు ఈ మధరాపురిని నిరంతరము రక్షించుచుండును. ఆయన దర్శన మాత్రము చేతనే మధుర యొక్క పుణ్యఫలము సులభము అగును. ప్రాచీన కాలములో రుద్రుడు వేయి సంవత్సరములు పూర్తియగునంతవరకు నన్ను గురించిన కఠినతపమొనర్చెను. నేను సంతుష్టుడనై శివునితో హరా! నీ మనస్సునందు కావలెననుకొన్న వరమును నాకు

తెలియజేయము" అనగా మహాదేవుడు ఇట్లు పల్కెను."దేవేశా! నీవు సర్వత్రా వ్యాపించి విరాజమానుడవై ఉన్నావు. నీవు నాకు మధుర యందు ఉండుట కొరకు స్థానమునిచ్చి దయ చూపుము". మహాదేవుని మాటలను విని అందుపై నేను "దేవా! నీవు మధురయందు క్షేత్రపాలక స్థానమును తీసుకొనుము. ఇది నాకు సమ్మతమైనది. ఎట్టి వ్యక్తియైననూ ఇచ్చటకు వచ్చి నీ దర్శనమును చేసుకొనని వానికి ఎట్టి సిద్ధియును ప్రాప్తింపదు." అనెను. స్వర్గమున ఇంద్రుని అమరావతి పురము ఎట్లుండునో అట్లే జంబూద్వీపమునందు ఈ మధురాపురి ఉండును. ఎట్లైననూ మధురామండలము యొక్క విస్తరణము ఇరవైయోజనముల వరకు గలదు. అయినను అచ్చట ఒక్కొక్క అడుగును ఉంచుట చేత కూడా అశ్వమేధయాగము చేసిన ఫలము లభించుచున్నది. ఈ క్షేత్రమునందు అరవై కోట్ల ఆరువేల తీర్థములు కలవు. గోవర్ధన పర్వతము అట్లే అక్రూర క్షేత్రములు, ఈ రెండునూ రెండుకోట్ల తీర్థములతో సమానమైనవి. ఇంకనూ ప్రస్కంధనము, భాండీరము ఇవి ఆరు కురుక్షేత్రములకు సమానములు. సోమతీర్థము, చక్రతీర్థము, అవిముక్తము, యమునము, తిందుకము, అకృూరము అను పేర్లు గల తీర్థములకు ద్వాదశాదిత్య తీర్థములు అని పేరు గలదు. మధురయందలి అన్ని తీర్థములు కురుక్షేత్రమునుంచి వందరెట్లు మాహాత్మ్యము గలవి. ఇందు ఎట్టి సంశయము లేదు. ఎవరు మధురాపురి యొక్క ఈ మాహాత్మ్యమును సమాహితచిత్తుడై పఠించునో లేక వినునో అతడు పరమపదమును తాను స్వయముగా ప్రాప్తింపజేసుకొనుటయే గాక తన తల్లి తండ్రి ఇరువురి పక్షముల యందుండు రెండు వందల ఇరవై పీడల నుండి ఉద్ధరించినవాడగును.

మధురయందలి స్థానములన్నింటిలోనూ శ్రీకృష్ణుని యొక్క చరణ చక్రముద్రల చిహ్నములచే సుశోభితములై ఉండును. వానికి మధ్యన ఒక తీర్థము కలదు. దానియందు చక్రము యొక్క సగము మాత్రమే దృగ్గోచరము అగును. అచ్చట నివసించు వారు ముక్తి పొందుటకు అధికారము కలవారగుదురు. ఆవంతయు ఇందు సంశయము లేదు. శ్రీకృష్ణుని యొక్క క్రీడాభూమికి కూడా రెండు హద్దులు కలవు. ఒకటి ఉత్తరమున, రెండవది దక్షిణమున ఆ హద్దులు ఉండును. ఆ రెండింటి మధ్యభాగమున అవి విరాజిల్లుచుండును. ఆకారమునందు అవి విదియనాటి చంద్రునికి సమానముగా ఉండును. అచ్చట స్నానము, దానము చేసిన మనుష్యులకు దివ్య తీర్థములగు మధురాక్షేత్ర దర్శన ఫలము ప్రదానము

చేయుట కొరకు సదా ఉద్యుక్తులై వారు ఉందురు. అచ్చట గల నియమానుసారము జీవించు శుద్ధభోజనమును చేయువారు, స్నానము చేయువారు ఉందురు. అట్టి వారికి అక్షయ లోకప్రాప్తి సిద్ధించును. ఈ విషయమునందు ఎట్టి సందేహము అక్కర్లేదు. దక్షిణ కోటినుంచి మొదలు పెట్టి ఉత్తరకోటి పై యాత్రాసమాప్తి చేయవలెను. ఇచ్చట యజ్ఞోపవీతము యొక్క ప్రమాణభారము భూమిపై నడచువారిని వారి ద్వారా అనేక కులములవారిని రక్షింప గల్గుచున్నారు.

పృథ్వి ఇట్లు ప్రశ్నించెను. “ప్రభూ! యజ్ఞోపవీతము యొక్క ప్రమాణము ఏమి? నాకు ఈ విషయమును గురించి దయతో స్పష్టముగా తెలియజేయుడు. వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. “వరవర్ణినీ! ఇప్పుడు నేను యజ్ఞోపవిధిని తెలుపుచున్నాను వినుము. నా క్రీడాభూమి యొక్క దక్షిణ సరిహద్దు ఉన్న ప్రదేశము నుంచి మొదలు పెట్టి, ఉత్తర సరిహద్దు వరకు గల హద్దు యజ్ఞోపవీత హద్దు అనబడుచున్నది. ఇదే పద్ధతిలో దక్షిణము నుంచి ఆరంభించి ఉత్తరదిశయందు గల హద్దుపై యాత్రను సమాప్తము చేయవలెను. ఇంటికి బయట అయినప్పుడు స్నానము చేయనంతవరకు మౌనముగా ఉండవలెనను నియమము కలదు. వసుంధరా! స్నానము చేసిన తర్వాత శ్రీ కృష్ణ భగవానుని పూజ చేయుట పరమ ఆవశ్యకము. దీని తర్వాతనే మాట్లాడవలెను. స్నానము సమాప్తమైన తర్వాత, క్రమవిధానములో దేవాధి దేవుడగు శ్రీకృష్ణుని పూజ, యజ్ఞము, పాలుఇచ్చు గోపూజ చేయుట పరమ ఆవశ్యకమైన విషయము. ఈ క్రియ పూర్తియైన తర్వాత మాట్లాడవలసి ఉండును. పిమ్మట సువర్ణము, ధనవితరణ, బ్రాహ్మణులకు భోజనము తినిపించవలెను. ఈ విధముగా చేయు వ్యక్తి మరల తిరిగి వచ్చి సంసారమునందు పడడు. అతడు నా ధామమును పొందగలడు. ఈ అర్ధచంద్ర తీర్థమునందు ఎవరికి మృత్యువు వచ్చునో లేక ఎవని ఔర్వదైహికక్రియ జరుగునో, వారు అందరునూ స్వర్గమునకు పోయెదరు. ఈ తీర్థమున పురుషుని ఎముకలు ఎప్పటి వరకు నిలిచి ఉండునో అప్పటి వరకునూ అతడు స్వర్గలోకమునందే ప్రతిష్ఠితుడై యుండును. ఇంతకు ఎక్కువగా చెప్పవలసినది ఏమియు లేదు? ఇచ్చట గాడిద శరీరమును అయినను అగ్నికి ఆహుతి చేసినప్పుడు అది కూడా విష్ణురూపమును ప్రాప్తించుకొనగల్గును.

మధురయందలి ప్రాణులు నా రూపముననే ఉండును. అవి తృప్తి చెందిన యెడలనే నేను తృప్తుడను అగుదును. ఇందు సంశయము ఏమియు లేదు. దేవీ! ఈ విషయమునందు గరుడుని ఆఖ్యానమును వినుము. ఒకమారు అది శ్రీకృష్ణ దర్శనాభిలాషతో మధురకు వచ్చినది. అచ్చట నివాసితులందరునూ కృష్ణుని రూపములో ఉండుట చూచినది. చివరలో అది ఏదో విధముగా భగవంతుని వద్దకు పోయి ఆయనను సుదీర్ఘముగా స్తుతించినది. గరుడుడు చేసిన స్తుతిని విని భగవంతుడు "గరుడా! నీవు ఏ ఉద్దేశ్యముచే మధురకు వచ్చితివి? ఎందుకొరకు ఈ నా స్తుతిని చేయుచున్నావు? ఈ విషయములన్నింటినీ విశదముగా తెలుపుము" అని ప్రశ్నించెను.

గరుడుడు ఇట్లు పల్కెను. "భగవాన్! నేను మీ కృష్ణ రూపమును దర్శనము చేసుకొనవలెనను కోరిక చేత మధురకు వచ్చి ఉంటిని. కాని ఇచట వసించు ప్రజలందరయందును నాకు మీ స్వరూపమే కనబడినది. నా దృష్టియందు మధురయందలి ప్రజలందరును ఒకే విధముగా కనిపించుచున్నారు. అందరును ఒకే రకముగా ఉండుటను చూచి నేను మోహమునందు పడిపోయితిని" అనగా గరుడుని ఈ మాటలు విని శ్రీహరి చిరునవ్వు నవ్వి మధుర వాక్కులచే ఈ విధముగా చెప్పెను.

"గరుడా! మధురా నివాసులందరికి రూపము వేరు కాదు. అది నా రూపమే. పక్షిరాజా! ఎవనియందు పాపము నిండి ఉన్నదో వారు మధురా నివాసులకంటెను భిన్నముగా కన్పించును." అని చెప్పి శ్రీకృష్ణ భగవానుడు అచ్చటనే అంతర్ధానుడయ్యెను. గరుడుడు కూడా అచ్చటనుంచి వైకుంఠమునకు పోయెను. ఇచ్చట మరణించిన మనుష్యుడు, పశువులు, పక్షులు వంటివే గాక తిర్యగ్యోనులగు కీటకములు పక్షులు కూడా అన్నియును నాలుగు భుజములు గల విష్ణు రూపమును పొందును. ఇది సంపూర్ణముగా నిశ్చితమైన విషయము.

దేవీ! ఇచ్చటకు వచ్చి, శ్రీకృష్ణుని భగవతి ఏకాంశ, ఆమె తల్లి యశోదాదేవి, అట్లే మహావిద్యేశ్వరి దేవుల యొక్క దర్శనము కూడా చేసికొనుట ఆవశ్యకము. ఇచ్చట విశ్రాంతి తీర్థము, దీర్ఘవిష్ణువు, కేశవుల దర్శనము చేసికొనుటచే అందరూ దేవతల దర్శనము అర్చనము చేసిన పుణ్యఫలము ప్రాప్తించును. (168, 169)

170 వ అధ్యాయము - గోకర్ణ, సరస్వతీ తీర్థముల మాహాత్మ్యము

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "దేవీ! ఇప్పుడు నేను నీకు రెండవ ప్రాచీన ఇతిహాసమును తెలుపుచున్నాను. దీనిని శ్రద్ధగా వినుము. చాలాకాలము క్రిందట మధురయందు వసుకర్ణుడు అను పేరు గల ప్రసిద్ధ వైశ్యుడు నివసించుచుండెను. ఆయన భార్య సుశీల అను ఆమె గొప్ప సద్గుణవతి. చాలాకాలము పాటు వారికి సంతానము లేకుండెను. ఒకరోజు ఆ వైశ్యపత్ని సరస్వతి తటము పైన పుత్రవతులు అయిన చాలామంది స్త్రీలను చూచి ఖిన్నురాలై ఏకాంతము నందు ఏడ్చుచుండెను. అది చూచిన ఒక ముని హృదయమునందు దయ పొంగి పొరలి, ఆమెతో "శుభగురాలా! నీవు ఎవరవు? ఎందుకు రోదించుచున్నా"వని ప్రశ్నించెను. అందుకు సుశీల ఆ మునితో "మహాత్మా! నేను పుత్రహీనురాలనైన స్త్రీని. కాని నా సఖులందరునూ పుత్రులు కలవారే! ఇది నేను రోదించుటకు కారణము" అని చెప్పెను. ఆ మాటలను విన్న ముని "దేవీ! గోకర్ణ భగవానుని కృప చేత నీకు కుమారుడు లభ్యమగును. నీవు నీ భర్తతో ఆ గోకర్ణభగవానుని ఆరాధింపుము. అంతేగాక స్నానము, దీపదానము, ఉపహారము వంటి అనేక విధములైన జపములు స్తోత్రముల చేత ఆయనను ప్రసన్నుని చేసికొను ప్రయత్నము చేయుము" అని చెప్పెను.

ముని చెప్పిన ఆ ఉపదేశమును విని ఆ వైశ్యపత్ని ఆయనకు నమస్కరించి తన యింటికి పోయి ముని చెప్పిన మాటలను తన భర్తతో చెప్పి, ఆతనికి అవగతము చేసెను. అందుచే వసుకర్ణుడు భార్యతో దేవీ! ముని చెప్పిన మాటలు నాకు కూడా అనుకూలము గాను, ఆశాప్రదముగాను అనిపించుచున్నవి అని భార్యతో పల్కెను. అంతట ఆ వైశ్య దంపతులు ప్రతిదినము సరస్వతీ నదిలో స్నానము చేసి పుష్ప, ధూపదీపాదుల చేత గోకర్ణమహాదేవుని ఆరాధించుట ప్రారంభించిరి. ఈ విధముగా పది సంవత్సరములు గడచిపోయిన తర్వాత శంకరభగవానుడు వారిపై ప్రసన్నుడై ఆ దంపతులకు రూపవంతుడు, గుణవంతుడు అయిన పుత్రప్రాప్తి కలుగునని వరమునిచ్చెను. పిమ్మట పదవనెలలో సుశీలకు ఒక సుందరుడైన పుత్రుడు జన్మించెను. పుత్ర జన్మోత్సవ సమయమున వసుకర్ణుడు వేయి గోవులు, హెచ్చుగా బంగారము, అట్లే వస్త్రములు దానమిచ్చెను. అతడు గోకర్ణ భగవానుని దయచేబిడ్డ పుట్టిన కారణము చేత ఆ పిల్లవాని

పేరు గోకర్ణుడు అని పెట్టెను. పిమ్మట ఆయా సమయములందు ఆ బిడ్డ అన్నప్రాసన, చూడాకరణము, యజ్ఞోపవీతము మొదలగు సంస్కారములను జరిపించి, వైవాహిక గోదానము చేయించెను. అంతట వసుకర్ణుని సమయము భగవంతుని పూజ, ఉపాసనాదులందు గడచుట ముదలయ్యెను. గోకర్ణుడును క్రమముగా పెరిగి యవ్వనావస్థకు చేరుకొనెను. అతనికి పుత్రులు ఎవ్వరునూ కలుగలేదు. అందుచేత అతడికి తండ్రి మరి మూడు వివాహములను చేయించెను. ఈ విధముగా అతనికి నలుగురు భార్యలు కలిగిరి. వారు అందరునూ సౌందర్యము గలవారే. అట్లే రూపవయో ఉత్తమగుణ సంపన్నులు. అయిననూ వారికి సంతాన సుఖము కల్గు ప్రాప్తము కలుగలేదు. అంతట గోకర్ణుడు కూడా పుత్రప్రాప్తికై కార్యములు చేయుట ప్రారంభించెను. అంతేగాక అనేక వాపికూప తటాక మందిరములు మొదలగువానిని నిర్మాణము చేయించెను. మంచినీళ్ళ కొరకు బావులు, భోజనము కొరకు నిత్యాన్నదానముల ఏర్పాటు చేయించెను. అతడు గోకర్ణ శివునికి సమీపములో పశ్చిమ దిశయందు భగవంతుడు చక్రపాణి యొక్క అతి పెద్ద పంచాయతనము (దేవాలయము) నిర్మింపజేసి దాని చుట్టును విశాలమైన ఉద్యానవనమును నాటించెను. ఆ వనములలో అనేక విధములైన వృక్షములు, పుష్పలతలను వేయించెను. ఆ నలుగురు భార్యలు మందిరమునకు పోయి భగవానుని పూజా పునస్కారములు చేయుచుండిరి. ఈ విధముగా ధర్మనిష్ఠయందు ప్రవృత్తుడైన గోకర్ణునికి ధనధాన్యాదులన్నియూ నెమ్మది నెమ్మదిగా ఖర్చు అయిపోయెను. అందుచేత గోకర్ణునికి చింత కలిగినది. దానిని గురించి ఆలోచించి "ఇప్పుడు నేను ఏమి చేయగలను? నాకు అతి గొప్ప కష్ట సమయము కూడుకొని వచ్చినది. ఎందుకనగా తల్లి,తండ్రి అట్లే ఆశ్రిత పరివారముల భోజన ఏర్పాట్లు నాపైనే ఉంచబడినవి. అంతేగాక ధనము లేకుండా ఆ పని సుకరము కాదు" అని ఆలోచించెను. అతడు మరల వ్యాపారము చేయవలెనను కోరికచే మనస్సులో నిశ్చయించుకొని, తదుపరి కొందరు సహాయకులను వెంటనిడుకొని మధురామండలం నుంచి వెడలిపోయెను. అంతేగాక కొంత క్రయవిక్రయ సామానును తీసుకొని అతడు తన ఇంటికి పోయెను.

ఒకరోజున గోకర్ణుడు కొద్దిపాటి విశ్రాంతిని తీసుకొనవలెనను కోరికచే పర్వత శిఖరము పైకి పోయెను. అచట చాలా అందమైన గుహలు కలవు. అతడు ఇటునటు

తిరుగుచుండిన సమయమున అతడి దృష్టి అనుపమైన ఒక చోట పడెను. అచ్చట స్వచ్ఛమైన జలము నిండి యుండినది. ఇంకను అచ్చట ఫలము గల వృక్షములు, సుగంధములగు లతాపుష్పములతో బరువెక్కి ఉండెను. ఒకచోట రెండు పర్వతములు కలిసిన చోట 'మాల' (దండ) వలె గోళాకారముగా ఖాళీస్థలము పడి ఉండెను. అచ్చటనే అతనికి ఎవరో అతిథి స్వాగతమునకై పిలుచుచున్నట్లు అనిపించెను. ఇంతలో అతడి దృష్టి ఒక రామచిలుక పై పడినది. ఆ చిలుక ఒక పంజరంలో ఉన్నది. గోకర్ణుడు గాని దగ్గరకు పోయిన వెంటనే అది "పాంథా! దయతో మీరు మీమీ సహచరులతో పాటు ఈ రెండు ఉత్తమ ఆసనములందు కూర్చొనుడు అర్ఘ్య పార్వ ఫల పుష్పములను స్వీకరించుడు. ఇప్పుడే నా తల్లిదండ్రులు ఇచ్చటకు వచ్చి మీకందరకూ విశేషముగా స్వాగతింతురు. కారణము గృహస్థుడెవరైననూ రాగా, వచ్చిన అతిథికి స్వాగతము ఇవ్వని యెడల అతని పితరులు తప్పక నరకమునందు పడుదురు. ఎవరు అతిథులుగా వచ్చినవారికి గౌరవముగా ఆతిథ్యమిచ్చెదరో వారికి అనంతకాలము వరకును స్వర్గమునందు ఆనందము అనుభవించు అవకాశము లభించును. ఏ గృహస్తు యొక్క ఇంటికి అతిథి వచ్చి నిరాశతో తిరిగిపోవునో వాని యొక్క పాపమంతయూ ఆ గృహస్థునకు ఇచ్చి అతడి పుణ్యమును తాను తీసుకొని పోవును. అందుచేతనే అన్ని విధములా ప్రయత్నము చేసి, అతిథి యొక్క స్వాగతమునకు సిద్ధమగుటయే గృహస్థుడు చేయవలసిన పని."

అతిథిర్యస్య భగ్నాసో గృహాత్ ప్రవర్తతేయధి |

ఆత్మనో దుష్కృతం తస్మైతద్వా తత్సుకృతా హరేత్ ||

తస్మాత్ సర్వప్రయత్నేన పూజ్యాతై గృహమేధీనా|

కారే ప్రాప్తిస్వకాలే వాయథా విష్ణుస్తథైవసహాః ||

భావము: అతిథి సమయమునకు వచ్చినా లేక అసమయమున వచ్చినా అతడు విష్ణు భగవానునితో సమానముగా పూజించుటకు అర్హుడు.

దీనికి గోకర్ణుడు చిలుకతో "పురాణములలో చెప్పబడిన రహస్యములను తెలిసిన వాడవు నీవు ఎవరవు? ఇచ్చటి మనుష్యులు ధన్యులు. ఎందుకనగా వారివద్ద నీవు నివసించు చున్నావు." అని పలుకగా ఇందుకు ఆ చిలుక తన పూర్వేతిహాసమును తెలుపుట ప్రారంభించెను. ఆ చిలుక ఇలా చెప్పినది "పాంథుడా! చాలా పురాణకాలము నాటి మాట.

ఒక పర్యాయము సుమేరుగిరి యొక్క ఉత్తర భాగమునందు మహర్షుల నివాసము కలదు. మునులలో శ్రేష్ఠులైన శుకదేవుడు తపస్సు చేయుచుండెను. ఆయన ప్రతిదినము పురాణ ఇతిహాసములను ప్రవచనము చేయుచూ ఉండగా దానిని వినుటకు అసిత, దేవర, మార్కండేయ, భరద్వాజ, యవక్రిత, భృగు, అంగీరస, త్రైత్రి, రైభ్య, కణ్వ, మేధాతిథి, కృతతంతు, సుమంతు, వసుమాన్, ఏకతా, ద్విత, వామదేవ, అశ్విర, తితీర్ష ఇంకనూ గోతమోదర మొదలగు మునులు కూడా అనేక వేదజ్ఞములైన ఋషి మహర్షి సిద్ధ దేవతా పన్నగ గుహ్యాలకు మొదట వచ్చు ధర్మసంకేత విషయమున శంకలను తీర్చుకొనుటకు వచ్చారు. ఆ సమయమున నేను వామదేవముని యొక్క దురాచారి అయిన శిష్యుని సుఖోదరుడు అనుదానిగా ఉంటిని. నాకు చిన్నతనము నుండియే ధర్మకథ లేక నీతులపై చర్చ జరిగెడిది. అచ్చట నేను అశ్రద్ధ కలవాడనై ముందు నాకు గలిగిన అట్లే మాటిమాటికి తర్కవితర్కములు చేయుచుండు స్వభావము ఏర్పడినది. గురువు నేను అన్యాయవాదిని అని చెప్పి నన్ను అడ్డగించుచుండెను. అయిననూ నా ఈ పద్ధతి పోలేదు. అచ్చట కూడా నేను ఒక రోజు జరిగినట్లే చేసితిని. అయినప్పటికీ నా గురువునూ, ఇంకనూ అనేక ప్రధానమునులును అన్ని అడ్డగించిరి. అయినప్పటికీ నేను వారి మాటలను అవహేళనము చేసితిని. అంతట శుకదేవుడు క్రోధావేశముచే వచ్చి, నాకు శాపము ఇచ్చుచూ "ఇతడు మహాబకవాది. అందుచేత ఇతడి పేరు ఎట్లున్నదో దానిన అనుసరించి ఇతడు శుకపక్షి అగునుగాక", అని శాపమిచ్చెను. ఇంకేమి కలదు. నేను వెంటనే చిలుకను అయిపోతిని. అయినను మరల మునుల ప్రార్ధనపై అతడు ఇట్లు చెప్పెను. "దీని రూపము పక్షిరూపమే ఉండుగాక! లేక ఇతడు పురాణములన్నియు తెలిసినవాడు అగుగాక! అట్లే శాస్త్రముల అర్ధము అవగతము అగును. చివర మధురానగరము నందు చనిపోయి, బ్రహ్మలోకమును ప్రాప్తింపజేసుకొనును." పాంథుడా! అటు తర్వాత నేను అచట నుండి ఎగిరిపోయి ఈ హిమాలయ పర్వతముల మీదికి వచ్చి ఈ గుహయందు ఉండుట మొదలుపెట్టితిని. సావధానముతో ఎల్లప్పుడూ మధుర అను పేరును జపము చేయుచూ ఉందును. మరల నేను ఒక పక్షి సమూహముల గోళ్ళయందు ఇరుక్కొంటిని. అందుచేతనే ఈ పక్షులయందు ఉండుట ఏర్పడెను. అప్పుడు గోకర్ణుడు ఇట్లనెను. "భద్రుడా! నేను పాపనాశినియగు మధురాపురమునందు నివసించుచున్నాను. వ్యాపారమునకు కొంత విశ్రమము తీసుకొని

ఆలోచనతో ఇచటకు వచ్చితిని. ఇచట ఈ రెండింటిని గురించి ఈ విధమైన చర్చ జరుగుతున్నది. ఇది ఏదో ఒక పద్ధతి ప్రకారము జరుగుచు ఉన్నది. ఎట్లనగా శబరుని స్త్రీ ఆ సమయమున నిద్రించుచున్నది. కొందరు అలికిడి అగుటచే నిద్రనుంచి మేలుకొనిరి. చిలుకవారితో "తల్లీ! వీరు అతిధులుగా ఇచటకు వచ్చి ఉన్నారు. అందుచేత మనకు పూజ్యులు." అనగా ఆమె స్వాగతమునకు అవసరమగు వస్తువులను సమకూర్చుట మొదలు పెట్టెను. ఈ మధ్యనే శబరము అచటకు వచ్చెను. చిలుక ఆమెకు కూడా ఆతిథ్య సత్కారము చేసుకొనవలయునని సలహా ఇచ్చినది. అతడు గోకర్ణునికి నమస్కరించి, ఆమెను పూజించి స్వాదిష్టములైన ఫలములు, సుగంధపూర్ణపేయములు మొదలగునవి సమర్పించి కొద్దిసేపు మాట్లాడి "అతిథి దేవా! మీకు నేను ఇంకనూ ఏమి చేయవలెను చెప్పుదు?" అని అర్థించెను. గోకర్ణుడు "మిత్రమా! నీవు స్వాగత సత్కారములకు విరుద్ధముగా నాకు ఇతరములైన వేరు పదార్ధములను ఇవ్వవలెననుకొనుచున్న యెడల నాకు ఈ చిలుకనే ఇచ్చివేయుము. నేను దీనిని మధురకు తీసుకొని పాటు దానిని నా పుత్రుని రూపమున ఉంచుకొందును." అని చెప్పగా విని శబరుడు "నీవు దీనికి బదులుగా యమునా స్నానము చేసిన ఫలమును నీవు ఇవ్వగలవా?" అని ప్రశ్నించెను. ఆ మాటకు ఈ చిలుక "ఎవరైననూ నీచ యోనియందు పుట్టినవాడైనను లేక జన్మతో రాక్షసుడైననూ కానిమ్ము. అతడు మధురవాసియై సంగమ స్నానము లేక ద్వాదశీ వ్రతము చేయువాడైనను అతడికి అభీష్టము ప్రాప్తించగలదు. ఎవరు సంగమము నందు స్నానము, భగవంతుడు గోకర్ణేశ్వరుని దర్శనము చేయునో అతడు యమపురియందు ప్రవేశించడు. అతడికి శ్రీహరి భగవానుడు తన లోకమును ప్రాప్తింపజేయును" అని చెప్పగా అందుకు గోకర్ణుడు స్వీకృతిని ఇచ్చివేసెను. (170)

171 వ అధ్యాయము – చిలుక, వసుకర్ణ సంభాషణ

అనంతరము వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఈ విధముగా గోకర్ణుడు శబరునితో (మధురా స్నానమునకు బదులు) ఈ చిలుకను ప్రాప్తించుకొని, మధురానగరమునకు ప్రయాణించెను. అటు తర్వాత అచ్చటకు చేరుకొని ఆ చిలుకను తన మాతాపితలకు అప్పగించి అట్లే వారికి పరిచయమును కూడా చేసెను. మరల కొన్ని దినములైన తర్వాత అతడు వ్యాపారము చేయుటకొరకై ఆ చిలుకను తన వెంట తీసుకొని తన సహకర్ములతో సముద్రమార్గము ద్వారా పోయెను.

ఈ మధ్యలో ఒక రోజు ప్రతికూల వాయువు వీచుట చేత సముద్రమునందు వెను వెంటనే భయంకరమైన తుఫాను వచ్చెను. ఆ కారణము చేత, అందరూ పడవ ప్రయాణికులు భయపడిపోయి గోకర్ణుని లక్ష్యముగా చేసుకొని "ఎవడో నికృష్ణుడు, పాపి అయిన వ్యక్తి ఈ ఓడపై ఉన్నందువలన మన ఈ యాత్ర అంతకును దుర్ధశ కలిగినది. మనమందరమూ చావవలసి వచ్చుచున్నది" అని అనుట మొదలిడిరి. గోకర్ణుడు చిలుక ఎదుట తన దయనీయ స్థితిని తెలిపి, "ఇంకనూ పుత్రహీనుడైన వ్యక్తికి బహుదుర్గతి ప్రాప్తించును. ఇచ్చట ఓడలో ఉన్న ఎందరు వ్యక్తులు కలరో వారిమధ్య, అందరికంటే నేను పెద్ద పాపిని. ఇప్పుడు ఏమి చేయుట ఉచితము? ఇదంతయూ నీకు తెలియునా?" అని అడిగెను.

చిలుక ఇట్లు చెప్పెను. "తండ్రీ! నీవు దుఃఖపడవద్దు. ఇప్పుడే నేనొక ఉపాయమును పన్నుచున్నాను. అని ఈ విధముగా గోకర్ణుని ఓదార్చి, ఆ చిలుక ధృవము వైపుగా ఉత్తర దిశకు ఎగిరిపోయెను. ముందు ఒక యోజనము ఎత్తులో పర్వతము యొక్క ఒక శిఖరము కనపడుచు ఉండెను. దానిని దాటి అది విష్ణు భగవానుని సుందరమైన మందిరమునకు చేరుకొనెను. దాని ప్రభావము చేత అన్ని వైపుల నుంచి గొప్ప శోభ కలిగెను. దానికి లోపల ప్రవేశించి,అతడు "ఇచట ఏ దేవుడు విరాజిల్లుచున్నది? నేను ఆయన నుంచి తెలుసుకోవాలనుకుంటున్నాను. అపారకష్టములను అధిగమించి పుణ్యాత్ముడైన నా తండ్రి ఈ ఘోర సముద్రమును ఎప్పుడు దాటి రాగలడు?" అని అనుకొనెను. పృథ్వీ! ఆ చిలుక ఈ చింతయందు ఉండగనే, అచ్చటకు ఒకదేవి వచ్చినది. ఆమె చేతి యందు ఒక సువర్ణపాత్ర కలదు. ఆమె విష్ణువునకు పూజ చేసి "నమో నారాయణాయ" అని పలికి ఒక ఉత్తమమైన ఆసనముపై కూర్చొనెను. అంతలో, అతి తక్కువ సమయము మాత్రమే గడచిపోగా, మరల అచటకు పూర్వ స్త్రీ వలెనే ఉన్న అసంఖ్యేయులైన రూపవతులైన సుందర దేవులు వచ్చిరి. వారు అందరూ నృత్యగాన వాద్యముల చేత దేవార్చనము చేసి తిరిగి వెళ్ళిపోయిరి. అచ్చట జటాయువుయొక్క వంశమునకు చెందిన కొన్ని పక్షులు కూడా ఉండెను. వారు ఆ చిలుకను "నీవు ఇచటికి ఎట్లు చేరితివి? ఎందుకనగా, అగాధ జలపరిపూర్ణమైన సముద్రమును దాటుట సాధారణులకు సాధ్యము కాదు." అని ప్రశ్నింపగా, అందుకు రామచిలుక" నా తండ్రి

వాయువు యొక్క తేజముచే, సముద్రము ఓడపై గొప్పకష్టములను ఎదుర్కొనుచున్నాడు. ఆతనిని రక్షించుట కొరకు నేను ఇచ్చటికి వచ్చి ఉంటిని. మీరు కొంత ప్రయత్నించుడు. ఆ ప్రయత్నముతో వారికి సుఖము కలుగవచ్చును" అని చెప్పెను.

పక్షి గణములు ఇట్లు పల్కినవి. "ఏ మార్గము గుండా మీరు వచ్చిరో దానిని అనుసరించుడు. మేము కాలి కదలికల చేత మాత్రమే సముద్రము నందు నడచి ముక్కులతో మొసళ్ళు మొదలగు వానిని సంహరింతుము. అందుచేత నీతో పాటు మీ తండ్రి కూడా సముద్రమును దాటగలడు" అని చెప్పెను. అంతట ఆ చిలుక ఆ పక్షుల వెంటనే పోవుచూ గోకర్ణుని వద్దకు వచ్చెను. పిమ్మట గోకర్ణుడు అతిప్రయాస చేత సముద్రము బయటకు వెలువడెను. అచటకు చేరుకొని, అతడు దైవమందిరమునకు ఎదురుగా పోయెను. అక్కడున్న కమలములచే సుశోభితమైన ఒక సరోవరము కలదు. దాని సోపానములు (మెట్లు) మణులు,రత్నములచే తయారైనవి. గోకర్ణుడు ఆ సరోవరములో స్నానముచేసి దేవతలకును, పితరులకును తర్పణములు వదలెను.మరల మందిరమునకు పోయి కేశవ భగవానుని ఆరాధించి, అతడు గొప్ప రత్నముల ద్వారా సంపన్నుడై ఆ పంచాయతన మందిరమునందు చిలుకతో ఒక వైపున ఉండిపోయెను. ఇంతలోనే ఆ మందిరమునందు దేవార్చనలు చేసిన దేవులు అచటకే తిరిగి వచ్చిరి. దేవపూజ చేయుట మొదలిడిరి. తర్వాత వారిలో ఒక ప్రధానదేవి "సఖియలారా! బ్రహ్మయందు నిష్ఠగా ఉండువారు గోకర్ణుడు తినుట కొరకు ఫలములు, జలముల కొరకు ఉత్తమమైన జలమును ప్రదానము చేయుడు. వాటిచే మూడు నెలల వరకు దీని తృప్తి నిలిచి ఉండును. శోకము, మోహము పోయి వానితో పాపము కూడా నష్టమై పోవును." అనెను.

పిమ్మట అంతయునూ అతడు చెప్పినట్లే చేసి "నీవు నిశ్చితముగా, నిర్భయముగా ఈ స్వర్గమునందలి సామానులు సుఖమగు స్థానములయందు ఉంచి, నీ కార్యము సిద్ధించు వరకు అచ్చటనే నివాసము ఉండుము" అనిచెప్పి పిమ్మటవారు అచ్చటనుంచి వెళ్ళిపోయిరి. అంతట గోకర్ణుడు మరల ఈ ప్రకారము ఉండుచు, మధురాపురియందు వలెనే ఉండిరి. కొంతకాలము తర్వాత అతని ఓడకూడా సంయోగవశముచే ఒడ్డునకు వచ్చెను. అప్పుడు ఇచ్చట ఓడపైగల అతడి సహచరులు అతనిని చూడక తమలో తాము "అయ్యో! గోకర్ణుడు ఎచటికి పోయెనో తెలియనే లేదు. అతడు మరణించెను. జలములందు మునిగిపోయెను.

ఇపుడు మనవారి కర్తవ్యమేమనగా అతని తండ్రికి ఎదురుగా మనము కూడా పుత్ర రూపములో నిలువవలెను. ఉపార్జిత రత్నములనుంచి ఎంతభాగము గోకర్ణునికి కలదో దానిని అతని తండ్రికి అప్పగించెదము" అని అనుకొనిరి. అచ్చట గోకర్ణుని మనస్సు విపరీతమైన శోకాకులము కలదయ్యెను. అతడు చిలుకను తల్లిదండ్రుల క్షేమము విషయము అడిగెను. చిలుక నే"ను తుచ్ఛమైన పక్షిని నన్ను అచ్చటికి తీసుకొనిపోవుము. ఇది నా శక్తికి మించినది. నేను నీ ఆజ్ఞచే ఆకాశ మార్గమునందు మధురానగరమునకు పోయి, అచ్చట నీ విషయమును వారివద్ద చెప్పి మీ సందేశ మంతయు నీ వద్దకు చేర్చగలను" అని పల్కెను. గోకర్ణుడు కూడా పుత్రా! మంచిది నీవు మధురకు పొమ్ము. అచట నా అవస్థ తండ్రికి తెలియజేయుము. పిమ్మట అచటనుండి శీఘ్రమే తిరిగిరమ్ము" అనెను.

ఇప్పుడు ఆ చిలుక మధురకు చేరి, గోకర్ణుని స్థితి అంతయును అతడి తండ్రికి చెప్పి ఇట్టి విషమ పరిస్థితిని, విని దారుణమైన దుఃఖము కలుగగా, మాతాపితలు చాలా సమయము వరకు వారి కన్నుల నుంచి అశ్రుధారలు కారుచుండెను. అయినను ఆ చిలుక యెడ వారి మనస్సునందు గొప్ప స్నేహము కలిగినది. "విహంగమా! నీవు ధర్మమునకు అనుకూలమైన వృత్తాంతమును తెలిపి, మా ప్రాణరక్షణ కొరకు ఈ ఉత్తమ కార్యమును చేసితివి" అని పల్కిరి. వసుంధరా! ఈ విధముగా ఆ పక్షి తన బుద్ధి విద్యాబలము చేత, పుత్రశోకమునకు కారణమైన అత్యంత దుఃఖకరమైన గోకర్ణము నుంచి వృద్ధులైన మాతాపితరులకు పూర్ణశాంతి ప్రదానము చేసెను. ఇచ్చట గోకర్ణుని యొక్క ఇరవైల కొలది సహచరులు కూడా వసుకర్ణుని వద్దకు శ్రేష్ఠమైన రత్నములను తీసుకొనివచ్చిరి. వారి వద్ద తులలేని రత్నరాశి కలదు. అందుచే వసుకర్ణునితో వారందరునూ కుమారుని వలనే వ్యవహరించి పిమ్మట అతని ఆజ్ఞ తీసుకొని తమతమ ఇండ్లకు పోయిరి. (171)

172, 173 వ అధ్యాయములు - దేవులతో గోకర్ణుని సంభాషణ

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. శుభరాలా! గోకర్ణుడు దివ్యదేవుల ఆదేశముతో ఆ మందిరమునందు పదమూడు దినముల ఆరాధన ఆరంభించెను. ఇంతలో ఆ దేవీ గణము సరియైన సమయమునకు వచ్చి నృత్యము చేసిరి. ఆ మధ్యలోనే ఒక రోజు గోకర్ణుడు ఆ దేవులను అందరినీ అత్యంత మ్లానులు, నిస్తేజులు, దుఃఖభాగులుగా

ఉండుటను చూచెను. అతడు పుత్రహీనుడు అయిన పురుషునికి సద్గతులు కలుగవు. అయ్యో! పాపాత్ముడనైన నా వలన గల దోషము చేత ఈ దేవులు కూడా అట్టి స్థితిలోనికి వచ్చిరి. వీరికి ముసలివారగు లక్షణములు చుట్టు కొనుచున్నవి. శాస్త్రములందు సరిగానే చెప్పబడినది అని పలుకుచూ ఆలోచించు చుండెను. ఇంకను సాహసము చేసి, గోకర్ణుడు "ఉదాసీనులుగా ఉండుటకు కారణము ఏమి" అని వారిని అడిగెను. అంతట ఆ దేవులు "మహాభాగా! మీరు ఈ విషయము ప్రశ్నించుటకు అర్హత లేనివారు. అన్ని పనులయందును కాలాత్ముడైన ఆ దేవదేవుని హస్తము ఉండును" అని జవాబు చెప్పిరి. కాని గోకర్ణుడు మరలమరల ఆదరపూర్వకముగా వారికి నమస్కరించుచూ, ఆ ప్రశ్ననే అడుగుచుండెను. వారు దానికి సమాధానము రానందున గోకర్ణుడు తాను సముద్రమునందు దూకి ప్రాణత్యాగము చేసుకొందునని దానితో చెప్పెను.

వారు ఆ విధముగా ప్రాణత్యాగము చేసుకొందుమని చెప్పుటచే గోకర్ణుడు ఆ స్త్రీలలో పెద్దదయిన జ్యేష్ఠాదేవి దుఃఖముతో "ఎవరు దుఃఖమును దూరము చేయగల్గుదురో అట్టి వ్యక్తి ఎదుటనే చెప్పవలెను. అయిననూ చెప్పుచున్నాను వినుము" అని జవాబిచ్చెను. "మధుర అను పేరుతో ప్రసిద్ధి చెందిన ఒక దివ్య పట్టణము కలదు. ఆ పట్టణ ప్రభావముచే మనుష్యుడు ముక్తి పొందుటకు అధికారము గలవాడుగా అగును. ఇప్పుడు అయోధ్యా నరేశుడు చాతుర్మాస్య వ్రతము చేయవలెనను ఆలోచనతో తన చతుర్విధ సైన్యములతోను అచ్చటకు పోయివున్నాడు. అచ్చట విష్ణువు యొక్క అనేక మందిరములు, పూలతోటలు కలవు. అయిననూ ఆయన సేవకులు ఆ తోటలను భ్రష్టనష్టములు కావించిరి".

అని ఇంతవరకూ చెప్పి, ఆమె, మిగిలిన దేవులు ఒక్కుమ్మడిగా విలపించుట మొదలిడిరి. దీనితో గోకర్ణుడు అత్యంత దుఃఖము గలవాడయ్యెను. అతడు మరల ఆ స్త్రీలకు నమస్కరించి, చేతులు జోడించి వారి యెదుట నిలబడి అందరినీ ఓదార్చుచూ మధురమగు పలుకులతో ఇట్లు పల్కెను. "దేవులలారా! తప్పక ఆపివేయుదును. కాని ఈ సమయమున నాకు ప్రతికూల ప్రారబ్దము అన్ని చోట్ల కోరవలసినదిగా ఉన్నది" అని చెప్పెను. గోకర్ణుడు ఈ విధముగా చెప్పుటచే ఆ దేవులు ఆ వైశ్యుని "నీవు ఎవరు? ఎచట నుండి వచ్చితివి?" అని ప్రశ్నించిరి. గోకర్ణుడు తన పేరు ఇతర విషయములను తెల్పి, మరల వారి పరిచయమును అడుగగా వారు తమను "ఉద్యానాధిష్ఠాత్రిదేవి" అని చెప్పిరి. దీనిపై

గోకర్ణుడు దేవులారా! "ప్రపంచమునందు తోటనాటువానికి ఏమి ఫలము లభించును? అట్లే బావులు, దేవమందిరములు కొందరు నిర్మాణము చేయుచుందురు. అట్టి వారికి ఏ రకమైన పుణ్యము లభ్యమగుచున్నది? మీరు ఈ విషయములన్నింటినీ దయతో తెల్పుడు." అని పల్కెను .దీనిపై వారందరూ "ఆర్యా! బ్రాహ్మణ క్షత్రియ, వైశ్యులు అను ద్విజాతి వర్గములకు ధర్మపాలనమే సాధనము. మొదటి సాధనముగా కోర్కెలను నెరవేర్చవలెను. (ఇష్టా పూర్తమును పాటించవలెను.) ఇష్టమునకు గల ప్రభావము చేత స్వర్గము లభించును. నేరము చేత మోక్షము లభించును. ఏ పురుషుడు జీర్ణమగుచున్న వాపి కూప తటాకము లకు దేవమందిరములను జీర్ణోద్ధారణ చేయుచున్నాడో వాడు పూర్తము యొక్క పుణ్యఫలము నందు భాగము కలవాడు అగును. భూదానము, గోదానములు చేయుటచే పురుషులకు ఎట్టి పుణ్యము చెప్పబడినదో అట్టిదే ఫలము వృక్షములను నాటుట చేత కూడా మానవుడు ప్రాప్తింపజేసికొనును. ఒక రావిచెట్టు, లేక కనీసము పిచుమంద వృక్షము, వేప చెట్టు ఒక మరి చెట్లు, పది పూవులు గల వృక్షము, రెండు దానిమ్మ, రెండు నారింజ ఐదు మామిడి వృక్షములను ఎవడు నాటునో అతడు నరకమునకే పోడు.

అశ్వత్థామేకమ్ పిచుమంద మేకమ్ న్యగ్రోధమేకమ్ దశపుష్పజాతీః
ద్వేద్వేతథా దాడిమ మాతులుంగే పంచామ్రానోపి నరకమ్ నయాతి||

సుపుత్రుడు ఏ విధముగా కులమును ఉద్ధరించునో అట్లే ప్రయత్నపూర్వకమైన నియమముల చేత చేయబడిన అతికృత్యవ్రతము ఉద్ధరించునది అగును. అట్లే పుష్పఫల సంపన్నమగు వృక్షము తన యజమానుని నరకము నుంచి ఉద్ధరించును" అని పల్కెను.

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "పృథ్వీ! మాలతీ మొదలగు పుష్పజాతులు, అట్లే వృక్షముల యొక్క యజ్ఞాహ సాధ కభూతములు ఫల ప్రదాత నీడ ఇంకనూ గృహోపయోగము మొదలగు వానిచేత సంబద్ధుడై జ్యేష్టాదేవితో ఈవిధముగా సంభాషించిన తర్వాత గోకర్ణుడు ఇట్లు చెప్పుట మొదలు పెట్టెను. "అయ్యో! మహాదుఃఖము కలిగించు విషయము నేను నా తల్లిదండ్రులను మరచిపోతినే" అనుచుండగా అతడికి స్మృతి తప్పినది. అయిననూ పిమ్మట ఆ దేవులు గోకర్ణుని ముఖముపై నీటిని చిలకరింపగా అతనికి తిరిగి స్మృతి వచ్చెను. మరల దేవులు ఆయనను ఓదార్చుచు ఇట్లు ప్రశ్నించిరి. "ఆర్యా! నీవు ఎచట నుండి వచ్చుచున్నావు? అచట వృత్తాంతమును తెలుపుము.

గోకర్ణుడు ఇట్లు చెప్పెను.

దేవులారా!నా నివాసము మధురానగరంలో కలదు.వృద్ధులైన నా తల్లిదండ్రులు, పతివ్రతయైన నా నలుగురు భార్యలు అచ్చటనే ఉందురు. అచ్చట నాకొక ఉద్యావనము, దైవమందిరము కూడా కలవు.

ఈ విధముగా చెప్పగా, జ్యేష్టాదేని "అనఘుడా! నీవు మధురానగరమునకు పోవలయునని ఉత్కటమగు అభిలాష ఉన్న యెడల, నేను నిన్ను అచ్చటకు ఇప్పుడే తీసుకొనిపోగలను. దీనిచే మాకు కూడా మధురాపురిని దర్శించుట సులభము కాగలదు. నీవు ఈ సుందరమైన విమానముపై ఇప్పుడే కూర్చొనుము. ఈ దివ్యమగు రత్నములను, ఆభూషణములను ఫలములతో పాటు తీసుకొని రమ్ము" అని చెప్పెను. అప్పుడు గోకర్ణుడు విమానముపై కూర్చొండి, భగవంతుడగు శ్రీహరికి నమస్కారము, అట్లే ఆ దేవులకు అభివాదము చేసి మధురకు ప్రయాణమయ్యెను. పిమ్మట అచటకు చేరుకొని ఆయన అయోధ్య యొక్క రాజుకు ఆ రత్నఫలపుష్పములను సమర్పించెను. అచట గోకర్ణుడు తిరిగి వచ్చుట చూచి రాజు యొక్క మనస్సునందు అపార ఆనందము కలిగెను. అతడు ఒక రత్నధాత ధనికుడయిన వ్యక్తికి ఆసనము ఇచ్చిన పద్ధతిలో, గోకర్ణుని తన సింహాసనముపై కూర్చుండబెట్టుకొని చాలా ప్రేమతో గౌరవించెను. అప్పుడు గోకర్ణుడు రాజుతో "కొద్ది సమయము మీరు ఈ స్థానము నుంచి బయటకు పొండు. వెంటనే నేను ఆశ్చర్యమయమైన దృశ్యమును మీకు చూపుటయే గాక మీకు కొన్ని విషయములను నివేదింతును" అని చెప్పెను. ఆ ఏర్పాటు అయిపోయిన తర్వాత వారందరూ దేవులు విమానము నుంచి అచ్చటికి వచ్చిరి. అన్ని విషయములు తెలిసిన తర్వాత రాజు, తన సేనను మధుర నుండి అయోధ్యకు తిరిగి పంపించి, గోకర్ణునికి అనేక పర్యాయములు ధన్యవాదములు చెప్పి, అతనిని పొగడి ఇచ్ఛానుసారముగా వరములిచ్చెను. దేవులు కూడా గోకర్ణునితో నీకు శుభమగుగాక! అని చెప్పి దివ్యలోకమునకు వెడలిపోయిరి. అయోధ్యా నరేశుడు గోకర్ణునికి ఎన్నో ఆవులు, అమూల్య వస్త్రములు, గజ తురగములే గాక ఇంకనూ అపార ధనమును ఇచ్చెను. తోటలు, వనములను వేయుట పరమధర్మము. దీనితో ఆశ్చర్యనుగునట్లు గొప్ప ఫలములు ప్రాప్తించుట జరుగును. ఇది విని ఆ నరేశుడు వేరు ఉద్యావనములు నాటుటకు కూడా ఏర్పాట్లు చేసెను.

వరాహభగవానుడిట్లు చెప్పెసు. "వసుధా! గోకర్ణుడు న్యాయబద్ధముగా పరిపాలించుచూ,మధురయందే నివాసముండెను. అతడు ఇంటికిపోయి తన మాతాపితల చరణకమలములపై శిరస్సువంచి, ప్రణామములు అర్పించెను. ఆచిలుకను కూడా గోకర్ణుని యొక్క తల్లిదండ్రులు, నలుగురు సహధర్మచారణులైన భార్యలు తమశక్తి వైభవములను అనుసరించి సన్మానించి వారినిపూజించిరి. మధురయందు నివాసముండు ప్రజలకు తోటలు వేయించుటను ప్రేరణ ఇచ్చిరి. మరల గోకర్ణుడు ఒక యజ్ఞము చేయుటకు ప్రారంభించెను. బ్రాహ్మణులకు ఉత్తమమైన భోజనము ఇంకను ఇతరములగు అనేక దానములను ఇచ్చెను. చిలుకను హృదయమునకు హత్తుకొని, ప్రేమతో దానిని చూచి, గద్గద కంఠస్వరముతో 'ఇది ఎవరి కృపచేతనో నాకు ప్రాణమును, సద్ధర్మమును ఉత్తమగతిని ప్రాప్తింపజేసిన జీవము' అని అనుకొనెను.

గోకర్ణుడు మధురయందు ఒక మందిరమును నిర్మింపజేసి దానికి శుకేశ్వర మందిరము అని పేరిడెను. ఆ మందిరమునందు సుకేశ్వరుడు అను పేరుతో ఒక విగ్రహమును ప్రతిష్ఠింప చేసి, నిత్యము అన్నదానము చేయు విధానమును కూడా ఏర్పాటు చేసెను. అంతేగాక అనేక అన్నవితరణ సంస్థలను ఏర్పాటుచేసెను. ఆఅన్నదాన మందిరము లందు రెండువందలమంది బ్రాహ్మణులకు ప్రతిరోజు అన్నదానము చేయుచుండిరి. గోకర్ణుడు ఆ సంస్థకు చిలుక పేరుతో శుకసత్రము అని పేరిడెను. ఆ శుకేశ్వరస్థానములో ఎవరికి మృత్యువు కలుగునో, అతడు ముక్తుడు కాగలడు. చివరకు ఆ చిలుక కూడా విచిత్రమైన విమానమునెక్కి స్వర్గలోకమునకు చేరుకొనెను. ఏ శబరుని కృపచేత గోకర్ణము నందలి చిలుక లభ్యమైనదో, ఆ శబరుని, ఉద్ధరించుటకు గోకర్ణుడు త్రివేణీ స్నానముల యొక్క ఫలములను అతడికి అర్పణము చేసెను. అంతట ఆ శబరుడు తన భార్యతో కూడుకొని త్రివేణి స్నానము యొక్క ఫలమును పొందుటచే పత్నీసహితముగా స్వర్గమునకు చేరెను. శుకోదరుని వెంట వారందరూ దివ్య విమానమునెక్కి స్వర్గమునకు చేరిరి.

వసుంధరా! ఈ విధముగా నేను మధుర యొక్క సరస్వతి సంగమములో స్నానము, గోకర్ణేశ్వర శివుని యొక్క దర్శనము, గోకర్ణుడు అను పేరు గల వైశ్యునికి సంతానప్రాప్తి వంటి అనేక సుఖసుఖోపభోగములను ముక్తిని కలిగించు విషయములను వినరముగా తెల్పితిని. (172,173)

174 వ అధ్యాయము - బ్రాహ్మణ ప్రేత సంవాదము, సంగమ మహిమ

భగవంతుడు వరాహుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా! త్రివేణీ సంగమముతో సంబంధము గల మరియొక విషయమును చెప్పుచున్నాను వినుము. పూర్వకాలమున ఇచ్చటనేగల మహానామ వనమునందు, ఉత్తమ వ్రతమును పాటించువాడు, మహానాముడు అను పేరు గలవాడు, యోగాభ్యాసి, అయిన బ్రాహ్మణుడు కూడా నివసించు చుండెను. ఒక పర్యాయము తీర్థయాత్ర చేయవలెనను కోరికచే అతడు మధుర యాత్రకు పోయెను. దారిలో అతనికి ఐదు భయంకరమైన ప్రేతములు కలిసినవి. వారిని బ్రాహ్మణుడు "అత్యంత భయంకర రూపము గల మీరెవరు? అంతేగాక మీకు ఇట్టి భీభత్సరూపము ఏమి చేయుట చేత జరిగినది?" అని ప్రశ్నించెను.

అంతట ప్రధమప్రేత ఇలా అన్నది. మేము ప్రేతాలము. మా పేర్లు వరుసగా పర్యుషితుడు, సూచీముఖుడు, శీఘ్రగాముడు, రోధకుడు, లేఖకుడు. నేను స్వయముగా రుచికరమైన భోజనము చేసికొని పాచిన అన్నమును బ్రాహ్మణులకు ఇచ్చుచుంటిని. ఈ కారణము చేతనే నా పేరు పర్యుషితుడు అయ్యెను. ఈ రెండవ వాని దగ్గరకు అన్నపానములను గూర్చిన కోరిక చేత వచ్చిన బ్రాహ్మణులకు అతడు పెడతానని సూచించి పెట్టలేదు. అందుచేత ఇతని పేరు సూచీముఖుడు, మూడవ వాని దగ్గర ఇవ్వగలుగు శక్తి కలదు. అయిననూ ఎవరైననూ బ్రాహ్మణుడు వచ్చి ఇతనిని యాచించగానే, వేగంగా వేరు ప్రదేశమునకు పారిపోవును. అందుచేత ప్రజలీతడిని శీఘ్రగాముడు అందురు. నాల్గవవాడు అడుగుదురను భయముతో ఒంటరిగా ఎల్లప్పుడు ఉద్విగ్న మనస్సు గలవాడై ఇంటియందే కూర్చొని ఉండుచుండెను. అందుచేతనే ఇతనికి రోదకుడు అని పేరు వచ్చినది. బ్రాహ్మణుడు యాచన చేసిన తర్వాత మౌనుడై, ఎల్లప్పుడు కూర్చొని ఉండిపోవుచూ నేలపై గీతలు గీయుచు ఉండువాడు మాయందరియందును అధికపాపి. అందుకే అతనికి తగు పేరు లేఖకుడయ్యెను.మా పాపం వలన లేఖకుడు మదం కలవాడు, రోదకుడు తలవంచుకు పోయేవాడు, శీఘ్రగామి కుంటివాడు, సూచీముఖుడు సూది వంటి ముఖం కలవాడు, నేను కొంగమెడ, వేళ్లాడే పెదవులు, పెద్ద కడుపూ, బృహత్తు, చిక్కిన మోము కలవాడ నయ్యాను. "విప్రుడా! ఒకవేళ నీకు మానుంచి ఇంకేమైనా వినవలయునని కోరిక ఉన్న యెడల లేక అడుగవలయునని కోరుకొనుచున్న యెడల అడుగుము" అని పల్కెను. మరల ఆ

బ్రాహ్మణుడు "ప్రేతా! భూమి యొక్క అన్ని ప్రాణుల జీవనము ఆహారము మీదనే ఆధారమై ఉండును. అందుచేత నేను మీకు లభ్యమగు ఆహారము ఏది అని అడుగవలయు ననుకొనుచున్నాను" అని ప్రశ్నించెను.

ఆతడితో ప్రేతమిట్లు చెప్పెను. "దయానిధివైన బ్రాహ్మణుడా! మా ఆహారమును గురించి తెలుపుచున్నాను వినుము. ఆ ఆహార పదార్థములు ఇట్టివి. వానిని నీవు వినిన యెడల నీవు నాపై అత్యంతముగా అసహ్యపడుచుందువు, ఏ ఇళ్ళయందు పరిశుభ్రత ఉండదో, స్త్రీలు అనేక పదార్థములను అప్పటికప్పుడు ఉమ్మివేయుచుందురో, అట్లే మలమూత్రములు అనేక ప్రదేశములలో పడి ఉండునో, అట్టి ఆ గృహములందు మేము నివసించుచు భోజనము చేయు చుందుము, అచ్చట పంచబలులు జరుగవు, మంత్రములు చదువబడవు,దానధర్మములు జరుగవు,గురుజనులకు పూజనిర్వహింపబడదు,భాండములు (వంటపాత్రలు) అంతటను దొర్లుచుండును, అక్కడ సరిగా పక్వము కాని ఆహారము పడి ఉండును, ప్రతిదినము పరస్పరము జగడములు జరుగుచుండును అట్టి ఇండ్ల నుంచి మేము ప్రేతభోజనములు సంపాదించుకొందుము, విప్రవరా! నీవు తపస్సు అను మహాధనము గల పురుషుడవు. మనుష్యుని ప్రేతముగాకుండా నిరోధించుటకు ఏరకమైన పనులు చేయవలెనో వానిని మాకు దయతో తెల్పుము".

అనగా బ్రాహ్మణుడు ఇట్లు చెప్పెను. "ఏకరాత్ర, త్రిరాత్ర, చాంద్రాయణ, కృత్య, అతికృత్యము మొదలగువ్రతములు చేయుటచేత పవిత్రుడైన మనుష్యునకు ప్రేతయోని యందు జన్మించుట ఉండదు. శ్రద్ధతో మృష్టాన్నము, మధురములైన పదార్థములు జలము దానము చేయుటయును, సన్యాసిని గౌరవించుటయును చేయువాడు ప్రేతము కాడు. అయిదు, నాలుగు లేక కనిష్టముగా ఒక వృక్షమును నిత్యము జలము చేత పోషించువాడు, అట్లే అన్ని ప్రాణులయెడ దయచూపు వాడు ప్రేతము కాడు. దేవతలు, అతిధులు, గురువుల పితరుల యొక్క నిత్యపూజ చేయు వ్యక్తి ప్రేతము కాడు. కోపమును జయించి, పరమ ఉదారము కలిగి, ఎల్లప్పుడు సంతుష్టుడై విషయముల యెడ ఆసక్తి శూన్యుడై, క్షమాశీలుడు, దానగుణముగల వ్యక్తి ప్రేతము కాలేడు. ఏ వ్యక్తి శుక్లపక్షము కృష్ణపక్షములయందు ఏకాదశీ వ్రతమును ఆచరించునో అట్లే సప్తమి, చతుర్దశి తిథులయందు ఉపవాసము చేయునో, ఆతడు ప్రేతము కాడు. గోబ్రాహ్మణ తీర్థ పర్వత నదులు, అట్లే దేవతలకు ఎవరు

నిత్యమూ నమస్కారము చేయుదురో వారు ప్రేత స్త్రీ గర్భమునందు చేరరు. కాని ఏ నరుడు ఎల్లప్పుడూ వేదవిరుద్ధ ప్రవర్తన కలిగియుండునో, మద్యపానము చేయునో, చరిత్రహీనుడు, మాంసాహారియగునో, అతడు ప్రేతమగుట జరుగును. పరుల ధనమును వశము చేసుకొను వాడు, అట్లే ధనము తీసుకొని కన్యను అమ్ముకొనువాడు, ప్రేతము అగును. నిర్దోషులను, మాతాపితరులను, సోదరీసోదరులను భార్య లేక పుత్రుని పరిత్యజించువాడు కూడా ప్రేతము అగును. ఈ విధముగా గోబ్రాహ్మణ హత్య చేసినవాడు, కృతఘ్నుడు, భూమిని కన్యను అపహరించిన పాపాత్ముడు కూడా ప్రేతము అగును."

ప్రేతము మరల బ్రాహ్మణుని ఇట్లు ప్రశ్నించెను. "శ్రేష్ఠ బ్రాహ్మణుడా! ఎవడు మూర్ఖత్వమునకు లోబడి ఎల్లప్పుడు అధర్మము, ధర్మవిరుద్ధమైన పనులు చేయునో అట్టి పాపియైన వ్యక్తులకు ప్రేతత్వమునుండి ముక్తి చెందుటకు ఏమి ఉపాయము కలదు? దయతో దీనిని చెప్పుము".

బ్రాహ్మణుడు ఇట్లు చెప్పెను. "మహాభాగుడా! చాలా కాలము క్రిందట మాంధాత మహారాజు ఈ విధమైన ప్రశ్నను అడిగినంత వశిష్ఠుడు అతడికి ఇట్లు ఉపదేశము చేసెను. ఈ పుణ్యమైన ప్రసంగము ప్రేతాలకు ముక్తికలిగించి వారికి ఉత్తమగతులను ప్రాప్తించునట్లు చేయును. భాద్రపద మాసశుక్ల పక్షమునందు శ్రవణా నక్షత్రముతో కలిసి ఉన్న ద్వాదశియందు చేయబడిన దానము, హవనము, స్నానము ఇవి అన్నియూ లక్షరెట్లు అధిక ఫలమును ఇచ్చుచున్నవి. ఆనాడు సరస్వతీ సంగమమునందు స్నానము చేసి, వామనవిష్ణు భగవానునిపూజ విధిపూర్వకముగా ఆచరించి, కమండలదానము చేయవలెను. ఈ వామన ద్వాదశి వ్రతము చేత మనుష్యుడు ప్రేతముకాడు. అంతేగాక మన్వంతర పర్యంతము అతడు స్వర్గమునందు ఉండును. ఆ పిమ్మట అతడు వేదములను కడముట్టగా అధ్యయనము చేసి జాతిస్మరణ గల బ్రాహ్మణుడు కాగలడు. ఇంకనూ నిరంతరము బ్రహ్మచింతన చేయుట చేత ముక్తుడగును.

ఆనాడు భగవంతునికి షోడోశోపచార పూజను విధిగా చేయవలెను. అందుకై, అతడిని ఆవాహనము చేయుసమయమున "శ్రీపతి నీవు నీఅంశ చేత అన్ని లోకము లందును విరాజమానుడవై ఉంటివి. నా పై కృపయుంచి ఇక్కడికి రమ్ము! ఈ స్థానమును సుశోభితము చేయుము! మరల నీవు శ్రవణా నక్షత్ర రూపములో సాక్షాత్తు భగవంతుడవే

అగుచున్నావు. నేడు ద్వాదశి, ఆకాశమునందు సుశోభితమై యున్నది. నీ అభిలాష సిద్ధి కొరకు నేను నీకు నమస్కారము చేయుచున్నాను" అని చెప్పి శ్రవణా నక్షత్రమునకు కూడా పూజను, వందనములను చేయవలెను. మరల "కేశవా! నీ నాభినుంచి కమలము జన్మించినది. ఈ విశ్వమంతయూ నీపైనే అవలంబితమైయున్నది. నీకు నమస్కరించు చున్నాను." అని చెప్పి వామన భగవానునికి స్నానము చేయించవలెను. "నారాయణా! నీవు నిరాకార స్వరూపముచేత సర్వత్రా విరాజిల్లుచున్నావు. జగద్యోనీ! నీవు సర్వమున వ్యాపించి ఉన్నవాడవు. సర్వమయుడవు. అట్లే అచ్యుతుడవు. నీకు నమస్కారము." అని చెప్పి చందనము చేత ఆయనను పూజింపవలెను. "కేశవా! శ్రవణా నక్షత్రము ద్వాదశీ తిథియుక్త పుణ్యమయమైన సమయమునందు నేను చేయుచున్న పూజను స్వీకరించి దయచూపుము." అని చెప్పి పుష్పములను చల్లవలెను. "శంఖ చక్ర గదలను ధరించినవాడా! భగవాన్! నీవు దేవతలకు కూడా ఆరాధ్యుడవు. ఈ ధూపమును నీ సేవకై సమర్పించుచున్నాను." అని చెప్పి ధూపము వేయవలెను. దీపసమర్పణ కొరకు "అచ్యుత, అనంత, గోవింద, వాసుదేవ మొదలగు నామములను అలంకృతము చేయువాడా ప్రభో నీకు నమస్కారము. నీ కృప చేత ఈతేజము ద్వారా విస్తృత అఖిలవిశ్వము నష్టము కాకుండ నిరంతరము ప్రకాశప్రాప్తిని కలిగించుచు ఉండుము." అనీ, నైవేద్యము అర్పణము చేయు సమయమునందు "భక్తుల యాచనను సంపూర్తి చేయువాడా! భగవంతుడా! నీవు తేజోరూపమును ధరించి సర్వత్రా వ్యాప్తుడవై ఉన్నావు. అట్టి నీకు నమస్కారము. ప్రభూ! నీవు అదితి యొక్క గర్భమునందు పెరిగి, భూమండలముపై అడుగిడితివి. నీ మూడవ అడుగుచేత సమస్త లోకమును ఆక్రమించితివి. అట్లే బలి యొక్క పాలనను సమాప్తి చేసితివి. నీకు నా నమస్కారము." అనవలెను. "భగవంతుడా! నీవు అన్నము, సూర్యచంద్ర బ్రహ్మ విష్ణు రుద్రయమ అగ్ని మొదలగు రూపములను ధరించి సదా విరాజిల్లుచున్నావు" అని చెప్పి కమండలమును ఈయవలెను. మరల "ఈ కపిలాగోవు యొక్క అంగముల యందు చతుర్దశ భువనములు ఉన్నవి. దానిని దానము చేయుటచే నా మనఃకామన పూర్తియగు గాక" అని చెప్పి కపిలధేనువును దానము చేయవలెను. చివరగా ఈ విధముగా చెప్పి విసర్జించవలెను. "భగవంతుడా! నిన్ను దేవగర్భము అని అందురు. నేను చక్కని పద్ధతిలో నీ యొక్క పూజ చేసితిని, ప్రభూ! నీకు నమస్కారము." విజ్ఞుడైన మనుష్యుడు శ్రద్ధా సంపన్నుడై, ఏదో ఒక

భాద్రపద మాసమునందు వామన భగవానుని ఈ విధముగా ఆరాధింపవలెను. దానికి తప్పక సాఫల్యతలభించును. బ్రాహ్మణుడు మరల ఇట్లు చెప్పెను. ఎచ్చట యమున సరస్వతి నదుల సంగమము జరుగుచున్నదో, ఆ సారస్వత తీర్థముపై ఎవరు ఈ విధిననుసరించి శ్రద్ధాపూర్వకముగా ఈ వ్రతమును చేయుదురో వారికి వందరెట్లు ఫలము ప్రాప్తించును. నేను కూడా శ్రద్ధతో ఆ తీర్థమును సేవించితిని. అంతేకాక క్షేత్ర సన్యాసి రూపమున అచ్చట చాలా దినములవరకు నివాసము ఉంటిని. దానిచేత మీరు నన్ను పరాజితుడుగా నిర్ణయించ లేకపోయిరి. ఈ తీర్థము యొక్క మహిమ అట్లే దాని మాహాత్యము వినుట చేత మీకు కూడా శుభము కలుగును".

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఆ బ్రాహ్మణుడు ఈ విధముగా చెప్పుచు ఉండగానే ఆకాశమునందు దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి కురిసినవి. వెనువెంట ఆ ప్రేతములను తీసుకొని పోవుటకు నాలుగువిమానములు వచ్చి నిలబడినవి. దేవదూతలు ప్రేతముతో ఇట్లు చెప్పిరి. 'ఈ బ్రాహ్మణునితో సంభాషించుట, పుణ్యమయ చరిత్ర వినుట, మొదలగు వానిని, తీర్థ మహిమను శ్రవణము చేయుట చేత, ఇప్పుడు మీరందరునూ ప్రేతయోని నుండి ముక్తులైపోయిరి. అందుచేత ప్రయత్నపూర్వకముగా నైనను సాధుపురుషులతో సంభాషించవలెను".

ఈ విధముగా దేవతీర్థమునందు అభిషేకము చేయుట, అట్లే సరస్వతీ సంగమము యొక్క పుణ్య సంపర్కము చేత దురాత్ములైన ప్రేతములకు అక్షయ స్వర్గప్రాప్తి కలిగినది. ఇంకనూ ఆ తీర్థము యొక్క మహిమా శ్రవణమాత్రముచేత వారుముక్తులై అందులో భాగము కలవారైరి. అప్పటి నుండి ఈస్థానము 'పిశాచ తీర్థము' అను పేరుతో విఖ్యాతి చెందెను. ఆఐదు ప్రేతములకు ముక్తినిచ్చినట్టి ఈప్రసంగము సంపూర్ణ ధర్మమునకు తిలకము వంటిది. ఎవరు పరమభక్తితో తత్పరతా పూర్వకముగా ఈ చరిత్రను చదువుదురో లేక విందురో అట్లే దానిపై శ్రద్ధ కలిగి ఉందురో వారు ఎన్నడును ప్రేతము కారు. (174)

175 , 176 వ అధ్యాయములు - బ్రాహ్మణకుమారి ముక్తి

భగవానుడు వరాహమూర్తి ఇట్లు చెప్పెను. దేవీ! ఇప్పుడు కృష్ణ (మానసీ) – గంగకు సంబంధించిన మరియొక ప్రసంగమును వినుము. (సోమ తీర్థము, వైకుంఠ తీర్థములకు మధ్యన కృష్ణ గంగా స్థానము కలదు) ఒకప్పుడు శ్రీ కృష్ణ ద్వైపాయన మహర్షి

మధురయందు ఒక దివ్య ఆశ్రమమును నిర్మించి, పన్నెండు సంవత్సరము కాలము వరకు, యమునా నది ధారలలో నియమపూర్వకముగా స్నానము చేయవలెనను నియమమును ఏర్పరచుకొనెను. అందుచేత అచ్చట చాతుర్మాస్య దీక్ష కొరకు అనేకమంది వేదతత్వజ్ఞులు అట్లే ఉత్తమముగా వ్రతములను పాటించు మునుల యొక్క రాకపోకలు జరుగుచుండెను. వారు వచ్చిన వారితో శ్రౌత, స్మార్త పురాణాదుల అనేక శంకలను అడిగిన తోడనే ముని వారి శంకలను నివృత్తి చేయుచుండెను. అచ్చటనే 'కాలంజర' అను పేరుతో ప్రసిద్ధమైన తీర్థము కలదు. దానికి ప్రధాన దైవము శివుడు. ఆయనను దర్శనము చేసుకొనుట చేతనే కృష్ణ గంగలో స్నానము చేయుటచే కలుగు ఫలము లభ్యము కాగలదు.

ఇంతలో ధ్యానయోగమునందు నిరతము మునిగియుండు మునివరుడు అగు వ్యాసుడు ఒకమారు హిమాలయాపర్వతమునకు పోయి, పిమ్మట బదరికాశ్రమమునందు కొంతకాలము వరకు అచ్చటనే నిల్చి ఆగిపోయెను.ఆ త్రికాలదర్శుడు సిద్ధముని అయిన వ్యాసుడు తన జ్ఞాననేత్రముచే కృష్ణ గంగ యొక్క తటాకముపై మహాశ్చర్యజనకమగు దృశ్యమును చూచెను. ఆ దృశ్యము ఇట్లు కలదు. నది యొక్క అవతల తటముపై పాంచాల వంశమునకు చెందిన 'వసు'అను పేరు గల ఒక బ్రాహ్మణుడు నివసించుచుండెను. తీవ్ర దుర్భిక్షము చేత పీడింపబడినవాడగుటచే అతడు తన భార్యను వెంటనిడుకొని, దక్షిణా పథమునకు పోయెను. అంతేగాక శివనది యొక్క దక్షిణతటమునందు గల ఒక నగరము నందు బ్రాహ్మణవృత్తిచే జీవించుచుండెను. అచట ఆయనకు ఐదుగురు కుమారులు, తిలోత్తమ అను పేరుగల ఒక కన్య జన్మించిరి. ఆ బ్రాహ్మణుడు ఒక బ్రాహ్మణునికి ఆ కన్యనిచ్చి వివాహమును చేసెను. పిమ్మట ఆ బ్రాహ్మణుడు సపత్నికముగా మరణించెను. ఆ సమయమునందు తిలోత్తమ అను ఆ కన్యయే మాతాపితల అస్తికలను తీసికొని తీర్థయాత్రికులతో మధురకు చేరెను. అనగా ఆమె పురాణములయందు మధురానగర మందలి అర్ధచంద్ర తీర్థమునందు ఎవరి ఎముకలు పడునో వారు ఎల్లప్పుడు స్వర్గముననే నివాసము ఉండగల్గుదురు అని వినెను. ఆ బ్రాహ్మణ పుత్రి ఆ బ్రాహ్మణునికి గల సంతానములో అందరికంటే చిన్నది. ఆమె వివాహమైన కొద్ది కాలమునకే భర్త చనిపోయిన కారణమున విధవ అయినది. అందుచేత ఆమె తల్లిదండ్రుల అస్తికలతో మధుర చేరుకొనినది.

ఆ రోజులలోనే కాన్యకుబ్జము యొక్క రాజు మధురలోని మహాదేవుని కొరకు, అన్న సత్రమును స్థాపించెను. అచట నిరంతరము అన్నదానము జరుగుచుండెను. ఆ నరేశునివద్ద నృత్యగానములు కూడా నిర్వహింపబడుచుండెను. అచట గణికల దుఃచక్రము నందు పడి, ఆ కన్య కూడా అదే పనిలో చిక్కుకొని పోయెను. కొద్ది కాలములలోనే ఆమె కూడా రాజు యొక్క పరిజనములలో ఒకటి అయ్యెను. వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను.

వసుంధరా! ఆ వసు బ్రాహ్మణుని యొక్క కనిష్ఠ పుత్రుని పేరు పాంచాలుడు. అతడు మహారూపవంతుడు. అతడు కొందరు వ్యాపారుల వెంట అనేక దేశములు, రాజ్యములు, పర్వతములు, నదులనుదాటి, ఈ యాత్రచేయుచు, మధురకు చేరుకొని అచటనే నివసించు చుండెను. అతడు ఒకరోజు ప్రాతఃకాలమున కొందరు పురుషులతో కూడి స్నానము చేయుటకొరకు అచ్చట గల ఉత్తమమైన కాలంజన తీర్ధమునకు పోయెను. అచ్చటస్నానము చేసి శ్రేష్ఠమైన వస్త్రములు, అలంకారములతో అలంకృతుడై, ధనగర్వముతో ఒక వాహనముపై కూర్చొని దేవతల దర్శనము చేసుకొనుటకై త్రిగర్తేశ్వర మహాదేవుని స్థానమునకు చేరుకొనెను. అచ్చట అతడి దృష్టి తిలోత్తమపై పడినది. ఆ తిలోత్తమను చూడగనే అతడు సంపూర్తిగా ముగ్ధుడయ్యెను. మరల అతడు ఆ కన్యయొక్క సంరక్షకురాలి ద్వారా క్రొత్తవస్త్రములను, వందలకొలది సువర్ణ ఆభరణములను రత్నహారములను ఆమెకు కానుకలుగా పంపెను. అంతట ఆ స్త్రీపై గల ఆసక్తిచే అతడు ఆ ఇంటియందే అదే ఉండుచు, ఆమెను చూచుచు ఇంకనూ రోజులో సగభాగము జరిగిపోగా పిమ్మట తన ఇంటి మీదకు పోయి కూర్చొని, అట్లే సమీపమున ఉన్న కృష్ణ గంగోద్భవ తీర్ధమునందు స్నానము చేయుచు గడపసాగెను. ఈ విధముగా ఏడు నెలలు గడచినవి. ఒకమారు అతడు సుమంతముని ఆశ్రమము దగ్గర స్నానము చేయుచుండగా, ముని యొక్క దృష్టి అతనిపై పడెను. అతని శరీరమునందు క్రిములుపడినవి. ఆ క్రిములు రోగకూపమునుండి బయటకు వచ్చుచూ నీటియందు పడుచుండెను. అయిననూ స్నానము చేసిన తర్వాత,అతడు మొత్తం మీద ఎట్టి రోగము లేనివాడయ్యెను. ముని ఈ ప్రకారమైన దృశ్యమును చూచినవాడై అతడితో "సౌమ్యుడా!నీవెవరవు? నీతండ్రి ఎవరు? ఎచట ఉండువాడవు? నీది ఏ వంశము. అట్లే నీవు రాత్రింబగళ్ళు ఏపని కొరకు నిమగ్నమై ఉంటివి? అదంతయు నాకు తెలుపుము" అని అడిగెను.పాంచాలుడు "నేను ఒక బ్రాహ్మణ బాలకుడను.నా పేరు పాంచాలుడు.

ఇప్పుడు నేను వ్యాపార కార్యముపై దక్షిణ భారతదేశము నుంచి ఇచటకు వచ్చి ఉంటిని. ప్రాతఃకాలముననే ఇచట స్నానముచేసి త్రిగర్తేశ్వర మహాదేవుని దర్శనము చేసికొను చున్నాను. మరల కాలంజర క్షేత్రమునకు వచ్చి మీ చరణములను దర్శనము చేసికొను చున్నాను. అటు పిమ్మట సేనలు ఉండు స్థలము నుండి తిరిగిపోవుదును" అని చెప్పెను. ఆ మాటలు వినిన ముని "బ్రాహ్మణా! నీ శరీరముపై ప్రతిరోజూ నేను ఒక మహాశ్చర్యకరమైన విషయమును చూచుచున్నాను. స్నానముకు ముందు నీ శరీరము క్రిమిపూర్ణముగా కలదు. స్నానము చేసిన తర్వాత స్వచ్ఛతను పొంది ప్రకాశమయమైనదిగా మారిపోవుచున్నది. నీవు ఎవరి పాప ప్రపంచము నందు పడితివి? ఈ తీర్థమునందు స్నానము చేసిన ప్రభావము చేత అవి దూరము అగుచున్నవి. ఇప్పుడు నీవు బాగుగా ఆలోచించి దాని జాడ ఎరిగి నాకు తెల్పుము" అని పల్కెను.

దీనిపై పాంచాలుడు ఆ కన్య ఇంటికి పోయి ఆమెతో ఆదరపూర్వకముగా "శుభగురాలా! నీవు ఎవరి కుమార్తెవు? నీది ఏ దేశము? ఇచ్చటకు నీవు ఎట్లు వచ్చితివి? ఎట్లు జీవించుచున్నావు?" అని ఆదరపూర్వకముగా ప్రశ్నించెను. ఆ సమయమున పాంచాలుడు అనురాగపూర్వకముగా అడిగినంతట ఆ కన్య అతనికి ఎట్టి జవాబు చెప్పలేదు. కొంత సమయమునకు తర్వాత పాంచాలుడే మరల "అమ్మాయీ! చూడుము. నీవు ఇప్పుడు నిజమును తెలుపకపోయిన, నేను ప్రాణత్యాగము చేయుదును" అని పలుకగా అతడి నిశ్చయమును చూచి ఆ కన్య తన తల్లిదండ్రుల సోదరులు, దేశము, జాతి మొదలగు పూర్తి వివరములను యథావిధిగా తెలియునట్లు చెప్పెను. ఆమె నాతండ్రికి ఐదుగురు పుత్రులు, నేనును ఆరుగురు సంతానము ఉంటిమి. వారిలో అందరికంటే చిన్నబిడ్డను నేనే. వివాహమైన తర్వాత నా పతిదేవుని మరణము శీఘ్రమే సంప్రాప్తించినది. ఐదుగురు సోదరులలో అందరికంటెను చిన్నవాడు ధనతృష్ణ చేత చిన్నతనములోనే వ్యాపారుల వెంట విదేశములకు వెళ్ళిపోయెను. అతడు ఇల్లు వదలిపోయిన తర్వాత నా మాతాపితరులు కూడా మరణించిరి. అందుచేత కొందరు సహాయకులు వెంట వచ్చి నేను ఈ తీర్థమునందు మా తల్లిదండ్రుల అస్తులను ప్రవాహమునందు కల్పుటకు వచ్చి ఉంటిని. ఇచట నేను కొందరి వేశ్యల యొక్క దుర్మార్గపు వ్యూహమునందు చిక్కుకొనుటచే నాకు ఈ దశ సంప్రాప్తించినది. నేను కులటాస్త్రీల యొక్క ధర్మమును నాదిగా చేసికొని, నా కులమునకు

నష్టము కలిగించితిని. ఇంతేగాక మాతృపితృపతి ఈ ముగ్గురి కులమును ఇరువది యొక్క పీడలు గల ఘోరనరకమునందు పడవేసితిని" అని చెప్పెను. ఈ మాటలను విని పాంచాలునికి మూర్ఛ వచ్చినది.

వెంటనే అతడు భూమిపై పడెను. అక్కడ గల స్త్రీలు దీనవదనురాలైన ఆ బ్రాహ్మణ యువతిని చూచి సముదాయించి ఓదార్చి, పాంచాలుని నాలుగు దిక్కులలోను నలుగురు నిలబడిరి.అంతేగాక అనేక ప్రకారములైన ఉపాయములను ప్రయోగించుచూ, వారందరూ ఆతడి మూర్ఛను దూరమగునట్లు చేసిరి. అతడి శరీరములో చైతన్యము కలిగిన తోడనే, ఆమె ఆతడిని, స్మృతి పోవుటకు కారణమడిగినది. అందుకై ఆ బ్రాహ్మణ కుమారుడు తన పూర్తి వృత్తాంతమును తెలియజేసెను. మరల ఈ పాపముచేత ఆతడి మనస్సు నందు ఘోరచింత వ్యాపించెను. అంతట అతడు ప్రాయశ్చిత్తము గురించి ఆలోచించెను. అతడు ఇట్లు చెప్పెను. మునులందరును ఆలోచించి ఒకవేళ ఎవరైననూ ద్విజాతి బ్రాహ్మణుని హత్య చేసిన యెడల లేక అథవా మదిరను త్రాగినను, అందుకు అతడికి విధించవలసిన ప్రాయశ్చిత్తము శరీర పరిత్యాగము ఒక్కటే కలదు. తల్లి, గురుభార్య, సోదరి, కుమార్తె, కొడుకు భార్య, వీరితో అక్రమ సంబంధము పెట్టుకొనిన వారికి మండుచున్న అగ్నియందు ప్రవేశించుటయే ప్రాయశ్చిత్తము. దానికి విరుద్ధముగా అతడి శుద్ధి కొరకు వేరు ఇతర ఉపాయమే లేదు అని చెప్పెను.

పాంచాలిని తన అన్న నోటినుండి ముని చెప్పిన ఈ ప్రాయశ్చిత్తము వినినది. అందుచే ఆమెకూడా తన సౌభాగ్యమునకు కారణమైన ఆ భూషణములు, రత్నములు, వస్త్రములు, ధనము, ధాన్యము మొదలైన సంచితముచేసి పెట్టుకొనిన ఏయే వస్తువులు కలవో వానినన్నింటిని బ్రాహ్మణులకు పంచివేసెను. వెనువెంటనే ఈ ద్రవ్యముతో కాలంజర క్షేత్రమున శృంగారవనము అట్లే ఒక ఉద్యానవనముల నిర్మాణము చేయించబడుగాక, అని చెప్పినది. తిరిగిఅతడు తన ఆత్మశుద్ధి కొరకు కృష్ణగంగోద్భవ తీర్థమునకు పోయి విధి పూర్వకముగా చిత్యారోహణ చేయుదును అనుకొనినది.

అక్కడ పాంచాలుడు కూడా సమంతముని దగ్గరకు వెళ్ళి ఆయనకు నమస్కరించి మృత్యువునకుపయోగపడు కర్మలన్నింటినీ సంపాదించి,మధురానివాసులైన బ్రాహ్మణులను పిలిపించి వారికి సక్రమముగా పద్ధతి ప్రకారము దానములను చేసి, తనకు మిగిలిన

ధనరాశిని అంతటినీ సత్రమును ప్రారంభించుట కొరకు ఇచ్చివేసి, విధిని అనుసరించి తన ఔర్ధ్వదైహిక సంస్కారముల కొరకు ఏర్పాట్లు కూడా చేయించుకొనెను. కృష్ణ గంగయందు స్నానము చేసి ఇష్టదేవతలను దర్శించుకొని వారికి ప్రణామములు అర్పించి సుమంతముని యొక్క చరణములను స్పృశించి" భగవానుడా! నేను అగమ్యాగమన దోషము చేత చాలా పాపమును పొందితిని. నేను కులనాశకుడను. స్వంత సోదరితో దుర్యోగము చేత అక్రమ సంబంధము పెట్టుకొన్నవాడనైతిని. ఇప్పుడు నేను నా శరీరమును త్యాగము చేయవలెను అని కోరుచున్నాను. మీరు ఆజ్ఞాపింపుడు." అని చెప్పెను.

ఈ విధముగా సుమంత మునికి తన పాపమునంతయును విడమరచి చెప్పి, చితిపై నేతిని చిలకరించి ఆ అగ్నియందు ప్రవేశించవలెనని కోరుకొనుచుండెను. అట్టి సమయమున వెనువెంటనే ఆకాశవాణి "ఈ విధముగా దుస్సాహసము చేయవలదు. ఎందుకనగా మీ ఇద్దరి పాపములు అన్ని విధములుగా నశించినవి. ఇచ్చట భగవంతుడు శ్రీకృష్ణుడు సుఖపూర్వకముగా తన లీలను ప్రదర్శించెను. ఇచ్చట ఏ స్థానమునైనా, ఆయన చరణములచే చిహ్నితములై ఉన్నందున ఆ స్థానము అతడు బ్రహ్మ లోకముకంటే అధికతర శ్రేష్ఠము. వేరు స్థానము నందు చేసిన పాపము ఈ తీర్థమునకు వచ్చిన తోడనే నశించి పోవును. మనుష్యునికి గంగాసాగరమునందు ఒకమారు స్నానము చేయుటచే బ్రహ్మహత్య వంటి పాపము నశించిపోవును. ఈ పృథ్విపై ఎన్ని తీర్థములు కలవో, ఆ తీర్థములు అన్నింటియందు స్నానము చేసినందుచేత ఏ ఫలితము లభ్యమగుచున్నదో, అట్టి ఫలమే పంచతీర్థమునందు స్నానము చేయుట చేత లభ్యమగుచున్నది. ఇందు సందేహము లేదు. శుక్ల కృష్ణ పక్షముల ఏకాదశి తిథులనాడు, విశ్రాంతి తీర్థమునందు ద్వాదశినాడు సౌకరక తీరమునందు, త్రయోదశినాడు నైమిశారణ్యనందు, చతుర్దశినాడు ప్రయాగయందు అట్లే కార్తీక మాస ఏకాదశినాడు పుష్కరమునందు స్నానము చేయవలెను. దీనిచేత పాపములన్నీ దూరముగా తొలగిపోవును. వరాహ భగవానుడు, వసుంధరా! ఈ విధమైన ఆకాశవాణి మాటలను విని పాంచాలుడు సుమంతుని "ముని! నేను అగ్నియందు ప్రవేశము చేయుదునా? లేక త్రిరాత్ర కృత్య చాంద్రాయణ వ్రతములను చేయవలెనా? అను ఈ విషయమును నాకు తెల్పి దయ చూపుడు" అని పల్కెను. ముని ఆకాశవాణి చెప్పిన తర్వాత విశ్వాసముంచి ఆయనకు కేవలము ధర్మాచరణము నందు ఆదేశము నిచ్చెను.

పృథ్వీదేవి! ఏ మనుష్యుడు శ్రద్ధతో ఈ మాహాత్మ్యమును వినునో లేక చదువునో, అట్టివాడు ఎన్నడునూ పాపము చేత లిప్తుడు కాలేడు. అంతేగాక అతడి ఏడు జన్మలలో చేసిన పాపములు, దూరములై పోవును. అతడు జరామరణముల నుండి ముక్తుడై స్వర్గలోకమునకు పోవును. (175,176)

177 వ అధ్యాయము - సాంబుని శాపము, సూర్యారాధన వ్రతము

అనంతరము వరాహ భగవానుడు ధరణీదేవితో శుభాంగీ! ఇప్పుడు నేను నీకు శ్రీకృష్ణునికి సంబంధించిన కథయొక్క అద్భుత పరిణామము చెప్పుచున్నాను. వినుము. అది ద్వారకా పురికి సంబంధించిన వృత్తాంతము. దానితో పాటు సాంబుని శాపవృత్తాంతమును కూడా వినుము. ఒకమారు భగవంతుడు సానందుడు ద్వారకయందు విరాజమానుడై ఉండగా నారదమహాముని అచ్చటకు వచ్చెను. శ్రీ భగవానుడు ఆయనకు ఆసనము అర్ఘ్యము, పాద్యము, మధుపర్కముతో పాటు గోవులను కూడా సమర్పించెను. తదనంతరము ముని ఆయనకు "నీతో ఏకాంతముగా సంభాషించవలెనని కోరుచున్నాను" అని శ్రీకృష్ణునికి సూచించెను. పిమ్మట ఏకాంతములో నారదుడు "ప్రభూ! నీ నవయువకుడైన పుత్రుడు సాంబుడు గొప్ప వాగ్మి, రూపవంతుడు, పరమసుందరుడు. అట్లే దేవతలయందు కూడా విశేష ఆదరము పొందినవాడు. దేవేశ్వరా! దేవతలతో సమానులైన నీకు సంబంధించిన వేలకొలది స్త్రీలు ఆయన సౌందర్యమును చూచి ఆశ్చర్యచకితులు అగుచున్నారు. నీవు సాంబునికి ఆ దివ్యస్త్రీలను ఇచటకు పిలిచి వస్తుతః వారియందు కలత కలదో లేదో పరీక్షింపుము. అని తెల్పగా, శ్రీకృష్ణుని ఆజ్ఞపై తరువాత శ్రీకృష్ణుని వద్దకు (సాంబునితో సహా) ఆ స్త్రీలందరూ వచ్చి చేతులు జోడించి కూర్చొని పోయిరి." కొద్ది క్షణములు గడచిన తర్వాత సాంబుడు శ్రీకృష్ణుని "ప్రభూ! మీ ఆజ్ఞ ఏమి?" అని అడిగెను, వస్తుతః సాంబుని అందమునుచూచి శ్రీకృష్ణుని ఎదురుగాఉన్న ఆస్త్రీల మనసులయందు కలత ఉత్పన్నమైనది.

శ్రీకృష్ణ భగవానుడు "దేవులారా! ఇప్పుడు మీరందరూ లేచి నిలబడి మీమీ స్థానములకు పొందు" అని ఆజ్ఞాపించెను. శ్రీకృష్ణుని ఆజ్ఞను పొంది, ఆ స్త్రీలు తమ తమ స్థానములకు వెడలిపోయిరి. కాని సాంబుడు అక్కడనే కూర్చొని ఉండెను. అతడి దేహమునందు కంపము కలుగుచుండెను. అంతట శ్రీకృష్ణుడు "నారదముని వర్యా! స్త్రీల స్వభావము చాలా విలక్షణముగా ఉండును." అని పల్కెను. అంతట నారదుడు "ప్రభూ!

వీరి ఈ ప్రవృత్తి చేత సత్యలోకమునందు కూడా మీపై నిందలు వేయబడుచున్నవి. అందుచే ఇప్పుడు సాంబుని పరిత్యజించుటయే ఉచితమైనపని. దేవా! ఈవిశ్వమునందు మిమ్ములను పోలినవాడు మరియొకరు లేడు. కావున ఈ పనిని మీరే చేయగలరు.” అని చెప్పెను.

వసుంధరా! నారదుడు ఈవిధముగా చెప్పగా, శ్రీకృష్ణుడు సాంబుని ‘రూప హీనుడు అగునట్లు’ శాపమును ఇచ్చెను. ఆ శాపముచేత సాంబుని శరీరమునందు కుష్టు రోగము ప్రవేశించినది. అంతేగాక ఆతని శరీరమునుండి భయంకరముగా దుర్గంధము వచ్చుచుండగా, రక్తము బొట్లుబొట్లుగా పడుచున్నది. ఇప్పుడు అతడి శరీరము ఛిన్నా భిన్నములైన అంగములు కలిగిన పశువులవలె కనిపించుచున్నది.

పిమ్మట నారదుడే సాంబునికి శాపవిముక్తుడగుట కొరకు సూర్యారాధన చేయవలెనని ఉపదేశించెను. అంతేగాక “జాంబవతీ నందనా! నీవు వేదము ఉపనిషత్తుల యందు చెప్పిన మంత్రములను ఉచ్చరించుచూ విధిననుసరించి, సూర్యనమస్కారములు చేయవలెను. అందుచేత సూర్యుడు సంతుష్టుడు కాగలడు. ఇంకనూ సూర్యునితో నీకు సముచితముగా సంవాదము జరుగగలదు. ఆ ప్రసంగము చేత భవిష్యపురాణము రచింపబడును. దానితో బ్రహ్మ లోకమునకు పోయి నేను బ్రహ్మ ఎదుటగా ఎల్లప్పుడునూ పఠించుచుందును. సుమంతముని మర్త్య లోకములో మనువు ఎదురుగా దానిని చెప్పును. ఈ విధముగా, ఆ పురాణము యొక్క సమస్త లోకములందునూ ప్రచారము, పొంది వ్యాప్తి చెందును. “

సాంబుడు ఇట్లు చెప్పెను. “ప్రభో! నా స్థితి మాంసము యొక్క ముద్దవలె ఉన్నట్లుగా అనిపించుచున్నది. తిరిగి యాచలము పైకి నేనుఎట్లు పోగలను? మీ కృప చేతనే నేను ఈ దుఃఖమును అనుభవింప వలసివచ్చుచున్నది. లేనిచో తత్వతః నేను దోష రహితుడనుగా ఉందును గదా!” సాంబుని మాటలను వినిన నారదుడు ఇట్లు చెప్పెను. “సాంబా! ఉదయాచలము పైకిపోయి సూర్యుని ఆరాధన చేయుటచేత ఏ ఫలము లభ్య మగునో, అట్టిఫలమే మధురయందుగల షట్ సూర్యతీర్థమునందు కూడా సులభముగా పొందుటకు వీలగును. అచ్చట సూర్యభగవానుని విగ్రహములకు ప్రాతఃమధ్యాహ్న సాయంకాలములందు చేయబడు పూజ, సామ్రాజ్యము లభ్యమగుటతో సమానమగునట్టి ఫలమును కలిగించ గలదు. ప్రాతఃమధ్యాహ్న సాయంకాలము అను ఈ మూడు పవిత్ర

సమయములందు, సూర్యమంత్రమును జపించి అట్లే పల్కెడి స్వరము చేత ఆ సూర్యుని స్తోత్ర పాఠ పఠనము చేత, సర్వ పాపములును విడిచిపోయి కుష్టు మొదలగు రోగముల నుంచి కూడా విముక్తి లభించు చున్నది.

వరాహభగవానుడు వసుంధరా! మునిశ్రేష్ఠుడగు నారదుడు ఈవిధముగా చెప్పిన తర్వాత మహాభాగుడైన సాంబుడు శ్రీకృష్ణుని యొక్క ఆజ్ఞను పొంది భక్తిముక్తి ఫలమును ఇచ్చునట్టిదైన మధురకు చేరుకొని దేవర్షి నారదుడు చెప్పిన విధివిధానములను అనుసరించి మంత్రములను ఉచ్చరించి ప్రాతఃమధ్యాహ్న సాయంకాలమునందు ఆ షట్ సూర్యులకు పూజ, దివ్యస్తోత్రముల ద్వారా ఉపాసన చేయుట ఆరంభించెను. సూర్యభగవానుడు తన యోగబలము చేత సుందరమైన రూపమును ధరించి, సాంబుని వద్దకు వచ్చి ఇట్లు పల్కెను. "సాంబా! నీకు శుభమగు గాక! నీవు నా నుండి ఏదైననూ వరము కోరుకొనుము. శుభము కలిగించు నా వ్రతము, ఉపాసనా పద్ధతుల ప్రచారము కొరకు ఇవి చేయుట పరమ ఆవశ్యకము" అని చెప్పగా మునివరుడగు నారదుని చేత నీకు ఏ స్తోత్రములు చెప్పబడినవో, అంతేగాక నీవు దేనిని నాముందు వ్యక్తపరచితివో, ఆ నీ సాంబపంచాశిక యందు వేదముల అక్షరములు, అట్లే పదములు చేత కూర్చబడిన ఏబది శ్లోకములు కలవు. వీరా! నారదుని ద్వారా నిర్దేశింపబడిన ఈ శ్లోకముల ద్వారా నీవు చేసిన నా ఈ స్తుతి చేత నేను నీ యెడ సంపూర్ణముగా సంతుష్టుడనై ఉంటిని. "

వసుధా! ఈ విధముగా చెప్పి సూర్యభగవానుడు సాంబుని సంపూర్ణ శరీరమును స్పృశించెను. సూర్యుడు స్పృశించిన వెంటనే, సాంబుని సర్వాంగములు వెంటనే రోగము పోయి ప్రకాశింప దొడగెను. ఇంకనూ అతడు రెండవ సూర్యుని వలె ప్రకాశించు దేహము గలవాడాయెను. అదే సమయమున యాజ్ఞవల్క్యముని మధ్యాహ్నకాలమునందలి యజ్ఞము చేయుటకు ఉవ్విళ్ళూరుచుండెను. సూర్యభగవానుడు సాంబుని తీసుకొని ఆతని యజ్ఞము వద్దకు ప్రవేశించెను. అప్పటి నుంచి సాంబుని మధ్యందిన సంహితను అందరునూ అధ్యయనము చేయుచుండిరి. అప్పటినుంచి సాంబునికి 'మధ్యందినుడు' అను పేరు ఏర్పడెను. వైకుంఠ క్షేత్రము యొక్క పశ్చిమ భాగమున ఈ యజ్ఞము గౌరవింపబడుచున్నది. అందువలననే అప్పటినుంచి, ఈ స్థానమునకు 'మధ్యందనయ తీర్థము' అనిపేరు వచ్చినది. అచట స్నానము, దానితో పాటు దర్శనము చేసికొనుటచే ఆ ప్రభావము చేత, మానవుడు

సమస్త పాపముల నుండి ముక్తుడు కాగలడు. సాంబుని ప్రశ్న వేసిన తర్వాత సూర్యుడు చేసిన ప్రవచనము ఆ ప్రసంగము భవిష్య పురాణము అను పేరుతో ప్రఖ్యాతమైన పురాణము అయినది. ఇచ్చట సాంబునిచే కృష్ణగంగ యొక్క దక్షిణ తటముపై మధ్యాహ్న కాలపు సూర్యుని విగ్రహము ప్రతిష్ఠింపబడినది. ఏ నరులు ప్రాతఃమధ్యాహ్నసాయం సమయాలలో సూర్యుని దర్శనము చేసుకొందురో వారు పరమ పవిత్రులై బ్రహ్మలోకమునకు పోవుదురు.

దీనికెదురుగా సూర్యునిమరియొక ఉత్తమమైన ప్రాతఃకాలీన విఖ్యాత విగ్రహము 'కాలప్రియుడు' అనుపేరుతో ప్రతిష్ఠింపబడినది. తదనంతరము పశ్చిమభాగము మూల స్థానమునందు అస్తాచలమునకు సమీపమున, 'మూలస్థానము' అను పేరుతో మరియొక విగ్రహము ప్రతిష్ఠింపబడినది. ఈ విధముగా సాంబుడు సూర్యుని మూడు విగ్రహములను ప్రతిష్ఠించి, వానిని ప్రాతఃమధ్యాహ్న సంధ్య మూడు కాలములందును ఉపాసన చేయుటకు ఏర్పాటు చేసెను.

దేవీ! సాంబుడు భవిష్య పురాణమునందు చెప్పబడిన నిర్దిష్ట విధిని అనుసరించి ప్రసిద్ధమైన ఒక విగ్రహమును అచట ప్రతిష్ఠింపజేసెను. మధురయందలి ఆ శ్రేష్ఠమైన ప్రదేశము 'సాంబపురము' అను పేరుతో ప్రసిద్ధికెక్కినది. సూర్యుని ఆజ్ఞను అనుసరించి అచ్చట రథయాత్ర ఏర్పాటు చేయబడినది. మాఘమాసమందలి సప్తమీ తిథినాడు ఆ దివ్యస్థానమునందు రథయాత్ర ఏర్పాటు చేయబడును. ఆ రథయాత్రను ఏర్పాటు చేయు వారు సూర్య మండలమును ఛేదించుకొని, పరమపదము చేరుకొందురు. దేవీ! సాంబుని శాపము గల ఈ వృత్తాంతమును నేను నీకు తెలియజేసితిని. దీనిని వినుట చేత సమస్త పాపములు నష్టములై పోవును. (177)

178, 179 అధ్యాయములు - శతృఘ్ను చరిత్ర, మధురా మాహాత్మ్యము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! నేను చెప్పబోవునది ప్రాచీన కాలమునకు చెందిన విషయము. శ్రద్ధగా ఆలకింపుము. మధురయందు లవణుడు అను పేరు గల రాక్షసుడు ఒకడు ఉండెను. బ్రాహ్మణుల రక్షణ కొరకు మహాత్ముడైన శత్రుఘ్నుడు అతనిని వధించెను. ఆ స్థానము చాలా మహిమ గలది. మార్గశీర్షమాస ద్వాదశీ తిథినాడు అచ్చట సంయమపూర్వకముగా, పవిత్రముగా ఉండి స్నానము చేయుట, అట్లే శతృఘ్నుని చరిత్రను వర్ణించుట చేయవలెను. లవణాసురుని వధించుట చేత శతృఘ్ననికి తన

శరీరములో పాపము ప్రవేశించినదని శంక కలిగెను. దానిని దూరము చేసుకొనుట కొరకు అతడు బహురుచికరమైన అన్నము చేత బ్రాహ్మణులను తృప్తులను గావించెను. ఈ సమాచారమును వినిన శ్రీరామచంద్రునకు అత్యంత ఆనందము కలిగెను. ఆ కారణము చేత తన సైన్యము వెంటనిడుకొని శ్రీరాముడు అయోధ్య నుండి మధురానగరమునకు వచ్చి దానికి లక్ష్యముగా మహోత్సవమును చేసెను.

మార్గశిర మాసపు శుక్లపక్షము యొక్క దశమితిథినాడు భగవంతుడు శ్రీరాముడు మథురకు చేరుకొనెను. అచ్చట ఏకాదశితిథి యొక్క పుణ్యమైన సమయమునందు ఉపవాసముచేసి విశ్రాంత తీర్థమునందు సపరివారముగా స్నానముచేసి గొప్ప ఉత్సవమును జరిపెను. అంతేగాక, బ్రాహ్మణులకు తృప్తి కలిగించుటకై, స్వయముగా తానే భోజనము చేసెను. ఆ రోజు అచ్చట ఎవరి చేత ఉత్సవము జరుపబడునో వారు పాపముల నుండి సంపూర్ణముగా విముక్తులై, పితరులతో కూడి దీర్ఘకాలము వరకు అనగా ప్రళయ పర్యంతము వరకు స్వర్గలోకమున నివసింతురు.

వరాహభగవానుడు వసుధతో ఇట్లు చెప్పెను. మనసు, పలుకు, పని వీనిని అనుసరించి పాపకార్యములందు ఇష్టమును చూపుట అపరాధము. దంతధావనము చేయక పోవుట రాజాన్నము తినుట, శవమును తాకుట సూతకముగల చేతినుండి జలమును స్వీకరించుట, ఇంకనూ అతనిని ముట్టుకొనుట, మలమూత్రాది విసర్జించు క్రియలయందు కూడా పాపము కలుగును. పలుకకూడని మాటలు మాట్లాడుట, తినకూడని వస్తువులను తినుట, ఇంగువను వేసిన పదార్థములను తినుట, ఇతరులు ధరించిన మలిన వస్త్రములను నీలపు రంగుగల వస్త్రములను ధరించుట, గురువునకు అసత్యమును చెప్పుట పతితుడైన వ్యక్తి యొక్క అన్నమును తినుట, అట్లే భోజనము పెట్టరేమోనను భయము ఉత్పాదించుట, వీని అన్నింటిని సేవాపరాధములు అందురు. ఉత్తమ భోజనము స్వయముగా తానే తినుట, బాతు మొదలగు వాని మాంసమును తినుట,దేవుని మందిరమునందు పాదరక్షలు ధరించి పోవుట కూడా అపరాధములే. దైవముల ఆరాధనమునందు ఒకనిని పనిలోకి తీసుకొనుట, ఏ పూలను శాస్త్ర ప్రకారము నిషిద్ధములని నిర్ణయింపబడినవో వానిని ఉపయోగించుట, విగ్రహముపై నిర్మాల్యమును తొలగించకుండా అస్తవ్యస్తముచేయుట, చీకటిలో భగవంతుని పూజచేయుట కూడా అపరాధములే. మద్యములను త్రాగుట, అంధకారము నందు ఇష్ట

దేవతను మేల్కొల్పుట, భగవంతునికి నమస్కారము, పూజలు వంటివి సమర్పింపకనే ఇహలోకపు పనులయందు ప్రవృత్తులై పోవుట ఇవి అన్నియూ అపరాధములే. వసుధా! ఈ రకమైన ముప్పది మూడు అపరాధములను నేను నీకు స్పష్టపరచితిని. ఈ అపరాధము లతో కూడిన పురుషుడు పరమ ప్రభువైన శ్రీహరి యొక్క దర్శనము పొందలేడు. అతడు దూరముగాఉండి పూజానమస్కారములు చేసినా ఆకర్మ రాక్షసకర్మగా భావించబడును.

క్రమముగా ఈ అపరాధములను పోగొట్టుకొని శుద్ధపరచుకొనువిధము అది. మాసిన వస్త్రములచే దూషితుడైన వ్యక్తి ఒక రాత్రి, రెండు రాత్రులు లేక మూడు రాత్రుల వరకు వస్త్రములను ధరించియే స్నానము చేసి, పంచగవ్యమును తాగిన యెడల అతడికి శుద్ధి జరుగును. నల్లని వస్త్రములను ధరించుట చేత కలిగిన పాపము నుంచి రక్షింపబడు టకు గోమయమును తన శరీరమునకు బాగుగా పూసుకొనవలెను. పిమ్మట ప్రజాపత్య వ్రతమును ఆచరించిన అతడు పవిత్రుడగును. గురువునకు విరుద్ధముగా వ్యవహరించిన పాపమునుంచి ముక్తుడగుటకు రెండు చాంద్రాయణ వ్రతములను చేయవలెను. నరులు పతితుని యొక్క అన్నమును తినిన యెడల చాంద్రాయణ వ్రతము (చాంద్రాయణ వ్రతము నందు పిపిలికా, యవమధ్య, శిశుచంద్రాయణము మొదలగునవి కలవు. శుక్లపక్షము యొక్క పాద్యమినుంచి భోజనము పెంచుకొనుచూ పోయి అమావాస్యనాడు అన్ని విధములుగా ఉపవాసముండుట 'యవమధ్యము' అను సర్వోత్తమమైన చాంద్రాయణ వ్రతము అగును.) ఇంకనూ పరాక వ్రతము (పన్నెండుదినముల పాటు పూర్తిగా ఉపవాసము చేయుట పరాకవ్రతము అనబడును. యధాత్మనో ప్రమత్తస్య ద్వాదశః మభోజనమ్ పరాకోనమ కృత్యోయమ్ సర్వపాపాప నోదనః) చేయుట చేత సిద్ధులగుదురు. పాదరక్షలు ధరించి దేవాలయమునకు పోవు మానవుడు కృత్యపాదవ్రతము, రెండు రోజులపాటు ఉపవాసము చేయవలెను. పూలు మొదలగు నైవేద్యములు లేకపోవుటచే కూడా పంచామృతముతో భగవంతునికి స్నానము, స్పర్శ చేసి, నమస్కారము చేయుటచే పాపము నశించును. మదిరాపానము చేసిన పాపము చేత శుద్ధుడై బ్రాహ్మణుడు, క్షత్రియుడు, వైశ్యునికి నాలుగు చంద్రాయణ వ్రతములు అట్లే పన్నెండు సంవత్సరముల వరకు మూడు ప్రజాపత్య వ్రతములను చేయవలెను. లేని ఎడల సౌకరనకక్షేత్రమునకు పోయి ఉపవాసము ఉండి, గంగయందు స్నానము చేయవలెను. దాని ప్రభావము చేత

నరుడు శుద్ధి కలవాడగును. ఇట్టి మధురయందు కూడా స్నాన ఉపవాసములు చేయుటచే కలుగు శుద్ధి సంభవమైనది. ఏ మనుష్యుడు ఈ రెండు తీర్థములందు చెప్పబడిన ప్రకారముగా ఒకమారైననూ ఆచరించిన ఎడల అతడు అనేక జన్మలలో చేసిన పాపముల నుంచి ముక్తుడగును. ఈ తీర్థముల యందు స్నానము, జలపానము వంటి భగవంతునికి ధ్యానధారణ కీర్తన మనన శ్రవణ దర్శనము చేయుటచే పాతకములు పలాయనము చెందును'' అని చెప్పగా మరల ధారుణీ దేవి భగవంతుని ఇట్లు ప్రశ్నించెను.

"సురేశ్వరా! మధుర, సుకరము ఈ రెండే తీర్థములు నీకు అధికప్రియములుగా ఉన్నవి. కాని వీని కంటెను ఎక్కువైన వేరు ఇతర తీర్థములు ఉండిన యెడల వానిని గురించి దయతో నాకు తెలుప ప్రార్థన''. ధారుణీదేవి ప్రశ్నకు జవాబుగా వరాహ భగవానుడు ఇట్లు తెలిపెను. "వసుధా! చిన్న చిన్న నదులు మొదలు పెట్టి సముద్ర పర్యంతము ఈ పృథ్విపై ఎన్ని తీర్థములు కలవో, వాని అన్నింటిలో కుబ్జామ్రక తీర్థము శ్రేష్ఠముగా పరిగణింప బడుచున్నది. నా శ్రద్ధ చేత సంపన్నులైన సత్పురుషులు ఎల్లప్పుడును వానిని ప్రశంసించు చుందురు. కుబ్జామ్రకము కంటెను కోటిరెట్లు అధికమైన పరమ రహస్యమైన సౌకరక తీర్థము కలదు.

ప్రాచీన కాలము నాటి వృత్తాంతము. మార్గశీర్ష శుక్ల పక్షము ద్వాదశీ తిథిన నేను 'సితవైష్ణవ' తీర్థమునకు వెళ్ళితిని. అచట పురాణములలో శ్రేష్ఠముగా పరిగణింపబడిన గంగాసాగరీకము అని పిలువబడిన ప్రాచీనమైనదానిని చూచితిని. ఇందు నా మధురా మండల తీర్థముల కంటెను అత్యంత రహస్యములైన మహిమలు వర్ణింపబడినవి. సిత తీర్థము నుంచి పదార్ధ గుణముల ఫలము ఇచ్చట సులభముగా కలుగదు. ఇందు ఎట్టి మాత్రము సంశయము అక్కర్లేదు. కుబ్జామ్రకము మొదలగు సమస్త తీర్థములను తిరుగుట కంటే నేను మధురకు వచ్చి ఒక స్థానము నందు కూర్చొంటిని. నా ఆ తీర్థమును 'విశ్రాంతి తీర్థము'అని అందురు. ఆ స్థానము గోపనీయములలో కూడా పరమ గోపనీయము. అచ్చట స్నానము చేయుట చేత పరమ ఉత్తమఫలము లభించును. తాము చెందబోవు గతిని అన్వేషించు వారికి, మధుర పరమగతి అయినది. మధుర యందు ముఖ్యముగా కుబ్జామ్రకము, అట్లే సౌకరక క్షేత్రములు అధిక మహిమ కలవి. సాంఖ్యయోగము, కర్మయోగములను అనుష్ఠించుట లేకుండా ఈ తీర్థముల యొక్క కృపచేత మానవుడు

ముక్తుడు అగుచున్నాడు. ఇందు ఎట్టి సంశయమును లేదు. యోగసంపన్నుడు, పండితుడు, అయిన బ్రాహ్మణుల కొరకు ఏ పద్ధతి చెప్పబడుచున్నదో అదే గతి మధురయందు ప్రాణత్యాగము చేసినవారికి, సాధారణ వ్యక్తులకు కూడా ప్రాప్తించగలదు. సువ్రతురాలా! మధుర నుంచి ఉత్తమమైన ఏ ఇతర తీర్థమును, అట్లే కేశవ భగవానుని కంటే శ్రేష్ఠుడైన వేరు ఇతర దైవమును లేదు. (178,179)

180 వ అధ్యాయము - అగస్త్యుని ఉద్ధరణ, శ్రాద్ధ విధి, ధృవ తీర్థ మహిమ

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఇప్పుడు నేను ఇతరులతో సంబంధము కలిగిన మరియొక వృత్తాంతమును చెప్పుచున్నాను. దానిని కూడా వినుము. మధురాపురము నందు పూర్వము ధార్మికుడు,శూరుడు అయిన ఒక రాజు కలడు. అతడి పేరు చంద్రసేనుడు. ఆయనకు రెండువందల మంది రాణులు కలరు. వారిలో చంద్రప్రభ అను రాణి అందరికంటే గుణవతి. ఆమెకు వందమంది దాసదాసీ జనులు కలరు. ఆ దాసీజనములో ఒక దాని పేరు ప్రభావతి. ఆ దాసి యొక్క కుటుంబము నందు పురుషులు సదాచార విహీనులు. ఆ దోషకారణముచేత అందరూ చనిపోయి నరకయాతనలలో పడిపోయిరి. అందుకు కారణము వారి వంశమునందు వర్ణసంకరము ఉత్పన్నమగుటయే.

దేవీ! ఒక సమయము నందు వారి పితరులు ధృవతీర్థమునకు వచ్చిరి. వారిపై త్రికాలదర్శియైన ఒక ఋషి యొక్క దృష్టి పడినది. వీరిలో కొందరు దివ్యరూపము గల పితరులు ఆకాశగమన శక్తి కలవారగుటచే వారికి తగిన శ్రేష్ఠమైన వాహనములను అధిరోహించి వచ్చిరి. తమ వంశమునందు వారిని ఆశీర్వదించి వెడలిపోయిరి. ధృవ తీర్థమునకు వచ్చిన మరియొక పితృగణము వారు తన కుమారులు శ్రాద్ధము చేయనందు వలన వారి పొట్టయందు ముడుతలు ఎక్కువగా పడెను. అంతట వారు తమ పుత్రులను శపించి వెడలిపోయిరి. త్రికాలజ్ఞ ముని దూరము నుంచి ఇది అంతయూ చూచుచుండెను. పితృగణములు వెళ్ళిపోయిన తర్వాత, ఆ మునులు ఒంటరిగా ఆశ్రమమునందు ఉండిపోగా, ఒక సూక్ష్మశరీరధారుడైన పితరుడు ఆయనతో "మునీ! వర్ణసంకర సంబంధ దోషము కారణము చేత నాకు నరకమునందు స్థానము లభ్యమైనది. నేను నూరు సంవత్సరముల నుంచి ఆశ అను తాళ్ళతో బంధింపబడినవాడనై ఎదురుచూచుచున్నాను. కాని ఇప్పుడు నిరాశోపహతుడనై మీ దగ్గరకు వచ్చితిని. మూడు తాపముల చేత

అత్యంతముగా భయపడి, వివశుడనై మీ శరణుజొచ్చి వచ్చి ఉంటిని. ఎవరి పుత్రులు పిండదానము తర్పణము చేయుదురో వారి పితరులు తృప్తి చెందినవారై పుష్టిగా ఉండి, ఆకాశగమనము చేయు శక్తిచేత స్వర్గమునకు పోయిరి. కాని నేను బలహీన వ్యక్తిని అగుటచే ఎచ్చటకును పోలేకఉంటిని. ఎవరి సంతానము తమ బిడ్డలు పాపలతో ఎల్లప్పుడు సంపన్నుడుగా ఉండునో,వారు అతడిద్వారా పొందిన హవిస్సులతో బాగుగా పూజింపబడిన వారై పరమగతి పొందుటకు అధికారిగలవాడగును. త్రికాలజుడు మునిశ్రేష్ఠుడా! మీకు దివ్యదృష్టి సులభమైనది. దాని ప్రభావము చేత ఎవరి పితరులు స్వర్గమునకు పోవుచుండగా చూచుచుండిరో వారందరూ ఈనాడు చంద్రసేన మహారాజుచే సత్కృతులైనారు. అనిపల్కగా, పితరులు ఇట్లు చెప్పెను.

ఎవరు పితరుని కొరకు శ్రాద్ధము చేయునో, అతడికి నిశ్చితముగా ఉత్తమ ఫలము లభించును. కాని అట్లు శ్రాద్ధము చేయని యెడల విపరీత ఫలితము ముందు వచ్చును, అంతేగాక పితరుడు నరకమును పొందినవాడగును. దీనికి కొంతకారణము కలదు. అదికూడా నీకు చెప్పుచున్నాను వినుము. శ్రాద్ధ సంబంధమైన ఏ పదార్ధము తగిన దేశ కాలపాత్రునకు ఇవ్వబడకపోయినయెడల, విధియొక్క రక్షణ ఉండదు. వెనువెంటనే దక్షిణ నదికి పోయిన అతడు ప్రత్యవాయక కారణుడు అగును. ఎవరు శ్రాద్ధ శ్రాద్ధమునకు మధ్య సంపన్నుడు కాలేదో, దేనిపై దుష్టప్రాణి యొక్క దృష్టి పడినదో, దేనియందు తిలలు, కుశలు లభించక ఉన్నవో కనీసము మంత్రములు కూడా చదువబడవో ఆ శ్రాద్ధమును అసురులు తీసుకొని పోవుదురు. ప్రాచీన కాలమునుంచే భగవానుడగు వామనుడు ఇట్టి శ్రాద్ధ అధికారి బలియను రాజును చేసెను. అట్లే దశరధనందనుడగు భగవంతుడు రాముని ద్వారా తన గణములతో క్రూరుడైన రావణుడు మరణించినప్పుడు, ఆ త్రిభువన భర్తయగు శ్రీరాముడు కొన్ని ఇట్టి శ్రాద్ధముల ఫలితములు త్రిజటకు ఇచ్చి వేసెను. శ్రీరామభగవానుడు భగవతి సీతతో కూర్చొని ఉండెను. సీత ఆయనతో 'త్రిజట మీయందు భక్తి కలిగియున్నది.' అనగా సీత యొక్క మాట విన్న శ్రీరాముడు ప్రసన్నుడయ్యెను. అందుచే ఆ పరమప్రభువు రాక్షసికి ఈ వరమునిచ్చెను. "త్రిజటా! ఎవరి శ్రాద్ధము చేయు వ్యక్తి యొక్క గృహమునందు శ్రాద్ధమునకు సంబంధించిన ఉత్తమ హవిష్య పదార్థములు మొదలగు సామాగ్రి ఉండదో, శ్రాద్ధవిధి పాత్రలు తగినవి ఉన్ననూ శ్రాద్ధము చేయు సమయమనందు కోపము వచ్చెనో,

అట్లే పక్షమునకు చెందిన, మాసమునకు చెందిన శ్రాద్ధమును సరియైన సమయమునందు నిర్వర్తించకపోయినను, అట్టి సమయమున దక్షిణ ఇవ్వలేదో, ఆ ఫలమును నేను నీకు ఇచ్చుచున్నాను.ఈ విధముగా భగవంతుడు ఈశ్వరుడు కూడా నాగరాజు వాసుకి యొక్క భక్తిచేత ప్రసన్నుడై, అతడికి వరము ఇచ్చు సమయమునందు ఇట్లు చెప్పెను. నాగరాజా! ఏ మనుష్యుడు వార్షిక శ్రాద్ధముచేయు సందర్భమున ముందుగా భగవంతుడగు శ్రీహరి యొక్క ఆజ్ఞను పొందలేదో, శ్రాద్ధక్రియను సంపన్నముచేసిననూ, యజ్ఞసమయమునందు ఆ దక్షిణ ఇవ్వలేదో,దేవబ్రాహ్మణుల యెదుట ఇచ్చెదనని ప్రతిజ్ఞచేసి,దానిని నెరవేర్చుకొనలేదో, శ్రాద్ధమునందు మంత్రములు చదువకనే క్రియలను చేసెనో, ఇట్టి యజ్ఞమును, శ్రాద్ధమును సంపూర్ణ ఫలమును నేను నీకు అర్పించుచున్నాను" అని చెప్పి మునీ, ఇవి అన్నియు పురాణములు ఇతిహాసములలో వివరింపబడినవి. "మునివర్యా! ఎవనిని తన దయనీయ దశయందు చూచెనో, అతడి శ్రాద్ధము విధిపూర్వకముగా అనుష్ఠింపబడదో దాని ఉత్తమ ఫలము ఆ పితరులకు ప్రాప్తింప వీలుకాదు. ఈ కారణము చేతనే వీరు పనికిరాని కాలక్షేపము చేయుచున్నారు. వీరి పుత్రులు చేసిన శ్రాద్ధములయందు దోషములు ఉండిపోయినవి. అందుచేతనే పితృగణములు మా వంశమునందు ఎవరో ఒక వ్యక్తి జన్మించి హెచ్చుగా జలముగల నదులలో 'త్రుప్యర్ధ్వం ఉదీరతామ్, అయంతుమ్' మొదలగు మంత్రములచే మాకు తర్పణము, దాని ఒడ్డున శ్రాద్ధను చేయుదురో అని గాథలను పాడుచుందురు. మహాప్రాజ్ఞుడా! నీవు నన్ను దేనికై ప్రశ్నించితివో ఆ ప్రశ్నకు సంక్షేపముగా ఇది నా జవాబు" అనెను.

వసుంధరా! దీనినంతయూ విని ఆ ఋషులు చంద్రసేన రాజు వద్దకు వచ్చిరి. ఆ ఋషులను చూచి రాజు సింహాసనము నుంచి లేచి భూమిపై నిలబడినవాడై వారి చరణముల యందు శిరమును వంచి, మునిశ్రేష్ఠులారా! మీరు నా యింటికి వచ్చితిరి. దానిచేత నేను ధన్యుడను, కృతార్థుడను అయితిని. మీరు ఇచటకు వచ్చుట చేత నా జన్మము సఫలమైనది. పాద్యము, అర్ఘ్యము, మధుపర్కము ఇంకనూ గోవులు మొదలగు అన్ని వస్తువులను మీసేవకై సమర్పించుచున్నాను. వీనిని మీరు స్వీకరించి నాకు పూర్ణ సంతోషము కలిగించి, నన్ను కృతార్థుని చేయుడు అని పల్కెను. దేవీ! ఆ సమయమునందు చంద్రసేన రాజు చేత సమర్పింపబడిన అర్ఘ్యాదులను స్వీకరించి త్రికాలజ్ఞులైన ఆ మునులు

వెంటనే ఆ రాజుతో "రాజా! నేను వచ్చుటకు ఒక విశేషమైన కారణము కలదు. దానిని మీరు వినుడు" అని పలుకగా అందుపై రాజర్షి చంద్రసేనుడు తపోధనుడైన ఆ ఋషిని ఇట్లడిగెను. "తపోధనా! అది ఎట్టి కార్యము. మీరు దయతో తెలుపుము. నేను దానిని సముచితముగా చేయుటకు ఉద్యుక్తుడనై యున్నాను. దానితో మీ మనోరథ సిద్ధి జరుగు గాక!" అని పల్కెను. అందుకు ముని "రాజా! నీవు నీ పట్టపురాణి వారి దాసిజనమునందు ప్రభావతి అని పిలువబడు దాసిని ఇచ్చటకు పిలువుడు" అని చెప్పెను. రాజు తన రాణిని, ఆమెను పిలువనంపెను. పరమసాధ్వియైన రాణి వచ్చి, దాసితో నేలపై కూర్చొండెను. ఆ సమయమున ఆమె శరీరము భయము, దుఃశంకలచేత కంపించుచుండెను. వచ్చిన తోడనే ఆమె వినయపూర్వకముగా ఋషికి నమస్కరించెను.

ఆమె కూర్చొన్నాకా, ముని "అమ్మా! నేను ధృవతీర్థమునందు అత్యాశ్చర్యమైన ఒక విషయమును చూచితిని. దానిని మీ అందరి ముందు బయటపెట్ట తలచుకొంటిని. ఆ విషయము ఏమనగా ఈ రోజు జీవుల పితృగణములు ధృవతీర్థమునందు చేరుకొనిరి. శ్రాద్ధము పెట్టుటయందు నేర్పరులు అయిన పుత్రులు విధి ప్రకారము తమ పితృల శ్రాద్ధమును నిర్వర్తించిరి. అట్టి వారి పితరులు తృప్తులై స్వర్గమునకు పోయిరి. కాని అచ్చటనే నాకు అత్యంత దుఃఖభాగుడగు ఒక పితరుడు కన్పించెను. ఆయన శరీరము ఆకలి దప్పులచేత శుష్కించి ఉండెను. ఆతడి ముఖము వాడిపోయి, కన్నులు చాలా చిన్నవిగా ఉన్నవి. స్వర్గమునకు పోవునట్టి ఆశ దూరమగుట చేత ఆయన మరల అపవిత్రమైన నరకమునకే పోవుటకు సిద్ధమై వివశుడై యుండెను. ఆయనను చూచి నాకు చాలా దయ కలిగినది. ఆ కారణము చేత నేను వారిని "సోదరా! నీవు ఎవరు? నీకు ఏమి కావలయును? దయతో నాకు తెల్పుము" అని ప్రశ్నించితిని. అప్పుడు ఆయన సర్వమును తన స్థితిని వివరించెను. ఆ సమయమున ఆయన మాటలు వినిన వెంటనే, దయతో నేను వివశుడనైతిని. మహారాణీ! ఆ విషయము ఏమనగా, మీ ఈ దాసికి ఒక పుత్రిక కలదు. ఆమె పేరు విరూపనిధి. ఆ పేరుతో ఆమె ప్రసిద్ధురాలు అయినది. నీవు దయతో మీ దాసికి చెప్పి ఇప్పుడు ఇచ్చటకు పిలువనంపుము"అని పల్కెను.

వసుంధరా! ఈ విధముగా మునిశ్రేష్ఠుడగు త్రికాలజ్ఞుడు తెల్పిన విషయములను విని, చంద్రసేన మహారాజు యొక్క రాణి ఆ క్షణమునందే ఆ దాసిపుత్రికను పిలిపించుమని

ఆజ్ఞ ఇచ్చెను. ఆ సమయమున ఆమె మద్యపానము చేసి ఉన్మత్తురాలై ఉన్నది. ఏదో ఒక విధముగా రాజసేవకులు ఆమెను సంబాళించుకొని చేతితో పట్టుకొని అక్కడకి తీసికొని వచ్చి, ఆ ముని ఎదుట నిలువబెట్టిరి. ముని ధర్మమును పూర్తిగా ఎరిగినవాడు, అయిననూ మద్యపాన ప్రభావము చేత చెదిరిన మనస్సుగలదైన, ఆ దాసిని చూచి అతడు ఆమెను ఇట్లు ప్రశ్నించెను. "ఓసీ! నీవు పితరుల కొరకు కనీసము పిండదానమును, అట్లే జలములతో 'స్వధ' అని పలికి తర్పణమును ఇచ్చితివా లేదా? నీవు పితరులకు ముక్తిని కలిగించేది పిండము తర్పణములను విడచు విధులను సంపూర్తిగా చేయలేదని తెలియుచున్నది. వసుధా! దీనిపై ఆ దాసి మునితో ఇట్లు చెప్పెను. "అయ్యా! నేను ఇట్టి ఏ విధానపూర్వక విధిని నిర్వర్తింపలేదు. నా తండ్రి ఎవరో, ఆయన స్వర్గప్రాప్తికి ఎట్టి క్రియలను ఆచరింప వలెను అను విషయము కూడా తెలియదు" అని చెప్పెను.

పృథ్వీ! ఈ విషయమును చెప్పిన ఆ దాసితో త్రికాలజ్ఞుడైన ముని ఇట్లు చెప్పెను. మన ఈ నగరమును పాలించుచున్న మహారాజు, మహారాణి, ఇంకనూ ఇచ్చట నివసించు ప్రజలు అందరూ సజ్జన పురుషులు, ధృవతీర్థమునకు చేరుకొందురు. అచ్చట పితరులకు పుత్రుల ద్వారా చేయబడిన శ్రాద్ధ మహిమ యొక్క ఫలము మీ కందరకునూ కళ్ళ ఎదుటనే స్పష్టము కాగలదు అని పల్కగా అదివిని నగరవాసులందరునూ ఇంకనూ ఎవరికి శ్రాద్ధము జరుపుటయందు ఏ మాత్రము ఆసక్తి కూడా లేదో వారు ఇంకను శ్రాద్ధాధికారముగల బ్రాహ్మణులును ధృవతీర్థమునకు చేరుకొనిరి. అచ్చటకు పోయిన తర్వాత అందరి దృష్టి తమ సంతానము ద్వారా సత్రుతులుగా కాక అస్తవ్యస్తముగా గల జీవులపై పడెను. దిక్కులేని అట్టి జీవులపై జీవులు నాలుగు దిక్కుల నుంచి వానిపై వాలుచుండినవి. దానితోపాటు ఆ జీవులు ఆకలిచేత మిక్కిలి బాధపడుచుండినవి. ఆ సమయమున త్రికాలజ్ఞుడు అచ్చట చేరిన జీవులు అందరితో" చూడుడు. ఈ స్త్రీలందరూ నీ సంతానము చేతనే ఉత్పన్నులైరి. మీరు అందరు పరిపుష్ఠులు అగుడు. ఈ రాజు యొక్క కృపచేత ఈ ప్రజలందరు ఇచ్చటికి వచ్చుట జరిగినది" అని చెప్పగా, అంత ఆ పితరులు ఇట్లు చెప్పిరి.

"ఈ దాసి మొదటగా ఈ ధృవతీర్థమునందు స్నానము చేయవలెను. పిమ్మట వేదములయందు నిర్దేశింపబడిన పద్ధతిలో తర్పణము విడువవలెను. తదనంతరము ప్రాచీన ఋషులు ఏ విధముగా చెప్పిరో, దానిని అనుసరించి, పిండదానాది శ్రాద్ధకర్మ చేయవలెను.

అచ్చట ఉపయోగింపవలసిన పాత్రలు అన్నియూ రజతపాత్రలు కావలయును. వానితో వస్త్రములు, చందనము, ఉండుట అవసరము. అంతేకాక భక్తిపూర్వకముగా, పిండార్చన చేసి పితరుల యొక్క పూజను జరిపింపవలెను. సజ్జనులగు మీరందరునూ ఇచటనే ఉండి పిమ్మట దాని పరిణామమును అప్పుడే దర్శించుడు. మేము పరమ సుఖము చేత సంపన్నులము కాగలము. ఈ విధానమునందు ఈ సంతానము ద్వారా నా శ్రాద్ధమును చేయుట మీ అందరి దయపై ఆధారపడి ఉన్నది" అని పల్కెను.

వసుంధరా! రాణి చంద్రప్రభ అగస్తి అను పితృడు యొక్క మాటలను విని, దాసి ద్వారా ఆ ప్రాణి యొక్క శ్రాద్ధమును ఆచరించుటలో తత్పరురాలు అయ్యేను. ఆ శ్రాద్ధము నందు అనేక దక్షిణలు ఇవ్వబడెను. పిండదానము చేయు సమయమున పట్టువస్త్రములు, జపము, కర్పూరము, అగురు, చందనము, నువ్వులు, అన్నము మొదలగు వివిధ వస్తువులు ఉపయోగములోనికి తీసుకొని రాబడినవి. ఫలస్వరూపముగా పిండదానము యొక్క క్రమము సమాప్తము కాగానే, ఆ వికృతదశ కలిగిన అగస్తి ఇట్లు దేవతల రూపము వలె ఉన్నట్లుగా మారి అడవిలోనికి పోయిరి. అతడి శరీరము మహా తేజోమయమయ్యెను. పార్శ్వవర్తిగా గల మశకముల (దోమల) ఆకృతియందు కూడా అట్టి మార్పే జరిగెను. ఇప్పుడు ఆయనచుట్టు కమ్ముకొనున్న ప్రాణులుకూడా ఇట్టిశోభను పొందుట మొదలయ్యెను. యజ్ఞదీక్షితుడైన ఏ పురుషుడు అంతమునందు అవభృధ స్నానముచే సంపన్నుడు అయ్యెను అనునట్లు వారి రూపములు మారిపోయెను. ఆ సమయమున స్వర్గమునుంచి ఆకాశము నిండిపోవునన్ని విమానముల అచటికి వచ్చి చేరినవి. అప్పుడు అగస్త్యాది మహాఋషులు అందరును ఇట్లు చెప్పిరి. "మహానుభావా! మేము బాగుగా తృప్తి చెందాము. అందుచేత ఇప్పుడు పరమధామమునకు పోవుచున్నాము. ధృవతీర్థము యొక్క మహిమను గురించి నేను అనేకమార్లు మీ ఎదుట తెలియజేసితిని. మహాముని, నేను చెప్పవలసిన విషయము ఏమికలదు? మీరందరును స్వయముగా కూడా దీని మహిమను చూచితిరి. మమ్ము ఉద్ధరించుట పూర్తిగా అసంభవము. అయినను మీ కృపచేత మేము ఈ దుష్కరమైన పాపపుంజములను దాటివేసితిమి.

పృథ్వీ! మునివరుడు, త్రికాలజ్ఞుడగు ఆ ముని, అగస్తి అను పేరు గల ఆ జీవి చంద్రసేన మహారాజు, రాణి చంద్రప్రభ అచ్చట ఉన్న జనులందరూ, "ప్రభావతి ఆమె

పుత్రికలకు, పిమ్మట మీ అందరికీ శుభము కలుగుగాక" అని ఈ విధముగా చెప్పుచూ తమ సహచరులతో ఉత్తమమైన విమానము ఎక్కి స్వర్గమునకు పోయిరి.

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. భద్రా! అటు పిమ్మట చంద్రసేన మహారాజు ఆ తీర్థము యొక్క మహిమను చూచి, మహర్షి త్రికాలజ్ఞునికి నమస్కరించి తన పరిజన పురజనసహితముగా నగరమునకు తిరిగి పోయెను.

పృథ్వి!మధురామండలమందు అంతర్గతముగానున్న తీర్థముల మాహాత్మ్యమును నేను నీకు తెలియజేసితిని. ఈ తీర్థము శక్తి సంపన్నమైనది. అందుచేత దాని మాహాత్యమును వినినంతనే లేక స్మరించి చేసినంతలోనే మనుష్యునికి పూర్వజన్మములో చేసిన పాపములు నష్టములైపోవును. బ్రాహ్మణసన్నిధియందు కూర్చొని ఈ వృత్తాంతమును చదివినవాడు లేక స్మరించినవాడు గయాక్షేత్రమునకుపోయి తన పితరులను తృప్తి పరచును. మహాభాగా! ఎవనికి వ్రతమునందు శ్రద్ధ లేదో, ఈ ప్రసంగమున వినుటలో ఉదాసీనుడుగా ఉండునో, అట్లే శ్రీహరి భగవానుని అర్చించుటయందు విముఖుడు అయిన వానికి ఎదురుగా దీనిని వర్ణించుట చేయకూడదు. అతనిఎదుట వర్ణించుట విముఖ పరచుటయే అగును. అట్లే ఈవృత్తాంతము తీర్థములయందు పరమతీర్థము, ధర్మములందు శ్రేష్ఠధర్మము జ్ఞానమునందు సర్వోత్కృష్ట జ్ఞానము అట్లే లాభములయందు మహోత్కృష్ట జ్ఞానము. పుణ్యరాలా! శ్రీహరి భగవానుని యందు నిరంతరము శ్రద్ద గలవానికి, పుణ్యాత్మునికి మాత్రమే ఈ విషయముల ప్రవచనమే చేయవలెను.

సూతుడు ఇట్లు చెప్పెను. ఋషులారా! వరాహభగవానుని ఈ వాణిని విని ధరణి దేవియొక్క మనస్సు ఆశ్చర్యముతో నిండిపోయెను. ఇప్పుడు ఆ దేవి ప్రసన్నతా పూర్వకముగా విగ్రహమును స్థాపించు విషయమునందు ప్రభువుతో పునఃపున ప్రశ్నలు అడుగుట ప్రారంభించెను. (180)

181, 182 వ అధ్యాయములు - విగ్రహనిర్మాణము, ప్రతిష్ఠ, పూజావిధి

సూతుడు ఇట్లు చెప్పెను. "ఋషులారా! జగన్మాత వసుంధరా తీర్థముల మాహాత్మ్యము వినినంతనే చాలా ఆశ్చర్యము చెంది సంతోషభరిత సాంతనము కలదియై వరాహభగవానుని మరల ఇట్లు ప్రార్థించెను. "భగవాన్! నీవు మధురా క్షేత్రము యొక్క మాహాత్మ్యమును వర్ణింపగా, దానినివిని నాకు మహాసంతోషము కలిగినది. అయినప్పటికినీ

నా మనస్సునందు మరియొక విషయమును తెలిసికొనవలెనని జిజ్ఞాస కలిగినది. విష్ణుదేవా! దానిని సవిస్తరముగా కృపతో తెలుపుము. కొయ్య, పాషాణము మృత్తికలతో విగ్రహమును తయారుచేయుటలో మీరు ఏ రకమైన విగ్రహమునందు విరాజిల్లుచున్నారు? అను దానిని తెలుసుకొనవలెనని కోరిక కలదు. అంతేగాక రాగి, కంచు, వెండి, బంగారము మొదలగు వానిలో కూడా దేనిచేత ఈ అర్చావిగ్రహముల స్వరూపము మీ యధార్థరూపము కాగలవో తెలుపుము. గోడలపైన లేక భూమిపైన మీ శుభకరములైన విగ్రహములను తయారుచేయుచున్నారు. వాటిని గురించి జేయవలసిన విధానములను కూడా నేను తెలిసికొనవలయునను కొనుచున్నాను" అనిప్రశ్నింపగా వరాహభగవానుడు ఇట్లు చెప్పెను.

"వసుంధరా! ఏ వస్తువు లేక పదార్థము చేత విగ్రహమును లేక ప్రతిమను తయారు చేయవలయునో ఆలోచించి మొదట దానిని శోధన చేసి లక్షణములను అనుసరించుచూ చిహ్నములను గుర్తింపవలెను. పిమ్మట దానిని శుద్ధిచేసి, విధి ప్రకారము ప్రతిష్ఠింప వలయును. దేవీ! ఇది కాక పిమ్మట జననమరణ రూప భయముచే ముక్తుడు అగుటకొరకు ఆ విగ్రహమునకు పూజ చేయవలయును. ఒకవేళ కొయ్యతో చేయబడిన విగ్రహమును చేయింపవలెనన్నచో అన్నింటిలోను ఇప్పకొయ్య సర్వోత్తమమైనది. విగ్రహము తయారైన తర్వాత దానికి విధిప్రకారము ప్రతిష్ఠ, పూజ చేయవలెను. ప్రతిష్ఠ చేయునప్పుడు నేను తెల్పిన వస్తువులను, గంధము మొదలగు పదార్థములు విగ్రహమునకు అర్పించ వలెను. కర్పూరము, కుంకుమ, అగురు, దాసినచెక్క రసము, అత్తరు, చందనము, వట్టివేరు మొదలగు సామానుల చేత వివేకశీలుడైన పురుషుడు ఆ ప్రతిమకు లేపనము చేసి పూజ చేయవలెను. స్వస్తికము వృద్ధికి సూచకము. అందుచేత విగ్రహముపై శ్రీ వత్సము లేక కౌస్తుభమణి యొక్క చిహ్నములు ఉండుట ఆవశ్యకము. తిరిగి విధిపూర్వకముగా పూజ చేసి అర్చనకు పాలచేత సిద్ధము చేయబడిన పాయసమును భోగముగా అర్పించవలెను. ఇది అత్యంత మంగళప్రదమైనది. నువ్వులనూనె లేక నేతి దీపారాధన పూజకొరకు ఉత్తమమైనవి. ఇందు ఏమాత్రము సందేహము లేదు.

ప్రాణాయామము చేసి మంత్రమును ఉచ్చరింపవలెను. ఆ మంత్రము యొక్క భావము ఇట్లుండును. "భగవంతుడా! ఈ సంపూర్ణ విశ్వము నీ స్వరూపమే. అట్లయునను కూడా నీ స్పష్టమైన రూపము అందుకనిపించదు. ఇప్పుడు నీవు సుస్పష్టమైన రూపముతో

భూమండలముపై నడుచుచూ ఈ కొయ్యచేత చేయబడిన విగ్రహమునందు ప్రతిష్ఠితుడవు కమ్ము." కొయ్యచే చేయబడిన విగ్రహములయందు భగవానుని ప్రతిష్ఠించుటకు ఇది విధి. ప్రతిష్ఠించిన తర్వాత భగవంతుని ఆరాధించెడి పురుషుల వెంట ప్రదక్షిణము చేయవలెను. పూజ చేసిన తర్వాత కూడా దీపారాధన వెలుగుచూ ఉండవలెను. మనస్సులోనే "ఓం నమో నారాయణాయ" మంత్రమును ఉచ్చరింపవలెను. ప్రతిష్ఠింపబడిన విగ్రహమును నిత్యమూ పూజింపవలెను. దానితో "భగవంతుడా! నీవేనాకు ఆశ్రయమును కల్పించు ఏకైక మూర్తివి. వాసుదేవా! నీవు ఈ స్థానమును ఎన్నడును పరిత్యజింపకుండుటను ప్రార్థించుచున్నాను" అని మొక్కుకొనవలెను.

వసుంధరా! ఆ సమయమున అచ్చట ఎందరు భగవంతుని భక్తులు కలరో వారు ఇదే విధానము చేత అర్చావిగ్రహము యొక్క పూజచేయవలెను. అందరితో చందనము, పుష్పము అనులేపనములతోను నైవేద్యములతో విధిప్రకారము పూజ చేయవలెను. సుందరీ! ఇప్పచెట్టుకొయ్య చేత ప్రతిమను చేయించుటకు, ప్రతిష్టించుటకు ఇదియే విధానము.ఏ నరుడు కొయ్యప్రతిమను ప్రతిష్ఠించి ఆ విధితో పూజించునో అతడు తిరిగి ఈ లోక జంజాటమునందు పడక నా లోకమునకు చేరుకొనును.

వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఇప్పుడు పాషాణము (రాయి) చేత చేయబడిన విగ్రహమునందు నేను ఏ విధముగా నివసించుచున్నానో అది తెలుపుచున్నాను. పాషాణము చేత శ్రేష్ఠమైన విగ్రహము తయారు చేయుటకు, చూచుటకు అందముగాను, శల్యరహితముగాను, అట్లే చక్కగా శుద్దముగా ఉన్న రాతిని చూచి దానియందు దక్షుడైన కళాకారుని నియుక్తిని చేయవలెను. సర్వప్రథమముగా ఆ శిలపై తెల్లని వత్తితో ప్రతిమ యొక్క గుర్తులు ఉంచి దానిని అక్షతలు మొదలగువానితో పూజించి, దీపారాధన చూపించి ఇంకనూ పెరుగు, బియ్యములతో బలియిచ్చి, ప్రదక్షిణము చేయవలెను. అటుపిమ్మట "నమో నారాయణాయ" అను మంత్రమును చదివి "భగవంతుడా! నీవు అన్ని ప్రాణులలో శ్రేష్ఠుడవు. పరమప్రసిద్ధుడవు సూర్యచంద్రులు అట్లే అగ్ని నీ రూపములు. నీవు కాక ఈ చరాచర ప్రపంచమునందు అధిక విజ్ఞుడు వేరెవ్వరూ లేనేలేరు. భగవాన్ వాసుదేవుడా! ఈ మంత్రము యొక్క ప్రభావము చేత ప్రభావితుడవై, నీవు ఈ ప్రతిమయందు నెమ్మదినెమ్మదిగా ప్రతిష్ఠింపబడిన వాడవై, నా కీర్తిని

పెంపొందింపుము. అట్లే స్వయముగా కూడా వృద్ధికి ప్రాప్తుడను అగునట్లు చేయుము. నీవు నీ అభీష్టమైన విగ్రహమును స్వయముగా నిర్మించబడునట్లు చేయింపుము. సర్వప్రపంచము పరమప్రభువైన భగవాన్ నారాయణుని స్వరూపమే", అని మరల మంత్రధారణ చేయవలెను. విగ్రహము పూర్తి అయిపోయిన తర్వాత ఆయనను తూర్పు దిక్కుకు ఎదురుగా ఉంచవలెను. అంతేగాక ఉజ్జ్వలముగా ఉండు వస్త్రములను కట్టి రాత్రియందు ఉపవాసము చేయవలెను. మరల ప్రాతఃకాలమున దంతధావనము చేసి, తెల్లని యజ్ఞోపవీతము ధరించి చేతియందు చందనము మొదలగువానిని తీసుకొని "భగవాన్! ఎవని సర్వరూపమును మాయా శబరుడని చెప్పబడుచున్నాడో, సర్వజగద్రూపము లో విరాజిల్లువాడవు నీవే! ప్రభూ ఈ విగ్రహమునందు కూడా నీకు వాసము కలదు. ప్రపంచ కారణము చేత జగత్తు యొక్క ఆకారము వంటి అర్చావతారము ధరించి లోకనాథా శోభ పొందుము." అని "ఈ విధముగా నేను నీ ఆరాధనను చేయుచున్నాను. ఈ విగ్రహము కూడా నీవు లేనిది కాదు. ఆద్యంతరహితుడవైన ప్రభూ! ఈ జగత్తు యొక్క శక్తి స్థిరముగా ఉండుటయందు నేనే నిర్మించినవాడవు. నీవు ఓటమి లేనివాడవు." అని ఈవిధముగా భగవంతుని విగ్రహమును పూజించి "ఓం నమో వాసుదేవా" అను మంత్రమును పఠించి విగ్రహముపై జలమును చిలికించవలెను.

సుందరీ! ఈ విధముగా పాషాణమయమగు ప్రతిమయందు నా ప్రాణప్రతిష్ఠచేసి, పూర్వాభాద్ర నక్షత్రమునందు అన్నాదులయందు అధివాసము చేయించవలెను. నా ఉపాసన యందు ఉత్సాహము గల వ్యక్తి నా ప్రతిమాస్థాపన చేయును. అతడు శ్రీహరి భగవానుని లోకమునకు పోవును. ఇది నిశ్చయము. ప్రతిష్ఠయైన రోజులలో సాధకులు యవలు లేక పాలచే చేసిన ఆహారముచే రాత్రింబగళ్ళు గడుపవలెను. ఇష్టదేవుని విగ్రహము ప్రతిష్ఠింపబడిన తర్వాత సాయంకాల సంధ్యా సమయమునందు ప్రజ్వలించు నాలుగు దీపములు ఏర్పాటు చేయవలెను. భగవంతుని ఆసనమునకు క్రింద పంచగవ్యము, చందనము నీటితో పరిపూర్ణమైన నాలుగు కలశములను స్థాపింపజేయవలెను. ఈ సమయమున సామవేదగానము చేయు బ్రాహ్మణులచే వేదపఠనము చేయింపవలెను. దేవీ! ఏ బ్రాహ్మణులు వేదమునందలి వేలకొలది మంత్రములను చదువుదురో వారి నోటినుంచి వెలువడుచుండు ఈ శుభప్రదమైన సామవేద స్వరమును విని నేను అచ్చటికి పోవుదును.

ఎందుకనగా వేదమంత్ర పఠనము నాకు పరమప్రియమైనది. అయిననూ, అచ్చట అనర్గళమైన భాషణము చేయకూడదు. పుణ్యవ్రతములు చేయు పూజాసమయము నందు ఈ అర్థమువచ్చు మంత్రములు చదివి ఆవాహనము చేయవలెను. "భగవంతుడా! ఆరు విధములైన కర్మలయందు నీ ప్రాధాన్యత కలదు. నీవు అయిదు ఇంద్రియములతో సంపన్నుడవై ఇచటకు వచ్చు దయను ప్రదర్శింపుము. జగత్ప్రభో! నీయందు సర్వవేద మంత్రములు స్థానమును పొంది ఉన్నవి. సమస్త ప్రాణుల ఉనికి కూడా నీయందే కలదు. ఈ అర్చనము నీవు ఉండుటకు సురక్షిత స్థానము" అను ఈ అర్థము గల మంత్రము యొక్క ఉచ్చారణ చేయుచూ, నువ్వులు, నెయ్యి, సమిధలు, తేనెలతో ఒక వంద ఎనిమిది ఆహుతులను కూడా ఇవ్వవలెను. నేను ఈ విధి ద్వారా ప్రతిమా ప్రతిష్ఠుడను కాగలను. ఇంకనూ ప్రాతఃకాలమున స్వచ్ఛమైన జలమునందు స్నానము చేసి, మంత్రములను చదివి పంచగవ్యపానమును చేయవలెను. అనేక విధములగు గంధములు, పుష్పములు, లాజలు, మొదలగువానిని ఉపయోగించి తిరిగి మాంగళికగీతము, వాద్యములతో కలిపి మధ్య భాగమునందు ఎత్తైన స్థానముపై స్థాపింపవలెను. అన్ని విధములైన సుగంధములను తీసికొని, మరల ప్రార్థన చేసి "భగవంతుడా! ఎవనికిని సర్వలక్షణముల చేత లక్షితురాలైన లక్ష్మిదేవిచేత సుశోభితుడైన సనాతన శ్రీహరి అందురో ఆతడు నీవే. ప్రభూ! పరమ ప్రకాశము చేత సుశోభితుడవై నీవు ఇచ్చట విరాజిల్లవలెను. నీకు నా అనేక సాష్టాంగ నమస్కారములు" అని ప్రార్థన చేయవలెను.

ఈ విధముగా భగవానుని స్థాపించి దానికి అనులేపనము (శరీరమునకు రుద్దుట) చేయవలెను. చందనము, కుంకుమ మొదలగునవి కలిపిన యక్షకరమమును పూయుట మంచిది. ఈ విధముగా ఉద్వర్తనము అర్పించి "ప్రభూ! సకలవిశ్వములందునూ నీవు ప్రధానుడవు. అట్లే బ్రహ్మ బృహస్పతి నీకు ఉత్తమ పద్ధతిలో పూజ చేసెను. నీవు అఖిల లోకములకు మంత్రయుక్తుడవు. నేను నీ ఈ మంత్రము ద్వారా స్వాగతించుచున్నాను. నీవు ఇచట విరాజిల్లు కృపను దయచేయుడు" అను యర్థము గల మంత్రమును చదువవలెను. ఈ విధిచే బాగుగా ప్రతిష్ఠ చేయించి గంధములు పూలతో పూజ చేయించవలెను. నా విగ్రహముపై మొదట శ్వేత వస్త్రమును కప్పవలెను. వస్త్రము సమర్పించిన తర్వాత "దేవేశా! భక్తిపూర్వకమైన వస్త్రమును నీకు సమర్పిస్తున్నాను. విశ్వమూర్తి! ఈ వస్త్రములను నీవు

స్వీకరించి నాపై ప్రసన్నుడవు కమ్ము. నీకు పలుమార్లు నమస్కారము చేయుచున్నాను అను ఈ అర్థము గల మంత్రమును పఠింపవలెను.

ఆ పిమ్మట కుంకుమ అగురు చేత కలుపబడిన ధూపము సమర్పింపవలెను. ధూపము ఇచ్చు సమయమున "దేవేశా! ఆద్యంతములు లేని పురాణ పురుషుడవు నీవు. అట్లే సమస్త విశ్వమునందును అందరికంటెను పైన శోభించుచున్నావు. భగవంతుడా! నారాయణా! నీవు చందనమాలలు ధూపదీపములు స్వీకరించి మిమ్ము కృపజూపుము. నీకు నిరంతరము నా నమస్కారములు." ఈ అర్థము వచ్చు మంత్రము చదువవలెను. అనుచూ ఈ విధముగా పూజ చేసిన పిమ్మట భగవత్ ప్రతిమ యొక్క ముందు భాగమున నైవేద్యమును సమర్పింవలెను. ప్రాశన, అర్పణ చేయు మంత్రము ఇంతకు ముందే చెప్పబడినవి.వానిని ఉచ్చరించి విజ్ఞుడగు పురుషుడు అర్పింపవలెను. శరీర శుద్ధి కొరకు నైవేద్యము తర్వాత ఆచమనము ఇప్పించుట ఆవశ్యకము. అట్లే శాంతి పాఠము చదివింపవలెను. ఎందుకనగా శాంతి పాఠము చదివించుటచే, సమస్త కార్యములందునూ సిద్ది సులభమగును. ఆ మంత్రభావము ఇది. "జగత్ప్రభో! ఓంకారము నీ స్వరూపము, రాజు,రాష్ట్రము, బ్రాహ్మణుడు, బాలకుడు, వృద్ధుడు, గోవులు, కన్యలు పతివ్రతలు వీరందరునూ చక్కగా శాంతిగా ఉండవలెను. ఇచట రైతులకు మంచిపంట ఉత్పన్నము కావలెను". వసుంధరా! వ్రతము ఆచరించు పురుషుడు ఈ విధమైన విధి ద్వారా దేవేశ్వరుడైన భగవానునికి చక్కని విధానము ద్వారా ఆరాధన చేయవలెను.

దేవేశ్వరా! భగవానుని యొక్క మేలుకై అన్ని విధములుగా ఆరాధన చేయాలి. అంతేగాక బ్రాహ్మణులకు నిరహంకార భావముతో భోజనము చేయించవలెను. తమలో శక్తి ఉన్నచో పేదవారు అనాథులు కూడా తృప్తి కలిగించు ప్రయత్నము చేయువారే! ఈ విధిచేత నా అర్చక స్థాపన చేయవలెను. దీని పరిణామాత్మక స్వరూప పురుషుడు నా లోకమునందు ప్రతిష్ఠ పొందుదురు. వారు నా లోకమునందు ప్రతిష్ఠ పొందును. ఇంకనూ వారు నా లోకమునందు జలములోని ఎన్ని నీటి బిందువులు క్రింద పడుచున్నవో అన్నివేల సంవత్సరముల వరకు విష్ణులోకమునందు ఉండుటకు సిద్ధముగా ఉండవలెను. భూమీ! అహంకారరహితుడైన ఏ వ్యక్తి చేత నా ప్రతిష్ఠ చేయబడుచున్నదో ఆ వ్యక్తి ముప్పది తొమ్మిది పీడలనుంచి ఉద్ధారకుడై ఉండుచున్నాడు. (181, 182)

183, 184 వ అధ్యాయములు - మృణ్మయము, తామ్ర ప్రతిమల ప్రతిష్ఠావిధి

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఇప్పుడు మృత్తిక చేత చేయబడిన నా ప్రతిమను ప్రతిష్ఠ చేయు విధానము తెలుపుచున్నాను. ఆలకింపుము. మృణ్మయమూర్తి(మట్టిచేత తయారుచేయబడిన విగ్రహము) అందముగాను, స్పష్టముగాను అఖండితముగాను ఉండవలెను. కాష్టము (కొయ్య) దొరకని యెడల మట్టి లేక పాషాణ విగ్రహము తయారుచేయు విధానము కలదు. శుభము కలుగవలెనని కోరుకొను పండితులు రాగి, కంచు, వెండి, బంగారము లేక కనీసము సీసము ఈ వస్తువుల చేత కూడా నా అందమైన విగ్రహమును నిర్మాణము చేయించుకొందురు. కర్మకాండను గురించిన సంకోచములపై ఇచ్ఛ ఉన్న యెడల నాపూజ వేదిక మీదనే జరుపబడవలెను. కొందరు ఈ జగత్తుయందు కీర్తి వ్యాపింపవలెనను కోరికచేత, నా ప్రతిమలను ప్రతిష్ఠించు చుందురు.మరికొందరు తమ అభీష్ఠము సిద్ధించుటకొరకు ప్రతిమలను ప్రతిష్ఠింతురు. లేక నా ప్రకాశము కాంతి చేత ప్రకటింపబడు సూర్యమండలమునందును నన్ను ఆరాధింతురు.

దేవీ! నేను విభిన్న వ్యక్తులయొక్క భావనలను అనుసరించి అచ్చటనే ఉండి పోవుదును అను విషయమును తెలియవలయును. ఇంకనూ పూజ ప్రాప్తియైన తర్వాత ఉపవాసమునకు సంపూర్ణముగా అందరునూ హాజరు కావలెను. ఆ విధముగా ప్రతిష్ఠను పూర్తి చేయవలెను. ఇందు ఎట్టి సందేహము లేదు. మనుష్యులు ఏయే ఫలమును ఆశించి మంత్రములను ఉచ్చరింతురో, లేక విధిపూర్వక కర్మలను ఆచరించుట ద్వారా నా ఉండిపోదురో, అతడు కోరుకొనిన ఫలప్రాప్తియే అగును. ఇంతేకాదు నా కృపచేత అతడికి సర్వోత్తమమైన స్థితి కూడా ప్రాప్తింపగలదు. నా భక్తులు నిత్యము నియమితమైన పనులలో ఎల్లప్పుడూ ఉండి, మనసుతో కూడా నా ఆరాధన చేయుచుందురు. నాకు ఎవరైనను శ్రద్ధాపూర్వకముగా కనీసము ఒక దోసిలి జలమైననూ అర్పింతురో అట్టి సమయమున నేను ఆతని ఆ భక్తితో సంతుష్ఠుడను అగుచున్నాను. అందుకై చాలా పుష్పములు, జపములు, ఇంకనూ నియమములు ఆచరింపవలసిన అవసరము ఏముండును? ఏ నరుడు తన అంతఃకరణమును సత్యముగా ఉంచుకొని నిత్యము నా చింతన చేయుచుండునో, అతనికి కూడా నేను సంపూర్ణముగా కోరికలు తీరునట్లు చేయుచున్నాను. అంతేగాక ఆతడికి

దివ్యమైన, సుందరమైన అనుభవము, అట్లే ధాన్యము, మోక్షము కూడా సులభముగా లభ్యమగుచున్నవి.

వసుంధరా!ఈ విషయములన్నియూ అత్యంత గోపనీయములు. నా ఆరాధన యందు శ్రద్ధ కలిగిన వ్యక్తి మృణ్మయ ప్రతిమను తయారు చేసి శ్రవణా నక్షత్రమునందు దాని స్థాపన, ప్రతిష్ఠ చేయించుట కొరకు సిద్ధపరచవలెను. దీనియందు కూడా, ఇంతకు ముందు చెప్పబడిన మంత్రముల ఉచ్చారణ చేసి అదే విధముగా ప్రతిష్ఠ చేయవలెను. నీటితోపాటు పంచగవ్యము, చందనములను కలిపి దానిచేత ఆ నా విగ్రహమునకు స్నానము చేయించ వలెను. ఆ సమయమునందు "అచ్యుతా! నీవు ప్రపంచమంతటినీ నిర్మించువాడవు. ఎవని దయచేత ఈ జగత్తుయొక్క శక్తి సురక్షితముగా ఉండునో అట్టివాడవు నీవే. భగవంతుడా! నీవు నాయందు దయయుంచి ఈమృణ్మయ ప్రతిమయందే ప్రతిష్ఠితుడవు అగుము. ప్రభూ! నీవు కారణమునకే కారణుడవు. ప్రచండ తేజోవంతుడవు, పరమ ప్రకాశమానముల గల మహాపురుషుడవు. అట్టినీకు ఇవియే నా నిరంతర నమస్కారములు." అని చెప్పే ఆ ప్రతిమను మందిరము నందు ప్రతిష్ఠ చేయవలెను. ఇందు కూడా ఇంతకుముందు వలెనే నాలుగు కలశములను స్థాపింపవలెను. ఆ నాలుగు కలశములను తీసుకొని చెప్పబోవు భావము గల మంత్రమున చదువవలెను. "భగవంతుడా! నీవు ఓంకార స్వరూపుడవు. నీ రూపమే సముద్రము. వరుణదేవుని యొక్క కృప ప్రాప్తింప చేసికొని, సంపూర్ణ అర్చన పొందువాడవు. అట్లే జలరాశి, ప్రసన్నతలచే నిండిన హృదయము గలవాడవు. ఈ భావములను ముందుంచుకొని, నేను నీకు ఉత్తమమైన అభిషేకమును అర్పించు చున్నాను. ఎవనికి విశాల భుజములు కలవో, అగ్ని, పృథ్వీ రసము ఇవి అన్నియూ ఎవనిచే శక్తివంతములు అయినవో అట్టి నీకు నేను నమస్కరించుచున్నాను.

అర్చావిగ్రహమునకు ఈ విధముగా స్నానము చేయించి, ఇంతకు ముందు చెప్పబడిన నియమములను అనుసరించి, చందనము, పుష్పములు, పుష్పహారములు, అగురు, ధూపము, కర్పూరములతో పాటు, కుంకమయుక్త ధూపము చేత "ఓం నమోనారాయణాయ" అను ఈ మంత్రమును ఉచ్చరించుచు, పూజచేసి విధానాను సారముగా పితృతర్పణము చేయవలెను. మరల వస్త్రము అర్పణ చేసి, అదే సమయమున

"ఓం నమో నారాయణ" అను మంత్రమును ఉచ్చరించి పూర్వోక్త మంత్రము చేత మరల ఆచమనము చేసి శాంతిపాఠము పఠింపవలెను. మంత్రము యొక్క భావము ఇది: "దేవతలు, బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులకు శాంతి సులభము అగుగాక! వృద్ధులు, బాలబృందములు ఉత్తమమైన శాంతిని పొందెదరు గాక! పర్జన్యభగవానుడు (మేఘము) నీటిధారలను కురిపించి, పృథ్వి ధాన్యముల చేత పరిపూర్ణము చేయబడు గాక!" ఈ అర్థము వచ్చు మంత్రము చేత విధిపూర్వకముగా శాంతి పాఠము పఠింపవలెను. ఆ పిమ్మట శ్రీహరియందు శ్రద్ధ గలవారగు బ్రాహ్మణుల పూజ చేసి వారికి నమస్కరింపవలెను. పిమ్మట పూజయందలి లోపములకు క్షమను కోరుచూ ప్రార్థించి, విసర్జన చేయవలెను.

విసర్జనము తర్వాత అచ్చట ఎందరు కలరో వారందరని తగిన విధముగా సత్కరింప వలెను. ఒకవేళ ఎవరికైనను నా సాయుజ్యప్రాప్తి పొందవలెనను కోరిక ఉన్నచో వారు గురువును కూడా విధిపూర్వకముగా పూజింపవలెను. ఏ వ్యక్తి శాస్త్ర విహిత కర్మను సంపన్నము చేసి, భక్తితో గురుపూజ చేయునో,అతడు నిరంతరమూ నా పూజయే చేయు చుండును అని భావింపవలెను. రాజు ఎవరి పైననూ ప్రసన్నుడు అయిన యెడల అతడు గొప్ప కష్టముతో ఒక గ్రామమును పొందగలడు. కాని గురువు ప్రసన్నుడు అయిన యెడల ఆయన కృపచే బ్రహ్మాండ పర్యంతము పృథ్వి సులభము అగును. శుభగురాలా! నేను చెప్పిన విషయము మొత్తము శాస్త్రములలో ఇమిడి యున్నది. సర్వ శాస్త్రములలోను గురువు యొక్క పూజకొరకు సముచితములైన ఏర్పాట్లు తెలియజేయబడి ఉన్నవి. ఈ విధి ప్రకారము నా ప్రతిష్ఠ చేయు మనుష్యుని రెండు వంశములవారు ఇరువది యొక్క పీడలనుంచి తప్పించుకొనగల్గుదురు. పూజ చేయు సమయమునందు నా విగ్రహముపై ఎన్ని జలబిందువులు పడుచున్నవో అన్ని వేల సంవత్సరముల వరకు ఆ వ్యక్తి నా లోకమునందు ఆనందించును. భూమీ! నేను నీకు మృత్తికలతో చేయబడిన విగ్రహ ప్రతిష్ఠను వర్ణించి ఉంటిని. ఇప్పుడు నా భక్తులైన పురుషులకు ప్రియమైనది అగు లోహవిగ్రహ ప్రతిష్ఠ విధానమును గురించి నీకు తెలియజేసెదను.

పిమ్మట వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. "వసుంధరా! తామ్రముతో చేసిన నా సుందరమైన మెరిసెడి అర్చావిగ్రహమును నిర్మాణము చేయించి, సముచిత ఉపచార పూర్వకముగా ఉత్తరాభిముఖముగా గల విగ్రహమును తీసుకొని రావలెను. మరల

చిత్తానక్షత్రమునందు దానిని అన్నాధివాసము చేసి, అనేక విధములైన సువాసనలు, పంచగవ్యముల చేత మిశ్రిత జలముతోనా ప్రతిమకు స్నానము చేయించవలెను. స్నానము చేయించిన తర్వాత, చదువు మంత్ర భావము ఇది. "భగవంతుడా! జగత్తు యొక్క ఏకైక తత్వము, అట్లే దాని ఆశ్రయము అన్నియునూ నీవే అగుచున్నావు. నీవు నా ప్రార్ధనను స్వీకరించి ఇచ్చటకు చేరుకొనుము. పంచభూతములతోపాటు ఈ తామ్రముచే చేయబడిన ప్రతిమ యందు ప్రతిష్ఠింపబడినవాడవై, నాకు దర్శనము ఇమ్ము" అని పలుకవలెను. యశస్వినీ! ఈ విధముగా ప్రార్ధనాపూర్వక విగ్రహప్రతిష్ఠ చేసి, ఇంతకు ముందు తెలుపబడిన విధిక్రమము చేత అధివాసముతో కూడిన పూజను సంపన్నవంతము చేయవలెను. రెండవ రోజు సూర్యోదయమైన తర్వాత, వేదబుక్కులచేత విగ్రహమును శుద్ధిచేయించి మంత్ర పూర్వకముగా ఆ విగ్రహమునకు స్నానము చేయించవలెను. అచ్చట గల బ్రాహ్మణ సమూహములతో వేదధ్వని చేయింపవలెను. మరల మంగళకరమైన వస్తువులను మండపమునందు ఉంచవలెను. పూజ చేయు వ్యక్తి సుగంధ ద్రవ్యములచే యుక్తమైన జలమును తీసుకొని ఈ భావము గల మంత్రమును చదువుచూ, నా ప్రతిమకు స్నానము చేయింపవలెను. భావము ఇది. "ఓంకారస్వరూపా! ప్రభూ! నీవు అన్నింటి యందు విరాజమానుడవై ఉన్నావు. నీవు సర్వసమర్ధుడవు. నీయందలి శక్తిని పొందియే మాయ, బలమును పొందినది అయ్యెను. అట్లే యౌగిక శక్తికి నీవు శిరోమణివి. ఆ పురుషులు అందరునూ నీవే! ప్రభో! నా క్షేమము కొరకు శీఘ్రముగా ఇచ్చటకు రండు. ఇంకనూ ఈ తామ్రమయమైన ప్రతిమయందు దయతో విరాజమానుడవు కమ్ము. ఓంకార స్వరూప భగవంతుడా! నీవు పరమ పురుషుడవు సూర్యుడు, చంద్రుడు, అగ్ని, వాయువు, శ్వాస ప్రశ్వాసలు, అన్నియూ స్వయముగా నీవే అయి ఉన్నావు" అని చెప్పి గంధ పుష్ప దీపముల చేత అర్చన చేయవలెను. ఈ విధానము ప్రకారము ప్రతిష్ఠచేయు మంత్రము యొక్క భావము ఇది. "ముల్లోకములకు పాలకుడవైన పురుషోత్తమా! నీవు ప్రకాశమునకు ప్రకాశకుడవు. అంతేగాక విజ్ఞానమయ, ఆనందమయ ప్రపంచ ప్రకాశకుడవు. భగవంతుడా! ఇచ్చటకు రండు. ఈ ప్రతిమయందు శాశ్వతముగా విరాజితుడవై దయచేసి నన్ను రక్షింపుడు. వైష్ణవ శాస్త్రములలో చెప్పబడిన నియమములను అనుసరించి ఈ మంత్రమును చదివి స్థాపన చేయవలెను. పిమ్మట చేతులయందు నిర్మలమైన శ్వేత

వస్త్రమును స్వీకరించి "సంపూర్ణ విశ్వమునకుపైన పరిపాలించువాడా? నీవు ఓంకార స్వరూపపరమపురుషుడవు. పరమాత్మ! జగత్తుయందు ఏకమాత్ర తత్వజ్ఞుడవు, శుద్ధ స్వరూపుడవు నీవే! ఈ విధమైన పురుషోత్తమునికి నా నమస్కారములు. నేను నీకు ఈ సుందర వస్త్రమును అర్పించుచున్నాను. నీవు దీనిని స్వీకరించి నా పై కృప జూపుము."

పృథ్వీ! నా కర్మయందు పరాయణుడైయుండు మానవుడు ఆ ప్రతిమను వస్త్రములతో కప్పి, మరల విధిపూర్వకముగా నన్ను అర్చింపవలెను. గంధము, ధూపము మొదలగు వానిచే పూజ చేసిన తర్వాత నైవేద్యము అర్పించవలెను. దాని అనంతరము, శాంతిపాఠమును పఠింపవలెను. శాంతి మంత్రము యొక్క భావము ఇది. "దేవతలకును, బ్రాహ్మణులకును ఉత్తమమైన శాంతి సులభముగా లభ్యమగును గాక. రాజు, రాజ్యము, వైశ్య, బాలక, ధాన్య వ్యాపారము ఇంకనూ గర్భిణీ స్త్రీలకు అన్నింటి యందునూ సదా శాంతి నిలిచి ఉండుగాక! దేవేశా! నీ కృపచేత నేను ఎల్లప్పుడునూ అశాంతుడుగానే ఉండకుందును గాక!"

శాంతిపాఠము తర్వాత బ్రాహ్మణులను పూజించి, భోజనము, వస్త్రములు, వంటి అలంకారములతో గురువు పూజ చేయవలెను. ఎవరు గురుభక్తితో పూజ చేయునో, అతడు నాకు పూజ చేసినట్లే అగును. ఎవరి ప్రవర్తన యందు గురువు సంతుష్టుడు కాడో వానికి నేను కూడా చాలా దూరములో ఉందును. మనుష్యులు ఈ విధముగా నా ప్రతిష్ఠ చేయవలయును. అట్టివారు ఈ కార్యము చేత ముప్పది ఆరు పీడలను వదిలించుకొందురు. భద్రా! రాగి విగ్రహమునందు నన్ను స్థాపించుటకు విధానమును నీకు వివరించితిని. ఈ విధముగానే అన్ని విగ్రహములకు పూజలు చేయు విధానము నీకు తెల్పుదును. పృథ్వీ నాకు స్నానము చేయించు సమయమునందు విగ్రహముపైన ఎన్ని జలకణములు పడునో ప్రతిష్ఠ చేయించిన వ్యక్తి అన్ని సంవత్సరముల వరకు, నా లోకమునందు నివాసము పొందును." (183,184)

185 వ అధ్యాయము - కంచు విగ్రహమును ప్రతిష్ఠించు విధి

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. "సుందరీ! కంచుధాతువు చేత స్వచ్ఛమైన, సుందరమైన అన్ని శరీరాంగములచే పూర్తిగా సంపన్నమైన విగ్రహమును తయారు చేయించి జ్యేష్ఠా నక్షత్రమునందు ఆ విగ్రహమును ఇంటికి తీసుకొని వచ్చి మంగళ

వాయిద్యముల ధ్వనితో దానిని ప్రతిష్ఠ చేయవలయును. నా విగ్రహ ప్రవేశకాలము నందు విధిప్రకారముగా అర్ఘ్యమును స్వీకరించి, మంత్రములను పఠింపవలెను. ఆ మంత్రము యొక్క అర్థము "జగత్ప్రభో! సంపూర్ణ యజ్ఞములలో పూజను పొందినట్లే, యోగిజనులు ఎవరిని ధ్యానము చేయుచుందురో ఎవరు ఎల్లప్పుడు అందరినీ రక్షించుచుందురో ఎవరి ఇచ్ఛ చేత విశ్వసృష్టి పాటింపబడుచున్నదో అట్టి మహాత్ముడు ఎల్లప్పుడు ప్రసన్నముగా ఉండునో అట్టి దేవదేవుడవు. నీవే. భగవంతుడా! నీవు శ్రేష్ఠమైన విధానముతో నా ఈ పూజను స్వీకరించి ప్రసన్నతా పూర్వకమైన ఈ విగ్రహమునందు విరాజిల్లుడు" అని ప్రార్థించి అనంతరము అర్ఘ్యము ఇచ్చి శాస్త్రీయ విధిని పాటించుచు, ఆ విగ్రహము యొక్క ముఖమును ఉత్తరము వైపునకు ఉంచవలెను. ప్రతిష్ఠాసమయమునందు పంచగవ్యము, ఇంకనూ అనేక విధములైన చందనము, లాజలు, మధువుతో గల నాలుగు కలశములను స్థాపింపజేయవలసిన విధి. పవిత్రాత్మలు గల పురుషులకు సుర్యాస్తమయమును తెలుసుకొని నా ఆ ప్రతిమను పూజ చేయుటకు, అవసరమగు ఏర్పాట్లు చేసికొనవలెను. వెంటనే భగవానుని నివాసము నిమిత్తము కలశమును పైకెత్తి విగ్రహమునకు దగ్గరగా ఉంచి "ఓం నమో నారాయణాయ" అనవలెను. ఆ తర్వాత అంగముల యొక్క మంత్రములను చదువవలెను. పవిత్రాత్ముడైన పురుషుడు, సూర్యాస్తమయమైన తర్వాత నా ఆ ప్రతిమను పూజ చేయాలన్న భావముతో అచటనే ఉంచి వేయవలెను. దాని వెంటనే భగవన్నిమిత్తము ఆ శుద్ధ కలశమును పైకెత్తి విగ్రహము వద్ద "ఓం నమో నారాయణాయ" అని పలికి ఉంచివేయవలెను. తర్వాత చెప్పబోవు మంత్రమును పఠింపవలెను. మంత్రము యొక్క భావము. "భగవంతుడా! బ్రహ్మాండము ఇంకను యుగము యొక్క మొదలు తుది నీ రూపములే నీవు కాక ఈ విశ్వమునందు మరేమియూ లేదు. లోకనాథా! ఇప్పుడు నీవు ఇక్కడ వచ్చి ఉన్నందున ఇచ్చటనే శాశ్వతముగా విరాజిల్లుము. ప్రభూ! నీవు ఈ ప్రపంచ రూపములో వికారము పరమాత్మ రూపమునందు నిరాకారము, నిర్గుణుడవగుటచే ఆకార శూన్యము అగుచున్నావు. అట్లే విగ్రహరూపములో ఉండుటచే సాకారము కూడా కలవు. నీకు నా ప్రణామములు.

పృథ్వీ! రెండవ దినము ప్రాతఃకాలమునందే సూర్యోదయమైన తర్వాత అశ్విని, మూల లేక మూడు ఉత్తర నక్షత్రయుక్త ముహూర్తమునందు పూర్వోక్త విధానమును

అనుసరించి నన్ను మందిరము యొక్క ద్వారప్రాంతమునందు స్థాపింపవలెను. అన్ని విధములైన శాంతి చేయుట కొరకు జలము, గంధము పండ్లు, ఫలములతో "ఓం నమో నారాయణాయ" అని ఉచ్చరించి ప్రతిమను లోపలికి తీసుకొని పోవలెను. కలశముల యందు చందనముతో కూడిన నీటిని నింపి, అభిమంత్రింపవలెను. మరల అదే నీటితో విగ్రహమునకు స్నానము చేయింపవలెను. సర్వాంగములను శుద్ధిపరచుట కొరకు మంత్ర పూర్వక జలమును ఆవాహన చేయవలెను. మంత్రము యొక్క భావము: "పురుషోత్తమా! నీకు నమస్కారము. భగవంతుడా! నీకు నమస్కారము. భగవాన్! సమస్త సాగరములు సరస్సులు, సరోవరములు అట్లే పుష్కరము మొదలగు ఎన్ని తీర్థములు గలవో అవి అన్నియూ ఇచ్చటకు రావలెను. ఆ జలములతో నీ అంగములు శుద్ధములు కావలెను. ఇది జరుగుటకు నీవు నాపై దయ ఉంచుము" అని పలకవలెను.

ఆ పిమ్మట ఉపాసకుడు భక్తిపూర్వకముగా ప్రతిమకు స్నానము చేయించి, అర్చన చేసి గంధ ధూప దీపములు మొదలగువానితో పూజ చేయించి, వస్త్రములు సమర్పింప వలెను. దానితోనే "ఓంకార స్వరూప దేవేశా! ఈ సూక్ష్మ, సుందర, సుఖమును కలిగించు నట్టి వస్త్రము నీ సేవయందు నీ వద్ద ఉంచబడినవి. మీరు వీనిని స్వీకరింపుడు. మీకు నా నమస్కారము. వేదము, ఉపవేదములు, ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము ఇవి అన్నియూ నీ రూపములే. అట్లే అందరును నిన్నే అర్చించుదురు". పృథ్వీ! మంత్రములను బాగుగా తెలిసికొనిన వ్యక్తి, విధితో పాటు పూజచేసి నన్ను అలంకరించిన తర్వాత నైవేద్యము అర్పించి, పిమ్మట శాంతిపాఠము పఠించవలెను. శాంతిపాఠములోని మంత్రము యొక్క భావము "విద్య, వేదము, బ్రాహ్మణము, సంపూర్ణ గ్రహణము, నదులు, సముద్రములు, ఇంద్రుడు, అగ్ని, వరుణుడు, యముడు, శుక్రుడు, శని, ఎనిమిదిమంది లోకపాలకులు మొదలగు దేవతలు అందరునూ ఈ మొత్తము విశ్వమునకు శాంతిని దయజేయుదు. భక్తుల కోరిక పూర్తిచేయు భగవంతుడా! నీవు సర్వత్రా వ్యాప్తుడవు. ఈ విధముగా ఓంకారమయుడవైన నీవు పరమపురుషుడవగుటచే నేను నమస్కరించుచున్నాను. ఓంకారమయమైన నీవు పరమ బ్రహ్మచర్య స్వరూపుడవు. అట్టి కొరకు నేను నమస్కరించుచున్నాను. నేను ప్రదక్షిణము, స్తుతి, అట్లే అభివాదము చేయుచున్నాను." వీనిపిమ్మట భగవంతుడగు శ్రీహరియందు శ్రద్ధకలవారు, బ్రాహ్మణులను

పూజించి వారిని తృప్తిపరచ వలెను. కమలనయనా! విప్రవర్గము శాంతి కలశము నుంచి జలము తీసుకొని విగ్రహముపై జల్లవలెను. సాధకులు నా భక్తులు వంటి గురుజనులను నిందించకూడదు. ప్రతిష్టా సమయమునందు నా అంగములపై ఎన్ని జలబిందువులు పడినవో అన్ని వేల సంవత్సరముల వరకు ఆ వ్యక్తి విష్ణులోకమునందు ఉండుటకు అధికారము గలవాడు అగుదురు. ఏ మనుష్యుడు ఈ విధిచే నన్ను ప్రతిష్ఠించెదరో వారు తన మాతృపక్షము, పితృపక్షము రెండువంశములు వారి పితరులను ఉద్ధరించిన వారగుదురు. భద్రే! కాంస్యధాతువు చేత నిర్మింపబడిన నా ప్రతిమను ఎట్లు ప్రతిష్ఠ చేయవలయునో ఆ విషయమును నేను నీకు ముందే వినిపించితిని. ఇప్పుడు వెండితో తయారు చేయబడిన మాతృమూర్తులను ప్రతిష్ఠించు ఆ విధానమును తర్వాత చెప్పెదను. (185)

186 వ అధ్యాయము - రజత, స్వర్ణ ప్రతిమా ప్రతిష్ఠ, పూజా విధానము

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. వసుంధరా! ఇంతకుముందు చెప్పబడిన విధానము ప్రకారము వెండి, బంగారములతో చేయబడిన నా విగ్రహము తయారుచేయుట, దానిని ప్రతిష్ఠచేయుట మునుపటి విధానముగానే ఉండును అని తెలిసికొనవలయును. విగ్రహ నిర్మాణము అట్లే ప్రతిష్ఠలను చేయుటకు రాగి, కంచు వానికి చేసిన విధానమే వీనికి కూడా ఇంతకు ముందు తెల్పినట్లే చేయవలెను. దీనియందు పూజ, అర్చనము కలశ స్థాపనములే, గాక శాంతి పాఠపఠనము కూడా ఇంతకుముందు చెప్పబడిన విధానములోనే అనుష్ఠింపవలెను.

వరాహమూర్తి ఇట్లు చెప్పగా మరల పృథ్వీ "మాధవా! నీవు సువర్ణము మొదలగువానితో తయారుచేయబడిన విగ్రహముల పద్ధతిని తెలిపావు. కాని సాలగ్రామ శిలయందు నీవు స్వభావతః ఎల్లప్పుడు నివాసము ఉందువు. ప్రభూ! గృహము మొదలగువాని యందు సాధారణముగా ఎవని పూజ చేయవలయును లేని యెడల విశేషముగా ఏ దేవతను పూజింపవలెను, అను విశేషములను నీ నుండి తెలుసుకొనదలచు కొనుచున్నాను. నీవు ఈ రహస్యమును నాకు దయతో తెల్పుము. అంతే గాక శివపరివార పూజయందు ఏవి ఎంత సంఖ్యలో ఉండుట ఆవశ్యకమో ఆ విషయమును కూడా తెల్పవలెను అని కోరుచున్నాను" అని ప్రార్థించగా, వరాహభగవానుడు ఇట్లు చెప్పెను.

వసుంధరా! గృహస్థుల యొక్క ఇంటియందు రెండు శివలింగములు, మూడు సాలగ్రామ విగ్రహములు, రెండు గోమతీ చక్రములు, రెండు సూర్యుని విగ్రములు, మూడు విఘ్నేశ్వరుడు, మూడు దుర్గాదేవి విగ్రహములను పూజచేయుట నిషిద్ధము. విషమసంఖ్యాయుక్త సాలగ్రామ పూజ చేయకూడదు. అయినను విషమ సంఖ్యలో కూడా ఒక సాలగ్రామము యొక్క పూజ చేయతగినదే. దీనియందు విషమతకు గల దోషము ఏదియు ఉండదు. అగ్ని చేత కాల్పబడిన, అట్లే విరిగి ముక్కలైన విగ్రహము యొక్క పూజ చేయరాదు. ఎందుకనగా గృహమునందు ఇట్టి లోపము గల విగ్రహములను పూజించుట చేత ఇంటి యజమానుని మనస్సునందు ఉద్వేగము హెచ్చుగానుండి అరిష్టము జరుగవచ్చును. సాలగ్రామ విగ్రహము చక్ర చిహ్నము చేత యుక్తమై యున్న యెడల అది విరిగినను దానినే పూజింపవలెను. ఎందుకనగా అది విరిగి ముక్కలై కనిపించిననూ, దానిని శుభప్రదముగా పరిగణింపవలెను.

దేవీ! సాలగ్రామముల యొక్క పన్నెండు రకములైన విగ్రహములు విధిప్రకారము పూజించిన యెడల ఎట్టి ఫలితము కలుగునో, ఆ పుణ్యమును నేను తెలుపుచున్నాను వినుము. పన్నెండు కోట్ల బంగారముతో చేయబడిన శివలింగములను కమలపుష్పములపై ఉంచి పన్నెండు కల్పముల వరకు పూజచేయవలెను. దానితో ఎంత పుణ్యము ప్రాప్తించునో అంత పుణ్యము కేవలము పన్నెండు సాలగ్రామములకు ఒక రోజు చేసిన పూజతో సమానమగును. శ్రద్ధ కలిగి నూరు సాలగ్రామములను అర్చించినవాడు ఏ ఫలమును పొందునో దానిని వర్ణించుట వంద సంవత్సరములకు కూడా నాకు జరుగునది కాదు. ఇతర దేవతల విగ్రహములను అట్లే మణులు మొదలగువానితో తయారు చేసిన శివలింగముల పూజ సర్వసాధారణ వ్యక్తి కూడా చేయవచ్చును. కాని సాలగ్రామము యొక్క పూజ స్త్రీలు, హీనులు, అపవిత్రులైన వ్యక్తులను చేయనీయరాదు. సాలగ్రామము యొక్క చరణామృతమును స్వీకరించుటచే సంపూర్ణ పాపము భస్మమగును. శివునికి అర్పించిన ఫలములు, పుష్పములు, నైవేద్యము, పత్రి, నీరు తీసుకొనరాదు. ఒకవేళ సాలగ్రామశిలతో దానిని స్పృశించిన అట్టివాడు ఎల్లప్పుడు పవిత్రముగా పరిగణింప బడును. దేవీ! ఏ వ్యక్తి స్వర్ణముతో భగవద్భక్తుడైన పురుషునికి సాలగ్రామమూర్తిని దానము చేయునో అతడికి కల్గు పుణ్యము చెప్పుచున్నాను వినుము. అతడికి సంత్సరిత సముద్ర

పర్యంతము వరకూ వ్యాపించిన సంపూర్ణ పృథ్వీ సత్పాత్రుడైన బ్రాహ్మణునికి ఇచ్చిన పుణ్యము లభ్యమగును. సాలగ్రామ విగ్రహము మూల్యమును నిశ్చయించి ఎప్పుడైననూ ఎవరైననూ దానిని అమ్ముటయో, కొనుటయో చేసిన ఎడల వారు ఇద్దరును నరకమునకు పోవుట నిశ్చయము. వస్తుతః సాలగ్రామ పూజయొక్క ఫలమును వర్ణించు ఎవరును వంద సంవత్సరములు వరకూ కూడా సంపూర్తిగా చేయలేరు". (186)

187 వ అధ్యాయము - సృష్టి, శ్రాద్ధముల ఉత్పత్తి, పితృ యజ్ఞములు

ధరణీ ఇట్లు ప్రశ్నించెను. స్వామీ! నేను మీ వరాహ క్షేత్రము, మధురా క్షేత్రముల మహిమను ఇంతకుముందే వినిఉంటిని. ఇప్పుడు నేను పితృయజ్ఞసంబంధ విషయములను తెలిసికొనవలెనని కోరుచున్నాను. అది ఏమి? దానిని ఏ విధముగా ప్రారంభింపవలెను? సర్వప్రథములుగా ఈ యజ్ఞము యొక్క శుభారంభమును ఎవరు చేసిరి. అట్లే దీని ప్రయోజనము స్వరూపములను నాకు తెలియజేయుడు."

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! సర్వప్రథమముగా నేను స్వర్గ లోకమును సృష్టించితిని. స్వర్గలోకమే దేవతలయొక్క మొదటి నివాసము అయినది. జగత్తు అంతయూ ప్రకాశశూన్యముగా ఉండి, అంతటనూ అంధకారము వ్యాపించి ఉండెను. ఆ సమయమున నామనస్సుయందు 'చరాచరప్రాణులతో మూడులోకములు సృష్టింప వలయునా?' అను ఆలోచన ఉత్పన్నమైనది. ఆ సమయమున నేను ప్రపంచముయొక్క సృష్టికి విముఖుడనై శేషతల్పమున శయనించుచుంటిని. ఈ విధముగా నా అనంత శయనము జరిగినది. మాయా స్వరూపిణియగు నిద్ర నాకు సహచరి. ఆమె సృష్టి నా ఇచ్ఛపై ఆధారపడి ఉన్నది. అందుచేత నిద్రనుంచి లేచుచున్నాను. సృష్టి ప్రారంభ దినములలో సర్వత్రా జలమే, జలము ఉండెను. ఏదియూ ఏ మాత్రమును తెలిసికొన లేకుండెను. ఆ జలములయందు ఒక్క వటవృక్షము తప్ప అన్యమైనది ఏదియూ లేదు. ఆ వటవృక్షము కూడా విత్తనము నుండి పుట్టినది కాదు. అయిననూ నాకు విష్ణువు ద్వారాయే ఉత్పన్నము కలిగినది. మాయయొక్క ఆశ్రయమును తీసుకొని ఒక బాలకుని రూపములో నేను దానికి పైన నివాసము ఉండియుంటిని. నా ఆజ్ఞను తీసుకొని మాయ చరాచరములతో పరిపూర్ణమై, మూడు లోకములను అలంకరించినది. ఇదంతయూ నా కన్నుల ముందే జరిగినది. శుభే! నేనే వివిధ విచిత్రములతో కూడిన చరాచర విశ్వమునకు ఆధారము.

సమయానుసారము నేనే "బడబాముఖుడు" అను పేరుగల అగ్నిని తయారుచేసుకొందును. మాయ కూడా ఆశ్రయము పొంది పని చేయుచుండెను. ఆ మాయ చేత జలమంతయూ బడబానలము నుంచి వెలువడి నాలోనే – లీనమైపోయినది. ప్రళయము యొక్క అవధి పూర్తియైన తర్వాత లోకపితామహుడగు బ్రహ్మదేవుడు నేను ఏమి పని చేయగల్గుదును, అని నన్ను ప్రశ్నించెను. అప్పుడు నేనే ఆయనతో బ్రహ్మా! నీవు యధాశీఘ్రముగా సురాసురులను మానవులను సృష్టింపుము అని తెల్పితిని.

దేవీ! ఈ ప్రకారముగా నేను చెప్పినంతట బ్రహ్మచేతిలోని కమండలమును పైకెతి అందలి జలముచేత ఆచమనముచేసి దేవతలను సృజించు కార్యమును ఆరంభించెను. పితామహుడు (బ్రహ్మ) ద్వాదశిదిత్యులను, అష్టవసువులను, ఏకాదశ రుద్రులను, ఇద్దరు అశ్వినీ కుమారులను, నలుబది తొమ్మిది మరుద్గణములు మొదలగు అందరినీ ఉద్ధరించుట కొరకు బ్రాహ్మణులు మొదలైన సురసముదాయములను సృష్టిచేసెను. ఆయన భుజముల నుంచి క్షత్రియులను, ఉరువుల నుంచి వైశ్యులను, పాదముల నుంచి శూద్రులు ఉత్పత్తి అయ్యెను. ఆయన చేతనే దేవతలు, అసురులు, అందరునూ భూమిపై ప్రకాశించుట మొదలయ్యెను. దేవతలు, దానవులయందు తపము మొదలగు శక్తి సంబంధమైన విషయములలో ఆధిక్య స్పర్ధ కలిగెను. అదితి దేవిచేత ఆదిత్యులు, వసుగణము, రుద్రగణము, మరుద్గణము, అశ్వినీ కుమారుడు మొదలగు ముప్పది మూడు కోట్ల దేవతలు ఉత్పన్నులైరి. దితిదేవి వలన దేవతలకు విరోధులైన దానవుల ఉత్పత్తి జరిగినది. అదే సమయమున ప్రజాపతి (బ్రహ్మ) తపోధనులకు ఋషులను సృజించెను. వారందరూ తీవ్ర తేజస్సుచేత సూర్యుని సమానులగుచు, ప్రకాశముతో జ్వలించుచుందురు. వారికి అన్ని శాస్త్రముల యందును సంపూర్ణ జ్ఞానము ఉండినది. ఇప్పుడు వారి పుత్రులు అట్లే పౌత్రుల సంఖ్యకు హద్దులు లేవు. వారిలో ఒకడు నిమి. ఆ నిమికి కూడా ఒక పుత్రుడు కలిగెను. ఆ పుత్రుడే ఆత్రేయుడు అను పేరుతో ప్రసిద్ధుడయ్యెను. అతడు పుట్టుకతోనే బహు అందము గలవాడుగను, సంయత చిత్తము గలవాడై ఉదారస్వభావము చేత ప్రకాశించెను. అతడు మనస్సునకు ఏకాగ్రత, చలింపని భావములచేత శాంతముగా ఉండి తపస్సు చేయు చుండెను. వసుంధరా! పంచాగ్ని యొక్క తీవ్రత, వాయువుతో మాత్రమే జీవించుట, భుజమును పైకి లేపి ఒకే కాలి మీద నిలబడుట, ఎండిన ఆకులు, జలమును ఆహారముగా

స్వీకరించుట, శీతాకాలమునందు నీటియందే పరుండుట, ఫలములు ఆహారముపై ఉండుట, అట్లే చాంద్రాయణ వ్రతమును పాటించుట, ఇవి అన్నియూ ఆయన తపస్సునందలి అంగములుగా కలవు. ఈ నియమములన్నింటినీ పాటించుచూ ఆయన పదివేల సంవత్సరముల వరకు తపస్సునందు లీనమై పోయెను. ఇంతలోనే కాలవశము చేత ఆయన మరణము జరిగినది. ఇట్టి సుయోగ్యుడగు పుత్రుని మృతిచేత నిమియొక్క హృదయము శోకపూర్ణాకులమయ్యెను. ఈ విధముగా పుత్రశోకము కారణము చేత ఆ నిమి రాత్రింబగళ్ళు చింత చేత ఉండెను.

మాధవీ! ఆ సమయమున నిమి మూడు రాత్రులపాటు శోకమును పాటించెను. ఆయన బుద్ధి విస్తృతమైనది. అందుచేత ఆయన శోకమునుంచి ముక్తుడు అగుట కొరకు ఒక విధానమును ఆలోచించెను. అందుకు మాఘమాస ద్వాదశీ దినము ఉపయుక్తము అయినదని భావించి, మరల ఆ రోజు పుత్రుని కొరకు శ్రాద్ధమునకై ఏర్పాటు చేసెను. ఆ బాలకుడగు ఆత్రేయునికి తినుటకు, త్రాగుట కొరకు ఎన్ని భోజన పదార్థములు కలవో అన్ని ఉండుటయే గాక అన్నము, ఫలములు, వేళ్ళు రసములు కూడా కలవు. వానిని అన్నింటినీ ఒకటిగా చేసి మరల స్వయముగా పవిత్రుడై సావధానముగా తనతో గల బ్రాహ్మణులను ఆహ్వానించెను. పిమ్మట అపసవ్య విధానము చేత అందరను శ్రాద్ధకార్య సంపన్నులను చేసెను. సుందరీ! దీని తర్వాత ఏడు రోజుల పాటు కృత్యను ఒక విధముగా సంపన్నుని చేసెను. శాకములు, ఫలములు, వేళ్ళు మొదలగు ఈ వస్తువుల చేత పిండ దానము చేసెను. ఏడుగురు బ్రాహ్మణులకు విధి ప్రకారము కుశలను దక్షిణము వైపునకు, అగ్రభాగముగా ఉంచి పేరుగోత్రముల ఉచ్చారణనుచేసి మునివరుడు నిమి ధర్మపూర్వకమైన ఆలోచనలతో తన పుత్రునిపేరుపై పిండములను అర్పణము చేసెను. మాలినీ! ఈ విధముగా విధానమును పూర్తిగా అనుసరించుచు, దినములు సమాప్తములు అయినవి. ఈ విధముగా శ్రాద్ధ విధానమును పూర్తి చేసిన వెంటనే పగలు కూడా సమాప్తమయ్యెను. సూర్యభగవానుడు అస్తాద్రికి చేరుకొనెను. ఈ పరమదివ్య ఉత్తమకర్మము శ్రేష్ఠభావము చేత సంపన్నమయ్యెను. అతడు మనస్సు, ఇంద్రియములను వశమందుంచు కొని, ఎట్టి ఆశలను ఉంచుకొనక త్యాగముచేసి ఒంటరిగానే శుద్ధభూమి యందు ముందు కుశలు, అంతట మృగ చర్మములను, వస్త్రమును పరచి కూర్చుండిపోయెను. ఆయన ఆసనము అతి ఎత్తయినది

కాదు. అతి క్రింద ఉన్నది కాదు. చిత్తము,ఇంద్రియక్రియలను వశమందుంచు కొని ఏకాగ్రుడై తన అంతఃకరణములచే శుద్దుడు అగుటకు యోగాసనమును వేసెను. అట్లే తన శరీరము ఇంకనూ శిరమునకు సమానముగా ఉంచి భూమిపై నిలబెట్టెను. ఆయన దృష్టి నాశిక యొక్క అగ్రభాగమున కేంద్రీకరించబడినది. చిత్తమునందు ఏ ప్రకారమైన క్షోభమును లేకుండెను.మరియు నిర్భీతుడై బ్రహ్మచర్యము నందుండి శ్రాద్ధముతో పాటు ఒక నిష్ఠకలవాడై ఆయన నాయందే తన చిత్తమును ఉంచెను. ఈ విధముగా సాయంకాలపు సంధ్య సమాప్తమైనది. కానీ రాత్రియందు మరల చింత, శోకముల కారణము చేత ఆయన మనస్సు వెనువెంటనే క్షుభమైనది. అంతేగాక ఈ విధమైన పిండదానక్రియ చేయుటచే ఆయన మనస్సులో మహాపశ్చాత్తాపము కలిగెను. ఆయన ఆలోచించుచూ, “అయ్యో! నేను చేసిన శ్రాద్ధతర్పణము క్రియ ఈ రోజు వరకు ఏ మునులను చేసినట్టిది కాదు. జన్మ మృత్యువు పూర్వకర్మము ఫలితము చేత సంబద్ధము. పుత్రుని యొక్క మృత్యువు తర్వాత నేను తర్పణములు విడువరాదు. అది అపవిత్ర కార్యము. అయ్యో! స్నేహము, మోహముల కారణము చేత నా బుద్ధి నశించిపోయినది. దాని చేతనే నేను ఈ కర్మను ఆచరించితిని. పితృపదముపై స్థితుడైయున్న ఏ దేవదానవ గంధర్వ పిశాచ ఉరగ రాక్షసులు మొదలగువారు మొదటినుండియు ఉన్నారు గదా. వారు ఇప్పుడు ఏమైననూ చెప్పెదరేమో! అని ఆలోచించెను.

వసుంధరా!ఈవిధముగా నిమి రాత్రంతయూ ఆలోచించుటలో మునిగిపోయెను. మరల రాత్రి గడచినది. సూర్యుడు ఉదయించెను. మరల నిమి ప్రాతః సంధ్యలు ఆచరించి ఉన్నదిఉన్నట్లుగా అగ్నిహోత్రమును వెలిగించెను. కాని ఆయన చింతాదుఃఖము చేత మరల అసంతృప్తుడయ్యెను. లేచి ఒంటరిగా కూర్చొని ప్రలాపించుట మొదలు పెట్టెను. అతడు ఇటడిగెను. “ఓహో! నా కర్మ, బలము మరియు ప్రాణమునకు ఇది ధిక్కారము. పుత్రుని చేత ఏ దుఃఖమైననూ సులభము అగును. కాని నేడు నేను ఆ సుపుత్రుని చూచుటలో – అసమర్ధుడను. వివేకులైన పురుషులు చెప్పునది ఏమనగా “పుత్”అను పేరు గల నరకము ఘోరక్లేశదాయకమైనది. కాని పుత్రుడు దాని నుంచి రక్షించును. అందుచేత మనుష్యులందరూ ఈ లోకము పరలోకముల కొరకే పుత్రుని కోరుకొను చున్నారు. అనేక దేవతల పూజ, వివిధ ప్రకారములైన దానములు, అట్లే విధివత్ అగ్నిహోత్రము చేయుట చేత

ఫలస్వరూపుడగు మనుష్యుడు స్వర్గమునకు పోవుటకు అధికారము కలవాడగుచున్నాడు. కానీ అదే స్వర్గము తండ్రికి కుమారుని ద్వారా సహజముగానే లభించుట తేలికగును. ఇదియే గాక పౌత్రునిచే పితామహుడు, అట్లే ప్రపౌత్రునిచే ప్రపితామహుడు కూడా ఆనందమును పొందుచున్నారు. అందుచేత ఇప్పుడు నా కొడుకు లేని జీవనము నాకు ఉండకుండుగాక! అని కోరుచున్నాను" అని విచారపడెను. దేవీ! ఈ విధముగా ఆయన చింతతో అత్యంత దుఃఖము గలవాడగుచూ ఉండగా దేవర్షియగు నారదుడు వెనువెంటనే ఆ నిమియొక్క ఆశ్రమమునకు చేరుకొనెను. అలౌకికమైన ఆ ఆశ్రమమునందు ఋతువులన్నియూ అనుకూలముగా ఉన్నవి. అనేక రకములైన ఫలపుష్పజలములు లభించుచున్నవి. స్వయంప్రకాశము చేత ప్రకాశమానుడగు నారదుడు నిమి యొక్క ఆశ్రమమునకు ప్రవేశించెను. ధర్మజ్ఞుడైన నిమి నారదుడు వచ్చుట చూచి ఆయన స్వాగత సత్కారములకు ఏర్పాట్లు చేసి పూజించెను. దేవీ! ఆ సమయమున నిమి ద్వారా ఆసనము, పాద్యము, అర్యము మొదలైనవి ఇవ్వబడినవి. నారదుడు ఆయనను పట్టుకొని మరల ఆయనతో ఈ విధముగా చెప్పుట ఆరంభించెను.

నారదుడు ఇట్లు పల్కెను. "నిమి! నీ వంటి జ్ఞానపురుషునికి ఈ విధముగా శోకము ఎన్నడునూ రాకూడనిది. ప్రాణములు పోయినవారి కొరకు పండిత జనులు శోకింపరు. ఒకవేళ ఎవరైనను మరణించినచో నష్టము కలుగును. కనీసము ఎచ్చటకో పోయిన వాని కొరకు ఏ వ్యక్తి శోకించునో అతడు తిరిగివచ్చు గాక! ఇక్కడది సంభవము కాదు. చరాచరులగు ప్రాణుల చేత సంపన్నమైన ఈ మూడు లోకములయందు నేనే కాదు ఎవరునూ అమరుడైన వానిని చూడలేదు. దేవతలు, దానవులు, గంధర్వుడు, మనుష్యులు, మృగములు ఇవి అన్నియు కాలాధీనములు. నీ పుత్రుడు శ్రీమంతుడు. అతడు మహాత్ముడు. అది నిశ్చయము. ఆయన నిండు పదివేల సంవత్సరముల కాలము అత్యంత కఠినమైన తపస్సు చేసి పరమదివ్యగతిని ప్రాప్తించుకొనెను. ఈ విషయములన్నింటినీ తెలిసి కూడా నీవు శోకించుట కూడదు".

నారదుడు ఈ విధముగా చెప్పుట చేత నిమి ఆయన చరణములకు శిరస్సు వంచి ప్రణామము చేసెను. అయిననూ ఆయన మనస్సు పూర్తిగా శాంతింపలేదు. ఆయన అనేక పర్యాయములు దీర్ఘ నిశ్వాసములు తీసుకొనుచుండెను. అంతేగాక ఆయన హృదయము

కరుణ చేత వ్యాప్తము అయ్యెను. ఆయన లజ్జితుడై కొంతభయముతో గద్గదమైన స్వరముతో ఇట్లు చెప్పెను. "మునిశ్రేష్ఠా! నీవు మహాధర్మజ్ఞానివగు పురుషుడవు. అది సత్యము. నీవు నీ మధురమగు కంఠధ్వనితో నా హృదయమును శాంతి పరచితివి. అయిననూ ప్రేమ సౌహార్ధము, స్నేహముల కారణముచే నేను నీకొక మనవి చేయకోరుచున్నాను. దయచేసి నీవు ఆ విషయమును విని, నాపై దయచూపుము. నా చిత్తము, హృదయము ఈ పుత్రశోకము చేత వ్యాకులమైనది. అందుచేత నేను వాని కొరకు సంకల్పము చేసి అపసవ్యుడనై శ్రద్ధ తర్పణాది క్రియలను నిర్వర్తించి ఉంటిని. దాని వెంటనే ఏడుగురు బ్రాహ్మణులకు అన్నము, ఫలములు మొదలగు వానిచే తృప్తి పరచితిని. ఇంకనూ నేలపై కుశలను పరచి పిండములను అర్పణము చేసితిని. కాని అనార్య పురుషుడే ఇట్టి కర్మను చేయును. దీనివలన స్వర్గము, లేక కనీసము కీర్తి లభ్యము కాదు. నా బుద్ధి దెబ్బతినినది. నేను ఎవరను? ఇది నాకు స్మరణకు వచ్చుట లేదు. అజ్ఞానము చేత మోహితుడమైన కారణము వలన ఈ పనిని నిర్వర్తించితిని. ఇంతకు ముందు దేవతలు, ఋషులు ఎవరునూ ఇట్టిపని చేసి ఉండలేదు. ప్రభూ! నేను ఊహాపోహలయందు పడి ఉంటిని. అందుచే నాకు ఎటువంటి శాపమును ఇవ్వకుందురు గాక! అని పల్కెను.

అంతట నారదుడు ద్విజశ్రేష్ఠుడా! నీవు భయపడవలసిన అవసరం లేదు. నా దృష్టిలో ఇది అధర్మము కాదు. ఇది పరమధర్మమే అగుచున్నది. దీనియందు ఎట్టి సంశయమును పడవలదు. ఇప్పుడు నీవు నీ తండ్రి యొక్క ఆశ్రమమునకు పొమ్ము" అని పల్కెను,

నారదుడు ఈ విధముగా చెప్పిన తర్వాత, నిమి తనతండ్రి యొక్క మనస్సు, వాక్కు, కర్మల చేత ధ్యాన పూర్వకముగా శరణమును స్వీకరించెను. సరిగా అదే సమయమున ఆయన తండ్రికూడా ఆయన ఎదుటకువచ్చి నిలబడెను. ఆయన పుత్రశోకము చేత దుఃఖించుచున్న నిమిని చూచి ఏనాడునూ వ్యర్థముకాని అభీష్ఠ వచనముల ద్వారా ఓదార్చుటకు ఆరంభించెను. “నిమి! నీ ద్వారా సంకల్పితమైన కార్యము అయిపోయినది. తపోధనా! ఇదియే పితృయజ్ఞము. బ్రహ్మయే స్వయముగా దీని పేరు పితృయజ్ఞము అని పెట్టెను. అప్పటి నుండి ఇది ధర్మవ్రతము లేక క్రతువు అను పేరుతో వ్యవహరింప బడుచున్నది. చాలా కాలము క్రిందట స్వయంభువుడైన బ్రహ్మ దీనిని ఆచరించెను. ఆ

సమయమున విధిని ఉత్తమమైనదిగా భావించి బ్రహ్మ ఏ యజ్ఞమును చేసెనో, అందు శ్రాద్ధకర్మ యొక్క విధి, ప్రేతకర్మ విధానములు కలవు" అనిచెప్పి వానిని నారదునికి తెల్పెను.

వరాహభగవానుడు ఇట్లు పల్కెను. సుందరీ! ఇప్పుడు నేను బ్రహ్మద్వారా ఉపదేశింపబడిన ఆ శ్రాద్ధ విధిని ఉత్తమ విధానములో చేయుటను ప్రతిపాదించుచున్నాను. దీని వలన తెలియబడు విషయమేమనగా పుత్రుడు తండ్రి కొరకు ఏ రకమైన శ్రాద్ధమును చేయునో, ఎన్ని ప్రాణులు ఉత్పన్నముల గుచున్నవో, అవి అన్నియూ సమయానుసారముగా మృత్యువులే అగుచున్నవి. చీమ పుట్టుక నుంచి చూచిన బహు చిన్న జంతువులౌ ఆ చీమలను కూడా నేను అమరునిగా చేయలేను. ఎందుకనగా పుట్టిన వానికి గిట్టక తప్పదు. అట్లే ఎవని పుట్టుక నిశ్చితమో అతని మృత్యువు కూడా నిశ్చితమే. కొన్ని విశేష కర్మలు కనీసము ప్రాయశ్చిత్తము వంటివి ప్రాప్తించుట – చేత, మోక్షము కలుగుట కూడా నిశ్చితమే. సత్వరజోస్తమోగుణములు ఈ మూడును శరీర గుణములుగా చెప్పబడుచున్నవి. కొన్ని రోజులు పోయిన తర్వాత యుగాంతములో మనుష్యుడు అల్పాయుష్కుడు కాగలడు. తమోగుణ ప్రదానుడైన మానవుడు కర్మదోష ప్రభావము చేత సాత్విక విషయములపై శ్రద్ధ చూపలేడు. అందుచేత కర్మయొక్క ప్రభావముచే అతడే నరకమునకు పోవలసివచ్చును. తిరిగి రాబోవు జన్మమునందు అతడికి పశు, పక్షి ఇంకనూ రాక్షసుల గర్భములు లభ్యమగుచున్నవి. వేదములు తెలిసిన సాత్విక జ్ఞానుల ధర్మజ్ఞాన వైరాగ్యము ఊతగా ముక్తి మార్గము వైపు పోవుదురు. క్రూరులు, భయభీతులు, హింసకులు, నిర్లజులు, అజ్ఞానులు, శ్రద్ధాహీనులు మనుష్యులతోనూ, పిశాచములతోనూ ఒకే విధముగా వ్యవహించువారు అని తెలుసుకొనవలెను. అతనికి ఏదైనా మంచి విషయము తెలుపబడిన యెడల, అతడు అర్థము చేసికొనలేకపోవచ్చును. ఇదే విధముగా పరాక్రమ వంతుడు తన వచనములను పాటించువాడు, స్థిరబుద్ధి, సంయమశీలుడు, శూరుడు, వీరుడు మొదలగు ప్రసిద్ధుడైన వ్యక్తిని రాజసపురుషుడని మనస్సులో భావించవలెను, అట్లే క్షమాశీలుడు, ఇంద్రియవిజయి, ఉత్తమజ్ఞానవంతుడు, శ్రద్ధాళువు, తపము లేక స్వాధ్యాయమునందు సదా సంలగ్నుడుగా ఉండువారు ఈ సాత్వికులు.

బ్రహ్మ నిమితో ఈ విధముగా చెప్పెను. పుత్రా! ఈ విధముగా బాగుగా ఆలోచించిన నీకు ఇట్లు శోకించుట అనుచితమైనది. ఎందుకనగా శోకము అందరినీ

సంహరించును. అది ప్రజల యొక్క శారీరక సుఖమును కాల్చివేయును. దాని ప్రభావము చేత మనుష్యుని బుద్ధి నశించును. లజ్జ, ధృతి, ధర్మము, శ్రీ, కీర్తి, నీతివంటి వాని చేత సంపూర్ణముగా పరమ సుఖవంతుడవు అగుటకు ప్రయత్నము చేయవలెను. మూర్ఖులైన మనుష్యులు మోహవశము చేత హింస మిథ్యావాక్కులు పల్కుటయందు తత్పరులు అగుదురు. ఇట్టి మనుష్యులు వారి దోషముల కారణము చేత ఘోరమైన నరకమునందు పడుట తప్పనిది అగును. ఇప్పుడు నేను ధార్మిక జగత్తునకు శుభము కలుగుటకై సత్యమును చెప్పుచున్నాను. దానిని నీవు వినుము. సంపూర్ణమైన సంసారముయెడ ఆసక్తి తొలగి, ధర్మమునందు బుద్ధిని లగ్నము చేయవలెను. అది సారము గలది. స్వయంభువుడగు మనువు చెప్పినది, అట్లే నీవు నిర్వహించిన శ్రాద్ధము గురించి ఆలోచించి నేను నాలుగు వర్ణముల వారికిని విధానమును తెల్పుచున్నాను. దానిని ఆలకింపుము.

ఏ సమయము ప్రాణము కంఠస్థానములోనికి వచ్చి చేరుతో ఆ సమయమున మనుష్యుడు భయభ్రాంతులకు వశుడై మిక్కిలిగా భయము చెందును. అప్పుడు అతడు అన్ని దిశలయందును దృష్టి సారించుటకు అసమర్థుడగును. ఏ క్షణములోనైననూ స్మృతి కూడా వచ్చి పోవును. జీవునికి ఎప్పటి వరకూ కన్నులు తెరుచుకొని ఉండునో అప్పటి వరకూ భూమియందు దేవతలగు బ్రాహ్మణగణములతో స్నేహపూర్వకమైన శాస్త్రములన్నింటినీ చదివి యధాయోగ్యముగా దానాదికర్మలను చేయుట సముచితము. మరియొక లోకమున ఆ ప్రాణికి శుభము జరుగును. కావున గోదానమును తప్పక చేయవలెను. దీనికి ప్రత్యేక మహిమ గలదు. ఈ ధరాతలముపై సంచారము చేయుట అమృతతుల్యమైన పాలను దానముగా ఇచ్చుట ఇవి అవు యొక్క స్వాభావిక ధర్మములు. అందుచే దీని దానము వలన మానవుడు వెనువెంటనే తాపమునుండి విడిపోయినవాడగును. దీని తరువాత మరణాసన్న మైన కాలమున ప్రాణి యొక్క చెవియందు దివ్య మంత్రమును వినిపించవలెను. ప్రాణి హెచ్చుగా స్మృతి కోల్పోయినప్పుడు మనుషులు అతనిని చూచి మరణాకాలోచిత కర్మమును నెరవేర్చవలెను. ఆ మంత్రము చేత ఈ ప్రపంచమునందలి అన్నింటితో ప్రాణి విముక్తి చెందును. శాంతి కలుగును. ఇంకనూ తత్కాల మధుపర్కము చేతియందు తీసుకొని “ఓంకార స్వరూపా! భగవంతుడా! నీవు నేను అర్పించిన మధుపర్కమును స్వీకరించి దయ చూపుము. ఇది పరమ స్వచ్ఛమైన లోకమునందే సమానమగు భగవత్ ప్రేమ గల వ్యక్తుల

లోకమును నారాయణుని చేత రచింపబడిన దాహమును పోగొట్టునది, అట్లే దేవలోకమునందు పరమపూజనీయము" అని చెప్పి, మరణాసన్నమైన ప్రాణియ నోటియందు పోయవలెను. దీనికి ఫలస్వరూపముగా వ్యక్తి పరలోకమున సుఖమును పొందును. ఈ విధముగా విధిని పూర్తి చేసిన తర్వాత అతడు మరల సంసారములో పడడు. మృత ప్రాణికి సద్గతి కలుగ వలెనను ఉద్దేశముచే అతనిని వృక్షము క్రిందికి తీసుకొనిపోయి అనేక విధములైన సుగంధములు, ఘృతము, నూనె ద్వారా ఆ ప్రాణి యొక్క శరీర శోధము చేయవలెను. వెంటనే తైజస లేక వినాశి వంటి కార్యములు ఆతడికి చేయుట ఉచితము. జలమునకు సమీపమున దక్షిణమువైపు పాదములు ఉంచి పరుండబెట్టవలెను. తీర్థాదులను ఆ వాహనము చేసి ఆ జీవికి స్నానము చేయించుట సరియైనది. గయాది అన్ని తీర్థములు ఎత్తయిన, విశాలమైన పుణ్యమయములైన పర్వతములు, కురుక్షేత్రము గంగా, యమున, కౌశిక, పయోష్ణిని, గండకీ, భద్ర, సరయూ, బలదా ఇంకనూ అనేక వనములు, వరాహ తీర్థములు, పిండారక క్షేత్రములు, పృథ్వియందలి సంపూర్ణ తీర్థములు అట్లే చతుస్సముద్రములు వీనినన్నింటిని మనమునందు ధ్యానించి మృతప్రాణికి ఆ నీటిచే స్నానము చేయింపవలెను. పిమ్మట విధిని అనుసరించి అతనిని చితిపై పరుండబెట్టవలెను. అతని పాదములు దక్షిణ దిక్కుయందు ఉండవలెను. ప్రధానమైన దివ్యజ్ఞులను ధ్యానము చేసి, చేతియందు అగ్నిని తీసుకొని దానిని ప్రజ్వలితము చేసి విధి ప్రకారము మంత్రమును చదువవలెను. "అగ్నిదేవా! ఈ మానవుడు తెలిసి, తెలియక ఏమైననూ కఠినమైన పనులు చేసి ఉండవచ్చును. కాని ఇప్పుడు మృత్యుకాలాధీనుడై అతడు ఈ లోకము నుంచి వెడలి పోయెను. ధర్మాధర్మ ములు, లోభమోహములు ఇతనియందు సంపూర్ణముగా కలవు. కావున నీవు ఇతని శరీరమును భస్మము చేయుము. ఇతనిని స్వర్గలోకమునకు పోవునట్లు చేయము" అని ఈ విధముగా చెప్పి ప్రదక్షిణము చేసి, మండుచున్న అగ్నిని అతని శిరస్థానమున ప్రజ్వలితము చేసి పిమ్మట తర్పణము వదలి, మృతవ్యక్తి యొక్క పేరు తీసుకొని భూమిపై అతనికొరకు పిండము వదలవలెను. పుత్రా! నాలుగు వర్ణముల యందును ఈ విధముగానే సంస్కారము జరుగవలెను. మరల శరీరములను వస్త్రములను శుభ్రపరచుకొని, అచ్చటి నుండి తిరిగి వచ్చి వేయవలెను. ఆ సమయముననే పది దినముల పర్యంతము స్వగోత్రీకులందరును అశౌచమునందు భాగము కలవారు అగుదురు. ఆ పది

దినములు అయిపోవు వరకు ఆయనకు దేవ కర్మలు చేయుటయందు ఎట్టి అధికారమును ఉండదు" అని తెల్పగా (187)

188 వ అధ్యాయము - అశౌచము, పిండకల్పము, శ్రాద్ధొత్పత్తి ప్రకరణము

వరాహ విష్ణువును ధరణీ దేవి ఇట్లు ప్రశ్నించెను. "ప్రభూ! మాధవా! ఇప్పుడు నేను నీ నుండి అశౌచ సంబంధ కర్మను విధిప్రకారము చేయుటను వినవలయునని కోరుకొనుచున్నాను. దయతో దానిని గురించి చెప్ప వినతి". ధరణి ప్రశ్నకు వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను.

"కళ్యాణీ! మనుష్యులకు అశౌచము నుండి శుద్ధి అగుటకు ఏమి చేయవలయునో చెప్పుచున్నాను. వినుము. కృష్ణపక్షము యొక్క మూడవరోజు శ్రాద్ధ కర్త నదియొక్క జలములందు స్నానము చేసి పిండి చేత తయారు చేయబడిన మూడు పిండములను మూడు అంజలీ జలములను సమర్పించవలెను. నాల్గవ, ఐదవ, ఆరవ, ఏడవ దినము లందు కూడా ఇట్లే ఒక్కొక్క పిండమును పిండజలమును అర్పించుట సరియైన పద్ధతి. పిండములు ఉంచు స్థలములు వేరు వేరుగా ఉండవలెను. పది రోజుల వరకు క్రమముగా ఈ ప్రకారమైన విధికి పాటించుట ఆవశ్యకము. పదవరోజు క్షురకర్మ చేయించుకొని వేరొక పవిత్ర వస్త్రమును ధరించవలెను. సగోత్రీకులైన అందరి బంధువులు తిలలు, ఉసిరిక పొట్టు నూనె పూసుకొని స్నానము చేయవలెను. పదవరోజున వెంట్రుకలను తొలగించుకొని విధిపూర్వకముగా స్నానము చేసిన తర్వాత బంధుమిత్రులతో కలిసి తన ఇంటికి చేరుకొనవలెను. పదకొండవ దినమున సముచితమైన విధి చేత ఏకోద్దిష్ట శ్రాద్ధము ప్రేతమును ఉద్దేశించి చేయు ఒక అపరకర్మ చేయుట నియమము స్నానము చేసి శుద్ధుడైన పిదప తన ప్రేతము యొక్క ప్రపితామహ, పితామహ తండ్రులయందు సమ్మిళితము చేయుట కొరకు పిండమును ఇవ్వవలెను. సమ్మిళితము తర్వాత సపిండ (సపిండీకరణము) దానము చేయవలెను.

మాధవీ! నాలుగు వర్గములకు చెందిన మనుష్యులకు ఏకోదిష్ట విధానము సమానము. పదమూడవ రోజున బ్రాహ్మణులకు శ్రాద్ధాపూర్వక పక్వాన్నము గల భోజనము ఏర్పాటు చేయవలెను. దీనియందు దివంగత వ్యక్తి కొరకు శ్రాద్ధము ఆచరింపబడుచున్నదో ఆయన పేరుతో సంకల్పము చేయుట ఆవశ్యకము. ఇందుకొరకు మొదట బ్రాహ్మణుని

ఇంటికి పోయి, ఏకాగ్రచిత్తముతో నమ్రతాపూర్వకముగా శ్రాద్ధమునకు రావలసినదిగా నియంత్రణము ఇచ్చుట చేయవలెను. దేవీ! ఆ సమయమందు మనస్సులోనే ఈ మంత్రమును పఠింపవలెను. దాని భావము ఇది: "విప్రశ్రేష్ఠుడా! నీవు ఈ సమయమున యమధర్మరాజు యొక్క ఆదేశానుసారము దేవతాలోకమునందు చేరుకొని ఉంటివి. ఇప్పుడు వాయు రూపమును ధరించి, మానసిక ప్రయత్నము ద్వారా ఈ బ్రాహ్మణుని శరీరమునందు స్థిరముగా ఉండునట్లు దయచూపుము." పిమ్మట ఆ శ్రేష్ఠ బ్రాహ్మణునికి నమస్కరించి పాద్యార్పణము చేయవలెను.

సుందరీ! ఆ సమయమున బ్రాహ్మణుని శరీరమున ప్రేతము యొక్క రూపమును కల్పించుకొని ఆయనకు మేలు చేకూర్చు ఆలోచన చేత పాదసంవహనము (కాళ్ళు వత్తుట) మొదలగు పనిచేయుట మహా ఉపయోగకరమైనది. పృథ్వీ! మనుష్యుని కర్తవ్యము ఏమనగా అశౌచము కలిగిన దినములలో నా శరీరమును స్పృశించవద్దు. రాత్రి గడచిపోయిన తర్వాత ప్రాతఃకాలమున సూర్యోదయమైన తర్వాత శ్రాద్ధకర్తకు విధిపూర్వకముగా జుట్టు గొరిగించి నూనె మొదలగునవి అంటి స్నానము చేయవలయును. మరల స్థలశుద్ధి అనంతరము శుభ్రమైనదిగా చేసి అచ్చట వేదికను తయారు చేయవలెను. ఇందుకు అవసరమైన స్థలము నదీ తీరము లేక శ్రాద్ధకర్మ కొరకు ప్రత్యేకముగా ఏర్పరచిన స్థలము. ఇట్టి స్థలమునందు పిండదానము చేయుట ఉత్తమమైనది. 64 పిండములను ఇచ్చుట చేత యథార్థమైన సుకృతము సులభము అగును. సుందరీ! దక్షిణము, తూర్పు దిక్కుగా ముఖమును ఉంచి అన్ని పితృభాగములను సంపన్నములైనవిగా చేయవలెను. నదీతటముపై వృక్షము క్రింద లేక మర్రి చెట్టు యొక్క నీడయందు ఈ పని చేయుట పద్ధతిగా వచ్చుచున్నవి. ఆ స్థలము వద్ద హీనప్రాణుల దృష్టిపడకూడదు. ఏ ప్రదేశమునందు ప్రేత సంబంధమైన కార్యము చేయబడునో అచట ముర్గ, కుర్కర, కోడి, కుక్కలు, సూకరములు (పంది) మొదలగు పశుపక్షుల ప్రవేశము లేక ఉండవలెను. అవి నేత్రమునకు కనిపించుట నిషిద్ధము. అట్టి స్థలమునందు వాని శబ్దము కూడా ఉండరాదు.వసుంధరా ! కోడి యొక్క రెక్కలకు చెందిన గాలి నుంచి అట్లే చండాలుని దృష్టి నుంచి యక్తస్థానము నందు శ్రాద్ధము చేయుట చేత పితరులకు బంధనము జరుగును. అందువలన అవి లేకుండునట్లు చూచుకొనవలెను.

సుందరీ! అందు కొరకు వివేకము గల మనుష్యుడు ప్రేతకార్యమునందు వీని ఉపయోగము లేకుండా చేయుట పరమ కర్తవ్యము దేవ, దానవ, గంధర్వ, ఉరగ, నాగ, యక్ష, రాక్షస, పిశాచములే గాక, స్థావర జంగమాది ఎన్ని విధములైన ప్రాణులు కలవో వారు అందరూ నీ పృష్ఠ భాగమునందు ప్రతిష్ఠితులు అయి, స్నానము మొదలైన క్రియలను అవసరమును బట్టి చేయుచూ ఉందురు. ఈ ప్రపంచము అంతయూ విష్ణుభగవానుని మాయాక్షేత్రము. చండాలుని నుంచి బ్రహ్మపర్యంతము అన్ని వర్గములకు చెందిన మనుష్యులు శుభమైన లేక అశుభమైన పనులు చేయుటకొరకు స్వతంత్రము గలవారే. భూమీ! ఇందుకై ఆవశ్యక ప్రేతకార్యము చేయు సమయమునందు స్నాన పూర్వక స్థానశుద్ధి చేయుట ఆవశ్యకము. భూమిని ముందు పవిత్రము చేయకుండుట, శ్రాద్ధకర్మ చేయుటకు అనుపయుక్తము అగును. పృథ్వీ! ఈ జగత్తు నీపై ఆధారపడి ఉన్నది. స్వభావతః నీవు పరిశుద్ధి కలదానవే. కానీ అపవిత్రకార్యముల వలన నీవు దూషితురాలవుగా చేయబడు చున్నావు. అందుచే ఎప్పుడైననూ పవిత్రము చేసిన స్థానమునందే శ్రాద్ధము నిర్వర్తింప వలెను. లేనియెడల దానిని దేవతలు, పితరులు, స్వీకరించరు – ఇక్కడి వరకు ఆ ఉచ్చి, స్థానము యొక్క ప్రభావము చేత అతడు ఘోరనరకమున పడిపోవలసి వచ్చెను. ఆ కారణము చేత స్థానశుద్ది చేసిన తర్వాతనే ప్రేతమునకు పిండసమర్పణ చేయవలెను.

మాధవీ! పేరు, గోత్రములతో పాటు సంకల్పము చేసి పిండ అర్పణము విధిగా పాటింపవలెను. ఈ కార్యమంతయూ పూర్తిఅయిన తర్వాత తమ గోత్రము, కులసంబంధ సజ్జనులందరితో కూడి ఒక స్థానముపై వారిని కూర్చుండబెట్టి, భోజనము చేయవలెను. నాలుగు కులముల వారికిని ప్రేత నిమిత్త కార్యములందు ఇదియే నియమము. ధరణీ! ఈ విధముగా పిండదానము చేసిన తర్వాత ప్రేతలోకమునకు పోయిన ప్రాణి సంపూర్తిగా తృప్తుడు అగును. పిండులు కాని మనుష్యులు పిండదానము చేయరు. అయిననూ అశౌచగ్రస్తుదగు వ్యక్తుల భోజనమునందు సమ్మిళితులై ఉండిన యెడల వారికి కూడా శుద్ధి ఆవశ్యకముగా చేయవలెను. అట్టివాడు ఏదో ఒక నది వద్దకు పోయి వస్త్రసహితముగా అందు స్నానము చేయవలెను. ఒకవేళ అతడు అచటకు పోవుటకు అసమర్థుడైన యెడల మానసిక తీర్థయాత్ర చేసి, మంత్రమార్జన పూర్వక జలముతో ఆచమనము చేయవలెను. ఆ సమయమునందు సంపూర్ణ ఆరోగ్యముగా ఉన్న పురుషునికి బ్రాహ్మణుల కొరకు

అర్ఘ్యపానములను అర్పణము చేయవలెను. అన్నింటికంటే ముందుగా మంత్రమును ఉచరించి (చదివి) విధిపూర్వక ఆసనము ఇచ్చుట నియమము. ఆసనము ఇచ్చుటకై చెప్పు మంత్రము ఇది. "ద్విజవరా! మీ సేవ కొరకు ఇవ్వబడిన ఆసనము ఇచ్చట కలదు. మీరు దానిపై విశ్రాంతి గైకొనుడు. దానితో పరమ ప్రసన్నులై నన్ను కృతార్థుని చేయుట మీ దయపై ఆధారపడి ఉన్నది". బ్రాహ్మణులు ఆసనముపై కూర్చొనగానే, సంకల్పపూర్వక ఛత్రమును సమర్పింపవలెను. ఆకాశమునందు అనేకులు దేవతా గంధర్వ యక్ష సిద్ధుల గణములు, అట్లే పితరుల బృందము హాజరై ఉందురు. వారు అత్యంత తేజమూ కలవారిగా ఉందురు. అందుచేత వారిచే ఆతపవర్షాదులనుండి రక్షణ పొందుటకు ఛత్రమును ధరించుట ఆవశ్యకము. వసుంధరా! ప్రేతము యొక్క హితము కొరకు అను ఆలోచనతో కూడా ఛత్రదానము అనివార్యము. మొదట ప్రశాంతముగా ప్రేత భాగమును ఇవ్వవలయును. ప్రేతము ఏ ఆవరణమునకైననూ క్రింద ఉన్న యెడల కూడా అతడి నిమిత్తము బ్రాహ్మణునికి ఛత్రము దానము ఇచ్చుట పరమ ఉపయోగకరమైనది. దేవతా దానవ సిద్ధ గంధర్వులు ఇంకనూ మాంసభక్షకులైన రాక్షసులు ఆకాశము నందుండి క్రిందకు చూచుచూ ఉందురు. వారి అందరి దృష్టి పడిన తర్వాత ప్రేతము ఎక్కువగా లజ్జితుడుఅగు అనుభవమును పొందును. ఎప్పుడు ప్రేతము లజ్జితము అగునో దానిని చూచి అసురులు రాక్షసులు ఎగతాళి చేయుదురు. అందుచేత చాలావరకు మొదటి నుండియూ ఆదిత్య భగవానుడు దీనిని నివారించు కొరకు ఛత్రమును ఇచ్చు ఏర్పాటును చేసి ఉంచెను.

దేవీ! పూర్వకాలమున జరిగిన ఒక సంఘటన: ఒకమారు అనేకమంది దేవతలు ఋషులు, ప్రేతలోకమునకు చేరుకొనిరి. కాని అచ్చట వారిపై అగ్ని, రాళ్ళు, మండుచున్న జలము భస్మములు రాత్రింబగళ్ళు వర్షమువలె కురవసాగెను. ఆ ఉపద్రవమును శాంతింపజేయుటకై ఆదిత్య భగవానుడు గొడుగు యొక్క దానవిధిని ఏర్పాటు చేయుట జరిగెను. ఆ కారణముచే ప్రేత కార్యమునందు బ్రాహ్మణునికి ఛత్రదానము చేయుట ఆవశ్యకమయ్యెను.

శుభురాలా! దీని తర్వాత పాదరక్షలు దానము చేయుట కూడా పద్ధతి. దీనిని ధరించుట చేత పాదములకు విశ్రాంతి లభించును. దానిని దానము చేయుట చేత లభ్యమగు ఫలమును చెప్పుచున్నాను. యమధర్మరాజు పురమునందు పోవునప్పుడు,

పాదరక్షలు దానము చేయుటచే ప్రేతము యొక్క పాదములు బాధపడవు. యమలోక మార్గము అత్యంత అంధకారములతో వ్యాపింపబడి ఉండి, మహాకష్టములను కలిగించుచు, చూచుటకు భయావహముగా ఉండును. ఆ మార్గము నుండియే ప్రాణి యమలోకమునకు ఒంటరిగానే పోవును. అచట యమధర్మరాజు దూతలు దండమును చేతిలోనికి తీసుకొని వెనుక వెనుక నడచుచూ తమ ఆజ్ఞ పాటించునట్లు చేయుటలో నిరంతర తత్పరులై ఉందురు. మాధవీ! రాత్రింబగళ్ళు ప్రేతమును యమపురికి తీసుకొనిపోవుటకు సిద్ధముగా ఉండుటయే యమదూతల పని. అందుచే వారి పాదములు సుఖపూర్వకముగా ఉండి కార్యమును నెరవేర్చుట అత్యంత ఆవశ్యకము. యమపురి యొక్క మార్గము భూమిపై వేడితో ఉండి, ఇసుకతో వ్యాపించి ఉండును. ముళ్ళు కూడా వెదజల్లబడి ఉండును. అట్టి స్థితియందు అతడు ఇవ్వబడిన పాదరక్షల సహాయము చేత కఠినమార్గము కూడా దాటగల్గును.

భూమీ! ఇదియే గాక మంత్రమును చదివి, దప్పిక, దీపము దానమిచ్చు పద్ధతి కూడా కలదు. ప్రేతము వెంట వేరువేరుగా వానిని ఏర్పరచుట ఉపయుక్తమైనది. పేరు, గోత్రముల ఉచ్చారణ చేత వానిని ప్రేతము ప్రాప్తించుకొనగలదు. దీని తర్వాత భూమిపై కుశలను పరిచి, ప్రేతమును ఆవాహన చేయవలెను. ఆవాహన చేయు మంత్రము యొక్క భావము ఇది. "ప్రేతా! నీవు ఈ లోకమును పరిత్యజించి పరమగతిని ప్రాప్తించుకొంటివి. నేను భక్తిపూర్వకముగా నీ కొరకు ఈ గంధమును ఉంచితిని. ప్రసన్నుడవై నీవు దీనిని స్వీకరింపుము" అని చెప్పి వెంటనే విప్రునికి ఎదురుగా "విప్రవరా! నేను పడిన కష్టము చేత అన్ని విధములు గంధ పుష్ప ధూప, దీపములు అన్నింటిని ప్రేతము యొక్క సేవార్థము సమర్పించుచున్నాము."

వసుంధరా! ఇదే విధముగా ప్రేత నిమిత్తము సిద్ధపరుపబడిన అన్నము, వస్త్రములు, ఇంకను ఆభరణములు, బ్రాహ్మణునికి దానము ఇవ్వవలెను. ప్రేతము అనుభవించుటకు యోగ్యమైన అనేక ద్రవ్యములు, దానములు చేసిన పిమ్మట మూడుమార్లు తనకు ప్రసన్నత ప్రాప్తించలేకపోయినందుచేత మనుష్యుడు దేనియందు దానధర్మముల యొక్క లోపము జరుగదో అట్టి పనులను చేయవలెను. జాతివారు, సంబంధీకులు మధ్య ప్రసన్నమైన మనస్సుతో ఏ బ్రాహ్మణుడు విశేషముగా ప్రేత భాగ భోజనము కొరకు

ప్రదానము చేయవలెను. అచ్చట దానిని ప్రతిష్ఠ చేయవలెను. కేవలము చూచినంత మాత్రము చేతనే ఎవరునూ తృప్తిపడరు. ఈ విధముగా ప్రేతమును మనస్సులో తలచుకొని నరులకు భోజనము మొదలైన పదార్ధములను తినిపించి అర్పించవలెను. సామాన్య ప్రభావము చేత యోనిప్రాణి చాలా వేగముగా పాపము నుండి ముక్తుడైపోవును.

శాంతి కొరకు జలముతో విధి ప్రకారము స్నానము చేసి తలవంచుకొని నమస్కరింప వలెను. ఆ పిమ్మట పితరుల కొరకు దానములు ఇచ్చు స్థానము వద్దకు చేరవలెను. దేవీ! నీ భక్తిలో నిష్ఠలు పాటించుచూ మానవులకు ఈ మంత్రమును చదివి స్తుతి చేయుట విధి. మంత్రభావము ఇది. "వసుధా! నీవు జగన్మాతవు. అట్లే మేధినీ, ఉర్వీ, శిలాధార మొదలగు నామములతో నీవు విభూషితవుగా ఉన్నావు. నీవు జలమునకు తల్లివి. అట్లే దానికి ఆశ్రయ ప్రదానము చేయుదానవు, జగత్తు నీపై ఆధారపడినది. నీకు ఎల్లప్పుడూ నమస్కరింతును. సుందరీ! ఈ విధిచేత భక్తులు పిండదానము చేసినప్పుడు అతడికి మహాపుణ్యము ప్రాప్తించును. తర్వాత ప్రేతము యొక్క పేరు, గోత్రములను పలికి తిలోదకములు ఇవ్వవలెను. దాని వెంటనే రెండు బొటనవ్రేళ్ళను నేలపై ఆనించి శ్రేష్ఠులైన బ్రాహ్మణులకు నమస్కారము చేయవలెను. మంత్రపూర్వకముగా తన చేతులతో బ్రాహ్మణుని చేయి పట్టుకొని పైకి లేపి అతడి శయ్యపై కూర్చొనబెట్టి, అంజనము మొదలైన వస్తువులను అర్పించవలెను. కొన్ని క్షణముల వరకు అచ్చటనే విశ్రాంతి తీసుకొని మరల శ్రాద్ధ స్థానమునకు వచ్చి వేయవలెను. పిమ్మట గోవు యొక్క తోక పట్టుకొని బ్రాహ్మణుని చేతియందు దానిని దానము ఇవ్వవలెను. మేడిచెట్టు కొయ్యతో చేసిన పాత్రయందు నల్లనువ్వులు, తిలలు తీసుకొని ద్విజులు "సౌరభేయః సర్వహితా" అను ఈ మంత్రమును ఉచ్చరించవలెను. మంత్రముతో జలశుద్ధి అగుచున్నది. అందుకు దానిని ఉపయోగించుట వలన సంపూర్ణ పాపము నశించిపోవును. దీని తర్వాత ప్రేతమును విసర్జించి బ్రాహ్మణునికి దానము ఇచ్చుట తగిన కార్యము. చివరలో అపసవ్య రూపము చేత 'కా బలి' ఇవ్వవలెను. దీని తర్వాత ప్రేతము కొరకు తయారు చేయబడిన పదార్ధముతో చీమలు మొదలగు ప్రాణులకు సరియైన విధముతో బలి యిచ్చి తర్పణము చేయుట విధానము. మాధవీ! జనులందరు భోజనములు చేసిన తర్వాత అనాథలను, పేదవారిని కూడా సంతుష్టులను చేయవలెను. అందుచే వారు యమపురికి పోయి మృతప్రాణికి సహాయము చేయుదురు.

అనాథలకు ఇవ్వబడిన సంపూర్ణ అన్నము అక్షయమగును. ఆ కారణము చేత ప్రేతసంస్కారము తప్పక చేయవలెను.

ఈ విధముగా నాలుగు వర్ణముల వారి కొరకు నిమి మొదలగు ఆదర్శ ఋషులకు స్వయంభువ మొదలగు మనువులు అన్ని విధములా శుద్ధి అగుటకు నియమమును ప్రదర్శించిరి. ఆకారము చేత దీనివలన పురుషులు శుద్ధి పొందుదురు. ఇందు సందేహము ఏ మాత్రమును లేదు. ప్రేత సంబంధ కార్యమునందు ధర్మపూర్వక సంకల్పము చేయుట ఎక్కువ ఆవశ్యకమైనది. ఆత్రేయుడు కూడా నిమికి ఇట్లు చెప్పెను. "పుత్రా! నీవు చెప్పిన ప్రేతకార్యక్రియ, దాని సంబంధించిన భయము యొక్క అనుభవము చేయుచున్నాము. ఈ కార్యము అనుచితమైనది. ఈ ప్రసంగమును నేను నారదుని ఎదుట విస్తారముగా వ్యక్తము చేసి ఉంటిని. పుత్రా! నీ కొరకు నేను ఒక యజ్ఞ ప్రతిష్ఠ చేసి ఇచ్చెదను. నేటినుండి ప్రారంభించిన ఈ యజ్ఞము అఖిల జగత్తుయందు పితృయజ్ఞము అను పేరుతో ప్రసిద్ధ కాగలదు.

వత్సా! ఇప్పుడు నీవు పోవచ్చును. శోకించుట నీకు శోభనీయదు. బ్రహ్మ, విష్ణు, మహేశుల లోకములందు ఉండునట్టి నీకు మంచి అవకాశము లభించగలదు. ఇందు ఎట్టి సందేహమును లేదు.

ఈ విధముగా పితృసంబంధమైన కర్మను వివరించి ఆత్రేయ మహాముని నిమికి ఊరడింపు కలిగించెను. అందుచేతనే మూడవ, ఏడవ, తొమ్మిదవ, పదకొండవ మాసములలో సాంవత్సరిక క్రియల నియమము ఏర్పడినది. ఈ మాసములలో పిండ దానముచేయుట విధి అయినది. ప్రేతము యొక్క ఈకార్యము పూర్తిగా ఒక సంవత్సరములో సమాప్తము అగును.ఎన్ని ప్రాణులు ఈ లోకము నుంచి పోవుచున్నవోఅట్లే పోయి చాలామంది అన్యలోకమునందు కూడా చేరుకొనుట జరుగుచున్నది. పిత, పితామహుడు, పుత్రవధు (కుమారుని భార్య) స్త్రీ తమ కులము వారికి సంబంధించినవారు, బంధువులు ఇంకనూ బాంధవులు ఈ బహుసంఖ్యాక ప్రాణుల చేత సంబంధము ఉంచుకొనువారు ఈ సంసార స్వప్నము యొక్క సమాన మిథ్యా సారహీనము అగును. ఎవరిదో మృత్యువు అయిపోయి దాని స్వజనులు కొంతకాలము పాటు ఏడ్చుచూ ఉందురు. తర్వాత ముఖమును వెనుకకు తిప్పికొని తిరిగి వచ్చుదురు. స్నేహరూపమైన బంధనము

చేత ప్రాణి కట్టివేయ బడినది. అయిననూ అతడు అరక్షణములోనే స్నేహబంధము ఖండింపబడి కూడా పోవును. ఎవరికి ఎవరు తల్లి? ఎవనికి ఎవరు తండ్రి? ఎవరికి ఎవరు భార్య? అట్లే ఎవరికి ఎవరు పుత్రడు ప్రత్యేక యుగమునందు దీని సంబంధము కలియుచూ తెగిపోవుచూ ఉండును. అందుచే దీనిపై ఏ ప్రవేశమును పెట్టుకొనరాదు. ఈ లోకము మోహము యొక్క బంధము చేత బంధింపబడి ఉన్నది. మృతుడైన వ్యక్తి కొరకు సంస్కారవిధి, శ్రద్ధ స్నేహపూర్వకముగా జరుపబడుచున్నది. అందుచేత అది శ్రాద్ధము అని పిలువబడుచున్నది.

మాతా, పితా, పుత్రుడు,భార్య మొదలగు సంసారమునందు వచ్చుచుండును. అట్లే పోవుచూ కూడా ఉండును. అందుచే వారు ఎవరి వారు? మనకు వారితో ఎట్టి సంబంధము? మృతప్రాణికి ప్రేత సంస్కారము సమాప్తము అగుగాక! పోవు సమయము నందు అతడు పితరుల శ్రేణియందు సమ్మిళితుడు అయిపోవును. మరల ప్రత్యేక మాసము యొక్క అమావాస్య తిథినాడు అతడికి తర్పణము వదలవలెను. బ్రాహ్మణుని యొక్క నోటియందు హవనము చేయుటచే బ్రాహ్మణునికి భోజనము చేయించుటచే పితామహుడు, ఇంకను ప్రపితామహుడు శాశ్వతముగా తృప్తి కలిగిన వాడు అగును. పితృయజ్ఞము యొక్క ప్రతినిధి యగు ఆత్రేయ మహాముని ఈ విధముగా నిశ్చయాత్మకమైన మాటలు తెల్పి కొంతకాలము పాటు శ్రీహరి భగవానుని ధ్యానించి,పిమ్మట అచటనే అంతర్ధానము చెందెను.

నారదుడు ఇట్లు చెప్పుచున్నాడు: మునివరా! మేము ఆత్రేయునికై ఏ సంస్కార సంబంధ విషయములు తెలుపబడినవో, అట్లే నీవును వానిని విని వుంటివో అవి నాలుగు వర్గములకు సంబంధమును కలిగి ఉండును. అందుచే విధిపూర్వకముగా చేయవలెను. అప్పటినుంచి తపస్సు యొక్క పరమ ధన్యులగు ఋషుల ద్వారా ప్రతిమాసము యొక్క అమావాస్యనాడు న్యాయమును అనుసరించి ఇది పితృయజ్ఞము అగుచూ వచ్చుచున్నది. నిమి ద్వారా నిర్దిష్టమైన ఈ యజ్ఞము ద్విజాతుల వారికి మంత్ర సహితముగాను, శూద్ర వర్గము వారికి మంత్ర రహితముగాను చేయించవలెను. ఇది విధి. అప్పటినుంచి దీని పేరు "నేమి శ్రాద్ధము" అని పిలువబడుచున్నది. ద్విజాతి వర్ణముల వారు మాత్రము ఎల్లప్పుడు దీనిని చేయుచూ వచ్చుచున్నారు. మహాభాగా! నీవు ముని గణములలో మహా

ప్రతిష్ఠితుడవైయితివి. నీకు శుభమగుగాక! ఇప్పుడు నేను పోవలయునని అనుకొను చున్నాను''. ధరణీ! ఈ విధముగా చెప్పి, నారదముని అమరావతికి ప్రస్థానము చేసెను. (188)

189 వ అధ్యాయము - శ్రాద్ధమునందు దోషములు, వానిని రక్షించు విధి

ధరణి ఇట్లు చెప్పెను. "భగవాన్! బ్రాహ్మణ క్షత్రియ వైశ్య, శూద్ర ఈ నాలుగు వర్ణముల వారును ఏ విధము చేత శ్రాద్ధమును పెట్టవలెను. వీరికి అశౌచము ఎట్లు కలుగును? అట్లే శుద్ధి ఏ విధముగా జరుగును? ఇంకనూ ఏ విధిచేత ప్రేతము యొక్క సద్గతుల కొరకు భోజనము మొదలగునవి చేయుట పద్ధతి. వీటిని గురించిన నీవు చెప్పు వివరణను నేను వినవలయునని కోరుకొనుచున్నాను. "ప్రభూ! ఇప్పటి వరకు నాలుగు వర్గములకు చెందిన అందరు వ్యక్తుల కర్తవ్యము ఉత్తమ బ్రాహ్మణునికే దానము ఇవ్వవలెను అని వివరణ లభ్యమగుచున్నది. అయిననూ దానము ఎవరికి ఇచ్చుట ఉచితము? ప్రేత శ్రాద్ధమునకు ఇచ్చు దానము స్వీకరించుట నిందిత, గర్హిత కార్యము అని చెప్పబడుచున్నవి. అందుచేత పురుషోత్తమా! బ్రాహ్మణ సమాజమునందు ఏ బ్రాహ్మణుడు ప్రేత భాగమును స్వీకరింపవలెనో, ఎట్టి కర్మను చేయునో, ఆతడు చేసిన కర్మలకు పాపము ఎట్లు దూరమైపోవును? దాతకు కూడా శ్రేయము ఏ విధముగా కల్గును?" అను విషయములను కూడా నేను నీ నుంచి తెలుసుకొనుట కర్తవ్యముగా భావించుచున్నాను.

సూతుడు ఇట్లు చెప్పెను. ఋషులారా! పృథ్వీదేవి ఈ విధముగా పరమాత్ముడు ప్రభువు అయిన వరాహునికి వేసిన ప్రశ్నచేత శంఖ, దుందుభుల ధ్వని వెలువడుచున్నట్లు వినబడినది. ఆ సమయమునందు వారాహరూపధారుడైన నారాయణ భగవానుడు భాగ్యవతి అగు వసుంధర ప్రశ్నలకు సమాధానములు ఇట్లు చెప్పెను. వరాహభగవానుడు ఈ విధముగా పల్కెను. "దేవీ! బ్రాహ్మణులు ఏ విధముగా దాతను ఉద్ధరింపగలరో, ఆ విధానమును నీకు తెల్పుచున్నాను. ఏ బ్రాహ్మణుడు అజ్ఞానము చేత ప్రేత నిమిత్తము ఇవ్వబడిన అన్నమును స్వీకరించునో, అతడు తన శరీర శుద్ధికొరకు ఒక పగలు, ఒక రాత్రి నిరాహారుడై ప్రాయశ్చిత్తము చేసికొనవలెను. ఇట్లు చేసుకొనుటచే ఆ బ్రాహ్మణుడు శుద్ధుడు అగును. వానికి తూర్పు దిశయందు ప్రవహించునట్టి నదియందు విధి ప్రకారము స్నానము చేసి ప్రాతః సంధ్యా వందనము చేసుకొనిన తర్వాత తర్పణములు వదలి, అగ్నియందు

తిలల హవనము, శాంతి పాఠము, మంగళపాఠములను పఠింపవలెను. అంతేగాక పంచగవ్యములను స్వీకరించుట మధుపర్క సేవనము పరమశుద్ధికి కారణములు అగును. తదనంతరము మేడి కర్రతో చేసిన పాత్రయందు శాంతిజలమును తీసుకొని ఆ బ్రాహ్మణుడు తన యింటికి మార్జనము చేయవలెను. పాపరాశిని భస్మము చేయుట కొరకు దేవతల ముఖము అగ్ని చేయు కార్యమును చేయును. అందుచేత సమస్త దేవతలకు క్రమము ప్రకారము తర్పణము, భూత బలి నిర్వర్తించి తర్వాత బ్రాహ్మణులకు భోజనము పెట్టవలెను. గోదానము చేయుట చేత పాపములన్నియూ నష్టమగును. అందుకై గోదానము కూడా చేయవలెను. ఇట్టి విధానమును పాటించుట చేత నరుడు పరమ గతికి చేరుకొనును. ఎవరి పొట్టయందు ప్రేత నిమిత్తమైన అన్నము ఉండునో,అట్లే కాలధర్మమును అనుసరించి అతడి ప్రాణములు ఎట్లు ప్రయాణము చేయునో, అట్టి బ్రాహ్మణులు కల్పపర్యంతము భయంకరమైన నరకమునందు నివసింపవలసి వచ్చును. అంతేగాక అతడు కఠిన దుఃఖమును అనుభవించవలసి వచ్చును. పిమ్మ టవానికి రాక్షస యోనియందు జన్మించవలసి వచ్చును. ఇందువలన దాత-భోక్త ఇద్దరికిని తమ తమ క్షేమము కొరకు ప్రాయశ్చిత్తము చేసుకొనుట చాలా ఆవశ్యకమైనది. గోవులు, ఏనుగులు, గుఱ్ఱములు అట్లే సముద్ర పర్యంతము సంపూర్ణమైన సంపత్తులను దానముగా తీసికొని బ్రాహ్మణుడు కూడా మంత్రపూర్వక ప్రాయశ్చిత్త కార్యమును సరిగా నిర్వర్తించగా, నిశ్చయముగా దానియందు దాతను ఉద్ధరించుటకు కావలసిన శక్తి వచ్చును.

ఏ పురుషుని జ్ఞాన సంపన్నత ఇంకనూ వేదాభ్యాసము చేయుటయందు నిరతము లగ్నమైయుండునో, ఆ బ్రాహ్మణుడు స్వయముగా తనను అట్లే దాతను ఉద్ధరించుటయందు పూర్తి సమర్థుడు అగును. ఇందు సంశయము లేదు. వసుంధరా! మూడు వర్గముల వారు ఎన్నడునూ బ్రాహ్మణుని అనాదరము చేయకుండా ఉండుటయే పరమకర్తవ్యము. దేవకార్యము యొక్క ఆవశ్యకముగా, జన్మ నక్షత్రమునందు శ్రాద్ధతిథియందు, ఏదైనను పర్వకాల సమయమున లేక ప్రేత సంబంధకార్యమునందు ప్రవీణుడైన బ్రాహ్మణునితో సమ్మిళితము కావలెను. వైదిక విద్యను తెలిసిన వానికి, వ్రతనిష్ఠ కలిగిన వానికి నిరతము ధర్మమును పాటించువానికి శీలవంతుడు, పరమ సంతోషి ధర్మజ్ఞాని, సత్యవాది, ఓర్పు కలవాడు, శాస్త్రమును తుదముట్ట ఎరిగినవారు ఇంకను అహింసావతి అయిన వాడు వంటి

బ్రాహ్మణులను సంపాదించి అతడికి వెంటనే దానము ఇవ్వవలెను. ఆ బ్రాహ్మణుడే దాతను ఉద్ధరించుటయందు సమర్థుడు. కుండుడు (తండ్రి బ్రతికి ఉండగనే జారపురుషుని వలన జనించినవాడు) లేక గోలకుడు (భర్త మరణించిన తర్వాత స్త్రీ అన్య పురుషుని వలన జన్మించినవాడు గోలకుడు) అయిన బ్రాహ్మణులకు ఇవ్వబడిన దానము నిష్ఫలము అగును. అతడు దాతను నరకమునందు పడునట్లు చేయును. పితృ సంబంధమైన లేక దేవకార్యములలో ఒకడు కూడా కుండకుడు లేక గోళకుడు అయినబ్రాహ్మణుడు ఉండిన యెడల అతనిని చూచి పితరులు నిరాశోపహతులై తిరిగి వెళ్ళి పోవుదురు.

యశస్వినీ! అపాత్రునికి ఎన్నడునూ దానము ఇవ్వరాదు. ఈ విషయమును గురించిన ఒక ప్రాచీన ప్రసంగమును తెల్పుచున్నాను వినుము. అవంతీపురమున పూర్వకాలమున మనువంశమునందు పుట్టిన పరమధార్మికుడైన రాజు ఒకడు కలడు. ఆయన పేరు మేధాతిథి. ఆయన పురోహితుడు, అత్రి గోత్రకులోద్భవుడైన చంద్రశర్మ. అతడు నిరంతరము వేద పఠనమునందు సంలగ్నుడై ఉండుచుండెను. రాజు మేధాతిథి మహాదానపరుడు. ఆయన ప్రతిదినము బ్రాహ్మణులకు గోవులను దానమిచ్చుచుండెను. విధి ప్రకారము వంద ఆవులను ఒక రోజున దానము చేసిన పిమ్మటనే అతడు భోజనము చేయవలయునను నియమమును పెట్టుకొనెను. వైశాఖమాసమునందు, ఆ మహారాజు తన తండ్రి యొక్క శ్రాద్ధ దినమునాడు అనేకమంది బ్రాహ్మణులను ఆహ్వానించెను. ఇంకనూ ఆ బ్రాహ్మణులు గురువు (రాజ పురోహితుడు)వచ్చిన తర్వాత ఆ గురువునకు రాజు నమస్కరించెను. అట్లే విధి ప్రకారముశ్రాద్ధ కార్యమును ప్రారంభించెను. పిండ ప్రదానము తర్వాత అన్నదానమునకు సంకల్పము చేసి బ్రాహ్మణులలో భోజనమును పంపిణీ చేయబడెను. తర్వాత ఆ విప్రుల సమూహములలో ఒక గోళక బ్రాహ్మణుడు కూడా కలడు. రాజు శ్రాద్ధమునందు సంకల్పింపబడిన అన్నము ఆ బ్రాహ్మణునికి కూడా ఇవ్వబడెను. అట్లు చేయుటచే శ్రాద్ధమునందు మహా దోషము ఉత్పన్నము అయినది. ఈ కారణము చేత మేధాతిథి మహారాజు పితరులు స్వర్గమునుంచి క్రిందికి పడవేయబడుటచే వారికి ముళ్ళతో నిండి ఉన్న అడవియందు పడిపోవలసి వచ్చెను. తదుపరి రాత్రింబగళ్ళు ఆకలి దప్పికల బాధచేత ఆయన బాధింపబడెను. ఒకప్పటి మాట, స్వయముగా రాజు మేధాతిథి సంయోగవశముచే ముగ్గురు నలుగురు పరిజనులతోపాటు వేట కొరకు ఆ అడవియందు

ప్రవేశించెను. రాజు అచట తన పితరులను చూచి "మహానుభావా! మీరెవరు? మీకు ఇట్టి దశ ఏల కలిగినది. మీరందరునూ ఏ కర్మ కారణముచేత ఈ దారుణ దుఃఖమును అనుభవింపవలసి వచ్చుచున్నది. ఆ విషయమును దయతో నాకు ఎరిగింపుడు" అని పల్కెను.

పితరులు ఇట్లు చెప్పిరి. "మా వంశమును నిరంతరము వృద్ధి చెందించువాడైన మహాశక్తి సంపన్నుడైన పురుషుడు ఒకడు కలడు. జనులు అతని మేధాతిథి అందురు. మేము అందరమూ అతని పితరులము. అయిననూ ఈ సమయమునందు నరకమున పడి ఉన్నాము." అని చెప్పెను. భూదేవీ! ఆ సమయమున పితరుల యొక్క ఈ మాటలను విని రాజు మేధాతిథి యొక్క హృదయమునందు వర్ణింపలేని దుఃఖము కలిగెను. అతడు పితరులను ఓదార్చుచూ ఇట్లు పల్కెను. "పితృగణములారా! నేనే మేధాతిథిని. మీరు ఎల్లరు నా పితరులు. ఏ కర్మ యొక్క దోషము చేత మీకు ఈ నరకమునకు చేరవలసిన స్థితి కలిగినది?" అని ప్రశ్నించెను.

పితరులు "పుత్రా! నీవు మా కొరకు శ్రాద్ధమునందు అన్నసంకల్పము చేసితివి. దైవవశమున ఆ అన్నము ఒక గోళక బ్రాహ్మణునికి చేరెను. అందుచేత శ్రాద్ధకర్మ దూషితమైనది. దానికి ఫలస్వరూపముగా మేము నరకములో పడవలసి వచ్చినది. అట్లే అదే సమయము నుండి మేము దుఃఖమును కూడా అనుభవించుచున్నాము. మాకు ఏ ప్రకారముగా మరల స్వర్గము సులభమగునో తెలిసికొనవలయునను కోరిక కూడా కలుగుచున్నది. పుత్రా! నీవు సమస్త ప్రాణులకు హితమును కలిగించుటలో నిరతము మునిగి ఉండువాడవు. దానము చేయుట నీ స్వాభావిక గుణము. నీ ద్వారా లెక్కలేనన్ని గోవులు దానముగా ఇవ్వబడినవి. దక్షిణలు కూడా నీవు పర్యాప్తముగా ఇచ్చితివి. ఆ పుణ్యప్రభావము చేతనే మేము స్వర్గమును పొందగల్గితిమి. కానీ మేము ఇప్పుడు తిరిగి స్వర్గమును పొందగోరుచున్నాము. అందుచే నీవు మరల ఒకమారు శ్రాద్ధమును చేయవలెను. దానివలన మేమందరమూ ఉద్ధరింపబడుదుము" అని చెప్పిరి. –

వసుంధరా! పితరుల యొక్క మాటలను విని మేధాతిథి రాజు ఇంటికి తిరిగి వచ్చెను. పిమ్మట ఆయన తన పురోహితుడైన చంద్రశర్మను పిలిపించి ఆయనతో ఇంతకు ముందు చెప్పబడిన వృత్తాంతమును వివరించెను. అట్లే మరల శ్రాద్ధము పెట్టవలయునను

కోరికను వ్యక్తపరచి ఈ శ్రాద్ధము కొరకు కుండక, గోళకులను ఎవరినీ పిలువవలదు అని ఆయనకు నివేదించెను.

దేవీ! రాజు మేధాతిథి యొక్క ఆదేశము చేత పురోహితుడు చంద్రశర్మ బ్రాహ్మణులను పిలిపించి పిండదానము చేత శ్రాద్ధమును సక్రమముగా నిర్వర్తింపజేసెను. అంతేగాక బ్రాహ్మణులకు భోజనము పెట్టి, దక్షిణలను ఇచ్చి వారిని పూజించెను. దీని తర్వాత అందరిని వీడ్కొల్పి పిమ్మట తాను స్వయముగా ప్రసాదమును గ్రహించెను. అటుపిమ్మట రాజు మరల అడవిలోనికి పోయి ఆ అడవిలో తన పితరులు సంతోష సంతృప్తులుగా ఉండుటయూ అట్లే పరమ పరాక్రమ రూపమునందు ఉన్నవారిని చూచెను. అంతట ఆ రాజు యొక్క సంతోషమునకు హద్దులు లేకుండా పోయెను. ఆ సమయము నందు పితరుల యందు శ్రద్ధను ఉంచు మేధాతిథిని చూచి పితరుల యొక్క ముఖ మండలముపై అలముకొన్న ప్రసన్నతతో వారు "నీకు శుభమగుగాక! నీవు మాహితము కొరకు గొప్ప కార్యమును చక్కగా నిర్వర్తించితివి. ఇప్పుడు మేము స్వర్గమునకు పోవుచున్నాము" అని చెప్పిరి.

దేవీ! శ్రాద్ధమునందు సంకల్పింపబడిన అన్నపాత్ర బ్రాహ్మణులు లేకపోవుటచే ఆవులకు పెట్టవచ్చును. లేని యెడల ఆవులు లభించని యెడల యత్నపూర్వకముగా దానిని నదిలో వదలివేయవలెను. అంతేగానీ ఏదో ఒక ప్రకారము అపాత్రులు, నాస్తికులు, గురుద్రోహులు, గోళకులకు, కుండకులకు ఆ భోజనమును ఇవ్వకూడదు. భామినీ! ఈ ప్రకారముగా తను ఉద్దరణను ప్రదర్శించుచూ పితరులందరును స్వర్గమునకు పోయిరి. మేధాతిథి మహారాజు బ్రాహ్మణులతోపాటు తన నగరమునకు తిరిగి వచ్చెను. ఆయన పితరుల యొక్క ఆజ్ఞను యధావిధిగా ఆచరించెను.

దేవీ! ఇది దీనికొరకే నేను నీకు వివరించితిని. అనగా ఒక ఉత్తమ బ్రాహ్మణుడు లభించిననూ, ఆయనయే మొత్తము అగును. ఆయన కృపచేతనే యజ్ఞకర్త కష్టముల నుండి ఉద్ధరింప బడును. దీనియందు ఎట్టి సంశయమును అక్కరలేదు. అచ్చట ఒకరే విప్రదాతకు ఈ విధముగా పంపించి వేయుటలో సమర్థులు. అట్లే అగాధములో ఉన్న జలమును పారజేయుటకు ఒక నావ అగును. వసుంధరా! అందుచేతనే సుపాత్రుడైన బ్రాహ్మణునికి

మాత్రమే దానము ఇవ్వవలెను. దేవతలు, దానవులు, మానవులు, రాక్షసులు, గంధర్వులు, ఉరగములు అందరికినీ ఈ విధానము వర్తించును. (189)

190 వ అధ్యాయము - శ్రాద్ధము, పితృయజ్ఞ విధి, దాన ప్రకరణ

ధరణి ఇట్లు పల్కినది, భగవాన్! దేవతలు, మనుష్యులు, పశువులు, పక్షులు, ప్రభృతిగల అన్ని ప్రాణులు కాలవశమున ప్రేతములు అగును. అవి ఎన్నడునూ నరకమునకు పోవు. అయిననూ మరల సంసారమున ప్రవేశించుచున్నవి. ఇప్పుడు నేను ఒక విషయమును నీ నుంచి తెలుసుకొనవలయుననుకొనుచున్నాను. అది ఏమనగా పితరులుఎవరు? వారికి విధిపూర్వకముగా అర్పణ చేయుటచేత శ్రాద్ధ సంబంధ పదార్ధములు భోజనముకొరకు లభ్యములు అగుచున్నవా? ప్రత్యేక మాసమునందు సంకల్ప పూర్వకముగా అర్పించబడిన పిండము ఏపద్ధతిచే పితరుల వద్దకు చేరుచున్నది? పితృక్రియ చేత సంబంధము ఉంచుకొనువారు శ్రాద్ధమునందు ఏ పితరుడు భోజనము గ్రహించుటకు అధికారము గలవాడై ఉన్నాడు. ఈ విషయమును తెలిసికొనవలయునని నాకు మహా కుతూహలముగా ఉన్నది. దయతో నిర్ణయపూర్వకముగా తెలియజేయుడు" అని కోరెను.

వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. దేవీ! నీవు నన్ను అడిగిన విషయమును చెప్పుచున్నాను. పితృ సంబంధ యజ్ఞములందు భాగము పొందుటకు ఎవరు అధికారము కలవారో చెప్పుచున్నాను. ఆ విషయములను వినుము. తండ్రి, పితామహుడు (తండ్రి తండ్రి) ప్రపితామహుడు (ముత్తాత) వీరు పితరుల కొరకు పిండ సంకల్పము చేయవలెను. పితృపక్షము వచ్చిన యెడల నక్షత్రము, తిథులను తెలుసుకొని పితరులకు దానిని పుణ్య పర్వముగా భావింపవలెను. ఆ సమయములందు పిండదానము చేయుట చేత విశేషమైన ఫలము లభ్యమగును. శుభలోచనా! ఏ జ్ఞానవంతుడగు పురుషునికి, ఏ విధముగా శ్రద్ధా పూర్వక శ్రాద్ధము ఆచరించు విధానముకలదో దానిని అంతటిని నేను నీకు తెల్పుచున్నాను. నీవు సావధాన చిత్తురాలవై తెలిసి కొనుము. బ్రహ్మయజ్ఞము, దేవయజ్ఞము, భూతయజ్ఞము, మనుష్యయజ్ఞము అను అనేకవిధములైన యజ్ఞములు కలవు. కొందరు ద్విజాతి బ్రహ్మయజ్ఞమునందు, కొందరు గృహస్థాశ్రమమునందుండి భూతయజ్ఞము, అట్లే మనుష్యయజ్ఞము చేసి ఇష్ట దైవమును ఉపాసించుచున్నారు. ఇప్పుడు నేను పితృయజ్ఞమును వివరించుచున్నాను. వరారోహా! దానిని వినుము. ఎవరు నూరు యజ్ఞములు చేయుదురో

వారు నన్నే ఆరాధననే చేయుచున్నారు. నీకు నేను ఈ పూర్తి సత్యమైన విషయమును చెప్పుచున్నాను. వసుంధరా! హవ్యకవ్యములను గ్రహించుట కొరకు దేవతల యొక్క ముఖము అగ్ని. యజ్ఞమునందు ఉత్తరాగ్ని, దక్షిణాగ్ని, ఆహవనీయాగ్ని అను మూడు అగ్నులు ప్రయుక్త పడుచున్నవి. ఈ అగ్నులన్నింటి యందును నేను వ్యాపించి ఉన్నాను. ఇంకను సమస్త కార్యములందు అట్లే దేవ యజ్ఞములందు కూడా పవిత్రమైన రూపములో నేనే వ్యవస్థితుడనై ఉన్నాను. దేవ తీర్థములలో భిక్షుకులు, వానప్రస్థులు, సన్యాసులు అగు వారిని సత్కరించుట తగినది. కానీ శ్రాద్ధమునందు వీరికి భోజనము ఏర్పాటు చేయరాదు. ఎందుకనగా దేవతల నిమిత్తమే వీరి పూజ చేయు విధానము కలదు. ఇప్పుడు ఏ వ్రతము చేయువాడు బ్రాహ్మణ శ్రాద్ధము సందు నియంత్రణము చేయుట కొరకు యోగ్యుడో, ఆ నిర్దేశములను చెప్పుచున్నాను వినుము. ఎవరు తన ఇంటియందు ఎల్లప్పుడూ సంతుష్టుడుగా ఉండునో అట్లే క్షమాశీలురు, సంయములు, ఇంద్రియ విజయులు, ఉదాసీనులు, సత్యవాదులు, క్షత్రియులు, శ్రోత్రియులు వీరు ధర్మప్రచారకులు. ఇట్లు బ్రాహ్మణులను శ్రాద్ధము కొరకు తీసుకొనువారిగా పరిగణింపవలెను. మైథిలీ! వేద విద్యాపారంగతులు, స్వచ్ఛము, మధురమైన అన్నమును తినువారి యొక్క స్వభావము కలవారు అయిన బ్రాహ్మణులను పితృయజ్ఞ సంబంధము గల శ్రాద్ధమున భోజనము చేయు ఏర్పాటు చేయుట హితకరము. శ్రాద్ధమునందు అన్నింటి కంటే ముందుగా దేవతీర్థమునందు స్నానము చేయుట అవశ్యము. ముందుగా అగ్నియందు, హవనము వ్రేల్చి తరువాత విధిని పాటించుచూ, పితరుల నిమిత్తము బ్రాహ్మణుల ముఖమునందు హవనము చేయుట ఉచితమైనది.

దేవీ! బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులు అను ఈ నాలుగు వర్ణమలు శ్రాద్ధము నిర్వహించుటకు అధికారము గలవారు. శ్రాద్ధపదార్థములను కుక్కలు, జింకలు, పందులు మొదలైన అపవిత్ర జంతువులు, వ్యక్తులు చూచుటకు వీలు లేదు. తమ శ్రేణి నుంచి చ్యుతులైనవారు, సంస్కారము పొందని వారు అన్ని విధములైన అకార్యకర్మములు చేయు చుండువారు అట్లే సర్వభక్షకులు ఇట్టి బ్రాహ్మణులను పితృయజ్ఞములకు సంబంధించిన శ్రాద్ధమును చూడనీయరాదు. ఒకవేళ ఇట్టి బ్రాహ్మణుల దృష్టి శ్రాద్ధముపై పడిన యెడల దానిని ఆసురీశ్రాద్ధము అందురు. చాలాకాలము క్రిందట నేను ఇంద్రుని కార్యము సిద్ధము

చేయుట కొరకు వామనావతారమును ఎత్తితిని. ఇట్టి శ్రాద్ధములను నేను బలికి ఇచ్చియుంటిని. అందువలన విద్వాంసులైన పురుషులు కావలెను. పితృయజ్ఞమునందు ఇట్టి బ్రాహ్మణులను కలిపివేయరాదు. ఎచట సర్వసాధారణ దృష్టి పడదో అట్టి స్థానము నందు పవిత్రులై తర్పణ పూర్వకముగా బ్రాహ్మణునికి శ్రాద్ధమున భోజనమును చేయనీయ వలెను. భూదేవీ! మంత్రమును చదివి, పితరులను ఆవాహనము చేసి మూడు పిండములను ఇవ్వవలెను. ఈ పిండములకు అధికారి తండ్రి, తాత, ముత్తాతలే. ప్రతి నెలయందు అపసవ్యముగా వీనికి తిలోదకము, పిండ దానములను కల్పించవలెను. మరల వైష్ణవీ, కాశ్యపి, అజయ, ఈ పేర్లను ఉచ్చరించి తలవంచుకొని మీకు కూడా ప్రణామము చేయవలయును.

దేవీ! ఈ విధముగా పిండదానము చేయుటచే పితరులు ప్రసన్నులై పోవుదురు. ఇందు ఎట్టి సందేహము లేదు. సృష్టి యొక్క ప్రారంభమునందు ముగ్గురు పురుషులు పితరుల రూపములో ప్రత్యక్షమైరి. పిండములే వారికి ఆహారముగా ఉండెను. దేవతలకు అసురులు యక్ష, రాక్షస, గంధర్వ పన్నగులు వీరందరూ వాయురూపమును ధరించి పితృయజ్ఞము చేయువారగు పురుషుల శ్రాద్ధక్రియ యొక్క దోషములపై దృష్టి సారించి ఉంచుదురు. ఇది నిశ్చయము. వివేకి అయిన వ్యక్తి, పితృయజ్ఞమును చేసిన అతనిని పితరులు కృపతో ఆయువు, కీర్తి,బలము, తేజస్సు, ధనము, పుత్రులు, పశువులు, స్త్రీలు అట్లే ఆరోగ్యము ఎల్లప్పటికిని సులభము అగును. ఇందులో ఎట్టి సంశయము లేదు. ఇదియే కాదు. తన ఈ ఉత్తమకర్మ యొక్క ప్రభావము చేత ఆ మనుష్యుడు పరమ పవిత్రమైన లోకములకు అధికారుడు అయిపోవుదురు. ఇంకనూ ఆ ప్రేతములు పశుపక్షుల యోని యందుపడవు. అట్టి పురుషుడు నరకమునకు పోయి ఉన్న తమ పితరులను ఉద్దరించుట యందు సంపూర్ణముగా సమర్ధులగుదురు. దేవతలను అట్లే పితరులను ఉపాసించు మనుష్యుడు గృహస్థాశ్రమము నందు ఉండుచు కూడా పూర్తి విధితో ద్విజాతి వర్గము వారి యొక్క పితరులను తృప్తిపరచుదురు. శ్రాద్ధమునందు తృప్తులైన పితరులు ఆ ప్రాప్తి వస్తువును నాశనము లేనిదానిగా పరిగణింతురు. ఎవరికి పితరులపై శ్రద్ధ కలదో వారికి కూడా పరమగతులు కల్గును. ఈ విధములైన జ్ఞానపూర్ణజనులు, మృత్యువునకు తర్వాత సత్త్వగుణముచే సంపన్నులై శుక్లమార్గము వెంట ప్రయాణము చేయుదురు.

ధరణీ! ఎవరి మనస్సుపై అజ్ఞానపు ఆవరణ కలదో ఎవరు కృతఘ్నులు, ప్రచండ మూర్ఖులు, అయి ఉండిరో అట్టి మనుష్యుని స్నేహమయములైన వందలకొలది తాళ్ళతో బంధించి భయంకరమైన నరకములో పడవేయుదురు. ఇంకనూ ఏ మానవుడు కల్పపర్యంతము వరకు నరకమునందు పడవేయుదురో వారి పుత్రులు కూడా లేక పౌత్రులు చెప్పబడిన శ్రాద్ధక్రియను చేసిన వారి ప్రభావముచే ఆ ప్రాణులకు సద్గతి కలుగును. అమావాస్యకు ఎవరు జలాశయమునకు పోయి పితరుల నిమిత్తము బిందు మాత్రమైననూ జలమిచ్చుచున్నారో అతనికి, నరకమునందు గల పితరులకు కూడా తృప్తి లభ్యము కాగలదు. ఏ ద్విజాతి వర్ణ పురుషులు పితరుల కొరకు భక్తి పూర్వకముగా తర్పణ, తిలాంజలి అటే పిండపాతము మొదలైన శ్రాద్ధకార్యమును నెరవేర్చునో అట్టి వారి పితరులకు నరకము సంభవించుదు. ఇంకనూ వారు శాశ్వతముగా తృప్తులు అగుదురు. శ్రాద్ధమునందు మేడి కట్టెతో చేయబడిన పాత్రయందు తిలలు, జలముచేత తర్పణము వదలుటయందు గొప్ప మహిమ కలదు. పితరుల యొక్క ఉద్ధరణ చేయుటచే బ్రాహ్మణుల యొక్క మాటలపై శ్రద్ధ వహించి అట్లే తమ వైభవమును అనుసరించి వారికి దక్షిణలు ఇచ్చుట పరమ ఆవశ్యకము. నల్లనిది, వేగము గలది, పరుగెత్తు ఒంటెను వదలుటచే లభ్యమగు పుణ్యము భూమండలముపై కలుగు పుణ్యము యొక్క ప్రభావము చేత పితరులు అరవై ఆరువేల సంవత్సరముల పాటు చంద్రలోకమునందు ఆనందపూర్వకముగా నివాసము ఉందురు. వారికి ఆకలి దప్పికలు కలుగవు. శ్రాద్ధతర్పణము గృహస్థులకు అత్యంతము నిర్వర్తింపవలసిన ధర్మము. చీమలు మొదలగు జంగమ ప్రాణులు, అట్లే ఆకాశమునందు విహరించు జీవములు గృహస్థుల యొక్క ఆశ్రయముపై బ్రదుకుచుండును. ఇందులో సంశయము లేదు. గృహస్థాశ్రమమే అన్ని ధర్మములకు మూలము. అన్ని వర్ణముల వారును అట్లే ఆశ్రమముల వారును గృహస్థుల పైననే ఆధారపడి ఉన్నారు. ఈ ఆశ్రమమునందు ఉందు వ్యక్తులు ప్రతి మాసము పర్వముల యందు అట్లే ప్రత్యేక నిర్దిష్ట విధిపై శ్రాద్ధము చేయుచుందురు. వారి ద్వారా పితరులకు నిశ్చయముగానే ఉద్ధరణ జరుగును. గృహస్థుని యొక్క ఇంటియందు ధర్మపూర్వక శ్రాద్ధమును నిర్వర్తించుట చేత ఎట్టి ఫలము లభ్యమగునో అట్టి ఫలము యజ్ఞదాన అధ్యయన ఉపవాస తీర్థ స్నాన అగ్నిహోత్రము వంటి విధిపూర్వక మైన అనేక విధములైన

దానముల చేత కూడా లభ్యము కావు. బ్రహ్మ, విష్ణు, రుద్రుల యొక్క శరీరమునందు ప్రతిష్ఠులైయున్న పితృగణములు, తండ్రి, పితామహ, ప్రపితామహుల రూపము చేత కనిపించువారై విరాజిల్లుదురు. కశ్యపుడు వారి జనకుడు. మొదట ఎన్నడునూ అగ్నియందు హవనము చేయకుండా, బ్రాహ్మణ ముఖమునందు హవనము చేయబడిన, అనగా బ్రాహ్మణునిచేత భోజనము చేయింపబడినది, భూమిపై కుశలు పరచి పిండ సంకల్పము చేసి వానిపై ఉంచబడును.ఆ పిండము చేత పితృదేవతలకు అజీర్ణము ఏర్పడెను. వారికి గొప్ప బాధ కలిగెను. వారు భోజనము తినుటను వదలివేసిరి. దుఃఖము చేత అత్యంత అసంతప్తులై వారు సోమదేవుని వద్దకు పోయిరి. సుశ్రోణి! అజీర్ణము చేత దుఃఖితులైన ఆ పితరులపై చంద్రుని దృష్టి పడినది. అందుచే చంద్రుడు మధురమైన వాక్యము లతో వారిని స్వాగతించెను.

సోముడు ఇట్లు అడిగెను."పితరులారా! మీ ఈ దుఃఖమునకు కారణమేమి? దానిపై పితరులు సోమదేవా! మీరు మా మాటలు విని దయ చూపుడు. బ్రహ్మ, విష్ణు, శంకరుని శరీరము నుంచి ఉత్పన్నములైన మేము ముప్వరము పితృదేవతలము. శ్రాద్ధమునందు మేము నియుక్తులము కాబడితిమి. పుత్రులు మొదలగు వారి ద్వారా అర్పింపబడిన పిండముల చేత మేము అత్యంత తృప్తులము అయితిమి. కానీ నేడు మాకు అజీర్ణము కలిగినది. దీని వలన మేము దుఃఖము పొందుచున్నాము." అని పల్కిరి.

సోముడు ఇట్లు చెప్పెను. "పితృగణములారా! నేను మీ మిత్రుడను అగుదును. ఇప్పుడు మీరు ముగ్గురునూ ఉండరు. ఒక నాల్గవ పితరుడనుగా నేను చేయబడితిని. ఇప్పుడు మనము అందరమును ఎచ్చట మనకు క్షేమము కల్గునట్టి అవకాశము కలదో అచటికి పోవుదుము." వసుంధరా! సోముడు ఈ విధముగా చెప్పుట చేత ఆ పితరులు ఆయన వెంట సుమేరు పర్వత శిఖరమునకు పోయిరి. అచట లోకపితామహుడగు బ్రహ్మ బ్రహ్మర్షుల చేత సేవించబడుతూ సుశోభితుడుగా ఉండెను. అందరునూ ఆయనకు ప్రణామము చేసిరి. మరల సోముడు వారితో "భగవాన్! ఈ పితరులు అజీర్ణము చేత పీడింపబడుచూ, మిమ్ములను శరణు వేడుటకు వచ్చిరి. నీవు దయతో వారి క్లేశమును నాశనము చేయు విధము తెలియ చేయుడు." అప్పుడు ఒక ముహూర్తకాలము వరకు పరమ యోగీశ్వరుడైన భగవంతుడు శ్రీహరి యొక్క ధ్యానమునందు బ్రహ్మ నిమగ్న

డయ్యెను. అంతట శ్రీహరి భగవానుడు ప్రత్యక్షమై వారితో "ఇది నా వైష్ణవీమాయ యొక్క ప్రభావము. ఇంతకు ముందు గల దేవతలు ఇప్పుడు పితరుల రూపములో కన్పించు చున్నారు. నా అంగముల నుండి వెలువడిన పితబ్రహ్మ యొక్క రూపము, పితామహుడు విష్ణువు యొక్క రూపమును, అట్లే ప్రపితామహుడు రుద్రుని యొక్క రూపమును పొందిరి. మర్త్య లోకమునందు శ్రాద్ధ సమయమునందు వీరు పితృ దేవతల యొక్క రూపములో నియమింపబడుట జరిగెను. బ్రాహ్మణుల యొక్క హితము కొరకు విష్ణుమాయ యొక్క ఆజ్ఞచేత ప్రజలు వీరిని పితృయజ్ఞముల ద్వారా తృప్తిపరచు చున్నారు. ఇప్పుడు నేను వారి అజీర్ణము దూరమగు ఉపాయమును తెలియజేయుచున్నాను. ధూమ్రకేతువు, విభావసుడు (అగ్నికి మరియొక పేరు) అను పేరుచే శాండిల్య మహామునికి తేజశ్వంతులైన ఇద్దరు పుత్రులు కలరు. మానవ మాత్రుల కొరకు వారు శ్రాద్ధము చేయు సమయమునందు ముందుగా అగ్నికి భాగమిడి, శేష పిండమును ఆ తేజశ్వంతుడైన విభావసునితో కలిపి పితరులకు అర్పణము చేయుదురు గాక!

పరమప్రభువైన విష్ణువు యొక్క కథనముపై బ్రహ్మ మనసులోనే హవ్యవాహను డైన అగ్నిని ఆవాహనము చేసెను. ఆయనను స్మరించినంత మాత్రము చేతనే సర్వభక్షకుడైన అగ్నిదేవుడు వారి వద్దకు వచ్చెను. అగ్ని యొక్క శరీరము ప్రచండ తేజముతో ఉద్దీపమగు చుండెను. నా ప్రేరణచేత బ్రహ్మవారిని ఐదువిధములైన యజ్ఞములలో భాగము పొందుటకు అధికారము గలవారిగా చేసి అగ్నితో ఇట్లు చెప్పెను. "హుతాశనా! నీవు బ్రహ్మ స్వరూపుడవు." పితరుల నిమిత్తము శ్రాద్ధమునందు సమర్పింపబడిన పిండభాగము నందు "ఓం అగ్నయే కవ్యవాహనాయ స్వాహా" అను ఈ మంత్రము ద్వారా సర్వ ప్రథమముగా నీవే భాగము పొందుటకు అధికారము ఇవ్వబడుచున్నావు. నీ తర్వాత మరుద్గణ సహిత దేవతల యొక్క భాగమును పొందుటకు అధికారము పొందుదురు. మీరందరునూ స్వీకరించి తీసుకొనిన తర్వాత, అన్నము పితరుల కొరకు పథ్యస్వరూపముగా అగును. ఇంకనూ సోమసహిత పితరుడు దానికి అధికారులు అగుదురు.

వసుంధరా! బ్రహ్మయొక్క ఈ ఏర్పాటుచేత అగ్నిదేవుడు, పితరులు, శ్రాద్ధమునందు భాగము కలవారైరి. అప్పటి నుండి అగ్ని సోమునితో పితృయజ్ఞమునందు అందరు పితరులతో భోజనము చేయుటకు శాశ్వతమైన నియమముగా ఏర్పరిచిరి.

జగత్తునకు ఆశ్రయము ఇచ్చునట్టి పృథ్వీదేవీ! ఈ నియమమును అనుసరించి పితరుల నిమిత్తము శ్రాద్ధము పెట్టు సమయమున సర్వ ప్రథమ పిండము అగ్నికి సమర్పించి, పిమ్మట పితరులను తృప్తి చెందింపవలయును. వసుంధరా! ఈ విధముగా ఏ మనుష్యుడు మంత్రములను ఉచ్చరించి, విధానము ప్రకారము పితరుల కొరకు శ్రాద్ధము నిర్వహించుచున్నాడో అట్టి ఆ పితరులు తృప్తులై తమ కరుణ చేత నిరంతరము సుఖ సమృద్ధియందు భాగము కలవారు అగుచున్నారు.

దేవీ! ఇప్పుడు శ్రాద్ధము యొక్క శ్రేణియందు నిందింపదగినవారు ఆ బ్రాహ్మణులను వివేచనము చేయుచున్నాను వినుము. నపుంసకులు, చిత్రకారులు, పశుపాలురు, చెడు మార్గమునందు పోవువారు, నల్లని దంతములు కలవారు, ఏకాక్షులు (ఒక కన్ను మాత్రమే కలవారు) లంబోదరులు, నాట్యము చేయువారు, గాయకులు, వస్త్రములకు అద్దకము వేయుట ద్వారా జీవనము గడుపువారు, వేదవిక్రయులు (వేదమును ధనము తీసుకొని నేర్పువారు) అన్ని వర్ణముల వారి చేత యజ్ఞము, చేయించువారు, రాజ సేవకులు, వ్యాపార నిమిత్తము కొనుగోళ్ళు, అమ్మకము చేయువారు, బ్రహ్మయోనియందు ఉత్పన్నులైనవారు, నిందకులు పతితులు, సంస్కార రహితులైన గణకులు, గ్రామములలో తిరిగి యాచించు వారు, దీక్షితులు, కాండపుషులు అనగా శాస్త్రమును తీసుకొని తిరుగుచుండు వారు వడ్డీ పై ఆధారపడి జీవించువారు, రసపదార్థములను అమ్మువారు, వేశ్యావృత్తిచే జీవించువారు, చోరులు, వ్రాయసగాండ్లు, యాచకులు, శాండికులు, అనగా సారాయి తయారు చేయువారు, గైరుకులు, ఒకరకమైన వస్త్రములు తయారుచేయువారు, దంభ, అన్ని వర్గములకు సంబంధించిన కార్యమునందు నిమగ్నులై అన్ని వస్తువులను అమ్ముటయందు నేర్పుకలవారు. ఈ బ్రాహ్మణులందరూ శ్రాద్ధకర్మము కొరకు నింద్యులుగా భావింపబడుచున్నారు. వీరికి పితరుల నిమిత్తము ఉద్దేశింపబడిన శ్రాద్ధమునందు భోజనము చేయించుటకు అర్హత గలవారు కారు. పండిత వర్గమువారు ఎవరు జీవనము కొరకు దూరముగా పోవుదురో, రసపదార్థములను అమ్ముదురో అట్లే ధూర్తులు, నల్లనువ్వులను అమ్మువారు మొదలగు వృత్తులలో ఉన్న బ్రాహ్మణులు శ్రాద్ధమునందు సమ్మిళితము అయిన యెడల ఆ శ్రాద్ధము రాజసము అని చెప్పబడెను. దేవీ! ఇవికాక నేను ఏఏ నిందితులైన బ్రాహ్మణులను తెల్పితినో ఆ అందరు బ్రాహ్మణులు రాజసగుణములు

కలవారు. మాధవీ! శ్రాద్ధ సంబంధమైన క్రియలయందు పితరులకు పిండదానము చేయు సమయమున ఇట్టి పంక్తి దూషితులు (పంక్తి బాహ్యులు) అయిన బ్రాహ్మణులను చూచుటకు కూడా రానివ్వకూడదు. ఒకవేళ ఇట్టి బ్రాహ్మణులు శ్రాద్ధమునందు భోజనము చేసిన ఎడల వానిపై శ్రాద్ధకర్త యొక్క దృష్టి పడిన, ఆయన పితరుడు ఆరు నెలల పర్యంతము దారుణ దుఃఖమును అనుభవించును. వసుధా! ఎచటనైననూ ఇట్టి తప్పు జరిగిన యెడల శ్రాద్ధకర్త, భోక్త ఇద్దరికినీ ఎంత తొందరలో వీలైన అంత త్వరగా ప్రాయశ్చిత్తము చేసుకొనుట అత్యంతా వశ్యకము. ప్రాయశ్చిత్తము స్వరూపము ఏమనగా బాగుగా మండుచున్న అగ్నియందు ఘృతమును హవనముగా చేసి సూర్యదర్శనము, శిరోముండనము, పితాపితామహులు మొదలగువారికి మరల గంధ, పుష్ప, ధూపము మొదలగు వానిచే పూజ అర్ఘ్యము, తిలోదకముల దానము చేయవలెను. ఇట్టి వానిని విధిప్రకారము చేసి తాను పవిత్రుడై ఆ బ్రాహ్మణ భోజనము మొదలైనవి చేయించవలెను.

సుందరీ! ఇప్పుడు మరల వేరొక విషయమును తెల్పుచున్నాను వినుము. జ్ఞానము చేత ఎవని అంతఃకరణము పవిత్రమైనదో ఆ బ్రాహ్మణుడు విధిని అనుసరించి మంత్ర శుద్ధి చేసుకొనవలెను. ఎవరైననూ ఎన్నడైననూ మృతుడైన సంబంధిత వ్యక్తి యొక్క అన్నమును తినకుండా ఉండునో, అట్టి బ్రాహ్మణునికి వైశ్వ దేవ నిమిత్తమైన భాగమును ఇవ్వవలెను. అతడిని శ్రాద్ధమునందు భోజనము చేయించుట అనుచితము. ఏ బ్రాహ్మణుడు శ్రాద్ధము నందు ప్రేతాన్నమును తినునో అతడికి కలుగు దోషమును చెప్పుచున్నాను వినుము. ప్రేతాన్నమును తినిన ప్రభావముచే ఆ దంభ మనుష్యునికి నరకమునకు పోవలసి వచ్చును. అట్లే ద్విజాతి పురుషుని కర్తవ్యము ఏమనగా మాఘమాసమునందలి ద్వాదశీ తిథి యొక్క పుష్య నక్షత్రమున తేనె, పండ్లతో పితరులను తృప్తిపరచి, ఘృతయుక్త పాయసమును తినవలెను. "నాకు పవిత్రతాప్రాప్తి కలుగుగాక!" అను సంకల్పము చేత అతడు కపిలగోవును దానము ఇచ్చి, అట్లే తన శుభము కొరకు కోరికతో పితృశ్రాద్ధమును నిర్వర్తింపవలెను. ఇద్దరు బ్రాహ్మణులకు భోజనము పెట్టించి పాపవిసర్జనము చేయవలెను.

విశాలాక్షీ! అమావాస్య తిథికి దంతధావనము చేయుట సుమారుగా అందరికినీ నిషిద్ధమైనదే. బుద్ధిహీనుడైన వ్యక్తి అమావాస్యనాడు దంతధావనము చేసిన వానికి ఈ కర్మచేత చంద్రుడు, దేవతలు, పితరులు కష్టమును అనుభవింతురు. రాత్రి గడచిపోయిన

తర్వాత ప్రాతఃకాలమున సూర్యుని కిరణములు ప్రకాశించుట మొదలైన సమయమున పగటిపూట చేయవలసిన పనులను ఆరంభింపవలెను. ఈ పని చేసి బ్రాహ్మణుని విధులు చేయుటయందు సంపన్నులుగా చేయవలెను. పితరుల యెడ శ్రద్ధను ఉంచు మానవుడు జుట్టు క్షౌరము చేయించుకొనుట, గోళ్ళు తీసుకొనుట నూనె పూసుకొని స్నానము చేయుట తర్వాత పక్వాన్నమును తయారు చేయించుట చేయవలెను. వంట పూర్తయిన తర్వాత పగటి మధ్యకాలమునందు శ్రాద్ధక్రియ నిర్వర్తించుట విధి. మరల తీర్థము యొక్క శుద్ధ జలముచేత బ్రాహ్మణునికి పాద్యమిచ్చి మండపమునందు ప్రవేశింపజేసి విధిపూర్వకముగా అర్ఘ్యపూర్వకముగా చందనము పుష్పమాలలు, ధూపము, దీపము, వస్త్రములు, తిలలు, ఇంకనూ జలము చేత పూజింపవలెను. మరల భోజనము కొరకు ఎదుట పాత్రను ఉంచి భస్మము చేత మండలమును తయారు చేయవలెను. వేరు వేరుగా మండలములు ఉండుట చేత పంక్తిదోషము ఏర్పడదు. మరల అగ్ని సంబంధకార్యములను పూర్తి చేసి అన్న పరివేషణము చేయవలెను.సపాత్రక శ్రాద్ధమునందు పితరులను ఉద్దేశించి సంకల్పము చేయనవసరము లేదు. దీనియందు కేవలము బ్రాహ్మణునికి "ద్విజదేవా! విద్వాంసులైన పురుషులు భోజనము చేయు సమయమునందు "రక్షోఘ్న" మంత్రమును కూడా పఠింప వలెను. బ్రాహ్మణుడు తృప్తి పడిన తర్వాత అన్న వితరణ చేయుట విధానము. దీని పిమ్మట మరియొక ఆసనము ఇచ్చి పిండమును ఈయవలెను. భూమి మీద కుశలను పరచి దక్షిణము వైపు ముఖమును ఉంచి పితా, పితామహుడు, ప్రపితామహులు ఈ పితరుల కొరకు పిండమును అర్పించవలెను. మరల తన సంతానవృద్ధి కావలెనను ఉద్దేశముతో విధిపూర్వకముగా వారిని పూజింపవలెను. పూజకు చివరగా బ్రాహ్మణుని చేతియందు అక్షయ్యోదకమును ఇవ్వవలెను. బ్రాహ్మణుడు సంతుష్టుడైన పిదప స్వస్తివాచన పూర్వక విసర్జనము జరుపవలెను. వసుధా! మూడు పిండములు నేలమీద ఉన్నంతకాలమును పితరులకు సుఖము లభ్యమగుచుండును.

మరల శ్రాద్ధకర్త ఆచమనము చేసి, పవిత్రుడై శాంతి నిమిత్తక జలమును ఈయవలెను. ఎచ్చట పిండపాతము జరిగినదో, ఆ భూమిని వైష్ణవి! కాశ్యపీ, అక్షయ అను పేర్లను ఉచ్చరించి తలవంచి నమస్కారము చేయవలెను.మొదటి పిండమును స్వయముగా గ్రహింప వలెను. రెండవది భార్యకు ఇవ్వవలెను. మూడవ పిండమును నీటిలో పడవేయ

వలెను. ఇట్లు పితరులకు ప్రణామము చేసి, పితరులను, దేవతలను విసర్జింపవలెను. ఈ విధముగా పిండదానము చేయుటచే పితృదేవుడు ప్రసన్నుడు కాగలడు. ఇందు ఎట్టి సంశయమును లేదు.ఆ పితరుల దయచేతనే దీర్ఘాయుష్షు, పుత్రపౌత్ర వంశాభివృద్ధి, అట్లే సంపద అభివృద్ధి కలుగును.సమయమునందు ఉత్తములైన జ్ఞానులైన బ్రాహ్మణులు, అట్లే యోగులను కూడా పిలిచి శ్రాద్ధ సంబంధ వస్తువులను సమర్పించవచ్చును. లేని ఎడల అతడు శ్రాద్ధఫల ప్రదానము చేయుటయందు అసమర్థుడు అగును. ఇందు ఎట్టి సంశయములేదు. (190)

191, 192 వ అధ్యాయములు - మధుపర్క విధి, శాంతిపాఠ మహిమ

పృథ్వి ఇట్లు అనినది. "భగవాన్! నీ నుంచి నేను అనేక విషయములను విని ఉంటిని. ఎంత వినిననూ నాకు తృప్తి కలుగుట లేదు. ఇప్పుడు నాయందు దయ ఉంచి నీవు మధుపర్కము అనగా ఏమి? దానిని ఏ ఏ పదార్థములతో, ఏ పరిమాణములో కలుపుదురో దానిని అర్పించు విధానము ఎట్టిదో దయతో నాకు తెలియజేయుడు."

ఆ మాటలను విని వరాహుడు ఇట్లు చెప్పెను. "దేవీ! నేను మధుపర్కము యొక్క ఉత్పత్తి, దానిని ప్రదానము చేయు విధానము తెల్పుచున్నాను. వినుము. మధుపర్క ప్రదానము వలన సమస్త అరిష్టములు దూరమైపోవును. ఈ విశ్వమును సృష్టించినప్పుడు నా దక్షిణ శరీరమునుండి ఒక పురుషుడు ప్రాదుర్భావ మయ్యెను. అతడు గొప్ప రూపవంతుడు, ద్యుతిమంతుడు, శ్రీమంతుడు, కీర్తిదాయకుడుగాను ఉండెను. అతనిని చూచి సృష్టికర్తయగు బ్రహ్మదేవుడు "ప్రభూ! ఇతడు ఎవరు? అని అడిగెను. అప్పుడు నేను ఇతడు మధుపర్కము. నా శరీరము నుండియే ఉత్పన్నమైనవాడు. అందుచే ఇతడు నా భక్తులను సంసార జంజాటము నుంచి ముక్తి కల్గించును. నా ఆరాధనా సమయమున, ఈ మధుపర్కమును అర్పించు మనుష్యునకు అతడు సర్వశ్రేష్ఠ స్థానము ప్రాప్తింపజేయును. ఎచ్చటకు పోయినను, ప్రాణికి శోకము కలుగదు." అన్నాను. ఇప్పుడు నేను మధుపర్క నిర్మాణము, దానవిధిని కూడా తెల్పుచున్నాను. ఈ మధుపర్కప్రదానము చేయుట ద్వారా మానవుడు నా దివ్య ధామమునకు చేరుకొనగలడు. సర్వశ్రేష్ఠమైన సిద్ధిని పొందవలెనను అభిలాష ఉండిన యెడల, తేనె, పెరుగు, నెయ్యి మొదలగు వానిని సమాన భాగములుగా తీసుకొని, మంత్రములను చదువుచూ విధిపూర్వకముగా కలుపవలెను. ఏ మానవుడు ఈ

మధుపర్క విధాన విధిని పాటించెనో అతడు నాకు పరమప్రియుడు అగును. పిమ్మట మధుపర్కమును చేతియందు ఉంచుకొని, “ఓంకారస్వరూపా! భగవాన్! ఈ మధుపర్కము నీకు సమరింప బడుచున్నది. మీరు దీనిని స్వీకరించి, నన్ను మీ దయకు ప్రాప్తుని చేయుడు. ఇది మీ విగ్రహము నుంచియే ప్రత్యక్షమైనది. ఈ ప్రపంచమునుండి ముక్తి పొందుటకు ఇది పరమసాధనము. భక్తిపూర్వకముగా నేను దీనిని తమ సేవకొరకు సమర్పించుచున్నాను. దేవేశ్వరా! నేను మీకు వందమార్లు నమస్కారములు అర్పించుచున్నాను” అనెను.

సూతుడు ఇట్లు చెప్పెను. “ఋషులారా! మధుపర్కము యొక్క ఉత్పత్తి దీనిని దానము చేయుటచే లభ్యమగు పుణ్యఫలము, అట్లే దానిని అనగా మధుపర్కమును స్వీకరించవలసిన ఆవశ్యకతను విని శాంతిపాఠ సహితముగా ఉత్తమ వ్రతమును పాటించు ధరణీమాతకు చాలా ఆశ్చర్యము కలిగెను. అనంతరము ఆమె వరాహమూర్తి పాదములను స్పృశించి ఇట్లు పలికెను. “భగవంతుడా! మీకు ప్రియమైన మధుపర్కము అను పదార్థమును మీ యందు అధికశ్రద్ధగల భక్తుడు ఏ విధముగా అర్పణ చేయవలెను? భక్తితో ఈ మహాకార్యమును చేయు విధానవిధిని తెలుపగోరుచున్నాను” అని ప్రశ్నింపగా వరాహభగవానుడు ఇట్లు చెప్పెను.

“మహాభాగురాలా! నేను సమస్త వృత్తాంతమును చెప్పుచున్నాను. వినుము. దీని ప్రభావము చేత మానవుడు దుఃఖరూపుడై ఈ లోకమునుండి ముక్తి పొందును. నీవు మొదట ఏ విషయమును చర్చించితివో దానిని నాపై భక్తిగల వ్యక్తి సన్మానము చేసి శాంతి పాఠమును చదివి సంపన్నము చేయును. శాంతిపాఠము పఠించిన తర్వాత నాపై భక్తి నిమగ్నులైన పురుషులు నాకు జలాంజలిని సమర్పించి, మరల ఈ భావము వచ్చు మంత్రమును పఠింపవలెను. మంత్రము యొక్క భావము ఇది. “భగవంతుడా!ఎవని ద్వారా లోకసృష్టి జరుగుచున్నదో, దేవసంబంధ యజ్ఞములందు జరుపు కర్మకు ఎవరు సాక్షియో అట్టివాడవు నీవే. నాకు శాంతి ప్రదానము చేయుటచే, వెనువెంటనే సంసారము నుంచి చేయు రాకపోకల నుండి ముక్తిని కలిగింపుము.” పృథ్వీ! ఇది సిద్ధి, కీర్తి, బలములయందు మహాబలము, లాభములయందు పరమ లాభము, గతులయందు పరమగతిగా ఉండును. ఇట్టి శాంతిపాఠమును అర్థపూర్వకముగా ఎవరుపఠింతురో, వారు నాలో లీనమైపోవుదురు. అతనికి ఈ ప్రపంచమునకు మరల వచ్చుట జరుగదు. ఈ విధముగా శాంతిపాఠమును

పఠించి నాకు మధుపర్కము నివేదింపవలెను. "ఓం నమోనారాయణాయ" అని ఉచ్చరించుట మంత్రము విధానము. మంత్రము యొక్క భావము ఇది. "భగవాన్! నీవు సర్వశ్రేష్ఠులైన దేవతలను కూడా సపించువాడవు. మధుపర్కమను పేరు గల పదార్థము నీకు సంబంధముగలదె. అన్ని పదేశములలో, అన్ని సమయములలో అందరిచే బాగుగా పూజింపబడువాడువు. నీవే! నీవు సంసార సాగరమునుండి నన్ను ఉద్ధరించుట కొరకు ఇచ్చట ఉండుటకై ఈ పాత్రలయందు విరాజమానుడవు కమ్ము."

సుశ్రోణీ! మేడికర్రతో తయారు చేయబడిన పాత్రయందు నేయి, పెరుగు, తేనెలను సమాన పాళ్ళలో కలిపి మధుపర్కమును తయారు చేయవలెను. ఒకవేళ తేనె దొరకని యెడల, కలుపలేకపోవుటచే దానికి బదులుగా బెల్లమును కలుపవచ్చును. నేయి లేని సమయమునందు దానికి బదులు ధాన్యము యొక్క పేలాలను కలుపవచ్చును. పెరుగు లభ్యము కాని యెడల పాలనే కలుపవలెను. ఈ విధముగా పెరుగు, తేనె, ఘృతములను సమాన పాళ్ళలో కలిపి మధుపర్కము తయారుచేయవలెను. కొన్ని గ్రంథములలో పెరుగు, తేనె, జలము, బెల్లము, నేయి. ఈ అయిదింటిచే మధుపర్కము చేయవలెనని కలదు. మనుస్మృతి, ఆపస్తంబధర్మ సూత్రములు, మొదలగువానిలో ఇట్లు కలదు. అంతేగాక దానిని ఈ విధముగా భగవంతునికి అర్పించవలెను. "దేవేశా! రుద్రుడు కూడా నీ రూపమే. నేను, పెరుగు, నేయి, తేనెలతో తయారు చేయబడిన ఈ మధుపర్కమును నీకు సమర్పించు చున్నాను" అని పలుకవలెను. ఒకవేళ అన్ని వస్తువులు లేనిచో అప్పుడు శ్రద్ధాళువైన భక్తుడు కేవలము నీటిని మాత్రమే చేతులలోకి తీసికొని ఈ మంత్రమును పఠింపవలెను. "ఏ ప్రభువు యొక్క నాభి నుంచి వెలువడిన కమలముపై ప్రపంచ సృష్టి ఆధారపడి ఉన్నదో అట్లే యజ్ఞములు, మంత్రములు, రహస్య యుక్త జపములతో ఎవరి అర్చన చేయబడుచున్నదో వాడవు నీవే! భగవంతుడా! ఈ మధుపర్కము నీతో సంబంధము కలది. ఈ దివ్య పదార్థమును నీవు స్వీకరించి మాపై దయచూపుము". భగవతీ! ఈ మధుపర్కమును అర్పించిన వానికి యజ్ఞ సంబంధమైన సర్వ ఫలములు ప్రాప్తించును. పిదప అతడు నా లోకమునకు వెడలిపోవును.

పృథ్వీ! ఇప్పుడు మరియొక విషయమును వినుము. నా కర్మయందు నిమగ్నులై ఉన్న వ్యక్తులకు ప్రాణము పోవు సమయమునందు ఈ విధముగనే చేయవలెను. అతడి

ప్రాణయాత్ర సమయమునందు విధిపూర్వకముగా మంత్రములను ఉచ్చరించుచూ ఈ ప్రపంచములోనే ఇది మధుపర్కము ఇచ్చు విధానము. ప్రాణము పోవు సమయమునందు అనేక కర్మలను చేయవలసి ఉండును. నా భక్తుడు మరణాసన్న (మృత్యువు సమీపించి ఉన్న) వ్యక్తికి సంపూర్ణముగా లోకమునుండి ముక్తి కల్గించు మధుపర్కము తప్పక ఇవ్వవలయును. ఎప్పుడు ఒక వ్యక్తి మరణాసన్నుడై ఉండునో అప్పుడు చేతియందు ఉత్తమమైన మధుపర్కమును ఉంచుకొని ఈ భావము కల మంత్రమును చదవవలెను. "దేవలోకమునకు అధిపతివగు స్వామీ! భగవంతుడగు నారాయణుడవు నీవే. ప్రభూ! నేను మిమ్ము సేవించుటకు భక్తిపూర్వకముగా మధుపర్కమును సమర్పితము చేయుచున్నాను. దీనిని నీవు స్వీకరించవలెను." మృత్యు సమయమునందు ఈ మంత్రమునే చదివి మధుపర్కము ఇవ్వవలెను. పృథ్వీ! మధుపర్కమునకు గల మాహాత్మ్యమును ఎవరునూ ఎరుగరు. అందుచేత సిద్ధిని కోరుకొనుచున్నవారు ఆ సమయమున సర్వప్రథమముగా సంసారసాగరము నుంచి ముక్తుని చేయువాడవైన భగవంతుడగు శ్రీహరిని అర్చించుట కూడా ఆవశ్యకమైనదే. మధుపర్కమును సమర్పించు వానికి పరమగతి లభించును. ఈ విధానము పవిత్రము, స్వచ్ఛము, సంపూర్ణముగా ఉండి కామనలను తీర్చునట్టిది. దీక్షితుడైన వాడిని గురువుయందు భక్తి ఉంచునట్టి శిష్యులు కావలెను. అతనికి ఎదురుగా అతని ప్రసంగమును వినవలెను. పాపములను నశింపజేయునదియగు ఈ మధుపర్క ఆఖ్యానమును ఎవరు పూర్తిగా విందురో, అతడు నా దయచే పరమ దివ్య సిద్ధప్రాప్తిని ప్రాప్తించుకొనగలడు.

భద్రా! మధుపర్కమును పరిచయము చేయు ఈ సంగ్రహము నేను నీకు వినిపించితిని. రాజదర్బారులయందును, శ్మశానభూమియందు లేక భయము, దుఃఖ పరిస్థితులు ఎదురుపడినప్పుడు ఈ శాంతిదాయకమగు ప్రసంగమును అధ్యయనము చేసిన పుత్రహీనులకు, భార్యాహీనులకు, భార్యయు లేక పతిహీనుడైన స్త్రీకి అందమగు భార్య లభించును. మానవునికి గల ఇహలోక బంధములు విడిపోవును. ఈ విషయము ప్రపంచమును ఉద్ధరించు పరమ రహస్యపూర్ణమైనది .ఏ వ్యక్తి విధితో ఈ ప్రయోగమును ఆచరించునో అతడు ఈ లోకముపై ఆసక్తిని వదలి, నా లోకమును ప్రాప్తింపజేసికొనును. (191, 192)

193 వ అధ్యాయము - నచికేతుని యమపూరీ యాత్ర

సూతుడగు రోమహర్షణుడు ఇట్లు చెప్పెను. వేదవేదాంగపారంగతుడైన వ్యాసుని శిష్యుడగు వైశంపాయనుడు, జనమేజయ మహారాజ ఆస్థానమునకు వెళ్ళెను. కానీ ఆ సమయమున రాజు అశ్వమేధ యజ్ఞమునందు దీక్షితుడుగా ఉన్న కారణము చేత ఆయన సింహద్వారం వద్దనే ఆగిపోవలసి వచ్చెను. యజ్ఞము సమాప్తమైన తర్వాత, జనమేజయుడు హస్తినాపురమునకు తిరిగి వచ్చిన తర్వాత, ఆయనకు పరమజ్ఞానియైన వైశంపాయన మహర్షి అచ్చటికి వచ్చెనని తెలిసినది. గంగా తటము పై రోమహర్షణుడు రాజు కొరకు వేచి ఉండి అచటనే వసించుటకు తగిన స్థానమును ఏర్పాటు చేసుకొనెను. ఋషి తనను కలియుటకు వచ్చెనని తాను ఆ మహర్షితో కలవలేకపోతినని ఇది కూడా ఒక విధమైన అవమానమునకు గురి చేయుటయే అని భావించి జనమేజయుడు చింతతో వ్యాకులపాటు చెందెను. ఆయన శీఘ్రముగా వైశంపాయన మహర్షి వద్దకు వెళ్ళెను. ఆయనకు స్వాగతము తెల్పిన తర్వాత "భగవాన్! నా చిత్తము వ్యాకులపాటు చెందినది. యమలోకము ఎట్టిది? ఎంతదూరము వ్యాపించి ఉండును. ఈ ప్రేతపురికి ఈశ్వరుడగు ధర్మరాజు గొప్ప ధీరుడని విన్నాను. ఈ సంపూర్ణ జగత్తును ఆయన పాలించుచుండెను. అని అందువలన ఎట్టి కర్మలచేత అచటికి (యమలోకమునకు) పోవలసిన అవసరం కలుగకుండా ఉండును అను విషయమును తెలిసికొనదలచిన నాకు ఆవిషయములను తెల్పుడు." అని ప్రశ్నించెను.

అంతట వైశంపాయనుడు "రాజా! ఈ విషయమును గురించి ఒక పురాతన ఇతిహాసము తెలిపెదను వినుము. దీనిని వినుట చేతనే నరులు సంపూర్ణముగా పాపముల నుండి ముక్తులగుచున్నారు. ఆ వృత్తాంతమును వినుము. ప్రాచీన కాలమున ఉద్దాలకుడు అను పేరు గల ఒక వైదిక మహర్షి కలడు. ఆయనకు నచికేతుడు అను పేరు గల తేజస్వి,యోగాభ్యాస పరుడు అయిన పుత్రుడు కలడు. సంయోగవశమున ఆయన తండ్రి ఉద్దాలకుడు ఒక రోజు రోషము వచ్చినవాడై తన పరమధార్మికుడైన పుత్రుని "దుర్మతీ! నీవు యమపురికి పొమ్ము!" అని శాపము నిచ్చెను. ఇందుపై నచికేతుడు కొన్ని క్షణములు ఆలోచించి మరల గొప్ప నమ్రతతో ఉద్దాలక మహర్షితో "తండ్రీ! నీవు మహాధార్మి కుడవైన పురుషుడవు. మీరు చెప్పిన మాటలు ఎన్నడునూ మిధ్య కాలేదు. అందుచేత నేను ఇప్పుడే మీ

ఆజ్ఞచేత మహాతేజోవంతుడైన యముని యొక్క అందమైన నగరమునకు వెళ్ళుచున్నాను" అని పల్కెను.

అంత ఉద్దాలకుడు తాను చేసిన అకృత్యమునకు పశ్చాత్తాపపడుచూ "నాయనా! నీవు నాకు ఒకడవే పుత్రుడవు. నీకు సోదరులు ఎవరునూ లేరు. నీకంటే వేరు ఇతరుడు ఎవరును సోదరుడు లేడు. నేను క్రోధముచేత మాట్లాడితిని. అందుచే నన్ను అధర్మునిగా భావించకుము. నింద మిధ్యావాది అని చెప్పబడు దోషము నాపై బాగుగా పడగలదు. కానీ వత్సా! ఇప్పుడు నీ ప్రవర్తన నన్ను ఉద్ధరించునట్టిదిగా ఉండవలయునని కోరుకొను చున్నాను. నేను నీవంటి నిత్యధర్మాచరణపరాయణుడైన పుత్రునికి ఇచ్చిన శాపము సరియైనది కాదు. నీకు యమపురికి పోవుట ఉచితమైనది కాదు. ఆ పట్టణమునకు రాజు వైవశ్వతదేవుడు. నీవు స్వేచ్ఛగా అచ్చటికి పోగలిగినట్లైన, మహాయశస్వి అయిన రాజు యొక్క క్రోధకారణము చేత నిన్ను ఎన్నడునూ రానీయడు. పుత్రా! నీవు నీ వంశము యొక్క భవిష్యత్తును సంహారము చేయువాడవు లేక నష్టపరచువాడవు కారాదు. నరకము యొక్క ఒక శబ్దము "పుత్" ఆ పదమునకు "త్రాణ" కలిపిన కారణము చేత, కుమారుని "పుత్రుడు" అని పిలుచుదురు. సంతానహీనుడైన వ్యక్తి చేత చేయబడిన హవనము, ఇవ్వబడిన దానము, చేసిన తపస్సు పితరుల తర్పణము మొదలగునవి అన్నియూ వ్యర్థములై పోవును.

"పుత్రా! నేను సేవాపరాయణుడగు శూద్రుడు, వ్యవసాయము చేత జీవనము గడుపు వైశ్యుడు,ధనమును రక్షించువాడగు క్షత్రియ సమూహము, ఉపాసనా కర్మమునందు నిరతుడగు బ్రాహ్మణుడు, గొప్ప తపస్సు చేయు తపస్వి ఇంకనూ గొప్పదానములను చేయువాడగు దానపరుడైన వ్యక్తి, ఒకవేళ సంతాన హీనుడైనచో అతడు స్వర్గప్రాప్తిని పొందలేడు. పుత్రుని చేత తండ్రికి, పౌత్రునిచే పితామహునికి, ప్రపౌత్రుని చేత ప్రపితా మహునికి పరమానందము లభ్యమగును. అందుచేత నేను నా వంశము యొక్క వృద్ధిని చేయునట్టి నీ వంటి పుత్రుని త్యాగము చేయను. అందుచే నేను నీవు యమపురికి వెళ్ళవద్దని అర్థించుచున్నాను" అని చెప్పెను.

వైశంపాయనుడు ఇట్లు చెప్పెను. "రాజా! మునిశ్రేష్ఠుడగు ఉద్దాలక మహర్షి మాట విని నచికేతుడు "తండ్రీ! నీవు విచారించవద్దు. తిరిగి నేను ఇచ్చటకు రాగలను.

అంతేగాక నీవు నన్ను నిశ్చయముగా మరల చూడగలవు. ఈ లోకమంతయూ నమస్కరించునట్టి దివ్య పురుషుడగు యమ ధర్మరాజు యొక్క దర్శనము చేసికొని నేను తిరిగి ఇచ్చటకు తప్పక తాగలను. నాకు మృత్యువు యెడ ఎట్టి భయమును లేదు. జనకా! సత్యమునందు గొప్ప శక్తి కలదు. ఆ సత్యము స్వర్గమునకు సోపానము. సూర్యుడు కూడా సత్యము యొక్క బలము చేతనే మండుచున్నాడు. అగ్నికి సత్యము చేతనే దాహకశక్తి లభించినది. సత్యము పైననే పృథ్వి నిలబడుచున్నది. సత్యమును ఆచరించుట కొరకే సముద్రము తన హద్దులను అతిక్రమణము చేయక చెలియలి కట్టకు లోపలనే ఉన్నది. ప్రపంచమునకు హితము చేయుట కొరకు సామవేదము, సత్యమంత్రముల గానము చేయుచున్నది. సత్యము పైననే అందరి ప్రతిష్ఠ ఆధారపడి ఉన్నది. స్వర్గము, ధర్మము ఈ రెండునూ సత్యము యొక్క రూపములు, సత్యము కాకుండా వేరైన రెండవది ఏదియునూ లేదు. తండ్రీ సత్యము అన్నింటితో కలసి పోవునని ఒకవేళ దానిని పరిత్యజించిన ఏ ఉత్తమ వస్తువును చేతితో తాకలేము అని విని ఉంటిని.

బ్రహ్మ కూడా సృష్టికి ప్రారంభకాలమునందు యత్నపూర్వకముగా సత్యదీక్షను కొనెను. సత్యమును ఆశ్రయించియే ఔర్యుడను ముని అగ్నిని బడబాముఖమునందు విసరివేసెను. జనకా! ప్రాచీన కాలమునందు సర్వశక్తి సమన్వితుడైన సంవర్తుడు దేవతలను దయతలచుటకై సంపూర్ణముగా లోకములకు ఆశ్రయమును ఇచ్చెను. పాతాళమునందు నివాసము ఉండు బలి చక్రవర్తి కూడా సత్యమును రక్షించుట కొరకే బంధనమును స్వీకరించెను. వందలకొలది శిఖరములతో శోభించునట్టి మహావింధ్యపర్వతము పైకి ఎదుగుచూ పెరుగుచుండగా సత్యమును పాటించుట కొరకు పెరుగుట ఆగిపోయెను. సంపూర్ణముగా చరాచరముల చేత సంపన్నమైన ఈ జగత్తు సత్యము చేతనే శోభించును. గృహస్థుడు, వానప్రస్థుడు, ఇంకనూ యోగులు అందరును ఎంతో ఉత్తమముగా పాటించు నది ధర్మమే. అట్లు వేయి అశ్వమేధ యజ్ఞములు చేయుటచే వచ్చు ధర్మమును సత్యము చేత పోల్చిన యెడల సత్యమే అన్నింటికన్ననూ ఎక్కువగా కనిపించగలదు. సత్యము చేత ధర్మరక్షణము జరుగును. అట్లు రక్షింపబడిన ధర్మము ప్రాణులను రక్షించును. అందుచేత నీవు ఈ సమయమందు సత్యమును రక్షింపుము". సువ్రతా! ఈ విధముగా చెప్పి ఋషి పుత్రుడగు నచికేతుడు యముని యొక్క ఉత్తమమైన నగరమునకు పోయెను. తపస్సు,

యోగము యొక్క ప్రభావము చేత కొద్దికాలములోనే అతడు యమపురికి చేరుకొనగల్గెను. యమపురికి చేరిన తర్వాత యముడు అతడికి యథోచితమైన స్వాగతసత్కారమును చేసెను. పిమ్మట కొన్ని దినముల తర్వాత అచట నుంచి అతడు తిరిగి వచ్చుటకు సమ్మతించెను. అందుచేత ఆ ఋషి కుమారుడు తిరిగి తన గృహమునకు రాగల్గెను. యముపురినుండి తిరిగి వచ్చిన పుత్రుని చూచి ఉద్దాలక ముని తన రెండు బాహువులతో ఆలింగనము చేసుకొనెను. అతడి శిరము మూర్కొనెను. ఆ సమయమున అపారమైన హర్షకారణముగా భూమి ఆకాశములలో కూడా హర్షధ్వని వినబడెను.

అనంతరము ఉద్దాలకుడు కుమారునితో "వత్సా! యమపురియందు నీకు ఏమియునూ కష్టములు కలుగలేదు కదా!" అని ప్రశ్నించెను .ఆ సమయమునందు యమపురి నుంచి తిరిగి వచ్చిన నచికేతుని చూచుటకై ఋషులు, మునులు ఎందరో దేవతలు కూడా అచ్చటికి వచ్చిరి. ఆ ఋషులయందు చాలా మంది నగ్నులు (నగ్నముగా ఉన్నవారు). ఆ ఋషులయందు మరికొందరు రాతితో దంచిన అన్నమునే తినుచుండిరి. అనేకులు మౌనవ్రతమును పాటించుచూ, ఉండిపోయిరి. కొందరు ఋషుల వాయుభక్షకులై ఉండిరి. అనేకులైన ఋషులు యొక్క నియమము అగ్నిసేవనము, ఆ వ్రతమునుపాలించు ఋషులు పొగను మాత్రమే పీల్చి జీవించుచుండిరి. సమస్త సముదాయము ఆ ఋషి కుమారుడైన నచికేతుని చుట్టునూ నిలబడి అతనిని చూచు చుండిరి. కొందరు వారిలో కూర్చొనినవారు, మరికొందరు నిలబడినవారు కలరు. వారు అందరునూ శాంతులు, శిష్ఠులు, అనునాసితులు, శాలీనులు. వారు అందరు ఋషులును వేదాంతమును సాంగోపాంగముగా అధ్యయనము చేసినవారు. ప్రథమముగా యమ లోకము నుంచి వచ్చిన నచికేతునిపై కొందరి దృష్టి ప్రసరించుట చేత వారిలో కొందరు భయము కలిగి ఆతృతతో అచ్చటినుండి వెడలిపోయిరి. అట్లే కొందరు అతిగొప్ప కౌతుహలము కలిగినవారైరి. దానితో వారి హృదయములందు సంతోషము కూడా కలిగినది. కొందరు ఋషుల మనస్సుల యందు వ్యాకులత ఉత్పన్నమైనది. అట్లే కొందరు సందేహాస్పదమైన చర్చ జరుపుట యందు నిమగ్నులై ఉండిరి. ఇంకనూ ఆ ఋషులు మహాతపోధనుడైన ఋషికుమారుడగు నచికేతుని అందరూ ఒక్కసారే ప్రశ్నలను అడుగుట ఆరంభించిరి.

అనేకమార్లు సంబోధించుచూ ఋషులందరూ నచికేతునితో "వత్సా! నీవు గొప్ప విజ్ఞుడవు. అట్లే గురువు యొక్క పరమసేవకుడవు. ఇంకనూ స్వధర్మముపై కదలక నిలబడు వాడవు. నీవు యమపురియందు ఏ విషయములను చూచితివి? అట్లే ఏ విషయములను వింటివి? ఇచ్చటగల ఋషులందరి మనస్సులయందు ఈవిషయములను వినవలయునను కోరిక గలదు. నీ తండ్రి ఉద్దాలకుడు కూడా ఈ విషయమునంతటినీ సంపూర్ణముగా వినవలయునని కోరుకొనుచున్నాడు. తండ్రి! మేము అడిగిన వానియందు ఏవైననూ రహస్య విషయములు ఉన్న యెడల వానిని ప్రత్యేకముగా భావన చేసి స్పష్టముగా మాకు తెలియునట్లు పలుకుము. ఎందుకనగా ఆ యమలోకము నుంచి అందరునూ భయ భీతులుగా ఉందురు. ఈ విషయము అందరికీ తెలిసినదే. ఈ మాయా రాజ్యమునందు గల సంపూర్ణ జగత్తు లోభము, మోహముల వలన కలిగిన అంధకారముతో వ్యాపించి ఉన్నది. చింతనము అట్లే అన్వేషణము అను కర్మములు ఉండియే ఉండును. కాని హితమైన మాట చిత్తమునకు సరిగా ఎక్కకపోవచ్చును. యమపురియందు చిత్రగుప్తుని కార్యశైలి ఎట్లుండును. మరల అతడి కథనము ఏ రూపములో ఉండును. యమధర్మరాజు, ఆయన కాలము యొక్క స్వరూపము ఎట్టిది? అచట వ్యాధులు ఏ రూపముచే దృష్టి గోచరములు అగును? కర్మ విపాకము యొక్క స్వరూపము కూడా తెలుసుకొనవలయునని మేము కోరుకొనుచున్నాము. అంతేకాక ఏ కర్మము చేత అతడు విముక్తుడగునో ఆ విషయములను కూడా తెలుసుకొనుట నా కోరిక. విప్రశ్రేష్ఠుడా! అచ్చట నీకు ఎటువంటి దృశ్యములు కనబడినవి? లేక వినబడినవి? నీవు వానిని ఎట్టి రూపములో వినగల్గితివి. అది అంతయును సంపూర్ణముగా విస్తరపూర్వకముగా ఉన్నది ఉన్నట్లుగా వర్ణించుము".

వైశంపాయనుడు ఇట్లు పల్కెను. "జనమేజయా! నచికేతుడు గొప్ప మనస్సు గల ముని. మహారాజా! ఋషులు ఈ విధముగా నచికేతుని ఎప్పుడు ప్రశ్నించిరో అట్లే శ్రేష్ఠులైన ముని పుత్రుడు ఏమి జవాబిచ్చెనో వానిని నేను ఇప్పుడు తెల్పుచున్నాను వినుము. (193,194)

195, 196, 197 వ అధ్యాయములు - యమపురి వర్ణనము

నచికేతుడు ఇట్లు చెప్పెను. "నిరంతరము తపస్సునందు తత్పరులై ఉండు ద్విజశ్రేష్ఠులారా! మీకు అందరకు యమపురి వృత్తాంతమును తెలుపుచున్నాను. ఎవరు

అసత్యమాడుదురో, స్త్రీలు పిల్లలు మొదలైన ప్రాణులను వధింతురో, బ్రాహ్మణులను హత్య చేయుటయందు తత్పరులై ఉందురో, ఇంకనూ విశ్వాస ఘాతకులో, ఎవరియందు మౌఢ్యము, కృతఘ్నత, అట్లే లోలుపత పూర్తిగా ఉండునో ఎవరు ఇతరుల భార్యలను అపహరించుదురో అట్లే నిరతము పాపకార్యరతులై ఉందురో వారు యమలోకమునకు పోవుదురు. వేదములను నిరంతరము నిందించుచు, వైదికమార్గమును చెడగొట్టుచు, మధిరాపానము చేయుచు, బ్రాహ్మణ వధ చేయుచు, కుసీద వృత్తిని అనగా వడ్డీకి ధనము నిచ్చి దానితో జీవనము గడుపువారు, కపటముగా ప్రవర్తించువారు, తప్పక నరకమునకు పోవుదురు. గురువును ద్వేషించువారు. ఘోరమైన పనులను ఆచరించినవారు, కపటముతో కూడిన మాటలను మాట్లాడువారు, తప్పుడు పనులలో నిమగ్నులైనవారు, గృహములు, గ్రామముల హద్దులను ధ్వంసం చేయువారును, అదేవిధముగా వ్యర్థముగా పూలు, పండ్లను కోయువారును, పతివ్రతలైన స్త్రీల యెడ దయచూపక కఠినముగా ప్రవర్తించువారును, అట్లే పాపులు, హింసకులు, వ్రత భంజకులు, సోమరస విక్రేతలు, స్త్రీ పై ఆధారపడి జీవించువారు, అబద్ధమును చెప్పు అలవాటు కలవారు, అట్లే ద్విజుడై యుండియు వేదమును అమ్మువారు, ఇంటింటికి తిరిగి నక్షత్ర చన చేయువారు, తప్పక నరకమునకు పోవుదురు. అంతేగాక అచట తమ చెడు పనుల యొక్క ఫలమును అనుభవింతురు".

వైశంపాయనుడు ఇట్లనెను "రాజా! నచికేతుని ముఖము నుండి వెలువడిన ఈ ప్రకారమైన మాటలను ఆ పరమ తపస్సులైన మునులు ఆశ్చర్యమునకు లోనైరి. వారి ఆశ్చర్యమునకు హద్దే లేకపోయెను. అందుచేత వారు నచికేతుని తిరిగి ప్రశ్నించుట మొదలిడిరి".

ఋషులు ఇట్లు ప్రశ్నించిరి. "మునీ! నీవు గొప్ప జ్ఞానవంతుడవైన పురుషుడవు. నీవు యమపురియందు ఏమేమి దర్శించితివో ఆ విషయములను అన్నింటినీ దయతో మాకు తెలియజేయుము. సూక్ష్మ శరీరము యమ యాతనలయందు అనేక క్లేశములను భరించవలెనని, నిప్పుచేత తగులబెట్ట బడుదురని, అస్త్రముల చేత కోసిననూ కూడా వారి శరీరమునకు నష్టము ఏమి జరగదని విద్వాంసులు చెప్పుదురు. విప్రుడా! వైతరణీ నది యొక్క రూపము ఎట్లు ఉండెను? అట్లే దానియందు జలము ఏ విధముగా ప్రవహించును. రౌరవనరకము యొక్క స్థితి ఎట్లుండును. అంతేగాక కూటశాల్మలిక ఆకారము ఎట్టిది?

యమధర్మరాజు యొక్క దూతలు ఎట్లుందురు? వారు చేయుపని ఏమి? వారియందు ఎట్టి పరాక్రమము ఉండును? ఆ యమలోకమున ఉండు దూతలు ఏ విధముగా పనుల యందు ఉద్యుక్తులుగా ఉందురు. వారి ఆచారమెట్టిది? వారి అపూర్వ తేజముతో కప్పబడిన కారణము చేత ప్రాణులు తరచుగా అచేతనులై పోవుదురు. ప్రాణుల ద్వారా పలు రకములైన, పలుపర్యాయములు దోషములు జరుగుచూనే ఉండును. అతడు రాజసము కలిగి ఉండును. అందుచే ధైర్యము ఉండదు. ఇది ఎవరి మాయ? ఎవరి ప్రభావము చేత ప్రాణులు పరమేశ్వరుని మరచి సంసారము యొక్క జంజాటమునందు విహ్వలులై ఉందురు. అనేకమంది నరులు మూర్ఖత కలిగిన కారణము చేత పాపము చేయుదురు. ఆ విధముగా వానికి ఫలరూపముగా వారు కష్టములను అనుభవించవలసి ఉండును. "వత్సా! నచికేతా! నీవు యమలోకమునకు పోయి సర్వవిషయములను స్వయముగా చూచి ఉంటివి. అందుచేత ఈ విషయములన్నింటిని దయతో మాకు తెలియజేయుము" అని ఋషులు నచికేతునికి వినుతించిరి.

వైశంపాయనుడు ఇట్లు చెప్పెను. "రాజా! ఆ అందరు ఋషుల యొక్క అంతఃకరణము అత్యంత పవిత్రములుగా ఉండినవి. ఆ ఋషుల మాటలను వినిన తర్వాత వాక్కులయందు పరమ నైపుణ్యము కలిగిన నచికేతుడు అందరి మాటలను స్పష్టము చేయుచూ "ద్విజవరులారా! యమధర్మరాజు యొక్క ఆ నగరము రెండు ప్రాకారముల మధ్యయందు చుట్టుకొని ఉండి సువర్ణముతో చేయబడిన ఒక వేయి యోజనముల పర్యంతము వ్యాపించి ఉండును. అట్లే మేడపై ఉండు గదులతో దివ్యభవనముల చేత సుశోభితమై ఉండును. వానియందు ఒక్కొక్కచోట భీషణ యుద్ధము, మరియొక్క చోట సంఘర్షణము జరుగుచుండును. కొన్నిప్రదేశముల యందు జీవులు వివశులై బందీలుగా పడి ఉందురు. అచ్చట పుష్పోదకము అను పేరుగల నది కలదు. ఆ నది ఒడ్డున అనేక విధములైన వృక్షములు కలవు. దానికి గల సోపానములు బంగారముతోను అట్లే వాకిలులు సువర్ణము రంగుతో ఉండును. అచట వైవస్వతి అను పేరు గల ప్రసిద్ధమైన చాలా పెద్ద నది ఉండెను. ఆ నది ఆ యమలోకమున గల నదులన్నింటికంటే పవిత్రము శ్రేష్ఠమైనదిగా చెప్పబడును. అదేవిధముగా తల్లి ఎట్లు తమ పుత్రుని రక్షించుటయందు తత్పరురాలై ఉండునో, అట్లే ఆ నది పరమ రమణీయమైన సరితా పురము యొక్క మధ్యన

వ్యాపించి ఉండును. దాని జలము అందరకు సుఖము కల్గించునదియే కాక మనస్సులను ముగ్ధులను చేయునట్టివి. ఎల్లప్పుడు ఆ నది దివ్యజలములతో నిండి ఉండును. కుందపుష్పములు, చంద్రునితో సమానము అయిన తెల్లని రంగు గల హంసలు ఆనందము వలన కలిగిన ఉత్సాహముతో ఆ నదీ తటములపై నిరంతరమూ తిరుగుచు ఉండెను. వారి ఆకారము, అట్లే రంగు మహా ఆకర్షణీయముగా ఉండును. అంతేగాక వానికి చెవులు ఉష్ణము చేత సువర్ణము వలె ప్రకాశించుచుండును. అట్టి రమణీయమైన సువర్ణముతో సమానముగా మెరయుచుండును. ఇట్టి రమణీయ కమలముల చేత ఆ నది పెద్దది అయిననూ మనోహరముగా కనిపించును. సువర్ణము చేత చేయబడిన మెట్లు కలిగిన కారణము చేత దాని సౌందర్యము ఇతోధికముగా పెరిగినది. దాని యందలి నిర్మలమైన జలము,సుగంధపూర్ణముగా అమృతముతో తూగునట్లు ఉండును. దాని తీరమున గల వృక్షములపై పూలు, అట్లే పండ్లు ఎప్పుడు అభావమును చెందవు. భూలోకమునందు మనుష్యుల ద్వారా పితరులకు జలము సమర్పింపబడును. వాటితోనే ఈ నది సుందర రూపమును ధరించినది. ఆ నది యొక్క తీరముపై అనేక ఎత్తైన భవనములు కలవు. దాని కాంతి చేత రమణీయత బహు అధికముగా పెరిగి ఉండును.

ఆ పురము అనేక విధములైన యంత్రములు, ప్రకాశక సాధనములు అట్లే ఆవశ్యకములైన ఇతర ఉపకరణముల చేత పరిపూర్ణమై ఉండును. దేవతలు, ఋషులు, ధర్మముపై నిరంతరము దృష్టి ఉంచువారగు జనులకు అచ్చట వేరు వేరుగా నివాసము ఏర్పాటై ఉండును. ఇచ్చట గల భవన గోపురములు శరదృతువు మేఘములా అనునట్లు ప్రకాశముతో ఉండును. ఇచ్చట పుణ్యాత్ములైన మనుష్యులకు ఈ ద్వారముల నుండియే ప్రవేశము కల్గును. అగ్ని పొగ కలిగిన ఇచ్చట దోషములన్నియూ నశించి పోవును. కానీ ఈ నగరము యొక్క దక్షిణ ద్వారము అత్యంత భయంకరముగ లోహమయమైనది. ఇది. పాపకర్ములచేత ఎల్లప్పుడు సంతప్తముగా ఉండును. పాపమునందు ఇష్టము కలవారు. ఇతరులతో శత్రుత్వము కలవారు, మాంసమును తినువారు, అట్లే నిందింపబడుస్వభావము కలవారగు మహాపాపులకొరకు ఔధుంబర, అవీచమాన, ఉచ్చాను అను పేరుగల మహా కందకములు ఉండును. యమపురి యొక్క పశ్చిమద్వారములకు దగరగా అగ్నిశిఖలు

నిరంతరము పైకి ఎగయుచూ ఉండును. పాపులైన జీవులకు ఒక మార్గమునుంచే ప్రవేశము కలుగును.

ఆ పరమ రమణీయ పురమునందు ఒకవైపు సర్వోత్కృష్టమైన సభాభవనము నిర్మింపబడి ఉండును. దానియందు అన్ని రకములైన రత్నములు ఉపయోగింపబడి ఉండును. ధార్మికులు, సత్యవాదులు అయిన వ్యక్తులచేత అందరి స్థానములన్నియు నింపబడి ఉండును. క్రోధలోభములపై విజయము ప్రాప్తించుకొనినవారు అట్లే వితరాగులైన తపస్వులు ధర్మాత్ముల, మాహాత్ములచేత అట్టి ఆ సభ, నింపబడి ఉండును. ఈ సభయందు ప్రజాపతి మనువు, మునిశ్రేష్ఠుడైన వ్యాసుడు, అత్రి, ఔద్దాలకి, అంతులేని పరాక్రముడైన మహర్షి ఆపస్తంభుడు, బృహస్పతి, శుక్రాచార్యుడు, గౌతముడు, మహా తపస్వి అయిన శంఖ లిఖితుడు, అంగిరాముని, భృగువు, పులస్త్యుడు, అట్లే పులహుని వంటి ఋషులు, మునులు, మహారాజులు నివసించి ఉందురు. ఇంతియే గాక ధర్మప్రపారకుల యొక్క సమూహము అచ్చట విచారణ చేయుచుందురు.

ద్విజవరులారా! యమధర్మరాజు ప్రక్కన సంచరించు ఇట్టి మునులు అనేకమంది కలరు. వారు ఛందశ్శాస్త్రము, శిక్ష, సామవేదములను పఠించుచూ ఉందురు. అట్లే ధాతువాదము, వేదవాదము, నిరుక్తవాదము, చేయుచుండు వారికి అచ్చట లోటే ఉండదు. విప్రులారా! యమధర్మరాజు యొక్క భవనముపై ఉత్తమమైన కథలను ప్రవచనము చేయువారిని, ఉత్తములైన ఋషులను, పితరులను అనేక మందిని నేను దర్శించితిని. మహర్షులారా! అచ్చట ఒక శుభకరమైన దేవి యొక్క దర్శనము కూడా నాకు లభించినది. ఆమె సర్వతేజములను ఒక చోట రాశి పోసినట్లుగా ఉన్నది. యమధర్మరాజు స్వయముగా దివ్యగంధములతోను, అనులేపనములతోను, ఆమెకు పూజ చేయుచుండెను. సమస్త లోకము యొక్క సృష్టి పాలనకు సంభారము ఆమె చేతియందే కలదు. విశ్వగతులలో ఆమెనే సర్వోత్తమ గతి అందురు. విజ్ఞులైన పురుషులు ఏ కర్తవ్య సాధన యందైననూ ఇంత శక్తి లేదని,ఆమెతో సమానముగా చేయలేరని, ఆమె చేతనే సమస్త ప్రాణులు భయము చెందుదురు. కాలము కూడా అచ్చట ఆకారముగా విరాజిల్లుచుండును. ఆ కాల ప్రకృతి యొక్క సహాయము పొంది అత్యంత భయంకరులు, క్రోధము కలవారు అట్లే దుర్వినీతులు అగుదురు. ఆమెయందు సగము బలము తేజము కలవు. ఆమె ఎన్నడునూ వృద్ధురాలు

కాదు. అట్లే ఆమె శక్తికి అంతులేదు. ఆమెను ఎట్టి విధముగానైనను తిరస్కరించలేరు. దివ్యచందనము వంటి అనులేపనము ఆమె శోభను పెంచుచున్నవి. ఆమె సహవాసములో కొందరు వ్యక్తులు గీతములు పాడువారు, సంతోషింపజేయువారు, సమస్త ప్రాణులను ఉత్సాహితులు చేయుటలోను ఉద్యుక్తులుగా ఉండిరి. ఆమె కాల రహస్య జ్ఞాతగా ఉండెను. అంతేగాక ఆమె సమ్మతికి వారు సమర్థకులు. యమధర్మరాజు యొక్క నగరమునందు కుష్మాండము (పెద్ద గుమ్మడికాయ), యాతుధానము వంటి మాంసభక్షకులైన రాక్షసుల యొక్క పెద్ద సమూహము కలదు. కొందరికి ఒకటే కాలు, కొందరికి రెండు కాళ్ళు, మరికొందరికి మూడు కాళ్ళు, కొంతమందికి అనేక కాళ్ళు కలవు. అచట ఒకే బాహువు, రెండు బాహువులు, మూడు బాహువులు కలవారును ఇంకను పెద్ద పెద్ద చెవులు, చేతులు, కాళ్ళు కలవారు కూడా ఉండిరి. ఏనుగు, గుఱ్ఱము, వృషభము, శరభము, హంసలు, నెమళ్ళు సారసములు చక్రవాకములు మొదలైన పశుపక్షులు మొదలగునవి అన్నియును మీరందరునూ యమధర్మరాజు యొక్క నగరమునందు పరమశోభితులై ఉండిరి. (195,196,197)

198, 199, 200 వ అధ్యాయములు - యమయాతనా స్వరూపము

తదుపరి మహర్షులతో నచికేతుడు ఇట్లు చెప్పెను. ద్విజవరులారా! నేను యమపురికి ప్రవేశించినప్పుడు ఆ ప్రేతపురి స్వామియగు యమధర్మరాజు నన్ను ఒక ముని అనుకొని ఆసనము, పాద్యము, అర్ఘ్యముల అర్పణ పూర్వకముగా నన్ను గౌరవించి తదుపరి నాతో ఇట్లు పల్కెను. "మునిశ్రేష్టా! ఇది సువర్ణమయమైన ఆసనము. నీవు దీనిపై కూర్చుండుము" అనెను. ఆయన నన్ను చూడగానే పరమ సౌమ్యమూర్తిగా అయ్యెను. తదుపరి ఆయనను స్తుతించుచూ, "మహాభాగా! నీవే శ్రాద్ధమునందు దాతగాను, విధాతల రూపములో కనిపించుచుందువు. పితృదేవతల సమూహమునందు నీవు ప్రధాన దేవుడవు. వృషభ స్వరూపుడవగుటచే నీవు చతుష్పాదుడవు అని చెప్పుచున్నావు. నీవు కాలజ్ఞుడవు, కృతజ్ఞుడవు, సత్యమే పలుకువాడవు. అట్లే దృఢవ్రతుడవు. ప్రేతములను శాసించునట్టి యమధర్మరాజా! నీకు నిరంతరము నమస్కారము చేయుచున్నాను. ప్రభూ! నీవు కర్మ ప్రేరకుడవు. భూత భవిష్య వర్తమాన కాలములతో నీవే విరాజిల్లుచుందువు. శ్రీమంతుడా! నీవు రెండవ సూర్యుని వలె ప్రకాశమును కలిగి ఉన్నావు. నీకు నమస్కారము. ప్రభవిష్ణుడా!

హవ్యకవ్యములను పొందు అధికారము కలవాడవు నీవే! నీ ఆజ్ఞచేత వ్యక్తి కఠోరమైన తపస్సు, సిద్ధి, వ్రతములయందు సదాతత్పరుడై ఉండి పాపముల నుంచి విముక్తి పొందగల్గుచున్నాడు" అని పల్కెను,

ఆ సమయమున వైశంపాయనుడు ఇట్లు చెప్పెను."రాజా! ఋషిపుత్రుడైన నచికేతుని పవిత్ర ముఖమునుండి వెలువడిన అట్టి నుతిని విని యమధర్మరాజు అత్యంత సంతుష్టుడై ఋషికుమారునితో తన అభిప్రాయమును స్పష్టముగా వినిపించుటను ప్రారంభించెను".

నచికేతునితో యముడు ఇట్లు పల్కెను."పాపరహితుడా! నీ వాక్కు యదార్థముగా ఉండి, అట్లే మహామధురముగా ఉన్నది. నేను నీ వాక్కులతో అతిశయ సంతుష్టుడనైతిని. ఇప్పుడు నీకు దీర్ఘఆయుష్యము, నిరోగత, ఇంకనూ ఏయే ఇతర వరములు కోరుకొను చున్నావో వానిని నాకు తెలియజేసి పొందగలవు.

ఋషికుమారుడగు నచికేతుడు ఇట్లు పల్కెను. "ప్రభూ! నీవు ఈ లోకమునకు అధిష్టాపాత్రుడవు. మహానుభావా! నేను జీవనము, మరణము దేనిని కోరుకొనను. నీవు ఎల్లప్పుడూ సమస్త ప్రాణుల యొక్క హితమునందు సంలగ్నుడవై ఉందువు. భగవంతుడా! నీవు నాకువరము ఇయ్యవలెననియే కోరుకున్నచో నీలోకమును సంపూర్తిగా చూడగల్గుటకు వరము ఇచ్చుటయే నా కోరిక. పాపాత్ములు మరియు పుణ్యాత్ములకు ఏది గతియో అవి అన్నియు ఇచట పూర్తిగా దృష్టి గోచరములు అగుచున్నవి. రాజా! నీవు నాకు వరదాతవు కావలెనని కోరుకొన్నచో నాకు ఈ అన్నింటిని చూడగల్గునట్లు దయచూపుము. నీ విధి కార్యమును నిర్వహించు ఏర్పాట్లను చేయుటయందు నేర్పరుడు, శుభమును చింతించు వాడగు చిత్రగుప్తుని చూపించునట్టి నీ దయను నాకు ప్రసాదింపుము.

అని ఈ విధముగా నేను చెప్పిన తర్వాత మహాత్ముడు, తేజస్వి అగు యమధర్మరాజు ద్వారపాలకునికి "నీవు ఈ బ్రాహ్మణుని సముచిత రూపములో చిత్రగుప్తుని వద్దకు తీసుకొని పొమ్ము. ఆ మహాత్మునితో ఈ ఋషి కుమారుని యెడ మృదువుగా వ్యవహరించవలెనని, అట్లే సమయోచితమైన అన్ని ఇతర విషయములను ఆయనకు తెలియజేయవలెనని చెప్పుము" అని ఆజ్ఞ ఇచ్చెను. ద్విజవరులారా! అట్లు యమధర్మరాజు దూతకు ఆజ్ఞ ఇవ్వగానే వెంటనే అతడు నన్ను చిత్రగుప్తుని వద్దకు తీసికొని పోయెను. నన్ను

చూచి చిత్రగుప్తుడు తన ఆసనము నుండి లేచి నిలబడెను. అచ్చట గల వాస్తవ స్థితులను విచారణ చేసి ఆయన నాతో "ముని శ్రేష్ఠుడా! నీకు స్వాగతము. నీ ఇచ్ఛానుసారము ఇచట పరిభ్రమింపవచ్చును" అని చెప్పి అంతేగాక తిరిగి ఆయన దూతలతో ఇట్లు చెప్పెను. "దూతలారా! మీరు ఎల్లప్పుడు నా మనస్సును అనుసరించి వివిధ కార్యములను ఆచరించుచుందురు. మీరు ఈ మునిపుత్రుని ఎవరునూ తెలిసికొనలేనట్లుగా యమలోకమును చూపుడు. ఈయనకు శీతోష్ణములు, ఆకలి, దప్పికల క్లేశము కలుగకుండునట్లు చూడుడు" అని ఆజ్ఞాపించెను.

ఋషి కుమారుడు నచికేతుడు ఇట్లు చెప్పెను. "మునిశ్రేష్ఠులారా! చిత్రగుప్తుని ఆజ్ఞ ప్రకారము దూతల వెంట, నేను అచ్చటికి చేరితిని. అనేకమంది దూతలు గొప్ప వేగముతో అటునిటు పరుగెత్తుచుండుటను చూచితిని. వారు కొందరిని పట్టుకొనుట, కొందరిని దెబ్బలు కొట్టుట, పాపులను బంధించుట, అగ్నియందు కాల్చుట, మొదలగు దండనల చేత మరల మరల శిక్షించుచుండిరి. కొందరి శిరములు పగిలిపోవుచుండెను. అనేకులు భయంకరముగా ఛీత్కారములు చేయుచుండిరి. కానీ వారికి అచ్చట రక్షణనిచ్చువారు ఎవరును లేకుండిరి. అట్టి అనేకమంది ప్రాణులు చీకటితో నిండి ఉన్న అగాధమైన నరకమునందు వండబడుచుండిరి. కొందరు ప్రాణులు ఆ నరకములో ఉడికించబడు చుండిరి. వారితో అగ్నికొరకు ఇంధనముగా చేయబడుచుండిరి. అట్లే ఉండిన అధిక పాపకర్మల ప్రాణములు తెర్లుచూ ఘృతము, నూనె క్షారవస్తువులు ఉన్న నరకమునందు పడి ఉండిరి. వారి దేహములు ఉడుకుచుండి నూనె, నేయి ఇతర క్షారపదార్థములతో కాల్చబడుచుండెను. భయంకరమైన యాతనలతో వారి దేహములు కాల్చబడుచుండెను. తాము చేసిన కర్మలను అనుసరించి అప్పుడప్పుడు వివశులై వారు పెద్దగా ఏడ్చుచుండిరి. ఎందరో ప్రాణులు తిలలవలె గానుగలయందు పడవేసి తిప్పబడుచుండిరి. ఆ పాపాత్ములైన ప్రాణులయొక్క రక్తము, నుజ్జ మొదలగు వానితో దుస్తరమై దాటరానిదైన వైతరిణీ నది కన్పించుచుండెను. భయంకరమైన ఆ వైతరణీనదియందు నురుగుతో మిశ్రితమైన రక్తపు సుడిగుండములు పైకి వచ్చుచుండెను. వేలకొలది దూతలు ఇట్లు దృష్టి గోచరము అగుచుండిరి. వారు పాపులను శూలమునకు గుచ్చి పైకి పట్టుకొని ఉండిరి. ఇంకనూ స్వయముగా వృక్షముల పైకెక్కి ఆ జీవులను అత్యంత భయంకరమైన వైతరణీనదియందు

పడునట్లు విసరివేయుచుండిరి. ఆ నది రుధిరముచేత నురుగుచేత నిండి మిక్కిలి వేడిగా ఉండినది. దానియందు అనేక సర్పములు కలవు. ఆ సర్పములు అక్కడ పడి ఉన్న ప్రాణులను కరుచుచుండినవి. ఆ నది నుండి బయటికి వచ్చుట ఎవరికిని సాధ్యము కాకుండెను. ఆ జీవులు రక్తముతో నిండిన జలమునందు మునుగుచూ తేలుచూ ఉండిరి. వారి నోటినుండి చొల్లు కారుచుండెను. వారికి ఎవరును రక్షకుడు అగువాడు దొరుకకుండెను.

అచ్చట ఇటువంటి ప్రాణులు ఎందరో కలరు. వారిని దూతలు కూటశాల్మలీ (గొప్ప బురుగు చెట్టు) అను పేరు గల వృక్షము పై వ్రేలాడదీసి ఉండిరి. ఆ వృక్షమునందు ఇనుము చేత చేయబడిన అసంఖ్యాకమైన ముళ్ళు (మేకులు) కలవు, దూతలద్వారా కత్తులు, బల్లెములతో మాటిమాటికి వారి పై దెబ్బలు వేయుట జరుగుచుండెను. ఆ వృక్షము యొక్క కొమ్మలు గగుర్పాటు కలిగించునవిగా ఉండెను. ఆ వృక్షముపై వ్రేలాడదీసియున్న వేలకొలది పాపజీవనులను చూచితిని. కూష్మాండులు, యాతుధానులు అనువారు యమధర్మరాజు యొక్క అనుచరులు. వారి ఆకారము దీర్ఘముగా, భయంకరముగా ఉండి వారిని చూచిన తోడనే ప్రాణులు భయపడుచుండిరి. సూదియైన ముళ్ళతో నిండి ఉన్న శాల్మలీ వృక్షము యొక్క కొమ్మలపై వారు చాలా వేగముతో ఎక్కుచూ ఎట్టి శంకను లేనివారై పాపులైన ప్రాణుల యొక్క మృదువైన శరీర అవయవములపై దెబ్బలు కొట్టుచుండిరి. వారు కూష్మాండులు మొదలైన ప్రాణులను చంపి వారి మాంసమును తినుటయందు అధిక ఆసక్తి కలిగి ఉండిరి. అందుకు కారణమేమనగా, వారిది భయంకర రాక్షసజాతి. కోతి వృక్షములపై గల ఫలము ఎంత ఆసక్తిగా తినుచుండునో అంత ఆసక్తితో వారు పాపుల యొక్క మాంసమును తినుచుండిరి. మనుష్యులు వనము నందు బాగుగా పండిన మామిడి పండ్లను ఎట్లు తిందురో అట్లే పొడవు ముఖము కలిగినవారు ఆ పాపులను తినుచుండిరి. కూష్మాండులు, యాతుధానుల నోటియందు గల పాపప్రాణులను లాక్కొని తమ ఉదరమునందు వేసుకొనుచుండిరి. వారు వృక్షముల పైననే ఆ పాప ప్రాణులను చప్పరించి తినుటచే కేవలము ఎముకలు మాత్రము మిగులుచుండెను. అట్లు మిగిలిన వారిని నేలపై విసిరి కొట్టుచుండిరి. నేలపై పడిన తర్వాత ఆ అరణ్యమున కొన్ని జంతువులు లటుక్కున అచ్చటికి వచ్చి ఇంకనూ మిగిలి ఉండిన మద్య మాంసములను మరల

నములుచుండిరి. ఇంకనూ మిగిలి ఉన్న కర్మయొక్క క్రమమున యధాశీఘ్రముగా శిక్షలను నెరవేర్చుచుండిరి. అచట ఒక్కొక్కప్పుడు దుమ్ము, రాళ్ల వర్షములు పడుచుండెను. ఆ వర్షమునకు భయపడిన పాపాత్ములైన ప్రాణులు వృక్షముల క్రింద చేరుచుండగా, అచ్చట కూడా వారి శరీరములను అగ్ని కాల్చుచుండెను. ఎవరైనను జీవములు వేగముగా పరుగెత్తుటకు ప్రయత్నము చేసినను దూతలు వారిని సమర్ధముగా పట్టుకొని బంధించు చుండిరి. భయంకరమైన ప్రదేశములలో వారు అగ్ని చేత ఉడకబెట్టుచుండిరి. దుఃఖితులైన ప్రాణులతో వారు "మీరందరూ కృతఘ్నులు, లోభులు, పరస్త్రీలను అనుభవించినవారు, మీ మనస్సులయందు నిరతము పాపమే నిండి ఉన్నది. మీరు ఏ రకమైన సుకృతమును చేసినవారు కారు. మీరు ఎల్లప్పుడు ఇతరులను నిందించుచుండిన వారే. ఈ యాతనలను అనుభవించిన తర్వాత కూడా తిరిగి మీరు ప్రపంచములో జన్మనెత్తిన తర్వాత అచ్చట కూడా మీకు కష్టములే కలుగగలవు. అందుకు కారణమేమనగా పాపకర్మలు చేయువాడైన ప్రాణి మరల అత్యంత దరిద్రమగు కుటుంబమునందు జన్మను పొందును. సదాచారులైన వారికి ఇట్లే సత్యమునే పలుకు ప్రాణులకు దయ చూపబడును. వారే ఉత్తమ వంశమును పొందగలవారు. వారి మనస్సుల యందు ఏ రకమైన దుఃఖమును ఉండదు. వారు ఇంద్రియములను తమ వశము నందుంచుకొని, శ్రేష్టమైన పద్ధతిలో జీవితము గడుపుచూ అంత్యకాలమందు పరమగతిని పొందుదురు" అని బెదిరించుచుండిరి.

నచికేతుడు ఇంకనూ ఇట్లు చెప్పెను. "మునిశ్రేష్ఠులారా! యమలోకమునందు ఇనుప సూదులు పరచబడిఉన్నవి. అంతయూ అంధకారము వ్యాపించి ఉన్నది. అయిననూ అచ్చట ఒక స్థానము కూడా కలదు. అది మహా విషమ స్థితి కలది. అచట పాపచారులైన ప్రాణులు పడియుందురు. వీరే కాక కాళ్ళు ఖండించబడిన వారు కూడా కొందరు ఉందురు. వారిలో ఎక్కువ మంది చేతులు లేనివారు, శిరస్సులు లేనివారు. ఆ యమపురియందు ఇనుముతో తయారు చేయబడిన ఒక స్త్రీ ఉన్నది. ఆమె శరీరము అగ్నితో సమానముగా మండుచుండెను. ఆమె భయంకరమైన ఆకారము గలది. ఆమె ఎవడైననూ పాపియైన పురుషుని తన శరీర అవయవములతో కరుచుకొనిన ఎడల కాలెడి గుణము ఉన్నందుచేత వాడు పరుగెత్తి పోవును. అప్పుడామె వాని వెంట పరుగెత్తుచూ "ఓరి పాపి! నేను నీకు సోదరిని. ఇట్లే ఇతర స్త్రీలు కూడా కలరు. నేను నీ పుత్రికను. ఓరీ మూర్ఖుడా! నేను పిన్నిని,

అత్తను, గురుపత్నిని, మిత్రుని భార్యను. నీ సోదరిని అట్లే రాజు యొక్క భార్యను. శోత్రియుడగు బ్రాహ్మణుని పత్నిని. అందుచేత నాకు సౌభాగ్యము కలిగినది. ఆ సమయమున నీవు మమ్ములను బలాత్కరించితివి. ఇప్పుడు నీవు ఈ క్లేశము నుంచి తప్పించుకొనలేవు. ఓరి నిర్లజ్జుడా! ఆపదలచేత భయపడి పారిపోవుచున్నావెందుకు? దుష్టుడా! నేను నిన్ను తప్పక చంపుదును. నీవు ఎట్టి పనులను చేసితివో వాటికి అన్నింటికి ఇప్పుడు ఫలమును అనుభవింపుము" అనుచు వెంట పరుగెత్తును.

ద్విజవరులారా! ఇంకనూ పెద్ద పులులు, సింహములు, తోడేళ్ళు, గాడిదలు, రాక్షసులు, క్రూరమృగములు, కుక్కలు, కాకులు, ఈ జంతువులన్నియూ ఆ పాపులను తమ పట్టులోనికి తీసుకొనుటకు తత్పరులై ఉందురు. అట్లే యమధర్మరాజు దూతలు వారిని అసిపత్రవనము, తాళవనము అను పేరు గల నరకమునందు విసరి పడవేయుదురు. అచ్చట దుమ్ము, మంటలచేత నిండి ఉండి, దావానలము వలె అగ్ని ధగధగ మండుచూ ఉండును. పాపాత్ములైన ప్రాణులకు అగ్నిజ్వాలలు భరించలేనివిగా ఉండును. అప్పుడు వారు వృక్షముల క్రింద విశ్రాంతి తీసుకొనుటకై పోవుచుందురు. అచ్చట కత్తులతో సమానమైన ఆకులచేత వారి శరీరములు ఛిద్రమగుట జరుగును. మరల ఛిన్నాభిన్నములగుట, కాలుట వంటి ఘోరములైన దెబ్బలు తినిన కారణము చేత వారు మూలుగుచూ ఉందురు. వివిధ బాధలచేత శరీరమంతయూ దెబ్బలచే తట్టుకొనలేక వారు ఆర్తనాదము చేయుచుందురు. అసిపత్రము, తాళవనము అను పేరు గల నరక ద్వారముల యందు మహారథులు అయిన వీరులు పహరా కాయుచుందురు. వారి భయంకరమైన ఆకారము వర్ణింప వీలుకానిది.

విప్రులారా! నేను యమపురియందు అనేక అగ్నిజ్వాలలకు సమానమైన మండించు శక్తిగల పక్షులను చూచితిని. వానిశబ్దము అత్యంత తీక్షణముగాను, కర్కశముగను ఉండును. వారి స్పర్శ తగిలిన వెంటనే ప్రాణులు మండిపోవును. వాని ముక్కులు ఇనుము చేత తయారు చేయబడి ఉండును. మరియొక ప్రదేశమందు అత్యంత భయంకరమైన పెద్ద పులులు గుంపు ఉండును. కొన్ని చోట్ల మాంసభక్షులగు క్రూరమైన కుక్కల మంద ఉండెను. అట్లే అనేక కూరజంతువులు క్రోధముతో మండుచు, పాపులైన ప్రాణులను తినివేయుచుండును. ఒక ప్రదేశమున అసిపత్రవనము ఎలుగుబంట్లు,

ఏనుగులతో నిండిఉండును. యమలోకమునందు మేఘములు, ఎముకలు, పాషాణములు, రక్తము, బూడిద యొక్క వర్షము పడుచుండును. ఆ సమయమున పాపులగు ప్రాణులు వాటికి ఆహుతియై ఎగురుచూ, పరుగెత్తుచూ, చిందులు తొక్కుచూ ఉందురు. మిక్కిలి ఎక్కువగా ఆహుతులైన కారణము చేత వాని నోళ్ళ నుండి దారుణ శబ్దములు వెలువడు చుండును. ప్రతి ప్రాణి "అయ్యో! ఇప్పుడు నేను చచ్చితిని" అని అరచుచుండును. వారి కరుణాక్రందనముల చేత అన్ని దిక్కులు భయంకర శబ్దముతో నిండి ఉండును. ఒకచోట కొందరు ఏడ్చుచుందురు. మరియొక చోట కొందరు చెడు పద్ధతిలో బాధపడుచుందురు. ఒకచోట కొందరు మోటైన రాళ్ళ చేత వత్తబడు చుందురు. అట్లే కొందరు లేచుటకు ప్రయాసపడుచుందురు. అన్నిచోట్లా హాహాకారములతో నిండిన అత్యంత దీనమైన అరుపులు వినబడుచుండెను.

ఋషికుమారుడు నచికేతుడు ఆ మహర్షులను ఉద్దేశించి, ఆ నరకలోకమును గురించి ఇంకనూ ఇట్లు తెల్పెను. "మునివరులారా! తప్త, మహాతప్త, రౌరవ, మహారౌరవ, సప్తతాళ, కాలసూత్ర, అంధకార, కరీషక, కుంభీపాకము వంటి అంధకార రారవములు అను ఈ పది భయంకరమైన ప్రసిద్ధ నరకములు. వానియందు క్రమక్రమముగా రెట్టింపు, మూడురెట్లు, పదిరెట్లు కష్టములు, యాతనలను అనుభవింపబడవలసి వచ్చును. ప్రేతము అచట నుంచి రాత్రింబగళ్ళు మార్గముపై పోవుచూనే ఉండి యమపురికి చేరుకొందురు. దుఃఖితుల యొక్క దుఃఖము క్రమముగా ఎక్కువగుచు ఉండును. అట్లే అచ్చట మార్గములందును కేవలము దుఃఖమే దుఃఖము ఉండును. సుఖము ఎదురువచ్చు అవకాశమే ఉండదు. దుఃఖమే దుఃఖము చుట్టుకొనుచూ ఉండును. కొద్దిమాత్రమైననూ సుఖము లభించు ఎట్టి ఉపాయము ఉండదు. కుటుంబ సంబంధమైన బంధములు తెగిపోయి ఉండును. పంచభూతములు వేరై పోవును. అతడికి మృతి చెందినవాడు లేక ప్రేతము అను పేరు కలుగును. ఈ దుఃఖమునకు ఎచటనైననూ అంతము లభించుట అనునది అసంభవమైన విషయము. శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు అనునవి సుఖ సాధనములు, ఇవి ఉండినప్పటికినీ, ఆ జీవికి కొద్ది కూడా సుఖము లభ్యము కాదు. దుఃఖము యొక్క చివరి హద్దుపై చేరుకొనిన వ్యక్తికి శరీరము మనః సంబంధములైన అనేక క్లేశములు, కష్టములు కలుగుచునే ఉండును. ఒక ఇనుముతో తయారుచేయబడిన

వాడియైన ముళ్ళు అట్లే అత్యంతము వేడితో ఉండు ఇసుక చేత నిండిన నేలపై కాలుమోపవలసి ఉండును. మండుచుండిన అగ్ని వలె ఉండు అనేక పక్షులు ఆకాశమును నిండి ఉండును. అందుచేత వానికి అచ్చటకూడా కష్టములను ఎదుర్కొనవలసి వచ్చును. ఆకలి దప్పుల పరిస్థితి చరమ హద్దులకు చేరుకొనును. ఎచ్చటనైననూ ఈ స్థితియందు నీరు లభించిన యెడల అది కూడా చాలా వేడిగా ఉండును. కొన్ని ప్రదేశములందు చల్లటి స్థలము దొరికి ననూ ఆ శీతలత్వము కూడా చాలా భరించలేనట్లు ఉండును. పాపాత్ముడైన ప్రాణి త్రాగుటకు జలము లభించినను కోరికతో ఉన్ననూ అచటగల రాక్షసులు ఆ ప్రాణిని చెరువు దగ్గరకు తీసుకొని పోవుదురు. హంసలు, బెగ్గురు పక్షులచేత నిండి ఉన్న ఆ జలాశయము నందలి కమలములు, కుముదములు, జలాశయశోభను వృద్ధి చేయు చుండును. ప్రాణికి జలము త్రాగవలయునని హెచ్చుకోరిక ఉండినను పరుగెత్తుకొనుచూ అచటికి చేరిననూ అక్కడ గల జలము అత్యంత వేడిగా ఉండును. దానియందు పడిన వెంటనే వాని మాంసము ఉడికిపోవును. అట్లే రాక్షసుడు ఉదరము పూర్తిచేయుటయే వానికి సాధనము అగును. ఇంకనూ పాపాత్ములైన మనుష్యులు క్షారజలము గల మహా సరస్సునందు పడవేసినప్పుడు, దానియందు ఉండు అనేక జల జంతువులు ప్రాణిని తినుచుండును. కొంతకాలము ఈ విధముగా గడచిన తర్వాత ప్రాణి అచ్చట నుంచి ఎచ్చటకునూ పారిపోలేడు. ఈ విధముగా శృంగాటక వనము అను పేరు గల నరకమునందు తోడేళ్ళు అధికముగా తిరుగుచూ ఉండును. అత్యంత వేడిగా మండుచుండు ఇసుక చేత అచ్చటి భూమి నిండిపోయి ఉండును. అందుచేత పాపకర్మముల యొక్క పరిణామ స్వరూపములైన ఆ ప్రాణులు ఆ నరకముల ముందు మండుచూ, ముక్కుచూ, చచ్చుచూ, క్రిందపడుచూ, దెబ్బలు తినుచూ ఉండును. అంతేగాక అచట విషము గల సర్పములు, చాలా దుఃఖమును కలిగించు కుక్కలు కూడా కరుచుచుండును. భరింపలేని ఆ కుక్కల ఆకృతి నల్లగా అట్లే శ్యామవర్ణముగా ఉండును. అవి నిరంతరము, క్రోధావేశము నందు ఉండును. ఇచటనే కూటశాల్మలీ అను పేరు గల ఒక వేరొక నరకము కూడా కలదు. అది ముండ్ల చేత పరిపూర్ణముగా ఉండును. యమధర్మరాజు దూతలు దాని యందలి నరకజీవులను ఈడ్చుచూ ఉందురు. ఎప్పుడు కేవలము వాని ఎముకలు మాత్రమే మిగిలి ఉండునో అప్పుడు వారిని ఇతర ప్రదేశములకు పంపుదురు. అక్కడ కరంభవాలుక

అను పేరు గల ఒక నది కలదు. దాని వెడల్పు వందయోజనములు. వైతరణీ నదియొక్క విస్తారము ఏభై యోజనములు, దాని లోతు ఐదుయోజనములు. దానియందు చర్మము, మాంసములు, ఎముకలను ఛిన్నా భిన్నములను చేయునట్టి అనేక హింసాప్రవృత్తి గల ఎండ్రకాయలు నివసించు చుండును. ఆ పీతల దంతములు వజ్రముతో పోల్చదగినవి.

అచ్చట ధనుస్సునకు సమానమైన ఆకారముగల గుడ్లగూబలమందలు వ్యాపించి ఉండును. వాని వజ్రాకార నాలుకలు ఎముకలను ఖండఖండములు చేసి వేయును. అవి చాలా విషపూరితములగును. మహాక్రోధముతోను ఉండి అత్యంత భయంకరములుగా అట్లే ఎవరికినీ సహింపరానివిగా ఉండును. చాలా కష్టముతో ఆ నదిని దాటిన తర్వాత ఒక యోజనము బురద మార్గమును సరిచేయవలసి ఉండును. అప్పుడు కొన్ని ప్రాణులు సమతలముగా ఉన్న నేలమీదకు చేరును. అయిననూ వానిని ఉంచుటకు ఎట్టి గృహమును దొరకదు, ఆశ్రమమును లభ్యము కాదు.

వైతరణీ నదికి దూరముగా దక్షిణ దిశయందు మూడు యోజనములు ఎత్తుగల ఒక వటవృక్షము కలదు. దానిని సంధ్యాకాలమునందలి మేఘము వలె నిరంతరము కాంతిని వెదజల్లుచుండును. దాని ముందు 'యమచుల్లి' అను పేరు గల నది కలదు. దానికి కూడా లోతు మూడుయోజనములే. దాని ముందు వంద యోజనములు దూరముతో వ్యాపించి ఉన్న శూలత్రహా అను పేరు గల నరకము కలదు. అది పర్వతము వంటి ఆకారము కలది. అచ్చట మొక్కలకు ఏ మాత్రము స్థానము లేదు. అచ్చట అంతయూ కేవలము రాళ్ళే ఉండును. ఇచ్చటనే శృంగాటక వనము నందు అనేక రకములైన గడ్డి కలదు. కుట్టునట్టి నల్లని రంగు గల ఈగలు ఈ విశాల వనము యొక్క ప్రత్యేక భాగమునందు ముసురుకొని ఉండును.ఆ సమయమున పాపులైన ప్రాణుల యొక్క ఆకారము కీటకముల వలె ఉండును. ఈ హింసించు ఈగలు ప్రాణిపై ఆక్రమించి కుట్టును. ఇచ్చట అతడికి తల్లి, తండ్రి, పుత్రుడు అట్లే భార్య మొదలగు జనులందరూ నాలుగు దిశలయందును బంధనములతో పడి ఉందురు. ఇంకనూ వాని కన్నుల నుండి కన్నీరు ధారగా పడుచుండును. అచ్చట అచేతనముగా వారు పడి ఉందురు. స్మృతివచ్చిన తర్వాత వారందరూ "పుత్రా! రక్షింపుము పుత్రా! రక్షింపుము" అని ఏడ్చుచూ ఉందురు. ఇట్టి స్థితియందు యమదూతలు కర్రలు, ముద్గరములు, దండములు, గురనములు, వేణువులు,

సర్పాకారములైన తాళ్ళు, కొరడాలు, ముష్టులతో వారిని మర్ధించుచుందురు. అందుచే ఆ ప్రాణి ఎల్లప్పుడునూ మూర్ఛితుడుగా ఉండిపోవును". (198,199,200)

201, 202, 203 వ అధ్యాయములు - నరక క్లేశములు

అనంతరము ఋషిపుత్రుడగు నచికేతుడు ఇట్లు చెప్పెను. "విప్రులారా! ఒకసారి యమదూతలందరూ అలసిపోయి, పనిచేత విసుగుచెందిన వారై కూర్చుండిపోయిరి. పిమ్మట చేతులు జోడించి చిత్రగుప్తునితో "దేవా! మా శక్తి అంతయూ అయిపోయినది. మీరు వేరు ఇతర దూతలను ఈ పని చేయుట కొరకు యుక్తులను చేయుడు" అని ప్రార్ధింపగా చిత్రగుప్తుడు కనుబొమ్మలు ముడిచి తీవ్ర కోపమును పొందెను. వెనువెంటనే ఆయన మందేహ రాక్షసులను పిలువగా ఆ రాక్షసులందరూ అనేక విధములైన రూపములను ధరించి ఆయన ఎదుట నిలబడిరి. ఆ రాక్షసుడు ఆయనతో "ప్రభూ! యథాశీఘ్రముగా దయతో నాకర్తవ్యమును ఆజ్ఞాపింపుడు" అని ప్రార్ధించెను. అంతట చిత్రగుప్తుడు "మీరు నా ఆజ్ఞకు వ్యతిరిక్తముగా ప్రవర్తించుచున్న ఈ దూతలను పట్టుకొని వెంటనే వీరిని బంధించివేయుడు" అని ఆజ్ఞాపించెను. వెంటనే రాక్షసులు అలసిపోయి ఉన్న వారిని, బంధించబోయిరి. అంతట యమదూతలు "ఆకలి చేత బాధపడుచున్న వారిని, దుఃఖించుచున్న వారిని, లేక తపస్సు చేయుచున్న వారిని, దయనీయ వ్యక్తులను సేవకులు, లేక ఆత్మీయులను సరిగా గ్రహించి వారిపై దయచూపుట ధర్మము. నీవు మహాపురుషుడవు. ఆ కారణము చేత నీవు మమ్ములను బంధింపవలసినదని ఇట్టి ఆజ్ఞను ఇవ్వకుందురు గాక" అని వినతి చేసిరి. కానీ చిత్రగుప్తుడు వారి మాటలను లెక్కచేయలేదు. అందుచేత చివరలో దూతలకు మందేహులగు రాక్షసులకు భయంకర సంగ్రామము మొదలయ్యెను. దూతలు, మహాఘోరమగు పరాక్రమము గల వీరులు. వారి యుద్ధముచేత మందేహ రాక్షసుల సేన చిందరవందర అయినది. మరియొక వైపు "నాప్రాణములను రక్షింపుము, ప్రాణములను దానము చేయుము" అను అరుపులు, ఇంకొకవైపు "నిలునిలు పట్టుకొనుము, నరికి పార వేయుము" వంటి శబ్దములు పెద్దగా వ్యాపించుచుండెను. తమ శరీరాంగములు ఛిన్నాభిన్నములగు పిశాచముల యుద్ధభూమి నుంచి విముఖులై పారిపోవుట మొదలిడిరి. అట్టి సమయమున యమదూతల సైన్యములు క్రోధము చేత కన్నులు ఎర్రగా చేసి, వారిని పెద్ద కంఠధ్వనితో "నిలువుడు నిలువుడు ఎక్కడికి

పారిపోవుచున్నారు ధైర్యముగా ఉండుడు. ఇప్పుడు మేము మిమ్ములను లొంగదీసుకొన వలయుననుకొనుట లేదు" అని ఉచ్చైస్వరముతో అరచుచుండిరి. సరిగా అదే సమయమున యమధర్మరాజు త్వరగా అచ్చటకు ప్రవేశించెను. ఆయన అచ్చటకు వచ్చిన వెంటనే ఆజ్ఞాపించుట చేత ఆ యుద్ధము సమాప్తమైనది. అంతేగాక ఆయన చిత్రగుప్తునితో దూతలకు సంధి చేసెను.

అప్పుడు యమధర్మరాజు "దొంగసాక్ష్యము ఇచ్చువాడును, ఇతరులపై చాడీలు చెప్పువాడును అగు నీతిబాహ్యులు ఉన్న యెడల ఆ మానవునికి రెండు చెవుల యందును కాగిద్రవరూపములో ఉన్న మేకులను కొట్టుడు. అబద్ధము చెప్పువానికి కూడా ఇదే దండన వేయవలెను. గ్రామముల యందు తిరిగి యజ్ఞములను చేయించువాడు, ఏదో ఒక సిద్ధాంతము పై స్థిరముగా నిలువనివాడు, దంబాచారములు చేయువాడు, అట్లే ఎవరి మనస్సుయందు మూర్ఖత్వము నిండి ఉండునో అట్టి బ్రాహ్మణుని తాడుచే బంధించి ఒక భయంకర నరకమునందు పడవేయుడు" అని ఆదేశించెను. "ఎవని నోటినుండి ఎల్లప్పుడును, దుష్టవాక్కులు వెలువడునో ఆ పాపి యొక్క నాలుకను వెంటనే కోసివేయుడు. ఎవడు బంగారమును దొంగతనము చేయునో ఎవడు ఇతరులు చేసిన ఉపకారమును మరచి పోవునో, తండ్రిని ఎవడు హత్య చేసెనో వాడు, కౄరుడు, పాపాత్ముడు, అగు మానవుని బ్రహ్మఘాతుల యొక్క (బ్రాహ్మణులను హత్య చేసినవాడు) వరుస యందు కూర్చొనబెట్టుడు. ఇంకనూ వెంటనే వాని ఎముకలను ఖండించి, శిఖలతో పైకి రేగుచున్న అగ్ని కీలల యందు కాల్చి వేయుడు" అని భటులను ఆదేశించెను.

పరమర్షులారా! చిత్రగుప్తుని యొక్క ఆజ్ఞలను అనుసరించి అసత్యము చెప్పుటయందు నాలుగు భేదములు కలవు. అవి 1)ఇతరులను నిందించుట, 2) కటువుగా మాట్లాడుట 3) హింసాప్రజుడై ఎల్లప్పుడు అసత్యములాడుట, ఇట్లు అసత్యములాడువాడు కఠినుడు, మూర్ఖుడు, దయలేనివాడు, సిగ్గులేనివాడు, మూఢుడు, ఇతరుల మనస్సు నొచ్చుకొనునట్లు మాట్లాడువాడు, అట్లే ఇతరవ్యక్తులను ప్రసంశనీయులు, ఉత్తమగుణములు కలవారి యెడ ఓర్పు కలిగియుండుటలో అసమర్థుడు, కుత్సితమైన మరియు కఠోరమైన విషయములను మాట్లాడువారు, తన మనస్సునందు మూర్ఖత్వము నిండి ఉండినట్టి అధములైన మనుష్యులు బంధనములతో నరకమునందు పడుదురు. అటుపిమ్మట

పశుయోనియందు అట్లే పురుగుల, పక్షులు మొదలగు అనేక యోనులయందు జన్మించుటను అనుభవించును. దీనికి తోడుగా ప్రపంచమునందు దోషపూర్ణమగు పనులను చేయువాడు సమస్త ప్రాణులను ద్వేషించుటయందు నిమగ్నమైయుండు స్వభావము కలవాడు, అట్టి పాపకర్ములగు ప్రాణులు చాలాకాలము వరకు భయంకరమగు నరకములో పడి ఉందురు. నరకములో ఉండవలసిన కాలావధి పూర్తియైన పిదప వారికి మనిషి యోనియందు జన్మించుట ప్రాప్తించును. ఆ జన్మమునందు కూడా, కొందరికి వికృతమైన శరీరము, కొందరికి క్షీణించిన శరీరము, కొందరికి వికారమగు పొట్ట మొదలైనవి కల్గును. కొందరి తలకాయ, శరీరాంగములయందు ప్రణములు, కొందరికి అంగహీనత అట్లే వాత రోగములు కలుగును. కొందరికి కన్నుల నుండి కన్నీరు నిరంతరము కారుచుండును. అట్లే కొందరికి భార్య లభ్యము కాదు.

ఒకవేళ భార్య ఉన్ననూ సంతానశూన్యులగుట లేక తనవంటి సుందర లక్షణములు గల సంతానము లభ్యము కాక, కురూపి, వికారుడు కొట్లాటలు చేయుగుణములు కలవాడు అగు పుత్రాదులు లభ్యమగుదురు. అట్లే కన్నులు లేనివారు కూడా కావచ్చును" అని చెప్పెను.

అంతట యమధర్మరాజు "దూతలారా! ఎవరు దొంగనతము చేయుటయందు నిరంతరము తత్పరులై ఉందురో వాడు పశువులు లేక హీనమనుష్యుల శరీరము ప్రాప్తించు కొందురు. ఇంకనూ ఎల్లప్పుడూ దుఃఖము కలిగి ఉందురు. ఎవడు ధర్మశీలాది సంపన్నుడైన వారిని శుభలక్షణములు కలిగి ఉన్న వ్యక్తిని అవహేళన చేయునో, వారిని కొన్ని వేల సంవత్సరముల వరకు నరక యాతనలు అనుభవించుటకై నరకములలో పడవేయుదు.

ఇంకనూ నరక యాతనలను అనుభవించిన తర్వాత కూడా ఏ వ్యక్తులు నిర్లజ్జ, చిందరవందరైన శరీరాంగములు, దుర్బలమగు గాత్రము, స్త్రీ సమానమైన వేషము కలిగి స్త్రీకి లోబడి నిరంతరము స్త్రీల యందు ఆసక్తి, కలిగి స్త్రీల అధికారము చేత పెద్దవాడు అగువాడు, స్త్రీ కొరకే ప్రాప్తించిన పదార్థములను సొంతము చేసుకొనువాడు, కేవలము స్త్రీని దేవతగా గౌరవించుటలో విముఖుడు, స్త్రీలు పాటింపవలసిన నియమముల వేషమును అనుసరించి తాను స్వయముగా స్త్రీకి లోబడువాడు లేక వారి ఆలోచనలను తీసికొని సంసారమునందు ఉత్పన్నుడైన జన్మను పొందును. (201,202,203)

204, 205, 206 వ అధ్యాయములు - కర్మవిపాక నిరూపణము

ఋషిపుత్రుడు నచికేతుడు ఇట్లు చెప్పెను. మిత్రులారా! ఇప్పుడు నేను యమధర్మరాజు చిత్రగుప్తుల సంభాషణగా మీకు మరియొక ముఖ్య విషయమును చెప్పబోవుతున్నాను. దయతో దానిని ఆకర్ణింపుడు, చిత్రగుపుడు యమధర్మరాజునకు ఇట్లు చెప్పెను. "ఈ మనుషుడు స్వర్గమునకు పోవును. ఈ ప్రాణి వృక్షయోనియందు జన్మించెను. అతడు పశుయోనియందు ప్రవేశింపవచ్చును. అట్లే ఈ ప్రాణికి ముక్తి కలిగింపుము. ఈ వ్యక్తికి ఉత్తమగతి ప్రాప్తింపవలెయును ఈ జీవునికి తన పితామహ ప్రభృతి పూర్వ ఋషులతో కలియవలెను. తరువాత ఆయన ఇతర దూతలతో "మహాపరాక్రమము గల వీరులారా! ఈ నరుడు నిరంతరము ధర్మవిముఖుడుగానే తన జీవితమును గడిపివేసెను. ఇతడు సాధ్వి అయిన తన భార్యను పరిత్యజించెను. ఇతని వద్ద పుత్రపౌత్రులు ఎవరునూ నశింపకుండిరి, అందుచే ఇతడిని రౌరవనరకమునందు పడవేయుదురు గాక" అని ఆదేశించెను.

పిమ్మట మరల చిత్రగుప్తుడు "వీరందరు మహా ధర్మాత్ములు అయిన వ్యక్తులు. ఇట్టి నరులు ఇంతకు ముందు కాలమునాడు లేకుండిరి. అంతేగాక భవిష్యకాలమున ఉండరు. వీరియందు పాపము లేశమాత్రము లేదు. అందుచేత మీరు వీరినే వెనువెంటనే ఇచట నుండి పంపివేయవలసినదిగా తెలుపుడు. ఈ వ్యక్తి తన జీవితకాలము అంతయును ఎవరిని ఎన్నడును నిందింపలేదు. సంపద గల కాలమునందు, అట్లే విత్తులు ఏర్పడినందున కాలమునందుగాని ఎట్టి స్థితినందును వీరు తమ విద్యుక్త ధర్మములందును సంపూర్ణముగా యధావిధి పాటించిరి. ఆ కారణముచే వీరు స్వర్గమునకు పోయి అనేక కల్పముల పర్యంతము అచటనే వసింతురు గాక! ఈ నరుడు పూర్వకాలమునందు పరమధార్మికుడిగా ఉండెను. కాని ఇతడు మహా స్త్రీ వ్యసనలోలుడు, అందుచే ఇతనికి కలియుగమునందు మనిష్యయోని ప్రాప్తింపజేయుదురు గాక! అటు పిమ్మట స్వర్గమునందు వసించు భాగ్యము లభ్యమగును ఈ వ్యక్తి యుద్ధభూమి యందు శత్రుమూకలను చీల్చి చెండాడి, వధించిన పిమ్మట తాను స్వయముగా అసువులు బాసెను. బ్రాహ్మణులు, గోవులు ఇంకను దేశము కొరకూ యుద్ధమొనర్చెను. ఆ సంగ్రామమునందే తన ప్రాణములను చాలించెను. అందు చేత మీరు ఇతడితో వినయముతో ప్రవర్తించి అభ్యర్థింపవలెను. అంతేగాక ఈ వ్యక్తిని

విమానమునందు అధిరోహింపజేసి ఇంద్రపురియగు అమరావతికి చేర్చి అచట అతడు ఒక కల్పమునందు నివసింపజేయునట్లు చేయుదురు గాక! ఇచటనే ఉన్న మరియొక జీవి కూడా అతడి వలెనే ధర్మాత్ముడగు పురుషుడు. పరమ భాగ్యశాలియగు ఈ ప్రాణి నిరంతరము ధర్మపాలనము చేసెను. ఇతడి కాలమంతయు ప్రతిక్షణము ధ్యానము చేయుట యందే గడిపివేసెను. సమస్త ప్రాణులను దయతో ఆదరించెను. ఇతనికి సుగంధములతోను పుష్పమాలికలతోనూ వెనువెంటనే సన్మానపూర్వకముగా గౌరవింపుడు. ఈ మహాత్ముడగు వ్యక్తి యొక్క శిరముపై గంధమాల్యాలు చల్లి వింజామరములతో వీచుచూ అతడిని మహోత్తమ విధముగా పూజించి గౌరవింపవలసినది అని నా ఆజ్ఞ.

మరియొక ధర్మాత్ముని దర్శనము చేసుకొనుచూ చిత్రగుప్తుడు ఇతడును మహా యశస్వియైన పురుషుడు. ఇతని వలన సర్వప్రాణులను సుఖము పొందగలిగిరి. అందుచే ఇతడికిని సుఖమే కలుగుట అవశ్యకము ఇతడిని అనేక గుణముల చేత శోభస్కరముగా వెలుగొందుచున్న ఇంద్రుని నగరము అమరావతి నందు ప్రవేశపెట్టుదురు గాక! మహాధర్మాత్ముడగు ఈజీవి దేవేంద్రుడు స్వర్గలోకమునందు ఎంతకాలము వరకు వసించునో అంతవరకు ఇతడిని దేవేంద్రలోకమునే ఉంచవలెను. ఇతడికి ఎప్పటి వరకును ధర్మము వెంట ఉండునో అప్పటివరకు, స్వర్గమునందు భోగములను అనుభవించు అవకాశము లభించును గాక! కాలము అతిక్రమించిన తరువాత అతడు స్వర్గము నుంచి దిగి రావలసిన సమయము ఆసన్నమైన యెడల మనుష్యయోనియందు జన్మము పొంది సుఖములను అనుభవించును గాక! ఇతడు రత్నములతో చేయబడిన వేణువును తయారు చేయించి దానము ఇచ్చియుండెను. అంతేగాక సమస్త ధర్మములను విధిపూర్వకముగా ఆచరించియుండెను. ఇతడు అశ్వనీకుమార లోకమునకు తీసుకొని పోబడును గాక. ఇందులకు హేతువు ఆ అశ్వనికుమార లోకమునందు సమస్త విధములైన సుఖములను పొందగలుగు ఏర్పాట్లు సులభముగా లభ్యమగును. మరియొక జీవివైపు చూచుచూ చిత్రగుప్తుడు ఇతడు మహభాగ్యశాలియగు పురుషుడు. నిరంతర శ్రీహరిభక్తుడు, వైష్ణవ ఆచారవిధిగతుడు ఇతడు చేసిన పుణ్యకార్యములు ఇంతింతని చెప్పుట వీలుపడదు. ఆ హేతువుచే ఇతడు దేవాధిదేవుడు సనాతనుడు అగు శ్రీహరికి పార్శ్వమున ఉండదగినవాడు అందుచే ఇతడిని వైకుంఠలోకమునకు చేర్చిదురు గాక! ఇతడి త్యాగవృత్తి అంతులేనిది.

ఇతడు ఎక్కువగా పాలిచ్చు అనేక గోవులను, ఎందరో అవసరము గలవారికి దానముగా ఇచ్చెను. తన సర్వశక్తులను వినియోగించి ఇతడు నిత్యమును బ్రాహ్మణులకు గోదానము చేయుటయందు ఉత్సాహము గలవాడై ఉండెను. అంతేగాక మరియొక విషయము కూడా కలదు. ఇతడు మహా నిష్టాగరిష్టులు, పరమ పవిత్రులగు అనేకమైన బ్రాహ్మణులకు నిరంతర అన్నదానము చేయుచుండెను. రుద్రధేనువుతో (కామధేనువు) ఉపమింపదగు మనోహరములైన ఆ గోవులు కల్పాంతము వరకును. ఇతడి వెనువెంటనే ఉండగలవు. ఈ నరుడు ఒక కల్పము వరకును రుద్రలోకము నందే వసింపగలరు. ఇందు ఆవంతయు సందేహము లేదు. ఇతడు మధురములైన పదార్థములను సుగంధితమైన వస్తువులను రసదుగ్ధపరిపూర్ణములు సవత్సాయుత గోవులను అనేకములను బ్రాహ్మణులకు ఇచ్చి యుండెను. ఆ గోవుల సర్వాంగములను సువర్ణము చేత సుశోభితములై యుండెను. ఈ మహా దానపరుడైన పురుషునికి సంబంధించిన వృత్తాంతములను లిఖించియుండిన గ్రంథపుటిని నేను చూచితిని. దానియందు మూడు కోట్ల సంవత్సరములు పర్యంతము స్వర్గమునందు నివసించగలడని లిఖింపబడినది. అటు పిమ్మట మహాపురుషుల ఋషుల వంశమునందు జన్మించి ప్రవర్తింపగలడు అని చెప్పెను.

పిమ్మట మరియొక ప్రాణిని గురించి తెలుపుతూ చిత్రగుప్తుడు ఇతడు సువర్ణదాన మొనర్చినవాడు, ఇతడు దేవతల వద్దకు పంపబడును గాక. పిమ్మట వారి ఆజ్ఞలను పొంది ఉమాపతి, కైలాసమునకు అధిపతియగు రుద్రభగవానుని లోకమునకు పంపబడును గాక! ఇతడు మహాతేజశ్వంతుడని తెలియుచున్నది. ఇదే నిశ్చయము. రుద్రలోకమున ప్రవేశించి ఇతడు తన ఇచ్ఛానుసారము కోర్కెలను నెరవేర్చుకొను గాక! అని పలుకుచు మరికొన్ని ప్రాణులవైపు చూచియూ ఈ వ్యక్తులందరూ దానము చేయవలయున్న నిర్ణయమును నెరవేర్చుకొనువారు. అనేకులైన ప్రాణులు వీరికి అభివాదములు చేయుదురు అందుచే వీరికి స్వర్గప్రాప్తి కలుగు గాక! అనిపలికి మరియొకరి వైపు చూచుచూ ఈ జీవి మహాబుద్ధిశాలియగు ఈపురుషుడు ఇతని వలన సర్వజనుల అవసరములన్నియు తీర్చబడు చున్నవి. ఇతడు సర్వుల హితము కొరకు సంలగ్నుడై ఉండుచూ అట్టి కార్యములను సంధించుచుండెను. సర్వజనుల కోర్కెలను నెరవేర్చుచుండెను. ఈ ప్రాణి అందరి ఆదరాభిమానములకు పాత్రుడైనవాడు. ఇతడు సద్బ్రాహ్మణులకు ఎందరికో పృథ్వీదానము

చేయుచుండెను. ఇతడు స్వర్గములందు ప్రవేశించి బహుకాలము వరకును అచట ఉండుటకు అర్హత కలవాడు, పిమ్మట తన అనుయాయులతో కలిసి బ్రహ్మ లోకమునందు ప్రవేశము పొందును. మహాశ్రేష్ఠుడగు ఈ మానవునికి కోరుకొనిన భోగములతో పాటు సేవలు కూడా లభ్యము కావలయును. ఆ బ్రహ్మలోకమున ఇతడు అక్షయమగు స్థానమును పొంది అజరుడు కాగలడు. బ్రహ్మలోకమునందలి బ్రహ్మఋషి గణములు అందరును ఈ జీవిని ఆదరింపగలరు.

మరియొక పురుషుని చూపుతూ చిత్రగుప్తుడు ఈ ప్రాణి అందరికినిఅతిధి రూపములో ఇచటికి చేరియుండెను. సర్వేంద్రియములన్నియు ఇతని ఆధీనములో నుండెను. ఇతడు సమస్త ప్రాణులయందు దయ కలిగియుండెడివాడు. అంతేకాక అందరిని సమానముగా చూచుచూ నిరంతర అన్నదానము చేయుటకు ప్రవృత్తుడు అయి ఉండెడివాడు. తన పరివారము నందలి మనుషులందరూ భుజించు వరకు తాను ఎన్నడు అన్నగ్రహణము చేయువాడు కాడు. నా ప్రియమైన భృత్యులారా! ఇతనిని వెనువెంటనే ఇచటనుండి పంపివేయ బడును గాక!" అని యమధర్మరాజు తన నిర్ణయమును తెలిపియున్నారు.

ఈ ప్రాణి అనేక కన్యాదానములు ఒనరించియున్నాడు. అంతమాత్రమే గాక? బహుయజ్ఞములను చేసి వానిని సంపన్నములొనరించెను. ఆ హేతువుచే ఇతనికి పదివేల సంవత్సరముల పాటు స్వర్గసుఖములను అనుభవించు అవకాశము కల్పింపుము. అటుపిమ్మట ఇతడు సర్వప్రధమముగా మత్స్య లోకమున నివసించు ఒకానొక ఉత్తమ కులమునందు జన్మించునుగాక. పరమదయాళుడగు ఈ పురుషుడు పదివేల సంవత్సరముల పాటు దేవతలతో సమానముగా స్వర్గలోకమునందు సుఖపూరితముగా విరాజితుడై వసించును గాక! తదనంతరము ఇతడు మనుష్యని యందు జన్మించి సర్వ భూప్రజల గౌరవమును పొందును గాక! అని పలుకుచు, మరియొకని గురించి ఇతడు ఛత్రము, పాదరక్షలు, కమండలములను అనేకమార్లు దానమొనర్చినవాడు. మీరు ఇతడిని గౌరవింపుడు. వేలకొలది సభామండపములు ఏ దేశములో కలవో, ఆ దేశమునందు ఇతడిని విద్యాధరుని గావించి నాలుగు మహాపద్మ వర్షముల పర్యంతరం నిరంతర నివాసమొనరింపజేయుడు అని తన సేవకులను ఆజ్ఞాపించెను.

పిమ్మట నచికేతుడు విప్రులతో విప్రులారా! చిత్రగుప్తుడు చెప్పిన వేరొక మహాత్మ్యము గల విషయమును వివరించుచున్నాను, దానిని కూడా సావధానులై వినుడు అని పలికి ఇంకను ఇట్లు చెప్పెను. గోవులు దివ్యప్రాణులు. వాని సర్వాంగములయందును సర్వదేవతలు నివసింతురు. తమ శరీరమునందు అమృతమును ధరించి ఉండి ఈ ధరిత్రిపై ఆ అమృతమును సర్వులకు ఇచ్చుట గోవుల స్వాభావిక గుణము. అవి తీర్థములలో పరమ తీర్థములుగాను, పవిత్రముచేయు పదార్ధములలో పరమపవిత్రముగాను ఇంకను పుష్టి కారకములలో మహాపుష్టి ప్రధానములై ఉండెను. వారిచే ప్రాణులు సిద్ధి పొందుచుండెను. ఆ హేతువుచే ప్రాచీన కాలమునందును గోదానముల పరంపర కొనసాగుచునే ఉన్నది. గోవు పెరుగుచే, సమస్త దుగ్ధము చేత శంకర భగవానుడు, ఘృతముచే అగ్ని భగవానుడు, పాయసముచే పితామహుడగు బ్రహ్మ తృప్తి పొందుచున్నారు. గోపంచగ్రవ్య ప్రాశనము చేత అశ్వమేథ యజ్ఞపుణ్యఫలము ప్రాప్తింపగలదు. గోదంతములందు మరుద్గణములు, జిహ్వాయందు సరస్వతి, గిట్టలయందు గంధర్వులు, ఖరాగ్రభాగములందు నాగగణములు, సర్వసంధుల యందును సాధ్యగణము, చక్షులయందు సూర్యచంద్రులు కపుదము (శిరోగ్ర భాగము) నందు సర్వ నక్షత్రములు, తోకయందు ధర్మము, ఆపానమందు అఖిల తీర్థములు యోనియందు భాగిరధి నది, ఇంకను అనేక ద్వీపములు ద్వీపసంపన్నమైన చతుస్సముద్రములు, రోమకూపములందు ఋషి సముదాయము, గోమయమునందు పద్మజయగులు, రోమములందు సమస్త దేవతాగణములు అట్లే చర్మము, కేశములయందు ఉత్తర దక్షిణ అయనములు వసించుచుండును. ఇంతేగాక శౌర్యధృతి, కాంతి, పుష్టి వృధి, సుతి,వేద, లజ్జ, వపు, కీర్తి, విద్య, శాంతి, మతి, సంతతి, ఇవి అన్నియు గోవు వెనుక అనుసరించి నడుచుచుండును. ఇందు ఎట్టి సంశయము లేదు. గోవులు ఎచ్చట నివసించునో అందే సర్వజగత్తు, శ్రీలక్ష్మి, ఇంకను జ్ఞానదర్శనము సర్వములును వసించును. గోమహత్వమును గురించి వరాహపురాణములో మహత్వపూర్వకముగా వివరింపబడినది.

వరాహపురాణ వర్ణన :

దంతేషు మరుతో దేవా జిహ్వాయాంతు సరస్వతీ

ఖురమధ్యేతు గంధార్వాః ఖురాగ్రేషుతు పన్నగా |

సర్వసంధిషు సాధ్యాశ్చ చంద్రాదిత్యౌతు లోచనే

కకుదే సర్వనక్షత్రా లాంగూలే ధర్మ ఆశ్రితాః ।

ఆపానే సర్వతీర్థానీ ప్రస్రవే జాహ్నవీ నదీ

నానాద్వీప సమాకీర్ణాశ్చత్వారః సాగరాస్తథా ।

ఋషయో రోమ కూపేషు గోమయే పద్మధారిణీ

రోమే వసంతి దేవాశ్చ త్వక్కే శేష్వయనద్వయమ్ ।

ధైర్యం ధృతిశ్చ కాంతిశ్చ పుష్టి వృద్ధిశ్చ స్తథైవ చా

స్మృతిర్మేధా తథా లజ్జా వపుః కీర్తి స్తథైవ చ ।

విద్యా శాంతిర్మతి శ్చైవ సన్నతిః పరమాతథా

గచ్ఛన్త మనుగచ్ఛన్తి ఏతాగావో న సంశయః ।

యత్రగావో జగత్త్రత్ర దేవదేవ పురోగమాః

యత్రగావ స్తత్ర లక్ష్మీః సంఖ్యాధర్మశ్చ్య శాశ్వతః

సర్వరూపేషు తా గావస్తిష్ఠన్యభిమతాః సదా ॥

ఈ ధేనువును గురించిన పవిత్రవర్ణన చాలామాహాత్మ్యము కలది. (204,205,206)

207 వ అధ్యాయము - దానధర్మ మాహాత్మ్యము

పిమ్మట ఋషిపుత్రుడగు నచికేతుడు ఈ విధముగా మహాఋషులకు వివరించెను. "విప్రులారా! నారద మహాముని పరమ సాత్వికుడైన మహాపురుషుడు. అయినప్పటికినీ ఆయన మనస్సునందు కలహములను చూడవలయునను అభిలాష హెచ్చుగా ఉండుచుండెడిది. ఈ విధముగానే ఒకమారు ఆయన కౌతూహలచిత్తుడై పర్యటన గావించుచు, నేనచట ఉండగా, యమధర్మరాజు సభయందు ప్రవేశించెను. మహర్షి వచ్చిన విషయము తెలియగనే యముడు ఆయనకు పరమ ఆదరముతో స్వాగతించి సత్కారములనుచేసెను. పిమ్మట మునివర్యుడు సుఖాసీనుడై విశ్రాంతి తీసుకొనుచుండగా నారదునితో "ద్విజశ్రేష్ఠ! మీరు నా అదృష్టము వలన ఇచటకు నేడు వేంచేసి ఉన్నారు. మహామునివర్యా! మీరు సర్వజ్ఞులు. సర్వదర్శులు. సంపూర్ణ ధర్మముల యందు శ్రేష్టులుగా

పేరెన్నిక గన్నవారు. అంతేకాక గాంధర్వ విద్య (సంగీతము) ను, చారిత్రక విషయములను, పూర్ణముగా తెలిసినవారు. మీరు ఇచటకువచ్చి మమ్ము అనుగ్రహించుట చేత మీ దర్శనము మాకు లభించినది. మీ దర్శనము చేతనే మేమెల్లరమును పవిత్రమైతిమి. నిరంతర కలతలకు ఆవాసమగు మా అంతఃకరణములు శుద్ధములైనవి. మునివర్యా! ఇంత మాత్రమే గాక మీ పాదస్పర్శచేత మా రాజ్యమంతయు పునీతమైనది. భగవత్స్వరూపుడా! ఇప్పుడు మీరు మీ మనోరథమును తెల్పుడు." అనెను.

నారదుడు "రాజేంద్రా! నీ ప్రజాపాలన ధర్మాను సారమే కలదు. నీవు సత్యము, తపము, శాంతి, ధైర్యముల చేత సంపన్నములైన గుణ స్వరూపుడవు. సువ్రతుడా! నా మనస్సునందు ఒక గొప్ప సందేహము కలుగుచున్నది. దానిని దయతో నీవే వివరింపుము. సురోత్తమా! నా సంశయము ఏమనగా ప్రాణులు ఏయే వ్రతధారణల చేత నియమ, దాన, ధర్మాది తపస్సు యొక్క ప్రభావముచే అమరత్వము పొందగల్గుచున్నారు? అందుకు వారు ఆచరింపవలసిన విధి, కృత్యములు. ఎటువంటివి? ఎందరో మాహాత్ములు ఈ లోకమున అతులనీయమగు శ్రీకీర్తి మహాఫలములనే గాక పరమ దుర్లభములగు సనాతన పదమును కూడా పొందగల్గుచున్నారు. ఇందుకు విరుద్ధముగా కొందరు తమ జీవితములు అంతయు కేశములను అనుభవించి మరణించిన పిదప నరకమును చేరుకొనుచున్నారు. తమరు తత్వపూర్వకముగా ఈ సర్వవిషయములను మాకు కరుణతో స్పష్టముగా వివరింపుడు" అని ప్రశ్నించెను.

అంతట యమధర్మరాజు నారదునితో ఇట్లు పల్కెను. "తపోధనా! నీవడిగిన సందేహములకు సంబంధించిన సర్వ విషయములను సమూలముగా వివరించుచున్నాను. వినుడు. అధర్మము చేసినవారి కొరకు నరకము నిర్మింపబడి ఉన్నది. పాపులగు మానవులే అచ్చటకు చేరుకొందురు. అగ్నిహోత్రము చేయనివారు, సంతానహీనులు, భూదానము ఒనర్పనివారు, ఇంకనూ మరికొన్ని విధులను ఆచరింపని నరులు మరణించిన పిదప నరకమునకు వచ్చుదురు. వేదములను తుదముట్ట చదివిన విద్వాంసులు, శూరులు, వీరులగు పురుషులు, నూరు సంవత్సరముల ఆయుర్దాయమును గడుపుదురు. ఏ మానవుడు స్వామి ఆజ్ఞలను యధాక్రమముగా పాటింతురో ఎవరు నిత్యము సత్యభాషణము చేయుదురో అట్టివారు నరకమున ప్రవేశింపరు. ఎవరు ఇంద్రియములను తమ వశమందు

ఉంచుకొనిరో, తమ స్వామికార్యములను శ్రద్ధగా నిర్వహింతురో, అహింసను పాటింతురో, యత్నపూర్వకముగా బ్రహ్మచర్యపాలన మొనరింతురో, ఇంద్రియ నిగ్రహమును, బ్రాహ్మణ భక్తియును కలవారో, వారు ఎన్నడునూ నరకము దిశయే చూడరు. పతివ్రతలైన స్త్రీలు, ఏకపత్నీవ్రత మాచరించు పురుషులు శాంతస్వభావులు, పరస్త్రీ విముఖులు, సర్వప్రాణులను తన వలెనే భావించువారు, సమస్త జీవులయెడ దయ కలిగి ఉద్యుక్తులైయుందురో అట్టివారు ఏనాడునూ అంధకారావృతమై పాపులచే నిండబడియుండు నరకము అను పేరుగల ప్రదేశమునకు ఎన్నడునూ రానేరాడు.

ఈ విధముగా ఏ ద్విజుడు జ్ఞానియై, సాంగోపాంగముగా విద్యాధ్యయనము, ఈ ప్రపంచముపట్ల ఉదాసీనదృష్టి కలవాడు నరకము చూడడు. తన యజమాని కొరకు తన ప్రాణములను బలిపెట్టువారు, నిరంతరము దానము చేయుచూ సర్వప్రాణుల హితము నందు సంలగ్నులగువారు, తమకు జన్మనిచ్చిన మాతాపితలకు ఉత్తమ పద్ధతిలో సేవ చేయువారు నరకమునకు చేరుకొనరు. తగు మాత్రమున తిలలు, గోవులు, పృథ్వీదానము చేయువారికిని, నరకప్రాప్తి కలుగదు. ఇది నిశ్చయము. శాస్త్రోక్త విధిననుసరించి యజ్ఞము చేయుట, చేయించుటయందును, చాతుర్మాస్య వ్రతమును, ఆహితాగ్నివ్రత నియమములను పాటించుచూ, మౌనవ్రతమును ఆచరించువారును, నిరంతర స్వాధ్యాయపరులును, అట్లే శాంతస్వభావులై ఉండువారును అగు ద్విజులు యమపురియందు నన్ను దర్శింపరు. జితేంద్రియులు, పర్వముల కంటే భిన్నములైన కాలములందు కేవలము ఋతు కాలమునందు మాత్రమే తన భార్య వద్దకు పోవువాడు కూడా నరకమునకు చేరడు. ఇట్టి బ్రాహ్మణులే దేవతా స్వరూపులు అగుదురు. ఇందు ఎట్టి సంశయమును లేదు. ఎవరు సర్వకామనల నుంచి నివృతులై ఎవరి నుంచియునూ ఎట్టి ఆశను కలిగి ఉండరో, నిరంతరము తన ఇంద్రియములను వశమునందుంచుకొందురో అట్టివారు కూడా ఈ ఘోరమైన ప్రదేశమగు నరకము నందు ఎన్నడునూ ప్రవేశింపరు." అని యమధర్మరాజు వివరింపగా నారదుడు మరల సూర్యపుత్రుని ఇట్లు ప్రశ్నించెను.

"సువ్రతుడా! దానములందు ఎట్టి దానము ప్రశస్తమైనది. ఎట్టివాడు దానస్వీకరణకు పాత్రుడగును. దానము చేయుట చేత ఎట్టి ఫలము ప్రాప్తించుచున్నది? అంతేగాక ఎట్టి కర్మము శ్రేష్ఠకర్మము అగుచున్నది. నరుడు ఎట్టి ధర్మమును సంపాదించుట

చేత స్వర్గలోకము నందు ప్రతిష్ఠను పొందగల్గుచున్నాడు. ఎట్టి దానము యొక్క మహిమ చేత పరిణామ స్వరూపముగా నరుడు సుందరరూపమును, ధనదాన్యములను, దీర్ఘాయువును, అట్లే ఉత్తమ వంశమును పొందగల్గును. ఈ విషయమును దయతో నాకు తెలియజేయుము." అని ప్రశ్నించెను.

ధర్మస్వరూపుడగు యమధర్మరాజు నారదునికి ఇట్లు చెప్పెను. "దేవర్షి! దానము చేయు విధులు, దాన విధానములు అగణితములు. అవి శతవర్షముల కాలము తెలిపినను పూర్తియగుటకు సమర్ధములు కావు. అయినను మనుష్యుడు ఉత్కృష్ట ఫలమును పొందు దానముల ప్రభావమును సంక్షేపముగా తెల్పుచున్నాను వినుము. తపస్సు ఒనరించుట చత స్వర్గప్రాప్తి సులభమగుచున్నది. తపస్సుచే దీర్ఘాయువు, భోగోపకారులగు వస్తువులు లభ్యములగును. జ్ఞాన విజ్ఞానములు, ఆరోగ్యము, రూపము, సౌభాగ్యము, సంపద, ఇవి అన్నియు తపస్సుచే ప్రాప్తములగును. కేవలము మనస్సునందు సంకల్పము చేత మాత్రమే ఎవరికిని ఎట్టి సుఖభోగములు ప్రాప్తింపవు. మౌనవ్రతమును పాటించుట చేత అవ్యాహత ఆజ్ఞాశక్తి లభించును. దానమొనర్చుట చేత అనుభవించుటకు తగిన వస్తువులును, అట్లే బ్రహ్మచర్యమును పాటించుట చేత దీర్ఘకాలము జీవించుటయును ప్రాప్తించును. అహింసా ఫలస్వరూపముగా సుందరమైన రూపము, దీక్షను వహించుట చేత ఉత్తమ వంశమునందు జన్మించుటయును లభ్యమగుచున్నవి. ఫలములు, దుంపలను తిని జీవించువారు, కేవలము ఆకులు, జలములు ఆహారముగా స్వీకరించువారు, స్వర్గప్రాప్తి పొందుదురు. పయోవ్రతము (పాలుమాత్రమే స్వీకరించుట)ను పాటించుటచే స్వర్గప్రాప్తి, గురుసేవారతుడగుటచే మహత్త్వ సంపద లభ్యములగును. శ్రాద్ధము, దానములొనర్చిన ప్రభావముల చేత పురుషులు పుత్రవంతులగుదురు. ఎవరు తగిన విధముగా దీక్షా స్వీకారము చేసి, తృణాది శయ్యపై పరుండి తపము చేయువానికి గోసంపద, ఇతర సంపదలు లభ్యములగును. ప్రాతఃమధ్యాహ్న సంధ్యాకాలములందు, త్రికాలములలోనూ స్నానమొనరించు అభ్యాసి బ్రహ్మప్రాప్తి పొందగల్గును. కేవలము జలము మాత్రమే స్వీకరించి తపస్సు చేయువాడు తన అభీష్టములను ప్రాప్తింపజేసుకొనును.

మహర్షీ! యజ్ఞశీలుడగు పురుషుడు స్వర్గమే కాక ఇంకనూ అనేక ఫలములను పొందుటకు అధికారి యగును. పది సంవత్సరముల కాలము పాటు కేవలము జలములు

మాత్రమే త్రాగి తపస్సు చేయుచు, లవణాది రసాయనిక పదార్థములను స్వీకరింపక ఉండునో వానికి సర్వసౌభాగ్య ప్రాప్తి కలుగును. మాంసమును త్యజించిన నరునికి సంతానము, దీర్ఘాయువు కలదగును. చందనము, పుష్పమాలలు లేకుండా తపోవంతుడగు మానవుడు సుందరమైన స్వరూపము కలవాడగును. అన్నదానము చేయుట చేత నరునకు జ్ఞానము, స్మరణ శక్తి సంపన్నత కలుగును. ఛత్ర దానము చేయుటచే ఉత్తమ గృహము, పాదరక్షల దానముచే చక్కని రథము అట్లే వస్త్రదానము చేయుటచే సుందర రూపము, విశేష ధనము, సంతానప్రాప్తిలచే సంపన్నుడగును. ప్రాణులకు నీటిని త్రాగుటకు ఇచ్చుట చేత నరుడు నిరంతరము తృప్తి కలవాడగును. అన్నము, జలము రెండింటినీ దానము చేసిన ప్రభావము చేత ప్రాణులకు సర్వకామనలు సంపూర్తిగా పూర్ణములగును. సుగంధితములైన పూలు, ఫలములచే నిండియుండిన వృక్షములను దానమిచ్చిన వానికి అన్ని విధములైన భోగవస్తువులు నిండిన గృహము లభ్యమగును. అతడు ఇంటియందు సుందరులైన స్త్రీలు అమూల్యమైన రత్నముల చేత పరిపూర్ణముగా నిండియుండిన అన్నము, వస్త్రములు, కలుగును. జలములు, ఫలరసములను దానమిచ్చిన వ్యక్తికి మరుజన్మము నందు సర్వములును సులభములగును. బ్రాహ్మణులకు చందనము, అగురు ధూపమును దానము చేసిన వానికి సుందరమైన రూపము, నిరోగమగు జన్మము లభ్యమగును. బ్రాహ్మణునికి అన్నము, సమస్త ఉపకరణములతో కూడిన గృహదానము చేసిన వారికి జన్మాంతరమునందు అనేక గజములు, అశ్వములు, స్త్రీలు, ధనము మొదలగు వానిచే నిండియున్న ఉత్తమగు సుందర నివాసము ప్రాప్తించును. ధూపదానము చేయుట చేత నరునకు గోలోకమునందును, అట్లే వసులోకమునందు వసింపగల్గిన అవకాశము సులభముగా లభ్యమగును. ఏనుగులు అట్లే బలిష్ఠములగు వృషభములను దానము చేయుట చేత ప్రాణి స్వర్గమునకు పోయి, అచ్చట అంతులేని, ఎన్నడును తరగని దివ్య సుఖములను అనుభవించును. ఘృతదానము చేసినవానికి సుకుమారత్వము, అట్లే తైలదానము చేసిన నరునకు స్ఫూర్తి, శరీర కోమలత్వము ఉపలబ్ధములగును. తేనెను దానము చేయుట చేత ప్రాణి మరియొక జన్మమునందు అనేక రకములగు రసముల చేత నిరంతరము తృప్తి చెందియుండును. దీపదానము చేయుట చేత అంధకార కష్టము కలుగదు. అట్లే పాయసదానము చేసిన వ్యక్తికి శరీరము దృఢంగా ఉండును. పులగము

దానము చేసిన వ్యక్తికి కోమలత్వము, సౌభాగ్యము లభ్యమగును. ఫలదానము చేత పుత్రవంతుడు, భాగ్యశాలికాగలడు. రథదానము చేయుటచే దివ్య విమానమును పొందును. దర్పణదానము చేత ఉత్తమ భాగ్యమును పొందును. ఇందు ఎట్టి సంశయమును లేదు. భయభీతుడైన ప్రాణికి అభయ ప్రధానము చేయుటచే మనుష్యునకు సర్వకామనలు సిద్ధింపగలవు. (207)

౨౦౮ వ అధ్యాయము - పతివ్రతోపాఖ్యానము

అనంతరము ఋషిపుత్రుడు నచికేతుడు మునులతో ఇట్లు చెప్పెను. విప్రవరులారా! యమునికి ఒకనాడు, ముహూర్త కాలంలో ఆకాశంలో విమానాలలో వెళుతున్న బ్రాహ్మణులు కనిపించారు. వారు దివ్యభరణాలు అలంకరించుకున్నారు. వారు ఎక్కిన విమానాలు సూర్యునిలా మెరుస్తున్నాయి. వారు తపఃసిద్ధులు. వారితో వారి పత్నులూ, బాంధవులు పరస్పరానురాగంతో ఉన్నారు. వారిని చూచిన వెంటనే యమధర్మరాజు ముఖం వివర్ణమైపోయింది. క్రోధము, మిక్కిలి దుఃఖము కలిగి ప్రభను, తేజస్సును కోల్పోయాడు. అలా ప్రభాహీనుడైన ఆ ధర్మరాజును చూచి నారదుడు "నీవు అపర శివునిలా వెలిగే వాడవు. నీముఖం క్షణంలో వివర్ణమైపోయింది ఎందువల్ల? బాధపడుతున్నవు, భయపడుతున్నావు ఎందుకని? ఇది చెప్పు" అన్నాడు. యముడు "మహాముని! యాయావరులనే విప్రులు ఉన్నారు. వారు ఉంఛవృత్తి పరాయణులు, అసూయరహితులు, నిత్య యోగులు, అతిథి మర్యాదలు చేసేవారు, జితేంద్రయులు. వారికి తామంటే గర్వం. వారంతా నామీదగా వెళుతున్నారు. కానీ నన్ను మెచ్చుకోలేదు. నా వశంలో ఉండేవారు కూడా కాదు. వివిధ గంధాలు, ఆభరణాలు ధరించి, పరివార సమేతంగా వెళుతున్న వారు, నా మీదకు దండలు వదులుతున్నారు. మృత్యుస్వరూపుడైన నేను తపస్సిద్ధులకు ఉన్నా లేనట్లే! మహాత్ములను నేను ఆపనూ లేను, అనుగ్రహించనూ లేను. అందుకే బాధపడుతున్నాను" అన్నాడు.

ఇంతలో అక్కడికి విమానంలో ఒక పతివ్రత వచ్చింది. ఆమె గొప్ప కాంతితో మెరిసిపోతోంది. ఆమెతోపాటు భర్త, పరిచారకులు, సంరక్షకులు ఉన్నారు. చూడ ముచ్చటగా ఉన్న ఆమె ధర్మురాలు, పుణ్యస్త్రీ. ఆమె విమానంలో మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి. ఆమె విమానంలో నుండే ధర్మరాజుతో "మహాబాహు! నీవు

సత్యవంతుడవు, కృతజ్ఞుడవు. ఇలా బ్రాహ్మణులపై తపస్వులపై ఈర్ష పడకు. వారు వేదపారంగులు. వారి తపోబలము, మహత్యము ఊహించలేము. పూజ్యులు సర్వదేవతా స్వరూపులైన ద్విజులపై మాత్సర్యము, క్రోధము కూడదు. రాగం, రోషం, మోహం సజ్జనుల పట్ల ఎన్నడు వహింపదగినవి కావు'', అన్నది. ధర్మరాజు పూజించగా గగనంలో మెరుపుల తూర్పుగా ఆమె వెళ్ళిపోయింది. నారదుడు ధర్మరాజుతో "రాజా! ఈ మహాభాగు రాలెవరు? చక్కని రూపంతో ఉన్నది. ఆమెను నీవు పూజించావు. నీకు హితం చెప్పి వెళ్ళింది. ఆమె ఎవరో తెలుసుకోవాలని కుతూహలంగా ఉన్నది. నాకు వివరంగా చెప్పు" అన్నాడు.

యమధర్మరాజు ఇట్లు చెప్పెను. "దేవర్షి! నేను ఏ మహాస్త్రీని పూజించితినో ఆమె కథ పరమసుఖదమైనది. ఆ వృత్తాంతమును నీకు విస్తారముగా వివరించెదను. తండ్రీ! పూర్వకల్పమునందలి కృతయుగమునందు జరిగిన వృత్తాంతమిది. నిమి అను పేరు గల ప్రసిద్ధుడైన మహాతేజస్వి, సత్యవంతుడు, ప్రజానురంజక పరిపాలకుడగు నొక రాజు కలడు. ఆయనకు ఒక పుత్రుడు ఉండెను. అతడి పేరు మిథి. కేవలము తండ్రి వలన జన్మించిన కారణము చేతనే ఆతడిని జనులు జనకుడు అని పేరుతో పిల్చుచుండిరి. ఆతడి భార్య మహాసుందరియగు రూపవతి అను పేరు గల గుణవతి. ఆమె నిరంతరము తన భర్త హితమును కోరుటయందే తత్పరురాలై ఉండెను. భర్త ఆజ్ఞలను పాటించుట, ఆతడియందు నిరంతర శ్రద్ధాభక్తులు కలిగియుండుట అట్లే శుభకర్మములందు నిమగ్నరాలై యుండుట ఆమెకు స్వాభావిక గుణములుగా ఉండెను. తన స్వామి (భర్త) వచనములను అనుసరించి ఎంతో ప్రశాంతచిత్తురాలై వెనువెంటనే ఆతడాదేశించిన కార్యములందు తత్పరురాలై ఉండెను. మిథి మహారాజు కూడా గొప్ప తపస్వి, సత్యసమర్ధకుడు. ఇంకనూ సర్వప్రాణుల హితమునందే తన సంపూర్ణ కాలమును వినియోగించుచుండెను. ఆయన శ్రమ ధర్మపూర్వక కృషితో సంపూర్ణ భూమండలమును పాలించుచుండెను. ఆయన పరిపాలనా కాలమునందు రోగములు, ముసలితనము, మృత్యువులు లేనందున మృత్యువు యొక్క శక్తి కుంఠితమయ్యెను. పరమ తేజోవంతుడైన జనకుని రాజ్యమునందు దేవతలు సకాలమునందు వర్షములు కురిపించుచుండిరి. ఆయన రాజ్యమునందు దుఃఖవంతుడు మరణాసన్న కాలము సమీపించిన వాడు, వ్యాధిగ్రస్తుడు, దరిద్రముచే పీడింపబడినవాడు అగు వ్యక్తి చూచుటకైన కనిపించక ఉండిరి.

మహర్షీ! చాలాకాలము ఈ విధముగా జరిగిన తర్వాత ఒకనాడు ఆయన భార్య రూపవతి నమ్రతాపూర్వకమైన పలుకులతో భర్తతో "రాజా! మన సంపత్తి అంతయూ భ్రుత్యులు, బ్రాహ్మణులు, పరిజనులయొక్క సుఖమునకై ఏర్పాట్లు చేయుటలో నెమ్మదినెమ్మదిగా సమాప్తమగుచున్నది. ప్రస్తుతము మన కోశాగారమునందు కొద్దిపాటి అవశేష ధనమును లేదు. ఎక్కువగా చెప్పుట ఎందులకు? ప్రస్తుతము మన భోజనము కొరకు కూడా అవసరమగు ధనము నిండుకొన్నది. మన వద్ద ఇప్పుడు గోధనము, వస్త్రములు, పాత్రలు కూడా మిగిలి లేవు. మహారాజా! ఇట్టి పరిస్థితులలో నా కర్తవ్యము ఎట్టిదో దయతో తెలియజేయుడు. నేను తమ ఆజ్ఞను పాటించు దాసిని గదా!" అని విన్నవించెను.

భార్య మాటలను వినిన మిథి "భామినీ! నీ ఆలోచనకు విరుద్ధముగా నేను ఎన్నడునూ ఏమియును చెప్పవలయుననుకొనుట లేదు. అయినను ఒక్కమాట వినుము. శత సంవత్సరముల పర్యంతము మనము హవిష్య భోజనము పైననే గడుపుచూ కాలము పుచ్చితిమి. ప్రియురాలా! ఇప్పుడు మనము గుద్ధలి (భూమిని త్రవ్వు సాధనము)కట్టెల సహాయము చేతనే వ్యవసాయము చేయుదము. ఈ విధముగా శ్రమించుట చేత జీవనము గడుపుట వలన మనకు శుద్ధమగు ధర్మప్రాప్తి కలుగగలదు. దీనియందు ఎట్టి సంశయము లేదు. ఇట్లు చేయుటచే మనకు భక్ష్య, భోజ్యములకు, ఆవశ్యకమగు వస్తు సంభారము లభ్యము కాగలదు. అంతేగాక మన జీవిక కూడా సుఖమయముగా ఉండగలదు" అని పల్కెను.

మిథి మహారాజు ఈ విధముగా చెప్పిన పిదప రాణి రూపవతి "మహారాజా! మీరు మహాయశస్వులగువారు, మీ సౌధమునందు సేవకులు, శూరులగు వీరులు అశ్వగజములు, ఒంటెలు, మహిషములు, ఖరములు అనేకములు వేల సంఖ్యలో గలవు. మీ ఇచ్ఛానుసారము వీరందరునూ కృషి కార్యమును చేయలేరా?" అని ప్రశ్నించెను. అంతట మిథి మహారాజు తన రాణితో "వరాననా! నా వద్ద గల సేవకులు ఈ రాజ్యమును రక్షించుట యందు తమ తమ పనులలో నియుక్తులై ఉండిరి. ఇంకను అందరును తమ తమ పనులయందు సంలగ్నులై ఉన్నారు. దేవీ! మన వద్ద గల సర్వపశువులు, బలిష్టములైన ఎద్దులు, కంచరగాడిదలు, అశ్వములు, గజములు, ఒంటెలు మొదలగునవి

కూడా రాజ్య విధులయందు నియుక్తములై ఉన్నవి. శ్రేష్ఠురాలా! ఇదే విధముగా ఇనుము, రాగి, ఇత్తడి, బంగారము, వెండి మొదలగు లోహములతో తయారు చేయబడిన ఉపకరణములు కూడా రాజ్య కర్మములయందే కలవు. అందుచేత వానిని అన్నింటినీ వదలివేసి ఇప్పుడు మనము ఎచటికైననూ పోయి ఉపయుక్తమగు ప్రదేశమునందు భూమి, యినుము మొదలగు పదార్థములను అన్వేషింపవలయును. ఎచ్చటకైనను ఉపయుక్తమగు భూమి ఒక గుద్దలి లభ్యమైన యెడల తేలికగా నేను కృషి కార్యము (వ్యవసాయము) చేయగలను. అని పల్కగా రూపవతి “రాజా! నీకు ఇష్టము వచ్చినట్లు పోవుదము. నేను కూడా నీ వెనువెంటనే వచ్చెదను” అని పల్కెను. ఈవిధముగా వారిరువురి మధ్య సంభాషణ జరిగిన తర్వాత మిథి మహారాజు తన సహధర్మిణితో కలసి అచ్చటనుండి వెడలిపోయెను. సరియగు స్థానము, క్షేత్రము మొదలగువానిని అన్వేషించుచూ వారిరువురునూ పర్యాప్తముగా మార్గమును పరిశీలించుచూ పోవుచుండిరి. అంతట రాజు ఒక ప్రదేశము వద్ద ఆగి “వరవర్ణినీ! ఈ క్షేత్రము కళ్యాణ ప్రదమైనదని అనిపించుచున్నది. ఇచ్చట నీవు ఆగిపొమ్ము. నేను ఇచ్చట గల గడ్డిగాదములను కోయుచుండగా, అనంతరము నీవు ఇచ్చట తృణపత్రములను దూరముగా పారవేయుచూ శుభ్రము చేయుచుండుము” అని చెప్పెను.

రూపవతి మిథి మహారాజు రాజు చెప్పిన మాటలను విని నవ్వుచూ మృదుమధురమైన పలుకులతో “ప్రభూ! ఇచట కేవలము వృక్షములు, మనోహరములగు వివిధ వర్ణములు గల లతలు మాత్రమే కన్పించుచున్నవి. అయిననూ సమీపమున కించిన్మాత్రము కూడా జలము కనిపించుట లేదు. ఇచ్చట వ్యవసాయము చేయుటచే హృదయమునందు చింతయే మిగులును. అందుచే కృషి కార్యమును మనము ఎట్లు చేయగలము? ఇచటకు దగ్గరలో వేగవతీ నది ప్రవహించుచున్నది. అంతేగాక ఇచ్చట గల భూమి కూడా గులక రాళ్ళమయముగా ఉన్నది. ఇట్టి స్థానము నందు వ్యవసాయము చేయుటచే మనకు ఎట్టి సఫలత లభ్యము కాగలదు” అని ప్రశ్నించెను.

రూపవతి పల్కిన మాటలను విని మిథి మహారాజు మధురవచనములతో ప్రియా! ఇంతకు ముందువలెనే ఇచ్చట కూడా సంపదలను సంగ్రహింపగలదు. చాలా సమీప ప్రాంతమునందే జలము లభ్యము కాగలదు. అంతేగాక నలుగురు మనుష్యులు ఇచ్చట చేరినయెడల ఇచ్చట కూడా కించిన్మాత్రమైననూ ఎట్టి కష్టమును ఉండదు.

మహాదేవి అటు చూడుము. అది గృహము. ఇచ్చట ఎట్టి బాధలను కలుగుటకు అవకాశము లేదు. అని ఇంత మాత్రము చెప్పిన పిదప రాజు తన భార్యతో కలిసి ఆ క్షేత్రమును శోధించుట మొదలిడెను. క్రమముగా సూర్యుడు, ఆకాశ మధ్యభాగమునకు చేరుకొనుటచే ఆ సూర్యుని ఉగ్రమగు ఎండ వ్యాపించగా రాణి దప్పిక చేత మిగుల ప్రయాసనొందెను. తపస్వినియైన ఆ వనితకు ఆకలి కూడా బాధింప మొదలిడెను. కోమలమైన ఆమె పాదములు కాలినరాగి పాత్రవలె ఎర్రగా కమిలిపోయెను. ఎండ యొక్క వేడిమి చేత వారు మిక్కిలిగా బాధింపబడిరి. అంతట రాణి అత్యంత వ్యధితురాలై, పతితో "మహారాజా! నేను ఎండ వేడిమి చేత పీడితురాలనై దప్పిక వలన వ్యాకులపాటు పొందుచున్నాను. రాజా! దయతో శీఘ్రముగా నాకు జలమునిచ్చు ఏర్పాటు కల్పింపుము." అని వినుతించెను. అంతట రూపవతి బాధచే, దుఃఖముచే అత్యంత సంతప్తురాలైన కారణము వలన తన చైతన్యమును కోల్పోయెను. ఆ కారణము చేత ఆమె భూమిపై పడిపోయెను. భూమిపై పడిపోవు సమయమున ఆమె మనస్సున క్రోధము అంకురించినది. అప్పుడే ఆమె దృష్టిపథము స్వతఃగా సూర్యునిపై పడినది. పిమ్మట ఆకాశమునందుండి కూడా సూర్యభగవానుడు భయము చేత కంపింప తొడగెను. ఆ మహాతేజశ్వంతుడగు దేవునికి ఆకాశమును వదిలి ధరాతలముపై వచ్చి వివసుడు కావలసి వచ్చినది. ఈ ప్రకృతి విరుద్ధమైన విషయమును చూచి జనకమహారాజు (మిథి) "తేజోవంతుడా! నీవు ఆకాశమును త్యజించి ఇచ్చటకు ఎట్లు చేరుకొంటివి? నీవు మహాతేజశ్వంతుడవగు దేవుడవు కదా! సర్వప్రజలను నీకు అభివాదము చేయుదురు. నేను నిన్నెట్లు స్వాగతింపగలను?" అని సూర్యుని ఉద్దేశించి పల్కెను.

సూర్యభగవానుడు వినయపూర్వకముగా మిథి మహారాజుతో "రాజా! మహా పతివ్రతయగు రాణి రూపవతి నాపై అత్యంత కోపము వహించినది. ఆ కారణము చేతనే నేను మీ ఆజ్ఞ పాటించుట కొరకు ఆకాశము నుండి దిగి ఇచ్చటకు వచ్చి యుంటిని. ఇప్పుడు భూమండలమున స్వరమునందును ఇంకనూ మూడు లోకములందునూ ఈమెతో సమానమైన పతివ్రతయగు స్త్రీని ఎచటను దృష్టి గోచరము అగుట లేదు. ఈమె యందు అంతులేని శక్తి యున్నది. ఈమె తపము, ధైర్యము, నిష్ఠ, పరాక్రమము ఒకదానిని మించి ఒకటి ఉండి ఆశ్చర్యము కల్గించుచున్నది. ఈమెకు గల ఇతర విశిష్ట గుణములు కూడా

ప్రశంసనీయములు. మహాభాగుడా! ఈమె చిత్తము కూడా నిరతము నీ చిత్తమును అనుసరించి ఉండును. సుపాత్రుడగు వ్యక్తికి సుపాత్రునితోనే సంబంధము కల్గును. ఇది అతడిలో గల పుణ్య మహాఫలమని తెలియవలెను. మీ భార్యాభర్తలివురునూ శచీ దేవేంద్రులకు సమానముగా నిరతము ఒకరికి మరియొకరికి అనురూపముగా కలరు. రాజా! ఏ విధముగానైనను నీ అభిలాష వ్యర్థము కాకూడదు. నీ మనస్సునందు భోజనము కొరకు తగిన ఏర్పాటును చేయుటకై వ్యవసాయము ఉత్తమమైనది అని అనిపించుచుండిన దానినే అవశ్యము చేయుము. ఈ ఆలోచన చేయు వ్యక్తి నాకు వ్యతిరేకుడు ఎప్పుడునూ కాదు. నీ ఈ ప్రయాస సఫలము, కీర్తివంతము, అభిలాషను పూర్తి చేయునది కాగలదు." అని చెప్పి సూర్యభగవానుడు ఆ మహారాజుకు జలముతో నిండిన ఒక పాత్రను నిర్మించి ఇచ్చెను. ఆ పాత్రయే గాక ఒక జత పాదరక్షలు దివ్యాలంకారములతో అలంకృతమైన ఒక ఛత్రము మొదలగు వస్తువులను ఆ మిథికి ప్రసాదించెను. అంతేగాక ఆ వస్తువులన్నియూ ఈ స్త్రీ చేసిన పుణ్యకర్మ యొక్క ఫలితములని తెల్పెను. అంతట వారు చైతన్యవంతులై అభయసిద్ధిని గాంచిరి. అంతట ఆ రూపవతి ఆశ్చర్యకరమైన ఈ సంఘటనను చూచి "రాజా! ఈ శీతల జలమును ఈ దివ్య ఛత్రమును, పాదరక్షల జతను ప్రసాదించినది ఎవరు? తెల్పుడు" అని ప్రార్థింపగా జనకరాజు (మిథి) "మహాదేవీ! ఇవి నీపై దయతో గగనమండలము నుంచి ఇచటకు వచ్చి ఈ విశ్వమునకు ప్రధానుడైన భగవంతుడు వివశ్వంతుని చేత ప్రసాదింపబడినవి. ఇవి అన్నియూ ఆయన కరుణా ఫలితములే" అని చెప్పగా మిథి మహారాజు వచనములను వినిన రాణి రూపవతి "ప్రాణనాథా! ఈ సూర్య దేవుని ప్రసన్నుని చేసుకొనుటకు నేను చేసిన పని ఎట్టిది? ఈ విషయమును తెలుసుకొను ప్రయత్నము చేయుడు."అని వినుతింపగా జనకరాజు మహాతేజోవంతుడు అయినందు వలన సూర్యునికి ఎదుట రెండు చేతులు జోడించి నమస్కరించి "భగవాన్! నేను నీకు ఎట్టి ప్రియకార్యమును చేయగలను." అని ప్రశ్నించగా రాజు ప్రార్థనను వినిన భాస్కరుడు "గౌరవవంతుడా! స్త్రీలతో నాకు ఎట్టి భయము కలుగకూడదు అనునది నా మనస్సునందలి కోరిక" అని చెప్పెను.

మిథి మహారాజు ఎవరిని ఎట్లు గౌరవింపవలెనో అను విషయమునందు మిక్కిలి కుశాగ్రబుద్ధి కలవాడు. రూపవతియగు మహారాణి నిరంతరము ఆయన హృదయమును

ఆహ్లాదితము చేయుచుండెను. సూర్యదేవుని మాట వినిన పిమ్మట రాజు తన భార్యకు సర్వ విషయములను వివరించెను. ఆయన మాటలను విని ప్రసన్నురాలు పరమ కుశాగ్ర బుద్ధి గల రాణి ఆనందముతో పొంగిపోయినది. ఆ కారణముచే ఆ రాణి తన అభిప్రాయమును వ్యక్తపరుచుచూ "దేవా! నీ తీవ్ర కిరణముల నుంచి రక్షణ పొందుటకై నాకు గొడుగును దానము చేసితివి. దానితో దివ్యజలపాత్రమును ఇచ్చితివి. ఈ రెండే గాక పాదములను క్షేమముగా ఉంచుటకై పాదరక్షలను ప్రసాదించితివి. ఇవన్నియూ పరమ ఆవశ్యకములగు వస్తువులు. అందుచేత మహాభాగా! నీవు ఎట్టి వరమును కోరితివో అట్లే జరుగును గాక! నీవు స్త్రీల నుంచి ఎట్టి భయమును పొందకుందువు గాక! నీ కోరికను అనుసరించి కార్యములను చేయుటయందు నీవు సర్వస్వతంత్రుడవు" అని రాణి పల్కినది.

యమధర్మరాజు "మహర్షి ఇదియే ఆ రూపవతియను మహాపతివ్రతకు సంబంధించిన వృత్తాంతము. అప్పటి నుంచి ఇట్టి పతివ్రతలను గౌరవించుట, నమస్కరించుటలను నేను చేయుచున్నాను" అని తెల్పెను. (208)

209 వ అధ్యాయము - పతివ్రతా మాహాత్మ్యవర్ణనము

యమునితో నారదుడు ఇట్లు చెప్పెను. "ధర్మరాజా! తపోధనులైన స్త్రీలు ఏ విధమైన కర్మల చేత లేక తపముల చేత సర్వోత్తమమై సద్గతిని పొందుటకు అధికారము కలుగజేసుకొందురో ఆ విషయమును తెలుసుకొనవలయునను కుతూహలము నాకు హెచ్చుగా కలదు. అందుచేత నీవు ఈ విషయమును కరుణతో తెల్పి నన్ను కృతార్థుని చేయుము."

నారదుని వచనములకు యమధర్మరాజు ఇట్లు జవాబిచ్చెను. "సువ్రతుడవైన, ఉత్తముడవైన ద్విజవరా! నారద మహాముని నీవు అడిగిన ప్రశ్నకు సమాధానముగా స్త్రీలు అట్టి స్థితిని పొందుటకు ఎట్టి నియమములు, తపస్సుల వలన ఉపయోగసాధనములు కాజాలవు. మహాముని ఉపవాసము, దానము, అట్లే దేవతార్చన కూడా కోరిన విధమును ప్రసాదించుటలో సమర్ధములైనవికావు. ఇది ఏ విధానమును అనుసరించుట చేత సులభముగా లభ్యం కాగలదో ఆ విషయమును సంక్షిప్తముగా వివరించుచున్నాను ఆకర్ణింపుడు. ఏ స్త్రీ తన భర్త నిద్రించిన తర్వాతనే నిద్రించునో ఆతడు నిద్రనుంచి లేవక ముందేతాను స్వయంగా మేలుకొనునో, అట్లే భర్త భోజనము చేసిన తర్వాతనే తాను

భోజనము చేయునెడల ఆమె మృత్యువునే జయింపగలదు. ఇది సత్యము. అంతేగాక మహర్షి భర్త మౌనముగా ఉన్న యెడల తాను మౌనముగా ఉండిపోవునో అతడు కూర్చుండుటకు ఆసనము స్వీకరించిన తర్వాతనే స్వయంగా తాను కూర్చొనునో, అట్టి సతి చేత, తన పతిపైనే దృష్టి కేంద్రీకరింపబడి ఉండి నిరంతరము తన మనస్సు పతియందే నిమగ్నమగుచూ తన భర్తయొక్క ఆజ్ఞలను నిరంతరము పాటించుటయందు తత్పరురాలైన పతివ్రత చేత మేము అందరమును, అట్లే ఇతర దివ్యులును భయము చెందుదుము. తన పతియొక్క వచనములను శ్రద్ధగా వినుచూ, వానిని పాటించుచూ ఎన్నడునూ ఆజ్ఞోల్లంఘనము చేయని సాధ్వి యొక్క సంసారము పరమ సౌభావహముగా ఉండును. సర్వదేవతలును ఆమెతో సంభాషింతురు. అంతేగాక ప్రత్యక్షముగా గాని పరోక్షముగా గాని అన్య పురుషుని ఎన్నడునూ తన మనస్సున తలంచని స్త్రీ పతివ్రత అనబడును. అట్టి స్త్రీకి మృత్యువు కూడా వెరచి ఉండును. నిరంతరము తన సమక్షమునందుగాని పరోక్షము నందుగాని అన్యపురుషుని ఎవరిని కనీసం మనస్సులోనైనూ తలంచని స్త్రీ పతివ్రత అని చెప్పబడును. అట్టి స్త్రీకి మృత్యుభయము కూడా ఉండదు. సదా, తన స్వామి హితమునందు నిరంతరము మగ్నురాలై ఉండు స్త్రీ నిర్భయముగా ఉండగలదు. సదా పతి ఆజ్ఞలను అనుసరించు పతివ్రతయగు స్త్రీ మృత్యువు చేత జయింపబడదు. అనగా ఆమె నరకలోక ఛాయలను కూడా చూడదు."

ఇంతయే కాక యమధర్మరాజు నారదునితో "బ్రహ్మనందనా! ఏ స్త్రీ తన భర్తను గురించి ఇతడే నా తల్లి తండ్రి సోదరులు ఇంకనూ పరమ దైవము అగునని ఊహించునో, అట్లే సదా పతి శుశ్రూషయందు సంలగ్నురాలై ఉండునో అట్టి పతివ్రతపై నా శాసన ప్రభావము ఏ మాత్రమును ఉండదు. తన స్వామిని నిరంతరము ధ్యానించుట, ఆతనిని అనుసరించుట, అనుగమించుటకు వ్యతిరేకముగా ఒక్కక్షణముకూడా వ్యర్థ ఆలోచనలందు నష్టము కాకుండా ఉండునో ఆమె పరమసాధ్వి. నేను ఆమె ఎదుట చేతులు జోడించి నమస్కరింతును. తన పతి గురించిన ఆలోచనల తర్వాత తనకు తోచిన ఆలోచనను వ్యక్తీకరించునో ఆ పతివ్రతకు మృత్యువు యొక్క ఆభాసము చూడవలసిన అవసరము పడదు. నృత్యము, సంగీతము, వాద్యములు, ఇవి అన్నియు చూచుట, వినుటయందునూ ఏ స్త్రీ యొక్క నేత్రములు, కర్ణములయందు చొరకుండా పతిసేవయందే నిరంతరములగ్నమై

ఉండునో అట్టి స్త్రీ మృత్యు ద్వారమును దర్శింపదు. ఏ స్త్రీ స్నానము చేయునప్పుడు, స్వచ్ఛందముగా కూర్చొనియున్నప్పుడు అట్లే కేశసంస్కారము చేసుకొను చున్న సమయమునందు మనస్సులో కూడా అన్య వ్యక్తిపై దృష్టి రానీయకుండిన ఆమెకు మృత్యుద్వార భీతి ఉండదు. మహర్షి వర్యా! పతిదేవుని ఆరాధనయందు నిత్యము తన కాలమును నియోగించుచూ భోజన సమయమునందును ఆతని క్షేమమునే కాంక్షించుచూ ఇతర సమయములందు కూడా తన చిత్తమున నిరంతర భర్తృ చింతన చేయు స్త్రీ మృత్యుముఖ ప్రవేశమునకు ఎట్టి అవకాశమును ఉండదు. నిత్యము సూర్యోదయమునకు ముందే లేచి గృహపరిసరములను పరిశుభ్రము చేసికొనుటయందు ఉద్యుక్తురాలై ఉండు స్త్రీ దృష్టి మృత్యుద్వారమునందు పడదు. తన నేత్రములు, శరీరము, భావములు సదా సుసంయుతములై ఉండునో అట్లే తన పవిత్ర ఆచారములు, ఆలోచనల చేత కూడి ఉండునో ఆ స్త్రీ మృత్యు ద్వారమును దర్శింపదు. తన భర్త యొక్క ముఖమును చూచుట యందును, ఆయన చిత్తానుసారము ప్రవర్తించుటయందు సమయమును సార్థక మొనరించుట యందు తత్పరురాలగు పతివ్రతకు ఎదుట మృత్యువు నిలబడుటకు కూడా భయపడును. మహర్షి వర్యా! ఈ ప్రపంచము నందు యశస్వినులైన మనుష్యుల యొక్క అనేక మంది స్త్రీలు స్వర్గమునందు వసించువారు కలరో అట్లే ఎవరిని దేవతలు కూడా దర్శించుచుందురో అట్టి పతివ్రతలే నాయెదుట విరాజమానులై ఉందురు. సూర్యభగవానుని ద్వారా పతివ్రత మాహాత్మ్యమును విను అవకాశము నాకు లభించినది. ఆయన కృప చేతనే ఈ గోపనీయములు, రహస్య మయములైన విషయములను యథాప్రకారము నాకు కర్ణగోచరములైనవి. అప్పటి నుంచి నేను పతివ్రతలను చూచిన తోడనే భక్తి భావముతో వారిని పూజించుచున్నాను. (209)

210 వ అధ్యాయము - కర్మ విపాకము, పాపవిముక్తికి ఉపాయములు

నారదుడు తదనంతరము ఇట్లు చెప్పెను. యశోవంతుడా! నీవు సూర్యభగవానుని ఆదేశమును అనుసరించి పతివ్రతా స్త్రీల యొక్క ఉత్తమ ధర్మములను వివరించు రహస్యమైన ఉపాఖ్యానములను తెలియజేసితివి. దానిని నేను అత్యంత శ్రద్ధాసక్తుడనై వినగల్గితిని. కానీ సర్వప్రాణులకును సంబంధించిన కర్మ ఫలములు అనగా సుఖదుఃఖముల విషయములను గురించి తెలుసుకొనవలయునని నాకు చాలా ఉత్కంఠ

కలదు. మహాతపా! నేను ఆ వృత్తాంతమును నీనుంచి తెలుసుకొన వలయునని కోరుచున్నాను. దయతో దానిని తెలుపుము. దుఃఖము, తాపము చేత సంతప్తులై మనుష్యులు సుఖము కొరకు కఠోరమైన తపస్సును చేయువారు కలరు. కానీ వారి మనోరథము ఈడేరునట్లు కనిపించుట లేదు. వారు అన్ని విధములైన సాంసారిక సంబంధ ప్రియాప్రియములు, సుఖప్రాప్తి కొరకు అనేక వ్రతములు ఉపాయములను ఆచరించు చున్నారు. అయినప్పటికినీ కృతకృత్యులు కాకున్నారు. ఏదో ఒక విధముగా వారి కోర్కెలు విఫలములే అగుచున్నవి. లోకమునందు ధర్మాచరణ వలన సుఖప్రాప్తి లభ్యము కాగలదని ప్రసిద్ధమైన శృతివాక్యము కలదు. కానీ పరిశీలింపగా ఇది నెరవేరుచున్నట్లు కనిపించుట లేదు. గొప్ప ప్రయత్నముతో కఠోరమైన తపస్సు చేయువారు కూడా క్లేశములను అనుభవించుచున్నారు. ఏ కారణము వలన ఇట్లు జరుగుచున్నది? ఈ లోకములోని ఉద్భిజ, స్వేదజ, అండజ, జరాయుజము అను నాలుగు విధములైన ప్రాణులు ప్రపంచము నందు సంచరించుచున్నవి. ధర్మాత్మా! ఎవరు ఏ కారణము చేత ఎట్టి దోష కారణము చేత మనుష్యుని బుద్ధిని పాపకార్యముల వైపు ప్రేరేపించుచున్నవి. అవి ఎట్టివి? ఈ లోకము నందు అత్యంత కఠోరమును దుఃఖమును కలిగించునవి, సుఖము కలుగజేయునవి అగు కర్మలు ఎట్టివి? అను ఈ విషయమును నాకు తెలియజేయుము" అని నారదుడు ఈ విధముగా ప్రశ్నింపగా ఘనుడగు యమధర్మ రాజు ఇట్లు పల్కెను. "మునివర్యా! మీరు అడిగిన ఈ ప్రశ్న పరమపుణ్యకరమైనట్టిది, నేను దానికి సమాధానముగా చెప్పబోవు వృత్తాంతము సర్వమును ధ్యానపూర్వకముగా ఆకర్ణింపుము. ఈ ప్రపంచమునందు దేనికినీ కర్త గోచరము కాదు అట్లే కర్మ ప్రేరకమును చేయువాడు దృష్టి గోచరము కాదు. ఎవరి యందు కర్మ ప్రతిష్ఠింపబడి ఉండునో ఎవరి అధీనమున కర్మ కలదో, ఎవరి పేరు కీర్తింపబడునో ఎవని చేత ప్రపంచమంతయూ ఆదేశింపబడునో ప్రేరణ పొందుచున్నదో, ఎవరి వలన సర్వకార్యములను సమకూరుచున్నవో ఆయనను గూర్చి తెలుపుచున్నాను వినుడు. బ్రహ్మపుత్రా! ఒకానొక సమయము నందు ఈ దివ్య సభయందు అనేకులగు బ్రహ్మర్షులు విరాజమానులై ఉండిరి. అచ్చట జరిగిన సాకల్య చర్చను నేను దర్శించితిని. ఆ చర్చ వివరములను వినగల్గితిని. వానిని కూడా తెల్పుచున్నాను. తండ్రీ! నరుడు ఏ కార్యములను తన స్వయంశక్తి చేత చేయగల్గుచున్నాడో అదియే అతడి స్వకర్మ ప్రారబ్ధము

కాగలదు. దాని పరిణామ రూపముగా అనుభవించవలసి వచ్చును. అది సుకృతమైనను కావచ్చును లేక దుష్కృతమైననూ కావచ్చును. సుకృతమైన యెడల సుఖము లభింపగలదు. దుష్కృతమైనందు చేత దుఃఖమును కల్గును. ఏ వ్యక్తి సంసార దుఃఖాది ద్వంద్వములయందు పడి పీడింపబడునో అట్టి వ్యక్తి తనను తానే ఉద్ధరించుకొనవలయును. ఎందుకనగా నరుడు తనకు తానే తన శత్రువు, మిత్రుడు అగుచున్నాడు. జీవులు తనకు తానే పూర్వము ఆచరించిన కర్మల యొక్క నిశ్చిత రూపము చేత ఈ ప్రపంచమునందు వేలకొలది గర్భములయందు జనించును. 'ఈ ప్రపంచము నిరతము సత్యమైనది.' అని గ్రహించిన కారణము చేత అతడు తన రాబోవు జన్మములందు సర్వత్రా తిరుగుచుండును. ప్రాణి కర్మను చేయుచున్న కొలది అది అతడికి సంచితమగుచుండును. ఇంకనూ పురుషుని పాపకర్మములు క్రమక్రమముగా క్షీణించుచుండగా, అదే క్రమమును అతడికి శుభవృద్ధి ప్రాప్తి కలుగుచుండును. దోషయుక్తుడగు వ్యక్తి శరీరధారియై ఈ లోకమునందు జన్మను పొందును. ఈ జగత్తుయందు పడిన ప్రాణుల చెడుకర్మము యొక్క అంతమైన పిదపనే శుద్ధమగు బుద్ధి లేక జ్ఞానము ప్రాదుర్భావము అగును. ప్రాణి యొక్క పూర్వశరీర సంబంధమును కలిగియుండు శుభా శుభముల బుద్ధి ప్రాప్తియగును. నరుడు స్వయముగా ఉపార్జించిన దుష్కృత సుకృతములు మరుజన్మమునందు వానికి అనురూపముగానే సహాయకములు అగుచుండును. పాపము అంతము కాగానే క్లేశములు నశించును. దాని ఫలస్వరూపముగా ప్రాణి శుభకర్మమునందు నియుక్తుడగును.

ఈ విధముగా మనుష్యుడు సత్యకర్మల యొక్క ఫలమును శుభముగాను, అట్లే దుష్కర్మల ఫలము అశుభముగాను అనుభవింపవలసి వచ్చును. అంతట అతడి విస్తృతి కర్మల యందు నిర్మలత్వము కలిగి సత్సమాజమునందు ఆతడికి గౌరవప్రాప్తి లభ్యమగును. శుభకర్మల ఫలస్వరూపముగా స్వర్గము అట్లే అశుభకర్మల ఫలప్రాప్తముగా నరకమునకును పోవును. వస్తుతః అతడు ఎవరికిని ఏమియునూ ఇచ్చునది లేదు. అట్లే ఇతరులనుండి తీసుకొనునదియు ఉండదు.

ఈ విధముగా యముడు వివరించగా నారదుడు ఆతనిని ఇట్లు ప్రశ్నించెను. "అర్కనందనా! ఎవరు చేసిన శుభాశుభకర్మలకు ఫలితముగా అభ్యుదయము, అశుభ కర్మల చేత పతనము, కలుగును అను నియమము ఉన్న యెడల ప్రాణి తన మనస్సు,

వాక్కు కర్మ లేక తపము వేని సహాయమును స్వీకరించుట చేత ఈ సంసార రూపదగు క్లేశముల నుంచి రక్షించుకొనగల్గును? నీవు దీనిని కూడా తెలియజేయుము."

అనగా యముడిట్లు చెప్పెను "సంయమివరా! ఈ మన ప్రసంగము అశుభము లను కూడా శుభమొనరించునదియు, పరమ పవిత్రమైనది, పుణ్య స్వరూపమైనదియు. అదే విధముగా పాపములు, దోషములను నిరంతర సంహారకమును అగుచున్నవి. ఇప్పుడు నేను ఆ జగస్రష్టుడు, జగదీశ్వరుడు, ఎవని ఇచ్ఛ చేత సర్వ ప్రపంచము చలించుచున్నదో అట్టి వానికి ప్రణామపూర్వకంగా నమస్కరించి నీ ఎదుట సంపూర్ణముగా వర్ణించుచున్నాను వినుము. చరాచరములు అగు ప్రాణి సమూహముల చేత సంపన్నమగు ఈ త్రిలోకములను ఎవరు సృజియించిరో ఆతడు ఆదిమధ్యాంతరహితుడు. దేవతలు, దానవులు మరియే ఇతరులయందును ఇట్టిశక్తి లేదు. దీనిని ఎవరును ఎరుగరు. ఎవరు సమస్త ప్రాణుల యందును సమానదృష్టి కలిగియున్నాడో అతడు వేదతత్త్వమును ఎరిగినవాడై, సర్వ పాపముల నుండి ముక్తుడు అగును. ఎవనికి తన ఆత్మవశమందుండునో, మనస్సునందు నిరంతరము శాంతి విరాజిల్లుచుండునో, ఎవడు జ్ఞానియై సర్వజ్ఞుడగునో అతడు పాపముల నుంచి ముక్తుడగుచున్నాడు. ధర్మము యొక్క సారము అర్థము, దాని స్వభావము అట్లే జీవుల విషయములందు ఎవనికి సర్వజ్ఞానము కలదో, జన్మించిన తర్వాత, ఎవరు తిరిగి ప్రమాదమును కొని తెచ్చుకొనడో అతనికి సనాతన పథము సులభము అగును. గుణ అవగుణములు, క్షయాక్షయములను ఎవడు సంపూర్తిగా ఎరుగునో అట్లే ధ్యాన ప్రభావము చేత ఎవరి అజ్ఞానము నశించిపోవునో ఆతడు పాపములనుండి విముక్తి అగును. ఎవడు ప్రపంచమునందలి సర్వ ఆకర్షణల నుంచి ప్రలోభముల నుంచి చిక్కుకొనక శుద్ధజీవనము గడుపునో అట్లే ఇష్టమగు వస్తువుల యందలి కోరికలు ఎవని మనస్సును ప్రలోభపరచవో ఎవని ఆత్మను సంయమనములో ఉంచి ప్రాణములను త్యాగము చేయునో అతడు సంపూర్ణ పాపములనుంచి ముక్తుడగును. తన ఇష్టదేవతలయందు శ్రద్ధ కలవాడును, క్రోధముపై విజయము సాధించినవాడు ఇతరుల సంపత్తిని అక్రమముగా గ్రహింపని వాడును, ఎవనిని ద్వేషించని వాడును అగు మనుష్యుడు సర్వపాపము నుండి ముక్తుడగును. గురుసేవయందు సదా సంలగ్నమై ఉన్నవాడు, ఎన్నడునూ ఏ ప్రాణికి హింసతలపెట్టనివాడు, నీచవృత్తులను ఆచరింపనివాడును సర్వపాపముల నుంచి విముక్తి పొందును. ఎవరు సర్వధర్మములను

ఆచరించునో అట్లే నిందిత కర్మల నుండి దూరముగా ఉండునో, అతడును పాపములకు దూరుడే అగును. తన అంతఃకరణమును పరమశుద్ధముగ గావించుకొని తీర్థములను సేవించువాడును, నిరంతరము దురాచరణముల నుండి దూరముగా ఉండువాడును, అగు మనుష్యునికి సమస్త పాపములును ముక్తములే అగును. బ్రాహ్మణులను చూచినంతనే భక్తి భావము చేత ఏ మనుష్యుడు లేచి నిలబడునో సమీపమునకు పోయి నమస్కరించునో ఆ మనుష్యుడు పాపవిముక్తుడగును.

పిమ్మట నారదుడు ఇట్లు ప్రశ్నించెను. "పరంతపా! సంపూర్ణ ప్రాణులకు శుభప్రదము, క్షేమప్రదము, హితము, పరమ ఉపయోగమగు వానిని గురించిన వర్ణన నీ నుంచి సాకల్యముగా వినియుంటిని. సూర్యాత్మజా! తత్త్వదర్శుల యొక్క సమ్యక్ విధానముగా దానిని పాటించుట అవశ్యము చేయదగినదే అగును. నీ కృపచేత నా సందేహము ధృవీకృతమైనది. అందుచేత ఇప్పుడు నీవు యోగమును అనుసరించుటచే పాపము నుండి దూరము చేయు ఏదైనను చిన్న ఉపాయము ఉన్న యెడల దానిని దయతో నాకు ఎరింగింపుము. నీవు యోగధర్మ సంబద్ధ సాధనములను ఇంతకుముందే నాకు తెలిపి యుండుటచే పాపమును దూరము చేయుట మహా కఠిన కార్యమని తెలియుచున్నది.. అందుచేత ఏదైన ఇతర మార్గమును అనుసరించి, ఈ ప్రపంచమున సుఖప్రాప్తి పొంది లక్ష్యసిద్ధి చేసుకొనుటయందు కొద్దిపాటి శ్రమగల దానిని వివరింపుము. ఈ లోకము లేక పరలోకమునందు కూడా ఆత్మను జయించిన వ్యక్తి అట్లే అనేక విధములుగా సుగుణముల ఆధిక్యత గలవాడు అగు సజ్జనుడు, నిత్యము దేనిని సాధన చేయుట చేత కార్యసాఫల్యము పొందుచున్నాడో దానిని వినుటకు నేను ఇష్టపడుచున్నాను. మహాతపస్వియగు ధర్మరాజా! అనేక యోనులందు ప్రాణుల ఉత్పత్తి జరుగుచున్నది. వాని చేత అనేక అశుభకార్యములు చేయబడుచున్నవి. అందుచేత వానిని దూరము చేయగల్గిన దగు సరళము, సుగమము అగు ఉపాయములను తెల్పుడు."

యముడు "మునివర్యా! స్వయంభువుడగు బ్రహ్మ ప్రజాసృష్టికర్త. ఈ ధర్మ విషయమునందు ఆయన ఏ విధముగా తెల్పెనో దానిని చతుర్ముఖునికి నమస్కరించి నేను నీకు చెప్పుచున్నాను. ప్రాణులకు శుభమును, పాపములను నాశనము చేయుట దాని ప్రధాన ఉద్దేశము. క్రియ యొనరించుట అతి ముఖ్యమైనదే. అందుచే దానిని గురించి

చెప్పుచున్నాను వినుము. కైవల్యము యెడ శ్రద్ధావంతుడైన తర్వాత మనుష్యులకు జ్ఞానము కల్గుచున్నది. తన అంతఃకరణము పరమశుద్ధముగా ఉంచుకొని ధర్మము యెడ సంపూర్ణ ఆసక్తి కలవాడే ఈ విషయమును వినవలయును. అతనికి సర్వ కోరికలు పూర్ణములు కాగలవు. అట్లే పాపముల నుంచి విముక్తి పొంది తన ఇచ్చానుసారముగా సుఖప్రాప్తి పొందగలడు.

బ్రహ్మ చెప్పిన ఉపదేశప్రద వాక్యములు ఇవి. శింశుమారక చక్రము దాని స్వరూపము. దాని రూపమును ప్రతిమగా చేయించి, తన శరీరమునందు భావించుకొని దానిని అర్చించి, అభివాదము చేయు మనుష్యునికి సర్వపాపములు నష్టమగును. అట్లే ఆ వ్యక్తి ఉద్ధరింప బడును. తన వాక్కర్మల చేత పాపమొనర్చిన వ్యక్తి నిందితుడగుట యందు సందేహములేదు. ఆ చక్రమునందుగల సోముడు, గురుడు మొదలగు సర్వ గ్రహములకును అతడు మానసిక ప్రదక్షిణచేసి ధ్యానము చేసినయెడల అట్టి మానవుడు అనేక పాపముల నుంచి ముక్తుడగును. శుక్రుడు, బుధుడు, శనీశ్వరుడు, మంగళుడు అను ఇవి అన్నియూ బలమైన గ్రహములు. చంద్రునిది సౌమ్య రూపము. హృదయమునందే ఈ రూపములను భావించుకొని ప్రదక్షిణము, ధ్యానములను చేసుకొనినప్పుడు మనుష్యుని పాపములు శాశ్వతముగా సిద్ధి పొందును. అట్టి సమయమునందు శుద్ధత ప్రాప్తించగలదు. ఆ సమయమున శరదృతువు యొక్క చంద్రుని వలె పురుషుని ఆత్మ శుద్ధమునొందును. వందమార్లు ప్రాణాయామము చేయుట చేత సంపూర్ణ పాపవిముక్తి కలుగును. మునివర్యా! మనుష్యుడు యత్నపూర్వకముగా శుద్ధుడై జఘన స్థానమునందుండు చంద్రుని దర్శించి నమస్కరింప వలెను. దీని ఫలస్వరూపముగా అతడు సమస్త పాపములనుంచి ముక్తుడు కాగలడు. శింశుమారక చక్రము 800 అక్షరములచే సంపన్నము అయినది. దీనిని నీటియందు ప్రక్షేపించి స్వయముగా ఆర్ద్రుడై ధ్యానము చేయవలెను. చంద్రుడును, సూర్యుడును ఇరువురు స్వయముగా స్వచ్ఛమైన దేవతలు. తమ తేజస్సు చేత ప్రకాశించు, ఈ ఇరువురు ఒకరినొకరు చూచుకొను సమయమునందు హృదయమున వీరి ధ్యానము చేయవలెను. ఇందుచేత సంతతము పాపశమనము అగును. మహామునీ! మానవులు ఈ విధముగా కల్పన చేసికొనగా శ్రీహరియే శింశుమార చక్రమయ వామన రూపమున అవతరించునట్లు, అట్లే ఆయనయే వరాహరూప ధారణ చేసి జలముపై దర్శనము

ఒసంగినట్లు మరియు ఆయన యొక్క దంష్ట్రలపై పృథ్వి శోభించుచున్నట్లు ఇంకనూ ఆయనయే నసింహ రూపమున అవతరించునట్లును భావించి ప్రార్థింపవలెను. నీరు లేక పాలను ఆహారముగా తీసుకొనుచు ఆయనను ఆరాధింపవలెను. అందుచే ఆ ఆరాధకుడు సర్వపాపములు నుండి ఉద్ధరింపబడును. విధిపూర్వకముగా ఆయనకు నమస్కరించిన యెడల సర్వపాపముక్తి లభించును. (210)

211, 212 అధ్యాయములు - పాపనాశ విధాన వర్ణన

నైమిశారణ్యమున సమావేశమైయున్న శౌనకాది మహామునులతో ఋషి పుత్రుడగు నచికేతుడు ఇట్లు చెప్పెను. "మహర్షులారా! యమధర్మరాజు యొక్క శుభకరమైన పలుకులను విని నారదుడు భక్తిపూర్ణభావము చేత మరల ఆయనను ఇట్లు ప్రశ్నించెను. మహానుభావా! యమధర్మరాజా! నీవు నా తండ్రితో సమానమైన శక్తిశాలివి. అట్లే స్థావర జంగమాది సమస్త ప్రాణులయెడ సమానదృష్టితో వ్యవహరించువాడవు. ఇప్పటి వరకును నీవు ద్విజాతి వారల అనగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు సంబంధించిన పాపవిముక్తికై సరళమార్గములను తెలియజేసితివి. ఇప్పుడు దయతో ఇతరులకు సంబంధించిన ఆ విషయములను గురించి కూడా నాకు వివరింపుము.

నారదుని పలుకులు వినిన సమవర్తియగు యమధర్మరాజు ఇట్లు చెప్పెను. "మహామునీ! గోవులకు గొప్పమహిమ కలదు.అవి పరమపవిత్రము, శుభకరము దివ్యులగు దేవతలకు కూడా దేవతల వంటివి. వానికి సేవ చేయువారు పాపముక్తులగుదును శుభకాలమునందు గోవుల పంచగవ్యములను త్రాగు నరులు తక్షణమే తమ పాపముల నుండి విముక్తులగుదురు. గోపుచ్ఛము (ఆవు తోక) నుండి జాలువారు జలమును శిరస్సుపై చల్లుకొనువాడు ధన్యుడగును. అట్టి వానికి నమస్కారము చేయువారందరును తీర్థములు సేవించిన ఫలమును పొంది, పాపములన్నింటి నుండి ముక్తుల అందుచేత సర్వసాధారణములైన జనులందరును గోసేవను తమ శక్త్యానుసారము చేయవలయును. అంతేగాక ఉదయకాల సూర్యుని, అరుంధతి నక్షత్రమును, అట్లే సప్తర్షులందరిని వైదిక విధిని అనుసరించి పూజింపవలెను. అట్లే పెరుగుతో కలుపబడిన అక్షతల చేత వారిని పూజించి అర్చించుట నిర్దేశిత విధానము. అంతేగాక మనసును ఏకాగ్రము చేసి చేతులు జోడించి, ప్రాణాయమము చేయు మానవులకు కూడా తక్షణమే సంపూర్ణ పాప విముక్తి

కలుగగలదు. శూద్రుడైన వ్యక్తి బ్రాహ్మణ సేవ చేయుట, ఆతడిని తృప్తి పరచుట, భక్తితో పాటు యత్నపూర్వకముగా ప్రాణాయామ మొనరించిన యెడల అతడికి శీఘ్రమే పాప విముక్తి జరుగును. విషువ యోగ కాలమందు అనగా ఏ దినమున రాత్రింబగళ్ళు సమానముగా ఉండునో (మార్చి 21 లేక 22, సెప్టెంబరు 22 లేక 23) ఆ దినమునందు పవిత్రుడై, గోవుపాలను దానము చేసినవాడు తన జన్మకాలమునందంతయు చేసిన పాపములన్నీ అదే క్షణమున నష్టమై పోవును. పూర్వార దిశగా కుశలను పరచి వానిపై వృషభమును నిలబెట్టి దానము చేసిన పురుషుడు బ్రాహ్మణులతో కలసి స్వయముగా ప్రాణాయామ మొనరించినట్లైన, అతడు పాపముల నుంచి సంపూర్ణముగా తొలగిన వాడగును. తూర్పు దిశగా ప్రవహించు నది యందు యజ్ఞోపవీతమును సవ్యముగా ధరించి ప్రదక్షిణ చేయుచు విధిప్రకారము అభిషేకముచేసిన మనుష్యుడు పాపముక్తుడగును. ఏ బ్రాహ్మణుడు పవిత్రుడై ప్రసన్నతా పూర్వకముగా దక్షిణావర్త శంఖము నుంచి తన చేతిలోనికి జలమును తీసుకొని దానిని శిరముపై చల్లుకొనునో ఆతనికి జన్మమంతయూ చేసిన పాపములు అప్పుడే నష్టమై పోవును. బ్రహ్మచారియగు నరుడు తూర్పు దిశయందు ప్రవహించు నది యందు ప్రవేశించి నాభిదఘ్న (బొడ్డు వరకు వచ్చు) జలమునందు నిలబడి స్నానము చేయుట విధిగా నిబంధింపబడినది. స్నానానంతరము నల్లని తిలలు కలిపిన ఏడు దోసిళ్ళ జలము చేత తర్పణము అర్పించవలెను. పిమ్మట మూడు పర్యాయములు ప్రాణాయామము చేయవలెను. ఇందుకు ఫలస్వరూపముగా జీవిత పర్యంతము అతడొనర్చిన పాపములు అదే క్షణమున నష్టములై పోవును. చిల్లులు లేని తామరాకులయందు నీటిని ఉంచి సంపూర్ణ నవ రత్నముల సహితముగా మూడు పర్యాయములు స్నానము చేసిన వ్యక్తి సమస్త పాప విముక్తుడగును.

దేవర్షీ! నేను నీకు మరియొక అత్యంత గోపనీయమైన మార్గమును వివరించు చున్నాను. కార్తీక మాస శుక్ల పక్షమున వచ్చు ప్రబోధినీ ఏకాదశి తిథి వ్రతముచేత భక్తిముక్తులు రెండును అతి సులభములగును. అవి విష్ణుభగవానుని వ్యక్తావ్యక్త రూప ఆకారములు. అందువలన అవి మర్త్యలోకమునందు ప్రవర్తిల్లుచున్నవి. వీనిని ఉపాసన చేయువానికి కోట్ల కొలది జన్మలయందు అశుభములు తొలగిపోవుచుండును. ప్రాచీన కాలమునందు జరిగిన విషయము చెప్పుచున్నాను వినుము. శ్రీహరి భగవానుడు

వరాహరూపములో అవతరించెను. అట్టి సమయమునందు, సంపూర్ణ లోకముల క్షేమము కొరకు ఆలోచించిన పృధ్వీదేవి ఏకాదశినే తన మనస్సునందు ఉంచుకొని భగవంతుని ఇట్లు ప్రశ్నించెను. "ప్రభూ! ఈ కలియుగము సాధారణముగా అందరికినీ భయోత్పాతము కల్గించునది. ఈ యుగమునందు మనుష్యుడు ఎల్లప్పుడును పాపమునందే మునిగి ఉండును. ప్రభూ! బ్రాహ్మణుని ధనమును అపహరించి వేయుట, వారిని వధించుట కూడా జనులకు సాధారణ విషయమే అయిపోయినది. కలియుగమునందలి జనులు గురు, మిత్ర, స్వామిలకు విరుద్ధముగా వైరము వహించుట యందే తత్పరులై ఉందురు. పరాయి స్త్రీతో అనుచిత సంబంధము పెట్టుకొనుటలోవారు ఇహలోక పరలోక భయమును ఉంచుకొనుట లేదు. సురేశ్వరా! ఇతరుల సంపదపై అధికారము చలాయించుట, అభక్ష్య భక్షణము చేయుట అట్లే దేవతలను, బ్రాహ్మణులను నిందించుట వారి సహజ స్వభావమగును. కలియుగ ప్రజలు సాధారణముగా డాంబికులు, మర్యాదహీనులు అగుదురు. కొందరు అనీశ్వరవాదులుగా కూడా అగుచుందురు. ఇందు మనుష్యుడు నిందిత దానములను తీసుకొనుట చేత కూడా అగమ్యాగమనము నందు ఇష్టమును పెంచు కొందురు. వారు ఇవియే గాక ఇంతకంటెను అధికముగా అనేక పాపములను చేయుదురు. అందువలన వారికి శుభము ఎట్లు కలుగగలదు?

ధారుణీదేవి ప్రశ్నించిన ఈ ప్రశ్నకు వరాహభగవానుడు ఇట్లు చెప్పెను. విష్ణుభగవానుని సర్వోత్కృష్ట శక్తికలదు. కలియుగమునందలి నానా ప్రకారములైన ఘోర పాపమునందు మునిగిఉండు మనుష్యుల క్షేమము కొరకునేను ఏకాదశీ రూపధారణమును చేసితిని. అందుచేత అన్ని మాసముల యొక్క రెండు పక్షములందును ఏకాదశినాడు ఈ వ్రతమును చేయవలెను. దీని చేత ముక్తి సులభముగా లభ్యము కాగలదు. ఏకాదశి నాడు భోజనము చేయుట నిషిద్ధము. పూర్తిగా ఉపవాస వ్రతమును ఆచరింపవలెను. ఏదైనను విశేషకారణము చేత పూర్ణ ఉపవాసము చేయుటకు వీలుకాని యెడల నక్తవ్రతము చేయవలెను. (నక్తవ్రతము అనగా సాయంత్రము సూర్యాస్తమయము అగునంత వరకును ఏమియునూ తినక, నక్షత్ర దర్శనము అయిన తర్వాతనే భుజింపవలెను) మనుష్యులకు ప్రబోధినీ ఏకాదశీ వ్రతము తప్పక ఆచరింపవలసినది. సోమ, మంగళవారములు, అట్లే పూర్వ ఉత్తరాభాద్ర నక్షత్ర యోగములందు ఈ ఏకాదశి వ్రతము యొక్క మాహాత్మ్యము

కోటి గుణితమగును. ఆనాడు స్వర్ణముతో విష్ణు ప్రతిమను చేయించి, ఆయన దశావతారములను కూడా విధి ప్రకారము పూజ చేయుట విధానము అగును. ప్రబోధినీ ఏకాదశి తిథియొక్క మహిమ వేయి ముఖములతో కూడా చెప్పుటకు వీలుపడదు. వేలకొలది జన్మములయందు శివోపాసన చేయుటచే లభ్యమైన వైష్ణవత, విశ్వమునందు ఎట్టి పరిస్థితులలోను దుర్లభమైనది. అందుచేత విద్వాంసుడైన పురుషుడు ప్రయత్నపూర్వకముగా విష్ణుభక్తుడగుటకు ప్రయత్నింపవలెను.యమధర్మరాజు మరల నారదునితో ఇట్లు చెప్పెను. మునివర్యా! ఉత్తమ వ్రతమును పాటించుటయందు సదాతత్పరురాలైయుండు మహాభాగురాలైన ధరణి వరాహభగవానుడు చెప్పిన ఈ మాటలను వినిన వెంటనే జగత్ప్రభుడగు విష్ణువును విధివిధానముగా ఆరాధించి ఆయనయందు లీనమై పోవును. నారదుడు ఇట్లు చెప్పెను. "యమధర్మరాజా! నీవు సంపూర్ణ ధర్మజ్ఞానులయందు శ్రేష్ఠుడవు. నీవు చెప్పిన ఈ దివ్య కథ ధర్మ విషయములతో కూడి ఉన్నది. అందువలన నేను కూడా నీ నుంచి తెలుసుకొనిన నిర్దిష్టమైన ధర్మమార్గ వ్యాఖ్యానము చేత సంతుష్టుడనైతిని. ఇప్పుడు నేను యధా శీఘ్రముగా ఆ లోకములకు పోవలయునని కోరుకొనుచున్నాను. దానిచే నా మనస్సునకు ఆనందానుభూతి కలుగగలదు. యమధర్మరాజా! నీకు శుభమగు గాక!"

అనంతరము నచికేతుడు ఇట్లు చెప్పెను. "విప్రులారా! ఈ విధముగా చెప్పి నారదుడు యమలోకమునుంచి ప్రయాణమై వెడలిపోయెను. ఆ మునివరుడు తన ఇచ్ఛానుసారము సర్వత్రా పరిభ్రమించగల్గిన సామర్థ్యము గలవాడు. ఆయన ప్రయాణమై పోవు కాలమున ఆకాశమునందు ఆయన తేజము రెండవ సూర్యుని వలె వెలుగొందినది. యమధర్మరాజు ధర్మ విషయములపై మిగుల శ్రద్ధ కలిగినవాడు. ముని తన వద్ద సెలవు తీసుకొని పోయిన తర్వాత ఆయన మరియొక మారు మిక్కిలి ప్రసన్నుడై నాకు ప్రణామము చేసి ఆదర సత్కార పూర్వకముగా ప్రియవచనములతో "సువ్రతుడా! నీవు కూడా ఇప్పుడు ఇచ్చట నుంచి వెడలి పోవచ్చును" అని పల్కెను. ఆ సమయమునందు శక్తిశాలియగు సూర్యనందనుడు అగు యమధర్మరాజు యొక్క అంతరాత్మ ప్రశాంతతతో నిండిపోయినది. మహామునులారా! నేను కూడా యమధర్మరాజు యొక్క ఉత్తమమైన పురమును చూచి విని ఆ విషయములనన్నింటినీ మీకు సాకల్యముగా ఎరిగించి యుంటిని".

అనగా వైశంపాయనుడు ఇట్లు చెప్పెను. "రాజా! ఆ బ్రాహ్మణులందరునూ తపమునే తమ ధనముగా పరిగణింతురు." అనగా నచికేతుడు ఈ మాటలను విని ఆయన మనస్సునందు ప్రశాంతత ఏర్పడెను. కన్నులు ఆశ్చర్యముతో నిండినవి. అందులో కొందరు మునులకు దేశాంతరములలో భ్రమించుటయందు విశేషమగు అభిరుచి కలదు. అట్లే ఇతర బ్రాహ్మణులు అరణ్యమునందు నివసింపవలెనను కోరికతో వచ్చి ఉండిరి. కొందరు బ్రాహ్మణులు శాలీన లేక యాయవారవృత్తిని, కపోతవృత్తిని కోరుకొను వారు కలరు. సంపూర్ణ ప్రాణుల యెడను దయఉంచుటనే శుభకరమని, ఎవని నోటి నుండి శుభవాక్కులు వెలువడుచున్నవో, అట్టి బ్రాహ్మణులు ఎందరో కలరో, వారు అందరునూ అనేక పర్యాయములు నచికేతునికి ధన్యవాదములు సమర్పించిరి. వారిలో కొందరు బ్రాహ్మణులు శిలోంఛ వృత్తిని అవలంబించువారు కలరు. (పొలములో పండిన పైరును కోసుకొనిన తర్వాత నేలపై పడిన గింజలను ఏరుకొని వానితో జీవితము గడుపుట శిలోంఛవృత్తి అని అనబడును.) కొందరు మహాతేజస్కులైన బ్రాహ్మణులు కాష్ఠవృత్తిని అవలంబింతురు. అందరునూ భిన్నభిన్న వృత్తులను అవలంభించువారే. కొందరు సదా ఆత్మ చింతనము నందే మునిగి ఉందురు. కొందరు విప్రులు మౌన వ్రతమును పాటించుచూ జలాశయ వ్రతమును అవలంబింతురు. కొందరు శిరస్సును పైకెత్తి నిద్రించుచుందురు. మరికొందరు బ్రాహ్మణులు మృగము వలె ఇటునటు స్వచ్ఛందముగా తిరుగవలెనను నియమము కలవారు. ఇంకనూ కొందరు పంచాగ్నివ్రతులు. కొందరు కేవలము ఆకులను మాత్రమే తిని జీవనము గడుపువారు. కొందరు కేవలము జలము చేత మరికొందరు గాలిని పీల్చుటను అవలంబించువారు. కొందరు శాకములను తిని గడుపువారు. వీరేకాక ఇంకనూ కొందరు ఘోరతపస్వులు, జ్ఞాన యోగులు కలరు. వారందరును జన్మించుట, మరణించుటయే తప్ప వేరితర విషయములే ఉండవు అని పల్కుదురు. వారే ఇదే విషయమును అనేకమార్లు ప్రకటించుచుందురు. వారి మనస్సులయందు నిరతము సంసార భయము ఘనీభవించి ఉన్నది. అందుచేత సావధానులై విధింపబడిన నియమములను నిరతము పాటించు చుందురు. ఉద్దాలక మహర్షి కుమారుడగు నచికేతునియందు కూడా ధర్మప్రబలత కలదు. ఈ తపస్సులందరిని చూచిన తర్వాత నచికేతుని మనస్సునందు అపారహర్షము కలిగెను. అంతేగాక ఆయన నుంచి సదా ధర్మ

చింతనము జరిగినది. మనస్సునందు అమితమైన వేదార్థము, శుద్ధ స్వరూపుడగు శ్రీహరి చిన్మయ భగవద్విగ్రహమున ఉండిపోయెను. పిమ్మట ధర్మాత్ముడగు నచికేతుడు సావధానుడై శుద్ధతపోమార్గమునే ఎన్నుకొనెను.

రాజా! ఈ ఉత్తమ ఉపాఖ్యాన ప్రభావము చేత ఎల్లరకు భగవంతుని యెడ శ్రద్ధ ఉత్పన్నమగును. దీనిని ఎవరు విందురో లేక చదివి వినిపింతురో వారికి సర్వకామనలు సిద్ధింపగలవు. (211,212)

213 వ అధ్యాయము - గోకర్ణేశ్వర మాహాత్మ్యము

సూతుడు శౌనకాది మహామునులతో తన ప్రసంగమును కొనసాగించుచూ ఇట్లు చెప్పెను. "మహర్షులారా! అతి ప్రాచీన కాలమున జరిగిన ఒక విషయమును తెల్పుచున్నాను. ఆ కాలమున తారకామయము అను పేరు గల మహాఘోరమైన దేవాసుర సంగ్రామము జరిగెను. ఆ మహోగ్ర యుద్ధమునందు దేవతలు రాక్షసులు ఒక్కొక్కరి పక్షమున ఇరుసేనల యందును ఒకరిని మించిన మరియొక్కరు మహావీరులగు శూరులు కలరు. యుద్ధసమాప్తమున దేవతలు దానవుల సేనను సంపూర్తిగా ఓడించిరి. అందుచేత దేవేంద్రుడు మరల స్వర్గసింహాసనమున అధిష్ఠితుడయ్యెను. మూడు లోకములయందలి చరాచర ప్రాణులకు సుఖశాంతులు లభించి సంతోషముతో జీవించుచుండిరి. ఆ కాలము నందే పర్వతముల యందు అగ్రేశ్వరుడగు మేరుపర్వతుని ఒక సువర్ణమయ శిఖరముపై అనేక విధములైన రత్నములు అన్ని దిశలయందును తమ కాంతులను వెదజల్లుచుండగా కొన్ని స్థలముల యందు విద్రుమ మణుల గనులు ఉండగా, ఒక విశాల కమల దివ్యాసనముపై బ్రహ్మ కూర్చొని యుండెను. ఆ ఆసనముపై బ్రహ్మ ఏకాగ్రచిత్తముతో సుఖపూర్వకముగా ప్రతిష్ఠితుడై యుండెను. ఒకనాడు సనత్కుమారుడు అచటికి వచ్చి వెనువెంటనే పితామహుడగు పరమేష్ఠికి ప్రణామముచేసి గోకర్ణమును గురించి తెలుసుకొను కుతూహలము గలవాడై ఇట్లు ప్రశ్నించెను.

"మహాదేవా! పరమేష్ఠి తత్వజ్ఞులగు పురుషులయందు శిరోమణిగా ఉన్నవాడవు నీవు. శుభకరమగు నీ వాక్కుల నుంచి ఋషుల ద్వారా వివరింపబడిన పురాణ వృత్తాంతమును వినవలయునను కోరిక గలదు. మహావిభో! ఉత్తర గోకర్ణము, దక్షిణ గోకర్ణము, శృంగేశ్వరము అని చెప్పబడు మూడు శివలింగములు పరమోత్తమములుగా

స్వీకరింపబడుచున్నవి. ఈ ఉత్తమములగు మహా లింగములు ఎందుకు, ఎట్లు, ఎవరిచే ప్రతిష్టింపబడి ఉన్నవి? మహేశ్వరుడగు శంకర భగవానుడు మృగరూపమును ధరించి ఏ కారణము చేత అచట విరాజిల్లుచున్నాడు? దేవతా ప్రముఖులందరునూ ఎట్లు అచ్చట నివాసము చేయుచున్నారు. శంకరుడు మృగరూపమును ధరించుటకు కారణమేమి? అంతే గాక ఆ శివలింగ విగ్రహప్రతిష్ఠ ఏకాలమునందు జరిగెను?" అను ఈ విషయములను జిజ్ఞాసుడవైన నాకు కృపతో తెలుప ప్రార్థన.

సనత్కుమారుని ఆసక్తికరమగు ప్రశ్నను వినిన చతుర్ముఖుడు ఇట్లు చెప్పెను. "వత్సా! ఈ పూర్వకాలీన విషయము మిక్కిలి రహస్యపూర్ణమైనది. నేను విని ఉన్న ప్రకారము యధానుసారము నీకు తెలుపుచున్నాను. శ్రద్ధతో ఆకర్ణింపుము. గిరి శ్రేష్ఠుడగు మంధరా చలము యొక్క పరమ పవిత్రమగు ఉత్తర భాగమునందు 'ముంజవంత' అను పేరుతో ప్రసిద్ధమగు ఒక శిఖరము కలదు. ఆ శిఖరశోభ చేత నందనము అను పేరుతో ఉపవనము ఒకటి పెరుగుచుండెను.అచటి సాధారణశిల కూడా ఆకుపచ్చగా స్ఫటికమణితో సమానముగా ఉండును. మరికొన్ని శిలలు పగడ సదృశ్యముగా ఎఱ్ఱని లోయల చేత సుశోభితములై ఉండును. కొన్ని శిలాఖండములు నీలముగాను, మరికొన్ని స్వచ్ఛమగు తెల్లని కాంతితోను ప్రకాశించుచుండును. ఆ పర్వతమునందలి ప్రతిస్థానము వద్దను శ్రేష్ఠములగు గుహలు, సెలయేరులు ఉండెను. ఆ పర్వత రాజము యొక్క శిఖరములన్నియు విచిత్రములు, చిత్రవర్ణ శోభితములు అగు పుష్పములచేత నిండియుండెను. వివిధములగు పుష్పఫల భారము చేత నిండియుండు ఆ శిఖరముల శోభ అత్యంత మనో మోహకములుగా ఉండును. అచ్చట దేవతాగణములు తమ భార్యలతో విహారమును చేయుచుందురు. వివిధ వృక్ష శాఖల పై కూజితములు చేయుచుండు పక్షులు ఆ పర్వత శ్రేష్ఠుని యొక్క ముఖశోభను సుశోభితములుగా చేయుచుండెను. అచటి ఉపవనముల యందు అచ్చటచ్చట కాంచనవృక్ష పుష్పములు, కొన్నిచోట్ల హంసలు సారస (బెగ్గురు పక్షులు) పక్షులు తిరుగుచుండును. కొన్ని ప్రదేశములందు సంపూర్ణముగా వికసించిన పద్మముల చేత నిండిన జలాశయములు, నిర్మల స్వచ్ఛపూర్ణ జలములచే నిండి ఉండి, వాని శోభను ఇనుమడింప జేయుచుండును. పశుపక్షులు నదులనుండి తమ జోడు ప్రాణులతో కలిసి తిరుగుచూ, అత్యంత శోభాశీలములగు ఉద్యానవనములతో నిండి ఉండిన ఆ

ప్రదేశము తపస్వుల కొరకు సర్వథా ఉపయుక్తముగా ఉండెను. అది ధర్మారణ్యము అని పిలువబడును. అదియే స్థాణునగు మహేశ్వర భగవానుని నివాసస్థానము. మహేశ్వరుడు సంపూర్ణ సురగణములకు అధిపతి. భక్తులయందు సదా కృపారసము ప్రసరింప జేయువాడు. మహాశక్తి శాలియైన శ్రీకంఠునితో గిరిరాజ కన్య గౌరి నిరంతరము విరాజమానురాలై ఉండును. తన సేవికలతోను, కుమారుడగు కార్తికేయునితోను జగన్మాత భర్తతో కూడి శ్రేష్ఠమగు ఆ పర్వతముపై వసించుచుండును. ఆ దేవేశ్వరులు జన్మరహితులు, వినాశరహితులై పరమపూజ్యులగు వారు. వారిని సేవింప వలెనను కోరికచే సర్వదేవతలు దివ్యవిమానములను అధిరోహించి అచ్చటకు పోవుచుందురు.త్రేతాయుగమునందు జరిగిన ఒక విషయము. నంది అను పేరుతో విఖ్యాతుడగు ఒక మహాముని శంకర భగవానుని ఆరాధింపవలెనను కోరికతో అచటకు వచ్చి తీవ్రము కఠినమైన తపస్సు చేయుట ప్రారంభించెను. ఆయన గ్రీష్మకాలమునందు పంచాగ్ని మధ్యమున నిలబడి తాపము చేతను, వర్షఋతువునందు నీటి మధ్యయందు నిలబడియు తపస్సు చేయుచుండెను. ఎట్టి అవలంబనము లేక చేతులు పైకెత్తి నిలబడి తపమాచరించు చుండెను. ఆయనకు జలము, అగ్ని,వాయువులు మాత్రమే ఆధారముగా ఉండెను. ఆయన అనేక విధములుగా వ్రతములు తపోనియమమును సంపూర్ణముగా అనుసరించు చుండెను. అచ్చట గల బ్రాహ్మణులు అందరియందును ఆ నందికి పరమ ఆదరము గౌరవము కలదు. ఆయన సమయానుకూలముగా జలమును ఫలములను ఇంకనూ ఇతర ఉపచారముల చేత ఈశ్వరుని అర్చించుచుండెను. ఉత్తమ వ్రతానుష్ఠానము చేయుచున్న ఆ ద్విజవరుడు ఉగ్రమగు తపస్సు చేత తనను తాను జయించెను. అంతమునందు శంకర భగవానుడు ఆయన యెడ పరమప్రసన్నుడై మునిశ్రేష్ఠుడగు నంది యెదుట సాక్షాత్కరించి తనదర్శన భాగ్యమును కల్గించి "మునివర్యా! నేను నీకు దివ్యనేత్రములను ప్రసాదించు చున్నాను. ఇప్పటివరకునూ నీకు నా రూపమును అదృశ్యముగా కలదు. కాని ఈ సమయమున నేను నీ యెడ ప్రసన్నుడనగుటచే ఈ నా రూపమును దర్శింపుము. ఈ లోకమున విద్వాంసులగు నరులు మాత్రమే నా ఈ అప్రతిమ ఓజస్వీ రూపమును చూడగల్గుదురు." అనెను.

రాజా! ఆ సమయమున సర్వోత్కృష్టము, శుభకరమగు శంకరుని సంపత్కర రూపము వేలకొలది సూర్యులతో సమానమైన తేజమును వెలువరుచుచుండెను. ఆ ప్రభుని

మేలికాంతి పుంజములు స్పష్టముగా కనిపించుచుండెను. జటలు ఆయన శిరోకాంతిని పెంపొందించుచుండగా, శిరస్సున చంద్రకళ లలాటమును సుశోభితము చేయుచుండెను. మహాదేవుని నేత్రములు రెండునూ పరమ ప్రకాశమానముగా ఉండగా మూడవ నేత్రము అగ్నితో సమానముగా వెలుగుచుండెను. ఆయన పవిత్ర అంగములపై పద్మపుష్పములు విరాజిల్లుచుండగా, చేతియందలి కమండలము ప్రకాశించుచుండెను. వ్యాఘ్రాంబర ధారియై సర్పయజ్ఞోపవీతములను ధరించి తన ఎదుట ప్రత్యక్షమైన మహాదేవుని దర్శన ప్రాప్తిచే వెనువెంటనే మహాతపస్వి నందికి రోమాంచము కలిగెను.

రాజా! ఆయన సనాతనుడు, పరబ్రహ్మ, పరమాత్మునియొక్క రూపాంతరము. ఆయన్ను దర్శించినంతనే మునిశ్రేష్ఠుడగు నంది అంజలిఘటించి త్ర్యంబకేశ్వరుని ఇట్లు స్తుతించెను. ఏ దేవదేవుడు తాను స్వయముగా ఉద్భవించి ఈ సర్వలోకములను తానే ధరించి, పోషించుచున్నాడో తన భక్తులను కరుణించి వరప్రదానము చేయు మహాదేవుడు ఎవరో, అట్టి జగత్ప్రభువునకు నమస్కరించుచున్నాను. ఏ భగవంతుడు త్రినేత్రుడు, శివుడు, శంకరుడు, భౌముడు అను నామము చేత విఖ్యాతుడో ఈ లోక సృష్టి, రక్షణ, సంహారములకు ఎవరు కారణభూతు డగుచున్నాడో, చర్మమయ వస్త్రమును ధరించి, ముని రూపములో ఎవరు దర్శనమిచ్చునో ఆ మహేశ్వరునకు నమస్కారము. నీలకంఠుడు, భీముడు, భూత, భవ్య, భవప్రలంబభుజ కరాళ అరినేత్ర కపర్ది విశాల ముంజకేశ ధీమంత శూలపాణి పశుపతి విభుడు స్థాణువు గణేశ్వరుడు స్రష్ట సంక్షేప్త భీషణ సౌమ్య సౌమ్యతర త్ర్యంబక, శ్మశాన నివాసి వరదుడు కపాలమాలి హరితశ్మశ్రుధరుడు మొదలగు మహానామముల చేత సంబోధింపబడువాడు అగు అట్టి రుద్రభగవానునికి నా ప్రణామము. భక్తులకు సదా ప్రియము కల్గించువాడును, అగు పరమాత్ముడైన శంకరునికి మరల మరల నమస్కరించుచున్నాను.

అని ఈ విధముగా విప్రవరుడగు నంది రుద్రభగవానుని స్తుతించి ఆయనను సమ్యక్ విధానములతో ఆరాధించి, శిరము వంచి మరల మరల నమస్కారము చేయుచూ పుష్పాంజలి అర్పించెను. అంతట శంకరభగవానుడు భక్తాగ్రేశరుడగు నంది యెడ సంతుష్టుడై స్వయముగా ఋషితో వరదుడగు మహేశ్వరుడు "విప్రవరా! నీ తపమునకు సంతుష్టుడనైతిని. వరమును కోరుకొనుము. నీ మనస్సునందు గల అభిలాషను సంపూర్తిగా

తీర్చుటకు నేను ఉద్యుక్తుడనైయున్నాను. అందుచేత నీ కోరికను నాకు తెల్పుము" అని ఆదేశించెను.

రాజా! శంకరభగవానుడు మునివరుడగు నందికి ఈ విధముగా ఆదేశింపగా ఆయన అంతఃకరణము సంతోషముచే నిండగా అనంతరము కాలకంఠునితో ఇట్లు విన్నవించెను. "ప్రభూ! నాకు ప్రభుత్వము, దేవత్వము, ఇంద్రత్వము, బ్రహ్మత్వము, లోకపారత్వము, అపవర్గము అణిమాది అష్టసిద్ధులు, ఐశ్వర్యము, నానాపత్యాది సిద్ధులు ఏ ఒక్కటియునూ అవసరము లేదు. దేవేశ్వరా! నీవు కళ్యాణస్వరూపుడవు. నీ భక్తుల క్షేమము కొరకు సదాసంలగ్నుడై యుండువాడవు. అందుచేత నీవు నాపై ప్రసన్నుడవైన యెడల దేవేశ్వరా! కృపతో నీ భక్తిని నాకు ప్రసాదింపుము. మహేశ్వరా! నీవు తప్ప అన్యులైన ఏ దేవతల యందును నాకు భక్తి కలుగకుండు గాక! అట్లే సర్వజీవులకును ఆశ్రయము కల్గించువాడవు, ప్రభుడవు అగు నీయందే నాకు స్థిరమగు భక్తి నిరంతరము నిల్చు గాక! ఇది నా సత్యమగు హృదయ పూర్వక అభిలాష. దీనికి ఫలస్వరూపముగా నీకై నిరంతరము తపస్సునందే నిమగ్నుడనై ఉండు శక్తిని కల్గించి, నా ఈ కార్యమునందు ఎట్టి విఘ్నములు కలుగకుండా నేను రాత్రింబగళ్ళు నీ నామమునే జపించునట్లుగా కరుణింపుము. ఇదియే నా కోరిక. అని ప్రార్థించెను. రాజా! విప్రవరుడగు నంది కోరిన ఈ కోర్కెను విని శంకర భగవానుని ముఖము మధుర మందహాసముతో ప్రకాశించెను. ఆయన ప్రసన్నుడై మధురములగు వాక్కులతో నందితో "విప్రఋషి! లెమ్ము. సువ్రతా! నీ తపస్సు చేత నేను మహాప్రసన్నుడనైతిని. నీవు శుద్ధచిత్తముచే భక్తిపూర్వకముగా నా ఆరాధన సల్పితివి. తపోధనా! నీ తపశ్చర్యచేత నాకు పరమ సంతోషము కల్గినది. వత్సా! నీవు నా ఆరాధన యందు చిత్తపూర్ణుడవై నిరంతరము ఉందువు గాక! రుద్రుల సమక్షమునందు నీవు నాకై మూడు కోట్ల జపము చేసితివి. ఒక వేయి సంవత్సరముల పాటు నీవు తీవ్ర తపస్సు చేసితిపి. నీవు చేసినట్టి తపస్సుతో తుల్యముగా ఇప్పటివరకునూ ఏ దేవదానవ ఋషులును చేసి ఉండలేదు. నాచే చేయబడిన ఈ అత్యంత కఠిన తపము మహాశ్చర్య జనకముగా ఉన్నది. దీని ప్రభావము చేత చరాచర ప్రాణులచే వ్యాపితమైన ఈ మూడు లోకములును అత్యంత క్షుభితములైనవి. నిన్ను చూచుటకై ఇంద్రునితో కూడి సర్వదేవలోకవాసులును ఇచ్చటకు వచ్చి ఉన్నారు. సురాసురుల కొరకు నీవు అక్షయము, అవ్యయము, అతర్క్యము

అయిన శక్తిని పొందితివి. నీ శరీరము నుండి దివ్యతేజము వెలువడుచున్నది. అలౌకికమైన ఆభరణముల చేత అలంకరింపబడినవాడవై, నీవు, మహాసుశోభితుడవు అగుచున్నావు. నీయందు నాతో సమానమైన శక్తి వచ్చి ఉన్నది. దేవదానవులందరునూ నిన్ను అద్వితీయ పురుషునిగా గణించుచున్నారు. ఇప్పుడు నీవు నాతో సమానమైన రూపమును ధరించెదవు. ఇంకను నావంటి తేజఃప్రాప్తి కలుగగలదు. నీకు త్రినేత్రములు ఏర్పడును. సర్వగుణముల యందును నీయందు ప్రాధాన్యము కలుగును. అంతేగాక దేవదానవులు నిన్ను ఆరాధింతురు. ఇందెట్టి సందేహమును లేదు. నీవు ఇదే శరీరముతో శాశ్వతముగా అమరుడవై ఉండగలవు. జరామృత్యువులు నీ వద్దకు రాలేవు. దీనిని గాజేశ్వరగతి అందురు. అది నీకు లభ్యమగును. దేవతలకు కూడా ఎన్నడునూ ఇట్టి శక్తి అలభ్యము. ద్విజోత్తమా! నా పార్షదులయందు నికు ప్రధాన స్థానము లభించగలదు. జనులు నిన్ను నందీశ్వరుడు అని పిల్చెదరు. ఇందు సందేహము లేదు.

తపోధనా! నీకు సాత్విక ఐశ్వర్యము లేక అణిమ మహిమాది అష్టసిద్ధులు ప్రాప్తింపగలవు. అంతేగాక నీవు నా మరియొక స్వరూపముగా భావింపబడుదువు. దేవతలు నీకు ప్రణామములు అర్పించెదరు. నా కృపచేత లోకమునందు నీవు స్వామి పదవిని పొందగల్గుదువు. నేటినుంటి దేవకార్యములందు అన్నింటియందును నీకు ప్రథమ పూజ జరుగగలదు. నీవు నా పార్షదుల(సేవకుల)లో ప్రధానుడవు అగుటయే కాక నా కృపకు పాత్రులైన సర్వమానవులు చక్కగా నిన్ను కూడా అర్చింతురు. నీవు నా గణమునందు ఒకడవు అగుదువు. నా ద్వారపాలకుడుగా ప్రతిష్ఠింపబడుదువు. అట్లే విషమ పరిస్థితుల యందు నా శరీరరక్షణమును చేయువాడవగుదువు. ఈ మూడు లోకములయందును వజ్ర, దండ, చక్ర, అగ్ని అను వేనిచేతను నీకు ఎట్టి బాధయును కలుగదు. దేవ, దానవ, యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుష, పన్నగ, రాక్షసులలో గల నా భక్తులు అందరునూ నీ ఆశ్రయమును పొందుదురు గాక! ఇప్పుడు నీవు సంతుష్ఠుడవైన తర్వాతనే నేను సంతుష్టుడను అగుదును. నీవు కుపితుడవైన యెడల నా మనస్సునందు కూడా క్రోధా విర్భావము కలుగగలదు. భక్తవరా! ఎక్కువ ఎందులకు నిన్ను మించి ఈ విశ్వమునందు ఇతరుడు ఎవరునూ నాకు ప్రియమైన వాడు కాడు" అని చెప్పెను. ఈ విధముగా! భక్తవరుడగు నందికి ఉమాపతియగు శంకరభగవానుడు ప్రసన్నతా పూర్వకముగా

స్వయముగా ఆకాశములో ప్రతిధ్వనించు మధురమగువాక్కులలో స్పష్టముగా “భక్తా! నీకు శుభమగుగాక! నీవు కృతకృత్యుడవైతివి. మరుద్గణములతో పాటు సర్వదేవతా గణములను నిన్ను దర్శించుటకై ఇచ్చటికి వచ్చుచున్నారని తెలుసుకొనుము. వత్సా! ఆ సురాసుర సముదాయములు అందరును ఇచ్చటకు వచ్చి నన్ను దర్శించుటకు అవకాశము లభ్యము కాకముందే నేను ఇచ్చట నుంచి వేరు ప్రదేశమునకు పోవలెనని అనుకొనుచున్నాను” అని చెప్పి శంకరభగవానుడు అచ్చటనే అంతర్ధానుడయ్యెను. (213)

214 వ అధ్యాయము - గోకర్ణ మాహాత్మ్యము, నంది కి వర ప్రదానము

అనంతరము బ్రహ్మ ఇట్లు చెప్పెను. “సనత్కుమారా ! ఈ విధముగా చెప్పిన తర్వాత భూతభావనుడగు శంకర భగవానుడు అచ్చట నుంచి అంతర్ధానమైపోయిన వెంటనే, గణాధ్యక్షుడగు నందియొక్క శరీరము మహాతేజోవంతము, దివ్యము అయినది. ఆయన నాలుగు భుజములు, మూడు నేత్రములతో విరాజమానుడై, ఒక దివ్యస్థానమున స్థితుడైయుండెను. ఆయన శరీరవర్ణము కూడా దేదీప్యమానముగా ప్రకాశించుచూ, అగురుసుగంధమును పరిసరములలో వ్యాపింపజేయు చుండెను. త్రిశూలము, పరిఘ, దండము పినాకము అను విల్లు ఆయన చేతులయందు సుశోభితములై కనుపించు చుండెను. ఆయన ధరించిన ముంజమేఖల ఆ పరిసరముల శోభను ఇనుమడింప జేయుచుండెను. తన తేజముతో ఆయన రెండవ శంకరునివలె కన్పట్టుచుండెను. ఇంకను వామన భగవానుని వలె ఉద్యుక్తుడై ఆయన తన పాదములను ముందుకు చాచెను. ద్విజవరుడవగు సనత్కుమారా! మూడు అడుగులతో పృథ్విని ఆక్రమించు ఉద్యుక్తుడై ఆయన ఒక అడుగు ముందుకువేసెను. ఆ నందికేశ్వరుని దర్శించి, ఆకాశచారులగు సమస్తదేవతలును పృథ్విని ఆక్రమించవలెనని ఆలోచించుచుండిరి. ఆయనను చూచి, ఆకాశచారులగు దేవతలు, సమస్తదేవతల యొక్క మనస్సులు ఉవ్విళ్ళూరుచుండెను. ఆ దేవతల ఆశ్చర్యమునకు హద్దు లేకుండెను. అందుచేత ఇంద్రునికి తెలుపవలెనని వారందరూ స్వర్గము వైపునకు కదలుట మొదలిడిరి. దేవతల ద్వారా ఈ సమస్త వృత్తాంతమును తెలుసుకొనిన ఇంద్రునకు ఆయనతో లోకపాలురకు దీర్ఘమైన విషాదము కలిగినది. వారికి తమ మనస్సులయందు చింత విస్తృతముగా ఏర్పడినది. వారందరును ఈయన ఎట్టి వ్యక్తి. ఈయన ఉమాకాంతుడగు శంకరభగవానుని నుంచి వరప్రాప్తి

పొందెను కదా! ఆ కారణముచేత ఆయన అపారశక్తి సంపన్నుడయ్యెను. ఇప్పుడు తన శక్తిని అనుసరించి ఈయన మూడు లోకములయందును అవశ్యము విజయమును ప్రాప్తించు కొనగలడు. ఈయన యందుగల ఉత్సాహము, తేజము,బలములు స్పష్టముగా ప్రతీతములగు చున్నవి. అందుచే ఈతడు దేవతలయందు ముఖ్య స్థానమును కూడా తనదిగా చేసుకొన గలడు.ఆ హేతువు చేత తన తేజః ప్రభావముచే స్వర్గలోకమునకు ప్రవేశించునంత లోపల వరమును ప్రసాదించుటయందు మహానిష్ణాతుడగు శంకర భగవానుని మనము ప్రసన్నము చేసుకొనుటయందు నిమగ్నము కావలయును" అని తమలో తాము ఆలోచించిరి.

మునివర్యా ! ఆ దేవతలు ఈ విధముగా పరస్పరము సంభాషించుకొనుచు శ్రేష్ఠులగు ఆ దేవతలు నా వెంట ముంజవాన్ పర్వత శిఖరము పైకి చేరుకొనిరి. అచట సమస్త జగమునకు ఆశ్రయమును కల్పించువాడును, శక్తివంతుడును అగు శ్రీ కృష్ణ భగవానునికి ఈ విషయమును తెలియజేయుదుము అని భావించి సురసముదాయము అచట నుంచి వేగముగా వెడలిపోయినది. ఇప్పుడు అందుకు కారణము శంకరుని కృపయే, అని ఆయన కృపచేత దేవతలు, మునులు, అందరికిని ఆ విషయము స్పష్టమైనది. అంతట విష్ణు భగవానుడు స్వయముగా దేవతలవెంట నాతో సమానమైన నంది వద్దకు చేరుకొనెను. నంది వారితో ఇట్లనెను. "ఆహా! నేడు నా జీవనము సఫలమైనది. ఇప్పటివరకును నేను చేసిన పరిశ్రమ అంతయు నేడు సఫలము అయినది.నా శ్రమ ఫలించినది. ఎందుకనగా సకల దేవాధీశుడగు ఇంద్రుడును, అట్లే సంపూర్ణలోకముల శాసకుడగు శ్రీహరి యొక్క దర్శనము నేడు నాకు లభ్యమగుటచే నా భాగ్యము పండినది. నేడు నా జీవితము సర్వపరిపూర్ణమై నామనోరథములన్నియూ ఈడేరినవి. పాపసంహారకుడగు శివభగవానుడు శాంతస్వరూపుడై అనుగ్రహించాడు. నేను సంతోషముతో ఉక్కిరిబిక్కిరి అగుచున్నాను. ఆ దేవదేవుడు నాకు కోరిన వరములన్నియు ప్రసాదించి నన్ను తన పారదునిగా చేసికొనెను. నాపై ఆయనకు గల దయకు హద్దులు లేవు. ఆ కారణము చేతనే నాలో గల సమస్త కల్మషములు శుభకరములైనవి. శంకరభగవానుడు మహామహిమాన్వితుడు, ఆయన దేవతల గురించి నా యెదుట ఏమి చెప్పెనో ఆ చెప్పిన విషయమును సర్వప్రపంచమునకు హితకరములై సత్యసిద్ధములైనట్టివి. ఇందు ఆవంతయును సందేహము లేదు. ఆయన

"ప్రియనందీ! దేవర్షులు నీయెడ ప్రసన్నులై నిన్ను చూచుటకై ఇచటకు వచ్చి యున్నారు. నేడు పరమేష్టియగు బ్రహ్మ నిన్ను ఆశీర్వదింపవలెనని తలచుచున్నారు. అందు వలన నేడు పరమేష్టి యొక్క కటాక్షమును నీవు పొందగలవు. ఆ కారణముచేత మీ అపారమగు కరుణ చేత నా హృదయము నిండిపోయినది" అని చెప్పెను.

దేవతలు ఇట్లు పల్కిరి. శంకరుడు ఇట్లు పలుకగా, దేవతలందరునూ "విప్ర శ్రేష్ఠుడా నందీ! మేమును నీకు వరదాయియగు శంకరుని దర్శనమును కోరుకొను చున్నాము. నీ తపస్సు చేత సంతుష్టుడై సర్వేశ్వరుడు నీకు సాక్షాత్తుగా తానే దర్శనమిచ్చును. ఆయనను దర్శించుకొనవలెనని మాకు కూడా అభీష్టముకలదు." అని పలికి పిమ్మట దేవతలందరునూ నందిని మరియొక మారు కపాలధారణ చేయునట్టి మహేశ్వరుడగు శంకరుని దర్శనము మాకు ఎచట లభ్యముకాగలదు అని ప్రశ్నించిరి.

వారికి నంది ఇట్లు చెప్పెను. "ఆ ఈశ్వరుడు నాపై దయతో దర్శనమొసగి, అచ్చటనే అంతర్ధానము చెందెను. అందుచేత ఆ పరమేశ్వరుడు ఎచ్చట విరాజమానుడై యుండునో నాకును తెలియదు. ఆ కారణము చేత ఆయన ఎచ్చట ఉన్ననూ మీరు దేవతలైనందను స్వయముగా అన్వేషించవలెనని నా కోరిక" అని చెప్పెను.

ఆ మాటలకు సనత్కుమారుడు "భగవాన్ మహాభాగుడగు శంకరుడు నందితో ఏమి చెప్పెను? దేనిచేత ఆయన విరాజమానుడై ఉండు స్థలమును మేము కనుగొనగలము? దేవేశా! మీరు మాకు ఈ విషయమును చెప్పి పుణ్యము కట్టుకొనుడు. ఈశ్వరా! భగవంతుడు శంకరుని విషయమున ఏదియును గోపనీయము కాదు" అని పల్కెను. సనత్కుమారుని మాటలకు బ్రహ్మ ఇట్లు పల్కెను. "వత్సా! శంకరుడు దేవతలకు చెప్పిన విషయములను వారికి స్పష్టపరచుట నా యెడల ఉచితము కాదు. దానిని నేను మీకు చెప్పుచున్నాను. అయిననూ వారు నందికి ఏమి చెప్పిరో దానిని నేను మీకు తెల్పుచున్నాను. విప్రవరా! హిమాలయములకు ఆవలివైపున పృథ్విపై సంకటగిరి అను పేరు గల విఖ్యాతమైన ఒక సిద్ధస్థానము కలదు. దాని అనేక వనములు ఉపవనములు మిక్కిలి శోభావంతములుగా ఉండును. అచట 'శేషాత్మక' అను పేరు గల శ్రేష్ఠమైన ఒక సర్పము నివసించుచుండును. ఆ సర్పము తీవ్రమైన తపస్సు చేసినది. ఆ కారణము చేత దాని సర్వపాపములును భస్మమైపోయినవి. ఇప్పుడు వానిని అనుగ్రహించుట నాకు

అత్యంతావశ్యకము. అచట సుందరమైన ఆశ్రమము ఒకటి గలదు. మరియు నిర్జన స్థానమునందు ఆ సర్పము నివసించుచుండును. అట్టి దివ్యస్థానమునందు వాసము ఉండుటలో చాలాకాలము గడచిపోయినది. ఆ పవిత్రమైన పర్వతమునకు పైన ఉన్నతమైన శిఖరమే అధివసించి ఉండును. శ్లేష్మాతకసర్పము యొక్క నివాసము ఆ పర్వత స్థానమగుటచేత, ఆ పర్వతమునకు శ్లేషాత్మకవనము అను పేరు వచ్చినది. ఒకానొక కాలమునందు జరిగిన విషయము. నేను మృగరూపమును ధరించి అచ్చట విహారము సల్పుచుంటిని. అచ్చట నన్ను దేవతాగణములు పట్టుకొనుటకు ప్రయాసపడుచుండుటను చూచితిని. నేను అచట గల ఒక రహస్య స్థానమునందు దాగుకొంటిని. వారు నన్ను వెతుకుటయందు నిమగ్నమైరి. వత్సా! నీకు ఈ ప్రసంగము దేవతలకును, అప్సరసలకును తెలియనీయరాదు. నేను వారిక వరములనిచ్చి అంతర్ధానమైతిని".

సనత్కుమారునితో బ్రహ్మ ఇట్లు చెప్పెను. "నందికి వరమునిచ్చి మహేశ్వరుడు అంతర్ధానమైపోగా ఆయన తేజముచేత దిక్కులన్నియూ వెలిగిపోవుచుండెను. ఆయనవద్దకు అనేకులు దేవతలువచ్చి దర్శించిరి. ఆయన దివ్యశరీరము విదియ నాటి చంద్రునివలె ప్రకాశించుచూ పూజనీయము అయ్యెను. ఆయన మరుద్గణములను వెంటబెట్టుకొని మనోగామియగు అనగా ఇచ్చానుసారము ప్రయాణించుటకు వీలగు ఇంద్రుని రథమును అధిరోహించి అచ్చటకు చేరుకొనెను. ఆయన చేరుకొనిన మరుక్షణమే, ఆ పర్వతమంతయూ దివ్యతేజముతో ప్రకాశించెను. వివిధ జలచర జీవులకు స్వామియగు వరుణుడు కరుణావరమును ప్రసాదింపవలెనను కోరికతో తన గణములను వెంటనిడుకొని అచ్చటకు వచ్చెను. ఆయనకు గల అత్యంత తేజస్వియగు విమానము వజ్రమువలె స్పటికమణి విధముగా తేజోవంతమై యుండెను. ఆ పర్వత శిఖరముపై ధనమునకు అధిపతి యగు కుబేరుడు కూడా అచ్చటకు వచ్చి చేరుకొనెను. విచిత్రమైన ఆయన రథము ప్రకాశించెడి బంగారము చేత నిర్మింపబడి ఉండెను. ధనాధ్యక్షుడగు కుబేరునితో అనేకులు యక్షరాక్షస గంధర్వకిన్నెర కింపురుషులతో రాక్షసులు కూడా అచ్చటకు చేరుకొనిరి. సూర్యునితో సమానమగు ధగద్ధగీయమానముగా ప్రకాశించెడి విమానములయందు వారందరు అచ్చటకు చేరుకొనిరి. ఆ విమానముల శోభ అలౌకికమైనట్టిది. వారి అందరి మధ్యగల ఉత్తమ పుణ్యశ్లోకుడు, సుశోభితుడైన కుబేరుడు రెండవ సూర్యునివలె వెలిగిపోవు

చుండెను. సూర్యచంద్రులు అట్లే సమస్త గ్రహమండలము నక్షత్ర సమూహములు అగ్ని సమానముగా తేజస్వులై విమానములను అధిరోహించి ఆకాశము నుంచి ధరాతలమునకు దిగి వచ్చిరి. ఏకాదశ రుద్రులు, ద్వాదశ సూర్యులు కూడా అచ్చటకు చేరుకొనిరి. అశ్వినీ కుమారులు ఇరుపురును ఆ మహాతేజస్వంతమగు ముజ్జవన పర్వతము పైకి దిగి వచ్చిరి. విశ్వేదేవులు, సాధ్య గణములు తపోవంతులు అగు బృహస్పతి మొదలగువారు కూడా ఆ సమయమున అచ్చటికి వచ్చెను. విశాఖుడు అను పేరుతో విఖ్యాతుడగు కార్తికేయుడు అను భగవానుడు కుమారస్వామి, భగవంతుడగు వినాయకుడు ఆ మహాపుణ్యవంతమగు ప్రాంతమునకు చేరుకొనెను. వందలకొలది నెమళ్ళు క్రీంకారములు చేయుచుండగా నారద, తుంబుర, విశ్వావసు, పరావసు హాహాహుహూ, ఇంకనూ అనేకులగు ప్రసిద్ధులగు గంధర్వులు ఇంద్రుని ఆజ్ఞప్రకారము వివిధ విధములగు విమానముల ద్వారా అచ్చటకు చేరుకొనిరి. అంతేగాక పవన, అగ్ని, ధర్మ, సత్య, ధృవుడును ఇంకను దేవర్షులు సిద్ధ, యక్ష విద్యాధర గుహ్యక సముదాయములు ఆ ప్రదేశమునకు వచ్చిరి. విశేష మాహాత్మ్యము గల ఆదర్శకారులగు ఋషులు కూడా వచ్చిరి. గంధకాళి, ఘృతాచి, బుద్ధ గౌరి, తిలోత్తమ, ఊర్వశి, మేనక, రంభ, పుంజకస్థల వంటి ఇతరులు కూడా అప్సరసలు ఆ ముజ్జవాన పర్వతముపైకి చేరుకొనిరి. పులస్త్య, అత్రి, మరీచి, వసిష్ట భృగు, కశ్యప, పులహా, విశ్వామిత్ర, గౌతమ, భరద్వాజ అగ్నివేశ్య, వృద్ధపరాశర, మార్కండేయ, అంగీర, గర, సంవర్త, క్రతు, జమదగ్ని, భార్గవ, చ్యవనాది మహామునులందరునూ విష్ణుకథలను వినుచూ స్వర్గాధ్యక్షుడగు దేవేంద్రుని ఆజ్ఞ చేత అచ్చటకు సామూహికముగా చేరుకొనిరి.

స్త్రీ పురుష రూపములలో సింధుమహానది, సరయు, తామ్రపర్ణ, చారుభాగ, మిత స్థిత, కౌశికి, పుణ్య, సరస్వతి, కోకా, నర్మదా, బాహుధా, శతద్రు, విపాశ, గండకీ, సరిద్వరా, గోదావరి, వేని, తాపి, కశ్లోయ,సీత, చీరవతి,నంద, చందన, చర్మణ్వతి, పరాశ, దేవిక, ప్రభాస, సోమ, లౌహిత్య, గంగాసాగరాది నదులును ఇంకనూ ఎన్ని పుణ్య తీర్థములు కలవో అవి అన్నియుసూ ఆ సమయమున పృథ్వీతలమునకు వచ్చి చేరినవి. ఇంద్రుని ఆజ్ఞచేత ముంజవంత అను పేరు గల ఆ ఉత్తమమైన పర్వతమునకు అందరునూ చేరుకొనిరి. పర్వతములలో మహాఉత్తమమగు మహామేరు కైలాస, గంధమాదన, హిమవంత, హేమకూట, నిషధపర్వత ప్రవర, వింధ్యాచల, మహేంద్ర, సహ్యామలయగిరి,

దగ్గర, మాల్యవంత, చిత్రకూట అన్నిటికంటే ఎత్తైన ద్రోణాచల, శ్రీ పర్వతములు లతలతో పరిపూర్ణములై, పర్వతరాజ పారియాత్ర అను ఈ పర్వతములలో ఉత్తమమైన పర్వతములుగా పరిగణింపబడుచున్నవి. ఇవి అన్నియును అట్లే లతలచే పరిపూర్ణములగు ఇవి శ్రేష్టముగా పరిగణింపబడుచున్నవి. వీని అన్ని పర్వతముల కథ పర్వతములలో ఉత్తమముగా గణింపబడినవి. వీటి అన్నింటితోపాటు అనేక అరణ్యములు కూడా మనుష్య రూపధారణము చేసి అచ్చటకు ఆగమించినవి. సంపూర్ణయజ్ఞములు, సమస్తవిద్యలు, చతుర్వేదములు, మహాభాగుడగు సర్పరాజు వాసుకీ, సర్పరాజు, అమృతాశి వేలకొలది ప్రాణులతో ప్రకాశవంతుడైన అనంతశేషనాగు, ధృతరాష్ట్ర సర్పరాజగు కిర్మీరుడు, శ్రీమంతుడగు అంభోధరుడు, మహాతేజస్వంతుడగు నాగరాజు కూడా అచటకు వచ్చియుండెను. వీరేకాక సర్వాధ్యక్షుడును వేలు, లక్షలకొలది సర్పరాజములును ఆ ప్రదేశమునకు చేరుకొనెను. విద్యుజిహ్వా, ద్విజిహ్వేంద్ర, శంకవర్య, అనిమేశ్వర, మూడులోకములందును విఖ్యాతములగు శ్రీమంతులైన అనుసమేశ్వరుడు, పిలోచన కుమారుడు స్వచ్ఛము, స్ఫోటమణి, సతైచితుడు, పర్వతము వలె అచలుడుగా నుండు వాడును అట్లే వందలకొలది సర్పములతో ఎత్తులగు అరిమేజయుని వెంట సర్పరాజగు పరాక్రమవంతుడైన నాగరాజు వినత, భూరి, కంబలర, అశ్వతర అట్లే సర్పరాజగు పరాక్రమవంతుడు ఏకాపత్రుడు నాగుల అధ్యక్షుడగు కర్కోటకుడు, ఇంకనూ ధనుంజయుని వంటి మహాపరాక్రమశాలురగు అనేకులు భుజగేంద్రులు ముజ్జవన పర్వతముపై చేరుకొనిరి. దివారాత్రులు, పక్షమాసములు, సంవత్సరములు, ఆకాశము, పృథ్వి, దిశలు, విదిశలు, అచ్చటకు వచ్చిరి. ఆ సమయమున అచ్చటకు చేరుకొనిన దేవతలు, యక్షులు, సిద్ధులచే ఆ ముంజవంత పర్వతశిఖరము సంపూర్ణముగా నిండిపోయి నది. ప్రళయకాల మందు సముద్రము యొక్క ఒడ్డు జలముచే పరిపూర్ణము అయినట్లు ఆ పర్వతశిఖరము వీరందరిచే నిండిపోయినది. అప్పుడు ఆ పర్వత రాజగు ముంజవంత సురమ్య శిఖరము పై దేవతాసమూహముచే నిండిపోవుటచేత, వాయుప్రేరితమై వృక్షములు వారిపై పుష్పవర్షము కురిపించుట ప్రారంభము చేసినవి. ఆ సమయమునందు దివ్యులగు గంధర్వులు ఉత్తమ సంగీతముతోను, అప్సరసలు ప్రశంసనీయ నృత్యములతోనూ, పక్షులు సంతోషముతో మధుర స్వరములతో కలకూజితారావములు చేయుట ప్రారంభించినవి. పవనములు

పవిత్రములగు సుగంధములను తమతో తీసికొని వీచినవి. వాని స్పర్శచేత సర్వజనుల మనస్సులు ముగ్ధములై పోవుచుండెను. ఈ విధముగా దేవతలందరును, వారి ముందు విరాజమానుడై ఉన్న విష్ణుభగవానుని ముందిండుకొని ప్రకాశించెను. అట్లు దివ్యాభరణ ములచేత వారి ఆకారములు విద్యోదితములగుచున్నవి.

ఇంకనూ అచటకు చేరిన గంధర్వులు, అప్సరసలు గణములపై నంది దృష్టిసారించెను. ఆయన సర్వదేవతలను, ఇంద్రునితో కూడా అచ్చటకు చేరుకొనుటను గమనించెను. అయిననూ నంది సావధానుడై చేతులు జోడించి శిరస్సు వంచి, ఇంద్రునికి నమస్కరించెను. వెనువెంటనే సర్వదేవతాగణములును వచ్చుటను చూచి నందికి మహాశ్చర్యము కలిగినది. అందుచే ఆయన వారందరిని స్వాగతించుటయందు నిమగ్నుడయ్యెను. అచట ఉపస్థితులైయున్న సమస్త దేవతాగణములును క్రమముగా నమస్కారము చేయుటయందును, పిమ్మట వారందరికిని యథాశీఘ్రముగా ఆసనము, పాద్యము, అర్ఘ్యము మొదలగువానిని అర్పించుటయందును సంలగ్నుడయ్యెను. అట్లే తన అనుయాయులకు ఆదేశములను ఇచ్చుట ప్రారంభించెను. నంది చేసిన స్వాగతసత్కారము లను స్వీకరించిన మాస, రుద్ర, మరుద్, అశ్వినీ కుమార, సాధ్య, సిద్ధ విశ్వేదేవ, గంధర్వ, గుహ్యకాధి దేవతలు, గణదేవతలు, నందిని ప్రశంసించిరి. విశ్వావసు, హాహాహూహూ, నారద, తుంబుర, చతురంగసేనలు మొదలుకొని అన్యులైన గంధర్వులును నందిని ప్రశంసించిరి. వాసుకీ ప్రభృతులగు నాగసర్పములు రాజులని పిలువబడును. వానియందు అంతులేని శక్తి కలదు. సౌమ్యమూర్తియగు నందీశ్వరునిచూచిన వారందరును ఆయనను యథాశక్తి అర్చించిరి. వారందరియందును సిద్ధ, చారణ, విద్యాధర మొదలగు అప్సరసల యొక్క గణములు దేవేశ్వరుడగు ఇంద్రునిచే సన్మానింపబడిన నందీశ్వరుని అర్చించుట మొదలిడిరి. యక్ష, విద్యాధర,గ్రహ, సముద్ర పర్వత, సిద్ధ బ్రహ్మర్షి గణములు, గంగాది నదులు,వీరి అందరియందును అపారసంతోషము ఉత్పన్నమయ్యెను. అందుచే అందరునూ నందీశ్వరునికి తమ ఆశీర్వాదములను ఇచ్చుట ఆరంభించిరి.

ఇట్లు జరుగుచుండగా, దేవతలు ఈ విధముగా పల్కిరి. "మునులారా! భగవంతుడు పశుపతి శంకరుడు నిరంతరము మీయందు ప్రసన్నుడై ఉండునుగాక! అనవద్యులారా! మీకు సర్వత్రా అబాధగతి లభ్యమగుగాక! ద్విజవరులారా! మీకు దేవతల

కంటెను అధిక శ్రేష్టమైన శక్తి సులభముగా లభ్యమగు గాక! విభో! రోగములు, వ్యాధులు మిమ్ములను అంటకుండు గాక! మీరు అమరులై చరింతురు గాక! అచ్యుతులారా! శంకరభగవానునితో సప్తలోకములయందునూ సుఖముగా నివసించు శక్తి మీకు లభ్యమగు గాక !" అని పలుకగా దేవతల ఈ మాటలను విని నందీశ్వరుడు మరల వారితో తన ఉద్దేశములను ఈ విధముగా వ్యక్తపరచుట ప్రారంభించెను.

నంది ఇట్లు చెప్పెను. "మీరందరూ ప్రధానులగు దేవతలు. మీరందరితోను నాకు అగాధమగు స్నేహముకలదు. మీరు మహానుభావులు. అందుచేత ప్రియమగు సంభాషణలతో నాకు ఆశీర్వాదములను ప్రసాదించితిరి. అట్టి ప్రియవాక్యములను చెప్పిన మీకు నేను అత్యంతము ఋణపడి ఉన్నాను. మీకు నేను ఏమి చేయగల్గుదును? అందుకై మీరు నాపై దయయుంచి ఆజ్ఞాపింపుడు. నేను మీ ఆజ్ఞలను శిరసామనసా స్వీకరింతును." అని చెప్పగా, నందీశ్వరుడు పలికిన పలుకులు విని ఇంద్రుడు ఆయనకు ఈ విధముగా సమాధానమిచ్చెను.

శుక్రుడు ఇట్లు చెప్పెను. "భద్రుడా! ముందుగా శంకర భగవానుడు ఎచ్చటకు పోయెనో మాకు తెలుపుడు. ఈ సమయమునందు ఆయన ఎక్కడ గలడో తెలియజేయుము. విప్రవరా! దేవతలందరికిని అధ్యక్షుడు మహాశక్తిశాలియగు శివుని చూడవలెనని మేమందరము కుతూహలముగా ఉన్నాము. మునివర్యా! స్థాణువు, ఉగ్రుడు, శివుడు, శర్వుడు, మహాదేవుడు, అని పిలువబడు శంకరభగవానుని గూర్చి నీవు మాత్రమే తెలిసిన వాడవు. ఆయన గల స్థలమును వెంటనే తెలుపుము" అని ప్రార్థించెను. వజ్రపాణి ఇంద్రుని పలుకులు బుద్ధిపూర్ణములై, ఉండగా ఆ పలుకులను వినిన నంది శంకరుని మనస్సునందే స్మరించెను. వెనువెంటనే ఆయన ఇంద్రునికి సమాధానమిచ్చుటకు ఉద్యుక్తుడయ్యెను.

నందీశ్వరుడు "దేవేంద్రా! నీవు స్వర్గమునకు అధిపతివి. నీవడిగిన సందేహ విషయమునందు యదార్ధ విషయమును దయతో ఆకర్ణింపుము. ఈ ముంజవంత పర్వతముపై నేను సదా శివశంకరుని పూజించితిని. ఆయన పరమశక్తిశాలి పురుషుడు. అట్టి మహానుభావుడు నా యెడ ప్రసన్నుడై అనేక దివ్యవరములను ప్రసాదించెను. అనంతరము ఆయన దయాపూర్ణుడై ఇచ్చట నుంచి వేరు ప్రదేశమునకు వెడలిపోయెను. ఇప్పుడు ఆయనను గురించి తెలుపుటకు నాకు సామర్ధ్యము లేదు. వాసవా! నేను నీ

ఆజ్ఞలను స్వీకరించు గలవాడును. నీవు శంకరుని గూర్చి నన్ను ఆజ్ఞాపించిన యెడల ప్రభువును అన్వేషించు కార్యమును స్వీకరింతును." అనెను. (214)

215 వ అధ్యాయము - గోకర్ణేశ్వర జలేశ్వర మాహాత్మ్య వర్ణనము

పరమేష్ఠియగు బ్రహ్మ ఇట్లు చెప్పెను. అటు తరువాత సర్వదేవతలతో ఆలోచించి ఇంద్రుడు త్రినేత్రుడు శంకరభగవానుని వద్దకు పోవలెయునని నిర్ణయించుకొనెను. దేవతలందరునూ నందీశ్వరునితో సహా ఆ పర్వతము ఎత్తైనదిగా ఉండుటచే ఆకాశ మార్గములో ప్రయాణము చేసిరి. రుద్రభగవానుని అన్వేషించుచూ తమ మనస్సులను ఆ కార్యము పైననే లగ్నము చేసి, దేవతలందరునూ స్వర్గలోకము, బ్రహ్మలోకము, నాగలోకము మొదలగు సర్వలోకములను అన్వేషించిరి. ఇట్లు నిరంతర అన్వేషణము చేత వారందరునూ అలసిపోయిరి. కానీ పరమేశ్వరుని కనుగొన లేకపోయిరి. వారు చతుస్సముద్ర వేలాపర్యంత, సప్తద్వీప పరివేష్టిత, భూమిపై వెదకుట ప్రారంభించిరి. పిమ్మట వారు వరములతో కూడిన మహాపర్వతముల పైనను ఆ పర్వతముల గుహలయందును ఉన్నతములైన వారి శిఖరముల పైననూ అట్లే అతి గహనముగా ఉన్న వన నిరంజనములలోను క్రీడాస్థలములయందునూ అన్ని దిక్కుల యందును, అన్వేషించుచునే ఉండిరి. వారందరు అన్వేషణలో నిరంతరము మునిగి యుండుటచేత పృథ్విపై గల తృణములు కూడా ముక్కలు ముక్కలై పోయినవి. కాని ఎంత ప్రయత్నము చేసినను, త్రినేత్రుడగు పరమేశ్వరుని జాడలు కనుగొని ఆయన దయను ప్రాపించుకొనుటయందు దేవతలు సాఫల్యమును పొందలేకపోయిరి. అందుచే వారికి శంకరుని దర్శనము లభ్యము కాలేదు. ఆ కారణము చేత దేవతలు అత్యంతమ నిరుత్సాహ పడి దుఃఖమును పొందిరి. తర్వాత చేయవలసిన కర్తవ్యమును గూర్చి వారందరునూ ఒకరితో ఒకరు సుదీర్ఘముగా చర్చించి, ఒక నిర్ణయమునకు వచ్చిన తర్వాత ఆ దేవతలందరునూ నన్ను (బ్రహ్మ) శరణువేడిరి. అంతట నేను మనస్సును స్థిరముగా నిల్పి ఏకాగ్రచిత్తుడనై ఈ ప్రపంచ క్షేమమును ప్రసారించువాడగు శంకరుని సమాహిత బుద్ధితో ధ్యానించితిని. ఆయన రూపము అలంకారములు మొదలైన వారిని గురించి ధ్యానపూర్ణుడనై ఆలోచించుటచేత నాకు ఒక ఉపాయము తట్టినది. అందుచే దేవతలతో మనము నిరంతరము పరమేశ్వరుని కొరకు అన్వేషణ జరిపియు, మూడు లోకములను శోధించి వదిలితిమి. కానీ ఈ

భూమండలముపై శ్లేష్మాతకవనము అను వనమును శోధింపలేదు. (ఈ శ్లేష్మాతకవనము ఉత్తర గోకర్ణక్షేత్రమునకు మరియొక పేరు. ఇది పశుపతినాధునికి (నేపాల్ దేశము) కేవలము రెండు మైళ్ళ దూరములో కలదు. ఇచట బాగమతి నది ప్రవహించుచున్నది.) అందుచేత ప్రధానులైన దేవతలారా! మనమందరమును వెంటనే ఇచ్చటినుంచి ఆ ప్రాంతమునకు పోయెదము గాక అని ఈ విధముగా చెప్పి దేవతలందరినీ తన వెంట నిడుకొని శ్లేష్మాతకపర్వత దిశయందు ప్రయాణించిరి. శీఘ్రమే తమ తమ విమానములను అధిరోహించి, అచ్చటకు పోయినందువలన వారు శ్లేష్మాతకవనమునకు చేరుకొనిరి. ఆ మహాపుణ్య స్థానమగు శ్లేష్మాతకపర్వతము అనేక గుహలతో కూడియున్నది. ఆ పుణ్యమయ స్థానము సిద్ధులు, చారణులు మొదలగు వారిచే నిండియుండెను. అచ్చట గల కందనములు, ఇంకనూ అనేక విధములగు పవిత్రము, పరమ రమణీయమైన స్థానములు ధ్యానము చేసికొనుటకై అత్యుత్తమమైనవిగా వారికి తోచెను. వానియందు అన్ని గుణములు ఆధిక్యము కలదు. అనేక సుందర ఆశ్రమములు, ఉద్యానములు, స్వచ్ఛమైన జల ప్రవాహముచేత నిండియుండి, నదులతో అలరారుచుండెను. ఆ వనమునందు అతి శ్రేష్ఠములైన సింహ, శలభ, శార్దూలము, మత్తేభ, మహిష, నీలగోవులు, మర్కటముల గుంపులు శబ్దము చేయుచుండెను. సిద్ధాదులగు పురుషుల చేత ఆ పర్వతము నిండి యుండెను. దేవతలందరునూ ఇంద్రుని తమముందుంచుకొని ఆ వనమునందు ప్రవేశించిరి. వన ప్రారంభమునందే రధాది తమతమ వాహనములను వదలివేసి, నడచుచూ పోయిరి, అయిననూ వారందరునూ గుహలు, వృక్షములు, అట్లే వృకములతో నిండియున్న దట్టమైన అరణ్యములను సర్వదేవతలు మూర్తీ స్వరూపుడైన రుద్రభగవానుని అన్వేషణ చేయుట యందు సంలగ్నులైరి. కొంత ముందుకు పోయిన తర్వాత వారికి అత్యంత మనోహరమగు వనము కన్పించినది. ఆ వనము సర్వవనములకు అలంకారముల వంటిది. అచ్చట అనేకములైన పర్వతీయ నదులు, సరస్సులు, అనేక వృక్షములు, పుష్పములు, ఫలములతో నిండుగా ఉండినవి కలవు. వానిచేత ఆ వనశోభ ద్విగుణీకృతమైనది. దేవతలందరునూ ఆ వనమున ప్రవేశించిరి. ఆ నదులతటములందు కుంద పుష్పములు, చంద్రునితో సమానమైన స్వచ్ఛమగు వర్ణము గల హంసలు తిరుగాడుచున్నవి. పుష్పముల నుంచి మధుర మనోహర సుగంధము వెలువడుచున్నవి. ఆ

కారణముచేత ఆ వనము సుగంధపూరితముగా ఉండెను. అచ్చటచ్చట వ్యాపించి ఉన్న సైకతస్థలులు ముత్యముల కుప్పల వలె సుందరముగా హృదయములను ఆకర్షించుచున్నవి. ఇట్లుండగా ఆ ప్రదేశము నందు సకల దేవతల మనస్సులను ముగ్ధములనొర్చు సుందరమగు ఒక కన్య వారికి కన్పించినది. ఆమెను చూచి దేవతలందరునూ నాకు (బ్రహ్మకు) సంజ్ఞ ద్వారా తెల్పిరి. ఎందుకనగా నేను సమస్త దేవతలలోను అగ్రగణ్యుడను గదా! ఈమె ఎవరు అని నేను ఆలోచించుచుంటిని. తిరిగి ఒక ముహూర్తము పాటు ధ్యానమగ్నుడనైతిని. అంతట నాకు ఆ కన్య యొక్క విషయము బోధపడినది. ఆమె ప్రపంచ శాసకుడగు శంకరుని మూల శక్తియు, గిరిరాజగు హిమవంతుని పుత్రియు అగునని నాకు తోచినది. అది నిశ్చయమే. ఆమె భగవతి ఉమాదేవి. ఆ తరువాత దేవతలందరునూ ఆ పర్వత శిఖరము పైకి పోయి వెనువెంటనే క్రిందికి చూచుట ప్రారంభించిరి. అప్పుడు సురసత్తముడు త్రినేత్రుడు, కరుణామయుడు అగు శంకరుని దర్శనము వారందరకి ప్రాప్తించినది. ఆ సమయమందు శంకరుడు మృగసమూహ మధ్యమునందు వానికి రక్షకుడా అనునట్లు విరాజిల్లుచుండెను. ఆయన శిరస్సుపై ఒక కొమ్ము, ఒకటే పాదము కలదు. అవి జ్వలించుచూ సువర్ణము వలె ప్రకాశించుచుండెను. ముఖ, నేత్ర, దంతములు మొదలగు ఆయన శరీరాంగము లన్నియు బహు సుందరముగా కలవు. ఆ సమయమునందు అట్టి మృగరూపధారుడైన రుద్రునిచూచి దేవతలందరునూ ఆ కొండ నుంచి దిగిపోయి పరుగెత్తిరి. ఆ మృగేంద్రుని పట్టుకొనవలయునని వారందరి మనస్సులయందును తీవ్రమైన అభిలాష కలిగినది. ఆ హేతువుచేత వారు తీవ్ర వేగముతో అన్ని విధములైన ప్రయత్నములు చేయుటకు సిద్ధపడి ఉండిరి. పిమ్మట ఇంద్రుడు ఆ కొమ్ముపై భాగమును పట్టుకొనెను. ఆ సమయమున నేను కూడా అచ్చటనే ఉంటిని. నేను ఎక్కువ శ్రద్ధాభక్తులతో ఆయన కొమ్ము యొక్క మధ్యభాగమును నా చేతితో స్పృశించితిని. అంతేగాక ఆ మహాత్ముని కొమ్మును భగవంతుడగు శ్రీహరి కూడా తన చేతితో పట్టుకొనెను. ఈ విధముగా ముగ్గురును ఆ శృంగమును పట్టుకొనుటచేత, మూడు భాగములయందును మేము ముచ్చరమును పట్టుకొనుటచేత ఆ శృంగము మూడుగా విభాజితమైనది. ఇంద్రుని చేతియందు శీర్షభాగము, నా చేతియందు మధ్యభాగము విష్ణువు చేతియందు మూలభాగము ఉండి శోభాయమానముగా కన్పించుచుండెను. ఈ విధముగా అది

మూడురూపములుగా అయ్యెను. ఇట్లు మేము కొమ్ము యొక్క మూడు భాగములను ఎప్పుడు మావిగా చేసికొంటిమో అప్పుడు ఆ ప్రధాన మృగరూపధారుడగు శంకరుడు శృంగరహితుడై అచటనే అంతర్ధానుడయ్యెను. అయిననూ ఆయన మా కొరకే అంతర్ధానుడై ఆకాశమునందు ప్రవేశించి మాకు ఉపాలంబనము కల్పించుచూ, "దేవతలారా! నేను మిమ్ములను ఆశ్చర్యపరచితిని. మీకు స్వయముగా నన్ను పొందుటకు సామర్థ్యము కలుగదు. నేను శరీరధారుడనై మీతో చేయి కలిపితిని. అయిననూ వదిలించుకొని వచ్చి వేసితిని. ఇప్పుడు మీరందరునూ నా శృంగముతో సంతోషము పొందుదురు. నేను శృంగసహితుడనై ఉండగల్గిన యెడల ధర్మము కూడా తన నాలుగు పాదములపై తప్పక నిలువగలదు. ఇది నా సిద్ధాంతము" అని చెప్పెను. ఇంకను కరుణావత్సలుడగు శంకరుడు "దేవతలారా! ఇది శ్లేష్మాతకవనము ఇచటనే నా కొమ్మును విధిపూర్వకముగా ప్రతిష్ఠింపుడు. ఆ సత్కార్యము చేత ప్రపంచమునకు క్షేమమగును. ఈ వనము అత్యంత మహాపుణ్యక్షేత్రము కాగలదు. నా మహిమచేత ప్రభావితమై ఈ స్థానమునందు మహాయజ్ఞము సంభవించగలదు. భూమండలము పై ఎన్ని తీర్థములు, సముద్రములు, నదులు కలవో అవి అన్నియు నా కొరకు రాగలవు. హిమవంతుడు పర్వతరాజు. ఆయన ఉండు శుభప్రదేశము పేరు నేపాలము. నేను అచట గల భూమినుంచి స్వయంభూ రూపములో స్వతహా నాకు నేను దర్శనము ఇచ్చెదను. నా ఆ విగ్రహమునకు నాలుగు ముఖములు ఉండును. ఆ విగ్రహమునందు నా తలపై దండము ప్రచండ తేజముతో ప్రకాశించును. మూడు లోకములయందునూ అగ్ని స్థలములయందు శరీరేశుడు (పశుపతి నాథుడు) అను పేరుతో నేను కీర్తివంతుడను కాగలను. అచట నాగప్రదము అను పేరుతో ప్రసిద్ధమగు విశాలమగు సరస్సు ఏర్పడగలదు. సర్వప్రాణులకు హితము కల్గించవలయునను ఆలోచనతో, నేను దాని జలమునందు ముప్పదివేల సంవత్సరములవరకు నివసించి ఉందును. ఆ కాలమునే వృష్టి వర్షమునందు శ్రీకృష్ణ భగవానుడు అవతరింపగలడు. ఇంద్రుని ప్రార్థన చేత ఆయన తన చక్రము ద్వారా పర్వతములను పైకి లేపి రాక్షస సంహారమొనర్చును. మ్లేచ్ఛులచేత నిండి ఉన్న ప్రదేశములను శుద్ధియొనర్చును. సూర్య వంశ క్షత్రియులు అనేకులు జన్మించి సూర్యవంశము వలె వారి కష్టముచేత మ్లేచ్ఛుల శక్తిని అణచి వేయుదురు. వెనువెంటనే

క్షత్రియ గుణములు ఈ దేశమున బ్రాహ్మణులను ప్రవేశింపచేసి వారి సహాయము చేత ప్రచలితముగు ధర్మమును స్థాపింపజేయుదురు. వారికి నాశములేని స్థిరమగు రాజ్యోపలబ్ధి కాగలదు. మొదట కొన్ని రోజుల వరకు, ఈ ప్రాంతము జనరహితమై శూన్యముగా అగును. పిమ్మట క్షత్రియ వంశములందు ఉత్పన్నులైన రాజులు నన్ను ఆ శూన్యప్రదేశమునందే లభింపజేసుకొని నా అర్చా విగ్రహమును ప్రతిష్ఠింతురు. పిమ్మట ఆ స్థానము ప్రసిద్ధులగు బ్రాహ్మణులు, అట్లే సంపూర్ణముగా వర్ణాశ్రమములను నిలుపజేసి మహత్తరమైన జనపదముగా మార్చగలరు. అచ్చట ప్రజలందరునూ వివిధ విధములుగా నివాసము ఉండుచు సర్వులకు సుఖమును కల్గింతురు. అప్పుడే జీవులందరును ప్రత్యేక సమయములందు నన్ను ఆరాధించుచుందురు. నాకు విధి ప్రకారము నమస్కరించి దర్శించిన సజ్జనులకు సంపూర్ణ పాపము భస్మము అగును. దానితోపాటు వారు శివపురికి చేరగా వారికి నా దర్శనము లభ్యము కాగలదు. నా ఈ స్థానము గంగకు ఉత్తరముగా అశ్వినీముఖముతో దక్షిణము నందు పదునాల్గు యోజనముల దూరమున వ్యాపించగలదు. అని తెలిసికొనవలెను. ఎత్తైన హిమశృంగముల నుంచి జాలువారు బాగమతి అను పేరుగల ఒక నది ఆ స్థల శోభను ఇనుమడింప జేయును. ఆ బాగమతి యొక్క శుద్ధ జలములను భాగీరథియగు గంగాజలము కన్ననూ అధిక పవిత్రముగా చెప్పబడును. దానియందు స్నానము చేసిన ప్రభావముచేత నరులు విష్ణు, ఇంద్రలోకములకు చేరి శరీరములను త్యాగము చేసిన పిమ్మట నేరుగా నా లోకమున ప్రవేశింపగలరు. ఇందు ఆవంతయునూ సందేహము లేదు. ఈ క్షేత్రమునందు నివసించు నరులకు ఘోర పాపముల నుండియే కాదు, అనేక దుర్గతులనుంచి విముక్తి కలుగుట సులభము కాగలదు. ఇంద్రలోకమునందు ఎవరు నియమపూర్వకముగా నివసించుదురో వారు దేవదానవ గంధర్వ, సిద్ధ విద్యాధర ఉరగ ముని అపుర యక్షప్రభృతులు అందరును నా మాయా మోహితులైన కారణము చేత ఆ నా రహస్య స్థానమును కనుగొనుటయందు అసఫలులు అగుచున్నారు.

సురోత్తమా! తపస్వుల కొరకు ఈ తపోభూమి సిద్ధ క్షేత్రముగా చెప్పబడినది. విద్వాంసులగువారు ప్రభాసక్షేత్రము, ప్రయాగ, నైమిశారణ్యము, ఇంకను పుష్కర కురుక్షేత్రముల కంటే అధికమైనదిగా ఈ క్షేత్రమును గురించి చెప్పుచున్నారు. ఆ నా

మామయగు పర్వతరాజైన హిమవంతుడు స్వయముగా విరాజిలుచున్నాడు నదులయందు సర్వశ్రేష్టముగా చెప్పబడు గంగానది, ఇంకను ఇతర శ్రేష్ఠ నదులు ఆ హిమాలయముల నుండియే పుట్టుచున్నవి. ఆ ఉత్తమ క్షేత్రము మహాపణమయమైనట్టిది. అన్ని ఉత్తమములగు నదములు, నదులు అట్లే తీర్థములు అచ్చటనుండియే వెలువడుచున్నవి. అచ్చటి పర్వతములన్నియు పుణ్యస్వరూపములు అగుచున్నవి. అచ్చటనే నా ఆశ్రమము కలదు. సిద్ధులు, చారణులు ఆ ఆశ్రమమును సేవించుచుందురు. అచట నా విగ్రహము శయనేశ్వరము అను పేరుతో విఖ్యాతమగుచున్నది. ప్రవాహములయందు ధారగా ప్రవహించు శ్రేష్ఠమగు బాగమతి అను పేరుగల నది మహాపుణ్యదమైనట్టిది. అది కూడా హిమాలయముల నుంచే వచ్చుచున్నది. భాగీరథి, వేగవతీ అను ఈ రెండు నదులును నదులయందు పరమపవిత్రములైనట్టివి. వీనిని కీర్తించుట చేత మనుష్యుల యొక్క పాపము భస్మమై పోగలదు. అంతేగాక వానిని దర్శించుట చేతనే ప్రాణులు సంపూర్ణ ఐశ్వర్యమును పొందుచున్నారు. ఈ శ్రేష్ఠమైన నదుల యొక్క నీటిని త్రాగుట చేత, స్నానమొనర్చుట చేత పురుషుడు తనతోపాటు ఏడు తరముల వారిని ఉద్ధరింపగలడు. ఆ తీర్థము యొక్క మహిమను లోకపాలుడగు విష్ణువు కూడా స్వయముగా కీర్తించును. అచ్చట స్నానము చేసినవారు స్వర్గమునకు చేరుకొందురు. ఇంకనూ అచ్చట మరణించిన వారికి మరల జన్మించవలసిన అవసరము లేదు. ఎవరు అచ్చట మాటిమాటికిని స్నానము చేయుదురో వారు పునర్జన్మ పొందరు. అంతేగాక, స్వర్గమును చేరుకొందురు. నేను వారియెడ పరమ ప్రసన్నుడనై, సంసార సాగరము నుండి వారిని ఉద్ధరింపగలను.ఆ నదుల యొక్క జలముచే నిండిన పాత్రను తీసికొని వచ్చి, దానిని పరిశుద్ధమొనర్చి పూర్తిగా నిండిన పాత్రతో పరిశుద్ధమగు మనసుతో శ్రద్ధాపూర్వకముగా నాకు స్నానము చేయించిన (అభిషేకించిన) వాడు, వేదవేదాంగములను తెలిసిన శ్రోత్రియ బ్రాహ్మణుల సహాయముచే అభిషేకము చేయునో, అతడు అగ్నిహోత్రుని ఫలమును సులభముగా పొందగల్గును. ఆ నదుల యొక్క తటములపై జలభేదనము చేసి మృగశృంగోదకము అను పేరుతో ప్రసిద్ధమగు నా విగ్రహము అచ్చట కలదు. ఆ విగ్రహము అత్యంత ప్రియమైనది. అచ్చట సావధాన మగు మనస్సుతో శిరస్సుపై జలమును పోయుచూ, స్నానము లేక అభిషేకము చేయవలెను. అందుచేత జీవితము అంతయు చేసిన సర్వపాపములను అదే క్షణములో నష్టము అగును.

అచటనే పంచనదులు అను పేరు గల ఒక పవిత్ర తీర్థము కలదు. ఆ తీర్థ సమీపమున బ్రహ్మర్షి గణములు నివాసముందురు. కేవలము అచ్చట స్నానమాత్రము చేయుటచేత జీవులు అగ్నిష్టోమ యజ్ఞఫలమును పొందెదరు. భాగమతినది ఇచట అరువదివేల దివ్యగోవులను కాపాడుచుండెను. ఆ కారణముచేత దానిని కృతఘ్నులు లేక పాపులగు మనుష్యులు పొందజాలరు. నిరంతరము పవిత్రుడైయుండి ఇష్టదేవతలయెడ శ్రద్ధ ఎవరు కలిగి ఉందురో, అట్లే సత్యపాలనము చేయుదురో, అట్టి మానవులకు మాత్రమే బాగమతి నదియందు స్నానము చేయు అదృష్టము కలుగగలదు. అంతేగాక వారు ఉత్తమ గతులను పొందగల్గుదురు. దుఃఖముచే బాధింపబడువాడు, భయభీతుడు, సంతప్తుడగు మనుష్యుడును, వ్యాధుల చేత సతతము కష్టము పొందువాడును అగు వ్యక్తి కూడా ఈ బాగమతి నదియందు స్నానము చేసి పశుపతి నాథుడు అను పేరుగల నా దర్శనము చేసుకొనిన వారు పరమపవిత్రులై శాశ్వత శాంతిని పొందగల్గుదురు. ఇందు ఆవంతయూ సందేహము లేదు. ఆ నదియందు స్నానమొనర్చిన పురుషుడు సంపూర్ణముగా నా కృప పొందగల్గును. అంతేగాక అతివృష్టి, అనావృష్టి, శలభములు, ఎలుకలు, చిలుకలు సమీపమునకు చేరుకొనిన రాజులచే కలుగునవి ఈతి బాధలు మొదలగు అన్ని ఉగ్రఉపద్రవముల నుంచి సర్వదా శాంతిని పొందుచుండును. బాగమతి సర్వనదుల యందును ప్రధానమైనది. దాని జలమునందు స్నానము చేసి, నా దర్శనము చేసికొనిన కారణముచేత శుద్ధుడును, పవిత్రుడును కాగలడు. ఈ భాగమతినది యొక్క జలములో ఎచ్చటెచ్చట ఎవరెవరు స్నానము చేయుదురో, అచ్చటచ్చట, ఆ నరునికి రాజసూయము అశ్వమేధ యజ్ఞములను చేసిన ఫలము సంప్రాప్తించును. ఈ క్షేత్రమునందు చేసిన ఫలము ఒక యోజనము దూరమధ్యమున నాలుగువైపులను వ్యాపించి ఉండును. నేను స్వయముగా నాగేశ్వర రుద్ర రూపమున విరాజమానుడనై యుందునో ఆ మూలక్షేత్రము గురించి తెలుసుకొనవలయును. దాని తూర్పు దక్షిణ భాగమునందు నాగరాజగు వాసుకి వసించు స్థానము కలదు. (ఈ వాసుకీనాథ దేవతస్థానమగు దేవధర వైద్యనాథ ధామమునుంచి ఇరువది ఎనిమిదిమైళ్ళ దూరములో ధుంక అను ప్రదేశము నకు పోవు మార్గముపై కలదు. ఇచ్చట నాగేశ్వరుడు జ్యోతిర్లింగముగా ఉండును.) ఆ నాగేశ్వరుడు వేయిమంది ఇతర నాగులతో కలసి, నా ద్వారముపై సర్వధాస్థితుడై ఉండును. నా క్షేత్రమునందు

ప్రవేశింపగోరువారికి వాసుకి వల్ల విఘ్నములు కలుగును. అయినప్పటికినీ ఎవరు ఆయనకు మొదటగా నమస్కారము చేసి పిమ్మట నాకు ప్రణమిల్లిన ఎట్టి విఘ్నములును కలుగవు. ఆ క్షేత్రమునకు పోయి నరుడు పరమ భక్తి చేత ఎల్లప్పుడును నాకు నమస్కరించుచుండును. అతడిని పృథ్విపై నాకు నిరంతరము వందనము చేయును. ఈ పృథ్విపై రాజు అగుటకు ఉత్తమ యోగ్యత లభ్యము కాగలదు. అంతేగాక అన్ని ప్రాణులు అతడికి అభివాదము చేయుదురు. ఏ మనుష్యుడు గంధము, మూల్యము మాలలచేత నా విగ్రహమును అభ్యర్చనము చేయునో అతడు 'తుషితులు' అను పేరు గల దేవతల యొక్క యోనియందు జన్మించును. ఇందు సంశయము లేదు. ఏ వ్యక్తి నా ఆ పర్వతము పై శ్రద్ధాపూర్వకముగా ప్రజ్వలితమగుచున్న దీపమును దానము చేయునో అతడు సూర్యప్రభ అను పేరు గల దేవతల యోనియందు ఉత్పన్నుడగును. సంగీతము, వాద్యము , నృత్యము. స్తుతి అట్లే జాగరణము చేసి నా సేవను ఉపాసించునో ఆ జీవికి పెరుగు, పాలు, తేనె, ఘృతము లేని ఎడల కనీసము నీటితో నైనను నాకు స్నానము చేయించునో అతనికి ముసలితనము, రోగము, మృత్యువులు వశములో ఉండును. ఏ మానవుడు శ్రాద్ధ సమయము నందు భక్తిపూర్వకముగా బ్రాహ్మణులను ఈ స్థానమునందు భోజనము చేయించునో, అట్టి వానికి స్వర్గమునందు అమృతపానము చేయగల అవకాశము లభించును. అంతేగాక దేవతలు ఆతడిని గౌరవింతురు. బ్రాహ్మణుడు అనేక విధములగు వ్రత, ఉపవాసములు ఉత్తమముగా చేసి హవనము, స్వాధిష్టము, నైవేద్యము మొదలగు ఉపచారముల ద్వారా స్వర్గమునందు నివసించు, సముచితమైన శ్రద్ధతో సంపన్నుడై నన్ను సేవించునో అతడికి వేయి సంవత్సరములు నివసించుటకు అవకాశము ఉండును. ఈ ఎనిముది సేవలు అయిన తర్వాత అతటియందు ఎట్టి సందేహము లేదు. ఇంతేగాక మరల మృత్యులోకమునందు వచ్చుటజరుగదు.ఇంకనూ అతనికి సర్వఐశ్వర్యములు ప్రాప్తించును. ఇచట శైలేశ్వరము అను ఒక స్థానము కూడా కాగలదు. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర, స్త్రీ అననేల? ఎవరైనూ అచటకు పోయి భక్తితో నా ఉపాసన చేసిన యెడల వారికి నా పార్షదులు అగునట్టి అవకాశము సులభముగా లభించును. అంతేగాక వారు నిరంతరము నా గణములయందునూ, దేవతలతోనూ ఆనందభోగమును అనుభవించ గలరు. ఈ శైలేశ్వరము మహారహస్యస్థానము. ఈ భూమండలమందు దానిని మించిన శ్రేష్టమగు

స్థానము వేరొకటి ఎచ్చటనూ లేదు. బ్రాహ్మణులు, గురువులు, కనీసము గోవులు, హత్య చేసినట్టి మానవులకు కూడా ఈ క్షేత్రమును దర్శించుట చేత సర్వపాపముల నుండి విముక్తి లభించును. ఇచట అనేక విధములగు తీర్థములు కలవు. అట్లే అనేక దేవతా నివాస స్థానములగు పవిత్ర స్థలములను కలవు. ఈ తీర్థజలము వాని అన్నింటికీ సంబంధము కలవియే. ఆ కారణము చేత ఎవరు ఆ జలమును స్పృశించుదురో వారు సర్వాఘముల నుండి విముక్తిని పొందగల్గుచున్నారు. శైలేశ్వర స్థానమునకు రెండు క్రోశముల దూరమున కోశోదకము అను పేరుతో విలసిల్లుచున్న ప్రసిద్ధ పవిత్ర తీర్థము ఒకటి కలదు. అది దేవతలచే నిర్మింపబడినది. ఆ కోశోదకము మహామునులందరకునూ చాలా ప్రియమైన తీర్థము. ఇచ్చట స్నానము చేయుట చేత మనుష్యుడు పవిత్రుడు కాగలడు. అంతేగాక తన మనస్సును వశమునందుంచుకొని నిరంతరము సత్యమునందే ఇష్టము కలవాడు అగును. మరియు ఆ నరుడు సమస్త పాపముల నుండి విముక్తిని పొంది అన్ని విధములైన ఉత్తమ ఫలముల యందు భాగస్తుడగును. శైలేశ్వర భగవానుడి దక్షిణ భాగమునందు అవినాశము అను తీర్థము కలదు. అచ్చటకు పోయి ఆ తీర్థమున స్నానమాచరించిన నరునకు ఉత్తమ గతి ప్రాప్తించగలదు. అచ్చటనే భృగుపతనము అను పేరుగల స్థానము విరాజిల్లుచున్నది. ఆ భృగుపతన ప్రభావము చేత నరులు కామక్రోధరహితులై విమానముపై స్వర్గమునకు చేరుకొనగలరు. అప్సరసల సముదాయము వలన అట్టి నరునకు సహాయము లభింపగలదు. భృగుపతనమునకు కొంతదూరములో బ్రహ్మోద్భేదము అను విఖ్యాత తీర్థము ఉన్నది. దానిని సృష్టి ప్రదాత యగు బ్రహ్మయే స్వయముగా నిర్మించెను. ఆ తీర్థమును సేవించినందు వలన కలుగు ఫలితమును చెప్పుచున్నాను వినుము. ఏ నరుడు సంయమశీలుడై ఒక సంవత్సరము పర్యంతముఅచట స్నానమొనరించునో అతడు 'విరజ' అను నామముగల బ్రహ్మ లోకమును చేరుకొనును. ఇందు ఆవంతయు సందేహము లేదు. అచ్చటనే 'గోరక్ష' అను పేరుగల మరియొక తీర్థము గలదు. ఆ తీర్థస్థానమునందు గో, వృషభముల అనేక పాద చిహ్నములు ఉండును. ఆ పాద చిహ్నములను దర్శించుట చేతనే నరునకు వేలకొలది గోదానములు చేసిన ఫలము లభ్యము కాగలదు. అచట గౌరీశిఖరము లేక గౌరీశంకర అను పేరు గల మహాభగవతి గౌరీ శిఖరము కలదు. ఆ శిఖరమునందు సిద్ధ పురుషులు నివసింతురు. ఆ శిఖరము ఎడల మిక్కుటమగు ప్రేమగల జగన్మాత

పార్వతీదేవి అచ్చట నిరంతరము విరాజమానురాలై ఉండును. ఆస్తికులు అచ్చటకు కూడా పోవలయును. ప్రపంచమును రక్షించుటయందు నిరంతరము ఉద్యుక్తురాలగు జగన్మాత భగవతి ఉమ అచ్చట కొలువై ఉండును. ఆ మాతృదేవతను దర్శించుట, పాదములను స్పృశించుట, నిండు మనస్సుతో కొలుచుటచేత నరులకు అనేక లోకములకు పోగలుగు అధికారము సిద్ధించగలదు. ఆ స్థానమునుంచి క్రిందుగానే బాగమతి నది ప్రవహించు చున్నది. ఆ భాగమతీ నదీతటముపై తన ప్రాణత్యాగము చేయువారి ఎదుట ఆకాశ మార్గగామియగు విమానము వచ్చును. ఆ విమానముపై అధిరోహించి ఆ నరుడు వెంటనే భగవతి ఉమాదేవి యొక్క లోకమునకు చేరుకొనగల్గును. అచ్చట ఉమాదేవికి సంబంధించిన ఒక స్నాన కుండము కలదు. ఆ కుండమునందు స్నానమాచరించిన వ్యక్తి అగ్ని సమానముగా ప్రకాశమానుడై, కార్తికేయ (కుమారస్వామి) లోకమునకు పోవును. ఇచటనే పంచనదము అను పేరుగల మరియొక పుణ్యతీర్థము కలదు. అచ్చట బ్రహ్మర్షి గణములు నివాసము ఉండును. అచ్చటకు పోయి కేవలము స్నానము చేయుటచే ప్రాణికి అగ్నిహోత్ర యజ్ఞఫలము లభ్యము కాగలదు. ఒక పర్యాయము ఒక ముంగిస మనస్సు నందు సద్బుద్ధి ఉత్పన్నమైనది. అందుచేత అది సావధానముగా ఆ తీర్థమున స్నానము చేసెను. అందుచేత దాని మనస్సు పరమపవిత్రమై తన పూర్వజన్మ వృత్తాంతమును స్మరింపగల్గెను. దాని ఉత్తర భాగమునందు సిద్ధపురుషులచే సేవింపబడు ఒక శ్రేష్ఠమైన తీర్థము గలదు. గుహ్యమగు మాహాత్మ్యము గల ఆ ప్రాంతము పానీయము. దానిని గుహ్యకగణము నిరంతరము రచించుచుండును. అచట పూర్తిగా ఒక సంవత్సరము పాటు స్నానమొనరించిన నరునికి ఉత్తమమగు బుద్ధి సంప్రాప్తమగును. అంతియేగాక అతడు గుహ్యక శరీరమును పొంది రుద్రభగవానుని అనుచరుడు కాగల్గును. ఈ శిఖరము పైననే నివాసము ఉండు భగవతి ఉమయొక్క పూర్వ ఉత్తర, దక్షిణ భాగములయందు భాగమతినదియొక్క ప్రవాహము నిరంతరము ప్రవహించుచుండును. ఈ పుణ్యనది హిమాలయముల యొక్క కంధరముల నుండి వెలువడుచున్నది. అచట బ్రహ్మోద్భేధము అను పేరు గల మరియొక పవిత్ర తీర్థము కూడా కలదు. అటకు పోయి నరులు ఆ పుణ్య నదీజలముచే ఆచమనము, స్నానము తప్పక ఆచరింపవలెను. ఇందుకు ప్రతిఫలముగా అట్టి మానవుడు ఎన్నడునూ మృత్యులోకమును దర్శింపడు. ఏ విధమైన బాధలను ఆ

మానవునికి కష్టమును కల్గింపవు. అచ్చటనే సుందరీకా అను తీర్థమును కలదు. మొట్టమొదట బ్రహ్మ ఆ తీర్థములను నిర్మాణము గావించెను. ఆ తీర్థ జలమునందు స్నాతుడైన నరుడు మంచి అందగాడు, తేజస్వి కాగలడు. మూడు సంధ్యాకాలముల అందును అచటకు చేరుకొని సంధ్యోపాసన చేయుట మనుష్యునకు అవసరమగునట్టిది. ఇందుచే అతడు పాపములనుండి విముక్తుడు అగును. బాగమతి, మణివతి అను ఈ రెండు పవిత్ర నదులు హిమాలయములను ఛేదించుకొని వెలువడుచున్నవి. ఈ రెండు నదీమతల్లులకును పాపనాశనము చేసి మనుష్యుని ఉత్తమగతులు ప్రాప్తించునట్లు చేయు శక్తి కలదు. వేదములయందు పూర్ణమగు వైదుష్యమును పొందిన విద్వాంసుడగు ద్విజుడు పవిత్రుడై రాత్రింబగళ్ళు అచట వసించి రుద్రుని జపము చేసిన యెడల ఆ నరునకు అగ్నిష్టోమ యజ్ఞఫలము లభింపగలదు. సర్వరాజ్యపాలకులును అట్టి విద్వాంసులను సన్మానింపగలరు. ఇట్టి కర్మ ప్రభావము చేత అతనిచే సమస్త వంశమంతయూ ఉద్ధరింప బడును. ఎట్టి వ్యక్తి అయిననూ అచ్చటస్నానము చేసి తిల తర్పణములు సమర్పించిన యెడల వారి పితరులు విముక్తులగుదురు. ఇందు సందేహించవలసిన పనిలేదు. బాగమతి నది ప్రవహించు సర్వప్రాంతములయందును శ్రేష్ఠులగు పురుషులు ఆ నదీజలముల యందును స్నానముచేయవలెను. ఇందుకు ఫల స్వరూపముగా ఆ నరుడు తిర్యగ్యోని యందు జన్మను పొందుట నుంచి ముక్తుడు కాగలడు. అంతేగాక ఒక సమృద్ధమగు వంశమునందు జన్మింపగలడు. బాగమతి, మణివతి అను ఈ రెండు నదుల యందు కొద్దిపాటి భేదము కలదు. బుద్ధిమంతులగు మహర్షులు వాని తటములయందు నివసింతురు. యోగ్యులగు మనుష్యులు కామక్రోధరహితులై విధాన పూర్వకముగా గంగాద్వారమందు స్నానమొనర్ప వలెను. అచట స్నానము చేసినందువలన కల్గు మహాపుణ్య ఫలము చెప్పుచున్నాను వినుము. అచ్చట, మిగిలిన నదులన్నింటియందు స్నానము చేసిన దానికి పదిరెట్లు అధికముగా ఆ రెండు నదుల యందునూ స్నానమొనర్చిన యెడల పుణ్యము లభ్యము కాగలదు. ఇందు ఆవంతయూ సందేహింపవలసిన అవసరము లేదు. ఈ క్షేత్రమున విద్యాధర, సిద్ధ, గంధర్వముని దేవత యక్షులు మొదలగువారి సముదాయములు వచ్చి స్నానించుచుందురు. అంతేగాక భగవంతుడు ముక్కంటి ఉపాసన యందు సదా సంలగ్నులై ఉందురు. ఇచ్చటనే బ్రాహ్మణులకు కొలదిపాటి ధనమును

దానముగా ఇచ్చిననూ అది పది రెట్లు దానముగా ఫలము సంప్రాప్తించి అక్షయమగును. అందుచేతనే ఓదేవతలారా! అచ్చట స్నానమొనర్చి ధర్మకార్య సంపాదన చేయవలయును. ఈ శ్లేష్మాతకవనము పరము – పుణ్యధామము. అచ్చట దేవతలు వసించుచుందురు. దీనిని మించిన ఇతర ఇట్టి ఏ పుణ్య క్షేత్రము లేదు. ప్రియులైన దేవబృందములారా! నేను మృగరూపధారణము చేసి ఎచ్చటెచ్చట విచారించితినో లేక ఆసీనుడనైతినో ఎచ్చట నా భక్తులను నిద్రపుచ్చితినో, అచ్చటచ్చట అందరు స్త్రీల యొక్క సమూహముల చేత అది పుణ్యక్షేత్రమయ్యెను. సురగణములారా! నా శృంగమే ఈ మూడు రూపములుగా అవతరించినది. అందుచే దీనిన మనస్సుందను ధారణ చేయుడు. ఈ నా క్షేత్రము పృథ్వియందు గోకర్ణేశ్వరము అను పేరుతో ప్రసిద్ధి చెందగలదు. అని ఈ విధముగా సనాతనుడగు రుద్రభగవానుడు, దేవతలకు ఆదేశములిడి, తనరూపమును ఉపసంహరించెను. అంతట దేవతలు ఆయనను దర్శించుటలో అసమర్థులై ఉత్తర దిశవైపునకు వెడలిపోయిరి. (215)

216 వ అధ్యాయము - గోకర్ణేశ్వర, శృంగేశ్వరాది తీర్థమాహాత్మ్యము

పృథ్వీ దేవితో వరాహ భగవానుడు ఇట్లు చెప్పెను. మహామునులారా! మృగ రూపమును ధరించిన శంకరభగవానుడు అచటనుంచి వేరు ప్రదేశమునకు వెడలిపోగా నాతోసహా అచ్చట గల ప్రధాన దేవతలందరును మరల నొకమారు పరస్పరము ఆలోచించుకొనుట ప్రారంభించిరి. అప్పటివరకునూ శంకర భగవానుని శృంగము మూడు భాగములుగా విభజింపబడినది. దేవసముదాయము ప్రయత్నపూర్వకముగా వైదిక కర్మలను అనుసరించి చక్కని విధముగా మరల మరల వానిని ప్రతిష్ఠించుటకు ఏర్పాట్లు గావించిరి అని తెల్పి, భగవానుడు వరాహమూర్తి ధరణీ దేవితో ఇట్లు చెప్పెను. "దేవీ! వజ్రపాణియగు ఇంద్రుని చేతియందు పరమేశ్వర శృంగము యొక్క అగ్రభాగము కలదు. శక్తిశాలియగు శంకరుని శృంగము యొక్క విచలమైన భాగము నేను (అనగా బ్రహ్మ)తీసుకొని ఉంచితిని. మరియు దేవరాజగు ఇంద్రుడు, నేనునూ ఆ భాగములను అచటనే విధిపూర్వకముగా ప్రతిష్ఠించితిమి. అప్పుడు దేవతలు, సిద్ధులు, దేవర్షులు, బ్రహ్మర్షుల ప్రయాసచేత ఆ పరమ విశిష్ఠయగు విగ్రహము 'గోకర్ణుడు' అను నామముచేత ప్రతిష్ఠింపబడును. శ్రీహరి యొక్క చేతియందు శృంగము యొక్క మూలభాగము పడి

ఉన్నది. ఆయన దేవతీర్థమునందు దానిని ప్రతిష్ఠించెను. ఆ విశాలశీలమగు విగ్రహము శృంగేశ్వరము అను పేరుతో అచ్చట సుశోభితమై యుండెను. శృంగమునందు మూడు రూపములు ధరించినవాడై పరమ శివుడు విరాజిల్లెను. ఆయనయందును అవి అన్ని స్థానముల యందునూ ప్రతిష్ఠింపబడినవి. వస్తుతః ఆయన ఒకడే అయిననూ అనేక రూపములలో అభివ్యక్తుడయ్యెను. ఆయన ఆ మృగశరీరమును తన వందభాగములుగా స్థానమును కల్పించెను. అయిననూ ఆ శృంగమునందు మూడు విధములుగా విభక్తములైన భాగములను స్థాపించి సంపూర్ణ ఐశ్వర్యములతో సంపన్నుడగు శంకర భగవానుడు ఆ మృగరూప శరీరముతో వేరై హిమాలయ పర్వత శిఖరము పైకి చేరుకొనెను. పర్వతరాజగు హిమవంతునిపై సర్వసమర్థుడగు శివుని వందలకొలది రూపములు సుప్రతిష్టములై ఉన్నవి. మూడు విధములైన విగ్రహములు ఆ ప్రభువు యొక్క ఒక శృంగమునందే సర్వప్రథమునందే సర్వప్రథమముగా సుశోభితమయ్యెను. శంకర భగవానుడు సమస్త విశ్వశాసకుడు. దేవదానవులు అందరును ఆయనను తమ ప్రభువుగా పరిగణింతురు. ఆ సమయమున వారందరును అత్యంత కఠిన తపము ద్వారా శివభగవానుని ఆరాధించిరి. అంతేగాక ఆయన నుంచి అనేక విధములైన వరములను పొందిరి. శ్లేష్మాతక వనము యొక్క సమస్త భూభాగము నాలుగు వైపుల నుంచి దేవతలు, దానవులు, గంధర్వులు, యక్షులేగాక ఇంకనూ మహోరగముల చేత నిండిఉండినవి. తీర్థయాత్రలను సేవించుట కొరకై వారందరును అచ్చటకు వచ్చుట, ప్రదక్షిణ మొనర్చుటయందే సంలగ్నులై ఉండుచుండిరి. తీర్థదర్శన ఫలము వారికి లభ్యమగు చుండెను. వారి మనస్సులయందు ఈ ఆశాభావమే పూర్తిగా నిండియుండుటయే గాక ఈ క్షేత్రదర్శనము చేత లభ్యమగు మహాఫలము కూడా వారికి తెలిసినదే. అందరూ సుర గణములు, ఎచ్చటెచ్చట తీర్థములు కలవో అచ్చటకు పోయి ఆ స్థానముల నుంచి పునఃశ్లేష్మాతక తీర్థమునకు చేరుకొనిరి. ఒకనాడు పులస్త్య బ్రహ్మర్షి మనుమడు రావణుడు కూడా అచటికి చేరుకొనెను. అతడు అత్యుగ్రమైన తపమొనరించి, శంకర భగవానునికి అర్పించెను. ఆ స్థలమునందు పరమశివుడు గోకర్ణేశ్వర నామముతో ప్రతిష్ఠితుడై ఉండెను. రావణుడు ఆయనకు అత్యుత్తమమగు శుశ్రూషను చేయుటచే వరములిచ్చుటయందు పరమేశ్వరుడు స్వయముగా ఆతని సేవలచే సంతుష్టుడు కాగా, అదే స్థితియందు ఆ

శంకరుని రావణుడు మూడు లోకములను జయించుటకై వరము వేడెను. చివరిలో శంకరభగవానుని కృపచేత ఆతడి మనఃకామనలన్నియూ పూర్తిగా నెరవేరినవి. ఆ పరమ ప్రభువు రావణునికి అనేకమార్లు దర్శనమిచ్చి కృపతో సహాయమొనరించెను. మరల అదే క్షణములో త్రిలోకముల పైననూ విజయవంతమగుటకు తన నగరము నుంచి జైత్రయాత్రకు వెళ్ళెను.మూడు లోకములను జయించవలెనను కోరికచేత తన నగరములను చేరుకొనెను. అతడు మూడు లోకములను జయించి ఇంద్రుని కూడా యుద్ధమున ఓడించి తన అధికారమును పొందగల్లెను. ఇంద్రజిత్తు అను పేరుగల రావణాసురుడు కుమారుడు అతనికి సహాయము ఒనరించుచుండెను. ఆ సమయమునకు చాలా ముందే ఇంద్రుడు శివభగవానుని కొమ్ముయొక్క అగ్రభాగమును తీసుకొని తన వాస స్థానమున ప్రతిష్ఠించెను. దానిని పుత్ర సహితుడైన రావణడు పెకలించి వేసెను. అయిననూ రాక్షసుడగు రావణుడు దానిని తీసుకొని తన పురమునకు పోవుచుండగా సముద్ర తటమున చేరిన పిమ్మట దానిని నేలపై ఉంచి క్షణకాలము సంధ్యావందనము ఆచరించుటకై పోయెను. సంధ్యా వందనము సమాప్తమైన తర్వాత, తిరిగివచ్చి లింగమునుంచిన ప్రదేశమున దానిని బల పూర్వకముగా పెకలించివేయుటకు ప్రయత్నింపగా, అది ఎంత ప్రయత్నించిననూ రాలేదు. ఆ విగ్రహము కూడా వజ్రసమానముగా కఠోరమైనదయ్యెను. రావణుడు ఆ విగ్రహమును అచటనే వదలివేసి లంకకు ప్రయాణమయ్యెను. వరాహమూర్తి పృథ్వితో ఇట్లుచెప్పెను. మహామతీ! నీవు ఇట్టి మూర్తిని దక్షిణ గోకర్ణేశ్వరునిగా తెలుసుకొనుము. భూతపతి శంకర భగవానుడు అచట స్వయముగా వెలసియున్నాడు. మహర్షులతో బ్రహ్మ ఇట్లు చెప్పెను. “మహా మునులారా! నేను మీకు విస్తర పూర్వకముగా సర్వ విషయములను వివరించితిని. ఇట్లే గోకర్ణుని ఉత్తర దిశయందు కూడా ప్రతిష్ఠచేయుట జరిగినది. విప్రర్షులారా! దక్షిణము నందు శ్రీ శృంగేశ్వరుని ప్రతిష్ఠ ఎట్లు జరిగినదో అదే విధముగా ఉత్తరమునందు శ్రీ శైలేశ్వర భగవానుడు విరాజిల్లుచున్నాడు. వత్సా! నేను నీతో ఈ క్షేత్రము, తీర్థముల యొక్క పవిత్రమగు ఉత్పత్తి, ప్రసంగమును చెప్పి ఉంటిని. ఇప్పుడు మీరు నా నుండి ఏమి పుణ్యాత్మకమగు విషయమును వినుటకు కుతూహలపడుచున్నారో తెలుపుదు. (216)

★★★

217 వ అధ్యాయము - వరాహపురాణ ఫలశృతి

సనత్కుమారుడు ఇట్లు చెప్పెను "భగవాన్! మీరు యదార్థముగా ఉన్నది ఉన్నట్లు నా శంకలను తీర్చి సమస్త విషయములను స్పష్టముగా విశదీకరించిరి. నేను నా సంశయ విషయములను ప్రశ్నించుచూ పోయిన కొలది మీరు అత్యుత్తముగా వానిని గూర్చిన స్పష్టతను కలిగించిరి. విశ్వస్వరూప స్థాణువు జగదీశ్వరుడు అగు శంకరభగవానుడు అప్రతిముడగు తేజోవంతుడు. ఆయన జంగల పుణ్యక్షేత్రమునందు కలదు. మహాభాగా! జగత్తు యొక్క కళ్యాణముకొరకు ఆయన విగ్రహము లేక శృంగము ఎట్లు ప్రతిష్ఠింప బడవలెనో అట్లే వారుండు స్థలము తీర్థము అయినది. నేను వాని అన్నింటిని గూర్చి వినగోరుచున్నాను. జగత్ప్రభూ! నీవు యథార్ద రూపముగా దాని వివరణ తెల్పుదయను నాపై ప్రసరింపజేయుము" అన్ని ప్రార్థించెను. బ్రహ్మ ఇట్లు చెప్పెను. "మహాముని! ఈ సర్వతీర్థముల ఫలమును నీకు సందేహరహిత ముగా తెలియజేయబడినది. దానిని గురించిన మిగిలిన విషయములను నీవు పులస్త్యుని ద్వారా గ్రహింపగలవు. (వరాహ పురాణంలోని ఈ అంశము ఖిల రూపము. అనగా శేషభాగము. అందువలన ఆ విషయములను తర్వాత గ్రహింపవలెను). నీవు ఇప్పుడు మునులందు అగ్రేశ్వరుడవై ఈ వనమునందు వర్ధిల్లుము. తాతా (తండ్రీ)! నీవు నాతో సమానుడవుగా వేద వేదాంగ ములను, తత్వ విషయములను, అత్యుత్తముగా తెలిసిన పుత్రుడవు. ఎవరు ఈ విషయములనన్నింటినీ వినునో, అతడు సంపూర్ణముగా పాపములనుండి విముక్తుడు కాగలడు. ఇదియేకాక అతడు యశోవంతుడు, కీర్తిమంతుడుగా అయి ఈ లోకమునందు, పరలోకమునందు కూడా పూజ్యుడగును. నాలుగు వర్ణములకు చెందిన వ్యక్తుల యొక్క కర్తవ్యము ఏమనగా, వారు తమ మనస్సును, ఇంద్రియములను నియంత్రించుకొని నిరంతరమూ ఈ విషయములను వినుచుండవలెను. ఈ వృత్తాంతము అంతయూ పరమ మంగళ స్వరూపము, కల్యాణమయము, ధర్మ అర్ధ కామ సాధకమై పరమ పవిత్రమై, ఆయుర్వర్ధకమై విజయ ప్రధానము కల్గించును. ఇది ధనమును, యశమును కల్గించునది. పాపనాశకము, క్షేమకారి. శాంతకారకము, ఈ పుణ్యమగు వృత్తాంతమును వినుటచే మర్త్య లోకమునందును, పరలోకమునందును దుర్గతి కలుగదు. ప్రాతఃకాలమునందే నిద్ర మేల్కొని దీనిని శ్రవణ కీర్తనము చేయు మనుష్యుడు స్వర్గమునందు ప్రతిష్ఠితుడు కాగలడు.

విప్రవరా! పరమేష్టి, ప్రజాపతి అయిన బ్రహ్మ సనత్కుమారునికి ఈ సర్వ విషయములను తెల్పి చాలించెను. ఋషివరులారా! వరాహభగవానుడు పృథ్వీదేవి, సంవాదముగా ఈ పురాణసారము వివరింపబడినది.ఎవరు భక్తిపూర్వకముగా నిరంతరము దీని శ్రవణము లేక కనీసము మననము చేయుదురో వారు సర్వపాప విముక్తులై పరమగతి పొందుదురు. ప్రభాసక్షేత్రము, నైమిశారణ్యము, హరిద్వారము, పుష్కర తీర్థము, ప్రయాగ, బ్రహ్మతీర్థము, అమరకంటకములయందు దీనిని తెలుసుకొనినవారు పుణ్య ఫలప్రాప్తిని పొందుదురు. దానికంటెను కోటిరెట్లు ఈ వరాహ పురాణ పఠనము కలుగ చేయును. శ్రేష్ఠులగు బ్రాహ్మణునికి కపిలగోవును దానమిచ్చుట చేత ఎట్టి ఫలము లభ్యమగునో, ఆ ఫలము వరాహపురాణమందలి ఒక అధ్యాయ శ్రవణం చేత కలుగగలదు. ఇది నిశ్చయము. ఇందు సందేహము లేదు. పవిత్రుడై సావధానముగా ఈ పురాణమునందలి పది అధ్యాయములను శ్రవణము చేయుటచే మనుష్యునికి అగ్నిష్టోమము, అతిరాత్రము యజ్ఞముల ఫలము లభ్యము కాగలదు. బుద్ధిమంతుడైన వ్యక్తి ఉత్తమమైన భక్తి చేత నిరంతరము దీని శ్రవణము చేసిన యెడల వరాహ భగవానుని వచనము ప్రకారం అతడికి యజ్ఞములు, సర్వదానములు అఖిల తీర్థములయందు అభిషేకము చేసిన ఫలము ప్రాప్తింపగలదు. పుత్రహీనుడగు వ్యక్తి దీనిని వినుట చేత పుత్రులను, సౌందర్యవంతులగు పౌత్రులను పొందగలరు. ఎవని ఇంటియందు వరాహపురాణము లిఖితరూపములో ఉంచుకొనబడునో, అంతేగాక అది పూజింపబడునో, అతని యెడ దయామూర్తియగు నారాయణుడు పరిపూర్ణ సంతుష్టుడు కాగలడు. ఈ పురాణమును విన్నాకా విష్ణుభగవానుని చందనము పుష్పములు, వస్త్రముల చేత పూజింపవలెను. అంతేగాక బ్రాహ్మణులకు భోజనము సమర్పింపవలెను. అట్టివారు రాజైన యెడల తన శక్తిని అనుసరించి గ్రామము మొదలగు వానిని దానమివ్వవలెను. ఏ మనుష్యుడు పవిత్రుడై సంయత చిత్తము చేత ఈ పురాణ శ్రవణము చేయునో, దీనిని పూజించునో, అతడు పాపములన్నింటి నుంచీ సంపూర్ణముగా విముక్తి పొంది శ్రీహరి సాయుజ్యప్రాప్తిని పొందగల్గును. (217)

శ్రీ వరాహ మహాపురాణము సమాప్తము. సర్వేజనాస్సుఖినోభవంతు.

చైతన్య అగ్ని జ్యోతి – శ్రీ గురూజీ

శ్రీశ్రీశ్రీ వి.వి. శ్రీధర్ గురూజీ ప్రసిద్ధ నృసింహోపాసకులు. అష్ట మహా సిద్ధులు పొందిన సిద్ధపురుషులు, ఛాయా అథర్వణవేదం, కృష్ణ మోహన విద్యలలో ఏకైక నిష్ణాతులు. శ్రీ జ్వాలా సెంట్రల్ ట్రస్ట్ కి అధిపతులు, గురూజీ వాతావరణంలోని దుష్టాక్షరలను (ఒక విధమైన ఆధ్యాత్మిక శక్తిస్వరూపాలను అక్షరలు అంటారు). నిర్మూలించి సంఘంలో శాంతి సౌభాగ్యాలు పెంపొందించడానికై ఛాయా అథర్వణవేదం, కృష్ణ మోహన విద్య, నృసింహ తాపిన్యోపనిషత్తు వంటి శాస్త్రాల ఆధారంగా నృసింహ ధన్వంతరీ యజ్ఞ ప్రక్రియను తయారు చేసి ఇప్పటివరకు 125 యజ్ఞాలను, ఎన్నో యంత్ర పూజలను నిర్వహించారు. వివిధ మూలికలు హవిస్సుగా ఉపయోగించి చేసే ఈ యజ్ఞ ప్రక్రియలోని ధన్వంతరీ తత్వం, ఆరోగ్య వాతావరణాన్ని పెంపొందించి, కేన్సర్, ఆస్తమా, గుండె వ్యాధులు, జలోదరం, మానసిక వ్యాధుల వంటి భయంకర వ్యాధులను నిర్మూలించడంలో ఉపయోగపడుతుంది. యజ్ఞంలో కుల, మత, జాతి వివక్షత లేకుండా అందరికీ హోమం చేసే అవకాశం ఉంటుంది. ఇందుకు ఏ రకమైన రుసుము వసూలు చేయరు.

శాస్త్రాలు 'మాతృ దేవోభవ! పితృ దేవోభవ!' (తల్లికి, ఆమె పితృ దేవతలకు నమస్కారం తండ్రికి, ఆయన పితృదేవతలకు నమస్కారం) అని ఘోషిస్తున్నాయి.

గురూజీ ఇలా అంటారు: "తల్లి దండ్రులను భక్తితో సేవించు. వారు పరమ పదిస్తే, శాస్త్ర విధిగా పితృకర్మలను శ్రద్ధతో ఆచరించు. పితృదేవతల కృపను సంపాదించుకొని తరించు. పితృదేవతల కృప ఉంటే ఏ సమస్యనైనా ఎదుర్కోగలుగుతావు. వాళ్ల కృప లేకపోతే నీవేంచేసినా ఫలించదు".

పితృ శాపం ఒక వ్యక్తితో ఆగక వంశంలో పుత్ర పౌత్రాదులకు కూడా కష్టాలను కలిగిస్తుంది. సర్ప పూజలో పాల్గొనడం వల్ల పితృశాపం వల్ల కలిగే దుష్ఫలితాలు... వివాహం కాకపోవడం, పిల్లలు లేకపోవడం, అనారోగ్య సంతానం, మనశ్శాంతి లేకపోవడం, కుటుంబంలో అకాలమరణం, కుటుంబ సంబంధాలు పాడవడం, కోర్టు వ్యవహారాలు తెమలకపోవడం వంటివి తగ్గుతాయని చెబుతారు. గురూజీ యజ్ఞాలలోనూ, యంత్రపూజలలోనూ ప్రయోగశాస్త్ర విధిని సర్ప గద్యోచ్చారణతో చేసే సర్ప ఆరాధన వల్ల పితృశాంతి జరిగి భక్తులకు ఉపశమనం కలుగుతుంది.